బోయి భీమన్న సమగ్ర సాహిత్యం

సంపుటి - 4

వచన గ్రంథాలు భాగం - 1



పద్మభూషణ్ డా॥ బోయి భీమన్న సాహిత్య పీఠం
పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
హైదరాబాద్

బోయి భీమన్న సమగ్ర సాహిత్యం

సంపుటి -4

వచన గ్రంథాలు (భాగం-1)

జానపదుని జాబులు, రాగవైశాఖి,
ధర్మం కోసం పోరాటం, రాజకీయవీరుడు డాక్టరు ఖాను

ప్రధాన సంపాదకులు

ఆచార్య అనుమాండ్ల భూమయ్య

సంపాదకులు

ఆచార్య కర్రి సంజీవరావు (శిఖామణి)

సహాయ సంపాదకులు

శ్రీమతి బోయి విజయేందిర

శ్రీ గనుమల జ్ఞానేశ్వర్

పద్మభూషణ్ డా॥ బోయి భీమన్న సాహిత్య పీఠం

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం

హైదరాబాద్

Boyi Bhimanna Samagra Sahityam
Volume - 4 (Vachana Gandhalu Part - 1)
Padmabhushan Dr. Boyi Bhimanna Sahitya Peetham
Potti Sreeramulu Telugu University
Hyderabad - 500 004.

బోయి భీమన్న సమగ్ర సాహిత్యం
సంపుటి - 4 (వచన గ్రంథాలు భాగం - 1)

© పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం

డా॥ బోయి భీమన్న శతజయంతి ప్రచురణ
తెలుగు విశ్వవిద్యాలయం
ముద్రణ : జూన్, 2010
ప్రతులు : 1000

ISBN : 81-860-73-195-8

మూల్యం : రూ. 155/-

ప్రతులకు :

డైరెక్టర్, ప్రచురణల విభాగం
పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
పబ్లిక్ గార్డెన్స్, నాంపల్లి,
హైదరాబాద్ - 500 004.

ముద్రణ :

ప్లానోగ్రాఫర్స్
చిరాగ్ అలీ లేన్, అబిడ్స్,
హైదరాబాద్ - 500 001.
ఫోన్ : 23203390, 66103390

ఆచార్య అనుమాండ్ల భూమయ్య
ఉపాధ్యక్షులు

డా॥ బోయి భీమన్న సాహిత్య పీఠం - కార్యాచరణ ప్రణాళిక

పద్మభూషణ్ డా॥ బోయి భీమన్న సాహిత్య పీఠాన్ని తేది 19-09-06న తెలుగు విశ్వవిద్యాలయంలో స్థాపిస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డా॥ వై.ఎస్. రాజశేఖర రెడ్డి గారు ప్రకటించారు. వెంటనే దీనికి కావలసిన నిధుల్ని 21-01-2007 తేదీన విశ్వవిద్యాలయం నిధుల నుంచే దీని కోసం వేరుగా కేటాయించారు. ఈ సాహిత్యపీఠం వెంటనే వివిధ కార్యక్రమాలకు రూపకల్పన చేసి అమలు పరుస్తుంది. ప్రస్తుత ముఖ్యమంత్రి డా॥ కొణిజేటి రోశయ్యగారి నేతృత్వంలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భీమన్న పీఠానికి తమవంతు సహకారం కొనసాగిస్తున్నది.

1. , డా॥ బోయి భీమన్నకు సంబంధించి అందుబాటులో లేని వారి రచనల్ని (పద్యం, గేయం, వచన కవిత్వం, నాటకం, వచనం) సేకరించి సంపుటాలుగా ప్రకటించడం.
2. డా॥ భీమన్న రచనలపై వివిధ ప్రదేశాలలో సదస్సులను నిర్వహించి, సదస్సు పత్రాల్ని ముద్రించడం.
3. భీమన్న జీవితం - రచనలకు సంబంధించి ఒక వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేయడం.
4. భీమన్న అముద్రిత రచనల్ని సేకరించి ప్రచురించడం.
5. భీమన్న తన కావ్యాలకు రాసుకొన్న పరిశోధనాత్మక పీఠికల్ని రెండు సంపుటాలుగా ముద్రించడం.
6. భీమన్న ఇతరుల గ్రంథాలకు రాసిన ముందు మాటల్ని సేకరించి ప్రకటించడం.
7. భీమన్న రచనలపై వచ్చిన పరిశోధనాత్మక వ్యాసాల్ని, సమీక్షల్ని సేకరించి ప్రకటించడం.
8. భీమన్న నాటకోత్సవాల్ని నిర్వహించడం.
9. డా॥ భీమన్న రచనల్ని కొన్నింటిని ఇంగ్లీషులోకి, కొన్నింటిని భారతీయ భాషలలోకి అనువదించడం.

పైన పేర్కొన్న కార్యక్రమాలను భీమన్న సాహిత్యపీఠం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టి శరవేగంతో పూర్తి చేస్తోంది. రాష్ట్రం నాలుగు చెరుగులా, ఆంధ్రవిశ్వవిద్యాలయం, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, కాకతీయ విశ్వవిద్యాలయం, శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయాలలో ఇప్పటి వరకు నాలుగు సదస్సులను విజయవంతంగా నిర్వహించింది. భీమన్న తన కావ్యాలకు రాసుకొన్న పరిశోధనాత్మక పీఠికలను రెండు సంపుటాలుగా ప్రకటించాం. డా॥ భీమన్న రచనలను ప్రసిద్ధులైన అనువాదకుల చేత ఇంగ్లీషులోకి అనువదింప చేయడం జరిగింది. ఇవి త్వరలో ముద్రించబడతాయి.

డా॥ బోయి భీమన్న గారి వచన గ్రంథాలను సేకరించి రెండు సంపుటాలుగా ప్రచురిస్తున్నాం. ఇందులో మొదటి భాగంలో జానపదుని జాబులు, రాగవైశాఖి, ధర్మంకోసం పోరాటం, రాజకీయ వీరుడు డాక్టరు ఖాను, రెండవ భాగంలో కులనిర్మూలన, అంబేద్కరిజం, అంబేద్కర మతం, ఎంత చీకటి ఎన్ని దీపాలు, పురాణాలలో హరిగిరిజన మనీషులు, నాకు తెలిసిన జాషువా, శ్రీశ్రీ కమ్యూనిస్టుకాదు గ్రంథాలను చేర్చడం జరిగింది. ఈ గ్రంథాలు భీమన్నగారి అభ్యుదయ దృక్పథానికి, పటిష్టమైన వచన రచనా నైపుణ్యానికి అద్దం పడతాయి. తెలుగు వారి భాషా, సాహిత్యం, సంస్కృతి రంగాలలో విస్తృత అధ్యయనానికి, పరిశోధనలకు వీలు కల్పించే ఉన్నత ఆశయాలతో ఏర్పడిన పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం చేస్తున్న ఈ ప్రయత్నానికి మీరు అందించే సలహాలను విశ్వవిద్యాలయం స్వీకరిస్తుంది. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి భీమన్న రచనలను ఒకసారికి ముద్రణ (2008) హక్కులు ఇచ్చిన బోయి భీమన్న సాహితీనిధి అధ్యక్షులు శ్రీమతి హైమవతీ భీమన్నగారికి, ఇతర సభ్యులకు ధన్యవాదాలు. మా ఈ ప్రయత్నానికి పాఠకుల ప్రోత్సాహం, ఆదరణ ఉంటుందని ఆశిస్తున్నాను.

(అనుమాండ్ల భూమయ్య)

తేది : 10-9-2010
హైదరాబాద్

ఆచార్య కర్రి సంజీవరావు (శిఖామణి)
కన్వీనర్
డా॥ బోయి భీమన్న సాహిత్య పీఠం
పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం

సంపాదకీయం

భీమన్న వచన రచనా నిపుణత

పద్య కవిగా, గేయ కవిగా, వచన కవిగా, నాటక కర్తగా బహు ముఖీనమైన వైదుష్యాన్ని, వైవిధ్యాన్ని ప్రదర్శించిన భీమన్న వచన సాహిత్య సృజనలోను తనదైన ముద్రను నిలుపుకున్నారు. ప్రవాహ గతితో చదువరులను తన వెంట పరుగులు తీయించే వాక్య నిర్మాణ శైలీ, భాషా పటిమ, చెప్పదలచుకున్న విషయాన్ని సహేతుకంగా, తర్కబద్ధంగా వివేచనతో నిరూపించే విషయ పరిజ్ఞానం భీమన్న వచన రచనలోని గుణాలు. భావోద్వేగంతో సాగే శృంగార లేఖా పరంపర రాగవైశాఖి, రచ్చబండపై కూర్చుని ముచ్చట్లు పెట్టినట్టు, జానపదుని అంతరంగాన్ని ఆవిష్కరించే జానపదుని జాబులు, విద్య ద్వారానే ఈ దేశంలోని దళిత బహుజనులకు విముక్తి అని చెప్పిన అంబేద్కర్ సిద్ధాంతాన్ని, దృక్పథాన్ని నాటి, నేటి యువతరానికి అందించే ధర్మకోసం పోరాటం, అంబేద్కరిజం, అంబేద్కర మతం వంటి గ్రంథాలు, ఆధునిక యుగపు మహాకవులైన గుర్రం జాషువా, శ్రీశ్రీల గురించి తన దృష్టి కోణం నుండి అందించిన సాహిత్య విషయాలు, ఆత్మావలోకనం లాంటి ఎంత చీకటి, ఎన్ని దీపాలు, సాంస్కృతిక వారసత్వాన్ని అందించిన పురాణాలలోని హరి, గిరిజన మనీషులు వంటి రచనలు భీమన్న ఆలోచనల్లోని సమసమాజ భావనలకు, విషయ పరిజ్ఞానానికి, వైవిధ్యానికి నిదర్శనంగా నిలుస్తాయి. వచన రచనలో ఇన్ని విభిన్నాంశాల మీద ఇంత లోతైన అధ్యయనం, అవగాహనలతో రచనలు చేసిన వారు తెలుగు సాహిత్యంలో అరుదుగా కనిపిస్తారు. ఈ వచన గ్రంథాలు భాగం-1లో జానపదుని జాబులు, రాగ వైశాఖి, ధర్మకోసం పోరాటం, రాజకీయవీరుడు డాక్టరు ఖాను గ్రంథాలు-భాగం-2లో కులనిర్మూలన, అంబేద్కరిజం, అంబేద్కర మతం, ఎంత చీకటి ఎన్ని దీపాలు, పురాణాలలో హరి, గిరి, జన మనీషులు, నాకు తెలిసిన జాషువా, శ్రీశ్రీ కమ్యూనిస్టు కాదు గ్రంథాలు వున్నాయి.

'అంబేద్కర మతం' గ్రంథంలో అంబేద్కర్ ప్రతిపాదించిన ఎడ్యుకేట్, ఆర్గనైజ్, ఏజిటేట్ అంశాలు అవశ్యం ఆచరణీయం అని చెబుతూ, మార్క్సిజం గొప్పతనాన్ని అంగీకరిస్తూనే సామాన్యుణ్ణి కాక కార్మికుణ్ణి నాయకుడిగా వుంచడం వల్ల పతనం అయింది అంటారు. అంబేద్కర్ ఇస్లాం మతంలోకి కాక బౌద్ధంలోకి వెళ్ళడం ద్వారా ఈ దేశాన్ని పెద్ద ప్రమాదం నుండి గట్టెక్కించారని అభిప్రాయ పడ్డారు.

ఎంతచీకటి ఎన్ని దీపాలు ఒక రకంగా ఆత్మ కథనాత్మక రచన. 83 ఏళ్ల జీవితంలో చెయ్యగలిగినవి, చెయ్యలేకపోయినవీ, అప్పటి ఆలోచనలూ, ఆకాంక్షలూ ఎలా వుండేవో సింహావలోకనం చేసుకోవడం. ఇతరుల రచనలు చదవక పోవడం వలన మంచివక్తగా రాణించ లేకపోయిన ఆత్మశోధన రచయిత నిజాయితీని పట్టి యిస్తాయి.

'అంబేద్కరిజం' గ్రంథంలో త్రిశరణాలైన బుద్ధం ధర్మం, సంఘంతో పాటు భీమం శరణం గచ్ఛామి చేర్చి, దానితో పాటు చైతన్యం, సంఘటితం, సమరం వంటి త్రినినాదాలు ప్రతిపాదిస్తారు.

'జానపదుని జాబుల్లో' దళిత, రైతుకూలీలకు సంబంధించి, వ్యవసాయానికి సంబంధించిన అంశాలు చర్చకు వచ్చాయి. తూర్పు గోదావరి జిల్లా యాసలో సాగిన ఈ రచనలో కోనసీమ ప్రకృతి అందాలు, సంఘం, గ్రామ నిర్మాణం, పాలేరు తనం నిర్మూలన వంటి అంశాలపై నిశిత పరిశీలన వుంది.

'ధర్మంకోసం పోరాటంలో' కొలకలూరి గ్రామంలోని మాల మాదిగలు తమ మధ్యగల వైషమ్యాలను విస్మరించి ఏకం కావడం మాల మాదిగల ఐక్యతకు శుభసూచకంగా భావించి రాష్ట్రం అంతా దీనిని ఆదర్శంగా తీసుకోవాలని సూచిస్తారు. అందుకు 'భీమసేన' నిర్మాణం జరగాలని ఆకాంక్షిస్తారు.

'శ్రీశ్రీ కమ్యూనిస్టు కాదు'లో శ్రీశ్రీ వచ్చి సాహిత్యాన్ని, ఘంటసాల సంగీతాన్ని పాడుచేసారని గతంలోనే సంచలనాత్మక ప్రకటన చేసిన భీమన్న ఈ రచనలో శ్రీశ్రీ గొప్పకవి, మహాకవి అని అతని సినీ గీతాల ద్వారా రుజువు చేస్తూ, అవసరం శ్రీశ్రీని మార్క్సిస్టును చేసింది, మార్క్సిస్టులకు శ్రీశ్రీ లాంటి ఒక నాయకుడు కావలసి వచ్చాడు అని వ్యాఖ్యానిస్తాడు.

'నాకు తెలిసిన జాషువా' గ్రంథంలో పద్య రసవిద్య తెలిసిన మహాకవిగా జాషువాని అభివర్ణిస్తూ, జాషువాతో తనకు గల సాన్నిహిత్యాన్ని ఆత్మీయంగా కలబోసుకుంటారు.

ముస్లిం అయినా తన ఇంటికి సూర్యభవన్ అనీ, తన మనుమరాలుకి సంస్కృత పేర్లు పెట్టుకున్న ప్రముఖ జాతీయ నాయకుడు, కాంగ్రెస్‌వాదీ, అచ్చమైన దేశభక్తుడు, రచయిత అయిన డా॥ ఖాన్ రాజకీయ జీవితంలోని ఎత్తుపల్లాలను, తిరుగుబాట్లను తలస్పర్శిగా వివరించిన గ్రంథం 'రాజకీయవీరుడు డాక్టరు ఖాను'.

రాగవైశాఖి 120 పై చిలుకు ఖండికలతో వచనంలో సాగిన శుద్ధ, ముగ్ధమోహన ప్రణయగాథ. మధ్య మధ్యలో సందర్భోచితంగా రసపుష్టి కలిగిన పద్యాలు రచనకు రుచి కలిగిస్తాయి.

ఈ గ్రంథాలు భీమన్న గారిని నిపుణత కలిగిన వచన రచనాతత్వజ్ఞునిగా నిరూపిస్తాయి.

బోయి భీమన్నగారి మొత్తం కావ్యాల్ని సేకరించడానికి కొంత శ్రమపడవలసి వచ్చింది. శ్రీమతి హైమవతీ భీమన్నగారు భీమన్న రచనల్ని చాలా వరకు అందించారు. వారి దగ్గర లేని రచనల్ని మిత్రులు శ్రీ గనుమల జ్ఞానేశ్వర్, డా॥ బోయి నాగవర్మగారు అందించారు. భీమన్నగారి కావ్యాలు నిర్దుష్టంగా, అందంగా రావడానికి సహకరించిన సహాయ సంపాదకులు శ్రీమతి బోయి విజయేందిర, శ్రీ గనుమల జ్ఞానేశ్వర్‌లకు కృతజ్ఞతలు.

ఈ సంపుటాలను గ్రంథ ముద్రణకు వీలుగా శుద్ధ ప్రతులను తయారు చేయించిన పీఠం పూర్వ కన్వీనర్ ఆచార్య కె. ఆనందన్ గారికి ప్రత్యేక కృతజ్ఞతలు. సహకరించిన డా॥ మాదిరాజు కనకదుర్గ, శ్రీమతి పుష్పలత గారికి అభినందనలు. అందంగా ముద్రించిన ప్లానోగ్రాఫర్స్ వారికి కృతజ్ఞతలు.

హైదరాబాద్
03 మే, 2010

(కె. సంజీవరావు)

సంపుటి - 4

భీమన్న వచన గ్రంథాలు : భాగం-1

1.	జానపదుని జాబులు	1
2.	రాగ వైశాఖి	101
3.	ధర్మం కోసం పోరాటం	459
4.	రాజకీయ వీరుడు డాక్టరు ఖాను	579

జానపదుని జాబులు

(పల్లెటూరి లేఖలు)

బోయి భీమన్న

★



దేశి కవితా మండలి

విజయవాడ - 2

దేశీ ప్రచురణ
పునర్ముద్రణ
జూన్ - 1957
హక్కులు రచయితవి
వెల : రూ. 1-50

సంపాదకులు :

బొందలపాటి శకుంతలాదేవి

శివరామకృష్ణ

ఇందులోని జాబులు చాలవరకు 'పల్లెటూరి లేఖలు' అనే పేరున ౧౯౩౨ (1932)లో 'జనవాణీ' పత్రికలోనూ, కొన్ని 'జానపదుని జాబులు' అనే పేరున ౧౯౩౩ (1933)లో 'ప్రజామిత్ర'లోనూ ప్రకటించ బడ్డాయి. పట్నంలో కొంతకాలం చదువుకొని, బీదతనంవల్ల చదువు సాగించలేక తన స్వగ్రామంపోయి పల్లెటూరి పనుల్లోనే మునిగిపోయిన 'జానపదుడు' పట్నంలోని శ్రీమంతుడైన తన మిత్రునికి తన అవస్థలన్నీ వ్రాస్తాడు.

జానపదుని జాబులు

నెచ్చెలీ !

నీకు హృదయం వుంటే –

నిన్న సాయంకాలం ఇంటికి వస్తున్నాను. సంజవేళ – నూటికి తొంభై తొమ్మిది మంది గ్రామీణుల కొంపలు కూల్చే సంజవేళ – ఆయాసంగా ఇంటికి వస్తున్నాను.

గ్రామానికి ఒక మూల కల్లుపాక దగ్గర ప్రజలు కుమ్ములాడుతున్నారు. కేకలు, బొబ్బలు వేస్తున్నారు. చెల్లాచెద రవుతున్నారు. మళ్ళీ కూడుకొంటున్నారు. చిత్తగొల్లుగా వుంది.

రోజూ అంతే.

ఉదయం నుంచి – సాయకాలం వరకూ రెక్కలు ముక్కలు కొట్టుకుంటారు. రక్తం నీరుగా మార్చుకొని శ్రమిస్తారు. సాయంకాలానికి చేతికి వచ్చిన బేడ డబ్బులూ కల్లు దుకాణంలో సమర్పించుకొని – పీకల దాకా తాగుతారు.

వట్టిచేతుల్తో – తల గిర్రున తిరుగుతూంటుంది – తూలిపోతూ వుంటాడు, తాగుడు పిశాచి పూర్తిగా ఆవేశించిన దురదృష్ట కార్మికుడు–

వట్టి చేతులతో ఇంటికి పోతే –

'ఆకలి ! ఆకలి!' పిల్లాడు అడలుతుంటాడు – ఆకలని.

తాగుబోతు – రెండు తన్నేసరికి, భార్య అడ్డం వస్తే, ఆమెకో రెండు – ఇక అడ్డం వచ్చే వాళ్ళెవళ్ళు ? ఇరుగు – పొరుగు అంతా తప్పతాగి – వాళ్ళ వాళ్ళ ఇళ్ళల్లో పెళ్ళాలనీ, పిల్లలనీ తన్నేవాళ్ళే !

కొంప దెయ్యాలకొంప అవుతుంది. ఏడ్పులూ, పెడబొబ్బలూ మిన్ను ముట్టుతాయి. ఆకలి – దెబ్బలు – నిరాశ – దుఃఖమూ – తప్ప ఆ కుటుంబంలో సౌఖ్యం అనేది పేరుకు కూడా పోతుంది.

రోజూ ఇంతే – చాలమట్టుకు అన్ని కుటుంబాలలోనూ ఇంతే.

ఈ చిత్తగొల్లు అంతా చూస్తూ – అసహ్యించుకొంటూ – ఒక్కొక్క జిల్లాలోనే పెట్టుకుంటూ వస్తున్నారే ప్రొహిబిషన్, మా జిల్లాకు ఎప్పుడు వస్తుందో – వస్తే ఈ త్రాగుడు మానేస్తారు ! ఈ పైశాచిక క్రియలు నశించి పోతాయి! అప్పుడు ఈ గ్రామీణ కుటుంబాల్లో కాస్త శాంతి – సౌఖ్యం – నెలకొంటాయి ! అని ఆలోచించుకొంటూ సాగాను నేను.

వీధిలో రెండడుగులు వేశానో లేదో – ఏదో దీనకంఠం రోదిస్తూన్న ధ్వని – ఆ తావుకు నడిచాను.

ఎవరు? ఒక రైతుబిడ్డ !

'అమ్మా, ఏం విచారిస్తున్నావు !' అన్నాను.

కళ్ళనీళ్ళు పైటకొంగుతో ఒత్తుకుంటూ – ఆమె – 'కాదు నాయనా ! పూర్వం ఎప్పుడోనట, మాకు తెలీనే తెలీదు. మా మామగారికి, చిన్నప్పుడెప్పుడో, అప్పు పెట్టాడట. వీడి అప్పు తగులడిపోను – ఉన్న నాలుగెకరాల పల్లమూ రాయించేసుకున్నాడు–' కూలబడింది గుమ్మంలో–

'మా బ్రతుకు తెరువు పోయింది – చిప్పా, కర్రా చేతికొచ్చాయి–' ఏడుస్తోంది.

తల్లిని చూచి పిల్లలిద్దరూ బావురుమని ఏడుస్తున్నారు.

ఇచ్చే అప్పు ఎంత? ఏ విత్తనాలకో – ఏ కోడెదూడని కొనడానికో – ఏనాగలి చేయించుకోడానికో ఏ పాతికో, ఏభైయో, వడ్డీకి వడ్డీ – పదేళ్ళలో, ఈ మధ్య ఎన్నో తిరగరాతలు జరిగిపోతాయి, ఆ రైతుకు ఎంత మొత్తం చేసే సొంత ఆస్తి వుందో అంత మొత్తానికీ, అసలీ ఫాయిదాలతో, పెరిగి వుంటుంది.

సఖా ! ఎన్ని కొంపలు కూలిస్తే గాని ఒక్క కొంప కోటికి పడగెత్తగలదు ?

ఎన్ని కొంపల్ని కడుపులు మాడ్చి – ఏడ్పించితే గాని ఒక కొంప సుఖంగా వినోదించగలదు ?

ప్రతినిత్యమూ – ప్రతీ కొంపలోనూ ఏవో ఆవేదనలు, అంధకారాలు తారాడుతూనే వుంటాయి. కన్నీరొలక గూడని 'కలకంఠుల' కంట నిరంతర ధారగా కన్నీరు ప్రవహిస్తూనే వుంటుంది.

నీవు చూడవు గాని – మీ పట్నాల లోనే కనబడతారు. కాయకష్టం చేసినా గాని కడుపు నిండని స్త్రీలు, మట్టి తట్టలు మోసుకపోతుండే అభాగినులు కనబడతారు, ఏ కారులో పోతూనో ఒక చూపు రోడ్డు ప్రక్కకు విసిరితే.

కాని మా పల్లెటూరికి వత్తువా ? మా పల్లెటూరి పడుచుల్ని ఒకింత పరికింతువా?

ఘోర గంభీర ఘనాఘన ఘోషల
కోమల చంచల రేఖ లవేమో–
మృత్యుభీకరాభీల తమస్సున
మిణుగురు బుర్వుల వెలుగేమో –
నిజోద్రిక్త పూరుష పటుశక్తికి
నిదానమో ఈ రమణీరామము !'

ఈ సత్యం – సత్యం కాదనను – మటుమాయమై వుంటుంది.

నీ కావ్యాలలో – నీ మేడల మీద – నీ ఉద్యానాలలో – నీ సినీమా నాటక రంగాలలో – నీకు పరిచయమయ్యే విలాసవతులనే ఆదర్శ ప్రాయులుగా అనుకుంటున్నట్టుంది నీవు. నీ కావ్యాలూ – నీఉద్యానాలూ స్వభావ విరుద్ధాలని అనను – ప్రత్యక్షాన్ని తెరగప్పే మోసాలు.

'రక్తం త్రాగుతున్నాం. రుచిగా వుంది – ఎవరిదైతే మన కేం?' అనే తత్వం వాటిది. ఆ రక్తం ప్రవహించి వున్న శరీరాలు ఏమిటో – ఎవరివో – స్థితిగతు లెటువంటివో – అది మనకెలా లభించిందో – ఈ ఆలోచనలే వాటి కక్కరలేదు.

అది కాదు ప్రత్యక్షజీవితం – మా గ్రామాలు వచ్చి చూద్దువా?

మలినమై, గుంటపడిన కళ్ళు – ఎండిపోయి నొక్కుకు పోయిన చెక్కిళ్ళు – ఎన్నడూ నూనె రాయక, దువ్వక , చింపిరిపోయిన తలలు–

కృశించిపోయి, ఎముకలు బైలువడ్డ రొమ్ములు– ఆరి, వెన్ను కంటుకుపోయిన కడుపులు, ఎండుకట్టె ల్లాంటి కాలుసేతులు–

దరిద్రదేవతాభీకర స్వరూపాలు–

నీకు హృదయంవుంటే – నీవు నా స్నేహితుడవు కాబట్టి పేదల నిర్భాగ్యస్థితిని చూచి కన్నీళ్ళు రాల్చే హృదయం నీలో వుండి తీరుతుంది – అది శ్రీమంతుల,

అధికార్ల, త్రుప్పుపట్టిన ఇనపగుండెల ముక్కుకంపుకు బండదేరకపోతే - ఏడుస్తావు చూచి.

మానవులా వీళ్ళు ? డార్విన్ పిచ్చివాడా ? కోతులు - అందుండి మనుష్యులు - అంటాడు. వానరజాతులకు మధ్య మరో జాతి-మా గ్రామీణజాతి-వుందనడే ! డార్విన్ దేశంలో ఈ జాతి లేదేమో ! వున్నా-ఇంత దౌర్భాగ్యస్థితిలో లేదేమో !

ఈ సంశయం నాకు కల్గినందుకు నవ్వుతావు. అవును నీకు నవ్వుగానే వుంటుంది. ధనికత్వం ఈ నిరుపేద కార్మిక జాతినీ - రైతుసంఘాన్నీ - ఎంతగా మాడ్చి, జీవచ్ఛవాల్ని చేసిందో ప్రత్యక్షంగా నీవు చూస్తే - నీకూ కలుగుతుంది ఈ సంశయం. కలగడమే కాదు - ఉండవలసినంత మానవత్వమూ నీలో వుంటే - గుండెల్ని పట్టి పీకుతుంది, పీల్చుతుంది, చంపుతుంది.

మగవాళ్ళతో సమానంగా పాటుపడుతూ - పాటుకు తగిన ఫలితం లేక పస్తులు పడుతూ-

ఒంటినిండా బట్ట లేని బికారిస్వరూపాలు

ఆకలిబాధ-చెప్పరాని ఆకలి బాధ-రేపటిగతి ఏమిటా అని బెంగ-పిల్లల అటమట చూచి మనేద-కన్నీళ్ళు-ఎక్కడైనా పని దొరుకుతుందేమోనని పరుగెడుతూ-

ఈ కార్మిక స్త్రీలు అనుభవించేది నరకం. ఈ బాధ, బాధ పెట్టేవాళ్ళకి కనిపించదు. వాళ్ళకు బాధ పెట్టడమే సరదా. ప్రతి ఉదయమూ రక్తం కళ్ళజూడక బతకలేని కసాయివాడికి గుండె మెత్తనా? కర్మఫల మంటాడు కామందు గట్టు మీద కూర్చుని.

ఈ బాధని ఎవరూ వర్ణించరు, మన పట్నం కవులకి ఉన్నమట్టుకు తిని ఊరూరు తిరుగుతూ, (కార్ల్‌మీదా-రైళ్ళ మీదా) ఏ అమ్మాయి మీదో - ఏ కృష్ణుడి వలపు కత్తెగా ఉపమించుకోనో- పద్యా లల్లుకొనే మన పట్నం కవులుకి - కనిపించదు. కనిపించినా శృంగారం కనిపిస్తుంది ! బాధలో శృంగారం !!

ఈ బాధ-చావు బ్రతుకుల మధ్య దరిద్ర పిశాచి భూతం ముళ్ళ గోళ్ళు గుండెల్ని పిసుకుతున్న బాధ - ఊపిరితిత్తుల్ని చింపుతున్న బాధ - కడుపులో ఆకటి పేగుల్ని వడిపెట్టి లాగి తెంపుతున్న బాధ - నీవు చూస్తే ! దగ్గిరగా రానక్కరలేదు - దూరాన్నుంచే - చూస్తే !

అప్పటి కప్పుడు నీ భావాలు మార్చుకొంటావు. నీ ధనికత్వాన్ని

వొదులుకొంటావు. నీ జమిందారీ గర్వాన్ని సడలించుకొంటావు, నీ పేద రైతుల-పేద కూలీల-ఇక్కట్లు బాపడానికి నడుం కట్టి ముందు కురుకుతావు. అప్పుడు జమిందారీ రైతుబిల్లు చెడ్డదనవు.

ఈ బిల్లును గూర్చి నే నొక మాట మాత్రమే చెప్పగలను. ఈ బిల్లే చట్టమై అమల్లోకి వస్తే - భారతదేశం గాంధీజీని ఎలా పూజిస్తుందో - రైతులోకం శ్రీ ప్రకాశం పంతులును అలా పూజిస్తుంది.

జమిన్ రైతు లోకమే కాదు - మొత్తం రైతులోకమే అంటున్నాను. ఏమంటావా? జమిందారీ రైతుల ఇక్కట్లను తొలగిస్తూ- ఈనాందారీ రైతుల మార్గంలో వున్న శిలాకంటకాల్ని తొలగించి ఈ చట్టం - స్నిగ్ధీకరిస్తుంది. రైతులు ఆ మార్గంలో కాలు పెట్టడమే తడవుగా-తమ గమ్యస్థానానికి ఒకటే జారడం జారిపోగలరు.

అంటే రైతు విప్లవానికి ఈ బిల్లు ఒక సోపానమని అంటాను. సంయుక్త రాష్ట్రాలలో ఇలాంటి బిల్లే - భూములేని రైతులకు అప్లికేషనులపై భూస్వాముల భూమిలో కొంత భాగాన్ని తీసుకొని ప్రభుత్వం ఈయవచ్చు అనే బిల్లు - వస్తూ వుంది. ఇలానే దేశ మంతటా.

రావలసిన అసలు విప్లవానికి ఈ రైతు విప్లవం ఒక దారి మాత్రమే. అది కార్మిక విప్లవం. కార్మికుల కోసం ఒక్క ప్రొహిబిషన్ తప్ప కాంగ్రెసు ప్రభుత్వం ఇంతవరకూ ఏమీ చేసివుండలేదు.

ఈ వూహ లన్నిటి తోటి బుర్ర వేడెక్కిపోయింది. సౌఖ్యం లేని ఇన్ని కుటుంబాలు - ఇన్ని గ్రామాలు - ఇన్ని కోట్ల మంది- ఎందుకు ? ఎప్పుడు వస్తుంది ఆ సౌఖ్యం అనే మాయ వస్తువు ?

ఇంటికి పోయాను.

' చిట్టీ ? '

'ఆ'

' అమ్మ ఏదీ ? '

' పొలంనుంచి రాలే '

' నాన్నా ! '

' నాన్న కూడా '

' దీపం వెలిగించలేదేం ? '

' ఇంట్లోకి వెళ్ళడానికి - చీకటి - భయమేస్తోంది. '

★★★

ప్రియసఖా !

లేఖ ఆలస్యం అయింది - కారణం వ్రాస్తాను -

భోగి రోజున - ఉదయం - స్నానం చేసి భోగిమంట దగ్గిరికి వచ్చేటప్పటికి - రామారావూ, శాస్త్రి కూర్చుని వున్నారు- మంట కణకణ మండుతోంది.

' అదేమిటి ? ' అన్నాను.

' ఏది ? ' అన్నాడు శాస్త్రి.

' ఆ బండి చక్రం '

' అది బండి చక్రం కాదు. కసి ' అన్నాడు రామారావు.

కసి ?

ఔను ! కసి !

సఖా ! ప్రేమ ప్రేమను పుట్టిస్తాది. ద్వేషం ద్వేషాన్ని కలిగిస్తాది.

కామందు రాఘవరావు తోటలో చాలా తాటి వాసాలు వున్నై. వాటిని తానెందుకూ ఉపయోగించడం లేదు.

' మా పశువులు మంచులోపడి కూనిగిలబడిపోతున్నై - ఒక పాక వేసికొంటాం - దయ చేసి నాలుగు వాసాలు ఇప్పించండి ' అని అడిగితే ' లేవు - పో ' మ్మన్నాడు.

రాత్రి - అతడి దొడ్లో వున్న బండిచక్రాన్ని వొకటి లాక్కొని వచ్చి భోగిమంటలో పడేశారు మా మిత్రులు కొందరు.

అది కసి.

' అది కసి ఎలా అవుతాది ? ' అని నీవు ప్రశ్నించవచ్చు.

ఆ తోట తను నాటాడా ?

కంచెలు కట్టి కాపాడాడా ?

నీరు పోసి పెంచాడా ?

ఇక – ఆ తోట 'నాది' అని ఎలా చెప్పుకోగలడు ?

' బోలెడు డబ్బు పోసి కొన్నాడు ' అంటావా ?

ఆ డబ్బు ఎక్కడిది ? తను పుడుతూ తెచ్చాడా ? తీశాడా గనుల్లో నుంచి ?

ముద్ర వేశాడా ?

ఇక – ' ఈ డబ్బు నాది ' అనడానికి ఏమి హక్కుంది ?

ఏమీ హక్కు లేని ఒక ఆసామి – నాల్గు తాటివాసాలు ఈయడానికి నిరాకరిస్తే కసి కాదూ ?

మాకే తోటలు వుంటే ఇంకొకణ్ణి అడిగే కర్మం మా కెందుకు పడుతుంది ?

కసి ! ఔను, కసి !

' కసి బలే బలేగా మండుతోంది ! ' అన్నాడు.

' ఇదో మంటేనా? ఇంకా, ఇంకా మండాలి. విద్వేషం–అసమత్వం–నిరంకుశత్వం–స్వార్థం–ఇవన్నీ కాలి, బొగ్గు బొగ్గు అయిపోయేదాకా ఈ జ్వాలలు ఆగ కూడదు ' అన్నాడు రామారావు.

అంటూ లేచాడు మంట దగ్గిర నుంచి. అంతట్లోకే మా కోడెదూడ ముందూ – ఒక దుడ్డుకర్ర వెనకా రివ్వున వచ్చాయి మా ప్రక్కకు.

కోడెదూడ నా దగ్గిర నిలుచుంది చేతిని నాకుతూ. ఆ కర్ర మంటలో పడింది.

శాస్త్రి పరకాయించాడు.

సంక్రాంతి – బంతిపువ్వుల దండలో నాలుగు మువ్వలు గ్రుచ్చి సరదాగా దూడ మెడలో కట్టాం – అది గంతులు వేస్తూ పోయి రాఘవరావు తోటలో ప్రవేశించింది. ఆ ఫలితమే ఆ కర్ర !

కర్ర మంటలో పడి కాలిపోయింది. ' ఒకదాని కొకటి సాయం ' అంటూ నిప్పు యెగదోశాడు రామారావు.

ప్రొద్దెక్కే కొలదీ పొగమంచు దట్టం అయింది.

మా వీధి గడిస్తే చక్కని పొలాలు వుంటాయి – అక్కడి పెద్దగట్టు మీదకు పోతే సరదాగా వుంటాది ఎప్పుడైనా సరే, ఏవేళ అయినా సరే.

అక్కడికి పోదాం అని బైలుదేరాం. వాకిటి నిండా నిండుగా వున్నై ముగ్గులు. ఆ ఇల్లాలు ఆ ఇంటిగుమ్మంలో అతిదీనంగా విచారిస్తూ కూర్చున్నది.

' పండగ పూటా చస్తున్నామండీ ! నా కూలీడబ్బులు ఇప్పించండీ ! ' అని దీనంగా ప్రార్థిస్తూ వున్న ఒక కూలీని ' ఈ వేళ లేవు పో ' మ్మని గర్జించాడు, అరుగు మీద కూర్చున్న ఒక మహాభోగి.

ఆ చలిలో చెమటలు గ్రక్కుకొంటూ ఏవో మోసి = కొనిపోతున్నాడు తన కామందుకి ఒక పాలేరు.

పనికి ఆలస్యంగా వచ్చాడని తన నౌకర్ని కొట్టడానికి తరుముతున్నా డొక యజమాని.

' పండగపూట అయినా సంతోషం లేదు. ప్రజలు తమ సంతోషాన్ని ధన దేవతకి బలి ఇస్తున్నారు. '

' ఎంత క్రూరసంఘం ఇది ! ఒకరి ఏడుపుతో మరొకరికి సంతోషం కలిగిస్తూంది. ఒకరి ఆకటితో ఇంకొకరి కడుపు నింపుతోంది. ఒకరి రక్తంతో వేరొకరికి సౌఖ్యసౌధాలు నిర్మిస్తోంది ! '

' దుర్భరం ! ' అన్నాడు రామారావు.

ఈలోపున మేము వీధి గడిచాం.

శాస్త్రి ఏదో ఆలోచిస్తూ వస్తున్నాడు. ఆయన భుజం మీద చేయి వేసి 'రామారావు సంఘాన్ని తెగతిడుతున్నాడు' అన్నాను.

' తిట్టాలి - తిట్టవలసిందే - తిట్టడమే కాదు, నాశనం చేయవలె ' అన్నాడు.

' ఏం ? ' అన్నా.

' ఈ సంఘం మనకు పనికి రాదు. దీన్ని సంస్కరించడం కూడా తగదు.'

' ఏం? '

' సంఘం ముసిల్ది అయిపోయింది ' అన్నాడు రామారావు - 'ముసలిదానికి కాంచనాభరణాలు పెడితే మాత్రం నవయౌవనాంగి అవుతుందా ? '

' మనకు క్రొత్త సంఘం కావాలి. క్రొత్త ఉత్తేజం కావాలి. 'కొత్తజీవనం కావాలి. ప్రాత అనేది వుండనే కూడదు.'

' చూడు, ' అన్నాడు శాస్త్రి ఎదుట చూపుతూ.

మంచు అప్పుడప్పుడే విడిపోతున్నది. ఆ మంచుతెర లోంచి పైరుచేలు కొంచెం కొంచెంగా కనిపిస్తున్నాయి.

' అటు చూడు ' అన్నాడు. ఆ చలిలో యీ పండుగ రోజున ఆ చేల్లో గడ్డికోసే ఆ కూలీబాలికలు.

ఆ ప్రాసాదం మీద ఆ వెచ్చని యెండలో తడికురులు ఆరబోసికొనే ఆ సుకుమారులు.

' ఈ సంఘాన్ని ఉన్నది ఉన్నట్లే ఉంచి యీ కూలీల్ని ఆ ప్రాసాదం మీదికి ఎక్కించగలవా ? ఆ సుకుమారుల్ని యీ పొలాల్లోకి దింపగలవా ? '

' అసంభవం '

' అయితే – ఆ క్రొత్తసంఘం ఎలా వుండాలి ? '

' నీవు అడిగితే నేను చెప్పుతానా ? '

' పోని నేను అడిగాననుకో. '

' నీవు అడిగినా చెప్పను. '

' పోనీ దాచుకో ' అన్నాడు రామారావు.

' ఎప్పుడూ సంతోషంతోటే వుండేవాడివి, అలా వున్నావేం ? ' అన్నాను రామారావుని.

' కసి ' అన్నాడు.

మిత్రమా! విజ్ఞానమూ ఉద్రేకమూ గల యువకులు పట్నాల్లో వుండిపోతూ ఆ భోగాలకి అలవడిపోతూ వున్నారు గాని వారే గనక పల్లెటూళ్ళు వచ్చి మా కష్టాలన్నీ కనులార చూస్తే ఇంతలో వస్తుంది స్వర్గరాజ్యం.

కాని, ఏదీ ఆ అదృష్టం ?

ఎపుడు ఆ సుప్రభాతం ?

మిత్రుల సాన్నిధ్యం ఎంతో ఆనందం కూర్చింది నాకు ఆ వేళ. నీవూ ఉంటే ఎంత బాగుండేదో ?

భోగిరోజు ఇలా గడిచింది.

రెండో రోజున ' మా యింటికి పోదాం ' అన్నాడు రామారావు.

' కాదు, మాయింటికి ' అన్నాడు శాస్త్రి.

అంతట్లోకే మా అయ్య పిలిచి ఏదో పని మీద కూ - వెళ్లి రమ్మన్నాడు. మో - మా వూరికి ఆరుమైళ్ళ దూరంలో వున్న ఒక చిన్నగ్రామం. అదే తిరుపతి రావు వూరు.

'సరే. ఎవరింటికీ వొద్దు. అందరం కలిసి మో- వెళుదాం రండి' అన్నాడు శాస్త్రి.

సరే అంటే సరే అనుకొని బైలుదేరాం.

త్రోవ పర్రగట్లూ, డొంకసందులూ.

మా కెవరికీ కాళ్ళకి జోళ్ళు లేవు.

శీతాకాలం బెడ్డలు చురుకు చురుకు మంటూంటే శాస్త్రి, 'అమ్మో, అమ్మో' అనడం మొదలు పెట్టేడు.

రామారావు కాల్లో ఒక ముల్లు విరిగింది. ఒకచోట కూర్చున్నాం. ఇంకొక ముల్లు తెచ్చి ఆ ముల్లును తీయబోతే ఆ ముల్లు కూడా కాల్లోనే విరిగిపోయింది.

మేఘు పడుతూ వున్న తిప్పలు చూచి ఆ దగ్గరే పని చేస్తూ వున్న ఒక కూలీ అమ్మాయి తన ముళ్ళగుత్తెతో ఆ ముల్లు తీసివేసింది.

సఖా ! ఒకనాడు కాలేజీకి పోతూ వుంటే మధ్య వర్షం పట్టుకొని కొట్టి కొట్టి విడిచిపెట్టింది. జ్ఞాపకం వుందా ?

అప్పుడు మనం తడిసి - పుస్తకాలు దాచుకోడానికైనా వీలు లేక తటపటాయిస్తుంటే మనతోటే కాలేజీకి వస్తూ వున్న ఒక అమ్మాయి - చేతిలో పెద్ద గొడుగు వుండి కూడా, మన పుస్తకాల్ని అయినా తడిసిపోకుండా కాపాడడానికి వొప్పుకొన్నది కాదు - కాదూ ?

ఆమె నాగరిక నారీమణి,

ఈమె పల్లెటూరి పడుచు,

ఆమె విద్యావతి,

ఈమె విద్యావిహీన.

కాని,

ఇద్దరి లోని మానవత్వాన్ని పోల్చి చూడు.

పట్నానికి అన్నీ అవయవాలే. కాని హృదయం లేదు.

పల్లెకు హృదయం వుంది. సర్వాంగసౌందర్యం కొంత కొరవడినా బాధ లేదు.

పల్లెటూళ్ళ సౌహార్ద్రాన్ని మెచ్చుకొంటూ ఆ ప్రయాణాన్ని సాగించాం.

' సంఘం హెచ్చు తగ్గులతో వుంది. ధనాన్ని ఒక ప్రమాణంగా తీసికొంటే, అత్యధిక ధనసంఘంలో అత్యల్ప మానవత్వమూ, అత్యల్ప ధనసంఘం (నిరుపేద సంఘం)లో అత్యధిక మానవత్వమూ వుంటాయి అనుకొంటాను ' అన్నాడు రామారావు – cనాగరికతను తీసికొన్నా అంతే '

' అది సర్వత్రా అనువర్తించదు ' అని శాస్త్రి అన్నాడు.

ఈ విధంగా ప్రసంగించుకొంటూ కుంటుతూ వున్న రామారావును వెక్కిరించికొంటూ, సాగిపోయింది–మా ప్రయాణం.

మో – చేరేటప్పటికి బాగా చీకటి పడిపోయింది.

తిరుపతిరావు ఇంటి దగ్గర లేడు.

' ఎక్కడికి వెళ్ళాడు ? ' అన్నాను.

' పొలం ' అన్నది ఆయన చెల్లె.

' ఎంతదూరం అన్నాను' అంతట్లో ఆయనతల్లి వచ్చింది.

అతిథిసత్కారాలు పొందిన తర్వాత అరుగు మీద కూర్చున్నాం, తిరుపతిరావు వస్తాడని.

' అరుగులన్నీ పెచ్చు పెచ్చులుగా వూడి వున్నై ' ? అని శాస్త్రి అంటూ రెండు పెచ్చులు లాగాడు.

' మా ఇంటికి అరుగులే లేవుగా ' అన్నాను.

' ఇవి పెచ్చులు కాదు – గాయాలు ' అన్నాడు రామారావు.

' ఏమి గాయాలు ? '

' సంఘం ఒక యుద్ధరంగం. అందులో విద్రోహంవర్గం అమాయకమైన కూలీముఠాని గాయపరచింది – పరుస్తూ వుంది. ఆ గాయాలు ఇవి '

' అయితే ఇవి ఇంతలో మానవు '

' మానవు. చక్కనివైద్యం ఏది ? '

ఇలాగే కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నాం. రాత్రి పదకొండు, పన్నెండు గంట లయిపోయింది.

కోడి కూసింది - ' తెల్ల వారిపోయింది ' అన్నాడు శాస్త్రి.

' సంక్రాంతి రోజుల్లో కోళ్ళు ఎప్పుడు పడితే అప్పుడు కూస్తవి నాయనా ' అన్నది తిరుపతిరావు జనని - ' అదుగో ! అబ్బాయి వస్తున్నాడు. '

శిరస్సు మీద గడ్డిపరకలు - ముఖాన్ని ధూళి - చిరుచొక్కా అంతా దూగర

కళ్ళలో వేడి-నిట్టూర్పులో ఆయాసం -

వస్తూనే మా ముగ్గుర్నీ ఒక్కసారిగా కౌగలించుకొన్నాడు తిరుపతిరావు.

ఏమో - ఏంటో - ఎక్కడోలాగ కనిపించింది క్షణం - కాని,

ఆ మైమరపు క్షణకాలమే.

ఆత్మానందంతో ఆకలి తీరుతుందా ?

అలసట పోతుందా ?

కల్ల - కల్ల.

మో - లో ఇంతవరకూ ఆగిపోవలసి వచ్చింది నేను. ఆ వూళ్ళో పోస్టాఫీసు లేదు. తిరిగి ఇంటికి వచ్చి వ్రాస్తున్నాను- ఇదే ఆలస్యానికి కారణం.

మో - విశేషాలన్నీ తరువాత లేఖలో -

★★★

నెచ్చెలీ !

క్షమిస్తావనే అనుకొంటున్నాను. లేఖ ఆలస్యమైంది. ఆలస్యానికి కారణం లేకపోలేదు. మీ పట్నాల్లోలాగ కాలం కరకట్టుగా నడవదు మాపల్లెల్లో . ఈవేళ నిరుద్యోగం అయితే రేపు తీరిక లేని పని- మళ్ళీ ఆ మరునాడు పని మందం - ఈ విధంగా వుంటుంది స్థితి. అందుచేత స్థిరంగా ఈ వేళ ఇది చేయాలి - ఆవేళ అది చేయాలి - అని కార్యక్రమం తయారు చేసికొనడానికి ఏమీ అవకాశం వుండదు.

గ్రామాల్లో సాధారణంగా వుండే యీ అస్థిరభావమే నీకు లేఖ వ్రాయుట ఆలస్యం చేయించింది. కాలం చాల విలువైంది. గ్రామాలు యీ విలువ గ్రహించడానికి ఇట్టి అస్థిర స్వభావం తొలగాలి.

మొన్ననే నీకు లేఖ వ్రాయాలని అనుకొన్నాను. కాని, ఆ వేళ అంతా పని. ఒక్క క్షణమైనా తీరుబడి అయింది కాదు. ఆ రాత్రి వ్రాయాలని కలమూ, కాగితమూ పట్టుకొని దీపంబుడ్డి దగ్గిర కూర్చున్నాను.

' కిరసనాయిల పొగ కళ్ళలో పడుతోంది. కళ్ళు జబ్బు చేస్తాయి. ' అని మాయమ్మ అన్నది.

' ప్రొద్ద స్తమానమూ పని చేశావు, పడుకోకూడదా ! ' అన్నాడు మామయ్య.

' అన్నోయ్ ! యీ లెక్క చెప్పి పడుకో ' అంటూ పలక తీసికొని వచ్చింది మా చెల్లి.

అది రూపాయిల గుణకారం లెక్క. లెక్క చెప్పుతున్నాను. ' రూపాయల్ని అణాలు చేయాలంటే ఏమి చేయాలి ? ' అన్నాను.

మా చెల్లి ఆలోచిస్తోంది.

' దుకాణం మీదికి తీసుకవెళ్ళి మార్చాలి ' అన్నాడు మా తమ్ముడు.

' కాదు, పదహారు పెట్టి గుణించాలి ' అన్నది మా చెల్లి.

మాయమ్మ మా తమ్ముడి పక్షం అయింది.

' అయితే యీ రూపాయిని గుణించి అణాలు చేయి ' అంటూ ఒక రూపాయిని దొర్లించింది మా చెల్లి దగ్గరికి.

నాకు ఆశ్చర్యం కలిగింది.

అచ్చట కలిగిన చమత్కారానికి కాదు నాకు ఆశ్చర్యం కలుగుత. ఇటువంటి చమత్కారా లెన్నో నిత్యమూ చూస్తూ వుంటాం గ్రామాల్లో.

మాయమ్మ మా తమ్ముడి పక్షం అవలంబించినందుకు కాదు నాకు ఆశ్చర్యం కలుగుత వినోదం కోసం, బిడ్డల సాన్నిధ్యాన్ని తల్లులు అనుభవించే ఆనందాన్ని అనుభవించడం కోసం, ఆవిడ ఒక పక్షం వహించి మాతో తర్కానికి దిగింది.

మాయమ్మకు ఆ రూపాయి యెక్కడి నుంచి వచ్చింది అని కాదు నాకు ఆశ్చర్యం కలుగుత. పదిరోజులు కష్టపడి పని చేస్తే వచ్చిన కూలి ఆ రూపాయి.

రూపాయి కంటికి కనపడితే ఎంతో ఆనందం. అందుకనే చిల్లర తీసుకొనక మినపకుడుం వంటి రూపాయి తీసుకొన్నాడు మా అయ్య.

ఆ రూపాయిని అందరూ తలకొక కాస్తసేపూ దగ్గర పెట్టుకొని ఆడుకొన్నారు దానితో.

కాని నాకు ఆశ్చర్యం కలిగించింది వేరొక విషయం. మనం అభ్యసించే విద్యకూ, జీవితంలో చేయబోయే పనికి ఉన్న అంతరం హఠాత్తుగా నా మనస్సుకు తట్టింది.

మనం నేర్చుకొన్నది, నేర్చుకొంటున్నది, రూపాయిని పదహారుతో గుణించి అణాలు చేయడమే.

కాని చేయవలసిన పని రూపాయిని దుకాణం దగ్గిరకు తీసుకొని వెళ్ళి మ్రోగించి చూపి పదహారు అణాలనూ లెక్క పెట్టుకొని ఇంటికి రావడం. అంత వుంది అంతరం !

' చూశావా ? చదువులు చదువుతున్నాం. పట్నాల్లో ఒక రూపాయి ఒక దమ్మిడీలాగ ఖర్చు పెడతాం. '

చదువు పూర్తి అవగానే ఉద్యోగాలకు దేవుళ్ళాట మొదలు పెడతాం. అందరి కాళ్ళూ పట్టుకొంటాం.

సఖా ! ఇన్ని త్రిప్పలూ ఎందుకు ? బ్రతకడానికి ! బ్రతికి ఎందుకు ? మన స్వార్థాన్ని నింపుకోవడానికి ! అంతేగా ?

సంఘం ఏమైపోయినా సరే, మనతో వారు ఎన్ని కట్టళ్ళు కుదుస్తున్నా సరే, దేశం అధోగతికి దించుకొని పోతున్నా సరే మనకు చీమ కుట్టిన చందం అయినా వుండదు.

మన జిల్లా కాదు, మన తాలూకా కాదు, మన గ్రామం కాదు, మన ఇల్లు వుండి, తక్కిన ప్రపంచం అంతా మునిగిపోతున్నా సరే, మనం లెక్క చేయం అంతే.

మిత్రమా ! చదువుకొన్న వాళ్ళంతా తమ కష్ట ఫలాన్ని తింటూ పట్నాలలో సౌఖ్యాలు అనుభవిస్తూ, కులుకుతూ వుండడం చూచి పల్లెటూళ్ళు కన్నీరు విడుస్తున్నవి.

గ్రామోద్ధరణం అంటూ పత్రికల్లో వ్రాసుకొంటే పని కాదు. ఉపన్యాసాలిస్తే పని కాదు. రోడ్ల వెంట మోటారు కార్లలో నాలుగుసార్లు తిరిగి నాలుగువందలు భత్యాలు కొడితే పని కాదు. అవన్నీ రూపాయిని పదహారు చేత గుణించినట్లే వ్యర్థాలు. కాగితం మీద కోట్లుకోట్లు సంఖ్యలు వేసుకొని ' ఇంత ధనం వుంది నాకు ' అని సంతోషించడం ఎట్లో, అవన్నీ అట్లే.

ఈ ఊహ ఆ క్షణంలో తట్టింది నాకు. ఆశ్చర్యం కలిగింది.

ప్రజాసముదాయం కోరే ప్రత్యక్షఫలం ఆడంబరం కాదు.

అంతట్లోకే ' వరికుప్పచేలో నీరుపడ్డది, నీవు రావాలి. ' అంటూ వచ్చాడు, ఒక రైతుకోటయ్య. ఆ వేళ నీకు లేఖ వ్రాయడానికి వీలే చిక్కలేదు.

ఆ రాత్రి అంతా పొలాలలో జాగారం చేశాం.

కోతలు అయినవి. కొందరు కోతలు కోయగానే నూర్చి వేసుకొంటారు. కొందరు కుప్పలు వేసికొని వేసవి కాలం తలసూపగానే చైత్రారంభంలో నూర్చు కొంటారు.

కుప్పలు చేలలోనే వేస్తారు. కుప్పల చుట్టూ పైరులు చక్కగా పెరుగుతూ వుంటాయి.

నీటి బోదెకు దగ్గరగా వున్న చేలో కోటయ్య కుప్ప వేశాడు.

కాలువ యింకా యెండిపోలేదు. బోదె కన్నం తెగి కుప్పచేలో నీరు పడింది.

బోదె కన్నం కట్టివేసి చేలో పడ్డ నీరు పోయేలాగున పిల్లబోదెలు తీసి ఒక గట్టు మీద కూర్చున్నాం కోటయ్యా, నేనూ.

హాయిగా నక్షత్రాలు మెరుస్తున్నాయి. గుబురు గుబురుగా యెదుగుతూ, చల్లని గాలికి 'జోరు' మంటూ పైరుచేలు యెంతో ఆనందాన్ని కూరుస్తున్నాయి.

'పల్లెటూరి జీవితం యెంతో మనోహరమైంది!' అని అనుకున్నాను. కాని, 'పస్తులు పడాలి, కష్టాలకు ఓర్చుకోవాలి. ఈ రెండూ తప్పితే పల్లెటూరే ప్రశాంత జీవిత సౌఖ్యానికి పుట్టిల్లు.'

'కుప్ప పల్లాన్ని పడ్డది. ఆ మెరక చేలో వేద్దాం అనుకొన్నాను' అన్నాడు కోటయ్య. 'అంతర్వేది వెళ్ళగానే మార్చేయాలి.'

'అంత తొందర యేమి వచ్చింది? సంవత్సరాదికి నూర్చుకోవచ్చు' అన్నాను.

'అబ్బే, పన్నులు వచ్చి తల మీద తన్నుతాయి. ఇంట్లో ఒక పింగాణీచిప్ప అయినా లేదు అమ్మడానికి. అన్నీ ముట్టిమూకుళ్ళే' అన్నాడు.

సభా! కష్టం వొకళ్ళది, ఫలితం మరొకళ్ళది.

పేదల నోళ్ళు కొట్టి, కడుపులు మాడ్చి, ఉన్నదంతా ఊడ్చుకపోయి ఏమి చేస్తారో తెలుసా? బేంకులలోనూ, ఇనుప పెట్టెలలోనూ కుప్పలు పోసికొని కూర్చుని అనుభవిస్తారు సర్వభోగాలూను.

ఎప్పుడు తొలకరిస్తాది అని కళ్ళు విప్పి కనిపెట్టుకొని వుండి –

ఎప్పుడు కాలువకు నీరు వొస్తాది అని రాత్రింబవళ్ళు మననం చేసి –

మడిదున్ని విత్తనాలు చల్లి - నీటి కొరకూ - కూలి కొరకూ యితరులతో పోటీలు పడి -

ఆకుమళ్ళు పశువులు త్రొక్కి తినివేయకుండా రాత్రింబవళ్ళు పొలాల లోనే, వట్టి నేలనే పండుకొని కాపలా కాచి -

కుట్టే జెర్రిలకూ, పొడిచే తేళ్ళకూ, కరిచే పాములకూ శరీరాన్ని అర్పిస్తూ -

విసుగూ విరామమూ లేకుండా పొలాలకు నీరు పెట్టి, దున్ని, ఊడ్చి -

వర్షం అనక, బాడిబందలు అనక-పైరుల్ని-నిత్యమూ చూస్తూ, కాస్తూ -

ఎరువులు వేసి, కలుపులు దీసి, పంట పండించి -

పంటను యెలుకలు, చిలుకలు తినివేయకుండా జాగ్రత్త చేసి -

పంటను కైలు చేసి - ధాన్యం రాసులు పోసి - తమ కడుపులు కాలుతూవున్నా, కన్నీళ్ళు కారుతూ వున్నా -

మిత్రమా ! ఇనాందారులకు ఫలితం అంతా అప్పగించి వట్టిచేతులు నలుపుకొంటూ యిండ్లకు పోయి పస్తులు పడే రైతుల దీనగతి యెవరికి హృదయం కరిగించదు ?

చాలకాలం గడిచిపోయింది నాకు యీ వూహ లోనే, కోటయ్య ఏమి ఆలోచిస్తున్నాడో నాకు తెలియదు.

ఇద్దరమూ తెలివొంది చూచుకొనేసరికి మంచుచేత మా తలలు నానిపోయినై. పోదాం పద అని లేచాడు కోటయ్య.

రాత్రి అంతా నాకు నిద్దర పట్టలేదు. పైగా అమితమైన చలి కూడాను. చలిమంటలు వేసుకొంటూ కబుర్లు చెప్పుకొంటూ ఆ రాత్రి గడిపాం.

ఆ మర్నాడు నిద్దుర బద్ధకం చేత (ఏమీ పనిలేకపోవడమే బద్ధకానికి కారణం) నీకు లేఖ వ్రాయలేకపోయాను. ఆ రాత్రి అన్నం తినకుండానే నిద్ర పోయానట, మాయమ్మ అన్నానికి యెంత లేపినా లేచాను కానట.

రేపంతా పని వుంది. మెట్టదుక్కులు వచ్చాయి. తోటల్లో అరకలు కట్టాలి. రేపు మూర్తిగారి యింటికి వెళ్ళాలి అనుకొంటూన్నాను. ఎలా వుంటుందో.

ఇంతవరకూ నా లేఖ యెందుకు ఆలస్యమయిందో వ్రాశాను. అసలు నీకు వ్రాయాలి అనుకొన్న సంగతి వ్రాయనే లేదు.

క్రిస్టమసు వస్తుంది. క్రిస్టమసుకూ సంక్రాంతికీ కలిపి కాలేజీకి సెలవులు యిస్తారు. నేను యీ యేడు చదువు సాగిస్తే నిన్ను మా వూరు తీసుకొని రావాలి అనుకొన్నాను. కాని పురిటిలోనే సంధి కొట్టింది నా చదువుకు.

డబ్బు లేని చదువు యిబ్బందుల చేటు. వచ్చే యేడైనా చదువుతానో చదవనో. కాలం జరిగిపోయే కొలదీ స్నేహాలు ప్రాతబడిపోతూ వుంటాయి. క్రొత్తపరిచయాలు కలిగే కొలదీ ప్రాత పరిచయాలు అడుగున పడిపోతూ వుంటాయి. ఇది ప్రపంచ స్వభావం.

కనుక యీ సెలవులకు మా వూరు వస్తావనే అనుకొంటున్నాను.

నీవంటి అర్ధహృదయుడు పల్లెటూళ్ళు వచ్చి ఇచ్చట ప్రజలు పడే కష్టాల్నీ - కష్టాలు తొలగిపోతే పల్లెటూళ్ళు మానవసంఘానికి ఈయగల ఆనందాన్నీ - చూస్తే యెప్పటికైనా మంచిది.

ఏ విషయమూ వెంటనే తెలపాలి. నారింజపళ్ళూ, వెలగపళ్ళూ, కొబ్బరి కురిడీలూ జాగ్రత్తచేసి వుంచుతాను. తప్పకుండా రావాలి. సెలవు.

★★★

చెలీ !

క్షేమం

రాత్రంతా కుప్ప దగ్గిర పందుకొన్నాను. జోగయ్య ఒక మామూలు రైతు - సుబ్బయ్య ఒక ఈనాందారు దగ్గిర పాలేరు - ఈ ఇద్దరూ నాకు మిత్రులు.

ఈ వూసూ ఆ వూసూ చెప్పుకుంటూ కొంతసేపు కాలం గడిపాం. ఒకరి కష్టా లొకరికి తెలుపుకొంటూ సానుభూతిని ప్రకటించుకొంటూ గడిచాయి కొన్ని గడియలు.

కుప్ప దగ్గిర - కుప్పకు ఆనుకొని- ఒక గట్టు. ఆ గట్టు మీద కొబ్బరి ఆకుల చివళ్ళతో కట్టిన ఒక పాక - ఆ పాకలో మేము పందుకొన్నాం.

వట్టిగడ్డి మాకు పరుపులు. కొబ్బరితుంటలే తలదిండులు. కొబ్బరిచాపలే దుప్పట్లు.

వెల్లకిల పందుకొన్నాం ముగ్గురమూ. మా పాకలో నుంచి మిణుకు మిణుకు నక్షత్రాలు ఎంతో హాయిగా వున్నై. ఆ నక్షత్రాలు తొంగిచూచే సందుల్లో నుంచి చల్లగా మంచుసోన దిగజారుతోంది.

చలి ఉహుహుహూ అనిపిస్తుంది. మా పంచెలు ఆ చలిని ఆపలేక పోయినై. కట్టుకొన్న పంచెలు విప్పి కప్పుకొన్నాం. చలి ఆగలేదు. దగ్గిర వున్న కొబ్బరి చాపలు మీదకు లాక్కొని వాటి మీద వట్టిగడ్డి కప్పుకొన్నాం.

' ఈ వేళ మంచి చలి ' అన్నాడు సుబ్బయ్య.

' ఈవేళ కేంగాని మొన్న వేసింది శీతలం ' అన్నాడు జోగయ్య. ' అరక పట్టుకొని దున్నుతూంటే మేడితోకకు చెయ్యి అంటుకు పోయింది. '

' ఈ వేళ కూడ అలాగే వుంది ' అన్నాను నేను. ' ఆపైని ఇంకో నాలుగాకులు వెయ్యవలసింది. '

' అప్పుడే నా వొల్లంతా నానిపోయింది ' అన్నాడు సుబ్బయ్య.

' ఇంటికాడ హాయిగా పందుకోక – ఈ నరకం ఏంటి మనకి ? ' అన్నాడు జోగయ్య.

' ఈ కుప్ప మనది కాదు కాబట్టి '

' మనదైతే ? '

' మన కామందు లాగే హాయిగా శాలువా ముసుగు పెట్టుకొని గుర్రుపడుతూ వుందుము, ఈపాటికి డాబామిద్దె గదిలో. '

' అప్పుడు మన ప్రాణానికి ఇంకొకళ్ళు ఏడ్చేవాళ్ళు ఈ చలిలో పడి మనలాగే '

' ఏడిస్తే పోనీ '

' అలాగే అందరు యజమానులు. మన కామందును మనం అసహ్యించుకొంటున్నాం. మనం కామందులమైతే మన చేతి క్రింద పనిచేసేవాళ్ళు మనల్ని అసహ్యించుకొంటారు ' ఈ మాట కొంచెం రైతునని చెప్పుకొనే జోగయ్య అన్నది.

జోగయ్య మాటని సుబ్బయ్య ఎదిరించాడు. ' అందరూ యజమాన్లే అయితే నో ? ' అని.

' అవలేరు ' అని జోగయ్య అన్నాడు. సుబ్బయ్య నా చేతిని గోకాడు. ' పోనీ ' అయ్యారు అనుకో. అప్పుడు ? ' అన్నాను.

' ఎందుకు అవరు ? '

' కుబేర్రావుగారి పండ్రెండువందల ఎకరాల్నీ ప్రభుత్వం వశపరచుకొని కుటుంబానికి ఐదు ఎకరాల చొప్పున ఇస్తే ? అలాగే హిందూ దేశా న్నంతట్నీ విభాగిస్తే ఎందుకు అవరు ? ' అన్నాను.

' అబ్బో ! ఇక న్యాయం వుండ్దర్లేదూ ? ' అని జోగయ్య అన్నాడు.

' ఇప్పుడేమంత అగోరిస్తుంది న్యాయం ? ' అని సుబ్బయ్య అన్నాడు.

అని ,

' కష్టం వొకళ్ళది, ఫలం మరొక్కళ్ళది. ఇదేనా న్యాయం ? తను స్వయంగా సాగుచేసుకోలేనంత భూమి ఈనాందారు కెందుకు ? కష్టపడి - భూమిని బాగుచేయగలిగే మాకు ఏమీ (ఇళ్ళస్థలం అయినా) లేకపోవడం దురన్యాయం కాదూ ? ' అంటూ ఉపన్యాసం సాగించాడు సుబ్బయ్య.

' అయితే ఇప్పుడేమంటావు ? ' అన్నాను సుబ్బయ్యని.

' ఏమనడానికి ఏముంది ? నీవు మొన్న పత్రికలో చదివావు కావూ అందరికీ సమానత్వం రావాలని ? అది రావాలి ' అన్నాడు.

' అది ఎలా వస్తుంది ? మాటలతో వస్తుందా ? ' అన్నాను.

' సాధించాలి '

' ధైర్యం-సాహసం వుండాలి. మన మందరమూ వీరులు అయిపోవాలి ' అన్నాడు.

' అమ్మో పల్లెటూళ్ళు ! ' అనుకొన్నాను.

ఇంతట్లోకే కుప్ప బెదబెదలాడింది. ఏంటా అని పరకాయించాం. ఏంటో చల్లగా కనుపించి కుప్పచాటున దాగింది.

' అమ్మో ' అని ఉలిక్కిపడ్డాడు సుబ్బయ్య.

' బలే ధైర్యం వుంది నీకు ! సమత్వం సాధించే వీరుడివి. కాదూ ? ' అన్నాడు జోగయ్య.

లాంతరు తీసుకొని కుప్ప వెనకాలకు వెళ్ళాను. అది తుర్రుమని పారిపోయింది.

' ఏమిటది ? ' అని సుబ్బయ్య అడిగాడు.

' మా కర్రెకోడిదూడ ' అన్నాను.

' కుప్ప లాగిందా ? '

' లేదు. లాగే ప్రయత్నంలో వుంది పాపం ! '

అది కూడా మన సుబ్బయ్య లాంటిదే. సాధించడానికి వచ్చి పారి పోయింది !

' అది ఎక్కడికి పోతాదో - కట్టివేసి వస్తా' నని లాంతరు తీసుకొని బైలుదేరాను.

సుబ్బయ్య - జోగయ్య అనుకొన్న మాటలు మాటి మాటికీ జ్ఞాపకం వస్తూనే వున్నై.

' పల్లెటూళ్ళలో విప్లవశక్తి పుట్టింది. అది లోలోపల కుమ్ములుతోంది అగ్నిపర్వతం లాగ, ఎప్పుడో ప్రేలక తప్పదు ' అని అనుకొంటూ తిన్నగా మందలోకి వెళ్ళాను.

తల్లి దగ్గర నిల్చుంది దూడ. తల్లి దాన్ని నాకుతుంది ప్రేమతో.

తోటంతా ప్రశాంతంగా వుంది. మందలో మా అయ్య పందుకొని వున్నారు.

మెల్లగా దూడని కట్టివేసి - లాంతరు తగ్గించి - ఆ మంద లోనే కూర్చున్నాను చాలసేపు విశ్వవిలాసాన్ని వీక్షిస్తూ.

సుఖంగా నెమరవేస్తూ పందుకొన్న ఎద్దు.

కూలీలూ, పాలేళ్ళూ, అంతా కష్టాలు మరిచిపోయి సుఖస్వప్నాలు కంటూ వుంటారు వారి వారి గృహాల్లో.

ఎంతోమంది కష్టజీవులు ప్రేమసల్లాపాల్లో ఆనందం పొందుతూ వుంటారు ఆ సమయాన్ని.

దుఃఖితులు జీవితార్తుల్ని మర్చిపోయి నిద్రిస్తూ వుంటారు.

ప్రకృతి ఎంత హాయినీ - ప్రశాంతాన్నీ కూరుస్తుంది జీవితానికి !

ఆహా ! ' రేపు ' అనేది లేకపోతే - !

' రేపు అనేది లేకపోతే ఎంత బాగుండునుప ? ' అనుకొన్నాడు.

' రేపు అనేది నిజంగా లేదేమో ' అని భ్రమ కలిగింది. కాని - భ్రమ.

ప్రొద్దు పొడుస్తుంది తిరిగి. తప్పదు.

ఎద్దుల్ని తోలుకొనిపోయి అరకలు కట్టాలి.

అవి అలసి నడవకపోతే కర్రలతో వాటిని కొట్టాలి.

కార్మికులు, కర్షకులు, తిరిగి వారి వారి పనులకుపోవాలి.

కష్టపడాలి.

దుఃఖించాలి.

అబ్బ ! ఆ 'రేపు' అనేది రాకపోతే ఎంత హాయిగా వుంటుంది ప్రాణం !

సభా ! అలాంటి వూహలతో చాలసేపు ఆ అంధకారంలో కూర్చున్నాను. మానవులకు – అందులోనూ పేదలకు – ఎంత కష్టం దాపురించింది !

తమతో బాటు ఎన్ని జీవుల్ని, ఆవుల్నీ, ఎద్దుల్నీ ఇంకా ఎన్నో జంతువుల్ని కష్టపెడుతున్నారు తమ స్వార్థానికి !

ఈ దీనజీవికలు తరించే మార్గం లేదా వొకటి ?

'సమత్వం రావాలి. సర్వసమత్వం రావాలి' అంటూ ఏదో గింగురుమన్నది' నా చెవిలో.

ఇక అక్కడ వుండలేక లాంతరు తీసికొని కుప్ప దగ్గిరికి బైలుదేరాను.

త్రోవలో రెండు లేగదూడలు ప్రక్క ప్రక్కగా పండుకొని నెమరు వేసి కొంటున్నవి.

రెపరెపలాడుతూ కూస్తో, రెండు గుడ్లగూబలు ఒక చెట్టు మీద నించి ఇంకొక చెట్టు మీదికి ఎగిరిపోయినై.

చెలికారం ఎంత దివ్యమైంది !

చెలికారం లోనే సర్వసమత్వం వుంది.

నీవు ధనవంతుల బిడ్డవు, నేను నిరుపేదను.

నీవు నిత్యపట్ట వాసివి, నేను పల్లెటూరివాడిని.

నీవు భోగలాలసుడవు-నేను కష్టజీవిని.

కాని,

మన స్నేహం ఎంత హృదయపూర్వక మైంది !

సర్వసమత్వం స్నేహంలో వుంది – సత్యం.

ఇప్పుడు సంకుచితంగా వున్న స్నేహాన్ని విశ్వవ్యాప్తం గావించాలి అంతే.

అప్పుడు కలుగుతుంది సమత్వం.

అది శాశ్వతంగా వుంటుంది ఆనందకరమై.

కుప్ప సమీపించాను. పాకలో ఆ యిద్దరూ నిద్రపోతూ వున్నారు.

మంచు కురుస్తూ వుంది జోరుగా.

నేను కూడా గడ్డిలో దూరి కూర్చున్నాను.

ప్రజలకు కష్టాలు నశించిపోవాలి. సౌఖ్యాలు శాశ్వతంగా ఉండాలి.

ఈ కుప్ప దగ్గర మేమెందుకు చలిలో వణకుతూ బాధపడుతున్నాం ? కుప్పను దొంగలు దోచుకోకుండా చూడడానికి.

దొంగ లెందుకు దోస్తారు ? తిండి లేక. తిండిగలిగితే దొంగలే వుండరు.

తిండిగలిగితే మేము ఈ కష్టాలు పడనే పడం.

అందరికి కడుపులు నిండుగా తిండి దొరికే అవకాశాలు వుంటే చాలు - సమత్వం దానికదే వస్తుంది.

ముందు ప్రపంచాన్నంతా ఒకే స్నేహదృష్టితో చూచే గుణం సంఘానికి కలగాలి. ఈ వూహల్లో ప్రపంచమంతా ఒక్కసారి చుట్టి వచ్చింది మనస్సు. వివిధ దేశాల్లోనూ సమత్వానికీ, అసమత్వానికీ, నిరంకుశత్వానికీ, దాస్యానికీ- భాగ్యానికీ పేదరికానికీ- ఎక్కువకూ తక్కువకూ-గర్వానికీ అడకువకూ-పోరాటం ఏవిధంగా జరుగుతున్నదో ఒక్కసారిగా కళ్ళకు కట్టినట్టు కనిపించింది.

కాలేజిలో అసమత్వానికి చెందిన రాముడూ, గర్వానికి చెందిన దేవిడ్డూ, నిరంకుశత్వానికి చెందిన రాఘవరావూ, భాగ్యానికి చెందిన నీవూ, పేదరికానికి చెందిన నేనూ, అడకువకు చెందిన మహమ్మద్ ఖానూ - ఎంత స్నేహంగా వుండే వాళ్ళమో జ్ఞప్తికి వచ్చింది.

' ఆ స్నేహం కాలేజీకి వెలుపల ఎందుకు వుండదు ? అది విశ్వవ్యాప్తం ఎందుకు కాదు ? సర్వసమత్వాన్ని సాధించడానికి మారణ విప్లవమే యేల ? శాంతి విప్లవం చాలదా ? ' అని అనుకొన్నాను.

ఆ స్నేహమంతా తలుచుకొని అందులో ప్రత్యేకంగా నీ తోటి స్నేహాన్ని జ్ఞప్తికి తెచ్చుకొనేప్పటికి శరీరం పుల కాంకురితం అయింది. ఏదో తెలియని ఆవేశం ఉప్పొంగింది హృదయంలో.

ఆ పాకలో గడ్డి క్రింద దాచిన పుస్తకం, పెన్సిలు తీసి ఈ కిరసనాయిలుబుడ్డి లాంతరు వెలుగులో ఈ పద్యం వ్రాశాను.

'నాలుగింటికె కళాశాల మూసిన నాటి
పైరు చేల్గట్ల విహారములును,
సెలవులలో వేడ్క చెలగు సంజల నాటి
వైనతేయ తటోపయానములును,
వెస పుస్తకములపై విసుగు వుట్టిన నాటి
నెలవైన వెన్నెల పులినములును,
పువ్వుకో కాయకో, పుట్టువాదుల నాటి
క్షణికమ్ములగు ప్రేమకలహములును

మరపునకు రావు, నెచ్చెలి, మరపు రావు,
బ్రతుకు తెర్వుల వెన్నంటి వచ్చు తుదికి.
జీవిత పథాలు వేరయి, జీవయాత్ర
వెడలి దూరమైపోయెది వేళకూడ.

ఒంటరినె అయి ఇంట కూర్చున్న యపుడొ
ఏమియును తోచకొక దారి నేగు నపుడొ
వేసవులలోని సాయాహ్న వేళలందు
మొక్కల కుదుళ్ళ తీర్చి నీర్వోయునపుడొ
కలలవలె పూర్వరీతులు కానుపించు
కలత కన్నీరు వేడిగా కారిపోవు.'

సఖా ! అది చూడడానికి కొబ్బరి చిగుళ్ళ పూరిపాక. పట్నం వాళ్ళ కంటి కది అసహ్యంగా, తేలికగా కనిపిస్తుంది.

కాని, మాకు అది దివ్య భవనం, చర్చాసౌధం, సౌఖ్యవేదిక, విహారసీమ.

★★★

ప్రియ మిత్రమా !

అనారోగ్యంగా వుంది. ప్రొద్దుటి నుండీ ఇంట్లోంచి బైటికి పోలేదు.

సాయంకాలం అబ్బాయి వచ్చాడు – పొలం పోదాం రమ్మన్నాడు. నీరసంగా వుంది – రాలేను – అన్నాను.

' తావులు తేలే చల్లని తేటగాలీ - హృద్యంగా కల కల్లాడే పచ్చని పైర్లూ - హృదయాన్ని ఆకర్షించే తోటలూ - వుండే గ్రామంలో ఇంట్లో కూర్చోవడం నరకప్రాయం కాదూ ? ' అన్నాడు.

' ఆరోగ్యం సరిలేదు. '

' ఆరోగ్యం సరిలేక పోవడం యువకులికి కాదు '

నీడగా వున్న మార్గం విడిచి (చలి వేస్తూంది) ఎండలో నడిచాం.

ఆవూసూ, ఈవూసూ చెపుతూ నాకు వుత్సాహాన్ని కలిగించడానికి యత్నిస్తున్నాడు అబ్బాయి-

' ఇంటికాడ - ఆ జ్వరం కంపు ప్రక్కా - ఆ వూపిరి తిరగని చీకటిగదీ - ఆ పొగ చూరూ గాలీ '

' చెరువు గట్టుకు వెళ్ళితే - ఆ విడిచే చెంగల్వలూ - ఆ మొగిచే తామరపూలూ - ఆ ఆడుకొనే చిరుకెరటాలూ - ఆ పాడుకొనే నీటి పక్షులూ - '

అంటూ.

పొలం పోయాం - చెరువుకట్టు మీదికి. ఎండలో నిల్చున్నాను. ఆ సాంధ్యాముగ్ధ సౌందర్యాన్ని చూస్తూ - అబ్బాయి చెరువులో దిగాడు పువ్వులు కోయడానికి.

ఆ పాటల్లో - ఆ ఆటల్లో - ఆ సుందర ప్రకృతి వొడిలో పూర్తిగా నిద్రపోయాను, నేను మానవుణ్ణి అని మరిచి !

కలలు కంటున్నాను, అంతా ఆనందమే - అంతా సౌఖ్యమే - అని నా అనారోగ్యాన్ని విస్మరించి !

కీర్తిస్తున్నాను - ఆ ఆనందాన్ని నాకిచ్చిన ఎవర్నో - నా కష్టజీవిత దుఃఖాన్ని కప్పిపుచ్చుకొని !

వెర్రివాణ్ణి.

సఖా ! ఆ ప్రక్కచేలో కష్టంతో పనిచేసుకొంటూ వున్న రైతు ఈ ఆనందాన్ని అనుభవిస్తూ వున్నాడా ?

ఆ చెరువుమూలలో పశువుల్ని మేపుకొంటూవున్న ఆ చిన్నకుర్రాడు ఈ సాయంసంధ్యా ప్రకృతిలో ప్రమోదిస్తున్నాడా ?

గడ్డి బుట్ట తలపై పెట్టుకొని – నీర్సంగా ఇంటికి పోయే ఆ పల్లెటూరి పడుచు, ఈ ముగ్ధ సౌందర్యంలో తన్మయత్వం పొందుతుందా?

లేదు – లేదు.

నావంటి అనారోగ్యులికీ – నీ వంటి సుఖభోగులకీ – ఇంకా ఎవరో వంటి పనిలేనివారికీ తప్ప, కష్టపడి జీవించే స్వార్థజీవులకి ఈ సౌఖ్యమూ – ఈ ఆనందమూ – అనుభవించడానికి తీరుబడి వుండదు ! సౌకర్యాలు లేవు !

దుర్గతి !

' ఏమిటి ఇలా వున్నావు ? ' అన్నాడు అబ్బాయి భుజం మీద చేయి వేస్తూ – చేతిలో పువ్వుల్ని ముఖంలో పెడుతూ.

' నిరాశ ' అన్నాను.

' ఎందుకు నిరాశ ? ఏమి నిరాశ ? మరణం ముందు – నిరాశ వెనుక.'

మరణం ముందు – నిరాశ వెనుక ?

' కావచ్చును కాని, సఖా ! ఈ సంఘక్రమం వొకరికి నిరాశగా – మరొకరికి పేరాసగా వుంది.

" అటు విను " అన్నాను.

నవ్వే పువ్వుల పెదవుల్లోనించో – కేరేకెరటాల గొంతుల్లోనించో – పక్షుల కదిలే నాలుకమీద నించో – ఒక పాట వినిపిస్తూంది.

ఈ పల్లె చాలు నాకీ పొలము చాలు నా
కీ పాక చాలు నోయీ !
ఆకలీ, అధికారి ఆదరుపాటూ నన్ను
అంటరాగూడదోయి !

పాట వచ్చిన దిక్కు నడిచాం.

ఆ వూచిన బాడిదపు చెట్ల క్రింద – ఆ పొలం అంచున ఒక పాక – ఆ పాకలో ఒక రైతుబిడ్డ.

' కృష్ణా ! పాటలు పాడేస్తున్నావే : '

అన్నాను వెళుతూనే.

చూస్తూనే ఆ కుర్రాడు లేచి వచ్చి చేతిని గట్టిగా పట్టుకొని మెత్తగా గిల్లాడు.

' ఏం ? వేడిగా వుంది చేయి ! ' అన్నాడు.

' జ్వరంగా వుంది, ఇంటికి పోతాం - పాటలు పాడు - మాన వద్దు - ఏనాటికైనా మన పాటల్ని లోకం వినకపోతుందా ' అన్నాను. ' పొలం కాపలా కాస్తున్నావా ? '

' ఔను '

నిరాశ కాదూ ?

అబ్బాయి ఏదో ఆలోచిస్తూ నడుస్తున్నాడు.

' నిరాశ కాదూ ? ' అన్నాను. ఆ కుర్రాడి చదువు వీధిబడితోటే ముగిసింది. కాని ఎంత చక్కని పాటలు వ్రాస్తాడను కొన్నావు ? ఈ పల్లెటూళ్ళో - ఈ దినదిన భుక్తి కోసం - ఈ ఆకటిచిచ్చు ఆర్చుకొనే నిమిత్తం కష్టిస్తూ నష్టిస్తూ - వ్యర్థం అయిపోవలసిందే కాదూ అతని జీవితం ?

' ఓ అంటే నా రాని షోకిల్లాలంతా విద్యాభ్యాసాలకనీ - విదేశాలకనీ - (వాళ్ళ పెద్దలు వుద్యోగస్తులో - కోటీశ్వర్లో అయివుండటం చేత) లక్షలకొలది డబ్బు వ్యర్థం చేస్తూ వుంటే - ఈ అజ్ఞాత కాళిదాసులూ, యీ అనామక మహాత్ములూ ఈ పల్లెటూళ్ళలో, ఈ మారుమూలల్లో, హతాశులై నశించిపోవలసిందే కాదూ ? '

' నిరాశ ! '

అబ్బాయి ఏమీ మాటాడలేదు.

' నీ జ్వరం ఏమయింది ? ' అని మాత్రం అడిగాడు.

చెలీ ! నా జ్వరం ఇంటికి పోయేటప్పటికి ఎక్కువయింది - నీర్సంగా వుండి బైటికి ఎందుకు పోయావని మా అయ్య కోప్పడ్డారు.

ఈ సాయంతనం జరిగిందంతా వ్రాయాలి అని కూర్చున్నాను, కిరసనాలు దీపం దగ్గిర.

కాని - ఏం జరిగిందీ ?

' మరణం ముందు- నిరాశ వెనుక ' అన్న అబ్బాయి మాటల్లో అర్థం ఉందా ?

నిరాశ అంటే ? ఇక ఆ జీవితం వ్యర్థం అన్నమాట !

ఎన్ని జీవితాలు - ఒకటా ? రెండా ? నూరా ? లక్షా ? కోట్లకొలదీ -

వ్యర్థం అయి పోతున్నాయి. ఈ వ్యర్థానికి కారణం నిరాశ ! నిరాశ ముందు - మరణం వెనుక !

కాని -

భుక్తి కోసం దేశాంతరం పోయి మరణించిన భర్త కోసం సంతోషంతో వైనతేయంలో దాక్కొన్న ఆ ముగ్ధ -

ఆకటిచిచ్చుతో అలమటిస్తూ వున్న బిడ్డల్ని తృప్తి పరుపలేక (తన ఇరుగూ పొరుగూ మహాభాగ్యంతో తుల తూగుతూవున్నా) చెరువులో ముందు బిడ్డల్ని పడేసి - తరువాత తాను పడి - ఈ స్వార్థ సంఘానికి వీడ్కోలు చెప్పిన ఆ తల్లి -

ఉరికంబం మీద చలువ కన్నీరునించి, జయిస్తానని గర్వపడ్డ ఆ యువకవీరుడు -

చీకటి చెరసాలలో చిరునవ్వు నవ్విన ఆ ప్రవక్త -

త్రేతాయుగంలో -విద్వేషాన్ని స్వార్థాన్ని నిర్మూలించి - సౌఖ్యాన్ని మానవకోటికి సమానంగా పంచిపెట్టాలని యత్నించి - స్వార్థపరుల చేతిలో హత్యపొంది - కలియుగంలో తన ఆశయాన్ని గెలిపించుకొంటూ వున్న ఆ అమృతజీవి-

' మరణం ముందు - తరువాత నిరాశ ' అనేది కూడా కాక - అసలు నిరాశ అనేది లేనేలేదేమో అని...

అబ్బాయి మాటలు కాదన్నాను. సమర్థించుకోవడానికి కూడా ఆయన ప్రయత్నించలేదు !

గంభీరత !!

ఈలాగే అనుకొంటున్నాను, వూహలు పరుగెత్తుతున్నాయి - కాని కలం జరగడం లేదు.

కలం పడేసి - వూపిస్తున్నాను. ఏదో చిమర వాసన కొట్టింది -

అయ్యో ! దీపంబుడ్డి మీదికి వ్రాలి నా క్రాఫింగు వెంట్రుకలు సగం మాడినై.

" ఏమిటి ఆ వాసన ? " అని పల్కరించాడు మా అయ్య.

" ఏమీ లేదు కాగితం మాడింది " అన్నాను.

" ఇంకా వ్రాస్తున్నావా ? పడుకో " అన్నాడు.

దీపం ఆరిపేసి పడుకొన్నాను. కాని నిద్ర మాత్రం రావడం మానేసింది. క్రింద చెమ్మ, వర్షకాలంలో మా ఇల్లు అంతా నానిపోవడం వల్ల ఆ చెమ్మ ఇంకా ఆరలేదు. నేను పడుకోవడం వొక చాప మీద. దోమలు విస్తారం.

పైని దోమలూ - లోపల ఆవేదనలూ-చురుకు చురుకు పొడుస్తున్నాయి. శరీరం మీదకి చీమలు ప్రాకుతున్నాయి. పైని ఇంటికి కప్పు చిల్లులనుండి నక్షత్రాల కాంతులూ - మంచు చినుకులూ రాలుతున్నై.

లేచి కూర్చున్నాను - మళ్ళీ పండుకొన్నాను - మళ్ళీ లేచాను.

దీపం వెలిగించాలని అగ్గిపెట్టె కోసం వెతికాను.

' ఏమిటి నాయనా అది ? ' అన్నది మాయమ్మ.

' అగ్గిపెట్టె లేదు. అగ్గి ఇస్తాను ' అంటూ కుంపటిలో నిప్పులు వూదడానికి లేస్తోంది.

' అక్కర్లేదులే అమ్మా ' అని చెప్పి పండుకొన్నాను.

మిత్రమా ! అగ్గిపెట్టే కొనడానికి కూడా డబ్బు లేదు. ఆ మాట మరిచిపోయే నేను అగ్గి పెట్టె కోసరం వెతికాను !

అయినా మావూళ్ళో - మా (కూలీ) సంఘంలో మేమే భాగ్యవంతులం !

సఖా ! రాత్రి అంతా ఇలా గడిచిపోయింది. నాకు లాగే ఎన్ని ఎన్ని ఆర్తిజీవనాలు తపించిపోతూ వున్నాయో ఈ నిశీధ సమయాన్ని !

ప్రశాంతంగా నిద్రపోవలసిన రాత్రుళ్ళే మాకు వ్యధాచింతలు - అప్పుడే మాకు తీరుబడి మా బ్రతుకుల్ని గురించి ఆలోచించుకోడానికి.

ఎన్నటికి యీ దుస్థితి తొలగిపోయి సమతాసౌఖ్యం రావడం ? ఈ దుర్భర క్షుధానిశీధి గడిచిపోయి ప్రశాంత ప్రభాతం రావడం ?

★★★

ప్రియసఖా !

క్రిష్టమసు వచ్చింది - పోయింది. సంక్రాంతి వస్తూ వుంది - అదీ అలాగే పోతుంది.

కాని,

మా కష్టాలు ఎప్పుడూ రావడమే - పోవడం మాత్రం వుండదు.

ప్రొద్దుటే లేచి అరక కట్టాను. వూరి వెలుపల పుంత దగ్గర తోట అది. ఆ పుంతలో కూలీల ఇండ్లు చిక్కిరిబొక్కిరిగా కట్టబడి వున్నాయి.

నేను దును తున్న తోటదరిని-కంచె ఆవల - ఒక కొంప వుంది. ఆ కంచె ఎత్తుగా పెరిగి, చీకటిచీకటిగా, ముసుగ్గా వుంది.

ఆ కొంపలో ఇంకా దీపము వెలుగుతూనే వుంది. ఆ దీపం వెలుగులో ఒక ముసలివాడు ఏవో కొన్ని కాగితాలు తిరగవేస్తూ కూర్చున్నాడు.

అతడెవరో నాకు తెలుసు.

ఇంకా చీకటి పోలేదు. నేను దున్నుతునే వున్నాను. మంచు కురుస్తూనే ఉంది.

ఒక కొండ్ర కలిపి, రెండో కొండ్రపోసి, చుట్టూ తిరుగుతూ ఆ కంచె దగ్గరకు వచ్చేటప్పటికి 'జల్లు'మని పూలవర్షం కురిసింది మీద -

అక్కడ పూలచెట్లే లేవు. డొంకమల్లెలు వున్నాయి, అవి పూసేకాలం కాదిది.

మరి - ఆకాశాన్నుంచి నక్షత్రాలు రాలాయా ? దేవతలు పూలవర్షం కురిపించారా నేను పడే కష్టానికి మెచ్చి ?

ఏమో - అనుకొని - అరక నొక్కిపట్టి వెనక్కి చూశాను.

' నాయనగారూ ! ఇంత చీకటితోనే అరక కట్టారా ? ' అంది కంచె ఆవలనుండి ఒక వృద్ధకంఠం.

' అవును ' అన్నాను.

' మీద పడ్డాయేమో కాగితం ముక్కలు, ఏమీ అనుకోకండి '

' ఫర్వాలేదు లే ' అంటూ ఎడ్లని తోలాను. నాగలిలో చిక్కింది ఒక పెద్ద కాగితం ముక్క.

దాన్ని తీసి చదివాను. అందులో ఇలా వుంది.

' నాయనలారా ! దురన్యాయం సాగుతోంది ప్రపంచంలో. కడుపుమాడి కూలీలు చచ్చిపోతున్నారు. తిన్నది అరక్క ధనవంతులు తట్టుమొట్లాడుతున్నారు. భార్య, భర్త, తల్లీ, తండ్రి, కొడుకూ, ఇంటిల్లిపాదీ రెక్కలు ముక్కలు గొట్టుకున్నప్పటికి

కడుపునిండా కూడు దొరకడం లేదు. అయ్యలారా ! ఇది గమనించండి, ఇలా ఎంత కాలం ఈ అన్యాయాన్ని జరగనిస్తారు ?....

ఈ ముక్కలో అంతే వుంది. దాని తరువాత ముక్క కోసం వెతికాను అరక ఆపి.

నేను ఆ ముక్క చదవడం – అరక ఆపి తక్కిన ముక్కలు వెదకడం – ఆ కంచె అవతలి వ్యక్తి చూచాడు.

' ఏంటి అయ్యగారూ ! వెతుకుతున్నారు ? '

' ఈ కాగితాల్ని ఇలా ఎందుకు చింపివేశావు ! '

' ఎందుకండీ చాలాకాలం క్రిందటివి – ప్రాతవి. '

' ఇలాంటి కాగితాలు ఇంకా వున్నాయా నీ దగ్గర ? '

' ఏవో నాలుగైదు కాగితాలు మాత్రం వున్నాయండీ. '

' వాటిని నన్ను చూడనిస్తావా ? '

' మీ చిత్తం. '

సఖా ! ఇక్కడ నేను చేస్తూన్న పనికి నీవు నవ్వుతావేమో – నవ్వినా సరే.

అరక ఆపేశాను. ఎడ్లని విప్పి ఇంటిముఖం పట్టించాను.

తోటలో చెల్లా చెదురుగా పడివున్న కాగితం ముక్కలు దొరికినన్ని పట్టుకొని కంచెలో నుంచి దూరి అవతలి కొంపకు పోయాను.

ఆ వృద్ధుడు (పేరు సుబ్బారాయుడు) నన్ను సావిట్లోకి పిల్చి పీట వేశాడు. కూర్చున్నాను.

ఒక మూల ఎలుకలు కొట్టిన పాత తాటాకుల బుట్ట పెట్టెని ఒక దాన్ని నా ముందు పెట్టి దాని మూత తీశాడు.

అందులో కొన్ని కాగితాలు వున్న మాట వాస్తవమే. కాని తెల్లకాగితాలు ! ఒకటి రెండు ఏదో చిల్లర పద్దుల జాబితాలు – ఒకటి రెండు వుత్తరాలు.

' సరిలే, మంచి కాగితాలు చింపేశావు ' అంటూ అక్కడే కూర్చుని ఆ చింపుముక్కలు చదవడం మొదలు పెట్టాను ఒక్కొక్కటి.

' అమ్మలారా ! అయ్యలారా ! తక్కువ కూలీకి పని చెయ్యకండి. కామందు అనగా... '

ఒక్క ముక్కకూ మరో ముక్కకూ అతకులు కుదరలేదు. అందుచేత ముక్కలన్నీ వట్టి వట్టివే చదివేశాను.

' ... మన కష్టరక్తం, మన వేడి చెమ్మట, ధనవంతులకు తిండి అవుతున్న ... '

' గొప్పవాళ్ళం అనుకొనేవాళ్ళు మనతో సమానంగా అయినా పనిచేయాలి – లేక వాళ్ళతో సమానంగా బ్రతకడానికి సరిపోయేటంత కూలి అయినా...'

' వూడుపుల్లో కట్టుకట్టించాను. కూలి రెట్టింపు చేయించాను '

' ...వేళ వందమంది చుట్టలు త్రాగేవాళ్ళని కొట్టాను. నలభై మంది త్రాగుబోతులకి సంఘశిక్ష వేయించాను. మరీ... '

' శనివారం సంతకు వెళ్ళాను. సంతచుట్టూ పాతిన తుమ్మ ముళ్ళకంపలకు వేనవేలు పొగచుట్టలు గ్రుచ్చ... '

' కట్టుకు లొంగకుండా పనిచేయడానికి కూలీల్ని తీసుకొచ్చిన వెం... '

మిత్రమా ! ఈ విధంగా వుంది ఆ కాగితం ముక్కల్లో –

ఇది లెనిన్ హెచ్చరింపా ? మ్యాజినీ దినక్రమమా ? ఏమీ కాదు–

ఒక గ్రామీణుని తెగింపు మాత్రం.

ఇతడు ఏమి చదువుకొన్నాడు ?

నిరక్షరకుక్షి ! ఏమేమి విప్లవ గ్రంథాలు తిరగ వేశాడు ?

అసమత్వం – సంఘదౌష్ట్యం – అనుభవం !

' ఈ వ్రాతలన్నీ ఎవరు వ్రాసి పెట్టారు నీకు ? ' అన్నాను.

' ఎవరైనా అబ్బాయి చేత చెప్పి వ్రాయించుకొనే వాణ్ణి ' అన్నాడు.

' మరి వీటిని ఎందుకు చింపివేశావు ? ' అన్నా.

' నాయనగారూ ! ఎందుకండీ ఇవన్నీ ? నాకేమి చేస్తాయి ? పనియేమన్నా అయిందా – కష్టం ఏమైనా ఫలించిందా – ఏమీ లేదు. పని కావాలి గాని మనకు వట్టి వ్రాతలు కూడుపెడతాయటండీ ? ' అన్నాడు సుబ్బారాయుడు.

అంటూ,

' ఎంత శ్రమపడ్డాను ? ఎంత కష్టం అనుభవించాను ? ఎందరి తిట్లు తిన్నాను ? ఎందరి క్రోధానికి బలిఅయ్యాను ? ఎన్ని సమ్మెలు కట్టించాను ? ఎందరిని – కామందుల్నీ, కూలీల్నీ కూడ – కొట్టాను ? ఎన్నిసార్లో కోర్టులకి వెళ్లాను ? ఎన్ని సార్లు నెగ్గుక వచ్చాను ?

'అయ్యగారూ ? నాకష్టం వ్యర్థమైంది. నా బ్రతుకే విఫలం అయింది. ఇంక నన్ను యీ కాగితాలా రక్షించేవి ?

'ఆ రోజులు తలుచుకొంటే, అప్పుడు మీరింకా చిన్నవారు, నేను ఇంకా ఎందుకు బ్రతికివున్నానా అనిపిస్తుంది. ఎంతో విచారం కలుగుతూ వుంటుంది.

'సంఘం ఒక అధర్మసంస్థ. ధనవంతులు స్వార్థం కోసమూ – పేదలు పరార్ధం కోసమూ – జీవితాల్ని త్యాగం చేసుకుంటున్నారు. ఎంత దారుణం !

'కూలిని ఎక్కువ చేయడానికి సమ్మే కట్టేప్పుడు ఒక నాడు నేను కర్రపుచ్చుకొని త్రోవలో నిల్చుంటే జిల్లా అంతా వొణికింది.

'ఆ రోజుల్లోనే నాయత్నాలు ఫలించలేదు. మన వాళ్ళకి అంతరాత్మలు లేవు. వివేకం శూన్యం, ఓర్వజాలని తనం మెండు.

'ఏమో –' అంటూ పెదవి విరిచాడు నిరాశ తోటి ఆ ముదుసలి !

సుబ్బారాయుడి ఉపన్యాసం వింటూ అలాగే కూర్చుండి పోయాను.

కూటి కోసం కూలీలు పోరాటం సలిపిన ఆ రోజులు సమ్మెల తోటి – దొమ్మీల తోటి – కుట్రల తోటి – అల్ల కల్లోలంగా కనుపించాయి నా ఊహానేత్రానికి.

సంఘం ఒక అధర్మసంస్థ ?

ఔను – ఔను –

ముమ్మాటికి ఔను.

ఈ అధర్మానికి ఈ గ్రామీణుని హృదయం ఎంత కుమిలిపోయిందో !

'గొప్పతనాన్ని గ్రహించి, గౌరవించే ఉపజ్ఞ భారతీయులకు లేదు. ఇటువంటి వాళ్ళు ఏ పరదేశంలోనో అయితే యుగ పురుషులు అయివుండేవాళ్ళు – ప్రపంచానికి సౌభాగ్యం కూర్చి వుండేవాళ్ళు !'

చైనా విప్లవనాయకుడైన సన్ యాట్ సేనుడి వీలునామా లోక ప్రసిద్ధం. అది ఈ సుబ్బారాయుడి దినచర్యను మించగలుగుతుందా !

'ఎందరెందరు మహాపురుషులు ఇలా వ్యర్థం అయిపోతున్నారు !

'అవిద్య ! అవిద్య ! అవిద్య ! దీనికంతకీ, ఈ దుస్థితి కంతకీ, మూలకారణం అవిద్య !

'అవిద్య అనాగరిక లక్షణం. అనాగరిక దేశాల్లో భారతదేశం మొదటిది!'

సఖా ! ఇలాంటి వూహలు రెచ్చిపోయినై. నాకు గుండె బరువెక్కిపోయింది, కూర్చున్న కాడ నుంచి లేవలేక పోయాను.

వూహించే కొలదీ క్రొత్త విచారాలే పుట్టు కొస్తున్నాయి. కాని ప్రాత విచారాలు పోవడం లేదు.

' అన్నోరు, అయ్య రమ్మంటున్నారు ' అని పిలిచింది మా చెల్లి.

' వెళ్ళండి అయ్యగారు ! వెళ్ళండి కాని మన సంఘాన్నీ - సంఘంలో అతిదుర్భరస్థితిని అనుభవిస్తూ వున్న కూలీల్ని మాత్రం మరిచిపోకండి ' అంటూ సుబ్బారాయుడు ఇంట్లోకి పోయాడు.

' అయ్య ఏమంటున్నారు ? ' అన్నాను మా చెల్లెతో ఇంటికి వస్తూ.

' తిడుతున్నారు '

' ఎందుకూ ? '

అంటూ కంచె దాటి చూచేటప్పటికి నేను దున్నకుండా అరక మానివేసిన తోట దున్నివుంది.

' అమ్మో ' అనుకున్నాను ' ఇంకేముంది ! ఈవేళ సాధింపులు తప్పవు.'

సుబ్బారాయుడి ఇంటికి వెళ్లిన తరువాత మా అయ్య వచ్చి - తిరిగి అరక కట్టి - ఆ తోట దున్ని వేసినాడు.

కావలసినది కార్యం, కబుర్లు కావు. నేను చేసిన పని ఏది ?

నేను సుబ్బారాయుణ్ణి మెచ్చుకోవడం.

అతని వ్రాతలు చదివి ఆనందించడం.

అతని అభిప్రాయాల్ని పదేపదే ఊహించడం, గొప్పవాళ్ళని కనుటలో భారతదేశం ఇతర దేశాలకి తీసిపోదు అని గర్వించడం. అంతే.

ఇదంతా ఎందుకు ? కూడు పెడుతుందా ? గుడ్డలు ఇస్తుందా ? సౌఖ్యం చేకూరుస్తుందా ? ఏదీలేదు.

అయినా - అంత తప్పు పని చేశానా ?.

చేయవలసిన పని చేయలేదు.

కాని - అనామకుడైపోతున్న ఒక గొప్ప ప్రజాసేవకుణ్ణి గురించి కొంత తెలిసింది.

అయినా –

సుబ్బారాయుడు నాకుమల్లే ఊహాజీవి కాదు. ఉత్తర కుమారుడూ కాదు. కష్టజీవి – కర్మజీవి.

మిత్రమా ! ఇంటికి చేరేటప్పటికి నా వూహలు మధ్యలోనే వున్నై. హఠాత్తుగా చినిగిపోయినై – మా అయ్యను చూచేటప్పటికి.

కాని ఆ చినుగుల్లో – ' సంఘం ఒక అధర్మసంస్థ ' అనేది మాత్రం శిధిలం శిధిలంగా రాలింది.

సంఘం మీది ఏవగింపు నల్లగా ఆవరించింది – సంజ చీకటి లాగ అందులో ఏవో క్రొత్త వూహలు తళుక్కు మన్నాయి నక్షత్రాల్లాగ. ఆ నక్షత్రాల్ని గురించి నీకు వచ్చే లేఖలో వ్రాస్తాను.

★★★

సుహృద్వరా !

' ప్రతిదీ విచిత్రమే – అన్నీ ఆశ్చర్యాన్నే కలిగిస్తాయి నీకు ' – అన్నావు. కోతలు కోసేటప్పుడు ఈనాందార్లు దగ్గిర వుండి కుప్పలు వేయించుకుంటారు.

ఊడుపులు ఊడ్చినప్పటి నుంచీ కష్టం ఫలితానికి వస్తుంది, కడుపార తిందాం, అని కాచిపట్టుకోనివున్న రైతులు, కూలీలు బిక్క మొగాలు వేసుకొని నిరాశ చేసుకొని ఇండ్లకు పోతారు.

ఇదేమీ కడుపు కోతపెట్టదా ? హృదయం (ఉంటే) మండించదా ? దీన్ని కూడా నీవు తేలికగానే చూస్తావేమో, నీ వింత ప్రకృతి నాకు అర్థం కాలేదు.

నీవు నమ్మవు కాని అన్నం లేక ఎంతమంది చచ్చిపోతున్నారో పల్లెటూళ్ళలో లెక్కలు లేవు.

కాయకసరూ, పండూఫలమూ, ఏవో ఎల్లప్పుడూ వుండే పల్లెటూళ్లలో దరిద్ర దేవతకు ఎంతో మంది బలి అయి పోతున్నారంటే, మరి ఆ దేవత భయంకర రూపం నీవే యోచించుకో.

పస్తులు పడి మాడి చస్తున్నారు పాపం ప్రజలు అని పనులు యేమన్నా తక్కువ అవుతవా ? ఉహూ – ఎప్పటిపనులు ఎప్పటి మాదిరిగానే వుంటవి.

తమ కూలీలు, రైతులు , పాలేళ్ళు, తిన్నారా - తిన లేదా - అని ఆలోచించరు యజమానులు. తిన్నా సరే తినక పోయినా సరే పనులు మాత్రం ఎప్పటిలాగే చేయాలి. తాము మాత్రం తృప్తిగా భుజించి వచ్చి గట్టమీద కూర్చుంటారు.

ఇదంతా ఎందుకు చెప్పవలసిందంటే మేము కూడ కొంత పొలం కౌలుకు చేస్తున్నాం. పండినచేలు కోసి కుప్ప వేసి ఇంటికి వెళ్ళి రాత్రి పస్తుపడుకోవలసి వచ్చింది. ఎంత కష్టంగా వుంటుందో అనుభవించిన వాళ్ళకే తెలియాలి.

' పస్తులు పడుతున్నారు పాపం' అని ప్రకృతి కరుణిస్తుందా ? అసలు ప్రపంచంలో ఇలాంటి హెచ్చుతగ్గులు, కష్టసౌఖ్యాలు వున్న సంగతి ప్రకృతికి తెలిసా ? ప్రపంచం ఒకేరీతిగా వుండాలనే ప్రకృతి ఆశయం. కాని, సంఘం స్వార్థపరుల పక్షం వహించి మావంటి వారిని అధోగతిపాలు చేస్తుంది.

శీతకాలం, మెట్టదుక్కులు, తోటలు ఆరిపోతున్నాయి. ' రేపు అరకలు కట్టాలి' అని చెప్పిపోయాడు మా యీనాందారు. ' కట్టవచ్చులెండి ' అన్నాడు మాఅయ్య కాని-

' ఆరిపోవడంలే ఆ మెరకగడ్డ ? ' అంటూ కళ్ళెర్రజేస్తే ఏమి చేస్తాం ?

ఇంత మాత్రం దానికే అంతకోపమా అనుకొన్నాను నేను. కాని, మన స్వతంత్రభావాలు అక్కడ చెల్లుతవా ? కామందు హుకుం, చేసితీరాలి.

తొలికోడి కూయక ముందు నుంచే లేపడం ప్రారంభించాడు మాయయ్య నన్ను. నాకు నిద్ర చాల్లేదు. రాత్రి సగం రాత్రి వరకూ పొలంలో కుప్పదగ్గర జాగారం చేశాను. మా వుళ్ళో దొంగలు విస్తారంలే. దొంగలంటే మామూలు దొంగలు కాదు. మామూలుగా దొంగలు భాగ్యవంతుల్ని దోచుకుంటారు.

భాగ్యవంతుల్ని దోచుకొంటే పదిరోజులపాటు బ్రతుకనన్నా బ్రతుకవచ్చు. కాని పల్లెటూళ్ళలో ఈమధ్య చిల్లర దొంగలు బైలుదేరారు. కొబ్బరికాయలు దొంగిలించడం, కుప్పలు దోచుకోవడం, వాకిట్లలో పెట్టుకొన్న కుండా బిందీ ఎత్తుకు పోవడం. ఇవి చిల్లర దొంగలు చేసే గొప్ప దొంగతనాలు.

పేదలు, పేదల కొంపలే దోస్తారు. తిండి లేనప్పుడు కడుపు కాలుతూ వున్నప్పుడు, ప్రాణాలు అటూ ఇటూ అవుతున్నప్పుడు ఏమి చేయాలి ? మూడే మార్గాలు.

అడుక్కోవాలి, అంటే భిక్షమెత్తుకోవాలి. ఎవడు పెడతాడు ? ఒకపూట-రెండూ పూటలు అయితే ఎవడైనా పెడతాడు ముష్టిలో వీరముష్టి. అక్కడనుండి ?

అప్పుచేయాలి ? ఎక్కడ ? ఎవరి దగ్గర ? పేదలకు అప్పులు ఎవరు యిస్తారు. ? అప్పులు చేసు తిరిగి ఎలా తీర్చుకుంటారు? పోనీ అప్పులు చేసి ఎగవేయడానికికా?

దొంగిలించాలి. ఈ కళ అందరికీ చేత కాదు. కాని కొందరు జీవితంలో నిరాశపొంది సంఘం చేస్తూ వున్న అన్యాయాన్ని సహించలేక, తాము బ్రతకడానికి వేరుగతి గానక దొంగతనానికి దిగుతారు.

ఎన్ని చట్టాలు చేసినా, ఎన్ని బందో బస్తులు చేసినా – ఎన్ని రక్షణ విధానాలు అమల్లో పెట్టినా, దొంగతనాలు ఆగకపోవడానికీ 'క్రైమ్' అనేది తగ్గక పోవడానికీ కారణం ఏది అంటావు ? సంఘంలోవున్న అసమత్వమే. ఈ 'క్రైమ్' ను ఆపడానికి సంఘాన్ని ఆమూలాగ్రంగా సంస్కరించాలి. అట్లు సంస్కరించక ఎన్ని క్రొత్త చట్టాలు చేసినా, ఎన్ని క్రొత్త బందిఖానాలను కట్టించినా ఏమీ లాభం వుండదు.

దొంగలు ఎవరు ? సంఘం దౌర్జన్యాన్ని ఎదుర్కొనే విప్లవకారులు. న్యాయానికి సంఘంలో స్థానం లేదని గ్రహించి అసమత్వాన్ని బహిరంగంగా ఎదిరించడానికి జంకి, వేరు మార్గాలు పట్టిన సంఘీయులు.

దొంగలు కూడ మనుష్యులే. వాళ్ళు అందరిలాగ పుట్టినవాళ్ళే. వాళ్ళకీ అంతరాత్మలు వున్నవి.

కాని మా పల్లెటూరి దొంగలు కేవలం తిండి కోసం–అణాకూ, బేడకూ దొంతనాలు చేస్తారు. పేదల్ని పేదలే దోచుకోవడం.

దొంగతనాలు తప్పుకాదు అని నేను అనడం లేదు. కాని, నిరుపేదలకూ, నిరుద్యోగులకూ బ్రతకడానికి గత్యంతరాన్ని సంఘం చూపడం లేదు.

అలాంటి దొంగలు ! మా కుప్ప యెక్కడ నూర్చుకపోతారో అని రాత్రులంతా కాపలా మూలాన్ని నిద్ర చాలడం లేదు.

' పొద్దుపొడుచుకొచ్చేస్తుంది. లెగు లెగు ఇంత నిద్దరా ? ' అన్నాడు మా అయ్య. లేవక తప్పింది కాదు. చలి వణికిస్తుంది. నీవు నిరుడు కొని పెట్టిన ఖద్దరు దుప్పటి కప్పుకొని బైటకు వచ్చాను. రావడంతోనే 'జుంయ్' మని నడినెత్తి నుంచి పాదాలదాకా మంచుగడ్డ చేసేసింది శరీరాన్ని. ఒక మంచు బిందువు మామిడిఆకు మీదనుంచి రాలింది. 'అమ్మా' అనుకొన్నాను.

' రండి రండి ' అన్నాడు వెంకన్న ' ఎడ్లు ముందు ' వెళుతున్నాయి. నాగలి కూడా తోటలో వేసి వచ్చాను.

మిత్రమా ! అతణ్ణి చూచి ముందు నేను భయపడ్డాను. ఒక గోచి తప్ప అతని పైమీద మరి బట్టలేమీ లేవు. చేతిలో ఒక చిన్న ఈతజువ్వ, కిర్రుచెప్పులుకూడ వున్నాయి. ఒక మ్రోడులాగ నిల్చున్నాడు మా వాకిట్లో !

ఎంత కష్టం ! పట్నంలో సౌఖ్యం పొందే సుకుమారులకు – పల్లెటూళ్ళలో అయినా ధనం కూడబెట్టుకొని సర్వ భోగాలు అనుభవించే జమీందారులకు, ఆ చలి ఆపడానికి ఎన్ని శాలువలు కావాలంటావు ? పైగా భారత దేశపు శాలువలు చాలుతవా ? విదేశాలనుంచి దిగుమతి కావాలి బేళ్ళు, బేళ్ళు.

అలాంటి భయంకరం అయిన చలి వెంకన్నను ఏమీ చేయలేదు.

' నీకు చలిపెట్టడం లేదూ ?' అన్నాను.

' కప్పుకోవడానికి దుప్పట్లు వున్న మీవంటి వారికి తప్ప నాకేమి చలి ?' అన్నాడు అతడు, అంతటితోటి వూరుకోక ఒక మోటుసామెత కూడా ప్రయోగించాడు చలి మీద.

' నన్ను కూడా దొంగల్లో చేర్చావా ' అన్నాను దుప్పట్ని తీసివేస్తూ.

' అ దేమిటండీ ! మీరు దొంగలెలా అవుతారు ? ' అన్నాడు.

' ఇప్పుడు నీవు అన్నావు కావూ దొంగనని ? అనడమేమిటి ? నిజంగా నేను దొంగనే. నీకు లేని దుప్పటి నాకు ఎలా వచ్చింది ? నీవూ కష్టపడుతున్నావు. నేనూ కష్టపడుతున్నాను. ఇద్దరి కష్టమూ సమానమే. అయితే నాకు వున్న దుప్పటి నీకు ఏది ? ' అన్నాను.

' మీరు కొనుక్కొన్నారు: నేను కొనుక్కోలేదు ' అన్నాడతడు.

' నీవు ఎందుకు కొనుక్కోలేదు ? '

' నాకు యిచ్చే కూలి ఒక్కపూట తిండి సరిపోతుంది. రెండోపూట పస్తే. ఇక బట్టలు ఏమిపెట్టి కొనుక్కొంటాను ? '

' నాకూ అంతే కదూ ? మరి నేనెలా కొనుక్కున్నాను ? '

' ఏమో ' అన్నా డతడు. అప్పుడు నేనిలా చెప్పాను.

' నేను కొనుక్కో లేదు యీ దుప్పటి. భాగ్యవంతుడైన ఒక స్నేహితుడు కొని పెట్టాడు. ఆ స్నేహితుడికి మాత్రం డబ్బు ఎక్కడిది ? '

' ప్రపంచంలో బ్రతకడానికి మూడే మూడు విధనాలు: (1) కష్టపడి సంపాయించుకోవడం (2) భిక్ష మెత్తుకోవడం (3) దొంగిలించడం.

' ధనికులు పనినా చేయరు, ధనికులు భిక్షింప, రింక ధన మెట్లబ్బున్ ? '

' అని ఒక కవి ప్రశ్నించినట్లే ప్రశ్నించుకొంటే, మన వంటి పల్లెటూరి పేదరైతుల, పేద కూలీల నోర్లుగొట్టి కూడబెట్టిన ధనమే ధనికులకు ఆధారమని తేలుతుంది. అట్టి ధనాన్ని పెట్టే నా మిత్రుడు ఈ దుప్పటిని కొనిపెట్టాడు. అతని మిత్రుణ్ణి గనుక నేనూ దొంగనే. నీవు సరీగా అన్నావు. అందుకనే దీన్ని తీసి పారేసాను.'

నా యీ ఉపన్యాసానికి నీవు కోపగించుకో నక్కర్లేదు.

నేడు కూపస్తమండూకాలకి కూడా రాజకీయాలు తెలుసు. ఇలాంటి ఉపన్యాసాలు పల్లెటూళ్ళలో ప్రతీ పశువులకాపరి కుర్రవాడికీ వచ్చు.

కాని,

' దిగుదిగుమనే నా సవితే కాని, దిగే నా సవితి ఒకరా లేదు ' అన్నట్లు అందరూ చెప్పేవాళ్లే. చేసేవాళ్ళే కళ్ళకు కనుపించరు.

' ధరణిలో, దొంగతనములో, దొరతనములో' అని పాడాడు వెంకన్న. మా వూరికి యెనిమిది మైళ్ళ దూరంలో వున్న ఒక వూళ్ళో వేసిన హరిశ్చంద్ర నాటకానికి కామందుతో కూడా వెళ్లి అతడు నేర్చుకొన్నవి ఈ రెండుముక్కలే.

అయినా సమయానికి స్ఫురించే విద్య కొంచమయితే నేమి?

' దొంగతనాలకైన దొరలకే చెల్లింది – దొరతనాలకైనా దొరలకే చెల్లింది. మీకేమండీ ? మధ్య మావంటి వాళ్ళున్నారు కదా మాడి చావడానికి ? ' అన్నాడు పుసుక్కున.

అరే ! నేను ఒకరి మీద నిందమోపుతుంటే, ఇతడు నా మీద నింద మోపుతున్నాడు !

సభా ! ' ఇదే సాంఖికాంతరములో వున్న నిగూఢ రహస్యం ! ' అనుకొన్నాను.

' మాటల కేం గాని ప్రొద్దుపొడిచేస్తుంది, రండి ' అన్నాడు వెంకన్న.

దుప్పటి తీసిపారేసి నేనూ కర్ర తీసికొని బైలు దేరాను. కాని–చలి !

ఊరికే నాకు నేనే – వణకిపోవడం మొదలు పెట్టాను.

మాట్లాడబోతే ' పవవవ ' ' దదదదద ' అంటూ ప్రారంభమైంది.

పచ్చికతో నిండి, నేలంతా చల్లని మంచునీటి మయమయింది.

చెట్ల ఆకుల మీద నుండి మంచిబొట్లు రాల్తూ, ఒక్కొక్కటి ఒక్క చలిపిడుగులాగ మొత్తుతున్నాయి.

' చదువుకొన్నవారు, మీకు కూడా యీ తిప్పలన్ని ఎందుకండీ ? ' అన్నాడు వెంకన్న నా అవస్త చూచి.

' పేదలు చదువుకొన్నా సరే - చదువుకోకపోయినా సరే. పట్నాల్లో వున్నా సరే-పల్లెల్లో వున్నా సరే అవస్తలు తప్పవు-' అన్నాను, మరేమీ అనడానికి తోచక.

' లేదండీ, చాలమంది పట్నాల్లో ఉద్యోగాలు చేసుకుంటున్నారుగా ! మా నీలకంఠ బాబుగారికి మా ఆలాపనే లేదు ' అన్నాడు.

' నన్ను కూడా మీ నీలకంఠ బాబుగారి లాగ అయిపొమ్మంటావా ? ' అన్నాను.

ఈ మా వూసుల సందట్లో నా చలి సగం చచ్చింది.

' వెంకన్నా ! నీవే చెప్పు భాగ్యవంతులు ఉద్యోగస్థుల్లో వుంటారంటావా, లేక వ్యవసాయం, వర్తకం చేసుకొనేవారిలో వుంటారంటావా, ఎక్కువమంది ? ' అన్నాను, అరకలు కట్టే తోటలోకి వెళుతూ.

' వ్యవసాయం, వర్తకం చేసుకొనేవారిలోనే వుంటారు ' అన్నాడు ఎడ్ల భుజాల మీద కాడి పెడుతూ.

' అయితే, ఈ ఉద్యోగస్థులు పట్నాల్లో వుండి ఎవరికి మేలు చేసినట్టు ? వాళ్ళ జీతం డబ్బులు వాళ్ళకే చాలవే. వారంతా పల్లెటూళ్ళు వచ్చేస్తే దేశాన్ని ఎంత శోభావంతం చేయగలరో ఆలోచించు' అన్నాను నేను కూడా ఎద్దుల భుజాల మీద కాడిపెడుతూ.

వయ్యారంగా (పట్నంలో మసిలినవాణ్ణి కదూ ?) కాడి పెట్టబోయానేమో అందులో ఒక ఎద్దు కొమ్ము విసిరింది, కాడి క్రిందబడింది, నా మోకాలు బొప్పికట్టింది.

కొమ్ము విసిరిన ఎద్దును కొట్టాలా, కాలికి తగిలిన నాగలిని కొట్టాలా, అన్నంత కోపం వచ్చింది. సఖా ! ఇదీ నేటి నా ఉషఃకాల జీవిత సరళి ! నా మెట్టదుక్కుల అనుభవాలూ, కుప్పనూర్పుల అనుభవాలూ నీకు చాలా లేఖలు వ్రాయించే లాగున్నాయి.

ఇలాగే రాస్తూ వుంటానులే. కష్టపడి అలసిన నా హృదయానికి కొంచెం ప్రశాంతి కలుగుతూ వుంటే చాలు. నా లేఖలన్నీ నీవు సొంతంగా చదువుతూ వుంటే చాలు.

మెకాలి బొప్పి సలుపుతోంది. ఆవుపేడ కాపడం పెట్టుకోవాలి. ఇక నేను విరమిస్తాను.

★★★

ప్రియ సుహృద్దీ !

ఆ రాత్రి తిరుపతి రావు కూడా పొలం పోయాను.

ఆ పొలం ప్రక్కనే వైనతేయం ప్రవహిస్తోంది శ్రావ్యంగా.

కొబ్బరాకు చిగుళ్ళతో వేసిన వాక పైరుపాకలో వాక కిరోసినాయిల బుడ్డిలాంతరు మినుకు మినుకు మంటూ వుంది దూరంలో.

పోతూ-పోతూ పురుషోత్తం సమాధి దగ్గర నిల్చున్నాం కొంతసేపు.

ఆనాటి రోజులన్నీ - ఆ యువజనోద్యమాలూ, ఆ గ్రామ ప్రచారాలూ, గుప్పున వచ్చాయి జ్ఞాపకానికి.

వేసవి కాలంలో తలలు కాల్చుకుంటూ, కాళ్ళు మాడ్చుకుంటూ ఆ యిసుక గరువు పల్లెలన్నీ తిరిగి యువకుల్లో జాతీయ జీవనం పోసిన ఆ బాల్యదినాలు కనులకు గట్టినై.

జాతిదాస్య ముక్తికీ, దేశ సౌభాగ్యానికీ విధానాలు ఏర్పరుస్తూ ఆకాశానికి నిచ్చెన్లు వేసిన ఆ చిన్నతనపు టూహలు - ఆ వూహల్లో పొంగెత్తిన ఆ ఉడుకు - అవన్నీ ఆపాదమస్తకం తిమ్మిరి పుట్టించినై జీవనాడుల్లో.

బాల్యావస్థ ఎంత పవిత్రవంతం ! అది ఎంతైనా చేయగలదు - మానవాభ్యుదయానికి.

' చేతనముల్ వసంత వనసీమల లోపల
పల్లవించి, విస్ఫీత వినూత్నలీల
సురభింపగ నుండిన నాటి వేళలన్ ;
మేతలు మేసికొన్నవి సుమీ, యెడదల్

కడసారి ! నేటికిన్ ఆ తియ త్రేన్పులే
వెడల నైనవి పస్తులగూడ ! నెచ్చెలీ ! '

అని పాడాడు తిరుపతిరావు - అపూర్వం అయిన ఏదో వొక అనుభవాన్ని కలిగిస్తూ, ఆ అంధకారంలో అట్లే నిల్చున్నాం మౌనంగా.

అంతా నిశ్శబ్దం - ఆ నిశ్శబ్దంలో వొక వృద్ధ కంఠం - ఆ కంఠంలోంచి వొక జానపదగీతి బహుళంగా వినిపించింది మాకు.

' మా తాత ' అన్నాడు తిరుపతి రావు, 'భారతాది గ్రంధాలు చదివినవాడు, వ్యావసాయిక గీతాలు మంచివి పాడతాడు.'

ఆ వొడ్డే బడిపాక దగ్గరకు వచ్చాం - వచ్చి వెనకాల నిల్చున్నాం - పాట - ఏమో - హృదయాన్ని ఆకర్షించింది నాకు.

' కష్టానికొక ఫలము
కన్నీటికొక వాంఛ
వాంఛలో సౌఖ్యాను
భవమె లేకున్నచో
కష్టమేలోయీ ?
నా బీదకూలీ !
నా బాలకూలీ !'

గీతం సన్నబడి - ఆవులించాడు ఆ వృద్ధుడు.

' నీ చెమటబొట్టులానే కాదరైతా ?
నిఖిలసంపద లీనినానోయి ! రైతా !
ఏలనీ నా భాగ్యమంత గొంపోయి
ఎక్కడో, ఎవరికో, అప్పగించేవు ?
వ్యర్థమే కాదా ? నీ కష్టానష్టాల
కర్థమే లేదా ?
మోసగించావా ? నిను నమ్ముకొన్నట్టి
ముద్దరాలను నన్ను ?

అంతలో తిరుపతి రావు అమాంతంగా తుమ్మాడు. పాట ఆగింది, పలుకరించాడు.

' ఎవరు, తాతగారు ! ఆ ముద్దరాలు ? ' అన్నాను.

' ఏదో, బాబూ ! పాట ' అన్నాడు, ' మీ రెంత సేపయి వచ్చారిక్కడికి !'

' అబ్బే, ఇప్పుడే. '

' అయితే ప్రక్కలు వేసుకొని పడుకోండి. '

తిరుపతిరావు ప్రక్క సర్దుతున్నాడు.

' పడుకోవడానికి కేంలెండి - ఏదైనా పాట పాడండి అన్నాను.

' ఎంత కాలం - ఎంత కాలం అన్న పాట పాడు, తాతా ! అది బాగుంటాది' అన్నాడు తిరుపతిరావు.

' పాటలకేం లే, బాబూ ! పాటలు ఎన్నయినా పాడుకోవచ్చు వృద్ధుణ్ణి - ఓపిక లేదు ' అన్నాడు.

మాకు మాత్రం అంత వోపిక వెలిగిందా ? పోనీ-ఒక కథ అయినా చెప్పండి' సాగించాడు ఆ ముసలాతడు కథ :-

ఇందాక ఆ ముద్దరాలు ఎవరు అని అడిగావు కాదూ !

ఒకనాడు - ఒక పైరుచేలో గడ్డికోస్తూ ఒక కూలీ బాలిక ఇలా అనుకొంటూ వుంది :

' గడ్డీ ! గడ్డీ ! ఎవరవు నీవు ? '

' భూదేవి బిడ్డను. '

' ఇప్పుడు ఏం చేస్తున్నావు ? '

' కఠినుల చేతుల్లో - చావూ బ్రతుకూ మధ్య అల్లాడుతున్నాను. '

' గడ్డీ ! గడ్డీ ! ఇప్పుడెక్కడికి వెడతావు నీవు ? '

' కామందు పశువుల కొట్టంలోకి. '

' అక్కడ నీకు ఏం పని ? '

' పశువుల పేగుల్లో అరిగిపోయి - పాలు అవడం '

' గడ్డీ ! గడ్డీ ! అవుడు నీవు ఎందుకు పనికివస్తావు ? '

' కామందులు బాగా పెరగడానికి పనికివస్తాను '

' వారు నీకేమిస్తారు ? '

' మడిమతాపులూ - కొడవలికోతలూ-ఇస్తారు. '

' అయితే నీవూ - నేనూ - వొకటే. '

ఇలా ఆ బాలిక అనుకొంటూ వుండగా ఆ గట్టే పోతూవొక రైతు ఆ మాటల్ని విన్నాడు.

' మీరే ఆ మాటలు వింటే ఏమనుకొంటారో చెప్పండి ' అని ప్రశ్నించాడు మమ్మల్ని ఆ వృద్ధుడు.

' అవేవో పిచ్చిమాటలో - ఆగతాయకబుర్లో అనుకుంటాం ' అన్నాను.

' ఆ రైతు అలా అనుకోలేదు - మీకంటే తెలివైన వాడు ' అన్నాడు. మళ్ళీ కథ సాగింది :-

ఆ మాటల్ని విని ఆలోచించాడు అతను. ఆ పంట పొలం అంతా వొకసారి చూశాడు. అది పుష్కలంగా, కలకల్లాడుతునే కనిపించింది.

తన కేసి చూచుకొన్నాడు. ఆ గడ్డి కోసే బాలిక కేసి చూచాడు. తాము ఇద్దరూ కూడా కళావిహీనులైన అస్తి పంజరాల్లాగే వున్నారు.

మళ్ళీ మళ్ళీ పంట పొలం వంకా - తమవంకా చూచాడు.

ఒక్క క్షణం కన్నులు మూసుకొన్నాడు.

ఎవరు అతని యెదుట ప్రత్యక్షం అవుత ?

సస్యలక్ష్మి !

నేను ఇందాక పాడిన పాట-ఆ లక్ష్మిదే. ఆమెయే ఆ ప్రలాపిస్తూ వున్న ముద్దరాలు.

రైతు సాష్టాంగపడ్డాడు - కన్నులు విప్పి చూచాడు. ఏముంది ? అంతా మామూలే ! -

పొలాలు పంటలతో నిండి వున్నై - అతని కడుపు ఆకటితో మండూతూ వుంది.

' అంతే కథ-నిద్ర వస్తూంది. పడుకోండి ' అన్నాడా ముదుసలి.

' సగంలోనే ఆపేసి అంతే కథ ఏంటి ? ' అన్నాను.

' నిద్ర మనకు వుండకూడదు. అది మనకు కాదు. ఈ పొలాల్లో ప్రవహిస్తూ - ఈ ఉప్పునీటి కాలువల్లో కలిసి పోతూవున్న మన జానపద హృదయ సౌందర్యం ప్రపంచ దృష్టిని ఆకర్షించి, తనలో లయంచేసికొనేవరకూ మనం నిద్రపోకూడదు' అని చెపుతూ -

'కునుకొక్క మునుకయో
మునిగిపోవలదయో
నీవు కునికే ముందు
నీ యుల్ల మును విప్పి
శాంతి సందేశమ్ము
సౌఖ్యమ్ము ప్రజకిచ్చి
మునిగిపోవోయీ
మనికి సార్థకమోయి
కునుకకోయీ, సఖా !
కువలయమ్మీక్షింపు,
లేచిరావోయీ
లేతపూదోటోయి,
విహరింపుమోయీ
అహములున్ నిశలున్,
కునుకకోయీ సఖా,
కువలయ మీక్షింపు'

అంటూ పాట మొదలు పెట్టాడు తిరుపతి రావు. ఆ పాటలో ఆ వృద్ధుడు నిజంగానే మునిగిపోయాడు.

ఆ ముడుతలు పడ్డ నేత్రాల్లో ముత్యాలసరులు కాన్పించాయి. అతని విలువ రోజుకు రెండణాలు మాత్రం. కాని ఆ ముత్యాల విలువ ? క్షణానికి సామ్రాజ్యాలు !

ఒక్క క్షణం రెండుక్షణాలు.

కన్నులు నులుముకొన్నాడు, నాకళ్ళలోకి చూచాడు.

'నిజమే-బాబు ! నిజమే పాటుపడటం-తినడం-నిద్రపోవడం ఇవే మన పన్లు' అన్నాడు.

'అందుకనే-తాతగారు ! మనం నిద్రకట్టుకొని అయినా ఏదో పనికివచ్చే పని చేస్తూ వుండాలి - తను ఆనందం పొందలేని-ఇతరుల్ని ఆనందిపజేయలేని

జీవితో లోకానికి ఏమీ పని వుండదు. మీరు ఆ కథ చెపితే మన ముగ్గురికీ ఆనందమే' అన్నాను.

' నిజంగా ఆ కథ అంతే ' అన్నాడు. ' కాని దాని పర్యవసానం చాలా వుంది – దాన్ని ఈ పాటలో చెపుతాను విను. '

అతడు ఆ పాట పాడుతూంటే నా మనస్సు ఒక్క చోట నిలచింది కాదు. పరుగూ-పరుగూ-పొలాల్లోంచి పనిలోకీ పనుల్లోంచి పనివారి గుండెల్లోకి అక్కడనించి ప్రతిజీవనాడిలోకి-ప్రతి అణువులోకి ప్రాకింది.

ప్రతి కంటిలోకి తొంగిచూచింది. ప్రతి యింటిలో కాలిడింది.

అక్కడక్కడ ఏమి వున్నై ? భగ్నహృదయాలు. నిరాశపూరిత జీవితాలు, అపార దుర్వ్యధలు.

అదేమీ పెద్ద పాట కాదు – వ్రాయడానికి నాకు రాదు కూడాను.

ఇప్పుడిప్పుడు ధర్మదేవత బిడ్డల్ని తానే మేలుకొలుపుకొంటూ వున్నదనీ-ఏదో వ్యామోహంలో పడి – తమని తామే మరిచిపోయి వున్న 'జనం' త్వరలోనే లేస్తారనీ – అతడు పాడాడు – ఆ పాటలో వినపడ్డ విశ్వాసం అతడి సందేశాన్ని బలపరచింది.

తిరుపతిరావు ఆ పాటలోనే నిద్రపోయాడు – వృద్ధుడు చూపులోనే చూపులు ఆపేశాడు, ఇంక నేను ఒక్కణ్ణే మెలకువతో వున్నాననుకొన్నాను. ఆ అర్ధరాత్రి సమయాన్ని కూర్చున్నాను – నిద్రరాలేదు – ఆ గుబురుపైరు మొక్కల్లోంచి చల్లనిగాలి చక్కిలిగింతలు పెడుతోంది. పురుషోత్తం సమాధి దగ్గిర ఏవేవో వెలుగులు కనిపించి పిలిచాయి.

నెమ్మదిగా సమాధి కేసి బైలు దేరాను – నేను వెళ్ళే కొలదీ ప్రశాంతి, భయంకరం అవుతూ వుంది. అది దుర్భరమైంది – నాకు వాతావరణం చాలా తేలిగ్గా అయింది. అదే ఏదో మాట్లాడుతుంది. ఏదో వినరాని నిశ్శబ్దం చెవుల్లో గింగురుమంటూంది – వెళ్ళేకొలదీ చీకటి దట్టమైపోతోంది – అది చేతికి తగులుతోంది.

ఇక పోలేకపోయాను – నిట్టూర్పు విడిచాను. వెనక్కి తిరిగి చూచాను. ఏమీ కనిపించలేదు.

'సఖా!' అని వినిపించింది ఒక సంబోధన – 'సఖా! నేనెంత తపిస్తున్నానో చూడు.

ఎక్కడ చూడాలి ? అంతా చూచాను – కనపడనిది కనప డుతూంది అంతే.

ఉక్కిరిబిక్కిరి అయాను, కళ్ళు విప్పాను.

ఆ వృద్ధుడు పాడుతూనే వున్నాడు. ఆ లాంతరు వెలుగుతూనే వుంది. అబ్బ ! నిద్ర !!

' నాకు బోధించారు నిద్ర మంచిది కాదని ' అన్నాడు. నవ్వాడు.

నేను అలాగే కళ్ళు మూశాను. అతడు పాడుతూనే వున్నాడు.

' ఓ పంట తల్లీ,
ఓ పైరువల్లీ,
పలవింప కోయమ్మ
' పంట పండోయమ్మ '
' పంటతో మీ యిళ్లు
బంగారమౌనా !
పంట పొలములు చూడ
వంట యిండ్లను చూడ
ఒకటి కలకలలాడు
ఒకటి తెలతెలవోవు
పంటతో మీ యిళ్ళు
బంగారమౌనటో !
మేలుగాదోయీ !
మేలుకోవోయీ !'
' గాఢాంధభిత్తికా
గార మందున్నావు
పిలుచుచున్నావు నీ
పిలు పెవ్వ రాలింత్రు ?
అలించి నిన్నెవ్వ
రేలీల వీక్షింత్రు ?
వెడలిరావమ్మా-మా చేల
నడచిరావమ్మా

విహరింపుమమ్మా-మా పైరు
వీడులో వేడ్కతో
చీకటులు నిలువలే
వేకువలు గలుగునే
మేలుకొంటాము నీ
మేలుకొల్పులలోన
మేలుగాదోయమ్మ
మేలుకొల్పోయమ్మ
ఓపంట తల్లీ !
ఓ పైరు తల్లీ !
....
....'

సఖా !

లేఖ అలస్యం అయింది, క్షమించాలి.

ఏరోజు కారోజు తిండి వెతుక్కోవడంతోటే సరిపోతుంది. తిండి వెతుక్కోవడం అనేది పెద్దపని. కూలీలకు అదే జీవితం.

తిండి వెతుక్కోవడమే ఆశయమా జీవితానికి ? ఉదర పోషణమేనా ఉద్యోగం బ్రతుక్కి ?

రాత్రింబవళ్ళు పనిచేయడం - రెక్కలు ముక్కలు కొట్టుకోవడం, ఉడికీ ఉడకని (ఆకలిచేత) చాలీచాలని (యజమానుల స్వార్థం మూలాన్ని) గంజినీళ్ళతో కడుపు నింపుకోవడం - మళ్ళీ విశ్రాంతి అనేది లేకుండా పనికిపోవడం - ఇంతేనా ప్రపంచంలో ఈ పేద జీవులికి ?

ఈలాంటి ప్రశ్నలతో తెల్లవారింది. రాత్రి అంతా కునుకు అన్నదే లేదు నాకు.

ఒక ప్రక్క ఆకలి - ఒక ప్రక్క అర్థం కాని జీవిత సమస్యలు - వేపుకు తిన్నాయి నన్ను రాత్రంతా.

ఈ కూలీ అనే సంఘం ఎందుకు వునికిలోకి వచ్చింది అనే ప్రశ్న బాధించింది. ఆ బాధతోటే లేచాను ప్రక్కమీద నుంచి.

'బాబూ ఏదో చూడు మరి' అన్నది మాయమ్మ'. మా చెల్లె నా ముఖంవంక చూస్తుంది పేద చూపులు. నా గుండె దడదడ లాడింది.

ఏం చూడాలి ? లేస్తూనే అలా ఎక్కడికో పోయాను - ఎందుకో తెలియకుండానే.

'నీవు కూడా రారాదా ?' అన్నాడు సుబ్బయ్య. 'కామందులు పనిమీద ఏమన్నా ఇస్తారేమో అడగడానికి వెళుతున్నాం.'

'ఏం ఇస్తారు ? వాళ్ళకి ఏం పట్టింది ఇవ్వడానికి ? కూలీలు చస్తే వాళ్ళ కేం-బ్రతికితే వాళ్ల కేం ? వాళ్ళకు పనే కావలసింది. ఆ పని వున్నప్పుడు కాని మనవంక చూడరు. ఒకవేళ ఇచ్చినా సగానికి సగం నష్టమేగా ?'

'మరేం చేస్తాం ? పూర్తిగా చావడంకంటే నగం బ్రతకడం మేలుకాదా ?'

'ఐతే మీరు వెళ్ళి చూడండి. నేను తర్వాత వస్తాను'

సుబ్బయ్య వెళ్ళిపోయాడు, నాకు మతిపోయింది.

తిరిగి ఇంటికి వెళదాం అనుకొన్నాను. అడుగుపడ్డది కాదు. కామందు దగ్గరకే ఎందుకు వెళ్ళగూడదు ? ఏదో మాదిరిగా ఈవేళ కడుపు చల్లార్చుకొంటే రేపటి మాట చూచుకొనవచ్చు కద ?

సుబ్బయ్య కూడా వెళితేనే బాగుండేది. వొక్కణ్ణీ, అయితే మాత్రం ?

ఏదో విధంగా - అటునుంచి నరుక్కు రమ్మని - కామందు ఇంటికి వెళ్ళాను.

చావడిలో కూర్చున్నాడు చీట్ల పేక దగ్గిర.

'ఓహో ! నీవా ?' అన్నాడు, 'ఎందుకు వచ్చావు ?'

'నేనా అండి-పనిమీద ఏమైనా అడుక్కు వెళదామని వచ్చానండి.' అన్నాను.

'ఉహూ !' అన్నాడు తల వూపుతూ. మళ్ళీ నావంక చూడలేదు.

ఐదు నిమిషాలు - పది నిమిషాలు - అరగంట.

కాళ్ళు లాగుతున్నై, కడుపు మందుతూంది.

గంట-గంటన్నర. రెండు గంటలు.

వీధి అరుగును జేరబడ్డాను - కండచీమలు వెన్ను పట్టుకొని కరచినై.

దగ్గరవున్న మామిడి చెట్టుకు జేరబడ్డాను - క్రొత్తగా పూచిన పువ్వులగుత్తుల్లో నుంచి తేనె చుక్కలు రాలినై మీద.

ఆ అరుగు మానవ కల్పితం - ఈ వృక్షం ప్రకృతి సిద్ధం.

అయినా నాకీగతి ఏమిటి ? ఎంతకాలం ఈ యజమాని వాకిట్లో ఏడ్వాలి పడి ?

నేనూ మానవుణ్ణే - యజమానీ మానవుడే.

ఒక మానవుడి కాళ్ళ దగ్గిర ఇంకొక మానవుడు పడి యేడ్వడం సిగ్గు కాదూ ? కృత్రిమం కాదూ ? దుర్గతి కాదూ ?

ఏమిటి ఈ ఖర్మం నాకు ? ఎంతకాలం ఇలా నిలబడడం? కూర్చుంటే తప్పేమో - కూర్చోమనే దిక్కు లేదే ఇంత శ్రీ సౌధం ముందూ !

విసుగెత్తుతూంది - వెళ్ళిపోతాను - వీడిలెక్క ఎవడికి ?

నాకూ ఆత్మగౌరవం వుంది - నాకూ స్వాతంత్ర్యేచ్ఛ వుంది.

నాకూ వేడెక్కే రక్తం వుంది - అలసిపోయే శరీరం వుంది.

నాకూ టైం వుంది, నాటైంకూ కొంత విలువ వుంది.

ఎంతకాలం ?

ఎక్కడ ?

నా మాదిరి మనిషి కాళ్ళ దగ్గిర !

నా కాళ్లు వంటి కాళ్లు వున్న ఒక మనిషి కాళ్ల దగ్గిర !

సిగ్గ ! సిగ్గ !

ఒక మనిషి ఇంకొక మనిషికి చాకిరీ చేయడం ఎంత నీచం !

మనుష్యులు అంటే ఎంత వుపేక్ష ఈ వ్యక్తికి !

ఒక మనిషి తనతోడి మనిషిని వుపేక్ష చేస్తున్నాడంటే, అతడు తనలోను వున్న మనుష్యత్వాన్ని చంపుకొన్నవాడన్న మాట.

ఇటువంటి మనుష్యత్వం చచ్చినవాళ్ళతోటి నాకేం పని ?

'కానుకనై ధరాధిపుల
కాళ్ళకడన్ బొరలాడి
వాడిపోలేను.....'

నిజం - నిజం.

లేచాను వెళిపోదాం అని.

కాని, కాళ్ళు సాగవు, ఎక్కడికి వెళ్ళడం ? గుండె మండింది - కన్ను మూతపడింది.

'...జననీ నయనారుణ
దుఃఖబాష్ప బాధానల
ధార యొందు నెలవైనది
నా హృదిమీద మండుచున్. '

ఎక్కడికి వెళ్ళడం ? ఇంక ఎవరు ఎరుగుదురు నన్ను ?

డబ్బు కావాలి బ్రతకడానికి, ఎవరిస్తారు ? ఎక్కడి నుంచి వస్తుంది ?

ఒక వేళ ఎక్కడినుంచి అయినా వచ్చినా, మమ్మల్ని ఎవరు తిననిస్తారు ?

ధనవంతుల హుకుం చెలాయిస్తుంది ప్రపంచంలో కూలీలు కూలి పోతున్నారు.

అసలు కూలీ సంఘం ఎందుకు పుట్టాలి ? ఇలా దేవురించడానికేనా ?

దుఃఖం కంఠం వరకూ వచ్చింది నాకు. కన్నీరు కొలకుల దాకా నిండింది.

పకపకా నవ్వాడు యజమాని ఆ సౌధంలో. వలవలా యేడ్చాను నేను ఆ నేల మీద కూలబడి.

నా స్వాతంత్ర్యాన్ని కాల్చేయాలనీ - నా అభిమానాన్ని పాతేయాలనీ - నా జీవితాన్నే క్రిందేయాలనీ - ప్రయత్నించే యజమాని వాకిట్లో నేనెందుకు నిలవాలి ?

యజమానికి నేనంటే కిట్టదు - నిరంకుశులికి ఎవళ్ళకీ కిట్టదు అన్యాయాన్ని ఎదిరించే వాళ్లంటే.

లేచాను ఇంకొకసారి - పోదాం అని.

ఎక్కడికి ?

ఇంటికి.

ఒక పక్క కూలిపోతూ వున్న ఇంటికి ?

శుష్కించిన శరీరాలతో - ఆకటిచిచ్చులో కాలిపోతూ - నన్నే ఆలోచించుకొంటూ - ఆకాశవీధులలో ఆలాపించే నా తల్లి దండ్రుల దగ్గరికి - నిరాశతో !

అన్న వస్తాడు - ఏదో తెస్తాడు - అని గంపెడాశతో - నేను వచ్చే మార్గం కాచుకొని ఎదురు చూస్తూ వుండే నా చెల్లెలి దగ్గరికి - వట్టి చేతులతో !

దుర్భరం !

ఇంటికి పోలేను.

ఇక గత్యంతరం ?

ఆత్మహత్య.

మిత్రమా ! ఆత్మహత్య అనుకొనేసరికి ఎలా వుంది అనుకున్నావు నా మనస్థితి ?

నేను ఆత్మహత్య చేసికొంటే ?

వలవల యేడ్చేస్తారు - పలపల బాదుకొంటారు - మలమల మాడి చచ్చిపోతారు నా తల్లిదండ్రులు. ఆ కడుసుకోత ! ఆ కన్నీటి నిప్పు ! రంపంకోత కోయదూ, నిలువునా చీరెయ్యదూ నా ఆత్మని ? ఆ అవస్థ !

ఆ కడుపుకోత ! ఆ కన్నీటి నిప్పు ! రంపంకోత కోయమా, నిలువునా చీరెయ్యదూ నా ఆత్మని ?

ఆ కడుపుకోత ! ఆకన్నీటినిప్పు ! రంపంకోత కోయదూ, నిలువునా చీరెయ్యదూ నా ఆత్మని ?

అయినా-

ఆ పాపం నాకు కాదు, నా ఆత్మహత్యకి కారణం అయిన వాళ్ళకి. రాసులు రాసులు ధనం పాతళ్ళు వేసికొని ఆకలి అని అడిగితే లేదనేవాళ్ళకి. మొదట సంఘంలో ఈ అసమత్వం పునాదులు వేసినవాళ్ళకి, యజమానిత్వం లోకంలో ప్రవేశ పెట్టిన వాళ్ళకి, నాకు కాదు.

కాని - ఆత్మహత్య !

చేసికొని ఏమి చేయను ? అబలుడంటారు - అనామకుడంటారు - జాలిపడతారు - మరిచిపోతారు.

నిరంకుశత్వాన్ని ఎదిరించలేక - అన్యాయాన్ని అరికట్టలేక ఆత్మహత్య చేసికోనా ?

లేక-

అడుగు అడుక్కు అణగద్రొక్కుతూ - అనుక్షణమూ అవమానిస్తూ - ఆకటిచిచ్చులో నన్ను త్రోచి, తాను సౌఖ్యయాత్ర సాగిస్తూ వున్న నిరంకుశత్వం ముందు అభిమానాన్ని చంపుకొని బ్రతికి వుండనా ?

అక్కడ నిలవలేక పోయాను - అక్కడి నుండి కదల్లేక పోయాను.

అప్పటికి మధ్యాహ్నం అయింది.

'ఏం ? ఏంకావాలోయ్ ? అన్నాడు కామందు బైటికి వచ్చి, సంగాతగాళ్ళని సాగనంపుతూ.

నేనేమీ చెప్పలేదు. అతని మొగం వంక కన్నెత్తి చూడ్డానికి నాకు అసహ్యం వేసింది.

కాని,

ఏమైనా అడిగితే ఇస్తాడేమో ! అడిగిచూస్తే ? అని ఆశ

ఈ ఆశకు కారణం నా తల్లిదండ్రుల ఆకలి.

నోరిచ్చి అడిగాను - లేదన్నాడు.

కాళ్ళు వొణికాయి - నాళ్ళు సడిలాయి - చెమ్మట్లు పోశాయి-

ఈ అవస్థంతా ఎందుకు వచ్చింది ? ఒకళ్ళ మీద ఆధారపడడం వల్ల కాదూ ? నాలుగు డబ్బులు సంపాదించుకో గలిగే స్వతంత్ర కృషి లేకపోవడంవల్ల కాదూ ?

కూలీగానే పుట్టి - కూలీగానే పెరిగాను - జీవితం అంతా కూలీయాత్రే సాగించదలిచాను- ఏరోజుకు ఆరోజు కూలిపని చేసుకొని బ్రతకడమే పుట్టినందుకు ఫలం అనుకున్నాను.

ఇతరులు అనుభవించే సౌఖ్యాలు - చెలాయించే అధికారాలు- వర్తించే ఇష్ట ప్రవర్తనాలు - చూచి, వాళ్ళ - పూర్వపుణ్య ఫలవిశేషం అనుకున్నాను.

అయితే -

పూర్వ పుణ్యఫలం పేకాటలు ఆడుమంటుందా ? నిరుపేదల్ని హింసింప మంటుందా ? దుర్మదతలు నడిపిస్తుందా ? కాఠిన్యంలో క్రూరమృగాల కంటే అధములుంగ చేస్తుందా !

వట్టిది.

బహుశా (అటువంటిది ఏమైనా వుంటే) అది పూర్వ పాపఫల విశేషం అయివుంటుంది.

ఇతరుల్ని హింసించేది (మానసికం - శారీరకం - ఎటువంటి హింస అయినా సరే) పాపమే అయివున్నప్పుడు దాన్ని ఎదిరించాలి కాదూ !

ఎదిరించాలి.

నాకు మతిపోయింది - బానిసత్వాన్ని త్యజించాలి. బానిసత్వానికి భయంపడి మృగాలే - పక్షులే - ప్రతి జీవి కూడా పారిపోతాయి కదా దూరదూరంగా ! అలాంటప్పుడు యీ మానవులకి అది నిత్యజీవితం అవుతుంది . బానిసత్వం లేకపోతే బ్రతుకు తెరువే కనబడడం లేదు. నిరాశ !!

నిరాశ ఎందుకు ? ఆత్మహత్య ఎందుకు ? స్వతంత్రంగా జీవించలేనా ? నా స్వాతంత్ర్యానికి అడ్డు వచ్చే ఏ ప్రకృతి నైనా సరే ఎదిరించలేనా ? ఎదిరించి నిలవలేనా ?

ఇక నేను ఇక్కడ నిలవను, వట్టి చేతులతో నా తల్లి తండ్రుల దగ్గిరికి వెళ్ళను.

'తల్లికడుపు చిచ్చు
చల్లార్ప లేకుండి,
కన్నీటి కంటితో
కలత' పెట్టలేను.
ఇక గత్యంతరం ?

స్వతంత్రజీవనం ! స్వయంకృషి !

ఎట్లు !

తరువాత వ్రాస్తాను.

★★★

మిత్రమా !

' పల్లెటూళ్ళు గురించి నీవు వ్రాసేదంతా నిజమేనా ' అని అడుగుతున్నావు. ' నిజంగా అంత దుస్థితిని పల్లెలు అనుభవిస్తున్నాయా ' అని సంశయిస్తున్నావు. అవును నీకేం ! తీరుబడిగా ఏ చదరంగమో ఆడుకొంటూ కూర్చునే నీకు, రాత్రింబగళ్ళు కష్టపడి పని చేసుకొని జీవించేవాళ్ళ కష్టాలు యెలా బోధ పడతవి !

' ఎప్పుడూ పల్లెటూళ్ళ గొడవే వ్రాస్తావు, ఎన్నికలు వస్తున్నవి. చూస్తున్నావా ! నీవు ఏ పక్షానికి చేరతావు ! ' అని వ్రాస్తున్నావు ! హృదయం మండుతుంది, కడుపు కాలుతున్నది. ఏ పక్షానికి చెందాలి ! ఎందుకు చెందాలి ! ఎన్నికలు వస్తుంటె ఏమి చేయాలి ! ఎందుకు యెన్నికలు ! ఏమి తినడానికి ! అవి మాకెందుకు పనికి వస్తవి ?

ఇప్పుడు శాసనసభలు మా పల్లెటూళ్ళకు ఎంత మేలు చేస్తున్నవో, ఇక ముందు కూడా అంతే చేస్తవి.

మిత్రమా ! ప్రభుత్వం ధనవంతులది. శాశన సభలు ధనవంతులవి. ఉద్యోగాలు ధనవంతులవి అధికారాలు ధనవంతులవి. అంతే. పేదలకు ఒకటే మార్గం వుంది. బ్రతకడానికి, అది ధనవంతుల దగ్గర సేవకావృత్తి !

సేవకావృత్తి తప్ప మరొకమార్గం కనుపించడం లేదు పేదలకు. ఎంతకాలం ఒక పరిపూర్ణ పరిణామం రాకుండా ఈ ప్రపంచ పరిస్థితులు ఇదే విధంగా వుంటాయో, అంతకాలం ధనికులకు అధికారమూ, పేదలకు సేవకావృత్తి తప్పవు, ముమ్మాటికీ తప్పవు.

ఇక-

పరిపూర్ణ పరిణామం ఎలా వస్తుంది !

ప్రభుత్వం తీసుకొస్తుందా ఆ పరిణామాన్ని !

శాసనసభలు తెస్తవా !

మీ పట్నాలు తేగలవా ?

నీకు లేఖ వ్రాయాలని ఇంతవరకూ వ్రాశాను. దేశం బాగుపడాలంటే నేటి సంఘస్థితి మారాలి. ఏ విధంగా మారాలి అని ప్రశ్నించుకొని ఆలోచిస్తూ, చేతిలోని కలాన్ని నోటిలో పెట్టుకొన్నాను పరధ్యానంగా. నోరంతా సిరా అయింది.

కలాన్నీ కాగితాలనూ నేను కూర్చున్న మంచం మీద పెట్టి నోరు కడుగుకోడానికి నూతి దగ్గిరకు వెళ్ళాను. అక్కడకు ఒక అమ్మాయి పరుగెత్తుకుంటూ వచ్చి 'మా తాత వుత్తరం చదవడానికి రమ్మన్నాడు మిమ్మల్ని' అన్నది.

' ఇక్కడకు తేలేకపోయినావా ? ' అన్నాను. ' అక్కడ చాలామంది వింటారంట ' అంది. నీ లేఖ అంతటితో ముగిసింది.

పేదలకు సేవకావృత్తే జీవనమార్గం అని చెప్పాను. ఆ సేవకావృత్తి కూడా దొరక్క – చాలామంది కార్మికులు విదేశాలకు పోతారు. అక్కడినుంచి ఇళ్ళకూ – భార్యకూ – బిడ్డలకూ ఏమైనా పంపిస్తూ వుంటారు. జ్ఞాపకం వచ్చినప్పుడల్లా వుత్తరాలు వ్రాస్తూ వుంటారు.

ఇప్పుడు నన్ను చదవగోరిన వుత్తరం – ఆ తెగలో వచ్చింది. ఒకటే వుత్తరం. ఒక్కరికే. కాని – అక్కడ పదిహేనుమంది గుంపు గూడారు ! ఎందుకు ? ఏమి సంగతులున్నవో, విదేశాలలో తమ భర్తలు ఏమి చేస్తున్నారో, ఎట్టా వున్నారో, ఏమో, అని – సంగతులు విందామని – ఆశ ! ఆకాంక్ష ! ఉత్తరంవచ్చిన ఆమెకు పొగడ్తలు ! కడకు ఆ ఉత్తరంలో ఏముంటుందో !

సఖా ? చూచితివా ? విదేశాలలో కూలిపని చేసే ఒక ప్రాణం మీద ఆధారపడి – స్వదేశంలో – భార్య, బిడ్డలు, ముసలి తల్లిదండ్రులు, చుట్టాలు, సిబ్బందీ.....

అంతట్లోకే 'బాబు, బాబూ ! ఈ పద్దు వ్రాసిపెట్ట'మని ఒక ఆమె వచ్చింది.

' ఏమి పద్దు ? ' అన్నాను.

' కోకను మూడు పావులాలకు తాకట్టు పెట్టాను ఈవేళ, ఆ పద్దు ' అన్నది

కోక ! తాకట్టు మూడు పావులాలకు !

మిత్రమా ! దుస్థితి అంటే ఇప్పు డవుతుందా అర్థం ?

కోక తాకట్టు ! మూడు పావులాలకు !

' ఏమండోయ్ ! ఈ పద్దు కూడా వ్రాసి వెళ్ళండి, ఎక్కడికి వెడుతున్నారో' అన్నాడు ఒకతను.

' ఏమిటి, పద్దులన్నీ ఈ వేళే వస్తున్నవి ! ఈవేళ ఏదైనా మంచిరోజా ? ' అన్నాను. – ఈ రోజుల్లో చదువుకొన్న వాళ్ళకు తిథులూ, వారాలూ, వగైరాలూ జ్ఞాపకం వుండవు కదా !

' మరేనండీ. ఈవేళ శనివారం' అన్నాడు.

' అయితే ? '

' సంత '

' అయితే ? '

' అతడు నావంక చూచాడు, నా కపు డర్థమైంది.

అతని కొడుకు – ఎనిమిదిఏండ్లు వుంటాయి మూడవక్లాసు చదువుతున్నాడు – ఒక ఇనాందారుని దగ్గిర పాలేరు తనానికి కుదిర్చాడు, సంతఖర్చుకు డబ్బులు తీసికొని !

' చదువు మానిపించావా ? ' అన్నాను కొంచెం కోపంతో.

' ఏమి చేయనండి ? ' మింగడానికి మెతుకు లేదు మీసాలకి సంపెంగనూనె ఎందుకు మాకు ?

' డబ్బు – డబ్బు – డబ్బు – ప్రతి వస్తువుకీ డబ్బు కావాలి. కాని ఎలా వస్తుంది ? ఎన్ని రోజులు పస్తులుపడి బ్రతకగలం ? ఇప్పటికే శవాకారాలు వచ్చినై 'అందుకని పెద్ద ఇనాందారు దగ్గర కుదిర్చాను కుర్రాణ్ణి. ఏదో తిప్పలు పడాలి కదాండి. – రాసేద్దురు రెండు ముక్కలు' అన్నాడు అతడు దీనంగా.

సభా ! పేద తల్లిదండ్రులు తమ బిడ్డల్ని భుక్తి కొరకు అమ్ముకుంటున్నారు, ధనవంతులు కొంటున్నారు. కొని, ఉపయోగించుకొంటున్నారు, పనిముట్లులాగా.

ధనవంతుల్లో కల్లా ప్రభుత్వమే కదా అధిక ధనవంతమైంది ? ఈ పేదబిడ్డల్ని తానే కొని విద్యావంతుల్నిగా ఎందుకు చేయగూడదు ? దేశంలోని అధిక సంఖ్యాకులు అభాగ్యులై, అజ్ఞానులై నశించి పోతుండగా ఈ ఉద్యోగులందరూ ఏమి పని చేయడానికి ! ఇంత ధనం ఎక్కడ పారబోయడానికి ?

ఆ చిన్న చేతుల్లోని పుస్తకాలను లాగి చింపివేసి – ఆ కురుచచెడ్డీని తీసి గోచీని పెట్టించి – కలాన్ని ఉడదీసుకొని కర్రను చేతికిచ్చి – కాంతులు చిందుతూండే ఆ చిన్నారి మొగాన్ని దాస్యదుఃఖ దూషితాన్ని పూసి –

ఆ బాల్య క్రీడాశక్తిని కామందు కాళ్ళకుగట్టి–

ఆ బాలుని జీవితాన్ని ఎలా వ్యర్థం చేస్తున్నారో తల్లిదండ్రులు చూడు ! ఆ దోషం తల్లిదండ్రులదా ? పేదరికానిదా ? సంఘానిదా ?

రెండు పద్దులూ వ్రాశాను. నా కొరకు ఎదురు చూస్తూన్న గుంపు దగ్గిరకి వెళ్లాను. కూర్చోమని ముక్కాలు పీట వేశారు. కూర్చున్నాను. ఉత్తరం అందుకుని విప్పాను.

'చిరంజీవి ..... పరిస్థితులు మునుపటిలాగ లేవు .... పనులు లేవు.. ఏదో విధంగా గడుపుకోవలెను...'

మొదట ఉత్సాహంతో తెల్లగా వున్న వారి మొగాలు నల్లగా అయినవి. అందరూ ముఖాలు ముడుచుకొని ఎవరి యిండ్లకు వారు పోయినారు.

ఆ వుత్తరం లోనే ఒక ఖాళీ కవరు వున్నది జవాబు కోసం. చాలా గ్రామాల్లో పోస్టాఫీసులు వుండవు. ఉండినా కవర్లు, కార్డులు దొరకవు. దొరికినా కొనుక్కోవడానికి చాలా మందికి డబ్బు వుండదు. అందుకని ఆ వుత్తరంలో ఖాళీ కవరూ, ఒక తెల్ల కాగితమూ పెట్టినాడు ఆమె భర్త.

వెంటనే జవాబు వ్రాసి పెట్టమన్నది. వ్రాశాను.

'మ.రా.శ్రీ... పుంతలో ఇల్లు కూలిపోవడానికి సిద్ధంగా వుంది.. .వర్షం అంతా ఇంట్లోనే వుంటుంది. బాగుచెయ్యడానికి డబ్బు లేదు. పైగా భూమికి పన్ను యెక్కువ కట్టారు....'

మిత్రమా ! ఇక్కడ ఒక్కమాట – సర్కారు ఇళ్లు లేనివాళ్ళకి ఇళ్ళస్థలాలు యిచ్చారు పుంతల్లో. ఆ స్థలానికి పన్ను గట్టారు ! చూచావా వింత ఔదార్యం ? పనికిమాలిన పుంతలు పేదలకిస్త పన్నులు గుంజడానికేనా ? అట్లు పన్నులు చెల్లించని వాళ్ళని ఇళ్ళు విడిచి లేచిపొమ్మన్నారు ! చూశావా వింత పరిపాలన ? ఎక్కడికి లేచిపోవడం ? స్మశానంలోకి !

'....చిన్నపిల్లవాడ్ని మామిళ్ళ వారి కాడా – పెద్దపిల్లను పెద్దకామందుల దగ్గిరా పాలేరుతనాలకు కుదిర్చాను...పెద్ద కామందువారి తోటలో వున్న పాకలోకి కాపరం రమ్మంటున్నారు...వెళ్ళడమా ? వద్దా ?...

ఉత్తరం వ్రాయడానికి నా కలం నడిచింది కాదూ. 'అబ్బా ! ఇంత దౌర్భాగ్యస్థితా !' అనిపిస్తుంది నీకు. కాని పల్లెటూళ్ళ – వాటిలోనూ పేదల – దౌర్భాగ్యస్థితి వర్ణించడానికి నాకు శక్తి చాలడం లేదు.

ఉండడానికి ఇళ్ళు లేని వాళ్ళు యెన్నో లక్షలమంది పుంటారు భారతదేశంలో – భిక్షకులూ, కొండజాతులూ కాకనే. జమిందారుల, ఇనాందారుల, కామందుల, భూముల్లో– చిన్న చిన్న పాకలు వేసికొని అందులో నివసిస్తూ వుంటారు, వారికి చాకిరీ చేస్తూ. జీవిత కాలమంతా అదే మాదిరి, అదే బ్రతుకు.

మా యింటికి కూడా చావడికి తలుపుల్లేవు. నేను తిరిగి వెళ్ళేటప్పటికి చావడిలో దూరి – మంచం మీద కాగితాల్నీ కలాన్నీ క్రిందకు పడేసి అల్లరి చేసింది

మా ఆవు. నీకు లేఖ మళ్ళీ ప్రారంభించి వ్రాయాలి. తరువాత వ్రాస్తాను.

ఒక్కమాట 'క్రిష్టమసుకు ఆ అడవుల్లోనే వుంటావా, పట్నం వస్తావా ? ' అని అడిగావు. గ్రామాలు అడవులు గావు - 'శాంతిసదనారామాలు. నేడు ఎంత దుస్థితిలో వున్నా ప్రపంచానికి మార్గదర్శక మయ్యేది ఒక్క గ్రామమే. గ్రామంలో వుండే సౌఖ్యం మరెక్కడా వుండదు. గ్రామం ప్రేమకు పుట్టిల్లు.

ఇక విరమిస్తాను, సెలవు.

★★★

మిత్రమా !

పల్లెటూళ్ళకు నీవు కనబరచిన సానుభూతికి సంతోషము. కాని నీ లేఖ నాలో ఒక వింతభావమును కలిగించినది. ఆ భావం నీ సానుభూతి నుండి కాదు, నీ నిర్లక్ష్యము నుండి. అది నా సంతోష ఫలితం కాదు, నా నిరాశ ఫలితం. నీవు పల్లెటూళ్ళ పట్ల గనబరచిన నిర్లక్ష్యానికి నీపై నాకు గలిగిన కోపఫలితం.

నీకు నా కృతజ్ఞత ఎంతమాత్రమో, నా కోపమూ అంతమాత్రమే. నీకేమి ? నిత్యపట్నవాసివి. నితాంత భాగ్య రాశివి. జనపదాలకు నీవు రానూ రావు, జానపదులు పడే పాట్లు నీవు చూడనూ చూడవు. ' ఆ పాట్లు ఇలా వుంటాయి' అన్న ఆలోచనే వుండదు నీకు. చీకట్లో వున్న వాళ్ళు వెలుగు కోసం తహ తహ లాడతారు. కాని వెలుగులో వున్న వాళ్లకు చీకటి సంగతి ఏమి పడుతుంది ?

నిష్కారంగా వ్రాస్తున్నానని ఏమీ అనుకోకు. నిజంగా నీ లేఖ చూడగానే నాకు చాలా విచారం కలిగింది. ' దీపావళికి లక్షలు ఖర్చు చేశారు మా పట్నంలో. మా యింట్లో కూడా క్రొత్త బట్టలకు, విందులకు, యెక్కువగా బాణ సంచాకు ఖర్చు అయింది' అని వ్రాశావు. సంతోషం. కాని ఆవేళ మా పల్లెలో ఎంతమంది పస్తు వున్నారో, పండుగ పూట పస్తు వుండరాదని తవ్వెడు - సోలెడు - బియ్యంకోసం కొందరు యెంత అవస్థ పడ్డారో కొంచెం వ్రాస్తాను - చిత్తగిస్తావా ?

పండుగ రోజున సాయంకాలం - వూరు బడి పంతులూ, నేనూ షికారుకు బైలుదేరాం వీధులంట - పండగ విలాసాలు చూద్దాం అని. మావూళ్ళో అన్ని కులాల వారూ వున్నారు. అన్ని తరగతుల కష్టాలూ వున్నై. కాని- అని ..... అక్కరలేదు, కొన్ని అయినా సౌఖ్యాలు లేవు.

' తాతగారూ ! పండగ సందడి ఏమీ కనబడడం లేదే ! ' అన్నాడు పంతులు. చితికిపోయిన ఆ పెంకుటింటి సగం విరిగిన ఆ అరుగు మీద కూర్చున్న ఆ వృద్ధ రైతు, ' ఏం పండగ బాబూ ! మునుపటి రోజులా, మునుపటి లోకమా ? ' అన్నాడు. ' ఏమి అల్లా అంటారు ? ' అన్నాడు పంతులు మళ్ళీ.

' పూర్వం ఈ అరుగుల నిండా ప్రమిదెలు వెలిగించే వాళ్ళం –' ఆ వృద్ధుని కంఠం మారింది, గుటకలు మింగుతూ అన్నాడు 'మా వూళ్ళో– ఈ రోజు వచ్చేటప్పటికి – యెంత మంది మా పందిట్లో వుండేవారు ! ఎంతమందికి సంతర్పణ జరిగేది ! ఎంత మందు కాల్చేవాళ్ళం ! ఎంత ఆనందం చేసే వాళ్ళం ! ధరలు పడిపోయాయి. మా కొంప కూలిపోయింది ! ఇంకెక్కడి పండుగలు – ఇంకెక్కడి ఆనందం' సగం లోనే ఆపేశాడు. ఇక చెప్పలేకపోయాడు.

పూర్వపు రోజుల్ని జ్ఞాపకం తెచ్చి ఆ రైతుకు దుఃఖం కలిగించినందుకు పంతులు పశ్చాత్తా పడ్డాడు– 'తాత గారూ ! ముందు ముందు మంచిరోజులు వస్తాయి లెండి' అని మాత్రం అన్నాడు.

' నాయనా ! ఇక ముందు మంచిరోజులు వస్తాయా ! నీకు నమ్మకం వుందా ? ఏమో, నాకు మాత్రం నమ్మకం లేదు. అటు చూడు. ఆ యిళ్ళు ఎంత శిథిలంగా వున్నాయో ! అన్నీ ఒక ప్రక్క కూలిపోయినవే. ఐదుతరాల నాడు కట్టిన యిళ్ళవి. కూలిపోక ఆగుతాయా ? బాగు చేయించుకోడానికి డబ్బు ఏదీ ? ఆచుగం కూలిన చివుకు కొంపల్లోనే కాపరాలు చేస్తున్నారు.

అంతకు ముందే వేసిన కలయంపి ఆరిపోవడం చేత ఆ యింట్లో నుంచి ఒక అమ్మాయి వచ్చి వాకిట్లో ముగ్గులు పెట్టడం ప్రారంభించింది. ఆ వాకిలిని చూచి తక్కిన వాకిళ్ళన్నీ పారజూచాము. అన్నీ కలకల్లాడుతూనే వున్నై. కాని ముగ్గులు నల్లగా వున్నై. ముగ్గులు పెట్టే బాలికల ముఖాలు ఆనాటి అమావాస్యలాగే వున్నై. వారి విచారానికి కారణం నీకు వేరే వ్రాయనక్కర లేదు. దుఃఖం స్వభావం అయిపోయింది పల్లెటూళ్ళకు. ఆ మ్రుగ్గు అంత నల్లగా వుండడానికి కారణం మాత్రం నీకు చెబుతాను. ఇటిక ఆవములలోని తెల్లటి బూడిదను మ్రుగ్గులో కలుపుతారు. ఎందుకు ? మ్రుగ్గు చాలక, చాలినంత కొనుక్కోవడానికి డబ్బు లేక. అందుకే ఆ మ్రుగ్గు అంతే నల్లగా వుంది.

' ఆ మ్రుగ్గులే ఇళ్ళల్లో మనుష్యు లున్నారని ఆనవాలు. లేకపోతే ఇవి మనుష్యులు కాపురం చేసే యిళ్ళు అని ఎవరన్నా అనుకొంటారా ? ' అన్నాడు ఆ వృద్ధుడు - ' చూడండి ఎక్కడా టపాకాయల చప్పుడైతే వినబడడం లేదు. ఈ పండగ అంటే చిన్నపిల్లలు ఎంతో ఉత్సాహం పడతారు. కాని ఇప్పుడు ఏ బిడ్డ ముఖంలోనూ కళ లేదు. ఏ బిడ్డ నరాల్లోనూ ఉత్సాహం లేదు.'

మిత్రమా ! ఆ రైతు చెప్పే మాటలన్నీ నిజమే, ఆ 'మ్రుగ్గు' లే లేకపోతే అవి మనుష్యులు నివసించే కొంపలని అనుకోవడం చాలా కష్టం.

ఒకనాడు - మనం టార్జాను ఫిల్ముకు వెళ్ళినప్పుడు - ఆ ఆఫ్రికా అనాదివాసుల్ని చూచి 'ఎంత అనాగరికత మూర్తీభవించింది' అన్నావు జ్ఞాపకం వుందా ? నేడు నీవు పల్లెటూళ్ళు వస్తే - ఈ నవయుగంలో భారతదేశం యెంత అనాగరికస్థితిలో వుందో - తెలుసుకొంటావు. నిజంగా దుఃఖిస్తావు. అప్పుడు నీ ఉద్యోగ కాంక్ష మాయమైపోయి, మానవ సేవావిధి హృదయంలో హత్తుకుంటుంది. అందుకనే నిన్ను మా వూరు తీసికొని రావడానికి నేనెంత ప్రయత్నించినా మీ నాయనమ్మ రానిచ్చింది కాదు. నీవు కూడా మీ నాయనమ్మ మాటకు ఎదురు చెప్పలేక పోయావు.

' చూడండి, ఏ బిడ్డ ముఖంలోనూ కళ లేదు - ఉత్సాహం లేదు' అని ఆ రైతు చెప్పిన మాటల్లో ఎంత సత్యం వుందనుకొన్నావు ? విదేశాల వార్తలు నాకంటే నీకు ఎక్కువగా తెలుస్తూ వుంటాయి. ముస్సోలినీ అబిసీనియాను జయించడానికి కారకులు ఎవరు ? హిట్లరు తన యిష్టం వచ్చినట్లు ఆటలాడడానికి బలం యెక్కడిది? ఫ్రెంచి - రష్యా విప్లవాలకు మూలశక్తి యేది ? చిన్న చిన్న దేశాలు పెద్ద పెద్ద సామ్రాజ్యాల్ని ఏలడానికి బలం ఎక్కడి దంటావు ?

తరుణశక్తి ! మిత్రమా ! తరుణశక్తి ప్రపంచాన్ని పాలిస్తుంది. ఆ శక్తి భారతదేశంలో వుందా ? అసలు తారుణ్యం అనేది భారతదేశంలో వుందా ? అని నాకు అనుమానం. తారుణ్యం లేంది శక్తి ఎక్కడ నా నుండి వస్తుంది ?

రోజంతా కష్టపడినా ఆకలి తీరే అన్నం లేక, అన్యాయం అడుగుల క్రింద అణగిపోయి జీవనిర్జీవగతుల మధ్య అల్లాడుతూ వున్న పల్లెటూళ్లకు 'కళ' ఎక్కడనుంచి వస్తుంది ? జీవం నిలబెట్టుకోడానికా పల్లెటూళ్ళు పాట్లు పడుతున్నాయి. ఆవేదన

పొందుతున్నాయి. చూచేదెవరు ? ఆదరించేదెవరు ? ఎవరిక్కావాలి ? పల్లెలు ఎంత యేడ్చినా పట్నాలకు వినబడదు. పట్నాలకు వినబడేటంత గట్టిగా పల్లెలు ఏడ్వలేవు శక్తి యేది ?

ఆ వృద్ధ రైతు దగ్గర నుండి కదిలి వీధి ఆ చివర వరకూ వెళ్ళాం. కాని మా వుత్సాహమంతా ఆ ముసలాడి దగ్గరే చల్లారిపోయింది. పండగ యేమయినా సందడిగా వుంటే బాగుండును. కాని అదీ లేదు.

ఆ వీధి దాటి రామాలయం దగ్గరకు వెళ్ళి నిల్చున్నాం. లోపల తిల్లిక వెలుగుతుంది. కాని అది అంత కాంతిగా లేదు.

'అబ్బ, ఎంత నిర్జీవంగా వున్నది వూరు ! ఇంక ఈ వూళ్ళు బాగు పడతాయా ? ' అనిపించింది.

'తవ్వెడు బియ్యం ఇస్తారా ' అని వినిపించింది నాకు, ఆ దేవాలయం చాటు నుండి.

' ఎవరమ్మా ? ' అన్నాను. ఆ అమ్మ ఎదరకు వచ్చింది.

' ఏమి ? పండుగపూట అప్పా? ' అన్నాడు పంతులు.

' ఏముందండి, ప్రొద్దుట కూడా వండుకోలేదు. '

నాకేమీ తోచలేదు. హృదయంలో మంట మండుతుంది. నా ఆవేదన నీకు వ్యక్తం చేయలేను. ఎంత దుస్థితి !

ఆమె ఎక్కడినుండి బియ్యం అడుగుతుందో నీకు తెలుసునా ? పురుషోత్తాన్ని నీ వెరుగుదువు. మీరిద్దరూ కలిసి కొంతకాలం చదువుకొన్నారు. నాకు దీపావళి ఆనందం ఎవరితో పోయిందో అతడే పురుషోత్తం అంటే. ఈ వూళ్ళో ' బియ్యము నిల్వ ' సంఘాన్ని ఒక దానిని స్థాపించాడు. ఈ సంఘానికి సంబంధించిన కుర్రాళ్ళు చిన్న చిన్న సంచులతో వెళ్ళి ప్రతియింటా బియ్యం అడిగి ఈ రామాలయం గదిలో నిల్వ చేస్తారు. ఇది ఎంత చక్కని పద్ధతో ఆలోచించు. ఆ యువక హృదయానికి తట్టిన విశ్వజనీన పద్ధతి యిది. ఇప్పటికి ఆ గది బియ్యంతో సగం నిండింది. ఆ బియ్యంలో నుండి అప్పు అడుగుతుంది ఆమె.

' ఎందాక అప్పు ఇచ్చేదండీ ? ఇప్పటి కప్పుడే వందమంది అయ్యారు ! ' అన్నాడు ఆ సంఘ కార్యదర్శి అరుగు మీద నుంచి లేచి వస్తూ.

ఎంతమంది పస్తులు పడుతున్నారు ! ఎంత ఆకటిచిచ్చు ప్రతి క్షణమూ వారిని మాడ్చి వేస్తుంది ! ఈ దురవస్థ తొలగడానికి యెన్ని యుగాలు పడుతుంది ? యెప్పటికి పల్లెలు బాగుపడతాయి ! పల్లెలే గదా భారత సౌభాగ్యము ! యెంత కాలం పడుతుంది భారతదేశం బాగుపడడానికి !

మిత్రమా ! మా దీపావళి దీపాలు లేకుండా గడిచింది. చాలినంత అన్నం లేకుండా గడిచింది. ఏ భోగాలు అనుభవించినా పట్నం లోనే, అక్కడి నుండి లోకమంతా ఇలాగే వుంది అనుకొంటావు నీవు. టపటపాలతో, పూవత్తులతో, చిచ్చుబుడ్లతో, రంగు రంగులతో, రకరకాల ఆకాశదీపికలతో, విందులతో రంగు, విహారాలతో, వైకుంఠం లాగా వుంటుంది మీ పట్నం. కాని దేశంలో 90 వంతులు అంధకారంతో, ఆకటిచిచ్చుతో, ఆవేదనతో, అసౌఖ్యంతో, నిరాశతో, నిరానందంతో, చిక్కిచివికిన బ్రతుకుతో, అనారోగ్యంతో, కుమిలి కృశిస్తూ వుంటుంది. సంక్రాంతికి నిన్ను మా వూరు తీసికొని వస్తానులే. అప్పుడు నీవే అనుభవపూర్వకంగా తెలిసికొందువు గాని.

కడకు నా వింతభావం ఏమిటో నీకు చెప్పనే లేదు. తరువాత లేఖలో చెప్పుతాను. ఇక సెలవు.

★★★

ప్రియ మిత్రమా !

కొర్రలూ సోమలూ కోతకొచ్చాయీ
మినప-జనపా - యెర్ర మేతకొచ్చిందీ
బలవండిరా బాబు పాలికాపుల్లూ
బాగుగా మేపండి బక్క యెద్దులనూ
శీతకాలపు దుక్కి చేయి చాచిందీ
యెండకాలపుమోట యెదురు కాచిందీ

ఇలా పాడుకొంటూ - నాగలి భుజాన్ని వేసుకొని వస్తున్నాడు-నరుసు. ఆ పాట నేను అందుకొని...

నూవులా చేలోన నూనె పొంగిందీ,
లేయావు పొదుగులో నేయి చేరిందీ,

అమ్ముకోకుండగా అరగించండీ
చిమ్ముకోకుండగా చేవదేరండీ
మన గ్రామసీమల్లు మణులు పండాలీ..,
మన భారతీదేవి మహిమ పొందాలీ !

అని పాడుతూ - ఆ ప్రక్కని వున్న దోసపాదు చాటు నుండి యెదురుపడ్డాను. భయపడ్డాడు నరుసు, పాట మానేశాడు. దారి తొలగి వెళ్ళిపోయాడు.

ఆ భయపడడమే నాకు కిట్టదు. యెందుకు భయపడాలి ! నేనూ మనిషినే - అతడూ మనిషే, నా యెక్కువేమిటి ! అతడి తక్కువేమిటి !

నేను రైతుని, అతడు పాలేరు. అతడి చేతి క్రింద ఇంకా పనిచేసేవాళ్ళు ఉన్నారు. నా పైన భూస్వామి ఉన్నాడు.

ఆ మీద ప్రభుత్వం వుంది. ఈ అన్నితరహాల్లోనూ వున్న అందరూ కూడా మానవులే. అయితే ఒకళ్ళ కొకళ్ళు యెందుకు భయపడాలి ! ఒకళ్ళ పచ్చకు ఒకళ్ళు యెందుకు ఓర్వలేక పోవాలి ! ఒకళ్ళ ఆనందానికి ఒకళ్ళు యెందుకు అడ్డు రావాలి !

చిన్న రైతును కావడంతో నేను అతడికి యజమాని నయ్యాను! అయితే - అతడు పాడుకోగూడదూ ? అణిగిమణిగి, భూమికి జానెడు లోతుని కుంగిపోయి వుండాలా ! యెవళ్ళండీ ఈ దుశ్శాసనాన్ని కల్పించిన మహానుభావులు !!

ఎవరి విధిని వారు నెరవేర్చుకుంటూ పోతున్నప్పుడు - యెవరికి యెవరు భయపడేదీ ! యెందుకు భయపడేదీ !

అబ్బా - ఈ ' భయం ' అనేది మానవ సంఘాభివృద్ధికి నిరోధకం అవుతున్నది ! ఈ 'భయం' అనేదే చురుకుపాలుకు పిరికిమందు ! ఇదే ఇంతటి భారతదేశాన్నీ విదేశీయుల చేతులకు అప్పగించి వేసిన పిశాచి !!

భయం చావాలి. పరాక్రమం పుట్టాలి. అప్పుడు గాని -

ఇలా అనుకొంటూ - అప్పుడే కోసిన దోసపిందెలు ఒక్కొక్కటే కాజేస్తూ - బైలుదేరాను. అప్పటికి నాగలిని దూళ్ళపాకలో పడేసి - ఇంటికి పోతున్నాడు, నరుసు.

' నరుసూ ! పంటమూన యెవరు వేశారు ! ' అన్నాను అతడిని పిల్చి.

' మా యెంకిది వేసిందండి ' అన్నాడు.

' యెంకి – అన్నమాట చాలక పైగా ఒక 'ది' కూడా చేర్చావు ! యెంకమ్మ అంటే నీ సొమ్మేం పోతుంది ! నీ భార్యని నువ్వే గౌరవించకపోతే పరాయివాళ్ళు గౌరవిస్తారా ! ' అన్నాను.

ఇంకా కొంచెం విపులంగా చెప్పాలని ' మనం గౌరవింప బడాలంటే, ముందు మనవాళ్ళని మనం గౌరవించుకోవాలి. దేశానికి గౌరవం రావాలంటే, ముందు దేశీయులకి గౌరవం వుండాలి... ...

' దేశమంటే మట్టి కాదోయ్
దేశమంటే మనుషులోయ్ '

అన్నట్టు, దేశం సకల సంపదలతో తులతూగుతూ వున్నా దేశంలోని మనుషులికి గౌరవం లేనినాడు ఆ దేశానికే గౌరవం లేదు. ఇదే ఇప్పుడు మన తెలుగు దేశానికి పట్టిన దుస్థితి !

' తెలుగుభూమి చాలా సారవంతమైనది. బంగారం పండుతుంది. కాని తెలుగు వాళ్ళంటే దేశంలో గౌరవం లేదు. కారణం ! – మనల్ను మనం గౌరవించుకోక పోవడమే.

' గౌరవం వచ్చేది మనిషిని బట్టి కాని హోదాను బట్టి కాదు. ధనికుడు కాబట్టి గౌరవంగా చూడాలనీ – కూలీ గాబట్టి హీనంగా చూడాలనీ ఏ స్మృతిలోనూ లేదు. అదే నిజమయితే, దౌర్జన్యం అన్నమాట.'

ఈ మాటల ధోరణిలో మేము చాలా దూరం పోయాం. మా పొలం దాటి, నరుసు యిల్లు దాటి, కూడా పోయాం. అక్కడ రామాలయం అరుగు మీద పదిమంది కూర్చుని కథలు చెప్పుకొంటున్నారు.

నన్ను చూడగానే రమ్మన్నారు. 'వస్తాను గాని కథ సాగనీయండి' అన్నాను.

'మా కథల కేం లెండి. పనీ... పాటూ లేని కథలు' అన్నాడు అందులో ఒక పిల్లరైతు.

నిజంగా పనీపాటూ లేని కథలే సుమా. ఊడ్పులైపోయాయి. ఇక రైతుకి ఏమీ పని వుండదు. పిల్లరైతులకీ, కూలీలకీ తిండికి చాలా ఇబ్బందిగా వుంటుంది. చేదామంటే పనులు కనపడవు. డబ్బు దొరికే సూత్రం కనపడదు. ఏమీ తోచక ఈ నాలుగు నెలలూ దరిద్ర దేవత కడుపులో గురకలు పెడుతూ వుంటారు.

'ఇంకా నయం. మీరు కథలైనా చెప్పుకొంటున్నారు. ఎందుకూ కాని పేకాటల్తోనూ – గాలిపటాన్ని ఎగరవేయడంతోనూ – బీచీ షికార్లతోనూ – డాన్సింగుల తోనూ– కాలం వృధా పుచ్చుతూ వుండే పట్న వాసుల జీవితంచూస్తే – ఛీ ! ధిక్ !!–'

'కాని వాళ్ళకీ – మనకీ ఒక్క విషయం మాత్రం తేడా వుంది. వాళ్ళకి కష్టం లేకుండానే డబ్బు వస్తుంది. మనకు రెక్కలు ముక్కలు కొట్టుకున్నా డబ్బు రాదు. ఈ కీలకమే మనం కనిపెట్టాలి' అన్నాను.

అప్పు డింకో రైతు అన్నాడు: 'మీరు పట్నంవాళ్ళ దాకా పోయారు. మన పల్లెటూళ్ళోనే వుంటూ –ఏమీ కష్టం లేకుండానే – రైతుల్ని పీల్చి పిప్పి చేస్తూ, వేలూ – లక్షలూ గడించుకుంటున్న ఈ భూస్వాముల మాట చెప్పరేం ?'

ఇంకో రైతు:– 'మనదేశంలో కేవలం తిండి లేక వేనకువేలు చచ్చిపోతూ వుంటే ఈ విషయాన్ని గురించి కొంచెమైనా ఆలోచించకుండా 'పాపం – చైనావాళ్ళు చచ్చిపోతున్నారు, రామ రామ ! స్పెయిన్ ప్రభుత్వం పడిపోతున్నది' అంటూ కన్నీరు పెట్టుకొనే మన పిల్లనాయకుల మాటల్లాగనే వున్నయి. మీ కబుర్లనూ ! బస్తీ వాసన బాగా తగిలిందా ఏమిటండో ? '

నేను అడ్డంగా మాడాను. ఏం చేసేది ? మొన్న మొన్నటి వరకూ గ్రామీణులు ప్రపంచం ఏమిటో ఎరగకుండా నూతిలో కప్పలలాగా వున్నారు. తమ పనేమిటో తామేమిటో అంతే ! కర్మసిద్ధాంతాన్ని నమ్ముకొని కలిగిన దానితో తృప్తిపడి వుండేవాళ్ళు.

కాని ఇప్పుడు బాగా తెలివి మీరిపోయారు. ఏ శక్తి ప్రపంచాని కంతకీ జీవనమైందో, ఆ శక్తికి తామే దోహదకర్తల మనీ, అట్టి తమశక్తి లోకకళ్యాణం కోసం కాక కొంత మంది స్వార్థపరుల స్వాభివృద్ధికి మాత్రమే వ్యర్థపరుపబడుతూ వుందనీ, రైతులూ, కూలీలూ ఇప్పుడు గ్రహించారు.

అప్పుడు నే నన్నాను:

'నన్ను మీరు అలా అనగూడదు. బస్తీవాసన తగలడమంటే పైత్యం తలకెక్కడ మన్నమాట. నాకు అలాంటి పైత్యమే ఎక్కి వుంటే ఆ గిరాకీల్లో, ఆ షోకుల్లో మునిగిపోయి మళ్ళీ మీ మొహం చూచి వుందునా ? ఇంతకీ నేను చేసిన దోష మేమిటి ? ఇక్కడి మన జీవిత విధానంతో ఇక్కడి భూస్వాముల జీవిత విధానాన్ని తేడా తీయక, పట్నస్థుల జీవిత విధానాన్ని తేడా తీయడమే కదా ? '

' అబ్బే వట్టినే అలా అన్నానండీ. పట్నాల్లో ప్రజలు ఎలా వుంటారో తెలిసికోవడం కూడా మన విధి ' అన్నాడా రైతు.

' ఔను. నన్నడిగితే - తిన్న తిండీ, నిలవ నీడా, కట్టబట్టా, ఇవే వుంటే - గ్రామజీవితం ముందు పట్నం జీవితం నిజంగా లెక్క కొస్తుందా ? '

' ఆ మూడింటి కోసమే జీవిత కాలమంతా కష్టపడి ఏడవాలి గద మనం' అన్నాడు ఇంకోరైతు.

'ఎంతకాలం ఏడుస్తాం ? ఏడవడానికే పుట్టామా ? ఈ ప్రపంచంలో కొందరు సుఖపడడానికీ - కొందరు కష్టపడడానికీ అని చెప్పి వేరే వేరే పుట్టారా ? సృష్టిలో లేదు ఈ పక్ష పాతం. సంఘంలో కలిగింది. దీన్ని సంస్కరించుకొని సంఘాన్ని పునర్నిర్మాణం చేయాలి' అన్నాడు ఒక కూలీసంఘపు మేస్త్రీ.

' సంఘ పునర్మిర్మాణం ' అనే విషయాన్ని గురించి నన్ను కొన్ని ఉపన్యాసా లివ్వమన్నారు.

' ఉపన్యాసాల యుగం దాటిపోయింది. కబుర్లతో కార్యాలు సాధించే రోజులు దాటిపోయాయి. అయినా ఉపన్యాసాలు కావలిస్తే కావలసినన్ని ఇస్తాను. వాటి నన్నింటినీ కార్యరూపంలో పెట్టి ఉపయోగానికి తీసుకురావాలి. లేకపోతే లాభం లేదు' అని అంటూ ' నరుసూ ! నువ్వెళ్ళిపో. చీకటి పడ్డది ' అన్నాను.

నరుసు వెళ్ళిపోయాడు. నే నక్కడే కూర్చుని 'కథ కానీయండి. మధ్యలోనే విడిచిపెడితే మొండితేలు కుడుతుంది ' అన్నాను.

' ఈ పిచ్చినమ్మకాలు మీకూ వున్నాయా ? ' అని అడిగాడు ఒకతడు.

' నాకు లేవు. కాని మీకు వున్నాయి కదా ' అన్నాను.

' అబ్బే, మాకథ అంత గొప్ప కథ కాదు. పూర్వం కూలీలూ, రైతులూ ఒక్క తల్లిబిడ్డలే అని కథ చెప్పుకుంటున్నాం' అన్నాడు ఆ కథకుడు.

' ఒక్క తల్లి బిడ్డలు ఎలాగయ్యారు ? ' అన్నాను.

' ఒక తల్లికి ఇద్దరు కొమాళ్ళు వుండేవారట: '

' ఊఁ... '

' అందు పెద్దవాడు సోమరి, చిన్నవాడు చురుకైన వాడు.

' ఊఁ... '

" చిన్న వాడి చురుకుదనానికి మెచ్చి - అతడే తన మానవసృష్టి కంతటికీ ఆధారభూతుడు కాగలడని గ్రహించి - భగవంతుడు అతడికి ఒక 'నాగలి' ఇచ్చాడట"

' నాగలితో సేద్యం చేసి ప్రపంచాన్ని పోషించమని కాబోలు ' అన్నాను, నేను.

' కాని ఇప్పుడు మరనాగళ్ళు వస్తున్నాయి చూచారా ? ' అన్నాడు ఇంకొకతను.

' మరనాగళ్లైనా - అమరనాగళ్లైనా - అసలు నాగళ్లే కాదా ! ఈ దేశంలో అయినా, మరే దేశంలో అయినా, భూమి దున్నక పండదు గదా ? ' అన్నాను.

' ఆ నాగలిని సంతోషంతో తెచ్చుకుంటూ వున్నాడట ఆ కుర్రవాడు. ఆమధ్యలోకి అన్నగారు ఎదురుపడ్డాడట - '

' ఊఁ... '

' తమ్ముడూ ! నేను దేవుడి దగ్గరికి వెళ్లలేకుండా వున్నాను. నీకు పుణ్యముంటుంది. ఈ నాగలి నాకిచ్చేసి - ఇంకొకటి అడిగి తెచ్చుకో - ' అని బ్రతిమాలాడట. '

' ఇచ్చేశాడా? '

' ఇవ్వక ఏమి చేస్తాడు? జాలి గుండె కలవాడు. '

' ఊఁ...'

' ఇచ్చేసి - భగవంతుడి దగ్గరికి మళ్ళీ వెళ్ళి ఎదురుగా నిల్చున్నాడట.'

" మళ్ళీ వచ్చావేమిరా ? నీ నాగలి ఏమి చేసుకొన్నావు ?' అని అడిగాడట భగవంతుడు. "

' ఊఁ... '

" నా నాగలి మా అన్న కిచ్చానండి. నా కింకొకటి దయ చెయ్యండి' అన్నాడట - పాపం అతడు."

అప్పుడు భగవంతుడు ఉగ్రుడై 'ఓరి మూర్ఖుడా ! ఇంకొకళ్ళకి దానం చెయ్యమనే ఇచ్చానా నీకు ? నీ తెలివి తక్కువకి ఫలితంగా నీ యన్నకి పాలేరుతనం చేసుకొని బ్రతుకు. వెళ్ళు - పో-' అని గద్దించాడట. "

' పాపం నిర్భాగ్యుడు. '

'ఆ నిర్భాగ్యుడే కూలీ అయినాడు. ఆ సోమరిపోతు అన్నగారే రైతు అయినాడు.

ఆ రైతు తమ్ముడు తనకు చేసిన మేలు మరచిపోయి కూలి అయినా సరీగ్గా ఈయకుండా హింస పెట్టేవాడు. ఆ తమ్ముడి సంతతివారే ఇప్పటి కూలీలు, ఆ అన్న సంతతి వారే ఈ రైతులు. అందరూ అన్నదమ్ముల బిడ్డలే. కాని రైతులు కూలీలను హింస పెడుతూ వుంటారు. '

' కూలీలు, తెలివి తక్కువ వల్ల యీ దుస్థితిని తెచ్చుకున్నారు. కనుక విరుగుడుగా తెలితేటల వల్లనే ఈ శాపాన్ని పోగొట్టుకోవాలి ' అన్నాడు మా కూలీసంఘపు మేస్త్రీ.

సఖా ! కథ వింటివా ? నీ పత్రికల లోని కథలు ఎన్ని వందలయితే ఇలాంటి కథ ఒక్కదానికి సాటి అవుతవి ? సంఘంలో, వాఙ్మయంలో, కథల్లో జీవం వుంది అంటే ఆ జీవం గ్రామాల్లోనే వుంది. మా గ్రామాలు సహజసౌందర్య మధురాలైన పుష్పాలు, మీ పట్నాలు కృత్రిమపు రంగుల కాగితపు పువ్వులు.

అప్పటికి చాలా చీకటైపోయింది. రామాలయానికి భార్యలు వచ్చి వారి వారి భర్తలను భోజనాలకు పిలుచుకు పోయారు. నేనూ లేచిపోయాను. ఇంటికి పోయే దార్లో ఇలా తోటగట్ల మీద పాటలు పాడుకొంటూ పాలేరు కుర్రాళ్ళు ఖామందుల ఇళ్ళ దగ్గర నుంచి కొంపలకు పోతున్నారు.

ఖామందు పొలములో సోమ పండిందీ,
పాలేరు గుడిసెలో బాల నవ్విందీ,
తెలుగుతోటల్లోన తేనె కారిందీ
తల్లి చేతుల్లోన తనివి తీరిందీ.

... .

ఇంటిచుట్టూ తోట యేపుచూపిందీ,
చేలనిండా పంట చెలువారుతుందీ,
కాని మా యిళ్ళలో గంజైన లేదూ,
అమ్మలా ఆకళ్ళు ఆరనే లేదూ.

... ...

పంట బాగా పండు భాగ్యాలతల్లీ !
పాలేళ్ళ ఆకళ్ళు బాపుమా తల్లీ !

కూడు లేనట్టి మా గుడిసెలే తల్లీ !
బంగారుటిండ్లుగా పాలింపు తల్లీ !

★★★

ప్రియ మిత్రమా !

దసరా వచ్చింది. నవరాత్రులు ప్రారంభమైనాయి. బలే జోరుగా వుంది... ఉత్సవాల సంరంభం.

భారతదేశానికి కంతటికీ ఇది గొప్ప పండగ. డబ్బు లేని మా గ్రామాలలో కంటే, డబ్బు మురుగుతూ వుండే పట్నాల్లో ఎక్కువ దర్జాగానూ, దుబారాగానూ వుంటాయి ఉత్సవాలు.

బసంగిచేలు కోతకొచ్చాయి. వర్షాలు పడుతున్నాయి. మురుగుడువచ్చి చేలు ముంచుతూంది. నీరంతా విడగొట్టడానికి రాత్రి చాల రాత్రి వరకూ పొలంలోనే జాగారం చేశాను.

'ఆంధ్రరాజ్యము మేము
ఆదుకోవాలీ
ఆంధ్రతేజము మమ్ము
అలముకోవాలీ
విజయమ్ము చేకూర్చు
వీరాధి దేవతా !
శుభములు దయచేయు
శుభ్రకాశీశ్వరీ ! '

అంటూ మా చెల్లెలు పాడుతూంది.

' చేమంతిపూలో - చేమంతిపూలో - ' అంటూ వీధిలో కేకలు వేస్తున్నారు పువ్వులు అమ్ముకొనేవాళ్ళు. ఆ కేకలు విని మేల్కొన్నాను నేను. అప్పుడే పొద్దు చరచరా పొడుచుకొచ్చేస్తోంది.

అరుగు మీద నిల్చున్నాను. పూలగంప అరుగు మీద పెట్టి -

' చేమంతివూలండీ, పట్నానివి' అన్నా డతడు.

ఎంత దుస్థితి పట్టింది మాగ్రామాలకి ! ఏమి భూకంపాలు పుట్టాయి మా గ్రామసీమల్లో ! ఏమి ప్రళయం వచ్చింది మా గ్రామసౌభాగ్యానికి !

అయ్యో !

మా జానపదాలు జారిపోలేదే - మా పొలాలు వూడిపోలేదే - మా తోటలు నీటగలియలేదే-మా దొడ్లు దొర్లిపోలేదే.

మా పచ్చదనం భస్మమై పోలేదే - మా గ్రామ సౌందర్యం ధూమం కాలేదే. మా పల్లెటూళ్ళ కొచ్చి - పట్నాలు పువ్వు లమ్మడమా ?

సిగ్గు - సిగ్గు. వాసి - వాసనా లేని పువ్వుల మీద వాసన, రంగు పౌడర్లు చల్లి తెచ్చిన పువ్వులు, ఘుమఘుమలాడే మా గృహారామ పుష్పాల మీద దిగదుడుపుకయినా పనికిరాని వువ్వులు-

మా గ్రామాలలో అమ్మడమా ? మా గ్రామవాసులు కొనడమా ? అయ్యో ! ఆకాశం పెళేలు మంది, భూమి పళేలు మంది. భగ్గుమంది నా వొళ్ళు.

డబ్బు దండుకొనే పట్న వాసులకు సిగ్గేమిటి ? సంసారాలు చక్కబెట్టుకొనే గ్రామీణులకు వుండొద్దా బుద్ధి ?

ఏమైనా నాలుగు డబ్బులుంటే, పట్నం పువ్వులకీ - పట్నం కాఫీలకీ - పట్నం ముక్కుపొడుములకీ - పట్నం పౌడర్లకీ - పట్నం షోకులకే కాజేస్తారు.

పువ్వులు పట్నాల నుంచి రావలసిందే ? కూరగాయలు పట్నాల నుంచి రావలసిందే ? అపరదినుసులు పట్నాల నుంచి రావలసిందే ?

ఎంత తగులబడిపోతుంది గ్రామసౌభాగ్యం ! ఎంత సోమరులై - మొద్దులై పోతున్నారు గ్రామవాసులు !

తమకు కావలసిన - తమకు చేతనైన - అవసరాల్ని కూడా వారు ఉత్పత్తి చేసుకోకపోతే మరెందుకు ? పట్నాలకు శాశ్వతంగా దాసులైపోతారా గ్రామీణులు ?

మా చెల్లి పరుగున వచ్చి 'ఏవీ - పువ్వులు - చూపించు' అంది.

' ఎందుకు ? ' అన్నాను.

' వుట్టినే ' అంది.

' చెశ్ ! - ఈ దండంతా మా దొడ్లో ఒక్క పువ్వుకి చాలదు' అంది, వందపువ్వులుగుచ్చిన ఒక దండను ఎత్తి.

' అలా తిట్టగూడదు, పొమ్మను ' అన్నాను.

అతడేదో గొణుక్కుంటూ పోయాడు.

' తిట్టడం కాదన్నా ! పట్నం పువ్వులు - పట్నం పువ్వులు అంటూ చెత్తపువ్వులు తెస్తాడేం ? ఈ కొనుక్కునే వాళ్ళకి మతుల్లేవూ ? ' అంటూ - నే చెప్పేది వినకుండానే ఇంట్లోకి పరుగెత్తిపోయింది.

ఎవరిది తప్పు ? పట్నంవాళ్ళదా ? పల్లెటివాళ్ళదా ? తమ దొడ్లో పూయించు కోగలిగే పువ్వులు కూడా డబ్బు పోసి కొనుక్కోవడమేనా ?

మిత్రమా ! చూస్తివా ? పల్లెటూళ్ళు ఎంత పాడైపోయాయో. ఇదంతా మీ పట్నాల మహాత్మ్యమే. పట్న నాగరికతా వ్యామోహంలో పడిపోయి పల్లెటూళ్లు తమ మహత్తర వ్యక్తిత్వాన్ని మరిచాయి.

నేను ఇలా ఆలోచించుకొంటూ నిల్చున్నాను, వూళ్ళో చిన్న చిన్న భజనపార్టీలు బయలు దేరి గోదావరికి పోయి స్నానాదికృత్యాలు తీర్చుకొని వస్తున్నారు.

చాలామంది చేతుల్లో జమ్మికొమ్మలూ - అవీ - వున్నాయి. మంగళ వాద్యాలతో వాటిని తీసుకుపోతున్నారు.

"అర్జునస్య ధనుర్ధారీ
రామస్య ప్రియదర్శనమ్"

మొదలైన మంత్రాలు మధ్య మధ్య వినిపిస్తున్నాయి.

ఇవే జమ్మిపూజలు. లేక ఆయుధ పూజలు.

ఈ పూజలు ఏనాడు పుట్టాయో నీ వెరుగుదువా ? అజ్ఞాతవాసం తర్వాత పాండవులు జమ్మిచెట్టు మీద దాచిన ఆయుధాల్ని తీసికొంటూ ఆయుధపూజ చేశారు. అప్పటి నుంచీ ఈ పూజలు పుట్టాయని ప్రతీతి.

రావణుని చంపిన తర్వాత అయోధ్యకు వచ్చే ముందు శ్రీ రాముడు శమీ వృక్షపూజ చేశాడు. అప్పటి నుంచీ ఈ దసరా పుట్టిందని మరికొందరంటారు.

అసలు ప్రారంభం ఏదైనా యుద్ధదేవత ఆరాధనయే ఈ పండగ. శమీవృక్షాన్ని వూజించడం అంటే అపరాజిత దేవిని వూజించడం. అపరాజిత దేవి విజయానికి అధి దేవత.

అట్టి విజయోత్సవానికి - అట్టి యుద్ధదేవత అర్చనానికి - అట్టి ఆయుధపూజాదీక్షకు - నేడు ఎట్టి గతి పట్టింది ?

మీ పట్నంలో జరిగే నవరాత్రి ఉత్సవాలకి ఒకసారి వెళ్ళి చూడు.

మిడిగ్రుడ్లూ, ముంతకొప్పులూ, బొంతరొమ్ములూ, అసహ్యంగా వుండే లక్క బొమ్మల గెంతులాటతో - వాటికి తీసిపోని భోగంమేళాల సీదర చిందులాటతో - వాటివెనక ఉవ్విళ్ళూరుకొంటూ, సిగరెట్లు కాల్చుకొంటూ, కిళ్ళీరసం చొక్కాల మీద కార్చుకొంటూ, చెడదిరిగే షోకిల్లాల చెర్లాటతో - క్రూరత్వాన్ని గాని, పరాక్రమాన్ని గాని, విజయోత్సవాన్ని గాని, ఏ విధంగానూ పుట్టించని సావిత్రీ చరిత్ర, నలోపాఖ్యానం మొదలైన హరికథా కాలక్షేపాలతో,

కోలాటాలతో

కొట్లాటలతో

ఇదా అపరాజితా దేవి పూజ ? యీద్ధాల్లో విజయం చేకూర్చే మహాశక్తి పూజ ఇదా ?

మా గ్రామాల్లో ఈ వుత్సవాల్ని ఏనుగు సంబరాలు అంటారు, యుద్ధాల్లో ఏనుగుల మహాసంరంభాన్ని ఈ పండగ సూచిస్తుందని గావును.

బాజాలతో ఏనుగుల్నీ లొట్టిపిట్టల్నీ ఉరేగిస్తారు. భజనలు చేస్తారు. ఈ భజనల్లో అయినా వీరకీర్తనలు గాని , వీరకథనములు గాని మచ్చుకైనా కనిపించవు. బాలింతకోపులతో ప్రొద్దులు పుచ్చుతారు.

ఇక ఈ మహాజనులు పూజించే ఆయుధాలు ఎట్టివో తెలుసా ? అర్జునుడి ధనుర్బాణాలా ? కాదు. భీముడి గదా ? కాదు. శ్రీ రాముడి దివ్యాస్త్రమా ? కాదు. బాలవీరుడి పౌరుషమా ? కాదు. పురుషోత్తముడి భుజాదండమా ? కాదు. ఝాన్సీలక్ష్మీ ధైర్య సాహసాలా ? కాదు.

పోనీ - తుపాకీలా ? కాదు. ఫిరంగిగుండ్లా ? కాదు. మరేమిటి ?

కుమ్మరి కుండ పెంకులు - మంగలి పొది - రైతు నాగలి - జమిందారు ఇనప్పెట్టె - ఉద్యోగి ఫైల్సుకట్టలు !

ఏమి ఆయుధాలు ! ఏమి ఆయుధపూజలు !! ఇంతకి దిగింది మన ఆయుధపూజ !!!

సఖా ! పూజించడానికి వీరులు లేరా మనకు ? స్మరించడానికి వీర చరిత్రలు లేవా ? పాడుకోడానికి వీరగాథలు లేవా ?

ఈ విషయంలో చూస్తే మా గ్రామాల కంటే మీ పట్నాలు సర్వభ్రష్ట మైనాయి.

పల్నాటి వీరచరిత్ర – బొబ్బిలి యుద్ధగాథ, మరాటీ వీరకథనం మొదలైన వీరగానం వల్ల ఇంకా మా పల్లెటూళ్ళు జీవనం నిలబెట్టుకొంటున్నాయి. పట్నాలకు అదీ లేదు.

మొన్నమొన్న జరిగిన సిపాయీ కలహం స్వాతంత్ర్యం కొరకు జరిగిన పోరాటంగా ఎంతమంది చిత్రించారు ? ఎంత మంది కవులు ఆ పోరాటాన్ని గానం చేశారు ? అదే మరో దేశంలో అయితే ?

చెప్పవచ్చేదేమంటే మన పూజలూ, మన పండగలూ, మన ఆచార వ్యవహారాలూ అర్థం తెలీకుండా అర్థం లేకుండా అనుసరించబడుతున్నాయి.

మన దేశంలో వీర్యం నశించింది. పౌరుషం పరుల పాలయింది. శక్తి చల్లారిపోయింది. బడాయి, షోకు ఈ రెండూ మనకు దాపరించాయి. అవి మీ పట్నాల్లోంచి మా పల్లెలలోకి పాకిపోయాయి.

ఈ ఆలోచనా ప్రవాహంలో పడి కొట్టుకుపోతున్న సమయంలో ప్రక్కవీధి నుంచి ఒక పాట వినిపించింది నాకు.

" పావులా బేడైతే పట్టేదిలేదూ
అర్ధరూపాయైతే అంటేదిలేదూ
రూపాయి అయితేను చెల్లుబడికాదూ
రెండురూపాయిలా రొక్కంబు మాకూ
అయ్యవారల కిందు అయిదువరహాలూ
బాగుగా మాకిందు పప్పుబెల్లాలూ
జయా విజయీభవ, దిగ్విజయీభవ."

దసరా రోజంతా ఉత్సాహాన్ని, ఉత్సవాన్నీ కలిగించేది ఈ బడిపిల్లలే.

తమ రంగురంగుల గిలకలబద్దలతో – కనపడ్డవారిపై నెల్లా బుక్కా కొట్టుకుంటూ వీధులలో వరసగా నడిచిపోయే ఆ బాల బాలికల్ని చూస్తే – భారతయుద్ధం జ్ఞాపకానికి వస్తూ వుంటుంది.

నాటి ధనుస్సులూ, బాణాలూ, అస్త్రశస్త్రాలూ – నేటికి గిలకబద్దలు గానూ, బుక్కాగొట్టాలు గానూ, బుక్కా గానూ తయారయ్యాయి. నాటి పరాక్రమం నేటికి పిల్లలమీదా, వృద్ధులమీదా బుక్కాకొట్టడంలో చూపబడుతోంది. ఎంత పతనం !

పోనీ – ఈ మాత్రపు జ్ఞాపకాన్నైనా వుంచుకొని, పూర్వపు గాథలు నెమరకు తెచ్చుకొని, కాస్త నవజీవనం పొందుదామంటే, ఈ ' గిలకలు పట్టించడం కూడా ఉపాధ్యాయుల అధికారంలో లేదిప్పుడు. ఈ బడిపిల్లల వేడుక ఉత్సవాన్ని ప్రభుత్వం వారు అరికట్టేశారు. మరే అవినీతి, అఘాయిత్యవు ఆచారాల్నీ అరికట్టలేకపోయినా, ప్రభుత్వం ఇలాంటి ఉపయోగమయిన ఉత్సవాల్ని మాత్రం అరికడుతుంది.

దసరా దండయాత్ర మ యింటి మీదకు కూడా వచ్చేలాగుంది. నేను కూడా బుక్కా బాణాలకు గురి అయ్యేలాగున్నాను. కాస్త కాచుకోవాలి. సెలవు.

★★★

ప్రియసఖా !

నీ లేఖ అందింది. పట్నం జీవితం యెలా వుంటుందో అందులో వర్ణించావు. పల్లెటూరి జీవితాన్ని చిత్రిస్తూ ఉత్తరం వ్రాయమన్నావు.

నీది ఉత్తమమైన వాంఛ. ఒకచోట జీవిత విధానంతో మరొకచోటి జీవిత విధానాన్ని నిత్యమూ తెలిసికొంటూ వుండాలి. మంచి చెడ్డలు, హెచ్చుతగ్గులు, ఏమైనావుంటే సరిచేసుకోవాలి. ఈ వాంఛ నీకు కలిగినందుకు చాలా అభినందిస్తూ వున్నాను.

నీ పట్న జీవితానికీ – నా పల్లెటూరి జీవితానికి పరస్పర విరుద్ధంగా వుంటుంది. నీ పట్న జీవితం సౌఖ్యమయం అయితే – నా గ్రామ జీవితం కష్ట సమయం. నీ పట్నవాసం ఆనందకరం అయితే నా గ్రామవాసం దుఃఖకరం.

నీ ట్రాంబళ్ళు, నీ మోటారుటాక్సీలు, నీ ఎలక్ట్రిక్ ట్రైనులు, నీ కాఫీహోటళ్ళు, నీ సినీమాలు, నీ రేడియో సంగీతాలు, నీ హాస్పిటల్ గొడవలు, నీ జీవితాన్ని వాయువేగ మనోవేగాలతో ఎక్కడికో తీసుకొనిపోతూ వున్నట్లు అనిపిస్తూంది. నీకు. కాని–

నా రెండెడ్లబళ్ళూ, నా సవారీలూ, నా నాగళ్ళూ, నా మోటలూ, నా గడ్డపారలూ, నా వూడ్పులూ, నా కలుపుతీతలూ, నా కుప్పనూర్పులూ, నా

పాలిపాటలూ, నా చెమ్మటబొట్లూ, నాపూరిగుడిసెలూ, నన్ను ఎక్కడివాణ్ణి అక్కడే వుంచి క్రుళ్ళబెట్టి పాతేస్తూ వున్నట్లు తోస్తూ వుంది నాకు. చూచావా మన ఇద్దరి జీవిత విధానాలకీ మధ్యన వున్న అంతరం ?

నా జీవిత విధానాన్ని గురించి వ్రాయడ మంటే పల్లెటూళ్ళ జీవిత విధానాన్ని గురించి వ్రాయడ మన్నమాట. అంటే కన్నీళ్ళు కార్చడ మన్నమాట. అంటే హృదయాన్ని చీల్చుకోవడం అన్నమాట. పల్లెటూళ్ళు ఎంతెంత ప్రత్యక్ష నరకాన్ని అనుభవిస్తూ వున్నాయో విద్యుద్దీపాలూ, విద్యుత్పంకాలూ ఒప్పారుతూ వున్న మేడలలో హాయిగా సుఖించే నీకు ఏమి తెలుస్తుంది ?

గ్రామజీవితం నీకు అర్థం కావాలంటే మా ఇంటికి ఒకసారి రా. ఈ పూరిగుడిసెలో ఈ డొక్కనారత్రాడు మంచం మీద ఒక రాత్రి పందుకో. ఈ పచ్చిమిరపకాయ ముక్కను నంజుకొంటూ ఈ అంబలి కాస్త త్రాగు. ఈ కిరసనాయిల్ బుడ్డి దీపం దగ్గర ఈ కూలీమనిషికి ఒక వుత్తరం వ్రాసి పెట్టు.

రంగంలో వున్న భర్తకు వుత్తరం వ్రాయించుకోడానికి ఇప్పుడే వచ్చింది ఒక కూలీ మనిషి. ఇప్పుడు రాత్రి పదిగంటలు. ఎనిమిదిగంటలకి వచ్చింది పొలం నుంచి, మానెడు ధాన్యం వుంటే దంచి - గంజి కాచుకొని - త్రాగి - ఇప్పుడు వచ్చింది నా దగ్గరకు వుత్తరం వ్రాయించుకోడానికి. నీ కళ్ళల్లో ఏమైనా కన్నీళ్ళు వుంటే ఇప్పుడు రాల్చు.

'...వూడుపులై పోయాయి. ఏమీ పనుల్లేవు, గడ్డికోసి అమ్ముకొంటున్నాను. రోజూ అణా - బేడా- వస్తూంది.... మీ బాబుకు నల్లమందుకే సరిపోవడం లేదు. ఉన్న వొక్క ముక్కుపుడకా అరుఅణాలికి తాకట్టు పెట్టేశాను... రంగంలో దెబ్బలాటలంట, వెంటనే దేశం వచ్చేయవలసింది... తర్వాత దేవుడే వున్నాడు.. ఇల్లు ఒక ప్రక్క కూలిపోయింది... నీట్రాడు మీద పడి లేకదూడ చచ్చిపోయింది... రెండో ప్రక్క నాలుగు ఆకులు వొడ్డుకొని వుంటున్నాం...'

ఈ వుత్తరం వ్రాసినంత సేపూ వెంకమ్మ ఏడుస్తూనే వుంది. ఈ కాస్త ముక్కా వ్రాయడానికి నాకు ఒక గంట సేపు పట్టింది.

ఒక వైపున భర్త మీద బెంగ - ఒక వైపుని దరిద్ర దేవతతో కొట్లాట ! కడుపు తరుక్కుపోతోంది.

' అమ్మా ! ఎందుకలా ఏడుస్తావు ? ఏడ్చి ఏమి లాభం ? రంగంలో

దెబ్బలాటలు చల్లారిపోయేయి. నీ భర్త కొచ్చిన ఏమి ఫర్వాలేదు. ఇక దరిద్ర మంటావా ? ఏడిస్తే ధనం వస్తుందా ?... ' అంటూ ఓదార్చబోయాను.

వెంకమ్మ ! ఏమీ మాట్లాడలేదు. కొంచెంసేపటికి దుఃఖం ఆపుకొని అన్నది - 'అన్నయ్యగారూ ! ఆడవాళ్ళను అవమానించి - కంచం లోని అన్నాన్ని కాలదన్నే రాక్షసులికి ఏమన్నా శాస్తి వుందా ?' అని.

' వుంది వుంది. ముమ్మాటికీ వుంది. ఇప్పుడు కాకపోతే - మరెప్పటికైనా వున్నది. ఏం ? నిన్నెవరైనా అవమానించారా ?' అని అడిగాను.

'నా భర్త దేశంలో వుంటే నాకిన్ని పాట్లు వుండకపోను గదా. నేను ప్రొద్దుట గడ్డికి పోయాను పొలం లోకి. ఆ పొలం ఏరైతుదో నాకు తెలీదు. గట్టున కూర్చుని గడ్డి కోసుకుంటున్నాను.

పెనుభూతంలాగ వచ్చిపడ్డాడు, ఎక్కడినుంచో అతగాడెవరో నాకు తెలీదు. నోటికి రాని బండ బూతులు తిట్టాడు - కొడవలి లాక్కొన్నాడు - గడ్డి బుట్టను పరపరా చింపేశాడు - గడ్డిని చేలల్లోకి విరజిమ్మేశాడు. బ్రతిమలాడాను - ఏడిచాను, మొత్తుకున్నాను. పాదాల మీద పడ్డాను కాని... '

మిత్రమా ! కడుపు కరిగించే ఇలాంటి దృశ్యాలు మా గ్రామాలలో ఎప్పుడు పరిపాటే. ఇలాంటివి ఎన్నో చూచాను. చూచి చూచి నా గుండె కరుడు కట్టుకుపోయింది. దరిద్ర దేవత - అవమాన దేవత - కష్ట దేవత - దుఃఖదేవత - యీ దేవతలంతా నిర్భాగ్య కార్మిక సంఘాన్నే పట్టుకొని పీడించుకు తింటున్నవి. ఇప్పుడైతే మాత్రం కన్నీరు రాల్చడం తప్ప నేను చేయగలిగిం దేముంది ?

' వెంకమ్మా ! కష్టేఫలే - అన్నమాట వట్టిది కాదు. ఏనాటికైనా సరే - కష్టం ఫలించి తీరుతుంది. ఎన్నో వందల సంవత్సరాల నుంచి మన కూలీజాతి కష్టపడుతోంది. సుఖపడే కాలం రాకపోదు. వెంటనే రాకపోవచ్చును. ఈ తరంలో రాకపోవచ్చును. వచ్చేతరంలో రాకపోవచ్చును. కాని రాకనే పోదు. మనం కష్టాలు పడ్డాము. పడుతున్నాము. కష్టాలకి తగిన ఫలం - ఆనందం అనుభవించడం లేదే అని మనం ఇప్పుడు విచారించగూడదు. ముందు ముందు మనజాతి అంతా సుఖపడడానికి తగిన పునాదుల్ని మనం వేసి పోతున్నాం సుమా అనేదే మనం పొందవలసిన సంతృప్తి. ఆ సంతృప్తిలోనే మనకు సుఖం వుంది.

' ఈనాడు ఒక కూలీ కష్టపడిందంటే ముందు కాలంలో ఒక కూలీ సుఖపడుతుం దన్నమాట. ఈనాడు ఒక కూలీ అవమానింప బడిందంటే వచ్చే

కాలంలో ఒకామె మహాపతివ్రత కాబోతుం దన్నమాట. ఈనాడు ఒక కూలీ అన్నం లేక ఆకటిచే అల్లాడిపోతూ చచ్చిపోయిందంటే ముందు కాలంలో ఒక కూలీ రాజ్యం ఏలుతుం దన్నమాట. ఇప్పుడు కూలీలంతా దరిద్రులై గుడిసెల్లో కుమిలిపోతున్నారంటే ముందుయుగంలో కూలీలంతా సంపన్నులై చక్కని మేడల్లో సుఖిస్తా రన్నమాట.

' కానీ మనలో ఒక్కటి మాత్రం అవసరం. ఈ దీన స్థితికి విచారమూ, ఉన్నతస్థితికి రావాలనే ఆసక్తీ, పురుష ప్రయత్నమూ, ఇవి ఎంత మిక్కుటంగా వుంటే అంతత్వరలో యీ కూలీల ఇప్పటి స్థితి మారి ఉన్నతస్థితి కలుగుతుంది. నీ అవమానాన్ని గురించి విచారించకు. ఇదొక్క లెక్క కాదు. ఇలాంటి అవమానాలు రోజుకు ఎంత మంది కూలీలు పొందడం లేదు ?' అన్నాను.

నా మాటలు అర్థం చేసుకొన్నది, ఉరడిల్లింది వెంకమ్మ.

' అన్నయ్య గారూ ! మీరు చెప్పిందంతా నిజమే. దేవుడే వుంటే - ఈ కూలీలకు ఇన్ని కష్టాల్నీ - అవమానాల్నీ కలిగించేవాళ్ళకి...'

' ఆగు ఆగు. వెంకమ్మా ! నీవు ఇతరుల్ని నిందించే కంటే నిన్నూ - నీ జాతినీ దీవించుకోవడం మంచిది. ఏమంటావ్ ? ఒక భాగ్యవంతుణ్ణి నీ అధమ స్థితికి తెచ్చే కంటే - నీవు ఒక భాగ్యవంతుడి స్థితికి వెళ్ళడం సంఘానికీ - దేశానికి కూడ ఎంతో శ్రేయం !' అన్నాను. గుడ్లనీరు కుక్కుకుంటూ వెంకమ్మ వెళ్ళిపోయింది.

నీకు లేఖ వ్రాస్తూ వుండగా జరిగిన విషయం ఇది. ఇదే వ్రాశాను. దీన్ని బట్టి నా గ్రామజీవిత విధానాన్ని ఊహించుకో.

గ్రామం ఎవరిది ? నీ పట్నంలో వుండే గవర్నరు దనుకున్నావా ? లేక ప్రధానమంత్రి తాతసొమ్ము అనుకున్నావా ? కాదు - కాదు. గ్రామం మాది. అంటే మా కూలీలది - మా రైతు బిడ్డలది !

' భారత భూమి సౌభాగ్యవంతమైంది ' అంటే ఆ భూమి ఎవరి చెమట బిందువులతో పునీతమైందో ఎరుగుదువా ? ఆ సౌభాగ్యమంతా ఎవరి కష్టపలితమో తెలిసికొంటివా ?

అట్టి కూలీలు - రైతులూ - ఎంతెంతటి నష్టకష్టాలు అనుభవిస్తున్నారో - వాళ్ళు బ్రతుకుతున్నది ఎంతటి దీనపుబ్రతుకో ఎప్పుడైనా చూశావా ?

మా గ్రామాలు మారాలి. దేశసేవ అంటే మీ పట్నంలో వంతెనలు కట్టించుకోవడం కాదు. మీ కార్పొరేషను బిల్డింగులకి మెరుగులు దిద్దుకోవడం కాదు. వేలూ ' లక్షలూ పాలరాతి పాయిఖానాల కోసం ఖర్చుపెడతారే మీ పట్నంలో అది కాదు, దేశసేవ అంటే !

'తెల్ల వారుజామునే లేచి పొలం పోవాలి' అని మా అయ్య కేకేస్తున్నాడు. కనక ఇప్పటికీ ఉత్తరం ముగిస్తున్నాను. తక్కిన విషయాలు వచ్చే లేఖలో వ్రాస్తాను. సెలవు !

★★★

సుహృద్వరా !

" పిల్లికి పీతల మొలతాడు " అంటారు. అంటే ఏమిటో తెలుసా ?-

లేతగా వూడ్చిన పంపు మూనతిరిగిందో లేదో చూచి వద్దామని సాయంకాలం పొలం బయలుదేరాను. రోజంతా వర్షం కొట్టి కొట్టి అప్పుడే తెరిపి ఇచ్చింది.

తేలుకుట్టిన దొంగల్లాగ అప్పటిదాకా ఇళ్లలో అణిగి మణిగివున్న పిల్ల కాయలంతా ఎగబడ్డారు పొలాల్లోకి. అప్పటి దాకా పాకలలోనూ - పంచలలోనూ- కట్టివేసిన వుంచిన పశువుల్ని విప్పి కంచెలికి తోలుతున్నారు పాలేళ్ళు.

ఆ దృశ్యాన్ని వొకసారి చూశావా ? చాలా అందంగా వుంటుంది. విడీవిడనీ మేఘాలు - వచ్చీరాని తుంపర్లూ- కాసీకాయని యెండా - మేసీమేయని పశువులూ - తిరిగీ తిరగని మనుష్యులూ.

నిండు భాద్రపద మాసం, బోదెలూ- కాల్వలూ- వుప్పటేర్లూ -చెరువులూ -పొలాలూ - గట్లు మునిగి పొర్లుతూ వున్నై. ఏపు గుల్కుతూ సస్యాలు మనోహరంగా వున్నై.

కాలవల్లో ఈతలు కొట్టేవాళ్ళూ - చెరువులలో గేలాలు కాచేవాళ్ళూ - బోదెలలో ఎదురెక్కే చేపల కోసం ఆరాట పడేవాళ్ళూ.

నేను ఒక చిన్న పిల్ల కాలవ దాటి చేలోకి పోయాను. కంది బెండచెట్లని మెల్లి మెల్లగా ఒత్తిగించుకొంటూ - చేల చుట్టూ తిరుగుతున్నాను.

ఇంతింత హాయి - ఆహారం మా పల్లెటూళ్ళు రాసులు రాసులుగా పంట పండేస్తున్నాయే ! ఇంతకంటే మా కిం కేం కావాలి ?

ఏం కావాలి ? - అంతా కావాలి. ప్రశాంత జీవనం, ప్రకృతి సౌందర్యం, ఇవి తప్ప - సమస్తమూ కావాలి.

పంటలు సమృద్ధిగా పండుతున్నాయి - కాని మాకు దక్కడం లేదు. ఫలాలు పండుతున్నాయి - అవి ఏమైపోతున్నాయో !-

ఏమైపోతున్నాయి ? మీ పట్నాలకు పోతున్నాయి. పండించేది మేము - అనుభవించేది మీరు. కష్టపడడం మా వంతు, దాని ఫలితం తినేయడం మీ వంతు.

మేము జీవనాధారమైన అమృతాన్ని సేద్యం చేసి మీకు అందిస్తున్నాం. తిరిగి మీరు మాకు ఏమి ఇస్తున్నారు ? ఎందుకూ పనికిరాని - పైగా జీవితాన్ని తికమకలు పెట్టే - వెదురుబద్దల విమానాలు, కాగితాల బుట్టలు, కాఫీ, కప్పులు సిగరెట్లు, బీడీలు, మా నెత్తి మీద రుద్ది మా చేతుల్లో ఆడే నాలుగు రాళ్ళూ గుంజేస్తున్నారు. పట్నాలు పల్లెటూళ్ళకు చేస్తున్న మేలు ఇదే కదూ ?

మా చక్కటిపంట అంతా తేలిగ్గా కాజేసుకోవడం - బూచి బూచి బొమ్మలు మా కంటగట్టడం.

' మీ రైతుల - కూలీల - మీద మేం అధికార్లం ' అని దబాయించడం, వందలూ - వేలూ - జీతాలు తీసుకోవడం, బస్తీల్లో కూర్చుని సర్వభోగాలూ అనుభవించడం.

ఎవళ్ళనోళ్ళూ కొట్టక ఎవళ్ల కడుపులూ మాడ్చక ఎవళ్ళ ఇళ్ళూ దోచకపోతే - మీ వేషాలకూ - మీ విహారాలకూ - డబ్బు ఎక్కడినుంచి వస్తుంది ?

ఇదంతా మీ పట్నాల్ని నిందించడం కాదు. ఒకళ్ళని నిందించడం నా చేతనేకాదు. మా గ్రామాల్ని చూస్తూ కంట తడిపెట్టుకొంటున్నాను. మా అమాయికత్వానికీ - అల్పజ్ఞతకూ ఏడుస్తున్నాను. పట్నమే దేవలోకం అనీ - పట్నవాసులే దేవతలు అనీ - అనుకొనే ఈ గ్రామీణుల వెర్రి బాగులతనానికి సంతసిస్తున్నాను.

గ్రామ పునర్నిర్మాణం జరగాలి. -

"అలనాటి ఋషివాటికల నుండి పరతెంచు
ఆమ్నాయపూత గంగామృతమ్ము- "

ఇప్పుడు పట్నాల్లో మురికి కాల్వలగుండా ప్రవహిస్తూ వుంది. అలా పనికిరాదు. విజ్ఞాననిధులకు గ్రామవాటికలే ఆటపట్లు కావాలి. ఇది సాధించాలి.

ఈ లేఖ నీకు గ్రామపునర్నిర్మాణం మీద వ్రాయాలనుకొన్నాను. ఒక్కటే కాదు. చాలా లేఖలు వ్రాయాలి, నీ అభిప్రాయాలు కూడా కోరదా మనుకొన్నాను.

ఇలా అనుకొంటూ చేల చుట్టూ తిరుగుతున్నాను. నా యీ ఆలోచనల్లో పడిపోయి ప్రపంచమే మరచిపోయాను. వూరికే యంత్రం లాగ తిరుగుతున్నా నన్నమాటే గాని – చూచినా కనబడ్డం లేదు – చెవివొగ్గినా వినబడ్డం లేదు.

అంతలో ఒక కుర్రాడు కెవ్వున కేకేశాడు. ఉలిక్కిపడి చూచాను. స్వప్నం నుంచి మేలుకొన్నట్టు అయింది. నా కళ్ళముందటి నుంచి ఒక పెద్దతెర తీసివేసినట్లయింది.

మిత్రమా ! ఇలానే అనుభవిస్తున్నారు గ్రామవాటికల ప్రశాంత సౌఖ్యజీవనం గ్రామవాసులు. తమ నిరంత కష్టాల్లో పడిపోయి దరిద్ర దేవత నిశితదంష్టికల్లో చిక్కుకొని, తమ దుస్థితికి దేవుడ్డీ – దెయ్యాన్నీ – తిట్టిపోస్తూ – ఎందుకో ఒకందుకు ఎప్పుడూ ఆరాటపడుతూనే వుండే గ్రామీణులు సౌఖ్యం ఎలా అనుభవించగలరు ? వారి చుట్టూ మిసమిసలాడుతూ తాండవించే ఈ ప్రకృతి సౌందర్యాన్ని యెలా గ్రహించుకో గలరు ? ఎలా ఆనందించగలరు ?

కష్టాలు పడేవారికి ఎప్పుడూ తన కష్టాల మీదే వుంటుంది ధ్యాస. దుక్కి దున్నేవాడికి, నాగలి చేయడంలో వడ్రంగి చూపిన పనివాడితనం కనిపిస్తుందా ? ఎద్దు కొమ్ము వంపులలో వుండే ఆ సొగసుదనం ఆనుతుందా ? తన వెల్లగిత్తల నల్లతోకలు – నేటి కాలేజీ అమ్మాయిల కుచ్చుజడలను జ్ఞప్తికి తెస్తవా ? ఎక్కడి మాట ?

కష్టపడే వాడికి కళ – సౌందర్యం కనబడవు. ఒక దరి నుంచి వాడి శరీరం నలిగిపోతూ వుండె – పేగులు కాలిపోతూ వుండె – ఆయాసం వస్తూ వుండె – తల తిరిగిపోతూ వుండె – అతని కళా, సౌందర్యమూనా కావలసింది ?

' ఏమబ్బాయ్ ! భేర మన్నావు ?' అన్నాను, ఆ కుర్రాళ్ల దగ్గిరకి పోయి. అతని చేయి రక్తం కారుతోంది. పాపం ఆ కుర్రాడి చెక్కుల మీద ఇంకా కన్నీటి చుక్కలు రాల్తూనే వున్నై. ఏం జరిగిందో చెప్పకుండానే అంతా అర్థమౌతూంది. ఆ ప్రక్కనే యేనాది కుర్రాళ్ళు మండపీతల్ని పదుతున్నారు. పీత కన్నాలలో పేడనీళ్లు పోసి – పీతలు బైటికి రావడం తోనే పట్టుకొంటున్నారు. పీతతో వేళాకోళం ఆడబోతే వూరుకుంటుందా ? వేలు కత్తిరించింది.

అయినా ఆ కుర్రాడు దాన్ని వదల్లేదు. 'వదిలెయ్యి' అన్నాను. 'ఉహు' ని తల వూపాడు.

'మనం తినే వస్తువు ముందు మనల్ని కరిస్తే నేం ? ' అన్నాడు.

ఔను నిజమే. చాలా మంచి సిద్ధాంతం. ఈ సిద్ధాంతమే కదా మహాత్ముణ్ణి నడిపిస్తుంది ? మనం అనుభవింపబోయే సంపూర్ణ స్వరాజ్యం ముందు మనల్ని ఖైదులలోకి నెట్టిస్తే నేం - లాటీలతో కొట్టిస్తేనేం ? అణువు దగ్గిర నుంచి అంతరాళం దాకా - పీతల్ని పట్టడం నుంచి పృథ్విని పాలించడం దాకా - ఈ సిద్ధాంతం అక్షరాలా అనువర్తిస్తూంది !

కష్టాలు కలగాయంటే అవి సుఖాలకి జేగంట లన్నమాట. దుఃఖం కలిగింది అంటే అది ఆనందానికి ప్రార్థనాదికం అన్నమాట.

ఆ చేలన్నీ వర్షపు నీటితో మునిగిపోయి వున్నై. మహా ప్రవాహంగా కొట్టుకుపోతున్నది. ఆ పైనుంచి ఒక ఉప్పుటేరు పారుతున్నది.

' అదంతా వర్షం నీరేనా ! ' అన్నాను.

' కాదు. పెద్ద కాలవ గండి పడింది. పాపం - సుబ్బా రాయుడిగారి పొలం అంతా కొట్టుకుపోయింది ' అన్నాడొక కుర్రాడు.

' మొన్ననే కదా పదివేలు పోసి గట్టు పోయించారు సర్కారువారు ' అన్నాను.

' పదే కాదు, పదొందలు కాదు, పది రూపాయిలైనా దానికి ఖర్చు పెట్టలేదు' అని జవాబిచ్చాడు.

సఖా ! ఇలా వున్నారు గ్రామదేవతలు. ' మన - రావుగారే కదా కంట్రాక్టరు ? గ్రామ సౌభాగ్యం కోసం ఎంతో భారం నెత్తిన బెట్టుకొని మోస్తున్నానని చాటుకొంటాడే ఆయన ? '

' ఔనండి. ఆయన చాలా భారం మోస్తున్నాడు. ఆ మోత అంతా పిల్లికి పీతల మొలత్రాడు మోత లాంటిది.

పిల్లికి పీతలమోత ! యెంతమంది సంఘు సేవకులు ఇలాంటి మోతలు మోస్తున్నారో కొంచెం ఆలోచిస్తే గుండెలు (వున్నవాళ్ళకి) బ్రద్ధలై పోతాయి.

పిల్లికి పీతల మోత లాంటిది !

' అయితే ఆ డబ్బంతా అతడు తినేసినట్టేనా ? ' అన్నాను.

' ఏం – చేదా ! ' అన్నా డతడు.

' మీ రెందుకు వూరుకున్నారు ! '

' వూరుకోక ఏం చేసేది ? ఇత డొక్కడేనా ? ఇలాంటి వాళ్ళెంత మంది ప్రజల డబ్బు తినేయడం లేదు ? పైగా అతడు మంచి మోతుబరి. ఎదిరించి అడిగితే– అడిగినవాళ్ళ కొంపలు గంగలో కలుస్తాయి. '

అన్యాయం జరుగుతుంటే కళ్ళారా చూస్తారు. చూస్తూ వూరుకొంటారు. ముందుకు వచ్చే ధైర్యం లేదు. ఎదిరించే సాహసం లేదు. ఇలా వున్నాయి నేడు పల్లెటూళ్ళు. ఇట్టి దుస్థితిలో వున్నారు గ్రామవాసులు. వీరా స్వరాజ్యం తెచ్చే యోధులు ?

ఉహూ ! లాభం లేదు గ్రామాలు – ఇప్పుడున్న స్థితిలో స్వాతంత్ర్య సమరానికి పనికిరావు. పునర్నిర్మాణం జరగాలి. ప్రజల్లో మిలటరీ స్పిరిట్ వృద్ధి చేయాలి. మిలిటరీ డిసిప్లిన్ అలవరచాలి. అన్యాయాన్ని ప్రతిఘటించే ధైర్యం పెంపొందించాలి. అప్పుడు గాని ప్రజలు సైనికులు గాజాలరు.

ఇప్పుడు కాంగ్రెస్ పునర్నిర్మాణానికి పూనుకున్నది. అయితే దేశంలో కాంగ్రెస్ బలం ఎంత ? 35లక్షలు ! 37 కోట్లమంది గల దేశంలో కాంగ్రెస్ బలం 3 లక్షలు మాత్రమే. కోటి కొక లక్ష అంటే నూటికి ఒక్కడు. తక్కిన మంది మటా?

ఇలాంటి పీతల మోత మోసే పిల్లులు చాలామంది సర్వత్రా వున్నారు. ఇలాంటి పిల్లుల్ని మనం లొంగదీయకపోతే రెచ్చిపోయి గ్రామాల్నే కాదు, పట్టణాల్ని గూడా నాశనం చేస్తారు.

★★★

ప్రియసఖా !

వసంత కాలం వచ్చింది. కలకల్లాడుతూన్నై మా పల్లె తోటలన్నీ. ప్రకృతి కాంత సౌందర్యం చిందుతూ నర్తిస్తూంది.

మ్రోళ్ళు చిగిర్చినై, రాళ్ళు చెమర్చినై, వైకుంఠం లాగ నేత్రపర్వం చేస్తూన్నై, పైరుపొలాలు. కాని, మా బ్రతుకులు ఎలా వున్నై అనుకొన్నావు ?

తరతరాల నుంచీ వస్తూన్న మా దరిద్రం దరిద్రం లాగే వుంది, పెనుభూతాల్లాగ మమ్మల్ని చుట్టుకొని వున్న మా కష్టాలు కష్టాల్లాగే వున్నై.

మా ఆకలిమంట మండుతూనే వుంది. మా ఏడ్పుగతి ఏడుస్తూనే వుంది.

శరీరానికి క్షయ లాంటిది జీవితానికి పేదరికం. దీన్ని చైత్రకాలం చిగురింపజేయనూ లేదు, వర్షాకాలం ఉప్పొంగించనూ లేదు.

ఇక క్షీణించి పోవలసిందేనా మా జీవితాలు ? ఈ కూలీ మ్రోళ్ళని చిగిరింపచేసే కాలమే - అవకాశమే - లేదా లోకంలో ?

విరబూసిన ఉద్యానాలలో విహరిస్తున్నారు, విదేశం సిల్కు వేషాలతో భాగ్యవంతులు ఒకప్రక్క. మాసిన మొల దిరగని ముతక పేలికలతో, అభిమానాన్ని సిగ్గుపరుస్తూ పొలాల్లో కష్టిస్తున్నారు పేదకూలీలు మరోప్రక్క.

మనోహరం అయిన మామిడితోపులో చల్లని ఒక కాసారం వొడ్డున కూర్చుని ఆటపాటలతో వినోదిస్తున్నారు భాగ్యవంతుల బిడ్డలు ఒకప్రక్క. ఆ మండే ఎండలో తహ తహ లాడిపోతూ చినిగిన తువాళ్ళు నెత్తిపైని కప్పుకొని పశువుల్ని కాస్తున్నారు కూలీబిడ్డలు మరోప్రక్క.

ఈ రెండు ప్రక్కలికి మధ్యనొక గట్టు వెంబడే పోతున్నాను నేను నిన్న సాయంకాలం. స్వతంత్ర్య జీవనం కోసరం వెతుకుతున్నాను కానూ ? ఆ వెతికే త్రోవల్లో ఇదోటి.

స్వతంత్ర జీవనం - స్వతంత్ర జీవనం - అని పలవరిస్తూంది, నా గుండె.

నాలాంటి ఒక మానవుడికి నేను లొంగి ఎందుకు పని చేయాలి ? వ్యర్థంగా నేను ఎందుకు ఈ దరిద్రం అనుభవించాలి ? నాలాంటివాళ్ళు మేడలలో వుంటే. నేను ఎందుకు ఈ పూరిగుడిసెలలో ఏడవాలి ? వాళ్ళు సుఖంగా వినోదిస్తూ వుంటే, నేను ఎందుకు చెమ్మట వోడ్చి కృశించాలి ?

ఈ ప్రక్క వినోదించే యీ భాగ్యవంతుల బిడ్డల్ని చూచి, ఆ ప్రక్క మాడే ఆ కూలీబిడ్డలికి ఏమైనా ఉద్దేశాలు గలుగుతవా ? తమ గతిని గూర్చి తాము ఆలోచించుకుంటారా ? ఈ అసమత్వానికి కారణం యోచిస్తారా ? పోనీ - ఆశ్చర్యం అయినా పడతారా ?

ఇలా చింతించుకొంటూ సాగిపోతున్నాను నేను. ఈ అసమత్వానికి కంతకీ

సంఘం చేస్తూన్న దౌష్ట్యం అనుకొంటున్నాను - కారణం. రెండు ప్రక్కలా చూస్తున్నాను ఈర్ష్యతో.

ఇలా వుంటే సంఘమంతా ! ఈ పచ్చని సౌభాగ్యంతో అలరారుతూ వుంటే !

ఆ ప్రక్కనవున్న ఎముకలగూడు ఆకారాలు పుష్టి చెంది ఈ ప్రక్కన వున్న సుందరస్వరూపాలుగా మారిపోతే ! ఆ ఎర్రటి ఆకటికళ్ళు ఈ శీతల తరళ నేత్రాలుగా అయిపోతే !

ఆ ఎండలో ఎండే దీనగతి మాసిపోయి ఈ శీతలచ్ఛాయలలో సుఖం పొందే సుగతిగా పరిణమిస్తే !

ఎలా వుండేది మానవసంఘం ?

అలా మారడం సాధ్యమా ?

కాలికి ఒక కందిమోడు తగిలి వ్రేలు పగిలింది. నేను పోతూ వున్నది కంది మ్రోళ్ళ దారి అని అప్పుడు తెలిసింది నాకు, స్వప్నం లోంచి మేలుకున్నట్టు.

రక్తాన్ని పచ్చగడ్డికి తుడిచేసి రెండు గడ్డిఆకులు తుంచి కట్టు కట్టాను.

గాయం మండుతూంది కాని, నా హృదయం మంటని అది మించలేదు. అందుచేత నా ఆలోచనలలో నేను పడి కొట్టుకు పోతున్నాను.

ఆ కూలీపిల్లలు ఈ ధనవంతుల పిల్లల్ని చూస్తున్నారు. చూస్తూ 'అది వారి పూర్వ పుణ్యఫలం. ఇది మన పూర్వ పాపఫలం' అనుకొంటూన్నట్లున్నారు. ' వీరిలాగ సౌఖ్యం అనుభవించగలం' అనేది వారి వుద్దేశం లోనే ఉండదు - 'అనుభవించాలి' అనే ఆశ కూడా వుండదు.

ఆ అశను వారికి కలిగిస్తే ? తమ దీనస్థితికి అసంతృప్తి పడేలాగ వారిని చేస్తే ? ఆ అసంతృప్తి విప్లవాన్ని కలిగించి తీరుతుంది. అది ఫలకారి కాకపోతుందా?

సాయంత్రం పడేకొలదీ ప్రకృతి రామణీయకం అధికమౌతోంది. చిలకలూ-గోరింకలూ కిలకిలారింత లాడుతూన్నై. కొమ్మల ఒడులలో కూర్చుని కోయిళ్ళు ముద్దులు పెట్టుకొంటూన్నై.

చెదరిపోయే పశువుల్ని అదలిస్తూ కూడగట్టుకొంటున్నారు పశువుల కాపర్లు.

చేయి వారాపెట్టి - పడమర చూచి - ఏదో మాట్లాడుతూంది ఒక కూలీపడుచు

కామందుతో. 'చీకటి పడిపోతోంది - పిల్లాడు ఏడుస్తూంటాడు - బాబు ! వెళ్ళి - వండి - గంజికాచుకోవాలి - పోనిస్తురా ?' అని అడుగుతోన్నట్టుంది.

'వీల్లేదు' అన్నట్టున్నాడు కామందు - పాపం మళ్ళీ పనిచేస్తుంది ఆయమ్మ దీనంగా.

పశువుల్ని కూడగట్టుకొని నాదారికే వస్తూన్నాడు ఒక కుర్రాడు.

ఏదో అనమోయాడు - కాని గొంతుక రాలేదు. మళ్ళీ అనమోయాడు - మళ్ళీని ... ...

'కో' అన్నాడు కడకి. 'కో' అని కూస్తూంది ఈ ప్రక్క మామిడిచెట్లలో ఒక కోయిల. దాన్ని వెక్కిరిస్తూన్నట్టున్నాడు.

'కో' అంది కోయిల, 'కో' అన్నాడు కుర్రాడు.

ఆ కంఠం సంస్కారం పొందింది పాడడంలో. ఈ కంఠం సంస్కారం లేంది.

'కో' అంది కోయిల, 'కో' అన్నాడు కుర్రాడు.

దానికి పాడడమే పని. ఇతనికి నిత్యమూ ఎండల్లో మాడడమే కర్మం.

ప్రొద్దుటినించీ అది ఆకుల నీడలలో కూర్చుంది భాగ్యవంతుల బిడ్డలాగ. కమ్మని చిగురాకులు తింటూంది. తీయని పూదేనె త్రాగుతుంది.

మరి ఇతడో ?

ప్రొద్దుటే పోయాడు పశువుల కూడా పొలంలోకి - చల్ది గంజి త్రాగి ఆ ఎండలలో మాడాడు పగలంతా. గొంతు ఆర్చుకుపోతోంది. ప్రేగులు మండుతూన్నై. ఆకలి పేల్చేస్తూంది.

ఆ పిట్ట దూకుతుంది. చెట్టు చెట్టుకీ - కలవాళ్ళ యింటి ముగ్ధ లాగ. ఈ బిడ్డ నడుస్తున్నాడు నిస్సత్తువగా - శవం లాగ - పశువుల వెనకాల.

'కో' అంటూంది కోయిల. 'కో' అంటున్నాడు కుర్రాడు - మానకుండా - పట్టుదలతో.

పందెం వేడుక చూపు చూస్తుంది కోయిల. కాని - లంక మిరపకాయల కారం చూపు చూచుకొంటున్నాడు కుర్రాడు తన దుస్థితి వంక. అలవాటుగా కోయిల కూతకి 'కో' అంటూన్నాడే గాని తన దృష్టి అంతా తన దీనగతి మీదే వున్నట్టు కనపడుతున్నాడు.

ఎప్పుడు ఇంటికి పోదునా - ఎప్పుడు కాసిన్ని వెణ్ణీళ్ళు కంఠంలో పోసికొందునా - లాక్కుపోయే కాళ్ళని, పీక్కుపోయే శరీరాన్ని, ఏ పంచనో ఎప్పుడు చేర్తునా - అని ఆత్రంతో తోల్తున్నాడు పశువుల్ని.

కోయిల గొంతు పెగిలిపోతోంది. కుర్రాడి గొంతు సన్నగిలుతోంది. అన్యధా ఎలాగ ? గొంతులో తడేదీ ?

'కోకోకో' అని ప్రారంభించింది కోయిల. కళ్ళెర్ర జేసి దాని వంక చూచాడు.'

అబ్బాయీ !' అన్నాను. 'దానితో పందెం ఎందుకు ? దాని కేం ? అది సుకుమారి.'

'నేను కష్టజీవిని' అన్నా డతడు. 'నా మాట ముందు సాగాలి - నేను పందెంలో గెలవాలి'

సభా !

'... చావలేదు, చావలేదు, ఆంధ్రుల మహోజ్జ్వల చరిత్ర. '

అన్నమాట నాకు గప్పున జ్ఞాపకం వచ్చింది-

' కూలీలు పూర్తిగా దాస్యానికి అలవాటైపోలేదు. అలా అలవాటైపోవటం కూడా మానవ స్వభావం కాదేమో, యే మూలనో ఒకమూల స్వేచ్ఛాలేశాలు నెరుస్తూనే ఉంటవి. వాటిని ప్రజ్వలింపచేస్తే విజయం సుసాధ్యం' అని అనుకొన్నాను-

' నేను గెలవాలి' అన్న పట్టుదల యువకునికి స్వభావం. ఆ స్వభావాన్ని 'నీవు గెలవ లేవు' అన్న అభాసంతో కప్పేస్తున్నారు పెద్దలూ - పాలకులూ.

' నేను గెలవాలి ! '

ఎంత చక్కని సిద్ధాంతం !

' కోయిల పందెంలో నేనా - అన్ని విషయాలలోనూ నా ? ' అని ప్రశ్నించాను.

తేరి నా మొగం వంక చూచాడు. నా ప్రశ్న అర్థం అయినట్టుంది. '

' అన్ని విషయాలల్లోను. కాని - ' అని ఆగాడు. పెద్దల చాకిరి కంపు అప్పుడే కొట్టినట్టుంది పాపం ఇతడికి.

' కాని... ? '

తన కామందును తప్ప తక్కిన ప్రపంచాన్ని అంతనీ ఎదిర్చి గెల్చేలా కనిపించింది ఇతని మౌనం.

మిత్రమా ! కామందు అంటే ఎంత భయం అనుకొన్నావు ? తిండి పెట్టక మాడ్చడమే కాకుండా చావదన్నుతాడు అతణ్ణి ఎదిరిస్తే - గత్యంతరం కనబడదు.

ఇలాంటి కోయిల పందాలతోను - గుర్రం పందాలతోను తీరిపోతోంది ' నేను గెలవాలి ' అన్న ఆకాంక్ష. ప్రత్యక్ష ప్రపంచాన్ని ఎదుర్కొనేటప్పటికి వీరిలో ఇక మిగిలివుండేది వొక పిరికితనమే - నీరసం- నిస్పృహ.

కోయిల అలానే కూస్తుంది దూరంలో. అది కూసినప్పుడల్లా చెవులు నిక్కించి వింటూనే వున్నాడు యీ కుర్రాడు. తిరిగి తిరిగి చూస్తూనే వున్నాడు.

మన జాత్యాభివృద్ధిని పెద్దలూ - పాలకులూ - అరికడుతున్నా రనడం నిజం. 'నీవు ఎందుకూ పనికిరానివాడివి' అని మొదటి నుండి నేర్పేస్తారు పిల్లలకి. అలా నమ్మిస్తారు. తమలాగే దాసానుదాసులుగా తయారు చేస్తారు.

ఈ ఘోరం మా కూలీ తెగలో మరీ ఎక్కువ. పిల్లవాడు నడవడం ప్రారంభించగానే పాలేరుతనాలకి తోల్తారు. ఐదు సంవత్సరాల ప్రాయంనుంచే ఆర్జన ప్రారంభిస్తాడు మగవాడు. ఏభై సంవత్సరాలకీ అదే అర్జన. పెరగదు గొర్రెతోక లాగ !

'నీవు పాలేరుతనానికే పుట్టావు, కామందు ఏమి చెప్పితే అది చేయాలి. ఎదిరిస్తే పాపం' అని నేర్పుతారు, అదే చదువు వాళ్ళకి -

మేము పల్లె చేరుకొనేటప్పటికి చాలా చీకటైపోయింది. మన్నూ, మిన్నూ ఏకం అయిపోయాయి-

' ఇప్పుడేమి చేయాలి నీవు ?' అని అడిగాను -

' దూడలని కట్టివేయాలి, పాలు పితకాలి, గడ్డి వేయాలి, దూడలు పాలు విడిచిందాకా వుండాలి- ఇంట్లో కామందురాలికి పనులు చేయాలి- వారు పొమ్మన్నదాకా పోగూడదు' అన్నాడు-

' భోజనం కామందుల ఇంటి దగ్గరేనా ?' అన్నా-

' కాదు - ఎప్పుడైనా పెడితే పెడతారు. కాని పెట్టాలి అని లేదు. మా అమ్మ వుంది - ఉంటే తింటాం - లేకపోతే పడుకొంటాం మాటాడక ' అన్నాడు - ' దూడలు పోతోన్నై - వెడతాను అని చెప్పి వెళ్లిపోయాడు.

రక్తం పిండిపోస్తారు తమ కామందులికి. కాని అంత రక్తాన్నీ తిరిగి పుచ్చు కోవడం చేతకాదు.

నడిచి పోతున్నాను చీకట్లో . కాని అడుగు అడుక్కీ గుండెలలో గ్రుచ్చుకుంటూన్నై ఆవేదన్లు. ఆ కుర్రాడి 'నేను గెలవాలి' అనే పట్టుదల ఎలా నాశనమైపోతోంది !

ఈ ప్రక్క సౌభాగ్యాన్నీ, సౌకుమార్యాన్నీ చూచి – ఆ ప్రక్క ఆకలిమంటలూ, అస్తిపంజరాలూ ఏల కంటగించుకోవడం లేదు ?

' ఈ సాంఘికాంతరాలు మాకు కిట్టవు. ఒకళ్ళ క్రింద మేము చాకిరీ చేయలేం ' అని ఎదిర్చిన తక్షణం కూలిపోవేం ఈ కుల తత్వాలు ?

కాని – ఈ తిరుగబడే శక్తి అరికట్టబడుతోంది. అబలత్వం అలవడుతోంది. అబలత్వానికి స్వార్థం సైదోడు. ప్రపంచానికి తాను పనికిరాననుకొన్నవాడు తనకి తానైనా పనికిరావడానికి ప్రయత్నిస్తాడు. తనకు తానూ పనికిరాలేని వాడు కుత్సితమార్గాలు అవలంభిస్తాడు.

ఈ కుత్సితమార్గాలే ప్రపంచంలో మెజారిటీ ఇప్పుడు – అయితే, ప్రపంచంలో మెజారిటీ అబలులేనా అని అడుగుతావు – ఔను అని జవాబిస్తాను – లేకపోతే ప్రపంచంలో మెజారిటీ దరిద్రులై వుండి కూడా ధనస్వాముల నిరంకుశత్వాన్నీ – క్రౌర్యాన్నీ సహించుకోగలరా ? మైనారిటీ భోగలాలసులై వుండడానికీ – మెజారిటీ రెక్కలు ముక్కలు కొట్టుకొంటూ చేతికి నోటికీ అందకుండా బ్రతకడానికీ – కారణం వూహించుకోకుండా వుండగలరా ?

నేను నా మిత్రుడి ఇంటికి పోయేటప్పటికి అందరూ పండుకొనేవేళ అయింది. గూటిలో కిరసనాలు బత్తీ వెలుగుతోంది. ఆ వెలగులో ఏదో చూస్తున్నారు భార్యా భర్త లిద్దరూ.

సాయంకాలం రెండుగంటలకి ఇంటి దగ్గర బయలుదేరాను. ఈ మధ్య సంగతులన్నీ ఆ యిద్దరికీ వినిపించాను. ఆ వినిపించనవి వినిపించినట్టే నీకు వ్రాస్తున్నాను. వారు పొందిన భావాన్నే నీవూ పొందుతావని నా ఆశ.

ఇక సెలవు.

★★★

ప్రియసఖా !

నీ లేఖ చాల చిత్రంగా వుంది. కాని ప్రస్తుత సాంఘిక విధానానికి అనుగుణ్యంగానే వుందనుకొంటాను.

నీ బాకీదారులు బాకీలు చెల్లించుట లేదని నీవు ఆగ్రహిస్తున్నావు. మా పెట్టుబడిదారులు మాటి మాటికీ అడుగుతున్నారనీ, వేధిస్తున్నారనీ మేము వ్యధచెందుతున్నా. కోక ఎరువిచ్చి పీట పట్టుకొని కూడ కూడా తిరిగినట్లు వుందని నీవు విసుగుకొంటున్నావు. కష్టపడి, పనిచేసి, పండించి ధనముగా మార్చి, వారి యింట్లో మూట గట్టి, వట్టి చేతులతో ఇంటికి వచ్చి , పస్తులు పడి చావవలసి వస్తోందని మేము పరితపిస్తున్నాము. చూస్తివా పట్టణాలకూ పల్లెలకూ, ధనికులకూ, దరిద్రులకూ మధ్య వున్న అంతర మెట్టిదో ? ఇట్టి పరస్పర విద్వేషాలతో సంఘం ఎంతకాలం ప్రశాంతంగా వుండగలదంటావు ?

నీవు మా వూరు వస్తే ఏ రైతు నోటంటా 'ఋణభారం' అన్నమాటే పదేపదే వింటావు. ఏ కూలీ నోటంటా ' అప్పు' అన్నమాటే నీకు వినబడుతుంది.

పనులు చేస్తున్నప్పుడూ ఋణాల గురించే, ఇంటి దగ్గర తీరుబడిగా కూర్చున్నప్పుడూ ఋణాల గురించే, మాట్లాడుకొనేటప్పుడూ ఋణాల గురించే చెప్పుకొని విచారిస్తూ వుంటారు ప్రజలు. విచారించి ఏమి చేస్తారు ? విచారంలోనే నవ్వుకొంటూ వుంటారు. ఆ నవ్వులు పెదవులు దాటి రావు.

' ఋణాలంటే మనకొక్కళ్ళకే కాదు. లోకంలో అందరికీ వున్నై ' అన్నాడు ఆ మూలగోడకు జేరబడి ముసుగు పెట్టుకొని కూర్చున్న ఒక వ్యక్తి.

' రాజూ ! వున్నాయా ? లేవనుకొన్నాను. ఒక్కపూటైనా నోటికి ఉప్పగా భోజనం చేయని మనవంటి దరిద్ర బ్రతుకులు ఇంకెక్కడైనా వుంటాయా ?' అన్నాడు ఒక రైతు చుట్ట కాల్చుకొంటూ చింతచెట్టు వేరు మీద కూర్చుని.

ముడ్డిక్రింద వేసికొన్న చెప్పులజోడు సర్దుకొంటూ రాజు 'వున్నాయి. ఎందుకు లేవు ? దమ్మిడీ అప్పు పెట్టి నక్కను ఎన్ని తిప్పలు పెట్టింది భూదేవి ?'

' ఎక్కడి నక్కా? ఎక్కడి భూదేవి ? ఏదీ చెప్పు కాస్త వింటాం. చెప్పు చెప్పు. కథ వింటూ అయినా కాసేపు కష్టాలు మరిచిపోవచ్చు. '

రాజు కథ మొదలుపెట్టాడు. ఆ కథ నీవు వినదగిందే, కొంచెం చెపుతాను విను. పల్లెటూళ్ళ దీనులు కష్టాలు మరిచిపోవడానికి కష్టాల కథలే చెప్పుకొంటారు.

'ఒక నక్క వుందిట - దానికి భూదేవి ఒక్క దమ్మిడీ అప్పు పెట్టిందట. అప్పు పెట్టి ఎక్కడ పడితే అక్కడ నా దమ్మిడీ ఇవ్వవూ ?' అనడం మొదలెట్టింది భూదేవి నక్కను '

' మన పెట్టుబడిదారు లాగ. '

' ఈవేళ మాయింటికి వచ్చాడు. వాడి బాధ ఎవడు పడతాడని ఇంట్లో వుండి 'లే' డనిపించాను. '

' నీవల్లా గన్నా చేశావు - పాపం ఆ నక్కగతి చూడు. నీలాగే తప్పించుకోవాలని అదే పరుగున కొండ మీదకు పరుగెత్తింది. '

' పోని తప్పించుకొంది. '

ఈ రైతు ఎంత అమాయకుడో అని నాకు నవ్వు వచ్చింది. నవ్వాను. అందరూ నావంక చూశారు.

' పట్నాలు తిరిగి వచ్చిన పిల్లాడికి మన పల్లెటూరి కథలు బాగుంటావా ?' అన్నాడు రాజు.

' మీ కథకు కాదు నేను నవ్వుత. ఎంతో దీక్షతోటి వింటున్నాను ' అని నమ్మకంగా అన్నాను.

' అక్కడ మాత్రం భూదేవి లేదూ? అక్కడా అడిగింది నా దమ్మిడీమాట ఏమి చెప్పావు ?' అని.

' భూదేవి దగ్గరనుంచే గామోసు నేర్చుకొన్నారు ఈ పెట్టుబడిదార్లంతాను బాకీదారుల్ని వేపుకతినడం. '

ఎక్కడ పడితే అక్కడే అడుగుతుంది దమ్మిడీ. నక్కకేమీ తోచిందికాదు పాపం. ఒక జొన్నచేనుకు అడ్డంపోతుంటే ఒకజొన్నకాడ కంట్లో గ్రుచ్చుకొని కన్ను పోయింది.'

' పాపం-మన సుబ్బన్న అప్పులవాళ్ళ బాధ పడలేక పట్టణం పారిపోయి రైలుకిందబడి చచ్చినట్టు !'

' కన్ను పోయి నక్క యేడుస్తుంటే-'నా దమ్మిడీ ? ' అన్నది భూదేవి

' నాలుగు తన్నవలసింది భూదేవిని. నేను దగ్గిర వుంటే ఆ పని చేసే వాడిని ' అన్నాడు ఒక యువకుడు.

'ఎవరి కష్టాలు ఎవరికి తెలుస్తవి ? ఆ దమిడ్మీవల్ల భూదేవికి ఏమీ కాదు, కాని పాపం ఒక జీవనాన్ని మాత్రం ఏడిపిస్తుంది'

' నక్క మనలాగ తెలివితక్కువది కాదు. జిత్తులమారి. ఏమన్నదో చూడండి- నీవు మంచినక్కకు పెట్టావా, గుడ్డి నక్కకు పెట్టావా, అప్పు ? అన్నది.

' బలేగా అన్నది. '

' మంచినక్కకే' అన్నది భూదేవి. '

' ఐతే నేను గుడ్డినక్కను. నన్ను అడుగుతావేం? ' అన్నది నక్క

' మంచి పని చేసింది నక్క. భూదేవి పని అయింది ' ఈ విధంగా అందరూ అప్పు ఎగగొట్టిన నక్కను మెచ్చుకొన్నారు. అంత మెప్పు పొందిన నక్క గుడ్డిది ఐతేనేం ?

మిత్రమా ! ' ఆ నక్కే జర్మనీ వంటి దేశాలకు మార్గదర్శిని అయింది ! మాకెందుకు కాగూడదు ?' అని అనుకొన్నాను నేను ఆఖరున.

కథ చెప్పుకొన్నారు. కాని కథ వల్ల నీతి యేమిటో ఎవరూ గ్రహించుకొన్నట్టు తోచలేదు. అప్పటికే రాత్రి వొంటిగంట అయింది. నక్కవూసే చెప్పుకొంటూ ఎవరి యిండ్లకు వారు పోవడానికి లేచారు.

అంత రాత్రి వరకూ వుండి - అంత కథా విని - వారు గ్రహించుకొన్న దేమి ? వారు పొందిన లాభమేమి ? నాకు చాలా కష్టం కలిగింది. తమ కథలో నీతినే తమకు కొంచెం బోధించాలని అనుకొన్నాను. అనుకోవడంతోటే ' నక్క లాగే మనం కూడా చేద్దాం రేపట్నించి ' అంటూ లేచాను తిరుగలి మీద నుంచి. ' తిరుగలి మీద కూర్చున్నావు, తిరుగలి అరిగేవరకూ పెండ్లి అవదు ' అన్నది ఒక ముసలమ్మ. అందరూ నవ్వారు, కాని నా మాటను ఎవరూ వినలేదు.

ఆ రాత్రి జరిగిన సమాచారం ఇది. ఈ విధంగానే ప్రతిరోజునూ తమ కష్టాల్ని మరిచిపోవడానికి ఏవో కథలు చెప్పుకొంటూ కాలం గడుపుతూ వుంటారు కృషికులూ, కార్మికులూను.

ఇదంతా తాత్కాలిక ప్రశాంతి. ఎంత కాలం ఈ విధంగా రోజులు గడుస్తాయి ? ఎంతకాలం కాలే కడుపును కథలతో తృప్తిపరుస్తారు ? ఎంతకాలం ఋణభారం సహిస్తారు, అవమానం భరిస్తారు ?

ప్రపంచంలో ప్రశాంతి ఏర్పడాలంటే ప్రస్తుతం వున్న సాంఘిక విధానం పనికిరానట్టు తోస్తుంది. సంఘం పూర్తిగా మారిపోవాలి.

మానవసంఘంలో తక్కిన అన్ని చరాచర సంఘాల్లో వలేనే సమత్వం ఏర్పడాలి. స్వార్థం నశించిపోయి, సౌహార్ద్రం వృద్ధి పొందాలి. అప్పుడే నిజమైన, శాశ్వతమైన సౌఖ్యం ప్రపంచానికి కలుగుతుంది.

సఖా ! అట్టి సమత్వం ఇంతలో కలుగుతుందా ? మానవసంఘం ఇంతలో పరివర్తనం పొందుతుందా ? మావంటి దీనుల కష్టాలు గట్టెక్కే కాలం సమీపంలో వుందా ?

ఏమో ! ఒక్కొక్కసారి ఏ చెట్టు నీడనో కూర్చుని ఆలోచించుకొంటుంటే భరింపరాని దుఃఖం కలుగుతూ వుంటుంది. మావూళ్ళో సౌఖ్యాలు అనే వాటిని కలలో కూడా రుచి చూచి యెరుగని కష్టజీవుల్ని చూస్తున్నప్పుడు కడుపులో పేగులు చుట్టలు చుట్టుకొని పోతవి. సంఘ విధానాన్ని మార్చడానికి ఎవరు సమర్థులు ?

రాత్రులు ఏవో కథలు చెప్పుకొని క్షణకాలం అయినా కష్టాలు మరిచిపోతారు. కాని రాత్రుళ్ళంతా యజమానులు, పెట్టుబడిదార్లు పీడిస్తున్నట్లే కలలు గంటారు. వేకువజామునే లేచి తిరిగి ఎవరి పనులకు వారు పోతారు, ఇంతే. ఇదే వారి దినచర్య. ఇదే పల్లెటూళ్ళ జీవనగతి. ఈ గుడిగుడి గుంచం బ్రతుకుతోనే, ఈ చాలీచాలని జీవితభృతితోనే, ఇదే విశాల ప్రపంచం అనుకొంటూ రోజులు గడుపుకొంటున్నవి పల్లెలు. మహర్షులు మెచ్చుకొన్న పల్లెలకు ఈ రోజులలో ఇంతకన్న మహదాశయం కనపడడంలేదు ! ఈ మా జీవిత గతుల్ని గురించి, వీటిని తగువిధంగా మార్చే సూత్రాల్ని గురిచీ ముందు, ముందు వ్రాస్తాను.

★★★

ప్రియసఖా !

నీ లేఖ అందింది. నా లేఖ ఆలస్యమైంది. నీవు ఆంధ్ర మహాసభలకు మద్రాసు వస్తావు గదా – అక్కడ నిన్ను కలుసుకోవచ్చు గదా– అని లేఖ వ్రాయలేదు నేను. కాని నీవు రాకనే పోతివి.

నీవంటి సారస్వతోపాసకులే – కవులే– అతి ముఖ్యాలైన ఇటువంటి మహాసభలకు రాక పడకటిండ్లలో – బృందాకుటీరాల్లో– ఇనకతిన్నెల్లో – ఎలమావిగున్నల్లో – ప్రియురాంద్రతోటీ, ప్రణయగేయాలతోటీ, భావతరంగాలతోటీ, శకుంత మిథునాలతోటీ, కులుకుతూ కూర్చుంటే, మావంటి జానపదులా మహాసమస్యల్ని పరిష్కరించేది ?

పదిరూపాయిల బైరాగీ టిక్కట్టు కొని మద్రాసు ప్రయాణమయ్యాను. నేనెప్పుడూ చెన్నపట్నం చూడలేదు. ఆంధ్రతేజం వెల్లివిరిసే రోజుల్లోనే దాన్ని చూడాలి అనిపించింది.

రైలు అంతా క్రిక్కిరిసి వుంది. కూర్చోడానికి స్థలం లేదు. చాలామంది నిలబడి వున్నారు. ఇద్దరు ముగ్గురు తెల్లమొగాలు మాత్రం పరుపులు పరుచుకుని – బారచాచుకొని పడుకొన్నారు.

పెట్లోకి ఎక్కీ ఎక్కడం తోటే ఒక అతణ్ణి లేపి 'కాస్త జరుగు – కూర్చోవాలి' అన్నాను. అతడు కళ్ళెర్రజేసి తెర్ర ముగం చిర్రుమనిపించి ఏదో ఇంగ్లీషులో కసిరాడు. నేనూ నా పల్లెటూరి సత్తా అక్కడ వుపయోగించడానికి సిద్ధపడ్డాను. కాని నా చుట్టూ వున్న 'ఆంధ్రు లంతా – 'అరెరే ఆయన దొరగారు. మాట్లాడకు' అని నన్ను మందలించారు.

'ఇంతమంది ఆంధ్రపురుషులం వుండి ఒక్క పరాయి వాణ్ణి లేవగొట్టలేక పోతిమే ! పైగా, తోడి ఆంధ్రులంతా వాడితో ఏకమై వాడి ఆధిక్యతకూ – అధికారం చెలాయింపుకూ – దోహదం ఇస్తున్నారే ! ఇదేనా ఆంధ్రపౌరుషం ? ఆంధ్ర ప్రతిభ ? ఆంధ్రవీర్యం ?....'

హతాశుణ్ణి అయ్యాను. అందరితో బాటు నిల్చున్నాను.

రైలు వేగంతో పరుగెడుతోంది. ఎన్నో స్టేషన్లు వెనుకబడిపోతున్నాయి. అభివృద్ధి మార్గాన్ని బడి, ప్రపంచ నాగరిక జాతులన్నీ ఇంత వేగంతోనూ పరుగిడుతుంటే– మన ఆంధ్ర జాతి ఒక వెనుకబడిపోయిన స్టేషన్ వంటిది గదా అని వాపోయాను.

కాళ్ళు లాగుతున్నాయి. కూర్చోడానికి స్థలం లేదు. పడుకునివున్న దొరగార్లు లేవరు. బండి అంతా వెదికాను.

'20 జనులు కూర్చుండేది' అని వుంది. మందినంతా లెక్కపెట్టాను. ముప్పాతికమందికి తక్కువ లేరు. 'ఈ తెలివితక్కువ తనం – ఈ అబలత్వం– ప్రయాణీకులదా – రైల్వేవాళ్ళదా ?' అని అనుకొంటూ ఇంకో పెట్టెలోకి మారాను గాని అక్కడా ఇదే గోల.

యీ మాదిరిగా పొన్నేరి స్టేషన్ దాటిపోయింది, అక్కడినుంచి స్టేషన్ల పేర్లు ఇంగ్లీషులోనూ, అరవంలోనూ, తురకంలోనూ తప్ప– తెలుగులో లేవు !

నేను గోదావరి స్టేషన్‌లో ఎక్కాను. అక్కడనుంచీ చూసుకొస్తున్నాను. ఏ స్టేషన్‌లో చూచినా – ఏ రైల్వే ఉద్యోగిని చూచినా – అడ్డకట్ల అరవమొగాలే కనబడుతూ వచ్చాయి. మా జిల్లా కలెక్టర్ని చూశాను. ఆయన అరవవాడే. మ– జిల్లా మునసబు అరవవాడు. మా సబ్ మ్యాజిస్ట్రేటు అరవవాడు. మా రిజిస్ట్రారు అరవవాడు. అంతా అరవవాళ్ళే !

ఆంధ్రదేశంలో గ్రామ మునసబు కరణాలు తప్ప ఉద్యోగస్థులంతా అరవ లేనా ? అయితే మన తెలుగు వాళ్ళేమైపోయారు ? ఈ రైల్వేస్టేషన్ల పేర్లు తెలుగులో ఎందుకు లేవు !

' మద్రాసు – ఆంధ్రసభలు !' అనీ – ఆంధ్ర రాష్ట్రం తక్షణం ఏర్పడాలి' అనీ – 'మద్రాసు ఆంధ్రులది' అనీ – మొదలైన ఇంగ్లీషులోనూ, తెలుగులోనూ, తమిళంలోనూ, తురకంలోనూ పెద్దపెద్ద అక్షరాలతో వ్రాయబడిన పెద్ద పెద్ద ఖద్దరువస్త్ర తోరణాలు– నేను రైలు దిగేసరికల్లా కన్నుల పండువుగా కనబడతాయి అనుకున్నాను.

పట్నమంతా ఆంధ్రప్రతిభతో అలంకరింప బడుతుందనీ – మద్రాసులో వున్న 300000 మంది ఆంధ్రులూ, ఆంధ్రదేశం నుంచి వచ్చే లక్షల కొలదీ ప్రతి నిధులు – నాయకులు, కవులూ, గాయకులూ, నటకులూ, కళాకోవిదులూ, సంఘసేవా

పరాయణులూ, మంత్రులూ, సెక్రటరీలు, ప్రభుత్వోద్యోగులూ, విద్యార్థులూ – అంతా నగరవీధుల్లో ఉరేగింపులూ, ఉత్సవాలూ జరుపుతూ వుంటారనీ – మేము రైలు దిగగానే రాష్ట్రగానాలూ, విజయగీతాలూ పాడుతూ వందల కొలది ఆంధ్రవాలంటీరు దళాలు స్టేషన్‌కు వచ్చి మాకు స్వాగతం ఇచ్చి మహాసభకు తీసుకుపోతారనీ – అనుకొన్నాను.

కాని – అంతా హుళక్కి అయింది. అంతా నిరాశ అయింది. నిరుత్సాహంతో నా శరీరమంతా కంపించి పోయింది. కడకు – ' ఆంధ్రమహాసభలు ఎక్కడ, ఎక్కడ ' అంటూ – వెతుక్కుంటూ తిరిగి తిరిగి – ఆ ' గోడపన్ను (వాల్‌టాక్సు) ' వీధిలోని దుస్సహమైన ఆ బొగ్గుపొగకంపు ధియేటరును కనుక్కొనేటప్పటికి మా పెద్దలు దిగివచ్చారు.

పత్రికల్లో పెద్దపెద్ద హెడ్డింగులతో, ఫోటోలతో, ప్రకటితమైన నాయకుల ఉపన్యాసాలను చూచి మద్రాసులో ఆంధ్రసభలు మహాగొప్పగా జరిపారు అని అనుకొంటావు. కాని ఈ సభలు ఏమాత్రమూ ఇంప్రెసివుగా లేవు. ఆంధ్రుల గొప్పతనాన్ని ఏమీ ఇవి చూపలేదు సరిగదా ఇదివరకూ వున్న సద్భావాన్ని లేకుండా చేశాయి.

జాతీయనిర్మాణమూ – శిక్షణా – తమకు ఎంత అవసరమో ఇప్పటికైనా మన ఆంధ్రులు తెలుసుకోలేరు.

ఆంధ్రసభలు ఇలావున్నాయి. సరే, ఇక ఆంధ్రులు మాది అంటూన్న చెన్ననగరం ఎలావుందో చూద్దామని బైలుదేరాను.

రిక్షావాణ్ణి పిలిచి తెలుగులో మాట్లాడాను. వాడు అరవంలో మాట్లాడాడు, నాకు తెలియడం లేదు. ' నీకు తెలుగు తెలుసునా ? ' అని అడిగాను. వాడు అరవంలోనే జవాబు చెప్పాడు. అంతలో ఒక అడ్డకట్టు యువకుడు వచ్చి వాడితో అరవంలో మాట్లాడడం ప్రారంభించాడు నా తరపున. అంతటితో రిక్షావాడు తెలుగులో మొదలు పెట్టాడు.– ' ఏమి సామీ ! చాలా దూరం వుండింది సామీ !.. ' అంటూ. అప్పుడు ఆ అడ్డకట్ట యువకుడు కూడా ధారాళమైన తెలుగు మాట్లాడాడు.

అసలు ఖర్మం ఏమిటంటే – ఆ రిక్షావాడు – ఈ యువకుడు తెలుగు వాళ్ళే ! మద్రాసు తెలుగువాళ్ళ స్థితీ – తెలుగుస్థితీ ఇలా వుంది.

ఏ ట్రాములో చూచినా అరవమే. ఏ గోడ మీద చూచినా అరవమే. ఏ ఎడ్వర్‌టైజుమెంటు చూచినా అరవమే. అరవానికి ఇంగ్లీషు జత. తెలుగుకు ఎక్కడా తావు లేదు.

జనరల్ హాస్పిటల్‌లో కూడా – ఆయా సెక్షనుల పేర్లు ఇంగ్లీషు లోనూ, అరవంలోనూ తప్ప తెలుగులో లేవు.

తెలుగువాళ్ళు తెలుగువాళ్ళమని చెప్పుకోరు, తెలుగువేషం వేయరు, తెలుగు భాష మాట్లాడరు – అడ్డకట్టు లేక సూటు – అరవం లేక ఇంగ్లీషు.

ఒకరు ఇద్దరు తప్ప, మద్రాసులో విరివిగా వర్తక వ్యాపారాలు సాగిస్తూన్న ఆంధ్రులు లేరు.

పెద్దపెద్ద ఉద్యోగస్తుల్లో కూడా ఆంధ్రశబ్దం లజ్జాకరంగా భావించి, ' అన్న ' కు ' ఆన్ ' అనీ – అయ్యకు ' అయ్యర్ ' అనీ వ్యవహరించబడుతూ గౌరవప్రతిష్టల్ని నిలుపుకొంటూ కాలం గడుపుతున్నవారు చాలమంది.

మద్రాసులో వున్న పాకీవారంతా ఆంధ్రులే !

ఆడయార్ దివ్యజ్ఞాన సమాజం వారి ఇంటర్ నేషనల్ లైబ్రరీలో మీ కాకినాడ 'పరిషత్పత్రిక' తప్ప మరే ఆంధ్రపత్రికలూ లేవు.

తెలుగు ఆహారం దొరకాలంటే స్వయం పాకం మొదలెట్టవలసిందే. ఎక్కడ చూసినా సాంబారునీళ్ళే, ఆంధ్ర హోటళ్ళు ఎక్కడన్నా వున్నా లేనట్టే లెఖ్ఖ.

ఇలా ఎన్ని వ్రాయను ? ఇవి ఒక్కరోజులో నేను మద్రాసు అంతా చూచినప్పుడు నాకు తగిలిన బాహ్యదృశ్యాలు. ఇంత అధ్వాన్నంగా వుంది మద్రాసు నగరం.

మద్రాసులో ఆంధ్రత్వం ఎక్కడా కనిపించలేదు నాకు.

ఆంధ్రుల్లో ముందుకు చొచ్చుకుపోయే గుణం చాలా తక్కువ. అదే యీ పతనాని కంతకీ కారణం. మద్రాసు నగరం మనది అని మహోపన్యాసాలిచ్చిన ఆంధ్రమూర్తులు మద్రాసంతా ఆంధ్రత్వంతో నింపడానికి ప్రయత్నం చేస్తున్నారా ?

ఈ మద్రాసు యాత్ర వల్ల నాకు దుర్భరమైన – దుస్సహమైన అనుభవాలు కలిగాయి. సంఘ నిజస్థితిని ఇప్పుడు కొంచెం అర్థం చేసుకోగలను. పట్టణ గ్రామజీవితాల తులమాన జీవితక్రమాన్ని ఇప్పుడు బాగా చిత్రించుకోగలను.

ఈ విషయాలన్నీ వచ్చే లేఖలో వ్రాస్తాను. పొలం పోవాలి, ఇప్పటికి సెలవు.

★★★

రాగవైశాఖి

శృంగార లేఖా కావ్యం



బోయిభీమన్న

ప్రథమ ముద్రణ : 1965
ద్వితీయ ముద్రణ : 1994

హక్కులు రచయితవి

వెల : రూ. 110/-

ప్రతులకు :

1. **భీమన్న సాహితీ నిధి**
ఐ.సి. 85,
ఇర్రం మంజిల్ కాలనీ,
హైదరాబాద్ - 482.

2. **విశాలాంధ్ర పబ్లికేషన్స్**
విజ్ఞాన భవన్, బ్యాంక్ స్ట్రీట్,
అబిడ్స్, హైదరాబాద్.

ముద్రణ :
పద్మావతీ ఆర్ట్ ప్రింటర్స్,
1-1-517/బి/1,
న్యూ బాకారం, గాంధీనగర్,
హైదరాబాద్ - 380.
ఫోన్లు : 611413, 600547.

రాగ వైశాఖి

శృంగార లేఖా కావ్యం

రాగవీచిక

''ప్రింటింగుకు ఒక పదిహేను వందలు ఖర్చయ్యే పుస్తకం ఏదైనా ప్రెస్సులో ఇచ్చేయండి!''

ఇది బాపురెడ్డి గారి లేఖ – విశాఖ నుంచి.

లేఖ చూసుకొన్న వెంటనే రాగవైశాఖి ప్రాత ప్రతిని ప్రెస్సులో ఇచ్చేశాను – పదిహేను వందలలో కాదని తెలిసినా, అదనంగా ఎంతైతే అంత సొంతం పెట్టుకొందామన్న ధీమాతో.

''సొంత లాభం కొంత మానుకు పొరుగు వాడికి తోడు పడవోయ్!'' అన్న గురజాడ మహాకవి నిర్దేశానికి సాక్షాత్తు ప్రత్యక్ష నిదర్శనం బాపురెడ్డి. తానూ కవే. తన కావ్యాన్ని ప్రింటు చేద్దామన్న పట్టాభిరామరెడ్డి గారితో భీమన్న గారి కావ్య మేదైనా ప్రింటు చేద్దాం అని చెప్పి, ఒప్పించి నాకు లేఖ వ్రాశాడు బాపురెడ్డి.

కోటు పట్టాభిరామ రెడ్డి విశాఖలో ఇంజనీరు కాంట్రాక్టరు. బాపురెడ్డికి మిత్రుడు. బాపురెడ్డి లాగే ఉదార చరిత్రుడు. ఉన్నంతలో పొరుగు వాళ్ళకు, ముఖ్యంగా మిత్రులకు, తోడ్పడడమే జీవిత లక్ష్యంగా కలవాడు.

ఆ విధంగా ప్రింటయిన ప్రణయ కావ్యం రాగవైశాఖి. ఇందుకు సంబంధించిన వివరాలు నా జీవిత చరిత్రలో చూడవచ్చు.

రాగవైశాఖి ఒక ప్రణయ లేఖా కావ్యం. అక్కడక్కడ పద్యాలూ, గేయాలతో కూడిన వచన కావ్యం. ఇది కోటు పట్టాభిరామరెడ్డిగారికే అంకితం చేశాను.

"He got something to give us" అన్నారట పట్టాభి రామరెడ్డి గారు బాపురెడ్డితో – ఈ కావ్యం చదివిన తరువాత.

పట్టాభిరామరెడ్డి గారిని గురించీ, ఆయన వంశ విశిష్టతను గురించీ, నెల్లూరు జిల్లా లోని ఆయన స్వస్థలమైన సంగం గురించీ ''కావ్య కల్యాణం'' అనే శీర్షిక క్రింద అంకిత చరిత్రలో వర్ణించడం జరిగింది.

ప్రణయ లేఖల సంపుటి

ఒక అమ్మాయి, ఒక అబ్బాయి. వాళ్ళు ఏదో ఒక సందర్భంలో కలుసుకున్నప్పుడు, ఒకళ్ళ పట్ల ఒకళ్ళకు ఇష్టత ఏర్పడింది. అప్పటి నుంచీ తరచు కలుసుకొనేవాళ్ళు. ఇష్టత ప్రణయంగా వికసించింది. వాళ్ళు తరచు కలుసుకొంటూ వున్నప్పటికీ, ఒకరి కొకరు లేఖలు కూడా వ్రాసుకొనేవాళ్ళు. అవి ఎన్నో జీవిత విషయాలపై చర్చలుగా వుండేవి. ఆ లేఖల సముదాయమే ఈ కావ్యం. అందుకే దీనిని శృంగార లేఖా కావ్యం అన్నాను. ప్రణయ సౌందర్యాల విన్యాసమే శృంగారం కదా!

కళను కళగానే చూడాలి. దానికి వైయక్తిక రాగ ద్వేషాలను ఆపాదించకూడదు. వైయక్తికత వుండదని కాదు – అది విశ్వజనీనంగా వుంటుంది.

రాగవైశాఖిని నేను ప్రారంభించింది 1960లో. తరువాత కొన్ని అసూయలూ, అపోహలూ వల్ల దాని వ్రాత ప్రతి ఒకసారి పోతే మళ్ళీ వ్రాయడం, రెండోసారి పోతే కూడ మళ్ళీ వ్రాయడం జరిగింది. మూడోసారి పోకుండా జాగ్రత్తపడి బెంగుళూరు వెళ్ళి, అక్కడి లాల్ బాగ్ గార్డెన్స్‌లో ఒక నెల రోజుల పాటు కూర్చుని, పూర్తి చేయడం జరిగింది దీన్ని.

అప్పటి నుంచీ ఈ కావ్యం వ్రాతప్రతి లోనే ఎంతోమంది మిత్రులు చదివారు. ప్రశంసించారు. ముద్రించుమంటూ తొందర చేశారు. 1965లో బాపురెడ్డిగారి లేఖ అందే నాటికి ఉన్న పరిస్థితి అది.

ఈలోగా ఈ కావ్యం వ్రాతప్రతికి సోదరి లలిత కొన్ని నకళ్ళు తీసిపెట్టింది. వాటిని జాగ్రత్తగా భద్రపరచడం కూడా జరిగింది. నా కావ్యాలు చాలా వాటికి లలితే నకళ్ళు తీసి పెడుతూ వుండేది.

దీనితో పాటు అదే కాలంలో ప్రారంభించి వ్రాసిన ''అనాది కొస నుంచి అనంతత్వం లోకి'' వచన కవితా సంపుటి అప్పటికే ముద్రించబడింది. ''ఆత్మా,

శరీరమా'' (క్షీరసాగరం) అన్న ఒక మహా నవల ఈనాటికీ ముద్రణ కాలేదు. ''శివాలకలు'' వచన కవితల సంపుటి మరొకటి. ఈ నాలుగు గ్రంథాలకూ మూల తత్వం ఒకటే – ప్రేమ, రసాద్వైతం.

ప్రశస్తీ, ప్రతికూలతా

రాగ వైశాఖి ముద్రణ జరిగి, గ్రంథావిష్కరణ, అంకితోత్సవం సభ నిర్వహించబడి నప్పుడు భాగ్యనగరం లోని మహా కవులూ, విద్వాంసులూ, మంత్రులూ ఎందరో మహనీయులు గ్రంథాన్ని వేనోళ్ళ కీర్తించారు. ప్రపంచ సాహిత్యం లోనే ఈ నవ కావ్యం ఉత్తమోత్తమ మైనట్టి దన్నారు. జాతీయ అంతర్జాతీయ అవార్డు లెన్నో రమణీయమైన ఈ సాహిత్యానికి రావలసి వున్నా యన్నారు.

అయితే, సభలో ఆసీనులై వున్న యువ మిత్రులలో కొందరు అసూయతో రగిలి పోయి, ఆ మర్నాటి నుంచే గ్రంథాన్ని అనేక విధాల దుయ్యబడుతూ పత్రికల కెక్కారు. గ్రంథాన్ని నిషేధించా లన్నారు. గ్రంథకర్తను అరెస్టు చెయ్యా లన్నారు. అసెంబ్లీ లోనూ, కౌన్సిలు లోనూ విమర్శోపన్యాసాలు చేయించారు. 'భారతి' వంటి సాహిత్య పత్రికలలో ఖండన సమీక్షలు వ్రాయించారు. సుమారు రెండు సంవత్సరాల పాటు సాగింది ఈ దుమారం, ఈ సాహితీ విప్లవం.

రాగవైశాఖి గ్రంథాన్ని తాము ప్రత్యేకంగా పండితుల చేత పరిశీలింప చేశామనీ, అందులో శృంగారం ఉన్నప్పటికీ తాత్విక చింతనా, సామాజిక స్పృహా చాలా ఎక్కువగా వున్నాయనీ, ఇది అనేక సమస్యలపై ప్రజలకు కనువిప్పు కలిగించేదిగా వున్నదనీ, కనుక నిషేధించ వలసిన అవసరం లేదని ఆయా పండితులు అభిప్రాయాలు వెలిబుచ్చారంటూ అప్పటి ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డిగారు అసెంబ్లీలో ఒక ప్రకటన చేశారు. ఆ మర్నాటి నుంచీ బ్రహ్మానందరెడ్డిగారినే ఏమర్శిస్తూ పత్రికలలో వ్రాతలు వచ్చాయి.

'అభిసారిక' సంపాదకుడు రాంషా, డి.ఆర్.కుసుమ, గిడుగు రామమూర్తి మొదలైన సాహితీ దర్శకులు రాగవైశాఖి మహోత్తమమైన రసవత్కావ్య మంటూ తిరగబడి వ్రాసేవరకూ ఆ దుమారం అలానే కొనసాగింది. ఆ తర్వాత విమర్శలు

తగ్గిపోతూ, ప్రశంసలు పెచ్చరిల్లుతూ, రాగ వైశాఖికి సాహిత్య దర్శనాలలో ఒక రసాద్వైత దర్శనంగా శాశ్వత స్థానం సమకూరింది.

అయితే, గ్రంథం నిషేధింప బడగలదేమో నన్న భయం కారణంగా ముద్రిత ప్రతులు ఎవరెవరి చేతుల్లోనో పడి అదృశ్యమై పోయాయి. తుదకు నా సొంతానికి ఒక ప్రతి గూడ లేకపోయింది. మా చెల్లెలు ద్రౌపది కిచ్చిన ప్రతిని తెప్పించుకొని, ఇప్పుడు అదే ప్రతిని పునర్ముద్రణ కోసం ప్రెస్సులో ఇచ్చాను - ఇరవై ఎనిమిది సంవత్సరాల తర్వాత.

ఈ లోగా-

విద్వాంసుల అభిప్రాయాలు

''అద్భుతమైన, అపూర్వమైన రచన.'' "Raga Vysakhi is the book of the decade. I feel like that" అంటూ ఒక లేఖలో పేర్కొన్నారు డా. బెజవాడ గోపాలరెడ్డి గారు.

''భీమన్న సమగ్ర జీవిత తత్వాన్ని ప్రతిబింబించే రసాద్వైత దర్పణం ఈ మహాకావ్యం'' అంటూ ఆనాడు తనకిచ్చిన ప్రతి చివరి పేజీలో వ్రాసుకొన్నారు మహాకవి బాపురెడ్డిగారు.

సమకాలీన అగ్రశ్రేణి సాహితీ మహిళా రత్నాలు ఇద్దరు రాగ వైశాఖిని మెచ్చుకొన్నారు. ఆ ఇద్దరూ తెన్నేటి హేమలత, వాసిరెడ్డి సీతాదేవి గార్లు.

''రాగ వైశాఖి చదివారా? అది సర్వకాల, సర్వదేశ సుందర సాహిత్య సారం'' అంటూ సహజ కవి మల్లెమాల (సుందర రామరెడ్డి) గారు తమ వద్దకు వచ్చే ప్రతి సహృదయుడికీ చెప్తారు. ప్రతి సభ లోనూ రాగవైశాఖి పేరు స్మరిస్తారు.

''పరమజ్ఞతకు పరాకాష్ఠ రాగవైశాఖి'' అంటూ పేర్కొన్నారు ఉస్మానియా యూని వర్సిటీ తెలుగు శాఖాధిపతి వేటూరి ఆనందమూర్తిగారు - ''యువభారతి'' వారు ప్రతి నెలా రెండవ శనివారం నిర్వహించే సాహితీ కార్యక్రమంలో ప్రసంగిస్తూ. రాగవైశాఖిపై ప్రత్యేకంగా జరిగిన సదస్సు అది,

1990 అక్టోబరులో. రాగవైశాఖి శృంగారంలో సున్నిత భావనలే కానీ పచ్చిదనం లేదన్నారు ఆనందమూర్తి గారు.

''భీమన్న రస సిద్ధుడు. అతడి జోలికి వెళ్ళకండి!'' అన్నారట కవి సమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ గారు – తన శిష్యులతో, సదరు కాంట్రవర్సీలో తమ పాత్ర ఎలా వుండాలని అడిగి నప్పుడు.

ఈ విధంగా రాగవైశాఖి గురించి జరిగిన వాదోపవాదాలలో ఉదాహరించదగిన వాక్యాలు, వ్యాఖ్యలు అసంఖ్యాకంగా వున్నై. వీటన్నిటినీ ఇక్కడ పేర్కొంటే అది మళ్ళీ మరొక మహాకావ్యం అవుతుంది.

''రాగ వైశాఖి – ఒక పరిశీలన'' అంటూ శ్రీమతి డి.సరోజినిగారు ఒక పరిశోధక థీసిస్ వ్రాసి సెంట్రల్ యూనివర్సిటీ నుండి ఎమ్.ఫిల్. పట్టా తీసుకొన్నారు. గైడు ఆచార్య కొత్తపల్లి వీరభద్రరావు గారు. ఆచార్య వీరభద్రరావు గారికీ, ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం గారికీ రాగవైశాఖి ప్రాణ తుల్యమైన రసవత్సాహితి.

మిత్రుడు మోదుకూరి జాన్సన్ సినిమా రంగంలో అడుగుపెట్టిన మొదట్లో, తన రచనా వ్యాసంగానికి రాగ వైశాఖి లోని భాషా, శైలీ, భావాలూ తన కెంతో తోడ్పడు తున్నాయని ఆయన నాకు వ్రాసే ప్రతి ఉత్తరం లోనూ పేర్కొనేవాడు.

రాగవైశాఖి కావ్యాన్ని తమ పర్యటనలలో ఎల్లప్పుడూ తమతోనే వుంచుకొనే వారు – ఐ.ఎ.ఎస్. అధికారి ఎల్.మాలకొండయ్య గారు. ఆయన 1971 ప్రాంతంలో తూర్పు గోదావరి జిల్లా కలెక్టరుగా వున్నప్పుడూ, ఆ తర్వాత కొన్ని శాఖలకు కమీషనరుగా వున్నప్పుడూ కూడా నాకు ఎన్నో సన్మానాలు ఆయన ప్రోత్సాహంతో జరిగాయి. మా స్వగ్రామంలో 1971 డిసెంబరులో జరిగిన నా షష్టిపూర్తి మహోత్సవం కూడా అందులో ఒకటి.

మా గ్రామానికి చెందిన శెట్టి బలిజ నాయకుడు, బ్యాంకరు, భూస్వామి అయిన చిట్టూరి నరసింహం గారు – ఆ దారిన పోతున్న మా తమ్ముడు అర్జునుడ్ని ఆపి అన్నారట – ''మీ నాన్న పేరు నిలబెట్ట గలిగిన గొప్ప గ్రంథం రాశాడయ్యా భీమన్న'' అని. నరసింహం గారు ఆ కాలంలో మా నాన్నకు తరచు అప్పులు పెడుతుండే షావుకారు. ఎవరినీ మెచ్చుకొనే తత్వం కాదు. బహు గ్రంథ పాఠకు

డాయన. అటువంటి వాడు బహు పరిశీలనగా మెచ్చు కొన్నాడట రాగ వైశాఖిని.

రాగ వైశాఖిపై అసెంబ్లీలో చర్చ జరిగినప్పుడు ఎంతో మంది శాసన సభ్యులు సాహిత్య ప్రభావితు లైనారు. అందులో విశాఖ మండలానికి చెందిన పాలవెల్లిగా రొకరు. ఆయన గ్రంథాన్ని ఎక్కడో రెట్టింపు ధరకు కొనుక్కొని చాలా వరకూ కంఠస్థం చేశారు. నాకు ఆత్మీయు లైనారు.

ఇలా ఎంతో మంది - ఆనాటి సాంస్కృతిక శాఖా మంత్రి ఎమ్.ఆర్.అప్పారావు, మిత్రులు డా. ఖాను గార్లతో సహా.

ఈ రాగ వైశాఖి రచనా పరంగా ఆధునిక తెలుగు వాఙ్మయ సరళినే ఒక మలుపు తిప్పి రస రంజితం చేసిందనీ, ఎంతో మంది సినిమా రచయితలకూ, నవలా రచయితలకూ మార్గదర్శక మయిందనీ సాహితీ మిత్రు లంటుంటారు ఈ నాటికీ.

ఎన్నో సిద్ధాంతాలు

రాగ వైశాఖి ఒక మహా కావ్య మనీ, అందులో అనేక జీవిత సిద్ధాంతాలు ప్రతిపాదించ బడి వున్నాయనీ బాపురెడ్డిగారు పేర్కొంటూ ఆనాడే ఒక మంచి పరిశోధక వ్యాసాన్ని తయారు చేశారు. పరిశీలనగా చదివితే ఒక పాతిక సిద్ధాంతా లైనా రాగవైశాఖిలో ప్రతిపాదించబడి వున్నై. అవన్నీ ప్రాథమిక సత్యాలతో కూడిన వినూత్న సిద్ధాంతాలు.

జీవితం రెండు విధాలు. ఒకటి - ఒక క్రమం అంటూ లేకుండా ఇష్టం వచ్చినట్టు సాగిపోయేది. దానిని స్వేచ్ఛా జీవితం అనవచ్చు.

రెండోది - క్రమబద్ధమైన జీవితం. ఒక సిద్ధాంతాన్ని అనుసరించి సాగుతుం దది. క్రమబద్ధ జీవితం సాంఘిక మైనట్టిది. దానిలో శాంతి భద్రత లున్నై. స్వేచ్ఛా జీవితం ప్రమాదాలతో కూడుకొన్నట్టిది. అయితే దానిలో థ్రిల్లు వుంది. సృ జనాత్మకత వుంది.

జీవితం వంటిదే కావ్యం కూడా. ఏ సిద్ధాంతానికీ కట్టుబడకుండా స్వేచ్ఛా జీవితాన్ని అనుసరించి సాగే కావ్యం సహజ సుందరంగా వుంటుంది.

సృజనాత్మకమై వుంటుంది. జీవితాన్ని సమగ్రంగా అర్థం చేసుకొన్న కవి వ్రాసిన స్వేచ్ఛా కావ్యమే నిజమైన కావ్యం.

ఒక సిద్ధాంతాన్ని ఆధారంగా చేసుకొని కొన్ని నియమ నిబంధనలకు కట్టుబడి వ్రాసే కావ్యంలో కొత్తదనం వుండదు.

రాగవైశాఖిలో ఎన్నో సిద్ధాంతాలు ప్రతిపాదించ బడ్డాయనీ, ముఖ్యంగా రసాద్వైత సిద్ధాంతం అందులో అంతర్వాహినిగా వున్నదనీ చెప్పినప్పుడు – ఈ కావ్యం సిద్ధాంతబద్ధమైన రచనగా పరిగణించకూడదు. రచన స్వేచ్ఛగా సాగిపోతున్నప్పుడు దాని నుంచి యధాలాపంగా ఆయా సిద్ధాంతాలు పుట్టుకొచ్చా యనాలి.

రసాద్వైతం కోసమో, ఇతర సిద్ధాంతాల కోసమో లక్ష్యపూర్వకంగా వ్రాసిన కావ్యం కాదిది. స్వేచ్ఛగా కావ్య సృష్టి జరుగుతున్నప్పుడు ఆ సృష్టి నుంచి ఉద్భవించి ఓజోవంతాలైన సత్యాలివి. జీవితం గురించి, కావ్యం గురించి అధ్యయనం చేసినప్పుడు ఈ తేడాలను గుర్తించ వలసి వుంది.

పరస్పర భక్తే రసాద్వైతం

భారతీయ వేదాంత దర్శనాలలో ఆత్మకూ, పరమాత్మకూ అభేదాన్ని ప్రతిపాదించే అద్వైతం ప్రధాన మైనట్టిది. ఆత్మా, పరమాత్మా వేరు వేరు కాదనీ, ఆ రెండు తత్వాలూ ఒకటే ననీ అద్వైతం చెపుతుంది. అవి రెండూ ఒక్కటి కాదనీ, రెండూ రెండు వేరు వేరు తత్వాలనీ ద్వైతం చెపుతుంది. విశిష్టాద్వైతం, ద్వైతాద్వైతం, శుద్ధాద్వైతం మొదలైన పేర్లతో పిలువబడే వన్నీ ద్వైతంలో భాగాలే.

నేను అద్వైతంలో పుట్టి పెరిగిన వాణ్ణి. ఆత్మా, పరమాత్మా ఒక్కటే అనడంలో ఎలాంటి సందేహమూ లేదు. అవి విత్తనమూ వృక్షమూ లాంటివి. దీపమూ, వెలుగూ లాంటివి. సముద్రమూ, కెరటమూ లాంటివి. అయితే అవి రెండూ సత్యమే అవుతాయి. ఒకటి సత్యమూ, రెండోది అసత్యమూ కావు. ఈ విధమైన చింతనతో నేను అద్వైతాన్ని అంగీకరిస్తూనే, పరమాత్మతో పాటు దాని

వికాస రూపమైన ప్రకృతి కూడా, దాని అసంఖ్యాక రస భావ సౌందర్యాలు కూడా సత్యమే అనే నిర్ణయానికి వచ్చాను. అంటే నాకు పరమాత్మ ఎంత సత్యమో జీవితమూ అంతే సత్యం. కాకపోతే, ఒకటి శాశ్వతం, రెండోది తాత్కాలికం. ఒకటి స్థిరం, రెండోది అస్థిరం. అంతే!

నా రచన లన్నిటికీ జీవితానందమే ప్రాతిపదికగా వుంటున్నది కాబట్టి దాని కొక మంచి పేరు పెట్టుకోవలసిన అవసరం ఏర్పడి, దానిని రసాద్వైతం అన్నాను. నా సిద్ధాంతంలో పరమాత్మ రస స్వరూపి. రసమే పరమాత్మ. రసం అంటే ఏమిటి? రెండు ఆత్మల పరస్పరాకర్షణతో, అన్యోన్యానురాగంతో ఆర్ద్రమైన మనస్సే రసం. మనస్సు రసార్ద్ర మైనప్పుడు, అది పరమాత్మే. ఈ రసాద్వైతం కవితా స్వరూపి. జీవిత ప్రతిష్ఠ. మరీ స్పష్టంగా చెప్పాలంటే - అద్వైతం వైరాగ్య నిష్ఠం అయితే, నా రసాద్వైతం జీవిత నిష్ఠం.

మరొక్క విషయం ఇక్కడ వివరించాలి.

సమాజం నుంచి కుల మతాలను తొలగించా లనీ, నిత్యావసరాల పరంగా మానవు లంతా సమానం గానే చూడబడా లనీ, మరణానంతరం ప్రతి జీవీ పొందేది మోక్షమే ననీ (బ్రహ్మై క్యమేననీ), పునర్జన్మ సిద్ధాంతం తప్పనీ, పరమాత్మలో ఐక్యమైన ఆత్మ తిరిగి అదే వ్యక్తిత్వంతో జన్మించడం సాధ్యం కాదనీ, అన్ని మతాలకు దేవు డొకడే అనడం వాస్తవం కాదనీ, మతాలు చెప్పే దేవుడు ఒక డ్రగ్గు అనీ, ఈ డ్రగ్గును నిషేధిస్తే తప్ప సర్వమానవ సమైక్యం సాధ్యం కాదనీ నేను చెపుతూ వస్తున్నాను. ఇవి సాంఘిక, ఆర్థిక, రాజకీయ రంగాల లోని మానవుల ప్రవర్తనలకు సంబంధించిన నా భావాలు.

సత్ చిత్ రిరంస

తాను ప్రేమించిన స్త్రీ కోసం పురుషుడూ, పురుషుడి కోసం స్త్రీ, ఎంతటి త్యాగా నికైనా సిద్ధపడే శక్తి ప్రేమకు ఎలా వచ్చింది?

కని పెంచిన తల్లి దండ్రులనూ, బ్రతుకు బాట ముళ్ళాలుగా వికసించడానికి తోడ్పడిన తోబుట్టువులనూ ధిక్కరించి, విసర్జించి పోగల సామర్థ్యం ప్రేమకు ఎక్కడి నుంచి వచ్చింది?

ప్రకృతి పురుష ద్వంద్వ సమాస పరమాత్మ యొక్క నిరంతర రమణం నుంచి వచ్చింది. అట్టి పరమాత్మ యొక్క నిరంతర సిసృక్షే సృష్టి. సృష్టి లోని ప్రతి లవమూ ప్రకృతి పురుష తత్వ నిష్ఠమే. అదే సత్ చిత్ రిరంస. దానినే రసాద్వైతం అన్నాను.

దీనిని స్వప్రయోజక, లౌకిక, సాంసారిక నియమాలతోనూ, కామనలతోనూ, ఉద్రేకాలతోనూ పోల్చి విమర్శించగూడదు.

ఈ రిరంసా ద్వయమే ఈ కావ్య నాయికా నాయకులు – వైశాఖీ వసంతులు.

ఈ కావ్యంలో పది అధ్యాయా లున్నై. వాటికి శ్రావణ పూర్ణిమ మొదలు వైశాఖ పూర్ణిమ వరకూ గల పూర్ణిమల పేర్లు పెట్టాను. ఇందులోని రసానంద రహస్యాన్ని రసజ్ఞులు ఆస్వాదించ గలరు.

రాగ వైశాఖి, నా తదితర కావ్య కళా శిల్పాలతో పాటు, రస భావ సౌందర్య నిష్ఠ మైనట్టిది. ఇది కేవల ఆనంద సుందర బృందావనం. పరమాత్మ లోని ఆత్మ చైతన్యం బహు ముఖాలుగా వికసించి పరిమళించే, ఫలించి రసబంధురమై ప్రవహించే రామణీయకం ఇది. ఒకే భావ ప్రవంతికి ఇవి రెండు శాఖలు. వాస్తవ జీవిత పరిశీలన ద్వారా వీటిని అర్థం చేసుకోవలసి వుంది.

భారతీయ వైదిక చింతనా ఫలితమైన సచ్చిదానంద తత్వాన్ని, ప్రకృతి పురుషుల నిరంతర భగవ ద్భోగ లీలా లౌల్యాన్ని రసవత్ సుందరంగా వర్ణిస్తే – అట్టి వర్ణనను అశ్లీల మంటూ గోల పెట్టిన వాళ్ళ నేమనాలి? వైరాగ్య తత్వానికీ, రాగ జీవిత సౌందర్యానికీ తేడా తెలుసుకొని సుఖ శాంతులతో బ్రతకడం నేర్చుకో మనాలి. అదే అంటున్నాను నేను ఈ రాగ వైశాఖిలో.

ప్రస్తుతాంశం

ప్రేమకూ, సెక్సుకూ తేడా తెలియని, లోకజ్ఞత లేని కలాల వెంట వరదలుగా పొంగుతున్న ఈ నాటి కవిత్వాన్నీ, నవలలనూ, సాహిత్య విమర్శలనూ, తిలకిస్తూ కలవరం చెందుతున్న నేను – రాగ వైశాఖిని మరొక మారు ప్రజల ముందు

పెట్టాలనే తీవ్ర కాంక్షతో 28 సంవత్సరాల తర్వాత పునర్ముద్రణకు ప్రెస్సులో ఇచ్చాను.

దీని ముద్రణకు అయ్యే ఖర్చు నా తలకు మించినట్టిదనే సత్యం నాకు తెలుసు. ఈ విషయం తెలుసుకొన్న మల్లెమాల సుందర రామరెడ్డి గారు కొంత సహాయం చేస్తామన్నారు. తెలుగు యూనివర్సిటీ వారి సహాయం తప్పకుండా అందగలదన్న ధీమా వుంది.

మొదటి ముద్రణ ముఖ పత్రానికి చిత్రశిల్పి పి.ఆర్.రాజుగారు వేసిన వర్ణ చిత్రం ఆధారంగా ఫిలిం రచయిత్రి, ప్రొడ్యూసరూ అయిన శ్రీకరుణ వేయించిన ఈ ముఖ చిత్రం రసిక జనామోదం పొందగలిగినట్టిది. ఆర్టిస్టు ఏలే లక్ష్మణగారికి కృతజ్ఞతలు.

ఈ అందరికీ, ఇంకా మా ఆవిడ, హైమవతికీ, మా పోస్ట్ గ్రాడ్యుయేట్ అమ్మాయిలు విజయ పల్లవికీ, విజయేందిరకూ కూడా వాళ్ళ సహాయ సహకారాలకు అభినందనలు చెప్పవలసి ఉంది.

పద్మావతీ ఆర్ట్ ప్రింటర్స్ వారికీ, ముఖ్యంగా ప్రెస్ ప్రొప్రైటరు శ్రీనివాస్ గారికి కూడా కృతజ్ఞతలు.

– భీమన్న

రాగ వైశాఖి

శ్రావణి

శ్రీ మంగళ గౌతమీ చి దమలా
సీమంత రత్నోదయా
ప్రేమారామ విహార రాగ మధుపా !
ప్రేమ ద్రమా సుప్రభా !
వ్యోమ ప్రాభవ సౌహృద ప్రణవ భా
షోజో మతీ ! సాహితీ
స్వామీ ! పూర్ణం రసైందవీ రుచిర వై
శాఖీ మనో వల్లభా !

అర్థం కాలేదు కదూ పద్యం?

నా కోసం, నా గురించి, నేను వ్రాసుకొని, పాడుకొంటున్న పద్యం ఇది– నిన్ను చూచిన ఆ సాయంకాలం నుంచీ!

నేను తిరిగిన వనాలలో, గడిపిన తీరాలలో, లతలు, పక్షులు, చల్లని గాలులు, వెన్నెల తరగలు – సమస్తమూ – గొంతెత్తి పాడ గలవు ఈనాడు ఈ పద్యాన్ని, ఎప్పుడు పడితే అప్పుడు!

అంత గాఢతతో, ఉద్వేగంతో, తడవ కొక రాగంతో పాడుకొంటున్నాను దీన్ని! ప్రకృతి సమస్తానికీ కంఠస్థమై పోయిం దందుకే ఈ పద్యం!

పద్యం మళ్ళీ చదువుతున్నావు కదూ?

నీ చూపులు కింజల్కాలే అయినై!

అవి నా కళ్ళకు కాటుక అలద గల్గితే?

నా జీవిత క్షేత్రంలో శృంగార కళా దేవ్యాలయం ఈ పద్యం. ఇందులోని ప్రతి పదమూ ఒక రాగ ప్రియే, ప్రతి అక్షరమూ ఒక ప్రణయ కళే! ప్రతి స్పందనా శ్రీమ దమలా సముప లాలితమే!

రాగ ప్రణయ కళా మనోజ్ఞంగా నా చిన్నప్పటి నుంచీ నిర్మించుకొంటూ వచ్చిన ఈ దివ్యాలయంలో – తనంతట తానుగా ఆవిర్భవించి, సుప్రతిష్ఠ అయిన దేవత ఎవరో తెలుసా?

నా ఆబాల్య సమారాధ్య రాగ దేవత?

నీవు!

నా చూపులు నీపై వాలిన ఆ తొలి క్షణంలో

రాఖీ పూర్ణిమ ఈ వరానన! శర
ద్రాక సుధాపాత్ర మీ
రేఖా చిత్రము! రాగ మోహన కళా
శ్రీ స్ఫూర్తి ఈ మూర్తి ! వై
శాఖీ సుందరి సత్య మీ రమణి ! ఏ
సౌఖ్యమ్మో నా కోసమై
లేఖా దూతికయై గడించినది ఈ
లేమన్! హిమానీ రమన్!

అనుకొన్నాను – పైకొన్న రసావేశంతో!

శ్రావణ పూర్ణిమ అది!

వైశాఖ పూర్ణిమలా ఎలా కనిపించావో నాకు!

నీకు జ్ఞాపకం ఉంది కదూ – అకాశవాణి పచ్చిక బయల్లో మనం తొలిసారి కలుసుకొన్న ఆ సాయంకాలం?

బయలు నిండా పూల తోటలు

ఎన్నో గులాబీ పువ్వులు

ముళ్ళు గుచ్చుకొని నెత్తురు చిందినా లెక్క చెయ్యక, చిటారు రెమ్మపై విరిసిన పెద్ద ముద్దగులాబీని తుంచుకొని, నాట్య శ్రీ పిలుపు విని, పొదలు దాటి, పచ్చిక బయల్లో అడుగు పెట్టి –

ముఖ మెత్తి చూశాను, ఎదురుగ్గా

పాల వెన్నెలను దోసిలితో ఎత్తి ఎవరో నా ముఖం నిండా కొట్టిన ట్టయి, ఉక్కిరి బిక్కిరై పోయాను ఒక్క క్షణం!

కళ్ళు నలుపుకొని చూశాను మళ్ళీ!

ఎదురుగ్గా - నీ ముఖ చంద్రుడు!

ఆ పచ్చిక బయలే పచ్చని ఆకాశం, గులాబి గుత్తులు నక్షత్రాలు, నీ ముఖబింబం పూర్ణచంద్రుడు!

ఎంతటి మధుర భ్రాంతి!

అదీ మన తొలి కలయిక - ఆకాశవాణి పచ్చిక బయల్లో!

"ఎవరి కండీ పుష్పం?" అన్నాడు నాట్యశ్రీ - పుష్పం కేసి చూస్తూ!

"ఇంకెవరికీ?" అన్నాను నేను - నీ కేసి చూస్తూ!

నా చేతిలో పుష్పంగా విరిసింది నీ చిరునవ్వే!

అర్ధ నారీశ్వరుడు నటరాజు

నారీ నటాంశ నాట్యశ్రీ!

పురుషుడు స్త్రీ పాత్ర ధరించి, స్త్రీ ప్రకృతినే కళామూర్తిగా తీర్చిదిద్దిన ప్రతిభ అతడిది!

శకుంతలగా, సత్యభామగా, చిత్రాంగిగా, చింతామణిగా, మోహినిగా, మధురవాణిగా కనిపిస్తా డతడు నాకు - పంచెకట్టులో కూడా!

అంతటి నారీ నటాంశ కూడ అదృశ్యమై పోయిందా క్షణంలో!

నీవు - నేను!

మరేం లే దక్కడ!

నన్ను నీ వెరుగుదువు!

నిన్ను నీవు తెలుపుకొన్నావు!

వైశాఖి!

ఓహో, ఎంతటి అతిలోక మధుర నామం!

ఆశీతాంశు సమస్త క
ళాశయములు, మాధురిమలు, ఆనందమ్ముల్,
రాశీభూతముగా ఈ
వైశాఖిని చేసి పంపె వాక్పతి నాకై !
ఎంతటి జీవేశ్వర మధుర సుందర భాగ ధేయం !
ఎంతగా మురిసిపోయానో నేను !
ఎవరో నీవు, ఎవరో నేను
ఈ అనంత కాలములో !
ఏ వసంత రుచులు గ్రోలి
ఈ తోటను విరిసితిమో !
ఏ రసైక భావనలో
ఏ అలలమొ, ఏ కలలమొ !
రమ్యా రసరాజ్యములో
రాగ దేవతలమైతిమి !
ఎచటి దానవో నీవు !
ఎచటి వాడనో నేను !
ఓహో అని శివుడె మెచ్చ
ఒక పూజనె చేరితి మిట !
నిరంతర వసంతం నా జీవితం !
చైత్రీ సుందరం ఇంతవరకు !
వైశాఖీ సుధా మధురం ఇక మీద ఇది !
వైశాఖీ ! ప్రియసఖీ ! దేవీ !
రోహిణీ ! ఉత్తేజ కారిణీ !
రాగోజ్జ్వల రాజ్యదా ! విద్యా !
స్వాగతం ఆనంద దేవతా !

2

దేన్ని తెలుసుకొంటే లోకంలో మరి దేన్నీ తెలుసుకో నక్కర లేదో – ఆ పరమ జ్ఞానమే పరిపూర్ణ బ్రహ్మ.

దేన్ని చూస్తే లోకంలో మరి దేన్ని చూడనక్కర లేదో – ఆ పరమ సౌందర్యమే నీవు!

ఇప్పుడిస్తున్నై నాకు దర్శనం – సత్యం, శివం, సుందరం అన్న పదాలు తను నిజ స్వరూపంతో !

ఇంత వరకు నాకు అవి వట్టి శబ్దాలు !

ఇప్పు డవి నీ చి న్మన శ్శరీరాలు !

అవే నీవు !

నీవు తెలియకుండా నాకు అవెలా తెలుస్తై ? నీవు కనిపించకుండా అవెలా కనిపిస్తై ?

అయితే – వాటిని అసలే ఎరుగనని కాదు.

సత్యాన్ని నా తల్లిలో, శివాన్ని నా చెల్లిలో, సౌందర్యాన్ని నా సహస్రాధిక సహచరీ సహచరులలో దర్శిస్తూనే ఉన్నాను, అనుభవిస్తూనే ఉన్నాను నేను ఆబాల్యంగా.

ఆది నుంచీ ఎరుగుదును నిన్ను

అప్పుడు నా బహుముఖోపజ్ఞవు నీవు !

అప్పుడు నా చూట్టూ, నన్ను పరివేష్టించి ఉన్నావు నీవు. ఆడుతూ, పాడుతూ, నన్ను ఆకర్షిస్తూ, ఆశ్చర్య విభ్రమాలలో ముంచి వేస్తూ !

ఒకొక్క చోట ఒకొక్క అందం నీ వప్పుడు

ఒకొక్క నోట ఒకొక్క రాగం నీ వప్పుడు

అప్పుడు నీవు నాకు అనేకం.

ఆనాటి అనంతకోటి ఆనంద సుందరమూర్తులు ఏక కేంద్రం వైపు ఉపసంహరించుకొని, సర్వ కళా సమగ్ర సుభగమైన ఒకే ఒక నీవు కాగా – ఇప్పుడు నీ చుట్టూ నే నున్నాను అలముకొని !

నా కేంద్రానివి ఇప్పుడు నీవు.

ప్రకృతి రామణీయకం అంతా నీవు నా పరిధి వైనప్పటిది.

ఇప్పుడు బైట నాకే ముంది ?

నిన్ను చూచిన ఆ క్షణం నుంచీ నాకు నీ వొక్కతవే సత్యం. ప్రకృతి నీ ఛాయ.

అంతా నీవు - ఇప్పుడు నాకు.

నీ పెదవుల పై చిరునవ్వు, నీ కన్నులలో ఆ కాంతి, నీ కంఠంలో ఆ ప్రణయనాదం - నన్ను నీకు పరిధిని చేసి, నీ చుట్టూ త్రిప్పుకొంటున్నై నన్ను !

ఇదే జ్ఞానం

ఇదే సౌందర్యం

ఈ సౌందర్య జ్ఞాన సమాద్వైతమే నీవు !

నాకు నీవే విహార పరిధివి !

నాకు నీవే విశ్రాంతి కేంద్రానివి !

3

మధురము నీ తలంపు, మధు
మాసము నీ అలరింపు, దేవి ! నీ
అధరము నవ్య జీవన సు
ధాసవ పాత్రము నాకు ; ఏ కళా
పథముల బోవుచుండి ఇటు
వచ్చెదవో - పలికించి పొమ్ము నా
వ్యథిత హృదంతరంగమున
వాడిన కిన్నెర కన్నె కోరికల!

ఒకరి కొకరం ఒకే సమయంలో లేఖలు వ్రాసుకోవడం ఎంతటి సమైశ్వర్యం! క్రొత్తవాళ్ళం కాం మనం !

జీవన స్రవంతికి ఎదురు బొదురు తీరాల వెంట, ఎంతదూరం నుంచి, ఎంతకాలంగా ప్రయాణం చేస్తూ వస్తున్నామో మనం !

ఆకస్మికంగా, ఆ సాయంకాలం అలా కలుసుకొన్నప్పుడు, ఇద్దరం ఒకేసారి దూకేశాం అందులో !

ఒకటై పోయాం ఆత్మ దాకా !

అందుకే ఈ భావైక్యత !

నాకు లాగే - ఎన్నో లేఖలు వ్రాసి చింపేశావు కదూ నీవు ?

ఆ ముక్కలు ఎక్కడ పోశావో !

అవి గులాబి మొక్కలై మొలిచి ఉంటై ఈ పాటికి !

మొగ్గలు కూడ తొడిగి ఉంటై ఈనాటికి

ఈ పువ్వులు నీ చిరునవ్వుల్లా గుబాళిస్తై

ఈ లేఖ లోని గులాబీ రేకలు అవే కావు కద !

ఎన్నిసార్లు ముద్దు పెట్టుకొన్నానో ఈ నీ లేఖను !

ఇందు లోని ప్రతి పదమూ నీ పెదవిలా ఎంత మధురంగా ఉంది !

పలు భాషల లోని రమణీయ పద జాలాన్నంతా శృంగార రసంతో ముద్ద చేసిన ముద్ద గులాబివి నీవు !

నా కోసం ప్రత్యేకంగా సర్వ రసభావ సౌందర్యాలూ, ఆనందాలూ, ఆకాంక్షలూ సమ్మిళితం చేసి సృష్టించబడ్డ పరమ రమణీ మూర్తివి నీవు !

మృదు మధురమైన బాల్యము మొదలు నన్ను
నిజ హృదానంద పీఠిపై నిల్పుకొనుచు
ప్రియము గూర్చిన ఎల్ల పూర్ణిమలు కూడి
చక్క దిద్దిన పూర్ణ వైశాఖి వీవు !

అట్టి వైశాఖీ మనో వాల్లభ్య పదవికి నీ అంగీకారం కావాలా ఏం?

నీవు అంగీకరించకపోతే !

ఏమౌతుంది ?

నా ప్రేమ నాది !

నా ఆరాధన నాది !

అందుకు ఎవరి అంగీకారమూ అక్కరలేదు.

ఆ నాడు, ఆ సాయంత్రం, ఆ పచ్చిక బయల్లో - ఆనంద వీణవై నీకు నీవుగా పలుకరించిన ఆ ప్రక్వాణ రాగ క్షణంలో -

ఆ కాకలీ స్వన తరంగాల వెంట, ఆ రమణీయ రూప కాంతుల వెంట, ఆ పరిపూర్ణ వికసిత కుముదినీ పరిమళాల వెంట – సుందర సూక్ష్మ రేఖా రమ్యమూర్తివై నీవు నా హృదయంలో ప్రవేశించిన ఆ మధుర క్షణం నుంచీ – నీవు నా దానవే !

నీ అంగీకారం శరీరం వరకే !

నా ఆరాధన అంతకు మించిన ఆత్మస్థాయి కలది !

పరమాత్మీయ పారాలను చేరిన ఆత్మోపరతి అది !

పూజిస్తున్నా నందుకే తన్మయతతో – నా హృదయ పీఠస్థమై భాసించే నీ సర్వాంగీణ గీర్వాణ సుందరమూర్తిని !

లావణ్యమ్ముల రాశి, హాసముల ప్రో
ల్లాసమ్ము, ఉద్వేగ లీ
లా విద్యుత్తు, వినీల కుంతల సమా
వేశమ్ము, ఆ జీవనో
జ్జీవానందము, తన్మయీభవ గుళు
చ్ఛీభూత రూపచ్ఛటల్ !
ఈ వైశాఖిని మించు రాగలత లే
దీరేడు లోకమ్ములన్ !

అంటూ పాడుకొంటున్నా నందుకే !

ఈ రాగలత పల్లవించి, పుష్పించి, ఫలించి – నాకు ప్రేయో మధురామూ, లోకానికి శ్రేయో మధురమూ కాగలిగితే !

4

వైశాఖీ !

నీ వొక పరమ అనుభూతివి నాకు !

కృష్ణభావంతో రాధ నూహించుకొని – రాధా విహార విపినే రమ తాం మనోమే అని పాడుకొంటూ – గోదావరీ తీర విపినాలలో తిరిగే వాణ్ణి నేను బాల్యంలో.

గంగకు ఉపనది యమున

గోదావరికి శాఖ వైనతేయం

కృష్ణుడు పశులకాపరి, నేనూ పశులకాపరినే చిన్నప్పుడు.

అతడిది యమునా తీరంలో బృందావనం. నాది వైనతేయ తీరంలో రసాల వనం.

కృష్ణ మంత్రాధి దేవత రాధ !

రాధ కృష్ణుడిది.

కృష్ణ భావం నా కెందు కిప్పుడు?

స్వభావం లేనప్పుడు

దృష్టితో చూచినప్పుడు నేనే కృష్ణుడి ననుకోవడంలో విప్రతిపత్తి ఉండకపోవచ్చు.

అయినా –

కృష్ణుడు ఒక వ్యక్తి. రాధ ఒక వ్యక్తి.

నే నొక వ్యక్తిని. నీ వొక వ్యక్తివి.

రాధ కృష్ణుడిది

వైశాఖి నాది.

నేనూ, కృష్ణుడూ ఒక్కటే అయినప్పుడు – నీవూ, రాధా ఒక్కటే కాదా?

వ్యక్తినీ, వ్యక్తి యొక్క అనుభూతినీ నిరూపించి చూపడం కోసమే ఈ పోలిక.

నేను కృష్ణుణ్ణీ కాను. నీవు రాధవూ కావు .

నేను నేనే. నీవు నీవే !

అనుభూతి ఎక్కడా ఒక్కటే. దేశ కాల పాత్రానుగుణంగా అభివ్యక్త మవుతుం దది.

మేఘమూ అదే . వర్షమూ అదే . నదీ సరోవరాది రూపాలు మాత్రం అనంతం.

పురుషుడూ అదే. ప్రకృతీ అదే –

ఈ సహస్రాధిక చరాచర సుందర లీలామూర్తులు నీవు !

నీ కరాపచిత పల్లవ వల్లరులలో, నీ పదాంక విలసన్మధుర స్థలాలలో, నీ యశో ముఖర మత్త ఖగావళులలో, నీ విహార సుందర విపిన వనాలలో, నీతో చెలికారమున్న ప్రతి చోటా, ప్రతి క్షణమూ రమిస్తూనే ఉంటుంది నా మనస్సు నిరంతరంగా.

ఆనంద పారమ్యం నీవు నాకు !

రాగ వైశాఖివై నీవు రాగానే -

పూర్ణ వసంతుణ్ణై నిల్చాను నే నిప్పుడు - ఈ రసాల వనంలో ! ఈ వైనతేయ తీరంలో !

5

బైట సృష్టిలో, లోపల భావమందు
వెలయు పరమ పదార్థ వైవిధ్య మెల్ల
ఎదద గొనివచ్చి నీ పూజ నిడితి, దేవి !
స్వీకరింపుము నను ధన్యు జేయు కొరకు !

విశ్వం లోని సకల సౌందర్యాలను, సకల మాధుర్యాలను, సకల తేజస్సులను, అమృతాన్ని, ఆనందాన్ని, ఆత్మను - యావత్సవంవదనూ సమర్పించేశాను నీకు ఆ తొలి చూపు లోనే.

తొలిచూపు జన్మాంతర సంస్కార చిత్త ప్రవృత్తి జన్యం
మలిచూపు మేధా విలాస విన్యసితం.
అందుకే -
తొలిచూపుది ప్రేమ
మలి చూపుది లోకజ్ఞత.
అందుకే -
క్రొత్తవాళ్ళం కాం మనం !

తొలిసారిగా అల్లంత దూరంలో పరస్పరం చూచుకోగానే, చిరకాలంగా విరహంతో కాలిపోతున్న వాళ్ళం వలె, ఒరిగిపోయాం ఒకరి ఒడిలో ఒకరం ఆత్మికంగా !

నా ప్రణయ పీఠం కోసం అంతవరకు - నేను నే నంటూ - పోటీలు పడుతున్న ఆసంఖ్యాక సుందర తారామూర్తులు - అరుణోదయంలో వలె - అదృశ్యమై పోయారు నీ రాకతో !

నీ రాక పూర్ణ వసంత జీవన రాక నాకు !
ఒక్క కొమ్మను మించి మరొక్క కొమ్మ
రాగ మధురము, పుష్ప భరాలసమ్ము ;
రంభ నొకదాని మించి ఊర్వశి ఒకర్తు
భువన మోహిని, ఆనంద పూర్ణ కలశి !

కొమ్మలు-రకరకాల అందమైన లేత, చిగురు, చేవ, పూల, పండ్ల కొమ్మలు - ఊర్వశులు, దేవకన్యలు -

ఎంతో మంది చూశారు, వచ్చారు, కూర్చున్నారు, మీటారు ఇక్కడ, ఈ నా హృదయ వీణను !

ఎన్నడూ ఇంత రాగ లలితంగా, లలిత మధురంగా, మధుర మోహనంగా స్పందించ లే దిది !

నీ చూపుల చిరునవ్వుల్లో చక్కిలిగింతలు పొంది కిలకిల్లాడి పోయిం దిది!

నీ ఆగమ వసంత సౌరభమే దీనికి నవ చైతన్యం అయింది.

మోదుగు మొగ్గల్లాంటి నీ మునివ్రేళ్ళు సోకీ సోకడంతోనే వెల్లి విరిసింది ఆనంద కంఠంతో.

వేయి కోయిళ్ళు ఒక్కసారి అందుకొన్నై స్వాగత గీతం నీకు.

క్రొత్త రాగాలు మెరుపు తీగల్లా నా శరీరం నిండా ప్రాకి, అనుభూతుల్ని పూచి, ఆనందంతో నింపేశై క్షణంలో.

దర్శన మాత్రం లోనే ద్రవింపజేసి, స్పర్శన మాత్రం లోనే అమృత గాన గోదావరిని వరద పొంగించిన రాగలక్ష్మివి నీవు !

సర్వ లాలిత్యాలూ, లాలసలూ, మృదుత్వాలూ, మాధురులూ, వ్రేళ్ళ కొసల దాకా కుట్మలించి స్వాగతం చెపుతున్నై నా ఆత్మకు నీ స్పర్శా స్ఫూర్తిలో !

పంచ ప్రాణాలూ, సహస్రాధిక నాడులూ తంత్రులుగా పట్టి పలికిస్తున్నావు నీవు నా హృదయాన్ని !

పలుకుతున్నాను నేను ప్రతి అణువునూ నీకు శ్రుతి చేసుకొని !

నిరంతరంగా పలికించు నన్ను !

పలకనీ నన్ను నీ ప్రతి భావానికీ రాగం మార్చుకొంటూ, ప్రతి రాగానికీ ప్రాణం కూర్చుకొంటు!

నిన్ను చూచి, సరస్వతిని చూశాను నేను వీణా మండలంలో !
ఆమె నా దోసిట్లోకి విసిరివేసిన ఆపాతమాధుర్యానివి నీవు
ఆలోచనామృతానివి నీవు
వరంగా వచ్చావు నీవు
స్వరంలా ప్రవేశించావు గుండెల్లో
మ్రోయించు అనురాగ రాగాలను !
పలికించు వీణా వైణిక భేదం అదృశ్యమై పోయేదాకా !
నాద బ్రహ్మనే అయేదాకా !
మూగ వీణను నేను
రాగ తాళము నీవు
నన్ను నిన్నును గూర్చు
నటరాజు రా నేల ?
అందెలను గట్టనేల? మన పైని
చిందులను ద్రొక్కనేల ?

6

ఎప్పుడో చూచినట్టే ఉంది నాకీ ప్రదేశం !

అర్ధచంద్రుడికి ముత్యాల గొడుగు పట్టిన ఆ శ్రావణమేఘ శలాక !

ఆ ముందర – విల్లెక్కుపెట్టి, పడమటి కొండల్లో మరుగై పోతున్న పంచ బాణుడు !

ఆ క్రింద – వికసిస్తూ, ముకుళిస్తూ ఉన్న నీలోత్పలాలు, రాజీవాలు !

సంజ చీకటిలో మునిగి, వెన్నెలలో తల లారబోసుకొంటున్న కొబ్బరి మొక్క తోటలు !

చీకటిమూసలో కరిగి పొంగిపడుతున్న ఆ వెండి వెన్నెల మనోజ్ఞ జలపాతం.

నురుగులు గ్రక్కుతున్న ఆ సరస్సు !

సరస్సు నుంచి దూకి, గిరిద్వయం మధ్యగా ఒరసి, క్రిందికి ప్రవహిస్తున్న ఆ కొండవాగు !

వాగుకు ఇరుప్రక్కలా ఆ నిమ్మ, నారింజ, అరటి, చెరకు, మామిడి, పనస, అనాస, దానిమ్మ, పోక తోటలు !

నిద్రలో మేల్కొంటున్న ఆ శుక శారికాదులు !

మెలకువలో నిద్రిస్తున్న ఆ కృష్ణైకాదశీ చంద్ర కళలు !

ఎప్పుడో, ఎక్కడో - అనుభవించినట్టే ఉంది నాకు ఈ అందం అంతా ! ఈ ఆనంద రాజ్యం అంతా !

అవును !

నాకు తెలుసు ఈ ప్రాంతం అంతా - ఇక్కడి ప్రతి అణువూ, ప్రతి అంశమూ, ప్రతి అందమూ !

ఇక్కడి ప్రతి తృణమూ నేను త్రొక్కినదే, ప్రతి పువ్వూ నేను వాసన చూచినదే, ప్రతి పాటా నేను విన్నదే, ప్రతి సరస్సూ నేను ఈత కొట్టినదే !

ఇక్కడి ప్రతి రుచీ నా అనుభవం లోదే !

అయితే -

ఎప్పుడు చూశాను దీన్ని?

ఎప్పుడు, ఎక్కడ అనుభవించాను ఇదంతా ?

జ్ఞాపకం లేదు !

బహుశా - ఈ జన్మలో అయి ఉండదు !

వైనతేయ తీరంలో అమలాదేవి ఒడిలోని నా రసాలిని - కామరూపంలో - ఇక్కడ ఆవిర్భవించ లేదు కదా నా కోసం !

అయి ఉండదు.

జ్ఞాన యుగం లోని అద్భుతాలు విజ్ఞాన యుగంలో సాధ్యం కావు.

జ్ఞానం ఆనందం తోడిది

విజ్ఞానం ఆహారం తోడిది

ఈ ప్రాంతం ఆనంద విక్రీడితం

ఈ సౌందర్యం సనాతనం

ఏ జన్మలో చూశానో దీన్ని !

ఏ ప్రవృత్తిలో అనుభవించానో దీన్ని !

ఏ రూపంలో రమించానో ఈ సుందర సుమనోంతఃపుర రాగ మనో రమలతో !

ఈ పరిచయం ఇప్పటిది కాదు !

కాని –

ఇంత కొత్తగా అలరిస్తున్న దేమిటి నన్ను !

కాక –

నే నెరిగిన నీ సౌందర్యమే – సూర్యకాంతి ప్రిజం నుంచి వలె – నా స్మృతి పథం నుంచి వెలువడి, ఈ మోహనరాంగ లీలను ప్రదర్శిస్తున్నదేమో నా ముందు !

ఎక్కడైనా, ఎప్పుడైనా, ఏ సౌందర్యమైనా అంతేకద !

నిన్నెరిగిన తర్వాత, ఎరగని దేముంటుం దీ సృష్టిలో ?

నీవు తెలిస్తే – సమస్తమూ తెలిసిందే !

నీవు సనాతన జీవన ధర్మధారవు నాలో !

నా చుట్టూ గల ఈ సౌందర్య విలసనం అంతా – నీ ధారాపాత వినిర్గత సుధాతుషార లీలా వికసనమే !

నీవు నాకు చిరపరిచితవు

కనుకనే –

ఈ సృష్టి సమస్తమూ నాకు చిరపరిచితం !

ఇంత దూరమూ నీ శ్రీధామం !

ఇంత దివ్యమా నీ విహార భూమి !

7

వేయకురా – చేయి వీణపై !

తీయకురా – ముసుగు నిదురపై !

నర నరాలలో

నవ రాగాగ్నులు

రగిలించకురా !

రాజ వైణికా !
బిగువు సడలెరా
రగిలిన గుండె !
పగిలే స్థాయిని
పలికించకురా !
విర హాగ్నికి నీ
వ్రేళుల కొనలే
సమిధలు గా నను
స్వాహించకురా !
కోయిల పాటకు
కొండ వాగునకు
నాద బ్రహ్మకె
నను శ్రుతి చేతువా !
పాదలేనా నీ
పరమ స్థాయిని !
ఉండిపోదు నీ
ఉరమున వ్రాలి !

ఓహో !

మేఘాల మధ్య నుంచి మెరుపు తీగ వలె, సౌధోపరి తలం నుంచి ఎక్కడి దా గాన రస తరంగిణి !

కంఠం నీదే
రాగం నీదే
పాట నాది !

మొన్న ఏదో పత్రికలో ప్రకటించిన నా పాట కదూ అది ?

ఎంత ధన్యుణ్ణి నేను !

ఈ నాడు పాటలు వ్రాయలేని తెలుగువాడే లేడు కదా !

మరి నా పాటే ఎందుకు పాడుతున్నావో నీవు !

ఎంతో కాలంగా నా పాటలే పాడుకొంటున్నావు కదూ !

నే నెవరో తెలియని నాటి నుంచీ కూడ !

ఇది కదా జన్మాంతర ప్రణయవాసనా సుశ్రీ !

ఏమీ తోచక, నిద్రపట్టక, నీ నామజపం చేసుకొంటూ, ఈ అర్ధరాత్రి, ఇంతదూరం నడిచి వచ్చినందుకు - ఎంతటి మధురామృతం లభించింది నాకు !

నీ కంఠంలో కరిగిపోతున్న దది పాట కాదు - నేనే !

హిందోళ రాగంలో నీవు విసిరిన ఆ గానతరంగిణి - ఆనందాందోళికలో తీసుకుపోయింది నన్ను - ఎక్కడికో - నీ హృదయాంతఃపురం లోకి !

పరమ పారవశ్యం లోకి !

8

ఓహో - ఏమి టివన్నీ !

ఫొటోలు ! ఫొటోలు ! ఫొటోలు !

ఎన్ని ఫొటోలు ! ఎన్ని పోజులు ! ఎన్ని రంగులు ! ఎన్ని రకాలు !

నా గది నీ ఫోటోలతో నిండి, ఒక యువతీ కళాశాలే అయింది !

ఎందుకు పంపించావు వీ టన్నిటినీ ?

ఇందులో దే న్నని ఎంచుకోను ?

తరచు కలుసుకోలేం కనుక, ఒక వారం రోజుల పాటు మా ఊరికి పోయి రావలసి ఉంది కనుక, నీ ఫోటో ఒకటి పంపించు మన్నందుకా నాకీ ఎన్నిక కార్యక్రమం ?

సరే !

ఫొటోల రాశి పైకి దూకింది నా దృష్టి-ధాన్యరాశి పైకి కోడిపుంజు వలె !

ప్రకృతి లోని రసాలూ, రుచులూ అన్నీ కలిసిన సహజ సౌందర్య రాశివి నీవు.

ఈ ఫొటోలు ఎంతటి అమూల్య రత్నాలైనా, నీ అనుకృతులే.

నీవు ఎదుట ఉండగా, నీ ప్రతిమ నాకెందుకు ?

నీవు లోనికి వచ్చిన తర్వాత కూడ, నిన్ను బైటే వెతుకొంటున్నా నేమిటి ?

లోపల నిరీక్షిస్తున్నావు నీవు నా కోసం

నే నింకా బైటే కూర్చున్నాను నీ కోసం !

మానవ స్వభావం ఇంకా ఎంత చీకట్లో దేవులాడుతున్నది !

సరే –

నాకు కావలసిం దొక్క ఫొటో.

ఈ మహారాశిలో ఏ ఒక్కటైనా నీదే కద !

మరి – ఇలా వెతుకుతున్నా నేమిటి !

అవివేకమా ?

నీ సంపూర్ణ సుందరమూర్తి కోసం ప్రయత్నమా !

విద్యుత్తు నుంచి కాంతిని వలె నీ నుంచి ఎంతటి సౌందర్యమైనా పొందవచ్చు.

నిన్ను నిన్నే పొందాలని నా ఆశ !

అందుకే ఈ యజ్ఞం !

కెమెరాకు జీవమే లేదు. జ్ఞాన మెక్కడిది?

అది నిన్నెలా పట్టగలదు ?

కేవల నిర్జీవ సమాజం లాంటి దది !

నీ సౌందర్య ధగధ్ధగలకు అది ప్రేలి ముక్కలై పోదా ?

నీ వాస్తవ రూపం లోని సహస్రాంశ కూడ ఇందులో ఏ ఫొటోకి రాలేదు!

గులాబీ మల్లె కాదు, మల్లెల మధుప్రియ కాదు, మధుప్రియ మలయ మారుతం కాదు.

ఈ ప్రకృతి నిండా అందాలే. దేని అందం దానిది.

అన్ని అందాలూ కలిసిన ఒక సమగ్ర సంపూర్ణ సౌందర్యం ఒక్కచోట ఎలా సాధ్యం ?

కొన్ని అందాలు దూరానికి బాగుంటై

కొన్ని దగ్గరగా బాగుంటై

కొన్ని నిజమైన అందాలు కెమెరాకు అందవు

కొన్ని సహజ వికారాలు ఫొటోలో కనిపించవు

కెమెరాది కోణ దృష్టి !

దర్శన, స్పర్శన, ఆస్వాదన, ఆరాధన యోగ్యమైన అందమే అందం నిజంగా.

సంపూర్ణమూ, సమగ్రమూ అయిన అందం నీది !

నీ చిత్తం, నీ మనస్సు, నీ హృదయం, నీ హక్కు, నీ శరీరం – నీ ప్రతి అణువూ, దాని ప్రతి కదలికా ఒక అందమే.

నీ చుట్టూ అందాలు

నీ నిండా అందాలు

అందాల రాశివి నీవు.

ఒక్క అందాన్ని మాత్రం పట్టి చూపగల ఒక్క ఫొటోలో నీ సమస్త సౌందర్యాలను కోరుతున్నాను కదూ నేను ?

వట్టి అవివేకం !

ఏదో ఒక్క అందంతో తృప్తి పడని నావంటి వాళ్ళకు శ్రమ తప్ప సుఖం లేదు. ఆవేదన తప్ప ఆనందం లేదు.

ఇప్పుడేమిటి చెయ్యడం ?

నిన్నే ఒక ప్రతిమగా మార్చి, జేబులో పెట్టుకోనా ?

అప్పుడు నీ వుండవే !

నీవు లేని నాకు నీ బొమ్మ ఎందుకు ?

ఒక్క ఫొటో ఎంచుకోడానికి ఇంత రాద్ధాంతమా – అంటావు కదూ ?

ఫొటో నీ లోని ఒక్క అంశానికి అనుకృతి.

నాకు కావలసింది నీ మొత్తానికి సమ్యక్కృతి !

మానవ జీవిత మూహా
గానం కంటే చిక్కన !
మానవ హృదయం కవితా
గానం కంటే చక్కన !
చిత్తంలో ప్రతి దెబ్బా
సుత్తి దెబ్బగా మలచిన

మానవ మూర్తిని మించి
మహిత శిల్ప మేమున్నది ?
ఏల నాకు చిత్రాలు ?
ఏలా నా కజంతాలు ?
వెన్నెలలో విహరించే
నిన్ను మించి కళ కలదా ?

9

వెల్లి విరిసి, విను వీధు లొరిసి ప్రవహిస్తున్నది వైనతేయం !

ఈ మధుశిలపై కూర్చుని, ప్రవాహంలో కాళ్ళాడించు కొంటూ, ఇలా ఎన్ని నిశీధాలు గడిపానో నేను – నా బాల్యం నుంచీ !

పైని – పాలవెల్లి పొంగిన స్వర్ణది !
క్రింద – గోదావరి వరదలో వైనతేయం !
పైని – గోలోకం, రాధ, కృష్ణుడు
క్రింద – తోటలు, పొలాలు, నీవు, నేను !
నా హృదయంలో నీవు !
వీణా మండలం నుంచి ఏదో నాదం !
నా హృదయంలో నుంచి ఏదో గానం !
శ్రావణ నిశీధం !
ఎందుకో మేఘం పట్టలేదు !
పరమేశ్వరి కదా గోదావరి !

అనంత రూపాలతో అలరిస్తున్నది – పరమేశ్వరుడైన ఆంధ్ర సాగరుణ్ణి !

అతడు ఆనంద హృదయంతో అందరికీ అన్ని చేతులు చాచి, ఆలింగనం చేసుకొంటున్నాడు, ఆత్మైక్యం ప్రసాదిస్తున్నాడు, అనుక్షణం.

గౌతమి, వసిష్ఠ, ఆ మధ్యలో వైనతేయం – ఈ నదీమూర్తులు ముగ్గురూ నా ఆరాధ్య దేవతలే !

ఆ మధ్యస్థ లంక భూములన్నీ నా విహార వనాలే.

అమలాదేవి కరుణా కటాక్ష భాగధేయాలు ఇవన్నీ

వాటన్నిటి సారభూతమే ఈ నా రసాల వనం.

ఈ వనంలో లేని పుష్పలతలు, ఫలవృక్షాలు, విహంగాలు, సరోవరాలు, సౌందర్యసీమలు మరెక్కడా లేవు లోకంలో.

ఋతుకాంత లారుగురూ కలిసి నర్తిస్తూ ఉంటా రిక్కడ సర్వకాలాల్లోనూ.

నే నొక్కణ్ణీ అనుభవించలేను ఈ సౌందర్యం అంతా !

ఎన్నో రూపాలతో ఎన్నో మాధుర్యాలను ఆస్వాదింప జేస్తూ, రాగలీలవై నన్ను చిన్నప్పటి నుంచీ రంజిస్తున్న వనలక్ష్మివే నీవు !

నా తోట లోని ప్రతి పల్లవమూ, ప్రతి పుష్పమూ, ప్రతి ఫలమూ, ప్రతి మెరుపూ, ప్రతి రుచీ, ప్రతి రవమూ నీ శ్రీపాద రేణు పరిమళ సుభగమే.

ఈ తీర వాసినివే నీవు

నా ఆబాల్య సఖివే నీవు

ఇప్పుడు కూడ ఫొటోగా నా జేబులో, దేవతగా నా హృదయంలో ఉన్నావు నీవు నాతో.

అయినా –

నీ శ్రీధామం భాగ్యనగరంలో !

నా రసాలిని కోననీమలో !

ఇంతవరకు నీవు నా ఊహవు, వాంఛవు, ప్రకృతి సౌందర్య రాగదేవతవు.

నా కల లన్నీ కళా రూపం దాల్చిన పరమ సుందర వైశాఖివి ఇప్పుడు నీవు !

నీవు వేరు, నేను వేరు ఇప్పుడు !

నా నుంచి విడిపోయిన నేనే నీవు !

నిజానికి మన మధ్య దూరం ఇప్పు డనంతం !

నా సుందర స్వప్నదేవతవు కా విప్పుడు నీవు. ఒక ప్రత్యేక వ్యక్తిత్వం గల మానవ కాంతవు.

మానవ కాంతల కంటే దేవ కాంతలే ప్రణయ సులభలు !

అందుకే ఈ వియోగ దుఃఖం.

శ్రావణ నిశీధమే వైశాఖ మధ్యాహ్నంలా వేగిపోతున్నది !

ఈ విరహాగ్ని ఒక దుర్భరం !

ఇలా ఎంతకాలం ఉండగల నిక్కడ ?

నీ లేఖ అందింది.

అది మరీ అగ్నిపై గుగ్గిలం చల్లింది !

ఈ కళా మధురానంద లోక మందు

నేను చూడని సౌందర్య మేది లేదు ;

కాని, నిను చూచినప్పుడె కలిగె నాకు

కన్నులకు కాంతి, గగనమున కస్మితయును !

10

కన్యాకుమారిలా, ఆ చివర నీవు

హిమవంతుడిలా, ఈ చివర నేను

అంతర్వాహిని అయిన మన ప్రణయ సరస్వతిలో నీ పాద పద్మాల పసుపు పారాణి పరిమళాలు !

నా పాదాలకు ఏత తృహవాస వాసనా వైభవం !

పాదాలతో పాదాలు కలిసి నప్పుడెల్ల, తను లతలపై రాగాంకురాలు మొగ్గ దొడుగుతున్నై !

అవి ముద్ద గులాబీల మొగ్గలై, నిక్కి చూస్తున్నై పైకి మన చేతుల కేసి !

కాళ్ళ దగ్గర కలిసే ఉన్నాం మనం. శరీరాలకే ఈ ఎడబాటు !

అటు నీవు – ఇటు నేను !

ఈ మధ్య దూరం అనంతం

ఆటంకాలు అసంఖ్యాకం

కలవ నివ్వదు లోకం మనల్ని ముఖాల దగ్గర !

ఈ వికాసం, ఈ కాంతి అంతా ఎక్కడిదో దానికేం తెలుసు ?

మన పాదాలు కనిపించవు దానికి !

నీ పాదాలను నా కాళ్ళతో నొక్కే కొలదీ అలా మైకంలో పడిపోతున్నా వేమిటి నీవు ?

నీ మైకమే నేను

నా జాగృతిని నీవు

మన మధ్యది ఈ లోకం !

ఈ లోక వ్యవహార మట్టానికి దిగువ - మన పాదాలు మనకే కనిపించడం లేదు !

ఎంతటి స్పర్శా సుఖం !

ఆ సుఖమే ఈ వసంతాలకు మూల బీజం.

తెలీదు లోకానికి మన సంగతి !

మనల్ని విడదీసి ఉంచా ననుకొంటున్న దది.

మనం కలిసే ఉన్నాం పాదాల దగ్గర - పాలకడలి లోతుల్లో !

లక్ష్మీ సరస్వతులు నాకు నీ పాద పద్మాలు

వాటికి సేవా మందిరాలు నా హస్త కమలాలు

నా హస్త కమల సంపుటిలో లక్ష్మీ సరస్వతులు !

నా గుండెలపై తాండవించాలి ఈ జంట !

లక్ష్మిని గుండెల మీదే ఉంచు !

నా జిహ్వాగ్రం వరకూ రానీ సరస్వతిని !

ఇక మేలుకో మైకం నుంచి !

తిరుగు ఇటుకేసి !

ఎంత కాలం ఈ దూరం ?

ఎంత దూరం ఈ కాలం ?

11

పిచ్చివాడ నైతిని !

ప్రేమ కామినై, నీకై !

ఒక్క పిచ్చివాణ్ణే కాదు - నీ కోసం ఏమైనా కాగలను నేను !

గోదావరి నుంచి నా వైనతేయాన్నే తీసుకొచ్చాను భాగ్యనగరానికి నీ కోసం!

నే నెక్కడుంటే అదే నా రసాలిని !

శివగిరి, వైనతేయం, మధుశిల, రసాలిని - అక్కడ నేను !

తూర్పున శివగిరిని ఆనుకొని ఆంజనేయుని కొండ, దాని ప్రక్కదే నీ నివాసం శ్రీధామం !

పడమట పౌరోద్యానం. ఆ ప్రక్కది ఆకాశవాణి.

ప్రతి ఉదయం ఆంజనేయుడికి కొబ్బరికాయ కొట్టి, ప్రసాదం నీ గుండె గుమ్మంలో ఉంచుతూ ఉంది నా మనస్సు.

ఆంజనేయుడు మనస్స్వరూపి. అతడికి కొట్టే కొబ్బరికాయ జగత్స్వరూపి.

ఆత్మ తపస్సులో ఉంది. హృదయం ఆరాధనలో ఉంది. మనస్సు పూజలో ఉంది. శరీరం మాత్రం నీ దర్శనం కోసం తిరుగుతూ ఉంది - వైనతేయ తీరం వెంట - నా రసాలినికీ, నీ శ్రీధామానికీ మధ్య !

ఉదయం ఉషస్సువు నీవు.

బాలసూర్యుని కర కమలాలలో నీ చరణ కమలాలు నా నమస్కృతీ కమల కలికా పరిసేవితాలు !

సాయంత్రం సంధ్యవు నీవు.

పౌరోధ్యాన వృక్ష లతాదుల శిరో వేదికలపై రమ్య నృత్యం చేసే రాగలీలవు నీవు !

ఉదయం రాగ జ్యోతివి. మధ్యాహ్నం రాగ ప్రభవు. సాయంత్రం రాగ రమవు నీవు !

సమస్త విశ్వ రాగ రుచులూ రాశీభూతమై వికసించిన రాగవైశాఖివి నీవు !

అదిగో ఆకాశవాణిలో నీ వీణా వాణి !

వింటూ కూర్చున్నా నిక్కడ – ఈ మధుశిలపై, ట్రాన్సిస్టరు పెట్టుకొని !

ఇప్పుడు అహోరాత్రాలు నీవే నాకు !

పుష్పాలు, పరిమళాలు, మధువులు, ఫలాలు, నదులు, నక్షత్రాలు – విశ్వం నిండా విరిసిన ఈ సమస్త సంపదలూ – నా దృష్టికీ, భావానికీ అందిన తక్షణం – నీ పూజలో అర్పితమై పోతున్నై !

ప్రేమించాను నిన్ను
స్వీకరించావు నీవు.
ప్రేమించడమే జీవితం
ప్రేమ విజయమే జీవిత విజయం.
ఇక సాక్షాత్కరించవా, దేవీ ?

అరవిందమ్ములు చూచునన్ భయము లే ;
దాశావకాశమ్ము ని
ద్దురలో నున్నది; ప్రేమ చంద్రు కర సిం
ధూరాను రాగాను షం
గ రుచుల్ గ్రోలి, ప్రఫుల్లవై చెలయు మిం
కన్ చైత్ర కాలమ్ము నీ
కొర కిం దాగిన, దీ క్షణమ్ము వృధ కా
కుండన్ ప్రమోదింపుమా !

ఈ హృదయ నివేదన నీ మనస్సుకు అందుతున్నదో లేదో !

మామూలు లేఖలు ఎన్ని వ్రాసి ఏం లాభం ?

హృదయాన్నే లేఖగా మడిచి నీ శ్రీధామం లోకి విసిరి వేస్తున్నాను ఈసారి!

రాగ వాంఛలు రమ్యాక్షరములు కాగ ,
రాగ రక్తిమ లేఖన రసము కాగ ,

హృదినె లేఖగ మడిచి, నీ పద సరోజ
సేవ నర్పింతు ! విప్పి చూచెదవొ, లేదొ !

చూచి, అది ఏదొ-స్వప్నవాసుల అనైజ
భావ రమణుల పారాణి పాద చిహ్న
పంకిలమ్మని - చించి పార్వైతు వేమొ !
కై కొనవొ యేమొ దాని ఏకాంత సేవ !

కై కొనియు, అది నేటి లోక స్వభావ
మని ఉపేక్షింతువేమొ ! ఏమైనగాని
నీ కరుణగోరి నీ చేత నిలిచియున్న
లేఖ నేనే సుమా ! విస్మరించవలదు !

12

మన్మధ బాణాల్లా ఉంటారు కొందరు !

సానపట్టిన మన్మధ బాణాల్లా !

చూపులు మరుని తూపులు కావడంలో విశేషం లేదు. ప్రతి సుందరి చూపులూ అవి గురి పెట్టబడ్డ లక్ష్యానికి తూపులే.

ప్రతి సారీ అవి తగలక పోవచ్చు. తగిలినా గాయపరచ లేక పోవచ్చు. అయినా, ఒక క్రమ గమనం కల బాణా లవి.

తామే మన్మధ బాణాలు కొందరు !

ఆపాద మస్తకం వాళ్ళ ఆకారాలే మంచి వాటమైన బాణాల్లా ఉంటై !

మొన దేరిన అలాంటి ఒక్కొక్క బాణం రివ్వుమంటూ -

మనకేసి గురిపెట్ట నక్కర లేదు - మన వంక చూడ నక్కర లేదు - మన ఊహే ఉండ నక్కర లేదు -

అది ఎందుకు ఎటు పోతున్నా సరే - మన గుండెల్లో నుంచే దూసుకు పోతుంది !

చూపులు తూపులైనప్పుడు - వాటిలో కొన్ని తేనేటీగల్లా కుడతై.

మరికొన్ని తలవెంట్రుకకాయలు కురులలో వలె గుండెల్లో చిక్కుకొని ఊడిరావు.

కొన్ని గాయం చేసి పోతై.

కొన్ని చేసిన గాయాలు మానవు.

కాని -

ఆ తూపులతో పాటు విల్లూ, దాని వెనుక గల విలుకత్తే కూడ - ఒక తిరుగులేని మహాస్త్రమై హృదయంలో నాటితే - ఇంకేముంది !

ఒక అరవిందం మోహన మనిపిస్తే, ఒక అశోకం వెర్రెత్తిస్తుంది.

ఒక చూతం ప్రతి నరాన్నీ ఉద్దీపింపజేస్తే, ఒక నవమల్లిక నడిరోడ్డు మీదే శోషిల్ల జేస్తుంది.

ఒక నీలోత్పలం నిశకే నిప్పంటిస్తే, ఒక -

అయిదేనా మన్మధ బాణాలు! అయినా, లక్షల సంఖ్యలో ఉండవా ఒక్కొక్కటీ?

ప్రతిరోజూ, ఎక్కడో ఒకక్కడ, ఏదో ఒక బాణం నాటుతూనే ఉంటుంది నా రొమ్ములో !

ఈ బాణాలు - కత్తుల్లా, కొరడాల్లా, రవ్వల్లా, రాకెట్లలా - మగవాళ్ల గుండెలతో ఇలా ఎందుకు చెలగాట మాడతవో !

నెత్తురు చిందేలా ప్రియురాలు పెదవి కొరికితే - అది గురి చూసి కొట్టిన బాణమే అనవచ్చు.

కానీ -

ఎటుకేసి, ఎందుకోసం పోయే బాణమైనా - నా గుండెల్లో నుంచే దూసుకు పోవడం - ఎంత బాధ !

ఈ బాధ నాకు చిన్నప్పటి నుంచీ ఉన్నదే.

కాని -

ఏ మహా బాణం విసిరాడో ఇప్పుడు నా మీదకు మన్మధుడు !

దూసుకు పోయిన బాణం కాదిది !

బైటికి పోలే దిది !

గుండెల్లో నుంచి ఆత్మ లోకి దిగిపోయిన రాగనిశిత నారాచం ఇది !

నా కోసమే నిర్మించబడి, నాకేసే ఎక్కుపెట్టబడి, సూటిగా నాలోకే దిగిపోయిన అపూర్వ ప్రణయాస్త్రం ఇది !

ఇది జరిగింది శ్రావణ పూర్ణిమ నాడు !

వరలక్ష్మీ వ్రతఫలం చిప్పిలిన రాగరసంతో నింపావు నీవు - ఆ బాణం దిగిన తోరణ గండిని !

నీవే ఆ బాణం !

నీవే ఆ రాగం !

ఆ నాటి నుంచీ పిచ్చివాడిని నేను నీ కోసం !

ఎదురు చూస్తూ కూర్చున్నా నిక్కడ - మధుశిలపై

అదిగో -

అది పూర్ణ చంద్రోదయమా !

రెక్కల గుర్రంపై భాద్రపదివై వస్తున్న నీవా ?

మహిమీద నీ వొక్క మనిషివే అగుగాక !

ఇరుగు పొరుగుల కొక్క ఇంతివే అగుగాక !

ఆస్తి, అందము, పదవి - అంతమాత్రమె జగము !

నాకు మాత్రము నీవు లోకోత్తర శ్రీవె !

భాద్రపది

శ్రావణి నాడు అక్కడ అలా కలుసుకొన్నాం. భాద్రపది నాడు ఇక్కడ ఇలా కూర్చున్నాం !

ఈ లోగా ఎంత వర్షం, ఎన్ని తుఫానులు, ఎంత కల్లోలం !

ఎన్ని మెరుపులు, ఎన్ని పిడుగులు !

స్త్రీ పురుషుల మధ్య సెక్సు మినహా స్నేహం ఉండ దనుకొనే లోకం చిమ్మిన ఎంత బురద !

లోకం చిమ్మేదే బురద ! సెక్సు పవిత్రమే నా దృష్టిలో !

ఎంతో దగ్గరగా కూర్చున్నాం

ఏవేవో కబుర్లు చెప్పావు నీవు

ఏవేవో ప్రశ్నలు వేశావు నన్ను

నా కేమీ తెలియ లే దప్పుడు !

నాకు ఆ క్షణంలో తెలిసిందొక్కటే – నీ సాన్నిధ్య సుఖం !

ఇప్పు డదంతా జ్ఞాపకం వస్తున్నది ! ఒళ్లంతా చెంబేలీ మొగ్గలతో నిండిపోతున్నది !

తగిలీ తగలని ఆ స్పర్శ ఎంత అవ్యక్త మధురం !

ఇంకొంచెం దగ్గరగా జరగాలని ఎన్నిసార్లో యత్నించింది నా ఒళ్లు !

అలా నీ మెరుస్తున్న మెడపై వాలాలని ఎన్నిమార్లో కదిలింది నా చేయి!

ఆ చిరునవ్వుల తేనె మందారాలను ఒక్కసారి – ఒక్కసారి.

నిగ్రహం అంత కఠోరమని అంతవరకు తెలియదు నాకు !

"ఒళ్ళు దగ్గర పెట్టుకొనే ఉన్నారుగా ?" అన్న నీ హెచ్చరిక నవ్వుతూ వచ్చినా, రివ్వునే తగిలింది నా బుద్ధి చెంపపై !

ఓ - అన్నాను కొంచె సర్దుకొని !

నిజాని కది అబద్ధం.

నా ఒళ్ళు నా దగ్గర లేదా క్షణంలో.

నా దగ్గర ఉన్నది నీ ఒళ్ళు !

నా దగ్గరా నీ దగ్గరా ఉన్నది నీ ఒళ్ళే ! నా ఒళ్ళే ఎక్కడా లేకుండా పోయినట్టిది !

చంద్రుడు, వెన్నెల, పొంగి ప్రవహిస్తున్న వైనతేయం, కబుర్లు, శృంగార కళలు, కన్నులలో కాంతులు, కంఠంలో వీణా స్వనాలు, ఏదో స్పందనలు ! ఒడళ్లే లేవు మన కప్పుడు !

ఏదో హాయి !

నిశ్శరీర హృదయ స్థాయి !

కరాంగుళులు గుసగుసల లాడుకొంటున్నై !

ఆత్మలకు చేరుకొంటున్నై వాటి వార్తలు !

గులాబి మొగ్గలు నవ్వుకొంటున్నై సిగ్గుల చెరగులలో !

ఎక్కడున్నాం మనం !

"అమ్మా ! మీకు నా ఆత్మ కావాలా ! శరీరం కావాలా ?"

ఓహో ! ఇక్కడా ఉన్నాం మనం !

ఏం ప్రశ్న అది !

ఎంత కంగారు పడ్డానో నీ ప్రశ్నకు !

అంతటి ఆత్మావిష్కృతి తర్వాత ఇంతటి ప్రాథమిక ప్రశ్న !

అంతటి ఆరాధన తర్వాత ఇంతటి అసంగత మీమాంస !

అవును - అదంతా కేవల భావనా స్వప్న స్వరూపం.

ఇప్పు డిది పచ్చి వాస్తవ జాగృతి !

స్వప్న మనగా నేమి ? జాగృతి అనగ నేమి ?
మనసు మొదటిది, దాని అనుభవమె రెండోది !
అనుభవమ్ములు అసంఖ్యాకమ్ము లగు నపుడె
ఆనందమై మనకు అపవర్గ రుచిరమౌ !

14

"ఆత్మ కావాలా? శరీరం కావాలా?" అని కదూ నీ ప్రశ్న ?

"శరీరం వద్దులే" అన్నాను నేను ధీమాగా !

నమ్మలేదు నీవు !

నీ చూపులే చెపుతున్నైగా ?

"నిజం, దేవీ ! ఆత్మకూ, శరీరానికి పోటీ వచ్చినప్పుడు, నేను ఆత్మనే వరిస్తాను. చేతిలో చేయి కూడ వేస్తాను. ఏదీ చేయి ?"

ఇవ్వలేదు నీవు !

ఏం ?

ఏమో ! నా మాట నమ్మలేదు నీవు. నమ్మడం ఇష్టం లేదు నీకు !

"మనకు శరీరాలు వద్దు" అని కూడ అన్నావు కదూ చేయి ఇస్తూ ?

భావ కవుల అమలిన శృంగార భావం నీ దాకా ఎలా వచ్చిందో !

అప్పుడేగా నీ చేతి లోని రేఖలు నేను చూస్త ?

వలరేని విల్లులా ఎంత దివ్యంగా వంగి ఉంది నీ హృదయ రేఖ !

ఎంత తేలిక పడింది నా హృదయం !

అమలిన శృంగార భావం మెంటల్ సెక్సుకు సంబంధించి నట్టిది. అది నీ సహజ ప్రవృత్తి లోది కాదు. అంతే చాలు నాకు.

కొందరు కొమ్మ లుంటారు. బంగారు బొమ్మల్లా ఉంటారు. ఆకర్షిస్తారు. ఆకర్షించ బడతారు. అంతే. మరెందుకూ పనికిరారు పురుషుడికి. ఆలయంలో పూజ లందుకోడానికి మాత్రం పనికివచ్చే ప్రతిమలు వాళ్ళు.

పురుషులలో కూడ ఉంటా రలాంటి వాళ్ళు.

అట్టి వాళ్లతో స్నేహం, సాహచర్యం, సంపర్కం, సంసారం వంటివి బహు కష్టం. తాము సుఖపడరు. మరొకళ్ళని సుఖపెట్టరు వాళ్ళు.

శరీరాలే ప్రధానంగా సాగుతున్న జీవయాత్రలో, అవి అక్కర లేకుండా ఎలా బ్రతకడం !

అన్నం లేకుండా వట్టి సానుభూతితో కడుపు నిండదు.

శరీరాలు కలవకుండా వట్టి మానసిక ప్రేమతో ఆత్మ తృప్తి పడదు.

మనః పరిధిని దాటి, హృదయాన్ని ద్రవింప జేసి, శరీర వీణను మీటి, జీవితాన్ని రాగరంజితం చేసుకో గలిగిందే సమగ్రంగా వికసించిన ప్రేమ.

సెక్సు లేకుండా ప్రేమ ఫలించదు శృంగారంగా.

ప్రేమ లేకపోయినా సెక్సు ఫలిస్తుంది సంసారంగా.

సెక్సు పూర్తిగా శారీరకం. ప్రేమతో కూడినప్పుడు అది అమృతం అవుతుంది అదే శృంగారం.

శంగారం మలినమూ కాదు. అమలినమూ కాదు. అదొక ఆనంద రసానుభూతి. ద్వంద్వాతీత పరమస్థితి అది.

అమలిన శృంగార భావం శారీరక బలహీనతలు కల కేవల భావుకలది. తా చెడ్డ కోతులు వాళ్లు.

మన ఇద్దరమూ సమగ్ర ప్రేమ ప్రవృత్తి కలవాళ్లమే. మన మన హృదయ రేఖలలో మధురమైన ఆ చెరకు విలువంపులు ఉన్నై.

ఇప్పుడు చెప్పనా – నీ ప్రశ్నకు సూటి జవాబు ?

నీ ఆత్మా, నీ శరీరమూ, మొత్తం నీవే కావాలి నాకు !

నీ వొక మధు కలశం.

మధువు ఇచ్చి కలశం దాచు కొంటావా ? ఎందు కది ?

శాశ్వతమైన ఆత్మను ఇచ్చేసి, క్షణ భంగురమైన శరీరాన్ని భద్ర పరచుకోవడం వివేక మేనా ?

అమలినంగా ఉండ వలసింది ఆత్మా ? పెక్కు మాలిన్యాలతో నిర్మించబడ్డ శరీరమా ?

అసంబద్ధమైన ఈ మాలిన్య వాదం ఆర్షం కాదు, ఆప్రాచ్యం.

హృదయ పూర్తిగా, ఆత్మబుద్ధితో చేసిన ఏ పనికీ మాలిన్య దోషం లేదు.

శరీరాన్ని ఇచ్చి, ఆత్మను దాచుకోవచ్చు.

ఆత్మను ఇచ్చి, శరీరాన్ని దాచుకోవడం అసాధ్యం. అనవసరం కూడ.

నీ శరీరం నీది కానప్పుడు పడే పాట్లు అవి.

నీవు సర్వస్వతంత్రురాలవు కదా ! ఏదో ఒకటే ఇవ్వాలనుకొంటే ఆత్మనే ఇవ్వు ! నాకు మాత్రం పూర్ణత కోసం నీ శరీరం కూడా కావాలి !

శరీరాల కలయికతో ఆత్మారాధన సమసిపోతుం దేమో, ఆ తర్వాత మిగిలేది వట్టి నిరానంద నిరుత్సాహక దైనందిన జీవిత విధులే నేమో – అనే భయం కూడ ఉంది కదూ నీకు ?

వాడిపోతానేమో నని గులాబి మొగ్గ వికసించక మానుతున్నదా ?

చచ్చిపోతానేమో నని అరటిచెట్టు గెలవెయ్యక మానుతున్నదా ?

వట్టిపోతానేమో నని మేఘమాల వర్షిం చక మానుతున్నదా ?

వేదనలే జీవితం. అవి తీరడమే మోక్షం.

జీవితం ఒక వేదనా సామూహి.

వేదనలు తీరే కొలదీ జీవితం వికసిస్తుంది. దాని పూర్తి వికాసమే ఆనందబ్రహ్మ.

వేదనలను మధురీకరించి, ఆత్మారాధనలో నీరాజన మవుతుంది – ప్రేమికుల శరీరానుభవం.

త ద్విరుద్ధమయింది పచ్చి సెక్సు.

అది మనది కాదు.

మన ప్రేయసీ ప్రియులం. జీవేశ్వరులం. మన ఐక్యం సమగ్రం. సర్వసంపూర్ణం.

పూర్ణార్పణ ఒక్కటే అర్ధనారీశ్వర వ్రత సిద్ధి !

సామాన్య స్త్రీవి కావు నీవు
అధిగమించు లోక పరిధిని
వికసించు ఆత్మస్థాయిలో
నేను ఉన్నది అక్కడే !
నీ కోసం నిరీక్షిస్తూ !

15

జీవితం ఒక నిరంతర ఘర్షణ

అపజయాలు కారాకులుగా రాలిపోతూ, విజయాలు మారాకులుగా మోసులెత్తుతూ, ముందుకు సాగిపోతుంది జీవన లత.

జయాపజయాల నిత్యఘర్షణే ఈ మన యాత్ర.

ఎందుకూ భయం దీన్ని చూచి?

అసలు మనం పుట్టిందే ఒక ఘర్షణ నుంచి.

ఘర్షణ చైతన్య మూలకం

చైతన్యం ఒక స్రవంతి

ఏ భావ తరంగ ఘట్టనా జనిత రూపరేఖలమో మనం–ఈ స్రవంతిలో !

ఏ ఇచ్ఛా చాలిత నాదస్వర కల్పనలమో మనం – ఈ విశ్వ వీణపై !

శివ శక్తులం మనం

మన ప్రణయమే నాదం

మన చుంబనమే బిందువు

తత్ఫలితమే కళ

కళా రూపులం మనం !

శబ్దాల, అర్థాల, రేఖల, రంగుల పరస్పర సంయోగ వియోగాలే మన చరిత్ర.

మన చరిత్రే జీవిత చరిత్ర లోకానికి.

సుఖ దుఃఖాలు, మంచి చెడ్డలు, చీకటి వెలుగులు, నిమ్నోన్నతాలు, ముందు వెనుకలు – ఇవన్నీ ఎడాపెడా కొడుతూ ఉండగా, రెండు శిలల ఒరపిడిలో పుట్టిన స్ఫులింగం వలె పుట్టి, ప్రజ్వలితమై పురోగమిస్తుంది జీవితం.

నది ఒకటే అయినా, నీరు ఒకటి కాదు.

జీవి ఒకటే అయినా, జీవం ఒకటి కాదు.

క్షణక్షణ పరిణామ శీలి ఇది.

జీవి లోని జీవ పురోగమనమే జీవితం.

నిరంతర ఘర్షణా సముపార్జిత విజయమే పురోగమనం.

ఏ భావ స్పందనా రాగ వీచికలమో మనం –

తిరిగి ఆ భావ పయోధిలో లయమై పోవడానికే ఈ నిరంతర ఘర్షణ, నిర్విరామ పురోగతి, నిల్వనివ్వని ఆవేగం, ఆవేదన అంతా !

క్యూలో నిలబడినా, కుమ్ముకొంటూ చొరబడినా, అలసి కూలబడినా, అందకుండా పరుగిడినా –

జీవితం ఒక ఘర్షణ.

ఎందుకూ భయం దీన్ని చూచి ?

క్రొత్త నీటికి చేప ఎదురెక్కేటట్టు, నూతన పరిస్థితుల్లోకి ఉత్సాహంతో దూకేదే పూర్ణజీవి !

ఆత్మనే ఇచ్చిన దానవు –

నీ శరీరం నీ అధీనం లోనే ఉన్నదానవు –

పూర్ణార్పణతో పునీతవు కావడానికి ఎందుకూ భయం ?

16

ఏదో ఒక దీపపు వెలు
గేదో ఒక మూల మిణుక కే మానవుడున్
నీ దారి తెలియ నేరదు :
నా దేవీ ! లేచి రమ్ము నాతో భువికిన్ !

నా రాగ సరస్వతివి నీవు !

ఈ నా సంగీత సాహిత్యాలు నీ కరుణా కటాక్ష పరిచుంబిత సుందర సుధాకర శిఖరాలే !

నీ విమోహన లోచనాంచల పరీక్షణా కిలికించితాలే నా హృదయ దారుఖండాన్ని సాహితీ వీణగా తీర్చిదిద్ది, శ్రుతి చేసి పలికించినై కోటి కోమల రాగాలను !

నీవు నా రాగ సాహితివి !

నీవు పరమ పవిత్ర కళామూర్తివి ! కేవల దేవతవు నీవు !

నిన్ను నీ దివ్యసుందర ప్రణయాంతఃపురంలో కలుసుకొన్న నేను వట్టి మానవుణ్ణి !

నిత్యం ఆ మహోన్నత శిఖరాగ్రాలపై విహరించలేను నేను.

ముట్టితే మలినమై పోయే, తాకితే కందిపోయే, చూపుకే సురిగిపోయే, ఊహకే ఉరలిపోయే ఆ నీ మంజుమంజుల మందార భూములు నాకు బహు కష్టసాధ్యాలు.

పుష్పోద్యానాలు, పూర్ణజ్యోత్స్నలతో పాటు - వరదలు, బురదలు కూడ ఉండే నా కఠిన భూములే నాకు సమగ్ర సుందరాలు, సులభ గమ్యాలు.

కళా సమున్నత శిఖరోద్యానంలో నీవు నా ఆరాధ్య దేవతవు.

భూమిపై నా జీవిత రసాల వనంలో నీవు నా ప్రేయసివి.

వ్రేళ్ళు ఎక్కడో పైన ఉండి, శాఖలు క్రిందికి విస్తరించి, నా చుట్టూ, నా నిండా వికసించిన రాగలతవు నీవు !

నీ మూలం వీణామండలం

నీ కాండం ఆనందచేతన

నీ శాఖోపశాఖలు, పల్లవ పుష్ప ఫలరసాలు, శుకపిక భ్రమ రాదులు - అన్నీ నా దైనందిన జీవిత సుఖసంతోషాలు !

కళామయీ !

ఆనంద రమా !

వైశాఖీ !

బాగా ఆలోచించుకో !

వెలు గున్నప్పుడు నీ లూ ఉంటై.

నీ కిరణాల కొసలే నా నీడల మొదళ్ళు !

అందుకే అర్థిస్తున్నాను నిన్ను - శిఖరాగ్రం నుంచి హిమానీ కుమారి వలె నా రసాలినికి దిగి రమ్మని !

దివ్యలోకము నుంచి
దిగిరమ్ము నా కేసి,
అవ్యక్తమును డించి
అరుదెంతు నీ కేసి,
ఆ నడుమ కలిసికొని మనము, నవ్య
మానవము నిర్మింతము !

17

"అమ్మా !

"మీరు అనుకొన్నదంతా నిజమే.

"ఆనంద వేదనలు, అనురాగ తీవ్రతలు, ఒకరి కోసం ఒకరు పడే తహతహ, చేసుకొనే పూజ – అలాంటి వన్నీ శరీర సంయోగంతో సడలిపోతా యనీ, ఆ తర్వాత మనం కూడ మన ఇరుగు పొరుగు సంసారుల వలె జీవచ్ఛవాల మై పోతామనీ, తగని భయంగా ఉండేది నాకు !

"మన ప్రేమానురాగాలు శాశ్వతంగా ఉండాలి –

"అనుక్షణం ఒకరి కోసం ఒకరు ఆరాటపడుతూ ఉండాలి –

"మన హృదయాలు ఎల్లప్పుడూ నిండుగా ఉండాలి – ప్రేమ సుధ అంచులు పొర్లి ప్రవహిస్తూ ఉండాలి –

"ఇదీ నా కోరిక.

"కథలలో కావ్యాలలో చదవడమే కాని, ప్రేమ అనే దేమిటో తెలీదు నాకు.

"నా చుట్టూ, నాకు తెలిసిన వేలకొలది సంసారాలలో, ఏవో ప్రతిఫలాపేక్షల ఆపేక్షలు తప్ప – ప్రేమ అనేది కనిపించలేదు నాకు.

"ప్రేమ అనేది కామవాంఛకు పర్యాయపదంగా వినబడుతున్నది నేడు. అందుకే, దాని పట్ల ఉన్న గౌరవం పోగా, అసహ్యం కూడ ఏర్పడింది నాకు.

"కాని –

"మిమ్ము చూచిన ఆ క్షణం నా శరీరం నిండా ప్రాకిన విద్యుత్త రంగాలు, మ్రోసిన విపంచికలు - ఆ తర్వాత రేగిన తుఫానులు, ముంచెత్తిన ఉప్పెనలు - ఏదో అపూర్వ అవ్యక్త ఆనంద వేదనకు లోనుచేసినై నన్ను !

"ఎప్పుడూ, ఎవ్వరి తోనూ నాకు నేనుగా మాట్లాడని దాన్ని, మగవాళ్ళు పలకరించినా పలకలేని దాన్ని, సిగ్గుకు రూపకల్పనగా కీర్తి గడించిన దాన్ని నేను - నాకు నేనై మిమ్ము ఎలా పలకరించ గలిగానో ! మీకేసి అలా ఎలా చూడ గలిగానో ! అమ్మో !

"అప్పుడు - అంటే ఆ తర్వాత - అనుకొన్నాను - బహుశా ఇదే, అదేదో కావ్యగత ప్రేమకు తుల్యమైన ఆత్మానుభూతికి నాంది యేమో అని !

"ఈ అనుభూతి కోసం కదా నేను చేసిన తపస్సు అంతా !

"మీ గురించి విని ఉన్నాను నేను. మీ పద్యాలు, పాటలు ఎన్నో పాడి ఉన్నాను నేను. అవి నాకు చక్కిలిగింతలు పెడుతూ ఉండేవి. ఎవరో అజ్ఞాత ప్రియతముడు నా కోసం, నన్ను గురించి వ్రాసినట్టుండేవి. మీ దర్శన భాగ్యం కోసం ఉవ్విళ్ళూరిస్తూనే ఉండేవి అవి.

"ఎంతో మంది రాగదేవతలు మీ కోసం వెర్రెత్తి తిరుగుతా రన్న కథలు కూడ ఎన్నో విన్నాను నేను.

"అలాంటి ప్రపుష్టితో, ప్రాభావిత పరిదృష్టితో తొలిసారి మిమ్ము చూచి, ఏదో తెలియని మధుర బాధకు పాల్పడి, నిద్ర లేక, తిండి సహించక - ఏమీ తోచక వేగిపోతున్న నాకు, మీ తొలి లేఖ ఇచ్చిన ఉపశమనం ఎంతని చెప్పను ?

"రోహిణిలో మృగశిరా ప్రవేశమే అయిం దది !

"అయితే -

"మొదట్లో ఇలాంటి అనుభవాలనే పొంది, ఏవేవో ఆనందాలను ఊహించు కొని, శరీరాలు కలుపుకొన్న ఎంతోమంది స్నేహితురాండ్రను ఎరుగుదును నేను.

"వాళ్ళంతా ఇంచుమించు నా వయస్సు వాళ్ళు. ఈనాడు శవాలు, వట్టి జీవచ్ఛవాలు !

"విరబూచిన తంగేడుల్లాంటి, గులాబీ పొదల్లాంటి, మల్లెదండల్లాంటి, మైసూరు పెయ్యల్లాంటి, వరద గోదావరుల్లాంటి, మెరుపు తీగల్లాంటి సుందర బాలిక లెందరో - కొందరు ముళ్ళ కంపలై పోయారు, కొందరు ఎడారి పిట్టలై పోయారు - కొలది కాలం లోనే !

"ప్రేమ, ఆరాధన, అనుభూతి, ఆనందం - నిత్యనూతనంగా, సుస్థిరంగా ఉండాలంటే అమలిన శృంగారం ఒక్కటే మార్గమనీ, శరీరాన్ని అనాఘ్రుత పుష్పంగా ఉంచుకోక తప్పదనీ నేను అనుకోవడానికి ఇదే కారణం.

"నశించే శరీరమే నశించని ఆత్మను నాశనం చేయవచ్చు దుష్ట స్నేహం వలె !

"ఇంటికి నిప్పంటించు కోవడమే ప్రేమించిన వాడికి శరీరాన్ని ఇవ్వడం తరచు !

"మనకు శరీరాలు వద్దని నేను అన్న దందుకే.

"శరీరం ప్రేమను పైకెత్తి పరమాత్మే కావచ్చు. క్రిందికి లాగి నరక వ్యధే కావచ్చు.

"ఇలాంటిది నా మనస్తత్వం.

"అయినా -

"నా మనస్తత్వంపై నా ఆత్మ దాడి చేస్తూనే ఉంది మొదటి నుంచీ. ఇప్పుడు మీ బలంతో పుంజుకొని, ఓడించి వేసింది నన్ను ! నేను కేవలం నగ్నాత్మను అయినాను మీ ముందు !

"శారీరక సుఖేచ్ఛ కాదు మనది. జన్మజన్మాల సౌహార్దం ఇది. దీన్ని శరీరసంయోగం దివ్యీకరిస్తుందే కానీ, ఎందుకు న్యూనీకరిస్తుంది ?

"అదీ కాక-

"ఆత్మర్పణ చేసుకొని, నా సర్వస్వాన్నీ మీ చేతిలో పెట్టుకొన్న నేను - ఒక్క దమ్మిడీనా మిగుల్చు కొంటాను ? అది కూడ మీ జేబులోనే లేదా ?

"నేనే మీదాన్ని అయినప్పుడు మీది కానిది నాదగ్గర ఏమి ఉండగలదు

ఇక మీ ఇష్టం. మీ ఇష్టమే నేను. మీరే నేను.

ఓహో, దే వీ !

ఎంత బాగుంది నీ లేఖ !

ఏ శరీర సుఖమైనా - ఆ శరీర ధారి మనస్తత్వంపై ఆధారపడి ఉండేదే.

ఏ సుఖమైనా మనస్సు తోడిదే.

మట్టి మూకుడులో ఉన్నా అమృతం అమృతమే. బంగారు గిన్నెలో ఉన్నా విషం విషమే.

సుఖదుఃఖాలు జీవలక్షణం తోడివి. శరీరం తోడివి కావు.

సువర్ణ కలశంలో అమృతానివి నీవు !

నీ కోసమే ఈ నా తపస్సంతా !

18

నిజంగానే దిగివస్తావా దేవీ ?

నిజంగానే ఆ దివ్యోన్నత శిఖరాల నుంచి ?

ఈ సాధారణ మానవ జగత్తుకు ? ఈ నా కోసం ?

నీ నిర్ణయం ఆనందంలో ముంచివేసింది నన్ను. ఒళ్లు మరిచి నృత్యం చేశాను నేను - నీ లేఖ చేతపట్టుకొని !

హృదయమును శృతి చేసి జపించినాను
మధుర మధురాజ్యదా రాగ మంత్ర మొకటి ;
మంత్ర దేవత మరగి, హేమాద్రి కరగి
ఆత్మ వాహిని వైశాఖి అవతరించె !
కోటి చైత్రాలు కురులలో గ్రుచ్చుకొని, ని
రవధి కానందరాగ రసార్ణవములు
ఎదద నిడుకొని, అవతరించినది దేవి
శారత జ్యోత్స్న నుండి ప్రజ్ఞాన మట్లు !

ఓహో !

నిజంగానే వచ్చేశావు నీవు !
నాలోకి వచ్చేశావు నీవు !
నా కంటే ధన్యులిం కెవరున్నారు లోకంలో !

ఆకాశవాణి నా కర్పించె నిను, విపం
చిక చేసి, వికచ కల్పకశాఖి, వైశాఖి !
చూపులో కల్యాణ దీప మైతివి నాకు !
స్పర్శలో అనుకృత ప్రకృతి వైతివి నాకు !
సరస సంతత శుద్ధ చైతన్య శక్తిలో
మన మనం తానంద మధుర వీచికలమే !
ఒరసికొని, రాపాడి, ఒకరిలో ఒకరమై
పరవశిల్లెద మేక పారమ్య మూర్తిగా !

నీవు వెన్నెలవు, రేయిని నేను; నేనె వె
న్నెల నౌదు, నను దాల్చి నీవె రేయివి కమ్ము !
ఎవర మెవ్వరమైన, ఇర్వురము నున్నపుడె !
ఒకరి నొకరు ధరింప ఒకటె వెన్నెల రేయి !

ఆశ్వయుజ శుక్ల సప్తమీ సరస్వతి పూజ లందుకొంటున్న లేత వెన్నెల రేయి !

నీవే నా రాగ సరస్వతివి !
నీ పూజే నా పరమార్థం !
నేనే వెన్నెలను.
నన్నే చీరగా ధరించి, నీవే బాలశారదవై నృత్యం చెయ్యి !
ఔను – ఈ నృత్యం చేస్తున్నది నీవే !
కాదు – నేను !
నీవే వెన్నెలవు !
నిన్నే కట్టుకొని నర్తిస్తున్నాను నేను !

నీలో నేనా ?

నాలో నీవా ?

నా లోననే నీవా, నీ లోననే నేనా,

ఎవరిలో ఎవరమో ఎందుకీ జిజ్ఞాస ?

ఆధార విద్యాలయము నుండి నా మనో

రథముపై ఊరేగు రమ్యవైతివి, చాలు !

19

"ఎందు కంత ఒళ్లు తెలియని తనం ?"

"ఎవరామె ?"

అపస్వరాలు !

నీవు నా దాన వైన ఈ శుభముహూర్తంలో, ఆనందం పట్టలేక, ఒళ్ళు మరచి తాండవం చేస్తున్న నా చుట్టూ – ఎక్కడివీ అపస్వరాలు ?

మర్రిచెట్ల తొర్రల పరదాల నుంచి, తొంగిచూస్తున్నై గుడ్ల గూబలు !

ఆకాశం ఎత్తు పెరిగినా ఎవరికీ నీడ నివ్వలేని తాటిచెట్ల కమ్మలపై నుంచి, రెక్కలు రెపరెప లాడిస్తున్నై రామబంధులు !

గంధపుచెట్ల కొమ్మలను ఆశ్రయించుకొని, బుసలు కొడుతున్నై విషనాగులు!

ఆడుతున్న నా అడుగుల పైకెక్కి ప్రాణాలు దక్కించుకొంటున్న చీమలు, కండలు పీకుతున్నై కోరలు సాచి !

బురద గుంటల నుంచి కప్పలు –

పండిన వరిచేల గట్ల కన్నాల నుంచి ఎలుకలు –

పేద రైతుల వడ్లగాదెల క్రింద నుంచి పందికొక్కులు, వాళ్ళ పంట గదుల నుంచి పిల్లులు –

కొబ్బరిచెట్ల తలలలో నుంచి ఉడతలు –

భాగ్యవంతుల గేటుగుమ్మాల నుంచి కాపలా కుక్కలు –

చెరుకుతోటల నుంచి దోపిడీ నక్కలు –

అమృతమూ, ఆహ్లాదమూ ఆనందపు అంచులు తాకి ప్రవహిస్తున్న ఈ శరత్సుహాసంలో – ఎందుకో ఈ అపస్వరాలు !

ఎందుకో ఈ కర్కశ కఠోర నినాదాలు !

లోకోత్తర ప్రయోజకమైన ఈ నా ప్రేమసాగర మధనంలో హాలాహలం క్రక్కుతున్నది అసూయా వాసుకి !

శివుణ్ని నేను

నీ శక్తితో ఎలాంటి విషాన్నైనా కంఠగతం చేసుకోగలను.

నీవు కేవల వైశాఖి వేనా ?

నీవు నాలో కలిసిపోయే కొలదీ, నీ శక్తి నన్ను శివుణ్నే చేసే కొలదీ, పరమరాగ పరమేశ్వరివే నీవు నాకు !

రాగసుధాకలశివై, నీవే నా పెదవికి పెదవి వైనప్పుడు – ఈ నిశాచర లోకమా నన్ను నిరోధించ గలది ?

ఈ లోకులకా నేను ప్రత్యుత్తర మిచ్చేది ?

భారతీయ సంస్కృతికీ, సంప్రదాయానికీ విరుద్ధంగా ఫేరవించే అపస్వరాలను నరక వహ్నుల లోకి విసిరి పారవేసి, తాండవిస్తున్నాను నేను నీ అర్ధనారీశ్వర పూర్ణపదవి కోసం !

"ఎవరామె?" అట !

నీవెవరో ఈ లోకాని కెందుకు ?

లోకం ఒక సత్రం

లోకులు కాకులు.

అదిగో – నా ఆటకు ఎక్కడినుంచో పాట !

లోకులు కాకులు, సఖుదా !

లోకములో మన నీయరు!

లోకోత్తర సుఖ రతిలో

లోకమునకు చనువీయకు!

లోకు లనగ నెవరోయీ ?

ఆకలి తీరిన వారే !

ఆకలి తీరిన వెనుక
అవనిని మరిచిన వారే !
చిన్ననాటి బ్రతుకు పుటలు
చిరిగిన వారే లోకులు !
ఆశించిన ద్రాక్షపండ్లు
అందని వారే లోకులు !

20

ఎవ్వ రీమె అటంచు ప్రశ్నించు చున్న,
దెందుకో లోకమున కింత ఇది ? మదీయ
హృదయమవు నీవ, స్పందన మీవ, దాన
వెలయు రాగము నీవ, భావ లయ ఈవీ !

నీవు నా దానవు, నేను నీ వాణ్ణి. ఇతర్ల కెందుకు మన జోలి ?
ఆమె ఎవరు అంటున్నారు
ఏమిటి ఈ లేఖలు అంటున్నారు !
ఈ లేఖలు గురించి లోకానికి ఎలా తెలుసునో - అని ఆశ్చర్య పడతావు కదూ నీవు ?
తెలిస్తే, ఏం ?
రహస్యాలు లేవు మనకు
మన హృదయం లోక విదితం
మన ప్రణయం విశ్వ రణితం
మనం విశ్వశ్వరులం !
మన రహస్యం ఒక్కటే
అది మనమే !
తెలుసుకోనీ లోకం.
ప్రణయాత్మే ఒక పనసపండు అనుకొంటే - దాని తొనలు కదా ఈ లేఖలు.

ఒక పూర్ణ ఫలం లోని వివిధాంశల, కళల, రుచుల, రసాల సార బిందువు నీవు !

చిన్మయానంద రుచు లిట్లు చేర్చి కూర్చి
తొనలు తీసి అందీయ, అందుకొనలేక,
ఏమి టీ లేఖ లన్న నే నేమి చెపుదు ?
హృదయమును పిండి ఎట్లు చూపింతు నిన్ను ?
ఎలా నిన్ను చూపించడం ?

ఈ తొనలను నా హస్తంతో లోకానికి అందిస్తున్న నీ అదృష్ణ అమృత హస్తం ఎలా కనిపిస్తుంది బాహ్య నేత్రానికి ?

ఎందుకు కనిపించాలి అసలు?

పండు తినునప్డు చెట్టు కన్పడున ? తేనె
గ్రోలునప్పుడు తోచునా పూలతోట ?
కన్నులుండియు కనలేని కర్మఠుండు
అనుభవము వీడి, మూలము నరయగోరు !

పోనీ– నిన్ను చూపుతానే అనుకో. లోకం నిన్ను గుర్తించ గలదా ?

పద్మములు చూచి నీ పాదపద్మములను
నీలమబ్బులు చూచి నీ నెరికురులను
మించులను చూచి నీ చిరు స్మేరములను
మంచిగా నిన్ను జగము గుర్తించ గలద ?

సలలితములు సుందర సరోజముల జూచి
విలసనములు గులాబి గుత్తులను జూచి
లాలసములు రసాల వల్లరుల జూచి
పోల్చుకొనున లోకమ్ము నీ పూర్ణ శోభ?

అంతవరకును తెలిసికొన్నదియె అనుము;
హృదయ సౌందర్య మెట్లు భావించగలదు ?
నాకు నీకును మధ్య ఆనంద పరమ
సారణుల నెట్టు లూహింప జాలు జగము ?

నీ వెవర వన్న ప్రశ్నేల ? జీవకోటి
కోటి సౌందర్యములకు దిక్సూచి వీవు !
అద్దమున వోలె తము దాము దిద్దుకొనక
పెదవి విరువగ త్రిప్పి చూచెదరు జనులు !

అలాంటి లోకానికి నా ప్రేమ తపః ఫలాన్ని నిన్ను ఎలా చూపుకొంటాను?

నీ వెవర వన్న ప్రశ్నతో నిఖిల జగము
చచ్చినను చావనీ, చూపజాల నిన్ను ;
ఈసు విడనాడి, సౌందర్య మెచట నున్న
అర్చనము చేయు కళ దాని కబ్బుదాక !

21

లోకం మీద ఏదో పగతో పుడతారు కొందరు

వాళ్ళ ముఖా లెప్పుడూ చిరచిర లాడుతూనే ఉంటై.

ఏ విధమైన మంచినీ, అందాన్నీ, కళనూ సహించలేరు వాళ్ళు.

ఎప్పుడూ ఏ ఒకళ్ళకో అపకారం చెయ్యకుండా, ఏ మృదుల హృదయాన్నో వేధించకుండా, ఏ లలిత లవలినో త్రుంచి పారవెయ్యకుండా ఉండలేరు వాళ్ళు.

ఏ జన్మ లోనో, ఎవరి వల్లనో, ఏదో అపకారాన్ని పొంది, బాధతో కుమిలిపోయి, ప్రతీకార వాంఛ ప్రబలి, పగ తీర్చుకోకుండానే చచ్చిపోయి పుట్టిన దౌర్భాగ్యులు కావచ్చు వాళ్ళు.

తమకు అపకారం చేసిన వాళ్ళెవరో గుర్తు లేక, మొత్తం లోకం మీదనే సాముదాయకంగా పగ తీర్చుకోడానికి పూనుకొంటారు వాళ్ళు.

అపకారం పొందిన వాళ్ళూ వాళ్ళే. దాని వల్ల పతనమైన వాళ్ళూ వాళ్ళే. ఇప్పుడు మరీ దిగజారి పోతున్న వాళ్ళూ వాళ్ళే.

ప్రతీకార వాంఛ కంటే పతన హేతువు మరొకటి లేదు.

వాళ్ళే వీళ్ళు - మన చుట్టూ చేరి మనల్ని హింస పెడుతున్న తేళ్ళు.

పులి మేకను చంపుతుంది. నల్లి నెత్తురు తాగుతుంది. వాటి క్రౌర్యానికి ఒక ప్రయోజనం ఉంది. వాటి స్వార్థానికి ఒక అర్థం ఉంది.

తేలు ఎందుకు కుడుతుంది ?

పాము ఎందుకు కరుస్తుంది ?

అనూరాధ ఒక తేలు

ఆశ్లేషయ్య ఒక పాము

వాళ్లూ, వాళ్ళ నేస్తాలూ చేరి ఎందుకలా పీడిస్తారు నిన్నూ, నన్నూ ?

మనం లేఖలు వ్రాసుకొంటే, పాటలు పాడుకొంటే, పౌరోద్యానంలో కూర్చుంటే వాళ్ళ కెందుకు ?

తేళ్ళు ! పాములు !

లోకం మీద ఏదో తీరని పగతో పుట్టుకొచ్చిన విషపురుగులు వాళ్ళు !

తప్పించుకు తిరగాలి వాళ్ళ నుంచి

అదీ సాధ్యం కాదు తరచు !

మన ప్రక్కనే, మన తోనే ఉంటారు వాళ్ళలో ఎందరో - స్నేహితులుగా - రంగులూ, సెంట్లూ పూసుకొని !

అట్టివాళ్ళు చేసే అపకారం మరీ క్రూరం.

ఏం చేస్తాం ?

"మన ప్రేమానురాగాలు, మన సంగీత సాహిత్యాలు, మన ఆనందాలు మనవి. అవి మన ఆంతరంగిక అనుభూతులు. లోకంతో ప్రమేయం లేదు వాటికి. అయినా - ఎందుకో లోకం ఓర్వలేక పోతున్నది" అంటావు నీవు !

లోకమూ, లోకులూ అంటే ఈ కొద్దిమంది తేళ్ళూ, పాములేగా ?

భయపడ వద్దు వాళ్ళకి.

మనం ఒకళ్ళ కోసం ఒకళ్ళం పుట్టిన వాళ్ళం. లోకాన్ని ప్రేమించడం కోసం వచ్చిన వాళ్ళం. త్యాగాలకు సిద్ధపడ్డ వాళ్ళం.

లోకం మనల్ని హింసించినా, మనం ప్రేమిస్తూనే ఉండాలి లోకాన్ని !

అందుకే -

భయం లేదు మనకు -

భయపడ వద్దు ఎవళ్ళకీ.

22

ఝుంఝూ మారుతంలా వచ్చావు నీవు నా జీవితం లోకి !

స్తబ్దంగా పడి ఉన్న మనస్సును కుదిపి పారేశావు ఒక్క ఊపుతో !

తుపానులు, ఉప్పెనలు, భూకంపాలు వంటివి లేకపోతే - భూగోళమే స్తబ్ధమై పోతుంది నిజంగా !

మహా ప్రళయాలు ఏర్పడక పోతే - విశ్వమే నిర్వీర్యమై పోవచ్చు కూడ !

దున్నితే కాని భూమి పండదు కదా !

జీవతమే అంత !

అల్పాల్పం కానీ, అధికాధికం కానీ, మధ్య మధ్య విప్లవాలు లేకపోతే - చైతన్యం త్రుప్పు పట్టి పోతుంది.

నా లోకి నీ రాక కూడ అలాంటిదే !

హఠాత్తుగా చెలరేగిన ఒక మహా ఝుంఝుకు గసిగి, రాలి, కొట్టుకొని వచ్చి, నా ఒడిలో వాలిన వైశాఖ పూర్ణిమవు నీవు !

వైశాఖివి నీవు!

మాసిన మనస్సు, మొద్దుబారిన భావాలు, త్రుప్పు పట్టిన ప్రజ్ఞ - నా సమస్తమూ నీ ఒక్క గిజాయింపుతో జవజవ లాడిపోయి, రచ్చబండ కెక్కినై !

ఒక్క ధారాపాతంతో క్షాళితమై పోయినై !

వచ్చావు ఝుంఝూ మారుతం లా

ప్రక్షాళించేశావు నన్ను నన్నెల్లా

ఎంత చైతన్యం తెచ్చావు నీతో !

ఎన్ని మాధుర్యాలు నింపావు నా నిండా !

కుదిలిస్తే కుదిలించావులే ఆ చరణ మూర్ధం -

కుదురుగా కూర్చున్నావుగా నాలో !

కురిస్తే కురిశావులే పడగళ్ళు -

కుముదినివై, కౌముదివై, కామేశ్వరివై నిల్చిపోయావు నాతో !

మాంద్యమే మహిషం. దాని సంహారమే విజయం.

విజయ శారదవు నీవు !

కేదార విజయేందిరవు నీవు !

విశ్వ చేతనా ప్రకంపనవు నీవు !

విరిచి పారేశావు నాలోని తమస్సు నంతా !

నవీకరించేశావు నా సమస్తాన్నీ – నీ రాగ రసోదయ విమూత్న జీవ ద్రవ్యాలతో ! ధాన్య రాశులతో ! వెన్నెల కుప్పలతో !

నా ప్రతి జీవాణువూ ఇప్పుడొక రాగదీపిక !

నా ప్రతి జీవనాడీ ఇప్పు డొక ఉన్మాత్న రాగవీణ !

పూర్ణ పురుషుడ్ని ఇప్పుడు నేను !

శక్తి కల జీవనము సముద్రిక్త మగుచు

వివిధ రీతుల నుప్పొంగి వెల్లివిరియు,

బ్రతుకు నింద ప్రచండ వైభవము లపుడె !

భ్రామరీ దివ్య భవ్యానుభవము లపుడె !

23

లత, వనిత, కవిత

సౌందర్య త్రయం ఇది,

రస నిష్ఠం ఈ త్రయం.

ఈ ముగ్గురు మతల్లికలూ – దేని మట్టుకు అదే – జగన్మోహనలు, వసంతంలా వికసించినప్పుడు,

ఏదైనా వికసించినప్పుడే పరమ సుందరం.

లతా హృదయం వనిత, వనితా హృదయం కవిత, కవితా హృదయం లత?

వివిధ వర్ణ సౌందర్య విలసితం, వివిధ రాగ రసోదయ రుచిరం, వివిధ భావ సమావేశ పరమానందం అది !

రసోద్భవ అయిన లత, తదనుభూతి జన్య అయిన వనిత, తద్భావ సంభూత అయిన కవిత – ఒకరిలో ఒకరు పర్యవసించగా – రసవాహిని ప్రభవించి, ఆనందమై ప్రవహిస్తుంది తిరిగి.

పరస్పరాశ్రయ జీవన సౌందర్య మంజూషలు ఈ ముగ్గురూ.

బ్రతుక్కు కావలసింది ఈ ముగ్గురే – ఏ బ్రతుక్కు అయినా.

చేతనా సౌందర్యానికి, దాని స్పందనకు, ప్రభూతికి మూలమూర్తి లత.

దాని రమణీయ రాగజ్యోత్స్న వనిత.

దాని ఆనంద పారవశ్యమే కవిత.

పరమ వరాలు ఈ ముగ్గురూ !

ఈ వరాలు లేని ఏ బ్రతుకైనా ఎడారే !

లతను పెంచలేని, వనితను ప్రేమించలేని, కవితను అనుభవించలేని ఇసక దిబ్బలు, ఉప్పు పర్రలు, మురికి కయ్యలు ఎన్నో ఉన్నై. వాటికి ఉన్నతమైన విలువలూ ఉన్నై లోకంలో.

కాని అవి కేవలం భూత పదార్థ నిక్షేపాలు.

వాటి జోలి వద్దు మనకు.

లతా వనితా కవితా సమాకృష్ట మధుర జీవితమే సఫల జీవితం ఏ మగవాడికైనా.

షండులు, సన్యాసులు నిషేధిస్తే నిషేధించనీ – వాళ్ళ కర్మ అది.

నా లతవు నీవు !

నా వనితవు నీవు !

నా కవితవు నీవు !

ఈ అమృత చేతనా త్రయ సౌందర్య సమ్యగ్రాగ రమ్యవు నీవు !

నీలో పర్యవసించి, ప్రవహించి పోతున్న ఆనంద లహరిని నేను.

గాయకుడు గానమున, కవి కావ్య మందు,
శిల్పి శిల్పాన పర్యవసించి పోవు ;
కార్యమున కారణ మ్మిట్లు కరిగిపోవ
పొంగి ప్రవహించు ఆనంద పూర్ణ గంగ.

24

తలంటి పోసుకొని

పన్నీటిలో స్నానం చేసి

తడి కురుల్ని ఆరబోసుకొంటూ

గుప్పుమని ముసురుకొంటున్న సాంబ్రాణి పొగ, చీకట్లలో చిక్కుకొన్న వెన్నెల వలె, తడి కురులలో తగులు కొని, బరువుగా లేచి, తెల్లగా, మబ్బుల్లా, ఆకాశాన్ని అలముకొంటూ ఉండగా –

చల్లగా పిల్లగాలులకు ఎదురెక్కుతున్న తుమ్మెదల బారుల వలె, మబ్బుల నీడల్లో విప్పారిన నెమలి ఫించాల వలె అలలు వేసే నీ కురులలో – చిక్కుపడ్డ నా ముఖం పూర్ణచంద్రుని పరాఙ్ముఖం కాగా –

ఆశ్వయుజ పూర్ణ సుందరిగా అవతరించిన నిన్ను – ఆ నీ ముఖ బింబాన్ని అలా నీ శిరో రేఖపై నుంచి వంగి ముద్దు పెట్టుకోవాలి నేను !

వదన కల్హారం మీది ఆ మత్త మధుపాలకు అమృతం గ్రోలించి మత్తెక్కించి అవి మత్తిల్లి మైమరచిన వెనుక, ఏత త్కల్హార దళాలకు కర్పూర తాంబూలం లంచం పెట్టి, రాగ రక్తిమను పంచుకొని, జ్యోత్స్నాసాగర మధ్యంగత సుధా కలశాన్ని పెదవులతో ఒత్తి ఆస్వాదించాలి నేను !

నా రెండు చేతులలో రెండు పీయూష భాండాలు !

నా పెదవులలో పూర్ణ సుధా రసబింబం !

నా చుట్టూ మృగశిర మబ్బులు !

నా నిండా విశాఖ మెరుపులు !

మేరు శిఖరాలను నొక్కితే పాల్కడలి మధనమై, అమృతం ఉప్పొంగాలి నా కోసం !

నా ఆశకు అంతు లేదు !

నీ కోసం ఎదురు చూస్తున్న కొలదీ – నా కోరికలు కళ్ళాలు త్రెంచు కొంటునై !

అలా నిన్ను తనివార అనుభవించి - తన్మయమై - అలా, అలా, అలా ఎంతసేపో ఒక్కరమై ఉండిపోయి, ఉండిపోయి, ఉండిపోయి -

లేచి, ఇద్దరమై, తప్పని నీ తిరోగమనంలో నిన్ను అనుసరించి -

నేలకు జీరాడి, నిఖిల సంపదలూ పండించే అ నీ కేశ సౌభాగ్యాన్ని గుండెలకు హత్తుకొంటూ -

గిరి శిఖరాలపై, సానువులలో, లోయల నిండా లావణ్యాలు కైలుచేసే వయ్యారాల తేనె వాగులలో పెదవులు ముంచుకొంటూ -

పద్మాలు పరిమళించే నీ పారాణి జాడల్లో అడుగులు వేసుకొంటూ

నిన్ను అనుసరించి - ఎంత దూరమైనా రాగలను నేను !

ఎంత దూరమైనా - ఎంత చీకటి నుంచైనా !

రమణీయ రజనీ కుమారిగా సాగిపోతూ, వెనుదిరిగి ఉదయ రవి చంద్రికగా నీవు ఎదురు తిరిగి నప్పుడు -

నీ వెచ్చని ఊర్పు తావులు నా వదనంపై సోకే దాకా !

నీ కేల్మోడ్పులో నేను బాల సూర్యుణ్ణే అయే దాకా !

25

బాగా చిక్క పోయానట నేను

విశ్వం అన్నాడు నిన్న వచ్చి.

నీవూ ఎంతగా చిక్కిపోయావో కద !

చక్కనమ్మ చిక్కినా అందమే అన్నమాట నీ వంటి వాళ్ళను గురించి చెప్పినట్టిది. చిక్కినా బాగానే ఉన్నానట నేను కూడ !

అది నీ సహవాస భాగ్యం కావచ్చు !

ఏదో తపస్సులో ఉన్నట్టు కూడా ఉన్నానట నేను.

ఏదో వినూత్న సాహితీ సృష్టికి పునస్సంధానం జరగబోతున్న శుభ లక్షణాలు కూడా కనిపిస్తున్నాయట నాలో !

సాహితీ హృదయం తెలిసిన గొప్ప కవి, శాస్త్ర దర్శనం చేసిన మహా

విమర్శకుడు విశ్వం. లోకానికి ఎంతో సహృదయుడు, నాకు పరమ ఆత్మీయుడు, పరమోపాసకుడు.

చిన్న వాడైనా ఎంతో పెద్దవాడిలా మాట్లాడతాడు, ఎంతో చనువుతో నా దగ్గర.

ఇంకా ఏమేమో అనబోతూ ఉంటే, కాఫీతో అతడి నోరు కట్టేశాను వెంటనే.

నేను తపస్సు చేస్తున్న మాట నిజమే !

అయితే - అది ఏ వినూత్న సాహితీ సృష్టి కోసమో కాదు అది నీ కోసం!

సమస్త సాహితీ రసభావ సౌందర్య సమాహార స్వరూపం ఎవరో - ఆ నీ కోసం !

నీ సంపూర్ణ సాక్షాత్కారం కోసం !

అట్టి నీ సంపూర్ణ సాక్షాత్కారమే నాకు లభిస్తే - ఒక నాకు వేరే సాహితి దేనికి ?

సాహితీ సుధాంసం నీ అధర సుధా రసం కంటే మధురమా ?

నా తపస్సు ఎందుకో అతడి కేం తెలుసు ?

వినీలాకాశం లోకి ఎంతటి ఫ్లాష్ లైటును వేసినా, స్పష్టంగా మనకేమీ కనిపించదు. అలానే, మిస్టిక్ కవిత్వంలో రసానుభూతి లేదు - అన్నాడు విశ్వం.

కావచ్చు. నాకు బాగా తెలియదు - ఈ కవితా మతాలను గురించి.

జీవిత కృషిలో తీరికే లేదు నాకు
తీరిక దొరికితే, నీ గురించి తపస్సు.
కృషి - తపస్సు
తపస్సు - కృషి
ఇదే నా నిత్య కార్యక్రమం.

నాకు కావలసింది కవిత. అది ఏ మత పాత్రలో ఉన్నా సరే, ఏ వేష భాషల్లో ఉన్నా సరే, ఏ దేశ కాలాల్లో ఉన్నా సరే.

కాని -

మిస్టిక్ కవితలో అనుభూతి లేకపోయినా, దాని అభాస ఉంది. అది చాలు సామాన్యుడికి.

సాక్షాత్తు కాళిని భరించలేడు మానవుడు. ఆమె విగ్రహం చాలు అతడికి. దానికే చేస్తాడు ఎన్ని పూజలైనా.

మానవుడికి కావలసింది వాస్తవం కాదు – దాని అభాస.

భగవంతుణ్నే భరించలేడు, నిజంగా ఇంటికి వచ్చి కూర్చుంటే !

మానవుడు స్వతంత్రుడు, స్వార్థపరుడు.

తన తర్వాతనే – ఏ దేవుడైనా !

తనే కేంద్రం సర్వ సృష్టికీ !

పరిస్థితుల్ని తన వైపుకు వంచుకొనే టందుకు తాను కూడా కొంత వంగుతా డంతే!

భక్తి, గౌరవం, క్రమశిక్షణ, సంప్రదాయం, ఆచారం, నీతి వగైరా అన్నీ అతడి స్వార్థ సాధనకు ఉపకరణాలే.

తనకు అనుకూలిస్తే అనుసరిస్తాడు, ప్రతికూలిస్తే ధిక్కరిస్తాడు – సంఘాన్నీ, ఆచారాన్నీ, దేవుణ్నీ కూడా !

తాను వాస్తవం. తక్కిన దంతా అభాస.

ప్రతి మానవుడికీ అంతే !

అందుకే, ఏదీ వాస్తవం కాదని కొట్టి పారేస్తాడు జ్ఞాని.

బ్రహ్మజ్ఞానీ, నాలాంటి రస బ్రహ్మ కోరేది వాస్తవ సత్య సౌందర్య దర్శనం !

ఊహాసౌధాలు, ఊహా ప్రేయసులు, ఊహా దేవతలు, ఊహా స్వర్గాలు – వీటి తోడిదే లోకం సామాన్యుడికి.

అట్టి వాడి కోసమే ఈ మిస్టిక్ కవితా కర్మాగారాలు, ఈ అధివాస్తవికతా హోటళ్ళు, ఈ అభ్యుదయ సాహితీ ట్రేడ్ యూనియన్లు, ఈ భావకవిత్వ బార్లూ !

నా సెర్చి లైటు ప్రసరణ అయోమయం లోకి కాదు, వాస్తవ సౌందర్యం మీదికి.

అంతరాళమూ అనంద సుందరమే చూడగల కంటికి.
దృష్టి నైశిత్యాన్ని బట్టి దూరాలు, లోతులు కనిపిస్తై.
మిస్టిసిజం అంటే - ఎవరికి ?
నీవు ఇతర్లకి మిస్టి సిజమే కావచ్చు.
నాకు వాస్తవ మానవ కాంతవే కద !
పరోక్షంలో ఉన్నా, అపరోక్ష రాగ రమవే నీవు నాకు !
నీ సంపూర్ణ సౌందర్యం కొరకే ఈ నా తపస్సు.
సాక్షాత్కరించవా ఇక ?

అందమెట నున్నదో, అమృత మట నున్నదే ;
అమృతమే ఆనంద, మదె నీ నివాసమ్ము !
నీ నివాసమె సదా నిశ్రేయసము నాకు ;
సాక్షాత్కరించవే, సంపూర్ణ సుందరీ !

ఆశ్వయుజి

మధుప వినుత వినూత్న హేమాబ్జ యుగళి,
మృగ మదాంబుద సంలిప్త మేరు యుగళి,
హస్త యుగళిని దాల్చి ముద్దాడి నాను
సరస వైశాఖి గూడి ఆశ్వయుజ వేళ !

చిమ్మ చీకట్ల కురులు మై చెంగలింప,
వదన పూర్ణిమ పై నుండి వంగి, వామ
నయన వక్షోంక మధుర లాంఛనము మీద
పెదవి మోపితి ఆనంద పదవి కొరకు !

మధుర మోహన మాపాద మస్తకమ్ము,
అమృత పూర్ణ కుంభము అంతరంగ రమత,
పదముల పదాలు - తీయని పెదవి పెదవి -
రమ్య వైశాఖి శారద రమ్య నాకు !

శరచ్చంద్ర పూర్ణ సుందరమైన వెన్నెల రేయి !
ఎంత హాయి !
ఒకరిపై ఒకరం వెన్నెల చల్లుకొని
ఒకరితో ఒకరం బాగా ఒరిసిపోయి

ఒకరిలో ఒకరం పూర్తిగా కరిగిపోయి

ఆనంద మధుర పయోనిధిలో మునిగిపోయిన ఆ వెన్నెల రేయి !

ఎంతో కాలంగా ఎదురు చూచిన రేయి –

ఎన్నో జన్మల నుంచి – కలువల కాలి దిండుగా, మల్లెల మధుతల్పంగా, తారల పూల పందిరిగా, చల్లని గంధపు గాలుల వీవనలతో – లజ్జా కజ్జల కమనీయ కాంతిరేఖ అయి – మనవెంట వస్తున్న రేయి !

మన రేయి !

మనం మనమైన రేయి !

ఎంత హాయి !

అశ్వినీ దేవతల హస్త వాసి వలె, ధన్వంతరి చేతి సుధాకలశం వలె, నా అధరామృత ధారా దేవివై అవతరించిన ఆశ్వయుజీ రూప రాగవైశాఖీ !

ఓహో !

ఆనందం !

నే నెరుగని, ఊహించని, వర్ణించలేని – ఒళ్ళెరుగని – అదేదో, ఏదో, పరమానుభూతి ! పరమానంద విభూతి !

శరీరాలే హృదయాలై కరగిపోయినై – ఏదో ఒక అపూర్వ సౌందర్య లహరి లోకి !

నీ లోకి !

మన రెండు శరీరాలూ ఏకమై నీ లోకి !

హృదయా లే మైనవో !

విశాల చాంద్రాంతరాళమే శృంగార శయ్యాగృహం కాగా

శయ్యా సౌభాగ్యమే మనం కాగా

ప్రేయః పరిధిపై రాసక్రీడలలో అలసి, శ్రేయః కేంద్రంలో తన్మయించిన ఆ మనమే –

శివ పారమ్యం నుంచి వస్తూ – శివపారమ్యం లోకి పోతూ – మధ్యలో తలెత్తి చూచుకొని, కలిసికొని, కౌగలించుకొని, కరిగి పోయిన ఆనంద తరంగాలం ఆ మనమే –

ఏమై పోయామో తెలియని ఆ రేయి !

ఆ పండు వెన్నెల రేయి !

మిన్నేటి తీరాల, వెన్నపూల వనాల,

పాలపచ్చిక మేసి, పరవశిల్లిన రేయి !

పండు వెన్నెల రేయి ! గుండె పండిన హాయి !

అమృత మొసగిన రేయి ! ఆనంద రసపాయి !

27

ఎంత మంచి తోటమాలిని నేను !

పుట్టుక తోనే తోట మాలిని నేను !

"ఒక్క గంట సేపు ఆనందించా లంటే విందుకు కూర్చో, ఒక్క రోజు పాటు ఆనందించా లంటే పెళ్ళి చేసుకో. జీవిత కాలమంతా ఆనందించా లంటే తోటమాలివి అవు" అన్నా డట ఒక వివేకి.

అతడూ నా లాంటి తోటమాలే అయి ఉండవచ్చు.

తోటల్లో పుట్టాను, తోటల్లో పెరిగాను, తోటల్ని పెంచాను. తోటల్ని ప్రేమించాను నేను.

పచ్చిక బయళ్లు, పైరు మొక్కలు, తీగలు, చెట్లు, పువ్వులు, పండ్లు, పిట్టలు, పాదులు, కోనేళ్ళు, వాగులు, లేగ దూడలు, లేడి పిల్లలు, తేనెలు, తుమ్మెదలు, వసంతాలు, వర్షాలు – ఎన్ని ఎన్ని మధుర స్నేహాలు ! ఎన్ని ఎన్ని స్నేహ అనుభూతులు !

ఎన్ని తోటలు పెంచాను

ఎన్ని అందాలు పూయించాను

ఎన్ని మాధుర్యాలు పంచాను నా చుట్టూ !

ఆరి తేరిన తోటమాలిని నేను !

ఇంటా బైటా కూడా తోట మాలినే నేను

నిద్ర లోను మెలకువ లోను కూడ తోట మాలినే నేను !

అతిశయోక్తి కా దిది

ఇప్పుడీ తోట చూడు !

ఇంత విశాలమైన, ప్రాణ సుందరమైన, మనో మోహనమైన తోట ఈ నగరం లోనే కాదు, ఈ లోకం లోనే ఉన్నదా ?

నీలి మబ్బులు నెమళ్ళ వలె పురులు విప్పి ఆడతై నా పాటకు.

ఋతు భేదం లేకుండా మధుప్రియలు వీణల వలె మ్రోగుతై నా మెప్పుకు.

కమల వనం నిండా కలువలు, కలువ కొలను నిండా కమలాలు - ఉదయం తెల్లగా, సాయంత్రం ఎర్రగా వికసిస్తై నా చూపుకు.

ఇక నా చిరునవ్వుకు -

నెలవంకలు, చెరకువింల్లు, మెరుపుతీగలు, కాటుకవానలు, ఎర్ర గులాబీలు, చంపక పుష్పాలు, అమృత బింబఫలాలు, సువర్ణ రసాలు, రత్న సానువులు, హిమానీ నదాలు, మానస హ్రదాలు, దూర్వాక్షేత్రాలు, రంభావనాలు, ఉన్నత సైకతాలు, హంసలు, కోకిలలు, కూజితాలు -

"అబ్బా - చాలు ! చాలు ! చాలు !"

ఓహో, మేనే మరచిపోయాను కదూ !

ఈ అందాలన్నింటికీ నేనే బ్రహ్మ విష్ణు మహేశ్వరులు !

"ఇంతటి సుందరోద్యానం ఎక్కడున్నదీ ? ఒక్కసారీ చూపలేదే !" అంటున్నావా?

అదిగో చూడు - ఆ నిలువుటద్దంలో, ఈ నా చేతుల్లో !

అందాల తోటవే !

ఆనంద సుందరివే !

నా ప్రణయాంజలిలో

నవ మధు దేవతవే !

28

శుక్ర గ్రహాన్ని సానపట్టి తీసిన రజనును వెన్నెలలో తడిపి చేసిన వీణవు నీవు.

బాల సూర్యుని అరుణ కిరణాలను తీగలుగా బిగించి, అనురాగ రాగాలను శ్రుతి చేసి, వాగీశ్వరుడు కారుణ్యంతో నా కందించిన రాగవీణ ఇది !

ఎంత నవనీత కఠినంగా ఉన్నదిది !

ఎంత బిగువుగా ఉన్నై తీగలు !

నేరని నా శిలా మృదుల కరాంగుళులు దీన్ని ఎలా పలికించగలవో !

హేమగిరి మూలమే అయిన ఈ నితంబ సీమను నా అల్పాంకం ఎలా భరించగలదో !

పూర్ణోదయ చంద్ర బింబాల లాంటి ఈ సువర్ణ తుంబీ ఫలాలను కత్తి వంటి నా భుజశృంగం ఎలా మన్నించగలదో !

అనుమానంతో

భయంతో

వణుకుతున్న హస్తాలతో

అందుకొన్నాను నేను వీణను !

సంధ్యారాగ సుందర పటాచ్ఛాదనను తొలగించాను మెల్లగా !

ఓహో, నా భాగ్యం !

వీక్షణ మాత్రం లోనే స్పందించి, స్పర్శా మాత్రం లోనే పలికింది వీణ - సిగ్గుపడుతూ, ముద్దులొలుకుతూ, అలవోకగా స్థాయి పెంచుతూ, ఆకాశ గంగలా జాలువారుతూ !

తారా పథాల కల్పవల్లికల చివళ్ళలో చివురిస్తూ, నా హృదయ కమలం లోకి ఆనంద మధువుగా దిగివస్తూ !

ద్రవించి పోయింది వీణ నా కరతలంలో !

ద్రవించి, ఆపాతమధురమై స్రవించింది - నా జీవనాడుల్లోకి !

ఎంత మధురం, ఎంత మహితం ఈ రాగ డోలా లీలోత్సవం !

నా రాగ వల్లకివి నీవు !

నా ప్రాణ వల్లభవు నీవు !

నా ఆనందరాగ సరస్వతివి నీవు !

ఆలపించు-నిరంతరంగా ఆలపించు - అనురాగ రాగాలను నా నిండా ఆలపించు !

అనురాగమే మూలరాగం ఈ సృష్టికి !

ఆనంద చేతనను మీటే మేళకర్త ఇది.
తదితరమైన సర్వ స్పందనలూ దీనికి జన్యాలే
ప్రతి హృదయవీణా దీనికి అనుకృతే !
ప్రతి అనుకృతీ నీలోని ఒక అనుభూతే !
రాగవీణా !
వీణాగాన సముజ్వల రసాలినీ !
రసాలినీ జగచ్ఛాఖీ !
వైశాఖీ !
ఆలపించు !
నీ గాన శక్తికి మహాలక్ష్మీ నీరాజనం ఇచ్చేలా ఆలపించు !

29

ఎంతసేపు, ఎంతసేపు,
ఈ ఎదురు చూపు ?
కన్నులు కాయలు కాయ !
కలువలు తామరలు కాగ !
అమృత మీయకుండగనే
అనిమేషుని జేసితివే ?
ఆకలితో, దాహముతో,
అంతులేని మనుగడతో !
వస్తావను కోలేక,
రావనుకొని పోలేక,
నిన్నటి సుఖ భోగాలను
నెమరు వేసుకొనుచు ఇట !
ఎంత సేపని ఈ ఎదురు చూడ్డం !
కూర్చున్నాను చెట్టు క్రింద ఎదురు చూస్తూ ఎంతసేపటి నుంచో !

నాకు నీడ పట్టిన గున్నమామిడి నీ నీడలా ఉండి, వెనక్కి తిరిగి చూశాను నీవు వచ్చేశా వనుకొని !

ఆకులు కనపడకుండా పూచిన నందివర్ధని – వెన్నెల ఫట్టు చీర కట్టుకొన్న నీవులా కనిపించి – పిలిచింది నన్ను దూరంలో !

అది నందివర్ధని చెట్టే అనుకొంటూ వచ్చాను నీ వద్దకు.

కాని – అది నిజంగానే నీవు కాదు !

తెల్లని చీర, తెల్లని రవిక, తెల్ల కలువ పువ్వుకు ముద్దులు మప్పే ఆ ముఖం. వెనుక నల్లని కేశరాశి – ఆకాశం నుంచి అవనికి దిగి వచ్చిన జోత్స్నాదేవివి నీవు !

అదిగో వచ్చావు !

రాలేదను కొంటున్నాను నేను !

ఇది కృష్ణ పక్షం !

ఈ వెన్నెల అంతా ఎక్కడిది మరి ?

నీవు ప్రక్క లేకుండా ఒక్క అడుగైనా వెయ్యలేని నేను ఇంత చీకటిలో, ఇంత దూరం ఎలా నడిచి వచ్చాను !

నీవు నా కూడానే ఉన్నావు

హృదయంలో ఉన్నావు

లోన నీవు నడుస్తుంటే, బైట నేను నడుస్తున్నాను. లోన ఉన్నావు నీవు.

బైట లేవు ! బైటికి వస్తానని రాలేదు ! అదీ సంగతి !

లోన ఉన్నంత మాత్రాన చాలదు. నా బైట కూడ కనిపించాలి నీవు నాకు!

నా కౌగిట్లో కరిగి, నా లోకి ఇంకిపోవాలి నీవు !

అందుకూ ఈ ఎదురు చూడ్డం !

అబ్బ ! ఎదురు చూడ్డం ఎంత బాధ !

ఎవరో వస్తున్నారు !

పూలతో ఆడుకొంటున్న పిల్లగాలి !

అదిగో నీ చిరునవ్వు !

మిణుగురు !

నవ్వులాటగా ఉంది ప్రకృతికి నన్ను చూస్తే !

భుజంపై చేయి !

దొరికావు !

పూలకొమ్మ !

వెతుక్కోవడంలో ఆనందం ఉంది. ఎదురు చూడ్డమే బాధ !

నా చుట్టూ నీ సమక్షమే. నీవే లేవు !

ఎందుకు రాలేదో!

దుర్భరం ఈ వియోగం!

నిన్ను దివ్వెగ బట్టి,
నీ కొరకె వెదకి -
విసిగి వేసారి, ది
వ్వెను పారవైచి -
పొగులులో పడి మున్గిపోతిని !
నాకు నీ
పొగలలో గుడి కట్టుకొంటివి !

30

కళా సి సృక్ష

సౌందర్య బుభుక్ష

జంతువు నుంచి మనిషిని విడదీస్తున్న గుణాలు ఈ రెండూ !

ప్రకృతికి మెరుగులు దిద్దేది కళ

కళను రసబ్రహ్మకు చేర్చేది సౌందర్యం.

కళా మనస్కత, సౌందర్య మనస్విత లేని మానవుడు కేవలం మృగప్రాయుడు.

"మన ప్రేమను ద్వేషిస్తున్న పెద్ద మనుష్యులు, మనల్ని అల్లరిపాలు చేస్తున్న రౌడీలు - వీళ్ళంతా అలాంటివాళ్లే !" అన్నావు కదూ ఒకనాడు ?

కాదు అన్నాను నేను !

మనల్ని లాలించే దంతా మంచీ కాదు, బాధించే దంతా చెడ్డా కాదు.

నీ ప్రయోజక దృక్కోణం నుంచి నిర్ణయించకూడదు మంచి చెడ్డల స్వరూపాన్ని.

లోకం అంతా మంచిగా నిర్ణయించిన ఒక విషయం నీ ప్రత్యేక వ్యక్తిత్వానికి అడ్డం రావచ్చు. నీ వైయక్తిక ప్రగతి కోసం దాన్ని నీవు ధిక్కరించనూ వచ్చు.

అలా ధిక్కరించిన వాళ్ళే మన మహర్షులు, ప్రవక్తలు, నియంతలు – మానవ ప్రగతి చరిత్రకు ప్రధానాధ్యాయాలైన వాళ్ళంతా !

కేవల సామాన్య మానవులకు సంబంధించినంత వరకు నీవు చెప్పిందే నిజ మనిపిస్తున్నది నాకు !

మనల్ని, మనలాంటి అనేకుల్ని ఏడ్పిస్తున్న వాళ్ళందరూ విద్యావంతులే, ఆధునిక నాగరిక సమాజంలో అగ్రతాంబూలం అందుకొంటున్న వాళ్ళే !

స్నేహం, సౌందర్యం, మనోవైశాల్యం, కళా హృదయం ఏవీ లేవు వాళ్ళకి.

వాళ్ళు కోరేది సౌందర్యం కాదు, సెక్సు.

మనకు మొరటు మనుషులుగా కనిపించే గ్రామీణులే నిజంగా కళా హృదయులూ, సౌందర్యోపాసకులూ !

ఇక్కడ పులితోళ్ళు కప్పుకొని, తోడి మనుషుల్నే తినివెయ్యవచ్చు. మేకతోళ్ళతో బలికి సిద్ధపడనూ వచ్చు.

వేష భాషలు లోకంలో బ్రతకడం కోసం.

మృత్యుకుడ్యాన్ని చొచ్చుకొని అద్దరికి పోలే వవి.

పరమాత్మ ఎదుట నిలిచేది నగ్నాత్మ.

అది కళా సౌందర్య పరిస్నపితమో, లోక వ్యవహార పంకిల దుష్టమో తేలేది అక్కడ !

ఇక్కడ అతడు రిక్షావాలా కావచ్చు. రాజ్యపాలకుడు కావచ్చు. అక్కడ అతడి విలువను తేల్చేది అతడి కళా ప్రవృత్తి. అది ఆత్మ సంబంధి.

కళకు రాణి సాహిత్యం

సౌందర్యానికి రాణి నీవు.

సాహిత్యాన్ని నా కుడిచేత, నిన్ను నా ఎడమ చేత ధరించిన ధీర లలితుణ్ణి నేను !

సాహిత్య సృష్టికి నా మోడలువు నీవు.
రసాలు ఎనిమిదా, తొమ్మిదా అన్న వాదం శుష్క సైద్ధాంతికులకు.
నాకు ఒక్కటే రసం
అది నీ దరహాస వదన సారసం !
సౌందర్యమే నీవు
నీవే కళ
శరీర పరిధిని దాటిన రిరంసే కళా సి సృక్ష !
దాని ఆత్మోపరతే సౌందర్య బుభుక్ష !
రాస వేదిక నుంచి
రాగమై ప్రవహించి
నీ ప్రణయ మధు వెల్ల
నిలిచెనే నా యెదను !
రాధ నారాధించి నానే !
నిన్ను
రస రమ్యంగా పొంది నానే !

31

ప్రతి క్షణమూ నీవు వస్తావని ఆశిస్తూ, ప్రతి అలికిడీ నీ అడుగుల చప్పుడే అనుకొంటూ, ప్రతి పలుకూ నీ కంఠస్వరమే అని వింటూ, ప్రతి మెరుపూ నీ చిరునవ్వే అని చూస్తూ - ఎన్ని యుగాలు గడిపానో నేను ఈ సాయంత్రం మధు శిలపై !

ఎందుకు రావడం లేదో నీవు !
ఏమై పోయావో నీవు !
వర్తమానం లేదు !
వార్త కూడ లేదు !

అనూరాధ ఏమి చెప్పిందో మీ వదినకు ! ఆశ్లేషయ్య ఏమి ఊదాడో మీ అన్న చెవిలో !

గయ్యాళికి, రౌడీకి భయపడి పోతుంది సజ్జన లోకం ! వాళ్ళకు లొంగి పోతుంది బేషరతుగా ! ఎందుకనో ?

న్యాయంపై కంటి, తమను తాము కాపాడు కోవడం పైనే దృష్టి ఎక్కువ సజ్జనులకు.

పట్టి కుమ్మరి పురుగులు ఈ సజ్జనులు !

గయ్యాళి నోరు, రౌడీ చేయి - లోకాన్ని పాలిస్తున్న మహాశక్తులు ఈ రెండే !

ఇప్పటికే అనుమానిస్తున్నారు మీ వాళ్లు మనల్ని. అగ్గికి ఆజ్యం అందిస్తున్నారు - అసూయా పరులూ, ఆకాశ రామన్నలూ, ఆత్మలు కుళ్ళిన వాళ్ళూ !

అయితే -

మీవాళ్ళు అంత సంకుచిత ప్రజ్ఞులు కారుగా ?

మరేమిటి కారణం ?

అనారోగ్యమా ? నీకా ? ఏమో - మానవులం ! శరీరాలు పట్టి మట్టి కుండలు !

ప్రమాద మేదీ జరగలేదు కద ?

కళ్ళు మూసుకు నడుపుతారు కొందరు కార్లు. వాయువేగంతో పోతారు కొందరు కోతులు. ఇక, లారీలు ఖడ్గమృగాలే కద ?

చీకటి పడితే - ఈ మానవ మహానగరం సందుగొందులు క్రూరమృగాలకు ఆటపట్టై పోతై ! మనిషే మనిషిపై దూకుతాడు పంజా విప్పి !

గుండె గుబేలు మంటున్నది !

ఏమిటీ కుశ్శంకలు నాకు !

అమిత ప్రేమ అశుభాన్ని శంకించవచ్చు కాని, ఇంత ఘోరం గానా ?

వివిధ దుస్సంఘటనల మధ్య నీ రూపాన్ని ఊహించుకొని ఏడుస్తున్నది నా మనస్సు !

నీ కోసం సర్వస్వాన్నీ అర్పించగల నేను నిస్సహాయుణ్ణై పడి వున్నా నిక్కడ !

మానవుని మనోనేత్రం ఎంత గుడ్డిది !

మానవశక్తి ఎంత అల్పాల్పం !

చిలుకను స్వేచ్ఛగా వదిలా ననుకొంటూ, పంజరాన్ని ఎగరవేస్తాడు మనిషి !

ఎంత అజ్ఞానం !

ఈ అజ్ఞానావరణను చీల్చుకొని, బైటపడి, వెదకలేను నేను !

అంతా అంధకారం !

నా అనుమానం గాని - నీవు క్షేమంగా ఎందు కుండవు ?

ఉంటే - ఎందుకు రావు ?

తెలీదు !

అందుకే ఏడుస్తున్నది మనస్సు.

శరీరాని కున్న దీపం కూడా మనస్సుకు లేదు !

ఏలా తీరని వాంఛ లిన్ని మదిలో
సృజ్యమ్ము లౌ జీవికిన్ !
కాలన్ సంకెలలన్ దగిల్చి, కదలం
గా నీక బంధించి, స్వే
చ్ఛా లోకమ్ముల మానసమ్ము విహరిం
చన్ జేయు ఆంధ్య మ్మి దే
వ్యాళమ్మో ! ఇటు ముంచెదున్ ప్రకృతి కే
లాడించు మంత్రాంగమై !

32

"మీ కోసమే పుట్టాను నేను.

"నా ఆత్మ, మనస్సు, హృదయం, శరీరం - ప్రత్యణువూ మీదే

"నిజంగా, మీ వీణను నేను

"ఈ నా సహస్రాధిక జీవతంత్రులపై క్షణాని కొక రాగం పలికిస్తున్నారు మీరు

"ఇలా పలుకుతూనే - తారాస్థాయికి లేచి, దాన్ని కూడ దాటిపోయి, రాగాల కొసల నుంచి గెంతి, మీ హృదయ పయోధి లోకి దూకెయ్యాలని ఉంది నాకు.

"తీగలు పట్ పట్ మని తెగిపోవాలి మీ మునివ్రేళ్ళపై. వీణ సమస్తం ఒక క్రొత్త రాగమై కలిసిపోవాలి మీ రాగ పారమ్యంలో.

'గతాన్ని శిశిరంలా రాల్చేసి, మీలో ఐక్యమైపోవాలి ఈ నా ప్రణయ వసంతం.

"గతం మృతం. భవిష్యత్తు అమృతం. నా భవిష్యత్తు మీరు. మిమ్ము నా కింత కష్టసాధ్యం చేస్తున్న వర్తమానం ఎంత చెడ్డది ? దీని సంకెళ్ళు ఎలా తెగిపో తవో ?"

ఆనాడు నీవు వ్రాసిన ఆ లేఖ ఈనాడు గాని నా కర్థం కాలేదు.
నిన్ను వర్తమానం బంధించి వేసిందా, దేవీ !
కుల మత వర్గ విభేద దుష్టమైన వర్తమానం ! ఎంత ఘోరం !
నా రాగ సరస్వతివి నీవు.
నీ రాగ మోహన మధుర నాదం ఇక నాకు వినిపించదా ?
నీ రాగ రంజిత లోచన కాంతి ఇక నాకు కనిపించదా ?
నీ రాగ రోచి ర్వి నిర్మల దరస్మితం ఇక నాకు లేదా ?
నీ రాగోజ్జ్వల పులకాంకిత తను స్పర్శ ఇక నన్ను మై మరపించదా ?
ఆ నీ ఆలింగన సౌభాగ్యం -
ఆ నీ పరిచుంబన పరమైశ్వరం -
ఆ నీ -
ఊహించ లేను ఇక !

ఇక నేనే శాశ్వతంగా చెవిటివాణ్ణీ, గుడ్డివాణ్ణీ, తనుస్పర్శా మనోభావాదులు లేని పరమశూన్యుణ్ణి అయిపోవలసిందేనా ?

అసూయ తప్ప ఆత్మీయత తెలియని వర్తమానం - వంశ ప్రతిష్ఠల పేరుతో ప్రణయ పవిత్రతల ప్రాణాలు తీసే మూర్ఖత్వం - ఇక మనల్ని కలుసుకోనివ్వదా ?

ఇక నీవు రావా ?

ఇక నేను లేనా ?

అయ్యయో ! జీవన వసంతమా ! త్వదీయ

గర్భమున ఎన్ని పూల రాగములు మాసి

పోయె ! ఎంతెంత మధు వింకిపోయె ! ఎంత

శోకమును మ్రింగి, త్రేను వీ శోభ నీవు !

33

ఆనాటి ఆ నీ లేఖకు, ఆనాడే నీకు నే నిచ్చిన జవాబు – నా స్మృతి పథంలో రగిలి, యావచ్ఛరీరాన్ని దహించి వేస్తున్న దీ నాడు.

రాగమయీ !

నిజమే !

మనం తరచు కలుసుకోడానికి అవకాశం లేకుండా ఉంది.

మనస్సులకు ఉన్న స్వేచ్ఛ శరీరాలకు లేదు.

స్వేచ్ఛ ఉన్న మనస్సులు కలిసే ఉన్నై కద !

శరీరాలకు అధినేత సమాజం, సమాజానికి లక్ష సంకెళ్లు. జాతి, మతం, కులం, శాఖ, వర్గం, స్థితి, గతి, శాంతి, భద్రత – ఇలాంటివి ఎన్నో దాన్ని ముందుకు కదల నివ్వవు.

ఇలాంటి వాటిని ఆసరా చేసుకొని, స్వార్థపరులు ఎందరో తమ స్వప్రయోజనా లను సాధించుకొంటూ ఉంటారు.

ఆత్మార్పణ చేసుకొన్న ప్రేమను ఇవేవీ నిరోధించలేవు. తాత్కాలిక జయాలు కొన్ని వాటికి లభించినా, తుది విజయం ప్రేమదే.

అయినా – ఎందు కంత బెంగ ?

అనుభవాలు సెలవు పెట్టినప్పుడు – అనుభూతులు లేవా మనకు ?

నీవు ఎదురుగ్గా ఉన్నప్పుడు గతం జ్ఞాపకం ఉండదు నాకు.

నీవు లేనప్పటిది నిన్ను గురించి ధ్యాస.

నీవు లేని దెప్పుడు ?

గత [illegible]తి విరామ లక్షణం.

వెనక్కి తిరిగి చూచుకోవడం ఆగినప్పుడు కద ?

ఆగే తీరికా, అవసరమూ లేదు నాకు.

నాకు నీవు ఎల్లప్పుడూ అపరోక్ష రాగ బ్రహ్మవే !

నా మనోవాక్కాయాలలో ఏదో ఒకటి నిన్నెల్లప్పుడూ అనుభవిస్తూనే లేదా ?

నా ఆత్మకు కూడా నీ ఆత్మే కదా పుట్టిల్లు ?

నీకూ అంతే కద ?

ఎందుకు మరి ఆ బెంగ ?

నీతో నా కెప్పుడూ ఎడబాటు లేదు.

గతం మృతం అంటావు నీవు !

నాకు అసలు గతమే లేదు.

కాలం ఒక్క వర్తమానమే నాకు !

భూత భవిష్యత్తులు – కాలి ధూళీ, నేత్ర కాంతీ మాత్రం !

నీ పరమావధి నేను.

నా సృష్టి శిల్పానికి మోడలువు నీవు.

ధరిస్తావు నీకు నచ్చిన దుస్తుల్నీ, అలంకారాలనూ, అంగరాగాలనూ – అభిగామిక వైహారిక విస్రంభణంగా !

ప్రదర్శిస్తావు నీకు ముచ్చటైన రంగుల్నీ, హంగుల్నీ, వంపుల్నీ, వయ్యారాల్నీ – నాకు నచ్చిన రీతిలో !

అందిస్తావు అమృతాన్నీ, ఆనందాన్నీ !

ఓజస్వినివి నీవు !

ఉజ్జ్వల రసరాజ్ఞివి నీవు !

నిత్యం నాతోనే ఉంటూ, ఎందుకు వియోగ దుఃఖభీతి ?

(అప్పుడు నీ వన్నావు – "నీ" బదులు "నా" ఉంచుమని !)

కావచ్చు !

అయితే – తీసి పారెయ్ అవన్నీ ! ఆ దుస్తులు, అలంకారాలు, ప్రదర్శనలు, ప్రసాదాలు అన్నీ !

చీరే అడ్డ మైనప్పుడు, శరీరం అడ్డం కాదా ?

నగ్నం కా - ఆత్మ దాకా !

నీ ఆహార్యం నా చిత్ర శిల్పాన్ని పులిమి వేస్తున్నది !

దర్శించనీ నన్ను నీ నగ్నాత్మను. స్పృశించనీ నీ రాగాత్మను. అనుభవించనీ నీ రసాత్మను !

ఆగనీకు నన్ను
ఇవ్వకు విశ్రాంతి
పేరుకోనీకు గతాన్ని
విదల్చి పారెయ్ ఆ ధూళి నంతా
కాళ్లు కడుక్కో ఈ నా ఆనంద బాష్ప సరోవరాలలో
స్నానమే చేసెయ్ పూర్తిగా !
వర్తమానాన్ని నిందించకు
మనమే వర్తమానం ఎల్లప్పుడూ
నీవూ - నేనూ
ఎదురు బొదురుగా !
ఒకరి కొకరం నిలుపు టద్దాలమై !
ఆత్మ కాదా నగ్న దీపాలమై !
రాగసుందరీ !
అలాంటి వాళ్ళం కదా మనం !
మరి -

నాకు ఎంతటి ప్రియమైన వర్తమానమేనా - ఈనాడు నిన్ను నిర్భందంలో ఉంచినట్టిది !

అంతటి ఆత్మవాదిని నేనేనా నీ రూపం కనిపించక ఇప్పుడిలా ఏడుస్తున్నది !

ఎలా భరిస్తున్నావో వాళ్ల ఆ నిందా వాక్యాలు, ఆ తీవ్రకోపాలు, ఆ తిరస్కారాలు - రాసి రంపాన్ని పెట్టే ఆ హింసాకాండ నంతా !

ఎంతమంది, ఎంతకాలం కాపలా ఉండగలరు స్త్రీ చుట్టూ ? అభిమానవతిని అనుమానించడం అవమానించడమే కాదా ?

స్త్రీకి స్వాతంత్ర్యం ఇవ్వకూడదన్న దుష్టనీతి ఇంకా ఎంతకాలం దాగి ఉంటుందో మానవ మనః కూపంలో - దీపం క్రీనీడలో నల్ల త్రాచు వలె !

కాలాహి పడగపై
బాలార్క మణి అదే !
పడగ నీడను బ్రతుకు
ప్రాణాల కదె మెతుకు !
పాము చీకటి పుట్ట చేరులే ! జగము
సోమ శేఖరు గూడి ఆడులే !

34

"రోజుకు రోజు, మరింత మోజు"

అవును, నవ నవోన్మేష రాగశాలినివి కదా నీవు !

"మరి దేనికి బెంగ ?"

అవును. బెంగ దేనికి. మనం ఆత్మీయంగా కలిసే ఉన్నాం. శారీరకంగా కలుసుకుంటూనే ఉన్నాం.

"మీ కివ్వని దేముంది నా దగ్గర ?"

అవును. ఏమీ లేదు.

"నేను మీ కంటి పాపనే కదా ? ఎందుకు నన్ను అలా కన్నీరుగా కార్చి పారేస్తారు ?"

అవును. గుండె బలహీనత.

"ఏవో తాత్కాలిక మైన ఆటంకాల వల్ల, నేను రెండు రోజులు కనిపించనంత మాత్రాన - ఇంత బాధ పడిపోతే ఏలా ? నేనేమైపోయాననుకొంటున్నారు ?"

ఏమైపోయావో తెలియకనే కదా, దేవీ, ఈ బాధ - ఈ బెంగ - ఈ కన్నీరు ?

గ్రీష్మంలో మలయ మారుతంలా, అమావాస్యకు దీపావళిలా, ఎంత

ఉపశమనాన్ని, ఎంత ఆశాకాంతిని తీసుకువచ్చిందీ ఈ నీ లేఖ నాకు !

జీవిత యాత్రలో ఏదో అలసట, అశాంతి, నీరసం, నిరాశ కలిగినప్పు డెల్లా - చూపు మాత్రం లోనే ప్రాణానికి ఇంత హాయిని కలిగించే ఈ నీ లేఖలు నిజంగా అమృత కలశాలే !

అవును. నీవు కలిగిన నేను అమృత చైతన్య బ్రహ్మనే!

నీ వంటి రాగ సరస్వతిని ఒక్కసారి గుండెకు హత్తుకొనే అదృష్టం కలిగిన ఎవరైనా సరే రాగబ్రహ్మే.

బెంగ, బాధ, కన్నీరు ఏమీ లేవు నాకు.

కాని -

చూడా లనుకొన్నప్పుడు నిన్ను చూడలేక పోతేనే తెగిపోయే నా నరాలు - ఇన్ని రోజులు నిన్ను చూడకుండా, ఏమై పోయావో తెలియకుండా ఎలా ఉండ గలను ?

అంతవరకు లేవనుకొన్న బెంగలు, నీ సమక్షంలో కనిపించని భయాలు, బాధలు అన్నీ - నీ పరోక్షంలో ఎక్కడి నుంచి వస్తవో - ముట్టడించి చంపేస్తె నన్ను !

నీవు దగ్గర లేకపోతే, ఎందుకు నా కీ శరీరం ?

నాకు కావలసింది లేఖ కాదు, నీవు !

అమృత కలశాలే కావచ్చు లేఖలు !

క్షణాని కొక కొత్త భావనతో, కొత్త మాధురితో, కొత్త కాంతితో ఆత్మకు ఆనందోపరతిని కలిగిస్తూనే ఉండవచ్చు అవి !

అయినా తృప్తి లేదు

శరీరం తపించి పోతున్నది

మనస్సు ఏడుస్తున్నది

ఇదేనా జీవితం ?

నీకూ, నాకూ మధ్య ఈ దూరమేనా జీవితం !

ఎలా ఉన్నావో ఒంటరిగా, ఆ అజ్ఞాన తమో మాయావరణంలో !

35

"ప్రణయ పరంజ్యోతీ !"

"ఎందుకిలా ముట్టించారు నా ఆత్మకు ఈ విరహాగ్నిని ?"

"కాలిపోతున్న దిది రాత్రి పొడుగునా - అగరువత్తి అయి !"

"మీ సంయోగమే పగలు, మీ వియోగమే రాత్రి నాకు."

"వత్తి కాలుతున్నప్పుడే దాని పరిమళమూ, ప్రయోజనమూ, అస్వాదయోగ్యతా - నిజమే."

"ఈ పొగల వెన్నెల మబ్బుల మధ్య, ఈ పరిమళాల ఘుమఘుమల మధ్య మైమరచి - నన్ను నన్నెల్ల ఆస్వాదించి, జీవితం తెల్ల వార్చడమే మీ అభిలాష అయితే - సరే !

"కాని -

"రేపటికి మీకు మిగిలేది వట్టి నుసి మాత్రమే"

"వట్టి నుసి - బూడిద !"

"అది ఏ వత్తిదైనా ఒక్కటేగా ?"

"నిశాంతంలో, తూర్పు దిశా ముఖాన మీరు అరుణోదయంలా అవులించి, లేచి చూచుకొన్నప్పుడు - ఏం ఉంటుం దక్కడ ?

"మీ ఆవులింత గాలికి ఆ నుసి కూడ ఎగిరిపోయి - ఆనవాలు కూడా ఉండ దక్కడ !"

"నే నేమైనా కానీ - "

"ఎన్నెన్ని ఆత్మవత్తులు ఇలా పూర్ణార్పణ చేసుకోకపోతే - ఉదయభానుడై వెలుగగలరు, లోకాన్ని వెలిగించగలరు అహరహం మీరు ?"

"శయ్య చుట్టూ, గది నిండా వెలిగించుకోండి నాలాంటి అగరువత్తుల్ని, కర్పూర దీపాలను అనంతంగా."

"ఆ పొగ మబ్బుల్లో, పాల తరగల్లో, వెన్నెల వెలుగుల్లో మత్తిల్లి, జొత్తిల్లి ఆనందించండి చల్లని జాబిల్లిగా !"

"అందులో ఒక వత్తి నైతే చాలు నాకు. మీ పాదాల దగ్గర ఒక్క చిన్న అగరువత్తి నైతే చాలు నాకు."

"మీ ఆనందమే కదా నా ఆదర్శం ?"

"కాలి పోనీండి నన్ను ఇలా !"

"ఈ రాత్రంతా ఇలా కాలిపోనీండి నన్ను. కలిసిపోనీండి మీలో - కమ్మని తావినై, ప్రాణ వాయువునై - మీ అణు వణువునా !

"మీ కన్నులలో కాంతినై వికసించనీండి నన్ను - రేపు మీ ఉదయ భాస్కర ప్రాభవంతో !"

"మీ లోనే ఉన్న నా కోసం వెతుక్కోకండి బైట, పెట్టుకోకండి బెంగ !"

ఓహో, నేవీ !

నేను రోజూ రాత్రంతా ఆస్వాదించే పరిమళం నీవేనా ?

ఇంత విరహాగ్నిలో కూడా రక్షిస్తున్న ఈ చందన శైతల్యం అంతా నీదేనా ?

నీవు కాలిపోతూ, నన్ను బ్రతికిస్తున్నావా ఇలా ?

మిగలనా నీవు రేపటిదాకా ?

తెల్లవారదా నాకు ఇక మీద ?

దండెత్తుకు రానా కృష్ణుడిలా ?

ఎత్తుకు పోనా నిన్ను రుక్మిణినిలా ?

36

"నాలుగు రోజులు కనిపించక పోతేనే అంత బాధైతే ఎలా ?"

"అన్నీ మీరే చెపుతారు. కించిత్తు వియోగాన్నే ఓర్చుకోలేరు."

"ప్రేమబలం గల కన్యకు తిరస్కరణీదేవి బలం కూడా ఉంటుంది పరివేష్టించి. కర్కోటకులైన గృహ పెద్దల పహరాలు గాని, మృగ ప్రాయులైన రౌడీల ఎత్తులు గాని ఆ దేవి ముందు పనిచెయ్యవు."

"అనుకొంటే, అభిసారికనే కాలేనా నేను ?"

"నేను రాక పోవటానికి మావాళ్ళ కాపలా ఒక్కటే కాదు కారణం"

"గుండెల్లో ఏదో బాధ ! చచ్చిపోతాననే అనుకొన్నాను మొన్న !"

"నేను చచ్చిపోతే, తర్వాత మీరెలా ?"

"ఇంకెవర్ని ముద్దు పెట్టుకొంటారు ?"

"ఎంత వెతుక్కుంటాయో ఆ చూపులు ! ఆ తనివి లేని తాగు బోతు చూపులు ! నా కన్నుల కాటుక కోసం, నా బుగ్గల కుంకుమ కోసం, నా పెదవుల మధువుల కోసం, నా జటలో మల్లెల కోసం, గులాబి గుత్తుల కోసం !

"నా ఒళ్ళంతా మందార మొగ్గలతో అలంకరించే ఆ మత్తు చూపులే నా సర్వ సంపదలూ !

"ఎందుకు చూస్తారో మీ రలా !

"మీది కానిది, మీకు ఇవ్వనిది ఇంకా ఏమున్నది నా దగ్గర ?"

"తృప్తి లేదా చూపులకు !"

"ఎంత దాహం !"

"నా బ్రతు కంతా మీ కొక గుటక !"

"నా దైవానికి నే నిస్తున్న దేమిటి, ప్రభూ ? లోకోత్తరమైన సమస్త సౌందర్యాలూ, మాధుర్యాలూ నాకు ప్రసాదించు. ఒక్క క్షణం పాటైనా నా స్వామిని తృప్తి పరిచి, గుండెలపై జోకొట్టుకొంటాను - అంటూ ప్రార్థిస్తాను నిరంతరం కన్నీళ్ళతో."

"చచ్చి పోతానేమో అన్న ఊహ రాగానే, ఎంత ఏడ్చానో !"

"ఆపాదమస్తకం, ప్రతి అంగుళం మీ ముద్దులతో పునీతమై, అమృత సుఖాన్ని సంతరించుకొన్న ఈ నా శరీరం, నేను చచ్చిపోయిన తర్వాత ఏం గాను ?

" ఇన్ని సౌందర్యాలు, మాధుర్యాలు, అనురాగాలు, ఆరాధనలు. అన్నీ వట్టి బూడిదేనా ?"

" ఈ శరీరాలు వట్టి అద్దె కొంపలు. వీటిపై మనకే అధికారమూ లేదు. ఎంత అన్యాయం !"

" నేను బ్రతికి ఉన్నప్పుడైనా, నా శరీరంపై నాకు అధికారం లేదే! అన్యాయానికి పరాకాష్ఠ కాదా ఇది !"

"డాక్టరు వచ్చి చూచి, ఏ జబ్బూ లేదన్నది. వట్టి అజీర్ణ మట !"

"గుండెల్లో అజీర్ణ మేమిటో !"

"బహుశా, మీ రాగాన్ని జీర్ణించుకోలేక పోతున్నానేమో !"

"మనస్సును గాయపరచి, శరీరానికి మందు పూస్తారు ఈ పెద్దలు !"

" మీ సువర్ణగిరుల మధ్య లోయలో వస్తున్నది నొప్పి !"

"అక్కడున్నది గుండె కాదు - మీరు !"

"ఎంత నొప్పి కలిగిస్తున్నానో మీకు !

"వ్యర్థమైన ఈ నిఘా ఇంకా ఎన్నాళ్ళులే ! నాకు మైనారిటీ తీరే వరకే కదా ?

37

"ఒంటరి దాన్ని కాను నేను."

"మీరు లేతా హృదయంలో ?"

"మీరు బైట కనిపించ నప్పుడు, లోనికి పోతాను నేను"

"అక్కడ - నా హృదయ పద్మం మీద - పద్మాసనం వేసుకొని, తపస్సు చేసుకొంటూ ఉంటారు మీరు శివుడిలా !"

"వట్టి దొంగ తపస్సు"

"నేను లభించిన తర్వాత కూడ తపస్సేనా ?"

"ఇంకా, ఏ రాగ - అమ్మో ! నే నేమనుకొన్నా, తెలిసిపోతుంది నీకు."

"ఎందుకా ఎరుపు ?"

"ఇంకెవరి కోసమూ లేదులే, ఏ గంగమ్మ కోసమో అని నే నన్నానా ఏమిటి ?'

"నా ఆరాధనే నాది"

"లోకమంతా మీ రాగ లీలేగా ?"

"అయినా - ఏ మోహిని కొంటెతనమో మోసం చేస్తుందని నా భయం"

"అసూయ కాదు సుమండి, వట్టి భయం"

"మనం నలుగురం - మీరు, నేను, నాలో మీరు, మీలో నేను !"

"ఎడబాటే లేదు మనకు"

"ఒంటరి దాన్ని కాను నేను"

"చీకట్లో - నా వెలుగు మీరు"

"చిక్కుల్లో - నా సంకల్ప బలం మీరు"

నరనరం లోను ప్రవహిస్తారు మీరు నాలో - నవ చైతన్య విద్యుత్తుగా - తలంపు మాత్రాన"

"ఏ ఎండ మావులో ఏ ఎడారి మధ్యకో విసిరి పారెయ్య వచ్చు జీవితాన్ని"

"అయితే ఏం ? నా ఒయాసిసు నా హృదయం లోనే ఉందిగా ?"

"ఒక్కె చిరునవ్వు, ఒక్క మత్తుచూపు, ఒక్క ఎర్రముద్దు - ఏదైనా చాలు నాకు మీ నుంచి. గెల్చుకు రాగలను ప్రపంచాన్ని నేను."

"నా హృదయంలో మీ రున్నారు. ఏ భయమూ లేదు నాకు"

"భయాలు, బెంగలు, చింతలు, చిక్కిపోవటాలు - మన వంటి వాళ్ళకు కాదు. మనం అద్వైతాన్ని సాధించిన జీవేశ్వరులం !"

"నా ఆత్మా, శరీరమూ ఏక ముఖమై ఏకాంత సేవ చేస్తున్నై మీకు."

"కలా, నిజమూ రెండూ ఒకే అనుభూతి రూపమై భాసిస్తున్నై నాకు."

ఓహో, రాగోన్మనీ !

కల లోనే కరిగి పోతున్నావా, దేవీ !

ఉన్మనస్ముడ నేను, ఉన్మనీ రమ నవీవు ;
ఇంత చక్రవ్యూహ మెందుకో మన నడుమ !
అధిగ మించగ లేవె ఆటంకముల నెల్ల ?
ఉప్పొంగి రాలేవె ఉన్మాత్న శక్తితో ?

38

"ఎంత నిజమైన కల !"

"రసాలినిలో, మధుశిలపై - వైనతేయం తరంగాలలో వయ్యారాలు పోతున్న కార్తిక రాకా సుధాకర సరోవరంలో కాళ్ళు కదుక్కొంటూ - జారి, మీ కౌగిట్లో వాలి -

- ఓహో, ఎన్ని దీపాలు !

బృందావనం నిండా గోపికలు, నందన వనం నిండా అప్సరసలు, రోదోంతరాళం నిండా తారలు !

రసాల వనం నిండా మనం ! మనిద్దరం !

మణి మృణాళినీ రత్న కమలినీ స్వర్ణ రజో తల్పినులపై పడి -

దివ్య భోగినీ భోగ డోలికలపై వినోదిస్తూ

నాగలోకం లోతుల నుంచి, స్వర్గలోకం శిఖరాలకు వీచాం మనం రెండు మలయ మారుత పరిమళ చీలికలమై

"ఆ మధ్యలో ఎంత అంధకారం ! ఎంత దుర్వాసన ! ఎన్ని నోళ్ళు ! ఎన్ని కోరలు ! ఎన్ని కారపు కళ్ళు ! ఎన్ని కత్తులు ! ఎన్ని ఉచ్చులు ! ఎంత నరకాగ్ని ! ఎంత ఏడ్పు !"

"పర్వతారణ్య దుర్గమ గర్భంలో సన్నని వాగులా, తీయని పాటలా, మెరుపు తీగలా దూసుకుపోయాం మనం - ఏ కత్తికీ అందకుండా, ఏ కోరకూ దొరక్కుండా!'

"సమస్త లోకాలకూ, సౌందర్యాలకూ శిఖరాయ మానమైన ఉజ్జ్వలోద్యానం అది ! అది మన వనమే ! రసాలిని !"

" ఆ రమ్యలోకం, రాగరమణం, రసభోగం అనిర్వచనీయం !"

" కల కాదిది !"

"ఒళ్ళంతా నొప్పులు, నొక్కులు, ఎర్రబడ్డ బుగ్గలు, నెత్తురు చిందుతున్న పెదవులు, మంటలు, జుర్రిన లేత ముంజెల వలె, అబ్బా - ఇవన్నీ, ఇంత ప్రత్యక్షంగా, ఇంత మధురంగా బాధ పెడుతూ ఉంటే ఇదంతా వట్టి కల అని ఎలా అనుకోను ?'

అ "కల ద్వారా పునరావృతమైన పూర్వానుభవమే ఇదంతా ?"

"కాదు కాదు. ఇదంతా పచ్చి వాస్తవం !"

"మీకు అంచక్కా ఏమేమో చెయ్యాలనీ, ఏవో అనందాలు వండాలనీ, కొసరి కొసరి తినిపించాలనీ ఉంటుంది నాకు - ఒంటరిగా ఉన్నప్పుడు కాని -

"మీ సమక్షంలో అన్నీ మరిచిపోతాను - నన్ను నేను మరిచి పోతాను."

"ఆ మైమరపులో ఏమిచ్చుకొంటానో మీకు !"

"మీ చూపు లోనే మైమరచిపోతుందీ మేను !"

"మనకు శరీరాలు వద్దన్న నేనే, నా సమస్తమూ ఒక్క శరీరమే అయినట్టు, కరిగిపోతాను మీ స్పర్శలో !"

"వృద్ధి క్షయాలూ, నాశనమూ కల శరీరాలకు సృష్టి ప్రణాళికలో ఇంతటి ఆధిక్యత దేనికో !"

ఏమిటో ఈ రేఖలు !

మలయ పవనమూ, ఝంఝూ మారుతమూ సూర్య చంద్రనాడులా ఆడుతున్నై వీటి పంక్తుల నడుమ !

ఎంత కలగి పోయిందో నీ మనసు ఈ మానవ కల్పిత విరహ ఝంఝులో!

నీవే ఝంఝూ మారుతంలా వచ్చిన నీకేనా ఈ తుపాను దెబ్బ !

ఎంత తపించి పోతున్నావో మనోవ్యధతో - ఏ దారీ కనిపించక ! ఏం చెయ్యను నేను ?

ఈ తుపాను గాలులలో
ఎంత కలగి పోయావో !
ఎద పగిలీ, మధు వొలికీ,
ఎంత బాధ పడినావో !
విశ్వమోహనముగ విరిసి
వెలయనున్న రాగలతవు !
పరమరాగ సుధను భువికి
పంచనున్న మోహినివి !
ఎడదలు కలిసిన ప్రేమకు
ఎడబాటే ప్రతిఫలమో ?
మనసిచ్చిన చెలిని విడిచి
మరణించుటె జీవితమో ?

39

కామం - ప్రేమ

స్త్రీగా పురుష సంబంధాన్ని పాలించే జంట ఇది.

ఈ రెండు ప్రవృత్తులూ తృప్తి పొందనిదే ఏ మానవ జీవికీ ఆనందం లేదు.

సుఖాన్ని ఇచ్చేది కామం

సుఖాన్ని స్థిరీకరించి, ఆనందాన్ని ఇచ్చేది ప్రేమ.

కామజన్యమైన సుఖ సంతానాదులు జీవకోటి కంతకూ సామాన్యమే.

ప్రేమ మానవుని ప్రత్యేక భాగధేయం.

స్వచ్ఛమైన ప్రేమ స్థాయిని మానవు డింకా అందుకోలే దనిపిస్తుంది నాకు.

ప్రేమకు శరీరాలతో పని లేదని నీ వన్నప్పు డెల్లా. నీ దివ్యత్వం జిగేలు మంటుంది నా కళ్ళల్లో !

నాకేనా ఈ భౌతిక వాంఛ లన్నీ !

నిన్ను చూడకుండా ఒక్క రోజైనా ఉండలేను కదా నేను !

నా హృదయంలో ఉన్నావు నీవు - నిజమే

నా ఆత్మలో ఆత్మవై ఉన్నావు - నిజమే

నిన్ను నా మనోనేత్రం నిత్యం దర్శిస్తూనే ఉంది - నిజమే

నీతో నా చిత్తం నిరంతరం రమిస్తూనే ఉంది - నిజమే

నేను నీవే - నిజమే

కాని -

ఇన్ని నిజాలు ఒక్క క్షణంలో అబద్ధమై పోయి, వాస్తవంగా - సశరీరంగా నిన్ను - ధర్మవరం పట్టుచీర కట్టుకొన్న నిన్ను - చూడా లనిపిస్తుంది నాకు.

నిన్ను చూడాలి

ఈ కళ్ళతో రెప్ప వెయ్యకుండా చూడాలి

స్పృశించాలి

కౌగిలించుకోవాలి

ముంగురులు, నొసలు, కళ్ళు, చెంపలు, బుగ్గలు, పెదవులు, కంఠం - ఆచ్ఛాదనం జారిపోతూ ఉండగా, ఆనంద సుందరంగా ఆవిష్కృతం అయ్యే ప్రతి కళాబిందువూ ముద్దు పెట్టుకోవాలి !

సర్వనగ్నమైన నీ శరీరలక్ష్మి రాగలక్ష్మే కావాలి – నా సమగ్ర సమాలింగన శతపత్రంలో !

అప్పుడు కాని, తృప్తి లేదు నాకు !

ఇదంతా నా బలహీనత ! కామ ప్రాబల్యం ! ప్రేమ స్థాయికి పెరగలేదు నేను !

నా శరీరం నాపై చెలాయిస్తున్న పెత్తనానికి, నా అబలత్వానికి ఎంతో ఎంతో సిగ్గు పడుతున్నాను నేను ఇంతవరకూ !

కాని –

ఇప్పుడు నీవు – నన్ను ఓదారుస్తూనే నీవు పడుతున్న బాధ !

ప్రేమ కాదా ఇది ?

శరీరానిది కాదా ఇది ?

పరమాత్మ, ఆత్మ, జీవాత్మ, ఘటాత్మ, అనాత్మ – ఈ ఆత్మ పంచకంలో, మానవ ప్రకృతిలో, ధర్మార్థ కామ మోక్షాదిక సమస్త విధి సిద్ధికీ ఘటాత్మ ప్రధానం!

ఘటాత్మే శరీరం !

నిరాకారమైన ఆత్మ యొక్క ఘనీ భూత సాకార స్వరూపమే శరీరం!

సశరీర సమాత్మైకమే సంపూర్ణ పూర్ణైక్యం !

అందుకే మనం విడిచి ఉండలేం !

వచ్చేసింది కార్తిక పూర్ణిమ.

పూర్ణిమే కదా జీవిత పూర్ణానందం మనకు !

అపరాజితవు నీవు

అభిసారికగా అయినా రాలేవా ఒక్కసారి !

పూర్ణ కళా సమభిజ్ఞా !

పూర్ణేందు మనోజ్ఞ ! రాగపూర్ణ జ్యోత్స్నా !

పూర్ణా ! పూర్ణిమ వచ్చెను !

పూర్ణైశ్వర్యమున నన్ను పూర్ణించగదే !

కార్తీకి

ఓహో, వచ్చేశావా, దేవీ !

కరిగించి వేసుకోనీ -నిన్ను నిన్నెల్లా - ఇలా ఈ నాలోకి !

సమ్మలేం శరీరాలను !

అవి ఉన్నంత వరకూ ఎడబాటు భయం ఉంది మనకు !

ఇక ఎడబాయలేను నిన్ను !

కరిగిపో నీవు నాలోకి !

కరిగి పోనీ నన్ను నిన్ను నీలోకి !

ఇంత గాఢా లింగనంలో కూడ ఇంత ఎడమా మన మధ్య ?

అమృత సాన్నిధ్యానికి అడ్డం వస్తున్నై శరీరాలు !

అబ్బ ! మనకు మన శరీరాలే శత్రువులు !

ఇలా ఎంతసేపు !

కలకాలం ఇలా ఉండిపోలేమా ?

కాలం కూడా శత్రువే మనకు !

అవశమై, అవ్యక్తంలో, సశరీరంగా ఆనందమై పోవలసిన మనస్సు మళ్ళీ మేల్కొంటున్నది !

మనస్సు కూడా శత్రువే మనకు !

ఓహో ! వచ్చేశావా దేవీ !

అర్ధరాత్రి నుంచీ మత్తెక్కిస్తున్న ఈ అపూర్వ దివ్య పరిమళాలు నీ పాద పయోరుహ సౌరభాలేనా ?

ఏవీ - ఇలా ఇవ్వు - పాదాలు !

కార్తిక పూర్ణిమా పుణ్యదీప జ్యోత్స్నల్ని చిమ్ముకొంటూ వచ్చావు కదా -వీణా మండలం నుంచి ?

ఎంత కర్కశం ఈ వెన్నెల !

ఆకాశగంగలో స్నానం చేసి, దానికి నీ సర్వ శుక్ల సౌరుచ్యాన్ని ప్రసాదించి, అక్కడి సువర్ణ కమలాలకు నీ పాద కమలాల సౌభాగ్యాన్ని రుచి చూపి, నీ తనూలత నమూనాగా కల్పలతికల్ని సింగారించి, ఐరావతానికి నీ యాన గంభీరత మప్పి, మేనకాది లావణ్య రాశులకు నీ మేని -

"అబ్బా ! నలిగిపోతున్నై గులాబీలు ! పాదాలు పద్మాలు అంటూనే, అంతకన్న మృదువైన కుసుమ గుచ్ఛాలను అలా నలిపి పారేస్తారేం ?"

ఓహో, పెదవులు !

అవి పెదవులా ? అమృత పదవులు !

హంసలా వెన్నెల జలపాతంలోకి ఉరికి, చిమ్ముకొంటూ ఇలా వచ్చేశావు, కదూ ?

"పిచ్చి ! ఇదంతా వట్టి పిచ్చి !"

పిచ్చి కాదు, ప్రజ్ఞానం ఇది. ఇదే అసలైన జ్ఞానావస్థ !

ఉన్నది ఉన్నట్టు చూడగల ప్రజ్ఞా ప్రాభవం ఇది !

వట్టి నాచును, పీచును మాత్రం చూడగల ఆధునిక పాండితీ ప్రకర్షలకు వాటి క్రింది అమృత జలాలు, ఆనంద తరంగాలు, అమూల్య భావరత్నాలు ఎలా కనిపిస్తై ?

మేల్కొని ఉన్నా ననుకొనే వాడే నిజంగా నిద్రపోతున్న వాడు !

శరీరం నిద్రపోక, ఆత్మ మేల్కోదు.

ఆత్మ మేల్కొనక, అసలు సత్యం కనిపించదు.

మల్లెపువ్వులు ఈ నీ చరణ కమలాలు !

నవ్వకు మరి ! అప్పుడే రానీకు ఉషస్సును !

ఈ మల్లెపూల వెన్నెల పరుపుపై నీ వొక స్వర్ణ కమలానివి !
ఎంతో ప్రయాణం చేసి వచ్చావు నీవు !
నడిచి వచ్చావు అనంత దూరాలు !
విశ్రాంతి తీసుకో ఈ నా హస్త కమలాలలో !
ఎంత స్వచ్ఛంగా ఉన్నై ఈ నీ పాదాలు !
పాదాలే చెపుతై ఎవరెక్కడ తిరిగి వచ్చిందీ !
కార్లూ, విమానాలూ, రోదసీ నౌకలూ శరీరానికే కాని, ఆత్మకు కావు కదా ?
వాటిలో తిరిగినంత మాత్రం చేత కర్మలు అంటకుండా ఉండవు.
కొందరి పాదాలపై, ఎక్కడెక్కడి కర్మో పేరుకొని ఉంటుంది.
విదలిస్తే వదలిపోయే ధూళి
కడుక్కుంటే కరిగిపోయే కంకర
సబ్బుతో కాని పోని పంకిలం
ఆమ్లాలు వాడితే కాని చెరగని కుళ్ళు
చర్మం ఒలిచినా పోని పాపం
ఇదీ, మానవుడు తన జీవయాత్రలో సంపాదించుకొని, కూడా తీసుకుపోయే గతం !
కొందరు కాళ్లు కడుక్కోబోతే, చేతులు కూడా మలిన మవుతై !
ఎవరైనా కడగబోతే, వాళ్ళకీ అంటుకొంటుం దది !
వాళ్ళు ముట్టుకొన్న దంతా మురికి అయిపోతుంది పాపం !
పుప్పొడి, కస్తూరీ మాత్రమే కాదు. ఆ ప్రక్కనే మురికీ, కుళ్లూ కూడ ఉన్న లోకం ఇది.
ముందుకు చూచుకు నడవాలి.
కళ్లు మూసుకు నడుస్తారు కొందరు.
అంతరాత్మ హెచ్చరికను కూడ వినక, దూకుతారు బురద లోకి.
ప్రతి ప్రాణికీ ఒక దీపం ఉంది
వెలిగించుకోరు చాలా మంది

ఆర్పేసుకొనే వాళ్ళూ ఉన్నారు !

కొందరి పాదాలు ఎంత స్వచ్ఛంగా ఉంటై !

పువ్వుల్లో నడిచి వస్తారు కొందరు

ఎక్కడ నడచి వచ్చినా, గతాన్ని అంటుకోనివ్వరు కొందరు.

పంకాన్ని కూడ పరిమళింప జేయగల పాదాలు నీవి !

మనిషిని దైవంగా మార్చగల మంత్ర పుష్పాలివి !

ఓహో, వచ్చేశావా, దేవీ !

రాకేం జేస్తావు ?

భగవతి సరస్వతి నా కిచ్చిన వరానివి నీవు.

ఇచ్చిన వరాన్ని తిరిగి పుచ్చుకొంటుందా జగదీశ్వరి ?

శాశ్వతంగా నా దానవు నీవు !

41

తనివే తీరడం లేదు నాకు !

దాహంతో ఆవురావురు మంటున్న ఎడారి నోట్లో ఒక్కొక్క చుక్క రాలుస్తున్నావు నీవు !

మరీ ఎక్కువ చేస్తున్న దది దాహాన్ని.

ఆషాడ మహామేఘాలను గుప్పెట్లో పెట్టుకొని, ఏమి టీ తుంపర్లు ?

"ఎందుకు ఆ వ్యర్థోపమానాలు ?" అంటున్నావు కదూ ? అవును !

నీకున్న పాటి నిశితదృష్టి, ఔచిత్య జ్ఞానం, రస స్వరూప వేత్తృత సాహితీ సమీక్షకులకు ఉంటే ఎంత బాగుండును !

ప్రకృతికి, మానవ ప్రకృతికి నడుమ

ముళ్ల డొం కలు లేచి, మొరిగె నన్ జూచి

అని అంటే–

"ముళ్ళ డొంకలు మొరగడ మేమిటి ?" అని ప్రశ్నిస్తా డొకడు.

ముళ్ళ డొంకలు మొరుగుతై, పూలతీగలు నవ్వుతై, పద్మవనాలు పిలుస్తై. తెలీదు అతడికి !

పదవి, గౌరవం, విందు, వినోదం,

ఇలాంటి ప్రాభవాలు కాదు నే కోరేది !

నీతో ఒక్క లేశం ఏకాంతం !

అని వ్రాస్తే –

"ఆ పిల్ల ఇంకేమీ వద్దా ? ఎంత ఘోరం !" అంటా డింకొకడు తప్ప ! నీవు అంటే పరబ్రహ్మ స్వరూపిణి అని గుర్తించలేడు అతడు !

కాకువు లేదంటాడు మరొకడు !

చేతికి మధుపాత్రను ఇస్తే – ఆ మధువు ఏ పువ్వులదో, ఎవరు తీసారో తెలుసుకొనిగాని ముట్టుకోడు మరో మహాశయుడు !

స్వతంత్ర ప్రయోగాలను తప్పు లనుకొంటాడు మరొక మిడిమిడి జ్ఞాని

అది రాయో, రత్నమో గ్రుడ్డివాళ్ళకు ఎలా తెలుస్తుంది ?

ఎక్కడో కాపీ కొట్టిన ట్యూన్లకు మాటలు పొదిగి, వాటిని పాట లంటాడు సినిమాలు తప్ప మరేమీ ఎరగని ఆధునికుడు !

మునగలేక, ముత్యాలు లే వనేవాళ్ళే అధికం, నేటి మన సంగీత సాహిత్య కళారంగాలలో !

ప్రతిభను తలెత్త నివ్వరు పండితులు. పాండిత్యాన్ని తలెత్త నివ్వరు పామరులు.

ఇక మిగిలింది భిక్షాటన – ప్రతిదానికీ, పరదేశాల వెంట !

శక్తీ, సంప్రదాయమూ పోయినై మన నేల నుంచి. అవెక్కడైనా కనిపిస్తే – ఎంత నిరసన వాటి పట్ల మన ఆధునిక పెద్దలకు అర్థంగాక !

ప్రకృతి అర్థం కాదు, పరమాత్మ తెలియదు, ఎవరికీ ఈనాడు ?

తన ఎల్లిని తప్ప మరో సుందరిని ఎన్నడూ చూచి ఉండని పేరిగాడి లాంటి కైసరులు సమాజానికి పెట్టని కోటలే కావచ్చు. సాహిత్యానికి మాత్రం తీరని చీడలు కారా ?

ఈనాడు సాహిత్యం అంటే కులం, వర్గం, మతం, ముఠా, సమస్యలు, ఉద్యమాలు, నినాదాలు, వ్యాపారం !

రసం, అనుభూతి, ఆనందం ఏమీ లేవు. వీటిని ఎరగరు కూడా ఈనాటి వాళ్ళు !

"నా రాగ స్పందనం నీవు, నీ ఆనంద మందిరం నేను" అంటే - అదేదో చెత్త.

" బొచ్చు కుక్క, బూదిగుంట " అంటే - అది మహాకవి వాక్యం ! దానికి బండెడు ప్రచారం !

తిండి, డబ్బు తప్ప మరో ప్రయోజనం లేదు ఆధునిక మానవ జీవితాలకు.

"అలంకారం సహజంగా ఉండాలి. బంగారం ఉంది కదా అని కాలికి కుండలాలూ, మెడకు వడ్డాణమూ తగిలిస్తారా ? ఒకటి రెండు రోజులు వర్షం ఎగబట్టినంత మాత్రం చేత, గోదావరి లంక ఎడారి ఎలా అవుద్ది ?" అంటున్నావు కదూ ?

అవును !

అంతే కాదు -

అక్షయమైన ప్రణయ కలశం నుంచి నీ చేతులు లాగేవరకు, నీ శరీరం అలసేవరకు, నీ ఆత్మ తనిసేవరకు వంచుతూనే ఉన్నావు, ఆనందాన్ని నా ఆత్మ నిండా !

నాకే తనివి తీరడం లేదు !

ఈ సమస్త మేఘ రాశిని- తేనె తుట్టెను వలె - పిండుకు తాగెయ్యాలి నేను.

ఈ కమలాకరాలను వంచేసుకోవాలి నా గుండెల్లోకి.

ఈ ఫలాలు, పుష్పాలు, వీటి శీధు మధు రసాలు ఒక్క గుటక కాగా

ఈ నదీనదాలను పులినాలతో సహా, ఈ సముద్రాలను తీరాలతో సహా, ఈ రోదోంతరాళాలను తారకలతో సహా పట్టెయ్యాలి ఆపోశనం.

ఇంత దాహమూ - అగస్త్యుడికి లోపాముద్రవలె- తీర్చేస్తూనే ఉన్నావు నీవు - నీవే ఒక సుధాకలశివై, దివారాత్ర భేదం కూడా లేకుండా !

అయినా, తనివి తీరడం లేదు నాకు.

ఇదంతా పచ్చి శృంగారం అంటాడేమో ఏ మహానుభావుడైనా ! అంటే, అననీ !

శివపారమ్యం కోరే ప్రతి ఆత్మభావనా పచ్చి శృంగారమే !

వ్యంగ్యాన్ని ఆత్మ వైపుకు కాక, శరీరం వైపుకు మళ్ళించుకొని బావురుమనే వృద్ధ పాండిత్యం ఏమనుకొంటే మనకేం ?

వంచెయ్యి నీ మొత్తం కలశం !

వచ్చేశావు తిరిగి !

అన్ని నిరోధాల్నీ, నిర్బంధాల్నీ గడిచి, హిమానీ కుమారివై దూకి వచ్చేశావు!

ఎంత దివ్యానుభూతిని తెచ్చావు నీతో !

కార్తిక పూర్ణ దీపలక్ష్మి వే అయినావు నా నిండా !

రాగ జ్యోతివై రసామృతమే చేశావు నన్ను !

కొందరికి గుండె చిన్నది, కొందరికి మ
నస్సు చిన్నది, బ్రతుకె కొందరికి చిన్న,
దంత మాత్రాన నిల చిన్నదనము లేదు
పెత్తనము చేయు నీ కన్న పెద్దదైన !

42

ఎంత అనుభవించినా, తనివి లేదు మీకు !

"చిలుక కొరికిన సువర్ణ రేఖలై పోయినై ఈ స్నిగ్ధ సుందర లవలీ దళాలు !

ఈ అరుణబింబ ఫలం గంట్లుపడి అమృతం ఓడుతోంది !

మేరుగిరి శిఖరాలు వంగి వాలినై ప్రభాకరుని పాదాబ్జాల ముందు

ఈ విశాల పేశల సికతా సీమ త్రొక్కిన మడుగైపోయింది – గజేంద్రమోక్షం కథలో వలె !

"ఈ – అబ్బా, ఇక చెప్పలేను.

"మీ తాగిన కళ్ళ చూపుల్లో ఏమున్నదో పీల్చి పారేసినై నన్ను ఆత్మదాకా !

"ఎంత బాధ ! ఎంత ఆనందం !

"బాధ పడే కొలదీ ఆందం, ఆనందపడే కొలదీ బాధ !

"రోజూ ఇంతే !

"ప్రతిరోజూ ఇంతే !

"ఏదీ ఆరదు !

"ఏదీ తీరదు !

దేనికీ పారం లేదు !

"పెదవుల్ని ఆశించి, రదన క్షతాల్ని పొంది, బాధపడుతూనే మళ్లీ ఆ పెదవుల్నే ఆశించడం !

"శిఖరస్థాయిలో అబ్బా అనుకొని, ఇక ఎప్పటికీ వద్దు అనుకొని, జీవితం మొత్తానికి ఈ సుఖం ఒక్కటే చాలు అనుకొని, ఆనందం నుంచి తేరుకొని, అభినందనలు చెప్పుకొని, ఆలింగనం చేసుకొని, అదుముకొని విడిపోయి– మరుక్షణం లోనే మళ్లీ అదంతా కావాలని ఆరాట పడటం !

"చికుర సీమల నుండి చరణ నఖాగ్రాల దాకా

"ప్రతి అందాన్నీ, ప్రతి అణువునూ

"చూచుకొని, చూచుకొని, చూచుకొని

"ముద్దిడుకొని, ముద్దిడుకొని, ముద్దిడుకొని

"గుండెకు హత్తుకొని, హత్తుకొని, హత్తుకొని

"ఎత్తుకొని, ఎగరేసి, పట్టుకొని, పడేసి

"చచ్చినంత సుఖంలో మునిగి, ఉక్కిరి బిక్కిరైపోయి, జన్మ కిక చాలు అనుకోవడం ప్రతీసారీ !

"కాసేపటికే మళ్ళీ దాహం, తాపం, చచ్చేటంత విరహవేదన !

"అంతా క్రొత్తే మళ్ళీ !

"తీరదు తనివి !

"మీకు – మిమ్మల్ని బట్టి నాకు !

"మన జన్మ ఇక ఇంతే చివరి దాకా !

"అసలు చివరే లేదు గద దీనికి !

"తనియ వేలరా ?

తరుణ రాగ సుధాకరా !

"నింగి నింద తారలు
నేల నింద కలువలు
వలచి, నిన్ను బ్రతుకు నింద
కొలుచు కొనుచు నున్నగాని !

"పూర్ణుడవై శివుని సిగను
పూజ లందు కొనుచుండి
దినమున కొక లోకానికి
దేవుడవై యుండి కూడ !

"మోక్షభార మొక నాటికి
మోయలేని కళాధరా !
ప్రణయముతో ప్రతి కళకును
ప్రాణ మొసగు జీవేశ్వర !"

43

"రెచ్చిపోతాను - చెయ్యి వేశారంటే ?"

పంచేంద్రియాలూ,వాటి ఉపగ్రహాలూ, మనస్సూ కూడా రెచ్చిపోయి - పిచ్చిగా ఉంది నాకు అప్పటికే !

శరీరం ప్రణయ మధువును బాగా గ్రోలి, మైకంలో పడి ఉన్నా, మనస్సు మేలుకొనే ఉంది నీకు !

అవును - నీవు స్త్రీవి !

శ్రుతి చేసిన వీణవు నీవు !

నీ సమస్తమూ కళా మృదులమే, రాగ మధురమే !

ఎక్కడ తాకితే అక్కడ స్పందిస్తుంది ఏదో ఒక ప్రణయకళ - గొంతెత్తుతుంది ఏదో ఒక దివ్యరాగం !

వాత్స్యాయను డేదో అంటాడు కాని - నీలో ప్రతి అణువూ ఒక కళా స్థానమే ! రాగ సరస్వతీ పుణ్యక్షేత్రమే !

తాకితే రాగం, తానం, పల్లవి !

శిరోజాల కొసల నుంచి, చరణ సరోజాల దాకా !

చెయ్యి వెయ్యకూడదు నీ మీద - అన్నప్పుడూ !

చెయ్యి వేస్తే - పలికించవలసిందే నిన్ను - ఆనంద శిఖరస్థాయిలో, అవనీ మోహనంగా !

అంచులు పొర్లనింపిన మధుపాత్రవు నీవు.

పెదవులతో అందుకోవలసిన చోట చేతితో తాకితే - ఉద్రేకం రగలడం తప్ప, ఆనంద జ్యోత్స్న ఎలా భాసిస్తుంది ?

పెదవులు ముంచి పీల్చుకొంటూ, నిన్ను నిన్నెల్ల, కోనసీమ రసాలాన్ని వలె, ఆస్వాదించి పారవెయ్యనా - పోనీ ?

నీవు ఫలానివి- నేను రసాన్ని.

పరస్పర ఆధార ఆధేయ ద్వయం మనం !

ఇదంతా రెచ్చిపోయిన పిచ్చిగా ఉన్నదేమో నీకు !

ఫలం మీద చెయ్యివేసి నొక్కితే - రసం చిప్పిలుతుందిగా !

నేనే చిప్పిలి, చింది, సిక్తమై పోతానన్న మాట !

పోతే పోనీ - అనంతత్వం దాకా !

"మోడలు మీద చెయ్యి వెయ్యకూడదు" అన్నాడు చిత్రశిల్పి రాజు.

మోడలు చలించ వచ్చు.

శిల్పీ చలించ వచ్చు

చిత్రం చెడిపోవచ్చు.

అలా చెడిన చిత్రాలే ధృతరాష్ట్రుడు, పాండురాజు వగైరా !

లోకంలో చెడిన చిత్రాలే అధికం - కుమారస్వామి నుంచీ కూడ.

నీవు నా సాహితీ మోడలువు !

లేదు మనకు అలాంటి భయం.

చలించి, చలింపజేసి - రెచ్చి, రెచ్చగొట్టి -. రమించి, రమించబడి- రసధ్వనిలా భాసించే మననుంచి, ఆనందంగా ఆవిర్భవించే విశ్వశ్రేయో దివ్యచిత్రం ఎందుకు చెడిపోతుంది ?

చెడిన చిత్రాలే బాగుపడే హస్తవాసి మనది !

చెడిపోవడం అనేదే లేని అమృత దివ్యం మన సన్నిధి !
వెయ్యనులే చెయ్యి !
వేస్తే పలికిస్తానులే, అవనీ వశంకర శివంకర శిఖర స్థాయిని !

నా వీణవు నీవు,
నా ఒడిలో నవ రసముల !

నా పొడవున విరబారి
నా ఎదలో నినదించి
నా గొంతున అక్షర మౌ
నవ గాయని నీవు !

వేయి తీగ తల్లుల ఎద
విరిసిన రమ్యా కమలిని
అడుగుల రేకులలోని
అమృత లహరి నీవు !

ప్రణయమునే ప్రణవముతో
ప్రతి మెట్టున మేళవించి
నాకే శ్రుతి చేసుకొన్న
నాద బ్రహ్మవు నీవు !

44

రేపు ఇన్ని గంటలకు ప్రొద్దు పొడుస్తుంది. సూర్యుడు తూర్పున ఉదయిస్తాడు. పౌర్ణమి రోజున చంద్రుడు నిండుగా ఉంటాడు – ఇలాంటివి స్పష్టంగా చెప్పగలడు ఏ మనిషైనా.

ఎలా చెప్పగలడు ?
అవి అందరి అనుభవంలోను ఉన్న నిత్య సత్యాలు కాబట్టి !
సత్యం అంటే ఏమిటి ?
సృష్టిలోని ఒక క్రమస్థితి.

అది ఎలా తెలుస్తుంది ?

నిత్య పరిశీలన వల్ల !

అందరికీ తెలిసిన సత్యాలే ఎక్కువ లోకంలో. వాటిపై ఆధారపడే దైనందిన జీవితం సాగిపోతుంది - ఒక క్రమానికి కట్టుపడి !

పంచభూతాలు, ఋతువులు, జీవగుణాలు, వాటి ధర్మాలు - అందరికీ తెలిసిన సాధారణ సత్యాలే, వీటి విషయంలో ఎవరైనా జోస్యం చెప్పవచ్చు.

మేఘం పట్టి ఉన్నప్పుడు, వర్షం వస్తుందని జోస్యం చెప్పగల వాళ్ళు చాలామంది. అది ఎప్పుడు పడుతుందో చెప్పగలవాళ్లు కొద్దిమంది. ఎలా పడుతుందో చెప్పగలవాడు విజ్ఞాని ఒక్కడే. ఎందుకు పడుతుందో చెప్పగల వాడు ఒక్కడూ లేడు.

అన్ని ప్రశ్నలకూ జవాబు లున్నై. ఎందుకు అనే ఒక్క ప్రశ్నకే జవాబు లేదు మానవుడికి !

అనుభవం, పరిశీలన, పరిశోధన, ఉపాసన, తపస్సు - ఇలా దృష్టీ నిశితమూ, ఏకాగ్రమూ అయే కొలదీ, ప్రకృతి అంతరాంతరాలలోని పరమ సత్యాలు అవగతం అవుతూ ఉంటై !

తాను దర్శించిన సత్యం తనదే - తాను అనుభవించిన సత్యం తానే - ఏ మానవుడి కైనా !

దాని విషయంలో స్పష్టంగా జోస్యం చెప్పగల డతడు.

ప్రకృతి గర్భంలో మానవుడు ఒక చిన్న దీపం మాత్రం. తన కాంతి పరిధి దాటి చూడలే డతడు. ఆ ఆ పరిధిలోనే అతడు ద్రష్ట, ప్రవక్త, ఋషి ! అది దాటితే అతడు వట్టి అనామకుడు, వట్టి శూన్యం !

అసలు మానవ మాత్రుడికే అందని మహా సత్యాల ముందు అతడి కందిన పరమ సత్యాలు - సూర్యుడి ముందు మిణుగురులు !

శక్తి వికాసాన్ని బట్టి, దృష్టి నైశిత్యాన్ని బట్టి, ఆత్మోన్నతిని బట్టి - మానవుడి జ్ఞానేంద్రియాలకు, మనస్సుకు, అంతరాత్మకు అందగల సత్యా లున్నై కనుక -

వాటి విషయంలో అతడు జోస్యం చెప్పగలడు కనుక -

మన చెల్లారావు చెప్పింది మనం ఎందుకు నమ్మకూడదు ?

చంద్రుని పైకి విడిచిన రోదసీ నౌక భవిష్యత్తును గురించి దాని విజ్ఞాని ఎంత ఖచ్చితంగా జోస్యం చెప్పగలడో - అంత ఖచ్చితంగానూ చెప్పగలడు జోస్యం విజ్ఞాని అయిన సాముద్రికుడు !

మ నిద్దరి చేతులూ ఒకే మాదిరిగా ఉన్నై అన్నాడు కదూ చెల్లారావు ?

అందుకే నేమో మనం ఒక టయింది ?

అధికారం ఉన్నా ఆత్మను పోగొట్టుకోని అమృత హృదయుడు చెల్లారావు. రసజ్ఞుడు, మిత్రుడు. సాముద్రిక శాస్త్ర విజ్ఞాని.

"చేతి రేఖలకు బ్రతుకులు బానిసలే నా !" అన్నావు నీవు !

జీవిత ప్రణాళికను సూచిస్తై అవి ! ఇచ్ఛాశక్తితో వివరాలను మార్చుకోవచ్చు.

నీ విద్యారేఖను అడ్డుకొన్న వైరి రేఖలు చెరిగిపోతై విద్యార్జనపై నీ మనస్సు లగ్నమయే కొలదీ.

నీ అదృష్ట రేఖ కంటే నాదే బాగుంది - అదే నీవు !

మన హృదయ రేఖలలోని ఆ చెరకు విలువంపులే మన శృంగార కళా వైభవాలు !

మనోరేఖ, జీవిత రేఖ కలవలేదు నా చేతిలో !

నన్నూ నాతోపాటు ప్రపంచాన్నీ కూడ ధిక్కరించగల శక్తిని నా అహంకారానికి ఇచ్చిన అధికారం ఇదే నేమో !

తరచు నిన్నూ ఏదో అని, నొప్పించి, ఏడ్పించే నా ప్రవృత్తికి నివృత్తే లేదేమో, మరి !

నా కాంతివి నీవు !

నా మనస్సు నీ చుట్టూ అల్లుకొని ఉంది - జలజం చుట్టూ జలం వలె !

బుద్ధి మాత్రమే తాగినట్లు ప్రవర్తిస్తుంది అప్పు డప్పుడు !

ఎందుకో నేను కోపంగా ఏదో అనగా - అందుకే నీవు అలిగి అలా వెళ్ళిపోగా -

ఎంత సేపు కూర్చున్నానో నేను - ఒంటరిగా -ఆ చలిలో, ఆ చీకటిలో !

నా శిల్పానివి నీవు అదృశ్యమైపోగా - చీకటికే శిల్పాన్ని నిల్చాను నేను మధుశిలపై !

45

" శిల్పాన్ని నేను"

" నన్ను తీర్చి దిద్దుతున్న శిల్పికి గుండెలు లేవు. నా కెలా వస్తై?

" చేతికి దొరికిన శిలను నేను అతనికి

" నా తండ్రి హిమవంతుడైనా, భగవంతుడైనా, అతడికి ఏమిటి లెక్క!

" సరే - అలానే కానీ !

" నే నొక శిలను. అతడొక శిల్పి. అంతే చాలు నాకు.

" ఏ పోకిరీ చేతికో, ఏ రుబ్బురోళ్ల షావుకారికో, ఏ తాసీ మేస్త్రీకో, ఏ చాకి పనివాడికో చిక్కకుండా - భావుకుడైన ఒక శిల్పికి నేను దొరకడం నా అదృష్టం కాక మరేమిటి ?

" చెక్కుకోనీ అతని ఇష్టానుసారం

" మలుచుకోనీ అతని అభిరుచికి అనుగుణంగా.

" కాని -

" ఈ శిల జీవశిల !

" దీనికీ ఉన్నై చేతిలో రేఖలూ, వాటి లక్ష్యాలూ !

" మనస్సును, మనస్తత్వాన్ని మధువుతో సేవించే మహాశిల్పి - సమయజ్ఞుడు కాకపోతే, ఎలా ?

" శ్రీవల్లి ఎదటేనా శిల్పి చేష్టలు !

" ఎక్కడికి పోతుందీ శిల ?

" తన కోసమే పుట్టిన శిల ?

" హృదయం నిండా అమృతం నింపుకొని, పెదవుల దాకా మాధుర్యం కూర్చుకొన్న ఇది వెన్నెల వెన్నవలె మలగి చెలగదా అతని కళా కమనీయ కరాంగుళులలో ?

" చేతిలోని కళా కలశాన్ని హృదయంలోకి వంచుకోవ డానికి అంత తొందర దేనికి ?

" ఏదో ఒక రూపాన్ని చెక్కి పారవేయాలన్న తహతహ దేనికి ?

" శిల అతడిది, కళ అతడిది, ఎంత తీరికగా చెక్కితే, అంత లోకోత్తర సుందర గా అవతరించదా శిల్పమూర్తి ?

" శిల్పం ఎంత అతిలోక సుందరమైతే, అంత అమృత కీర్తి లభించదా అతడికి ?'

సరే, కానీ -

" నాకు నేనుగా అతడి చేతులలో పెట్టుకొన్న అజ్ఞాత అనామక శిలను నేను"

" కరగిపోతున్నాను. వెల్లి విరుస్తున్నాను - అతని కరస్పర్శా మాత్రంలో!"

" ఉలి చక్కిలిగింతలు పెడుతోంది. సుత్తి రసధ్వనులు పలుకుతోంది.

" కోపం వచ్చినా, పరాజ్ముఖను కాను నేను."

" ప్రణయ శిల్పీ ! మలుచుకో నన్ను నీ ఇష్టానుసారం !

'దేవతగా దిద్దుకొంటావో, దెయ్యంగా చెక్కుకొంటావో - నా భవిష్యత్తుకు నీవే శిల్ప బ్రహ్మవు !

" ఒక్కటి మాత్రం మరచిపోవద్దు.

" ఇది వ్యక్తిత్వం కల జీవశిల !

46

" ఆ పద్యం కొంచెం పాడండి !

" ఏ పద్యం ?

" అదే, మొన్న మీరు వ్రాసి పంపిన పద్యం - రాఖీ పూర్ణిమ

" సంగీతం సరస్వతిని నీవు !

" నాద బ్రహ్మ మీరు !

" నీ గురించి, నీ కోసం వ్రాసి, నీ కిచ్చిన పద్యం అది. ప్రతి క్షణం పాడుకొంటూనే ఉన్నావు నీవు దాన్ని. పాతదైపోయింది కూడా. ఇప్పు డెందు కది ?"

" కవితకు పాత కొత్త లేమిటండీ ? మీరు పాడితే వినాలని ఉంది. అంతే.

" అయితే, ఏదీ ఆ కాగితం !

" అమ్మో ! అక్కడి నుంచి తియ్యడమే దాన్ని ?

" నేను తీసుకోనా ?

మన ఆ సంభాషణ, ఆ తర్వాతి పెనగులాట ఇప్పటికీ ఇప్పుడే జరిగిన ట్టుంటుంది నాకు !

శృంగార లీలా సంగ్రామ రంగంలో గెలిచిన పురుషుడి కంటె ఓడిపోయిన స్త్రీయే అధికురాలు కదా ! పురుషుడి చేతిలో ఎంత చిత్తుగా ఓడిపోతే అంత ఆనందాధి దేవత అవుతుంది స్త్రీ !

పురుషుడి విజయ పతాకే స్త్రీ ఆనంద సింహాసనం !

ఆ పద్యం వ్రాసిన కాగితం పదహారు మడతలతో తాళి బొట్టంత అయి - మేరుగిరి రత్న సానువుల మధ్య దేశంలో, అనాహత పద్మదళాల ఆవరణలో, ఎక్కడో దాచబడి ఉంది.

అందలి ప్రతి శబ్దం నీ హృదయంతో కలిసి స్పందిస్తున్నది.

ప్రతి అక్షరం నీ సాత్త్విక భావ పరిస్పపితమై రసవత్తర మవుతున్నది.

నా పద్యాక్షర మాలికా సమలంకృతాలు ఏతన్మంగళ గౌరీ శంకర గిరి శృంగాలు !

అంతకన్న మేటి పూజ ఏమున్నది - నా సాహితీ రాగదేవతకు !

సాధించాను నిక్షేపాన్ని !

చదివాను పద్యం వచనంలా.

" చదవ మనలేదు, పాడమన్నాను.

పాడాను మోహనచ్ఛాయలో.

" వచనం చదవడానికి, పద్యం పాడడానికి.

" అవును. నా ఉద్దేశం కూడా అదే.

ఈ నాడు ఎంత మంది ఏమి చెప్పినా, పద్యమే కాదు - అది కవిత అయితే, గద్యం కూడ - పాడాలనే అంటాను నేను.

విశ్వ జనీన సుందర భావాన్ని లయబద్ధంగా వ్యక్తీకరించడమే కవిత.

నగ్న సత్యం వేదాంతం, అలంకృత సత్యం కవిత - నా దృష్టిలో.

ఆ అలంకారంలో ప్రధాన మైనట్టిది లయ.

లయ అంటే రిధం. రిధం అంటేనే కాని లయ అర్థం కాని దుస్థితి ఆధునిక ఆంధ్ర విద్యావంతులది.

ప్రకృతే లయబద్ధం.

ఒక క్రమవృత్తంలో ప్రకృతిని నడిపిస్తున్న ఆ పరమశక్తే ఒక నాద లయ బ్రహ్మ !

అర్థం కాదు ఈ నాటి వాళ్ళకు ఇదంతా.

లయ లేనిది ఆనందం ఇవ్వదు. ఆనందం ఇవ్వనిది కవిత కాదు.

శరీరానికి సెక్సు. ఆత్మకు కవిత !

కవితను పాడాలి. చదవగూడదు.

ఆదికావ్యం రామాయణం గానం చెయ్యబడింది.

వేదాలు గానం చెయ్యబడుతున్నై.

ప్రపంచ సాహిత్యంలో మరొక ఆది కావ్యమైన ఇలియడ్ ఆనాడు హోమర్ మహాకవిచే వీధుల్లో పాడబడిందే !

ఖురాను కూడ వేదం వలె గానం చెయ్యబడుతున్నదే.

సూర్యోదయాది ప్రకృతి ధర్మాల వలె - వివిధ మతాల వేదాల వలె - ఆనంద జీవితోద్దిష్టాలైన పరమ సత్యాలు, ధర్మాలు, కళలు, కవితలు అన్నీ - లయబద్ధం కాక తప్పదు.

ఆంగ్ల కవిత కూడ ఒక లయలో చదవ బడుతుంది.

తెలుగు కవిత పాడ బడుతున్నదంటే - అది మన అదృష్టం !

లయను మించి, సంగీత స్థాయిని స్పృశిస్తున్న పరమ రమణీయ స్థితి తెలుగుది !

సిగ్గుపడడం చేతకాని తనం !

"గెలిస్తే భూలోక రాజ్యం, చస్తే స్వర్గ రాజ్యం" అన్న వీర భగవద్గీతకు నిర్వీర్య వ్యాఖ్యలు వెలువడి, భారతీయుల్ని పనికిమాలిన పందలుగా, బానిసలుగా తయారు చేసిన దురదృష్టం మనది.

ఆలోచించడం లే దెవరూ !

హరిదాసులు, పౌరాణికులు, జంగాలు - కడకు, సోది చెప్పే చెంచెతలు కూడ - వచనాలను సైతం పాడతారు నేడున్ను !

రసం రసాన్ని పొందినప్పుడే ఆనందం.

రస స్ఫూర్తీ, ఆనంద సిద్ధీ మాత్రమే కవితా ప్రయోజనం. కవిత ఏ రూపంలో వెలువడినా, ఏదో రాగ వరసలో వినపడక తప్పదు.

శాస్త్రీయ గానానికీ, లలిత గానానికీ, కావ్య గానానికీ ఎన్ని తేడాలు ఉన్నా– కవిత ఏదో ఒక స్థాయిలో, లయలో గానం చెయ్యవలసి నట్టిదే !

అర్థ భావ రసస్ఫోరకంగా పాడాలి కవితను.

అలా పాడ బడేదే కవిత.

చేతకాని వాళ్లు, తమ చేతకాని తనానికి బలకరంగా సృష్టించుకొనే సిద్ధాంతాలతో మనకేం పని ?

పాడగల కవిని నేను.

పాడతా – పాడించుకో !

పాడెద నేను నీ వదన
పద్మ రుచుల్ వికసింప : తీయగా
పాడెద నేను నీ హృదయ
పద్మ మరందము గ్రోలి : ఉన్మతిన్
పాడెద నిన్ను నిన్నె ఒక
పాటగ నాయెద మేళవించి; నే
పాడెద నేను నేనె ఒక
పాటగ నీ యెద మ్రోయగా, ప్రియా !

47

ప్రతి స్త్రీ లోను ఏదో ఒక అందం కనిపిస్తుంది నాకు.

అందాలు అనంతం !

ప్రకృతి లోని అనంతమైన సౌందర్యాంశలలో – ఏదో ఒక అంశ వికసించని స్త్రీయే ఉండదు లోకంలో !

ప్రతి అంశా దేని కది సుందరమే, ఆకర్షణీయమే, అనుభవయోగ్యమే !

ఏదో ఒక అంశ ఆకర్షిస్తుంది – ఏదో ఒక సాటి మగవాణ్ణి, ఏదో ఒక అనుకూల మనస్థితిలో !

ప్రతి అంశా ఆకర్షిస్తుంది. పూర్ణ పురుషుడైన వాణ్ణి.

సర్వాంశా సమన్విత సంపూర్ణ సౌందర్యం మాత్రమే ఆకర్షిస్తుంది పురుషోత్తముణ్ణి !

నీతో కలిసి – నే నిప్పుడు పురుషోత్తముణ్ణే !

నీవు నాతో చేరిన తర్వాత – మరి నన్ను ఆకర్షించగల మహా సౌందర్యం ఏదీ లేదు మిగిలి !

ఏదో వ్రాయాలనుకొని – మరేదో వ్రాసేస్తున్నాను కదూ ?

ప్రకృతి పురుష తత్వాన్ని వివరించా లనుకొన్నాను – సరేష !

మిత్రులతో కూడి – మూడు జిల్లాలు వెతికినా, పెళ్ళాడడానికి ఆడపిల్లే కుదరలేదు – రాంబాబుకు !

నాకు నచ్చిన, మంచి మంచి కన్యల జాబితా ఇచ్చాను అతడికి. అందర్నీ చూచి వచ్చి, తనకు ఒక్క వాళ్ళూ నచ్చలేదన్నా డతడు!

ప్రతి స్త్రీ లోను ఏవేవో లోపాలు చూపుతా డతడు – కేవల పండితుడి వలె !

ప్రతి స్త్రీ లోను ఏవో అందాలే కనిపిస్తె నాకు – ఒక జానపద కవికి వలె !

ప్రతి ఆడపిల్లా అందంగానే కనిపించి, ఎవర్ని వదులుకోవాలో తెలియక, అందర్నీ పెళ్ళాడెయ్యా లనిపించేది నాకు – నీవు కనిపించక పూర్వం !

నాది పూర్ణ సౌందర్య దృష్టి

సమస్త సుందర కళా సమ్య క్కామిని ఒక్కతె మాత్రమే నన్ను వివశుణ్ణి చేయగల పూర్ణ సుందరి !

పురుషుడు కేంద్రం

స్త్రీ పరిధి

పురుషుడు ఏకైక శుద్ధ చైతన్య మూర్తి

స్త్రీ అనంతకోటి రసభావ సౌందర్య విక్షేపం.

పురుషుని దృష్టి నలువైపులా

స్త్రీ దృష్టి ఏక కేంద్రం వైపు.

పరిధిలోని ఏ అంశ నైనా ప్రేమించగలడు పురుషుడు. అన్ని అంశలనూ ప్రేమించగలడు - ఒకే సారి, ఒకే రీతిగా, ఒకే గాఢతతో.

స్త్రీ అలా కాదు, తన కేంద్రం లోని ఆ ఒక్క పురుషుణ్ని మాత్రమే ప్రేమిస్తుందామె !

స్త్రీకి పురుషుడు ఒక్కడు
పురుషుడికి స్త్రీలు అనేకం
ఇదే గోపీకృష్ణ తత్వం
ఇదే జీవేశ్వర తత్వం
తెలియదు ఈ నాటి వాళ్ళకు.

సనాతనమైన ఆర్ష ధర్మాన్ని తెలుసుకోకుండా, అపజ్ఞాన దూషితమైన పాశ్చాత్యుల పాపసిద్ధాంతానికే దాసోహం చేస్తున్నారింకా మనవాళ్ళు !

ఏం చేస్తాం ?

అది అలా ఉండనీ.

పురుషుడు స్త్రీని ప్రేమించడంలో విశేషం లేదు. ఏ స్త్రీ నైనా, ఎంతమంది నైనా ప్రేమించగలడు - అతడిలోని ప్రతిపత్ చైతన్య ప్రాభవాన్ని బట్టి.

ఆనంద ప్రాభవ సిద్ధికి అతణ్ణి స్త్రీ కూడా ప్రేమించవలసి ఉంది.

ఒక్క స్త్రీ అయినా ప్రేమిస్తే చాలు - ఆ పురుషుడు ధన్యుడే.

అనేకమంది స్త్రీలచే ప్రేమించబడే వాడు పూర్ణ పురుషుడు.

సమస్త ప్రపంచం చేతా ప్రేమించబడే వాడు పురుషోత్తముడు.

ఒక్క స్త్రీ చేత కూడ ప్రేమించబడని పురుషు డెవడూ ఉండడు లోకంలో.

వెతుక్కోవాలి, వేచి ఉండాలి.

నిగ్రహం లేక, ఆత్రంతో స్త్రీల వెంట పడేవాడు ఏ ఒక్క స్త్రీ ప్రేమనూ పొందలేడు చివరకు.

వ్యభిచారి అయిన వాడికి స్త్రీ ప్రేమ లభ్యం కాదు. స్త్రీ ప్రేమ లభించని జీవితం సంపూర్ణం కాదు.

ప్రేమ లభించేవరకు వేచి ఉండడమే స్థిత ప్రజ్ఞత. అది లభించినప్పుడు, సాహసంతో నైనా దాన్ని పొందడమే కర్తవ్య ధర్మం.

ఒక్క స్త్రీ కూడా నచ్చలేదు రాంబాబుకు.

తాను ఏ ఒక్క స్త్రీ కైనా నచ్చాడో లేదో కూడ తెలియలేదు.

పెళ్ళికి నచ్చడం చాలు, ప్రేమ అక్కరలేదు అందుకు.

అతడు కేవలం దోష దృక్కు !

అందాన్ని చూడలేని వాడు ఆనందానికి నోచుకోడు.

ముళ్ళే కనిపించే వాడికి పువ్వులు సుఖం ఇవ్వవు.

జన్మాంతర స్నేహ పునీతమైన ప్రేమకు అందంతో నిమిత్తం లేదు. అట్టివాళ్ళు శుచులైనా, అశుచులైనా; ధనులైనా, నిర్ధనులైనా; యౌవనులైనా, వృద్ధులైనా; రూపసులైనా, కురూపులైనా శరీరాలతో సంబంధం లేకుండా - ఒకళ్ళ నొకళ్ళు తెలుసుకోగానే ఆత్మైక్యం పొంది, అమృతమూర్తు లైపోతారు.

ప్రేమకు శాసనం లేదు.

పెళ్ళికే ఏ గోలైనా !

సంసార జీవితం సుఖంగా గడిచి పోవడానికే కదా పెళ్ళి ?

బుద్ధిమంతురాలైన ఏ యువతి అయినా చాలు అందుకు.

ఆరోగ్యవంతమైన యౌవనమే అందం.

గ్రుడ్డిది రాంబాబు మనస్తత్వం.

ఎంత వెలుగు చూపి మాత్రం ఏం లాభం ?

48

స్త్రీ - పురుషుడు

రెండు మహాశక్తు లివి.

ఈ రెండు శక్తుల సంయోగ నైరంతర్యమే సృష్టి నైరంతర్యం.

పరస్పర విరుద్ధాలైన ఈ రెండు శక్తుల మధ్య గల ఆకర్షణమే ప్రణయం.

వాటి సంయోగమే సుఖం.

ఈ రెండు శక్తులు - దేని కది విడిగా అసంపూర్ణం కనుక - సంపూర్ణత్వం కోసం, అందువల్ల జనించే ఆనంద లవం కోసం - అవి తహతహ లాడతై.

అందుకోసం అవి ఒకదాని కొకటి చేరువ అయ్యే కొలదీ, వాటి సంయోగావకాశం కూడా ఎక్కువ అవుతూ ఉంటుంది సహజంగా.

స్త్రీ లభించినప్పుడు పురుషుడు, పురుషుడు దొరికినప్పుడు స్త్రీ, అనుభవించకుండా ఉండలేరు అందుకే.

శ్రీ శుకుడు, శంకరాచార్యుడు, క్రీస్తు, రామకృష్ణ పరమహంస, వివేకానందుడు, బాలయోగి వంటి లోకోత్తర పురుషులను గురించి చెపుతావు నీవు.

లోకం గురించి ఆలోచిస్తాను నేను.

లోక ధర్మానికి, సృష్టి ధర్మానికి విరుద్ధంగా, అతీతంగా, వెళ్ళే వాళ్ళను లోకం గౌరవించగలదు. కాని - అనుసరించ లేదు.

స్త్రీ పురుష సంయోగ సుఖ స్వరూపమే సృష్టి.

స్త్రీని బహిష్కరించే పురుషుడూ, పురుషుణ్ణి బహిష్కరించే స్త్రీ - పూర్ణ వ్యక్తులు కాలేరు.

ప్రత్యేక ప్రయోజనం కోసం ఒంటరిగా, ఏ బంధమూ లేకుండా ఉండిపోవచ్చు. అది వేరే సంగతి.

స్వయంగా స్త్రీని సంపాదించుకోలేని పురుషులు, పురుషుణ్ణి సంపాదించుకోలేని స్త్రీలు-ఎక్కువ సంఖ్యలో ఉంటారు లోకంలో. తల్లిదండ్రులు తెచ్చిన వాళ్ళను పెళ్ళాడి, సుఖంగా గడిపేస్తారు జీవితాలను వాళ్ళు. సామాజిక వ్యవస్థకు పునాదీ, ప్రాణమూ ఈ రకమైన సామాన్య జనమే.

మరి కొందరు పురుష లుంటారు. ధనం, బలం, హోదా, అధికారం వగైరా అదనపు శక్తులతో స్వాధీనం చేసుకొంటారు స్త్రీలను వాళ్ళు. బహు స్త్రీ భోగం ఒక వ్యసనం వాళ్ళకు.

కేవల సంగీత సాహిత్యాది కళల ద్వారా సన్నిహితు లవుతారు కొందరు మధుర హృదయులు. కళలో సహజంగా, అంతర్వాహినిగా ఉండే కామతత్వం పైకి ఉబికి ఉప్పొంగుతుంది అట్టి వాళ్ళలో.

ఆ కారణంగా, చెప్పుకోదగ్గ బాహ్యాకర్షణ ఏదీ లేకుండా, రెండు ఆత్మలు కలిసిపోయి, హృదయాలు కరిగిపోయి, శరీరాలు ఒకటైపోతై కొద్దిమంది విషయంలో. అందుకు మనమే ఉదాహరణ.

రెండు మేఘాలు, రెండు సెలయేళ్ళు, రెండు కిరణాలు - ఒకదాని నొకటి వెతుక్కొంటూ వచ్చి, ఒకటిగా కలిసి పోవడం !

హేతువు కనిపించదు ఈ ప్రేమకు, అంతం ఉండదు దాని ఆనందానికి.

చాలా అరుదుగా కనిపించే మన లాంటి రాగ హృదయుల్నీ, మహాయోగుల్నీ, మినహాయిస్తే - తక్కిన స్త్రీ పురుష లంతా కేవలం కామోప భోగ లాలసులే. సృష్టి ప్రణాళికలో సాధారణ సాధనాలే.

కామోప భోగం స్త్రీ పురుష సహజ గుణం.

నిరోధాలకు, నిషేధాలకు లొంగేది కాదది.

దేవతలు, మహర్షులు, ఇంకా అనేక మంది గొప్ప వాళ్ళు. ఆదికాలం నుంచీ దీనికి లొంగిపోయిన వాళ్ళే.

అలాంటి సహజ ప్రవృత్తిని అదుపులో పెట్టనూ వచ్చు. పెట్టలేకనూ పోవచ్చు మానవుడు.

పెట్టలేనప్పుడు, అది వరదలా పొంగి, కట్టలు త్రెంచుకొని, సమాజాన్ని ముంచకుండా తగిన కట్టుదిట్టాలు, డ్రైనేజీ ఏర్పాట్లు చేసుకోవలసి ఉంది.

అలాంటి వేమీ లేకుండా, ఉన్న ఏర్పాట్లను కూడా రద్దు చేసి, సహజ ప్రవృత్తికి వ్యభిచారం అంటూ ఒక చెడ్డపేరు పెట్టి, దాన్ని శిక్షకు పాల్పడ జెయ్యడం నిజంగా అన్యాయం !

కామం సహజ ప్రవృత్తి. బహిరంగంగా నిరోధించ బడితే, రహస్యంగా విజృంభిస్తుం దది.

ఒక్క మానవుడికే కాదు, సృష్టి లోని ఏ ప్రాణి కైనా - సహజ ప్రవృత్తి వల్ల ఆనందం, పారవశ్యం కలిగించే రాగమధువులు కొన్ని ఉన్నై. అందులో ప్రధాన మైనట్టిది కామం.

ప్రవక్తలు, ప్రవచనాలు, నీతులు, నియమాలు, మతాలు, నరక భయాలు, శాసనాలు, జైళ్ళు - ఇవన్నీ కూడా అపజయం పొందిన కారణం తెలుసా ?

ప్రాణికి పరమేశ్వరు డిచ్చిన ఒక మధుర వరాన్ని - ఒక రాగమధువును - ఒక ఆనంద సుధను - కంట్రోలు చెయ్యడానికి బదులు, పాప మని నిషేధించడమే !

ఒమర్‌ఖయాము మహాకవి వ్రాసిన రుబాయతులను తన రాజ్యంలో నిషేధించి, తాను మాత్రం చదువుకొనే వాడట ఔరంగజేబు చక్రవర్తి !

మానవుడి అహంకారానికీ, అహంకారి లోని అల్పత్వానికీ పరాకాష్ఠ ఔరంగజేబు ప్రవర్తన !

మానవులలో తా నొక్కడే గొప్పవాడి ననుకొనేవాడు పరమ అల్పుడు. వట్టి మృగం.

ఎదిరి బలం తెలియంది ఒక్క మృగానికే !

ఇంతకూ - చెప్పా లనుకొన్న దేమిటంటే-

ఒక సామాన్య పురుషుడికి ఒక సామాన్య స్త్రీ చాలు. అలాంటి స్త్రీ పురుషులే అధిక సంఖ్యాకులు. వాళ్ళే సమాజం అంటే.

కాని...

సామాన్యుడి ప్రక్క మరో అసామాన్యుడూ, సామాన్య స్త్రీ ప్రక్క మరో అసామాన్య సుందరీ ఉంటూ ఉండడం తప్పడం లేదు కదా ?

మురికి వేళ్లు, మొద్దు కాండం, చప్పని ఆకులు, కరుకు ముళ్లు -వీటి నడుమ అందమైన మొగ్గ ! అంతా ఒకే కుటుంబం !

పువ్వులనే తీసుకొన్నా -మల్లె ప్రక్కనే సుందర తరమైన గులాబి !

మల్లెకూ ముల్లుకూ, ఎందకూ చీకటికీ, ఆవుకూ దున్న పోతుకూ, మూడు ముళ్ళూ వేసి కట్టి పడవేయడం జరుగుతున్నందు వల్లనే - సుఖంగా సాగవలసిన సంసార సాగరాలలో రేగుతున్నై తుపానులు ! తెగుతున్నై కట్టలు ! పొంగుతున్నై ఉప్పెనలు !

ధనం, అధికారం, బలం, స్థూర ద్రూపం, వాక్చాతుర్యం - లాంటి అధి గుణాలు కల పురుషులు ఎక్కువగా ఆకర్షించ గలరు స్త్రీలను.

అలాంటి పురుషుని చుట్టూ చేరడం సహజం అనేకమంది స్త్రీలు - అయస్కాంతం చుట్టూ ఇనుప సూదుల వలె ! శారీరకంగా వీలు లేకపోతే, మానసికంగా అయినా !

ఫలితం -

ధనం వలె, విద్య వలె, అధికారం వలె - ప్రేమ కూడా ఒక్కొక్క చోట

కేంద్రీకృతమై పోవడం ! తక్కిన సమాజంలో ప్రేమ దారిద్ర్యం ఏర్పడడం ! దాని స్థానంలో కృత్రిమంగా కామం విజృంభించడం: స్వైరవిహారం పెరగడం !

బలహీనుల రక్షణార్థం వంచక శాసనాలు బైలుదేరడం !

కోర్టులు, పోలీసులు, వారసత్వ హక్కులు, కుటుంబ గౌరవం – వీటి భయం లేకుండా, భార్యకు కేవల హృదయంతో ఏలుకోగల భర్తలు ఎంతమంది సమాజంలో ?

సోషలిజానికి వ్యతిరేకిని కాను నేను. కాని – గడ్డి పరకల్ని రక్షించడం కోసం గోవుల్ని ఎండగట్టేది మాత్రం కాగూడ దది !

బలహీనుణ్ణి రక్షిస్తూ, బలవంతుణ్ణి అణచివేసే శాసనన్యాయం ఎప్పటి నుంచి బైలుదేరిందో – అప్పటి నుంచే ప్రారంభమైంది మానవజాతి పతనం !

నైతికులు, సన్యాసులు, భిక్షకులు, నిర్వీర్యులు – ఇలాంటి పనికిమాలిన వాళ్ళకు రాజ మర్యాదలు !

సోక్రటీసులు, క్రీస్తులు, అభిమన్యులు, భగత్సింగులు, గాంధీలు – లాంటి వాళ్ళకు రాజ మర్యాదలు !

లక్షమందిని రక్షించగల ఒక బలశాలిని పదిమంది కూడి చంపేస్తారు కుట్ర చేసి ! మోసానికి మౌలికశక్తి బలి !

ఇలాంటి న్యాయ శాసనం క్రింద – ఒక స్త్రీనీ, ఒక పురుషుణ్ణీ చేర్చి, కట్టి పడవేస్తున్నది సమాజం – కలిసి బ్రతకమని !

కలిసి బ్రతకవచ్చు – వాళ్ళ స్వభావాలు కలిస్తే, కలవకపోయినా, వాళ్ళ సహజ ప్రవృత్తులకు పరిపూర్ణ స్వేచ్ఛ ఉంటే. వాళ్ళిద్దరికీ వీధి గుమ్మం ఒక్కటే అయితే !

స్వేచ్ఛా కామం వీధి గుమ్మం
వ్యభిచారం దొడ్డి గుమ్మం.

వీధి గుమ్మాన్ని మూసివేసింది అధునిక సమాజం
దొడ్డి గుమ్మం వెడల్పు అయింది సహజంగా !

ఒక సామాన్య స్త్రీతో పూర్ణ పురుషు డెలా తృప్తిపడి ఉండలేడో, ఒక సామాన్య పురుషుడితో పూర్ణ స్త్రీ కూడా అలానే తృప్తిపడి ఉండలేదు.

కాగా -

సమాజం నుంచి వ్యభిచారం పోవాలంటే - కామోపభోగానికి వ్యభిచారం అన్న పేరును తొలగించుకోక తప్పదు.

సమాజంలో అందరూ సామాన్యులో, పరిపూర్ణులో కాలేరు కనుక అన్నం పేరును సున్నంగా మార్చినంత మాత్రం చేత, దాన్ని ఎవరూ తినకుండా ఉండలేరు కనుక

ఏ షరతూ లేకుండా స్త్రీ పురుష సంయోగాన్ని పవిత్రంగా భావించినప్పుడే మానవుడు పవిత్రు డవుతాడు ! మరో అడుగు ముందుకు పోతాడు !

ఆకలి దప్పుల వలెనే సెక్సును శారీరక తృష్ణగా మాత్రమే తీసుకొన్నా - (అలా తీసుకోవడమే సబబు ఈ సంతాన నిరోధక యుగంలో, కామానికి మరో ప్రయోజనం లేని ఈ రోజుల్లో) - అట్టి తృష్ణ అయా వ్యక్తుల సొంత విషయమే కాదా ?

అసహజమైన నీతుల్నీ, నిర్బంధాల్నీ కల్పించుకొని - వ్యక్తుల స్వవిషయాల్లో జోక్యం చేసుకొని - వాళ్ల బ్రతుకుల్ని నాశనం చేసే హక్కు సమాజాన్ని కెక్కడిదో ?

స్త్రీ - పురుషుడు

రెండు మహాశక్తులు ఇవి !

పురుషుడు రస స్వరూపి

స్త్రీ కళా స్వరుపిణి.

కళా స్వాదనే రసం

రసం రసాన్ని పొందడమే ఆనందం.

రసానందం బ్రహ్మానం ద లవం. అందుకే దాని కంత అవక్రపరాక్రమం. అంత విశ్వలీలా రామణీయకం.

ఈ రెండు శక్తుల నడుమ లేచిన విధి నిషేధ కుడ్యాలే అవినీతికీ, అక్రమానికీ, పతనానికీ హేతువులు.

సహజ ప్రకృతి పట్ల మానవునికి విధి నిషేధా లేమిటి ?

స్వేచ్ఛగా విడిచిపెట్ట బడవలసిన శక్తులు ఇవి రెండూ.

వాటికి స్వేచ్ఛ లభించే వరకూ లోకం పాపంలో కుళ్ళి చావక తప్పదు !

నీతికీ, అవినీతికీ తేడా ఏం లేదు ;
తనకు దక్కిన సుఖం నీతి,
మరొకడికి దక్కిన సుఖం అవినీతి !

49

తాను పురుషుడ నన్న అహంకారం జాస్తి గానే ఉంది రాంబాబుకు.

నీవు సూచించిన స్వర్ణలత కూడ నచ్చలేదు తనకు.

తన లక్ష్యాలకు అనుగుణమైన విద్యావతి దొరికే వరకు పెళ్ళాడడట తాను మరి – ఆమెకూ ఉంటైగా కొన్ని లక్ష్యాలు ?

తన లక్ష్యాలకు అనుగుణమైన స్త్రీ అంటే – తనకు బానిసగా పడి ఉండగల స్త్రీ అనేగా అర్థం ?

విద్యావతి బానిసగా ఎలా పడి ఉంటుంది ?

చదువు అబ్బక, ఏ కళ లోనూ ప్రవేశం లేక, తన బ్రతుకు తాను బ్రతికే ఏ విలువా లేక – ఎవడో ఒక మగవాడికి శరీరాన్ని అప్పగించి, అతడికి పిల్లల్ని కనిపెట్టడానికి మాత్రమే పనికివచ్చే ఆడవాళ్లు కొల్లలుగానే ఉన్నారు ఈ మన సమాజంలో.

కొనుక్కో నక్కరలేదు

ఏ ఖర్చు అక్కరలేదు

ఎదురు కట్నాలతో వస్తారు భార్యా రూపంలో కోరుకొన్న బానిసలు !

మనం విలువైన వస్తువును కొనుక్కొంటాం. పనికిరాని వస్తువును సొంత ఖర్చుతో తీసి పారవెయ్యిస్తాం.

తమ ఆడపిల్లల్ని సొంత ఖర్చులతో వదిలించుకొనే లక్షల కొలది తండ్రులలో – పిల్ల నిచ్చి, డబ్బు కూడ ఇస్తాడుగా ఏ ఒక్కడైనా ?

స్త్రీ కంటే పురుషుడు బలవంతు డన్న సత్యాన్ని గుర్తించి, పురుషుని ఆధిక్యత దృష్ట్యా చూస్తే – కన్యా శుల్క పద్ధతే కొంత విలువ ఇచ్చిం దనవచ్చు స్త్రీకి.

అయితే – రాంబాబుకు కావలసింది విద్యావతి అయిన బానిస.

పెళ్లి చదువులు చదివిన వాళ్ళంతా అలాంటి వాళ్ళే !

అయినా – కొన్ని లక్ష్యా లుంటై వాళ్ళకు కూడ

నేటి విద్యావతి – కేవలం తిండి కోసం మగవాడిపై ఆధారపడే నిస్సహాయ కాదు.

అవసరమైతే – మగవాణ్ణి పోషించగల దామె స్వార్జనతో.

భార్య, భర్త అనే పదాలే నాకు కిట్టవు. బానిస, యజమాని అనే కదా వాటి అర్థం ?

"నీకు పని మనిషి కావాలా ? సహచరి కావాలా ?" అని అడిగాను నేను రాంబాబును. ఇద్దరూ కావాలన్నా డతడు.

ఇద్దర్నీ, ముగ్గుర్నీ చేసుకోడానికి నేటి చట్టం ఒప్పుకోదు –

చట్టాన్ని సవరించుకో వచ్చుగా అన్నది లత !

లత ఉద్దేశాలే వేరు. బహుభార్యా నిషేధ చట్టం స్త్రీకే ఎక్కువ అపకారం చేసిం దంటుంది ఆమె !

మానవ శాసనం ప్రతీదీ ప్రకృతి శాసనానికి విరుద్ధమే అంటుంది కూడా.

ఈ విషయం మరోసారి చర్చించుకోవచ్చు కాని – రాంబాబు పెళ్ళే ఒక సమస్య అయి కూర్చుంది.

లక్ష్యా లట !

లక్ష్యం అంటూ ఏదీ లేనివాళ్ళు ఉండరు లోకంలో.

ప్రతి వ్యక్తికీ ఉంటుంది ఏదో ఒక లక్ష్యం

జీవికి ప్రధాన లక్ష్యం జీవించడం.

జీవించడం కోసం ఆ జీవి చెయ్యని పని అంటూ ఉండదు !

మంచి, చెడ్డ, పాపం, పుణ్యం, అధికారం, ధిక్కారం, యాజమాన్యం, సేవ–సమస్తాన్నీ ఏతత్ ప్రధాన లక్ష్యసిద్ధి కోసమే ఉపయోగిస్తున్నాడు మానవుడు.

సృష్టి స్థితి లయాలు మూడూ మానవుడి చేతిలోవే నేడు.

ఈనాడు సమాజం అంటే బలవత్తముడైన ఒక వ్యక్తి.

అతడు గొల్ల, సమాజం లోని తక్కిన వ్యక్తు లందరూ గొర్రెలు.

గొల్ల లక్ష్యమూ బ్రతకడమే

గొర్రె లక్ష్యమూ బ్రతకడమే.

అదే హేతువు లోకం లోని ఈ కల్లోలా లన్నింటికి,

వైర లక్ష్యాల తీగలతో అల్లబడిన జల్లెడ ఈ లోకం.

ప్రతి జీవికీ ఒక లక్ష్యం ఉంది. ప్రతి లక్ష్యానికీ ఒక మార్గం ఉంది. ప్రతి మార్గానికీ ఒక క్రమం ఉంది.

తనకే ఒక లక్ష్యం ఉన్నట్టు, మరెవరికీ లేనట్టు మాట్లాడటం మూర్ఖత్వం.

ప్రకృతి ధర్మాన్ని, క్రమశిక్షణను అనుసరించి పోతే – ప్రతి వైర శక్తి విరోధం లేకుండానే పురోగమించ గలదు. ప్రతి లక్ష్యమూ సాధ్యం కాగలదు. ఎవరి లక్ష్యానికీ ఎవరూ బానిసలు కానక్కర లేదు.

గుర్తించదు రాంబాబు !

లీల వంటిదే లొంగదియ్యా లతఙ్గి !

50

ఎవరీ సీరి – ఊర్వశిలా !

ఒకొక్క రమణి ఒకొక్క పౌరాణిక కాంతను జ్ఞప్తికి తెస్తుంది నాకు – ఒకొక్కప్పుడు.

ఆయా అంశలలో పుడతారు కొందరు.

ఆయా అంశలకు ఛాయా మూర్తులుగా భాసిస్తారు కొందరు.

అనంత కాలవాహినిలో అంశలు కూడ అనంతకాల చిరంజీవన లీలా తరంగాలే కావచ్చు కద ?

నీవే కదూ పరిచయం చేశావు ఆనాడు ఈమెను ?

గొప్ప పని చేశావు !

ఊర్వశిలా కనిపిస్తుంది సీరి నా కంటికి !

ఆ మాటే అన్నాను ఆమెతో నిన్న సాయంత్రం.

ఆనందంతో మందార పుష్పమే అయిందామె ఆ మాటకు !

ఏ స్త్రీ అయినా అంతే – వట్టి బెలూను !

అందంగా ఉన్నావంటే చాలు – బెలూనులా ఉబ్బిపోయి, టప్‌మని పగిలిపోతుంది ఆ మగవాడి చేతిలో !

మగవాడి చేతిలో ఆడది బానిస కావడానికి కారణం ఆమెలోని ఈ బలహీనతే !

సహజోక్తి ఏదో, కపటోక్తి ఏదో తెలిసికోగల నీ వంటి వివేకినులకు అది వరమే కావచ్చు. కాని - పొగడ్తలన్నీ నిజమే అనుకొనే విలాసినులకు మాత్రం అది పతన హేతువు !

అది వట్టి పొగడ్త అని తెలిసి కూడ, అందులో పడిపోతా రెందుకో చాలామంది !

పొగడ్తను మించిన మద్యం లేదు లోకంలో, స్పర్శామాత్రం తోనే మత్తెక్కిం చేస్తుం దది ఏ వ్యక్తి కైనా !

ఇక, సీరి విషయం-

నిజంగానే ఊర్వశిలా కనిపిస్తుం దామె నాకు !

నే నెవర్నీ పొగడను. పొగడవలసిన అవసరం కూడ లేదుగా ?

తన ఫొటో ఒకటి ఇచ్చిం దామె నాకు.

నా ఫొటో ఒకటి కావాలన్నది. కాని - నాకు ఫోటోలే లేవయ్యె !

నాది ఫోటోముఖం కాదు. నా ఫోటో నాకే నచ్చదు.

గోదావరి లంకలలో, మహా కరకట్లను కొమ్ములతో చిమ్మి, రంకెలు వేసే పోట్లగిత్త ముఖంలా - దుర్భరంగా కనిపిస్తుంది నా ముఖం నాకే !

అమృత భాండం ఇదే నంటూ - పెదవులు తియ్యవు మరి దీని నుంచి !

అది నీ ప్రేమకు నిదర్శనం, నా అందానికి కాదు.

అందుకే నేను ఫోటోలు తీయించుకోను. నాకు ఫోటోలే లేవు.

తనను గురించి చెప్పుకోవడంతో పాటు, నీ గురించి కూడ చెప్పిందామె ఏమేమో ! ఈ సంగతు లేమీ నీతో చెప్పవ ద్దన్నది కూడా !

మనం అందర్నీ నమ్ముతాం. అందరూ మనలాంటి వాళ్లే అనుకొంటాం. మన మిత్రు లంతా మనలాగే అవ్యాజాను రాగంతో ప్రేమిస్తా రనుకొంటాం. వాళ్ళంతా మన శ్రేయోభిలాషులే అనుకొంటాం.

నా మిత్రుడు మన్మధసూరి నా గురించి నీకు చెప్పినట్టే, నీ మిత్రురాలు సీరి నీ గురించి నాకు చెప్పింది !

ఈ చెప్పడాలు అప్పడాల వలె కమ్మగా ఉంటై !

ఆ కమ్మదనమే రిమ్మ తిరిగేటట్టు కొడుతుంది - వాళ్ళ జీవితాల గూబలపై!

మనల్ని చూచి అసూయతో చస్తున్న వాళ్ళు మన శత్రువు లొక్కళ్ళే కాదు - మన మిత్రు లనేకులు కూడ !

పిల్లులు, గుడ్ల గూబలు వెలుగును చూడలేవు. మరి నక్షత్రాలు కూడ ఎందుకు చూడలేవో !

మన ప్రేమను, అనురాగాన్ని, ఆరాధనను చూడలేక కళ్ళల్లో కారం కొట్టుకొంటున్న లోకం ఎవరో కాదు, మన చుట్టూ ఉన్న మనవాళ్ళే !

అందుకే జాగ్రత్తగా ఉండాలి మనం.

ఈ మధ్య మనం ఎదుర్కొన్న క్లిష్టపరిస్థితికి కారణం ఇలాంటి వాళ్ళ కుట్రలే కదా ?

స్వార్థాలు అనేక విధాలు. కుట్రలు అనేక తరహాలు.

తన ఫోటో ఒకటి ఇచ్చింది సీరి.

అంతకన్న మంచి ఫోటో లన్నీ మన్మధసూరి తీసుకుపోయాడట - ఏదో సినీమాలో వేషం ఇప్పిస్తానని !

తిరిగి ఇవ్వమని అడిగితే, తన గదికి వచ్చి తీసుకువెళ్ళ మంటున్నాడట !

మంచి చేప కోసం గాలం వేస్తున్నా నన్నా డతడు మొన్న నాతో.

బహుశా ఆ చేప ఇదే కావచ్చు !

51

ఊర్వశి విశ్వప్రేయసే కావొచ్చు. నాకు మాత్రం కాదు.

వెర్రి వాడి పెళ్ళాం వాడ కంతటికీ వదినె. ఏ ఒక్కరికీ అక్కరలేని ఆడది - అందరికీ కావలసిన వేశ్య !

అర్జునుడి వంటి దక్షిణ నాయకుడు, కృష్ణుడిలాంటి విశ్వ ప్రేమికుడు కూడా వేశ్యను అభిమానించినట్టు లేదు ఎక్కడా !

స్వకీయలైన ప్రియురాండ్రు లేని కేవల భావుకులు ఎవరైనా పడితే పడవచ్చు ఆమె వెంట. అలాంటి దుర్గతి పట్ట లేదు నాకు ! ఎలాంటి అనుమానాలూ వద్దు నీకు !

నా ప్రేయసి నా కుంది.

నా జీవితం లోనూ, నా సాహిత్యం లోనూ కూడా ఒక్కర్తే ప్రేయసి నాకు. అదే వైశాఖి !

బాల్యం నుంచీ రాగలక్ష్మిగా, రాగజ్యోతిగా, రాగప్రభగా, రాగరమగా - వివిధ రూపాలలో, వివిధ రాగాలతో నన్ను రసబ్రహ్మను చేస్తూ వస్తున్న ఆ ఏకైక అమృత రాగ ప్రేయసి - నీవే !

కృష్ణుడికి రాధ ఉంది.

రాధ పై మక్కువ కలవాళ్ళంతా, తామే రాధల మనుకొంటూ, శ్రీ కృష్ణుణ్ణి ఆరాధిస్తారు భర్తృ భావంతో. అది మధుర భక్తి ! స్త్రీ వేషం వేసుకొని, స్త్రీలతో కలిసి తిరిగే అక్బరు మనస్తత్వం అది !

ఊర్వశి సామాన్య. ఊరందరికీ ప్రేయసి ఆమె. ఆమెపై మక్కువ కల వాళ్ళంతా క్యూలో నిలబడి - ఆమె ఏ పురూరవుడికో పిల్లల్ని కంటూ ఉండడం వల్ల హతాశులై, విరహాగ్నితో వేగిపోతూ, భావగీతాలు పాడుకొంటూ గడిపేస్తారు కాలం.

ప్రేమకు, పవిత్రతకు, సౌందర్యానికి, ఆత్మార్పణకు, ఆనందానికి ఆదర్శప్రాయలైన స్త్రీ మూర్తులు ఎందరో ఉన్నారు ! పూర్వమూ, ఇప్పుడూ కూడా। సీత, సావిత్రి, అరుంధతి, శకుంతల, రాధ, ద్రౌపది, ఎంకి, కాంతం, అనార్కలి, భాగ్యమతి, స్నేహ, మధుబాల, బాల, కిన్నెరసాని - ఎంద రెందరో !

అట్టి ఆదర్శ స్త్రీ మూర్తులను భక్తితో ఆరాధించుకోలేక, క్రొత్తవారిని సృష్టించుకోలేక, పాత్ర క్రొత్తల నడుమ సతమత మవుతున్న వాళ్ళంతా మెహిందీలకు ఎగబడుతున్నారు - సంగీతం కోసం, సౌందర్యం కోసం, ప్రణయం కోసం !

అలాంటి వాళ్ళలో ఎక్కువ మందిని తన వెంట త్రిప్పుకోగలిగిన ఊర్వశి నిజంగా విశ్వప్రేయసి !

ఊర్వశి విశ్వప్రేయసే అయినా, సీరి రూపంలో ఆమె నా వెంట పడినా - నీ సహస్రాధిక సఖీ జనంలో ఆమె ఒక్కతె మాత్రమేగా !

అనుమానం వద్దు నీకు

వచ్చెయ్ - అనుభవిద్దాం ఈ మార్గశిర పౌర్ణమిని !

ఈ చలి మరీ ఉడుకెత్తిస్తున్నది నన్ను!

మార్గశిరి

ఈ చలిలో !
ఈ చల్లని వెన్నెలలో !

ఒత్తుగ మెత్తగ ఎదలకు
ఒకరి నొకరు హత్తుకొని
ఎల్ల జగము నిదురపోవ -
ఎవ్వడవో, ఒంటరిగా !

వస్తానని ఏ సోమరి
బద్ధకించి కూర్చున్నదొ !
వీలు లేక ఏ సుందరి
విరహాగ్నుల బడి యున్నదొ !

కవ్వించే కలువలతో
కయ్యానికి దిగబోకుమ !
మత్తు చల్లి, మంచు చల్లి,
చిత్తు చేయు జాబిల్లి !

నా మనస్సును చదివి, పాడుతున్నది ఉద్యాన రమ - నా చుట్టూ ఈ పాటను.

అది జాలో ! హెచ్చరికో !

మృగశిరా దేవి ఒడిలో బోర్లా పడుకొని, క్రిందికి వంగి చూశాడు. పాట విని పూర్ణచంద్రుడు నాకేసి !

తీక్షణంగా చూస్తున్నాడు – మీసం మెలివేసుకొంటూ !

వడవడ వణికి పోతున్నాను నేను – ఆ మంటల విసుర్లకు !

పార్వతీ పరమేశ్వర మిథున మూర్ధోపరి గంగా ప్రతీరంలో విహరిస్తున్న వీరు దతడు – వెనుక రోహిణితో, ఎదుట అర్ద్రతో !

క్రింద కలువల పట్ల కూడ ఎంత లాలస అతడికి !

నేను వాటి జోలికి పోకుండా నా పై ప్రయోగించాడు అగ్నేయాస్త్రాన్ని !

మంటలు, జ్వాలలు, ధూమం, ధూళి !

ఓహో, వెన్నెల కాదిది !

ఎందుకో ఇంత మాత్సర్యం అతడికి నా పట్ల ?

కేవలం కలువల రక్షణార్థ మేనా ?

అతడి కలువలు నా కెందుకు ?

నీ కందొవలు లేవా నాకు ?

అతడి ప్రియ తారలు నీ హారం లోని ముత్యాలు మాత్రం !

అతడి పూర్ణ జ్యోత్స్న నీ చిరునవ్వు కాంతి మాత్రం ?

అతడి పక్షాలు నీ బొట్టూ, కాటుకా మాత్రం !

రాగ జ్యోత్స్నవు నీవు !

ఒక అధి వీరుణ్ణి నాలో గుర్తించిన ప్రతి వీరుడు చంద్రుడు !

నీపై ద్వేషంతో నాపై యుద్ధానికి పురికొల్పి ఉంటుం దతణ్ణి మృగశిరా దేవి !

ఇదీ వీరత్వం !

ఇదీ వీర రసం !

ఇప్పుడు మా ఇద్దరికీ మధ్య జరుగుతున్న యుద్ధం యొక్క కథనమే వీర కావ్యం !

రెండో ప్రపంచ యుద్ధాన్ని పద్యాలలో వ్రాసి, దాన్ని మహా కావ్యంగా గుర్తింప జేసుకొంటున్నాడు సింహ మహాకవి !

మహా పండితులు, మహా నాయకులు – ఆ మహా కావ్యాన్ని వేనోళ్ల పొగిడి తరించడానికి తాము ఆదిశేషులం కాలేకపోయామే – అని బెంగ పెట్టుకొని చస్తున్నారట !

(నాకు తెలియదు. అతడే అన్నాడు నాతో)

" రామాయణ, మహాభారతాలను మించిన మహాకావ్యం వ్రాశాను. అంతా భగవత్కృప " అన్నా డతడు మొన్న వ్రాతప్రతి నుండి ఒకటి రెండు పద్యాలు చదువు తూ !

ఈ నాటికి మళ్ళీ ఒక మహా కావ్యం !

ఓహో, దేవీ ! సరస్వతీ ! రసపయోధీ ! రాగోదయీ ! విశ్వవాగీశ్వరీ ! సర్వ జీవ శ్రేయస్వినీ !

" మహాకవీ ! మహర్షీ మీ కావ్యనాయకు డెవరు ? నాయిక కాగల్గిన ఆ జగచ్ఛక్తి ఎవరు ?" అన్నాను నేను ఆనందబాష్పాలు తుడుచుకొంటూ !

జవాబు లేదు !

ఆనంద స్థాయి నుంచి, ఆఫీసు స్థాయికి పడిపోయి, ప్రశ్నార్థకంగా చూశాను అతడి కేసి !

అత డక్కడ లేడు !

రెండో ప్రపంచ యుద్ధమే కాదు – ఏ పోరాటం అయినా, అది చరిత్ర కాగలదే కాని, వీరకావ్యం ఎలా అవుతుంది ?

చరిత్రనో, జీవిత చరిత్రనో వచనంలో వలెనే పద్యాలలో కూడ రచించవచ్చు.

గణిత శాస్త్రాన్ని, వైద్య శాస్త్రాన్ని కూడా పద్యాలలో బిగించిన జాతి మనది !

పద్యం కవిత్వం కాదు.

నీతులు, నినాదాలు, ప్రవచనాలు – ఏవీ కవిత్వం కాదు.

అవన్నీ జీవితానికి కావలసిన ఉపకరణాలు.

కవిత్వం ప్రియభోజనం !

స్పర్శా మాత్రంగా అయినా రసం ఉంటేనే అది ఆస్వాదన యోగ్యం అవుతుంది. కవిత అవుతుంది !

రసం ఆనంద స్మారకం

ఆనందం తన్మయీశ్రీ !

నినాదాలు, ఉద్యమాలు, విప్లవాలు, చరిత్రలు – ఏవైనా సరే, ఒక రిధంలో నిర్మించవచ్చు. పద్యాలతో అల్లవచ్చు. అంతే !

పద్యమో, పాటో, లఘు కావ్యమో, పూర్ణ కావ్యమో, ఏదైనప్పటికీ – అది కవిత కావా లంటే – రసం ప్రధానం !

అది ఏ రసమైనా సరే !

రసానికి ఆలంబనం ప్రకృతీ పురుషులు ! నాయికా నాయకులు !

పరిశీలించి చూడు !

శృంగార నిరోధమే వీరం. శృంగార వైఫల్యమే కరుణం.

శృంగార స్పర్శ లేనిదే రసం కాదు

రస స్పర్శ లేనిదే కవిత కాదు

కవితా స్పర్శ లేనిదే కావ్యం కాదు !

రెండు పార్టీల మధ్య వీధిలో కొట్లాట కంటే – రెండు దేశాల మధ్యో, రెండు సిద్ధాంతాల మధ్యో ప్రపంచ యుద్ధం – స్వభావంలో ఏ విధంగా గొప్పది ?

కొట్లాట, యుద్ధం – తర తమ భేదాలతో – రెండూ ఒకటే !

ఇవి చరిత్రాంశాలే కాని, రస నిష్కాలు కావు.

రామ రావణ యుద్ధంలో సీత ఉంది

మహా భారత యుద్ధంలో ద్రౌపది ఉంది

ప్రతి ఇంటికీ ఒకో ఇల్లాలు ఉంది

రెండో ప్రపంచ యుద్ధంలో ఉన్న దెవరు ?

స్త్రీ లేనిదే శృంగారం లేదు. శృంగారం లేనిదే రసం లేదు. రసం లేనిదే జీవితం లేదు. జీవితం లేనిదే కావ్యం లేదు.

ప్రతి వ్యక్తి జీవితమూ ఒక కావ్యమే – మరో వ్యక్తి హృదయంతో ముడి పడ్డప్పుడు.

మన జీవితమే ఒక మహా కావ్యం ఈ రాత్రి !

నాయకుణ్ణి నేను !

ప్రతి నాయకుడు పూర్ణ చంద్రుడు !

మహా యుద్ధం ఇది !

హిమ కిరణాలు అణ్వస్త్రాలై ప్రేలుతున్నై !

ఓహో, వచ్చేశావు నీవు !

ఏడీ చంద్రుడు ?

దాక్కొన్నాడు పోయి, బిల్వ వృక్షం కొమ్మల్లో - ఆర్ద్రాదేవి పమిటె మాటున !

ఓడిన చంద్రుడి నుంచి, అతడి పదహారు కళలూ వచ్చేసి, నిన్నాశ్రయించినై ఇప్పుడు !

మన్నించనీ, సమ్మానించనీ, తృప్తిపరచనీ వాటిని - నా చుంబన చూషణపేషణాదిక సమస్త సంస్కార సంపద తోను !

తలపున జొచ్చి నీవు సర
దా మెయి నాడుచు పాడుచున్ ప్రవ
ర్తిలు సమయాల - కాల మొక
ప్రేక్షకురా లయి నిల్చిపోవు ! నా
కలలకు ఏ విరామమును
కల్గదు ; నీ పదపద్మ సేవలో
మలచితి జీవిత మ్మొక న
మస్కృతిగా, కృతిగా, ప్రభూతిగా !

53

మన్మధ సూరి నాకు మంచి మిత్రుడే

అయితే - ఈ మధ్య బాగా అసూయ పట్టుకొన్న దతడికి నా మీద.

నేను నీకు పూర్తిగ లొంగిపోయి, అతణ్ణి మరిచి పోయా నట !

అతణ్ణేనా నేను మరచి పోయింది ? బంధువుల్ని, స్నేహితుల్ని, శ్రేయోభిలాషుల్ని, సినిమాల్ని, నాటకాల్ని, లోకంలో నాకు గల సమస్త పరిచయాలను మరచే పోలేదా నేను నీ అమృత పరిష్వంగ పరమంలో ?

ముందు వచ్చిన చెవుల కంటె, వెనుక వచ్చిన కొమ్ములు వాడి అన్నాడు మొన్న.

అవును - వాడే !

అది వాటి అదృష్టం. ఎవ రేమి చెయ్యగలరు ?

ప్రకృతి సత్యాన్ని పేర్కొంటూ, మళ్ళీ దాన్ని ద్వేషిస్తా రెందుకో !

పుట్టుతో వచ్చిన వెంట్రుకల కంటె, తర్వాత వచ్చిన దంతాలు గట్టి కాదా? అంతకంటె ఉపయోగకరం కాదా ?

" తల్లి విషం. పెళ్ళాం బెల్లం " అనేది మరొక ద్వేష పూరిత వాక్కు - లోకంలో !

పెళ్ళాం బెల్లంగా కలకాలం బ్రతకాలనేగా - అందరూ కోరి పెళ్ళి చేసింది ?

అట్టి బెల్లంపై మన్ను చల్లే తల్లి విషం కాక మరేమవుతుంది ?

తానూ తన మగడికి బెల్లమేగా ?

తన కొడుకు బెల్లంపై ద్వేషం దేనికి ?

అలా ద్వేషించే స్త్రీ తల్లి ఎలా అవుతుంది ?

ఎందుకు గుర్తించరో ఈ సహజ సత్యాలను !

ఎందుకు పెంచుకొంటారో ప్రయోజనం లేని అసూయా ద్వేషాల్నీ, మాత్సర్యాల్నీ !

దేశకాల పాత్ర లనేవి వాస్తవాలు కావు చాలామందికి !

అందుకే - వాటి కనుగుణంగా మారలేక, మారే మనుషుల్ని చూచి ఓర్చుకోలేక - అసూయ పడతారు వాళ్ళు !

అసూయ అనేది వాస్తవ సత్య పరిజ్ఞానం లేకపోవడం వల్ల వచ్చే ఒక జబ్బు.

పుట్టింటినే బూడిద చేసుకొనే అగ్ని అసూయ !

దేశకాల పరిస్థితులు వాస్తవ సత్యాలు. క్షణం క్షణం మారుతూ, ముందుకు పోతున్నై అవి.

చైతన్యం కల దేదైనా ముందుకు సాగేదే. మృత పదార్థం మాత్రమే పడి ఉంటుం దొక చోట. అది కూడ ఆ చోటుతో పాటు కదిలి పోతున్నట్టిదే - గాడిద మీది బూడిద మూట వలె !

కొత్తగా పెళ్లైన కుర్రవాడు పెళ్ళాన్ని విడిచి-తల్లి ఒడిలో పడుకుంటాడా ? చెల్లెలితో సినీమా కెళతాడా ? మిత్రుడితో రాత్రంతా పేకాడతాడా ?

అలా చేసే వాడు మగవా డనిపించుకో గలడా ? మనిషిగా బ్రతక గలడా ?

కొడుకుకు ప్రాణమిచ్చే తల్లి, కొడుకు అర్ధాంగిని దయగా అయినా చూడదేం ?

అసూయ !

అసూయకు పైకి కనిపించని కారణం సెక్సు !

కొడుకును ప్రేమిస్తూ, కోడల్ని ద్వేషించే స్త్రీ ఎంతటి పతివ్రత అయినా సరే - మానసిక వ్యభిచారిణే !

తల్లిని ఆరాధిస్తూ, పెళ్ళాన్ని హింసించే మగవాడు కూడా అంతే !

అసమర్థులుగా కనిపించే సక్కుబాయి మగళ్ళు పరమ దుష్టులు !

మన్మథ సూరి మనస్తత్వం విచిత్రం.

ఒక స్త్రీ కోసం మరో స్త్రీని వదులుకొనే వాడు మనిషి కాదు - నా దృష్టిలో.

చాలా మందిని వదిలేసిన వాడు మన్మథసూరి ! అరటిపండులా తిని, తొక్కలా పారేసి పోవా లంటా డతడు స్త్రీని !

ఆరాధన అవివేక మంటాడు. రంభలూ, ఊర్వశులూ డజను ముప్పావులాకు మార్కెట్లో దొరుకు తున్నా రంటాడు !

మీ అన్నతో ఇతడు కూడ ఏదో చెప్పాడు కదూ మనల్ని గురించి ?

ఎంత యాతనకు గురి అయాం మనం !

ఆశ్లేషయ్య దుష్టుడు. ఇతడు అసూయాపరుడు.

తాను బ్రతకడం కోసం ఎంతమంది నైనా చంప గలడు అసూయ !

54

అబద్ధ మాడను నేను

అబద్ధ మాడే వాడు కవి కాదు – నా దృష్టిలో !

కవి చెప్పేదీ, వ్రాసేదీ అంతా అబద్దమూ, అతిశయోక్తీ – అంటుంది కదూ లోకం ?

అలా అనేది మూఢలోకం. సహృదయ లోకం కాదు.

అలా అనడం లౌకిక ప్రయోజనాల కోసం పద్యాలు వ్రాసే వాళ్ళను గురించి. రసానంద బ్రహ్మలైన కవుల్ని గురించి కాదు.

ప్రకృతి యొక్క అంతరాంతరాలలోకి కవి వెళ్ళేటంత దూరం సామాన్యుడు వెళ్ళలేడు, కవి చూచే టన్ని అందాలను చూడలేడు.

అపూర్వ లోకాలలో, లోకోత్తర సౌందర్యాలను దర్శించి, దివ్య మాధుర్యాలను అనుభవించి, తన అనుభవ పీయూషాన్ని ప్రపంచానికి పంచిపెట్ట వచ్చిన కవి – సామాన్యుడికి అర్థం కాడు. పైగా అనుమానించ బడతాడు కూడ. దానితో అతడి మొత్తం కవిత్వమే అతిశయోక్తిగా, అబద్ధంగా కొట్టివేయ బడుతుంది !

కవి గోవు లాంటి వాడు

తాను గడ్డి మేసి, లోకానికి పాలిస్తా డతడు.

చూచేవాళ్ళు ఎంతమంది ఉన్నారో, అన్ని కోణా లున్నై సత్యానికి

ఏ కోణం నుంచి చూచేవాడికి ఆ కోణం నుంచి కనిపించేదే సత్యం.

మరో దృక్కోణాన్ని అర్థం చేసుకోలేడు సామాన్యుడు, గుర్తించలేడు పండితుడు, సహించలేడు నాయకుడు.

అన్ని దృక్కోణాల నుంచీ చూడగల వాడు కవి ఒక్కడే !

పూచిక పుల్ల కూడ పువ్వులు పూచేస్తుంది – కవి చేయి తగలగానే !

అతడి చేతిలో రసవంతం కాని వస్తువే లేదు సృష్టిలో

కవి రస బ్రహ్మ

కవి చెప్పేదంతా సత్యం, పరమ సత్యం, సత్యస్య సత్యం !

నేను కవిని. అబద్ధ మాడను నేను

ఒకొక్క స్త్రీలో ఒకొక్క సౌందర్యం భాసిస్తుంది నాకు !

ఎన్నో రకాల కళ్ళు, ఎన్నో రంగుల కాంతులు.

పౌరాణిక కాంతల స్వరూప సౌందర్యాలను గురించి నిశ్చితమైన ముద్ర లున్నై నా మనస్సులో !

సమాజంలో, మన చుట్టూ, కనిపిస్తూనే ఉంటారు మనకు - ఎంతో మంది సీతలు, తారలు, ద్రౌపదులు, అహల్యలు, రాధలు, రంభలు, మేనకలు, కుంతులు, కైకలు, శూర్పణఖలు, సుమతులు, ప్రద్వేషిణులు !

చూడగానే చెప్పగలను నేను ఏ స్త్రీ ఏ అంశకు చెందినట్టిదో !

బాల్యం నుంచీ వెతుక్కొంటూనే వస్తున్నాను నేను నీ కోసం.

ఎంతో మంది - నీవే అన్నంత భ్రమ కలిగించిన రాగవతులు - తారసిల్లారు నాకు నా అన్వేషణలో.

నా కోసం పుట్టిన పూర్ణ సుందరి కంటపడనే లేదు నాకు నిన్ను చూచే దాకా !

సీరి ఊర్వశే అయినా, నీ చెలికత్తె మాత్రమేగా !

నీ చెలికత్తె నీవు ఎలా అవుతావు ?

ఏడ్పు, ఆకలి, హక్కులు, పోరాటం-ఇవే సాహితీ లోకాన్ని సైతం పాలిస్తున్న ఈ యుగంలో- నీ లాంటి ఒక పూర్ణ రసైక రాగేశ్వరిని సంపాదించుకో గలిగిన నేను ఎంత ధన్యుణ్ణి !

సీరి మన్మధసూరి లాంటి వాళ్ళ కోసం

నత్తలు కొంగల కోసం.

" మునిగితే గాని ముత్యాలు దొరకవు " అన్నది కదూ కుసుమ ?

కుసుమ, రాజు, సత్యకళ, రమణ, రామకృష్ణ, మోదుకూరి, రామదాసు, తారక - వంటి అమృత హృదయాలే లేకపోతే ఆశ్లేషయ్య లాంటి హాలాహలం నుంచి బ్రతికి బైటపడే వాళ్ళమే కాము మనం - ఆ తొలి రోజుల విలయాలలో !

మంచి చెడ్డల్ని గుర్తించి, పూర్తిగా, ఆమోదించేదే స్నేహం.

అలాంటి స్నేహం మూర్తి దాల్చిన మృదు మధుర మందార కుసుమమే కుసుమ !

ఇప్పుడు ఎక్కడున్నదో, ఏమైపోయిందో ఆమె !

కాని -

ఆత్మికంగా మనతో ఉంది, ఉంటుంది శాశ్వతంగా.

నిండా మునిగి సంపాదించుకొన్న ముత్యాలం మనం- ఒకరి కొకరం !

ఈ ముత్యాలే ప్రకృతి పురుష సత్యాలు !

అబద్ధ మాడను నేను

పరస్పర రాగబద్ధం, అనిరుద్ధం - ఈ మన జీవితోద్గీధం !

55

ఎవరి భర్తనో ప్రేమించే స్త్రీలు !

ఎవరి భార్యనో ప్రేమించే పురుషులు !

ఎలా తీరతై వీళ్ళ కోరికలు ?

లీలావతి ప్రశ్న ఇది.

ఎందుకో వచ్చి, బాతాఖానీ పెట్టింది నాతో మొన్న.

తమకు పని లేనప్పుడు, ఇతర్లకు కూడా పని ఉండ దనుకొనే వాళ్ళలో లీల ఒకర్తి.

నాకు పని ఉన్నదని గట్టిగా చెప్పలేని మొగమాటం నాది.

కూర్చున్నాను వింటూ.

ఏమిటో ఈ ప్రేమలు !

ఎందుకు జరుగుతవో ఇలా !

" కావాలని ప్రేమిస్తారా ఎవరైనా ? ప్రేమ ఎప్పుడు, ఎలా ఎవరిపై పుడుతుందో ఎవరికీ తెలీదు. ప్రేమించిన తర్వాత కదా, ఫలానా వ్యక్తిని ప్రేమించినట్టు తెలియడం ? ఆ తర్వాత కదా ఆ వ్యక్తి వివరాలు తెలియడం ? ఆ వ్యక్తి లభించడం సాధ్యం కాదని తెలిస్తే ఆ తర్వాత ఏమిటి గతి? అప్పటికే అంచులు మోసి ప్రవహిస్తున్న ప్రేమ వాహిని ఎటు మళ్ళడం ? రహస్య కామం వైపా ? ఆత్మహత్య వైపా ? ఆమరణ బ్రహ్మచర్యం వైపా ? ఎటు ?" అన్నది లీల.

ప్రేమించిన వాళ్ళను పెళ్ళాడకూడ దనే సిద్ధాంతం కదా నాది ?

సెక్సు కంటే, సంసారం కంటే ప్రేమ గొప్పది నా దృష్టిలో.

సెక్సు ఒక కోరిక. అది శరీర నిష్ఠం.

ప్రేమ ఒక అనుభూతి. అది ఆత్మ నిష్ఠం.

సెక్సుకూ, సంసారానికి ఏ స్త్రీ అయినా చాలు, ఏ పురుషుడైనా చాలు.

ప్రేమించడం అతిలోక సుందరం.

ప్రేమ స్థాయిలో పెళ్ళాడి, ఆ తర్వాత కూడ ప్రేమను అదే స్థాయిలో నిలుపుకొని తరించగల పూర్ణత్వం ఎవరి కుంది ?

ఎవరి భర్తనో, ఎవరి భార్యనో ప్రేమిస్తే ఏం ? దాని వల్ల వచ్చే నష్టం ఏమిటి ?

ప్రేమించడాన్ని నిషేధించలేరు ఎవరూ.

ప్రేమ ఆత్మ స్వరూపి. ఆనందలహరి. ఊర్ధ్వశ్రీ అది నిషేధించే కొలదీ వికసిస్తుం దది.

ప్రేమ ఏక పక్షమైనా తారక మైనట్టిదే. ఉభయ పక్షమైతే, ఇహపర సుఖదాయకం అవుతుం దది ఇతోధికంగా.

ప్రేమ ఆధ్యాత్మికం. పెళ్ళి లౌకికం. అందుకే ఆ రెంటికీ సంబంధం ఉండ కూడ దంటాను నేను. ఉంటే - సామాన్యుల విషయంలో ప్రేమ దెబ్బ తింటుంది.

ప్రేమ వల్ల ఏ చిక్కూ లేదు.

కామిస్తేనే ఏ చిక్కైనా !

కామం శరీర సంబంధి కనుక, రెండు శరీరాల కలయిక లేకుండా తీర దది.

అంటే - అవతలి వ్యక్తి కూడా విధిగా కామించవలసి ఉంటుం దప్పుడు.

అదీ జరిగితేనో ?

" ప్రారంభదశలో ప్రేమనూ, కామాన్నీ వేర్వరచలేం కనుక - అంతటి గాఢానురాగం, ఆత్మాను బంధం వ్యక్తం కావడం ఒక్క ప్రేమ విషయం లోనే కనుక - తాను ప్రాణాలను సైతం అర్పించి, తన ప్రేమ లక్ష్యాన్ని సాధించాలన్న ఆ తీవ్ర వాంఛ, మర్యాదగా తీరవలసి లేదా ? " అంటుంది లీల.

పోనీ, అది కామమే అనుకొన్నా - అది ఏక వ్యక్తిపై లగ్న మైనప్పుడు, అందులో ప్రేమ పాలే ఎక్కువ కదా ?

దానిని సఫలీకృతం చేసుకోవాలనే ఇచ్ఛ ఆ వ్యక్తిలో బలీయంగా ఉండదా ?

ఆ ఇచ్ఛ మర్యాదగా తీరనప్పుడు - శారీరక వ్యభిచారమో, మానసిక వైకల్యమో, దురంత జీవిత వైఫల్యమో తప్పదు కద ?

" అంతటి దుస్థితినీ, దుర్మార్గాన్నీ కొనసాగనిచ్చే కంటి - అలాంటి ఎన్నో జీవితాలను క్రూరంగా నాశనం చేసే కంటె - ఆ కోరిక సహజ మార్గం లోనే, చట్ట సమ్మతంగానే తీరిపోయే ఏర్పాటును, సంప్రదాయాన్ని నెలకొల్పు కోవడం శ్రేయస్కరం కాదా ? " అంటుం దామె.

ఔను - నిజమే !

అది వట్టి కామమే అయితే - అది చల్లారి పోక తప్పదు - ఆ కామినీ కాముకులు కలుసుకొన్న అచిరకాలం లోనే.

అది ప్రేమే అయితే - దాన్ని శాశ్వతంగా నిషేధించి, ఆ ప్రేయసీ ప్రియుల్ని జీవితాంతం హింసించడం పరమ పాపం.

మనస్సును వ్యభిచరించ నిస్తూ, శరీరాన్ని గదిలో పెట్టి తాళం వేసే దురాచారం ప్రబలి నప్పటి నుంచే పతనమై పోయింది మానవ సమాజం - నరకం లోతుల దాకా !

సహజమైన కామ నివృత్తికి వ్యభిచార మనే పేరు దేనికి ? ఆ పేరుకు అంతటి నిషేధం దేనికి ? ఆ నిషేధోల్లంఘనకు అంతంత ఘోరశిక్షలు దేనికి? మానవుడికి మెద డున్నదా ? ఉంటే - దానికి కాంతి ఉన్నదా ?

మానవ మనస్తత్వం, ప్రేమ తత్త్వం, పర తత్వం అర్థం కాని వృద్ధ నియంతలు శాసించే సమాజం ఏదైనా - ఇలా చీకట్లో బ్రతక వలసిందే.

స్వచ్ఛమైన ప్రేమకు శరీరంతో పని లేదు. ఎవరి నైనా, ఎంత మంది నైనా ప్రేమించ వచ్చు స్వేచ్ఛగా !

పచ్చి కామానికి ఏ శరీర మైనా ఒకటే !

కామించి, ప్రేమించి, ఈ రెంటినీ ఒకే వ్యక్తిలో కేంద్రీకరించుకొని, ఆ వ్యక్తితో జీవిత సాఫల్యం పొందుదా మనుకొన్న పవిత్ర స్త్రీ పురుషుల్నే కదా - ఈ సమాజం హింసిస్తున్నది ?

" పురుషుడికి స్త్రీ, స్త్రీకి పురుషుడు ఎందుకు ? కామ తృప్తి కోసం, సంతానం కోసం, ఆత్మిక పారమ్య ప్రాప్తి కోసం ! అవునా ? వీటి సిద్ధికి నేటి సమాజం ఎలా తోడ్పడుతున్నది ?" తీవ్రంగా అన్నది లీల.

నిజమే, మరి !

నీతికీ, జీవిత గమనానికీ సంబంధమే కనిపించడం లేదే !

మాది ఆధ్యాత్మిక మతం అని చెప్పుకొంటూ - ఆత్మను బైట పెంటమీద పారేసి, శరీరాన్ని పరదా వెనక దాచుకొనే మూఢ జాతిమనది.

ఆత్మను ఇచ్చుకొన్న చోటనే శరీరాన్ని కూడ ఇచ్చుకోనిచ్చే ధర్మజ్యోతి ఇంకా ఎంతదూరంలో ఉన్నదో !

56

" లీల చిన్నదే కాని, పెద్ద కబుర్లు చెపుతుంది "

" ఇంతకూ ఆమె చెప్పే పరిష్కారం ఏమిటి ?

" ఎంత మందిని ప్రేమిస్తే అంతమందినీ పెళ్ళాడే పద్ధతి మళ్ళీ తిరిగి రావాలంటుందా ఆమె ?"

" అది యుగం నాటి ఆచారాలను తిరిగి తెచ్చుకొంటే, ఇక మానవ జాతి సాధించిన పురోగతి ఏ మాత్రం ? "

బాగున్నై నీ ప్రశ్నలు.

పూర్వ కాలంలో బహు భార్యాత్వం, బహు భర్తృత్వం కూడ ఉన్నై.

ఇప్పుడా సంగతి వద్దు మనకు.

ఈనాడు కూడా బహు భార్యాత్వం చట్ట సమ్మతంగా అమలులో ఉంది - చాలా సమాజాలలో.

విడాకులు అనే ఒక కృతక న్యాయాన్ని సృష్టించుకొని, దాని ద్వారా తన బహు స్త్రీ భోగేచ్ఛను తీర్చుకొంటున్నాడు పురుషుడు - కొన్ని సమాజాలలో.

అదే పని స్త్రీ కూడ చేస్తున్నది.

విడాకుల చాటున ఈ దొంగ వ్యాపారం దేనికి ? ఇది వ్యభిచారం క్రిందకు రాదా ?

ఒక స్త్రీని పెళ్ళాడడం కోసం, మరొక స్త్రీకి విడాకు లివ్వడం ఎందుకు ?

తాను ఉండగా, తన మగడు మరొకతెను పెళ్ళాడ దానికి భార్య ఒప్పుకోదు కనుక !

ఎందుకు ఒప్పుకోదు ?

ఆర్థిక సమస్య ఉంది కనుక !

తన భర్త ఆస్తిని, ఆర్జనను, వారసత్వపు హక్కులను మరొకరు పంచుకోడానికి ఏ భార్యా ఒప్పుకోదు. కామం కంటె, ప్రేమ కంటి, ఆస్తిపై హక్కే భార్య ప్రవర్తనను నియమించే ప్రధాన సూత్రం - ఎక్కువగా.

ఇప్పుడు - నేటి స్త్రీల పరిస్థితిని పరిశీలించి చూడు !

పురుషులతో సమానంగా చదువు కొంటున్నారు స్త్రీలు. సమానంగా పని చేస్తున్నారు అన్ని రంగాల లోనూ. హక్కులు కూడా సమానంగానే ఉన్నై. కాని - పెండ్లి కావడం ఒక్కటే సమస్యగా ఉంది.

ఆఫీసు లోనో, విద్యాలయం లోనో, వ్యాపార సంస్థ లోనో, కర్మాగారం లోనో, ఎక్కడో ఒకచోట ఉద్యోగం చేస్తున్న ఒక స్త్రీ - తోడి ఉద్యోగి అయిన ఒక పురుషుణ్ణి ప్రేమించడంలో వింత ఏమీ లేదు కద !

అత డప్పటికే వివాహితుడై ఉంటే ?

నేటి మన సమాజంలో మూడే మార్గా లున్నై ఆమెకు - తన ప్రేమ సఫలం కావాలంటే -

అతడితో చాటుగా వ్యభిచరించడం.

ఉంపుడు కత్తెగా ఉండి పోవడం.

భార్యకు విడాకు లిప్పించి, తాను భార్య నామం ధరించడం !

ఆమె ప్రేమకు తగిన మార్గాలేనా ఇవి !

ప్రేమ నుంచి ఆనందాన్ని, ఆత్మోపరపతిని కోరుతున్న దామె.

పై మార్గాలలో దేని వల్లా ఆమె కోరిక నెరవేరదు.

మొదటి మార్గం పాపం.

రెండోది అవమానం.

మూడోది అన్యాయం.

ఆమెను రెండో భార్యగా అతడు స్వీకరిస్తే, ఈ గోలంతా ఉండదుగా ?

అతడి ఆస్తిని గాని, ఆర్జనను గాని, వారసత్వాన్ని గాని, మరేవిధమైన ఆర్థిక ప్రయోజనాలను గాని కోరడం లేదామె. అలావ్రాసి ఇస్తుంది కూడా. సమాజం కోసం భార్య అనే రెండక్షరాల బిరుదును కోరుతున్న దామె. తన బిడ్డకు చట్ట సమ్మతమైన ఒక తండ్రిని కోరుతున్నది - అంతే !

" సహజమైన ఆమె కోరికను తీర్చడానికి అనుగుణంగా మనం మన చట్టాలను ఎందుకు సవరించుకోం ?" అని అడుగుతుంది లీల.

ఏక భార్యా నియమానికి, విడాకుల పద్ధతికి మూలం ఆర్థిక బాధ్యతలే. భర్త ఆస్తి, ఆర్జన, వారసత్వం మొదటి భార్యకే చెందుతవనీ, తక్కిన భార్యలు వాళ్ళ బ్రతుకు వాళ్ళు బ్రతక వలసినదేననీ చట్టంలో నిబంధపరిస్తే - సమస్యే తీరిపోదా ? " అంటుం దామె.

అప్పుడు సమాజంలో రహస్య ప్రణయా లుండవు. వ్యభిచారం ఉండదు. స్త్రీకి పెళ్ళి సమస్య ఉండదు. ఉంపుడుకత్తెలు ఉండరు. ప్రేమ విఫలత లుండవు, ఆత్మహత్య లుండవు.

రాంబాబు వచ్చి చేరాడు మా సంభాషణలో.

దానితో ప్రారంభ మయింది ఆ ఇద్దరి మధ్యా - ప్రమీలార్జునీయం !

ఆ ఇద్దర్నీ అలా ద్వంద్వ యుద్ధంలో విడిచి - లేచిపోయాను నేను.

57

" శ్రీవల్లితో సినీమాకు వెళ్ళాను రాత్రి.

" అసలు సినీమాలకే వెళ్ళడం లేదుగా నే నిప్పుడు !

" ఎక్కడికి వెళ్ళినా, మీతో వెళ్ళాలి. మీతో అయితే, ఎక్కడికి వెళ్ళాలి ? మీరే నాకు సినీమాలు, నాటకాలు, సమస్త వినోదాలు !

" ఎన్నాళ్ళ నుంచో అడుగుతున్న దామె. అందుకని వెళ్ళాను. "

" దారి పొడవునా ఏవో కబుర్లు, కథలు చెపుతూనే ఉన్న దామె. అవేవీ నాకు వినిపించనే లేదు.

" సీట్లలో కూర్చున్నాం. ఆట ప్రారంభ మయింది. ఒంటరి దాన్ని అయిపోయాను నేను. "

" ప్రక్క కూర్చుని ఏమేమో వాగుతున్న మిత్రురాలు, చుట్టూ ప్రేక్షక జనం, ఎదుట చక్కని పిక్చరు, హాలంతా కరతాళ ధ్వనులు - అయినా, ఒంటరిదాన్ని నేను !

" మీరు ప్రక్క లేరు !

" మరి, ఎక్కడున్నారు ?

" లోన హృదయంలో ఉన్నారు, సరే. బైట ఎక్కడున్నారు ?

" రసాలినీ లతా గృహంలో ? మధుగిరిపై ? మన్మధసూరితో ? మరి-మరి

" వెదక సాగింది నా మనస్సు

" నిన్న మీరు చేసిన పని - ద్రాక్షరంగు బ్లౌజుపై ఒలకడం - వృధాగా పోతున్నదని మీరు దానికి పెదవులు చేర్చడం - పెదవుల మధ్య హేమగిరి శిఖరాల మొనలు చిక్కు కోవడం - ఉత్సాహ సంరంభంలో గాజు పగిలి నెత్తురు చిందడం - అప్పటి క్రీడలో నేను రాగజ్యోతినే కావడం - అన్నీ కనిపిస్తున్నై నాకు తెర మీద !

" మనమే నాయికా నాయకులం !

" శ్రీవల్లి పిక్చరు చూస్తోంది. నేను మన ప్రణయ లీలా విలాసాలు చూస్తున్నాను ఒకే తెర మీద !

" మనకు ముఖ్యం హృదయా లని నేనంటే - హృదయాలకు ఆధారాలు శరీరాలని మీరన్నా రొకనాడు. అదే నిజ మనిపిస్తుంది నేడు !

" ఆత్మ పదార్థం సర్వత్రా ఒక్కటే. ప్రేమ స్వభావమూ ఒక్కటే. మీరు నేను అనే భేదం, మనిద్దరం కలవడం ద్వారా దాని రహితం - శరీరాలను బట్టి వచ్చినట్టిదే కదా ?

" మనం హార్దికంగా కలిసే ఉన్నా, శారీరకంగా విడిపోయి ఉన్నందు వల్లనే కదా ఒంటరితనం బాధిస్తున్నది నన్ను ?

" ఎవ రెన్ని చెప్పినా, వాస్తవ జీవితంలో శరీరానిదే ప్రధాన పాత్ర. "

" మనం ఆంజనేయుని కొండపై, శివాలయం ఎదట, నందీశ్వరుని తోక దగ్గర ఉన్నాం అప్పుడు.

" అక్కడే కదా మనం పాణిగ్రహణం చేసుకొన్నది ? "

" ఎంత పారవశ్యం ! ఎంత చక్కని తోక ! దానితో ఆడుకొంటూ, ఒక వెంట్రుక పీకాను నేను ! "

" అబ్బా - జడ పీకేశావు - అన్నది శ్రీవల్లి !

" ఉలిక్కి పడ్డాను నేను !

" చూశావా - నాయిక చివరి కేమయిందో "

" ఏ నాయిక ? "

" నీతో సినీమాకు రా కూడదన్న దామె ! "

" ఏ నాయిక ఎలా పోతే నాకేం ! ఇప్పుడు నా నాయకు డెక్కడున్నాడో - అనుకొంటూ ఇల్లు చేరాను నేను.

" నిద్ర పట్టలేదు నాకు - ఆ తర్వాత ! "

ఓహో, రాగ లాస్యా !

ఎంతటి సత్యాన్ని మోసుకు వచ్చింది నీ లేఖ !

నీవు సినిమా చూస్తున్నంతసేపూ నీ మనస్సు ఎక్కడ విహరిస్తున్నదో, అక్కడే అంతసేపూ నా మనస్సు కూడా రమిస్తున్నది !

మన మనస్సులు లేచిపోయి, విశ్వవిహారం చేస్తూ, రాధామాధవం జరుపుకొంటూ ఉంటే - శరీరాలకు నిద్ర ఎలా పడుతుందిక ?

నాయికవు నీవు, నీ నాయకుడనే నేను;
లోకమే ఒక సినీమా కదే మనకొరకు !
పాటగాడను నేను, ఆటగత్తెవు నీవు !
మన ప్రయోగమె అస్తి ! మన వియోగమె నాస్తి !

58

" మీరు తరచు కలుసుకొంటూనే ఉన్నారుగా ? మధ్యలో మళ్ళీ ఈ లేఖ లెందుకు ?" అన్న దన్నావు కదూ శ్రీ వల్లి !

సామాన్యులకు అర్థం కాదు మన ఇతి వృత్తం.

నీవు చెప్పిన జవాబు కూడ అర్థం కాలేదు కదూ ఆమెకు ? ఆమె ఒక సామాన్య యువతి.

ప్రేమించుకొన్నా మనుకొనే ఇద్దరు యువతీ యువకులు శారీరకంగా కలుసుకోవడం వరకే ఆమె అర్థం చేసుకోగలదు.

లోక రీతే అంత !

జడ ప్రకృతికి అనుభవం లేదు.

ఆ మీది జంతు ప్రకృతికి అనుభవం ఉంది. కాని, అనుభూతి లేదు.

ఆ మీది మానవ ప్రకృతికి అనుభూతి ఉంది. కాని, దాని పరమజ్ఞత లేదు.

ఆ మీది పూర్ణ పురుష ప్రకృతికి పరమజ్ఞత ఉంది. పూర్ణపురుషుడు పురుషోత్తము డయ్యే దశ అక్కడ ప్రారంభ మవుతుంది.

అక్కడ పుడతాడు కవి !

పరమానుభూతి మెట్టు మీద పుడతాడు కవి !

ఆనందం, స్పందనం, భావం, బీజం, స్థావరం, జంగమం, మానవం– ఈ అన్ని దశల నుంచీ పయనించుకొంటూ వచ్చే జీవుడు, మానవ ప్రకృతిలో మొదటి మెట్టు మీద అడుగు పెట్టిన తొలిదశలో, అచ్చు జంతువు లాగే ప్రవర్తిస్తాడు – తికమకతో.

దొంగలు, దగాకోర్లు, రౌడీలు, శాడిస్టులు, కులతత్వవాదులు, గర్వపోతులు, హింసకులు, హంతకులు – ఈ బాపతు మనుషు లంతా జంతు ప్రకృతి నుంచి మానవ ప్రకృతిలో తొలిసారిగా అడుగుపెట్టిన ప్రొబేషనర్లే !

దేశం, జాతి, మతం, కులం, వంశం, వర్గం వీటి ప్రమేయమే లే దిక్కడ. జంతువు ఏ దేశంలో, ఏ వాతావరణంలో పుట్టినా జంతువే.

భౌతిక ప్రకృతి మానవ రూపం పొందిందే కాని, మానసిక ప్రకృతి ఇంకా జంతు దశ లోనే ఉన్నది అట్టి వాళ్ళకు.

అంధకారం నుంచి అప్పుడే వెలుగులో పడ్డ శిశువులు వాళ్ళు.

కళ్ళు మూసుకొనే ఉన్నై ఇంకా వాళ్ళకు !

అక్కడి నుంచి వాళ్ళ ప్రయాణం - ముందుకే అయినా - రకరకాలుగా సాగుతుంది కదిలి !

కొత్త వెలుగును భరించుకోలేక కొందరూ, దానిని దుర్వినియోగం చేసుకొని కొందరూ - తిరిగి జంతు ప్రకృతి లోకి తిరోగమించడమూ కద్దు.

ముందు శరీరం మానవ రూపం తాలుస్తుంది.

ఆ తర్వాత మనస్సు మానవతను సంపాదించు కొంటుంది.

ఆ నడుమ కాలం మూఢం.

అది సంధ్య చీకటి.

వివేకికి అది ఉదయ సంధ్య. అవివేకికి సాయం సంధ్య.

జీవశక్తిని ముకుళింప జేసుకొని వెనక్కి పోవడమో, వికసింప జేసుకొని ముందుకు పోవడమో - అది వాళ్ళ పురాకృత పుణ్య సామర్థ్యంపై ఆధారపడిన విషయం.

వాళ్ళ శరీరాలను అదుపులో పెట్టవచ్చు. మనస్సుల్ని ఎవడు కంట్రోలు చెయ్యగలడు ?

వాళ్ళ భవిష్యత్తును నిర్ణయించేది వాళ్ళ మనస్సే !

వివేకి అయిన జీవుడు, సంస్కార బలంతో నిగ్రహాన్ని అవలంబించి, తప్పటడుగులు వేసి పడుతున్నా - వెనక్కి జారిపోతున్నా - లెక్క చెయ్యకుండా, నవనవోన్మేష ప్రజ్ఞా ప్రాభవంతో ముందుకు సాగిపోతాడు.

పరమానుభూతి స్థాయిలో కవిగా పుట్టేవరకు, కష్ట భూయిష్ఠం గానే ఉంటుంది జీవుడి యాత్ర.

కవి, యోగి - వీళ్ళ స్థాయీ స్థితులు రసబ్రహ్మ, పరబ్రహ్మ సాయుజ్య సముపరతులు !

అవ్యక్తం నుంచి, బీజప్రకృతి నుంచి, జీవలత పుట్టి, పెరిగి, వికసించిన పుష్పం కవి !

ఫలం యోగి !

జీవన వథాన్ని, జీవిత పరమార్థాన్ని గుర్తించుకొన్న మానవుడు సహృదయుడు.

సహృదయుడైన క్షణం నుంచీ హెచ్చుతుంది- అతడి పురోగమన వేగం.

పరమార్థం అల్లంత దూరాన, శ్రీశైల శిఖరం వలె, దృగ్గోచరం కాగానే- కవి అవుతా డతడు.

అక్కడి నుంచి ఇంకా ముందుకు సాగేవాడు సాధకుడు, ముముక్షువు, మహాయోగి !

పరమార్థ లక్ష్యం చేరడమే జీవ బ్రహ్మైక్య పరమస్థితి.

ఇదంతా ఒక ఎడ తెగని యాత్ర. ఒక జీవ ద్రస వాహిని.

రాత్రిం బవళ్ళ వలె - జనన మరణాలు యాత్రను ఆపలేవు. మజిలీలు కావచ్చు అవి !

పెడదారి పట్టినప్పుడు నిరోధకాలు కావచ్చు అవి. చుట్టుదారుల వల్ల ఆలస్యం కావచ్చు కూడా.

కొన్ని రాత్రులు ప్రయాణం సాగక పోవచ్చు. కొన్ని పగళ్ళు ఆకర్షించి ఆపివెయ్య వచ్చు.

ఏది ఏమైనా - యాత్ర మాత్రం తప్పదు.

తొందరగానో, ఆలస్యంగానో - ఉత్సాహంగానో, ఆయాసపడుతూనో, నవ్వుతూనో, ఏడుస్తూనో - లక్ష్యం చేరక తప్పదు ఎప్పటికైనా !

వ్యక్తం కావాలనే తపన, ముందుకు పోవాలనే వ్యగ్రత, లక్ష్యం చేరాలనే ఉత్తేజన - భావస్థితి నుంచీ ఉంటుంది ప్రతి జీవికీ !

కవి స్థాయిలో విశిష్టరూపం ధరిస్తుం దది !

అక్కడి నుంచి పట్ట పగ్గా లుండవు దానికి !

అంతవరకు సంపాదించుకొని, సంచితం చేసుకొని, దారి బత్తెంగా మోసి తెచ్చుకొంటున్న సమస్తమైన అనుభూతుల్నీ - ఇరువైపులా విరజిమ్ముకొంటూ, పరుగు తీస్తా డతను ముందుకు !

ప్రయాణంలో తినడాని కేమీ దొరకదేమో నన్న భయంతో మూటగట్టి తెచ్చుకొన్న అటుకులు, దారి పొడుగునా సంచీలో నింపుకొంటున్న ఫలాదులు - భోగ భాగ్య వైభవోపేతమైన లక్ష్య లక్ష్మి ఎదురుగా కనిపించేటంత వరకే పనికివస్తా - ఆ మీద అవి వట్టి బరువులు.

వాటిని ఇటూ అటూ పారవేసుకొంటూ, దానం చేసుకొంటూ పోతాడతడా మీద.

ఆ విధంగా అతడు ఎడా పెడా చిమ్మివేసే అనుభూతులే, అతడి నుంచి లోకానికి లభించే సాహితీ సంపద.

అనాదిగా మనకు లభిస్తూ వస్తున్న అలాంటి సంపదే - వేదాలు, పురాణాలు, ఉపనిషత్తులు, కథలు, కావ్యాలు ఇత్యాది.

ఆ అనుభూతుల విలువను బట్టి ఉంటుంది - ఏ తత్సంపద విలువ కూడా -

అటుకులు కావచ్చు, అమృత ఫలాలు కావచ్చు అవి.

లక్ష్యం చేరేసరికి అతడి వద్ద మిగిలేదేమీ ఉండదు.

అప్పు డతడు శుద్ధ నిర్గుణ బ్రహ్మ.

కవి - యోగి మధ్య దారిలో ఉన్నాం మనం.

మనం తేలిక పడి, గమనం హెచ్చడం కోసమే ఈ చర్య ఈ లేఖలు. -

ప్రేమ, అనురాగం, త్యాగం, శరీరసుఖం, ఆనందం, ఆత్మోపరతి, పూర్ణార్పణ - మన సమస్త అనుభవాలకు మనం కల్పించుకొంటున్న అక్షర రూపా లివి.

లోభి వాని ధనం కాదు - ప్రతిభావంతుని అనుభూతి.

ఒకరి ఒడిలో ఒకరం మైమరచి ఉన్నప్పుడు, తరంగిత మయ్యే ఎన్నో మధుర భావాలు-

సిగ్గుతో పెదవి దాటనివి
పెదవులపై ముద్దుల్లో మూగ వోయేవి
ఊహల్లో ఊరేగేవి
పాల కోవాల్లా గొంతు దిగనివి
కౌగిట్లో కరగి పోయేవి
మానసంలో ఈదేవి
ఆకాశంలో రగిలేవి
ఆత్మకు కూడా అందనివి

ఎన్నో, ఎన్నో లజ్జా కజ్జల నునోజ్జ భావాలు - ఆనంద స్పర్శలు - నిక్షిప్తాలైన మధుకలశాలు ఈ లేఖలు !

మన దైనందిన అనుభవాలే అయినా - పచ్చి వాస్తవాలే అయినా - సార్వకాలిక విశ్వజనీన మాధుర్యాలు కావా ఇవి ?

వీటికి తల్లివి నీవు !

అర్థం కాదీ తత్వం శ్రీ వల్లికి.

బాహ్య విషయాభ్యంతర పరమ రహస్యాలను, అందలి అందాలను చూడగల రాగతపస్వు లెంతమంది ?

ఆపోజ్యోతీ సహజ్యోతివి నీవు !

నీ కిరణాలే అమృత శ్రీ చరణాలు !

చూడగల కను లుండి చూడవలెనే కాని,
అందాలు లేని దొక అణువైన కలుగునే !
అన్ని అందాలు నీ అడుగులై పద్మింప,
పద్మవౌ నిను గొల్చి పడయరే మోక్షమ్ము ?

59

చాలీ చాలని ఉన్నీల మేఘ శల్కం క్రింద ఉద్ధతమైన సౌదామనీ లతలా ఉన్నావు నీవు - ఆ కాశ్మీరు శాలువా కప్పుకొని !

బంగారు శరీరం, ఎర్ర కలువల ఛోళీ, పాల వెన్నెల చీర, చిమ్మ చీకటి కేశరాశి, నల్లని శాలువా, ఐరావత గమనం, నీలోత్పల రుచిరాలైన విశాల విలోకనాలు - సమ్మోహితులై పోయారు కద ఎగ్జిబిషను లోని స్త్రీ పురుష లంతా నిన్ను చూచి !

పంచబాణుడు పంచ బాణాలతో అలంకరించి, రతినే సంధించి, ఎగ్జిబిషను మీదకు వదిలాడో అనిపించింది అక్కడికి నీ రాక !

మత్తెక్కిన మంచివాళ్ళు, గుటకలు మ్రింగే సంసారులు, రాసుకు పోవాలనుకునే రౌడీలు, బూటు కాళ్ళతో పాదాలు త్రొక్కజూచే కారుదున్నలు - వీర

విహారం చేస్తున్నారు అందమైన ఆడవాళ్ళ వెంట పడి !

ఏమిటో ఈ మనస్తత్వం మగవాళ్ళకు !

తనది కాని, తనపట్ల మనసు లేని, తనకేసి చూడనైనా చూడని ఒక స్త్రీ వెంట అలా ఎందుకు పడతాడో మగవాడు !

అందాన్ని చూడవచ్చు. ఆనందించవచ్చు. పీడించడం దేనికో !

ఆహారం కోసం పులి మేకను చంపినట్టు, శరీరసుఖం కోసం స్త్రీని హింసించి చంపుతాడు క్రూరుడు !

అట్టివాడు బహుశా, అప్పుడే జంతు స్థితి నుంచి మానవస్థితికి పరిణమించిన జీవుడై ఉంటాడు. శాడిస్టు అయి ఉంటాడు.

ఆకలి, ఆశ, ఆరాటం – ఇవే అట్టివాడి సహజ గుణాలు.

ప్రేమ, సౌందర్యం, రసం వంటి వేమీ అర్థం కా వతడికి !

ఆకలి, ఆశ, ఆరాటం – వాటిని తీర్చుకోడానికి వేట !

అతడు ఏ రంగంలో అడుగు పెడితే, ఆ రంగం భయ విహ్వలమై పోతుంది. పాప దుష్టమై పోతుంది కూడ.

సంస్కారం మొగ్గ దొడగని ప్రాథమికుడు వాళ్ళు, పాపం.

అట్టి జంతు ప్రకృతులే ఎక్కువ ఎప్పుడైనా, ఏ సమాజంలో నైనా.

ఏం జేస్తాం వాళ్ళని ?

పాశవిక ప్రవృత్తి తగ్గుతూ, సహృదయత పెరుగుతూ, మానవత వికసించ వలసి ఉంది వాళ్ళలో.

అది క్రమంగా జరగవలసిన పరిణామం.

అది జరుగుతూ, అట్టి వాళ్ళు ముందుకు పోయే కొలదీ, క్రొత్త వాళ్ళు వస్తూనే ఉండరా!

ముగిసేది కాదు ఈ క్యూ !

సర్దుకు పోవలసింది మనమే.

తేళ్ళకు మందులు, పాములకు మంత్రాలు, జంతువులకు ఆయుధాలు భగవంతుడు మన కిచ్చిం దందుకే !

చేతులు జోడిస్తే కరుణిస్తుందా పెద్దపులి ?

మన చుట్టూ ఉన్న ప్రకృతిని అర్థం చేసుకొంటే చాలు మనం.

ఒళ్ళన్నీ కళ్ళతో చూచింది మొత్తం ఎగ్జిబిషను నీ వంక !
ఒక రంగుల రాట్నమే అయి తిరిగిం దది నీ చుట్టూ !
దాని ఇరుసే నీ సింహాసనం !
అదే నా శిరోభూషణం !

60

మనసు వరకె కదా
మనకు లభించిన స్వేచ్ఛ ?
మాధవ సఖిగా విరిసి,
మధు మోహినిగా వెలసి,
రస రాజ్యము లేలు మనసు !
రాగ రమా మణి మనసు !
చీకటి లేనిది మనసు,
లోకము మీదిది మనసు,
ప్రణయ పావనము మనసు,
పరమామృతమే మనసు !
కోరి నంతనే కోరిక
కొంగు బంగరౌ మనసు !
చేరి నంతనే శివునికి
శివయే తానగు మనసు !

పరువు ప్రతిష్ఠల పేరుతో శరీరం బంధింపబడి నప్పుడు, ప్రేయసీ ప్రియులకు ప్రాణాధారం వాళ్ళ మనస్సు ఒక్కటే కద ?

దాన్ని కూడ బంధించి పారేస్తే ?

మనస్సును పూర్తిగా బంధించే శక్తి మానవులకు లేదు. కాబట్టే బ్రతికాం మనం మొన్నటి మహావిలయాన్ని గడిచి !

- మనస్సును నిగ్రహించాలి -
మనో నియంత్రణ జరగాలి -

మనస్సు అధీనంలో ఉండాలి -

సృష్ట్యాది నుంచీ సామాజిక మానవుడు చేస్తున్న నినాదా లివి !

మనస్సును కట్టుకొన్న మహా యోగుల దగ్గర నుంచి, దాన్ని విచ్చల విడిగా విడిచి పెట్టేసిన మహా నియంతల దాకా - ఎందరో చేశారు, చేస్తున్నారు ఈ నినాదాల్ని !

ఇంతకూ -

మనస్సు అంటే ఏమిటి ?

అది ఎవరి అధీనంలో ఉండాలి ?

అసంఖ్యాకమైన జీవరాశి నుంచి మానవుణ్ణి వేరుపరచి చూపే ప్రధాన భూతం మనస్సు.

జీవలత పెరుగుతూ వచ్చి, ఒక విశ్వలీలా వసంతంలో మొగ్గ తొడిగి, పూచిన పువ్వే మేధస్సు. దాని పరిమళమే మనస్సు.

పరిమళం ఒకళ్ళ దొడ్డిలో నుంచి మరొకళ్ళ దొడ్డి లోకి వ్యాపిస్తున్నది కాబట్టి, దానిని గొలుసులతో కట్టి పడవెయ్య మంటారు వృద్ధులు !

మనస్సు కోతి లాంటిదనీ, దాన్ని అధీనంలో ఉంచుకోకపోతే జీవితం అధోగతి పాలవుతుందనీ, ప్రతివాడూ మనస్సు చెప్పినట్టెల్లా చేస్తే సమాజమే చచ్చిపోతుందనీ - అంటుంది కదూ మీ దొడ్డమ్మ ?

ఇప్పుడు బ్రతికి ఉన్న దనేనా సమాజం ?

మనస్సు కోతిలాంటి దంటాం.

ఆ సంగతి మనకు చెప్పిం దెవరు ?

ఆ మనస్సే కదా ?

అది కోతే అయితే, దాని మాట నమ్మడం ఎలా ?

అచల నిర్గుణ బ్రహ్మ సగుణ చైతన్యంగా భాసించి, వికసించి, పరిమళించి, ప్రసార గుణ వ్యాప్తిని పొంది, వేదమై, వేదాంతమై పరిఢవిల్లగా - అట్టి మనస్సును ఈనాడు నిరోధించు మనడం ఏరు చాటి తెప్ప తగలబెట్టు మనడమే కదా ?

ప్రకృతి ఇంకా ముందుకు సాగిపోవాలంటే - మనస్సు ప్రజ్ఞాన పూర్ణమై,

తానే మూలపుష్పమై వికసించి, ఆనంద పారిమళ్యం విరజిమ్మాలి విశ్వ విశ్వాంత రాలలో – అనంతకోటి సౌరమండల పరివ్యాప్తంగా ?

సూర్యు డొక దీప కళిక – సౌరమండలం ఒక చిన్న గది – మనోరూప జగజ్జీవ సమాజంలో !

ప్రకృతి పురోగమనంలో మానవుడే అగ్రగామి. మనస్సే మార్గదర్శిని.

మార్గాలను వెదకి, సరళం చేసి, విశ్వ విశ్వాలలో ప్రయాణించి, ఆనందోద్యానాలను గుర్తించి, తాను ముందుండి మానవుణ్ణి నడిపించుకు పోవలసి నట్టిది మనస్సు.

మనసే శరీరంగా కల ఒక పరమానంద చేతనా పరిణామానికి ప్రాతిపదిక కావలసినట్టిది మనస్సు.

అట్టి మనస్సునే కట్టి పడవేసే మానవుడు తాను జీవచ్ఛవం కావడమే కాక, ప్రకృతి పురోగతికే గుదిబండ కాడా ?

మానవుల్ని గొర్రెల వలె పాలించాలనుకున్న స్వార్థపరులు, రౌడీలు, మన పెద్దలు మనస్సుపై యుద్ధం ప్రకటించారు. బందీని చేశారు. స్వతంత్రంగా ఆలోచించే శక్తిని చంపేశారు. మానవజాతిని నిర్వీర్యం చేసి, ఒక మురికి పేటగా మార్చి పారేశారు.

మానవుని కంటె ఈనాడు – ఈ జీవకారుణ్య యుగంలో – పశువులు, సీమకుక్కలు, గినీపందులు, టర్కీకోళ్ళు, పిల్లులు, చిలకలు వగైరా అన్నీ ఉత్తమ జీవులేగా ?

అతి నీచ నికృష్ట జీవి ఒక్క మానవుడే – నేటి మానవుడి దృష్టిలో.

ఇప్పుడు మానవ జాతి బ్రతికి ఉన్న దనుకొంటున్నావా ?

అది చచ్చి చాలా కాల మయింది !

ఈ అవశేషమైనా ఇంకా బ్రతికి ఉండడానికి కారణం – ఎవరో ఒక కృష్ణుడు, ఒక క్రైస్తు, ఒక గాంధీ – సంప్రదాయాన్నీ, సాంఘిక నియమాలనూ కాలదన్ని, మనస్సును విడిపించి, యథేచ్ఛగా వదిలి, దానివెంట ముందుకు పోవడమే !

మనస్సు వెంట వెళ్ళలేడు మనిషి.

మనిషి నిర్మించే ఏ రాకెట్టూ మనస్సు వేగాన్ని పట్టుకోలేదు.

లక్షల కోట్ల కాంతి సంవత్సరాల దూరాన్ని క్షణంలో దాటేసి, అక్కడి మన్మథ లోకం లోని మందార కన్యలతో రమించి, వచ్చెయ్య గలదు మనస్సు – అనుకొన్న వెంటనే !

తమ మనస్సే తమ మార్గంగా పురోగమించిన మహా సాహసికుల ఆత్మ కథల సంపుటే కదా నేటి మానవ చరిత్ర ? మనస్సును కట్టేసుకుని, ముక్కు మూసుకొని, ప్రతివాడూ కూర్చుని ఉండి ఉంటే – ఈనాడు చెదపుట్టలు తప్ప, మనుష్యులు మిగిలే వాళ్ళేనా ?

మోక్షాన్ని కోరడం తిరోగమనమే కాని, పురోగమనం కాదు కదా !

అలసిపోయిన జీవపదార్థం, విశ్రాంతి కోసం, బ్రహ్మపదార్థం లోకి తిరిగిపోవడానికి పడే తపనతో కదా మోక్ష కాంక్ష ?

మరి నైష్ఠికులు, సన్యాసులు, మతపెద్దలు వగైరా తిరోగమన వాదులు – పురోగమన శీలకమైన మానవప్రకృతిని పాలించడానికి ఎలా అర్హులు ?

వృద్ధుని మార్గం యువకునికి అనుసరణీయ మేనా ?

ఒకడి శక్తి మరొకడికి ఉండదు. ఒకడి పట్టు మరొకడికి దొరకదు. ఒకడు తింటే మరొకడికి ఆకలి తీరదు. వ్యక్తిత్వం కల ఏ ఒక్కడూ మరొకరి మార్గాన్ని అనుసరించలేడు అందుకే !

స్వేచ్ఛా నిగ్రహ శక్తులు రెండూ మనస్సు లోనివే.

ఎటు ఎతదూరం వెళ్ళాలో, ఏ పని ఎప్పుడు ఎంతవరకు చెయ్యాలో, మనస్సుకు తెలిసినంతగా మరెవరికీ తెలియదు.

మనస్సు ఒక అద్భుతమైన, అద్వితీయమైన శుద్ధ చైతన్య ప్రజ్ఞాన వైదిక శక్తి.

దాన్ని కంట్రోలు చెయ్యా లనుకోవడం వ్యర్థం.

నీతులతో, నరకభయాలతో, స్మృతులతో, శిక్షలతో దాని ఇచ్ఛ కార్యరూపం తాల్చకుండా నిరోధించ వచ్చు. అలా నిరోధించబడ్డ మనస్సు – అశోకవనం లోని సీతలా క్రుళ్ళి ఏడుస్తూ ఉంటే చుట్టూ మూగిన రాక్షస మూకలా అట్టహాసం చేస్తోంది సమాజం !

కుటుంబం, కులం, మతం, జాతి, వాటి ఆచార సంప్రదాయాలు, వాటి విధి నిషేధాలు వగైరాలను అధిగమించలేని మనస్సు మనస్సుగా పేర్కొనదగింది కాదు. జడమైన శరీరమే అది. మట్టిలో చేరిపోవలసినదే అది.

అందుకే – దేవీ !

అంధకారంలో మిణుగురుల కాంతి లాభం లేదు.

ఏ మానవుడి మెదడుకూ నేడు అంతకన్న వెలుగు లేదు.

జ్ఞాన సూర్యోదయం కానీ !

రమించనీ మనస్సును విశ్వ విశ్వాంతర సౌందర్య సీమలలో !

ద్రష్టగా, శ్రోతగా, మన్తగా, విజ్ఞాతగా విహరించనీ దాని విశ్వాత్మ పారం ముట్టి !

అధిగమించి పోనీ దాన్ని

వికసించివేయనీ మనస్సే మహస్సుగా !

ఊహించలేం మన మిప్పుడు !

అంతవరకే మనస్సుకు స్థితి !

ఆపై మహస్సులో మనం !

మనలో మహస్సు !

61

" ఇది దెయ్యాల ప్రదర్శన కాదు. ఆధునిక చిత్రకళా ప్రదర్శన. కళ్ళు తెరు !" అంటూ అభయం ఇచ్చేవరకూ – కళ్ళు మూసుకొనే ఉన్న నీవు ఎంత కళా సుందరంగా కనిపించావు నాకు !

ప్రదర్శనను మాని, నిన్నే చూశారు కదా జనం అంతా !

క్యూబిజం, గ్లోబిజం, సింబాలిజం, సర్రియలిజం – అంటూ ఏమేమో చెప్పుకు పోతున్నాడు, చిత్రాలను గురించి, మనతో పాటు వచ్చిన చిత్రశిల్పి రాజు !

అన్నీ తెలుస్తున్నట్టే తల ఊపుతున్నాను నేను గొప్పగా !

అన్నీ తెలిసినట్టు ప్రవర్తించడమే సభ్యత ఈనాడు.

తెలియడం జ్ఞానం. తెలియక పోవడం అజ్ఞానం.

" ఇదేమిటి - అని ప్రశ్నించవద్దు. ప్రశ్నిస్తే - అదేమిటో నీకు తెలియదని అందరికీ తెలిసిపోతుంది. అప్పుడు నిన్ను ఎవరూ గౌరవించరు. మరి, నిజంగానే తెలియదు కదా- అంటావా ? తెలిసినవాళ్ళు మాత్రం ఎవరున్నా రిక్కడ ?" అంటాడు మన్మధసూరి.

అదీ నిజమే !

నాకు తెలియకపోతే, ఎవడికి మాత్రం తెలుసు ?

గుండెధైర్యం, వాక్శూరత, సాహసం కల ప్రతివాడూ - జర్నలిస్టో, ఆర్టిస్టో, పోయట్టో, పొలిటీషియనో అయిపోతూ ఉండడం లోని కిటుకు ఇదే.

ముందుకు వచ్చినవాడే నాయకుడు. ఎలుగెత్తి అరిచినవాడే ప్రవక్త. ఎదుట ఉన్నవాడే పెళ్ళికొడుకు. అడిగే వా డుండడు. అడిగేవాడు అజ్ఞాని కనుక, ఖాతరు చెయ్యబడడు.

" ఓహో, వహ్వా, బహుతచ్చా " అనే రెండు మూడు మాటలు నేర్చుకొని, శిరఃకంపనం చేస్తూ, చిరునవ్వు నవ్వగలిగితే - రసజ్ఞుడుగా, కళావేత్తగా, మహాను భావుడుగా కీర్తి రావడమే కాక, దానితో పాటు ఎన్నో పదవులు, లాభాలు కూడ లభించే అవకాశం ఉన్న ఈ రోజులలో మనస్సులోని అభిప్రాయాన్ని వెలిబుచ్చి, అజ్ఞాని అనీ, అనాగరికుడనీ అనిపించుకోవడం దేనికీ ?

పదవులూ, లాభాలూ నా దాకా రావు. ఆలి వంక అతిథులు వంట గదుల్లోనే ఉంటారు మకాం. అయితే - మంచివా డన్న పేరు పోతుందేమో అన్న దొక్కటే నా - భయం !

అందుకే ఊపుతున్నాను తల - అంతా తెలిసిపోతున్నట్లు !
నేను నీ వంక చూచినప్పు డెల్లా - నీవు నా వంకే చూస్తున్నావు !
నీ వంక నేను, నా వంక నీవు చూసుకొంటున్నాం మనం !
మన వంక చూస్తున్నారు ప్రదర్శనను చూడవచ్చిన వాళ్ళంతా !
మరి - చిత్రాన్ని ఎవరు చూస్తున్నట్టు ?
ఓహో - అంటూ నే నెందుకు తల ఊపుతున్నట్టు ?
భరించుకోలేక అనేశావు నీవు - ఇదంతా వట్టి చెత్త - అని !

" ఒక్క అందమైన, ఆనందకరమైన బొమ్మ కూడ లేదే ! అన్నీ గీతలు, ఊచలు, ఇటికరాళ్ళు, శిథిల సమాధులు, బ్రహ్మచెముడు డొంకలు, దిష్టిబొమ్మలు, పిశాచపు కళ్ళు, దయ్యపునోళ్ళు, కుష్ఠ పుళ్ళు, క్షయరోగపు ఎమ్ముల గూళ్ళు ! ఈ పులుముడా చిత్రకళ ? హారి, దేవుడా !"

ఎంత ధైర్యం నీకు !

ప్రేక్షకులంతా నీ పక్షమే !

రాజు కూడ నీ పక్షమే !

ఈ మోడర్న్ ఇజా లన్నీ తెలుసుకొన్నవాడే కాని, వాటి జోలికి పోయినవాడు కాదు రాజు. భారతీయమైన కేవల సౌందర్యాన్ని ఉపాసిస్తా డతడు. అందుకే పైకి వచ్చి పదవులు పొందలేక పోతున్నాడు సాటి వాళ్ళ వలె.

కళ పిచ్చిలోకీ, పిచ్చి వ్యాపారంలోకీ, వ్యాపారం గుత్తపద్ధతిలోకీ దిగి - సమాజాన్ని మాయ చేస్తూ, దోచుకొంటున్నప్పుడు ఎదిరించి సత్యం చెప్పగల ధైర్యం ఎంత గొప్పది !

అంతరార్థాలు, అర్థాంతరాలు, గూడార్థాలు వంటివి ఆలోచనామృతమైన సాహిత్యానికి చెల్లుతవేమో కాని - సద్యస్సుందరం కావలసిన చిత్రకళకు ఎలా చెల్లుతై ?

సౌందర్యం లేదు. మాధుర్యం లేదు. రంజనం లేదు. రసం లేదు. ఉన్న దంతా కేవల కంకాళ బీభత్సం !

వినగానే ఆనందం కలిగేది సంగీతం.

చూడగానే ఆనందం కలిగేది చిత్రకళ.

వాటిలోని శాస్త్రీయ సాంకేతిక విషయాలు ప్రజల కక్కర లేదు.

కావలసింది రుచికరమైన భోజనం.

అదంత రుచికరం కావడానికి ఎందరు ఎన్ని త్రిప్పలు పడ్డారో. అతిథులకు అనవసరం - జుగుప్సాకరం కూడ !

ఆనందానికి మూలం అందం

అందానికి మూలం రూపం

రూపం ప్రాతిపదికగా కలది చిత్రకళ.

అట్టి పునాదికే మొప్పం వచ్చినప్పుడు కళాసౌధం వట్టి పురాణ శైధిల్యమే కదా !

ఎవడో పేరున్నవాడు, ఎవడో నోరున్నవాడు, ఏ పనీ లేని వాడు - ఏమీ తోచక బొగ్గుతో నాలుగ్గీతలు గీస్తాడే అనుకో -

అతడి కార్యదర్శి వాటిని ప్రచారం చేస్తాడు - ఉద్యోగ ధర్మంగా !

అతడి అనుగ్రహం కోసం వేచి ఉన్న వాళ్ళంతా వాటి చుట్టూ చేరి భజన సాగిస్తారు - మహా చిత్రాలంటూ, కళాత్మకే కల్యాణ తిలకా లంటూ !

డబ్బుతో కీర్తిని కొనగల అదృష్టవంతులు కొనేస్తారు వాటిని - వందలు, వేలు పెట్టి - బహిరంగంగా, మహాడంబరంగా !

దేవతా వస్త్రాల కథే - ప్రతి విషయం లోనూ !

కంటికి పచ్చ కర్పూరపు కాటుక కావలసిన చిత్రకళ - కారం కొట్టినట్టు మండిపోతున్న దీనాడు !

సౌందర్య పారమ్యానికి సశరీరంగా మానవ భావుకతను తీసుకపోవలసిన చిత్రకళ - నీ వంటి అమృత హృదయను కూడ గాభరా పెట్టేస్తున్న దీ నాడు !

అబ్బ !

ఎంత బీభత్సంగా ఉంది ఈ మోడర్న్ ఆర్టు !

భూకంపం మరునాటి పీనుగుల పెంటలా ఉన్న దిది !

నీ అందాన్నీ, నీ ఆనందాన్నీ, నీ ఆత్మనూ -
నిన్ను నీవే తొక్కి పారేసుకొంటూ పోతున్న ఓ మనిషీ !
ఎందుకోయ్, శ్మశానం కేసి అంత పరుగు !

62

మొన్న ఎగ్జిబిషన్‌లో నన్ను పలకరించిన శివరంజని నీ స్నేహాన్ని అర్థించడం చిత్రమే !

నన్ను గెల్చుకొని కూడ, ఓడిపోయిన ఒక దురదృష్టవంతు రాలాయె ! కాలు జారి పడి, తిరిగి లేవలేకపోయిన ఒక దయనీయ గాథ ఆమెది.

ఆ కథ మరోసారి చెపుతాను.

నీలోత్పల, మణిశిల, దూర్వ - వీళ్ళ వివరాలు కదూ అడిగావు ?

ఈ ముగ్గురూ మూడు మనస్తత్వాలకు ప్రతినిధులు

ఎవరెలా పోయినా, తాను మాత్రం తన ధర్మాన్ని విడనాడ గూడ దన్న దీక్షతో, సంసారం నిలుపుకొని సుఖపడ్డ సతి నీలోత్పల.

తాను నమ్మిన ధర్మాన్ని తన వలెనే ఇతరులు కూడ అవలంబించాలని పట్టుపట్టి, విఫలురాలై, సంసారాన్ని పాడుచేసుకొని, తాను నాశనమైపోయిన మూర్ఖ మణిశిల.

ఇద్దరు పురుషులకు ప్రియురాలై, ఒక్కర్నీ తృప్తి పరచలేక, ఇద్దర్నీ పోగొట్టుకొన్న రేవడ దూర్వ.

నిత్యం మన మధ్య, మనతో కలిసి తిరుగుతున్న వాళ్ళ చరిత్రలే - సూక్ష్మంగా పరిశీలించి చూస్తే- అకాడమీ బహుమతులు పొందిన నవలల కంటె, నాటకాల కంటె కూడా అద్భుతంగా ఆవిష్కృతా లవుతై !

నీలోత్పల భర్త డబ్బున్నవాడు. వ్యభిచారి. తాగుబోతు. జూదగాడు. ఏ విశిష్టతా లేనివాడు. అయితే, క్రూరుడు మాత్రం.

నీవు నా కడ్డం రాకు. నీకు కావలసిన సుఖమేదో అడిగి పుచ్చుకో అన్నా డతడు.

సరే నన్న దామె.

పిల్లలు, కారు, విందులు, వినోదాలు - హాయిగా ఉంది ఆమె సంసారం. భర్తపై ఈగను కూడ వాల నివ్వ దామె ! అతడి సేవే ఆనందం ఆమెకు !

మణిశిల భర్త గొప్ప కళాకారుడు. ప్రేమ సముద్రుడు. లోకప్రియుడు. దేవతలా ఆరాధించు కొంటా డామెను.

చంద్రుని చుట్టూ కలువల వలె, అతడి చుట్టూ చేరతారు కళాహృదయులైన యువతీ యువకు లెంద రెందరో !

అందుకు అసూయ పడిం దామె. తనతో తప్ప .మరే ఇతర స్త్రీతోను మాట్లాడ వద్దన్న దతణ్ణి. ఇరుగమ్మల పొరుగమ్మల సలహాలు, నౌకర్ల చాడీలు విషపూరితం చేసినై ఆమెను. అతణ్ణి బాధించింది. తాను బాధ పడింది. సుఖ సుందరమైన సంసారాన్ని శిథిలం చేసుకొంది.

దూర్వ చిన్నప్పటి నుంచీ గాలి పిల్ల. అదుపాజ్ఞలలో పెరిగినట్టిది కాదు. డబ్బు కోసం ఒక వృద్ధుడికి స్నేహ మయింది. సెక్సు తీర లేదక్కడ. సెక్సు కోసం ఒక యువకుణ్ణి మరిగింది. అతడి సెక్సును తాను తీర్చలేక పోయింది. ఇంట్లో వృద్ధుడి అనుమానం ! వీధిలో యువకుడి ఆరాటం !

అవసరానికి పనికిరాని నీవు నా కెందుకు పొమ్మన్నాడు యువకుడు.

విశ్వాస ఘాతకివి - ఇక నీ ముఖం చూప వద్దన్నాడు వృద్ధుడు.

మతి పోయిం దామెకు !

చూశావుగా ఆ చూపులు !

63

ఈ వారంలో మనం చూచిన నాటకాలు, వాటిపై నీవు చేసిన వ్యాఖ్యానాలు - మనోరంగంలో మెదులుతున్నై నా కిప్పుడు.

రాగద్వేషాలకు, ఉద్యమాలకు అతీతమైన సహృదయ వ్యాఖ్యా లవి.

నీ వన్నట్టు, కన్యాశుల్కం నాటక మేమిటి ?

నాటకం అంటే ఏమిటి ?

నాటకం వాస్తవానికి ప్రతిబింబంగా ఉండా లంటాడు ఒకడు.

ఔ నంటారు అతడి అనుచర బృందం ఒక పదిమంది.

అంతటితో ఒక నాటు అద్దం తయా రవుతుంది సహృదయుల ముందు.

అందులో కళా పద్మిని కనిపించక రసిక అలావుద్దీన్లు దిగులు పడి పోగా - తమ ముఖాల్ని తామే చూచుకొని ప్రేక్షక మహాశయులు కేరింతలు కొడతారు !

అదే గుమాస్తా, అదే ప్యూను, అదే బక్షీసు ! అదే డాక్టర్లు అదే రోగి, అదే ఫీజు ! రోజూ ఇంట్లోనూ, వీధిలోనూ అనుభవించలేక చస్తున్న అదే గోల మళ్ళీ నాటక రంగంపై ప్రత్యక్షం !

అర్ధణా ముందకి అణన్నర క్షవరం అన్నట్టు - దానికో టిక్కెట్టు !

ఇంట్లో ఏడుపును, వీధిలో గోలను కాసేపు మరచిపోయి మనస్సుకు విశ్రాంతిని, హృదయానికి ఆహ్లాదాన్ని చేకూర్చు కొందామనీ, ఉత్తేజాన్ని పొందుదామనీ నాటకానికి వస్తే -

అక్కడ కూడా అదే ఏడుపూ, అదే గోలా నా ?

నాటకం ఒక సంపూర్ణ కళా సమామ్నాయం అన్న జ్ఞానం రచయితలకు గాని, ప్రయోక్తలకు గాని, విమర్శకులకు గాని ఉన్నట్టు లే దీనాడు !

పద్యాలు వ్రాయలేని వాడు వచన నాటకాలను ప్రచారం చేస్తాడు.

పద్యాలు పాడలేనివాడు అవి లేకుండా డైలాగులు కొట్టమంటాడు.

వీధిలో జరిగిన కొట్లాటను, జరిగింది జరిగినట్టు, స్టేజి మీద చూపా లంటాడు - ఆ కొట్లాటలో పాల్గొని వచ్చిన అసలు ముద్దాయి !

స్త్రీ పాత్రలకు ఆడవాళ్ళు దొరకరు కాబట్టి, స్త్రీ పాత్రలే లేని నాటకాలు కావా లంటాడు ప్రయోక్త !

పోనీ-

నాటకం జీవితానికి ప్రతిబింబంగా ఉండా లనుకొన్నప్పటికీ - జీవితంలోని స్త్రీలు నాటకంలో ప్రతిబింబించరా ?

పురుషుల చేత స్త్రీ వేషాలు వెయ్యించడం కృత్రిమం అనుకొంటే - అసలు స్త్రీలే లేకపోవడం కృత్రిమ తమం కాదా ?

" కళా కాదు, కాకరకాయా కాదు, పచ్చి వ్యాపారం " అంటావు నీవు.

అక్షరాలా అంతే.

అసమర్థుల, అజ్ఞానుల దుర్జనత్వం తప్ప మరేమీ కా దీనాడు కళారంగం.

వ్యాపారం - డబ్బు కోసమో, కీర్తి కోసమో.

కీర్తికి కళారంగంలో ఉన్న స్థిరత్వం మరెక్కడా లేదు.

బొగ్గతో ఇంత మసి పులిమి, దానిని మేఘం అనగలిగితే - పెళ్ళికి పంచరత్నాలు అల్లగలిగితే - కొన్ని నినాదాలను ఒకదాని క్రింద ఒకటి పేర్చగల్గితే - ముఖానికి ఇంత పౌడరు కొట్టుకొని, స్టేజీ మీదకు రాగల్గితే - అట్టివాడు సన్మానాలకు, గౌరవ ప్రతిష్ఠలకు తద్వారా ఉన్నత పదవులకు అర్హు డవుతున్నాడు.

ఏ కళా తెలియని, ఔచిత్యం ఎరగని వ్యాపారం చేతుల్లో చిక్కుకొన్నది - ఈనాడు కళారంగం అనే బాలనాగమ్మ !

వ్యాపారం చేతుల్లో మంత్రపు బొమ్మలు - కవులం, గాయకులం, చిత్ర శిల్పులం, నటకులం అనుకొనే వాళ్ళంతా నేడు !

సంగీత, సాహిత్య, నృత్య, ఆలేఖ్య, శిల్పాది సర్వకళా సంపూర్ణమైన ఒక విశిష్ట కళా ప్రక్రియ నాటకం.

నేత్ర పర్వం, శ్రవణపేయం, మనోమోహనం కాగలిగిందే నాటకం.

వాస్తవాన్ని ప్రతిబింబించడం కాదు నాటక ప్రయోజనం, ప్రతిబింబాన్ని వాస్తవీకరించడం.

వెంకయ్యను అద్దంలో చూపడం కాదు - వెంకయ్యను శ్రీ కృష్ణుడుగా చూపడం నాటక లక్ష్యం. అప్పుడే రసనిష్పత్తి, తన్మయీ భావానుభూతి, ఆనంద సిద్ధి !

అందుకే అన్ని దుస్తులు, అన్ని రంగులు, అంత రంగాలంకరణ ! అంత సంగీతం, అంత సాహిత్యం !

గుణాలకు, ఆదర్శాలకు ప్రతిమూర్తులైన నాయికానాయకులను వాస్తవీకరించి, సదస్యులకు ఏ తద్రైక్యతా రసానుభూతిని అందివ్వడానికే అన్ని కళలూ ఒక లయలో ప్రవర్తిల్లడం !

అందుకే - కన్యాశుల్కం నాటకం కాలేకపోయింది. వసంత సేన నాటకం కాగలిగింది.

కన్యాశుల్కంలో రక్తి కట్టించిన మధురవాణి నవ్వు - ఆ పాత్ర ధారిణి యొక్క వైయక్తిక ప్రతిభ మాత్రమే. ఆ నవ్వు కోసమే కదా కూర్చున్నారు హాలులో ఆ కొద్దిమంది జన మైనా ?

ఆమె క్రీగంటి చూపుల కోసమే కదా కూర్చున్నారు - మొదటి వరసల లోని రసికులంతా అంత సేపు ?

ఆ పెద్దల అనుగ్రహం సంపాదించడం కోసమే కదా ఆమె చూపిన ఆ హావ భావ విలాసాల తమాషా లన్నీ ?

స్టేజి, స్క్రీను - ఈ రెండు రంగాలు కూడా ఇలానే కళాహీన దీనమై పోయినై - వ్యాపారం స్వైర హస్తాలలో !

వసంతసేన గ్రాంథికంలో వ్రాయబడ్డ నాటకం. పద్యాలు, పాటలు ఎన్నో ఉన్నై. అయినా - హాలు కిటకిట లాడిపోయింది జనంతో.

ఎందుకని ?

అది నాటకం కనుక.

కళాస్పృష్టలు, కళాభిజ్ఞులు, కళా విమర్శకులు ఎవళ్ళూ బ్రతికి లేరు ఈనాడు.

బ్రతికి ఉన్నవాళ్ళు ఒక్క ప్రజలే !

ఉద్యోగ విజయాలు, చింతామణి, హరిశ్చంద్ర, పాలేరు వంటి నాటకాలకు వచ్చే జనం, డబ్బు అధునిక వచన నాటకాలకు ఎందుకు రావడం లేదు ?

అవార్డులు పుచ్చుకొంటున్న నాటకాలు, నటకులు కూడా వెంటవెంటనే అదృశ్యమై పోవడానికి ఏమిటి హేతువు ?

ఈ నాడింకా నాటక కళ బ్రతికి ఉన్నదంటే కారణం, కళా సంస్కారం గల ప్రజలు ఇంకా బ్రతికి ఉండడమే.

ప్రజ లెప్పుడూ బ్రతికే ఉంటారు.

కళ కూడ బ్రతికే ఉంటుంది.

కావ్యాంతే నాటకం - అన్నది ఋషివాక్యం.

కావ్యం కాదు కాదా, రెండు వాక్యాలు కూడా సమంగా వ్రాయలేని - జీవితానుభవం సైతం ఏమీ లేని - వాళ్ళంతా వ్రాస్తున్నారు నాటకాలు నేడు.

విదేశీ నాటకాలను కాపీ కొట్టేస్తున్నారు-సంప్రదాయ భేదాలను కూడా గమనించకుండా !

అక్షరాలు వచ్చిన ప్రతివాడికీ ఈనాడు తన తొలి రచన నాటకమే !

నాటకం అంటే - సమాజాన్నో, వ్యక్తులనో విమర్శించే ఏవో కొన్ని సంభాషణలు - అతడి దృష్టిలో !

అంతకంటె మరేం ఉంది కన్యాశుల్కంలో ?

సొంతంగా ట్యూన్లు కట్టుకోగల సంగీతవేత్తలు, సొంతానికి పాటలు వ్రాసుకోగల కవి బ్రహ్మలు, సొంత రుచులతో లోకం అంతరంగాన్నే జ్వలింప జేయగల చిత్రశిల్పులు కూడ మృగ్యమే మనకు ఈనాడు.

ఇంటి నిండా ఉప్పు, పప్పు, బియ్యం అన్నీ ఉన్నా-

ప్రతి దానికీ చేతులు చాచడమే - విదేశీ ఊక కోసం !

అభిజ్ఞ అంతరిస్తున్నది !

సరస్వతి నిద్ర పోతున్నది !

ఏదీ నీ భూపాల !

అమృత మయమైన బ్రహ్మ ముహూర్తమున కూడ
మరచి నిద్రించునే మన భారతీ దేవి !
కళ లెల్ల గంగలో కలిసి పోవుట లేదె ?
పలికించవే వీణ! పాడవే భూపాల !

64

ఎక్కువ చదువుకొన్నదే కాని - ఆత్మ విశ్వాసం లేనిది విద్యావతమ్మ. లోకజ్ఞానం కూడ తక్కువే ఆమెకు.

సంగీతంలో అపర సరస్వతి దేవేంద్రయ్య. కాని - నిగ్రహం, స్థైర్యం అనే మాటలు అతని నిఘంటువు లోనే లేవు.

ఈ ఇద్దరూ నాకు ఎంత ఇష్టులో, అంత గడ్డు సమస్యలు !

అసలు - అమ్మ, అయ్య అనే మాటలను పేర్ల చివర పెట్టుకోవడమే కిట్టదు నాకు.

మా అమ్మను తప్ప, మరొక స్త్రీని అమ్మ అనలేను నేను.

నా జీవితంలో, నా హృదయంలో మా అమ్మది ఒక ప్రత్యేక స్థానం. ఆ మహా స్థానంలో మరొక స్త్రీని నామ మాత్రంగా అయినా భరించలేను నేను.

అందమైన స్త్రీల రూపాన్ని నత్తులూ, అడ్డబాసలూ పెట్టి చెడగొట్టినట్టే - అందమైన పేర్లను కూడ అమ్మ, అయ్య చేర్చి నాశనం చేస్తారు కొన్ని భాషల వాళ్ళు !

మనిషి ఉండవలసింది మనసులో. పేరులో కాదు.

సంస్కృతం వంటి ఉత్తమ భాషలకు ఈ గోల లేదు.

ఈ ఇద్దరూ పేర్ల దగ్గరి నుంచీ సమస్యలే నాకు.

వీళ్ళ మనస్తత్వాలను బాగా చదివి చూశావు కదూ నీవు ?

నీ అభిప్రాయాలే నిజ మనిపిస్తున్నై వీళ్ళ విషయంలో నాకు.

జీవితానికి ముఖ్యం చదువు కాదు - వ్యక్తిత్వం.

జీవితం బహు ముఖం.

లోకం సువిశాలం.

ఏ ముఖంగా పోగలిగినా, సఫలీకృతం కాగలదు జీవితం.

కావలసింది - ఏదో ఒక ముఖంగా ముందుకు పోగలగడం.

వ్యక్తిత్వ శక్తిపై ఆధారపడిన విషయ మది.

వ్యక్తిత్వానికి పదును పెట్టగలది మాత్రమే చదువు.

వ్యక్తిత్వం కన్ను. చదువు దాని కాటుక.

అక్షరజ్ఞానం లేని ఒక బీడీల వర్తకుడు - తన దగ్గర పట్టభద్రులనే పెట్టుకోగలడు గుమాస్తాలుగా !

కళ అంటే ఏమిటో ఎరగని ఒక ప్రొడ్యూసరు - తన కాళ్ళ దగ్గర నిలుపుకోగలడు తారాపథం లోని రంభలనూ, నలకూబరులనూ !

ప్రతి వ్యక్తికీ ఒక వ్యక్తిత్వం ఉంది. ఒక కర్తవ్యం ఉంది. ఒక జీవితరేఖ ఉంది ఒక చేతిలో.

అయితే -

అదేమిటి ? ఎలా ఉపయోగించుకోవాలి దాన్ని ? ఏం చెయ్యాలి అందుకు ?

తెలుసుకోడానికి ప్రతిభ కావాలి.

చాలా మందికి ఈ ప్రతిభా ప్రభాతంపై పొగమంచు కప్పి ఉంటుంది. మేఘాలే క్రమ్మి ఉంటై.

జ్ఞాన సూర్యుణ్ణి ప్రకాశించ నివ్వవు అవి.

దీక్షతో, తపస్సుతో తొలగించు కోవాలి వ్యక్తి - నిప్పుపై నివురువంటి ఈ ఆవరణలను.

జీవిత యాత్రా మార్గంలో - తాను ఉన్న దశ ఉన్నతమైన దైనప్పుడు, ప్రతిభ తనంతట తానే బాణంలా సమస్త ఆవరణలనూ ఛేదించుకొని, ప్రకాశిస్తుంది అరుణోదయంలా !

ప్రతిభ చాలని సామాన్యులే ఏ దిక్కూ తోచక, అనుకరిస్తారు ఇతర్లను.

ఒకడు డాక్టరీ చదివి డబ్బు సంపాదిస్తుంటే - తాము కూడ అదే చదువుతారు చాలమంది.

తన తండ్రి పుస్తకాలు ఉన్నై కదా అని - తాను కూడ అదే కోర్సు చదువుతాడు కొడుకు !

ప్రతిభను వెలిగించుకోలేక, వ్యక్తిత్వాన్ని గుర్తించుకోలేక, ఇతరులతో పోటీలు పడి, ఓడిపోతూ ఉంటారు జనం ఎక్కువగా !

నే నెవరు ?

నా ప్రతిభ ఎట్టిది ?

నా జీవిత కర్తవ్యం ఏమిటి ?

ఈ ప్రశ్నలు వేసుకొని, సరైన జవాబులు పొంది, ఎన్ని త్యాగాల కైనా సిద్ధపడి, తదనుగుణంగా జీవిత రథాన్ని నడుపుకోగల వాడే విజయు డవుతాడు చివరకు, అపజయమే ఉండ దతడికి.

జీవితానికి ప్రధానం వ్యక్తిత్వం.

వ్యక్తిత్వానికి నిదర్శనం దాని లక్ష్య సిద్ధి.

లక్ష్యాలు అసంఖ్యాకం.

అభిరుచి సిద్ధమైన ఏ లక్ష్యం సాధ్యమైనా చాలు – ఆ జీవితం తరించి నట్టిదే !

విద్యకు చనువు ఉంది. అందరూ చదివితే తానూ చదివింది. ప్రతిభ వికసించ లే దామెలో.

దేవేంద్రకు కళ ఉంది. క్రమం లేదు.

జిగేలు మనే క్షణిక ప్రభ తప్ప మరో ప్రతిభ లేని క్షణ ప్రభ వలె, అతడి బుద్ధి క్షణ క్షణం.

జీవితాని కొక పథకం లే దతడికి. ఎర్ర చీర కనిపిస్తే చాలు – చేస్తున్న పనిని అలానే వదిలేసి, దాని వెంట పడి పోతా డతడు !

అలా వెంట పడే కదా – మొన్న సీరిచే చెంపకాయ తింట ?

దేన్నో వెతుక్కొంటూ ఉంటా డతడు నిత్యం !

నిద్రపోతూ ఉంటుం దామె నిరంతరం !

ఏమి చేద్దాం వీళ్ళని ?

ఈ ఇద్దరినీ కలిపి, పెళ్ళి చేస్తారట వాళ్ళ పెద్దలు !

ఆమె చచ్చినా ఎర్రచీర కట్టదు.

అతడు ఒక్క క్షణం కూడ పక్కలో ఉండడు.

తమాషాగా ఉంటై ఇలాంటి జంటలు !

గతి, గమనం, గమ్యం – ఈ త్రిగా దేవి స్వరూపం స్పష్టంగా తెలియకపోతే, ఎంత చదువుకొన్నా వ్యర్థమే. ఎంత కళ ఉన్నా విఫలమే.

గతి గమన గమ్య త్రిగా దేవి శ్రీదేవి
ఆమె సాక్షాత్కారమే మాధవత్వమ్ము !

65

ఆ ముఖం ఎంత అందంగా ఉండే దనుకొన్నావు !

ఏమై పోయిందో ఆ లావణ్యం !

ఉప్పు మాత్రం పండుతున్న దిప్పుడు – నెరలు తీసిన ఆ బాలకపోలాలలో !

ఏ నిదాఘులు ఆర్చివేశాయో ఆ కమల వనాన్ని ! ఏ తుపానులు ఆర్పివేశాయో ఆ కన్నుల లోని కామజ్యోతుల్ని !

చిన్ననాటి నైర్మల్యం, మాధుర్యం, ప్రేమ వంటి దివ్య వరాలన్నీ మాసిపోయి – ఎందుకలా మారిపోయిం దామె అంత కఠినశిలగా ?

ఎందుకలా ద్వేషిస్తుందామె పురుష లోకాన్ని ?

బాలగా అమృతం కురిసిన ఆమె, యువతిగా విషం క్రక్కుతున్న దెందుకని ?

మరొక సారి చూడు లక్ష్మీతులసిని !

ఆమె అనుభవం అట్టిది !

మానవుడు తన అనుభవంలో నుంచి చూస్తాడు లోకాన్ని.

అనుభవమే లోకం.

అనుభవాన్ని బట్టి అర్థం చేసుకొంటాడు లోకాన్ని. తదనుగుణంగా ప్రవర్తిస్తాడు లోకంలో. తన అనుభవమే తన లోకం ఎవరి కైనా.

అందుకే – ఎవరి లోకం వారిది.

ఎన్ని కోట్లమంది మానవు లున్నారో, అన్ని కోట్ల లోకాలున్నై ఈ భూలోకంలో – ఒక దానితో ఒకటి చిక్కుపడి !

అందులో లక్ష్మీతులసి లోకం ఒకటి.

దురాశ, దౌష్ట్యం, కృతఘ్నత, వంచన – వీటితో నిండి ఉన్న లోకం అది !

అట్టి లోకాన్ని ద్వేషించక, ప్రేమిస్తుందా ఆమె ?

ఆమె లోకం అలా ఎందు కయింది ?

ఏడెనిమి దేండ్ల క్రితం –

ఆమె ఇంకా అరవిచ్చిన మొగ్గగా, ఆనంద దుగ్ధగా, సుషమగా, షోడశిగా ఉన్నప్పుడు –

ఒక పెళ్ళికి వెళ్ళిం దామె !

పెళ్ళిళ్ళు, పేరంటాలు, ఇవేగా మన వధువులకు వరప్రదర్శన శాలలు !

అందులో ఓహో, ఒక అందగాడు !

పాము కుబుసం షర్టు, కోడెపులి మీసం, ఎలుగుబంటి జుట్టు, వేటకుక్క కళ్ళు, వంక నవ్వు, జింక చాతీ – అబ్బ ! ఎంత అందగాడు !

అతడి వలలో పడిం దామె !

శుభ ముహూర్తం ఒకతెకు !

దుర్ముహూర్తం మరొకతెకు !

ప్రేమ, వాగ్దానం, గర్భం, వాగ్దానభంగం, గర్భస్రావం, దుఃఖం, ఆశావైఫల్యం, ఆత్మ పాతిత్యం – ఇదంతా యుగయుగాలుగా జరుగుతున్న కామ చారిత్రక పునరావృత్తమే కద ?

ఒకసారి పడ్డ స్త్రీ వెంటనే లేచి నిలబడక పోతే ఇక జన్మలో నిలబడ లేదు.

ఆత్మబలం కలది కాదు తులసి !

ఆ తర్వాత మరొకడు, మరొకడు, మరొకడు !

వేటగాణ్ని మన్మథు డనుకొంటుంది కామశబల.

ప్రతి ధానుష్కుడూ పుష్పబాణుడు కాడు.

మృగాన్ని మనిషనుకొని, అతడి కోరల్లో చిక్కుకొని, తన సమస్తాన్నీ పోగొట్టుకొని, అసలు మనుషుల్ని ద్వేషిస్తున్న అవివేకిని తులసి !

హృదయం కల మగవాడు ఎలాంటివాడో ఎన్నడూ ఎరగదామె !

మనస్సు, హృదయం, ఆత్మ, వీటి సౌందర్యాన్ని ఎరగని దురదృష్టవంతులు,

శీల సౌందర్య పరమ మాధుర్యాన్ని రుచి చూచి ఎరుగని ద్వైషోపహతులు - ఎందరో ఉన్నారు లోకంలో !

ద్వేషిస్తారు వాళ్ళు లోకాన్ని.

తులసి ద్వేషిస్తున్నది.

ఆమె గతం కోటి బ్రహ్మాండాల బరువుతో క్రుంగదీస్తున్న దామెను !

ఆమెను ఉద్ధరించలేమా - అంటావు నీవు !

ఎందుకు లేము ?

గతం ఒక స్వప్నమని ఆమెను ఒప్పించ గలవా ?

తాను చేసిన పాపం ఏమీ లేదని ఆమెను నమ్మించ గలవా ?

" అందగత్తె కన్న అనురాగవతి మేలు " అన్నాడు నార్ల.

ఆత్మోన్ముఖం కమ్మను. ఆత్మేశ్వరుణ్ణి గుర్తించుకోమను. అనురాగాన్ని పెంచుకోమను. అనాసక్త కామమే ఆనందయోగంగా తెలుకోమను !

ఈ స్థాయిని అందుకో గలిగితే, మళ్లీ ఆనాటి నిష్కళంక సుందర శోభావతే కాగల దామె.

66

" అబ్బ ! దేవుళ్ళకు కూడ ఇద్దరేసి పెళ్ళాలు " అన్నది లక్ష్మీతులసి, భోగిస్నానం చేసి నేను వెంకటేశ్వరస్వామికి బంతిపూలు పెడుతుండగా వచ్చి.

" చెంచులక్ష్ములూ, లక్ష్మీతులసులూ కాక " అన్నాను నేను ఆమె వంక చూడకుండానే.

" అతడు గోపాలకృష్ణుడు కాబోలు ! మహానుభావుడు ! " అన్నది మళ్ళీ - కృష్ణుడి చిత్రపటాన్ని చూస్తూ.

శివుడి కేశబంధం లోని గంగను చూచి విరగబడి నవ్వించామె !

" పాపం, ప్రియురాండ్రను దాచుకోడానికి ఎంతెంత కష్టం పడుతున్నారో వీళ్ళు " అని, ఇంకా ఏమో వాగబోతూ ఉంటే భరించుకోలేక పోయాను నేను.

" నోరు మూసుకొంటావా ? బైటికి నడుస్తావా ?"

నోరు మూసుకొన్నది వెంటనే.

సంక్రాంతికి భక్తితో బొమ్మల కొలువు పెట్టుకొని, నీవు వస్తే బాగుండునను కొంటూ ఉంటే - తులసి వచ్చిపడింది ఎక్కడినుంచో !

ఎంతగా చెడిపోయింది తులసి !

ఇక పనికి రాదా !

కూర్చుంది మెదలకుండా - నేను ఒక్కొక్క పటానికీ పువ్వులు పెడుతుంటే - చూస్తూ !

ఎంత అమాయకురాలు !

అందుకే వంచించగలిగాడు ప్రతి పశువూ ఆమెను !

నిజానికి - ఈ పటాలలో బిగించబడి ఉన్న ఈ మూర్తు లందరూ దేవుళ్ళేనా ?

అయితే -

మనుష్యులకు కూడా లేనంత కామ తామసం వీళ్ళ కెందుకున్నది ?

ఆలోచిస్తే అర్థం దొరుకుతుందేమో !

" ఆలోచించే తీరిక ఎవడి కుందీ " అంటాడు దేవేంద్ర.

తాగుడు, జూదం, వ్యభిచారం వంటి వాటికి ఉన్నదట తీరిక !

" నీవు ఆలోచిస్తూ కూర్చో. నాకు పని ఉంది " అంటూ వెళ్ళిపోతా డతడు - కనిపించిన చీర వెంట !

ఈ దేవుళ్ళు కూడా అతడి లాంటి వాళ్ళేనా ?

శ్రీకృష్ణుడికీ, మన దేవేంద్రయ్యకూ తేడా ఏమిటి ?

దేవేంద్రయ్య ఆడవాళ్ల వెంట పడతాడు. చిక్కితే తొక్కి వదిలేస్తాడు. తప్పితే తన్నులు తిని వచ్చేస్తాడు.

ఆడవాళ్ళు శ్రీకృష్ణుడి వెంట పడతారు. అందరికీ తనలో స్థానం ఇచ్చి, తాదాత్మ్యం పొందుతా డతడు వాళ్ళతో. అందర్నీ తనలో లయం చేసుకొని, తాను అందరి లోనూ లయమై పోయే పరమాత్మ అతడు.

బలమైన, సమర్థుడైన, సరసుడైన, విశ్వాసపాత్రుడైన అట్టి పురుషుడి చుట్టూ స్త్రీ లోకం చేరడం - ప్రతిఫలాపేక్ష లేకుండా అతడికి ఆత్మార్పణ చేసుకోవడం - నిత్యం మనం చూస్తున్నదే.

శుద్ధ చైతన్యశక్తి నుంచి ఎంత ఎక్కువ శక్తిని చేదుకోగల్గితే అంత పరిపూర్ణత సిద్ధిస్తుంది పురుషుడికి.

ఎంత ఎక్కువగా వికసించగల్గితే అంత పూర్ణ సౌందర్యం లభిస్తుంది స్త్రీకి.

స్త్రీ పూర్ణ పురుషుణ్ణి, పూర్ణ పురుషుడు పూర్ణ స్త్రీనీ వెతుక్కొంటూ ఉంటారు నిరంతరం.

ఈ సహజాన్వేషణకూ, వివాహ వ్యవస్థకూ సంబంధం లేదు.

స్త్రీ పురుషులలో పరిపూర్ణ వికాసం లేనప్పుడు - ఏక పత్నీవ్రతం ఎంత అసహజమో, పాతివ్రత్యమూ అంతే అసహజం.

సహజాన్వేషణా, స్వయంవరణమూ అరికట్ట బడ్డప్పుడు - రహస్య ప్రణయమూ, మనోరమణమూ తప్పవు.

ప్రకృతి అనంతానంత రూపాలు కలది.

అన్ని రూపాల తోనూ ఆరాధిస్తుందది పురుషుణ్ణి.

గులాబి ఏ శక్తిని ఆరాధిస్తుందో - మల్లె, గన్నేరు, కలువ, జాజి వగైరా అన్ని పువ్వులూ అదే శక్తిని ఆరాధిస్తై !

రూప రాగాది భేదాలెన్ని ఉన్నా, ఆరాధనలో ఏకాగ్రత ఉంది ప్రకృతికి.

అదే ఈ గోపీకృష్ణ మధురభావన.

చరాచర జీవప్రకృతి సర్వమూ సహస్రాధిక గోపగోపీవ్రజం.

కేంద్రంలో కృష్ణబ్రహ్మ, నిరంతర సృష్టిలీలే రాసలీల !

అపరోక్ష జ్ఞానం ఇది. అనుభవం లోదే ప్రతి వ్యక్తికీ !

నిర్గుణాత్మక పరబ్రహ్మ యొక్క కామ శబలిత సగుణ చైతన్యమే పురుషుడు. అతడే హిరణ్యగర్భుడు. అతడి సృష్టే ప్రకృతి ! అతడి కళకు లక్ష్మి ! నాదానికి సరస్వతి ! బిందువుకు అర్ధనారీశ్వరి !

ఈ సగుణద్వయ వైవిధ్యానికి రూపకల్పనలే మన త్రిమూర్తులూ, దేవుళ్ళూ, దేవతలూ.

బుద్ధీ, సిద్ధీ మాత్రమేనా గణేశ్వరుడి భార్యలు ? అష్ట సిద్ధులూ అతడి భార్యలే కారా ?

ఆర్షమతం ఒక అలంకార శాస్త్రం. ఒక ధ్వని కావ్యం. ఒక వ్యంగ్య చిత్రం. ఒక సింబాలిజం.

ఏ దేవుడు ఏ గుణానికి మూర్తికల్పనో తెలిస్తే - అప్పుడు అతడి భార్యలూ, చర్యలూ, అన్నీ అర్థమవుతై మనకు.

ప్రపంచ వేదాంతానికే మకుటం ఆర్షసూత్రం - తత్త్వమసి ! దాని బహుముఖ శాఖోపశాఖా పరివ్యాప్తే, దాని అభిజ్ఞే ఈ కల్పన !

ఈ బొమ్మల కొలువు !

గూఢార్థాలు తెలియక మూఢార్థాలు తీస్తున్నారు పండితులు ! నమ్ముతున్నారు సామాన్యులు !

హేళన చేస్తున్నారు తులసి వంటి వాళ్ళు - దాఖలాలు కనిపించక !

స్త్రీ ప్రమేయం లేని ఏ అసలు దేవుడి కోసమో అన్వేషించి, పాప క్షమ కోసం మతాలు మార్చి, ప్రతి చోటా కామవేటకు గురై, లోకం మీద ద్వేషం పెంచుకొని, వచ్చి కూర్చున్నది తులసి - ఇక్కడ ఈ బొమ్మల కొలువులో !

మార్చవచ్చు నేమో ఈమెను !

పువ్వులు పరుచుకొని, నీ ఫోటో ముందు కూర్చుని, నేను బొమ్మ పాట పాడుకొంటుంటే - ఆమె అలా మునిగిపోయింది ఏదో ధ్యానంలో !

పౌష్ణి

నీ జటలో ముద్ద బంతిలా పూర్ణ చంద్రుడు !

దాని ప్రక్క వదులై వ్రేలాడుతున్న చేమంతిపూల చిరుచెండులా - పుష్యమి !

ఆ చెండు చివరికొస దారంలా ఆశ్లేష !

వృషభ వామనుడైన అర్ధనారీశ్వర మిధున మూర్తికి పూర్ణేందు శేఖర బిరుద ప్రధాన దివ్యోత్సవం ఈ పుష్య పూర్ణిమ !

పౌష్య లక్ష్మివి నీవు !

నా రాగ పౌషివి నీవు !

ప్రతి పూర్ణిమ మన కొక పండుగ

ప్రతి పండగా మన కొక పూర్ణిమ.

ఆనంద పూర్ణిమవు నీవు నాకు ప్రతి క్షణమూ !

సకల చరాచర ప్రకృతికీ అధిష్ఠాన చైతన్యం ఆనందమే !

ఆనంద ఇత్యుపస్థే-అన్నారు ఋషులు.

సుధాపూర్ణ పూర్ణ సోమ బింబమే ఆ ఆనంద భాండం.

అదే అన్నరసం సమస్త సృష్టికీ.

అన్నమే పరబ్రహ్మ. రస స్వరూపం అది. రసో వై సః అని ఋషు లనడం ఆ పరమ రసోమృత చైతన్య బ్రహ్మను గురించే.

సోమ కళలు కామ కళలై, పూర్ణ నారీ రూపంతో అవతరించిన రాగ కళా కామేశ్వరివి నీవు !

వస్తున్నావు కదూ ?

నీ జాడల నీడలే ఈ వెన్నెల పొలాలు !

పొలాల నిండా పచ్చని [illegible]

సరస్సుల నిండా కాయగూరలు !

రోదసి నిండా - సంక్రాంతి ముగ్గులను కాపీ చేసుకొంటున్న చంద్ర గృహిణులు !

నీ పాదాలు అంత స్వచ్ఛంగా ఉంటై అందుకే !

ఆపాద మస్తకం చుంబనార్హ మైనప్పుడే ఆ జీవితం స్వచ్ఛం !

పెదవులే చుంబనార్హం కావు చాలా మందికి !

అసూయా ద్వేష దూషణ వాచా విష దూషితాలై ఉంటై ఎంతో మంది పెదవులు !

ఎవరి గుండెలనో కొరుక్కు తినేసినట్టు - ఎర్రరంగు పూతతో - నెత్తు రోడుతూ ఉంటై పెదవులు కొందరికి ! బహుశా, హృదయం లోని విషయంతో నల్లబడ్డ పెదవుల్ని, అలా దాచుకొంటారో ఏమో లిప్పుస్టిక్కుల్లో వాళ్ళు !

కాళ్ళు గతంలోను, తల భవిష్యత్తులోను ఉంటుంది లోకంలో ఎక్కువ మందికి.

మొండెం మాత్రమే వర్తమానంలో బ్రతుకుతుంది వాళ్ళకు !

ఆ కాళ్ళను ఎంత మురికి !

ఆ మురికిని వర్తమానమే భరించలేదు-భవిష్యత్తు ఎలా భరించ గలదు ?

అందుకని - మొండెం మాత్రమే సాగుతుంది వర్తమానం పొడవునా !

అదే పురోగమన మంటుంది భవిష్యత్తు లోని తల !

ఇందులో తరించడం ఎక్కడ ?

తరించి, తరింప జెయ్యమంటున్నది మన ధర్మం.

ఎవరూ ఎవర్నీ తరింప జెయ్యలేరు.

తనకు తాను తరిస్తే చాలు ప్రతి వ్యక్తీ.
తనను తాను తెలుసుకోవడమే తరించడం.
అందుకు – ఆపాద మస్తకం వర్తమానంలో బ్రతకాలి !
పాదాలు, పెదవులు కూడ స్వచ్ఛంగా, చుంబనార్హంగా ఉండాలి.
అప్పుడే ఆనంద పూర్ణ పారవశ్యం. అదే తరించడం !
రాత్రిని వలె గతాన్ని వదిలేసి, ప్రభాతం వలె నడిచి వస్తావు నీవు వర్తమానం లోకి !

వికసిస్తావు నీవు శ్వేతపద్మం వలె నా చుట్టూ !
నీ లక్ష్యాన్ని అనుసరిస్తే చాలు మానవుడు !
తరించగలడు – తన్మయుడే కాగలడు– ఆనంద బ్రహ్మలో !
ఇంకా ఎందుకు రాలేదో నీవు ?
ఎందుకు తేలిపోనిస్తున్నావో నన్ను ఈ ఊహా మేఘాలపై ?
ఎవరు మూశారు నా కళ్ళు ?
ఓహో – నా వెనుకనే ఉన్నావా ఇంత సేపూ !

నను గోరి, నా కేసి నడిచి వచ్చే వేళ
పరమ గమ్యములు నీ పాద పద్మములు !
నను చేరి, నా చుట్టు నాట్యమాడే వేళ
పరమ రమ్యములు నీ పాద పద్మములు !
నను గూడి నా గుండె నధివసించిన వేళ
పరమ సౌమ్యములు నీ పాద పద్మములు !
పరమ పూజ్యములు నీ పాద పద్మములు !
పరమేశ్వరములు నీ పాద పద్మములు !

68

కాలు జారిన దంచు కంగారు పడకు !
కలుష మంటిన దంచు కన్నీరు తేకు !

తెలివిగా, మెల్లగా తీసుకో కాలు !
కనపడ్డ కొలనులో కడుగుకో బురద !
చేత కాకున్న, నా చేయూత కొనుము !
కొనుము నా కన్నీరు, కొలను లేకున్న !
జారి నట్లుంచకు జారిన కాలు !
కడిగినచో పోని కలుషమ్ము లేదు.
గతుకులతో నున్న బ్రతుకు తెర్వులలో
ఎప్పుడో ఎక్కడో ఎవ్వరో ఒకరు
పట్టు తప్పుచు నుండ్రు, పడుచునే యుండ్రు,
పడియు లేచుచు నుండ్రు, పయనించుచుండ్రు.
కాటు జారుట తప్పు కా దెవ్వరికిని,
లేవ లేకున్నప్పుడే వచ్చు ముప్పు !
తోడనే లేచి ముందుకు పోవ కున్న
తొక్కుకొనుచు పోవు తక్కిన జగము !
జగతిదే ఒక కాలు జారిన గాధ !
కాకున్న ఇన్ని దుఃఖపు గాధ లేమి ?
మొగ్గ త్రుంచుటలేమి ? మోసము లేమి ?
వెర్రి కామము లేమి ? వేటలు నేమి ?
దారి అంచున కాలు జారిన గాని,
తను వెల్ల బురదలో తడిసిన గాని,
భయ మింతయును లేదు, భద్రమౌ నీకు !
సడల నీకుము ఆత్మశక్తి సుంతైన !

ఓదార్చడం కోసం, నేను శివరంజనికి వ్రాసిన పద్యా లివి !

శివరంజని నాకు బాల్య సఖి. ఎప్పుడూ వెన్నంటి ఉండేది నన్ను. ప్రేమించగల మగవాడిని సుఖపెట్టగల అమృత మాధుర్యా లెన్నో నిక్షిప్తమై ఉన్నై ఆమెలో.

ప్రేమ, త్యాగం, విధేయత, ఆరాధన పరిచర్య వంటి ఎన్నో మంచి గుణాలు వికసించి పరిమళించినై ఆమెలో చిన్నప్పుడే.

వాళ్ళ నాన్నకు బదిలీ అయి ఆమె, నా చదువు కోసం నేను, విడిపోయాం అప్పుడే. కలుసుకోలేదు మళ్ళీ.

కుమార్తె పట్ల రెండు ముఖ్య బాధ్యత లున్నై తండ్రికి. పదహారు - పద్దెనిమిది ఏండ్ల మధ్య పెళ్ళి చెయ్యడం ఒకటి. స్వతంత్రంగా బ్రతకడానికి తగిన విద్య చెప్పించడం ఒకటి.

శివరంజని నాన్న మంచివాడే. కాని, వంశప్రతిష్ఠ పిచ్చి ఎక్కువ. ఈ రెండు బాధ్యతలలో ఒక్కటీ నిర్వహించలే దతడు. పైగా, ప్రేమించిన యువకుడితో స్నేహాన్ని పెంచుకొనే వీలు కూడ లేకుండా చేశాడు - ఆశ్లేషయ్య లాంటి వాళ్ళ దుష్ట సలహాలు విని !

అలాంటి పరిస్థితుల నడుమ విడిపోయాం మేం. గడిచిపోయినై ఎన్నో సంవత్సరాలు. మరిచేపోయాను నేను వాళ్ళ సంగతి పూర్తిగా.

పిల్లలు సహజంగా పెరగకుండా చిన్నప్పుడు ఎంత కరకుగా అణచిపెట్టబడితే, అంత కసిగా కట్టు తప్పి వ్యవహరిస్తారు ఆ తర్వాత.

అదే జరిగింది శివరంజని విషయంలో.

ఆమె చుట్టూ బిగించబడ్డ కట్టు దిట్టాల బాధ మరీ దుర్భర మైనప్పుడు, వాటిని తెంచుకొని పారిపోయిం దామె, ఒక గోముఖ వ్యాఘ్రంతో కలిసి.

ఏది గోవో, ఏది గోముఖవ్యాఘ్రమో ఎరగ దామె. చెప్పలేదు వాళ్ళ తలిదండ్రులు. స్వయంగా తెలుసుకోవ డానికి బైటి ప్రపంచంతో కలిసి మెలిసి తిరగ నివ్వలేదు కూడ.

అందుకే అమృత మనుకొని విషం త్రాగింది శివరంజని.

తామే శాశ్వత మనుకొంటూ, తమ పిల్లలు ఎల్లప్పుడూ పిల్లలే అనుకొంటూ, నిరంకుశంగా ప్రవర్తిస్తారు కొందరు తల్లిదండ్రులు. అలాంటి వాళ్ళ పిల్లలు అతి దుష్టులైనా అవుతారు, అధఃపతితులైనా అవుతారు, అప్రయోజకులైనా అవుతారు.

క్రమశిక్షణ అంటే- విద్యా వివేకాలకు వయస్సుతో పాటు క్రమవికాసం కలిగించడం. విద్యలో -చతుష్షష్టి కళలతో పాటు సెక్సు విజ్ఞానమూ, వివేకంలో - వివిధ మానవ మనస్తత్వ సమవగాహనతో పాటు ప్రేమ స్వాతంత్ర్యమూ కూడి ఉన్నై.

లక్ష్మీ తులసిదీ, శివరంజనిదీ ఒకే రీతి గాథ. అయితే, తులసి వేటగాని వలలో పడింది. రంజని తనకు తానై విషం తాగింది.

గోవు దగ్గరకు చేరుస్తా నన్న వ్యాఘ్రం, తాను కూడా గోవునే అని నమ్మించి, గుటుక్కున మింగేసింది ఆమె లోని సమస్త సౌందర్యాలనూ, మాధుర్యాలనూ, ఆనందాన్నీ, ఆత్మస్వాస్థ్యాన్నీ కూడ ! వదిలేసి పోయింది శల్యావశిష్టంగా !

తులసి లోకాన్ని ద్వేషిస్తోంది. రంజని తనను తానే ద్వేషించుకొంటూ, క్రుళ్ళి చస్తోంది ఇప్పుడు !

ఏం చెయ్యను నేను ?

నా సమస్త సుకృతాన్నీ ధారపోసి అయినా, ఈమెను ఓదార్చా లనిపిస్తుంది నాకు.

నిజానికి శివరంజని పోగొట్టుకొన్న దేమిటి ?

బాల్యంలో ఎన్నో పొరపాట్లు జరుగుతై. అందులో ఇదొకటి

తాను పాప మనుకొని బాధపడితే తప్ప, ఏ పనీ పాపం కాదు.

పాపమనే దేదీ లేదు లోకంలో.

అది మనస్సులో ఉంది.

మనస్సును శుభ్రంగా ఉంచుకొంటే చాలు. శరీరం చేసిన పొరపాట్లు, తిన్న గాయాలు, పొందిన బాధలు, మ్రింగిన విషాలు అన్నీ శరీరంతోనే పోతై.

సెక్సు శారీరకం, శరీరం నశ్వరం. మరి, ఎందుకు ఆ వ్యధ ?

సెక్సును నిషేధించడం – దానితో పాటు మనస్సు కూడా పోతుందేమో అని కదా ?

మనస్సే ఎదురు తిరిగినప్పుడు, పోయింది మరేముంది ?

ఏదీ పోనప్పుడు వ్యర్థ భ్రాంతితో ఆరోగ్యం చెడగొట్టు కోవడం ఏం వివేకం ?

సంతాననిరోధం చట్ట సమ్మత మైనప్పుడు, వివాహం సెక్సు కోసమే కాదా ? వట్టి సెక్సు కోసం వివాహం అవసరమా ?

వివాహిత స్త్రీ ఎంతమందితో తిరిగినా ఏమీ చెయ్యలేదు లోకం.

అవివాహితలకే ఏ సమస్య లైనా ! ధైర్య సాహసాల అవసరం కూడ వాళ్ళకే !

నీవు కూడా ఓదార్చు ఆమెను.

ఆమె నీ స్నేహాన్ని అర్థించడం అందుకే కావచ్చు.

మరచి పొమ్మను గతాన్ని.

వివాహం చేసుకొమ్మను నచ్చిన వాణ్ణీ

లేదా - స్వేచ్ఛగా అనుభవించమను జీవితాన్ని

లేదా - ఏదో ఒక లక్ష్యం కోసం పాటు పడమను నిరీహతో.

అంతే కాని -

నశించి పోయే శరీరాని కేదో చిన్న దెబ్బ తగిలిందని ఏడుస్తూ, నశించని ఆత్మను క్షోభ పెట్టుకోవడం వివేకం కాదని చెప్పు.

ఏ రస మెప్పు డే తరగ
నే గతి నుద్రతమై, యుదగ్రమై
మీరునొ, గట్లు పొర్లి పొలి
మేరలు ముంచునొ చెప్పలేము ; కా
సారము కూడ తీవ్ర తర
ఝం ఝుకు ఉప్పర మంటి పోయెడున్ ;
పారము లేని దీని కొక
పద్ధతి చూపుము, సాగి పోవగన్ !

69

ఈ గిన్నెల గత చరిత్రలు ఎవరికి తెలుసు ?

అందుకే కడిగిన గిన్నెనే మళ్ళీ కడుక్కోవడం.

నీ వన్నట్టు, నాకు అనుమానం కొంచెం ఎక్కువే.

రక రకాల పనుల మీద, రాత్రింబవళ్లు పర్యటిస్తూ - రక రకాల హోటళ్ళలో ఆకలి తీర్చుకోవలసిన వాళ్ళకు, అనుమాన దృష్టి ఆరోగ్య హేతువే.

రకరకాల హోటళ్ళు !

రకరకాల గిన్నెలు !

కొత్తవి, పాతవి, తళతళ మెరిసేవి, రంగు మాసినవి, పెచ్చులూడినవి, బీటలు తీసినవి !

ఎంత తోమినా చెరగని మచ్చలు కలవి, ఎంగిలి అంచుల్ని ఇంకా పట్టుకొని ఉన్నవి !

అందులో ఏ రకం గిన్నె పెట్టాడో మన ముందు సర్వరు !

నీళ్ళ బాల్చీ నుంచి ఇవన్నీ తడితడిగా వస్తున్నవే !

అయితే, వీటి కర్మంతా ఆ బాల్చీలో వదిలిపోయే ఉంటుందా ? అక్కడి మురికి మరి కొంత వీటికి కొత్తగా అంటుకొని ఉండదా ?

అంతకు ముందు ఎవరు తిన్నారో ఈ గిన్నెల్లో !

కుర్రవాడో, వృద్ధుడో - ఆరోగ్యవంతుడో, వ్యాధిగ్రస్థుడో !

తృప్తిగా తిన్నాడో, బాధగా లేచి పోయాడో !

పాపం వలె ఆ చెరగని మచ్చలు - ఏ పుచ్చిన నోటి ఎంగిళ్లో !

ఒకో గిన్నె కొట్టే ఆ వాసన - వదలని జన్మవాసన వలె - ఎంద రెందరి నోళ్ళదో ! తెలియదు మనకు.

నాకు పెట్టిన గిన్నె కొత్తదో, పాతదానికి రంగు వేసినట్టిదో !

ఏ మచ్చా లేకపోవచ్చు. ఎంతో శుభ్రంగానూ కనిపించవచ్చు. అప్పుడే షాపు నుంచి వచ్చింది కూడ కావచ్చు.

ఆ షాపులోనే ఎంతమంది చేతులు పడ్డవో దాని మీద !

సర్వరు చేతులకు మాత్రం మురికి లేదనే హామీ ఏముంది ?

గతం తెలియదు మనకు !

తెలిస్తే - ఎంత అసహ్యం !

అందుకే, తెలిసికోం మనం.

ఈ గిన్నెల గత చరిత్ర - వద్దు మనకు

అందుకే, కడుక్కో నీవు నీ వంతుకు వచ్చిన గిన్నెను - నీ చేతులతో స్వయంగా.

నా గిన్నెను, నా చేతులతో స్వయంగా కడుక్కొని, నా దాన్ని చేసుకొంటేనే నాకు తృప్తి !

సర్వరు మహాశయుడు ఏ రకం గిన్నెను తోస్తాడో నా ముందుకు - ప్రారబ్ధంలా !

అందుకే మళ్ళీ కడుక్కోవడం !

క్షణ కాలం కోసం కావచ్చు. కలకాలం కోసం కావచ్చు. క్షణంలో అంటుకొన్న కర్మలు కలకాలం పీడించే ప్రమాదం ఉంది.

కాలం కాదు ప్రధానం.

గిన్నెలు, ఆకులు ఏవీ అక్కర లేకుండా - అరచేతుల్లోనే పెట్టుకొని ఆరగించిపోయే ఆత్రగాళ్ళు లేరా ?

ఆ అరచేతుల్లో ఎన్ని కరస్పర్శల ఖిల స్పర్శలో !

బ్రతుకు తెరువులో, తెరువు కిరు ప్రక్కలా, ప్రక్క ప్రక్కనే

రకరకాల హోటళ్ళు !

రకరకాల గిన్నెలు !

వద్దు వాటి గత చరిత్రలు

కదుక్కొందాం మనం మన గిన్నెలు మళ్ళీ మళ్ళీ !

నిను నీవు కాపాడుకొనుచు పోవుటె సుఖము,
పరులపై ఆధారపడుటె దుఃఖము, చెలీ !
నీ బ్రతుకు చుక్కాని నీ చేత నుంచుకో !
నీ ప్రణయ గతి వెంట నీ విధిని మలుపుకో !

70

వేలాది పదనాల
వెర్రి చూపులు చూచి ,
వెక్కి రింతలు పొంది ,
వెదకి నిను కనుగొంటి -

ఆ వేలాది వదనాల చరిత్రలు విన గోరుతున్నావు కదూ నీవు ?

చంపేశావు !

నీవు కోరడం సమంజసమే కావచ్చు. కాని-నేను చెప్పడం ఉచితమేనా ?

నీ కోసం వెతుక్కొంటూ , ఇంతవరకూ సాగివచ్చిన నా జీవితంలో - ఎంతో స్నేహం , ఎంతో శృంగారం , ఎంతో సౌందర్యం నన్ను ఉత్తేజపరుస్తూ వచ్చిన మాట నిజమే - దారి పొడుగునా , అడుగడుగునా.

అదంతా చెప్పడానికి అభ్యంతరంలేదు నాకు. ఎందుకంటే – అవన్నీ నీ అన్వేషణలో నేను పొందిన అనుభవాలే కద ?

కాని –

నేను చెప్పడం సాగిస్తే – నీవు సొంతం వినగలవా ?

విని – సహించుకో గలవా ?

నీ కోసం నా అన్వేషణ నిన్నటిదీ, మొన్నటిదీ కాదు. ఆకస్మికంగా, యాదృచ్ఛికంగా కలుసుకొన్న వాళ్ళం కాం మనం.

ఒకళ్ళ నొకళ్ళం అనుసరించి వస్తున్న వాళ్ళమే మనం అనాదిగా.

చైతన్య స్థితి నుంచి చేతన స్థితికి, ప్రజ్ఞాన స్థితి నుంచి జ్ఞాన స్థితికి , నిరాకార స్థితి నుంచి ఆకార స్థితికి వ్యక్తీభూతుల మైన తర్వాత – ఒక మహోత్సవంలో జన సందోహం నుంచి తీసుకొంటూ బైటికి వచ్చిన జంట వలె – చూచుకోక తప్పదు కద ఒకరి కోసం ఒకరం – వెనుకకూ, ముందుకూ ?

నా కంటే ముందే వచ్చేసి ఉన్నావో, వెనక్కే ఉండి పోయావో – ఎలా తెలుస్తుంది, ఈ మాయా మోహ మహోత్సవ నైరంతర్యంలో ?

ఎంతో మందిని చూచి నీ వనుకొన్నాను. స్నేహం చేశాను. మధువులు గ్రోలాను. మైమరిచాను కూడ – ఆయా రిరంసువుల హంసోత్తరీయాల మకరధ్వజాల మధుర చ్ఛాయల్లో !

ఒకరిలా ఒకరు !

ఒకరి కంటే ఒకరు !

ఒకరిలో ఒక అందం మధుర మనిపిస్తే – మరొకరిలో మరొక అందం దివ్యమనిపిస్తే – ఒకర్ని మించి మరొకర్నిగా స్నేహిస్తూ, ప్రేమిస్తూ వచ్చి వచ్చి, ఇప్పు డనుకొన్నాను – ఇవన్నీ కేవలం నీ అంశలనీ, ఇవన్నీ కలిసిన పూర్ణ సౌందర్యమే నీదనీ, నేను వెతుక్కొంటున్న ఆ వైశాఖీ రాగలక్ష్మివే నీ వనీ !

ఇప్పుడు కదా కనిపించావు నీవు – నా అన్వేషణా మార్గ మందార వల్లరి చివర – ఏకైకర విశ్వసుందరంగా, విశ్వైక మధుర మోహనంగా గుబాళిస్తూ బొ

నీవు కూడ నన్ను వెతుక్కొంటూ, ఇటువంటి అనుభవాలనే పొంది ఉండవచ్చు కద ?

నీవు కూడ నేను వలెనే, వేలాది వదనాల వెర్రిచూపులు చూచి ఉండవచ్చు కద ?

ఆ చూపులు అన్వేషిస్తున్నవో, ఆహ్వానిస్తున్నవో తెలిసికోలేని దేవేంద్రయ్యలాంటి చిత్త కార్లెలు - వెంటపడి, కంటకాల వలె, నెత్తురు పిండి ఉండవచ్చు కద ?

ఎందుకు మనకు ఈ వ్యర్థ గతం ?

సెక్సు, శరీరం, సంసారం - ఇవే ప్రాథమిక మానవుడికి పంచప్రాణాలూ.

వీటికి సంబంధించిన తమ గత చరిత్రలు చెప్పుకోకూడదు - ప్రాథమికులైన భార్యా భర్తలు, ప్రేయసీ ప్రియులు కూడా !

చెప్పుకొంటే - సుఖ సముద్రం లోని తమ సంసార భద్రనౌక శతధా విభగ్నమే !

ప్రాథమిక మానవుడికి ఆత్మ తెలియదు. హృదయం అర్థం కాదు. మనస్సు నిలవదు. శరీర మొక్కటే అతని సర్వస్వం.

శరీర మంటే సెక్సు అతడికి.

ప్రాథమిక మానవు డంటే - అప్పుడే తొలిసారిగా జంతుస్థితి నుంచి, మానవ స్థితికి ప్రమోషను పొందినవ వాడు.

ఇలాంటి వాళ్ళు పుట్టు పేదలలో కంటె పుట్టు ధనికులలోనే ఎక్కువ.

మనం పరమ పారమ్య ప్రసిద్ధులం !

మనం అన్నిటా అబాధితులం !

తాను నశిస్తూ, లోకానికి వెలుగును ప్రసాదించే మైనపుదీపం స్త్రీ !

అందుకే - తాను వెతుకుతున్న స్త్రీ వలెనే కనిపిస్తుంది ప్రతి స్త్రీ, ప్రతి పురుషుడికీ !

నీవు పూర్ణ స్త్రీవి !

కనుక -

నీకు ఏ ముఖంలోనూ కనిపించి ఉండక పోవచ్చు నేను !

నేను పూర్ణ పురుషుణ్ణి !

కనుక-

ప్రతి ముఖంలోనూ నీ ఛాయలు కనిపించి ఉండవచ్చు నాకు !

ఆ ముఖా లన్నీ నీకు చూపుతానే అనుకో ! భరించుకో గలవా మరి నీవు ?

గత మది శ్మశానమే కద ? ఎందు కది మనకు ?
మృత పదార్థమె కదా గతము త్రవ్విన కొలది ?
వర్తమానము నుంచి పైన మగుటే సుఖము !
ముందె కల వానందములు అందములు చాల !

71

ఎందుకు వచ్చిందో నీ కంత కోపం !

కారణ ద్వారం లేని కోపగృహం లోకి నే నెలా ప్రవేశించగలను ?

ప్రారబ్ధం ఇలాంటిదే.

పూర్వజన్మలో చేసిన తప్పు లేమిటో తెలియవు జీవికి. ఈ జన్మలో మాత్రం ఘోరమైన శిక్షలు !

గత జన్మలో ఏ తప్పు చేసినందుకు, ఈ జన్మలో ఈ బాధ పడవలసి వచ్చిందో ?

స్పష్టంగా తెలియాలి జీవికి.

తెలిసినప్పుడే, అలాంటి తప్పు మరి జరగకుండా జాగ్రత్త పడగలగడం.

కారణం తెలియని శిక్ష అన్యాయం

కారణం తెలియని బహుమతి వ్యర్థం.

సృష్టి నిర్మాణ పథకంలో మౌలికమైన లోపం ఇదే.

సృష్టి ఎదగక పోవడానికి, మానవుడు పెరగక పోవడానికి ప్రధాన కారణం ఇదే.

నిర్గుణ బ్రహ్మ అగోచరం - ముత్యానికి మహాసముద్రంలా !

సగుణబ్రహ్మ వైయక్తికం - ఏ ముత్యాని కా హారధారి లా !

ఒకో ముత్యం ఒకో హారంలో చేరుతుంది. ఆ హారం ధరించిన మూర్తే దానికి ఆరాధ్య దైవం.

వ్యక్తికో భావం. భావానికో రూపం. రూపానికో రుచి !

రుచులు అనంతం.

ఒకరి రుచి మరొకరికి అరుచి !

పాపం, పుణ్యం, వ్యక్తి, దైవం - సామాజిక వ్యవస్థకు మూలస్తంభాలైన ఈ నాలుగూ ఎవరివి వారివే !

ప్రతివాడూ తన రుచే లోకరుచి అనుకొంటాడు. డబ్బా వాయించుకొంటాడు. దూకుతాడు కసిగా తక్కిన వాళ్ళ రుచుల మీదకు - డేగలా, గాలంలా, కత్తిలా, ఖడ్గమృగంలా !

ఏది పాపం ?

ఏది పుణ్యం ?

ఏ తప్పు కీ శిక్ష ?

ఏ సుకృతాని కీ బహుకృతి ?

దైవ స్వరూపం ఎట్టిది ?

విశ్వ ప్రణాళికలో మానవుడి ప్రయోజనం ఏమిటి ?

తెలియదు ఎవరికీ !

అందుకే ఈ అవ్యవస్థ !

ప్రతి పాపం ముందూ ఒక పరమార్థం, ప్రతి పుణ్యం వెనకా ఒక స్వార్థ చింతన, ప్రతి దేవుడిలోనూ ఒక స్వ - పర భేద కల్పన, ప్రతి మనిషి పట్లా ఒక అనుమాన దృష్టి !

జీవిత పరమార్థం తెలిస్తే

కర్మ స్వరూపం గోచరిస్తే

ఎంత బాగుండును !

ఎందుకు దాచబడిందో ఈ రహస్యం ?

ఏది ఏమైనా-

కారణం చెప్పకుండా శిక్ష విధించడం అన్యాయం - దైవం కానీ, ప్రభుత్వం కానీ, నీవు కానీ !

ఎందుకు వచ్చిందో నీ కంత కోపం !

ఈ పుష్య తమో విభావరిలా - ఎంత చలిగా, ఎంత చీకటిగా ఉన్నదది !

ఎంత అగమ్యంగా ఉంది మార్గం !

నా మిత్రులలో అన్ని రకాల వాళ్ళూ ఉన్నారు.

అందులో -

ఏ డబ్బా నీ చెవులు చిల్లులు పడ మోగిందో !

ఏ డేగ నీ భావంలో అసూయా క్రూర నఖాలను గుచ్చిందో !

ఏ గాలం మన గంగ్తా యమునా సమానంద సరస్వతిలో వేటకు దిగిందో !

ముళ్ళ మీద నిల్చి, చిరునవ్వులు వికసించగల వజ్ర సంకల్పం నీది.

హాలా హలాన్ని అంగుట్లో వంచుకొని, అర్ధాంగమై నిల్చిన అమృత హృదయం నీది.

అయినా -

ఎందుకు వచ్చిందో అంత కోపం !

అసూయ లాంటి కోపం !

అసూయ అగ్ని, పుట్టిన చోటనే దహించి వేస్తుం దది. జీవితంలో నేను భయపడేది ఒక్క అసూయకే !

నీ కోపం -

అసూయ కాదు కద ?

72

స్నేహము, ప్రేమ, రాగము, వ
శీకృతి, పూజ- సమస్త మాధురుల్
మోహినులైన కామినుల
ముద్దులతో కదు ధన్యమైన దీ
దేహము నాది ; నీ దయిన
దీ మధుమాసము నందు ! ఇంక నీ
ఆహవ భేరి వీడి, కుసు
మాహవ సాయక మందుకో గదే !

గర్వ కారణం కావలసిన ఈ పద్యం నిజంగా యుద్ధకారణ మయింది కదా మన మధ్య !

మనస్సు, హృదయం, ఆత్మ - వీటన్నిటికీ శరీరమే కదా ఆధారభూతం. స్నేహాది పరమగుణ మాధురీ మనోజ్ఞమైన అట్టి శరీరాన్ని నీకు అర్పించుకొన్నానంటే, అందులో తప్పేముందీ !

భేరీ సాయక పదాలు సంభోగ శృంగారాన్ని వ్యంజిస్తున్నాయా ఏమిటి?

శరీరం గల ఏ జీవికైనా - పరమభోగ్యమైన రసం శృంగారమూ, దాని విశ్రాంతి సంభోగమూ కాదా ?

అదే చెడ్డదైతే, ఇక జీవితంలో మంచి దేది ?

కామినుల ముద్దులు నీ కభ్యంతరమై ఉండవచ్చు. ఈ కామినులులోని గుణ మాధుర్యాలు. బైటి మామూలు స్త్రీలు కాదు.

నమ్మకం కలగడం లేదు కదూ నీకు ?

సరే, పోనీ, మాట వరసకు- వాళ్ళంతావాస్తవ కాంతలే అనుకొందాం.

అప్పుడు - మరీ ధన్యురాలవు కదా నీవు ?

అట్టి మధుర మోహన మూర్తులైన కామినుల ముద్దులతో ఆపాదమస్తకం ఆనంద పులకితమైన ఈ నా పవిత్ర దేహాన్ని - నీ ఆరాధనలో హారతి కర్పూరంగా వెలిగించుకొన్న నేను ఎలా దోషిని ?

ఎవరి వైనా - ప్రేమానురాగాలు పవిత్ర మైనట్టివే కద ? అట్టి అమృతసరంలో స్నానం చేసి, శుచినై నీ వద్దకు వచ్చి, నన్ను నీ కర్పించుకోవడం నీ గొప్పతనమే కాదా ?

ఆత్మాదులను గురించి ఎంత చెప్పుకొన్నా చివరికి ఎవవరికైనా కావలసింది శరీరమే.

ఏ స్త్రీకీ అక్కరలేని శరీరం నీకు మాత్రం ఎందుకు?

శ్రీరామున్ణి మరో స్త్రీ కోరకపోవడానికి కారణం, అతడికి సీత కూడా అక్కరలేకపోవడమే కద?

శ్రీ కృష్ణుణ్ణి అంతమంది స్త్రీలు కోరడానికి హేతువు అతడు విశ్వ ప్రణయకమూర్తి కావడమే కద ?

ఆత్మ గుణాల బాహ్య రూపమే శరీరం.

అందరూ కోరే వస్తువే విలువయింది.

అందరూ నన్ను కోరితే, నేను నిన్ను కోరాను.

అందరూ తమను తాము నాకు సమర్పించుకొంటే, నేను నన్ను నీకు సమర్పించుకొన్నాను !

అది కదా నీ ఆధిక్యత !

అదేనా నీకు కిట్టనిది ?

సీరి, లత, తులసి, శివరంజని, కృష్ణ, మంజీర, దూర్వ లాంటి వాళ్ళు ఎప్పుడో, ఎందుకో వస్తూనే ఉంటారు నా గదికి. వాళ్ళంతా నా కేలాంటివాళ్లో, నీకూ అలాంటి వాళ్ళే.

పూర్ణ సుందరివి - సామాన్యులతో నీకా పోటీ ?

నా- కోరికలే నీవు,
అవి - తీరుటయే నేను !
తీరే కొలదీ కోర్కెలు
ఊరుటె మనము!
నా - కై పూచే పూలు,
నను - పిలిచే కోయిలలు,
నను- తనిపే మధురుచులు,
నా - బ్రతుకే నీవు !
అడుగడుగున నను నిలిపే
అప్సరలే నీవు !
అనునిమిషమునను నడిపే
ఐందవివే నీవు.

73

అదా సంగతి !

నేను మంజీర ఇంటికి వెళ్ళినమాట నిజమే.

అయితే –

ఆ మాట నీకు చెప్పింది కూడా నేనే కద ?

అందులో రహస్యం ఏముందీ ?

ఏ రహస్యమూ లేదు నాకు.

నీ ముందే కాదు. మొత్తం లోకం ముందే నా జీవితం పరమనగ్నం.

శరీరం, హృదయం, మనస్సు, ఆత్మ, పరమాత్మ దాకా – ఏ విషయంలో దాచుకోవలసిం దేదీ లేదు నాకు.

అలంకారాలతో, అంగ రాగాలతో, రంగులతో, హంగులతో, వేష భాషలతో వివిధ లౌక్యాలతో కప్పి పుచ్చుకోవలసిన వికారాలు, నేరాలు, మచ్చలు, మురికి – ఏమీ లేవు నాకు ఎక్కడా, ఏ దశలోనూ !

నీ కంఠంలో నీడలా కనిపిస్తుంది – లోకానికి నా అంతరాత్మ – పరమ స్వచ్ఛంగా !

రాజకీయాలకు పనికి రాలేదు నేను అందుకే.

వైనతేయం, రసాలిని, నీవు – ముద్దులతో, విద్యలతో, పద్యాలతో నీ ఆరాధన – ఇదే కదా నా జీవితం బాల్యం నుంచీ ?

ఏ ఆచ్ఛాదనా లేనందువల్లనే, అప్పుడప్పుడు లోకం విసిరే మురికి, గుచ్చే ముళ్ళు, చల్లే నిప్పులు హృదయం దాకా తగిలి బాధిస్తై నన్ను.

లోకంలో బ్రతకాలనుకొన్న వాడికి ఏదో ఒక కవచం ఉండక తప్పదేమో !

సహజ కవచాలను కూడా వంచన చేసి ఒలుచుకుపోయే అహల్యాజారు లెంతమంది లేరు మన చుట్టూ ?

ఆశ్లేషయ్య ఎంతో శ్రేయోభిలాషిలా వర్తిస్తూ – నా గురించి మీ అన్న దగ్గరా, మీ అన్న గురించి నా దగ్గరా నీ విషయంలో ఎంత విషం క్రక్కాడో ఎరుగుదువు

కద ? అలాంటి విషనాగుల కాట్లకు ఎంతో మంది అమాయకులు బలైపోతూనే లేరా ప్రతినిత్యం ?

అలాంటప్పుడు -

కవచం కాదు కదా, బనీను కూడ ఒంటిమీద సహించలేని నావంటి వాడికి ఒక్క భగవంతుడే కదా దిక్కు ?

పాపం మంజీర !

లోక విషాదాన్నంతా తానే అనుభవిస్తూ, లోకానికి ఆనందం పంచ వచ్చిన హేమంత పూర్ణ చంద్రంలా ఉంటుం దామె వదనబింబం !

వీణ పలికిస్తే - వీణామండలమే దిగి వస్తుంది ఆమె వ్రేలి బుగ్గల లోకి ! నీ గాత్రానికి తోడులా, నీ గానానికి నీడలా ఉంటుం దది ఒకో క్షణంలో !

గజ్జె మ్రోయిస్తే- అప్సరో లోకమే అలా నిలబడి పోయి, కళ్ళప్పగించి చూడవలసిందే - ఊర్వశితో సహా ! రసాలినిలో, కొబ్బరి మొక్కలకు బీరపాదుల్ని ఎక్కిస్తున్న నీ వెంట - నీ అడుగులలో అడుగులు వేసుకొంటూ - నిన్ననుకరిస్తున్న మయూర బాలల బృంద నృత్యంలా మనో మోహనంగా ఉంటుందది !

అయితే - పాపం-

పాడుతూ, పాడుతూ మూగపోతుందామె వీణ !

ఆడుతూ, ఆడుతూ ఆగిపోతుందామె కింకిణి!

ఏ జన్మాంతరాల విషాదగాధలు జ్ఞప్తికి వస్తవో ! ఏ లోకాంతరాల వేదనా తరంగాలు గుండెకు తగులుతవో !

రెండు విఫల జన్మల మధ్య - ఏదో తెలియని స్ఫూర్తితో కఠోర తపం చేసుకొంటున్న అంబ జ్ఞప్తికి వస్తుంది నాకు, మంజీరను చూస్తుంటే !

అంబది పగ !

ఆమె జన్మాంతరం కూడ నాశనమై పోయిం దందుకే !

మంజీరది కరుణ !

కంఠం వరకు కన్నీటిలో మునిగి చేస్తున్న తపస్సు ఈమెది !

కరుణ రసానికి వర్ణచిత్రం ఈమె !

వీణను తోసేసి, గజ్జెను విప్పి పారేసి, వచ్చి కూర్చుంటుంది మంజీర నా ముందు, నన్ను చూడగానే !

ఎంత సేపైనా చూడాలనిపిస్తుంది నాకు ఆమెను అలా
ఏ జన్మాంతర మైత్రీ మాధుర్యమో ఇది !
పారోద్యానంలో కనిపించి, రమ్మంటే, వెళ్ళాను వాళ్ళింటికి మొన్న.
పాడమంటే పాడాను - నా కోరికలే నీవు - అంటూ !

" శివ ధనుస్సును సీత ఎత్తి పడవేసినట్టు - మీ రాతిగుండెను వీణలా మీట గల్గిన ఆ రాగ సరస్వతి-ఆ వైశాఖి-ఎంతటి మహా మహితాత్మురాలో ! ఆ మీ రాగ పూర్ణిమను ఒక్కసారి మాకు చూపరా ? " అన్నది మంజీర - కళ్ళు తుడుచుకొంటూ.

అపార్థం చేసుకోకు ఆమెను.
అసూయకు చోటివ్వవద్దు లవలేశమూ.
నీవు నన్ను వలె -
ఆమె ఎవర్ని వెతుక్కొంటూ వస్తున్నదో !
ఆ ఎవరు - నేనే ఎందుకు అవుతాను ?
అయితే మాత్రం ఏం ?
ఆముదపు చెట్టువు కావద్దు నీవు.

నీవు మహా బోధివి అయినప్పుడే - మహా బుద్ధుడికే కాదు, మహా విశ్వానికే ఆశ్రయం కాగలవు. ఆనందం పంచిపెట్టగలవు. అమృత పదవిని అందుకోగలవు.

నీవు కా దటే-
నీడ నాకు పట్టినది ?
మురళీధరు నైనప్పుడు
మోహన బృందావని వై,
బుద్ధుడ నే నైన నాడు
బోధివి నీవు కాదటే ?
ఋషిబాలుడ వైనప్పుడు
ఋక్కుతల్లివై నన్ను
బృహదారణ్యక మధువుల
బహు ముఖముల పెంచినది?

రస కోకిల నైనప్పుడు
రాగ రసాలినివై, నా
అఖిలానంద లవాలకు
అమృతార్ణవ మైనట్టిది ?

74

దుస్స్వప్నాలు !

కన్ను మూస్తే చాలు - చీకటి పడిందే తడవుగా వంటగదిని ముట్టడించే ఎలుకల వలె చుట్టుముడతై నన్ను - దిక్కుమాలిన దుస్స్వప్నాలు !

నేను మేల్కొని ఉండగా - ప్రాపంచికమైన ఎట్టి పనిలో, పరిస్థితిలో ఉన్నప్పటికీ - అందమైన, ఆనందకరమైన భావాలే పరివేష్టించి ఉంటై నన్ను ! నీలో, నీతో విహరిస్తూ, రమిస్తూ ఉంటుంది నా మనస్సు నిరంతరం !

అలాంటి సుందర మనస్థితి కల నాకు - ఎందుకో ఈ వికృత విభీకర స్వప్నస్థితి !

దొంగలకు, దుష్టులకు స్వప్నాలే రావట ! ఎంత అదృష్టవంతులో అట్టివాళ్ళు ! కొందరికి యథాతథంగా, మరికొందరికి వ్యతిరిక్తంగా స్వప్నాలు నిజమౌత వట ! మా చెల్లెలు ద్రౌపది అంటుంది. తన స్వప్నం యథాతథంగా నిజమౌతుందని ! ఆమె నిరంతర పూజాపరాయణ ! బ్రహ్మచారిణి ! స్థిత మనస్కు ! ఆమె అనుభవాన్ని కాదనడం ఎలా ?

కాని -

నా స్వప్నాలు ఎలాంటి శుభా శుభ ఫలాలను సూచించవు !

స్వప్నాలు మనస్థితికి దర్పణా లంటారు కొందరు.

నా విషయంలో అది కూడా విపరీతమే !

అపకారికి కూడ ఉపకారమే చేస్తాను నేను. అసూయ, ద్వేషం, మాత్సర్యం, పగ వంటి వైరగుణా లేమీ లేవు నాకు. పశ్చాత్తాప పడవలసిన పనే చెయ్యను నేను. సౌందర్యం, ప్రేమ నా కుడి ఎడమలు ! దయ, ధర్మం నా ముందు వెనుకలు; తపస్సు, ఆరాధన నా క్రిందు మీదులు. నా కళాపారమ్య సిద్ధి రాగసరస్వతి. అదే నీవు! అదే నేను !

ఇంతటి ఊర్ధ్వ కళా సంశోభిత సర్వ శుక్ల మనస్థితి కల నాకు - కన్ను మూస్తే ఎంతటి భయంకర భూత యాతన !

మెలకువ లోవి పగటి కలలు, నిద్రలోవి రాత్రి కలలు.

పగటి కలలు ఫలిస్తై, రాత్రి కలలు పీడిస్తై నన్ను !

ఈ పీడకలలు తెల్లవార్లూ - దోమల్లా, నల్లుల్లా పీడించి పీడించి - పాముల్లా, పులుల్లా జడిపించి జడిపించి - ఎడారుల్లో, శ్మశానాలలో త్రిప్పి త్రిప్పి - ఏదేదో గడ్డి తినిపించి తినిపించి - మెలకువ రాగానే దొంగల్లా పారిపోగా-

ఉదయం లేచేటప్పటికిఎంత నిస్సత్తు వని !

జీవుడు ఎన్నో నికృష్ట జన్మలెత్తి, మళ్ళీ మానవ జన్మలో ప్రవేశించినట్టు ఫీలవుతాను నేను - పీడ కలల నుంచి మేల్కొన్న ఆ క్షణంలో !

కావచ్చు !

ఎందుకు కాగూడదు?

జీవయాత్రా పథంలో, చివరి భాగంలో, కవి - యోగి దశల నడుమ ఉన్నాను నేను. సవికల్ప రాగ భోగంలో ఉన్నా ననవచ్చు. నిర్వికల్పానందానికీ, నాకూ ఎంతో దూరం ఉండదు.

ఇంతటి ఉన్నత అంతస్తు మీద ఉన్న జీవుడు - ఏవో కొన్ని స్వల్ప కర్మలను పదిలించుకోవడం కోసం ఎన్నో అంతస్తులు క్రిందికి దిగిపోవలసిందేనా ?

ఇలాంటి కంటింజెన్సీల కోసం, కాల కృత్యాల కోసం ఎక్కడి కక్కడే కొన్ని ఏర్పాట్లు, మినహాయింపులు ఉన్నై సృష్టి సంవిధానంలో. అందులో ఒకటి స్వప్న దశ.

నేరం చిన్నదైనప్పుడు, జైలు అవసరం లేకుండా, వార్నింగుతోనో, జరిమానాతోనో దానిని పరిహరించడం లాంటిది - కర్మ స్వల్పమైనప్పుడు, జన్మ అక్కర లేకుండా, స్వప్నంతో దానిని నివారించడం !

ఎంత మంచి ఏర్పాటు !

నా విషయంలో నా కనిపిస్తుందీ - ఎన్నెన్నో నికృష్ట జన్మల కర్మను ఈ జన్మలోనే స్వప్న రూపంలో అనుభవించి వేస్తున్నానని ! భావిజన్మల దుష్కర్మనే కాదు - ఈ జన్మ లోనే వాస్తవంగా జరగవలసి ఉన్న ఎన్నో దుస్సంఘటనల కర్మను కూడ స్వప్నస్థితి లోనే అనుభవించి వేస్తున్నానని !

రైల్లో బెడ్డింగు పోయినట్లు, ఎంత వెతికినా కనిపించనట్టు, ఈ లోగా దిగవలసిన స్టేషను దాటిపోయినట్టు, పరీక్ష నాశనమై పోయినట్టు - చచ్చినంత ఆందోళనతో మెలకువ వస్తుం దొకోసారి ! అదంతా వట్టి కల అని తెలిసినా, గుండె దడదడ లాడుతూనే ఉంటుంది చాలాసేపటి దాకా !

వాస్తవంగా రైల్లో బెడ్డింగు పోవలసి ఉన్న కర్మ కాస్తా విమోచనమై పోయిందన్న మాట ఈ పీడకలతో !

స్వప్నం కొద్ది క్షణాలే అయినా, అనేక సంవత్సరాల, జన్మల దీర్ఘ వ్యధను అనుభవిస్తాడు జీవుడు ఆ కొద్ది కాలంలోను !

అయితే - దుష్కృతం కొద్దిగా ఉండి, సుకృతం అపారంగా ఉండే నావంటి వాళ్ళకే ఈ మినహాయింపులు.

ధర్మరాజు ముందుగా నరకాన్ని దర్శించడం లోని రహస్యం ఇదే.

నా దుష్కర్మ అంతా ఇలా దుస్స్వప్న రూపంలో దూరీ కృతమైపోగా - స్వచ్ఛంగా, స్వేచ్ఛగా నీతో కలిసి, చివరి అంతస్తు వరకు పోగలను నేను.

దుస్స్వప్న మంటే భయం లే దిప్పుడు నాకు.

సుఖ స్వప్న మంటేనే భయం - రాగల సుఖం కాస్తా వాస్తవ రూపం ధరించకుండా స్వప్నమాత్రమై పోతోందేమో నని !

చెడ్డ అంతా స్వప్నంగా పోవాలి.

మంచి అంతా వాస్తవంగా వికసించి, ఫలించాలి.

ఇదీ నా కోరిక !

అందుకే - అంత చెడ్డ కల నీ గురించి వస్తే - కలలో ఎంత ఏడ్చానో, మేల్కొని అంత సంతోషించాను !

కలలోనె కరగిపోవలె ఎల్ల చీకటులు,
వెలుగు లెల్లను లేచి విరియవలె నా నింద !
అపడు నా తనువె సమ్యక్సుంద రోషస్సు,
అప్పుడు నేనే నీకు ఆనంద సుమనస్సు !

75

" స్త్రీ హృదయం తెలుసా మీకు ? "

ఉలిక్కిపడి చూశాను తలెత్తి !

హేమంత పోతూ పోతూ, శిశిరం ఒడిలోకి విసిరి పారేసింది నన్ను బహు క్రూరంగా ! కొయ్యబారి పోయాను నేను - ఆ అమావస్య కటిక చీకటి గుండా దూసుకు వస్తూ ! ఆ హేమంత శిశిర సంధ్యాశూన్యత లోదే నిన్ను గురించిన ఆ నా దుస్స్వప్నం ! అది మళ్ళీ మళ్ళీ నెమరుకు వస్తూ ఉండగా- పరధ్యానంలో మైమరచి ఉన్న నేను -

ఉలిక్కిపడి చూశాను తలెత్తి !

ఎదురుగ్గా - సీరి !

కొంటె చూపులూ, చంటి నవ్వులూ కలబోసి, నా ముఖం మీద - చిలకరించిం దామె ! తేరుకొన్నాను నేను !

" ఏ దుష్యంతుణ్ణి గురించి ఈ పరధ్యానం ? "

ఎంత హేళన !

నా వద్దకు వచ్చిన ఆడవాళ్ళను - కబుర్లు చెప్పి, కాఫీ ఇచ్చి పంపించేస్తా నని - సిటీ అంతా యాగీ చేసింది ఈమే కదా ?

సిటీ అంతా ఆమె వెంట పడితే, ఆమె నా వెంట పడింది ! ఏం జేసుకోను నేను ?

"సంవత్సరాల తరబడి మీ వెంటబడి తిరుగుతున్న స్త్రీని అర్థం చేసుకోలేని మీరు....." మనిషేమి టన్నట్టు చూచిం దామె నా కళ్ళల్లోకి !

" నీ మీద పడి రాసుకు తిరుగుతుందామె. నీవు అర్థం చేసుకోవడం లేదని ఏడుస్తూ ఉంటుందెప్పుడూ. నాకు చేతి కందేటంత దగ్గరలోకైనా ఆమె రాగల్గితే..." లొట్టలు వేస్తాడు ఒక మన్మధసూరో, ఒక దేవేంద్రో - ఆమెను తలంచు కొని !

అది నాకు గర్వకారణమే !

కాని-

నీవు ఇంకా లభించి ఉండకపోతే - నీ అన్వేషణా యాత్రలో ఆమె కూడ నా కొక మజిలీ కాగలిగి ఉండేదో ఏమో !

అరుణోదయం తర్వాత దీపంలా, అమృతం తర్వాత నారింజ రసంలా, శ్రీ లక్ష్మి తర్వాత శశికళలా వచ్చిందామె నా వద్దకు !

దేన్ని చూస్తే మరి దేన్నీ చూడనక్కరలేదో, దేన్ని అనుభవిస్తే మరి దేన్నీ అనుభవించ నక్కరలేదో - ఆ నిన్ను నా దాన్ని చేసుకొన్న తర్వాత - సీరి వంటి తృణ శలాకలు నన్ను ఎలా ఆకర్షిస్తై ?

అరిసెలు తిన్న నోటికి అట్లు రుచిస్తవా ?

భీముణ్ణి రంజించగలది ఒక్క హిడింబా రాగ సుందరే !

దురదృష్టవంతురాలు సీరి !

నేను మహా మేఘుణ్ణి.

నీవు సౌదామనీ రాగలతవు.

సీరి ఒక వరిమొక్క మాత్రం !

" ఎన్ని తెలిసినా, స్త్రీ హృదయం తెలియకపోతే, ఏమీ తెలియనట్టే "అన్నది కాఫీ తాగుతూ !

నేను సహించలేని భావం అది !

" పురుష హృదయం తెలుసా నీకు ? " ఎదురు ప్రశ్న వేశాను నేను.

అదేం ప్రశ్న - అన్నట్టు చూచిం దామె - ముఖాన్ని మఖలా ప్రశ్నార్థకం చేసుకొంటూ !

పురుషుడికి హృదయ మేమిటి ? అది తెలియడ మేమిటి ? హృదయం స్త్రీ ధనం ! అది ఆమె జన్మహక్కు ! అందువల్ల -

నా హృదయం ఆమె గుర్తించ నక్కర లేదట ! ఆమె హృదయం నేను గుర్తించి, దాని అడుగులకు మడుగు లొత్తాలట !

నిన్ను నేను ఎరిగి ఉండకపోతే - ఆ హృదయం అనేదేదో స్త్రీకి కూడా లేదని వాదించి ఉండేవాణ్ణే !

మగవాడి హృదయానికి నేనే ప్రతినిధిని. స్త్రీ హృదయం ఒక వరద గోదావరే కావచ్చు. పురుషుని హృదయం ఒక మహా గంభీర పయఃపారావారం !

స్త్రీకి హృదయం ఉంది. చూశాను దాన్ని నీలో !

హృదయ రీతుల వైవిధ్యాల మీమాంసే వద్దు మన కిప్పుడు.

స్త్రీ హృదయం కమలం.

పురుష హృదయం రవి.

కమలాలు అసంఖ్యాకం.

రవి ఒక్కడే !

ప్రతి కమలానికీ రవి ఒక్కడే !

ప్రతి కమలమూ రవికి తా నొక్కతే !

రవి కిరణం ఒక్కొక్కటి ఒక్కొక్క మూర్తి. ఆ మూర్తే పూర్ణ రవి ఆ కమలానికి !

ఒక కమలానికి ఒక కిరణం చాలు.

అనంతానంత కోటానుకోటి కమల హృదయాలకు రవి ఒక్కడే ప్రాణపతి !

సహస్ర కమల సమాహార మహా పరమ సుందరి నీవైనప్పుడు - సహస్ర కిరణ సమాధార మహా పరమాత్మను కాకుండా ఎలా ఉండగలను నేను ?

పురుషుణ్ణి అర్థం చేసుకోడానికి నిరాకరించే స్త్రీని ఏ పురుషుడు మాత్రం అర్థం చేసుకోగలడు ?

పోనీ-

అర్థం చేసుకోలేకపోతే, ఏం ?

తనను నేను అర్థం చేసుకోలే దంటుంది సీరి !

అర్థం చేసుకోవడ మంటే, తనకు ఇష్టమైన రీతిలో నడుచుకోవడం !

నా ఇష్టం మాత్రం ఆమెకు అక్కరలేదు !

ఎంత స్వార్థం !

అయితే ఒకటి -

పురుషుణ్ణి అర్థం చేసుకొన్న స్త్రీ అతణ్ణి రాజు చేసి, తాను రాణీ అవుతుంది.

స్త్రీని అర్థం చేసుకొన్న పురుషుడు ఆమెను దాసీ చేసి, తాను యజమాని అవుతాడు !

ఇదొక పరమ రహస్యం !

పురుషుడు గుర్రం

స్త్రీ రౌతు

గుర్రాన్ని యధేచ్ఛగా పోనివ్వాలి.

కళ్ళెం మాత్రం వదలకూడదు.

అప్పుడే ఆ జంట పరమానంద పారమ్యం అందుకో గలదు.

ఏ స్త్రీ అయినా, ఏ పరిస్థితిలో అయినా, కళ్ళెం బిగించిందో -

పడిపోతుం దామె తక్షణం - ఆనందస్వర్గం నుంచి వైఫల్య వైతరణి లోకి ! తరచు - గుర్రంతో సహా !

రౌతుకు గుర్రమే ఆధారం.

ఇదొక మహా రహస్యం !

పెట్టమారి మగడు మగనాలి ప్రేమకు ఎలా అర్హుడు ?

అర్థం కాదు సీరికి !

మనం పరస్పరం అర్థం చేసుకొన్న వాళ్ళం.

కనుకనే -

అర్ధనారీశ్వరులం !

అమృత శక్తులు కల్గు అశ్వమే మగవాడు,
అశ్వ హృదయము తెలిసినట్టి దే మగనాలు !
ఆనందలీలా విహార యాత్రకు గాక,
అంగటికి పోవగా అశ్వమేలనె, చెలీ ?

76

ఎవరు నీవు?

జన్మ జన్మాలుగా నా వెంట వస్తున్నది - బాల్యం నుంచీ నేను వెతుక్కొంటు న్నది- నా సంగీత సాహిత్యాలకు ఆపాత మధురంగా ఆలోచనామృతంగా భాసిస్తున్నది - ఎవరు ?

నీవు కావా ?

సమస్త సౌందర్యాలకూ పీఠస్థ దేవతవు, పరిపూర్ణ సుందరివి, నా హృదయైక రాగేశ్వరివి కావా నీవు ?

అయితే -

మరి, ఈ అసూయ లెందుకు ?

జీవనదీ సుందరికి నీటి బోదెలపై అసూయా ?

మన ప్రేమస్వర్గానికి నిప్పు పెట్టదలచిన నరకాసుర బలాన్ని మట్టుపెట్టి, సాంఘిక దురహంకారాన్ని పూడ్చిపెట్టి, అమావస్య గాఢ తమస్సును లక్ష ఆశా జ్యోతులతో వెలిగించి, అక్కడ బందీ చేయబడ్డ సహస్రాధిక జీవన మాధుర్యాలకు విముక్తి కలిగించి, కార్తిక బాల చంద్రికలతో నన్ను అలంకరించిన అపరసత్యవు కదా నీవు ?

ఒక్క రుక్మిణిపై అసూయతో భర్తను తన్నిన సత్యే, పద హారు వేల మంది రాజకన్యల్ని విడిపించి భర్త కివ్వగలిగిన సత్య !

సత్య కంటె, రుక్మిణి కంటె, రాధ కంటె కూడా అపూర్వ ప్రణయానంద ఘనతను సాధించిన ఉజ్వల వతివి నీవు !

ఒక మహా బడబానలం నుంచి ఉద్ధరించిన నీవే, మరో భీకర విలయంలోకి విసిరి వేస్తున్నావెందుకు నన్ను ?

" ఎవరు చెప్పారు మీకు, నే నసూయ పడుతున్నానని ? " అంటావు కదూ నీవు ?

ఎవరు చెప్పాలి ?

మనో వైఖరులు ముఖ పద్మంపై వెలుగు నీడలై ప్రవవర్తిల్లవా ?

అసూయలు అంతరంగాన్ని ఉడికించేస్తే. ముఖపద్మాన్ని మాడ్చి వేస్తే ! చిరునవ్వులు మాయ మవుతై. లావణ్యం ఇంకిపోతుంది. ఔజ్జ్వల్యం నశిస్తుంది. ఆకర్షణ పోయి, వైముఖ్యం పెరుగుతుంది. అంతటితో ఆ మనస్సు నుంచి, ముఖం నుంచి - ప్రేమానురాగాలు, శృంగార వైభవాలు, ఆనంద రసాలు చెప్పకుండానే పారిపోతై ! మిగిలేది శిశిరమూ, చిరాకులూ !

అందుకే చేరనివ్వ గూడదు అసూయలను దగ్గరకు.

తియ్యగా వస్తై అవి ఆశ్లేషయ్య నవ్వుల వలె !

తియ్యటి నవ్వుల్లో ఎంత విషం, ఎంత కుట్ర !

సరాసరి మనస్సు లోకే పోతై అవి పుట్టింటి చుట్టాల్లా !

ఆ తర్వాత ఆ మనస్సు దెయ్యాలకొంపై పోతుంది. ఆ ముఖం పిశాచాల వంటగదై పోతుంది. ఆ జీవితం విశ్వస్థ చాకిరీ ఐపోతుంది.

నేను భయపడేది వీటికే.

మన స్నేహాన్ని నిరోధించిన మీవాళ్ళను, మా వాళ్ళను, మన మిత్రులను, సమాజాన్ని కూడ ఎదిరించి నిలవగలిగాం మనం. అంత వరకూ వస్తే, ధిక్కరించి పారేశేవాళ్ళం కూడ.

సంస్కారం, స్వాతంత్ర్యం, లోకజ్ఞత, త్యాగం, అనురాగం అపారంగా కల అదృష్టవంతురాలవు నీవు. ఈ మహా సంపదతో బైటి శత్రువుల్ని చిత్తు చేసి పారెయ్యవచ్చు చిటికలో. జీవించవచ్చు సుఖంగా, స్వేచ్ఛగా - లోకాన్నే ధిక్కరించి!

కాని -

అంతశ్శత్రువులు అసూయలు

మహా భయంకరాలు అవి !

సర్వ నాశంకరాలు అవి !

వద్దు మనకు అసూయలు

అనురాగ జీవితరంగంలో ఆనందపూర్ణ వైశాఖివి నీవు.

ఎన్ని సౌందర్యాలైనా నీ రాగవర్యలే ! ఎందరు కుసుమబాలలైనా నీ రాగలీలలే ! ఎంత ఆనంద పారవశ్యమైనా నీ రాగరస్యమే !

ఎవరు మించిపోయిరి నిను

ఎందుకే అసూయ ?

నవ్వవేలనే ఎదలో

నవ రాగము విరియ !

రాగ సాగరమె నీకు

భోగ తల్పకము కాదటె ?

భోగి భూషణుడె నీకై

యోగ మూర్తి కాడటే ?

విరిసిన ఏ పువ్వైనా
మెరిసిన ఏ మబ్బైనా
ఉర్వికి రాలేదేనే
ఉండే దొక నీవేనే !

77

కమ్మగ పాడవచ్చిన పి
కమ్మును నేను ; రసార్ణవాంతరం
గమ్ము మధించి తెచ్చిన సు
ఖమ్ములు పంచుదు నిందు ; ఈ పువుం
గొమ్మల నీడలో కలిసి
క్రోలక - నెచ్చెలులార ! ఏల ద్వే
షమ్ములు పెంచుకొంద్రు కల
శమ్మునకై ? సుధ లొల్కబోతురే ?

సహజమైన పాట పికానిది
నేర్చుకొన్న విద్య కాదది.

నేర్చుకొన్న దానిలో నూతనత్వం ఉండదు. చిలుక పలుకులు ముచ్చటగా ఉండవచ్చు, కోకిల పాటలు అమృత స్రవంతులు.

ప్రతిభ, వ్యుత్పత్తి, అభ్యాసం - ఈ మూడూ ముఖ్యమే జీవిత విజయానికి.

అయితే -

వ్యుత్పత్తి, అభ్యాసం - ఇవి జీవితాన్ని నడిపించేవి మాత్రం.

జీవితాన్ని సృష్టించగలది ప్రతిభ ఒక్కటే !

ప్రతిభాజన్య మైన జగత్తును అర్థం చేసుకోవడం వ్యుత్పత్తి, ఆ అర్థాన్ని తిరిగి చెప్పగలగడం అభ్యాసం.

సహజ గానం పికానిది.

సహజంగా పుట్టేదే ఏ కళ అయినా.

వికసిస్తుం దది దేశకాల పరిస్థితులకు అనుగుణంగా.

వైశాఖంలో ధగధగ లాడిపోయే ఆకాశమే, మబ్బులు కప్పుకొని మూలుగుతుంది శ్రావణంలో, పొగమంచు శవపేటికలో జీర్ణించి పోతుంది మార్గశిరంలో !

ఆకాశమే దక్ష ప్రజా పతి !

చిత్రా విశాఖలు విశ్వైక మోహినులు !

షసంత రాకా సుధాకరుడే ఈ పుంస్కోకిల ! విశ్వమోహనంగా పాడవచ్చిన ఈ పికం !

ఆనంద రసార్ణవాన్ని మధించి తీసిన గాన సుధా సారాన్ని గొంతు దాకా నింపుకొని వచ్చి కూర్చున్న దిది - రసాలినిలో, మధూదయంలో.

అందరికీ చాలుతుందీ అమృత రసం

అక్షయం ఈ కలశం.

ఎప్పుడు, ఎవరికి, ఎంత కావాలో అప్పుడు, వారికి, అంతా లభిస్తుంది ఈ ఆనందసుధ !

పోటీ పడనవసరం లేదు

క్యూలో నిలబడ నక్కరలేదు

లభించదేమో అన్న భయం లేదు

ఒక చెట్టు క్రిందనే గుమిగూడాలని లేదు.

ఏ చెట్టు క్రింద నిల్చున్నా, ఏ కొండ మీద కూర్చున్నా, ఏ సాగరంలో ఈదుతున్నా - అందుతుం దది.

ఏ వేళ వచ్చినా దొరుకుతుం దది.

హృదయాల నిండా, జీవితాల నిండా - జన్మ జన్మాలకు సరిపడేం తగా - క్రోలవచ్చు దీన్ని అందరూ !

ఇంకెందు కీ పోటీలు ?

ఇంకెందు కీ కీచులాటలు ?

ఇంకెందు కీ అసూయలు ?

కలశం కోసమా ?

ఆ కలశం అక్కడున్నప్పుడే, అందరి కన్ని రూపాలుగా అమృతం అందిస్తుం

దది ! ఎవరి మట్టుకు వారే దాన్ని లాక్కోవాలని పోరుకు దిగితే - అమృతం ఒలికిపోదా ? కలశం పగిలిపోదా ?

రాగవతీ !

చూస్తున్నావుగా లోకాన్ని ?

వట్టి కలశం కోసం ఎంత పోరాటం !

పగల గొట్టేస్తా రేమో దీన్ని చివరకు !

ఎగర గొట్టేస్తారేమో పికాన్ని పాడకుండానే !

జారి పోతుందేమో వసంతం తిరిగి హేమంతంలోకి !

కలుగ జేసుకో - సమయం మించిపోకుండానే !

అందుకో అమృత భాండాన్ని

దాచేసుకో హృదయ పద్మంలో

పాడుకొంటాను నేను అక్కడి నుంచి, నిరాటకంగా, నిత్యనూతనంగా, భ్రమరంగా నైనా !

78

"అమ్మా !

" మా ఒక తాతయ్యకు ఏడుగురు భార్యలు - అవరుద్ధలూ, యాదృచ్ఛికలూ కాక "

" లోకం ఆశ్చర్యపడవచ్చు ఈ మాట విని. లోకానికి తెలియని అచ్చట్లు, ముచ్చట్లు ఎన్నో ఉన్నై మన గ్రామ సీమల్లో.

" మరి, శాసనా లెలా అంగీకరించా యంటే - అప్పటికి ఈ కలి శాసనాలు పుట్టుకు రాలేదు.

" మరో తాతయ్యకు కూడా ఏడుగురు భార్యలే. అయితే, అతడు ఏక పత్నీ వ్రతుడు.!

" అంటే - ఒకతె చనిపోతే మరొకతెనుగా చేసుకొంటూ వచ్చాడన్న మాట. ఒకొక్క బిడ్డను కని చనిపోతూ వచ్చారు. ఏడోది కూడ చనిపోయేటప్పటికి అతడికి తొంభై దాటినై !

" ఈ ఇద్దరి తాతయ్యల విషయం లోనూ, ఆడవాళ్ళు ఇష్టపడి వచ్చినవాళ్లే. హృదయాలను కూడ సమర్పించుకొన్న వాళ్ళే ! "

" ఒక్క రెండో తాతయ్య విషయం తీసుకొన్నా ఆ ఏడుగురూ అగ్నిసాక్షిగా పెళ్ళాడిన అర్ధాంగులే. పతివ్రతలే. జన్మ జన్మాలు అతడే భర్త కావాలని కోరుకొంటూ చచ్చిపోయిన వాళ్లే !

" ఆత్మ, పరమాత్మ, జన్మ జన్మాంతర వాసన, వాంఛ, మోక్షం వంటి ఆర్ష ధర్మ ప్రణాళిక లోని సత్యాలను - లోకమంతా ఆమోదించిన ఉపనిషద్గీతలను ఖాతరు చెయ్యని వాళ్ళను అలా వదిలేద్దాం.

" తాతయ్యా, ఆ ఏడుగురూ మోక్షం పొందేస్తే సమస్యే లేదు. కాని, వాళ్ళు అంతటివాళ్ళు కాదు "

" వాళ్ళంతా తిరిగి జన్మ ఎత్తితే - ఆధ్యాత్మికత నశించిన ఈ మానవతా యుగంలో - ఏమిటి గతి ?

" వాళ్ళందరికీ భార్య హోదా రావాలంటే, వాళ్ళు ఒకళ్ళ తర్వాత ఒకళ్ళుగా మళ్ళీ చావక తప్పదా ?

" అందరూ ఏక కాలంలో భార్యలుగా ఎందుకు బ్రతకగూడదో - తాము కోరుకొన్న అతడితో ? "

" ఏ స్త్రీ అయినా ప్రేమించిన వాణ్ణే పెళ్ళాడడం ధర్మం కాదా ? చట్టం ద్వారా దాన్ని నిషేధించడం స్త్రీ పాతివ్రత్య ధర్మాన్నే విచ్ఛిన్నం చెయ్యడం కాదా ?

" స్త్రీని ఇలా ఎందుకు హింస పెడుతున్నారో నేటి సంఘపెద్దలు ? "

" మణిశిల లాంటి వాళ్ళే ఆదర్శ స్త్రీలా లోకానికి ? "

" ఆర్షధర్మం ఏమైపోయినట్టు ? "

" స్త్రీ సాంగత్యమే మూల పాపం అన్న అజ్ఞానుల కృతక శాసనాలను తెచ్చి మనపై రద్దుతున్నా రెందుకు మన పెద్దలు ? "

" ప్రశ్న లడుగుతున్నది స్వర్ణలత లాంటి ఆధునిక విద్యావతులే కాదు, మా దొడ్డమ్మ లాంటి సనాతన ఆచారవతులు కూడ ! "

" ఇదంతా తెలియని దాన్ని కాదు నేను "

" నాకా అసూయలు ? "

" నేను పుట్టక ముందు నుంచీ, మీరు పుట్టినప్పటి నుంచీ, మిమ్ము ఉత్తేజపరుస్తూ వస్తున్న ఉజ్జ్వల రాగదేవత లందరూ నా అంశలే కారా ?

" నా అంశల పైనే నాకు అసూయా ?

" పోనీ - వాళ్ళందరూ వాస్తవ వ్యక్తులే అనుకొందాం ! సీరి, శివరంజని, మంజీర, దూర్వ వంటి వాళ్ళ వలెనే - రాగజ్యోతి, రాగప్రభ, రాగలత, రాగవీణ, రాగలక్ష్మి వంటి వాళ్ళు కూడ కేవల భావప్రేరణలే కాక, మీకు వాస్తవ ప్రియురాండ్రే అనుకొందాం ! అయితే, ఏం ?

" ఎందుకు అసూయలు నాకు ? "

" సామాన్య స్త్రీని నేను "

" ప్రజ్ఞానబ్రహ్మ మీరు "

" రాగ అనే రెండక్షరాల విశేషణంతో - విశ్వసౌందర్య విక్షేపంలోని ప్రతి రమ్యతా నేనైపోతున్న అదృష్టాన్ని నా కిచ్చిన మీ పట్లనా అసూయలు ?

" కుటుంబ సంబంధమైన చిక్కులు నా ఆలోచనల్ని పీడించినప్పుడు, ముఖం లోని నా అన్య మనస్కత అసూయగా కనిపించి ఉండవచ్చు మీకు.

" లేక-

" మనం ఎగ్జిబిషనులో తీయించుకొన్న ఫోటో పట్టుకుపోయి, నన్ను చింపేసి, మిమ్ము మాత్రమే జాకెట్టులో దాచుకొన్న సీరి - నాతో ఎంతో స్నేహంగా ఉంటూ, మీరు నాకు వ్రాసిన లేఖలను తీసుకుపోయి కాల్చి పారేసిన మేఖల - లాంటి వాళ్ళు నన్ను గురించి చాడీ లేమైనా చెపుతున్నారేమో మీకు !

" వాళ్ళను నేనేమీ అనడం లేదు. వాళ్ళ ప్రేమ గాఢత అలాంటిది కావచ్చు "

" ప్రేమ ఎంత గాఢంగా ఉంటే, దాని ప్రక్క అసూయ కూడా అంత దట్టం గానూ ఉండవచ్చు - వెలుగు ప్రక్క నీడలా "

" కాని -

" నా ప్రేమ స్వప్రకాశ సుందరం. దీనికి ఏ నీడలూ లేవు "

" మనకు ప్రమాదం తేగల వాళ్ళు మన చుట్టూ తిరిగే వాళ్ళేగా ?

" నమ్మవద్దు వాళ్ళ మాటలు "

" మాఘ స్నానాలు మొదలు పెట్టింది మా దొడ్డమ్మ.

" రసాలినికి ఎగువలో, అశోకధార దగ్గర మా స్నానాలు !

" శివరాత్రికి శ్రీశైలం వెళ్ళవలసి రావచ్చు. ఇప్పటి నుంచే బెంగగా ఉంది నాకు ! "

" ఏది ఏమైనా–

" మీతో పూర్ణైక్యం పొందిన నాకు, మీలో లేని ఏ దోషాన్నీ ఆపాదించవద్దు. మీలో ఉన్న దోషాలను కూడా నన్ను సోకనీయవద్దు. మీ రొక గులాబి చెట్టు, తామర కొలను, మహా సముద్రం. నేను కేవలం గులాబి మొగ్గను, పద్మకళికను, అనావిద్ధ రత్నాన్ని. మనిద్దరం ఒక్కటి కాదు. పునాది నుంచి శిఖరం దాకా ఆలయం సమస్తం మీరే. మీ హృదయాంతఃపురంలో పూజ లందుకొనే రాగేశ్వరిని నేను "

" మీ ప్రాణం నేను

" నా స్థానం ఎప్పటికీ నాదే !

" రేపు వస్తున్నాను – ప్రత్యేకంగా ! "

నీలోని ఒక రాగలీలా లవము నేను !
నీ నుండి ఎగసి, ఈ నింగిలో విరిసేను !
నా వెలుగు నీ దర్శన ప్రాప్తి కోసమే !
నా బ్రతుకు నీ స్పర్శన స్ఫూర్తి సౌఖ్యమే !

79

" ఎంత సేపు చూశానో ఎదురు తెన్నులు !

" నిర్ణీత సమయ నిర్నిద్రత లేని చెలి, నెచ్చెలుల కెంతొ చింతను గూర్చు – అంటూ మధుబాల నించిన కన్నీటి బిందువులో సుళ్లు తిరుగుతున్న అప్పటి నా ముఖాన్ని మీరు చూడగల్గితే !

" చూశాను – చూశాను – చూశాను – చూశాను

" ఎంతసేపు చూశానో ఎదురు తెన్నులు !

" ఒకనాడు – మీరు కూడ పొందిన ఈ బాధ ఎంత దుర్భరం !

" మీ వదనంపై రెపరెప లాడవలసిన ఈ సంజకెంజాయ చీరపైట చెంగుకు కన్నీళ్ళొత్తుకొనే ఉద్యోగం దొరికిం దిన్నాళ్ళకు.

" మీ చూపుల స్పర్శకే బిగువెక్క వలసిన ఛోళీ తడిసి మెత్తబడిపోయింది చింతతో.

" మీ కిష్టమైన ఎర్రగులాబి చీర, మందార ఛోళీ, తలంటుకొన్న కురుల నిండా ఇన్ని సన్నజాజులు - ఎంత శృంగారంగా వచ్చానని !

" చూడగానే, ముఖం ఎర్రముద్దలా చవిచూచిన చెంగల్వ వలె విప్పారగా, మీరు - వైశాఖీ ప్రియసఖీ దేవీ అంటూ - ేతులు చాస్తారనీ -

" నేను అందకుండా, అలా - అల - గాలిలో తావిలా తేలిపోబోతే, అమాంతం నా మీద కురికి, అపిలు పండును వలె అందుకొని, నా అందాన్నంతా కొరుక్కు తినేస్తారనీ -

" నేను మధురంగా మీ కంఠం దిగుతూ - ఉదరం లోకి కాక, హృదయం లోకి చేరుకొని - అన్నరసంగా కాక, ఆత్మరసంగా మారిపోగలననీ -

" ఎలాంటి తియ్యటి ఊహలతో వచ్చానో !

" ఎంత అందంగా వచ్చానో !

" అడవి గాసిన వెన్నెలై పోయాను నేను ఆ సాయంత్రం !

" మీరు చూడని ఈ అందాలు, మీరు అనుభవించని ఈ మాధుర్యాలు, మీ స్పర్శ తగలని ఈ శరీరం నా కెందుకు ?

" అడు గడుగునా గుచ్చుకొనే ఈ దబ్బముళ్ల మోజు కోసమా అంత పచ్చిక బీడును నడిచి ఇంత దూరం నే వస్త ?

" ముళ్ళేకాని కళ్ళు లేవు ఈ గులాబి పొదలకు ! మీద కురుకుతై రకరకాల పూల ఎంగిళ్ళతో ఈ తుమ్మెదలు ! చల్లని ఈ చలిగాలి చిలిపి ఆటలు నా పమిటెతోనా ? ఈ గోరింక పిల్లలకు మరో పనేం లేదు - నా వెంట పడడం తప్ప ! సంధ్యారాగం కాదిది - మన్మధుని బాణాలు కడిగిన నెత్తురు మడుగు ! రక్త మాంస శకలాలు ఈ ఎర్రకలువలు ! అన్నిటినీ మించి అగ్గిపై గుగ్గిలంలా - చెలరేగుతున్న రథసప్తమి వెన్నెల !

" ఏం చెయ్యను నేను ?

" ఎలా భరించగలను ఈ భగ్న మనోరథాన్ని ?

" సాగరంలో దూకనా ?

" కాని -

" నేను నా దాన్ని కానే !

" మీ సొత్తును పాడుచెయ్యడానికి నాకేం హక్కుందీ ?

" మీ సొత్తునేనా నేను?

" అయితే, మీ రెందుకు రాలేదు ?

" నా లేఖ అందలేదా ?

" అయ్యో, ఇది నా ఛోళీలోనే ఉండిపోయిందే! ఎంత పొరపాటు జరిగింది !

" వెన్నెలలా వచ్చిననేను

" చీకటిలా వెళ్ళి పోయాను తిరిగి !

ఎంత బాధ పడితివో
ఎదురు చూచి, ఎదురు చూచి !
విలయ కాల కీలల వలె
విషము గ్రక్కు వెన్నెలలో !
గుచ్చి గుచ్చి గుండె చీల్చు
కుసుమ శరుని దాడులలో !
ఆనందము కోరుకొని,
అమృత రుచులు తలచుకొని,
ఆశా పరిధుల దాకా
అశ్రువులను నింపుకొని !
విరహోగ్నులతో తనువే
వెలి బూదిగ మండి పోవ,
భగ్న మనోరథము క్రింద
ప్రాణములే చితికి పోవ !

మాఘి

మేలుకో !
బాల గోపీ విలోలా !
బ్రహ్మ వెలసెను, పరమ శృంగా
రమ్ము కలచెను అచల హృదయము !
ప్రణయ రాగ రసోజ్జ్వలమై
భాను బింబము రూపు కట్టెను !
వికృత హేమంతము నశించెను,
విశ్వమే ప్రత్యూష మాయెను !
మాఘ పుణ్యస్నాన సంధ్యల
మాధవా ! మేల్కోవ ? దేవా !
అరుణ అరుణారుణ రజస్విని
అమృత సంధ్యా రాగ లక్ష్మీ
నీ కొరకె వికసించె ! ఈ అతి
లోక మాధురి అందుకో !
ఎక్కడి దీ నాదోన్మని !

నన్ను మేలుకోమంటూనే, జీకొట్టి నిద్ర పుచ్చుతున్న ఆ ఉన్మనస్క ఎవరు !
భూపాల రాగ మనుకొని, కామవర్ధని పాడుతున్న ఆ రాగవర్ధని ఎవరో !
నీవేనా, దేవీ ?

నీవు కాక ఇంతటి మహాసత్త్వ మరెవరు ?

నేను నిద్రపోయా ననుకొంటున్నావు కదూ ?

రోజూ, తెల్లవారు జామున, అశోక ధార క్రింద, నీవు పాడే రాగోదయాలు నేను వినడం లేదా ?

" మరి, లేచి రావేమి ? " అంటావు నీవు !

పెదవితో లెమ్మంటూ, కంటితో వద్దంటూ, చేతిలో లాగుతూ, శరీరంతో అదుముతూ ఉంటే – ఏ దేవుడు లేవ గలడు అట్టి చమత్కార పరమైశ్వర్య పారవశ్యం నుంచి ?

వ్రతం చేస్తున్నది మీ దొడ్డమ్మ కద ?

ఆమె కోరుతున్నది నిజంగా కైవల్యమో – నీకు లభించిన అదృష్టం లాంటి ఆనంద ప్రణయమో !

ఈ జన్మ లోనే, పదినిమిషాల దూరం లోనే, అందుబాటులో ఉన్న సుఖాలను సైతం అనుభవించే ధైర్యం లేక – వచ్చే జన్మ దాకా వాటిని వాయిదా వేస్తారు కొందరు అంబేదలు !

ఎన్నో పూజలు చేస్తారు అందుకోసం!

న క్షరతి, న సంచలతి, న వినశ్యతి – అంటూ ఏది కీర్తింప బడుతున్నదో, ఆ మహా పరా పదవిని ఎవరైనా అందుకోవలసింది ఈ జన్మ లోనే. అస్ఖలిత జ్ఞానమే అందుకు సాధనం.

జప తపో వ్రతాదు లన్నీ వచ్చే జన్మ కోసమే ! ఈ జన్మలో లభించని సుఖ సంతోష సౌభాగ్యాల కోసమే !

మీ దొడ్డమ్మ నిన్నే ఎందుకు ఆరాధించదో ?

నీ వెవరో నీవు తెలుసుకొని, నే నెవరో కూడా తెలుసుకొన్న ప్రజ్ఞాన పరమేశ్వరి వైన నిన్ను ?

ముక్కోటి దేవతలూ, ముగ్గురు మూర్తులూ కూడా ఆరాధించేది నిన్నే కద !

నీ ఆరాధనే విశ్వశ్రేయోరాధన ! దాని సాఫల్యమే కైవల్యం ! అదే నిన్ను జీర్ణించుకొన్న నేను ! ఆ నేనే పరమ త్రయీ రూప రాగరమ వైన నీవు!

సరే - కానీ !
ఆడుకో రాగ లాస్యవై !
పాడుకో రాగ లక్ష్మివై !
లయించుకో నన్ను నీలో రాగ వైశాఖివై !
రాగ పరమేశ్వరుణ్నే అవుతాను నేను ఇప్పుడే !

చేసుకోవలె పూజ చేత పూలున్నపుడె,
పెంచుకోవలె సుఖము ప్రేమ దొరికిన కడనె,
ప్రణవ మొసగెడివాడె పరమేశ్వరుడు సుమా !
కలియవలె అతనిలో కనిపించినప్పుడే !

చూపులో చూపు, మనసున మనసు కలిసి న
ప్పుడె ఆత్మ ఆత్మలో పూర్ణైక్యమును చెందు !
హస్తగతమై యున్న ఆనంద లవముకై
వాయిదా ఎందుకో వచ్చు జన్మము దాక ?

81

చక్కగా విరబారి, తుల్లంగా విరబూచి, కనులకు నిండై, మనస్సుకు పండువై, చిత్తానికి ఉత్తేజం కలిగించే రాగసరోవరవు నీవు !

సరోవరం కనిపించకుండా అంచులు మోసి విప్పారిన సహస్రదళ సువర్ణ కమలానివి నీవు !

ఒక చిన్న ముద్దును కాసారం లోకి విసరగా, దాని స్ఫురిత స్పందనకు పద్మం చలించగా పద్మం లోని మధుపాలు రేగి అమృత నాదంతో ఆశల్ని ఆక్రమించగా, ఏ తన్నాద సుధ కలశాన్ని ఒక్క గుటకతో ఖాళీ చేసి, పెదవులతో అంచుల్ని మూసి -

" చాలు చిట్టి పోతై అంచులు ! "

తన సమస్త శిశిర తమస్సునూ ఒక నల్ల కల్వగా జటలో ముడుచుకొని, మఘా సౌధాగ్రం నుంచి దూకి, నా ఒడిలో పడ్డ రాకా పూర్ణ రాగ శశివి నీవు !

సాహసోపేత సమ్య గభిసారంలో, ద్వారం దగ్గరి సింహంచే తిన్నదెబ్బలా, చెక్కిలిపై ఆ పుట్టుమచ్చ !

రసాల ఫలంపై కత్తి నాటొక చోట పడగా, రసం మరొక చోట చిప్పిలు తున్నదో అన్నట్టున్న కెమ్మోవి !

ఎంత నిండుగా ఉన్నై నవనీత కలశాలు !

ఎంత తియ్యగా ఉంది ద్రాక్షరసాస్వాదన !

" చాలు, చాలు పగిలిపోతై కలశాలు ! "

ఓహో, పాల సముద్రానివి నీవు !

అమృత భాండమే నీవు పద్మ చలించగా !

దానిపై మూతగా ఉంచిన సువర్ణ కమలమే నీ వదన కమలం !

కమలాసన నీవు ! కమలాలయవు నీవు !

సువర్ణ కమలంలో వికసిత నీలోత్పలాలు !

వాటిలో అమృత మధుపాలు ! వాటికి ముద్దులే మధువులు !

నా పెదవులకు పచ్చ కర్పూరం కాటుక చిమ చిమ !

పాల తరగల బుగ్గలపై కాటుక పెదవుల గిట్టలు

" చాలు, చాలు - కలగిపోతై తరగలు ! "

ఓహో ! నీ వదన పద్మం ఏణాంక బింబమే !

నా వక్షం నిండా నీ కేశ సంపద వికసించగా

నీ వదన సైకతం నా బంగారు లేళ్ళ గిట్టలతో చిందర వందర కాగా

మధుపాలు మూగ వోగా

మేరు గిరి శిఖరాలు మేఘ మృదులం కాగా

వీచిన తావి తుపానుల్లో, కురిసిన మధు వర్షాలలో, పద్మాకరమే కలిగి నలిగి పోగా

ఓహో ! ఆనందోత్సవ మహా వైభవం !

నా రాగ విపంచివి నీవు !

అమృత గానంలో పరవశిల్లిపోయి, అపూర్వ రాగసుధల్ని ఇంకా ఇంకా

ఊరించాలని - అతిలోక గాన లక్ష్మీ సౌందర్యంలో పరమ తారాతి తారాతిశయం దాకా ఇంకా ఇంకా మునిగి పోవాలని -

స్వర మూలాన్ని అదిమి, మరీ బిగించ బోతున్నప్పుడు -

" చాలు, చాలు, చాలు -- తెగిపోతై తీగలు ! "

ఓహో - రసాలినీ ! రాగ రసోజ్జ్వలినీ !

82

నిజానికి ఏ యుద్ధమూ ముగియదు - ఆగుతుం దంతే.

ఆ మధ్య విరామ కాలంలో ఏం చెయ్యాలి ?

భీముడేం చేశాడో చెప్పనా ?

మహా భారత యుద్ధం ముమ్మరంగా సాగుతోంది. జయాపజయాలు దైవాధీనాలుగా ఉన్నై. ఆ రాత్రి పాండవ శిబిరంలో శ్రీకృష్ణుడు ఛలోక్తులతో ఉత్సాహం కలిగిస్తున్నా డందరికీ.

" ఇంత బలమూ గుద్దుల వరకేనా, ముద్దులకు కూడ పనికొస్తుందా ? " అన్నాడు భీముడి భుజం తట్టి !

ఆరుబైట కూర్చున్నా రిద్దరూ.

ఒక పురుషుడు ఒక స్త్రీని విడవకుండా ఎంతసేపు రమించగలడు ?

ఒకే బిగిని ఎన్నిసార్లు భావప్రాప్తిని కలిగించ గలడు ? ఏక కాలంలో ఎంతమందితో రమించగలడు ?

ఊర్ధ్వ రేతస్కత, అస్ఖలిత బ్రహ్మచర్యం సాధ్యం ఒక్కశివుడికి మాత్ర మేనా ?

కృష్ణుడు కూడా అస్ఖలిత బ్రహ్మచారే ! ఇలాంటిప్రయోగాలకు అతడి కున్న అవకాశాలు పాపం భీముడి కెక్కడివి ?

ద్రౌపది విషయం వచ్చింది.

పగలంతా యుద్ధం, రాత్రంతా నిద్ర - ఇంతేనా భీముడు చేస్తున్న పని ? అర్ధరాత్రి దాటిన తర్వాత ఆమె ఏమి చేస్తూ ఉంటుందో చూశాడా ఎప్పుడైనా ?

చూడలేదు !

ఆ రాత్రి చూడమన్నాడు కృష్ణుడు.

అలానే చూశాడు భీముడు.

చెమట్లు పోసి, మతి చెదిరి, వచ్చి కృష్ణుడి కాళ్ళపై పడ్డాడు. అంతటి మహా బలశాలీ జావ అయిపోయాడు పాపం.

అభయం ఇమ్మని ప్రార్థించా డతడు కృష్ణుడ్ని. తమ వంశాన్ని కాపాడు మన్నాడు ఏడ్చాడు నిజంగా !

నవ్వాడు కృష్ణుడు

లేవదీసి కూర్చోబెట్టాడు

ఒళ్ళ నిమిరి సేద దేర్చాడు

కాఫీ ఇచ్చి స్వస్థ పరిచాడు.

నవ్వుతున్నావు కదూ నీవు కూడ ?

కాఫీ కాకపోతే – అలాంటిదే ఏదో – ఆ కాలంలో వాడుకలో ఉన్న ఒక మద్యం.

" ఇంతే నటోయ్, హిడింబా ప్రియా ? " అన్నాడు.

మరీ నవ్వాడు పగల బడి !

ఏదో జ్ఞాపకం వచ్చినట్టు, ఆగి, అన్నాడు "సరేగాని, ఇన్నేళ్ళుగా సంసారం చేస్తున్నావుకదా. రతిలో ఒక్కసారైనా ద్రౌపది చేత చాలు అనిపించావా ? "

ఏం ప్రశ్న ?

ఏమిటి జవాబు ?

జ్ఞాపకం లేదు భీముడికి ?

ఎన్నడూ అనలేదా ఆమె ఆ మాట ?

అంత చిన్న మాట ?

ఎంత చిత్రం !

కొందరు మగవా ళ్ళుంటారు. తమ తృప్తేకాని, ఆడదాని తృప్తి అక్కరలేదు వాళ్ళకు. ఒళ్ళో పెడుదునా, దళ్లో పెడుదునా అంటూ – తమ యావ కాస్తా తీరిపోగానే – లేచి దులుపుకు పోతారు !

తిండి ఆకలి ఒక్కళ్ళది. సెక్సు ఆకలి జంటది. ఇద్దరికీ సమానంగా తీరాలి అది. ఒకరి ఆకలిని రెండవ వారు తీర్చవలసి నట్టి దది. జంటలో ఏ ఒక్కరికి తృప్తి లేకపోయినా సెక్సు విఫలమైనట్టే ! ముందుగా స్త్రీ ఆకలి తీర్చి, తర్వాత తాను తీర్చుకోవాలి పురుషుడు.

ఇలాంటి నర్మమర్మ మర్యాదలు తెలియనివాడా భీముడు ?

వీణను పట్టిన తర్వాత - వేళ్ళు రక్తాలు చిందుతున్నా, నరాలు తెగిపోతున్నా, ప్రాణాలు ఎగిరి పోతున్నా - నాదలక్ష్మి నా దనిపించుకోకుండా విశ్రమించని వైణికుడు కాడా భీముడు ?

భార్య కాబట్టి నిర్లక్ష్యం చూపి ఉండవచ్చు.

చాలా - అని అడిగి ఉండక పోవచ్చు.

గంటల కొలది రమించినా, పదుల కొలది భావప్రాప్తులు పొందినా, చాలు అనని కామినులున్నా రెందరో ! వాళ్ళతో రతి పరమ రమణీయం ! అసలు- అదే పరమానంద పరమైశ్వర్యం అస్థలిత వీర్యుడైన పురుషుడికి ! శుక్ర ప్రాబల్యం గల అలాంటి పూర్ణసుందరి అయి ఉండవచ్చు ద్రౌపది !

సామాన్యంగా - ఆకలి తీరినా, వద్దనదు ప్రేమగల స్త్రీ ! కవ్విస్తూనే ఉంటుంది ప్రియుడ్ని ! స్త్రీ అంగ నిర్మాణం కూడ అందుకెంతో అనుకూలం. ఈ విషయంలో పురుషుడి కున్న పరిమితులు స్త్రీకి లేవు.

అందుకే పురుషుడి బాధ్యత అధికం రతిలో. ముందుగా స్త్రీని తృప్తి పరచకుండా తాను స్థలితుడైన పురుషుడు ఆ స్త్రీ మెప్పును పొందలేడు. పైగా, ఆమె ద్వేషానికి గురి అవుతాడు తరచు.

చాలు అన్న రెండక్షరాలను స్త్రీ నుంచి పొందిన మగవాడి కంటె కృతార్థుడు మరెవడు ?

అతడే శివుడంటే !

ఏది ఏమైనా -

జ్ఞాపకం లేదు భీముడికి.

ఆ యోచనే లే దతడి కంతవరకు !

" పోనీ, ఇప్పు డనిపించుకో ఆ మాట" అన్నాడు కృష్ణుడు. కొన్ని వాజీకర

ప్రక్రియలు, కామ కళా రహస్యాలు, చిట్కాలు ఏవో ఉపదేశించాడు. చాలు అనే వరకు వదల వద్దన్నాడు.

" తృప్తి పడి, చాలు అని, ఆ మైకంలో - వరం కోరుకో అంటుందామె. వంశాన్ని కాపాడు అని కోరుకో ! కనీసం మీ అయిదు గురి నైనా మిగల్చమను " అన్నాడు.

ఇంతకూ, ద్రౌపది ఏం చేసేది ప్రతి రాత్రీ ?

ఉభయ పక్షాలూ పోరాటం ఆపి, అలసి నిద్రపోయిన తర్వాత, అర్ధరాత్రి లేచి యుద్ధరంగానికి వెళ్ళేది. ఉగ్రకాళీ రూపం తాల్చేది. ఆ పగలంతా యుద్ధంలో మరణించిన లక్షలాది యోధుల, గజతురగాదుల కళేబరా లన్నింటినీ ఆరగించి వేసేది. యుద్ధభూమి నంతా నాలుకతో నాకేసేది. మళ్ళీ మామూలు మనిషై, తెల్లవారక ముందే ఇల్లు చేరుకొని, ఇంటి పనులు చూచుకొనేది !

యుద్ధ దేవత ద్రౌపది !

మహా శక్తి క్షేత్రం ఆమె !

ఆ రాత్రి భీముడు చూచిన భయంకర బీభత్స దృశ్యం అది !

ఇప్పు డామెను సమీపించడానికే అతడికి గుండె చాలడం లేదు.

" ఆ యుద్ధం ముఖ్యం కాదు, ఈ యుద్ధంలో గెల్చిరా " అన్నాడు కృష్ణుడు.

తప్పదు కద !

వెళ్ళాడు -మెల్లగా !

గెల్చాడు - చిత్తుగా

వరమూ పొందాడు !

కాని - పాపం - ఈ రహస్యాన్ని భీముడికి చెప్పిన కృష్ణుణ్ణి మాత్రం శపించి పారేసిం దా మంత్ర మహాశక్తి !

ఆ శాప ఫలమే పూరీ లోని జగన్నాథుడికి ఆ మొండితనం (ట)

రాగ మాఫీ !

ఈ కథ ఎక్కడిదో తెలీదు. మా అయ్య ఎప్పుడో, ఏ శిష్యుడి తోనో చెపుతుంటే విన్నాను నేను.

కామ విషయంలో ప్రతి కామినీ ఒక ద్రౌపదే.

కాని -

ప్రతి మగవాడూ భీముడూ కాదు !

ప్రతి బావా కృష్ణుడూ కాదు !

83

ముఖం కడుక్కోకుండానే పడుకొన్నాను నేను రాత్రి !

తెలుసా ఎందుకో ?

అవన్నీ నీ ముద్దులు !

ముఖం నిండా ముద్దులు పెట్టి, పెదవి కరిచి, ఠక్కున లేచి, చెక్కిలి మీటి, చేయి నొక్కి-

నే నింకా మైకం నుంచి తేరుకొంటూ ఉండగానే, చేతిని చేతి లోకి తీసుకొని, మన రెండు చేతుల దూరం దాకా కదలిపోయి, మునివేళ్ళ చివరిముద్దులు అనుమతించి, జాలిచూపులు చూచి, కంఠం రుద్ధం చేసుకొని.

" మళ్ళీ రేపు" అంటూ, అంతలోనే అదృశ్యమై పోయావు నీవు క్షణంలో క్షణ ప్రభలా !

ఎంత మత్తు ! ఎంత విభ్రాంతి !

శృంగార రస ప్రణీతం నా జీవితం !

అనురాగ రాగ పరిస్పపితం నా శరీరం !

నీ అధర సుధా మధురం నా వదనం !

ఎలా కడుక్కోను నీరసమైన వట్టి నీటితో ?

నిద్రే లేదు నాకు రాత్రంతా !

శ్రీవల్లి ఎంత మంచిది !

నా ఎదరే ఎన్ని ముద్దులు పెట్టుకొన్నావు నీ వామెను !

ఆడపడుచు సగంమగ డన్న సామెతకు నీవే నేమో తల్లివి !

ఆమెను నీ వలా ముద్దులు పెట్టుకొంటుంటే - నా బుగ్గలు కందిపోయి మండసాగినై కద !

అసూయను గెలవాలని లోకానికి బోధిస్తున్న నాకే ఎంత అసూయ !

ప్రేమించగల వాళ్ళూ, ప్రేమించదగిన వాళ్లూ ఎంతమంది లోకంలో ?

తాను ప్రేమించే వ్యక్తి ఒకరు, తనను ప్రేమించే వ్యక్తి ఒకరు - ఇద్దరు వ్యక్తులు లభిస్తే చాలదా జీవితానికి ?

ఆ ఇద్దరూ ఒకే వ్యక్తి అయితే, అంతకన్న మహాభాగ్యం మరే ముంటుంది ? అలాంటి నీ ప్రేమను నాతో పంచుకోగలిగిన శ్రీవల్లి ఎంతటి అదృష్టవంతు రాలు !

నా నోట్లో కుక్కే అలవాటున, ఆమె నోట్లో కుక్కావు కదూ అపిలుపండు ముక్కలు ! ఉక్కిరి బిక్కిరై పోయిందామె, పాపం

నీవు తీసి బల్లపై విసిరిన కొత్త గాజుల్ని నేను తీసుకొని వేసుకో బోతుండగా-

" చీర కూడా " అన్న శ్రీవల్లి ఎంత చతుర ! ఎంత దివ్య !

"ఇంతలో అంత చనువే ! " అంటూ, నోరావులించావు నీవు !

ఎంతలో ?

సంవత్సరాల తరబడి పరిచయం కూడ స్నేహంగా పరిణమించదు కొందరి విషయంలో !

కొందరు చూపు లోనే ఆత్మీయులై పోతారు, ఎన్నో జన్మల సౌహార్ద సంపద తో !

శ్రీ వల్లి చనువు ఇప్పటిదేనా ? దాని వెనుక ఎన్ని జన్మల స్నేహం ఉన్నదో !

" అతి చనువు తిరస్కార హేతువు " అన్నది కదూ సీరి ఒకసారి ?

లోక వ్యవహారానికి సంబంధించిన సామెత అది. చనువిస్తే చంకెక్కే వాళ్ళు, అతి చనువిస్తే అనాదరించి అవమానిస్తారు.

ప్రేమకు చనువే ప్రాణం. అతి అయే కొలదీ ఆత్మానందాన్ని ప్రసాదిస్తుం దది !

" పెట్టి పుట్టినవాళ్ళు మీరు " అంటూ వెళ్ళిపోయింది శ్రీవల్లి !

" పెట్టి - పుట్టిన " అంటూ, ఆ రెండు మాటలకూ అర్థాలు తియ్యసాగావు నీవు !

అన్ని ప్రవచనాలూ, సామెతలూ పరమసత్యాలు కానక్కర లేదు. కొన్ని అసలు సత్యాలే కావు కూడా. దేశ కాల పాత్రలను బట్టీ, వృత్తులను అనుసరించీ,

రాగద్వేషాలను పురస్కరించుకొనీ ఉపుడుతూ, చస్తూ ఉండే వ్యావహారిక నుడికారాలవి.

పరమ సత్యం ఒక్కటే – అది ప్రకృతి పురుష శృంగార క్రీడా స్వరూపం. దాని సాహితీ నిర్వచనమే పెట్టి పుట్టడం !

పూర్వ జన్మలో దానధర్మాలు చేసుకొంటే, ఈ జన్మలో భాగ్యశాలిగా పుడతాడు. పూర్వజన్మలో పుచ్చుకోవడమే కాని ఇతర్లకి ఇవ్వడ మనేది లేనివాడు, ఈ జన్మలో దరిద్రుడుగా పుడతాడు.

అదేగా పెట్టి పుట్టడం ?

భవం అనే బేంకులో అతడికున్న ప్రారబ్ధం అనే అకౌంటును బట్టి ఉంటుంది అతడి జీవిత గమనం ! ఒకడు ఎంత కష్టపడినా తిండి గడవదు. ఇంట్లో కూర్చుంటే వచ్చి పడుతుం దొకడికి డబ్బు. ఎంత డబ్బున్నా సుఖం ఉండదొకడికి. దుర్మార్గుడి ఇంట లక్ష్మి తాండవిస్తుంది. పరమ సాధువుకు ముష్టి మెతుకులు కూడ దొరకవు. ఇదంతా వాళ్ళ వాళ్ల బేంకు అకౌంట్ల మహాత్మ్యమే !

కొందరు ఎప్పుడూ ఏదో వేసుకొంటూనే ఉంటారు బేంకుల్లో. ఆనంద మధురంగా సాగిపోతూ ఉంటై వాళ్ళ జీవితాలు.

పురాకృత సుకృతంలో కోటీశ్వరులం మనం !

పెట్టి పుట్టిన వాళ్ళం !

" పెట్టి – పుట్టడం " అంటూ, ఉచ్చారణ చమత్కృతి ద్వారా నీవు కల్పించిన అశ్లీల ధ్వని – ఎంతటి వేదాంత విద్యా రహస్విని !

పెట్టడం, పుట్టడం అనే రెండు క్రియలకూ కర్త ఒక్కడే !

తనను తాను పుట్టించుకొంటున్న వాడు పరమాత్మ ఒక్కడేగా !

పారం లేని పరమ కామన అతడిది !

నాకు నన్నే కనిఇచ్చే తల్లివి నీవు !

నీవు జగన్మాత వైనప్పుడే నేను జగత్పితను కాగలగడం !

మహా సృష్టులు జరిగేది మనోరమణం వల్లనే !

దాని స్వరూప లవలేశమే జీవుల కామోప భోగ భాగధేయం !

అదే నీ ముద్దు !

ఒకో ముద్దు ఒకో ఆనంద పద్దు !

ఎలా కడిగి వెయ్యగలను వీటిని అనంత విలయం లోకి ?

శివ సరస్వతుల నిత్య వసంత వన రతులె
ఈ అనర్గళ జగత్ శ్రేయాలు, ప్రేయాలు !
క్షణమైన వారు మిశ్రమించి నిల్చుచో
ఆనంద లోకాలె ఆభీల విలయాలు !

84

ఏమిటా పుస్తకం ?

మార్కెట్లోకి వచ్చే ప్రతి తెలుగు పుస్తకమూ కొంటావు నీవు !

నిన్ను చూశైనా ఎందుకు నేర్చుకోదో, ఈ చదువుకొన్న తెలుగులోకం !

కొనడం, చదవడం, ముఖ్యమైన మౌలిక రచనల్ని బీరువాలో పెట్టుకోవడం, తక్కిన వాటిని ఏ లైబ్రరీకో ఇచ్చివేయడం... ఎంత ఆదర్శప్రాయం నీ విద్యా జీవితం !

నీవు చదివిం దంతా నీవై వికసిస్తున్న దందుకే !

శ్రమించి సాధించుకొన్నదే నిజమైన విద్య.

కొందరుంటారు - కొందరేమిటి, ఎక్కువ మంది వాళ్ళే - వాళ్ళు అసలు పుస్తకాలే చదవరు. జీవిత క్షేత్రంలో అహర్నిశలూ ఏదో ఎడతెగని పనే వాళ్ళకు ! వాళ్ళ వల్ల ఏ బాధా లేదు మనకు.

వచ్చే బాధెల్లా కొనకుండా చదవా లనుకొనే వాళ్ళ నుంచే !

ఎక్కడ దొరుకుతై పుస్తకాలు తేరగా !

స్నేహితుల దగ్గర !

ఔను ! అంతే !

స్నేహితుడన్న వాడి దగ్గర, పుస్తకమన్నది కనిపిస్తే చాలు - చటుక్కున అడిగేసి, చేతినుంచి లాక్కుపోతారు. అతడింకా చదవకముందే.

అంతే - పుస్తకం ఇక రాదు.

ఆ తీసుకు పోయినవాడు కూడ చదవడు దాన్ని. మరెవడో పట్టుకుపోతా డక్కడ నుంచి. ఆ అక్కడి నుంచి అలా, అలా చేతులు మారి, మారి - చినిగి,

తునిగి, మసై, నుసై, అనాధప్రేతమై పోతుందది చివరికి - ఏ పేవుమెంటు మీదో !

. ఇంతకూ దాన్ని పూరా చదివినవాడు, అనుభవించినవాడు ఏ ఒక్కడూ ఉండడు !

కోరి కొనుక్కొన్న వాడైతేగా, మరి ?

పుస్తకం, వనిత, విత్తం - మొత్తం మానవ జీవితం ఈ మూడే !

ఎవరికైనా సరే అమూల్యమైనట్టివి , ఎవరినైనా సరే ఆకర్షించగలట్టివి, ఎవరైనా సరే అనుభవించ గలట్టివి ఈ మూడూ !

మానవుడు అబద్దాలాడతాడు, వంచన చేస్తాడు , దారులు కొడతాడు , పీకలు నులుముతాడు , యుద్ధాలు చేస్తాడు , నెత్తురు తాగుతాడు - వీటి కోసం !

అందుకే -

స్నేహితులు వస్తున్నారంటే - చేతిలో పుస్తకాన్ని బల్లకింద దాచేయడం , హాలులోని ఆడవాళ్ళను అవతలికి పొమ్మనడం , లెక్క పెట్టుకొంటున్న డబ్బును జేబులోకి తోసెయ్యడం !

మానవుడు భయపడేది కొత్తవాడికి కాదు, పాతవాడికి ! శత్రువుకు కాదు, స్నేహితుడికి !

స్నేహితుడి లాలూచీ లేకుండా - శత్రువన్న వాడెవడూ ఏమీ చేయ్యలేడు ఎవరజ్జీ !

ఎప్పుడూ , ఎవర్నీ పూర్తిగా నమ్మవ ద్దన్నది చాణక్య నీతి.

నీవూ అదే అంటావు !

" ఎప్పుడో , ఎందుకో , ఎవరో మన దగ్గరకు వస్తూనే ఉంటారు. ఏవో ప్రయోజనాలు దగ్గరకు చేరుస్తె రకరకాల మనుష్యుల్ని . అవి తీరి పోగానే దూరమై పోతారు వాళ్ళు . అందుకే ఎవళ్ళనీ , ఏ విషయాన్నీ హృదయం దాకా లోనికి రానివ్వ గూడదు " అంటావు నీవు . అలా రానివ్వడమే హేతువంటావు సమస్త దుఃఖాలకూ !

నిజమే కావచ్చు .

జీవితం ఒక రైలు ప్రయాణం .

పరిచయాలు , సాన్నిహిత్యాలు , స్నేహాలు , సుఖ దుఃఖ భాగస్వామ్యాలు - అన్నీ వచ్చే స్టేషను వరకే !

అక్కడ దిగే వాళ్ళెవరో ! ఎక్కే వాళ్ళెవరో !

ఆ దిగేవాళ్ళు తమవి విడిచిపెట్టీ పోవచ్చు , మనవి పట్టుకొనీ పోవచ్చు .

క్షణానికో నడక నడిచే జీవస్రవంతిలో - ఎప్పుడు ఎవరు ఎందుకు ఎలా దగ్గరికి వస్తారో , ఎలా దూరమై పోతారో ఎవరికీ తెలీదు .

నేటి మిత్రుడు రేపు శత్రువు కావచ్చు . నేటి శత్రువు రేపు స్నేహితుడు కావచ్చు . చెప్పలేం .

" ఎలాంటి స్నేహితుడి కైనా సరే , హృదయం విప్పి చూపవద్దు . ఎలాంటి శత్రువు నైనా సరే , హృదయం గాయపరచవద్దు " అంటావు నీవు .

జౌను ! అంతే !

పుస్తకం, వనిత, విత్తం- ఈ త్రిలోకాలకూ అధిష్ఠాన దేవీ మూర్తివి నీవు !

అట్టి నీ సౌందర్య పరమైశ్వర్యంతో ఆనంద మధురమూ, రాగభాను ప్రకాశమూ అయిన నా హృదయాన్ని ఇంకెవరికి చూపుతాను !

మనకు శత్రువులే లేరు.

ఉన్న మిత్రులంతా మనలాంటి వాళ్ళే !

" స్నేహితు లున్నారు జాగ్రత్త " అన్న సీరి హెచ్చరిక మనకు కాదు, ఆమెకే ! మన్మధ సూరిని పెళ్ళాడబోతున్న దామె !

ఇంతకూ ఆ పుస్తకం ఏమిటి ?

85

" తలంటి పోసుకొని -

" రోజంతా తీరిక లేని పనిలో, ఆమాటే మరచిపోయి -

" సాయంకాలం బాల్కనీ మీదకు పోయి, కురుల్ని విప్పుకొన్నాను తీరిక గా !

" జటలా అల్లుకొన్న రేలచెట్ల పూలరాశుల ఆవలిత ట్టున, సంధ్యాకాంత బిగి కౌగిలిలో కందిపోతున్న సూరన్న - తలెత్తి తొంగి చూశాడు నాకేసి - ఆ

పూలరాశుల సందుల్లో నుంచి కొంటెగా !

" జ్ఞాపకం వచ్చారు మీ రప్పుడు ! "

" జ్ఞాపకం రావడమంటే - సిగ్గేస్తుంది ! "

" ఎర్రటి ఆ సూరన్న ముఖం ఎలా ఉన్నదని -

" ఒకొక్క మానసిక స్థితిలో, ఒకొక్క ప్రకృతి దృశ్యం చూచినప్పుడు, ఒకొక్క మధుర సంగతి విన్నప్పుడు, మన సన్నివేశాలే జ్ఞాపకం వస్తై నాకు !

" ఏదో ఒక గాఢవాసన తగిలేవరకు మనకు ముక్కొకటున్నట్టే గుర్తుండదు గా ? ఏదో ఒక అపూర్వ సౌందర్యం కంటపడే వరకూ కన్ను సంగతి గూడ జ్ఞప్తిలో ఉండదు.

" క్షణానికో నూతనానుభవాన్ని సృష్టించుకొనే అభిరతీ నిరంతరులం మనం- అనుక్షణమూ ఆడుతూనే ఉంటాం ఒకరిలో ఒకరం - సూర్య చంద్ర ప్రాణ నాడుల్లా - తెలియకుండానే !

" ఒకొక్కప్పుడు మాత్రం, అన్నిటినీ మరిపించి, అత్యంత మధురమైన సన్నివేశమేదో మిమ్ము తెచ్చేస్తూ ఉంటుంది - వాస్తవంగా నా ముందుకు - సుషుమ్నా పరమ శ్రీ వలె !

" ఆరబోసుకొన్న కురులు ఆకాశం నిండా కమ్ముకొని, సాయంకాలపు చల్లగాలితో చిరుమబ్బుల్లా ఆడుకొంటూ ఉండగా -

" అంత పెందలకడే చీకటి పడిందేమిటా - అనుకొన్నదట - ప్రక్క ఇంటి క్రింది భాగంలోకి క్రొత్తగా అద్దెకు వచ్చిన ఇల్లాలు !

" వీధి లోకి వచ్చి, పైకి చూచిందట అప్పుడు ! "

" సంధ్యాకాంత ఒడిలో సూరన్న - నా ఒడిలో మీరు - పైకొన్న ఈ భావనలో మైమరచి ఉన్నాను నేనప్పుడు !

" రాగవాసిష్ఠం లోని సంధ్యవు నీవేనా - ప్రశ్నించిం దామె ఎవర్నో !

" క్రిందికి చూశాను నేను. నాకేసే చూస్తున్నదామె కళ్ళప్పగించి !

" నిన్నేనే అడుగుతూంట- అన్నదామె - అలానే చూస్తూ !

" నన్నేనా ! ఏమో , నాకేం తెలుసు ?

" నేను కాదు, ఆ ప్రక్క వాటాలో కనుక్కోండి - అన్నాను నేను !

" పకాలున నవ్విం దామె !

" బహుశా, నీవే అయి ఉంటావు - అన్న దామె !

" ఆ విధంగా నవ్వులపాలై, ఇదేదో నాటకంగా ఉన్నదనుకొని, పుస్తకం కొనేసి, చదివేశాను పూర్తిగా !

" మీ రాగ సంధ్యను నేనేనా !

" నేను పుట్టక ముందే మీకు నే నెలా దొరికాను ?

" నన్ను సంధ్యగా పోల్చుకొన్న ఆ అమ్మాయి రాజరత్నం ఎంతటి సాహితీ కళా హృదయ ! "

86

కను లర మోడ్చి నీవు తమ
కమ్మున ఈశ్వరు గొల్చు వేళ, నే
నును భవ దంతరంగమున
నుండుచు హైమవతీ ధవున్ భజిం
తును ; భవు పాద పంకజ మ
ధూళిని నిండుగ గ్రోలి రమ్ము ! అ
క్కున నినుగొన్న వేళ రుచి
గొందును నీ పెదవిన్ తదర్థముల్ !

అనుకోకుండా అడిగిన వరం ఇది నిన్ను - ఆ సాయంకాలం !

అంజనేయుని కొండపై స్వామికి టెంకాయ కొట్టి - శివగిరి శిఖరంపై నందీశ్వరుని తోక దగ్గర కూర్చున్నాం మనం ఎప్పటిలాగే !

ఆ ఎత్తు నుంచి చూస్తే - భాగ్యనగరం యావత్తూ దీపాల పూల తోటలా కనిపిస్తున్నది చుట్టూ !

ఒక పూర్ణ పురుషుని హృదయాన్ని తనదిగా చేసుకొని, అతడే తానై భాసించి, తన పేర మహారాజ్య రాజధానినే నిర్మింపజేసుకొన్న భాగ్యమతీ దేవి ఎంత ధన్యురాలు !

సీత కంటె, రాధ కంటె, అనార్కలి కంటె, నూర్జహాను కంటె – మరెందరో చక్రవర్తుల పట్టపు రాణుల కంటె – పురుష ప్రేమను చివరి బొట్టు వరకు క్రోల గల్గిన అమృత మనస్క, ఆనంద దేవత, పరమ ప్రణయిని భాగ్యమతి !

భాగ్యమతి హైదరీబేగం అయి, భాగ్యనగరం హైదరాబాదు అయింది !

మతాలు ఎన్నైనా, మానవత ఒక్కటే !

భాగ్యమతి వలెనే అందాల రాశి భాగ్యనగరం !

నిరూపించి చూపుతున్నావు నీవు – అదిగో నౌబత్ పహాడా గోపురోద్యానం.

అదిగో ఫలక్‌నుమా రాజభవనం, అవిగో చార్‌మీనార్ శిఖరాలు – అంటూ !

ఈ దీపరాశికి పట్టిన దర్పణంలా ఉంది నభోరాశి !

ఏమీ చూడ్డం లేదు నేను – నిన్ను తప్ప !

చేతులెత్తి స్వామికి నీవు నమస్కరించినప్పటి నీ ఉజ్జ్వల రూపాన్నే చూస్తున్నాను నేను అప్పటి నుంచీ !

నీ హృదయం స్వామి పట్ల భక్తితో నిండిపోగా, నా హృదయం నీపట్ల ప్రపత్తితో నిండిపోయింది !

ఆకాశం ఎత్తున పెరిగాం మనం అంజనేయుని జవసత్త్వాలతో !

నేనే అంజనేయుణ్ణి !

మనిద్దరం ఒకరి కొకరం భక్తులం ! ఈ తారలు నీ కురుల లోని సన్నజాజి మొగ్గలు !

భూర్భువ స్సువరోఫ్లకాలు మూడూ అపాదమస్తకం మనమే !

ఈ విశ్వమే మన రథం !

నిశీధ జీవ ప్రపంచాన్ని ప్రత్యూషం వైపు నడిపించుక పోతున్న సరస్వతివి నీవు ! నిన్ననుసరించి వస్తున్న బ్రహ్మను నేను !

గుడిలోనూ, గుడిచుట్టూ – నీవే !

నీ వెనుక నేను !

నీవు తప్ప, నాకేం కనిపిస్తుందిక ?

ఏం ఉంది బైట -నీలో లేనిది, నీవు కానిది ?

నీ కంటె చూడదగిం దేముందీ నగరంలో, ఈ లోకంలో ?

నీటిలో చేపల్లా మెరిసినై నీ కళ్ళు !

ఎక్కడి నుంచో రైలు కూత !

రేపే నీ ప్రయాణం శ్రీ శైలానికి !

" ఏం తేను శ్రీశైలం నుంచి ? "

నీ ప్రశ్న, నా కోరిక, నీ అరమోడ్పు కన్నులు, వాటిపై నా పెదవులు - ఆ అందం జన్మ జన్మాల సుకృత ఫల రసానంద కందం కదా !

అరమోడ్పు కనులలో అరుణార్క రశ్మిలో

రగిలి నీ పెదవులే రక్త పుష్పము లయ్యే !

తొలి వసంతపు సుధా కలశ కన్యక లివ్వి

నవరసము లూరనీ - నా పండ్ల తోటలో !

87

రైల్లో వున్నావు నీవు. ఆ రైలు నా గుండెల్లోనే పరిగెడుతోంది - వెళ్ళొస్తా, మళ్ళొస్తా-వెళ్ళొస్తా-మళ్ళొస్తా - అంటూ !

ఇప్పుడు నా గుండెల్లో ఉంట నీవు ఒక్కతెవే కాదు. నీతో పాటు రైలు, దానిలోని జనం, వాళ్ళ సమస్త సంసార సాగరాలూ, వాటిని తరింపజేసే శ్రీశైల క్షేత్రం కూడ నా గుండెల్లోనే ఉన్నై ఇప్పుడు !

కొందరు ఎదుట ఉండీ, లేనట్టే. కొందరు ఎదుట లేక పోయినా, ఉన్నట్టే ! ఎవరో వస్తారు. ఏదో అడుగుతారు. ఏమో చెపుతారు. వెళ్ళిపోతారు.

కొంత మందితో కలిసి తిరుగుతాం. ఎన్నో వ్యవహారాలు చక్కబెడతాం కూడ. హోటళ్ళలో, రైళ్ళలో, సినిమాలలో, ఉద్యానాలలో, క్షేత్రాలలో, బీచిలో, బజారులో – ఎంతో మంది జనం మన చుట్టూ !

వాళ్ళంతా, అంతసేపూ, అన్ని వ్యవహారాలలోనూ ఎదుట ఉన్నా – లేనట్టే మనకు !

పైగా – మనస్సులోని ఎవరో ఒకరు అంతసేపూ, అన్ని వ్యవహారాలలోనూ మనతోనే ఉంటారు – ఆనందాన్నో, విషాదాన్నో పంచుకొంటూ !

భౌతిక జనం ఎదుట ఉన్నా – లేనట్టే ! మానసిక జనం ఎదుట లేకపోయినా –ఉన్నట్టే !

మరి –

మానసిక, హార్దిక, ఆత్మిక లోకా లన్నిటినీ ఆక్రమించుకో గల ప్రియురాలే ఉన్నప్పుడు – ఇక బాహ్యప్రపంచం ఎక్కడిది ?

ప్రియురాలుగా పుట్టగల అదృష్టం, ప్రియురాల్ని పొందగల అదృష్టం లోకంలో ఎంతమంది కుంటుంది ?

-" ఈ నాటకంలో మీరంతా గెస్టు ఆర్టిస్టులు " అన్నావు కదూ మొన్న భూభారంతో ? ఒక్క మాటలో ఎంత చక్కగా కళ్ళకు కట్టించావు అతడి మొత్తం వ్యక్తిత్వాన్ని !

కొంత మంది బ్రతుకే అలాంటిది. ఎదటా ఉండరు. మనస్సులోనూ ఉండరు వాళ్ళు. సొంతం అనుకొనే దేమీ ఉండదు వాళ్ళకు. ఈ జగన్నాటకం లోకే గెస్టు ఆర్టిస్టులుగా వస్తారు, ఎవరికో అతిథులుగా ఉంటారు, ఎవరి పనో చేసి పెట్టి పోతారు – నిశ్చింతగానో, ఏడుస్తూనో !

రోడ్డు మధ్య ఆగిపోయిన కారును కాస్త ముందుకు నెట్టడానికి తలొక చెయ్యి వేసే యాదృచ్ఛిక పథికులు వాళ్ళు.

ఇందులో జడభరతుడి లాంటి నిస్సంగులూ ఉంటారు. దేవేంద్ర లాంటి బేఫికర్లూ ఉంటారు. భూభారం వంటి సినిక్కులూ ఉంటారు.

అయితే -

జీవితాన్ని, ప్రపంచాన్ని కూడ ద్వేషిస్తూ - ఏ సుఖమూ, ఏ సౌందర్యమూ లేకుండా - చస్తాం, చస్తాం అంటూనే - ఏళ్ళ కొలదీ ఏడుస్తూ బ్రతికే సినిక్కులే అర్థం కారు నాకు !

సమాజ వాతావరణం కలుషితం కావడానికి కారణం ఇలాంటి నిరాశావాదుల నిర్వేద నిశ్వాసాలే ఏమో !

తినడం, తాగడం, జెల్సా చెయ్యడం, విర్ర వీగడం, పోటీలు పడడం, పోరాటాలకు దిగడం, తమవంటి జీవుల్ని పుట్టించడం, చంపడం వంటి సాధారణ కార్యక్రమాన్ని నిర్వహించే జనమే అధికం ఈ జగన్నాటక రంగస్థలం నిండా !

అసలు ఈ జగత్తే ఒక రైలు.

అందులో ప్రాణబీజమై నీవు ఉన్నందు వల్లనే - అది నా గుండెల్లో పరిగెడుతోంది అనాహతంగా.

నా ఎదుట - ఉన్నట్టున్నా, లేని జగం !

నా లోన - లేనట్టున్నా, ఉన్న నీవు !

నేను తినేది, తాగేది - వినేది, కనేది - ఆశించేది, ఆలోచించేది - అనుభవించేది, ఆనందించేది - అంతా నీకోసమే. నాలోన, నా బైట కూడ ఉన్న నీకోసమే.

నీ ఆయుస్సు, నీ ఆరోగ్యం, నీ ఐశ్వర్యం, నీ సుఖం, నీ సంతోషం, నీ విజయం, నీ యౌవనం, నీ ప్రేమ, నీ ఆనందం - నీ జీవితాభ్యుదయ సర్వస్వం లోని ప్రతి కిరణమూ - నా నిత్యోపాసిత సరస్వతీ మహా మంత్రం లోని ప్రత్యక్షరం నుంచీ సముద్భూతం కావాలనేదే నా కోర్కె.

నీవు పుట్టి ఉండకపోతే -

నా బ్రతుకే వ్యర్థమై పోయేది !

నా ఉనికే సంశయాస్పద మయేది !

నీవు వికసించి నను వరించితివి కనుక

శివుడనై నేను, నిత్య మాధవుడ నైతి !

88

సుఖదుఃఖాల అహోరాత్రులు లేవు నాకు నీ ప్రణయంలో.

సుఖదుఃఖాలు మనఃప్రవృత్తికి కుడి ఎడమలు.

కలిసే సాగుతై అవి రెండూ - జీవిత యాత్రలో సపరివారంగా.

ముందుకు సాగడమే జీవలక్షణ మైనప్పుడు -

వేసిన అడుగు సుఖం

తీసిన అడుగు దుఃఖం !

దుఃఖం నుంచి విముక్తి సుఖం, సుఖం నుంచి విముక్తి దుఃఖం.

ఒకదాని నుంచి ఒకటి విముక్తి పొందుతూ పోవడమే జీవిత పురోగమనం.

వేసిన అడుగు తీస్తూ, తీసిన అడుగు వేస్తూ పోతున్నది సర్వ సృష్టి !

సుఖదుఃఖాల ఈ నిరంతర సంఘర్షణమే - సృష్టి స్థితి లయాత్మకమైన ప్రకృతి ఇతివృత్తం.

ఒకే పరమ పదార్థపు రెండు పాదాలివి. ఇందులో ఏది కదిలినా రెండోది కూడ కదలవలసిందే. ఒకదాని నుంచి ఒకదానిని విముక్తి లేదెప్పుడూ. ఉంటే - అది అవి రెండూ అగినప్పుడే ! అప్పుడే సుఖదుఃఖాలు రెండూ ఒకేసారి విశ్రాంతి పొందడం ! అదే మోక్షం జీవుడికి.

మోక్షం పరమ సుస్థిర స్థితేనా ?

కాదు నా దృష్టిలో !

వర్షకణం పరమ సాగర సంగమాన్ని సాధించినా, తిరిగి ఆవిరి కాక తప్పదు కద ?

మోక్షం సాగరగతస్థితి ! సుఖదుఃఖ తీరద్వయం లేని దది.

నదీ సాగర సంగమం మోక్షం.

రెండు నదుల పరస్పర సంగమం ప్రణయం.

మోక్షం బ్రహ్మానందం

ప్రణయం బ్రహ్మానంద లవం.

ప్రణయం నిత్యచైతన్య ప్రవాహిని ! నవనవోన్మేష శాలిని ! ఇతోధిక సౌందర్య వికాసిని !

ఒకసారి సాగరంలో కలిస్తే - ఆ తర్వాత మరేం లేదు, తిరిగి ఆవిరి కావడం తప్ప !

అందుకే, మోక్షం కోరను నేను.

నేను కోరేది- మనిద్దరం కలిసి, పెనవేసుకొని వెల్లివిరుస్తూ, నిత్య నూతన నిరంతరంగా ప్రవహించడం !

అప్పుడు, సుఖదుఃఖాలనే శాశ్వతంగా కోరుకోవడ మవుతుందేమో !

సుఖ దుఃఖాలు మానసిక వికారాలు ! అవి ఎవరివి వారివేగా ఉండిపోయినై ఇతర్ల సుఖదుఃఖాలను పంచుకోవడం అంటే, వాళ్ళ పట్ల సహానుభూతిని ప్రకటించడం మాత్రమేగా ?

అందుకే -

మనస్సుకు ప్రాధాన్యం ఇవ్వలేదు నేను ఎన్నడూ !

సుఖం లేకపోవచ్చు.

దుఃఖాలు ముసురుకోవచ్చు.

చూచేవాళ్ళు, పలకరించేవాళ్ళు, సాయం చేసేవాళ్ళు, ఆదరించి అక్కున చేర్చుకొనేవాళ్ళు ఎవరూ లేక - చచ్చేటంత ఆనారోగ్యంతో, దిగులుతో - ఈ రసాలినీ లతాకుటీరంలో, ఏకాకిగా పడి ఉంటే ఉండవచ్చు.

చలించను నేను !

నేను ఆత్మను. నీతో కలిసి పరమాత్మను నేను. మనస్సు నా బంటు మాత్రం !

ఏ తుపానులైనా రెచ్చగొట్ట గలిగేది మీది అలలనే. ఏ తదంతఃపుర రత్నరాశిని కాదు !

ఆ రత్నరాశే నేను కద ?

సుఖదుఃఖాలు సమగతిలో నడిస్తే -అది ప్రగతి !

అందులో ఏ కాలు కుంటినా, అది వక్రగతే !

కోటీశ్వరుని జీవితగతీ వక్రమే, నిరుపేద బ్రతుకూ వక్రమే అందులో ఏ కాలు కుంటినా అది వక్రగతే ! చరిత్ర దృష్టి లో !

ధృతరాష్ట్రుడు సుఖభోగే. అయినా, మహాదుఃఖి !

సీత మహా దుఃఖిత. అయినా, మహా ఆనంద !

సుఖదుఃఖాలు మనస్సు వరకే. దాని పరిధిని దాటి బ్రతికే వాళ్ళకు నిత్యం ఆనంద కైవల్యమే !

నీ సంయోగం సుఖం, నీ వియోగం దుఃఖం. అయినా -సుఖదుఃఖాతీతుణ్ణిలా అయాను నేను ?

బ్రహ్మానంద లవ రసానంద సరస్వఆవైన నీవు -

అపరోక్ష రాగవైశాఖివై నాలో, నాతో ఉండిపోవడం వల్ల !

89

నీవు నా దగ్గర లేకపోతే - నా మీద నాకే ఎంతో జాలి !

లోకమంతా కూడ నా మీద జాలి పడుతున్నంత దిగులుగా ఉంటుంది నాకు నీ వియోగంలో.

రేపు శివరాత్రి.

మీ దొడ్డమ్మతో నీవు శ్రీశైలంలో ఉన్నావు. ఏకాకిగా తిరుగుతున్నాను నేను ఈ పౌరోద్యానంలో - వృక్షలతాదులు, శుకభ్రమరాదులు చూపుతున్న అనంతమైన జాలి క్రింద క్రుంగిపోతూ !

జాలి !

జాలి అనగానే నాకు వాల్మీకి జ్ఞప్తికి వసాడు.

ఒక పక్షి మీద జాలిచే, ఒక మనిషినే చంపినవాడు వాల్మీకి !

ఆ పక్షి విలాపాన్ని మించి, విలపించి ఉంటుంది ఆ మనిషి యొక్క జంట !

గమనించిన వాళ్ళే లేరు నేటికీ !

ఒక ప్రాణిపై జాలి మరో ప్రాణిని చంపవచ్చునా ?

నిగ్రహానుగ్రహ సమర్థమైన వాక్కు వాల్మీకిది. పక్షి విలవిల తన్నుకోవడం చూచి, భరించలేక, అనాలోచితంగా అత డేదో అని ఉండవచ్చు. అది బాణంలా ఆ కిరాతకుడికి తగిలి ఉండవచ్చు. వాల్మీకి పశ్చాత్తాప పడవలసిన చర్య ఇది ! జాలికి నిదర్శన మెలా అయింది ?

అదలా ఉంచి -

వాల్మీకి ఆ వాక్కు లయబద్ధంగా వచ్చి ఉండవచ్చు. దానిని స్మార్తిగా తీసుకొని, అదే మాదిరి వాక్కులలో అతడు రామాయణం వ్రాసి ఉండవచ్చు. అది అంతవరకే.

కాని -

శోకమే శ్లోక మయిందనీ, ఆ తొలి శ్లోకం లోనే రామాయణ కథ అంతా వ్యంజిత మయిందనీ పండితు లనడం ఎలా ఉచితం ?

శోకం ఎందుకు ? ఎవరిని గురించి ?

వేట కిరాతుని కులవృత్తి కాదా ?

తన కులవృత్తిని అనుసరించి పక్షిని కొట్టా డతడు. ఆ పక్షి ఏ పరిస్థితిలో ఉన్నదన్న ప్రశ్నే లే దక్కడ. అతడు వేటకు బైలుదేరాడు. పక్షులు కనపడినై. కొట్టాడు. అంతే.

మృగాన్ని చాటు నుంచి కొట్టవచ్చు నని వాలికి రామునిచే చెప్పించిన వాల్మీకి -కిరాతుడు పిట్టను కొట్టవచ్చు నన్న ధర్మాన్ని ఎందుకు ఎరగడు ?

ఒక పక్షి విలాపం కంటె ఒక మనిషి విలాపం గొప్పది కాదా ? ముని శాపానికి గురై నశించిన సంసారాన్ని తలచుకొని ఆ కిరాతుని జంట ఎంతగా తన్నుకొని విలపించిందో !

వాల్మీకి శోకిస్తే, నిజంగా శోకించ వలసింది ఇందుకు !

ఆ శ్లోకంలో రామాయణం ఏదీ ? ఆడపక్షి సీత, మగపక్షి రాముడూ అయితే -కిరాతుడు రావణు డెలా అవుతాడు ?

కిరాతుణ్ణి చంపుత మగపక్షి కాదుగా ?

ఏదో జరిగితే, దాని కేవో అర్థాలు కల్పిస్తారు పండితులు.

పక్షులు, కిరాతుడు, వాల్మీకి, శ్లోకం - ఇవన్నీ కేవలం కాకతాళీయాలు. ఒకదాని కొకటి సంబంధం లేనివి ! వాల్మీకి రామాయణ రచన మానవ మనో వికాస పరిణామంలో ఒక విప్లవలీలా విశేషం మాత్రమే !

అందుకే -

జాలికి పెద్ద ప్రాధాన్యం లేదు నా దృష్టిలో.

ఒకరిపై జాలిపడడం, మరొకరిపై కత్తి దుయ్యడమే.

దౌర్బల్యం ఎక్కడున్నదో, అక్కడ బాధ ఉన్నది. బాధ ఎక్కడ ఉన్నదో అక్కడ జాలి ఉన్నది. జాలిదౌర్బల్య సూచకం.

కనుక –

ఎవరి పట్లా జాలి చూపవద్దు.

నీ పట్ల ఎవరైనా జాలిచూపితే, సహించవద్దు.

జాలి పడబడడం కంటె మరొక దైన్యస్థితి లేదు మనిషికి !

విధి నిషేధాల పరిమితుల మధ్య, ఒక క్రమానికి కట్టుపడి, సాగిపోతున్న ప్రకృతి ఇతివృత్తంలో – ఎప్పుడు ఏది ఎందుకు జరుగుతుందో తెలియదు. తెలిసినా, తెలియక పోయినా ఫలితం ఒక్కటే !

తెలియకుండానే శివరాత్రి పూజాఫలాన్ని పొందిన ఒక బోయ కథ నీకు తెలిసిందే కదా !

కర్తవ్య నిర్వహణం ఒక్కటే మానవ ధర్మం.

లోకంలో మనం చూపవలసింది వివేకం. జాలి కాదు.

అయినా –

ఈ నా ఒంటరితనంపై నాకే ఎంత జాలి !

అజరామ రమ్మైన ఆనంద కామనలో
కరుణమే తొలివలపు కెరటాలు రేపినది !
వాలుగన్నులు తెరచి జాలిగా చూచినది !
చూపె తూపై శాంతి దీపమే ఆరినది !

90

స్నేహితుడే శివుడు నాకు.

స్నేహితుణ్ణి తృప్తి పరిస్తే, శివుణ్ణి తృప్తి పరచినట్టే.

సమస్త ప్రపంచాన్నీ స్నేహంగా చూడగలగడమే శివపూజా పరాయణత.

డాక్టరు ఖాను విందుకు పిలిచాడు నన్ను, కొడుకు పెళ్ళిచేసుకొంటూ– శివరాత్రినాడు !

వెళ్ళడం ఎలా ?

మానడం ఎలా ?

వెళ్ళడమే సబబనిపించిందిద. వెళ్ళాను.

రకరకాల మిత్రులతో, విందులతో, వినోదాలతో బ్రహ్మాండంగా ఉంది కాలక్షేపం !

ఎంతో సంతోషించాడు ఖాను !

అయితే –

నా మనోవాక్కర్మీరాలు ఇక్కడ మేల్కొని ఉంటే – నా చిత్తం శ్రీశైలంలో మేల్కొని ఉంది ! త్రిశుద్ధిగా ఇక్కడ నేను విందు ఆరగిస్తూ ఉంటే – నా ఆత్మ మాత్రం చిత్తశుద్ధితో అక్కడ నిన్ను కలిసి ఉపవసిస్తూ ఉంది !

నేను ఊహించినట్టే నీవు –

పనుపు నీళ్ళలో స్నానం చేసి, పట్టుచీర కట్టుకొన్నావు నిండుగా !

జాజిపూలు పెట్టు కున్నావు పండువుగా !

జాబిల్లిని తురుముకొన్నావు చెండుగా !

జారు ముడి వైచుకొన్న కేశయూధం నుంచి, ఒక్కొక్క పువ్వే జారిపోతూ, అర్చిస్తోంది నీ పసుపు పారాణి అడుగుదామరల జాడలలో స్వయంభూత మవుతున్న భూలక్ష్మిని ! ఆ పూజలే ఆనవాలుగా నీ వెంట తిరుగుతూ, ఆ పువ్వుల స్థానే కొత్త మొగ్గలు తురుముతున్నాను నేను !

పాతాళ గంగ నుంచి నీవు పైకెక్కి వస్తూ ఉంటే – గంగామతల్లే భువనేశ్వేరి అయి శివార్చనకు బైలు దేరిందన్నా రందరూ.

ప్రతి మెట్టూ ఒక మిన్నేరే ఐ మెరిసింది నీ పాదస్పర్శలో !

చుట్టు ప్రక్కల అడవుల్లోని సమస్తబిల్వ లై వృక్షాలు నతమస్తకా నై నీసి !

చుక్కలు బిలబిల వచ్చి వాలినై తుమ్మి పూల వర్ష అన్నట్టు నీ ముందు !

గంగను శిరసా వహించిన శివానీ వలె ఉన్నావు నీవు – తల నిండా ఆ తెల్లని పూల చిరుతావుల కెరటాలతో !

శివుని అర్చించే నిన్ను సమస్త విశ్వమూ అర్చించడంలో వింత ఏముంది కనుక ?

సానువులలోని రత్న కణాలపై ప్రతిఫలిస్తూ, తారా ప్రదీపాల నడుమ మెరిసిపోతూ, మల్లికార్జున స్వామిని అర్చిస్తున్న నీవు - నెల కొక సారి అమావాస్య కావడానికి కారణం ఇప్పుడు తెలిసిం దనిపిస్తున్నావు భక్తుల చేత !

పక్షం దినాలుగా చంద్రుడు ఊర్ధ్వ కళా పూర్ణ దవుతూ అవుతూ, పూర్తిగా ఒక రోజంతా త్రిపురసుందరీ పూర్ణదేవీ రూపంలో, శ్రీశైలంలో మహాదేవుని సన్నిధిలో గడుపుతాడనీ -

అప్పుడు ప్రపంచానికి అమావస్యగా, మహాదేవుని సన్నిధి పూర్ణ పూర్ణిమగా ప్రభాసిస్తుందనీ -

తరవాతి పక్షం రోజులూ పారవశ్యం నుంచి దిగిపోతూ, తాను పరిపూర్ణంగా గ్రోలిన ఆ పరమేశ్వరుని కరుణామృతాన్ని పూర్ణ చంద్రుడై ప్రపంచానికి పంచిపెడతాడనీ -

భక్తులు చెప్పుకోవడం విన్నాను నేను !

ఆ పూర్ణ చంద్రశ్రీవే - నీవు !

శివ సాన్నిధ్యంలో నీవు - ఎంతటి మహనీయ దివ్య దర్శనం అది !

ఆ మహాక్షేత్రంలో, అంతటి మహావైభవం మధ్య, శ్రీశైల రాజకన్యలా నీవు అలా వెలిగిపోతూ ఉంటే - నీ నీడలో మేడ కట్టుకొని, ఆ మేడ కడగదిలో నిన్నే ఆరాధించుకొంటూ ఉండిపోయాను నేను రాత్రంతా !

నీ నీడతో పాటు నీలో చేరిపోయాను నేను ప్రత్యూషంలో !

జగజ్జేగీయమానమైన, జగజ్జీవన లీలా ప్రవర్తకమైన సంధ్యా తాండవాన్ని చూస్తూ కూర్చుండి పోయాను నేను హృదయ కమలంలో !

కాంచన రత్న రాజీవ దివ్యాసనం పై శ్రీ గౌరి నుంచి -

సరస్వతి వీణ, బ్రహ్మ తాళం, విష్ణువు మృదంగం, ఇంద్రుడు వేణువు పట్టి సంగీతం సమకూర్చగా -

శ్రీ లక్ష్మి గొంతెత్తి భువన మోహనంగా పాడుతుండగా -

సప్త సముద్రాలూ, సమస్త లోకాలూ, ఆపాదమస్తకం హర్ష పులకితాలై అనునాట్యం చేస్తుండగా -

ఆనంద తాండవం చేస్తున్నాడు నటరాజు !

ఓహో ! ఉజ్జ్వల రస దర్శనం !

గౌరీ పూజ చేస్తున్నాడు శివుడు - సృష్టి స్థితి లయా మోహనమైన అకాండ తాండవ విశ్వలీలా మహా కళతో !

వందనం చేస్తున్నాడు శివుడు - గాయత్రిగా కూర్చున్న గౌరికి, సంధ్యా సహితుడై !

అరమోడ్పు కన్నులతో, కేలుమోడ్పు శిరస్సున ధరించి, భక్తి పారవశ్యంలో మునిగి ఉన్న నీకు - అందిస్తున్నారు గౌరీ శంకరులు ఆశీస్సుల అమృత కలశాన్ని !

అందుకొని ఆస్వాదిస్తున్నావు నీవు !

తడిసి పోతున్నాను నేను !

నిండి పోయింది నీ హృదయం !

మునిగి పోయాను నేను !

ఓం నమశ్శివాయ !

నమళ్శివాయ సాంబాయ
నటరాజాయ నమో నమః !
నమళ్శివాయ సూర్యాయ
గంగాధరాయ నమో నమః !
నమళ్శివాయ సోమాయ
మహాబీజాయ నమో నమః
నమళ్శివాయ భీమాయ
మృత్యుంజయాయ నమో నమః !

91

"మైధునేన మహాయోగీ మమతుల్యో న సంశయః " అంటున్నాడు మహా శివుడు ! మైధునం వల్ల మహాయోగి తనంతటి వాడవుతాడట ! సంశయం ఏ మాత్రమూ లేదట !

మహాశివుడి కేం? పురుషోత్తముడు !

ఏ పురుషుడైనా పూర్ణ పురుష దశ వరకు మానవుడు. ఆ పైని పురుషోత్తముడు. అతడే భగవంతుడు.

భగవతి కలవాడు భగవంతుడు !

భగవతి నానారూప పూర్ణ ప్రకృతి !

సమస్త సౌందర్యాలూ ఆమెవే.

సమస్ర నామ మాత్రే కాదామె. ప్రపంచంలోని ప్రతి స్త్రీ నామమూ ఆమె పేరే !

అట్టి శ్రీ శక్తి, త్రిపురసుందరి, మహామాయ, మతంగిని - బైట, ప్రక్కన, లోన, చుట్టూ - క్షణాని కో రూపంలో భాసిస్తూ, తాదాత్మ్యంతో రమిస్తూ ఉన్న పరమశివుడు -అలా అనక, మరే మంటాడు ?

మైధునం తప్ప వేరే పనేమున్న దతడికి ?

ఒక్క క్షణం అది లేకపోతే - సర్వసృష్టీ, బ్రహ్మ విష్ణు మహేశ్వరులతో సహా, సర్వశూన్యమై పోదా ?

మైధునం అతడి గుణం, శీలం, రూపం.

అది అతడి విధి, కర్తవ్యం, ధర్మం.

అతడితో సమానం కావాలనుకొనే వా డెవడైనా ఉంటే - అట్టి వాడు నిత్య మైధున క్రియా ధర్మి కావలసిందే కదా ?

ఇందులో రహస్యం ఏముంది ?

సత్యాన్ని ఇంత అసందిగ్ధంగా చెప్పగలడు కనుకనే, మహాయోగులకే పరమ గురువు కాగలిగా డతడు !

మైధునం అంతటి మహా యజ్ఞం కనుకనే, దక్ష యజ్ఞంలో తనువు వీడి సతీదేవి కోసం అంత అల్లరి చేశాడతడు ! దిగంబరుడై, ఉన్మత్తుడై, అతడు ముని పల్లె లో తిరిగిప్పుడే కదా - మునికాంతల కామశక్తీ, మహామునుల నిగ్రహశక్తీ, అరుంధతి శీలశక్తీ లోకానికి వెల్లడి అవుత ? అమృతలింగం మనకు లభిస్త ?

కనిపించని ఆత్మాదుల కంటె, కనిపించే శరీరమే ఎంత ముఖ్యమో శివుని సతీవియోగ ఘట్టమే చెపుతున్నది వేనోళ్ళ !

శివు డంతటి వాడే ఉండలేడు శివ లేకుండా !

మహా కామిని శివ !

కామకళ, శృంగారకళ, జీవకళ ఆమె !

అత డెలా కోరితే అలా - ఆ రూపంలో, ఆ వైఖరిలో, ఆ పేరుతో అతణ్ణి రంజించే సౌందర్య లహరి ఆమె !

మందారం - మకరందం !

మేఘమాల - మెరుపుతీగ

కొండకొలను -సంజ కెంజాయ

కోకిల - గున్నమామిడి

చీకటి రేయి - వెన్నెల వాగు

మధుర ఝరి - మహా సముద్రం

" ఎందు కీ జాబితా ? ఆమె కానిదేదో చెప్పరాదా" అంటావు ?

అవును. నీకు జాబితా లంటే కిట్టవు.

ప్రపంచమే తానైన దేవి, ఏమి కాజాలదు ?

అలాంటి మహా మైధున పరమేశ్వరుడు - తనతో సమానులు కావాలనుకొనే వాళ్ళకు మైధునాన్ని ఒక అర్హతగా నిర్ణయించాడంటే - అందులో వింత ఏముంది ?

నవ్వుతున్నావు కదూ నీవు ?

నన్ను బాగా వాగనిచ్చి, చివరకు నేను చెప్పినదంతా తప్పనడం నీకు అలవాటై పోయింది !

" మరి - మహాయోగులు మైధునం చేసినట్టు లేదే ఎక్కడా " అంటావు కదూ !

ఎవరేమి చేశారో ఎవరు చూశారు ?

పైకి ముక్కు మూసుకు కూర్చుంటారు. లోపల అన్నీ చేస్తూనే ఉంటారు. పెద్ద మునుషులుగా చెలామణీ అయే వాళ్ళంతా పరమ రహస్యాలు కలవాళ్ళే !

మేనకా విశ్వమిత్రం, అంబికా వేదవ్యాసం వంటి ఉదంతాలు లెక్కకు మించి లేవా మన పురాణాల నిండా ?

" అవన్నీ ప్రయోజనాత్మక సంయోగాలు. ఆనందాత్మక మైధునాలు కావు.

ఆత్మ తాదాత్మ్యం లేదు వాటిలో. బ్రహ్మానంద సబ్రహ్మచారులు కారు ఆ జంటలు " అంటావు నీవు మళ్ళీ !

అవును. అదీ నిజమే.

అయితే - విను !

ఊర్వశి నీకు తెలుసుగా ?

సీరి కాదు. అసలు ఊర్వశి ?

నారాయణ మహర్షి తొడ లోని ఒక వెంట్రుక ముక్క ఆమె !

నర నారాయణుల తపస్సును భగ్నం చెయ్యడానికి ఇంద్రుడు రంభాదులను పంపగా - నారాయణ మహర్షి నవ్వి, తన తొడ లోని ఒక వెంట్రుకను పెరికి, వాళ్ళ ముందుకు విసరగా - అది వాళ్ళందరినీ మించిన సౌందర్యవతై వెలిసింది !

అదే ఊర్వశి ! ఊరుజ !

ఒక పరమయోగి వెంట్రుక !

అతడు తన ఒకొక్క వెంట్రుకతో ఒకొక్క భువన సుందరిని సృష్టించి ఉంటే - ఏమయేవి లోకాలు ?

అంతటి శక్తివంతులు మహర్షులూ, మహాయోగులూ.

వాళ్ళకు సామన్య స్త్రీ లెందుకు ?

ఊర్వశే వెంట్రుక ముక్క అయితే, సామాన్య స్త్రీ వట్టి గడ్డి పోచ కూడ కాదు కద !

అట్టి ఒక మహాయోగి మహాశివుడే కావాలను కొంటే - అతడు రమించ వలసింది ఊర్ధ్వశ్రీ అయిన ఒక్క మహాశక్తి తోనే !

మహాశక్తితో రమించినవాడే మహాశివుడు.

ప్రతి శరీరంలోను శివుడున్నాడు ఆత్మ రూపంలో.

సహస్రారపద్మం లోని తానే శివుణ్ణని తెలుసుకొన్న జీవుడు యోగి అవుతాడు. మూలాధారంలో తపస్సు చేసుకొంటున్న కుండలినీ కన్యను లేపుకు పోయి, ఆమెతో రమించిన మహాయోగి, మహాశివుడే అవుతాడు !

తానే శివుడు
తన శక్తే కుండలిని.

తన శక్తిని తనలోకి ఉపసంహరించుకోవడమే జీవబ్రహ్మైక్యం.
మహాయోగి మైథునంతో శివుడు.
నేను నీతో శివుణ్ణి !

ఏ రూపమును లేని, ఏ కోర్కెయును లేని,
ఆనంద మహితమౌ ఆదర్శమునె నేను !
నను జూచు ప్రతి ముఖము నా ముఖమెనే, చెలీ !

చూచుకొని సుఖపడుట కే చెలియు లేకుండ
వట్టి అద్దము బ్రతుకు వ్యర్థమే కదటే ?
పరమ శూన్య దటంచు పాయకే నను, చెలీ !
నిను గూడి పరమ శివుడనె కానటే, చెలీ ?

ఫాల్గుని

ఒకేసారి చూశాను నేను నీ వెనుక ముందుల్ని !

ఎంత రమణీయం ఆ దృశ్యం !

ఎంత పుణ్యం చేసుకొన్నై నా కన్నులు !

చంద్ర, సూర్యులను ఒకే చేత బంతులాడగల పరమయోగి నా కంటె ఏం గొప్ప ?

అటు – శృంగార కళా మూర్ధస్థమై ఫాల్గునీ పూర్ణచంద్ర బింబం !

ఆ క్రింద – ఆనందంతో ఉబ్బి తబ్బిబ్బు పడుతున్న ఉత్తర ఫల్గునీ తారాద్వయం ! హస్త కమల కలశుణ్ణై ఆ వెనుక నేను !

ఇటు – మాఘ కుహూ తమోరాశి స్వరాజ్యం నిర్మించుకొన్న పుష్కల కేశ శ్రీ ! భ్రమారాంబికా కరుణా కటాక్ష సహస్రాలు నా కోసం నిన్ను పొంది, భ్రామరీ స్నిగ్ధజీవ కాంతులతో వరదలై, హిమనీ జలపాతంలా నా వక్షం పై జాలువారుతున్న కైవల్య విక్షేపం !

ఇటు లేత సంపెంగ పూల తావులు, అటు నీ ఆనందలోల లోచన చంచరీక సరిగమలు, నా ప్రాణవాయువుల చుట్టూ దోబూచు లాడుతున్నై !

అటు పండు వెన్నెల, ఇటు చిమ్మ చీకటి –అటు పట్టపగలు, ఇటు బహుళ రాత్రి – అటు శ్రీగిరి, ఇటు శ్రీకాళహస్తి !

ఎర్ర నారింజ రంగు వెలుగు చూపులతో నా హృదయాన్ని రాగ రంజితం చూస్తూ, వెనుదిరిగి నిల్చిన కామ పూర్ణిమలా, ఎంత అలవోకగా అందించావు నాకు -నీ భుజం మీది నుంచి వెనక్కి దువ్వెన !

ఎన్ని అందాలతో మెరిసిపోయింది అద్దం !

ఈ అదృష్టం కోసమే ఏమో - అది నా దగ్గర ఇంతకాలం పడి ఉంట !

నీ కేశరాశిని ఎద మీద పరచుకొని, రెండు భుజాల మీదా చేతులు ఉంచి, శిరస్సుపై గడ్డం ఆన్చి, చూస్తున్నాను - నేను అలా వెనుక నుంచి నీ ముఖంలోకి !

అలా ఎంతసేపని ?

క్రమంగా నా పాణి పల్లవ వృంతంలో మర్యాదలు స్వీకరిస్తున్న నీ వదన కల్హారం నా పెదవుల వరకు వికసించడం -

జన్మ జన్మాలుగా నా కోసమే నింపి ఉంచబడ్డ అమృత కలశం అంచులు నా నోటికి అందడం -

పెచ్చిల్లిన తమకంతో కంపించిపోతూ, ఆ వేగం ముప్పిరిగొన, ఒకే ఒక గ్రుక్కెడు గ్రోలి, నేను ఉక్కిరి బిక్కిరై పోవడం -

అద్దం మనల్ని చూచి సిగ్గుపడి పోయి, ముఖాన్ని ముద్దుల్లో దాచుకోవడం-

ఎంత రమణీయం !

ఎంత అదృష్టవంతుణ్ణి నేను !

శ్రీ శైలం నుంచి తెచ్చిన శివచరణ సేవాప్రసాదం ఎంత మహనీయంగా ఉంది - నీ అధరామృతంతో కలిసి !

ఓహో -

రాగ సరస్వతీ !

రాగోదయ గీతీ !

93

" నే నెవరి కోసం ? మీ కోసమే కదా? " అంటావు నీవు.

అలా అంటూ, నీవు శశిలో శశబాల లా ఒడిలో ఒదిగినప్పుడు, చతుర్ముఖ బ్రహ్మనే అయిపోతాను నేను నీ ముఖంలో !

నేను ఊహించుకొన్ని రాగం, గీచుకొన్న బొమ్మ, మలచుకొన్న శిల్పం, పాడుకొన్న పాట, నిర్మించుకొన్న కావ్యం రాగ మోహన మనోరమంగా నా ఎదట సాక్షాత్కరించి, అంటున్నట్టే ఉంటుంది నా కా మాట !

రమణీయ రాగ రసాకృతి –నా అభ్యంతర సుందర కళా సరస్వతి – నా గుండె గుమ్మం తెరచుకొని, బైటికి వచ్చి, నా అంక వేదికపై కూర్చుని, ఆనంద చుంబనంలో తడిసి పోయిన చిరునవ్వుల్ని నా ముఖం మీద ఆరబోసుకొంటూ, సరస మాడుతున్నట్టు ఫీలవుతాను – నీ ప్రశ్ననూ, నిన్నూ చూస్తూ !

నేను కళా స్రష్టను

నీవు నా కళవు.

నీకు తండ్రిని, ప్రియుణ్ణి, కుమారుణ్ణి కూడ నేనే !

కళ కళ కోసమూ కాదు, లోకం కోసమూ కాదు.

కళ స్వయంభువు కాదు. సహజ సిద్ధం కాదు. తనను తానే తినేసుకొనే జీవ విశేషం కాదు. ఇతర్ల కోసం మార్కెట్లో పెట్టే మిఠాయి కూడ కాదు.

కళ కళ కోసమే అనే వాదం ఎంత అర్థరహితమో, కళ లోకం కోస మనే వాదం అంతే జీవరహితం !

కళ ఎవరి కోసమూ కాదు: అది ఏతత్కళాస్రష్ట కోసమే !

ఆత్మానందం కోసం, ఆత్మను వ్యక్తీకరించుకొంటూ, అపూర్వ సౌందర్యాన్ని సృష్టిస్తాడు కళాస్రష్ట.

ఎందుకు చేస్తా డతడు ఆ పని ?

చెయ్యకుండా ఉండలేడు కనుక !

బ్రహ్మ యొక్క ఆనంద కామనే కదా సృష్టికి మూలం ?

సృష్టి నిండా బ్రహ్మానందం కామరూపంలో ప్రవర్తిల్లడానికి అదే కదా హేతువు ? ఆనంద జన్మమైన ఆత్మ ఏతదాసేంద లవాన్నే ప్రాణాధికంగా కోరడంలో పాపం ఏముంది, మరి ?

ఆనంద ఫలం జీవసృష్టి; కనుక –

జీవేశ్వర సంయోగ సముద్భన సుధారసం ఆనందం, కనుక –

స్వీయాత్మోపరతి నుంచి పుట్టిన అట్టి ఆనందం నుంచి చేస్తాడు సృష్టి – కవి, చిత్రశిల్పి, గాయకుడు – ఏ కళాబ్రహ్మ అయినా !

ఆనందకళ ఇంటి భోజనం

వ్యాపార కళ హోటలు భోజనం.

ఆనంద కళ విశ్వజనీనం, విశ్వజన భోజ్యం అవుతుంది. ఏతత్కళా సృష్ట విశ్వానుభూతిపూర్ణుడై ఉన్నప్పుడు !

సార్వకాలిక, సార్వదేశిక, సార్వజనిక సహజానుభూతు లన్నీ హృద్గతమై ఉన్న స్రష్ట - ఆత్మానందం కోసం సృష్టించు కొన్న ఏ లవమైనా సరే - అది సర్వజనానందకరమే అవుతుంది.

బ్రహ్మ చేసిన బొమ్మ, చిత్రముగ తిరిగి
బ్రహ్మనే బొమ్మ చేసిన పడక టిల్లు
ఈ ప్రపంచము ; ఇందులో నెవరు లేరు ;
సతము మన బొమ్మ బొరుసులే సందడించు !

కళ తత్కళా స్రష్ట కోసం.

నీవు నా కోసం !

షోడశ కళా పరిపూర్ణ పూర్ణ సుధాకర సుందరివి నీవు.

ఆక్లేత నామితం - పరమ కల్యాణ కళా సామ్రాజ్య రాజ్యదవు నీవు.

నా ఆనంద యోగ రాగ కళా రమవు నీవు.

నీ ముఖ భూషణమే అహస్సు

నీ కేశ చాలనమే యామిని

నీ పాద కర్షణమే జగజ్జీవన కృషి.

అణువుగా నాలో గల విశ్వ సౌందర్యమే రసావిష్టమై రమ్యాకృతి తాల్చిన రాగ సరస్వతీ ! ఏమంటున్నావు ?

" నే నెవర్ని ? మీరే కద ! "

ఎవరవో నీవు, నే నెవరనో జగతిలో !

తెలిసికొను టెందుకే త్రిజగన్మనోహరీ ?

ఒకరి ఆనందాగ్ని కొకర మింధన మంతె !

ఒకరి స్వారస్యాని కొకర మింద్రియ మంతె !

బ్రహ్మ సృష్టియె బ్రాహ్మి, భవుని శక్తె భవాని,
మధుభావ సుభగయే మాధవునిలో లక్ష్మి ;
నాలోని నీవే కద్ల నా కళా జగ మెల్ల ?
నీ లోని నేనె కద నీ జగత్మథ యెల్ల ?

94

కనిపించి, కబుర్లు చెప్పి - చల్లగా వెళ్ళిపోయావు నీవు
హృదయం తేలిగ్గా ఉంది నాకు.
మనస్సు ఆహ్లాదం నుంచి తేరుకోలేదు
శరీరం నిండా ఏదో హాయి.

ఎంతో తృప్తిగా, వివశత్వంతో, పున్నమి ముఖం లోని నల్ల కల్వ వలె అరమోడ్పుగా చూస్తూ, విప్పారిన ముద్ద మందారం వలె చిరునవ్వులు చిందుతూ, ఒకడుగు ముందుకూ - ఒకడుగు వెనక్కూ వేస్తూ, గుండెల్లో గుచ్చుకు పోయిన మన్మథ బాణాన్ని మెల్లగా తీసినట్టు తీసుకొన్న నీ వీడ్కోలు - వాత్స్యాయనుడికి కూడ వైఖరీ బోధకమే కదా !

అందుకే అంత ఉల్లాసం నాలో !
బైలుదేరాను మధుశిల నుంచి
ఎటో, ఎక్కడికో, నిర్లక్ష్యంగా -
ఇప్పుడు సర్వాధికారాలూ కాళ్ళవి.

హృదయం, మనస్సు, ఆత్మ - మొత్తంగా నీతో, నీ కూడా వెళ్ళిపోగా - మిగిలిన శరీరానికి ఈ భూర్భువ ర్లోకాలలో కాళ్ళే బాధ్యత వహించినై.

నా కాళ్ళపై నాకు సంపూర్ణ విశ్వాసం ఉంది. అందాలకు, ఆనందాలకు మాత్రమే నడిపించుకు పోతై అవి నన్ను !

ఎక్కడ పుట్టాను !

ఎలాంటి నిప్పుల్ని, మంటల్ని, ముళ్ళని, మురికిని దాటుకొంటూ - ఎంత దూరం నడ్డిచ్చి వచ్చాను నేను ఇక్కడికి !

ఇక్కడ నీ సమక్షానికి !

ఈ పాటికి ఇల్లు చేరుకొని ఉంటావు నీవు.

పొరోద్యానం చేరుకొన్నాను నేను.

ఉద్యానం నీకులా ఎంత దివ్యంగా ఉంది !

కారాకులు రాలిపోతున్నై, కొత్త చివుళ్ళు తొంగి చూస్తున్నై.

పూచేస్తున్నై కొన్ని చెట్లు.

ఫాల్గుణ పూర్ణిమే వసంతారంభం నిజానికి !

ఎంత మనోహరంగా ఉంది వాతావరణం !

కాసారాలు పొంగి ఉన్నై !

కలువలు కమ్మగా పాడుతున్నై - తుమ్మెద గొంతుకలతో.

కోకిల కింకా కబురంది నట్టు లేదు.

పచ్చికలో ఆడుకొంటున్నారు పిల్లలు - పువ్వులతో కలిసి.

పూచిన రేల చెట్లతో పందాలు కట్టి ఎగురుతున్నై - నైలాను చీరలు, వాయిలు పమిటలు, పతంగ బాలలు !

సీతాకోక చిలుకలు కామదేవుడికి కళ్ళద్దాలై, దారులు చూపు తున్నై - పూల కాంతల పరదాలలోకి !

రంగు రంగుల పూలు, రకరకాల పూల చెట్లు !

ఏ చెట్టు ప్రక్క నిలబడ్డా, నీ ప్రక్క నిలబడ్డట్టే ఉంది నాకు !

ఇక్కడ తిరుగుతుంటే, నీ ఒడిలో మసలుతున్నట్టుంది నిజంగా !

ఈ పొదలో కూర్చుంటే, నీ ఎదలో కూర్చున్నట్టుంది హాయిగా !

నీ అనురాగంలా ఈ సంధ్యారాగం !

రకరకాల పూల తావులతో రంగు రంగుల గాలి కెరటాలు !

మై మరపులా చీకటి !

నీ నల్ల పట్టు పమిటె క్రింద పరవశమైపోయి నప్పటి ఆనందం !

తన శరీరం తనకు బరు వనిపించడం వార్ధక్యం.

ఈ స్థితి వయస్సును బట్టి రావచ్చు. మనస్సును బట్టి రావచ్చు.

త్వరగా రావచ్చు. ఆలస్యంగా రావచ్చు.

ఆసలు రాకనే పోవచ్చు కొందరికి.

మన పురాణాల్లోనూ, హిమాలయాల్లోనూ మాత్రమే కాక – మన గ్రామాల్లో కూడ ఉన్నారు నేటికీ – ఎంతోమంది చిరంజీవులూ, నిత్య యౌవనులూ.

నూట పన్నెండు సంవత్సరాల వయస్సు గల మా బంధు వొకడు, పన్నెండు సంవత్సరాల వయస్సు గల నాతో సమానంగా పచ్చిక బీళ్ళలో పశువుల్ని కాచే వాడు !

వార్ధక్యానికీ, వయస్సుకూ సంబంధం లేదు.

రస లుబ్ధులకు వార్ధక్యం లేదు.

రసమే అమృతం.

నవ రసాలలో అది ఏ రసమైనా సరే – ఏదో ఒక రసంలో మగ్నులై, ఏదో ఒక తపస్సులో లగ్నులై, ఏకాగ్రతతో జీవితాన్ని అనుభవించే వాళ్లే అమృతం సేవించిన వాళ్ళు – జరామరణ రహితులైన ఋషులు !

అట్టి వాళ్ళు శతవృద్ధు లైనా, చచ్చేవరకూ యువకులే ! చచ్చినా, కీర్తి కాయులైన అమరులే !

కీర్తి లౌకికమే కానక్కరలేదు. లోకానికి రోజు కొక సుప్రభాతాన్ని ప్రసాదించే పారలౌకికం కూడ కావచ్చు అది.

" గొప్పవాడు చచ్చాడు. ఒక చుక్క నేలకు రాలింది. పేదవాడు చచ్చాడు. ఒక చుక్క నింగికి లేచింది " అన్నాడు విశ్వనాథ !

పరమాత్మ మనకిస్తున్న వరాలన్నీ దరిద్రుల సేవా జీవిత నిక్షేపం నుంచి కైకొన బడినవే కావచ్చు !

దరిద్రులు, పీడితులు, కార్మికులు, కర్షకులు లోకానికి తమ నెత్తురు ఇవ్వ వచ్చిన దేవతలూ –

లంచగొండులు, లక్ష్మీపుత్రులు, కల్తీ చేసేవాళ్ళు, అధికార దుర్మదాంధులు, దోపిడీగాండ్రు, లోకం నుంచి నెత్తురు పిండుకపోవడానికి వచ్చిన యమదూతలూ – కావచ్చు !

చెప్పలేం.

ఎవరు ఎవరో,వాళ్ళ వాళ్ళ నిజస్వరూపాలు తెలియ వచ్చేది అక్కడ. బుద్ధుడ ప్రాయమైన ఇక్కడ కాదు.

ఏది ఏమైనా –

రస లుబ్ధులకు వార్ధక్యం లేదు.

రసాస్వాదన నైరంతర్యమే నిరంతర యౌవన వైభవ భోగలీల !

మల్లెపువ్వు ముసలి దెన్నటికీ కాదు ! మామిడి పండుకు వార్ధక్యం లేదు.

స్త్రీ వర్గానికి నీవు వలె, రసవర్గానికి శృంగారం రాణి !

శృంగారమే రసం, రసమే శృంగారం

వీరం, కరుణం వగైరాలు రసాలు కావడానికి హేతువు – వాటికి శృంగారంతో కల బాంధవ్యమే !

నిరుద్ధ శృంగారం వీరం

భగ్న శృంగారం కరుణం.

రామాయణమే ఉదాహరణం ఇందుకు.

కవిత, గానం, నృత్యం, చిత్రకళ – ఇవన్నీ శృంగారానికి అలంబనాలు.

ఈ కళలలో పారం ముట్టిన తనస్సులు నిత్య యౌవనులే.

భూత భవిష్య న్నైరంతర్యాన్ని ఆత్మగతం చేసుకొన్ని సిద్ధులు ఈ రస లుబ్ధులు !

శృంగారమే యౌవన శ్రీ !

దాని ఆరాధనమే అజరామృత శ్రీ !

శృంగార రసోపాసకులకు మృత్యువే లేదు, ముసలితన మెక్కడిది ?

స్త్రీకి శరీరం, పురుషులకు మనస్సు – వార్ధక్యాన్ని సూచిస్తారయనేది సామాన్యుల విషయం లోనే !

నా వంటి రసోపాసకులు, నీ వంటి రాగరాగిణులు కాలాతీతులు.

మంచి చెడ్డలు, చీకటి వెలుగులు, సుఖ దుఃఖాలు, రాగద్వేషాలు, జీవన్మరణాలు కూడా లేని కాలాతీత పరాశక్తులం మనం.

రాగమే తప్ప, మనకు ద్వేషం లేదన్నాడు కదూ ప్రసాదరావు ?

అది అతడి సౌహార్దం.

నేను చతుష్షష్టినీ, నీవు కేవల అష్టాదశివీ కావచ్చు –

నీవు శత వృద్ధవూ, నేను కేవల బాలుణ్ణీ కావచ్చు !

ఏ జన్మలో, ఏ వయఃపరిధిలో కలుసుకొంటామో మనం !

అయినా –

కలుసుకొని తీరతాం, గుర్తించుకొని తీరతాం – ఐక్యమై ఒకరిలో ఒకరం !

ఎవరూ నిరోధించలేరు మనల్ని !

అది దంపతులం మనం.

అద్యంత రహితమైన ఈ విశ్వలీల సమస్తమూ మన కామ కళా రాగ లీలే కద !

నీవు కృతయుగం నాటి ఆదిమహాలక్ష్మివీ, నేను కలియుగం లోని దరిద్రనారాయణరావునూ కావచ్చు గాక –

మన వయస్సుల లోని తేడా నాలుగు యుగాలే కావచ్చు గాక –

మనం ఒకరి నొకరం ప్రేమించు కొన్నప్పుడు – మనం వధూ వరులం.

వధూవరులు నిత్య యౌవనులు.

అవి అనంత రసానంద మహా పయోనిధిలో రెండు ఆత్మలు, రెండు హృదయాలు, రెండు ప్రేమ స్పందనలు, రెండు శరీరాల గుర్తే లేని రసబ్రహ్మలు !

రసబ్రహ్మ కాలాతీతం, దానికి వయసు లేదు.

అయితే –

వార్ధక్యం అనే పదానికి ఎనభై సంవత్సరాలు దాటిన వయస్సు అని అర్థం చెపుతున్నై మన నిఘంటువులు !

ఈనాడు మన దేశంలో – ప్రతివాడికీ, తన కంటె ఒక సంవత్సరం పెద్దవాడైన ప్రతివాడూ వృద్ధుడే కద ?

ఇరవై సంవత్సరాల వాడికి, ఇరవై ఒక్క సంవత్సరాల వాడు వృద్ధుడు !

ఎంత పతనమై పోయాడు మానవుడు - ముఖ్యంగా మన దేశంలో !

ఈ పతనానికి బాధ్యులు యువకులు కాదు - వాళ్ళ నైతిక నాయకులు !

మానవ ప్రవృత్తినీ, ప్రకృతి సర్వతోముఖ ప్రగతినీ నాశనం చేసిన వాళ్ళెవరో తెలుసా ?

ప్రవక్తలూ, నీతి బోధకులూ, సంఘ పెద్దలూను !

మనిషి కాలాతీతుడు !

అతడికి వయస్సు లేదు !

నీవే అది - ఎడమగా

నేనే అది - కుడిగా !

ఇద్దరం అదే - పరిపూర్ణ జీవితంగా !

ఏనాటి కృష్ణుడో - ఏ నాటి రాధయో -
ఈ నాటికిని రసధ్యేయమే ఆ జంట !

అమృత యౌవన మొక్క ఆనందరస మేనె !
వసుధలో రసపిపాసకు లేదు మిమ్లాస !

నాకు నీవే రసము - నీకు నేనే రసము -
నిను నాతొ, నను నీతొ నింపుకోవే, చెలీ !

96

వివాహం శిశిరం లాంటది స్త్రీకి !

కొందరికి వసంతం వస్తుంది ఆ తర్వాత. ఎక్కువ మందికి మాత్రం ఆ తర్వాత వచ్చేది విషమ హేమంతమే !

కోకిలలా పాడుకొంటూ, మయూరంలా ఆడుకొంటూ, లేడి పిల్లలా గంతులు వేస్తూ, ముద్దబంతి చెట్టులా ముద్దులు చిలుకుతూ - పదహారు ఇరవై ఏళ్ల పాటు పుట్టినింటిని నిత్యవసంతంగా కలకల్లాడించిన ముగ్ధ మనోహర మూర్తి - ఆ మూడు

ముళ్ళూ పడగానే, ముళ్ళ కంచెలో బందీ అయిపోతుం దొక్కసారిగా ! స్తంభించిపోతై ఆమె కళా సౌందర్యాలన్నీ ! మ్రోడులా నిలబడి పోతుందామె విభ్రాంతితో !

ఆ వివాహం వెనుక ఉన్నది అవ్యాజ ప్రణయమే అయితే, అనురాగంగా వికసించే సహజస్ఫూర్తి దానికుంటే, ఆ కట్టుకొన్నవాడు కళా ప్రియుడైతే, ఆమె బీజంలో ఉన్నది ఊర్ధ్వశ్రీ శక్తే అయితే – అట్టి స్త్రీ జీవితం నవనవోన్మేష మధుమాసమే అవుతుంది ఆ తర్వాత.

తమ స్త్రీత్వాన్ని కాపాడుకొంటూ – జన్మత: తమకు లభించిన కళలను, అభిరుచులను, సౌందర్యాలను పోషించుకొంటూ – కృష్ణుణ్ణి రుక్మిణిలా, సత్యలా, జాంబవతిలా, నీలలా, తమ స్వభావాన్ని బట్టి భర్తను ఆరాధించుకొంటూ – తాము స్త్రీలుగా బ్రతుకుతూ, తమ భర్తలను పురుషులుగా బ్రతకనిచ్చే భార్యలు చాలమందే ఉన్నారు లోకంలో !

అదృష్టవతులు వాళ్ళు.

భర్త ఎదుట మరొక పురుషుడితో వాత్స్యాయనుడి కామసూత్రాలనే చర్చావిషయంగా ప్రతిపాదించింది ఉభయభారతి.

జనకుడి మహాసభలో, వేదాంత విద్యాగోష్ఠిలో యాజ్ఞవల్క్య మహర్షినే ఎదుర్కొన్నది గార్గి.

ధన ధాన్యాది ఐహిక సంపద లన్నిటినీ రోసి, బ్రహ్మవిద్యను కోరింది భర్త దగ్గర మైత్రేయి.

భర్త అలసట పొందితే, తానే నరకుడితో యుద్ధం చేసింది సత్య.

మగడు వదిలేస్తే , తానే బిడ్డల్ని పెంచి ప్రయోజకుల్ని చేసింది సీత .

పూర్వ భారతంలో ఇలాంటి మహితాత్మ లైన మహా మాతంగినులు లక్షలాది !

నేడూ ఉన్నారు అలాంటి మహా మహిళలు ఎందరెందరో.

వర జన్మలు వాళ్ళు.

వాళ్ళ నలా వదిలేద్దాం.

మరో రకం వాళ్ళు కూడ ఉన్నారు.

ప్రేమించి పెళ్ళి చేసుకొన్నది కమల సుందరి. ఆ తర్వాత తెలిసింది – అప్పటికే అతడికి మరొక భార్య ఉన్నదని !

మేఖల మంచి గాయని. తన గురువునే ప్రేమించిం దామె. వాళ్ళ నాన్న దృష్టిలో అతడు చెడ్డవాడు. ఒక మంచివాణ్ణి తెచ్చి పెళ్ళి చేశా డామెకు. ఆ మంచివాడికి అప్పటికే ఒక భార్య, ఇద్దరు ముగ్గురు ప్రియురాండ్రు !

ఎన్నో వేలు కట్నం పోసి, ఎంతో ఇదిగా పెళ్ళి చేశాడు వాళ్ళ నాన్న తారావతికి. ఇంటికే తెస్తా డతడు రోజుకొక వన్నెల విసనకర్రను !

ఇలా – ఎంద రెందరో !

అందరూ సుఖం గానే చేసుకొంటున్నారు కదా కావురాలు ?

కారణం ?

సర్దుకుపోవడం !

రకరకాల సర్దుబాట్లతో కూడుకొన్నదే జీవితం.

ఇలాంటి సర్దుబాట్లు చేసుకోగలది ఒక్క స్త్రీ మాత్రమే.

కారణం ?

స్త్రీకి పురుషుడు ఒక్కడే కనుక !

స్త్రీకి శరీరమూ, మనస్సూ, హృదయమూ, ఆత్మా – సమస్తమూ ఏక ముఖమై ప్రగమిస్తుంది కనుక !

నిజమైన స్త్రీ – శరీరాన్ని ఒకడికీ, ఆత్మను మరొకడికీ ఇవ్వజాలదు కనుక !

చాలమంది మామూలు స్త్రీలకు శరీరాలే తప్ప, ప్రత్యేంగా ఆత్మ లుండవు. వాళ్ళు శరీరాలు కలిసిన చోటనే ఉండిపోతారు – ఎన్ని కష్టాలైనా ఓర్చుకొని.

కొద్దిమంది మానవతులకు ఆత్మలే కాని, శరీరాలు ప్రధానం కాదు. అట్టి వాళ్ళు ఆత్మలు కలిసిన చోటనే ఉండిపోతారు. అమరణ బ్రహ్మ చర్యం పాటించవలసి వచ్చినప్పటికీ లెక్కచెయ్యకుండా.

ఈ రెండు రకాల స్త్రీలూ గొప్పవాళ్ళే. శరీర ప్రాధాన్యం గల స్త్రీది లౌకికానందం. ఆత్మ ప్రాధాన్యం గల స్త్రీది బ్రహ్మానందం. ఒకటి అన్నం. రెండోది అమృతం.

శరీరాన్ని ఒకడికి, ఆత్మను మరొకడికి ఇవ్వవలసి రావడం కంటె మరో దౌర్భాగ్యం లేదు స్త్రీకి. అట్టి స్త్రీ జీవితం ఒక నరకం.

మేఖల అలాంటి నిర్భాగ్యురాలు.

ఆమె ఆత్మ ప్రియుడి దగ్గర, శరీరం భర్త దగ్గర ఉంటున్నవి. ఒక మాదిరి పిచ్చిది ఇప్పుడామె. ధైర్యంగా తన ఆత్మేశ్వరుణ్ణి పొందలేక పోయింది. సహజ మూర్ఖత్వానికి ప్రతీక అయిన తండ్రిని ఎదిరించలేక పోయింది.

తాను విశ్వసించిన ధర్మం కోసం పోరాడి, చావో బ్రతుకో తేల్చుకొనే సాహసం ఉన్న వాళ్ళదే విజయలక్ష్మి. పిరికితనం అధఃపతనమే.

నీ లేఖలు చింపేస్తే చింపేసిందిలే. ఏమీ అనకు ఆమెను.

తండ్రిని ధిక్కరించి, ఆత్మేశ్వరుడి కోసం త్యాగం చెయ్యగలిగి ఉండి ఉంటే – మేఖల నీ అంతటి సౌభాగ్యవతి అయి ఉండేదే.

ఇప్పుడు ఆమె ఆత్మికంగా ఒక పతిత !

ధైర్య సాహసాలు కల స్త్రీకి ప్రేమభగ్నత అనేది లేదు. ఆత్మను ఇచ్చుకొన్న చోటనే శరీరాన్ని కూడ ఇచ్చుకొని తరించగలదు ఆమె.

శరీరాన్ని ఇచ్చుకోలేక పోయినా, బాధ పడ దామె.

ఆత్మానందమే శాశ్వతానందం. అది లభించిన స్త్రీ, అట్టి ఆనందాన్ని చవిచూచిన స్త్రీ, శరీరాన్నే త్యాగం చేసి వెయ్యగలదు అందుకోసం.

సృష్టి స్థితి లయాలకు మూలభూతం శృంగారం.

శృంగారం రెండు భాగాలు. ఒకటి విప్రలంభం. రెండు సంభోగం.

విప్రలంభానికి లక్ష్యం సంభోగమే.

సంభోగ మంటే ఏమిటి ?

స్త్రీ పురుష లైంగిక మర్మాంగాల సంపూర్ణ సంగమ మేనా సంభోగ మంటే !

ఒక వలపు చూపు, ఒక తీయని ముద్దు, ఒక మెత్తని కౌగిలి, ఒక వెచ్చటి నిట్టూర్పు, ఒక చన్నుల స్పర్శ, ఒక పెదవుల పానం, ఒక మనోలాలన, ఒక ఆత్మస్పందన – వీటిలో ఏ ఒక్కటి లభించినా, అది సంపూర్ణ సంభోగమే. అట్టి ప్రేయసీ ప్రియులు శాశ్వతానంద రసబ్రహ్మలే.

ఈ రహస్యం తెలిసిన శ్రీలక్ష్మి వంటి ఆనందవతులు బహు కొద్దిమంది. తెలియని మేఖలలు అసంఖ్యాకం .

అసాధారణ పరిస్థితుల్ని ఎదుర్కోవలసి వచ్చే ఇలాంటి వాళ్ళను కూడ అలా ఉంచేద్దాం .

ఇక -

లోకం నిండా నిండి ఉన్న సామాన్య స్త్రీల జీవితాలే కదు దయనీయంగా తయారవుతై వివాహానంతరం !

పుట్టుకతో ఎంతటి మధుకలశంగా ఉంటుందో, అంతటి కఠిన శిలగా మారిపోతుం దామె భార్య కాగానే !

స్వేచ్ఛ పోతుంది. వీణ బూజు పడుతుంది. గజ్జెలు తుప్పు పడతై. గాత్రం పూడిపోతుంది . వ్యక్తిత్వం నశిస్తుంది . నిరాశ , నిస్పృహ కుడి ఎడమల నిలుస్తై పహరా జవానుల్లా !

ఒకో దురదృష్ట వంతురాలి విషయంలో పుష్పవతి కాగానే దాపురిస్తై ఈ దుఃఖాలన్నీ !

చదువు మూలబడుతుంది. జ్ఞానసూర్యుడు క్రుంకిపోయి, మరి ఉదయించడు ఆమె జీవితంలో . లోన వెలుగుండదు . బైటి వెలుగు అనుమతించబడదు . డబ్బిచ్చి తీయించి పారేస్తా రామెను - తలిదండ్రులు తమ ఇంటి నుంచి .

మూర్ఖుడైన తండ్రి కంటె క్రూరుడైన భర్తే మేలనిపిస్తుం దామెకు ఆ తర్వాత !

తండ్రి, అన్నలు, మగడు, మగని నేస్తాలు - అందరూ మహిషాసుర వంశ భూషణులే అయిన సందర్భంలో , ఆ స్త్రీ ఏం జేస్తుంది ?

స్త్రీగా చచ్చిపోయి, పిశాచిగా అవతరిస్తుంది !

ఆ మగడు ఒక పిశాచ రాజై ఉంటే - ఆమె జీవచ్ఛవంగా బ్రతికి, ఏడ్చే శక్తి లేక , నవ్వుతూ చచ్చిపోతుంది.

అతడిలో ఏ రకమైన బలహీనత , ఉన్నా, ఏ కొంచెం జాలి లాంటిది కనపడినా - ఇక ఆమెకు పట్ట పగ్గా లుండవు !

ఒక పెంపుడు జంతువుగా , బరువులు మోసే గాడిదగా , ఇల్లు కాపలా

కాసే కుక్కగా , డబ్బు సంపాదించి పెట్టే కిరాయి బండిగా – వాడుకొంటుందామె అట్టి భర్తను !

భార్య తోడిదే లోక మనుకొంటే – అట్టి భర్తకు సుఖం గానే గడిచిపోతుంది జీవితం.

కొంచెం వ్యక్తిత్వం ప్రదర్శించే గుణం ఉంటే – అట్టి భర్తకు కూడ పేకాట క్లబ్బులు, మంచి బార్లు, మెహిందీలు, నాటక సంస్థలు, ఆశ్రమాలు, మఠాలు ఎన్నో ఉన్నై ! తప్పితే – రైలు పట్టాలు, లోతైన చెరువులు, దీర్ఘ నిద్రా మాత్రలు వగైరా తక్కువేం కాదు !

తన కొక్కడికే ఏ దిక్కూ లేదంటాడు సదానంద !

తన భార్య ఏడ్చే ఏడ్పులు, తిట్టే తిట్లు, పెట్టే తిప్పలు –లోకంలో నభూతో నభవిష్యతి అని చెపుతూ, నిరానందమూర్తి సదానంద అంటాడు –

" నా భార్య పతివ్రత కాకపోవడం ఒక్కటే నాకు పట్టిన అదృష్టం. పతివ్రతే అయి ఉంటే – నే నీపాటికి కుక్క, పంది, గాడిద, దున్నపోతు వగైరా లక్షలాది హీనజన్మ లెన్నో ఎత్తేసి ఉండేవాణ్ణి " అని !

వికటం, వెటకారం, వైరవైఖరి – అంతేనట ఆమె బ్రతుకంతా. ఆమె నాలుక రేజరు బ్లేడట !

మరొక మగవాడితో సెక్సు సంబంధం లేక పోవడ మొక్కటే పతివ్రతా లక్షణ మనుకొనే ఇలాంటి మూర్ఖభార్యలే ఎక్కువ సమాజంలో. వీళ్ళే సమాజం లోని అన్ని దుఃఖాలకూ, దారిద్ర్యాలకూ హేతువులు కూడ.

" ఇలాంటి గయ్యాళి భార్యలు తాము ఎందుకూ పనికిరారు. తమను కట్టుకొన్న మగవాళ్ళను కూడ ఎందుకు పనికి రానివ్వరు " అంటాడు సదానంద !

నిజమే అనిపిస్తుంది – మన ఇరుగు పొరుగు సంసారాలను పరిశీలించి చూచినప్పుడు.

వ్యర్థమై పోతూ ఉంది ఎంతో ఎంతో పురుష శక్తి – ఈ పనికి మాలిన పెళ్ళాల చేతుల్లో పడి !

సహజ ధర్మం మీద నిషేధాలు విధించుకొని, సుఖ సంతోషాల దారుల్లో ముళ్ళ కంపలు పాతుకొని, పాప పుణ్యాలు కల్పించుకొని, అసూయా ద్వేషాలు

పెంచుకొని, అభ్యుదయాన్ని నిరోధించు కొంటున్నాడు నేటి మానవుడు !

భార్యగా చచ్చిపోవడ మేనా శక్తి స్వరూపిణి అయిన స్త్రీ ప్రారబ్దం ?

భర్తగా చచ్చిపోవడ మేనా వీర్య వంతుడైన పురుషుని పరమార్థం ?

" ఈ జన్మ ఎంత త్వరలో అంతమైతే అంత అదృష్టవంతుణ్ణి " అన్నాడు సదానంద !

ఈ జన్మలో సాధించ లేనిది మరో జన్మలో సాధించగల మనుకోవడం వట్టి భ్రమ, ఆత్మవంచన.

నీ శక్తిని నీవు గుర్తించుకొని, నీ పురోగతికి అవసర మనుకొన్నప్పుడు, ఎవరి నైనా సరే వంచించు. పర్వాలేదు. కాని ఆత్మను మాత్రం వంచించుకోకు !

తాను పరమాత్మలో ఒక సూక్ష్మాంశంగా గుర్తించుకొన్న తక్షణం తీరగల ఒక కోరికను - వచ్చే జన్మ వరకూ వాయిదా వేసే సదానందను గురించి ఏ మనుకోవాలి ?

అలాంటి జడ పదార్థానికి ఏమి బోధించి ఏం లాభం ?

అతడు నీళ్ళ లోని ఒక వత్తి.

ఎలా వెలుగుతుం దది ?

ఎంత శ్రమపడి, అంత చీకటిగా మారిందో అతడి భార్య !

97

" ఏ జన్మలో ఏ జంటను విడదీశానో, ఈ జన్మలో నేనాశించిన వస్తువు నాకు లభించలేదు " అంటూ కళ్ళొత్తు కొంటున్న మంజీర -

ఆమె కళ్ళల్లోకి చూస్తున్న నీవు -

నీ కళ్ళల్లోకి చూస్తున్న నేను -

త్రైపాక్షిక చిత్రకళా సమావేశం కదూ అది !

పాపం, మంజీర !

కన్నీళ్ళతో కోరికల్ని పెంచుకొంటూ, చిరునవ్వుల్ని పూయించుకొంటూ, కళాకాంతుల్ని పండించు కొంటూ, బ్రతుకంతా ఎడారిలో వలె ఒంటరిగా గడపడం !

ఎంత దయనీయం ఆమె స్థితి !

ఎలా ఓదార్చగలం ఆమెను ?

ఏమున్నది పరిష్కార మార్గం ?

ఆ మాట తానే అన్నది !

ఒక వస్తువును కోరుతున్న దామె.

తన బ్రతుకంతా ఒక అంజలిగా ఘటించింది దాని కోసం.

సంగీతం, నృత్యం, సౌందర్యం, యౌవనం - తన కున్న సమస్తమూ అర్పించి వేసింది దాని పూజలో.

కాని -

ఆ వస్తువు తనకు లభించదు.

మరో వస్తువు తన కక్కర లేదు !

ఎవరి జీవిత మైనా దుఃఖానికీ, ఘర్షణకూ, వైఫల్యానికీ రంగస్థల మయిం దంటే - అందుకు హేతువు ఇలాంటి పరిస్థితే !

సకల కళా సరస్వతి కదా మంజీర ?

ఆమె కోరాలే కాని, లభించని దేముంటుంది ?

తిలోత్తమను మించిన అందం, రాజు కొక్కర్తే కూతురన్నంత వైభవం, చుట్టూ సినీ తారాగణం, పత్రికల నిండా ఫోటోలు, నిత్యం మన లాంటి అభినందకుల సాన్నిధ్యం !

ఇంత సందడి లోను, ఇంత నిత్యోత్సవం మధ్య - ఏమిటా ఏకాంత వాసం !

ఎందు కా నిరంతర నైరాశ్యం ?

" ఒక్క క్షణం పాటు మామూలు స్త్రీనై, స్త్రీ హృదయం విప్పుతున్నాను మీ ముందు ! ఈ సౌందర్యం, ఈ కళావిక్షేపం, ఈ అభినందన పరంపర, ఈ రసకజన సందోహం - ఇదంతా నా కెందుకు - నేను కోరింది దొరక నప్పుడు ? " అని ఆమె కళ్ళొత్తుకొంటూ ఉంటే -

ఇంతటి కళాలక్ష్మి శృంగార హృదయం లోనా అంతటి శూన్యం - అని విస్తు పోతాను నేను !

ఎంత క్రూరం ఈ సృష్టి వ్యవహారం !

మనిషికి ఎన్ని ఉన్నా, తనకు కావలసింది లేనప్పుడు, మరేమి ఉన్నట్టు ?

ఇంతకూ ఆ కావలసింది ఏదో ఒక అపూర్వ అమూల్య అసాధ్య వస్తువేమీ కాకపోవచ్చు. తన సమీపంలో ఉన్నదే కావచ్చు. లోక దృష్టిలో చాల చిన్నదే, ఒక తృణమే కావచ్చు. అయినా – అది తనకు కావలసి ఉండి, లభించ నప్పుడు, అంతకన్న బాధ మరేం ఉంటుంది ?

మరి ఎందుకు కోరింది అలాంటి లభించని వస్తువును ?

ఆమె కావాలని కోరిందా దాన్ని ?

కోరిక స్వయంభువు. సర్వస్వతంత్రం అది. కోరిక పుట్టడం ముందు. అది తీరేదో కాదో తెలియడం తర్వాత !

కోరికలు రక రకాలు.

అందులో అనేకం రొటీనువి. తీర్చుకోవడం కష్టం కానివి.

తీరక పోయినా బాధ లేనివి.

ఉచితంగా లభించేవి.

మార్కెట్లో వెలకు దొరికేవి.

హార్ది కమైన కామం తీరక పోతేనే ఆత్మహత్య చేసుకోవా లనిపిస్తుంది కదా !

హార్ది కమైన ప్రేమే లభించకపోతే ?

పాపం మంజీర !

ప్రేమను కోరిం దామె.

తన హృదయాన్ని ఐక్యం చేసుకోగల మరో హృదయాన్ని కోరిం దామె.

అదొక్కటీ లభ్యం కానప్పుడు – వసుధైక సామ్రాజ్య సింహాసనమే లభించినా, తన కెందు కది ?

శత మోహములు, సహస్ర శ్రీలు, భోగాలు,
చేరి స్వర్గమె చరణ సేవ చేయును గాక !
తనను తనలో కలుపుకొను చెలియ లేకున్న,
ఏమి ఉన్నది ఎవరికేని ఈ బ్రతుకులో ?

98

" ప్రేమ తీరని కోరిక ఎలా అవుద్ది ? "

ఆ రోజు నుంచీ, మళ్ళీ మళ్ళీ, అన్వేషిస్తూనే ఉన్నాను ఈ నీ ప్రశ్నకు తగు జబాబు కోసం.

ప్రేమ హృదయ సంబంధి కదా !

హృదయం ఎకసించి, ప్రేమ కోసం అన్వేషిస్తూ ఉన్నప్పుడు - అదెక్కడో కనిపించగానే, తనను తాను అర్పించేసుకోదా ఆ హృదయం ?

ఇదంతా అంతరాత్మ ప్రేరణతో జరిగేదే కద ? అంతరాత్మ అంటే పురాకృత కర్మఫల పరా రూపమే కద ?

అప్పుడు ఆ ప్రియతమ లభించి తీరవలసిందే కద ?

మరి - లభించక పోతే ?

అందని చందమామ అయితే ?

మాడ్చి వేసే మార్తాండ బింబమైతే ?

స్వాధీనం కాని క్షణప్రభ అయితే ?

అమృతంలా ఆకర్షించి, హాలాహలంగా పొగలు క్రక్కితే ?

అప్పటికే మరొకరిదై ఉంటే ?

ఏమిటి చెయ్యడం ?

ప్రేమ జన్మాంతర సౌహార్ద ఫలితం కదా ? మరి దానికి ఆనందరసం ఎందుకు లభించడం లేదు తరచు ?

అంతరాత్మ పేరుతో మనస్సే కొన్ని కోతిచేష్టలు చెయ్యవచ్చు గాక ! అట్టి అపోహలు, భ్రాంతులు, పొరపాట్లు తాత్కాలికంగా బాధిస్తే బాధించవచ్చు గాక ! కాని - భగ్న హృదయతకు ఎందుకు దారితీస్తె అవి ?

మనస్సు చేసే కోతిచేష్టలు మోహానికి, కామానికి, సెక్సుకు సంబంధించి ఉండవచ్చునే తప్ప - ప్రేమకు, అనురాగానికి, ఆరాధనకు దరిదాపుల్లో కూడ ఉండవు.

ప్రేమకు ప్రేమ లభించి తీరవలసిందే.

ప్రేమ తీరని కోరిక కాదు ఎన్నిటకీ.

నీ ఉద్దేశమే రైటు.

అయితే – సాంఘిక విధినిషేధాల కారణం వల్ల, శారీరకంగా అది లభించక పోవచ్చు.

ఆత్మలు కలిసే ఉంటై.

శరీరాలు కలవక – ఏడుస్తై మనస్సులు !

ఆరాటం శరీరాలది – బాధ మనస్సులది.

అలాంటి దురదృష్టవంతురాలు మంజీర !

జీవిత యాత్రలో –ఒకే మజిలీలో ఉన్న ఆత్మలన్నీ ఒకే పక్వ దశలో ఉంటై రమారమి ! వాటన్నిటి మధ్యా సాదృశ్యం కనిపించ వచ్చు కొంత. అట్టి స్థితిలో – ఒకే వ్యక్తి అనేక మందిని, అనేక మంది ఒకే వ్యక్తిని ప్రేమించే అవకాశం ఉంది చాల !

సముద్రుడు ఎన్ని నదుల నైనా భరించగలడు.

నది ఒక్క పెద్ద వర్షాన్నే భరించలేక – పొంగి, కట్టలు త్రెంచుకొంటుంది కద ?

అందుకే – చాలమంది పురుషులు ఒకే స్త్రీని ప్రేమించినప్పుడు, వాళ్ళలో వాళ్ళు పోరాడుకొని, ఎవరో ఒక్కరే పొంద గలుగుతా రామెను !

చాల మంది స్త్రీలు ఒకే పురుషుణ్ణి ప్రేమించి నప్పుడు, అందరూ పొందగలుగుతా రతణ్ణి !

కాగా –

ప్రేమించిన వస్తువు లభించక పోవడ మనేది లేనేలేదు. స్త్రీకి !

మనం ప్రేమించిన వస్తువు తిరిగి మనల్ని ప్రేమించగల్గితే – అది మనకు లభించినట్టే !

శారీరక సంయోగానికీ, ప్రేమకూ సంబంధం లేదు.

సముద్రం వంటి ఒక పూర్ణ పురుషుణ్ణి ప్రేమించ గలిగిన స్త్రీ ఎలాంటిదైనా సరే ధన్యురాలే. ఆత్మయోగం సిద్ధించిన పిదప శరీర సంయోగానికి విలు వేమిటి ?

శరీరాలు సమాజానివి. ఆత్మలు మనవి. ఆత్మ సంయోగమే ఆనంద యోగం ?

మంజీర అనుకొంటుందీ - తాను ప్రేమించిన వ్యక్తి తనకు లభించలేదని !

లభించాడు ఆ వ్యక్తి ఆమెకు.

గుర్తించడం లే దామె !

హృదయ గత ప్రియుతముని నీడ కోసం బైటకు చేతులు చాస్తున్న ప్రాకృత ఆమె !

దొరకడం లేదని ఏడుస్తున్నది, పాపం !

ఏమిటి కర్తవ్యం ?

ఆత్మ సంయోగమే ఆనందయోగమే,
అది లభించెను కదే హృదయ మిచ్చిన చోట !
పొంగ నేలను కనులు పుబ్బ చెరువుల వోలె ?
ఆత్మ రతి కంటె దేహాలింగనము ఘనమె ?

99

ఆకులు కనపడకుండా పూచిన రసాల వల్లరిలా వస్తావు నీవు మత్తుగా పరిమళిస్తూ, మధురంగా పాడుకొంటూ !

వసంతం వచ్చేస్తుం దప్పుడు నీ రాకతో నా నరాల్లోకి - తొలకరితో పొలాల్లోకి నీరు వలె !

చిరునవ్వు ఉషఃకాంతి కాగా, ఉత్తర దక్షిణాలే నడిమింట కలుసుకొన్నట్టు రెండు చేతులు పైకి మోడ్చి, నీవు చేసే నమస్కారంలోని ఆ విలాస లాస్యభంగిమ -

ఉషోబాల వక్షం మీది నీలివోణీ జారిపోగా, పొడుపు గుబ్బలి గబ్బి గుబ్బలు సిగ్గతో ఎర్రబడగా, నీ మెయినిండా చెలరేగిన ఆ పుల కాంకుర పద్మ కళికలు - ఎదురుగ్గా కూర్చొని, పాణి పల్లవాలలో ముఖపద్మాన్ని ధరించి, స్వీకరించు

మనే నీ ఆ కనత్కజ్జల చంచరీక వయస్యలు -

నన్ను సాక్షాత్తు సూర్యుణ్ణే చేస్తె ప్రతిరోజూ !

జీవిత మంతా, జన్మలన్నీ ఇలానే సాగిపోతే !

మోక్షం ఇంత కంటె రమణీయమా ?

చుక్కలు కూడ లేని ఒక ఎడతెగని అమావాస్యే కద మోక్షం ? మెలకువ లేని ఒక గాఢ సుషుప్తి కద అది !

నీ సుందర తనూ స్పర్శా సుఖం తెలియని మత్తు - అది మోక్షమే అవనీ -నా కెందుకు ?

అనంత శూన్య నిరంతరమైన అమావాస్య కంటె, హానివృద్ధులు కల కృష్ణ శుక్ల పక్షాలే ఇష్టం నాకు - అవి ఎన్ని సార్లైనా రానీ, పోనీ !

అమావాస్య తరువాత చంద్రకళ వలె, మృత్యువు తర్వాత జీవకళ అంకురించి తీరవలసిందే ! లేకపోతే, అర్థంలేదు మృత్యువుకు !

ఒక జన్మలో ఏదైనా విఫలమైతే, మరుజన్మలో అది సఫల మవుతుందన్న గేరంటీ లేదు. కాని -

ఒక జన్మలో ఏదైనా ముగియక పోతే, అది దానంతట అదే కొనసాగి, ముందుకు పోతుంది మరుజన్మలో.

మనం ఏ జన్మ లోనూ విఫలమైనవాళ్ళం కాం. ప్రతి జన్మ లోనూ వైశాఖీ వసంతులమే ! రాగ రమా రాజేశ్వరులమే !

అనంత కాలంగా పయనిస్తూనే ఉన్నాం మనం ఇలా !

ఏకానందం నుంచి రెండు అనురాగ కిరణాలుగా విడిపోయిన ఆ తొలిక్షణమే మన ప్రణయ లతాంకురానికి ఆవాప మహోదయం !

ఆ క్షణం నుంచీ వస్తున్నాం మనం వికసించుకొంటూ !

ఒక్కనాటితో వచ్చినవి కావు - ఇన్ని రంగులు, ఇన్ని రమ్యతలు, ఇంత సౌరభం, ఇంత మాధుర్యం !

ఆనంద స్రవంతిలో, అవశత్వంతో, జంటగా పయనిస్తూ - ఏదో ఒక స్పందనలో, ఒక స్పర్శలో, ఒక జాగృతిలో ఒకరి నొకరం చూచుకొంటాం తల లెత్తి-

ఓహో, మనం – అనుకొంటాం అప్పుడు !

మనం !

అవ్యక్తం నుంచి వ్యక్తమైన మనం !

మనిద్దరం !

ఎంత మధురం ఈ భావన !

శృంగారం , సౌందర్యం , ఆనందం – మళ్ళీ పారవశ్యం !

అంతే ఎప్పుడూ !

కాలమే అమృత ఝరి మనకు.

అమృతం ఎంత త్రాగాలి ?

త్రాగించి , త్రాగి , మై మరచిపోతావు నీవు !

క్షణాలై పోతై యుగాలు !

జీవితం , సుఖం , సృష్టి – సమస్తమూ సాపేక్షమే.

మళ్ళా నీవు మరునాడు కనిపించే దాకా – ఈ లోపల – ఎన్ని యుగాలు, ఎన్ని విలయాలు , ఎన్ని అవతారాలు , ఎంత తపన , ఎంత గ్రంధం !

ప్రతి క్షణము ఒక సృష్టి , ప్రతి క్షణము ఒక లయము ,
క్షణము క్షణముకు నడుమ సందులే మనుగడలు !
క్షణములను పట్టి బుడగల వోలె చిదపనా ?
సందులను విరియించి స్వర్గాలె నిలపనా ?

100

నిశాకాంత నిద్రపోబోతూ, పంకా వేసుకొన్నదో ఏమో – చల్లని పిల్లగాలులు ఆడుకొంటున్నై అలవోకగా !

చిరుమబ్బులు కదులుతున్నై ముంగురుల వలె !

వెన్నెల సబ్బు నురగతో చక్కగా స్నానం చేసి, కురులార బోసుకొన్న యామినీదేవీ – వాటిని ముడుచుకొని జారుముడి వేసుకొన్నది మెల్లగా.

జాబిల్లికి అవలిప్రక్క పట్టిన తేనెపట్టులా ఉన్న దది.

కొన్ని తేనెటీగలు ఎగురుతూ ఇవతలికి కూడ వస్తున్నై చికుర సుందరంగా !

పూర్వ దిక్కామిని ఆవులించి లేచింది నీ వలె !

రాత్రంతా విరహాగ్నిలో తపించిపోయిన నీ వదనంలా ఉంది అరుణోదయం !

నీవు మాటి మాటికీ మునివ్రేళ్ళతో పైకి త్రోసివేస్తున్న ముంగురులే - అరుణబింబం పైకి వస్తూ పోతూ ఉన్న ఆ చిరుమబ్బులు !

రెప్పలెత్తి చూచినై నీ కళ్ళు !

కళ్ళెత్తి చూచినై పద్మాలు !

నీ చూపుల్లా ఎగసినై మధుపాలు

వెన్నెలకు జడిసి, రాత్రంతా దాక్కొన్న విషమ వియోగ దుఃఖ శకలాలవి !

మబ్బుల పైకి దాడి కదిలిన శిలీముఖాలే అవి !

నీ నుదుటి రేఖల్లోని కుంకుమ బొట్టులా ఉంది సూర్యబింబం !

అక్కడ శ్రీ ధామంలో నీ వలె, ఇక్కడ రసాలినిలో రాత్రంతా వేగివచ్చిన నా తాగుబోతు కళ్ళు -

చూస్తున్నై ఈ వినోదమంతా నీ చెక్కుటద్దాలలో నుంచి !

చేస్తున్నై అమృత పానం నీ వక్షో మేరు శిఖరాలపై వ్రాలి - దేవతల వలె !

చకోర రాత్రి అది మనకు !

చక్రవాక రాగరంజిత శంఖం నీ కంఠం - ఆహ్వానిస్తున్నది నన్ను !

కృష్ణా !

కృష్ణా !

ముజ్జగాలు మోహించగ !

మురళిని వాయించరా !

నీకులా ఎంత మనోమోహనంగా ఉన్నది ఫాల్గున ప్రభాతం !

ఈ పద్మాకర తీరంలో, ఈ మధుశిలపై నిలబడి, ఆరాధిస్తున్నాను నేను నీ పూర్ణ సౌందర్య మధూదయ శ్రీధామ వైభవాన్ని !

మధూద యానంద రాగ సుప్రభాతం నీవు !

ఇప్పుడు నీలోనే నే నున్నది !

మోవికి నను క్రోవి చేసి
మోహనముగ వాయించర !
భిదురమైన కళ గళమున
మధురమైన చాలురా !

101

నాది స్వార్థమే !

అయితే - స్వార్థం లేని దెవరికి ?

విత్తనం మొలకెత్తి నప్పటి నుంచీ,దాని వేళ్లు నేలనూ, ఆకులు గాలినీ గాలించి - ఆహారాన్ని సేకరించుకోవడం స్వార్థమే కాదా ?

మానవుడు తనకు కావలసిన దాన్ని చిన్నప్పుడు ఏడ్చీ, పెద్దప్పుడు పోటీపడీ సాధించుకోవడం కూడ స్వార్థమే మరి.

ఎవరి ఆనందఫలం గానో అభివ్యక్త మవుతుంది జీవి. తన ఆనందం కోసమే బ్రతుకుతుం దది. ఆ ఆనంద ఫలాన్ని లోకంలో వదలిపోతుంది తిరిగి !

ఆ ఫలం యొక్క భవిష్యత్తు కోసం ఎంత జాగ్రత్త ! ఎన్ని లక్షల ప్రతులు ! ఎన్ని కోట్ల బీజాలు !

చిన్న బీజంలో ఎంతటి మహాశక్తి !

వృక్షంతో పాటు దాని పువ్వులు, పండ్లు, వాటికోసం వచ్చే అళులు, పిట్టలు, దాని నీడను చేరే పాంథులు, పశువులు వగైరా మొత్తం దాని. జీవిత చరిత్ర అంతా ఆ బీజం లోనే లేదా ?

మితిమీరిన జాగ్రత్త !

లక్ష బీజాలు వ్యర్థమై పోయినా, ఒక్కటైనా నిలుస్తుందనే ఆశే మూలం ఈ జాగ్రత్త అంతటికీ !

ఎంత వేస్టుకు, ఎంత రద్దుకు సిద్ధపడి నిల్పుకొంటున్నది ప్రకృతి తనను తాను !

ప్రకృతి లోని ప్రతి జీవీ ఒక నియంత.

తనవాళ్ళ నెందరి నైనా బలిపెట్టి, పరాయివాళ్ళ నెందరి నైనా మట్టుపెట్టి, తన జాతిని రక్షించుకొనే నియంతే - ప్రకృతి లోని ప్రతి జీవీ !

తాను కేంద్రం.

తన చుట్టూ కల సృష్టి సమస్తమూ తన కోసం !

తత్ త్వమ్ అసి- అన్నది అన్ని జీవులకూ వర్తించేదే.

అహం బ్రహ్మాస్మి - అని ప్రతి జీవీ అనుకొంటుంది తనకు తెలీకుండానే !

మనిషి బిడ్డకు తాను మనిషి ననే జ్ఞానం ప్రత్యేకంగా ఎలా అక్కర లేదో, పుల్లిపిల్లకు తాను పులి ననే జ్ఞానం అలానే అక్కర లేదు !

తానేమిటో తన పుట్టుక తోనే తెలుసు ప్రతి జీవికీ !తానే పరబ్రహ్మ యొక్క ప్రధానాంశ, ప్రతినిధి అనే అహంకారం తోనే పెరుగుతుంది - ప్రవర్తిస్తుంది - అది !

అలా ప్రవర్తించకపోతే, అది సహజసిద్ధమైన జీవే కాదు.

జీవిత సంఘర్షణలో తానే గెలవా లన్న పట్టుదల, తెగింపు అందుకే దానికి !

మనిషి కంటికి అరటిపండు ఎంతో, పెద్దపులి కంటికి మనిషీ అంతే !

తన కోసం సృష్టించబడ్డ ఆహారం ! అంతే !

జీవితానికి పర్యాయపదం స్వార్థం. స్వార్థం లేకపోతే సృష్టి లేదు. జీవితం లేదు. అభ్యుదయం లేదు.

మానవుడి విషయంలో - మెదడు వికసించి, స్వార్థం వెర్రి తలలు వేసి, మొత్తం సృష్టే నశించిపోయే ప్రమాదం ఏర్పడి నప్పుడు పుట్టుకొచ్చింది - ఆత్మవత్సర్వ భూతాని - ధర్మసూత్రం !

కట్టు తప్పిన మానవ స్వార్థానికి కళ్ళెం వెయ్యడం వరకే ఆ సూత్రం ప్రయోజనం.

దురుపయోగ పరచబడిం దది ఆ తర్వాత.

అంతటితో ఆగిపోయింది ప్రకృతీ వికాసం.

శాంతి ఎందుకోసం ?

జీవిత లక్ష్యం ఏమిటి ?

ప్రకృతి కేది పరమార్థం ?

రామాయణ కాలం నుంచి, మొన్నటి నానావతి కేసు వరకు, మానవ ప్రకృతిని పరిశీలించి చూస్తే - సాధించబడ్డ పురోగమనం ఎంత ?

ఇన్ని వేల సంవత్సరాల లోను - సమాజం యొక్క గాని, వ్యక్తి యొక్క గాని నైతిక స్థాయి పెరిగిందా ? కామ క్రోధాదులలో మార్పు ఏ మాత్రమైన వచ్చిందా ?

సత్యానికి కృతయుగంలో ఒకడూ, పితృవాక్య పరిపాలనకు త్రేతా యుగంలో ఒకడూ తప్ప, మనకు వేరే ఉదాహరణలు ఉన్నవా ?

మానవుడు స్వార్థాని కొక చెడ్డ అర్థాన్ని కల్పించుకొని, తన ఆత్మకు తానే కళ్ళెం తగిలించుకొన్న రామాయణ కాలం నాడే ఆగిపోయింది మానవ పురో గమనం !

గిడసబారి పోయింది సృష్టి !

ఎండిపోయింది భావలత !

అందుకే - వాల్మీకి రామాయణం నకళ్ళకు నేటికీ ఈ గిరాకీ !

ఎన్నో వేల సంవత్సరాల క్రితం వాల్మీకి ఒక బొమ్మ వ్రాసి పెడితే - అదే ఈ నాటికీ లక్ష్యం మనిషికి ! ఇంకెక్కటి ప్రగతి ? ఇంకెక్కడి వికసన ?

బహుశా - ఈ జాడ్యం నుంచి బైటపడడానికి ఇప్పుడు మానవుడు పడుతున్న గిజగిజే నేటి మోడర్న్ ఆర్టు !

సృష్టి పునరుజ్జీవం పొంది, పురోగమించా లంటే -పోనివ్వాలి ఆత్మను యధేచ్ఛగా !

విదలించి వెయ్యాలి గతాన్ని
స్వేచ్ఛగా రూపొందాలి భవిష్యత్తు
ధైర్యం లేదు మానవుడికి !
శాంతిని కోరేవాడు చచ్చిన వాడితో సమానం.

మానవ ప్రసక్తే లేకుండా, మానవ బుద్ధికే అందకుండా, భవిష్యత్తు యధేచ్ఛగా రూపొందితే ఎలా ఉంటుందో !

హఠాత్తుగా నీవు నాలో ప్రవేశించినంత ఉత్తేజకంగా ఉంటుందా ?

నాది స్వార్థమే
పరమ స్వార్థం నాది.
అది నీవే కద !
నా సమస్త త్యాగమూ నీ కోసమే కద !

త్యాగ మన నేమిటే ? భోగ మన నేమిటే ?
పరమభోగమె త్యాగ ఫలమౌను కాదటే ?
నా కున్న స్వార్థ మీ లోకాన కలదటే ?
స్వార్థపరులకు నేనె స్వామి నౌదును కదే !

102

నా తెలుగు జాతికే జాతీయ తరువువే,
లోకానికే నీవు ఏకైక రస రమవు !
చూపవే నా తెలుగు శోభ జగముల కెల్ల !
ఓ ఆమ్రవల్లరీ ! ఓ రసాలేశ్వరీ !

పాడునే పికము నీ ప్రాణబీజము లేక ?
సాగునే జగము నీ శక్తి చక్రము లేక ?
సకల సౌందర్య కీలక రసమవే నీవు !
ఓ చూతవల్లరీ ! నా సాహితీ ఝరీ !

నీ రూపు, నీ ఏపు, నీ చూపు, నీ కాపు ?
కామధేనువు చేపె ! కల్యాణముల ప్రాపె !
నీ పుష్ప ఫల రసోన్మీలనమె నా బ్రాహ్మి !
ఓ సురభి వల్లరీ ! శ్రీసౌధ శేఖరీ !

విరియబూచిన సహకార ఫల్లరీ !

తెలుగు జీవిత విక్షేప వైఖరీ !

నిన్ను మించిన సౌందర్య లక్ష్మి ఎక్కడుందీ లోకంలో ?

నీ వయో లీలే వసంత హేల !

నీ వసంత హేలే నా జీవిత ఖేల !

ఒక్క నీవే సఖివి కాగలవు నా వైశాఖికి !

ఎవరా పిల్ల - అంటున్నావా ?

మామిడి పూల వాసనల
మత్తున, నూతన పర్ణశాలలో
మై మరపొంది, జీవితపు
మాధురులన్ కలలందె కాంచుచున్,
కోమలి ! ఈ వసంతమును
గుత్తుకు గైకొనియుంటి ; నా హృదా
రామము చాల రమ్య మగు,
రమ్మిక సా, రిటు తొంగిచూడుమా !

అంటూ - ఎవర్ని ఆ బాల్యంగా గొంతెత్తి పిలుస్తూ వస్తున్నానో - ఆ రాగ రమే వైశాఖి !

అదిగో, ఆమె వస్తున్నది, చూడు !

ఉగాది కదా నేడు ?

ఆమె వస్తున్నదన్న వార్తకే, ఆమె సాన్నిహిత్య భావనకే, రస ప్లావితమై పోతున్నది - నా హృదయంలా, ఈ ప్రకృతి అంతా !

ఇది కదా రస మంటే !

విభావాదులతో కూడిన స్థాయీభావమే రసమన్నారు లాక్షణికులు.

అలానే అనుకోనీ వాళ్ళను !

ఏది రసం ?

ఆమెను చూచినప్పటి నా కన్నుల లోని అరుణోదయం - రసం.

ఆమెను పల్కరించి నప్పటి నా కంఠంలోని స్వరలహరి - రసం.

ఆమె కబుర్లు విన్నప్పటి నా శ్రుతుల లోని సామగానం – రసం.

ఆమెను స్పృశించినప్పటి నా నరాల లోని విద్యుత్తు – రసం.

ఆమె అధర బింబం లోని అమృతమే – రసం

ఆమె పారవశ్యం లోని పరమానందమే – రసం.

ఈ రసం–

అనంతకోటి ఆనంద జన్మల సుకృత ఫలాల సమ్యక్‌సార మధుర సుధా రసమే !

అలా చూడు !

ఆమ్ల కటు కషాయ తిక్త లావణ్య రస రుచులతో – ఇక్షు నింబ చూతాది రసాధిదేవతలు – తమ తమ ఆత్మ రస కలశాలతో ఆ మాధుర్య రస రాశిని ఎలా సేవిస్తున్నారో, చూడు !

రుచి గల రసాలు ఆరే.

అవన్నీ శృంగార మాధుర్యానికి ఆశ్రితాలే !

శృంగార కళే రాగవైశాఖి !

ఆమె కేంద్రంగా , ఈ సకల రస ప్రకృతీ వసంత బృందనాట్యం చేస్తున్నది , చూడు !

రాత్రి కనిపించని చంద్రబింబం ఈ ఉదయం ఈ ఉద్యానంలో ఉదయించినట్టు లేదూ ఆమె !

షోడశ కళా ప్రపూర్ణ అయిన నవయౌవన నిత్యషోడశి , నిరంతర మధుర వసంత , నితాంత సుందర శివానందలహరి – ఆమె .

ఆమె ముఖంలో చిరుచెమటలా మిలమిల లాడుతున్న ఆ వెన్నెలే – రసం !

నింపుకో దాన్ని హృదయం నిండా !

సార్థకం చేసుకో నీ రసాలాఖ్యను !

ఇవిగో – నా చెలి వస్తున్న జాడలు !

నను చూచి నెమలి పిం

ఛము విప్పి నర్తించు !
వనములో నిను చూచి
వచ్చినది కాబోలునే , చెలీ !
నను చేరి పికము కం
ఠము దిద్దుకొనె సాగె !
వనములో నీ పాట
వినివచ్చె కాబోలునే , చెలీ !
నను పట్టి మలయ పవ
నము కౌగిటను గ్రుచ్చు !
వనములో నిను గొల్చి
వచ్చినది కాబోలునే , చెలీ !

ఇదిగో . నా చెలీ !

వసంత విస్రంభణశీల అయిన ప్రకృతి సుభగంకృత అయి , సహస్ర వైహారికి సౌదర్య సఖీ పరిసేవిత అయి కొలిచిరాగా –

అభిగామిక సండదర కళా మోమనంగా విజయంచేస్తూ –

దేవీ ! అబ్బ – ఎంత బాగున్నావు !

ఆపాదమస్తకము ఆనంద కళలతో
నా దేవి నిత్యసుందర షోడశీ దేవి !
సర్వాంగపూజా ప్రసాద మాధవి దేవి !
తరుణజీవన నిరంతర రసైందవి దేవి !

చైత్రి

ఇదిగో - ఇదీ వసంతం !

మిట్ట మధ్యాహ్నం

మామిడి నీడలో

చుట్టూ పనసలు , జీడిమామిళ్ళు , కొబ్బరితోపులు , వేపలు , రావి చెట్లు , వటవృక్షాలు

దగ్గరలో వైనతేయం -

ఊమ్మని వీచింది గాలి !

జల జల రాలినై ఆకులు !

గిర గిర తిరిగింది సుడిగాలి - ఆటవిక నర్తకిలా - రాలిన ఆకుల్ని మెలకు చుట్ట బెట్టుకొంటూ , దూళినీ దుమ్మునూ రేపి మైపూత గావించుకొంటూ !

కళ్ళు మూసుకొన్నాం మనం

చీర మార్చుకొన్నది ప్రకృతి !

గుప్పున కొట్టింది పరిమళం !

ప్రాణం లేచి వచ్చింది మనకు !

ఎండుటాకుల్నీ , ధూళినీ మోసుకొని , కారెండలోపడి , పోతోంది సుడిగాలిలా - శిశిరం - చెట్ల వెంటూ , పుట్ల వెంటా !

దాన్ని వెంటపడి తరుముతున్న పసిరిమొగ్గల పురిటి పరిమళం , వేడిగా నిట్టూర్చుతూ , ఆమోదంగా ఆగింది మన దగ్గర !

రాలిపోయిన కారాకుల కుదుళ్ళలో నుంచి - నిక్కి చూస్తున్నై క్రొంజివుళ్ళు ఎర్రని బోసి నవ్వులతో .

పొదలలో గువ్వలు , గోరింకలు , దొంకదూరు పిట్టలు , పిచికలు , పికిలింకలు -

చెట్లలో చిలుకలు , కోకిలలు , కాకులు , చెముడుకాకులు , వడ్రంగులు , నెమలి పిట్టలు -

నీడలో మనం !

గాలి తిరిగింది !

మిట్ట మధ్యాహ్నపు ఎండలో , చెమటలో నానిపోతూ , ఉస్సురుమంటున్న ప్రకృతి - పైట తీసి వేసుకొన్నది - దక్షిణపు గాలికి !

కో - అన్నది కోకిల !

అదిగో - అన్నది నెమలి !

చూశా అన్నది చిలుక !

పోయా వాలిం దది - ముసుగులో పరువుకు వచ్చిన సువర్ణ రేఖల గుత్తైపై !

కొరుక్కొన్నది వగరు చిగు రొకదాన్ని కోకిల !

తుమ్మెదలై రేగినై నా చూపుల నీ చుట్టూ !

తామరపూల తోటవు నీవు !

ఓహో -

ముంజెలు

ఎలనీరు

ఒలిచిన పంపరసనస తొనలు

పాలకొబ్బరి మీగడ

వెన్న ముద్దలు

వాటి కొసలపై ఎర్ర ద్రాక్షలు !

మల్లెపూల చెండ్లు

వాటినుంచి తీయమామిడి రసం !

వయ్యారపు వాగులు

వాటి గట్ల వెంట అరటి , పసుపు , పోక , తమలపాకుల తోటలు !

మెడ దిగువ మెరిసే నున్నని బంగారు తిన్నెలు

వాటి కాటుకమొనలపై నా ప్రేళ్ళ కనుపాపల సరిగమలు

వాటికి నీ గొంతుకలోని కోయిల వలపుల కువకువలు !

ఎంతలో ఎంత లీల !

నీవే వసంతం !

అచ్చం నీకులా – ఇదీ వసంతం !

రెండు మాసాల పాటు ప్రతి క్షణమూ వసంతమే అయినా – ఏదో ఒకొక్క నిమిషం ప్రత్యేకంగా తట్టి చూపుతుంది – ఎత్తి చూపుతుంది – పట్టి ఇస్తుంది. ఇదిగో వసంత మంటూ , అతిలోక రహశ్శోభను !

అదే నీ దివ్యదర్శనం !

నీవు మొదటిసారి ముద్దిచ్చిన ఆ క్షణమే వసంతోదయం నాకు .

ఆ ముద్దే మజ్జగాలకూ నన్ను ప్రణయ సమ్రాట్టును చేసిన అమృతశ్రీ !

అప్పటినుండి ప్రతి ఓణమూ వసంతమే మనకు .

హార్దికమైన ఆ అమృత శ్రీవసంతం మన సొంతం , శాశ్వతం .

ఈ నెటి వసంతం కేవల కాలికం . అందరికీ చెందిన సంతలాంటి దిది . ఎవరికి కావలసిన సుఖ సంతోషాలను వారు సేకరించి పెట్టుకొంటా రీ సంతలో – వారి వారి శక్తిని బట్టి – ఏడాదికి సరిపడేడంతగా !

సంవత్సరానికి సరిపడే చివుళ్ళు , పువ్వులు , తేనెలు , పండ్లు – సమస్త సంభారాన్నీ ఇప్పుడే నిల్వచేసి పెట్టుకొంటుంది ప్రకృతి !

మన కే మిస్తుంది ఈ బాహ్యవసంతం ?

మన వసంతం మనలోనే ఉంది కద !

హృదయ వసంతం అదృష్ట లబ్ధం !

అది వెకరికి , ఎప్పుడు లభిస్తుందో తెలియదు .

బాహ్య ప్రకృతితో , ఋతువులతో , వయస్సులతో , రూప గుణాదుల తో , ప్రయత్నాలతో , ప్రార్థనలతో ప్రమేయమే లేదు దానికి .

ముందుకు సాగవలసిందే జీవి అది లభించే వరకు !

గమ్యం చేరేదాకా - మధ్య మజిలీ లన్నీ తాత్కాలికాలే !

తనది ఆ గమ్యం . తన సొంతం . అదే తన వ్యక్తిత్వం .

ఎవరి గమ్యం కలిసిందే ముద్దు .

ఆత్మ దాకా అతుక్కుపోయిన రెండు పెదవుల ఎర్రముద్దే జీవేశ్వర పరిచుంబన పరమ రస స్థితి !

ఆ ఎరుపే వసంతం !

ఇటు నుంచి నేను , అటు నుంచి నీవు - చేస్తూ వస్తున్న ఎంతో యాత్రకు క్షేత్రం ఈ వసంతమే !

బాహ్య ప్రకృతితో, ఋతువులతో, వయస్సులతో, రూపగుణాదులతో, ప్రయత్నాలతో, ప్రార్థనలతో ప్రమేయమే లేదు దానికి.

ముందుకు సాగవలసిందే జీవి అది లభించే వరకు !

గమ్యం చేరేదాకా - మధ్య మజిలీ లన్నీ తాత్కాలికాలే !

తనది ఆ గమ్యం. తన సొంతం. అదే తన వ్యక్తిత్వం.

ఎవరి గమ్యం వారిది.

ఇద్దరి గమ్యం కలిసిందే ముద్దు.

ఆత్య దాకా అతుక్కుపోయిన రెండు పెదవుల ఎర్రముద్దే జీవేశ్వర పరిచుంబన పరమ రస స్థితి !

ఆ ఎరుపే వసంతం !

ఇటు నుంచి నేను, అటు నుంచి నీవు - చేస్తూ వస్తున్న ఎంతో యాత్రకు క్షేత్రం ఈ వసంతమే !

ఇదే జీవిత గమ్యం
ఇదే జీవిత విజయం
ఇదే మనం !
ఇదే త్రిగాదేవి శోభన శోభా శ్రీ మందిరం !
ఉదయ చంద్ర పూర్ణ బింబం
ఉదయ భాను బాల బింబం
రెండూ రెండు వెన్నెల వెన్న ముద్దలు !
ఎంత పరమ రుచిరంగా ఉన్నై ఇవి !

వీటి ఈ నడుమ లోయలో -మెత్తని, నున్నని, గుండ్రని ఈ గిరుల వంపుల్లో, నీడల్లో - అంచులను రాసుకొంటూ, అలలతో గిరి మొనలను దువ్వుకొంటూ - ఉప్పొంగి ప్రవహిస్తున్న యౌవనధార !

ఎంత దివ్యంగా ఉన్న దిది !

ఈ అమృత ధారా ప్రవాహంలో - రేబవళ్ళ జంట రేకల కెందామర పూదొన్నెలో, సంధ్యారాగంలా పొంగులు వారే సౌందర్య మధువును ఆస్వాదిస్తూ - ఇటు ఈ చరణ పద్మాకరం నుంచి, ఇటు ఈ మానస కాసారం దాకా, నిరంతరం విహరించగల ఈ సోహం చక్రవర్తిత్వం !

ఎంతటి అమృత పదవి నా కిది !

ఓహో - ఇదీ వసంతం !

నీ సహస్రదళ మనఃపద్మం నిండా పరమమధువు,
నా పెదవుల సంపుటి నిండా ఆనందమధువు,
ఈ పరమానంద మధుసంధానమే వసంతం !
ఇదే మనకు నిత్యజీవన శ్రీమంతం !

104

" ఇక్కడి నుంచి - అక్కడి వరకు - ప్రతి రుచినీ, ప్రతి కళనూ, ప్రతి వంపునూ, ప్రతి అణువునూ అనుభవించాలి నేను.

" ఆ అనుభవమే పూజాద్రవ్య సర్వస్వంగా, అర్చించాలి సరస్వతిని నేను నిరంతరంగా.

" ఆనందంతో లేచి, మైమరచి, లాస్యం చెయ్యా లామె - వీణాతంత్రులే రంగస్థలంగా, వివిధ రాగాలే గజ్జెల మువ్వలుగా !

" అప్పు డామె పాదపద్మాలలో మనిద్దరం - రాగ లవాలమై-రజో లేశాలమై, కింకిణీ స్వనాలమై - స్వరలహరీ భ్రమరాలమై - శ్రుతి రహస్యాల అంతఃపురాల వెన్నెల పరదాల - "

ఎంత గమ్మత్తు చేశావు, హఠాత్తుగా - నేనలా చెప్పుకు పోతూ, పై మూర్ధం నుంచి నీ నాభిదేశం చేరగానే !

" అంతే ! అంతవరకే నేను ! ఆ క్రింద మరేం లేదు ! " అని నీ వన్నప్పుడు - తెల్లబోయిన నన్ను చూచి, ఎంత నవ్వింది చంద్రుడి ఒడిలోని ఆ చిత్ర !

లోకోత్తర ప్రణయానంద సుధాపరిస్నపిత అవుతూ కూడ, నిత్య కన్యగా అందరి పూజలూ అందుకొంటున్న చిత్ర !

ఇది కదా పూర్ణ ప్రణయ రహస్యం !

పూర్ణచంద్రుని ఒడిలో అక్కడ ఆమె

నా ఒడిలో ఇక్కడ నీవు !

మీ ఇద్దరిదీ ఒకే ఆత్మ !

వెన్నలా కరిగి, వెన్నెలగా విరిసే అనురాగ చైత్రి అది రాగవైశాఖి ఇది !

చైత్రీ సఖం నీ శ్రీముఖం !

నా నిగ్రహాని కది అగ్నిపరీక్షే అయిందా క్షణం !

తెల్లబోయి తేరుకొన్న నాకు, అప్పు డనిపించింది - నీవన్నది నిజమే అని !

నాకు ఆత్మ ప్రీతికరమైన పరమ సౌందర్య మంతా - మాయ చాటున పరమాత్మ వలె - నీ పమిటె చాటునే నా కోసం ఉప్పొంగి ఉండగా, అది నాకు కరతల నవనీతఫల సుభగమై ఉండగా, తదమృతఫల మాధుర్యం అధరామృత మాధుర్యాన్ని మించి నన్ను ఆత్మేశ్వరుణ్ణే చేస్తుండగా - ఇంకా ఏముంది నేను కోరేది ?

తాకదగిన, చూడదగిన, వినదగిన, మననం చేయదగిన, ఆరాధించదగిన పరమసుందర శివాద్వైత మంతా, కైలాసగిరి శిఖర స్థాయిలో, ఆవిష్కృతమై ఉంది కద - నా ఎదుట, నన్ను అదుముకొని !

జ్యోతిర్మయాలైన నీ కందొవలు

చంద్ర శీతలమైన నీ మనస్సు

వాగ్దేవికీ, శ్రీలక్ష్మికీ ఏకాసన మహోనీయమైన నీ వదన పద్మం

అమృత కలశం అంచులే అయిన నీ పెదవులు

దిగ్దిగంత ప్రాభవాలకు ప్రతినిధులైన నీ శ్రీశ్రుతులు

పంచబాణ పరశ్శతాలను ఒకేసారి ఎక్కుపెట్టి ఉంచిన నీ భ్రూకుటి

అష్టమీందు సమైందవీ ప్రాభవమైన నీ నుదురు

ఉద్రిక్త వాతపోతాలచే బెదరగొట్టబడ్డ నీలిమబ్బు తునకల వటి ముంగురులు

ప్రాణ ప్రియా కాంతిమ యాంతః పురానికి చీకటి తలుపుల్లాంటి నీ కాటుక కనురెప్పలు

సూర్యచంద్రులు గతిక్రమాన్ని నియమిస్తూ, జన్మజన్మాల వాసనా విక్రీడితమై ఉన్న నీ నాసాగ్రం

సల్లని తుమ్మెదలు - కాళి గౌరి కావడం కోసం వలె - తపస్సు చేసి, వరప్రసాదలై- ఆపాదమస్తకం, నా ప్రతి అణువులోను, చిప్పిలుతున్న ప్రణయ మధువును పీల్చుకొంటున్నవో అన్నట్టున్న నీ నిశిత కుందరదన సేనా పంక్తులు

తార వెనుక దాగిన బుధుని భయానకం వంటి నీ కేశ విక్షేపం

సమస్త శృంగార సాహితీ రసధ్వనిని ఒక్క కూజితంలో ఒత్తగల నీ రాగరంజిత కంబుకంఠం

మేరుగిరి శిఖరాలే, పూర్ణచంద్ర బింబాలే అసూయ పడగల నీ పాలిండ్ల బంగరు బల్బులు

రెండు బంగారు కొండల మబ్బు శిఖరాల నుంచి దిగి, సువర్ణ సానుస్నిగ్ధ రుచులతో మిలమిల లాడుతూ, ఆ లోయలో ఏకమై, మహార్ణవ ముఖంగా క్రిందికి ప్రవహిస్తున్న నీ నూగారు

పేటిత కేళీ విహార కేంద్రమైన నీ నాభిదేశం

ముద్దులు, ముఖభూషలు, చాలనలు, చంద్రవంకలు, వషట్కృతి, పంచాంగుళం, ప్రాణం, హృదయం, నాడి, స్పందనం -

ఓహో !

పరమానంద పరాదేవతే నిజస్వరూం తో సాక్షాత్కరించింది కదా -

ఒక్క నీ చిరునవ్వు పమిటెలో తళుక్కుమని !

ఇంకేం కావాలి నాకు ఇంతకంటె ?

ఇప్పటి కింతే చాలు - అర్చించనీ నన్ను - కామకళ అక్కను, శృంగార కళను !

విహరించనీ నన్ను - ఈ రసానంద రసాల వననీమలో, ఇచ్ఛానుసారం !

ఉండనీ నన్ను ఇలానే - ఈ ఆనంద సాగర తీరంలో

గవ్వలు, పగడాలు, ముత్యాలు, ముత్యపు చిప్పలు ఏరుకొంటూ - ఇసకతో ఈప్సా సౌధాలు కట్టుకొంటూ - తరంగాలకు తాళం వేస్తూ ఆడుకొంటూ, పాడుకొంటూ !

గ్రోలనీ నన్ను - ఈ పూదేనెలను, ఈ ఫలరసాలను !

మైమరచి పోతానేమో నేను !

మైమరిచి పోతే, దూకుతానేమో సాగర తరంగాల మోహన ఆకర్షణల లోకి !

ఈదలేక పోతానేమో, దూకితే !

మునిగి పోతానేమో పూర్తిగా వివశుణ్ణయి !

ఇం కేం మిగులుతా నప్పుడు ?

మిగలకుండా - ఎలా అనుభవించగలను ఈ నీ సౌందర్యాన్ని అంతా ?

నిజానికి, ఇదే నీవు !

ఇంతవరకే నీవు !

ఆ క్రింద మరేముంది ప్రత్యేకత - సృష్టి యొక్క సాధారణ పరిపాలనా కేంద్రం తప్ప !

నీవు, నేను అనే వ్యక్తిత్వం కేవలం ముఖం వరకే !

అదే స్వర్లోకం !

ఆ దిగువ భువర్లోకం మన రాధామాధవ విహార సుందర క్షేత్రం !

ఆ క్రింది భూలోకం అంతా వట్టి ప్రజాస్వామికం ! వోటు పత్రాలన్నీ ఒకే రూపం ! తేడా ఏమీ లే దక్కడ !

చాలు నాకు ఇంతవరకు !

నా ధ్యేయం వోటు కాదు - వ్యోమప్రాభవ విజయ ప్రభ !

సంగీత సాహిత్య కళా కలశాలైన ఈ చైత్రీ వైశాఖీ పూర్ణబింబ ప్రియలు - శృంగార సుధా కామకళా కలశాలు - చాలు నాకు తరించడానికి !

ఓహో, దేవీ ! రాగవచ్చవీ !

నీ వన్నది సత్యం !

నీ క్రీడ సత్యస్య సత్యం ?

కుసుమ భరిత వనాలు, కోయిలలు, తుమ్మెదలు,
పద్మములు, తేనె దొప్పలు, రసాల ఫలాలు
ఆనంద రస మింతకన్న నేమిటె ? చెలీ !
నీ కన్న ఆనంద నిలయ మేమిటె ? చెలీ !

105

హిమనీ శీతల పానీయ మందిరంనుంచి తెప్పించుకొన్న ద్రాక్షరసం నీ అధర సుధారసంతో కలిసి , ఎంత మధురంగా ఉంది !

నీ వదన చంద్రకలశం నుంచి , అమృతంవలె , రసాన్ని పీలుస్తున్నాను నేను - ఇవతలి నుంచి స్ఫురిత స్వరంతో !

అవతలినుంచి నీవూ అంతే !

నీవు , నేను - కలశం నిండా బుడ్బుదాలను సృష్టిస్తూ , గ్రోలుతున్నాం కొరినొకరం - రెండు గొట్టాలతో , చెరొకవైపు నుంచీ !

ఎన్ని బుడ్బుదాలు !

క్షణభంగురాలా అవి ?

ఒకటి పోతే మరొకటి !

అదే రసం, అదే స్వభావం పునఃపునహా !

నిరంతరం ఈ సృష్టి !

ఆనంద క్రీడ ఇది మనకు !

అలా ఎంత సేపు ?

కలశంలో రసం ఉన్నంతసేపే ఈ సహస్రాధిక రస జగత్తుల రాసలీలలు !

అంతేనా ?

రసం ఉన్నంతసేపే మనం కూడ !

ఎంత అందంగా ఉన్నై బుడగలు నక్షత్రగోళాల్లా !

రసం అయిపోతే -దానితో ఈ విశ్వలీలే కాదు, మనం కూడ ఆఖరు !

నన్ను నీవూ, నిన్ను నేనూ ఆస్వాదించేస్తే - ఇంకేం ఉంటుంది మిగిలి?

ఆపుదామా ఇక ?

శాంకరీ శంకర విశ్వక్రీడా శాంబరిలా ఉన్న దది !

అనుభవించవద్దా దీన్ని మనం సంపూర్ణంగా ?

మిగుల్చుకోవద్దా మనల్ని మనం మరొక ఘడియ దాకా ? మరొక ఋతువు దాకా ? మరొక యుగం దాకా ?

అనుక్షణం ఇలానే ఒకరి నొకరం గ్రోలుకొంటూ , మళ్ళీ ఎప్పటిలాగే నిండుగా మనల&ఇన మనం మిగుల్చుకొంటూ , నడిపించలేమా ఆద్యంత రహితంగా ఈ ఆనంద రాగలీలను ?

ఓహో ! తరగడం లేదీ కలశం !

ఎవరు నింపుతున్నారో దీన్ని మళ్ళీ మళ్ళీ !

మన ఇద్దర్నీ ఇలా ఛేరదీసిన ఎవరో - మళ్ళీ మళ్ళీ నింపు తున్నారు మన కలశాన్ని !

మనల్ని మనం మరొక ఘడియ దాకా ? మరొక ఋతువు దాకా? మరొక యుగం దాకా ?

అనుక్షణం ఇలానే ఒకరి నొకరం గ్రోలుకొంటూ, మళ్ళీ ఎప్పటిలాగే నిండుగా మనల్ని మనం మిగుల్చుకొంటూ, నడిపించలేమా ఆద్యంత రహితంగా ఈ ఆనంద రాగలీలను ?

ఓహో ! తరగడం లేదీ కలశం !

ఎవరు నింపుతున్నారో దీన్ని మళ్ళీ మళ్ళీ !

మన ఇద్దర్నీ ఇలా చేరదీసిన ఎవరో - మళ్ళీ మళ్ళీ నింపుతున్నారు మన కలశాన్ని !

అవును !

నన్ను నీవూ, నిన్ను నేనూ అస్వాదించే స్తే - నేను నీవూ, నీవు నేనూ అవుతామే కాని - ఆఖరెలా అవుతాం ?

మనం ఆఖరు కాం ఎన్నటికీ !

ఈ పాత్ర అక్షరం, అక్షయం !

మనం శివసరస్వతులం !

ఈ కలశం అక్షయం

రసం అక్షరం !

మనం అక్షయ రమ్యాక్షర రాగ రసాస్వాదన పరాత్పరులం !

గొట్టాలా ఇవి ?

రసవాహిను లివి !

పెదవులా ఇవి ?

నిత్యజీవన సుధాపూర్ణ సంపుటీ సమైశ్వర్యా లివి !

పెదవి గల అక్షరము లన్నీ
అక్షరము లే నటే ?
ప్రేమ అను రెండక్షరములే
అక్షరము లౌ కదే !
అక్షరము లన్నంతనే అవి
అక్షరము లౌనటే ?
ప్రేమ అను రెండక్షరములే
అమృత పాత్రలు కదే !
అమృత పాత్రము లన్నియును శివ
సరస్వతు లౌ నటే ?
ప్రేమ అను రెండక్షరములే
నీవు నేనును కదే !

106

" అంత కందిపోయేటట్టా కరిపించుకొంటారు పెదవుల్ని - అన్నది వర్ష !

" ద్రాక్షరసం గుజ్జు అంటుకొన్నదంటే - నమ్మలే దది !

" నా పెదవుల్నీ, బుగ్గల్నీ, వాటినీ చూస్తూ కూర్చుంటుంది ఎప్పుడూ.

" ఎంత బాగున్నై - అన్నది మీ ఆర్ద్రారోహిణుల్ని చూచి !

చివర చెరొక ద్రాక్షపండూ గుచ్చిన రెండు వెన్నముద్ద లట అవి !

" పైట సర్దుకొన్నాను వెంటనే సిగ్గేసి !

" ఎందుకా గులాబీల జంటను మరీ ఎరుపెక్కించుకొంటావ్ ? నీ కేనా ఉంట మహా ? నాకూ ఉన్నై ! అన్నది ఈసుగా !

" లేవని నే నన్నానా ఏమిటి ?

" పోనీ, నీకే ఉన్నైలే, దాచుకో - అంటూ, తానే నా పైట సర్దబోయి, నొక్కి - లేత ముంజెలు కదే - అన్నది !

" మీకంటే అన్యాయంగా ఉంది దాని ప్రవర్తన. మీ అమృత కలశాలకు మీరు పెట్టుకొన్న పేర్లన్నీ ఆమె కెలా తెలుసో ! నన్ను ప్రేమిస్తున్నదట అది !

" ప్రేమ దాహంతో కుతకుత లాడిపోతున్నట్టు కనిపిస్తుంది. తనను తానే గట్టిగా అదుముకొని, గిల్లుకొని ఏడుస్తుంది. అంతలోనే నవ్వుతూ, నాపై పడి, కౌగిలించుకొని, బుగ్గలు కరుస్తుంది !

" ఆయ నేం జేశారే - అంటుంది !

" ఎంత సిగ్గు లేనిది !

" శారీరక వాంఛలు తీరక, కామోద్వేగం చల్లారక, ఇలా పిచ్చిదైపోతున్నదో ఏమో !

" అసూయ కూడ ఉన్నట్టుంది.

" ఎంతో కాలంగా పరిచయమై ఉన్న తనను విడిచి, లోగడనే పరిచయమైన నన్ను మీరు ప్రేమించడం, బహుశా, ఆమె హృదయాన్ని గాయపరచి ఉండవచ్చు. అందుకే నన్ను ఇలా పీడించడానికి పూనుకొని ఉండవచ్చు కూడ !

" మీ శృంగార చేష్టలకు ఆనవాళ్ళని తాననుకొనే గుర్తులు ఎక్కడ కనిపిస్తే అక్కడ - తాకి చూస్తుంది, నాకి చూస్తుంది, ఉమ్ముతుంది తూతూ అంటూ !

" మండిపోతుంది నాకు ఒళ్ళు.

" పోనీ, ఆమె కోర్కె ఏదో కాస్త తీర్చి పారెయ్యగూడదా మీరు ?

" మిమ్మల్ని ఇంత పిచ్చిగా కోరుతున్న స్త్రీ, కోర్కె తీరకుండానే చచ్చిపోతే, పిశాచమై పీడిస్తుందో ఏమో ఆ తర్వాత !

" కోర్కె కలగనే కూడదు. కలిగితే, అది తీరవలసిందే. తీరని కోర్కె బలి కోరుతుందిట ఉభయత్రా !

" స్త్రీ కోరితే, ఆ కోర్కెను తీర్చని మగవాడికి సద్గతి లేదన్నారు ఋషులు.

" ఋషుల్ని మనం కాదంటాం గాని - నేడు రోదసీ నౌకల్ని నిర్మిస్తున్న ఇంజనీర్లు లక్షమంది కంటె, ఆనాడు ఒక్క నారదుణ్ణి ఊహించిన ఋషే గొప్పవాడు నా దృష్టిలో !

" ఈ సృష్టి కుటుంబంలో సైంటిస్టు వంటలవాడు. ఋషి వ్యవసాయదారు. రాజు భోక్త !

" అయితే - ప్రియురాలి కుండవలసిన మధుర గుణాలేమీ లేవు వర్షకు !

" కళ్ళల్లో కామబాణా లున్నై. శరీరం చెరకు విల్లులా వంగుతుంది. నైలాను బుట్టలలో ఆపిలు పళ్ళు పరువుకు వచ్చే ఉన్నై. చాలు యువతికి, కాని -

" వాటిని పోషించుకుంటూ, మార్దవ మాధుర్యాలను తదనుగుణంగా పెంచుకొంటూ ఉండాలి జాగ్రత్తగా! ఆ పని చెయ్య దామె.

" ఏవో ఒకటి రెండు పై అందాలు చాలవు స్త్రీకి. పరిచయం స్నేహంగా, స్నేహం ప్రేమగా, ప్రేమ ఆరాధనగా వికసించేటట్టు చేసుకోవాలి తపస్సు ద్వారా !

" ప్రేమ లభించిన చోటనే తాదాత్మ్యం పొందాలి స్త్రీ. అదే ఆమెకు దేవీ పీఠం.

" పురుషుడు ప్రేమించేది అందం చూచి కాదు. అనురాగం అనుభవించి !

" అసలు - పురుషుడు ప్రేమించడం ఏమిటి ? పురుషుడు ప్రేమించడు. పురుషుడి ప్రేమ కామప్రధానం. బ్రహ్మ కామనే సృష్టికి మూలం. అదే పురుషుడికి వచ్చిన వారసత్వం. ప్రేమ, కామం - ఈ రెండూ కలిసిందే పురుష తత్వం. ప్రేమ లేని కామం ఉండవచ్చు ప్రాథమికులలో. అట్టి వాళ్ళే మెజారిటీ కూడ ! కాని కామం లేని ప్రేమ ఉండదు ఎంతటి పూర్ణ పురుషుడి కైనా !

" స్త్రీ అందుకు విరుద్ధం. స్త్రీ ప్రేమిస్తుంది.

" పురుషుడిలో ఉన్నవి రెండు తత్వాలు - ప్రేమ, కామం,

" స్త్రీలో ఉన్నది ఒకే తత్వం - ప్రేమ !

" స్త్రీ లోని ప్రేమ పురుషుడి లోని ప్రేమతో కలిస్తే - అది ఆనంద పరమావధి అయిన తాదాత్మ్య శ్రేయో అమృత పదవే.

" స్త్రీ లోని ప్రేమ పురుషుడి లోని కామంతో కలిస్తే - అది పురుషుణ్ణి పందిగా మార్చి, స్త్రీని బెజవాడ మురికికాల్వగా కంపెత్తిస్తుంది !

" తాను పతనం కాకుండా రక్షించుకోవలసిన బాధ్యత స్త్రీది. పురుషుడికి పతనం అనేదే లేదు.

" అందుకు స్త్రీ ప్రేమించాలి.తన ప్రేమను అందుకొన్న పురుష ప్రేమకే ఆత్మార్పణ చేసుకోవాలి.

" అందుకు - తపస్సు చెయ్యాలి స్త్రీ !

" తపస్సు చెయ్యాలి స్త్రీ. హైమవతి చెయ్యలేదా భీమేశ్వరుడి కోసం ? రమ చెయ్యలేదా శ్రీరాముడి కోసం ? తమస్సు లేని స్త్రీ సామాన్యుడికి భార్య కాగలదే కాని - ఒక పూర్ణ పురుషుడి ప్రియురాలు కాజాలదు.

" ఒక్క మగవాణ్ణి కూడ ఆకర్షించి ఆకట్టుకోలేని స్త్రీలున్నారు. తమ అపజయాలకు కారణాలను సైతం వెతుక్కోరు వాళ్ళు. దిద్దుకోరు తమ లోపాలను, మనస్సులను, ఆత్మలను.

" అందం, అభిజాత్యం, విద్య, ధనం వంటి వ్యర్థ ప్రతిష్ఠలను చూచుకొని గర్వపడే స్త్రీకి జీవితంలో లభించేది స్వకుచ మర్దన సుఖం ఒక్కటే !

" ఆరాధించగల స్త్రీయే ఆరాధ్యదేవత కాగలది.

" అవివాహితుడో, అందగాడో, అవిటివాడో - ఎవడో ఒక్క పురుషుడైనా అనురక్తుడై ఆరాధించగల్గితే - అట్టి స్త్రీ కంటె ధన్యురాలు మరెవరు ?

ప్రియురాల్ని ఉంపుడుకత్తెగా నిరసిస్తూ, గయ్యాళిని భార్యగా గౌరవించేది -వలపు విలువలు తెలియని ఇక్కడి లోకమే ! ఈ లోకానికి శరీరాలే కదా ముఖ్యం ? శరీరాలు ఎంత కాలం ఉంటై ?

" ఆత్మే ప్రధానమైన ఆధ్యాత్మిక లోకంలో - ఎన్ని ఆత్మలైనా కలిసిపోవచ్చు ఒక దానితో ఒకటి అనురాగ బలంతో.

" మీ సిద్ధాంతాలు నాకూ ఒంటబట్టినట్టున్నై ! ఏదో వ్రాసేస్తున్నాను తీరికగా ! మంజీర వచ్చి వెళ్ళిందిలే నిన్న.

" ఆత్మ, అనురాగం వంటివి అర్ధం కావు వర్షకు. పిచ్చి కామం దానిది. వట్టి శరీరం, దాని నిండా తాపం.

" నాలుక బ్లేడు. స్వభావం నల్లి. మాటి మాటికీ మూతి ముడుస్తుంది కదా ! అప్పు డనిపిస్తుంది నాకు - గత జన్మలో అది ఏదో ఒక ఎలుక బోనులో చిక్కుకొన్న చుంచు అయి ఉంటుందని !

" అద్దంలో అయినా చూచుకోదో ఏమిటో !

" నాకూ ఉన్నై ఎన్నో లోపాలు. మరి దిద్దుకోవడం లేదా ముఖాన్నీ, మనస్సునూ కూడా - మీలో చూచుకొని ?

" నేర్చుకోదు వర్ష.

" అసూయ వల్ల ఏం లాభం ?

" ఎవరైనా ఇద్దరు స్త్రీ పురుషులు చనువుగా ఉన్నట్టు కనిపించినా - ప్రేమతో పల్కరించుకొన్నా - ఒకరి దగ్గర ఉన్న విద్యను ఒకరు గ్రహించే ఉబలాటంతో పరస్పరం సన్నిహితులైనా కూడ ఓర్చుకోలే దామె. అలాంటి పరిచయాలకు అపార్థాలు కల్పిస్తూ, ప్రచారాలు చేస్తుంది. ఆకాశరామన్న ఉత్తరాలు వ్రాస్తుంది - వాళ్ళ వాళ్ళ పెద్దలకు !

" తాను పెట్టిన నిప్పుకు ఆయా జీవితాలు, సంసారాలు అంటుకుపోతుంటే - తృప్తిగా నిట్టూర్చే ఈ పైశాచిక మనస్తత్వానికి ఏమిటి కారణం ?

" భగ్న ప్రేమ ?

" ప్రేమ భగ్నం ఎప్పు డవుతుంది ?

" ప్రేమించడం చేత కానప్పుడు, ప్రేమలో స్వార్థం ఉన్నప్పుడు. కేవల శరీర కామాన్ని ప్రేమ అనుకొన్నప్పుడు. ప్రేమ కోసం త్యాగం చెయ్యలే నప్పుడు. తాను ప్రేమిస్తున్న వ్యక్తి తిరిగి తనను ప్రేమించా లనుకొన్నప్పుడు !

" నాకు లేనిది మరొకళ్ళకు మాత్రం ఎందుకుండాలి - అనేది ఆశ్లేషయ్య మనస్తత్వం. ఈ రకమైన కుళ్ళు వల్ల చెడేది ఆ కుళ్ళు కలవాళ్ళే !

" అలా చెడింది వర్ష !

" తాను ప్రేమించిందట ! అవతలి వ్యక్తి తిరిగి తనను ప్రేమించలేదట ! అందుకని తాను ద్వేషిస్తుందట !

" అతిథి స్వీకరించనంత మాత్రం చేతనే విషంగా మారిపోయేది నిజంగా అమృతమేనా ?

" ఎవరూ వాడనంత మాత్రం చేత, గుర్తించనంత మాత్రం చేత మాణిక్యం మసిబొగ్గైపోతుందా ? వేలకొలది సంవత్సరాలు భూగర్భంలో కూరుకుపోయి ఉన్నా - రత్నం రత్నమే కదా ? నల్లి నెత్తురుపూత పెదవుల చివర, పౌడరు చెంపలపై, చెవి రింగులలో ఎంత మిడిసిపడుతున్నా - నకిలీ రాళ్ళు నకిలీ రాళ్ళే కావా ?

" ఒకసారి ప్రేమిస్తే - ఆ ప్రేమ అమృత దివ్యమూ, ఆనంద పరమమూ అయితే - దానికి భగ్నత అనేదే లేదు కద ?

" ఏదైనా ఒక కాంతి ఆరిపోవచ్చునే కాని, చీకటిగా ఎలా మారిపోగలదు ?

" కాంతులకే అధికాంతి ప్రేమ. ఆరడం అనేదే లేదు దానికి !

" అర్థం కాదు వర్షకు !

" ప్రేమ పరమానంద కైవల్య పదవి అనీ, పెళ్ళి కేవలం సాంఘిక తంతు అనీ - ప్రేమ శివసరస్వతీ పరమాద్వైతమనీ, పెళ్ళి వట్టి బ్రతుకుతెరువు కాంట్రాక్టు అనీ - ప్రేమకూ, పెళ్ళికీ సంబంధమే లేదనీ - ఎరగదు ఆమె !

" తాను ప్రేమిస్తే చాలు. అదే తనకు ఆనంద లబ్ధి ! పరమామృత సిద్ధి !

" రాత్రికి సుఖంగా, ప్రశాంతంగా విశ్రమించే దెక్కడో నిశ్చయంగా, స్వయంగా తెలిసిన వ్యక్తి, పగలంతా ఎన్ని కష్టాల కైనా ఓర్చి, ఎలా శ్రమపడగలడో - తన ప్రణయాత్మకు పరమ విశ్రాంతి ఏదో గుర్తించుకొని, ఏ తదానందానుభూతిని అపరోక్షంగా పొంది ఉన్న వ్యక్తి కూడ -జీవిత మంతా ఎన్ని పోటీ పోరాటాల కైనా రొమ్ము ఒడ్డి, అలా విజయోన్నత పరా శిఖరాన్ని అధిరోహించగలడు !

" నీవు ప్రేమించిన ఆత్మే నీ పరమాత్మ. అది నిన్ను స్వీకరిస్తే చాలు. అదే నీ సౌభాగ్యానికి పరమైశ్వర్యం - అంటారు మీరు.

" పరమ స్థితిని అందుకోవడానికి ఆమె ఇంకా ఎన్ని జన్మలు ఎత్తవలసి ఉన్నదో ! "

ప్రేమ భావము లేక, ప్రేమించగా లేక,
నిను ఎవరొ వంచించి రని ఏద్వ ఫల మేమి ?
ప్రేమించగల దివ్య హృదయమే నీ కున్న
శివుడె నీ చరణాబ్జ సేవకుం దగు కదే !

107

" ఛ :ఛ ! అందరి మీదా పడింది ! "

" ఏమిటది ? "

" ముద్దు ! "

" నీ ముద్దుతో ముక్తులైన ఆ ధన్యాత్మ లెవరు ?

పత్రిక లాక్కొన్నాను నీ చేతిలో నుంచి !

ఎంత రసవత్తర సన్నివేశం అది !

ముఖం చేతులలో దాచుకొని, వ్రేళ్ళ సందుల్లోంచి చూస్తున్న నీవు - కేవల జ్యోతిరాత్మ కనికట్టులా కనిపించావు నా కప్పుడు !

ఎన్ని జన్మల తపఃఫలాల రసకవితలో ఆ చూపులు !

పత్రిక వదిలేసి, నిన్నే చూస్తున్నాను నేను !

ఓహో ! ఆ లజ్జామోహన ముగ్ధ సౌందర్య !

సాధారణ వస్తువే, రోజూ చూస్తున్నదే, తిరస్కార సీమ దాకా అతిపరిచయ మైనట్టిదే - జిగేలు మంటుంది ఏదో ఒక క్షణంలో, ఏదో ఒక దివ్య సౌందర్య లవంతో !

అదే దాని నిజరూపం !

ఆత్మోజ్జ్వల్యమే సౌందర్యం.

అదే సరస్వతి !

ఆ క్షణంలో, ఆ సౌందర్యంతో, దాన్ని పట్టుకోగలవాడే నిజమైన కళా బ్రహ్మ !

అతడే శివుడు.

ఈ శివసరస్వతీ సమద్వైత సౌందర్యమే రసబ్రహ్మ !

అలా ఎంతసేపు ఉన్నామో మనం – క్రియా శూన్యులమై – వట్టి ఆనంద శూన్యంగా !

అలానే సశరీర శూన్య పరిపూర్ణ తత్వమై పోయేవాళ్ళం మనం అకాల కాలాతీత పరాస్థితిలో – మిత్ర బృందంతో అప్పుడు మన బాపురెడ్డి వచ్చి ఉండక పోతే !

వేదకాలంలో, పరమ మాదిగ కూడ వేద విభజన చేయగల్గిన దివ్యయుగంలో, మనిషి మనీషిగా – ఋషిగా – దేవుడుగా బ్రతకగల్గిన ఆ ఎప్పుడో, సాధ్యమై ఉండి ఉండవచ్చు నన్న సమాధి – శిలా ఘటిత అర్ధనారీశ్వర దివ్య శిల్పం వలె తన కళ్ళ బడగానే, తన కళ్ళను తానే నమ్మలేక, తానూ ఒక శిల్పమూర్తి అయినాడు కద బాపురెడ్డి !

విశ్వం లోని సమస్త హృదయాలను రామాఫలాల వలె గ్రోలి, సీతాఫలాల శైతల్యం సంతరించుకొని, మహాస్రష్ట నిర్మించిన సహృదయతే బాపురెడ్డి. అమృత భావుకుడు, ఆనంద కవి, ఆత్మీయ మూర్తి అతడు !

పేపరు చూశాం.

అబ్బ ! పేపర్లో పడిందే ఫోటో !

కవి సమ్మేళనం ఫోటో అది. చాల రోజుల క్రితంది.

మంత్రిగారు అధ్యక్షులు కనుక పడిందది పేపర్లో !

ఏవో రాజకీయాలకు, ప్రమాదాలకు, యుద్ధాలకు సంబంధించిన వార్తలు, ఫోటోలు తప్ప – సంగీత సాహిత్యాలకు చెందిన వేవీ పత్రికలలో పడవు సాధారణంగా.

ఏ మంత్రిగారో వస్తే తప్ప – సాహిత్య సభలకు పత్రికా విలేఖర్లే రారు. వచ్చినా, వార్తలు పంపరు. పంపినా, అక్కడుండే మహాశయులు వెయ్యరు. వేసినా, ఏ మూలో ఒక రెండంగుళాలు !

తక్కిన పండ్రెండు పేజీల పత్రిక అంతా, పెద్ద పెద్ద శీర్షికలతో రాజకీయాలు - రాజకీయాలు - రాజకీయాలు !

రాజకీయం తప్ప, జీవితమే లే దీనాడు ఈ దేశంలో !

ఒక రాజకీయ పార్టీ వలంటీరు పాటి కూడ చెయ్యడు - ఈనాడు ఈ దేశంలో - ఏ మహాకవీ !

ఎవరికి కావాలి కళా, కవిత్వమూ ?

కావలసింది కూడు !

దానికి ఆధారం రాజకీయం !

కూడు, గుడ్డ, వసతి, సుఖం, వినోదం, స్త్రీ, అధికారం, గౌరవం, పదవి - అన్నీ కూడ మార్కెట్లో దొరుకుతై వెలకు.

ఉండవలసింది డబ్బొక్కటే. దానికి మూలం వ్యాపారం. వ్యాపారానికి కీలకం రాజకీయం.

మెదడూ, శక్తీ కూడ మార్కెట్లో దొరుకుతున్నై కద !

హృదయాన్ని చంపుకొని, రౌడీగా మారి, కుట్రలు చెయ్యగల్గితే - ఏ వోటరైనా సరే, డిక్టేటరే కావచ్చు !

అతడి కనుసన్నల్లో మెలుగుతై, ఆడతై, పాడతై - కళలూ, కవిత్వాలూ, సంగీతాలూ, స్వారస్యాలూ - బట్ట విప్పుకొని !

ఏడుస్తోంది సరస్వతి !

హృదయం ఏదీ కరగడానికి ?

ఆనాడు ఒక్క రాజుకే భయపడేవాళ్ళు అందరూ.

ఈనాడు ప్రతి ఒక్కడికీ భయపడుతున్నాడు ప్రతి ఒక్కడూ !

మనిషి మెషీనుగా మారిపోతున్న కాలం ఇది.

మెషీను తుప్పుగా, తుప్పు ద్రవ్యంగా, ద్రవ్యం శూన్యంగా మారిపోయిన తర్వాత -మళ్ళీ సర్వం పరబ్రహ్మే కద ?

అటుకేసే - అక్కడకే - ఈ పరుగులు !

ఏది ఏమైనా - ఫోటో పడింది పత్రికలో !

మంత్రిగారి ప్రక్కగా ఉన్నందువల్ల కాబోలు, నా బొమ్మ మరి కొంచెం బాగా పడింది.

కాసేపు ఏవో కబుర్లు చెప్పుకొని, వెళ్ళిపోయారు బాపురెడ్డీ, వాళ్ళూ !

అయితే -

దేవీ !

ఎదుట సాక్షాత్కరించి నేను ఉండగా - ఫోటోలోని నా బొమ్మనా ముద్దు పెట్టుకొంటావు ?

" తుడిచేశాగా ? అది అందరిమీదా పడింది ! "
" ఆ అందరూ నా కంటె గొప్ప కవులే లే ! "
ఎర్ర కల్వలై పోయినై నీ కళ్ళు !
కందిపోయినై నా బుగ్గలు !

కను ముక్కు తీ రొకటె కాదు చక్కదనమ్ము,
ఆత్మబొజ్జల్యమే అమృత సౌందర్యమౌ !
బొమ్మ బంగరుదైన బొమ్మేనె, ఒ చెలీ !
పువ్వు తృణము దెయైన పువ్వేనె, నా చెలీ !

108

కొబ్బరి కాయలున్, పసుపు
కుంకుమలున్, పువులున్, ఫలమ్ములున్,
దబ్బులు రెండు పుచ్చుకొని -
దాగులుపడ్డ మనఃపటమ్ములన్
సబ్బున గుంజి పెట్టు మని
స్వామిని చేరిరి మానవాళి ! ఆ
గబ్బుకు గబ్బిదమ్ములె క
కావికలై గుడి వీడి పారగా !

గుడి నిండా, గుడి చుట్టూ - జనం ! జనం ! జనం !
ఈ అందరూ ఆస్తికులేనా !

మౌళి ఒక్కడేనా నాస్తికుడు !

ఎందుకు అతడిపై నీ కంత కోపం !

ఆలోచించి చూడు కొంచెం.

దైవం లేదంటూ, ఉన్నది మనం మాత్రమే అంటూ, తమ ప్రవర్తనకు తామే బాధ్యత వహిస్తూ, జీవించే నాస్తికులు ఒక ప్రక్క-

ముక్తి కోసము కీలు మాడ్చె నొకడు ;

కూలీల నేడ్పించి, కోటికి పడగెత్తి,

ఈ రెండు పక్షాలలోను సమాజానికి ఎక్కువ అపకారు లెవరో చెప్పగలవా నీవు ?

అద్వైత పద్ధతిలో దైవస్వరూపం ఏమిటి ? శుద్ధ నిర్గుణ పరిపూర్ణ బ్రహ్మను లేదంటే ఏం ?

మనిషి ప్రవర్తనే కదా ప్రధానం సంఘానికి ?

మానవసేవే మాధవసేవ అని పైకి మాత్రం చెపుతూ, మానవులందరి చేత సొంత సేవ చేయించుకొనే ఆస్తికుల కంటె - మనస్ఫూర్తిగా బాధ్యతతో మానవులుగా బ్రతికే నాస్తికులే మంచి వాళ్ళు కారా ?

అందరూ నీకు లాగే వచ్చా రనుకొంటున్నావా గుడికి ? ఆ పూజలు చేస్తున్న ఆస్తికుల మనస్సులలోకి ఒకసారి తొంగిచూడు !

తన దొంగతనము పారిన ఒక్క టెంకాయ
కొట్టుదునని మ్రొక్కుకొనియె నొకడు ;
వెలదికై హితునికి విషమిచ్చి, దొసగు నీ
పైటకు తుదువగా వచ్చె నొకడు ;
రోజెల్ల దొంగ తరాజుతో ప్రజ దోచి,
ముక్తి కోసము కేలు మోడ్చె నొకడు;
కూలీల నేడ్పించి, కోటికి పడగెత్తి,
అరణాకు కైవల్య మడుగు నొకడు ;

సంఘ జీవఘ్నమైన దుష్కార్య మెంతొ
చేసి, గడియించుకొన్న అశేష కిల్బి
షమును నీ కొక్క పువ్వు లంచముగ నొసగి
కడిగి వేయించుకొన వచ్చె ఘను డొకండు !

దైవం లంచగొండి కాదని - పొగడ్తలకు ఉబ్బిపోయే అల్పుడు కాదని - ఒక్క కొబ్బరికాయకే మురిసిపోయి, కల్తీనేయి అమ్మిన పాపాన్ని తుడిచివేసే టంతటి దుష్టుడు కాదని - ఈ సరమ భక్తు లెప్పటికైనా గుర్తించగలరా ?

నారాయణా అని తన కొడుకును పిల్చుకొన్నంత మాత్రాన, ఒక మహా పాపి వైకుంఠానికి వెళ్ళాడట !

పరలోక మందున్న దేవుణ్ణి ఒకసారి స్మరిస్తే చాలు, టన్నుల కొలదీ పేరుకొని ఉన్న పాపపంకం మొత్తాన్ని అతడే మోసుకు పోతాడట !

పాపుల వ్రాతలి వన్నీ - నా ఉద్దేశంలో ! కేవలం వాళ్ళ పేరాస లివి !

మానవ సమాజాన్ని నాశనం చేసిం దిలాంటి వ్రాతలే !

ఏ మత గ్రంథాన్నై నాతెరిచి చూడు !

దైవం ఎక్కడో మరో లోకంలో ఉంటాడు. మహా భోగభాగ్యాల నడుమ- ఒక సంస్థానాధీశ్వరుడిలా, ఒక బడా నవాబులా - సుఖిస్తూ ఉంటాడు. పదవిలో ఉన్న ఒక లంచగొండివలె - క్రూరు డతడు. ఆశ్రిత పక్షపాతి కూడ. చెప్పుడు మాటలు వింటాడు బాగా. ప్రపంచంలో ఎక్కుడ ఏమి జరుగుతున్నదో, ఎవడో ఒక నారదుడు చెప్పేవరకూ, తెలియ దతడికి. చుట్టూ నిత్యం ఋషుల పొగడ్తలు, దేవతల భజనలు, మానవుల దానోహాలు ! వట్టి మూర్ఖుడు - కాముకుడు - దగాకోరు - దగుల్బాజీ !

అతణ్ణే నమ్ముకొని ఉన్న వాళ్ళకి మాత్రం ఇస్తూ ఉంటాడట కోరితే - వరాలూ, కోరకపోతే - మోక్షాలూ !

దైవాన్ని ఇంత నీచంగా - ఒక గ్రామ రౌడీ వలె - రూపొందించి, అసాధ్యమైన నీతులు కొన్ని సృష్టించి, అభ్యుదయ నిరోధకమైన దాసానుదాస్యాన్ని ప్రచారం చేసి, మూఢాచారాలను ఆచరణలోకి తెచ్చి, మానవుణ్ణి నాశనం చేశారు అజ్ఞానులు, స్వార్థపరులు, పాపులు !

రకరకాల గుడులు, మందిరాలు, మశీదులు, కోట్ల కొలది దేవతలు,వాళ్ళతో వాళ్ళకి విరోధాలు, భక్తుల కోసం పోటీలు, నైతిక వైరుధ్యాలు, ఆచార మౌఢ్యాలు, అడ్డపట్టీలు, నిలువుబొట్లు, దారంపోగులు, పిలక టోపిలు, ముఠాలు, ముఠా రాజకీయాలు, ప్రచారాలు, కుట్రలు !

ఏమిటి ఇదంతా ?

ఏమిటి చెయ్యడం మానవుడు ?

దేన్ని నమ్మడం ?

ఏ దిక్కుగా పోవడం ?

ఏది తరణోపాయం ?

ఎక్కడ వెలుగు ?

అంధకార బంధురమైన ఈ గహనంలో, నరక భయాలను రెచ్చగొట్టి, స్వర్గసోపానాలకు మార్గం చూపుతా మంటూ, స్వార్థ ప్రభువులు అందినంతవరకు దోచుకొంటున్నారు ప్రజల్ని !

ఈ ఆస్తిక కల్లోలాన్ని భరించుకోలేని వివేకి – నాస్తికుడు కావడంలో వింత ఏముంది ?

ఆస్తికులంటే ఎంత అసహ్యమో, నాస్తికులంటే అంత జాలి నాకు.

దైవానికి నాస్తికు డున్నంత దగ్గరగా ఆస్తికుడు లేడు నిజంగా.

అయితే – ఆ విషయం తెలియదు నాస్తికుడికి. అర్షవేదాంత చింతనను అవగాహన చేసుకోలే దతడు. అదే అతడి బలహీనత. అందుకే అతడంటే నాకు జాలి !

నీవే దైవం – అంటున్నది మన వేదాంతం.

మతం లోని దేవుడు మగవాడు. అలాంటి వా డెక్కడా లేడు.

వేదాంతం లోని దైవం ఒక శుద్ధ చైతన్య శక్తి. అది సర్వత్రా ఉంది.

దైవం వేరు, మతం వేరు.

మానవుడి కడుపు లోని ఒక నులిపురుగుకు మానవ స్వరూపం ఎలా అగమ్య గోచరమో, విశ్వగర్భం లోని మానవుడికి విశ్వేశ్వర స్వరూపం అలానే అందరానిది !

ప్రభుత్వం వలెనే పరబ్రహ్మ కూడ ఇదీ అని ఖచ్చితంగా ఎక్కడా లేదు. అంతటా ఉంది.

ఎవరు ఎప్పుడు ఎందుకు ఏ రూపంలో కోరితే, వారికి అప్పుడు అందుకు ఆ రూపంలో ప్రత్యక్ష మవుతుంది ప్రభుత్వం - పోలీసుగా, డాక్టరుగా, న్యాయమూర్తిగా, ఇంజనీరుగా, మంత్రిగా, గవర్నరుగా !

ప్రతి ఉద్యోగీ ప్రభుత్వమే. ఏ ఒక్క ఉద్యోగి ప్రభుత్వం కాదు.

సహజంగా ప్రతి ఉద్యోగిదీ ప్రభుత్వదృష్టే - స్వార్థం, బంధు పక్షపాతం, కులతత్వం, లంచగొండితనం వంటివి అతణ్ణి నాశనం చెయ్యనంత వరకు !

ప్రభుత్వంలో ఉద్యోగి వంటివాడే పరబ్రహ్మలో జీవుడు !

మానవుడి మెదడు ఏ మాత్రం ?

ఒక గుప్పెడు !

అది సాధించగల విజ్ఞానం ఎంత మాత్రం ?

ఎందుకు మరి ఈ అహంకారం మనిషికి ?

దీపకాంతి నైశిత్యమూ, పరిధీ పెరిగే కొలదీ - దాని వెనుక గల చీకటి యొక్క గాఢతా, వైశాల్యమూ కూడ పెరుగుతై !

చీకటి కణానికి సూర్యుణ్ణి చూపడం ఎలా ?

తలవెంట్రుకకు తలోదరి పూర్ణదర్శనం సాధ్యమా ?

సూర్య చంద్ర బింబాలే త్రిపుర సుందరి పాదుక లంటే - ఈ భూలోకం ఆమె పాదరేణువు కూడ కాదు కదా ?

మహద్రూపాన్ని మనసా వహించి, అణురూపాన్ని అలంకరించి చూస్తే - నీవే ఆమె !

నీవే ఆ దైవం !

ఈ ప్రవచనం అర్థమైనవాడు వేదాంతి. అర్థం కానివాడు నాస్తికుడు. అర్థం కానివ్వనివాడు మత పెద్ద. ఈ గోలంతా మన కెందుకులే అనుకొనే వాళ్ళే ఈ ఆస్తికజనం అంతా !

జిజ్ఞాస కలవాడు మౌళి.

అన్వేషించనీ అతణ్ణి ఇంకా, ఇంకా !

అన్వేషణ, అభిజ్ఞ, పరిశోధన, పరమజ్ఞత లేకనే - లోకోత్తర మహానీయమైన మన ఆర్ష విజ్ఞానం పెంటలపాలై కుములుతున్నది ఈనాడు !

కళ్ళు తెరచి చూడు !

దైవం ఉంది.

మనం ఉండడమే దైవం ఉండడానికి నిదర్శనం.

మనమే ఆ దైవం !

తమములో దాగి కాన్పించ దంతె కాని,
లేని దన్నది విశ్వాస లే దొకింత !
కాంతి కిరణమ్మునకు వాడి కలుగు కొలది
చీకటుల లోతులోతులు చించగల్గు !

109

" ఇంత పచ్చిగానా వ్రాసుకొంటారు లేఖలు ? " అన్నది కదూ వర్ష ?

" ఏం లాభం వీటివల్ల ? " అని కూడా అడిగిందామె !

" మధ్యలో బోరు కొట్టే ఈ చర్చ లేమిటి ? " అంటూ చుంచుమూతి కూడ పెట్టింది కద ?

అంతే కావాలిలే నీకు !

దానిపై, ఒక ఉపన్యాసమే దంచా వనుకో ! అర్థమయిందా ఆమెకు ? నీ వెంత కష్టపడి దంచినా, నీ దంపుడు బియ్యం మిల్లు బియ్యానికి అలవాటుపడ్డ ఆ నవనాగరిక నిత్యరోగిష్ఠికి నచ్చుతవా ? రుచిస్తవా ? జీర్ణమవుతవా ?

ఆమె సంస్కారం ఎంత ? ఆమె మెదడు బల్బుకు గల వోల్టేజి శక్తి ఎంత ? ఆ మాత్రపు వెలుగుకు అందగల్గిన ఆవరణం ఎంత? గుడ్డి కంటికి గోలోక సౌందర్యాన్ని చూపాలని ఎందుకు ప్రయత్నిస్తున్నావు నీవు ?

డబ్బు, పదవి, ప్రచారం, ప్రాభవం - ఇవి నాలుగూ నాలుగు దిక్కులు జీవితానికి !

ఏ రంగంలోనైనా సరే - సంస్థలోనైనా సరే - ఈ దిక్కుల్ని పాలించే దిక్పాలకులు, వాళ్ళ బంధుమిత్రులు, ఆ వాళ్ళ దాసులు, దాసానుదాసులు -

ప్రతిభావంతు లెవరూ ఆ చుట్టుప్రక్కలకు చేరకుండా జాగ్రత్త పడుతూ - తామే జిగేలుమంటూ, వెలుగుతూ ఉంటారు మతాబాల్లా !

మతాబా బ్రతు కెంత ?

దాన్ని చూచి చంద్రుడో, సూర్యుడో అని ఎందుకు భ్రమ పడతావు నీవు ?

అట్టి మతాబాల నెరసుల్లో ఒక నెరసు వర్ష !

జిగేలుమంటుంది. ఓహో - అనిపించుకొంటుంది. ఆరిపోతుంది ఆ మరుక్షణం. ఆ తర్వాత వట్టి చీకటి.

వర్షకు నీ విచ్చిన జవాబులు మాత్రం బలే బాగున్నై.

నన్ను అందుకొన్నావు నీవు. నాలో ఐక్యం కావడానికి అవసరమైన స్థాయి సిద్ధించింది నీ ఆత్మకు. గురువునే పాలించగల శిష్యురాలవు. ఈశ్వరుణ్ణే భిక్షుణ్ణి చేయగల భువనేశ్వరివి అయినావు నీ విప్పుడు !

ఈ నీ మహాదైశ్వర్య సిద్ధిని సాధించడం కోసమే - పరమేశ్వరుడనైన నా ప్రక్క, పరమేశ్వరిగా నిన్ను ప్రతిష్ఠించడం కోసమే రజస్తమస్సులను నీ నుంచి తొలగించి, శుద్ధ సత్త్వ చైతన్య రాగ కళగా నిన్ను రూపించడం కోసమే - ఇన్ని లేఖలు వ్రాశాను నీకు ! ఇన్ని చర్చలు చేశాను నీతో ! ఇంత జీవితం సృష్టించాను నీ కోసం !

నేను శుద్ధ సత్వ పరమేశ్వరుణ్ణి.

నాది అనంత పిపాస !

నీవు శుద్ధ చైతన్య పరమేశ్వరివి !

నీది నిరంతర దిత్స !

ఓహో - వైశాఖీ ! రాగ రమా !

నా అమృతానంద సాహితీ !

నా ఆనంద సుందర సంగీతీ !

ఎలాంటి పరిస్థితిలో అయినా సరే -

ఇద్దరం మనం !

ఒక్కరం మనం !

ఒకే ఒక ఆనందం మనం !

ఇద్దరమే !
మన మిద్దరమే !
సంయోగమె, వియోగమో
సంతోషము, విరహ వ్యథో,
బ్రతు కేమైనను గాని !

మనసు కున్న స్వేచ్ఛారతి
తనువుకు లేకున్న గాని,
తనువు కున్న పొలిమేరలు
దాటరాని వైన గాని !

విరహోగ్నులలో తనువులు
కరిగి బూదియే యైనను,
మన బూదియె విబూదిగా
మహియే శైవము కాగా !

మన మనసులు జోడుకట్టి
మబ్బులు మెరపులు కాగా,
మన ఆత్మలు కలిసిపోయి
మధురామృతమే కాగా !

110

నీ ఆత్మ ప్రవంతి నా ఆత్మ మహాపయోనిధిలో ఐక్యమై పోయిందన్న ఆనందంలో - మైమరచిపోయి, యోగనిద్ర లోకి జారిపోయిన నన్ను, ఎంత చక్కగా మేల్కొల్పావు నీవు - చరణ సేవా వ్యాజ ప్రణయ స్పర్శా పరమకర్తవ్య భూపాల రాగ రాగిణీ రమా మూర్తివై !

భూపాల రాగమా అది ?

నేను మేల్కొనే వరకూ అదే ! మేల్కొన్న తర్వాత, కామ వర్ధని అది ! ఆ తర్వాత ఆనంద రంజని అది !

అసమాప్తం కదూ నా గత లేఖ ?

ఎందుకు చూపావు మన లేఖల్ని వర్షకు ?

ఒళ్ళంతా అసూయ కదా ఆమెకు ?

ఆత్మ తెలీదు కదా ఆమెకు ?

మేఖల ఏం చేసింది ?

ఎందుకు నేర్చుకోవు గుణపాఠాలను అనుభవం నుంచి ?

" మీరు నేర్చుకొంటున్నారా ? " అంటావు కదా నీవు ?

నిజమే. నేనే కాదు, లోకమే నేర్చుకోవడం లేదు అనుభవం నుంచి ఏమీ!

"పెళ్ళాడి నరకం అనుభవిస్తున్నాను నేను. పెళ్ళాడవద్దురా, ప్రియ కుమారా ! "అని తండ్రి కొడుక్కి చెపితే - ఏమంటా డతడు ?

" నేను కూడ చూస్తాను ఆ నరకం ఎలాంటిదో ! " అనడా ?

అలానే - ప్రతి జీవీ !

అనుభవమే జీవితం.

దాని మంచి చెడ్డలే స్వర్గ నరకాలు.

ఎవరి అనుభవం వారిదే. ఎవరూ నేర్చుకోరు ఎవరినుంచీ !

మన అనుభవం మనది

వర్ష కెలా రుచిస్తుం దది ?

అత్యంత సూక్ష్మమైన ఆనందాలు పూర్తిగా వ్యక్తిగత మైనట్టివి.

ప్రేమ, శృంగారం, సౌందర్యం, రతి, మధుపానం, భోజనం, నిద్ర - వంటివి ఎవరివి వారివే ! వాటిని వాస్తవంగా అనుభవిస్తున్న వాళ్ళకు ఎంత మనోమోహన మధురాలో - తదితరులకు అంత జుగుప్సాకరాలు, అసూయాజనకాలు, ప్రాణాంతకాలు అవి !

నీవు త్రాగుతున్న అమృత రుచి నీ ప్రక్కనున్న వర్ష కెలా తెలుస్తుంది ?

ఒకరి ఆహారం మరొకరికి పుష్టిని ఇవ్వదు. ఒకరి నిద్ర మరొకరికి విశ్రాంతిని ఇవ్వదు. ఒకరి ప్రేమలేఖ మరొకరికి పారవశ్యం కలిగించదు.

అట్టి వైయక్తిక సుఖభోగాలను రహస్యంగా అనుభవించా లనడం అందుకే ! ఇతరుల కంట పడగూడదు ఆ అనుభవం ! పడితే, కలిగేది వైరస్యమూ, వైరమూ, ఆపదా మాత్రమే !

మన ఈ ప్రేమలేఖలను చూచి వర్ష సంతోషిస్తుం దనుకొన్నావా ?

ఏడుస్తుంది !

అన్ని రంగాల లోనూ ఉన్నారు ఇలాంటి ఏడ్చేవాళ్ళు ఈనాడు.

ఎదటివాడు చేసిన పని ఎంత బాగున్నదని లోపల అనుకొంటాడో – అంత బిగ్గరగా అరుస్తాడు – అది బాగుండ లేదని !

అంతకంటె ఘనుడు మరొకడున్నాడు సాహిత్య రంగంలో. ప్రతిభను పూర్తిగా ఇగ్నోరు చేస్తా డతడు. చెత్త పుస్తకంపై పది పేజీలు రివ్యూ వ్రాస్తాడు – అది ఎలా చెత్తో నిరూపిస్తూ ! మంచి పుస్తకం పేరైనా ఎత్తడు ! ఎత్తితే, ఆ మంచి పుస్తకం వ్రాసినవాడు గొప్పవాడై పోవచ్చు ! అలాంటి ప్రమాదాన్ని భరించుకోలేడు – ముఖ్యంగా మన తెలుగువాడు !

"ప్రతిభ లేనివాణ్ణి ప్రోత్సహించు. అతడు నీకు దాసుడై ఉంటాడు. ప్రతిభ కలవాణ్ణి అణిచివెయ్యి. లేకపోతే, ఇతడు నీ పెత్తనానికే ఎసరు పెడతాడు " అనేదే కదా నీతి నేడు ?

అదే కదా – ఒక నిత్యనూతన మహా ప్రవాహం కావలసిన మానవతను అరికట్టి, మురికిగుంటగా మార్చిన మహా మారి ?

అశక్తి, అసూయ, ద్వేషం, కుళ్ళుబోతుతనం, ఏడ్పు, అపకృతి – ఇదీ ఏ దౌర్భాగ్యుల కైనా అధఃపతనపు క్రమావస్థ !

మంజీరను గురించి ఈ మధ్య జరుగుతున్న దుష్ప్రచారం – వస్తున్న ఆకాశరామన్న ఉత్తరాలు – చూస్తున్నావు కదా ?

ఆమెను కామించి, వెంటపడి, వేధించి, తన్నులు తిని, పగ బట్టిన దుష్టులు తింటున్న గడ్డే కదా అది ?

కళా సరస్వతి పట్ల కామదృష్టి ఏమిటో వీళ్ళకు !

కామధేనువును కోసుకు తినజూచే పచ్చి కసాయి మనస్తత్వం అది !

మనతో ఆమెకు గల స్నేహానుబంధాన్ని త్రెంచివేయడానికి ఎంత కుట్ర జరుగుతున్నదో చూడు !

అవ్యాజమైన అనురాగబంధం జీవేశ్వర సంబంధమే. వాస్తవ నగ్నసత్యాలే త్రెంచలేవు దాన్ని. అసత్య దుష్ట కూట ప్రచారాలా త్రెంచగలవి ?

మంజీర నాన్న మేఖల నాన్న వంటి మూర్ఖుడు కాడు.

కుమార్తె హృదయంలోని స్వయంభూత జ్ఞానజ్యోతిని ఆర్పివేసి, తన వంశానుగత మౌఢ్యాంధకారంతో ఆమెకు ముసుగు తగిలించిన దురహంకారి మేఖల నాన్న. దాని ఫలితంగా ఆమె దివ్య వ్యక్తిత్వం చీకటిలో చీకట్లైపోయింది !

తానే తన పుత్రిక అన్న జ్ఞానంతో - తన జన్మాంతర తపస్సులన్నీ క్షాళితమైపోయి, శుద్ధ సత్వ చైతన్యంతో తానే ఆమెగా ప్రకాశిస్తున్నానన్న ఆనందంలో - ఆమెకు సంపూర్ణ స్వేచ్ఛను ఇచ్చి - ఆమె తరణంలో తానూ తరించిన జ్ఞాని మంజీర నాన్న ! దాని ఫలితంగా ఈమె రాగకళా రసబ్రహ్మే అయింది ! తన కాంతితో లోకాన్నే ఉద్ధరించ గలిగింది !

ఒకో ఆకాశరామన్న ఉత్తరానికి ఒకో నరకం సృష్టించాడు మేఖల నాన్న ; అతడి తర్వాత - ఆమెకు కట్టుకొన్న మంచివాడైన భర్త !

అలాంటి ఉత్తరాలన్నిటికీ నిప్పు ముట్టించి - ఆ మంటలలో - వాటికి కారకులైన ఆ ఆకాశరామన్నలకు దహన సంస్కారాలు జరిపి పారేశాడు మంజీర నాన్న !

అసూయ ఎంతటి క్రూర స్వరూపం తాల్చగలదో, ఎన్ని అమృత కలశాలలో విషం క్రక్కగలదో, దాని విషానికి మూర్ఖులు ఎలా నశించిపోగలరో, జ్ఞానులు ఎలా తట్టుకొని బ్రతకగలరో - ఈ చరిత్రలు రెండూ నిదర్శనాలు. ఇవి నీకు తెలిసినవే కద ?

అశక్తి !

అసూయ !

పగ !

మనిషిని స్వర్గం నుంచి నరకానికి త్రోసివేయగల కాలసర్పాలు ఈ మూడూ !

ఏది ఏమైనా -

ఈ విషయంలో రహస్యంగా కుట్రలు జరిపే ఆశ్లేషయ్య లాంటి పాముల కంటే -

బహిరంగంగా విమర్శించిన వర్షే వేయి రెట్లు కపటం లేనిది ! అందుకైనా మెచ్చుకోవాలి మనం ఆమెను !

పచ్చి శృంగార మేదో, పరమ శృంగార మేదో తెలియని రసహీన ఆమె.

పచ్చిదో, ఎండుదో - శృంగారం శృంగారమే. సమస్త సృష్టికీ ప్రాణం అదే !

మతాలను, నీతి శతకాలను, ఆయుధాలను, విద్యలను సమస్త మానవ వ్యాపారాలనూ తుడిచి పారేసి చూడు ! ప్రపంచాని కేమీ కాదు. మానవుడు బ్రతికే ఉంటాడు.

వాటన్నిటినీ ఉంచి, శృంగారాన్ని ఒక్క క్షణం పాటు లేకుండా చెయ్యి ! ఏ ముంటుంది మిగిలి ?

కాగా శృంగారమే లోకం. లోకమే శృంగారం.

జీవితంలో ఓడిపోయిన సినిక్కులు, ఎండిపోయిన వృద్ధులు, మొగ్గదొడగని మ్రోడులు, నీడ ఎరుగని ఎడారులు, వెలుగు చూడని పాడు బావులు ఏమన్నా - ఏం చేసినా - ఎలా ఏడ్చినా -

శృంగారం ఒక్కటే రసం, ప్రాణం, ఆత్మ - జగత్తుకు.

సృజన శక్తి కలది పచ్చి శృంగారమే. అది అందని జంబుకాలకు అది పులుపే మరి !

మానవుడు పడే పాట్లన్నిటికీ ప్రయోజనం ఏమిటి ?

బ్రతకడం.

బ్రతుక్కు ప్రయోజనం ఏమిటి ?

మోక్షమా ? మోటారు కారా ?

సృష్టి స్థితి లయాత్మక విశ్వలీల శృంగారం

పారమాత్మిక శృంగారం భక్తి

ఆత్మిక శృంగారం రసం

శారీరక శృంగారం భోగం !

ఇందులో ఒకటి పవిత్రమూ, ఒకటి అపవిత్రమూ కావు.

ఆత్మ ఎంత పవిత్రమో, ఆత్మకు మందిరమైన శరీరమూ అంతే పవిత్రం.

శృంగారాన్ని అసభ్య మంటూ నిషేధించేవాళ్ళు - ఆత్మస్వరూపం తెలియని వట్టి అజ్ఞానులు. ఆస్థానమే !

ఆనంద రస కలశివే నీవు, ఓ చెలీ !
అనవరత విశ్వచేతన వీవె నే, చెలీ !

సాహీతీ రాగదేవతవు కదా నీవు ?

విమర్శలు ఎప్పుడూ ఉండేవే
లెక్క చెయ్యవద్దు వాటిని.

ఏడ్చేవాళ్ళను ఏడ్పిస్తూ ఉండడం, నవ్వే వాళ్ళను నవ్విస్తూ ఉండడం సరదా ఈ లోకానికి.

లోకువ ఇవ్వవద్దు లోకానికి.

బలహీనులు పరువుగా బ్రతకలేరు.

ఆత్మబలం కలవాళ్ళదే ఆనంద సామ్రాజ్యం.

నవ్వుకొలదిగ జగము నవ్వించు చుండు
ఏడ్చుకొలదిగ జగము ఏడ్పించు చుండు
మ్రొక్కు కొలదిగ జగము ఎక్కి త్రొక్కుచు నుండు
తన్ను కొలదిగ జగము దాసోహా మను చుండు !

111

శ్రీకాళహస్తి జ్ఞాన ప్రసూనాంబ
ద్రాక్షారామ భీమేశ్వరుడు.

ఈ ఇద్దరికీ ఏమిటి సంబంధం ?

ఆమె శివ, ఇతడు శివుడు కారా ?

ఈ ఇద్దరూ ఒకటే కారా ?

ఈ మాట అంటే – అక్కడ అమృత లింగేశ్వరుడికీ, ఇక్కడ మాణిక్యాంబకూ కోపం రాదా ?

ఎందుకు రాదు ?

ఎందుకు వస్తుంది ?

ఇదొక మహా సమస్య.

సింహాచలం, అన్నవరం, ద్రాక్షారామం, బెజవాడ, మంగళగిరి, శ్రీశైలం, శ్రీకాళ హస్తి, తిరుపతి, వేములవాడ, యాదగిరి – ఇలా ఒక్క మన ఆంధ్రదేశం లోనే ఉన్నై వేలకొలది పుణ్యక్షేత్రాలు.

ఈ క్షేత్రా లన్నిటా ఉండేది ఒకే దేవీ దేవ ద్వయం.

ఒకే ఒక అర్ధనారీశ్వర మూర్తి.

అయితే క్షేత్రాని కో పేరుతో, పేరు కో గుణంతో, గుణాని కో శక్తితో ఇంత మంది దైవ మూర్తులు ఎలా వచ్చినట్టు ?

ప్రశ్నలోనే ఉంది జవాబు !

శిల్పిని బట్టి శిల్పం
శిల్పాన్ని బట్టి శక్తి
శక్తిని బట్టి క్షేత్రం
క్షేత్రాన్ని బట్టి ఫలం
ఫలాన్ని బట్టి రసం
రసాన్ని బట్టి ఆనందం
ఆనందాన్ని బట్టి శిల్పి !

ఈ పరిణామ వృత్తం అంతటికీ మూల భూతం ఒకే ఒక బిందువే అయినప్పటికీ – ఏ తదంతర్గత బీజ కళా ప్రవృత్తులు అసంఖ్యాకం కనుక, అసంఖ్యాకంగా వెలిశారు దేవతలు – వివిధ రూపాలతో, వివిధ తత్వాలతో, వివిధ నామాలతో.

ఒకో బిందువుకు ఒకో క్షేత్రం.

ఒకో క్షేత్రంలో ఒకో జంట.

ఆ జంటలో – ఒకచోట శ్రీశైలంలో వలె పురుషశక్తి ప్రసన్నుడై ఉండవచ్చు. మరోచోట బెజవాడలో వలె స్త్రీ శక్తి ప్రసన్నురాలై ఉండవచ్చు. అయినా – జంటగా ఉండడం మాత్రం తప్పదు సర్వత్రా.

జంట కలిసి ఉన్నప్పటిదే శక్తి.

జంట విడిపోతే, మిగిలేది వట్టి శూన్యం మాత్రం.

బిందువే క్షేత్రం –

బిందు శక్తే క్షేత్ర శక్తి.

ఏ తచ్ఛక్తికి కీలకం బీజం

బీజం అక్షరం

అక్షరమే మంత్రం

అది యంత్ర నిబద్ధం.

ఏత న్నిబద్ధ పరమ లవమే ఆ తత్ క్షేత్ర పీఠస్థ దేవీ దేవ మహా మహిమ !

ఈ అనం తానంద మహార్ణవంలో ఎన్ని బిందువులు ! ఎన్ని బీజాలు ! ఎన్ని శక్తులు !

అందుకే –

క్షేత్రాలు అనంతం

దైవ శక్తులు అసంఖ్యాకం !

అందుకే –

ప్రతి క్షేత్రమూ మనదే

ప్రతి శక్తీ మనమే !

అయినా – వ్యక్తిత్వాలు వేరు, గుణాలు వేరు, మనస్తత్వాలు వేరు, శక్తులు వేరు, రూపాలు వేరు, నామాలు వేరు – అందుకే.

ఇప్పుడు, ఈ తాత్విక సూత్రాన్ని ప్రకృతికీ, విశ్వానికీ, భూలోకానికీ, మానవ సమాజానికీ వర్తింపజేసి చూడు !

ఒకో బిందువు ఒకో క్షేత్రం

ఒకో క్షేత్రం ఒకో దేశం !

ఆ క్షేత్రస్థ దైవం ఆ దేశపు ప్రజ – ఆ జాతి.

ఒకో జాతికి ఒకో వ్యక్తిత్వం, ఒకో గుణం, ఒకో మనస్తత్వం, ఒకో రూపం, ఒకో నామం, ఒకో శక్తి !

అన్ని బిందువులూ ఒకే సాంబశివునివి.

అన్ని దేశాలూ ఒకే మానవ జాతివి !

అయితే –

దేని ప్రత్యేకత దానిది
దేని ప్రగతి పథం దానిది
దేని కర్తవ్యం దానిది.

ప్రతి బీజం వలెనే ప్రతి బిందువు, ప్రతి బిందువు వలెనే ప్రతి జాతి, ప్రతి దేశం - తమ తమ ప్రత్యేక శక్తుల్ని వికసింప జేసుకోవలసిందే. ప్రతి మానవ ముకుళమూ వికసించ వలసిందే, లక్ష్య ధర్మాన్ని బట్టి ఫలించ వలసిందే.

ప్రపంచం లోని మానవ జాతులన్నీ ఒక తోట లోని పుష్పఫలాలే.

దవనం, మరువం, మారేడు, జమ్మి
కొత్తిమిరి, కరివేపాకు, పుదీనా
మల్లె, గులాబి, బంతి, కలువ, కమలం, చంపకం, మొగలి
బీర, పొట్ల, గుమ్మడి, బెండ
గన్నేరు, జాజి, తుమ్మి, కడిమి, నాగమల్లి,
మామిడి, దానిమ్మ

ఇవన్నీ ఒక తోటలోవే అయినా - వాటికి ఆ యా ప్రత్యేకతలు లేకపోతే - వాటి ఉనికే వ్యర్థం అయిపోతుంది కదా !

ప్రపంచంలో -

ప్రతి మానవుడూ స్వేచ్ఛగా, స్వస్వభా వానుగుణంగా వికసించ వలసిందే.

ప్రతి జాతీ స్వేచ్ఛగా, స్వ సంప్రదాయానుగుణంగా ఫలించ వలసిందే.

ప్రతి దేశం - తోటలో తీగ, చెట్టు, పిట్ట, సరోవరం, తోట మొత్తం సౌందర్యానికి వలె - సృష్టి సాముదాయక మహాసిద్ధికి దోహదం చేయవలసిందే !

కుటుంబం లోని సభ్యుడు, సమాజంలోని వ్యక్తుడు, దేశంలోని పౌరుడు, ప్రపంచంలోని మానవుడు - ఒక్కడే !

ప్రపంచమే ఒక కుటుంబం అయితే -

అందులో సభ్యులే ప్రతి దేశమూ, ప్రతి జాతీ !

వ్యక్తి కానీ - జాతి కానీ -

వ్యక్తిగతమైన ఆత్మ వికాసంతో సామూహికమై మానవ వికాసానికి తోడ్పడ వలసిందే.

ఈ సార్వజనిక వికాస పరమ ప్రణాళికలో - ఏ వ్యక్తీ అలక్ష్యం చెయ్యబడ గూడదు. ఏ జాతీ ఉపేక్షించబడ గూడదు. ఏ దేశమూ మడిగట్టుకు కూర్చో గూడదు.

వ్యక్తుల వికాసమే జాతి
జాతుల వికాసమే వసుధ
వసుధైక సామ్రాజ్యమే మానవలోక పరిపూర్ణ ఫలం.
దేశాలే క్షేత్రాలు మనకు.
జాతులే శరీరాలు మనకు.

క్షేత్రానికొక పేరుతో, గుణంతో, రూపంతో వేంచేసి ఉంటాం మనం ప్రతి క్షేత్రం లోనూ.

అలానే -

ప్రతి క్షేత్రమూ మనలో ప్రతిష్ఠితమై ఉంది అనేక రూపాలలో.

ఎప్పుడు ఏ శక్తి అవసరమైతే, అప్పుడు ఆ శక్తి విజృంభిస్తుంది మనలో. అప్పుడు ఆ క్షేత్రమే ఆవిర్భవిస్తుంది మన నుంచి.

ప్రతి దేశమూ, ప్రతి, జాతీ, ప్రతి వ్యక్తీ మనమే అయినా - ప్రతి దేశానికీ వెళుతూ, ప్రతి జాతినీ పలకరిస్తూ, ప్రతి వ్యక్తితోనూ స్నేహం చేస్తూ మనం ఎలా వ్యవహరిస్తున్నామో-

అలానే -

ప్రతి క్షేత్రమూ, ప్రతి క్షేత్ర అధిదైవమూ, ప్రతి దైవశక్తీ, మనమే అయినా - ప్రతి క్షేత్రాన్నీ దర్శిస్తూ, ప్రతి దైవాన్నీ పూజిస్తూ, ప్రతి శక్తినీ ఆస్వాదిస్తూ ఆనందిస్తాం మనం.

క్షేత్ర - క్షేత్రజ్ఞ భేదం ఉన్నంత వరకు ఈ క్షేత్రారాధన తప్పదు మనకు.

మనం అంటే మన శరీరాలు కాదుగా ?

అయినా -

శరీరాలు లేకుండా మనం లేముగా !

అ శరీర బ్రహ్మకు ఆనంద రుచి తెలిసేది శరీరం ద్వారానే.

మానవులు రెండు వర్గాలు -

ఇహలోక సౌఖ్యం కోరే వారు

పరలోక సౌఖ్యం కోరే వారు !

ఇహ సౌఖ్యం కోసం పర సౌఖ్యాన్ని వదులుకొనే మనస్తత్వం కొందరిది. రాజకీయ, సాంఘిక, మత, వ్యాపార రంగాలకు చెందిన అనేకులు ఈ మనస్తత్వానికి చెందిన వాళ్ళే.

పరం కోసం ఇహాన్ని త్యాగం చేసుకొనే మనస్తత్వం మరి కొందరిది. కవులు, కళామనస్వులు, పండితులు, వేదాంతులు, సన్యాసులు, యోగులు, రైతులు, కూలీలు చేరవచ్చు ఇందులో.

ఈ రెండు మనస్తత్వాలకు అతీతులం మనం.

క్షేత్రమూ మనమే. శక్తీ మనమే.

ఇహమూ మనమే. పరమూ మనమే.

శరీరమూ మనమే. ఆత్మా మనమే.

మన శరీరాల సంయోగం ఒక అగ్ని. అది ఆనంద వాహనం. సశరీర సంపూర్ణంగా మనల్ని ఆనంద గా మార్చి, మహా మహస్సుకు ఉషస్సుగా ప్రతిష్ఠిస్తుం దది మనల్ని.

కామ శక్తే ప్రేమ శక్తి. ప్రేమ శక్తే ఆత్మ శక్తి. ఆత్మ శక్తే ఏ రంగంలో నైనా సరే, దిగ్విజయాన్ని సాధించ గలది.

వాల్మీకి, కృష్ణుడు, వ్యాసుడు, బుద్ధుడు, శంకరుడు, క్రైస్తు, వివేకానందుడు, గాంధీ, మీరాబాయి, కన్యకాపరమేశ్వరి, ఝాన్సీ లక్ష్మి, పొట్టి శ్రీరాములు, దుర్గాబాయి, అంబేద్కరు - వంటి వారి శక్తి అంతా ఎక్కడిది ? బ్రహ్మ కామన నుంచి అవతరించిన మహా కామనే కాదా ?

ఆత్మశక్తితో ఏ రంగంలో విజృంభింపజేస్తే, ఆ రంగాన్ని దేదీప్యమానం చెయ్యగల దివ్యశక్తి కలది కామన.

అట్టి మహా కామనకు ఉపాధి శరీరమే కాదా !

సాధారణ వ్యక్తిలో అది వట్టి కామం.

పశుప్రాయునిలో అది వ్యర్థ కామం. అడవిలో కాసిన వెన్నెల వలె, బూడిదలో పోసిన పన్నీరు వలె - ఉప్పు పర్రలో కురిసిన వర్షం వలె దుష్టకామం వ్యర్థం.

మహితాత్మనిలో అది విష్ణువు చేతి సుదర్శనం. శివుని చేతి పినాకం. బ్రహ్మ చేతి సరస్వతి.

నా చేతి నీవు !

ఏది ఏమైనా –

దర్శించుకోవాలి మనం పుణ్యక్షేత్రాలను ! అర్పించుకోవాలి మనం మనలే! స్పర్శించుకోవాలి మనల్ని మనమే ! ఐక్యమైపోవాలి మనం మనలోనే !

" క్షేత్రమూ, దైవమూ, శక్తీ మనమే అయినప్పుడు – అవన్నీ మనలోనే ఉన్నప్పుడు – ఎందుకు పడాలి ఈ గోలంతా మనం ? " అంటావు నీవు.

నేను – నేను కల్పించుకొన్న నీవు –

ఈ ఉభయ శక్తుల సంయోగ వియోగాలే కదా – వెలుగు నీడల, సుఖదుఃఖాల, జననమరణాల ద్వైధీ లీలా విశిష్టమైన ఈ ఎల్ల సృష్టీ ?

ఈ ద్వైతంలో –

వాతావరణంలోకి బొగ్గుపులుసు గాలిని వదలి, దాన్ని కలుషితం చేసే జంగమవర్గం ఒకటి ఉన్నప్పుడు – ప్రాణవాయువును వదలి, దాన్ని పరిశుభ్రపరిచే స్థావర వర్గం మరొకటి లేదా ?

ప్రజ్ఞాన చైతన్యం లోకి అనుక్షణం ప్రవేశిస్తున్న దురాలోచనలు, దుర్భాషా నినాదాలు, దుష్క్రియా దుర్వాసనలు ఎప్పటి కప్పుడు నిర్మూలించబడవలసి ఉంది కద ?

అట్టి విశ్వశౌచ కార్యక్రమం లోని అంశాలే సర్వ శ్రేయోభిలాషతో చేయబడే ప్రార్థనలు, పూజలు, యాగాలు, యోగాలు, తపస్సులు !

విశ్వాన్ని పాలించే పరమ భగవచ్ఛక్తికి సహాయక దోహద క్రియలే ఇవన్నీ.

ఇవన్నీ మన సంకల్ప శక్తులే. కేవలం మనమే.

జ్ఞాన ప్రసూనాంబవూ, మాణిక్యాంబవూ, భ్రమరాంబవూ నీవే అయినప్పుడు శ్రీ కాళహస్తీశ్వరుణ్ణీ, భీమేశ్వరుణ్ణీ, మల్లికార్జునుణ్ణీ నేనే అవుతాను సాక్షాత్తు.

నీవు అలా కాకపోతే –

నేను ఇలా కాను !

నీవు నా శిల్పానివే అయినా - ప్రదర్శనలో ఉన్నదానవు నీవే కనుక, నీ విలువే నా విలువ !

నీవు నా నీడవే అయినా - నీడలో విశ్రమిస్తున్న లోకానికి నీవే ఆనంద దైవానివి ! ప్రత్యక్షంగా భరించజాలదు అది నన్ను !

అందుకే -

దేవీ !

నన్ను తెలుసుకొని, నిన్ను నీవు తెలుసుకోవడం కోసమే ఈ యాత్రలు ! ఈ దేశాటన ! ఈ క్షేత్రదర్శనం ! ఈ పూజలు ! ఈ భక్తి !

స్త్రీని పురుషుడు, పురుషుణ్ణి స్త్రీ - ఆనంద సుందరంగా అనుభవించడం ఒక కళ !

అదే పరమ కళ !

ఈ కళాదర్శనమే భగవద్దర్శనం !

ఈ పరమ సుందర దర్శనయాత్రే జీవితం - మనవంటి పూర్ణ జీవ జీవనీ శివ సరస్వతులకు !

రా ! -

పోదాం !

అటు - రాగ వైశాఖిగా !

ఇటు - రాగ లక్ష్మిగా !

నడుమ - విశ్వైక జీవన రాగమూర్తినైన నేను - నిత్యాభ్యుదయ సమున్నాత్న వసంత వైభవంతో అభిరమిస్తుండగా -

రా - పోదాం -

ఈ సమస్త క్షేత్రాల లోనూ మనమే ఉంటూ !

ఈ క్షేత్రా లన్నిటినీ మనలోనే నిలుపుకొంటూ !

మన బ్రతుకె క్షేత్రము, మన వపువె ఆలయము,
మన ఇచ్ఛయే శక్తి, మనమె దైవము, కనుక -
విశ్వ సారథ్యమ్ము విడువగూడదె, చెలీ !
నిత్య యాత్రావిధిని నిలుపగూడదె, చెలీ !

112

శరీరాల ప్రమేయమే వద్దన్నావు -

స్పర్శామాత్రం లోనే తన్మయమై పోతున్నావు !

ఏదో అనుకొంటాం గాని - శరీరాల ప్రమేయం లేకుండా ఏముంది లోకంలో ?

శరీర సుఖానుభూతి కోసమే కాదా, అశరీరి అయిన పరమాత్మ ఆత్మ రూపంలో సశరీరి కావడం ?

ఆత్మలు కలిసిన రెండు శరీరాల కలయిక కంటె మరేముంది పరమానందం?

ప్రపంచం లోని సమస్త రస భావ సౌందర్యాలను ఒక్కచోట రాశి పోసి, ఆ రాశిని సమస్త సుఖశాంతి సౌభాగ్యాలతోను అలంకరించి, ఒకప్రక్క ఉంచి - రెండోప్రక్క ఒక స్త్రీని ఉంచి - ఏదో ఒక్కదాన్ని ఎంచుకోమంటే, పురుషు డెవడైనా సరే, స్త్రీనే ఎంచుకొంటాడు సహజంగా !

సౌహార్దం, సౌమనస్యం, సౌందర్యం, సౌభాగ్యం ! సౌశీల్యం, సౌబల్యం, సౌఖ్యం - ఇదీ సౌశ్రీ దేవి దివ్యస్వరూపం !

ఈ సౌవర్గ సంపద లన్నింటికీ స్త్రీయే పాదు. స్త్రీ లేకుండా ఆనందం లేదు పురుషుడికి.

అలానే స్త్రీకి జీవరసం పురుషుడు.

ఆనంద రస శోభాసుందరాలైన రెండు శరీరాలు - ఒకదాని కొకటి పరమానంద పారమ్యాలు.

ఆత్మ పొందే అనుభవా లన్నిటికీ శరీరమే నిలయం కద !

ముఖ్యంగా స్త్రీకి - మనస్సు, హృదయం, ఆత్మ అన్నీ ఒక్క శరీరమే కద !

అందుకే, శరీరంపై ఒక చిన్న ప్రేమ స్పర్శ తగలగానే - హృదయవీణను శ్రుతి చేస్తుంది ఆమె ఆత్మ కల్యాణీ రాగానికి !

శరీర స్పర్శే ఆత్మ స్పర్శ. శరీర తృప్తే ఆత్మానందం. దాన్ని ప్రసాదించిన పురుషుడే పరమాత్మ. అతడిలోనే ఆమె ఐక్యమై పోతుంది శాశ్వతంగా.

ప్రేమ సిద్దే మోక్షసిద్ధి స్త్రీకి.

తాను ప్రేమించిన పురుషుడు తిరిగి తనను ప్రేమించడమే ప్రేమ సిద్ధి. శరీర సంబంధం ఉండ నవసరం లేదు అందుకు. ఉంటే, జీవితానందం కూడ లభిస్తుంది - ఆత్మానందంతో పాటు.

తనను ప్రేమించే ఒక పురుషుడికి ఆత్మార్పణ చేసుకొన్న ? నీవు ఎంతటి పరాత్పర తరవు !

అసలు స్త్రీ సృష్టే పరమ సుకుమార సుందరం.

ఆమె పుట్టుక తోనే అగ్ని ! స్వచ్ఛమూ, సుందరమూ, పవిత్రమూ అయిన జ్వాల ! మాలిన్యాలు, దోషాలు, పాపాలు ఏవీ అంటవు దాన్ని !

స్త్రీ చిత్తం చంచలం - అన్నవాడు వట్టి అప్రయోజకుడు. అప్రయోజకులే అధిక సంఖ్యలో ఉన్న సమాజం, స్వార్థ బుద్ధితో అవమానించింది స్త్రీని అనేక విధాలుగా !

స్వార్థం, చాంచల్యం, దురాక్రమణ వంటి తన దుష్ట గుణాలకు స్త్రీని బలి చేసి, వదిలేసి, ఆ గుణాలన్నీ ఆమెకు అంటగట్టి, ఆమెను కులట అంటాడు పురుషుడు !

సుకుమార కుసుమం స్త్రీ !

దాన్ని ఎవడో ఒక క్రూరుడు త్రుంచి, ఆఘ్రాణించి, నలిపి పారవేస్తే - ఆ పాపం అతడిదా ? ఆమెదా ?

అమెదే అంటా డతడు !

నోరెత్తే శక్తి లే దామెకు !

పాప మనేదే ఉంటే - దాన్ని సృష్టించిన వాడూ, పోషిస్తున్న వాడూ పురుషుడే.

స్త్రీ పురుష సంబంధమే పాపమైతే, ఈ లోకమే ఒక పాపపు ముద్ద కదా ? దాన్ని భరించ వలసిన వాడు దానికి కారకుడైన పురుషుడే కదా ?

సృష్టి స్థితి లయాత్మక ప్రకృతిమూర్తి స్త్రీ !

ఒకో స్త్రీ ఒకో మధు కలశం !
ఒకో కలశంలో ఒకో ఆనంద సుధ !
ఒకో స్త్రీ ఒకో సౌందర్య వీణ !

ఒకో వీణపై ఒకో ఆనందరాగం !

ఒకో స్త్రీ ఒకో చంద్రకళా జ్వాల !

ఒకో జ్వాలలో ఒకో ఆనంద పరమ విభూతి !

స్త్రీ అమృత కలశం, జీవన వీణ, వహ్నిజ్వాల.

సహజంగా స్త్రీయే అంతటి దివ్యమూర్తి అయినప్పుడు దివ్య శృంగార కళామూర్తివి నీవు సాక్షాత్తు త్రిశక్తి రూప అమృత తత్త్వ ఆనంద చేతనవే కావా ?

అతిలోక సుందర మాధుర్యాల నన్నిటినీ నీ శరీరంలోకి ప్రవహింప జేసుకొని, నా కర్పించే రాగ ఝరిని నీవు !

నీవు నాలోకి ప్రవేశించిన ఆ నీ తొలిచూపు ! ఆ నీ తొలి స్పర్శ ! ఆ నీ తొలి కౌగిలి ! ఆ నీ తొలి ముద్దు !

అది అమృత కలశం !

అవి సుధా పూర్ణిమలు !

అది మధులీలా షీయూష కమలిని !

స శరీర ఆనంద సమదైత్వం అది !

ఎంతటి అదృష్ట భాగధేయం మనది !

నీవు పుట్టి ఉండకపోతే ?

పుట్టినా - నాకు లభించి ఉండకపోతే ?

సాధ్యమా అది ?

పూర్ణిమ నాడు చంద్రుడు ఉదయించక పోతే ? ఉదయించినా వెన్నెల కాయకపోతే ?

నీవు పుట్టడం, నాకు లభించడం - యాదృచ్ఛికాలు కావు ఇవి !

నాకు శరీరం - ఏర్పడ్డప్పుడు, నీకు శరీరం ఏర్పడక తప్పదు - పరస్పర దర్శనం కోసం, స్పర్శా సుఖం కోసం, సంయోగ మాధుర్యం కోసం, ఆత్మాభిరత పరమానందం కోసం !

అందుకే-

శరీరాలే మనం, మనమే శరీరాలు,

మనకూ, మన శరీరాలకూ అభేదం !

అందుకే –

మన శరీరాల పరస్పర దర్శనం లో ఇంతటి ఆనందం ! వాటి స్పర్శనలో ఇంతటి రసానందం ! వాటి సంయోగంలో ఇంతటి బ్రహ్మానందం !

113

" ఏ మివ్వను మీకు ?

" మీ కివ్వని దింకా ఏముంది నా దగ్గర మిగిలి ?

" మనసు, హృదయం, ఆత్మ – ఏమీ లేవు నాకు మీనుంచి విడిగా !

" శరీరం ఉంది – అక్షయ సుధాపాత్రం వలె మిగిలి – అనుక్షణం మీ ఇచ్ఛకు పూర్ణార్పణం అవుతూనే !

" మీరు పొందాలనుకొన్న ఆనందం ఏదైనా, ఇంకా నాలో మిగిలి ఉన్నదని మీ రనుకొంటే – పూర్తిగా పొందండి దాన్ని ఇప్పుడే !

" విడిపోతున్నాం మనం – మళ్లీ కలుసుకొంటా మనే ఆశతో, సంకల్పంతో, ప్రతిజ్ఞతో !

" మనం ఒకే ఒక శివాద్వైత పరబ్రహ్మ అయినా – శరీరాలు ఉన్నంత వరకు, విశిష్టాద్వైత ప్రేయసీ ప్రియులమే, శివసరస్వతులమే, బ్రహ్మానంద సబ్రహ్మచారులమే కదా మనం ?

" మిము తొలిసారి చూచిన ఆ క్షణమే నేను మీరైపోయి, మీలో లయమైపోయాను నేను పరిపూర్ణంగా !

" నేను అనేదే లేదు నా కిప్పుడు.

" స్త్రీ జీవితానికి ఏది పరమార్థమో, పరమగమ్యమో, పరమసిద్ధో దాన్ని చేరిన నేను – కేవల శుద్ధ నిర్గుణతత్వ పరిపూర్ణమైన అర్ధ నారీశ్వర శక్తినే అయిపోయాను కదా ?

" నేను అనేది ఏదైనా ఇంకా మిగిలి ఉంటే – ఈ అనంత విశ్వ విశ్వాంతర ప్రకృతి కంతా అధిష్ఠాన దేవత నైన నాలో – పొందండి దాన్ని ! పొంది, తన్మయులు కండి ! తన్మయులై, త్వమేవాహంగా ఉప రతి పొందండి నాలో !

" నాలో తప్ప, ఉపరతి పొందనివ్వను మిమ్ము ! మీరే విశ్రమిస్తే – సర్వం శూన్యమే కద !"

వైశాఖీ !

దైనందిన జీవిత వైరస్యాలతో సతమతమవుతున్న నీవేనా వ్రాస్త ఈ లేఖ?

నేను ఆపుకోలేని సుఖదుఃఖాలు చెప్పుకొనే కొద్దిమంది మిత్రులలో ఏ ముసలయ్యో, ఏ బాలకృష్ణో, ఏ రాజో, ఏ విశ్వమో, ఏ రాజరత్నమో, ఏ కుసుమో-

ఎవరైనా - ఈ లేఖను చూస్తే - ఏమంటారు వాళ్ళు ?

ఈ లేఖ నీది కాదంటారు.

నేనే సృష్టించా నంటారు !

నన్ను పూర్తిగా నమ్మే మిత్రులు కనుక - నేను నమ్మబల్కిన తక్షణం మూర్ఛపోతారు - నా ఒడిలోకే ఒరిగి !

శాంతించు ! శాంతించు !

నా ఒడిలోకి మరొకళ్ళు ఒరగడం అసలే కిట్టదు కద నీకు !

అవును !

నీవు పరిపూర్ణ ప్రకృతివి !

నేను పరిపూర్ణ పురుషుణ్ణి !

సమస్త సృష్టీ మన అధీనం లోదే. మనల్ని అతిక్రమించిన దేదీ లేదు ఎక్కడా, ఎప్పుడూ !

ఉన్న దొక్కటే - నేను !

నాతో పాటు - నీవు !

సరే. కాని -

నీవు మిగుల్చుకొన్న దేం లేదు. నిజమే. కాని-

నేను పొందవలసిందంతా మిగిలే లేదా ఇంకా నీలో ?

నీ లోని ఆనందం అక్షయం !

నా లోని పిపాస అనంతం !

క్రోలనీ నిన్ను కలకాలం !

ఏమైనా - మానవులం కదా ?

సర్వ స్వతంత్రులం కాం మనం !

విధిని కాదనలేం ఏమైనా !

తలుపు చప్పుడు ?

పని మనిషి కావచ్చు.

ప్రయాణం సంగతి మరిచే పోయాను !

వెళ్ళాలని లేదు నాకు.

నీతో ఇలా - ముఖంలో ముఖం, కంటిలో కన్ను, నోటిలో నోరు, రొమ్ములో రొమ్ము, నడుంలో నడుం, తొడలో తొడ, అడుగులో అడుగు - ఇలా - అతుక్కుపోయి, ఒకటైపోయి, ఆనందంగా కరిగిపోయి, అభిజ్ఞా రాగరేఖలమై విశ్వాంతరాళం నిండా విహరిస్తూ - ఇలా నీతో ఉండిపోవాలని ఉంది నాకు శాశ్వతంగా !

అలవాటైపోయిన ఈ చికుర సుందర నిశీధాలు, ఈ నీలోత్పలాలు, ఈ ఇందమ్మి మొగ్గలు, ఈ కమలాకర తీరాలు, ఈ గాన రస స్రవంతులు - ఈ అమృతభాండాన్నే విడిచి ఒక్క క్షణమైనా బ్రతకగలనా నేను ?

కాని -

వెళ్ళకపోతే ఎలా ?

ఎంత అస్వతంత్రుడు మానవుడు !

క్షణిక సుఖాల చక్కెర పూతలతో విషాద విష గుళికల్ని మ్రింగుతూ, గత మాధుర్యాల్ని నెమరుకు తెచ్చుకొంటూ, పునస్సమాగ మాకాంక్షల బలంతో ముందుకు సాగవలసిందే !

కామ్య బలం కంటె, కర్తవ్యబలమే కఠినతనం కదా !

సరే !

వైశాఖ పూర్ణిమకు ముందే వచ్చేస్తావు కదూ తిరుకొండకు ?

నీ కన్న ముందే చేరుకొంటాను అక్కడికి నేను !

శుక్ల సప్తమి నాటికే అక్కడికి నీవు రాగల్గితే - గంగాభవాని సంపూర్ణ దర్శనం చేసుకోవచ్చు విష్ణుపథంలో !

అడుగులలో అట్టడుగున పుట్టి, ఎన్నో అవస్థలకు లోనై, అన్ని ఒడిదుడుకులూ గడిచి, శివునికే శిరోధార్య ఆర్య కాగలిగిన మహా మహితాత్ములాలు గంగ !

అదే మన గోదావరి గంగ !

గోదావరీ తీరస్థ దుగ్ధమధు భూముల్ని - ఆకాశదర్పణంలో దుగ్ధా సుందరంగా దర్శించ వచ్చు మనం ఆనాడు !

గోలోక సుర గంగె, భూలోక వరగంగ !
గోగంగ - భూగంగ - గోదావరీ గంగె !
అమృత సుక్షేత్ర అది ఆనంద దుగ్ధయే !
అనుభవింతము రమ్ము ఆకాశ లక్ష్మిలో !

114

" వెళ్ళొస్తా, మళ్ళొస్తా ! వెళ్ళొస్తా, మళ్ళొస్తా !" అంటూ బైలుదేరింది రైలు ఎంతో బరువుగా.

ఎన్ని వేల మందికి చపుతున్నదో అది ఆ వీడ్కోలు !

ప్లాటు ఫారం నిండా విరిసినై సజల నేత్రాలు ! రెపరెపలలాడుతున్నై హృదయాలు జేలు రుమాళ్ళ వలె !

" వెళ్ళొస్తా, మళ్ళొస్తా, వెళ్ళొస్తా, మళ్ళొస్తా !" వీడ్కోలు చెపుతున్నది నీకు నా హృదయం !

ఆ నేత్రాలన్నీ నీవే ! ఆ హృదయాలన్నీ నీవే ! ప్లాటుఫారం నిండా నీ వొక్కర్తవే నిలబడిపోయి ఉన్నావు - మూగవోయిన కరుణ దేవతలా !

నిన్ను విడిచిపెట్టి వెళ్ళిపోతున్నాను నేను.

రైలుపెట్టె గుమ్మంలో నేను, ప్లాటుఫారం అంచున నీవు - నిలబడే ఉన్నాం !

అయినా, విడిపోతున్నాం, దూరమైపోతున్నాం మనం ఒకరి కొకరం అనంత వేగంతో !

కనిపించడం లేదు నీవు !

నిన్ను విడిచి ఉండలేని నా చూపులు నీతోనే ఉండిపోయినవో ఏమో - కన్నీళ్ళు తప్ప కనీనికలు లే విప్పుడు నా కళ్ళల్లో !

వెళ్ళి పోతున్నది నేను !

ఉండిపోతున్నది నీవు !

నా దుఃఖం కంటె నీ దుఃఖమే ఎన్నో రెట్లు అధికం !

కొత్త పరిసరాలు నాకు నిన్ను మరిపిస్తై ! పాత పరిసరాలు నీకు నన్ను జ్ఞాపకం తెచ్చి ఏడ్పిస్తై !

రైలు వేగం హెచ్చింది.

విశ్వ చైతన్య కేంద్రాన్ని విడిచిపెట్టి పోతున్న భూగోళంలా ఉన్న దిది !

ఒకొక్క పెట్టె ఒకొక్క దేశం. ఒకొక్క స్టేషను ఒకొక్క జన్మ.

శత శతాధిక జనతా గర్భిణి ఈ రైలు !

అపారమైన విశ్వాన్ని మోసుకుపోతున్న కాలం, అసంఖ్యాకులైన జీవరాశుల్ని మోసుకుపోతున్న భూగోళం, అనుల్లంఘనీయమైన కర్తవ్యాలను మోసుకపోతున్న రైలు, అనంతమైన విరహ వ్యధను మోసుకపోతున్న నా హృదయం - ఆక్రోశిస్తున్నై ఒకే తాళగతిలో, "వెళ్ళొస్తా, మళ్ళొస్తా" అంటూ !

జీవన గీతం ఇది !

కలగర్భపు అహోరాత్రుల నుంచి, క్రిక్కిరిసిన రైలు పెట్టెల నుంచి, విరహార్తాలైన = ప్రేమ గుండెల నుంచి - అనాదిగా, అనంతత్వపు ఆవధులు పొర్లి, అనునిత్యం వినవస్తున్న విశ్వజీవన గీతం ఇది !

వెళ్లొస్తా నన్న మాటలో ఎంత దుఃఖాంధకారం గూడు కట్టుకొన్నదో, మళ్ళొస్తా నన్న మాటలో అంత ఆశా ప్రభాతం ప్రాణ బీజమై ఉన్నది !

కాలం, భూగోళం, రైలు, నేను !

సాగిపోతున్నాం మేం - బరువుగా, వేడి నిట్టూర్పులతో, ఒకే మనస్థితిలో - గతానికి వీడ్కోలిస్తూ, వర్తమానానికి వాగ్దానం చేస్తూ !

ఇంకా అక్కడే నిలబడి చూస్తూ ఉండి ఉంటావు నీవు - భీమేశ్వరి రాగంలో, కామేశ్వరి తాళంతో, ఏతత్ జీవన మహాగీతం పాడుకొంటూ !

వెళ్ళొస్తా !

వెళ్ళొస్తా ! మళ్ళొస్తా !

తిరుగు లేని బాధ్యతలకు
శిరము వంచి వెళ్ళొస్తా!
బడలిన నా తనువును నీ
ఒడిని జేర్చ మళ్ళొస్తా !

కరుణ లేని కాలముపై
కత్తి దూసి వెళ్ళొస్తా !

అహితమైన దెల్ల గెలిచి
అమృతముతో మళ్ళొస్తా !

మరుపు లేని నీ పూజలొ
మల్లె లుంచి వెళ్ళొస్తా !
ఆరని విరహాశ్రువులకు
అవధు లెరిగి మళ్ళొస్తా !

115

వికసించడానికి మొగ్గ ఎంత వేగిరపడుతుందో, వికసించిన పువ్వు మళ్ళీ మొగ్గగా వెనక్కి తగ్గడానికి అంత ఆరాటపడుతుంది !

కాని – ఎలా సాధ్యం ?

మన ఈ మహాసృష్టికి వెనకడుగే లేదు కద !

పోనీ – మొగ్గ మొగ్గగానే ఉండిపోగూడదా ?

అయితే – అందువల్ల ఏం ప్రయోజనం ?

మొగ్గ వికసించవలసిందే.

మల్లె మొగ్గ కూడ వికసించవలసిందే – తీగనో, ఏ తీగబోడి సిగలోనో !

వికసించడం ఎంత అందం !

ఆ అందం చుట్టూ ఎంత ఆకర్షణ ! ఎంత ఆరాధన ! ఎంత ఆనందం !

అందుకే – వికసించడం కోసం అంత తహ తహ !

తన చుట్టూ ఎన్ని వలపు చూపులు ! చూపు తుమ్మెదలు ! తుమ్మెద పాటలు !

పాటలాధరల నిత్య సాంగత్య లీలలు ! లీలా మారుత డోలలు !

తాను ఆకర్షణకు కేంద్రం కావడం ! ఆరాధనకు దేవత కావడం ! ఆనందానికి నిలయం కావడం !

ఎంత అదృష్టం !

ఎంత సంతృప్తి !

క్షణ మాత్రమైతే నేం ! చాలదా జీవితానికి ?

చాలు అనిపిస్తుంది తొలిసారి

కావా లనిపిస్తుంది మరొకసారి.

కాని –

మరొకసారికి ప్రొవిజను లేదు ప్రకృతిలో !

ఎంత అన్యాయం !

మొగ్గ వికసించేది ఒకేసారి.

అన్ని అందాలు, అంత తపస్సు ఆ ఒక్కసారి కోసమే !

ఆ తర్వాతది బైటికి దారి !

లోనికి – బైటికి – గుమ్మాలు వేరు వేరు.

వచ్చిన గుమ్మానికి తిరిగి వెళ్ళే వీలే లేదు.

అదొక పెద్ద క్యూ !

ఒక మహా ప్రవాహం !

ఇటు ప్రవేశించి, అటు నిష్క్రమించ వలసిందే.

పోనీ – ప్రవేశ నిష్క్రమణల మధ్య, ఈ మధుర జీవిత మందిరంలో, ఇష్టం వచ్చినంత కాలం గడపవచ్చునా ?

అదీ వీల్లేదే !

ప్రవేశపత్రంపై టైం వేసి ఉంటుంది. ఆ టైంలోనే తీర్చుకోవాలి అన్ని సరదాలూ, ముచ్చటలూ, కోరికలూ, విధులూ !

క్షణమైనా వృధా చెయ్యకుండా గడుపుకొంటే – అన్ని కర్తవ్యాలూ నెరవేర్చుకోవచ్చు, అన్ని ఆనందాలూ పొందవచ్చు, అమృతత్వం కూడ సాధించవచ్చు ఆ ఇచ్చిన టైంలో !

కాని –

ప్రధమానుభవ పారవశ్యం నుంచి తేరుకొనే టప్పటికే తెల్లవారి పోతున్నది బ్రతుకు –ఎన్నో కల్పాలకు !

ప్రవేశించి, ఆ రద్దీకి తట్టుకొని, గోలకు ఆగి, కంఠం శ్రుతి చేసుకొని, పైకి చూచేటప్పటికే నిష్క్రమణ ద్వారం కనిపిస్తున్నది – ఎన్నో బాల కోయిలలకు !

చేసేది లేక కొందరు, ఉక్కిరిబిక్కిరై కొందరు, అర్థం కాక కొందరు, అనుభవయోగ్యత లేక కొందరు, ఆ ఒక్క మొక్కూ తీర్చేసుకొని విద్యార్థుల వలె !

ఇక –

ఎంత అనుభవించినా తనివితీరని మనలాంటి వాళ్ళకు ఈ టైం ఎలా సరిపోతుంది ?

నిల్చి చూడలేం.

మళ్ళీ అదే అనుభవించలేం.

ఒక్క అడుగు వెనక్కి వెయ్యలేం !

ఎంత క్రూరం ఈ ప్రకృతి శాసనం !

మనం మళ్ళీ మొగ్గలం కావాలంటే – వాడి రాలిపో వలసిందే ! నిష్క్రమించి ప్రవేశించ వలసిందే ! మళ్ళీ అంతా కొత్తగా ప్రారంభించ వలసిందే !

గతం గుర్తుండదు ! అనుభవం ఉపయోగించదు ! బ్రతుకంతా తిరిగి చరిత్ర చర్వణం !

ఈ పుష్ప జీవితాలను, ఆనందరాగప్రమత్తత కోసం వికసింపజేసుకొన్న మనం, అప్రమత్తుల మెలా కాగలం ?

ఎందుకో ఈ కాల నియమాలూ, పరిమితులూ, హద్దులూ !

వైశాఖి

ఇది వైకుంఠము వెంకటేశ్వరుడు ల
క్ష్మీశుండు కొల్వుండుటన్ !
ఇది కైలాసము, మల్లికార్జునుడు ఆ
ర్యేశుండు చెల్వొందుటన్ !
ఇది బ్రహ్మోర్వి, సరస్వతీ చరణ పం
కే జాతమై యుండుటన్
ఇది మా ఆంధ్రము ; నీకు వీతము ; త్రిశ
క్తీ ! పూజ గైకో గదే !

త్రిమూర్తులకూ, వారి దేవేరులకూ, వారి పరివారమైన ముక్కోటి దేవతలకూ నిలయమైన విశ్వకేంద్రం ఆంధ్రం !

సింహాచలం, సత్యనారాయణగిరి, ఇంద్రకీలాద్రి , శ్రీశైలం, శేషాద్రి – పూర్వగిరి పంక్తుల నిండా ఎన్ని క్షేత్రాలు ! ఎన్ని సౌందర్యాలు ! ఎంత ఔజ్జ్వల్యం ! ఎంత ఆనందోపరతి !

విశ్వ సౌందర్య కేంద్రం ఆంధ్రమైతే, కేంద్రంలో పరమ సౌందర్య విక్షేపం శ్రీ వేంకటాద్రి !

ఒక మహాశక్తి క్షేత్రం ఇది !

ఈ మహా సౌందర్యాన్ని దర్శించడానికి ఒళ్ళంతా కళ్ళు చేసుకొని, ఆనంద పరవశ్యంతో ఆహ్వానించాను జగదంబను – తొలిసారి నేను తిరుపతి కొండ లెక్కినప్పుడు – నా పరమ విభూతిలో పాలుపంచుకోవడం కోసం !

విశ్వ సృష్టికే మూలశక్తి దేవి !

ఆంధ్రాధిష్ఠాన పరవశ్రీ ఆమె !

శేషగిరి నుండి సింహాద్రి శిఖరమునకు
కల్పమంజరు లూయెల కట్టి, తెలుగు
కడలి తరగల చెలులు రంగార నిన్ను
మించుల యెడంద లడర ఊగించ గలరు !

అంటూ అంజలి ఘటించి పలికాను స్వాగతం.

తెలుగు వెంకన్నను మించిన భాగ్యశాలి, మహిమాన్వితుడు, కారుణ్యమూర్తి, రసాధిపతి లోకంలో మరొక రెవ రున్నారు ?

తనలో వెలసిన శ్రీస్వామిని పులకిత గాత్రంతో, రెండు చేతులతోనూ పైకెత్తి, దేవతలకు చూపుతున్న ఈ ధాత్రీదేవి సాక్షాత్తు యశోదా దేవే !

ఆ రెండు చేతులే సూర్యచంద్రులు. ఏడుకొండలే సప్తలోకాలు, సప్త కమలాలు ! ఆ చివర పద్మంలోని పద్మావతీ యుతుడైన శక్తి స్వరూపుడే శ్రీ వేంకటేశ్వరుడు.

ఈ ఏడుకొండల్నీ ఏడు స్వరాలకు శృతి చేసి, విశ్వగానమే చెయ్యాలి నేను – నీ హృదయ వీణపై !

ఏడు కొండల శిఖరాల కెదిగి, దివికి
ఓసరిల్లి, పిల్లనగ్రోవి నూదుకొనెడు
తెలుగు వెంకన్న నీ కాతిథేయ మొసగ
చూచెదవు గాని ! అచ్చ యశోద సుతుడె !

బెల్లించాను జగజ్జననిని !

ఆ సౌందర్య మహార్ణవంలో నేనొక అలనై, ఆ సంగీత మహా సామంలో

నేనొక ఉద్గీధనై, ఆ ఆనంద మహాయోగంలో వట్టి శూన్యమాత్రుణ్ణై – నేనే తిరుమలనై శిరస్సున ధరించాను స్వామిని ఆనాడు !

అప్పుడు నీ వెక్కడున్నావో !

ఆనందచేతనవై, నాదబ్రాహ్మివై, అభిజ్ఞా చిత్తవై, కసుమ సౌరభ శరీరవై – నా చుట్టూ, నన్ను అలముకొనే ఉండి ఉన్నా వేమో !

నీ అనురాగాన్ని మన్నించి జగదంబే నిన్ను నా కిచ్చిందేమో !

రాగలక్ష్మి, రాగజ్యోతి, రాగప్రభ, రాగవైశాఖి, రాగరేఖ, రాగరమ – ఓహో !

ఇప్పుడు, ఈ గిరిక్షేత్ర సౌందర్యంలో మునిగి, ఈ స్వామి సన్నిధిలో పరవశిల్లి, ఊహలు అందక, మాటలు రాక, కాలం నడవక, ఏదో వ్రాసి, ఎలాగో ముగిస్తున్నాను ఈ లేఖ !

వస్తున్నావు కద ? ఇక్కడే చదువుకొందువు గాని దీన్ని !

ఆనాడు ఆదిశక్తిని ప్రార్థించాను. ఈ నాడు అదే గొంతుతో పిలుస్తున్నాను నిన్ను – ఈ మహా సౌందర్య సుధాస్వాదనలె నాతో పాలుపంచుకోమని !

రమ్ము, దేవి ! ఈ గిరి మానసమ్ము లందు
మాధవుని దివ్య పాద పద్మాలు కలవు !
ప్రేమ సుందరములు, మాధురి ము లివ్వి !
రమ్ము, నా జంట తేటివై రమ్ము, దేవి !

117

" పానకంలో పుడకల్లా ఈ బిచ్చగాళ్ళేమిటి, గురో ? " అన్నాడు సాంబశివ.

సాహితీ భారతంలో సాంబశివ ఒక మహారథుడు. అట్టి వాడికే చికాకు కలిగించిన రాక్షసులు ఈ భిక్షకులు !

నిర్మలమైన మనస్సుతో, భగవద్ధ్యానం చేసుకొంటూ, దేవాలయానికి పోతూ ఉంటే – దారికి రెండు ప్రక్కలా బారులు తీరి ఉండే బిచ్చగాళ్ళు, చేసే గోల, చూపే దౌర్జన్యం, పెట్టే శాపనార్థాలు ఎంత దుర్భరం !

ఈ కుంటి, గుడ్డి, అవిటి, మూగి, సోమారి, రోగిష్ఠి దౌర్భాగ్య లంతా ఏ యే కర్మలు చేసుకొని అనుభవిస్తున్నారో ఈ బాధ లన్నీ !

ఇప్పుడు – ఈ విధంగా – పుణ్యక్షేత్రాలలో చేరి, యాత్రికుల్ని పీడించడం, ప్రశాంతతను పాడు చెయ్యడం, దానం చెయ్యలేని పేదలను తిట్టడం వంటి ఘోరాలకు పాల్పడడం వల్ల – ఇంకా ఎలాంటి దీనజన్మలు దాపురిస్తాయో కదా వీళ్ళకు ముందు ముందు !

ఈ బిచ్చగాళ్ళ కంటె పేదలైన వాళ్ళెందరు లేరు ఈ యాత్రికులలో ?

చొక్కాలున్నా వాటికి జేబులు లేనివాళ్ళు, జేబులున్నా వాటిలో డబ్బులు లేని వాళ్ళు, డబ్బులున్నా అవి తిరిగి ఇల్లు చేరేదాకా చాలని వాళ్ళు లక్షల కొలదీ ఉన్నారీ యాత్రికులలో ! ఏదో భక్తితో బాధతో ప్రశాంతి కోసం దైవదర్శనానికి వస్తే – ఇక్కడ ఈ పీడ ఏమిటి ?

ఈగలు, దోమలు, మిడతలు, ఎలకలు, రకరకాల తెగుళ్లు – ఈ జాబితాలో చేర్చబడవలసిన వీళ్లు ఎందుకిలా వదలబడ్డారో స్వేచ్ఛగా సమాజం మీదకూ, క్షేత్రాల మీదకూ !

తన గుమ్మం ముందు ఇంత కుళ్ళును పెట్టుకొని, ఆ భగవంతుడైనా ఎలా ఉండగలుగుతున్నాడో విశ్రాంతిగా !

" ఈ గుడుల్లో ఇంకా దేవుళ్ళున్నా రనేనా, గురో ?" అన్నాడు సాంబశివ – బిచ్చగాళ్ళ వ్యూహం నుంచి బైటపడడానికి యత్నిస్తూ !

డబ్బు ల్లేవు !

ఉన్నా వీళ్ల కెందు కివ్వాలి ?

మరి – భగవంతుడే బిచ్చగాడి వేషంలో వస్తేనో ?

అది అతడి కర్మ !

తన సృష్టి రాజ్యంలోని ప్రతి ఒక్కడికీ – తిండి, బట్ట, కొంప – ముఖ్యంగా ఈ మూడింటినీ ఉచితంగా చేకూర్చవలసిన ప్రాథమిక బాధ్యత భగవంతుడిపై లేదా?

మన అందరి దగ్గర నుంచీ భక్తి, ధ్యానం, ప్రార్థన, పూజ, వ్రతం, తపం, యజ్ఞం. యోగం, నైవేద్యం వంటి అమూల్య దివ్య సంపత్తిని రాజధనంగా వసూలు చేసుకొంటున్న భగవంతుడు - ఒక పేద యాత్రికుడి ముందు బిచ్చగాడై చేయి చాపితే, అది అతడి కర్మగాక మరేమిటి ?

బిచ్చమెత్తుకొనేవాడు ఎవర్నీ బాగుచెయ్యలేడు

ఏడ్చేవాడు సంతోష పెట్టలేడు ఎవర్నీ.

అంతా తనకే కావా లనుకొనేవాడు ఇతర్లకు ఇవ్వలేడు ఏమీ.

ఇచ్చే గుణం లేనివాడు ఈశ్వరు డెలా అవుతాడు ?

ఇలాంటి వాళ్ల ఆత్మలు వికసించవు. ఆత్మవికాసం లేకుండా ఉత్తమ జన్మలు లభించవు.

జీవన నైరంతర్యం, జన్మాంతర పౌనఃపున్యం - అహో రాత్ర సమాశ్లిష్ట మహాకాలం పలె - సత్యస్య సత్యంగా పేర్కొంటున్నాను కదూ పదే పదే ?

ప్రకృతి విజ్ఞాన ప్రమత్తులైన ఆధునికులకు ఇది మూఢ విశ్వాసంగా కనిపిస్తుం దేమో !

కాని - అది పరమ సత్యమే.

అభిజ్ఞ లేని అణువును విశ్లేషించిన ఒక మహా సైంటిస్టు కంటె, అతడి మేధస్సునే విశ్లేషించగలిగిన ఒక వైదిక మహర్షి గొప్పవాడు నా దృష్టిలో.

అణు శక్తి కంటె ఆత్మశక్తి గొప్పది.

సుఖంగా బ్రతకడానికి మాత్రమే పనికి

సైన్సు. ఆత్మ అందదడానికి.

ఆత్మ అందే దొక ఆత్మకే !

కాగా -

సోదా కోసమైనా సరే, సరదా కోసమైనా సరే, ఆకలితోనైనా సరే,ఆపదలోనైనా సరే - బిచ్చగాడు కాగూడదు భగవంతుడైనా.

ఆదిభిక్షువును అపార్థం చేసుకొన్న జాతి మనది.

అడుక్కుతినడాన్ని ఆధిక్యతగా భావించడం అల్పత్వం.

అన్నదానం మానవతకే అవమానకరం.

అందరికీ సమానంగా లభించవలసి ఉన్న అన్నాన్ని ఎవడో ఒకడు చేజిక్కించుకొని, ఏడాది పొడుగునా ఆ అందరి కడుపులూ మాడ్చి, ఏదో ఒక పండగరోజున అన్నదానం పేరుతో ఇన్ని చారు మెతుకులు పడేసి, దానిద్వారా కీర్తినీ,పదవినీ, పుణ్యాన్నీ, స్వర్గాన్నీ కొట్టేస్తా మనకోవడం కంటె మోసం, పాపం ఇంకేదీ ఉండదు.

అన్నదానం చేసేవాడెంత వంచకుడో, దాన్ని స్వీకరించేవాడు అంత పతితుడు.

అదేదైనా కానీ – దానం మానవత్వం కాదు నా దృష్టిలో.

బలివంటి బలాఢ్యుల పైచేయి సంప్రదాయం ఓడించబడి, వామనుల క్రిందిచేయి ధర్మానికి పట్టాభిషేకం జరిగినవాడే పతనం ప్రారంభమయింది మన ఆర్ష జాతికి !

ఆనాటినుంచీ, అన్ని కాలాలలోను, అన్ని రంగాలలోను కూడ అదే ముష్టి బ్రతు కైపోయింది మనకు ఈనాటి దాకా !

మనిషిగా బ్రతకలేనివాడు, ఎందుకు చావడు ?

చావడానికి ధైర్యం లేనివాడికి బ్రతికే హక్కు ఎక్కడిది ?

బిచ్చగాళ్ళకూ, పంటలకుపట్టే తెగుళ్ళకూ తేడా ఏమిటి ?

అహింస, జీవకారుణ్యం, అన్నదానం, శాంతి – ఈ రకం నినాదాలకూ, ఉద్యమాలకూ వెనుక ఉన్నట్టిది ఎంతటి భయంకర రక్తదాహమో, పచ్చి మోసమో, నపుంసక తత్వమో ఊహించలేవు నీవు!

దానం చేసి, దానంద్వారా గ్రహీత ఆత్మకు చంపేస్తున్నాడు దాత !

అతడి ఆత్మను శాశ్వతదాస్యంలో ఉంచేస్తున్నాడు కూడ !

మ్యుంగా నేటి ప్రజాస్వామ్య యుగంలో – మానవుడి ప్రగతికి దాత ఎంత శత్రువో, దాన గ్రహీత అంత చీడ !

సర్వ ప్రపంచమూ గ్రహాంతర యాత్రలకు పోతుంటే - మనం తిరుపతి యాత్రకుకూడ స్తిమితంగా పోలేకున్నాం !

స్వామిదర్శనం చేసుకొని, కాంటీనులో ఇంత తిని, ప్రొద్దు పోయి వచ్చి, సత్రంలో పడుకొంటే - మట్టడించిపై మమ్ము కోటాను కోట్ల నల్లులు, పగబట్టిన బిచ్చగాళ్ల రాక్షసాత్మల వలె !

118

ఎవరు ?

నీవు !

నీవే ?

కన్నుల చెన్నెల ! పెదవుల రుచి ! గుండె గుబులు ! కౌగిటి సుఖం !

అవును - నీవే !

కాని -

ఒక్క స్వర్గంలో మాత్రమే లభించే ఈ అధరామృత రుచి రసబ్రహ్మకు నిత్యవ్యయస్యగా మాత్రమే కనిపించే ఈ ప్రణము స్పందన - జీవేశ్వర సమైక్యంలె మాత్రమే సిద్ధించే ఈ స్పర్శాసుఖ సమాధి -

ఎక్కడివి ఇవన్నీ ?

ఇవన్నీ నీవే !

నమ్మకపోవచ్చు సామాన్యలోకం

లోకం ఎప్పుడూ కూపస్థ మండూకం !

లోకపు సరాసరి మెదడు జీరోబల్బు

అది నిత్యం వెలుగుతూనే ఉంటుంది

ఖర్చుమాత్రం కాదు కరెంటు !

క్షణంలె లక్షల కరెంటు కాలిపోయే విద్యుల్లతను చూచి, అసూయ పడుతుందది ! అది దాని ఖర్మ !

వచ్చేశావు నీవు - అంతే చాలు నాకు !

ఇచ్చేసుకొన్నావు నిన్ను నీవు - విలయ బ్రహ్మనై పోయాను నేను ఏ తదానంద రసోల్బణంలో !

నీవు నాకు అందీ అందని అందంగా ఉన్నంతసేపే ఈ సృష్టికి మనుగడ!

నీవు లేని స్థితి శూన్యం !

నీవు నాలో ఐక్యమైపోయిన స్థితి విలయం !

పరిస్థితిలో , స్వభావంలఓ - వాస్తవానికి రెండూ ఒకటే !

నీవు లేనిది ఆది.

నీవు నాలో కలిసిపోయినది అంతం.

ఈ రెండూ లేని ఆద్యంతరహిత స్థితి కదా నా నిరంతర ఆనంద జీవన రతి?

నీవు లేని దెప్పుడు ?

నిరంతర సుందర సదానంద రతివి నీవు నాకు !

నీవు నన్ను పైకొనని దెప్పుడు ?

అజేయ శివానంద మన్మధమూర్తిని నేను నీకు !

ఇలానే ఉందాం మనం - లోకోత్తర సదాసుందర శివానంద సత్య ప్రణయ ప్రతీకలమై !

స్నానం చేసిరా - ప్రయాణం చేసి వచ్చావు !

రుద్దనా సబ్బు ?

"ముద్దులేదా, సబ్బు దేనికి ?"

ఔను !

మాయామోహిత మత్తుణ్ణి నేను !

ఒక్క ముద్దుతో ముల్లోకాలకూ మోక్షం ఇవ్వగల నేను ఈ స్నానాల గదిలో, నీ ముందు వట్టి సబ్బు బొమ్మను !

"బొమ్ము కాదు, బ్రహ్మ !'

ఏదో ఒకటి - నీ చరణ సేవలో !

రాగ సరస్వతీ చరణ సేవ !

వైశాఖీ పాద పూజ !

అర్ధనారీశ్వర వ్రతం !

సింధు స్నాన పుణ్యోత్సవం !

రాధాకృష్ణ పూర్ణ పూర్ణిమా దివ్యామృత రసాస్వాదనం !

ఇన్ని ఐశ్వర్యాలు ఒక్క స్నానాల గదిలో !

ఎంత ఉన్మత్త మోహనంగా ఉంది – ఈ మహా వైశాఖీ ప్రణయ వ్రతం !

ఎంత బ్రహ్మానంద సుందరంగా ఉంది – ఈ బ్రాహ్మీ పాద పద్మాలయసేవా రాగలయ !

ఎంత – చంద్ర సూర్య సమున్మీలీత సచ్చిదానంద రాగలహరీ పరాం –

జగములో వికసించు సౌందర్యముల కెల్ల
స్నానాల గదియె ఉద్యాన పర్మాకరము !
పద్మమకళికల మీద ప్రణయోదయ కరాలు !
ఉదయేందు కలశిలో ఉజ్జ్వలానందాలు !

119

ఏవో పుణ్యము, లేవో ప్రేములు, రుచుల్,
ఏవో రసశ్రేయముల్,
ఈ వైశాఖిట మూర్తిదాల్చి, నను తే
ల్చెన్ పూర్ణ రాగాబ్ధిలో !
ఈ వాసంత రమా సమస్తమును నా
దే ఇంక ! కాలోత్తర
శ్రీ వాల్లభ్యము నాకు దక్కినదిపో,
జీవేశ్వ రావాస్యమై !

మహా వైశాఖీ వ్రత ఫలంగా నాకు లభించిన మహా వాల్లభ్యపదవి నీవు !

వ్యాస పూర్ణిమ, బుద్ధ పూర్ణిమ, అమృత పూర్ణిమ, అన్నమాచార్య పూర్ణిమ, సంనద్ధోరీ పూర్ణిమ, సింధుస్నాన పుణ్యపూర్ణిమ, అర్ధ నారీశ్వర పూర్ణిమ, అంకుర పూర్ణిమ, రాధా పూర్ణిమ – ఇలా జీవిత సమస్త వ్యాపారాలకు బీజావాప మనోజ్ఞమైన

ఈ మహా వైశాఖ పూర్ణిమ - ఈ మన రాగోదయ సముత్సవ సుధా పూర్ణ కుంభానికి విజయానంద రస పతాకగా నేడు ఆనందరాగ పూర్ణిమ అయింది !

లోకోత్తర సుందరమైన వైశాఖ పూర్ణిమ నా కోసం వైశాఖిగా ఇలా అవతరించగా, ఇక అక్కడ ఏముంది - రాగ పూర్ణిమ కాక !

అట్టి రాగ పూర్ణిమా పరిపూర్ణ సుధాకం బింబాన్ని మన నాల్టు పెదవులతోను అందుకొని - ఎంత మధురంగా నిర్వహించాం - పూర్ణి మాసీ సమస్తాశీర్వ్రత రాశీకృత సమీప్సిత వరవిధుల్ని - పగలంతా !

ఎంత వియోగవ్యధ తర్వాత,ఎంత నిరీక్షణ తర్వాత, ఎంత నైరాశ్యం తర్వాత - లభించింది నా యోగానికి ఈ ఆనంద సిద్ధి !

గడిచిపోతున్న అంధకారం అంతా భూగర్భంలోది ! పడుతున్న శ్రమావేదని అంతా భువ రంతరంలోది ! వాటితో మనకేం పని - స్వర్లోక సుఖం అంతా మందార దామంగా మనల్ని సన్మానిస్తున్నప్పుడు ?

ఎంత సేపటినుంచి కూర్చున్నానో నీకోసం ఎదురు చూస్తూ ఈ ఆరో కొండ శిఖరంపై !

ఈ కొండ పేరేమిటో !

పేర్లతో మనకేం పని !

ఆజ్ఞాపద్మాలయ ఎవరో కూర్చోపెట్టింది ఇక్కడ !

కూర్చున్నాను నీ కోసం - అస్థిమిత వహ్నిజ్వాల వలె, శయనాగారం గుమ్మంలో అర్ధరాత్రి ఎదురుచూచే విధ్యుక్త వినూత్న వరుడి వలె !

ముగియలేదా ఇంకా నీ అలంకరణం !

వైహారికమా ?

అభిగామికమా ?

ఉభయమా ?

ఎందుకో ఇంకా ఈ లోకాచార ప్రవృత్తి !

నీ రత్న కమలాలూ, వజ్రహారాలూ, మణి ముక్కరలూ, చీనిచీనాంబరాలూ, కనక కాంచీ వలగ్నాలూ, నటత్ రణత్ మహత్ మంజీర కింకిణీ నిస్వనాలూ 6 ఎందుకు ఇవన్నీ నాకు ?

అలంకారాలు శరీరంవరకే !

నిరలంకృత నగ్న నిశ్రేయస పరిభూతే పరమ రసానుభూతి !

నీవు వచ్చేవరకే నేను !

నీవు వచ్చిన తర్వాత మనం !

మనం అంటే ఈ లోకాలోక సమస్తమూ !

మనం అంటే భగవంతుడు !

అదే శ్రీ వేంకటేశ్వర మహాశక్తి ! అదే ఆనంద బ్రహ్మ !

ఆ మహాయోగ రాగవిభూతి కోసమే కూర్చున్నాను నేను ఇక్కడ ఎదురు చూస్తూ !

తెల్ల త్రాచు పిల్ల ల్లాంటి సెలయేళ్లు !

ఏ నాగినీదేవికి చెలికత్తెలో అవి ! నీ నిట్టూర్పుల్లా బుసలు కొట్టుకుంటూ వస్తున్నై దిగి

ఇంకా రాలేదేం నీవు !

చంద్రుడూ రాలేదు ?

ఎంత మంది తారలనైనా సరే, వలీల్లెపువ్వుల్లా త్రుంచి, సలిపి పారవేయగల కఠినుడు చంద్రుడు. అడ్డగించి ఉండడు కదా నిన్ను దారిలో !

ఎందుకు వస్తాయో ఇలాంటి కుశ్శంకలు మానవుడికి!

ప్రకృతి గుణాలలో స్వార్థం, సంఘర్షణ ఉన్నంతకాలం మానవ మనస్సు చుట్టూ తాను పహరా కాచుకోవడం తప్పదేమో !

తారలు, మల్లెపూలు, కలువలు చంద్రుడిపట్ల సౌమనస్యం కలవి. వాటి ధ్యేయం అతడి కరాలలో నలిగి పోవడమే.

పరాయత్తు చిత్తను ఎంతటి రాక్షసుడైనా ఏమీ చెయ్యలేడు.

అసలు నీవే వైశాఖీ పూర్ణచంద్ర దేవతవు కదా!

అదిగో నీవు !

పూర్ణ సుధాకర బింబాన్నే జటలో ముడుచుకోగల నీ సుందర వదనార విందం – అదిగో, దూరంలో !

కాని –

అంత దూరమా !

వెన్నెల పట్టుచీర కట్టుకొని, కొండమలుపు దాటి వచ్చేస్తున్నా వనుకొన్నాను కాని -

మేఘాన్ని చీల్చుకొని బైటపడ్డ చంద్రబింబ మది !

మనిద్దరం కలిసి ఉదయిస్తున్న వైశాఖీ పూర్ణచంద్రుణ్ణి చూద్దామనుకొన్నామే!

అందుకే కదా ఈ కొండలకు వచ్చాం మనం !

అందుకే కదా ఈ శిఖరస్థాయిలో కూర్చున్నాను నేను!

నే నొక్కణ్ణే చూచేశానే చంద్ర బింబాన్ని నీ వనుకొని !

ఎక్కడి వీ కలువ పువ్వులు నా కన్నులపై !

ఓహో, ఆనంద పరిమళాలు !

"మీరు చూచింది నన్నే! చంద్ర బింబం ఒక అద్దం. అందులో ఒకరి నొకరం చూచుకొన్నాం. ఇప్పుడిద్దరం కలసి, దాన్ని చూద్దాం !"

నీవేనా ?

కుముద వనమై వికసించావు నా చుట్టూ ! కౌముదివై కరగించావు నన్ను రాగరసంగా ! మెరిసి పోయావు నీవు దానిలో పరం జ్యోతివై !

120

ఎంత సేపు మనగల మిట
ఈ శిఖర స్థాయిని ?
ఈ రస రుచులకు అందని
ఈ అమృత నిశీధిని ?
అనురాగము అలలు మీటి,
ఆనందము తారదాటి,
మన్ను మిన్ను నేకతాళ
మై - మై మరపించి వేయ ?

ప్రజ్ఞాన ఘనాభానయె
ప్రళయమైన పరమములో,
రాగ పూర్ణ పద్మముపై
రాధా మాదశ కళతో ?

పరమ కైవల్య పదవి ఇది. రాధా మాధవ శివ సరస్వతీ ద్వంద్వాతీత పరాశక్తి క్షేత్రం ఇది. ఆనంద రసాత్మ ఇది. ఇంత వరకే మనం. ఇక లేం ఆ పైని !

ఉండలేం ఇక్కడ మనం – ఈ శిఖరాగ్రంపై. ఈ పరాపర ద్వార సూత్రం మీద ఎంతోసేపు !

ఇటో, అటో దిగిపోక తప్పదు !

వెలుగు – చీకటి !

చైతన్యం – శూన్యం !

రాగబ్రహ్మ – పరబ్రహ్మ !

ప్రవృత్తి – నివృత్తి

సమస్తం మనమే అయిన క్షణం ఒక్కటి చాలు మనకు !

అంతకు మించి – వద్దు !

ప్రవృత్తి మనది. రాగరంజితం అది. శాశ్వతీకరించుకొందాం దాన్ని ఆనంద మందిరంగా !

శివ శాంకరీ శాంబరీ !
బ్రహ్మానంద కాదంబరీ !
నా చుట్టు నీవు జ్యోత్స్నారాగ లక్ష్మివే !
నీ నిండ నేను చాంద్రీ శుక్ల పూర్ణునే !
నీ చుట్టు, నీ నిండ నేనేనె, ఓ చెలీ!
నే గ్రోలు మధు వెల్ల నీవేనె, నా చెలీ !

121

నిలబడ్డాం క్యూలో ధర్మదర్శనం కోసం !

నీ చేతిలో రెండు వెండి గుండెలు, నా చేతిలో ఒక నివేదన పొట్లం.

ఎప్పుడో గుండె బెదిరినప్పుడు - వెండిగుండె ఇస్తా నన్న మ్రొక్కు ఉంది నీకు స్వామికి.

నాకు ఏ మ్రొక్కూ లేదు.

దేవానికి లంచమిచ్చో, ప్రతిఫల మిచ్చో, వాగ్దాన మిచ్చో, పొగడ్తలతో ఉబ్బించో - అతడిచేత పని చెయ్యించుకోవ ం కిట్టదు నాకు.

ఏ గుడికైనా వెళ్ళినప్పుడు, న మనస్సులో ఏ కోరికా ఉండదు. విశ్వశ్రేయోరూపం తాల్చి, నిరామయంగా, శూన్య శుభ్రంగా ఉంటుందప్పుడు నా హృదయ స్థితి.

నేను దైవ దర్శనానికి వెళ్ళడం అతడి నుంచి ఏదైనా తెచ్చుకోవడానికి కాదు, నా కున్న దేదైనా అతడికి ఇచ్చి రావడానికి !

తాను ప్రేమించాలి

తాను ఇవ్వాలి.

ఈ రెండు గుణాలు చంద్రసూర్యులవలె కలిసినట్టిదే మహాయోగం. మహాయోగే మహేశ్వరుడు !

విశ్వశ్రేయో నిర్వహణలో క్షణక్షణం శక్తిని కోల్పోతూ ఉండే దైవానికి, తపస్సు ద్వారా తన ఆత్మశక్తిని అందించగల స్థితి ప్రజ్ఞుడే నిజమైన మానవుడు.

విశ్వశ్రేయమే నా వాంఛ.

అందులోనే ఉన్నై మన అందరి శ్రేయాలూ.

అంత మాత్రం చేత నిన్ను అక్షేపిస్తున్నానని కాదు.

సుఖాల కంటే దుఃఖాలే ఎక్కువగా కనిపించే జీవిత యాత్రలో ఆపద మ్రొక్కులు తప్పవు.

ఇచ్చేవా డుంటే, అడిగే వాళ్ళు లక్షలు !

తీరని కోరిక లుంటై ప్రతి మనిషికీ,

కోరికలు తీర్చేదేవుడు శ్రీ వేంకటేశ్వరుడు.

పరమ పదాన్వత పారం ముట్టిన మహాశక్తి క్షేత్రం ఇది.

అందుకే ఇన్ని మ్రొక్కులు. ఇంత భక్తి, ఇంత సేవ, ఇంత క్యూ !

క్యూ సాగుతున్నది ముందుకు.

నాగరికతా, ప్రకృతి విజ్ఞానమూ ఎంత పెరిగినా మానవుడు నిస్సహాయుడే. ఏదో పరమ శక్తి చేతిలో కీలుబొమ్మే !

సర్వాంతర్యామి అయిన ఆ శక్తి ఒకొకప్పుడు, ఒకొక చోట, ఒకొక రూపంలో కేంద్రీకృతం కావచ్చు - దావాగ్నివలె, వాయు గుండం వలె, సూర్యచంద్రుల వలె, నీవలె !

అట్టి కేంద్రం మంచిదీ కావచ్చు. చెడ్డదీ కావచ్చు.

మంచి చెడ్డలు వైయక్తిక దృక్పథాల తోడివి.

సుఖేచ్ఛా కేంద్రం వేంకటాద్రి.

సాగడం లేదు క్యూ !

ఏమిటి ?

నీ వెండి గుండెలు చూచికాదు నేను నవ్వుత.

నీవి రాతిగుండెలని ఎందుకంటాను?

బెదరిన గుండె ఒకటి కద ?

మరి - రెండెందుకో !

నీది బంగారుగుండె ! దాని బాగుకోసం వెండిగుండెనా ఇస్తావు ?

ఈ భావం నా మొఖంపైకి ప్రాకగానే, నీవు నా గుండెలలోకి చూచినప్పుడు, నీ పెదవులపై జిగేలుమన్న వెల్తురులో - మొత్తం క్యూ అంతా విరగబడి చూచింది నీ వంక !

భగ్గున వెలిగిన దీపంచుట్టూ అసంఖ్యాకంగా మూగిన ఆ చిరుతుమ్మెదలను చూచి - నేనే బెదిరాను కించిత్తు !

చిరుసిగ్గుతో దీపం మరింత మనోహరతను సంతరించుకొని, దీప లక్ష్మీ అయింది కదా !

కదల్లేక కదులుతున్నది క్యూ !

ఇదొక మహా క్యూ !

రకరకాల మనుష్యులు, రకరకాల మనస్తత్వాలు, రకరకాల బాధలు, రకరకాల మ్రొక్కులు ! నివేదనలు !

యాత్రికులు – విలాస యాత్రికులు !

కొండపై ఒక్కరోజు గడపడంకోసం, స్వామిని ఒక్కక్షణం దర్శించడం కోసం. జీవిత శిఖరీభూతమైన ఏ తదానందానుభూతిని ఒక్కసారి పొందడం కోసం దూరదూరాలనుంచి, కాలకాలాలు ప్రయాణంచేసి వస్తారు – రకరకాల మానవులు!

ఒక్క పదినిమిషాల పనికోసం పదేళ్లైనా – పది జన్మలైనా పయనించవలసి ఉండవచ్చు జీవుడు ! పని అన్నప్పుడు చేసితీరక తప్పదు – ఎప్పుడో ఒకప్పుడు !

అందుకే – బద్ధకించగూడదు మనం.

ఆ మహాయోగ రాగ విభూతి కోసమే కూర్చున్నాను నేను ఇక్కడ ఎదురు చూస్తు!

తెల్ల త్రాచు పిల్ల ల్లాంటి సెలయేళ్ళు!

ఏ నాగినీదేవికి చెలికత్తెలో అవి ! నీ నిట్టూర్పుల్లా బుసలు కొట్టుకొంటూ వస్తున్నై దిగి !

ఇంకారాలేదు నీవు !

చంద్రుడూ రాలేదు ?

ఎంత మంది తారలనైనా సరే, మల్లెపువ్వుల్లా త్రుంచి, నలిపి పారవేయగల కఠినుడు చంద్రుడు. అడ్డంగించి ఉండడు కదా నిన్ను దారిలో !

ఎందుకు వస్తాయో ఇలాంటి కుశ్శంకలు మానవుడికి !

ప్రకృతి గుణాలలో స్వార్థం, సంఘర్షణ ఉన్నంతకాలం మానవ మనస్సు తన చుట్టూ తాను పహరా కాచుకోవడం తప్పదేమో !

తారలు, మల్లెపూలు, కలువలు చంద్రుడిపట్ల సౌమనస్యం కలవి. వాటి ధ్యేయం అతడి కరాలలో నలిగి పోవడమే.

పరాయత్త చిత్తను ఎంతటి రాక్షసుడైనా ఏమీ చెయ్యలేడు.

అసలు నీవే వైశాఖీ పూర్ణచంద్ర దేవతవు కదా !

అదిగో నీవు !

పూర్ణ సుధాకర బింబాన్నే జటలో ముడుచుకోగల నీ సుందర వదనారవిందం - అదిగో, దూరంలో !

కాని -

అంత దూరమా !

వెన్నెల పట్టుచీర కట్టుకొని, కొండమలుపు దాటి వచ్చేస్తున్నా వనుకొన్నాను కాని -

మేఘాన్ని చీల్చుకొని బైటపడ్డ చంద్ర బింబ మది !

మనిద్దరం కలిసి ఉదయిస్తున్న వైశాఖీ పూర్ణచంద్రుణ్ణి చూద్దామనుకొన్నామే!

అందుకే కదా ఈ కొండలకు వచ్చాం మనం !

అందుకే కదా ఈ శిఖరస్థాయిలో కూర్చున్నాను నేను !

నే నొక్కణ్ణే చూచేశానే చంద్ర బింబాన్ని నీ వనుకొని !

ఎక్కడి వీ కలువ పువ్వులు నా కన్నులపై !

ఓహో, ఆనంద పరిమళాలు !

" మీరు చూచింది నన్నే ! చంద్ర బింబం ఒక అద్దం. అందులో ఒకరి నొకరం చూచుకొన్నాం. ఇప్పుడిద్దరం కలసి, దాన్ని చూద్దాం !"

నీవేనా ?

కుముద వనమై వికసించావు నా చుట్టూ ! కౌముదువై కరగించావు నన్ను రాగరసంగా ! మెరసి పోయావు నీవు దానిలో పరం జ్యోతివై !

120

ఎంత సేవు మనగల మిట
ఈ శిఖర స్థాయిని ?
ఈ రన రుచులకు అందని
ఈ అమృత నిశీధిని ?

అనురాగము అలలు మీటి,
ఆనందము తారదాటి,
మన్ను మిన్ను నేగతాళ
మై - మై మరపించి వేయ ?
ప్రజ్ఞాన ఘనాభానయె
ప్రళయమైన వరమములో,
రాగ పూర్ణ వద్మముపై
రాధా మాధవ కళతో ?

పరమ కైవల్య పదవి ఇది. రాధా మాధవ శివ సరస్వతీ ద్వంద్వాతీత పరాశక్తి క్షేత్రం ఇది. ఆనంది రసాత్మ ఇది. ఇంత వరకే మనం. ఇక లేం ఆ పైని!

ఉండలేం ఇక్కడ మనం - ఈ శిఖరాగ్రంపై, ఈ పరాపర ద్వార సూత్రం మీద.ఎంతోసేపు !

ఇటో, అటో దిగిపోక తప్పదు !

వెలుగు - చీకటి !

చైతన్యం - శూన్యం !

రాగబ్రహ్మ - పరబ్రహ్మ !

ప్రవృత్తి - నివృత్తి

సమస్తం మనమే అయిన క్షణం ఒక్కటి చాలు మనకు !

అంతకు మించి - వద్దు !

ప్రవృత్తి మనది. రాగరంజితం అది. శాశ్వతీకరించుకొందాం దాన్ని ఆనంద మందిరంగా !

శివ శాంకరీ శాంబరీ !

బ్రహ్మానంది కాదంబరీ !

నా చుట్టు నీవు జ్యోత్స్నారాగ లక్ష్మివే !
నీ నిండ నేను చాంద్రీ శుక్ల వూర్ణునే !
నీ చుట్టు, నీ నిండ నేనేనె, ఓ చెలీ !
నే గ్రోలు మధు వెల్ల నీవేనె, నా చెలీ !

121

నిలబడ్డాం క్యూలో ధర్మదర్శనం కోసం !

నీ చేతిలో రెండు వెండి గండెలు, నా చేతిలో ఒక నివేదన పొట్లం.

ఎప్పుడో గండె బెదిరినప్పుడు - వెండిగుండె ఇస్తా నన్న మ్రొక్కు ఉంది నీకు స్వామికి.

నాకు ఏ మ్రొక్కులేదు.

దైవానికి లంచమిచ్చో, ప్రతిఫల మిచ్చో, వాగ్దానమిచ్చో, పొగడ్తలతో ఉబ్బించో - అతడిచేత పని చెయ్యించుకోవడం కిట్టదు నాకు.

ఏ గుడికైనా వెళ్ళినప్పుడు, నా మనస్సులో ఏ కోరికా ఉండదు. విశ్వశ్రేయోరూపం తాల్చి, నిరామయంగా, శూన్య శుభ్రంగా ఉంటుందప్పుడు నా హృదయ స్థితి.

నేను దైవ దర్శనానికి వెళ్ళడం అతడి నుంచి ఏదైనా తెచ్చుకోవడానికి కాదు, నా కున్న దేదైనా అతడికి ఇచ్చి రావడానికి!

తాను ప్రేమించాలి

తాను ఇవ్వాలి.

ఈ రెండు గుణాలు చంద్రసూర్యులవలే కలిసిమట్టిదే మహాయోగం. మహాయోగే మహేశ్వరుడు !

విశ్వశ్రేయో నిర్వహణలో క్షణక్షణం శక్తిని కోల్పోతూ ఉండే దైవానికి, తపస్సు ద్వారా తన ఆత్మశక్తిని అందించగల స్థిత ప్రజ్ఞుడే నిజమైన మానవుడు.

విశ్వశ్రేయమే నా వాంఛ.

అందులోనే ఉన్నై మన అందరి శ్రేయాలూ.

అంత మాత్రం చేత నిన్ను ఆక్షేపిస్తున్నానని కాదు.

సుఖాల కంటె దుఃఖాలే ఎక్కువగా కనిపించే జీవిత యాత్రలో ఆపద మ్రొక్కులు తప్పవు.

ఇచ్చేవాడుంటే, అడిగే వాళ్ళు లక్షలు !

తీరని కోరికలుంటై ప్రతి మనిషికీ,

కోరికలు తీర్చేదేవుడు శ్రీ వేంకటేశ్వరుడు.

పరమ పదాన్యత పారం ముట్టిన మహాశక్తి క్షేత్రం ఇది.

అందుకే ఇన్ని మ్రొక్కులు, ఇంత భక్తి, ఇంత సేవ, ఇంత క్యూ !

క్యూ సాగుతున్నది ముందుకు.

నాగరికతా, ప్రకృతి విజ్ఞానమూ ఎంత పెరిగినా మానవుడు నిస్సహాయుడే. ఏదో పరమ శక్తి చేతిలో కీలుబొమ్మే !

సర్వాంతర్యామి అయిన ఆ శక్తి ఒకొక్కప్పుడు, ఒకొక చోట, ఒకొక రూపంలో కేంద్రీకృతం కావచ్చు – దావాగ్నివలె, వాయు గుండంవలె, సూర్యచంద్రులవలె, నీవలె !

అట్టి కేంద్రం మంచిదీ కావచ్చు. చెడ్డదీ కావచ్చు.

మంచి చెడ్డలు వైయక్తిక దృక్పథాల తోడివి.

సుఖేచ్ఛా కేంద్రం వేంకటాద్రి.

సాగడం లేదు క్యూ !

ఏమిటి ?

నీ వెండి 'గండెలు చూచికాదు నేను నవ్యత.

నీవి రాతిగుండెలని ఎందుకంటాను?

బెదరిన గుండె ఒక్కటి కద?

మరి – రెండెందుకో !

నీది బంగారుగండె ! దాని బాగుకోసం వెండిగండెనా ఇస్తావు ?

ఈ భావం నా మొఖంపైకి ప్రాకగానే నీవు నా గుండెలలోకి చూచినప్పుడు నీపెదవులపై జిగేలుమన్న వెల్తురులో – మొత్తం క్యూ అంతా విరగబడి చూచింది నీ వంక !

భగ్గున వెలిగిన దీపంచుట్టూ అసంఖ్యాక మూగిన ఆ చిరుతుమ్మెదలను చూచి – నేనే బెదిరాను కించిత్తు !

చిరుసిగ్గుతో దీపం మరింత మనోహరతను సంతరించుకొని, దీప లక్ష్మి అయింది కద !

కదల్లేక కదులుతున్నది క్యూ !

ఇదొక మహా క్యూ !

రకరకాల మనుష్యులు, రకరకాల మనస్తత్వాలు, రకరకాల బాధలు, రకరకాల మ్రొక్కులు ! నివేదనలు !

యాత్రికులు – విలాస యాత్రికులు !

కొండపై ఒక్కరోజు గడపడం కోసం, స్వామిని ఒక్కక్షణం దర్శించడం కోసం. జీవిత శిఖరీభూతమైన ఏ తదానందానుభూతిని ఒక్కసారి పొందడం కోసం దూరదూరాలనుంచి, కాలకాలాలు ప్రయాణంచేసి వస్తారు – రకరకాల మానవులు!

ఒక్క పదినిమిషాల పనికోసం పదేళ్ళైనా – పది జన్మలైనా పయనించవలసి ఉండవచ్చు జీవుడు ! పని అన్నప్పుడు చేసితీరక తప్పదు – ఎప్పుడో ఒకప్పుడు !

అందుకే – బద్ధకించగూడదు మనం.

ఒక్కలిప్త బద్ధకిస్తే, ఒకజన్మే వెనకబడిపోవచ్చు – ఆద్యంత రహితమైన ఈ మహా క్యూలో ! ఒక్కక్షణం ఏమరిస్తే, ఒక జీవితం జీవితమే నాశనమైపోవచ్చు – ఈ జగద్వేగంలో !

అప్పుడు – దైవాన్నీ, కర్మనూ, చుట్టుప్రక్కల వాళ్ళనూ, ఎంత తిట్టుకొన్నా – ఉండదు లాభం.

తొందర దేనికి ?

సాగనీ క్యూను !

ఆగుతూ, సాగుతూ ఉన్న ఈ క్యూ – కెరటాలు వేస్తున్న మహా గోదావరిలా ఉన్నదా ? పూర్ణిమనాటి సముద్వేల సముద్రంలా ఉన్నదా? రమాకృష్ణులను ఉయ్యాల లూపుతున్న శేషుని శ్వాసా విన్యాసంలా ఉన్నదా ? చూడు ఇటూ, అటూ !

ఓహో ! కోతి !

క్యూ పొడుగునా కోతులు !

ఒక పెద్ద కోతి శ్రీ కృష్ణ పరమాత్మలా విహరిస్తున్నది – ఆడ కోతుల గుంపులో!

ప్రతి ఆడకోతి నతశిరస్క అవుతూవుంది – ప్రియుడు దగ్గరకు రాగానే ! సాష్టాంగపడుతూ ఉంది – అతడి ముందు !

అట్టి ప్రతి ప్రియురాలినీ జబ్బలు పట్టుకొని లేవదీసి, రెండు బుగ్గలూ ముద్దాడి, మన్నిస్తూ ఉన్నాడు ఆ మర్కట మహా రసికుడు !

రాసలీలా రహస్యాన్ని చూపుతున్నాడు భగవంతుడు భక్తులకు !

స్త్రీకి భర్తే గురువు, భర్తే భగవంతుడు !

భర్త అంటే - తాను తన మనస్సును, హృదయాన్ని, ఆత్మను, తన సమస్తాన్నీ ఎవరికి సమర్పించుకొన్నదో - ఆ ప్రియుడు !

అతడే ఆమె ఆత్మ స్రవంతికి ఆనందార్ణవం ! అదే ఆమెకు మోక్షం !

ఏ జీవుడికైనా, ఏదో ఒక్క పురుషుణ్ణి ప్రేమించగల ప్రేయసిగా పుట్టినప్పుడే, మోక్షం సులభమేమో !

ఆ పురుషుడు కృష్ణుడైతే ఆమే రాధ. శివుడైతే సరస్వతి. సముద్రుడైతే మహానది. చెరువైతే పిల్లకాలువ. ఒంటరిగా ఒక చినుకు !

జాత్యహంకారాలు, కుటుంబ గౌరవాలు, ఆస్తిహక్కులు, శారీరక నిర్బంధాలు, వైవాహిక విధినిషేధాలు - ఇవన్నీ కేవల లైకికాలు ! పెళ్ళి పేరుతో శరీరం ఒక మగవాడి ఆధీనంలో ఉన్నా, ఆమె ఆత్మ నిరంతరం ఎవడితో రమిస్తూ ఉన్నదో - అతడే ఆమె భర్త ! అతడే ఆమెకు గురువూ, భగవంతుడూ, మోక్షస్థానమూ, ఆనంద నిధీ !

అట్టి పురుషుడు ఆనంద మహాసముద్రమే అయినప్పుడు - అనంత కోటి జీవ నదీనద సుందరీమణులు అతడిలో లయమైపోవచ్చు కదా?

"పురుషుడు ప్రేమించడు -" అన్నావు కదూ నీవు ?

స్త్రీ ప్రేమిస్తుంది.

పురుషుడు ప్రేమను స్వీకరిస్తాడు

ప్రేమించడం ఆత్మగుణం.

ప్రేమను స్వీకరించడం పరమాత్మగుణం ఈ రెండూ జరిగిందే జీవబ్రహ్మైక్యం.

తన సంతానంలో ప్రతి ఒక్కళ్ళనీ తండ్రి ప్రత్యేకంగా ఎలా ప్రేమించగలడో, తనలోకి చేరే ప్రతి ప్రవాహాన్ని సముద్రుడు తన తరంగ హస్తాలతో ప్రత్యేకంగా ఎలా స్వీకరించగలడో, అలానే - పరమాత్మ తనలో ఐక్యం చేసుకోగలడు - ప్రేమోద్వేగంతో చేరే ప్రతి ఆత్మనూ ప్రత్యేక ప్రత్యేకంగా !

ప్రేమించాలి.

ప్రేమించడమే మోక్షం.

స్త్రీకి మోక్షం సులభం !

పురుషుడు మోక్షం పొందాలంటే - ప్రతి జీవి ప్రేమనూ స్వీకరించి, అట్టి ప్రతి ఆత్మనూ తనలో ఐక్యం చేసుకోగల ప్రేమ సముద్రుడు కావాలి.

స్త్రీ పురుష ప్రేమాతీతుడైన అమృత స్వరూపుడే పురుషోత్తముడు.

అతడే కృష్ణుడు !

ఏ రూపంలో అయినా ఉండవచ్చు అతడు.

అతడి లీలే రాసలీల

అదే విశ్వజీవన హేల !

ఈ విధంగా -

క్యూ వెలుపలి కోతుల్ని, క్యూలోని మనుషుల్ని చూచుకొంటూ, ఈ రీతి మౌనచర్చల్ని చేసుకొంటూ, ఒకర్నొకరం ఆస్వాదించుకొంటూ, మనం -

నిజంగా - ఇప్పుడు ఈ చర్చలన్నీ మనం ఎలా చేసుకొంటున్నాం ?

లేఖల ద్వారా కాదు. మాటల ద్వారా కాదు. అభినయం ద్వారా కాదు

ఈ అన్నిదశలూ దాటిపోయిన ఆత్మస్థాయి మనదిప్పుడు.

మన మనస్సులే మనం ఇప్పుడు !

అటు నీ ఆత్మకూ, ఇటు నా ఆత్మకూ మధ్య మనోద్వారం తెరువ బడిందిప్పుడు.

నా లోని విద్య నీకూ, నీలోని వివేకం నాకూ -

నా లోని ఔజ్జ్వల్యం నీకూ, నీ లోని అనురాగం నాకూ -

నాలోని సత్యం నీకూ, నీలోని సౌందర్యం నాకూ -

నాలోని అమృతం నీకూ, నీలోని ఆనందం నాకూ -

ప్రవహిస్తున్నై ఇప్పుడు మనోవాహనలై, నిత్యం నిరవరోధంగా !

ఇదే పరమ గురు పారమ్య పదవి !

నేనే నీకు పరమ గురువును.

నీవు నాకు పరమ గురువువు.

ఇంద్రియాతీత పరమస్థాయిలో రమిస్తున్నై మన మనస్సులు, ఉపరమిస్తున్నై మన ఆత్మలు, విశ్వైక పాలన నిర్వహిస్తున్నాం మనం ఒక్కటిగా !

అభేదానంద మూర్తి మనది !

అందుకే -

మాటలు, చూపులు, స్పర్శలు - ఏవీ అక్కర లేకుండానే మాట్లాడేసు కొంటున్నాం - చూచేసుకొంటున్నాం - అనుభవించేసుకొంటున్నాం మనం పరస్పరం!

పరస్పరమే కాదు -

మొత్తం విశ్వమే మనమై విహరిస్తున్నాం !

కోతిలో కూడ కృష్ణుడు కనిపించిందందుకే !

విగ్రహారాధన మూర్ఖత్వ మన్నవాళ్ళు ఎంత మూర్ఖులు !

"శరీరమే విగ్రహం. ఆత్మే శక్తి. శరీరారాధనే ఆత్మేపరతి. ఉపనుషన్మధువిధి. ఇది లభించేది రాగ రసాత్మలకే యోగ యోషాత్మలకే.

ఓహో - ఎంత బాగా చెప్పావు !

ఎక్కడున్నాం మనం ఇప్పుడు ?

అమ్మో - గుంజారు నా చేతిని ఎవరో ! చినిగింది నివేదన పొట్లం ! చెల్లాచెదరైనై అందులోని పటికబెల్లం పలుకులు, కొబ్బరిముక్కలు, జీడిపప్పులు, ఖర్జూరపు పండ్ల చెక్కులు, ద్రాక్షపండ్లు -

పారిపోయింది - దొరికినన్ని ఎత్తుకొని - ఎవరు ?

కోతి !

కొంటె కృష్ణుడు !

అమ్మో - అంటూ బెదిరి నా అక్కున గ్రుచ్చుకొన్న నిన్ను చూచి, పండ్లికిలించిం దది !

పకాలు మన్నది క్యూ అంతా !

మన ఈ అనుకోని ఆలింగన సుఖం చూచి ఏడ్చుకొన్న వాళ్ళూ ఉన్నారు. ఆ క్యూలో ! భగవంతుని ఇచ్ఛకు ఎవరేడ్చి ఏం చెయ్యగలరు ?

సుఖంలో అనేక భోగాలున్నై, అనేక సంతోషాలున్నై, అనేక వినోదాలున్నై. అవన్నీ సుఖంలో అంతర్భాగాలు మాత్రమే.

పరస్పరం ప్రేమించుకొని, కామించుకొని, విరహతప్తులైన ఇద్దరు స్త్రీ పురుషుల శరీర సంయోగమే సుఖం.

శరీర సంయోగం ఆత్మ సంయోగంలో పర్యవసించడమే పరమ సుఖం.

శాశ్వతమైన పరమ సుఖమే ఆనందం.

ఆనందమే బ్రహ్మ.

స్త్రీ పురుష ఆత్మ సంయోగమే బ్రహ్మానందానికి ఏకైక మార్గం. ఆ మార్గం సంప్రయోగం గుండా పోవచ్చు. యోగం గుండా పోవచ్చు.

బ్రహ్మ ఆనంద కామనే జీవబిందువు. జీవ ఆనందకామనే తిరిగి బ్రహ్మ.

స్త్రీ పురుష సంయోగాన్ని పాపమన్నవాళ్ళే సృష్టించి పెట్టారు నరకాన్ని!

పాపం, వాళ్ళకు జీవేశ్వర నిజతత్వం తెలీదు.

సృష్టి చరాచర వర్గంలో ఎక్కడా కూడ స్త్రీకి ఆర్థిక పారతంత్ర్యం లేదు - ఒక్క మానవ వర్గంలో తప్ప ! స్త్రీ తిండికోసం పురుషుడిపై ఆధారపడి బ్రతకవలసిన దుర్గతి ఒక్క మానవ వర్గానికే పరిమితం.

ఆర్థిక దాస్యమే అన్ని దాస్యాలకూ మూలం.

స్త్రీ ఆనంద నిలయం

పురుషుడు రసబిందువు.

సమాన ప్రతిపత్తితో రసానందం అనుభవించి, బ్రహ్మానుభూతిని పొందవలసిన ఈ సౌందర్యలవాల నడుమ - బానిస, యజమాని తారతమ్యం ఎప్పుడు తలెత్తిందో ఏమో - అప్పటినుంచే పతనమై పోయింది మానవ సంఘం, పాపపుణ్య స్వర్గనరక దుర్వికల్ప కశ్మలం లోకి !

చంద్రుడు స్త్రీ

సూర్యుడు పురుషుడు.

సృష్టి స్థితులకు ఈ ఇద్దరూ సమాన ప్రాణభూతులే. నాడీ రూపంలో సమానంగానే నడుస్తారు ఇర్వురిలోనూ !

ప్రకృతిలో లేని ఈ తేడా మనుష్యుల్లోకి ఎలా వచ్చిందో !

ఈ కోతుల్ని చూసైనా గ్రహించ రేం మానవులు పరతత్వాన్ని ?

చూస్తున్నావు కదూ ఆ మర్కట మహా రసికుని రాసలీల?

అదంతా వ్యభిచారం అంటుంది మూర్ఖ లోకం.

రాజు చేస్తే శృంగారమూ, రజకుడు చేస్తే వ్యభిచారమూనా ?

కామ క్రీడ వ్యభిచారం కాదు,

సుఖానందానికి మార్గం అది !

ఆనంద బ్రహ్మకు ద్వారం అది !

అదిగో - ఆలయ ద్వారం !

దొడ్డి దారిని వచ్చి, ఎక్కువ డబ్బు చెల్లించి, ప్రత్యేక దర్శనం చేసుకుపోతున్నారు పలుకుబడి గల భాగ్యవంతులు !

అధికారపదవుల్లో ఉన్నవారికి ఆ డబ్బుఖర్చు కూడా లేదు !

పురాకృత పుణ్యులు వాళ్ళు !

సాలోక్య సామీప్యాలే కాదు, నిత్య సాన్నిధ్యం - సాయుజ్యం కూడ ప్రత్యేకంగా లభిస్తే అందులో మరి అదృష్టవంతులకు!

క్యూలో నిలబడవలసిన అవసరం లేదు వాళ్ళకు !

సామాన్యులకే ఈ క్యూ !

ముందో, వెనుకో - ధనంతోనో, ధర్మంగానో - దర్శనం తప్పదు ప్రతి వ్యక్తికి !

అప్పుడు - స్వామి ముందు - అందరూ ఒక్కటే - ఒకే పరమ ప్రపత్తి !

ధనమో, సుకృత ధనమో ఉంటే - ఈ క్యూ బాధే ఉండదు ఎవరికీ !

భగవంతుడే వెతుక్కొంటూ వస్తాడప్పుడు - అలాంటి ధన్యాత్మ కోసం !

గుమ్మం దాటు తున్నాం !

కూసం విడిచిన మహాసర్పంలా కదిలి వస్తున్నది క్యూ !

గోవింద నామమంత్రంతో ఎంత సత్వ సంపన్నమై ఉన్నదిది !

మెట్టెక్కుతున్నాం ! ఇదే చివరి మెట్టు !

నా ముందు నీవు !

నా ఒడిలో నడుస్తున్నావు నీవు !

నా వీపున వెన్న ముద్దల ఎర్రద్రాక్షల చక్కిలిగిలి !
ఎలా వచ్చావు నీవు నా వెనక్కి ?
ముందూ నీవే ! వెనకా నీవే !
ఓహో ఎంత చిత్రం !
ఈ క్యూ అంతా మనమే ! మనిద్దరమే !
నేనూ - నా ముందూ, నా వెనకా, అనేక రూపాలలో నీవూ !
వేరు వేరు పనులకోసం వేరు వేరు రూపాలు ధరించిన నీవే ఈ జనం అంతా ! ఈ క్యూ అంతా! అనంత రూపంతో కొనసాగుతున్న నా ఆత్మే ఈ క్యూ !
దీని ఆది అనంతంలో ! అంతం శ్రీ స్వామిలో !
ఈ క్యూ అంతా స్వామి కొక పూలదండ !
ఓహో - విశ్వరాగ దర్శనం !
విశ్వేశ్వర సాన్నిధ్యం !
ఆనంద తమస్సు !
అనురాగ జ్యోత్స్న !
అనిర్వచనీయ మహానీయ పరిమళం !
నా రాగ పరిమళవు నీవు !
ప్రాణమయం ఈ సమస్తం !
అదిగో - స్వామి !
ఆనంద కంఠారావాలు !
ఆహ్లాద ఘంటానాదాలు !
ఓహో - పరిపూర్ణ పరంజ్యోతి !
ఓహో - పరాపర పరమ విభూతి !
దివ్యసుందర శివంకర మూర్తి !
సర్వమంగళ మాంగల్య మూర్తి !
శ్రీ వేంకటేశ్వర స్వామి !
ఓం శ్రీ వేంకటేశ్వరాయ నమః
ఓం శ్రీ రమాపతయే నమః
ఎవరు నీవు !

ఎవరు నేను !

ఇద్దరం ఒక్కటే !

ఏకైక స్వామి !

ఎవ్వరో నీవు ! నే నెవ్వరో ఈ వూజ !
వూజలో ప్రతి జీవి వూజా కుసుమ మేనె !
జాతి, కాలము, తోట నంగతే లే దిందు !
నర్వ లోకులు ఒకే స్వామి ! లోక స్వామి !

నీ రూపమే కదా శ్రీ రూప మగు నాకు !
శ్రీ రూపమే కదా శ్రీ వేంకట స్వామి !
ఆ బాల్యమైన నా ఆరాధనమే స్వామి !
అను రూపమైన నీ ఆత్మమధువే స్వామి !

122

బైలు దేరింది బస్సు పాపనాశ క్షేత్రానికి !

క్యూ నుంచి ఉద్ధరించబడడం ఒక వేంకటేశ్వర మహాత్మ్యం కాగా - బస్సు బైలుదేరుతూనే ఏదో అద్వితీయ సౌందర్య మహార్ణవంలో పడి, మత్స్యకాంతలా దూసుకు పోవడం మరొక అలౌకిక ఆనందానుభూతి !

అద్భుతావహ చిత్తంతో విద్యుద్దీపాలై వెలిగినై మన శరీరంలోని ప్రతి పులకా, ప్రతి అణువూ - ఆ వైష్ణవ మాయా విభూతిలో !

క్యూలో నిలబడితే, మూడో రోజుకు గాని దొరికేటట్టు లేదు బస్సు.

ఆ సాయంకాలం వెళ్ళకపోతే, మరి ఇక వెళ్ళలేని పరిస్థితి మనది.

నా పలుకుబడీ, నీ శక్తీ - అన్నీ వ్యర్థమై పోయిన తర్వాత - ప్రయారిటీ టిక్కెట్లు దొరికే అవకాశం శూన్యమై పోయిన తార్వాత - శూన్య ముఖాలతో, శూన్య మనస్కులై నిలబడి ఉన్నాం మనం అక్కడ - వచ్చే పోయే బస్సుల్నీ, యాత్రికుల్నీ శూన్యంగా చూస్తూ !

నిస్సహాయత మూర్తి దాల్చిన రెండు ప్రతిమలం మనం.

నోరు పెగలని, కాలు కదలని స్వప్నోద్వేగ స్థితిలో ఉన్నాం మనం అప్పుడు!

ఒకరు ముఖం ఒకరు చూచుకొంటున్నాం ! కనపడడం లేదు అవి స్పష్టంగా – కన్నీటి తెరల వెనుక నుంచి !

ఎవరు – చేయి – నా భుజంపై ?

వెనక్కి తిరిగి చూశాను నేను !

తిరు నామం ! చిరు నవ్వు !

"పాపనాశం వత్తురా ?" అన్న ప్రశ్న !

ఎవరో – ఈ సనాతన తమిళ శతవృద్ధు !

"మాకు రెండు టిక్కెట్లు ఎక్కువ ఉన్నై, రండి ఇదే బస్సు !"

అప్పుడే వచ్చి ఆగిన బస్సులోకి దారితీశాడతడు – ఒక పదిమంది వరకూ కల తన కుటుంబంతో !

ఎంత ముద్దు చేశారు ఆ కుటుంబంలోని స్త్రీలంతా నిన్ను ! ముఖ్యంగా ఆ ఇద్దరు వృద్ధమాతలూ !

మీ దొడ్డమ్మలా ఉన్న ఆమె మరీను !

మనతో మీ దొడ్డమ్మ ఉంటే ఎంత బాగుండును !

ఇంతకూ – ఎవరు వీళ్ళు ?

ఏమిటి ఈ అకారణ కరుణా సుధావృష్టి !

ఈ ప్రశ్నకు జవాబు కేవల కైవల్య సమ్యగానంద బాష్పపయ ఃపారావార పారమ్యమే ! శ్రీ వేంకటేశ్వర మహాత్మ్యమే!

శ్రీ వల్లి అన్నట్టు – పెట్టి పుట్టిన వాళ్ళం మనం.

ఎప్పుడో, ఎవరికో, ప్రతిఫలాపేక్ష లేకుండా చేలిన ఏదో సహాయం – ఇప్పుడు, ఇలా మనకు అవసరానికి తోడ్పడు తున్నదేమో !

పుణ్యం ఒక బేంకునోటు. అది చేయలేని పని అంటూ ఏదీ లేదూ.

అదే అదృష్టం !

అదే దైవం ! భగవంతుడు !

ఎంత వాస్తవం భగవంతుని సాన్నిధ్యం !

శివుణ్ణి, కేశవుణ్ణి, చతుర్ముఖుణ్ణి నేనే అన్న అహంకారం తప్ప మరేదీ లేని నేను - శుద్ధ నిర్గుణ తత్త్వమైన అచల పరిపూర్ణ బ్రహ్మాను ఉన్నదన్నా, లేదన్నా ఒక్కటే అనే నేను - నీతో కలిసి, మహతో మహీయంగా, మహేశ్వరుడనై ఆనందిస్తున్న నేను - ఒక్క క్షణంలో అణోరణీయ పరమాణువు నై పోయాను, ఆ శతవృద్ధు పాదరేణువునై పోయాను ఆ క్షణంలో, ఆ మాయా వరణంలో !

పూర్ణపురుష విశిష్టాద్వైతం, పురుషోత్తమ పూర్ణ ద్వైతం సిద్ధించిన నేను - నీ కోసం ద్వైతంగా, అనంతానంతంగా, శివసరస్వతీ యోగంగా జీవించదలచిన నేను - తుడుచుకొన్నాను కళ్ళు నీ పమిటె చెరగుతో !

ఎక్కడున్నాం మనం ?

పరమ సౌందర్య పారావారంలో !

ఎంత పుణ్యం చేసుకొంటే లభిస్తుంది పరమానుభూతి !

విశ్వ సౌందర్య సౌభాగ్యమంతా ఏకముఖమై, స్వర్ణదీ తరంగ తుషార పరిస్నపితమై, సంజకెంజాయ చీరను కట్టుకొంటూ, అర్ధనగ్నంగా ఆవిష్కృత మయిందిక్కడ -

ఉదయం స్నానాలగది గుమ్మంలో నా ముందు నీవలె !

పోల్చుకొంటున్నాను నేను !

"ఎందుకలా చూస్తారు - కొత్త మనిషిని చూచినట్టు ?"

- సిగ్గుతో కప్పేసుకొన్నావు నీవు ఒళ్ళంతా !

ఎప్పుడూ కొత్తదానవే నీవు నాకు!

నిత్య నూతనం నీ సౌందర్యం - అరుణోదయంవలె, సాయం సంధ్యవలె, వెన్నెల రాత్రి వలె !

క్షణానికో అందం నికసిస్తుంది. రాగం వినిపిస్తుంది. లావణ్యం తరంగిత మవుతుంది. ప్రణయం గుబాళిస్తుంది - నీ తనులత నుంచి, ఈ పర్వత సానువిపిన సీమంతంలో నుంచి వలె !

నవనవోన్మేష నిరంతరం నీ ఆత్మ కమలం.

నీ దర్శనమే విశ్వరూప దర్శనం నాకు. నిన్ను చూడక మరి చూచేదెవర్ని? స్వామిలో కూడా నేను చూచిందెవర్ని ?

ఝుమ్ముమంటూ ముసురుకొంటున్నై తుమ్మెదల గుంపులు - ఏవో నీలంపూల చెట్ల నవమంజరులపై ! వాటి సువాసనలు సరసాలాడుకొంటున్నై రేగిన నీ చికుర శోభలతో !

చెట్లు కావవి ! ఋతుమతులైన ఉర్వశులు ! విశ్వ ప్రేయసులు !

పేర్లు తెలియని రకరకాల, రంగు రంగుల అందాల పూల రాశులు - బస్సులోని దేశ విదేశాల సుందరీ సమనస్వినుల వలె !

ఇరు ప్రక్కలా కీకారణ్యాలు, లోయలు, ఉన్నత గిరి శిఖరాలు, అగాధాలు, వాగులు !

చెందొవ మొగ్గలు, కేందామర తేనె దొన్నెలు, రంభ లాంటి లతా నికుంజాలు, తిలోత్తమల లాంటి నెమళ్ళు, వీణల లాంటి పిట్టలు !

పాడుకొంటూ రివ్వున పోతున్న రెండు బంగారు గువ్వలు వచ్చి పడినై నీ ఒడిలో - బస్సు కిటికీలో నుంచి !

కువకువ లాడిపోయినై అవి - నీ పమిటెలో తమ చిన్నారి ప్రతిబింబాలను చూచుకొని !

ఉద్విగ్నంగా ఉంది ప్రకృతి !

దూసుకు పోతున్నది బస్సు -

బాణంలా కొండశిఖరం మీదికి ! క్షణంలో పిడుగులా పాతాళపు లోతుల్లోకి!

ఎంత వేగం ! ఎంత ఆ వేగం ! ఎన్ని గతుకులు ! ఎన్ని కుదుపులు ! ఎన్ని మెలికలు ! ఎంత ఒరకం ! అనుక్షణం ఎంత ఆందోళన !

ఊగిపోయాం మనం !

తూగు టూయెలలా పోతున్నది బస్సు - కొండ నుంచి కొండకు, తారాపథం నుంచి తారాపథానికి!

స్వర్లోకపు అంచులు తాకుతున్నాం మనం!

ఆకాశగంగా శీతల సుధాశీకరాలు ! కనక కమల పరీమళాలు నందన మందార మధు తుషార సుషమలు !

భవర్లోకం వట్టి బయలు !

భూలోక జ్ఞానమే లేదు మనకు !

పుష్పకంలో విహరిస్తున్నాం మనం ! దివ్య విన్యాసాలు పోతున్నాం మనం! ఓహో – లోకోత్తర మహనీయ మధురానుభూతి!

వైకుంఠపు తోటమాలు లెవరో విద్యుల్లతల్ని తువ్వుకుపోగా, పెకలించి వేయబడ్డ ఎర్రమన్ను అడవి – ఈ సంధ్యారక్త పశ్చిమ దిశా క్షేత్రం !

పడిపోతున్నది బస్సు అంత ఎత్తునుంచీ – కొండవాగులా కాదు, అశనిపిండంలా కాదు, ఉల్కాపాతంలా కాదు, మరెలానూ కాదు –

ఓహో –

వట్టి డ్రైవరు కాదితడు ! మహా విశ్వకేంద్రంలో స్టీరింగు దగ్గర కూర్చున్న పరమ చేతనా ప్రచోదకు డితడు !

ఓహో – చోదన కళా లాఘవం !

ప్రసవించేసింది బస్సు జనాన్ని –

విశ్వంలోని సమస్త నాగులూ వాగులుగా ప్రవహించి వచ్చి, కలిసిన వేయి పడగల ఆదిశేషుడి లాంటి ఒక మహా నిర్జరి ఒడ్డున !

క్షేత్రం – ఇంకా రెండు ఫర్లాంగులు!

123

ఆ రేగిన – ఆ కట్టు – ఆ బొట్టు – ఆ ఒయ్యారం !

ఆ రేగిన జుత్తు, చెరగిన కాటుక, కరిగిన తిలకం !

అచ్చం ఎంకిలా ఉన్నావు కదూ ?

చంకలో తట్టో, కడవో ఒకటి తక్కువ !

ఆ లోపం కూడ తీరింది – పూజా ద్రవ్యాల తట్ట చంకకు రాగానే !

అన్నట్టు – ఎంకి పాత్ర నటించావు కదూ చిన్నప్పుడు ?

ఏదీ, పాడు –

" ఎన్నాళ్లు మనకోలె ఈ సుఖము లంటి "

నిజంగానే కంట తడిపెడుతున్నావేమిటి ?

ఎంకిపాటల కవి నండూరి ఎంత ధున్యుడు !

"నాజూకు లేదురా నండూరి సుబ్బిగా " అంటూ వృద్ధచాందస ప్రభువులు ఎంత ఆక్షేపించినా, ఆధునిక తెలుగు సాహితీ క్షేత్రంలో అతడొక్కడే కవి నా దృష్టిలో.

నాజూకు లేదట !

తెల్ల చక్కెర కేళీల్లాంటి ఎంకి పాటల్లోకంటె, నల్లకంకర రాళ్ళలాంటి పద్యకావ్యాల్లో ఉంది నాజూకు ?

కవి ప్రకృతి

పండితుడు వికృతి.

పండితులు, ప్రవక్తలు, సంఘ పెద్దలు, నైతికాచార్యులు అందరూ, కవి కష్టించి వేసిన రహదారుల్లో పోతూ - కవి చెమటోడ్చి నాటిన తోటల ఫలసాయం అనుభవిస్తూ - పై పెచ్చు అతణ్ణి ప్రతి చిన్న విషయానికీ తిట్టి పోసుకొనే అల్పులు.

ఈ అల్పులకు అసలు కవి అందడు.

హృదయంపై అధికారం ఉన్నవాడు నండూరి. హృద్వీణను ఖంగున మీటగలడతడు - ఏ రాగానికైనా సరే మేళవించి - బసవరాజు అప్పారావు వలె!

శ్లేషలు, సర్కసుఫీట్లు, సమాసాలు, శబ్దబంధాలు, నీతి బోధనలు, నినాదాలు ఆడంబరంగా ప్రదర్శిస్తూ - కేవల పాండిత్య ప్రకర్షకోసం ఉద్గంథాలు వ్రాసే రింగుమాస్టర్లతో మండిపోతున్న తెలుగు సాహితీ క్షేత్రంపై చల్లని చంద్రోదయంలా వెలిశాడతడు!

ఎంకి పాటల నిండా ఉన్నది మానవ మగ్న హృదయం.

హృదయమే రసబ్రహ్మ.

అదే కవిత .

స్థాన విశేష మాత్రంచేత ప్రచార మయేది కవిత కాదు, తైరు !

గుండె భోజనశాల

మెదడు పాఠశాల.

సాహిత్యాది కళలు ఆత్మను పోషించేవి.

పాండిత్యాది విద్యలు, రాజకీయాది వ్యాపారాలు జీవితాన్ని నడిపించేవి.

హృదయ పద్మకళికను వికసింపజేసి, అచ్చటి పద్మాసనను సాక్షాత్కరింప జేసేది కవిత ! దాన్న సాధించిన రసదార్శనికుడు నండూరి !

ఏ పాటో, పద్యమో పాడుకొంటున్నప్పుడు ఆ వ్యక్తి ఏ తద్భావం తానే అయిపోగలిగినపుడే - దాని ఉద్దేశం నెరవేరినట్టు!

రస స్నానం చేసిన ఆత్మే పరమాత్మ.

ఎంకిలా ఉన్నావంటే - ఎంకివే అయిపోయావు నీవు ?

ఎందుకు ఆ కంట తడి ?

నిజంగా -

మనకీ సుఖం ఎన్నాళ్ళు !

ఎంత బాధాకరం ఈ తలంపు !

ఎంత పెద్ద వేదాంతాన్ని అయినా ఇతర్లకు బోధించవచ్చు. తాను స్వయంగా ఎంతటి అపరోక్ష సాక్షాత్కారం పొందిన వాడైనా అయి ఉండవచ్చు. తానే పరమాత్మగా పర్యవసించిన రాజయోగే కావచ్చు. కాని -

శరీరం కలవాడికి, శరీరసుఖం ఎరిగిన వాడికి - అది ఎప్పటికైనా పోక తప్పదన్న భావం మనస్సులో మెరిసినప్పుడెల్లా, చిందాకాశం మేఘావృతం కాక తప్పదు!

అందుకు కారణం అవతలి తీరం గోచరించక పోవడమే ! శరీరం పోతే, దానితో సమస్తమూ పోతూ ఉన్నట్టు కనిపించడమే!

సుఖదుఃఖాలకు అతీతమైన ఆత్మానైతాన్ని మనం సంపాదించి పెట్టుకొన్న దందుకే కదా ?

మన అందం ఆత్మగతం

మన ఆనందం శాశ్వతం

మన ప్రణయం అమృతం.

అక్కరలేదు మనకు కంట తడి.

జల్లుపడ్డ పద్మాల మీది సూర్య కిరణాల వలె - ఎంత సుకుమారంగా నవ్వుతున్నై నీ చూపులు !

124

"మైలపడే దేవుడు మాలిన్యం నుంచి మానవుల్ని ఎలా ఉద్ధరించగలడు?" ఒక వృద్ధ యాత్రికుడంటున్నాడొక యువతితో - మనముందు నడుస్తూ ! ఆమె సిగ్గు పడింది.

'మన దేవుళ్ళందరూ భార్యలు కలవాళ్ళే ! వాళ్ళకు మాత్రం ఈ బాధలు ఉండవా? పర్వాలేదులే !" నవ్వుతూ అన్నాడు ప్రక్కనున్న యువకుడు.

"నీ వొక్కక్కవే అంతటి భగవంతుణ్ణి మైలపరచి,శక్తిహీనుణ్ణి చెయ్యగలిగితే - ఇక అతణ్ణేందుకు ఆరాధించడం ? నిన్నే పూజించవచ్చుగా ?" మరొక జాణ హేళన!

జాలిపడ్డావు నీవు ఆ యువతిని చూచి.

బహిష్టు ఎంత తుంటరి ! సరిగ్గా యాత్రాసమయంలో వస్తుందది !

ఉద్రిక్త మనస్కత కావచ్చు అందుకు కారణం.

" భగవంతుడు కేమీ పర్వాలేదు. కాని - క్షేత్రంలో ఉండేది నియంత్రిత మంత్రశక్తి కదా ! దానికి కొన్ని విధి నిషేధాలుండవా?"

ఈ మాటలు నీవు నాతోనే అన్నా - నీ వంకే చూశారు ఆ గుంపంతా !

మాలిన్యాలు, మలిన వాసనలు, దురితాలు, దురాలోచనలు వాతావరణాన్ని కలుషితం చేస్తై. మనం మామూలుగా దైనందిన జీవితంలో పాటించేపాటి శౌచ నియమాల నైనా క్షేత్రాలలోపాటించకపోతే - అది అధర్మమే కదా?

ఏ మాలిన్య హేతువుచే ఏ యంత్రం వికటిస్తుందో, ఏ మంత్రం బెడిసికొడుతుందో

కొంచెం దూరంగా ఉండడమే మంచి దన్న నీ సలహాను ఆమోదించా రందరూ !

దుర్గమారణ్య పర్యాలింగిత పర్వత వలయం మధ్య - ఇంకా క్రిందికి మెట్లు !

ఇంతవరకు బాహ్యవీణ - ఇక అంతర్వీణ కావచ్చు !

నా రాగవీణవు నీవు !

లోకంలోని ప్రకృతి సౌందర్యం అంతా నీ గాన కచేరీతో వసంతోత్సవం చేసుకొంటున్నదో !

కొండమ్మ పెళ్ళికో, గంగమ్మ సమర్తకో వచ్చిన త్రిలోక సుందరులంతా నీ అమృత గానంలో పడి, వెళ్ళిపోవడమే మరిచిపోయి నదీ వృక్షలతా శకుంతాది సుందర మూర్తులై, ఇక్కడే శాశ్వతంగా ఉండిపోయారో ఏమో !

"మనం కూడ ఇక్కడే ఉండిపోతే !" ఇద్దరం ఒకేసారి అన్నాం కూడా ఈ మాట - పైకి !

పళ్ళికిలించి, దూకిందొక బాలెంత కోతి, నీ చంకలోని తట్ట పైకి !

ఇక్కడి కోతులు దేవాంతకులు !

కోతినుంచే మనిషి పుట్టివుంటాడన్నయోచన - విజ్ఞాని డార్వినుకు - బహుశా, ఇక్కడి కోతుల్ని చూచిన తర్వాతనే కలిగి ఉండవచ్చు !

దారిపొడుగునా కోతులు !

మురమురాలు, బఠానీలు సెనగలు !

బండలు, వాటికి చక్కిలిగింతలు పెడుతున్న చిరువాగులు - వాటి గాజుల గలగలలు, కిలకిలలు, జలజలలు !

చుట్టూ గుబాళిస్తున్న సౌందర్యాన్నిచూచుకొంటూ, మధువనంలో చేరిన వానర సేనవలె చెట్లలో ఉన్మత్తలై సంచరిస్తున్న కోతులకు బెదురుతూ, బండలను దాటుతూ, వాగులలో కాళ్ళు తడుపుకొంటూ, మోకాళ్ళ ఎగువకు ఎగదోసిన ఎర్రపట్టు జరీచీరతో, ఆనందోత్సాహంలో వెలిగిపోతున్న నీవు - సాక్షాత్తు లక్ష్మీదేవిలా ఉన్నావు - వసంత సంధ్యారాగ రంజితవై !

యాత్రికులంతా నిన్ను ఆరాధిస్తున్నారు - కళ్ళల్లో కర్పూర దీపాలు వెలిగించుకొని !

వాగులు దాటినప్పుడెల్లా, నీవు కాళ్ళతో నీళ్ళు ఎగజిమ్మినప్పుడెల్లా - అలక్త మంజిష్ఠం అవుతూ ఉన్నవి సంధ్యాకాంత చూపులు !

అదిగో ప్రణవ నాదం !

అదిగో పాపనాశ జలపాతం !

అపర గంగా భవాని సాక్షాత్కారం !

అతిలోక సౌందర్యానికి పరమ క్షేత్రం !

జలధార క్రింద అంబు కణాల్లా యాత్రిక జనం !

దర్శన మాత్రం చేతనే సమస్త పాపాలూ పోతై. ఇక స్పర్శనమే లభిస్తే ఎంత సుకృతం !

ఈ యాత్రికులంతా ఎంత అదృష్టవంతులో !

కేవలం నగ్న సౌందర్యంలో, నగ్న పావిత్ర్యంలో, నగ్నా నందంలో మునిగి తేలుతున్న దివ్యాత్మలు వీళ్ళు !

ఎలాంటి పాప పంకిలమైనా పోతుంది ఈ క్షేత్ర స్పర్శకు ! ఏ పంకిలమూ లేని మనవంటి వాళ్ళకు అమృత పదవే ఈ జలస్పర్శ !

ఆకాశం ఎత్తునుంచి, శివుని జటాజూటం నుంచి వలె, క్రిందికి దూకుతున్న ఆ అమృత గంగలో జలక మాడడం - ఓహో, ఎంత బాగుంది !

సమస్త విశ్వమూ ఒక అంజలి - ఈ అమృత ప్రాసాద నిత్యధార క్రింద!

కొండమ్మ చెల్లెలు గంగమ్మ !

మహాశక్తులు ఇద్దరూ !

సర్వ శక్తి నాథుడు మహేశ్వరుడు !

విశ్వరూపిణి - విశ్వజనని - కొండమ్మ ! ఆమె నుంచి అభివ్యక్తమవుతున్న విశ్వ జీవనధార గంగమ్మ ! ఈమె నుంచి పరివ్యాప్తమవుతున్న విశ్వకాంతి ధార సరస్వతి !

ఈ విశ్వేశ్వర త్రిశక్తీ రూప పరమేశ్వరిని ఒడిలో, తలలో, ఎదలో చాలించి, లాలించి, పాలిస్తూ - పరమేశ్వరుడు చేస్తున్న సుందర లీలా తాండవం - ఎంత కళా విభూతిని ప్రదర్శిస్తున్న దిక్కడ !

క్షేత్రలక్ష్మి గంగకు దీపం వెలిగించి, కొబ్బరికాయ కొట్టి, హారతి ఇచ్చి, కుంకుమ ధరించి, ప్రసాదం స్వీకరించి, అంజటి ఘటించాం మనం తాదాత్మ్యంతో –

సృష్టిలో గల విష వహ్ని శిఖల నెల్ల
తానె తాల్చియు, అమృత శీతలుడు శివుడు !
ఏత దద్భుత లీలకు హేతు వీవు !
శివ శిఖాలంబినీ ! నమస్కృతులు నీకు !

125

బయలుదేరుదమా ?
ప్రణయ కళా రమా !

అరుణోదయ నర్తన శివ
చరణ కమల మధువు గ్రోలి,
తాండవ నటరాజ శిఖా
తరుణేందు కళను గోరి !

పాపనాశమును గొలిచి
పైనము సాగించెదమా ?
పరిధి లేని విశ్వమునకు
పరమకేంద్ర మవుదామా ?

ఎచ్చట వెన్నెల కలదో,
ఎచ్చట చీకటె లేదో,
ఎచ్చట మన మిద్దరమే
ముచ్చట ముద్దో – అచటికి !

ప్రతి పువ్వున వాసించుచు,
ప్రతి పెదవిని వికసించుచు,

ప్రతి గుండెను మ్రోయించుచు,
ప్రతి పాటయు మనమే యై !

అంతులేని అభిరతితో,
అమృత రాగ భోగముతో,
కామ కళా పరమాత్మను
కలకాలము పాలింతమ !

నిర్గుణ పరమాత్మ మనకెందుకు ?

ప్రణయ శృంగార కామ కళా త్రిశక్తీ రూప రాగ రస రమణీయ మూర్తి ఈ విశ్వం !

ఈ విశ్వమే మనం
నీవు - నేను
ఒకే ఇద్దరం !
ఒకే రాగం !
ఒకే తానం !
ఒకే పల్లవి !
ఒక అమృత మధువు !

మధు వయస్సుల నింద, మధు మనస్సుల నింద,
మధు జీవి తానంద మధుర పాత్రల నింద,
రాగ మధువై నదా రమియింతమే, చెలీ !
నిత్య మధు లోకాలు నిర్మింతమే, చెలీ !

ధర్మం కోసం పోరాటం



బోయి భీమన్న

మొదటి ముద్రణ : 1968
రెండవ ముద్రణ : 1969
మూడవ ముద్రణ : 1970
నాల్గవ ముద్రణ : 1992

ముఖ పత్రం : తోపారపు గంగాధర్

హక్కులు : రచయితవి

మూల్యం : రూ. 25/-

ప్రతులకు :

1. **విశాలాంధ్ర బుక్ హౌస్**
   బ్యాంక్ స్ట్రీట్,
   అబిడ్స్, హైదరాబాద్ - 500 001.

2. **భీమన్న సాహితీ నిధి**
   ఐ.సి. 85, ఇర్రం మంజిల్ కాలనీ,
   హైదరాబాద్ - 500 482.

ముద్రణ : **ప్లానోగ్రాఫర్స్,** అబిడ్స్, హైద్రాబాద్ - 500 001



కృతి భర్త



ధర్మం కోసం పోరాటం

అంకితం

డాక్టరు అంబేద్కరుకు

జయ జయ జయ అంబేద్కర !
జయ దళిత జన స్వరా !
జయ మానవ మందారా !
జయ భారత భాస్కరా !

నవ భారత సంవిధాన
ధర్మ పథక నిర్మాతా !
భువి సమస్త పీడిత జన
దుఃఖశాంతి తథాగతా !

వేదాలను శోధించి
వేదాంతము నధిగమించి
మనిషి మనిషిగా బ్రతుకుటె
మహిత మన్న మహాశయా !

అస్పృశ్యత రూపు మాపి,
అగ్ర అంత్య భేద ముడిపి,
నిష్కుల భారత జాతికి
నీడయైన బోధి ప్రియ !

జాతీయ సమైక్యానికి
మతాతీత రాజ్యానికి
ప్రజాస్వామ్య ధర్మానికి
శరణమైన సంఘర్షీ !

జగతికి స్వేచ్ఛా సమతా
సౌభ్రాత్రములను కూర్పగ
జన్మమెల్ల పోరాడిన
జనగణ విప్లవ యోద్ధా !

అంధకారమున పుట్టి
అవనికి దీపము పెట్టి
పంకమును మధించి మహికి
పరిమళ మొసగిన సూరీ !

రాళ్ళకు జీవము పోసి,
మ్రోళ్ళను చిగురింప జేసి,
మట్టి నుండి మానవులను
మలిచిన కారణ జన్మా !



కృతి కర్త

భీమ సేన

1967లో కర్నూలులో సంజీవయ్య గారి ఓటమిని స్వయంగా చూసిన తర్వాత, నేను ఒక నెలరోజులపాటు మరికొన్ని జిల్లాలలో పర్యటించి వచ్చి, హైదరాబాదులో కూర్చొని, ఒక పదిహేను రోజులలో వ్రాసి ముగించిన జీవగ్రంధం.ఈ ధర్మం కోసం పోరాటం. గుండె పగిలే దృశ్యాలను చూచినప్పటి మనస్సు రగిలే వేదనాపూరిత భావాలను ఇందులో పొందు పరచాను. నా వేదనను, ఉపశమన మార్గాన్ని ప్రజలందరితోను పంచుకోవడం కోసం వెనువెంటనే ముద్రించాను, ప్రకటించాను.

Educate అన్న అంబేద్కరు అన్నమాటకు అర్థం ప్రజలకు అక్షరాలు నేర్పమని కాదు. Awareness అంటే అవగాహన కలిగించ మని.

మన మెవరం? ఎందుకిలా బాధ పడుతున్నాం? ఈ బాధలను తొలగించుకొనే మార్గం ఏమిటి? ఈ మూడు ప్రశ్నలకు జవాబులను ప్రజలకు వివరించవలసి ఉంది. అలా వివరించడానికే అంబేద్కరు అస్పృశ్యులెవరు? అనే గ్రంథాన్ని వ్రాశాడు. ఈ అస్పృశ్య లనబడే వాళ్లంతా Broken People అయి ఉంటా రన్నా డాయన. ఈ Broken అనే ఇంగ్లీషు మాటకే దళిత అనే సంస్కృత పదాన్ని వాడుతున్నాం ఇప్పుడు. అంబేడ్కరుది చారిత్రక దృక్పథం. వాస్తవాన్ని పరిశోధన ద్వారా తెలుసుకొనేది.

నాది చిన్నప్పటినుంచీ కూడ పౌరాణిక దృక్పథం. వేదాలు, కావ్యాలు, పురాణాలు వగైరాలతో కూడిన సాహిత్యాన్ని పరిశోధించి మన మెవరమో తెలుసుకొన్న జ్ఞానం – మనం దళితులం కావచ్చు, కాకపోవచ్చు. కాని భారత జాతీయుల మనడం మాత్రం తథ్యం. వట్టి భారత జాతీయులం మాత్రమే కాదు. భారతీయత (Indianism) అనే దానికి, భారతీయ సంస్కృతికి, భారతీయ సాహిత్యానికి, భారతీయ వేదాంత దర్శనానికి కూడ మనమే మూల పురుషులం, మూల ఋషులం. ఇది మన చరిత్రను గురించిన నా పరిశోధనా ఫలితం.

మనం అంటే మాలమాదిగలం.

''మాలమాదిగ యువకుల్లారా ఏకం కండి!'' అనే నినాదం ఈ గ్రంథానికి కేంద్ర బిందువు. ఎందుకు ఏకం కావాలి? ఎలా ఏకం కావాలి? శతాధిక కులాలతో విచ్ఛిన్నమైపోయి ఉన్న భారత జాతిని ఎలా సంఘటిత పరచాలి? అనే విషయాలు ఈ కేంద్ర బిందువు చుట్టూ అల్లుకొని వున్నై.

అంటే Educate అని అంబేడ్కరు ఇచ్చిన పిలుపును నేను అంతకు ముందేనాడో అందుకొని, నా రచనల ద్వారా ఆచరిస్తున్నా ననుకోవచ్చు. నిజంగా చెయ్యవలసిందిది. ఈ ధర్మంకోసం పోరాటాన్ని ఎంతమంది చదివి అవగాహన చేసుకొన్నారో తెలియదు. అనేక వేల ప్రతులు మాత్రం ప్రజల చేతుల్లోకి వెళ్లాయి. ప్రజలు మేల్కంటున్నా రనేది కూడ వాస్తవంగా కనిపిస్తున్నదే. నా కృషి వృధా కాలేదు. సంతోషం.

దీనిని ''దళిత్ కైపిడి'' అనే పేరుతో కన్నడంలోకి అనువదించుకొన్నారు.

''నేను హరిజనుల గురించి మాట్లాడవలసి వచ్చినప్పుడు, హరిజనుల కోసం ఏదైనా మంచి చెయ్యవలసి వచ్చినప్పుడు కొంచెం భయపడేవాణ్ని – స్వకుల పక్షపాతి అంటారేమోనని. ఈ ధర్మం కోసం పోరాటం'' చదివిన తర్వాత ఇప్పుడు నాకు కొండంత ధైర్యం వచ్చింది. ఈ దీనులకు నేనే చెయ్యకపోతే మరింక ఎవళ్లు చేస్తారు? అనే ఆలోచన కలిగింది. ఈ గ్రంథాన్ని ఇప్పటికి నాలుగుసార్లు చదివాను. ఐదవసారి చదువుతున్నాను. దీనిని ఇంగ్లీషులోకి, హిందీలోకి అనువదింపజేస్తాను'' అన్నారు దామోదరం సంజీవయ్యగారు – తెనాలిలో జరిగిన ఒక సెమినారులో మాట్లాడుతూ.

అంతకు కొన్ని రోజుల ముందే ఈ గ్రంథం ఆయన అధ్యక్షత క్రిందే ఆవిష్కరించబడింది. ఆచార్య దివాకర్ల వేంకటావధానిగారు అద్భుతమైన ఉపన్యాసం చేశారు – ఆ ఆవిష్కరణ సభలో. ఈ సంగతులన్నీ శ్రీమతి హైమవతి వ్రాసిన ''పాలేరు నుంచి పద్మశ్రీ వరకు బోయి భీమన్న'' అనే నా జీవితచరిత్రలో వివరించబడి వున్నవి.

భారతీయ సమాజాన్ని, ముఖ్యంగా ఈ దేశంలో మెజారిటీ ప్రజలకు చెందిన హైందవ సమాజాన్ని, సంస్కరించి ఒక బలమైన జాతిగా తీర్చి దిద్దడానికి

ఈ గ్రంథంలో ఒక విశిష్టమైన ప్రణాళికను ఇచ్చాను. దానిని అమలుపరచడం కోసం ఒక పటిష్ఠమైన యువజన సంస్థకు కూడా రూపకల్పన చేశాను. అదే భీమసేన. దానిని నేను వాస్తవంగా 1968లో స్వయంగా నెలకొల్పాను. ఈ గ్రంథం వ్రాసే నాటికి ఆ సంస్థ పని చేస్తూ వుంది.

డా. భీమ్‌రావ్ అంబేడ్కర్ పేరు మీద నాచే నెలకొల్పబడిన సంస్థ భీమసేన. ఈనాటి దళిత ఉద్యమాలు ఈ సేనను పునరుజ్జీవింప చేసి నడపవచ్చు.

ఇప్పుడిది నాల్గవ ముద్రణ. మొదటి మూడు ముద్రణలూ తొలి ముద్రణ తర్వాత మూడేళ్లలోనే జరిగాయి. మూడవ ముద్రణ 1970లో జరిగింది. ఆ తర్వాత రెండేళ్లలోనే ప్రతులన్నీ అయిపోయినై. 1972-92 మధ్యలో 20 సంవత్సరాలపాటు ఎప్పటి కప్పుడు కొత్త రచనలను ప్రకటించుకోవడంతోనే కాలం గడిచిపోతున్నది. పునర్ముద్రణలకు అవకాశం చిక్కకుండా ఉంటున్నది. ఇప్పుడు దీనిని ప్రజల ముందుకు తెస్తున్నాను. దీనిని కావాలంటున్న వారి సంఖ్య అధికాధికంగా వుంది.

ఈ నాలుగవ ముద్రణ విషయంలో నాతో సహకరించిన వారందరికీ, ముఖ్యంగా శ్రీ పి. కమలేశ్వరరావు ఐ.ఏ.ఎస్. గారికీ, శ్రీ ఎమ్.ఎన్. భూషిగారికి, శ్రీ గనుమల జ్ఞానేశ్వర్ గారికీ, శ్రీ బి. వేదయ్యగారికీ, ప్లానోగ్రాఫర్స్ ప్రెస్ ప్రొప్రయిటర్స్ పి. సుబ్బయ్య, మురళి గారలకు నేను కృతజ్ఞతలు చెప్పుకొంటున్నాను.

ఈ గ్రంథాన్ని ప్రధానంగా హిందీలోకీ, ఇంగ్లీషులోకీ అనువదింప చేస్తానని ప్రకటించిన సంజీవయ్యగారి మాట కార్యరూపం ధరించనే లేదు. అయితే, ఆ తర్వాత ఇంగ్లీషులోకి అనువదించడానికి కొన్ని ప్రయత్నాలు జరిగాయి. అందులో మొట్టమొదటగా ప్రయత్నించిన వారు శ్రీ కె.ఎస్.ఆర్. మూర్తి, ఐ.ఎ.ఎస్. గారు. ఆ తరువాత కొంత కాలానికి శ్రీ కె. మాధవ రావు ఐ.ఎ.ఎస్. గారు అనువదించారు కాని ఫైనలైజ్ చెయ్యలేదు. వారున్న పదవుల కార్యభారాలు అలాంటివి. ఈ గ్రంథం ప్రధానంగా హిందీలోకి అనువదించబడాలి. అది భాషా సాహిత్యాల పరంగా వ్యుత్పన్నులైన యువకులు దళిత వర్గాల నుంచి ఉద్భవించి నప్పుడు మాత్రమే సాధ్యం కాగలదేమో!

నేను తొలిముద్రణకు, తరువాత రెండు ముద్రణలకూ వ్రాసిన పీఠికల నుంచి కొన్ని వాక్యాలను క్రింద ఇస్తున్నాను.

మొదటి ముద్రణ పీఠిక నుంచి

బహుజన హితాయ !

బహుజన సుఖాయ !

భారతదేశంలోని హరిజన సమస్యను అమెరికాలోని నీగ్రో సమస్యతో పోల్చడం ఈ రోజుల్లో పరిపాటి అయింది. అది సమంజసం కాదు. రెండు సమస్యలకూ పోలిక లేదు.

అమెరికాలోని నీగ్రో సమస్య నల్ల తెల్లజాతుల మధ్య సమస్య.

ఇండియాలోని హరిజన సమస్య తాతలనాటి వెలి సమస్య. వెలికి లక్ష కారణాలుండ వచ్చు. రంగుకు కాని, జాతికి కాని ఇందులో ప్రమేయం లేదు. హరిజనులు, తదితర స్పృశ్య కులాలవారు అందరూ ఒకే రంగు, ఒకే జాతి.

వేద కాలంలో – అంటే ఋషుల కాలంలో కులభేదాలు లేవు. అసలు కులాలే లేవు. ఆనాడు ప్రధానంగా గణించబడింది ప్రతిభ ఒక్కటే.

ఆనాడు ఎక్కడ, ఎవరికి, ఎలా పుట్టినవాడైనా – ప్రతిభావంతుడైతే, మానవాగ్రణి గానే గౌరవించబడేవాడు. మహర్షిగా, మహా పురుషుడుగా, పురుషోత్తముడుగా సన్మానింపబడేవాడు. విద్యకే ఆనాడు పట్టాభిషేకం, శక్తికే ఆనాడు పూజ.

శ్రీరామ ధర్మరాజాది రాజుల, వసిష్ఠ వ్యాసాది మహర్షుల వృత్తాంతాలను పరిశీలించి చూస్తే – ఈ సత్యం వెల్లడి అవుతుంది.

భారతదేశం మీదికి విదేశీ దండయాత్రలు మొదలై, పవిత్ర వేద మతస్థులు 'హిందూ' వంటి అప్రాచ్య నామంతో పిలువబడడం ప్రారంభమై విదేశీ యజమానుల బూట్లు తుడవడంలో పోటీపడ్డ స్వదేశీ బానిసలు తమలో తాము అంతస్తులు సృష్టించుకొని, వర్ణ వ్యవస్థ కరడుకట్టిన తర్వాతే – వర్ణ సాంకర్యానికి అవకాశం కలిగింది. వర్ణ సంకరులు వెలి వేయబడడం జరిగింది.

నాటి వర్ణాలే నేటి కులాలుగద? వర్ణాలే లేకపోతే వర్ణ సాంకర్యం ఎక్కడుండేది?

బానిసకు అహంభావం ఎక్కువ. కులం తక్కువ వాడిననే కాంప్లెక్సు పెరిగే కొలదీ గొప్పవాడి ననిపించుకోవా లనే తాపత్రయం పెరుగుతుంది. పతిత అయిన స్త్రీ పట్ల పతివ్రత కుండే ఉదారభావం వ్యభిచారిణి కుండదు. అందుకు కారణం కాంప్లెక్సే!

కారణం ఏదైతేనేం – భారతజాతికి హిందూ నామం స్థిరమై, కులవ్యవస్థ భారతీయత గుండెలమీద కుంపటిలా దాపురించి, అమాయకులైన ఒక వర్గం ప్రజలకు వెలి (అస్పృశ్యత) అంటగట్టబడింది. సరే. అయితే – అది ఎంతకాలం? ఈ చట్టానికి సవరణ లేదా? భారత రాజ్యాంగం కంటె మనుస్మృతి గొప్పదా?

తాతల నాటి వెలిని, అంటరానితనాన్ని ఆర్థిక స్వప్రయోజనాలకు వాడుకొన్నారు – బానిస చట్టానికి మత నైతికత కల్పించారు – ఆ తర్వాత పురోహితులూ, వారి చేతిలో కీలు బమ్మలైన పరిపాలకులూ! అందుకే – ఆత్మతేజం ఆరిపోయి, జీవధాతువు ఎండిపోయి, తాము మనుషులమే అన్న జ్ఞానస్పర్శను కోల్పోయారు హరిజనులు. తమ వారైన ఒక వర్గం ప్రజల్ని ఇంతగా జీవచ్ఛవాలను చేయగల్గిన జాతి – మనిషిని కాలదన్ని, పశువును పూజించే జాతి – ప్రపంచంలో ఒక హిందూ జాతి తప్ప మరొకటి లేదీనాడు.

అమెరికాలోని నీగ్రో సమస్య మొన్న మొన్నటిదే అయినా త్వరలోనే నీగ్రోలు మేల్కన గలిగారు. బానిసత్వంపై తిరగబడగల్గారు. భారతదేశంలోని హరిజన (చండాల) సమస్య వేల సంవత్సరాల నాటి దైనా, నేటికీ ఈ అంటరానివాళ్లు తలెత్తుకోలేక పోతున్నారు. వీళ్ళ జీవశక్తి ఎంతగా నాశనం చేయబడిందో దీనివల్ల మన కర్థ మవుతుంది.

ఈ జీవచ్ఛవాలకు ఆత్మచైతన్య శక్తిని కలిగించి, మానవ సహజ ప్రవృత్తిని మేల్కల్పడమే ఈ పోరాటాన్ని ప్రకటించడంలోని నా ఉద్దేశ్యం. చదువుకొని, మాలమాదిగ పేటల నుంచి పారిపోయి, పట్టణాలలో దాక్కొంటున్న పిరికి వాళ్ళకు కాదీ ఉద్బోధ. ఇంకా ఆ పేటలనే పట్టుకొని వ్రేలాడుతున్న సనాతన చండాల జనం ప్రగతి పథంలో పురోగమించడం కోసం ఇది.

''కృణ్వంతో విశ్వమార్యం'' అన్న ఋగ్వేద నినాదంలోని ''ఆర్య'' మతం నాది. ఆర్య శబ్దం జాతిపరమైన శబ్దం కాదిక్కడ. అదొక జీవిత విధానం. ధర్మ,

అర్థ, కామ మోక్ష – ఈ నాలుగూ పురుషార్థాలు. మానవుడు మానవుడుగా సంపూర్ణ జీవితాన్ని అనుభవించి, పూర్ణ పురుషుడై భగవత్సముడు కావడానికి ఈ చతుర్విధ పురుషార్థాలూ ప్రతిపాదింపబడినై. ప్రతి మనిషీ తనకు స్వభావసిద్ధమైన గుణాలను అనుసరించి, మానవ ధర్మ పరిధిలో బ్రతుకుతూ, అర్థ కామాలను అనుభవిస్తూ పెరిగి, ముముక్షువై, తుదకు మోక్షం పొందుతాడు. ఆర్య జీవన విధాన ప్రణాళిక ఇదీ. ఏ మానవుడి జీవిత వికాసానికైనా, జీవిత సాఫల్యానికైనా ఇదే పద్ధతి. కులంతో దీనికి సంబంధం లేదు.

కుల మత వర్ణ వర్గ విభేద రహితమైన ఆర్య భారత జాతి ఆవిర్భవించాలనేదే నా ఉద్యమం.

కుల వ్యవస్థను నిర్మూలించా లని అందరూ అంటున్నారు. కాంగ్రెస్, సోషలిస్టు, కమ్యూనిస్టు పార్టీలన్నీ అదే చెపుతున్నై. కాని అది ఎలా జరగాలో ఎవరూ చెప్పటం లేదు. నేను చెపుతున్నాను. చిత్తశుద్ధి కల ప్రగతి కాముకులంతా దీన్ని పరిశీలిస్తారని విశ్వసిస్తున్నాను.

హిందూమతం, కులవ్యవస్థ అనే పదాలు నేడు పర్యాయ పదాలుగా తయారైనై. పుట్టుకతోనే ఒక మనిషి ఒక వృత్తికి చెందడం ప్రకృతి విరుద్ధం. ధర్మ విరుద్ధం. గుణ కర్మలను బట్టి వర్గ విభజన ఉండవచ్చు. గుణకర్మలు స్థిరమైనవి కావు. నిత్య చైతన్య శీలాలవి. దొంగ అయిన వాల్మీకి మహాకవి వాల్మీకి అయినాడు. స్త్రీ లోలుడైన వేమన మహాయోగి వేమన అయినాడు. శూద్రుడైన వెంకటరత్నం నాయుడు బ్రహ్మర్షి అయినాడు. అదీ ఆర్య జీవిత విధానం. అదీ ఆర్య మతం.

హిందూ కులవ్యవస్థను రద్దుచేసి, దాని స్థానే ఆర్యమతాన్ని పునరుద్ధరించడానికి ఈ మధ్య రెండు ఉద్యమాలు బైలుదేరినై. అవి రెండూ విఫలమైనై. బ్రహ్మ సమాజం ఉన్న జందాలు తీసివేయమన్నది. ఆర్య సమాజం లేని జందాలను వేసుకోమన్నది. మనిషి కంటె జందానికి ప్రాధాన్యం ఇవ్వడం వల్లనే అవి విఫలమైనై. ఈ సమస్య పరిష్కారాన్ని క్రింది నుంచి, మాలమాదిగ పేటల నుంచి ప్రారంభించమంటున్నా నందుకే.

ఈ రచనలోను, ఈ నా ప్రణాళికలోను నేను కొంత తీవ్రత కనబరిచాననీ, అతిగా పోయా ననీ కొందరు ఉద్దేశ పడవచ్చు. రాజా రామ్‌మోహనరాయ్,

దయానంద సరస్వతి, వివేకానంద, వేమన యోగి, వీరేశలింగం పంతులు, బ్రహ్మంగారు. పితాపురం మహారాజా వంటి వారితోను – గాంధీ, అంబేడ్కరు, జగజ్జీవనరాం వంటి వారితోను మూర్తి, కూర్మయ్య, సంజీవయ్య వంటి వారితోను – మంగిపూడి వెంకటశర్మ, భాగ్యరెడ్డి వర్మ, కుసుమ ధర్మన్న, కవిరాజు, శ్రీ శ్రీ, జాషువా వంటి వారితోను – రచనలలో కాని, కృషిలో కాని పోల్చి చూస్తే – ఆ మహా సముద్రాలలో నేనొక అల కూడా అవుతానో, లేదో! అహంకార రహితంగా, ఆత్మమాత్ర పరిశుద్ధంగా, కేవల మానవ దృష్టితో ఈ నా రచనను, ప్రణాళికను పరిశీలించవలసిందిగా సహృదయుల్ని కోరుతున్నాను. నేను విశ్వమానవతావాదిని, విశ్వార్య వైదికుణ్ణి, సత్యవాదిని, ధర్మైక వర్తనుణ్ణి, అపార్థం చేసుకోకండి, ఆలోచించడం మొదలు పెట్టండి.

ఈ దేశంలో హరిజనులు ఒక బలమైన వర్గం. వారి ఉద్దేశాలను ప్రయోజనాలను, యోగ క్షేమాలను ఉపేక్షించటం విజ్ఞత కాదు. ఈ సత్యాన్ని పూర్తిగా మనసులో ఉంచుకొని, నిష్కల్మష హృదయంతో, సానుభూతితో ఈ గ్రంథ పఠనకు ఉపక్రమించవలసిందిగా భారత యువకుల్ని కోరుతున్నాను.

వేదాలు నాలుగే అయినా, పంచమ వేదంగా మహాభారతం ఎక్కువ ప్రాధాన్యం పొందింది. అలాగే – వర్ణాలు నాలుగే అయినా, పంచమ వర్ణం ఎక్కువ ప్రాబల్యాన్ని సంతరించుకొన్నది. ఈ సత్యాన్ని గుర్తించి, వర్ణాంతర వివాహాల ద్వారా వర్ణ (కుల) వ్యవస్థను నిర్మూలించి, భారతజాతిని ఏకజాతిగా తీర్చిదిద్దకపోతే – ప్రపంచ జాతుల మధ్య దానికి భవిష్యత్తు లేదు.

ఆహార విహారాదులు వ్యక్తిగతమైన స్వభావాన్ని బట్టీ, అభిరుచిని బట్టీ, ఆరోగ్య పరిస్థితిని బట్టీ ఉంటై. ఒకరి ఆహార విహారాల జోలికి మరొకరు పోవడం ధర్మం కాదు. ఈ విషయంలో మూఢాచారాలను, సెంటిమెంటును వదులుకోక తప్పదు. వేదకాలం నాడు ఏమి జరిగిం దనేది ఇప్పుడు అప్రస్తుతం. అప్పటికేది అవసరమో అది ఆనాడు జరిగి ఉంటుంది. ఈనాడు మనకేది అవసరమో దాన్ని మనం ఇప్పుడు అనుసరించవలసి ఉంది. వ్యక్తిగత ఇష్టానిష్టాలను రాజకీయ సమస్యలుగా తయారు చెయ్యకూడదు. కాలానుగుణంగా మారని పాతకాలపు పీఠాలకు నేటి కాలపు మానవ జీవితాలను శాసించే శక్తి లేదు. దురభిమానాలు అభ్యుదయ కరాలు కావు.

యుగపురుషుడు, దళిత జనోద్ధారకుడు, బౌద్ధమత మహాయానంలో నాగార్జునుని తర్వాత అవతరించిన అపర బుద్ధుడు, మానవతా సమతా ధర్మ ప్రవర్తకుడు అయిన డాక్టరు అంబేడ్కరుకు ఈ గ్రంథాన్ని అంకితం ఇస్తున్నాను. ఇందుకు ఎంతో ఆనంద పడుతున్నాను.

రెండవ ముద్రణ పీఠిక నుంచి:

చదువుకొని, చిన్న చిన్న ఉద్యోగాలైనా చేసుకొంటున్న యువకులు హరిజనులలో లేకపోలేదు. అట్టి యువకులు ఒక్కొక్కరు తమ జాతి ఋణం తీర్చుకోవడం కోసం ఒక్క ఆరు రూపాయలు ఖర్చు పెట్టడానికి సిద్ధపడితే గ్రామానికి రెండు ప్రతులు అనే నా కోరిక నెరవేరగలదు. అట్టి ప్రతి యువకుడూ – జన్మకు ఒక్కసారి – రెండు పుస్తకాలు కొని, తన గ్రామంలోని రెండు మాల మాదిగ పేటలకు బహూకరించగల్గితే చాలు. మాల మాదిగలు సమైక్యం కావడం అనే ప్రథమ లక్ష్యం అచిరకాలంలోనే సిద్ధించగలదు.

ప్రతి ఇంటా ఒక ''ధర్మం కోసం పోరాటం'' గ్రంథం ఉండాలనేది నా ఆశ. ఎక్కడైనా ధన సహాయం లభిస్తే – లక్షల కొలది ప్రతులు ముద్రించి, బైబిలు గ్రంథాలవలె ఇంటింటికీ ఉచితంగా పంచిపెట్టాలని కూడ ఉంది నాకు. ఉద్యోగులూ, నాయకులూ తలచుకొంటే – గ్రామానికి రెండు పుస్తకాలనైనా అందజేయవచ్చు. అదంత కష్టమైన పనేమీ కాదు.

ముద్రించిన గ్రంథాలను మార్కెట్టులో పెట్టే అలవాటు నాకు లేదు. నా గ్రంథాలను కొని చదివే అలవాటు ప్రజలకు లేదు. నాకూ – ప్రజలకూ మధ్య కులం ఒక బ్రహ్మరాక్షసిలా నిలబడి ఉంది. కుల నిర్మూలన జరిగితే తప్ప, నా గ్రంథాలు చదివి ఆనందించే అవకాశం ప్రజలకు ఉండ దనవచ్చు. అందుకే కుల నిర్మూలన జరగక తప్పదు.

ధర్మం అనేది దేశ కాల పాత్రల గుండా, భూత వర్తమాన కాలాల ద్వారా, అనాది నుంచి అనంతత్వంలోకి ప్రవహించిపోతూ ఉండే ఒక సమాజ చైతన్యధార. ఒక నిత్య నిరంతర ప్రవాహం. ఈ ప్రవాహానికి ఏవో అడ్డుకట్టలు కట్టి, తమ సొంత పాలాలను సాగు చేసుకోడానికి బలవంతులైన స్వార్థపరులు నిత్యం ప్రయత్నిస్తూనే ఉంటారు. అట్టి వాళ్ళ ప్రయత్నాలను నిరోధిస్తూ, అట్టి అడ్డుకట్టలను తీసి పారవేస్తూ

– క్రింది వర్గాల ప్రజలు ఎల్లప్పుడూ అప్రమత్తులుగా వుండవలసి వుంది. అట్టి నిరంతర జాగృతే ధర్మం కోసం పోరాటం.

మూడవ ముద్రణ పీఠిక నుంచి:

''అచ్చు పుస్తకాన్ని పునర్ముద్రించడం కదా తప్పు లెందుకు వస్తాయి?'' అనుకొన్నాను నేను. పుస్తకాన్ని ప్రెస్‌లో ఇచ్చి, ప్రూపుల బాధ్యత మిత్రులకు అప్పగించి, వేరే పనుల మీద పోయాను. ఫలితం ఇది!

దీనికి తప్పొప్పుల పట్టిక తయారుచేసి చూశాను. దానికంటే నాలుగో ముద్రణ వేసుకోవడమే సులభంగా తోచింది. ఈ ముద్రణ ప్రతులు ఖర్చు కాగానే – నాలుగో ముద్ర ణ ఒక్క తప్పుకూడ లేకుండా జాగ్రత్త తీసుకోగలనని మాట ఇస్తున్నాను.

ప్రపంచం అన్ని దేశాలలో ఉన్న సమస్యలన్నీ మన దేశంలోనూ ఉన్నై. కుల వ్యవస్థ, అంటరానితనం అనే సమస్యలు రెండూ మన దేశానికి అదనం. ఈ రెండు సమస్యల్నీ నిర్మూలించిన తర్వాతగాని, ప్రపంచ దేశాల పంక్తిలో మనకు చోటు లభించదు.

అందుకే – కులవ్యవస్థ వల్ల బాధపడుతున్న వారందర్నీ – ముఖ్యంగా మాలమాదిగల్ని ఏకం కమ్మంటున్నాను. ఈ రెండు దుష్ట సమస్యల్నీ నిర్మూలించి – దేశ సమైక్యానికీ, ప్రపంచ ప్రగతికీ మార్గదర్శకులు కమ్మంటున్నాను.

లోకంలో – ముఖ్యంగా మానవ సమాజంలో దుఃఖం ఉంది. దారిద్ర్యం ఉంది. అధర్మం ఉంది. వీటి నిర్మూలనకు కావలసింది నీతి బోధలు కాదు. నిర్మొహమాటమైన కార్యక్రమాలు.

స్వార్థపరుల పెత్తనం నుంచి – ఓ స్వార్థరహిత యువకులారా, మీరు విడుదలై, జాతిని విడిపించండి!

శుభం భూయాత్

భాగ్యనగర్

ఏప్రిల్, 1992 **– బోయి భీమన్న**

ధర్మం కోసం పోరాటం

న్యాయం కోసం మన ఆరాటం. ధర్మంకోసం మన పోరాటం. సమానత్వం కోసం మన ఉద్ఘాటం.

న్యాయం, ధర్మం, సమానత్వం – ఈ మూడూ భారత సమాజం నుంచి ఏ రోజున బహిష్కరించబడినవో, ఆ రోజునే పవిత్ర భారత భూమి పరదేశ దురాక్రమణకు పాదాక్రాంతమై పోయింది. ప్రజ్ఞా ప్రాభవాలను పోగొట్టుకొన్నది. బానిసకు సహజమైన నీచ దురహంకారాన్ని, పాశవిక కులతత్వాన్ని పెంచుకున్నది. మానాన్నీ, మానవత్వాన్నీ క్షణికమైన స్వప్రయోజనాలకు అమ్మేసుకొన్నది.

భారతీయ బహుజనుడా! మాలమాదిగ యువకుడా! నిస్వార్థ దేశ భక్తుడా! ఈ దుస్థితిని ఎంతకాలం సహిస్తావు? నిన్నూ, నీ జాతినీ శతాబ్దాలుగా కట్టిపడవేసి ఉంచిన ఈ దరిద్ర దాస్యశృంఖలాలను ఇంకా ఎంతకాలం భరిస్తావు?

2

భారత దేశంలో పుట్టే ప్రతి వ్యక్తీ ఏదో ఒక మతంలో పుట్టక తప్పదు. హిందుమతంలో పుట్టే ప్రతి వ్యక్తీ ఏదో ఒక కులంలో పుట్టక తప్పదు.

మతాలు, కులాలు మానవులు కల్పించినట్టివి. ఏ మతమూ, ఏ కులమూ లేని నిర్మల మానవుడుగా పుట్టే అవకాశం ఈనాడు ఏ మానవుడికీ లేదు.

కుల మత విభేద దూష్యం కాని విశ్వమానవజాతి ఏర్పడడం సాధ్యం కాదా? ఎందుకు కాదు?

3

ఏ మతమైనా చెప్పేదొకటే - పవిత్రంగా బ్రతకమని, భగవంతుణ్ని చేరుకొమ్మని.

ప్రపంచంలోని ప్రతి మతమూ తన మతస్థుల్ని సమంగా చూస్తుంది. లోకంలోని ఏ మూల, ఏ తెగ మానవుడినైనా తనలో చేర్చుకొంటుంది. గౌరవిస్తుంది.

కులం పేరుతో, అస్పృశ్యత పేరుతో, మనిషి నుంచి మనిషిని విడదీస్తున్న మతం, అవమానిస్తున్న మతం ఒక్క హిందూమతమే. తన మతస్థుల్ని హీనంగా చూస్తూ, దూరంగా తరిమి కొడుతూ, పరమతాల వాళ్లకు పాదాక్రాంతమై, వాళ్ళ పాదధూళిని శిరస్సున ధరిస్తున్న మతం ఒక్క హిందూమతమే.

ఐన వాణ్ని అరకాల రాస్తూ, కాని వాణ్ని కౌగలించు కొంటున్న మతం ఒక్క హిందూమతమే.

అందుకే - హిందూమతం అధర్మానికి, అన్యాయానికి, అనైక్యతకు, ఆత్మవంచనకు ఆకరమై రోజు రోజుకూ క్షీణించి పోతున్నది. అయినా, దాని పెద్దల చిలక పలుకులు మారడం లేదు.

పీఠాధిపతులు కళ్లు తెరవడం లేదు.

4

ఒకసారి - ఒక బ్రాహ్మడూ, ఒక సాహెబూ ఒక దారిన నడిచి పోతూ-ప్రొద్దుక్రుంకే సరికి ఒక అడవిని చేరుకొన్నారట. అక్కడొక పాడు దేవాలయం కనిపించగా, ఆ రాత్రికి అక్కడ తల దాచుకొందా మనుకున్నారు.

బ్రాహ్మడు విగ్రహానికి భక్తితో నమస్కరించి, దాని పాదాల వద్ద తలపెట్టుకొని పడుకున్నాడు. సాహెబు తన కాళ్ళను విగ్రహం రొమ్ముకు తన్ని పెట్టుకొని పడుకున్నాడు.

అర్ధరాత్రి గడిచింది.

"సాహెబూ! సాహెబూ! నాకు ఆకలిగా ఉంది. నీ కాళ్ళు తియ్యి, బ్రాహ్మణ్ని మింగేస్తాను" అన్నదట ఆ విగ్రహం.

"మిత్ర ద్రోహం చేస్తానా? నోరు మూసుకో"! అన్నాడట ఆ సాహెబు.

గ్రామాల్లో అందరికీ తెలిసిన పాత కథే ఇది.

దీని నీతి ఏమిటి? ఆలోచించండి!

తన భక్తుడైన బ్రాహ్మడి పట్ల ఆ విగ్రహం అవలంబించిన పైశాచిక వైఖరినే తన వారైన మాలమాదిగల పట్ల హిందూమతం అవలంబిస్తున్నది. కాదనగలరా?

5

కులం, మతం, జాతి - హరిజనులు, గిరిజనులు, బహుజనులు - అస్పృశ్యత, కులవ్యవస్థ, వైదిక సామ్యవాదం - రాజకీయ పార్టీలు, సంఘ సంస్కరణ, ప్రజాస్వామిక సోషలిజం- గాంధీయిజం, మార్క్సిజం, అంబేడ్కరిజం - కుల వ్యవస్థను, గ్రామ వ్యవస్థను నిర్మూలించి, కుల మత రహితమైన, ధర్మ ప్రధానమైన, ఉపనిష ద్విహితమైన సర్వమానవ సమతా సమాజాన్ని నిర్మించడం-భీమసేన, అంబేడ్కరు సేవాదళం, లోక సమాఖ్య, ప్రజా పరిషత్, పదవులు కోరని నాయకత్వం వగైరా అనేక విషయాలను గురించి నేనిక్కడ ప్రస్తావిస్తున్నాను. ఇవన్నీ ముఖ్య విషయాలే. కనుక, శ్రద్ధగా గమనించండి!

ఈ విషయాలు ఒక క్రమంలో ఉండకపోవచ్చు. పునరుక్తి ఉండవచ్చు. ఏ విషయాని కా విషయం మాత్రం సంపూర్ణంగా ఉంటుంది. కనుక, ప్రతి విషయాన్నీ జాగ్రత్తగా, సూక్ష్మదృష్టితో పరిశీలించండి! స్పష్టమైన నిర్ణయాలకు రండి!

6

వివిధ జాతుల మానవుల్ని ఉద్బోధించి, పాశవిక స్థితి నుంచి ఉద్ధరించి, సర్వజన సహోదరత్వాన్ని సాధించి, పరమేశ్వరుడికి అభిముఖంగా నడిపించుకు పోయేదే నిజమైన మతం.

కులం పేరుతో మనిషి నుంచి మనిషిని విడదీసి, హెచ్చు తగ్గులు కల్పించి, అస్పృశ్యత పేరుతో మానవత్వాన్నే అవమానిస్తున్న హిందూ మతానికి మత మని పిలిపించుకొనే అర్హత లేదు.

నేటి హిందూ మతం భగవంతుడి కోసం ఏర్పడ్డ మతం కాదు. ఆర్థిక రాజకీయ ప్రాబల్యం కోసం కొందరు తెలివైన స్మృతి కర్తలు కలిసి కుట్రపన్ని, రూపొందించిన ఒక సాంఘిక పథకం అది.

అందుచేత - జాతిభేదం వల్లా, కుల తత్వం వల్లా, అస్పృశ్యత వల్లా హీనులూ, దీనులూ అయి బాధపడుతున్న ఎవరైనా సరే తమ దౌర్భాగ్య హేతువులైన జాతి భేదాన్నీ, అస్పృశ్యతనూ నిర్మూలించి పారవెయ్యడానికి నడుం కట్టడంలో తప్పేం లేదు.

7

వేద కాలం గొప్పదే. ఆర్ష సంప్రదాయం ఉత్తమమైందే. ఉపనిషత్తులు మహత్తరమైనవే. భారతీయ ఆధ్యాత్మిక స్థాయి అద్వితీయమైనదే. ఎవరూ కాదనరు.

అయితే - లోకోత్తరమైన అట్టి మన సనాతన వేదాంతమతమూ, ఈ నాటి హిందూ మతమూ ఒకటేనా? కాదు. కాదు. కానే కాదు!

అహం బ్రహ్మాస్మి, తత్త్వమసి, ఆత్మవత్సర్వ భూతాని, సర్వేజనాస్సుఖినోభవంతు- మొదలైన సోషలిస్టు మూల సూత్రాలను ప్రతిపాదించి, సర్వమానవ సమానత్వాన్ని ఉద్ఘాటించి చెప్పిన వైదికార్య మతమూ- కులతత్వమూ, స్వార్థమూ, స్వమత జన హింసా తప్ప మరొక విలువ ఏదీ లేని నేటి హిందూ మతమూ ఒక్కటేనా? ఒక్కటి కావు. కానేరవు.

8

సమానీవ ఆకూతి:
సమానా హృదయాని వ:
సమాన మస్తు వో మనో
యధావహా సుహాసతి

- ఋగ్వేదం 10-191-4

"మీకందరకూ సమాన ప్రతిపత్తిగల ఉత్తమ జీవితం లభించగలందులకు ఓ మానవుల్లారా! మీ జీవిత లక్ష్యం ఒక్కటే అగుగాక. మీ హృదయా కాంక్షలు ఒక్కటే అగుగాక. మీ మనస్సులు కలిసి ఒక్కటే అగుగాక." ఇది కదా వేద ఋషులు ఆశించిన మానవసమాజ స్వరూపం.

సర్వ మానవులకూ ఏక ప్రతిపత్తిని ప్రతిపాదిస్తున్న వేద మతానికీ, స్వమత మానవులనే కులతత్వంతో హింసించి చంపుతున్న నేటి హిందూమతానికీ ఏమైనా పోలిక ఉన్నదా?

9

కృణ్వంతో విశ్వమార్యం – అనే నినాదాన్ని ఋగ్వేదం ఇచ్చింది. ప్రపంచంలోని మానవులందర్నీ ఆర్యమతంలో కలప మన్నది. ఆ నినాదం ప్రకారమే ఆపస్తంభ మహర్షి దక్షిణాదికి వచ్చి, ఇక్కడి ద్రావిడు లందరికీ జంజాలు వేసి, ఆర్య మతంలో చేర్చాడు.

ఇప్పుడు అలా ఎందుకు జరగడం లేదు? జరపడానికి ప్రయత్నించిన ఆర్య సమాజం ఎందుకు విఫలమైంది? పైగా – ఆర్యమతంలో పుట్టి పెరిగినవాళ్ళు, ఆర్షమత ప్రవక్తలైన వ్యాస వాల్మీకుల సంతతి వాళ్ళు కూడ నేడు హిందూమతాన్ని విడిచిపెట్టి, ఇతర మతాలలోకి ఎందుకు పారిపోతున్నారు?

ప్రపంచ మంతా వ్యాపించి ఉండవలసిన ఆర్యమతం నేడు స్వదేశంలోనే క్షీణించి పోవడానికి ఏమిటి కారణం?

10

ఈనాడు భారత దేశంలో ఉన్న ముస్లింలలో, క్రైస్తవులలో, బౌద్ధులలో, తదితర మతాలలో మెజారిటీ ఎవరు? హిందూమతం లోని కులతత్వ దౌర్జన్యాలకు బెదిరిపోయి, పరమతాల పాలైపోయిన మాల మాదిగలే కాదా?

ఈనాడు గిరిజనులుగా పేర్కొన బడుతున్న ఆటవికులలో మెజారిటీ ఎవరు? హైందవ పాశవికత్వాన్ని భరించలేక, అడవులలోకి పారిపోయిన హరిజనులే కాదా?

11

శ్రుతుల కాలం నాటి ఋషుల విశ్వమానవ ధర్మానికి విరుద్ధంగా స్మృతుల కాలంనాటి ప్రజాపతులూ, వాళ్ళ పురోహితులూ సంకుచిత వర్ణ వ్యవస్థను కల్పించారు. దాని రక్షణ కోసం అనేక దుష్ట శాసనాలను సృష్టించారు. తమకు అనుకూలంగా వేదాలకు భాష్యాలు వ్రాసుకున్నారు. వేదాంగాలను, కావ్య పురాణేతిహాసాదిక సారస్వతాన్ని నిర్మించుకున్నారు.

అసలు మూడు వర్ణాలే కదా! అవి భారత కాలంనాటికి నాలుగైనై. ప్రబంధ కాలం నాటికి పద్దెనిమిదైనై. ఇప్పుడు లక్షాతొంభైఅయి, భారత మాత గుండెలమీద చింతనిప్పులు అయి, కణకణ మండుతున్నై.

ఈ నిప్పుల్ని తొలగించడం, భారత జాతిని కాపాడడం మన ధర్మం. అందుకే మన పోరాటం.

12

ఆర్యుడు అంటే తండ్రి, ధర్మం తెలిసినవాడు అని అర్థం. అది ఒక జాతి పేరుకాదు. మానవుడు తపస్సు చేసి, ఋషి అయి, సంపాదించుకొన్న ఒక సంస్కారానికి పేరు అది.

సంస్కారం గల ప్రతిమనిషీ ఆర్యుడే.

లోకోత్తరమైన వైదికార్య ధర్మం ఎప్పుడో నశించిపోయింది. దాని మృత శరీరంలోకి కులతత్వ స్వార్థం పరకాయ ప్రవేశం చేసింది. నేటి హిందూమతం ఒక స్వప్రయోజకుల వ్యవస్థ. దాని రక్షణ కోసం కల్పించబడ్డ బానిస చట్టమే అస్పృశ్యత.

అస్పృశ్యత తొలగకుండా, కులవ్యవస్థ నశించకుండా భారత జాతికి పురోగతి లేదు.

13

ఇంతకూ- "హిందూ" అనే మాట కూడ మనది కాదు. అది పారసీక పదం. దాని అర్థం ఏమిటో తెలుసుకొన్నారా?

అసమత్వ పోషకాలు, అన్యాయ దూషితాలు, పారసీక దండయాత్రల తర్వాత పుట్టుకు వచ్చిన కుక్కమూతి పిందెలు అయిన నేటి హిందూమత మూఢ విశ్వాసాల దౌర్జన్యాలను నిరోధించకుండా ఆర్షమతానికి మోక్షంలేదు.

ఋషుల మతమే ఆర్షమతం.

14

శంకరాచార్యుడికి అద్వైత వేదాంత తత్వాన్ని బోధించిన వాడు ఒక చండాలుడు. రామానుజాచార్యుల గురువు ఒక చండాలుడు. హరిశ్చంద్ర చక్రవర్తినే కొనగలిగిన వాడొక చండాలుడు. భారతీయ వేద వేదాంగ పురాణేతిహాసాలకు మూల పురుషుడొక చండాలుడు. ఆధునిక స్వతంత్ర భారత రాజ్యాంగ నిర్మాత ఒక చండాలుడు. చండాలు డంటే మాలమాదిగవాడు. హరిజనుడు! వీళ్ళంతా అవతార పురుషులే. అపర శివులే కదా? గుర్తించండి!

భారత దేశంలో - ఒక్క భారత దేశంలోనే కాదు, మొత్తం ప్రపంచంలో - పుట్టిన మహర్షులంతా నిమ్నజాతుల వారే అనే సత్యాన్ని గమనించండి! ఈ సత్యం ఐతిహాసిక సత్యం. ఇప్పుడు నేను ఊహించి చెపుతున్నది కాదు.

ఇంతటి గొప్ప వారసత్వాన్ని, ఆస్తిని వదలుకొని, ఎంతో మంది ఎందుకు మత నిర్వాసితులై, పరమతాలపాలై పోయారు? బుద్ధి ఉన్న ప్రతి భారతీయుడూ ఆలోచించ వలసిన విషయం కాదా ఇది?

15

హిందూ సమాజం నుంచి అస్పృశ్యతను, కుల భేదాన్ని తొలగించి, సంస్కరించి, దానికి మళ్ళీ ఒక నూతనోత్తేజాన్ని కలిగించడానికి జినదేవుడు, బుద్ధుడు, రామానుజాదులు, వేమనయోగి, వీర బ్రహ్మం, రామ మోహన రాయలు, వివేకానందుడు, శ్రద్ధానంద సరస్వతి, గాంధీజీ, అంబేద్కరు, హరిజన సేవక సంఘం, ఆర్యసమాజం వంటి ఎందరో మహానుభావులు, ఎన్నో మహోద్యమాలు తలలు బద్దలు కొట్టుకొన్నప్పటికీ - ఈ రెండు పిశాచాలూ ఇంకా వదిలిపోలేదు. ఎందుచేత?

అసంఖ్యాకంగా పరమతాల పాలైపోయినా, ఈ నాటికీ పోతూ ఉన్నా, ఇంకా కోట్ల కొలది మాలమాదిగలు అంటరాని వాళ్ళనిపించుకొంటూ, హిందూ మతంలో మిగిలే ఉన్నారెందుచేత?

మాలమాదిగ పేటలకూ, అక్కడ కుళ్ళి చస్తున్న మాలమాదిగ జనులకూ ఎప్పటికీ విమోచనే లేదా? ఎంతటి మహాత్ములూ వాళ్ళని ఉద్ధరించనే లేరా?

ఏమిటి తరణోపాయం?

16

మాల మాదిగ సమస్య ఒక అనాధ ప్రేతం. దిక్కులేని శవం. దాన్ని మరొకడు ముట్టుకోడు. దాని కది కదిలి పోదు.

అది పూర్తిగా పరిష్కారమై పోకుండా భారత జాతికి ఆరోగ్యం లేదు. పురోగమనం లేదు. ప్రపంచ జాతుల మధ్య గౌరవస్థానం లేదు.

శవాన్ని ఇంట్లో పెట్టుకొని, శౌచలోకం మధ్య శంకరా చార్యుడు కూడా తలెత్తుకోలేడు.

అనాధ ప్రేత సంస్కారం పుణ్యం కదా అంటే – నేటి హిందూ సమాజంలో డబ్బు తప్ప, పుణ్యం కావలసిన వాడెవడు?

ప్రపంచ జాతుల మధ్య భారత జాతి మాన మర్యాదలతో బ్రతకాలంటే, భారత దేశం సర్వ మానవ సమానత్వంగల సోషలిస్టు దేశంగా అభ్యుదయం పొందాలంటే, సమాజం నుంచి అస్పృశ్యతనూ, కుల వ్యవస్థనూ తొలగించక తప్పదు. అలా జరగాలంటే, ఈ శవం దానంతట అదే ముందుకు కదలక తప్పదు.

17

సర్వ మానవ సమ సమాజ నిర్మాణమే తమ లక్ష్యంగా ఉద్ఘాటిస్తున్న కాంగ్రెసు, సోషలిస్టు, కమ్యూనిస్టు వగైరా రాజకీయ పార్టీలేవీ కూడ అసలు సమస్యను అర్థం చేసుకోలేదు. అర్థం చేసుకోడానికి ప్రయత్నించలేదు. ఆయా పార్టీలు తమ తమ కార్యరంగాలలో ఓడి పోవడానికి కారణం అదే.

18

అస్పృశ్యతను తొలగించడం కోసం, ఆత్మ గౌరవంతో జీవించడం కోసం, మాల మాదిగ యువకుల్లారా– ముందుగా మీరు మేల్కోవలసి ఉంది! మేల్కొని, ముందుకు సాగవలసి ఉంది!

మీ విమోచన కోసం ముందుగా మీరే లేచి నడుం కట్టుకోకపోతే – భగవంతుడు కూడా మిమ్మల్ని ఉద్ధరించలేడు. మిమ్మల్ని ఉద్ధరించకుండా దేశాన్నీ, ధర్మాన్నీ ఉద్ధరించడం అసాధ్యం.

19

దోచబడే బలహీను డున్నంతకాలం, దోచే బలవంతు డుంటాడు.

దోపిడీ జరగడానికి కారణం బలహీనుడు. దోమలు పుచ్చడానికి కారణం మురికి.

మాలమాదిగ యువకుల్లారా – బలవంతులు కండి! మీరు బలవంతులైతే – మిమ్మల్ని అన్యాయం చేసేవాళ్ళు, అవమానించేవాళ్ళు, అవతలుండమనే వాళ్ళు, అర్థాకలితో మాడ్చి చంపే వాళ్ళు ఎవళ్ళూ ఉండరు.

బలవంతులు కావాలంటే, ఏకం కావాలి. మాలమాదిగ లేకమైతే ధర్మాన్ని పాలించగలరు. లోకాన్నే జయించగలరు.

20

గతంలో ఎంతో మంది మహా పురుషులు అస్పృశ్యతను నిర్మూలించడానికి ఎన్నో తంటాలు పడ్డారు.

ధర్మ బలంతో, శాస్త్ర చర్చతో, హేతువాదంతో, ఎందరో దార్శనికులు అస్పృశ్యతా పిశాచిని ముక్కలుగా నరికి పారబోశారు.

అయితే – అది జరాసంధుడి కాయంలా ఎప్పటికప్పుడు అతుక్కొంటూనే ఉంది. బలం పుంజుకొంటూనే ఉంది. ఇతోధిక క్రౌర్యంతో భారత జాతిని పీడిస్తూనే ఉంది. అభ్యుదయ పురోగామి శక్తుల్ని ధిక్కరిస్తూనే ఉంది.

21

జరాసంధుణ్ణి చంప గల్గినవాడు భీమ సేను డొక్కడే. అస్పృశ్యతా పిశాచిని చంపగల్గిన శక్తి భీమసేనకే ఉంది.

భీముడు కృష్ణుడినుంచి వలె – దళిత జనోద్ధరణ ప్రవక్త అయిన అంబేడ్కరు ప్రబోధం నుంచి ఆత్మశక్తిని గ్రహించి – కృత నిశ్చయంతో జబ్బ చరచండి!

22

అస్పృశ్యత మన శత్రువు. ఒకటో నంబరు శత్రువు. కుల వ్యవస్థ రెండో శత్రువు. ఈ శత్రుద్వయం నశించకుండా భారతజాతికి అభ్యుదయం లేదు.

23

అస్పృశ్యత, కుల వ్యవస్థ – ఇదొక జంట. ఈ జంటకు పుట్టిన మరో జంట అన్యాయం, అనైక్యత. ఈ నాలుగూ కలిసి భారత జాతిని విడని దారిద్ర్యంలో, విదేశీ దాస్యంలో ముంచివేసినై. ఆధునిక భారతంలోని దుష్టచతుష్టయం ఇవి.

మాల మాదిగ యువకుల్లారా, ఏకం కండి! శత్రు నాశనం చేసి విజయులు కావటానికి అజ్ఞాతవాసం నుంచి బైట పడండి! ఇంకా ఎంతకాలం ఉంటారా మురికి పేటల్లో? ముదనష్టపు దాస్యంలో?

24

"డాక్టరు అంబేడ్కరు భయంకరుడు, భయరహితుడు. చేతికేది దొరికితే దానితో ఈ హిందూ కుక్కను కొట్టడానికి జంకడు" అన్నాడు గాంధీజీ ఒకసారి.

గాంధీజీ అంతటివాడు హిందూ సమాజాన్ని కుక్కతో ఎందుకు పోల్చాడు? అస్పృశ్యత, కులతత్వం, అన్యాయం, అనైక్యత – ఈ దుష్టగుణా లున్నందువల్లనే కదా?

ఈ శత్రు చతుష్టయాన్ని మట్టుపెట్టడానికి, అంబడ్కరు వలెనే, మీలో ప్రతి ఒక్కడూ భయంకరుడూ, భయ రహితుడూ కండి!

25

"నాల్గు పడగల హైందవ నాగరాజు" అన్నాడు మహాకవి జాషువా.

హిందూ సమాజాన్ని జాషువా పాముతో పోలిస్తే, గాంధీజీ కుక్కతో పోల్చాడు.

అది పాము కావచ్చు, కుక్క కావచ్చు. ఏదైనా – దానికి గల ఆ నాలుగు విషపు పడగల్నీ పీకి పారవెయ్యక తప్పదు.

మీరు బెదిరే కొలదీ అది బుస కొడుతూనే ఉంటుంది. ఉపేక్షించే కొలదీ ఉట్టెలు కొరుకుతూనే ఉంటుంది.

26

"అస్పృశ్యత బ్రతికి ఉండడంకంటే, హిందూమతం చచ్చినా మంచిదే" అన్నాడు గాంధీజీ! హిందూ పెద్దల మూర్ఖత్వంతో ఎంత విసిగి పోకపోతే అలా అంటాడాయన!

హిందూమతం ఇప్పటికే ఇంతగా క్షీణించి పోవడానికి ప్రధాన కారణం అస్పృశ్యతే! అది ఇప్పటికీ పోకపోతే, హిందూమతమే రూపుమాసి పోతుంది.

27

నీతుల్నీ, సిద్ధాంతాల్నీ, వేదాంతాన్నీ అలా విడిచి పెట్టండి! మానవ స్వభావాన్నీ, సమాజాన్నీ సంస్కరించే బలం వాటికి లేదు. వాటికి అంతటి బలమే ఉంటే – మనకు ఈ దైన్యమే దాపురించేది కాదు.

బలం కలవాడే రాజు అన్న దొక్కటే సార్వకాలిక సత్యం. శక్తి కలవాడే సజీవుడు అన్నదొక్కటే వాస్తవం.

బలాన్ని సమకూర్చుకోండి! మీరూ మనుషులే అని తెలుసుకోండి! మనుషులవలె బ్రతకడానికి పూనుకోండి!

28

మాలమాదిగ యువకులకే ఈ ఉద్బోధ ఎందుకు చేస్తున్నానంటే -

(1) అస్పృశ్యత వల్ల బాధపడుతున్న వాళ్లు మాలమాదిగలు.

(2) ఈ బాధను తొలగించుకోడానికి ప్రధానంగా ప్రయత్నించవలసిన వాళ్ళు మాలమాదిగలే.

(3) అస్పృశ్యత ఒక సామాన్యమైన పిశాచం కాదు. అదొక బ్రహ్మ రాక్షసి. మాటలు, మంత్రాలు ఏవీ దానిమీద పని చెయ్యవు.

(4) ఈ రాక్షసి మాలమాదిగల అభ్యుదయ మార్గంలో తిష్ఠ వేసుకు కూర్చుని ఉంది.

(5) దాన్ని ఎదిరించి, ఓడించి, అవతల పారవేసి, ముందుకు పోవలసిన విధ్యుక్త ధర్మం మాలమాదిగల మీదే ఉంది.

(6) అందుకు కార్యక్రమం మాలమాదిగ పేటలలోనే ప్రారంభం కావలసి ఉంది. ప్రత్యేకంగా మాలమాదిగలకే నేను ఈ ఉద్బోధ చెయ్యడానికి అదీ కారణం.

29

అస్పృశ్యతకు, కుల వ్యవస్థకు వ్యతిరేకులైన - అభ్యుదయ గాములైన - విప్లవ చైతన్యం కల యువకులెందరో ఇతర కులాలలో ఉన్నారు.

అట్టి వారంతా మాలమాదిగలకు ఈ విషయంలో తోడ్పడవలసి ఉంది. మాలమాదిగలు చైతన్యవంతులై, తమ శృంఖలాలను త్రెంచుకొని బైటపడడానికి సహాయపడవలసిందిగా - కుల మత విచక్షణ లేకుండా - భారతీయ యువకులందర్నీ నేను ఆహ్వానిస్తున్నాను.

30

గాంధీజీ హరిజన సేవక సంఘాన్ని నెలకొల్పినప్పుడు - దాని నిర్వహణ బాధ్యతను పూర్తిగా అగ్రకులాల వారికే అప్పగించాడు. " అస్పృశ్యత అనేది అగ్రకులాల వాళ్ళు చేసిన పాపం. వాళ్ళ పాపాన్ని వాళ్ళే తొలగించుకోవాలి" అన్నాడాయన.

అయితే – ఏం జరిగింది? పాపం ఎంత వరకు తొలగింది? స్వాతంత్ర్యం వ్వత అది ఇంకా పెరిగింది. పగటి వేషం కట్టి తాండవిస్తోంది! హరిజన సేవక సంఘం కూడ పని చెయ్యడం మానేసింది!

31

హరిజనుల ఇప్పటికే పైకి వచ్చేశారని ప్రచారం చేస్తున్న వాళ్ళు పచ్చి వంచకులు. ప్రభుత్వాన్నీ, హరిజనాభివృద్ధి కార్యక్రమాలనూ తప్పుదారి పట్టించడం కోసం జరుగుతున్న దు ప్రచారం అది.

హైదరాబాదు నగరంలోను, పట్టణాలలోను, గ్రామాలలోను ఉన్న మాలమాదిగ పేటల్నీ, అక్కడ బ్రతుకుతున్న మాలమాదిగ ప్రజల్నీ చూస్తే. వాస్తవం కళ్ళబడుతుంది.

పడక కుర్చీలలో తాంబూలం సేవిస్తూ కూర్చుని, ప్రపంచమంతా ఉద్ధరించబడిందని కలలు కంటున్న పెద్దలెవరైనా ఉంటే – అట్టి వారిని తీసుకువెళ్ళి, మాలమాదిగ పేటల్ని చూపండి!

32

శుభ్రంగా ఉండమనడం, మత్స్య మాంసాదులు మానమనడం, గుడుల్లోకి ప్రవేశం కల్పించడం, కొద్దిమంది చదువుకున్న వాళ్ళతో రాసుకు తిరగడం, ఏదో పదిమందికి ఊరికి దూరంగా ఇళ్ళ స్థలాలివ్వడం – ఇదీ ఇంతవరకు జరిగిన హరిజనాభివృద్ధి కృషి !

33

లక్ష ఎకరాల పొలాన్ని దోసెడు నీళ్ళతో సాగు చెయ్యడానికి ప్రయత్నించడం ఎలాంటిదో – మాలమాదిగల అభివృద్ధికి నేడు జరుగుతున్న కృషి అలాంటిది.

ఇది కళ్ళనీళ్ళు తుడిచే పని. ఇందులో నిజాయితీ లేదు.

బాధితులైన వాళ్ళు ఎంతకాలం కళ్ళు మూసుకొని మూలుగుతూ పడి ఉంటారో – అంతకాలం వాళ్ళకు న్యాయం జరగదు.

కనుక – ఓ మాలమాదిగ యువకుల్లారా! కళ్లు తెరిచి కర్తవ్యం యోచించండి!

34

హరిజనులు అభివృద్ధి పొందటం అంటే మాలమాదిగ పేటలు వాస యోగ్యంగా మారడం.

అస్పృశ్యత పోవడం అంటే నడిబజారులో ఒక మాలమాదిగవాడు మిఠాయి దుకాణం పెట్టుకొని బ్రతకడం.

కుల వ్యవస్థ నశించడం అంటే ఒక మాలమాదిగ పేటలో అమ్మాయిని ఆ ఊరి అగ్రవర్ణ యువకుడు వేదోక్తంగా పెళ్ళాడడం.

35

ఆంధ్ర దేశంలో మాలమాదిగ పేటల్ని ఒక ఏభై సంవత్సరాలుగా ఎరుగుదును నేను. ఈ ఏభై సంవత్సరాలలోను ఎన్నో ఉద్యమాలు నడిచినై. ఎంతోమంది నాయకులు, సంస్కర్తలు గొప్పవాళ్ళై చచ్చిపోయారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. పాత జమీందార్లు పోయారు. కొత్తవాళ్ళు జమీందార్లైనారు. మూడు పంచవర్ష ప్రణాళికలు గడిచినై. కోటానుకోట్ల స్వదేశీ విదేశీ ధనం ఖర్చయింది. ఎంతోమంది హరిజనులు శాసనసభ్యులు, మంత్రులు కూడ అయినారు.

అయితే – మాల మాదిగలకు ఏం జరిగింది?

మాల మాదిగ పేటలు ఏభై ఏళ్ళనాడు ఎలా ఉన్నాయో ఈ నాడూ అలానే ఉన్నై.

అవే మురికిపేటలు, అవే పూరిగుడిసెలు, అవే చిల్లుకుండలు, చింకి చాపలు, గుడ్డ పేలికలు, ఎముకల గూళ్ళు, అదే కూలిపని, అర్ధాకలి, పస్తులు.

మరీ ఘోరమైన విషయం ఏమిటంటే–స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత, పంచవర్ష ప్రణాళికలు ప్రారంభమైన తర్వాత, పంచాయితీ రాజ్యం అమలులోకి వచ్చిన తర్వాత, మాల మాదిగల బ్రతుకు మరీ దీనంగా, దిక్కులేనిదిగా తయారైంది. వాళ్ళ అతీగతీ కనుక్కునే నాధుడే లేకుండా పోయాడు.

36

పత్రికలు చూడండి. ప్రకటనలు చూడండి. సమాజాభివృద్ధి కోసం, దరిద్రుల ఉద్ధరణకోసం, సాంస్కృతిక వికాసం కోసం ఎన్నో సంఘాలు, కమిటీలు, కమీషన్లు, చర్చలు, సెమినార్లు, పథకాలు, ఖర్చుల మంజూర్లు, నిధుల కేటాయింపులు, గ్రాంట్లు, ఋణాలు ప్రతిరోజూ వందలు, వేలు కనిపిస్తూనే ఉంటై. అవన్నీ ఏం పని చేస్తున్నై? ఏమిటి సాధిస్తున్నై? రోజు రోజుకూ దేశం ఇలా దారిద్ర్యంలోకీ, అసమర్థతలోకీ, అవినీతిలోకీ, అశిక్షణలోకీ, అంధకారంలోకీ దిగజారి పోతున్నదేమీ?

పోనీ, ఏదో సాధించ బడుతున్నదనే అనుకున్నా- అది మాల మాదిగల పేటల దాకా రావడం లేదేమి?

మొత్తం మీద ప్రజల జీవన ప్రమాణం పెరిగింది కదా, ప్రజలలో మాల మాదిగలు ఒక భాగమే కదా, అంటే- న్యాయంగా అంతే. కాని మాల మాదిగల విషయంలో న్యాయం జరిగిందెప్పుడు?

"ప్రజలు" అన్న మాటలో మాల మాదిగలు కూడ ఇమిడి ఉన్నా రన్న జ్ఞానం ఈ దేశంలో ఎంత మంది కుంది?

"ప్రజలకు తిండి" అంటే, అగ్రవర్ణాల వారికి తిండి అనే కదా ఇప్పటికీ అమలులో ఉన్న అర్థం?

"గ్రామాభివృద్ధి" అంటే అగ్రవర్ణాల వారుండే ప్రాంతం అభివృద్ధి అనే! అందులో మాల మాదిగ పేటలు చేరవు!

గ్రామాభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించి చూడండి! ఒక్క మాల మాదిగ పేటకైనా రోడ్లు వేయబడ్డాయా? విద్యుద్దీపాలు ఇవ్వబడ్డాయా?

37

చదువులు స్కాలర్‌షిప్పులు, హాస్టళ్ళు, ఉద్యోగాలు – ఈ రంగాలలో జరిగినట్టు కనిపిస్తున్న కృషి నిజమైంది కాదు. అభివృద్ధి స్థిరమయింది కాదు.

నేటి హరిజన విద్యార్థులు, హరిజన ఉద్యోగులు గారడీవాడి చేతిలో మెరుస్తున్న వెండి రూపాయల లాంటి వాళ్ళు. నిజమైన ధనం కాదది. వట్టి కనుకట్టు!

పట్టణాలలోను, గ్రామాలలోను కూడ అగ్రవర్ణాల వారుండే ప్రాంతాలతో సమానంగా మాల మాదిగలుండే ప్రాంతాలు అభివృద్ధి చెందితేనే తప్ప, నిజమైన అభివృద్ధి జరిగినట్టు కాదు.

38

భారత రాజ్యాంగ నిర్మాణ సంఘాధ్యక్షుడు డాక్టరు అంబేడ్కరు.

భారత దేశంలో ప్రజాస్వామిక సోషలిస్టు సమాజాన్ని నిర్మించడం మన రాజ్యాంగ లక్ష్యం.

స్వాతంత్ర్యం వచ్చి ఇప్పటికి ఇరవై సంవత్సరాలయింది.

ఈ లక్ష్యంవైపు ఒక్క అంగుళమైనా పురోగమించామా?

కొన్ని ఆర్థిక సంస్థల్ని జాతీయం చేశాం. కొన్ని పరిశ్రమల్ని ప్రభుత్వ రంగంలో నెల కొల్పాం. అవి కూడా అంతంత మాత్రంగానే ఉన్నై. ఎందువల్ల?

ప్రతిపార్టీ లక్ష్యమూ సోషలిజమే అయినప్పుడు, వయస్సు వచ్చిన ప్రతివ్యక్తికీ ప్రభుత్వాన్ని శాసించే హక్కున్నప్పుడు, లక్ష్యం రోజు రోజుకూ ఎందుకు దూరమై పోతున్నది?

లక్ష్యాన్ని అవతలకు నెట్టి పార్టీల నాయకులూ, హక్కుల్ని అవతలకి నెట్టి వోటర్లూ – స్వార్థంతో, కుల మత పక్షపాతంతో, ధనాశతో, పదవీ వ్యామోహంతో కళ్ళు మూసుకొని ఎందుకు వ్యవహరిస్తున్నారు?

లోపం ఎక్కడుంది?

39

కాంగ్రెసు, సోషలిస్టు, కమ్యూనిస్టు వంటి పార్టీలు, ప్రణాళికలు అన్నీ కూడ చేసిన పొరపాటు, చూపిన బలహీనత ఒకే ఒక్కటి. అది దేశంలోని పెట్టుబడి దారుల, భూస్వాముల, మత దురహంకారుల పలుకుబడికి లొంగిపోయి, సామాన్య ప్రజల శ్రేయస్సును విస్మరించడం.

40

నాయకత్వం క్రింది వర్గాల నుంచి రావాలి. నాయకులు ధనాశ, పదవీ కాంక్ష లేనివారై, సమిష్టి శ్రేయోదృష్టి కలిగినవారై ఉండాలి.

ఏ నిర్మాణమైనా పునాదుల నుంచి జరగాలి, ఆకాశం నుంచి కాదు.

భారత దేశంలో సోషలిస్టు సమాజాన్ని నిర్మించాలనుకొంటే – అట్టి నిర్మాణం మాల మాదిగ పేటల నుంచి ప్రారంభం కావాలి. భారత సమాజానికి పునాదులు మాల మాదిగ పేటలే.

41

మన రాజ్యాంగం క్రింద, మన దేశంలో ప్రజాస్వామిక సోషలిజం నెల కొనాలంటే – అందుకు జరగవలసిన కార్యక్రమం ఇది.

(1) భూమి యావత్తూ జాతీయం చేయబడి, వ్యవసాయం ప్రభుత్వ రంగంలో నిర్వహించబడాలి.

ఏ గ్రామంలోని భూమి ఆ గ్రామ వ్యవసాయ శాఖ అధీనంలో ఉంటుంది. గ్రామ ప్రజల అవసరాలకు సరిపడ్డ ధాన్యం అక్కడి ప్రభుత్వ గోదాములో ఉంచబడుతుంది. మిగిలింది పట్టణాలకు, ఇతర ప్రాంతాలకు సరఫరా చెయ్యబడుతుంది.

(2) అగ్ర వర్ణాలుండే గ్రామాల మధ్యలో – ఎక్కడ ఖాళీ స్థలం ఉంటే అక్కడ – అక్కడి హరిజనులకు ఇళ్ళు కట్టబడాలి.

ఆ ఇళ్ళు మామూలు గుడిసెలు కారాదు. ఆ ప్రాంతపు అగ్రకులాలవారి ఇళ్ళకు అవి ఏ విధంగానూ తీసిపోరాదు.

(3) ఏ గ్రామం మధ్యలో అయినా ఖాళీ స్థలాలు లేకపోతే గ్రామానికి ఆనుకొని, వీధులతో వీధులు కలిసిపోయే విధంగా, హరిజనులకు ఇళ్ళు కట్టబడాలి.

ఈ విధంగా గ్రామం మధ్యలోగాని, గ్రామానికి చేర్చికాని, ఆ గ్రామం హరిజనులకు ఇళ్ళు కట్టబడ్డప్పుడు – మాలమాదిగ పేటలు వేరుగా ఉండడ మనే దుస్థితి తొలగిపోతుంది.

(4) కాపు, కమ్మ, రెడ్డి వగైరా కులాల వారంతా ఒక గ్రామంలో ఎలా కలిసిపోయి నివసిస్తున్నారో, అలానే హరిజనులు కూడ వారితో కలిసిపోయి నివసించే విధంగా గ్రామ పునర్నిర్మాణం జరగాలి.

ఈ పునర్నిర్మాణానికి అవసరమైన డబ్బును సమకూర్చడానికి ప్రత్యేక ఫైనాన్సు కార్పొరేషనులను ఏర్పాటు చేయ్యాలి.

ప్రతి జిల్లాకు ఒక కోటి రూపాయలతో ఒక ఫైనాన్సు కార్పొరేషనును ఏర్పాటు చేసి, జిల్లాకు రెండు మూడు గ్రామాల చొప్పున ఎంచుకొని, ఈ పునర్నిర్మాణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తే చాలు. కొద్ది సంవత్సరాలలోనే అద్భుతమైన ఫలితాలు వాటికవే సాధించ బడగలవు.

మాల మాదిగల పునరావాసం కోసం ఈ విధంగా జిల్లా కొక కోటి రూపాయల చొప్పున కేటాయించడం ప్రభుత్వానికి కష్టమైన పనేమీ కాదు.

ఎన్నో లక్షల, కోట్ల రూపాయలను ప్రణాళికల కోసం ఖర్చు చేస్తున్న ప్రభుత్వం – దేశం జనాభాలో అయిదోవంతు ప్రజలైన మాల మాదిగలకోసం ఈ మాత్రం చిన్న ప్రాజెక్టును నిర్వహించవచ్చు. అన్ని ప్రాజెక్టుల కంటే ఇదే నిజమైన, సరియైన ప్రాజెక్టు.

(5) ఈ ప్రాజెక్టు క్రింద హరిజనుల ఇళ్ళను గ్రామాలతో చేర్చి పునర్నిర్మిస్తున్నప్పుడు, వెనుకబడిన కులాలవారి పేటలను కూడ, అవి వేరు వేరుగా ఉన్న సందర్భాలలో, ఈ కార్యక్రమంలో చేర్చాలి.

పేటలు కులాల వారిగా ఉండకూడదు. కులాల పేర్లతో పిలువ బడగూడదు.

ఇలా జరిగినప్పుడే అస్పృశ్యత తొలగిపోయినట్టు. కులతత్వం నశించినట్టు

(6) అస్పృశ్యతతో పాటు కుల వ్యవస్థను తొలగించడానికి పూనుకోవాలి. అందుకు వర్ణాంతర వివాహాలు విరివిగా జరగాలి.

అస్పృశ్యతా, కుల వ్యవస్థా తొలగిపోవడంతో, భూమి జాతీయం చేయబడడంతో, దేశంలో సోషలిస్టు సమాజ నిర్మాణం ప్రారంభ మవుతుంది. అంతవరకు కాదు.

(7) శిశు రక్షణ, విద్యాబోధన, వృత్తి నిర్వాహణ, వైద్య చికిత్స, వృద్ధాప్య సహాయం వంటి మానవ జీవిత ప్రాథమికావసరాలన్నీ ప్రభుత్వమే ఉచితంగా కల్పించడంతో, సోషలిస్టు సమాజనిర్మాణం పూర్తి అవుతుంది.

(8) భావన, భావ ప్రకటన, రచన, ప్రవర్తన - ఈ నాలుగు విషయాలలోను వ్యక్తికి సంపూర్ణ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఉండి, జీవిత ప్రాథమిక సౌకర్యాలు అందరికీ సమానంగా లభించే సమ్యక్ సామాజిక వ్యవస్థే ప్రజాస్వామిక సోషలిజం నా దృష్టిలో. అట్టి సోషలిజం దేశంలో నిర్మించబడాలి. దేశ దేశాలకు అందజెయ్యబడాలి.

(9) దేశంలో కుల వ్యవస్థను పలెనే, గ్రామ వ్యవస్థను కూడ రద్దు చేయాలి.

కనీసం పదిమంది డాక్టర్లను, పదిమంది లాయర్లను, ఒక హైస్కూలును, ఒక నాటకశాలను పోషించుకోడానికి తాహతులేని గ్రామాలన్నిటిని రద్దు చేయ్యాలి. అట్టి చిన్న గ్రామాలను సమీప పట్టణంలో కలిపి వెయ్యాలి. పట్టణాల అభివృద్ధిని ప్రోత్సాహించాలి. కుగ్రామాల రద్దుతో, భూమి జాతీయకరణతో, వ్యవసాయం ప్రభుత్వ రంగంలో పెద్ద యెత్తున్న జరగడానికి వీలు కలుగుతుంది. ప్రజలంతా పట్టణాలలో, ఆధునిక సౌకర్యాలన్నిటినీ అనుభవిస్తూ జీవిస్తూనే, పరిశ్రమలలో కృషి చేస్తూనే - వేలకొలది ఎకరాల పొలాలను సాగుచేసి పండించడానికి, జన బాహుళ్యానికి తిండిని పుష్కలంగా అందించడానికి వీలు కలుగుతుంది.

42

వైద్యం, విద్య, వికాసం లేకుండా పల్లెటూళ్ళలో పశువుల్లా బ్రతుకుతున్న వేలకొలది మానవుల్ని ఉద్ధరించాలంటే - కుగ్రామాలను రద్దుచేసి, పట్టణీకరణను ప్రోత్సహించడం కంటే గత్యంతరం లేదు.

ప్రజా స్వామిక సోషలిజమే భీమసేన లక్ష్యం.

అస్పృశ్యతను, కుల వ్యవస్థను నిర్మూలించే కృషితో దాని కార్యక్రమం ప్రారంభం అవుతుంది.

నేను ఈ గ్రంథంలో పేర్కొంటున్న లక్ష్యాలను సాధించడానికి, సోషలిస్టు సమాజాన్ని నిర్మించడానికి ప్రజలందరి విశ్వాసాన్ని చూరగొన్న ఏదో ఒక పార్టీ

అవసరం. అట్టి పార్టీని భీమసేన అంటున్నాను. మీరంతా కలిసి అట్టి సంస్థకు లోక సమాఖ్య, ప్రజా పరిషత్తు వంటి మరో పేరేదైనా పెట్టుకోవా లనుకుంటే – అలాగే పెట్టుకోవచ్చు. పేరేదైనా– అట్టి సంస్థకు విప్లవమే ప్రధాన లక్ష్యంగా ఉండాలి.

43

ఆకాశం, గాలి, అగ్ని, జలం, భూమి– అయిదూ పంచభూతాలు. వీటిని అనుభవించే హక్కు ప్రతిప్రాణికీ సమానంగా ఉంది.

ప్రకృతి సిద్ధమైన ఈ హక్కును కొద్దిమంది వ్యక్తులు తమ స్వాధీనంలోకి తెచ్చుకొని, తక్కిన అశేష ప్రజానీకాన్ని దారిద్ర్యంలో అణిచిపెట్టి ఉంచడానికి ప్రయత్నం ప్రారంభించిన నాటి నుంచే మానవ జాతికి త్రిప్పలు మొదలైనై.

44

పంచ భూతాలలో ఒకటైన భూమి కొందరిదే ఎలా అయింది?

కొందరికి వేల కొలదీ ఎకరాలు ఉండి – మరి కొందరికి ఇళ్ళ స్థలాలు కూడ ఎందుకు లేకుండా పోయినై?

బ్రిటీషు ప్రభుత్వమూ, సర్వే పద్ధతీ రాకముందు దున్నేవాడిదే భూమి కాదా?

దున్నే వాళ్ళలో అధిక సంఖ్యాకులు మాల మాదిగలే కాదా?

భూమిని దున్ని పండించే వాళ్ళు సెంటు నేల కూడా లేని నిర్భాగ్యులెలా అయారు?

స్వయంగా ఆహారోత్పత్తికీ, ధనోత్పత్తికీ, ఏ విధంగానూ తోడ్పడని అధికార భోగలాలసులకు అంత ఆహారమూ, ధనమూ ఎలా వస్తున్నై?

45

భూముల్నీ, ఆస్తుల్నీ జనం అందరికీ సమంగా పంచాలని మనం కోరడం లేదు. అవి జాతిపరం కావాలనీ, మొత్తం జాతియొక్క సాముదాయిక అభివృద్ధికి తోడ్పడాలనీ మాత్రం కోరుతున్నాం.

46

భూమిని జాతీయం చేయడం, హరిజనుల్ని కలుపుకొని గ్రామ పునర్నిర్మాణం జరగడం, కుగ్రామాలను రద్దుచెయ్యడం – ఈ మూడు కార్యక్రమాలూ ప్రారంభమయ్యేలోగా, అందుకు నాందిగా, ఈ క్రింది కార్యక్రమం వెంటనే చేపట్టబడాలి!

(1) ప్రస్తుతం నగరాలలోను, పట్టణాలోను, గ్రామాలలోను మంజూరవుతున్న గృహ నిర్మాణ పథకాలలో – అవి ప్రభుత్వానివి కానీ, ప్రైవేటువి కానీ – జనాభాను బట్టి నూటికి ఇరవై ఇళ్ల చొప్పున హరిజనులకు ప్రత్యేకించబడాలి. అందుకు తగిన పరపతిని వారికి ప్రభుత్వం కలిగించాలి.

(2) వ్యాపారం, పరిశ్రమలు, కాంట్రాక్టులు, కళలు మొదలైన వివిధ వృత్తులలోను, జీవిత విధానాలలోను ధైర్యంగా మాల మాదిగలు ప్రవేశించడం కోసం ప్రత్యేకంగా ప్రభుత్వం ఒక ఆర్థిక సహాయ సంస్థను నెలకొల్పాలి.

(3) జనాభాను బట్టి మంత్రి వర్గాలలోను, తదితర అధికార అనధికార సంఘాలలోను, సంస్థలలోను విధిగా ప్రాతినిధ్యం కల్పించాలి.

(4) అప్పుడప్పుడు, అక్కడక్కడ హరిజనులకు మంజూరు చేయబడుతున్న ఇళ్ళ స్థలాలు తరచు ఊరికి దూరంగా ఇవ్వబడుతున్నాయి. అలా జరగరాదు. అట్టి స్థలాలు ఊరు మధ్యలోగాని, ఊరికి చేర్చిగాని ఇవ్వబడాలి.

(5) వర్ణాంతర వివాహాలను ప్రభుత్వం ఆర్థిక సహాయం ద్వారా ప్రోత్సాహించాలి.

(6) ప్రమోషనులలో కూడ షెడ్యూల్డు కులాలకు ప్రత్యేక ప్రాతినిధ్యం ఇవ్వాలి. సర్వీసు కమిషను, సెన్సారుబోర్డు, పారిశ్రామిక కార్పొరేషన్లు వంటి వాటిలోను, ప్రభుత్వ శాఖలలోను ఉన్నతాధికార సభ్యులుగా నియమించాలి.

(7) సనాతనమైన భారతీయ కళాసంపద మాలమాదిగలలోను, వెనుకబడ్డ కులాలలోను దాగిఉంది. ప్రోత్సాహంలేక, చిక్కి శల్యావశిష్టంగా ఉంది. అది ఉద్ధరించబడాలి. అందుకు సాంఘిక సంక్షేమ శాఖలో సాంస్కృతిక పునరుజ్జీవన అధికారులను నియమించాలి.

అట్టి అధికారులు మాల మాదిగలలోను, తదితర వెనుకబడ్డ కులాలలోను సాంస్కృతిక ప్రబోధం చేస్తారు. నాటకాలు, నాట్యాలు, ఆటలు, పాటలు, సంగీతం, మోళీ, గారడీ, మాస్టిడి, గడ, రుంజా, సోది, జానపద నృత్యాలు, ఆటలు, కథలు, తోలుబొమ్మలు, చిందులు, డప్పులు, సాము, గరిడీ, కోలాటం వగైరా సనాతన జానపద కళలను పునరుద్ధరిస్తారు.

ఈ నాడు భారతీయ సంస్కృతిగా తైతక్క లాడుతున్న దేదీ భారతీయం కాదు. విదేశీ వెర్రి తలలకు అది నకలు మాత్రమే. అందుకే అంతర్జాతీయ రంగంలో మనం ఎందుకూ పనికి రాకుండా పోతున్నాం.

47

విప్లవ వాదుల మని చెప్పుకునే అగ్ర కులాలకు చెందిన వారికి సొంతంగా ఆలోచించే శక్తిలేదు. విదేశీ ఇజాలను స్వదేశీ నిజాలకు మలుచుకొనే ప్రతిభలేదు.

భారత దేశంలో ఉన్నవి వర్గాలు కావు, కులాలు. ఇక్కడిది వర్గ పోరాటం కాదు, కులపోరాటం.

వర్గాలలో అంత్య వర్గం కార్మికులు. కులాలలో అంత్యకులం మాల మాదిగలు.

కార్మికులకు లేని అదనపు అసౌకర్యం మాల మాదిగలకుంది. అది అంటరాని తనం.

అందుకే - ఈ భారత దేశంలో మానవుడు మానవుడుగా బ్రతకాలంటే, పురోగమించాలంటే, పూర్ణవికాసం పొందాలంటే అస్పృశ్యత పోవాలి. కుల వ్యవస్థ నశించాలి.

అట్టి పనికి పూనుకోగలవాళ్లు, ప్రాణాలను బలిపెట్టి అయినా దానిని సాధించగలవాళ్లు ఒక్క మాలమాదిగలే!

నే నిస్తున్న నినాదానికి మూల హేతువు కూడా అదే!

మాల మాదిగ యువకుల్లారా! ఏకం కండి! అస్పృశ్యతపై, కుల వ్యవస్థపై కత్తికట్టండి!

48

భారత దేశంనుంచి, హైందవ సమాజం నుంచి అస్పృశ్యతనూ, కుల వ్యవస్థనూ నిర్మూలించడం అంటే మాటలు కాదు. నీతులు, ఉద్బోధలు, ప్రచారం, మతాంతరీకరణ వంటివేవీ లాభంలేదు. ఈ పద్ధతులన్నీ తరతరాలుగా, మహామహులుగా పేరొందిన అనేక మందిచే అనుసరించబడుతూ వస్తున్నట్టివే. అవన్నీ విఫలం కావడానికి కారణం మాల మాదిగలలో చైతన్యం లేకపోవడమే. తాము కూడా ఇతరులవలె మానవులమే అన్న జ్ఞానం కలగకపోవడమే.

49

ఇప్పుడు జరగవలసిం దేమిటి? వాస్తవ కార్యక్రమం ఏమిటి? మన కార్యక్రమాన్ని మాల మాదిగ పేటల నుంచి ప్రారంభించాలనుకొన్నాం కదా. ఎలా ప్రారంభించాలి?

అందుకు క్రమబద్ధంగా అనుసరించవలసిన కార్యక్రమం ఇది:

(1) ముందుగా మాల మాదిగలు ఏకం కావాలి.

(2) హరిజన విద్యావంతులలోను, ఉద్యోగులలోను ధైర్యాన్నీ, త్యాగబుద్ధినీ స్వజన సేవాసక్తినీ, కళాహృదయాన్నీ పెంపొందించాలి.

(3) ఇతర వెనుకబడ్డ కులాల వారిలో ప్రస్తుతం ఉన్న అజ్ఞానాన్నీ, అపోహలనూ తొలగించాలి.

(4) అగ్రకులాల యువకులలో అభ్యుదయ భావాలు, దూరదృష్టి, జాతి సాముదాయక పురోభివృద్ధి కాంక్షా కలవారు అనేక మంది ఉన్నారు.అట్టి వారందర్నీ మన ఉద్యమంలోకి ఆకర్షించాలి. వారికి వాస్తవ పరిస్థితుల్ని వివరించి చెప్పి, లక్ష్యాన్ని స్పష్టంగా చూపి, కార్యక్రమాన్ని అసందిగ్ధంగా ఆవిష్కరించాలి.

(5) అభ్యుదయకరమైన ప్రభుత్వ శాసనాలు ఖచ్చితంగా అమలు జరిగేటట్టు చూడాలి.

(6) కులమత విచక్షణ లేకుండా– అన్యాయం, అక్రమం, ఎక్కడ ఎవరికి జరిగినా ప్రతిఘటించడానికీ, స్వపర బేధం లేకుండా ధర్మాన్ని పరిరక్షించడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలి.

(7) వర్ణాంతర, మతాంతర వివాహాలను ప్రోత్సహించాలి.

(8) పేదరికాన్ని రూపుమాపేందుకు, సంపదను పెంచేందుకు, కులమత భేదాలను తొలగించేందుకు, ఐక్యతను పోషించేందుకు జరిగే ప్రతి పనికీ తోడ్పడాలి.

50

మాల మాదిగలు ఏకం కాకుండా – దేశంలో ప్రజలకోసం ఏ మంచి పనీ జరగదు. అస్పృశ్యత పోదు. అస్పృశ్యత పోకుండా కుల వ్యవస్థ నశించదు. అది నశించకుండా జాతికి పురోగతి లేదు. స్వాతంత్ర్యం పేరుతో, ప్రజాస్వామికం పేరుతో ఈ ఇరవై సంవత్సరాలూ జరిగిన పరిపాలన ఈ సత్యాన్ని నిరూపిస్తున్నది.

51

హరిజనులు, షెడ్యూల్డు కులాలు, మాలమాదిగలు – ఈ మూడు మాటలను నేను ఒకే అర్థంలో అస్పృశ్యులుగా చూడబడే వర్గం ప్రజలకు వాడుతున్నాను.

రాజ్యాంగంలో, ఒక షెడ్యూలులో (అనుబంధంలో) పేర్కొనబడ్డ కులాలు కనుక షెడ్యూల్డు కులాలు అంటున్నారు. అంటరాని తనం పోతే, షెడ్యూలు కూడ పోతుంది.

దేశం మొత్తం మీద అంటరాని వారుగా పేర్కొనబడే వారిలో మాల మాదిగలే మెజారిటీ కులం. అందుకే షెడ్యూల్డు కులాలన్నింటికీ కలిపి మాలమాదిగ అనే మాటను వాడాను. నాకు బాగా ఇష్టమైన మాట ఇది.

హరిజన అనేది ఒక కవి వాడిన పేరు. ఎవరో గుజరాతీ కవి కాబోలు అంటరానివారు హరి (భగవంతుని) యొక్క బిడ్డలని, పవిత్రులని చెప్పడానికి ఆ మాట వాడాడు. ఆ మాటను గాంధీజీ తీసుకుని ప్రచారం చేశాడు.

ఇది ఒక కవి నోటి నుంచి వచ్చినమాట కనుకను, కుల వ్యవస్థలో శూద్రుల తర్వాత పంచమ కులంగా మాలమాదిగలు పిలవబడుతూ ఉండడం వల్లను, ఈ మాట దేశం మొత్తంమీద వాడుకలోకి వచ్చి ఉండడం వల్లను, "హరిజన" పదాన్ని కూడ వాడాను.

ఇవికాక- నిరుద్ధ అనేమాట ఒకటి ఉంది. దాని అర్థం నిరోధించబడ్డ, ఆటంక పరచబడ్డ అని అర్థం. నిరుద్ధకులాలు అనికూడ అనవచ్చు. నేను ఈ గ్రంథంలో ఈ నాలుగు పదాలను ఆనుకూల్యాన్ని బట్టి పర్యాయపదాలుగానే వాడాను.

52

హిందవ సమాజంలో నాలుగే వర్ణాలున్నాయనీ, అయిదోది లేదనీ మనుస్మృతిలో మనువు చెప్పాడు. అసలు మూడు వర్ణాలే. శూద్రులు నాలుగో వర్ణంగా తర్వాత చేర్చుకోబడ్డారు. ఇప్పుడు మాల మాదిగలు అయిదో వర్ణంగా (పంచమ వర్ణంగా) పరిగణించబడుతున్నారు.

శూద్ర వర్ణంలో అనేక కులాలున్నై. కాపు, కమ్మ, రెడ్డి, వెలమ, గౌడ, బలిజ, రజక, యాదవ, ముదిరాజ వగైరా ఎన్నో కులాలు అందులో కలిసి ఉన్నై. ఆ కులాలన్నీ కలిసి ఐక్య పోరాటం జరపడం వల్లనే, అగ్ర వర్ణాలుగా చెప్పబడే ఆ మూడు వర్ణాలు సమాధానపడి, శూద్ర వర్ణానికి తమ గ్రామ వ్యవస్థలో గౌరవ ప్రదమైన స్థానాన్ని ఇవ్వడం జరిగింది. వర్ణాలు నాలుగైనై.

కాలక్రమంలో, ఏ కారణం చేతనైతేనేమి, ఇప్పుడు పంచమ (అయిదో) వర్ణం తయారయింది. ఇది ఇంకా అంటరానిదిగానే పరిగణించ బడుతున్నది.

ఈ పంచమ వర్ణంలోని కులాలన్నీ కలిసి, ముఖ్యంగా మాల మాదిగలు కలిసి, ఐక్య పోరాటం జరపకుండా వీరికి న్యాయం ఎలా జరుగుతుంది? గ్రామ వ్యవస్థలో గౌరవ ప్రదమైన స్థానం ఎలా లభిస్తుంది?

చరిత్ర పునరావృత్తం కాక తప్పదు.

ఆ నాడు శూద్రులవలెనే, ఈ నాడు హరిజనులు కూడా, మానవత్వం

కోసం సమానత్వం కోసం, ధర్మం కోసం, దైవం కోసం– ప్రాణాలకైనా తెగించి నాల్గుపడగల హైందవ నాగరాజుపై తొడగొట్టక తప్పదు.

ఈ పరిస్థితిని వాయిదా వెయ్యగలమే కాని, తప్పించుకోలేం. కనుక, దాన్ని నేడే ఎదుర్కొని పరిష్కరించి వెయ్యడం ఉభయత్రా శ్రేయస్కరం కాదా?

అందుకే– హరిజనులకు, అంటే మాలమాదిగలకు, ఈ హెచ్చరిక చేస్తున్నాను.

దేశం జనాభాలో సుమారు అయిదోవంతు మాలమాదిగలే.

కులాల వారీగా లెక్క చూచుకుంటే, దేశంలో మెజారిటీ కులం మాలమాదిగలే.

మెజారిటీ కులాన్ని మైనారిటీ కులాలు అణచిపెట్టి ఎందుకు ఉంచుతున్నై?

హరిజన యువకుల్లారా! ఆలోచించండి!

53

వర్గాలున్నంత వరకు వర్గ పోరాటం ఎలా తప్పదో, కులాలున్నంత వరకు కుల పోరాటం అలా తప్పదు.

వర్గ రహిత సమాజాన్ని, కార్మికవర్గం మాత్రమే స్థాపించగలదు. కులరహిత ప్రజాస్వామిక సోషలిజాన్ని హరిజన కులం మాత్రమే నెల కొల్పగలదు.

54

హైందవ సమాజం నుంచి కుల వ్యవస్థ రూపుమాసిపోయేదాకా మాలమాదిగ కులం ఉండక తప్పదు.

(1) మాల మాదిగలు తమలో తమకు గల అంతర్వివాదాలను తొలగించుకొని ఒకే ఒక కులంగా రూపొందేవరకూ–

(2) ఆ తర్వాత – వెనుకబడ్డ కులాలూ, మధ్యతరగతి కులాలూ తమ కులతత్వ శృంఖలాలను త్రెంచేసుకొని, దేశంలో కులవ్యవస్థ లేని ఏక సమాజ గ్రామాలు ఏర్పడేవరకూ–

మాల మాదిగల అభివృద్ధికోసం ప్రత్యేక కృషి జరగకతప్పదు. అందుకు ముందుగా మాలమాదిగ యువకులు త్యాగాలు చెయ్యక తప్పదు.

55

అస్పృశ్యత పేరుతో అమానుషంగా అణచిపెట్టబడ్డ వాళ్ళు మాలమాదిగలు. అందువల్ల మాల మాదిగ యువకులలోనే విప్లవ చైతన్యం ఉరకలు వేస్తూ ఉండాలి. తెగింపు, త్యాగం, పట్టుదల పరాకాష్ఠ పొంది ఉండాలి. ఆగిపోయిన మానవతా జీవధారకు తిరిగి ప్రాణం పోయగల నవయువకులు ఒక్క మాలమాదిగ పేటలలోనే ఉన్నారు. కనుక, వారికే నేను ఈ ఉద్బోధ చేస్తున్నాను. ఏకం కమ్మంటున్నాను. ధర్మంకోసం పోరాడమంటున్నాను.

56

మాల మాదిగలు ఏకం కావడం ఎలా?

మాల మాదిగ– ఈ రెండూ వేరు వేరు కులాలుగా ఉంటున్నై కదూ ఇప్పుడు?

ఈ రెంటికీ మధ్య పరిస్థితులలో కాని, ఆహార విహారాలలో కాని, వేషభాషలలో కాని, ఊరికి వెలపల గుడిసెల్లో ఉండడంలోకాని, అగ్రవర్ణాలకు వెట్టి చాకిరీ చెయ్యటంలో కాని, దారిద్ర్యంలో కాని–ఏ విషయంలో అయినా కానీ, తేడా ఏమైనా ఉన్నదా?

మాల మాదిగ పేటల మధ్య కాని, వారి వృత్తులమధ్య కాని, పరిశుభ్రతలో కాని తేడా ఏమైనా ఉన్నదా?

తేడా ఏమాత్రమూ లేనప్పుడు, ఉభయులూ ఒకేరకమైన బాధలకు అవమానాలకు, అన్యాయాలకు గురి అవుతున్నప్పుడు మాలమాదిగలు ఏకమై, ఒకే ఒక కులంగా కలిసిపోవడం విజ్ఞత కదా?

నియోగులు, వైదికులు, వైష్ణవులు, ద్రావిడులు వగైరా ఎన్నో శాఖలు కలిసి ఒక్క బ్రాహ్మణకులం అయినట్టు మాల, మాదిగ, పాకీ, చచ్చడి, రెల్లి వగైరా దళిత శాఖలన్నీ కలిసి ఒకేఒక కులం ఎందుకు కారాదు?

57

కొన్ని కొన్ని ప్రాంతాలలో మాలలు, మాదిగలు ఆనువంశికంగా అనుసరించే కొన్ని కొన్ని ప్రత్యేక వృత్తులకు సంబంధించిన ఇబ్బందులు ఉంటే ఉండవచ్చు. ఎముకలు, కొమ్ములు, చర్మం, మాంసం, చేపలు, కోళ్లు, పందులు మొదలైన వాటికి చెందిన పరిశ్రమలు కొంత అపరిశుద్ధ వాతావరణాన్ని కల్పించవచ్చు. కొన్ని కొన్ని పరిసరాలు కొంత కొంత మందికి కంపరం పుట్టించ వచ్చు. నిజమే.

నా మట్టుకు నాకు కుక్కల్నీ, పిల్లుల్నీ, కోళ్ళనీ ఇండ్లలో పెంచే వాళ్ళని చూస్తే చాలా అసహ్యం. అలాంటి ఇళ్ళు, అవి ఎంతటి గొప్ప వాళ్ళవైనా సరే, మృగశాలల్లా బోనుల్లా కనిపిస్తై. అయితే నాకు అసహ్యంగా కనిపించినంత మాత్రంచేత, వాటి గొప్పతనానికి ఏమీ లోపం ఉండదుకదా?

వ్యక్తిగతమైన ఇష్టాయిష్టాలు, అభిరుచులు సమాజ శ్రేయస్సుకు భంగకరాలూ, పీడాకరాలూ కాకూడదు.

పైగా– అటువంటి కొన్ని వృత్తుల్నీ, పరిశ్రమల్నీ అనుసరిస్తున్న కులాలు అగ్రవర్ణాలలో కూడ ఎన్నో ఉన్నై. వారంతా అస్పృశ్యులుగా పరిగణించబడడం లేదుకదా!

అస్థి, చర్మ, మాంస, మృగ, మత్స్య మొదలైన పరిశ్రమలకు, ఆధునికమైన పద్ధతులలో కర్మాగారాలను నెలకొల్పుకుంటే – అన్నివిధాలా శ్రేయస్కరంగా ఉండగలదు. అందుకు ప్రభుత్వం వారి లెదర్‌బోర్డు, కుటీర పరిశ్రమల సంస్థ వంటివి సహాయపడగలవు.

కాగా– మాలమాదిగలు ఏకమై, ఏక కులంగా కలిసిపోవడానికి వృత్తి భేదాలు ఆటంకం కాజాలవు.

ఇక మిగిలిన వెల్లా మూఢ భ్రమలు. అవి సహించరానివి. తాతల నాటి నుంచీ వస్తున్న ఆచారాన్ని వదులుకోవడం ఎలా అనేది ప్రతీకులంలోనూ ముసలమ్మలలో ఉండే మూఢాచార జాడ్యం. అట్టి జాడ్యాన్ని ఏ యువకులూ, ముఖ్యంగా మాల మాదిగ యువకులు సహించకూడదు.

అందువల్ల మాల మాదిగ యువకుల్లారా! మీరంతా కలిసి ఏక కులం కండి!

58

ఇప్పుడు మీరంతా ఒకే కులం మాలమాదిగ.

మాల అంటే పుష్పమాల అని అర్థం. మాదిగ అంటే మాదే కదా అని అర్థం. ఈ రెండు మాటలు వేరు వేరుగా ఉన్నప్పటికంటే కలసి ఉంటే ఎంత సొగసైన అర్థం వస్తుందో చూడండి!

మాలమాదిగ అంటే ఏమిటి? పుష్పమాల మాదేకదా అని! విజయం మాది అని!

ఎప్పటికైనా విజయం మీదే. మీరు కాకపోతే మీ బిడ్డలు, వాళ్ళు కాకపోతే వాళ్ళ బిడ్డలు, మనుమలు ఈ ఉద్యమాన్ని ఏదో ఒక పేరుమీద, ధైర్య సాహసాలతో, ధర్మ దీక్షతో ముందుకు తీసుకపోకమానరు. దేశంలో కులరహిత సమ సమాజం ఏర్పడకమానదు. అప్పుడైనా విజయం మీదే కదా?

59

ఒక మాల మాదిగను ఎవరైనా కులం అడిగినప్పుడు, జవాబు ఇలా ఉండాలి.

"ఏ కులం నీది!"

"మాలమాదిగ"

"మాలవా? మాదిగవా?"

"మాలమాదిగను."

ఇక నుంచి ఇలానే చెప్పుకుంటానని ప్రతి మాలమాదిగ యువకుడూ నేడే శపథం తీసుకోండి!

చాలా కాలంగా నేను ఇలానే చెప్పుకొంటున్నాను. మాలమాదిగలు రెండు కులాలన్న సంగతే మరిచిపోయాను.

నాకు సాధ్యమయింది మీకు ఎందుకు సాధ్యంకాదు?

హరిజన అని చెప్పితే, అందులో ఏ ఉపకులమో చెప్పకూడదు. అది ఒక్కటే కులం, బహు సనాతన కులం. నేడు నిరుద్ధకులం.

నిమ్న జాతి అని మీరెప్పుడూ చెప్పుకోకండి. మనది నిమ్న జాతికాదు. మనం తక్కువవాళ్ళం కాదు. ఎవరికంటె తక్కువ?

ఒక మనిషి మరొక మనిషి కంటె, ఒక కులం మరొకకులం కంటే, ఒకజాతి మరొక జాతికంటే తక్కువ ఎన్నటికీ కాదు.

60

"బ్రాహ్మణులు నియోగులమనీ, వైదికులమనీ, మరొకటనీ తమ శాఖా భేదాలను చెప్పుకోవడం లేదా? మనం మాలల మనీ, మాదిగల మనీ చెప్పుకోవడంలో తప్పేమిటి?" అని మీరడుగవచ్చు.

బ్రాహ్మణులలోను, తదితర అగ్రకులాలలోను కూడ అంతశ్శాఖాభేదాలెన్నో ఉన్నై. ఆయా శాఖల మధ్య తిండి తిప్పలూ ఇచ్చి పుచ్చుకోడాలూ కూడ ఉండవు. అయినా వారంతా కలిసే ఉంటున్నారు. ప్రక్క ప్రక్క ఇళ్ళలో కాపురాలు చేస్తున్నారు. తమలో తాము అస్పృశ్యతను పాటించుకోవడం లేదు. ఒకే బావి నీళ్ళు తాగుతున్నారు. కనీసం అలాగైనా మీ రెందుకుండరు? అగ్రకులాలకు సాధ్యమైన పని మీ కెందుకు సాధ్యంకాదు?

61

గుంటూరు జిల్లాలో, తెనాలి వద్ద కొలకలూరు అనే గ్రామంలోని మాల మాదిగలు ఈ సమస్యను చాలాకాలం క్రితమే పరిష్కరించుకున్నారు. అదొక చక్కని చరిత్ర.

మాల మాదిగలు ఏకం కావాలన్న వాంఛ గాఢంగా ఉన్న యువకులు ఆ గ్రామం వెళ్ళి, అక్కడి యువకులతో కలిసి దాన్ని ఎంత దీక్షతో, ప్రతిభతో సాధించారో పరిశీలించి తెలుసుకోండి.

ఆ గ్రామం జనాభాలో సగానికి సగం ఉన్న మాలమాదిగలు ఇప్పుడు ఒక్కటే కులంలా, కుటుంబంలా కలిసిమెలసి ఉంటున్నారు. తాము రెండు కులాలన్న మాటే మరిచిపోయారు.

కొలకలూరిలో సాధ్యమైన మాలమాదిగ సమైక్యం తక్కిన ఊళ్ళలో ఎందుకు సాధ్యం కాదు?

62

గ్రామంలో ఒక మాలపేట, ఒక మాదిగపేట దూరదూరంగా ఉన్నై. అయితే – మాదిగ పేటకు దగ్గరగా కొన్ని మాలకొంపలూ, మాలపేటకు దగ్గరగా కొన్ని మాదిగకొంపలూ ఉన్నై. రెండు పేటలకూ రెండు మంచినీళ్ళబావులున్నై.

మాల పేటకు చేరి ఉన్న మాదిగలు మంచినీళ్ళకోసం దూరంలో గల మాదిగ పేటకు పోవలసి ఉంది. అదే పరిస్థితి మాలలకూ ఉంది.

ఎండ, వాన, చీకటి, పనితొందర – ఎన్ని అసౌకర్యాలకైనా, ఇబ్బందులకైనా ఓర్చుకుంటున్నారే కాని, ఒకరి బావిని ఒకరు ముట్టుకోడానికి అంగీకరించలేదనడం కంటే, అలాంటి ఆలోచనే వాళ్ళకు రాలేదనడం సమంజసమేమో.

తాతల నాటినుంచీ వచ్చే ఆచారం గుడ్డిగా సాగిపోతూనే ఉంటుంది. ఎవడో ఒక బుద్ధిమంతుడు పుట్టి దాని ఔచిత్యాన్ని ప్రశ్నించేదాకా!

మంచినీళ్లు మైలపడతాయా? గంగకు అంటు దోష ముందా?

ఎవడో ఒక చాదస్తపు బ్రాహ్మడు వ్రాసిపెడితే, ఎవడో ఒక భూపాలుడు తన స్వప్రయోజనం కోసం దాన్ని అమలుపెడితే – జనం గుడ్డిగా దానికి లొంగిపోవలసిందేనా? సొంత ఆలోచనే అఖ్ఖర లేదా? అక్కడ బావిని వాళ్ళంతా, ఇక్కడి బావిని వీళ్ళంతా వాడుకుంటే ఈ ఇబ్బందులన్నీ తొలగిపోయి, ఉభయులకూ సుఖంగా ఉంటుంది కదా? అలా వీళ్ళెందుకు చెయ్యరు?

మాలపేటకూ మాదిగపేటకూ చెందిన కొంతమంది కుర్రవాళ్ళు కలిసి ఈ ఆలోచన చేశారు. దాన్ని అమలు పరచడానికి ఒక పథకం వేశారు.

ప్రతి కొత్త పథకానికి ప్రతిఘటన ఉంటుంది. ప్రతిఘటనను జయప్రదంగా ఎదిరించి ముందుకు పోయినప్పుడే అది ప్రగతి అవుతుంది.

ప్రగతి కాముకులైన ఆ మాలమాదిగ యువకుల పథకాన్ని ఆచార మూఢులైన పెద్దలు, ముసలమ్మలు ఎదిరించారు. మాలమాదిగల మధ్య మనస్పర్థలు

కలిగించి, జుట్లు ముడివేసి, కలహాలను పెంచి అందువల్ల తాము లాభపడుతూ ఉండే అగ్రకుల లౌక్యులు అట్టి పెద్దలకు, ముసలమ్మలకు హుషారిచ్చారు.

అయినా - యువకులు భయపడలేదు. తమ పట్టు విడువలేదు. తమ కార్యక్రమాన్ని విడవకుండా సాగించారు.

ఏమిటా కార్యక్రమం?

మాలల బావిలోని నీళ్ళను మాదిగల బావిలోను, మాదిగల బావిలోని నీళ్ళను మాలల బావిలోను పోయడం! అక్కడి పరిస్థితులకు వాతావరణానికి అనుకూలమైన అలాంటివే ఉభయ కులాలనూ కలిపే పనులు కొన్ని కొన్ని చెయ్యడం!

రోజులు గడిచే కొలదీ ప్రతిఘటన సడలిపోయింది. తర్వాత ఈ ప్రాంతపు మాలమాదిగలు కలిసి ఈ బావినీ, ఆ ప్రాంతపు మాల మాదిగలు కలిసి ఆ బావినీ వాడుకోవడం సాగించారు. ఉభయులకూ హాయిగా ఉంది.

ఆ తర్వాత మాల యువకులు మాదిగల ఇళ్ళలోను, మాదిగ యువకులు మాలల ఇళ్ళల్లోను కాఫీ ఫలహారాలను తీసుకోవడం ప్రారంభించారు.

ఉభయ కులాలకు చెందిన, చదువుకొన్న, ఆత్మబలం కల యువకులు ఈ కార్యక్రమాన్ని సాగిస్తున్నప్పుడు ఎవరు మాత్రం ఏమి చేయగలరు?

ఇప్పుడా గ్రామంలో మాలమాదిగలు సంఘటితులై, బలాధిక్యులై, తిరుగులేని పలుకుబడి కలవారై ఉన్నారు. ఎప్పుడైతే మాలమాదిగలు ఒక్కటై పోయారో అప్పుడే తక్కిన కులాలవారు అంటరానితనాన్ని పాటించడం మానివేశారు.

అట్టి మార్పు ప్రతి గ్రామంలోనూ సాధ్యమే - మాలమాదిగ యువకులు పట్టుదలతో పూనుకొని పని చేస్తే.

63

ఇప్పుడు కూడ మాలమాదిగల మధ్య చదువుకొన్న వాళ్ళలో భేదాలు లేవు. విద్యార్థులు, ఉద్యోగులు, నాయకులు అంతా కలిసే ఉంటారు. కలిసే తింటారు. కొన్ని కొన్ని చోట్ల వివాహ సంబంధాలు కూడ జరుగుతున్నై. ఉన్న సమస్య కేవలం గ్రామాలలోని పేటలలోనే. పరిష్కరించాలనుకుంటే యువకులకు ఇది పెద్ద సమస్యేమీ కాదు.

నిజానికి తమలో తాము అంటరానితనం పాటించుకొంటున్న పేటలు ఎక్కువగా ఉండవు. అలా ఉన్న పేటలలోనే మనం కొలకలూరును ఆదర్శంగా తీసుకొని పని చెయ్యవలసి ఉంటుంది.

64

కొన్ని ప్రాంతాలలో మాలలు, మరికొన్ని ప్రాంతాలలో మాదిగలు మెజారిటీగా ఉంటారు. ఎక్కడ ఎవళ్ళు మెజారిటీగా ఉంటే, వాళ్లు ఈ సమైక్యం విషయంలో పట్టుదలతో, సహనంతో, త్యాగబుద్ధితో పని చెయ్యవలసి ఉంది.

65

మాలమాదిగలలో ఏ వర్గం అంటరానితనం అనే పాపాన్ని పాటిస్తున్నదో ఆ వర్గమే దాన్ని తొలగించుకోవడానికీ, సమైక్యం పొందడానికీ ముందడుగు వెయ్యాలి. అందుకు ఆ పేటలోని విద్యార్థులు, ప్రగతికాములు నాయకత్వం వహించాలి.

66

మాలమాదిగలలో అంటరానితనం పోయి, వారు ఉభయులూ ఒకే కులంగా మారిన తక్షణం మొత్తం అంటరానితనమే అదృశ్యమై పోతుంది.

అంటరానితనం పోవడంతో కుల వ్యవస్థ సడలిపోతుంది. సోషలిస్టు ప్రాతిపదికపై అభ్యుదయ గ్రామ పునర్నిర్మాణం ప్రారంభమవుతుంది.

67

ఊడిస్తేగాని వీధులు శుభ్రపడవు. తోమితేనే గాని అంట్లు తెల్లబడవు. అస్పృశ్యతను, కులవ్యవస్థను, అసమానతను, అభ్యుదయ నిరోధకతను సమాజం నుంచి తుడిచి పారవెయ్యడానికి మాలమాదిగ యువకుల్లారా! చీపుళ్లు చేతపట్టండి.

68

రాజకీయ పార్టీలను నమ్మవద్దు. దేశంలోని అసలు సమస్యలను అర్థం చేసుకొన్న పార్టీ ఒక్కటీ లేదు.

ఏ రాజకీయ పార్టీకైనా లక్ష్యం అధికారం. ప్రజల అభ్యుదయం కాదు.

కష్టపడకుండా ఎక్కువ డబ్బు సంపాదించుకోవడానికి అనువైన మాయాబజారు

రాజకీయ రంగం. ఏ పనీ చేతకాని వాళ్ళకది ఆటపట్టు. అబద్ధాలు, మోసాలు, లంచాలు, కుట్రలు, లాటరీలు, పక్షపాతం, జూదం వంటి వాటితో నిండి ఉంటుందది.

అలాంటి రాజకీయాలతో, పార్టీలతో మనకు పనిలేదు.

తమ స్వార్థం కోసం నాయకులే కులతత్వాన్ని రెచ్చగొడతారు. కులాలమధ్య అనైక్యతను, అసూయను రగులుస్తారు, జాగ్రత్త!

ఎన్నికలు, సభ్యత్వాలు, అధికార పదవులు వంటి వాటికోసం ఎన్ని అకార్యాలకైనా పాల్పడే నాయకులున్నారు. అలాంటి వారు ఏమి చెప్పినా వినవద్దు.

ఈ నాడు దేశంలో రాజకీయాలే వృత్తి అయినై చాలామందికి. అవే ఆశ్రిత పక్షపాతానికి, అసమర్థతకు, అవినీతికి, అన్యాయవర్తనకు దారితీసి దేశాన్ని అధోగతికి ఈడ్చుకు పోతున్నాయి.

పరిస్థితిని అర్థం చేసుకొండి. అంతరాత్మ సాక్షిగా ప్రవర్తించండి. ఐక్యతే లక్ష్యంగా పురోగమించండి. కేవలం ధర్మం కోసమే పోరాడండి.

69

మాలమాదిగలు ఏకం కావడం చాలా మందికి ఇష్టం ఉండదు. పైకి సమైక్యత కావాలని ఉపన్యాసాలు ఇస్తారు. లోలోపల తద్విరుద్ధమైన పనులు సాగిస్తారు. ఇలాంటి ద్విపాత్రాభినయం చేసే నాయకులు అగ్ర వర్ణాలలోనే కాదు మాల మాదిగలలో కూడ ఉంటారు. సభలో ఒకమాట, చాటున ఒకమాట చెప్పే వాళ్ళెవర్నీ నమ్మవద్దు. అట్టివాళ్లు స్వార్థపరులే కాదు, మోసగాళ్లు కూడా.

70

మాల మాదిగల ఐక్య సంఘటనకు, ఆ తర్వాత కుల వ్యవస్థ నిర్మూలనకు, ఆ తర్వాత సర్వజన సమతా సమాజ నిర్మాణానికి పునాదులు మాలమాదిగ పేటలలోనే పడవలసి ఉంది. అందుకు మాలమాదిగ యువకులు, విద్యార్థులు నాయకత్వం వహించవలసి ఉంది. ఈ విషయంలో హరిజనోద్యోగులపై ప్రధానమైన బాధ్యత ఉంది.

71

మాలమాదిగ పేటలలో పుట్టి, బాల్యంలో అక్కడి కష్ట సుఖాలనుభవించి, కులం పేరుమీద స్కాలర్‌షిప్పులతో చదువుకొని, ఆ పేటలలో మాలమాదిగలందరికీ ఆశాజ్యోతులుగా పరిగణించబడి, కులంపేరు మీదనే ఉద్యోగాలు సంపాదించుకొన్న మాలమాదిగ యువకులకు ఆ పేటలపట్ల ఒక తీరని బాధ్యత ఉంది. ఆ బాధ్యత ఎట్టిదో చాలా మంది హరిజనోద్యోగులు గుర్తించలేకుండా ఉన్నారు. దానిని మనం వివరంగా వారికి స్పష్టపరచాలి.

72

పేదపేట అనే ఒక మాలమాదిగ పేట ఉన్నదనుకోండి. ఆ పేటలో వంద గుడిశెలు ఉన్నై. సుమారు ఐదువందలమంది మాలమాదిగలున్నారు. వాళ్ళంతా వ్యవసాయ కూలీలు, పిల్లలు, స్త్రీలు, వృద్ధులు కూడ ఏ పూటగంజి ఆ పూట కాయకష్టం ద్వారా సంపాదించుకోవలసిందే.

రాజ్యాంగాన్ని అనుసరించి ప్రభుత్వం షెడ్యూల్డు కులాలకు చేస్తున్న గొప్పగొప్ప సహాయాలేవీ వాళ్ళదాకా రాలేదు. అవి ఆయాశాఖల సిబ్బంది ఖర్చులదాకా వచ్చి ఇంకిపోయినై. వాళ్ళదాకా వచ్చిన సహాయం ఒక్కటే. అది విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు.

ఆ స్కాలర్‌షిప్పులతో చదువుకొన్న వాళ్ళలో పైకివచ్చి ఉద్యోగాలు సంపాదించుకోగలిగిన వాళ్లు నలుగురు.

ఆ నలుగురూ పట్నంలోనే ఉద్యోగం చేస్తున్నారు. పట్నంలోనే స్థిరపడి పోయారు. వాళ్ళెప్పుడూ ఆ పేటకు రారు. ఆ పేట వాళ్ళు ఆ పట్నం పోరు.

వారిలో ఒకడు పట్నంలో ఇల్లు కట్టుకున్నాడు. ఒకడు కారు కొన్నాడు. ఒకడు ఒక అగ్రవర్గ యువతిని పెండ్లి చేసుకున్నాడు. మొత్తంమీద ఆ నలుగురూ మంచి అభివృద్ధిలోనే ఉన్నారు. వాళ్ళ స్నేహితులంతా అగ్రవర్గాల వారే.

ఆ నలుగురూ పుట్టి పెరిగిన ఆ పేద పేటకు చెందిన ఒక వెంకయ్య వాళ్ళతో చిన్నప్పుడు గోళీలూ, చిత్రబిళ్ళా ఆడుకొన్న వాడు – చదువు మానుకొని కూలి పని చేసుకొంటున్నవాడు– ఒక రోజున తన బాల్య మిత్రుల్ని చూడాలన్న

కాంక్షతో పట్నం వచ్చి- అక్కడున్న వేలకొలది మేడలలో వాళ్ళ మేడ లేవో తెలియక, ఉసూరుమంటూ తిరిగి తన పేటకు వెళ్ళిపోయాడు!

వెంకయ్య ముఖంలో ఆ నలుగురినీ చూచి సంతోషిద్దామనుకొన్న ఆ పేదపేట మాలమాదిగలంతా అతడి ఆశాభంగాన్ని పంచుకొని కన్నీరు కార్చారు - ఒక కొన్ని రోజులపాటు!

73

'ఆ పేద పేటనుంచి నలుగురు మాలమాదిగ యువకులు విద్యాధికులైనారు. ఉన్నతాధికార పదవుల్ని నిర్వహిస్తున్నారు. ధనవంతులైనారు. అగ్రవర్ణాలతో సమానంగా అభివృద్ధి పొందారు. అందరితో కలిసి తిరుగుతున్నారు. తింటున్నారు. ఇక అంటరాని తనం ఎక్కడున్నది? హరిజనులకు ఇంతకంటే ఏం కావాలి?" అంటుంది ప్రభుత్వం!

అంటే- ప్రభుత్వం ఉద్దేశం ఏమిటి? ఆ అయిదు వందలమంది పేదపేట మాలమాదిగలకు ఆ నలుగురు ఉద్యోగులు ప్రతినిధులనే కదా? తమ ప్రాతినిధ్య బాధ్యతను ఆ నలుగురూ ఎలా తీర్చుకుంటున్నారు? ఏమిటి జవాబు?

74

ఆ నలుగురిలో ఒకడు ఒక వర్ణాంతర భవనంలో అద్దెకుంటూ, నాయుడు గారు గా చెలామణి అవుతున్నాడు.

రెండవ వాడు ఒక ముస్లిం వీధిలో నివసిస్తూ, తెలుగే మాట్లాడడు.

మూడవ వాడికి క్లబ్బు మిత్రుల తోడిదే లోకం. ఆ మిత్రులంతా లక్షాధికారులైన అగ్రవర్ణాల జూదగాళ్ళు.

.నాలుగోవాడు ఒక అగ్రకులం అమ్మాయిని పెళ్ళాడి, తన తల్లి దండ్రుల్ని కూడ ఇంటికి రానివ్వడు.

ఇదీ ఆ నలుగురూ తాము పుట్టి పెరిగిన మాలమాదిగ పేటకు చేస్తున్న సేవ!

హరిజనులకు ప్రత్యేక ప్రాతినిధ్యం ద్వారా స్కాలర్షిప్పులను, ఉద్యోగాలను ఇవ్వడంలో ప్రభుత్వం ఆశించిన ఫలితం ఇదేనా?

కూలీ నాలీ చేసుకొని, గంజినీళ్ళు తాగి బ్రతుకుతూ, తమ బిడ్డల్ని శ్రమపడి చదివించుకొంటూ - వాళ్ళు పెరిగి పెద్ద ఉద్యోగాలు చేసి తమనూ, తమ పేటనూ ఉద్ధరిస్తారనుకొంటూ- గంపెడాశలు పెట్టుకొన్న ఆ పేద పేట మాలమాదిగల ఆశలు మట్టిగొట్టుకు పోవలసిందేనా?

ఆ పేట నుంచి పైకి వచ్చిన ఆ నలుగురూ ఇక ఆ పేటకు ఎందుకూ ఉపయోగపడరా? వాళ్ళు చచ్చిన వాళ్ళలో జమేనా? ఆ పేట పందేళ్ళనాడు ఎలా ఉన్నదో - ఇప్పుడూ అలానే హైన్యదైన్యాలలో క్రుళ్ళుతూ ఉండి పోవలసిందేనా?

75

మాలమాదిగ ఉద్యోగులారా! కళ్ళు తెరవండి!

మీ చదువులు, మీ ఉద్యోగాలు, మీ పదవులు, మీ జీతాలు, మీ విందులు, వినోదాలు అన్నీ మీరు పుట్టి పెరిగిన మాలమాదిగ పేటల కష్ట జీవుల ఆశాదృక్కుల ఆకాంక్షలే అన్న సత్యాన్ని మరచి పోకండి!

76

సుఖ భోగాలను అనుభవించ వద్దని కాదు. ధనం సంపాదించవద్దని కాదు. చదువులు, ఉద్యోగాలు, రాజ్యాంగ రక్షణలు, వాటి అమలు కోసం మన పోరాటాలు- అన్నీ న్యాయంగా మనకు రావలసిన సుఖ సంతోషాల కోసమే. అయితే, వాటిని మీరు అనుభవిస్తున్నప్పుడు, అవి మీకు ఎలా లభించాయో మాత్రం జ్ఞాపకం పెట్టుకోండి.

77

మాల మాదిగ ఉద్యోగులకు మాత్రమే నేనీ హెచ్చరిక చేస్తున్నాను.

మీరు కష్టపడి ఉద్యోగాలు చేస్తున్నారు, సంపాదించు కొంటున్నారు. మీ సంపాదనను మీ ఇష్టం వచ్చినట్లు ఖర్చు పెట్టుకునే హక్కు మీ కుంది.

అయితే- గుండెలమీద చేయి వేసుకొని, అంబేడ్కరు ముఖం చూచి, ఈ ప్రశ్నకు జవాబు చెప్పండి?

భారత రాజ్యాంగంలో మీ కులానికి కల్పించబడ్డ ప్రత్యేక సౌకర్యాల సహాయంతో చదువుకొని, ఉద్యోగాలు చేస్తున్న మీరు ఆ కులానికి ప్రతినిధులు మాత్రమే కారా? అట్టి మీకు మీ సంపాదనను ఇష్టం వచ్చినట్లు ఖర్చు పెట్టుకునే అధికారం నైతికంగా ఉన్నదా?

మీ సంపాదనలో ఏదో కొంత భాగం మీ కులానికి, మీ పేట అభివృద్ధికి చెందవలసి లేదా?

78

మీ అభివృద్ధే మాల మాదిగల అభివృద్ధి అని ప్రభుత్వం భావిస్తున్నది. అంటే మాల మాదిగల అభివృద్ధికి మీరు అన్ని విధాల తోడ్పడాలనే ప్రభుత్వం కోరుతున్నది. మీరు ఏ విధంగా తోడ్పడుతున్నారు?

నెల కొక్క రూపాయి అయినా మాల మాదిగల అభ్యుదయ నిధికి చందా ఇస్తున్నారా?

ఏడాది కొకసారైనా మీరు పుట్టి పెరిగిన పేటల దుస్థితిని గుర్తుకు తెచ్చుకుంటున్నారా?

ఈ నాటి మిమ్మల్ని స్వార్థపరులుగా, లోభులుగా, నడమంత్రపు సిరులలో మునిగిపోయి జాతిని మరచి పోయిన అంధులుగా వచ్చే తరాల యువకులు నిందించకుండా మీరు ఏ విధంగా జాగ్రత్త పడుతున్నారు?

మీ సంపాదనలో నూటికి పదివంతులైనా మాలమాదిగల సాముదాయక అభ్యుదయం కోసం, సాంస్కృతిక వికాసం కోసం కేటాయించడం మీ కనీస ధర్మం కాదా!

79

టాల్‌స్టాయి మహాశయుని ధర్మకర్తృత్వ సిద్ధాంతాన్ని రష్యాలో మరో పేరుతో సోవియట్ ప్రభుత్వం అమలు జరిపింది. గాంధీజీ అదే సిద్ధాంతాన్ని భారతీయులకు బోధించాడు. కాని ఆస్తిపరులతో కూడిన కాంగ్రెసు దానిని అమలు జరపలేదు.

పేద వర్గాల నుంచి పైకి వచ్చిన మీరైనా దానిని అమలు పరచవలసి లేదా? మీ జీతంపై, మీ ఆస్తిపై మీ మొత్తం కులానికి హక్కులేదా? స్థిమితంగా ఆలోచించుకొని చూడండి.

త్యాగాలు చెయ్యడం, ఆదర్శప్రాయంగా బ్రతకడం మీకు అవసరం. మీ కులం పట్ల మీకు గల పవిత్ర ధర్మాన్ని మీరు నిర్వర్తించడానికి పూనుకొంటే మొత్తం జాతిపట్ల తమకు గల ధర్మాన్ని ధనిక వర్గాల యువకులు గుర్తించగలుగుతారు. దేశాభ్యుదయం కోసం మీతో కలిసి నడవ గలుగుతారు.

దేశంలో ప్రజాస్వామిక వ్యవస్థ నిలవాలంటే– అందుకు, ఓ హరిజన యువకులారా, మీరే మార్గదర్శకులు కాక తప్పదు. త్యాగాలు చెయ్యక తప్పదు.

80

రాజకీయాల జోలి మీకు వద్దు. అందుకు తగిన వారికి వాటిని వదిలేద్దాం.

మాల మాదిగ ఉద్యోగులు చెయ్యవలసిన పని సాంఘిక సాంస్కృతిక రంగాలలో ఎంతో ఉంది.

మీలో కవులున్నారు. గాయకులు, చిత్రకారులు, నర్తకులు ఎంతోమంది ఉన్నారు. ఉపజ్ఞ, ప్రతిభ, పాండిత్యం కలవారెంతోమంది ఉన్నారు. అయితే – వారికి ప్రోత్సాహం ఇచ్చే వారెవరూ లేరు. మీ వాళ్ళను మీ రెందుకు ప్రోత్సహించుకోరు? ఇతర కులాల వారిని చూసైనా ఎందుకు నేర్చుకోరు?

81

సంగీతం, సాహిత్యం, చిత్రలేఖనం, నృత్యం– ఈ రంగాలలోను, నాటక రంగంలోను, అకాడమీల ద్వారాను, ఆకాశవాణి ద్వారాను ఎన్నో కోట్ల రూపాయలను ప్రభుత్వం ఖర్చు పెడుతున్నది. అందులో మాలమాదిగ కళాశీలురకు ఉపయోగ పడుతున్న దెంత?

ఈ కళారంగాలలో కూడ మాలమాదిగలు వెనుకబడి ఉంటే– వారిలో తదభివృద్ధికోసం మొత్తం ఖర్చులో నూటికి ఇరవై వంతులు ప్రభుత్వం ప్రత్యేకించవలసి లేదా?

ప్రభుత్వం అలా చెయ్యకపోతే- చెయ్యించ వలసిన బాధ్యత చదువుకొని ఉద్యోగాలు చేస్తున్న మీపై లేదా?

82

ఎక్కడో ఎవరో పదిమంది ఆర్థికంగా బాగుపడడం, ఉద్యోగాలు చెయ్యడం, పదవులు అలంకరించడం నిజమైన అభివృద్ధి కాదు. జాతి మొత్తం సర్వతోముఖంగా వికాసం పొందడమే నిజమైన అభివృద్ధి, సాంస్కృతిక అభివృద్ధే స్థిరమైన అభివృద్ధి. ఈ సత్యం ఉద్యోగులు చాలామందికి తెలీదు. రాజకీయ నాయకులకు మొదలే తెలీదు.

ఆకాశవాణిలో మీ వాళ్లు ఎంతమంది పాడుతున్నారు? పాట వచ్చినవాళ్లు మీలో లేరా? రవీంద్ర భారతిలో మీ వాళ్లు ఎంతమంది ఆడుతున్నారు? ఆట వచ్చినవాళ్లు మీలో లేరా? ఎందుకు మీరు ఆలోచించరు?

చదువు లేని వ్యక్తికి ఉద్యోగం రాదు. సంస్కృతిలేని జాతికి అభ్యుదయం లేదు.

సంగీతం, సాహిత్యం, శిల్పం వగైరా కళలలో అభినివేశంగల ఎవరూ బానిసలు కాబోరు. అది లేని ఎవరూ స్వతంత్రులుగా మనలేరు.

నిజమైన అభివృద్ధి కోసం మీరు ఎందుకు కృషి చెయ్యరు?

83

క్రైస్తవులకు బైబిలు ఉంది. ముస్లింలకు ఖురాను ఉంది. బౌద్ధులకు ధమ్మపధం ఉంది. సిక్కులకు గ్రంథ సాహేబా ఉంది. హిందువులకు భగవద్గీత ఉంది. కమ్యూనిస్టులకు మార్క్సిభౌతిక వాదం ఉంది. ప్రజాస్వామ్యానికి ఆంగ్ల సంవిధానం ఉంది.

జీవిత సౌభాగ్యాన్నీ, జీవేశ్వర సమైక్యాన్నీ- స్వార్థాన్నీ తీర్థాన్నీ కూడ సమకూర్చి పెట్టే మతమో, మంత్రాంగమో ప్రతి ఒక్క వర్గం ప్రజలకూ ఉంది. తమ తమ మతాలకూ, మంత్రాంగాలకూ అనుగుణంగా సంస్కృతినీ, సంస్కారాన్నీ, కళలనూ, కాంతులనూ నిర్మించుకొంటూ, వికసింప జేసుకొంటూ ఆయా వర్గాల ప్రజలు

మానవుల్లా బ్రతుకుతూ, దైవత్వం కేసి పరుగులు పెడుతున్నారు.

ఓ మాలమాదిగ ప్రజలారా! మీరేం జేస్తున్నారు?

క్షుద్ర దేవతల్ని కొలుస్తూ, క్షుద్ర నాయకుల చుట్టూ ప్రదక్షిణాలు చేస్తూ, తరతరాలుగా ఎలా ఉన్నారో అలాగే ఇక ముందు కూడా క్షుద్ర జీవితాలు గడుపుతూ, బానిసలై పడి ఉంటారా?

మీ మతం ఏది? మీ దైవం ఎవరు? మీ లక్ష్యం ఏమిటి?

ఈ ప్రశ్నలకు స్పష్టంగా జవాబు చెప్పుకొని- దాని సాధనకై ప్రాణాలకు సైతం తెగించి పోరాడండి!

ఓ హరిజన ఉద్యోగీ! నీవు కోరుకోవలసింది- వెయ్యి రూపాయల జీతమో, కారో, మేడో, కాదు. ఒక పద్యాన్ని విని ఆనందించు. ఒక శిల్పాన్ని చూచి మెచ్చుకో. ఒక నాట్య ప్రదర్శనానికి అధ్యక్షత వహించు. నీ జన్మ తరిస్తుంది.

లక్ష్మి నిలకడలేని దయ్యా, మూఢయ్యా! స్థిర సౌభాగ్యాన్ని ప్రసాదించే సరస్వతిని నమ్ముకోవయ్యా! చాలు!

నిజానికి- నీకు ఉద్యోగం ఎలా వచ్చింది? సరస్వతి వల్లనే కాదా?

84

ఈనాడు మాలమాదిగ ఉద్యోగుల మనస్తత్వం చాలా విపరీతంగా ఉంది.

అందులో చాలా మంది తాము మాలమాదిగ కులానికి చెందిన వారమన్న విషయాన్నే మరచిపోయారంటే అతిశయోక్తి కాదు.

తాము పుట్టి పెరిగిన మాల మాదిగ పేటల్ని మరచిపోయి, మన ఉద్యోగులు తాము ఒక ప్రత్యేక కులంగా తయారవుతున్నారు. తమ చుట్టూ ఒక త్రిశంకు స్వర్గాన్ని సృష్టించుకొని, పిచ్చి సంతోషం పొందుతున్నారు. ఇది చాలా ప్రమాదకరమైన పరిస్థితి. వట్టి పేక మేడ.

పైకి వచ్చిన ప్రతీ మాలమాదిగ వ్యక్తీ మాలమాదిగ పేటలనుంచి దూరమై పోతుంటే- ఇక ఆ పేటల గతి ఏం కాను? అలా ఒళ్లు మరిచి పోతున్న వారిని మేల్కొలపడం, కర్తవ్యాభిముఖుల్ని చెయ్యడం ఎలా? ఆలోచించండి.

85

అమధ్య దేశ నాయకులలో అగ్రగణ్యులైన జగజ్జీవనరాంగారు హైదరాబాదు వచ్చినప్పుడు ఆయనకు షెడ్యూల్డు కులాల ఉద్యోగుల సంక్షేమ సంఘం సన్మానం చేసింది. అందుకు ఒక వెయ్యి రూపాయిల వరకు ఖర్చయింది. ఉద్యోగులు చందాలు వేసుకొన్నారు.

ఆ సందర్భంలో ఒక జ్ఞానయ్య, ఒక ఆఫీసులో ఒక మూఢయ్య వద్దకు వెళ్లి, అతని వంతు చందా ఇవ్వమన్నాడు. అతడు ఒక రూపాయి ఇవ్వబోయాడు.

చందా అన్నప్పుడు ఎంతైనా యివ్వవచ్చు. ఇచ్చేవాళ్ళ ఇష్టం. పుచ్చుకొనే వాళ్ళ అదృష్టం. అయితే నూరు రూపాయల జీతం తెచ్చుకొనే ఉద్యోగి కనీసం రూపాయి అయినా ఇవ్వాలని సంఘం నిర్ణయించింది. ఆ లెక్క ప్రకారం మూడయ్య తన మూడు వందల యాభై రూపాయలకు కనీసం మూడు రూపాయలైనా ఇవ్వవలసి ఉంది. అయిదువందల జీతం ఉద్యోగి ఒకాయన ఏభై రూపాయలిచ్చాడు. అలా ఉత్సాహంకొద్దీ పదులూ, పాతికలూ ఇచ్చిన వారు చాలమందే ఉన్నారు. మూఢయ్యలాంటి వాళ్ళు చాలా తక్కువమంది.

"మీరు న్యాయంగా నాలుగివ్వాలి. కనీసం మూడైనా ఇవ్వండి" అన్నాడు జ్ఞానయ్య. "నా దగ్గిర లేవు. జీతం చాలడం లేదు. చుట్టూ అప్పులు. ఈ రూపాయి అయినా సిగరెట్ల కోసం ధర్మయ్యవద్ద అప్పు తీసుకున్నాను. పట్టికెళ్ళండి" అన్నాడు మూఢయ్య.

"మీరే అలా అంటే ఎలా? మన నాయకుణ్ణి మనం గౌరవించుకోవాలి. మళ్ళీ ఇలాంటి శుభసందర్భం ఎప్పుడు వస్తుందో? సన్మానం గొప్పగా చేద్దామని కదా? పోనీ రెండైనా ఇవ్వండి!" అన్నాడు జ్ఞానయ్య తొందరగా పోదామని.

"ఇవ్వను. అసలు ఒక్క రూపాయైనా ఎందుకివ్వాలి? ఇవ్వక పోతే ఏం చేస్తారు?" అన్నాడు మూఢయ్య ముఖం బిగించుకుని.

"ఇది చేస్తారు–" అంటూ జ్ఞానయ్య ఉగ్రనరసింహావతారం తాల్చి– ఏం చేశాడో, మూఢయ్య కళ్లపొరలు ఎలా తొలగిపోయాయో, అతడి జేబునుంచి ఒక అయిదు రూపాయలనోటు– చిన్నప్పటి గోచీపాతను, పల్లెలోని గుడిసెను జ్ఞాపకం తెచ్చుకుంటూ, ఎలా బైటికి వచ్చిందో ఊహించడం కష్టమేమీకాదు.

ఒక మహానాయకుణ్ణి గౌరవించడానికి నూటికి రూపాయి ఇవ్వడానికి ఏడ్చిన వాళ్ళున్నారు. అట్టివాళ్ళు మాలమాదిగ ప్రజల సాంస్కృతిక అభివృద్ధికోసం నెలకు నూటికి పదిరూపాయలు ఇవ్వమని నేను చెపితే, నా మాట వింటారా?

86

వింటారా, వినరా అనే ప్రసక్తేలేదు. చెప్పడం నా ధర్మం కనుక చెపుతున్నాను. వంద రూపాయల ఉద్యోగి నెలకు నాలుగైదు రూపాయలైనా ఇవ్వవచ్చు. వేయి రూపాయల అధికారి నెలకు నూరు రూపాయలయినా ఇవ్వవచ్చు. జీతం తొమ్మిది వందలే అనుకుంటే జరగదా? పస్తుండవలసి వస్తుందా?

మాలమాదిగ ఉద్యోగులారా! మీ జాతికి మీరు ధర్మకర్తలనే సత్యాన్ని విస్మరించకండి! మీరు పుట్టిపెరిగిన మాలమాదిగ పేటలు తక్కిన అగ్రవర్ణాల గ్రామాలలో లీనమై పోయేదాకా మీ బాధ్యత తీరదని గుర్తించండి. త్యాగం చెయ్యండి. తక్కిన కులాల యువకుల కంటే ఎన్నో రెట్లు త్యాగాలు చెయ్యడానికే మనం ఈ కులంలో పుట్టామని తెలుసుకోండి!

87

అభివృద్ధి పొందిన అగ్రకులాల వారిలో కులతత్వం ఒకపాపం.

తరతరాలుగా అణిచి ఉంచబడ్డ బడుగు కులాలు, అమానుషమైన అంటరాని తనానికి గురిచేయబడ్డ మాలమాదిగలు తమ విమోచన కోసం పోరాడడం కులతత్వ మనిపించుకోదు.

అందువల్ల తమ అభివృద్ధి కోసం ప్రత్యేక కృషి చేసుకోడానికి మాలమాదిగలు సంకోచించ నక్కరలేదు.

88

బ్రిటిష్ ప్రభుత్వ కాలంలో, గవర్నమెంటు పోరంబోకు పుంతలలో, గుడిసెలు వేసుకున్నారెన్నో గ్రామాలలో మాలమాదిగలు. అప్పుడా గుడిసెలు కొంత కొత్తగా కనిపించేవి.

(1) దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఇరవై ఏళ్ళు ఐన తర్వాత (2) మూడు పంచవర్ష ప్రణాళికలు ముగిసిన తర్వాత (3) ఎన్నో కోట్ల కోట్ల రూపాయల స్వదేశీ విదేశీ ధనం ఖర్చయిన తర్వాత ఈ రోజున ఆ పుంతలకు వెళ్ళి చూడండి! ఆ గుడిసెలు కూలిపోతున్నై! ఆ మనుషులు చిక్కి శవాలై పోతున్నారు.

ఇదేనా మనం సాధించిన అభివృద్ధి?

బడుగు దేశాల అభివృద్ధి కోసం, పేదల పునరావాసం కోసం, అగ్రరాజ్యాలు చేస్తున్న సహాయమైనా మాల మాదిగ పేటలదాకా వస్తున్నదా?

89

అడిగితే గాని అమ్మ అయినా పెట్టదు. నిద్రపోయే వాణ్ణి వదిలేసి ఏడ్చే వాడికే పాలుపడుతుంది ఏ తల్లి అయినా. ఆందోళన చేస్తేగాని అవసరాలు కూడ గుర్తించని కాలమిది. అందుకే మేల్కొనండి! ప్రజలను మేల్కొలపండి! ఏకం కండి! ఎలుగెత్తి అదగండి!

90

కొన్ని గ్రామాల్లో మాలమాదిగలు గుడిసెలు కట్టుకొన్న ఆ పుంతల్ని చూడండి!

గవర్నమెంటు పుంతలు సన్నంగా, మైళ్ల కొలది పొడుగ్గా ఉంటై. పొలాలకు, గ్రామాలకు పశువుల రాకపోకల కోసం వదలబడ్డ బాటలు అవి. వాటిని బ్రిటీషు ప్రభుత్వం ఉచితంగా మాలమాదిగలకిస్తే, అక్కడ గుడిసెలు వేసుకున్నారు వాళ్లు. అవి గుడిసె పక్క గుడిసెగా ఒకమైలు పొడుగు వరకు తోరణంలా ఉంటై. ఆ దృశ్యం మనక యితే అలవాటయి పోయింది కనుక మామూలుగానే కనిపిస్తుంది. విదేశీయులకైతే ఎలా కనిపిస్తుంది?

కోళ్ళు, కుక్కలు, పందులు కూడ అలాంటి ఇరుకు మురికి గూళ్ళలో ఉండగలవా?

ఓ మాలమాదిగ యువకుల్లారా! ఓ భారతీయ ప్రగతి కాముల్లారా! ఆ పుంతల్నీ, ఆ గుడిసెల్నీ ఇంకా ఎంత కాలం సహిస్తారు?

91

హైదరాబాదు నగరంలో మాలమాదిగ పేటల్ని ఒకసారి చూడండి! అందమైన నగర దేవత ముఖంమీద బొల్లిమచ్చలు కావా అవి?

నగరం జనాభాలో సగానికి సగం మాలమాదిగలుంటారు. పోనీ – నాలుగో వంతుంటారనుకొందాం. అయితే, నగరం వైశాల్యంలో మాలమాదిగలుంటున్న పేటల వైశాల్యం ఎంత? లక్షోవంతైనా ఉన్నదా?

మాలమాదిగలకు, గుడిసెల సంఘాలకు నాయకత్వం వహిస్తున్న మహాత్ముని శిష్యుల్లారా! లెక్కలుకట్టి ప్రకటించండి! అంతరాత్మలు తడిమి చూచుకోండి! బ్రతకడమే ముఖ్యం కాదు. కుక్కలు, గాడిదలు కూడ బ్రతుకుతున్నై.

92

నాబత్ పహాడ్ దిగువ, ఆ కొండ మొదట్లో ఒక మాలమాదిగ పేట ఉంది. అక్కడ సుమారు రెండువందల కుటుంబాలు కొన్ని వందల తరాలుగా గుడిసెలు వేసుకొని నివసిస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్ ఏర్పడేవరకు ఆ ప్రాంతంలో ఆ గుడిసెలు తప్ప జన సంచారమే లేదు.

ఇప్పుడు ఆ ప్రాంతంలో గొప్పగొప్పవారి మేడలతో, మిద్దెలతో ఒక ఆదర్శనగరమే ఆవిర్భవించింది.

ఆ మాలమాదిగ గుడిసెలు మాత్రం అలానే మూలుగుతున్నై – తుప్పుపట్టి చిల్లులుపడ్డ డబ్బారేకుల బరువుల క్రింద – గజాని కొక గుడిసెగా– అర్ధరాత్రి గోనెగుడ్డలు కప్పుకొని వణుకుతున్న కార్మిక శతవృద్ధుల్లా!

పరిసరాలలో, ఇతర కులాల ప్రజలలో వచ్చిన మార్పు, అభివృద్ధి మాలమాదిగలలో, ఆ గుడిసెలలో రాలే దేమి? ఎవరూ ఆలోచించరెందుకని?

నగరంలో మాల మాదిగ పేటల అసహాయ స్థితికీ, మాల మాదిగ ప్రజల అబలత్వానికీ ఇదొక ఉదాహరణ మాత్రమే. ఈ అన్యాయం, ఈ దౌర్భాగ్యం నగరం నిండా ఉంది. చూచే నాధుడు లేడు. ఆందుకునే నాయకత్వం లేదు.

93

మాలమాదిగ యువకుల్లారా! ఏకం కండి!

అస్పృశ్యతపై, కుల వ్యవస్థపై, వర్గ పక్షపాతంపై, స్వార్థ పరత్వంపై, అవినీతిపై, అన్యాయంపై, ధర్మయుద్ధం ప్రకటించండి!

సుప్రసిద్ధ, సనాతన, వైదిక భారత జాతి మళ్ళీ దాస్యజాతి కాకుండా కాపాడుకోడానికి నడుం కట్టండి!

స్వార్థపరులు, కుక్షింభరులు, లంచగొండులు, పదవీ లుబ్ధులు అయిన మీర్జాపరులు మనలో, మనచుట్టూ ఎప్పటికప్పుడు పుడుతూ, చస్తూ ఉంటారన్న సత్యాన్ని విస్మరించకండి! మీ ప్రాణాలైనా ఒడ్డి ఆర్ష భారత ధర్మాన్ని రక్షించడానికి కళ్ళు తెరవండి! మీ అజ్ఞానాన్ని, అధైర్యాన్ని, అబలత్వాన్ని ఒక ఒళ్లు విరుపుతో విదిలించి వేసుకోండి.

94

లంచం పుచ్చుకొన్న లక్ష రూపాయల కంటే ఒక్క తుపాకీ బలమైంది. తుపాకులు పుచ్చుకున్న లక్షమంది సైన్యం కంటే ఒక్క ఆటంబాంబు బలమైంది. లక్ష ఆటంబాంబుల కంటే కార్మికుని ఒక్క చెమటబొట్టు బలమైంది. లక్షమంది కార్మికుల చెమటబొట్ల కంటే ఒక్క మార్క్స్ సిద్ధాంతం బలమైంది. లక్షమంది మార్క్స్‌ల సిద్ధాంతల కంటే ఒక్క మహాత్ముడి రాజనీతి బలమైంది. లక్షమంది మహాత్ముల రాజనీతుల కంటే ఒక్క అంబేద్కర్ మానవ సమతా ధర్మం బలమైంది. అట్టి ధర్మం కోసం పోరాడటానికి – ఓ నిరుద్ధ జాతుల యువకుల్లారా! నడుంకట్టి ముందుకు దూకండి!

95

సాంత కులం చెప్పుకోడానికి జంకుతున్న వాళ్ళు, పరాయి కులం పేరుమీద బ్రతుకుతున్న వాళ్ళు, మాల మాదిగ యువకులలో చాలామంది ఉన్నారు. అది నిజంగా సహించరాని విషయం.

కులం దాచుకొంటున్న వారు ముఖ్యంగా విద్యావంతులు, ఉద్యోగులు, వ్యాపారస్తులు; అట్టి వాళ్ళంతా మొత్తంమీద తమ ప్రాంతాలకు దూరంలోను, పట్టణాలలోను ఉంటున్న వాళ్ళే.

సొంత కులాన్ని దాచుకోవడం, పరాయి కులంగా చెలామణి అవడం నిజంగా కుల ద్రోహమే కాదు – ఆత్మ పాతివ్రత్యం కూడా అవుతుంది. అట్టి దుస్థితిని తొలగించడానికి తక్షణ చర్యలు తీసుకోవాలి.

96

మాల మాదిగ విద్యావంతులు, ఉద్యోగులు, వ్యాపారులు కులం దాచుకోడానికి కారణాలు నాలుగు.

(1) ఏదో కొంచెం చదువుకొని, తెల్లబట్టలు వేసుకొని, పట్నంలో షికార్లు కొట్టే పైలాపచ్చీసుతనం.

పల్లెలోనే కాదు, మహాపట్టణంలోకూడ – మాలమాదిగ వాణ్ణనే కాదు, మహాత్ముడి నామం జపిస్తూ హరిజనుణ్ణని చెప్పుకొన్నా కూడ, అవమానం తప్పదు కనుక – అట్టి వాడు పరాయి కులం పేరు చెప్పుకొని, గౌరవ మర్యాదలు పొందుతాడు. ఎక్కువగా నాయుడు అనే కల్పవృక్షం క్రింద తలదాచుకుంటాడు!

(2) బాగా చదువుకొని – ప్రతిభా ప్రాభవమో, కళాసౌకుమార్యమో కలిగి ఉండి– సంస్కారం కల అగ్రవర్ణ యువకుల స్నేహానికి లొంగిపోయిన ఉత్తమ సహృదయత.

నా విద్యార్థి దశలో ఒకసారి ఇద్దరు బ్రాహ్మణ మిత్రులతో ఎక్కడెక్కడో తిరిగి ఒక అగ్రహారం చేరుకున్నాం. అక్కడ ఒక బ్రాహ్మణ గృహస్థు ఇంట ఆ రాత్రికి ఆగాం. ఆ గృహస్థు నా మిత్రులలో ఒకరికి పరిచయుడో, బంధువో.

నేను చచ్చినా నా కులం దాచుకోనని నా మిత్రులకు తెలుసు. అందువల్ల – ముందే నా దగ్గర ఒక వాగ్దానం తీసుకున్నారు వాళ్లు. ఏమని? ఆ ఇంటి వాళ్ళలో ఎవరయినా నా వద్ద కులమతాల ప్రసక్తి ఎత్తినప్పుడు నోరెత్తకుండా చిరునవ్వు మాత్రం నవ్వుతానని, వాదన వస్తే – బ్రహ్మ సమాజాన్ని నేను బలపరుస్తానని!

నేను అబద్ధం ఆడవలసిన అవసరం లేదు. కనుక అందుకు ఒప్పుకున్నాను.

అంతా సవ్యంగానే కాదు- ఎంతో ఉత్సాహంగా, ఆనందకరంగా గడచిపోయిందా మకాం.

ఆ తర్వాత చెప్పారు వాళ్లు నాకు- వాళ్ళు ఆడిన నాటకం గురించి! నేను ఏదో శాఖ బ్రాహ్మణ్ణనీ, బ్రహ్మ సమాజంలో చేరి జందెం తీసేశాననీ, కులమత భేదాలు పాటించని వట్టి చాదస్తపు ఆధునికుణ్ణనీ ఆ ఇంటి వాళ్లకు చెప్పారట! ఎంత ఘోరమైన అబద్ధం!

"ఈ కాలపు కుర్ర కారంతా అంతేలే. ఏం చెస్తాం!" అన్నారట ఇంటివాళ్ళు. ఎంత ఉదారమైన సహనం!

ఈ రకమైన స్నేహసమౌదార్యంవల్ల కులం చెప్పకపోవడం ఉంది. ఇది కూడా ఒక బలహీనతే.

(3) తమ కులం పేరుచెపితే తమ వద్ద ఎవరూ సరుకు కొనరనీ, వ్యాపార రంగంలో తమకు భవిష్యత్తు ఉండదనీ భావించే ఒక భయం.

ఈ భయం సహేతుకమైనట్టిదే. అయినా భయంతో బ్రతకడం ఎంత కాలం?

(4) ఉద్యోగ ధర్మంపై దూర ప్రాంతాలలోను, పట్టణాలలోను కాపురం ఉండవలసిన పరిస్థితిలో - కులం పేరు చెపితే అద్దెకు ఇళ్ళు దొరకని దుస్థితి.

ఇది మరీ ఘోరమైన, దుర్భరమైన దుస్థితి. హిందూ సమాజం ఎంత మూఢ పాశవిక నీచస్థితికి దిగజారిపోయిందో సూచించే తర్జని!

ఈ నాడు హైదరాబాదు వంటి నగరాలలో, హరిజనుల మని చెప్పుకుంటే అద్దెకు ఇళ్ళు దొరకవు. పోనీ- మాల మాదిగ గుడిసెల్లో ఉండరాదా అంటే, అవి వాళ్ళకే చాలని పూరి పాకలు, మురికి కూపాలు. ఇక కులం దాచుకోవడం కంటే గత్యంతరం ఏముంది?

ఎంతో అభిమాన ధనులైన హరిజనోద్యోగులు కూడ అద్దె ఇళ్ళకోసం నాయుళ్ళమని చెప్పుకొంటూ బ్రతుకుతున్న సందర్భాలు వందలూ, వేలూ ఉన్నై నగరాలలో. ఎంత హృదయ విదారకమైన పరిస్థితి!

ఈ పరిస్థితి కొనసాగినంత కాలం భారత జాతికీ, దేశానికీ పురోగతి ఉన్నదా!

97

"మేం హరిజనులం" అంటే అద్దెకు ఇల్లు ఇవ్వరు.

"మేం నాయుళ్ళం" అంటూ వాళ్ళే తిరిగివస్తే, అద్దెకు ఇల్లు ఇస్తారు.

అంటే - అస్పృశ్యత ఎక్కడుంది? వ్యక్తి రూపంలోనా? కులం పేరులోనా?

ఎంత అవివేకం! ఎంత మూర్ఖత్వం!

ఒక్క భాగ్య నగరంలోనే కాదు. తదితర పట్టణాలన్నిటిలో కూడా - అద్దెల కుంటున్న పెద్దమనుషులలో అధిక సంఖ్యాకులు హరిజన నాయుళ్ళే అని చెపితే- ఆ అద్దె ఇళ్ళ యజమానులు గుండెలు పగిలి చస్తారా?

98

భారత దేశంలో - వివిధ కులాల, మతాల వ్యక్తుల్ని - ఒకే ప్రాంతం వాళ్ళని - ఒకే వయస్సు, చదువు, వృత్తి కలవాళ్ళని - ఒకే రకం దుస్తులు ధరించిన వాళ్ళని - ఒక వరుసలో నిలబెడితే - ఎవడు ఏ కులంవాడో, ఏ మతంవాడో, ఎవడు హరిజనుడో, ఎవడు సిరిజనుడో ఎవరైనా చెప్పగలరా?

పోనీ - రక్తపరీక్ష చేసైనా చెప్పగలరా?

ఇలాంటి సవాలునే ఒకసారి గాంధీజీ చేసిన జ్ఞాపకం.

"అంటరాని వారెవరు?" అన్న తన గ్రంథంలో రక్త పరీక్షనే ప్రాతిపదికగా డాక్టరు అంబేడ్కరు ప్రతిపాదించాడు. ఈ దేశంలో ఆయా ప్రాంతాలలో నివసించే హిందువులంతా ఒకేజాతికి చెందినవారని నిరూపించాడు.

అస్పృశ్యతా, కులతత్వమూ వ్యక్తిలో లేదు. కులం పేరులో ఉంది. ఎంత అజ్ఞానం! ఈ అజ్ఞానాంధకారాన్ని ఆధునిక విజ్ఞాననిధులైన యువకులెంత కాలం భరిస్తారు?

99

ఆఫ్రికా, అమెరికా వంటి దేశాలలో తెల్ల జాతివాళ్ళు రంగుజాతుల పట్ల చూపుతున్న విచక్షణకు- ఇక్కడ హిందూ అగ్ర కులాలు హరిజనులపట్ల చూపుతున్న విచక్షణకు పోలిక లేదు.

అక్కడ రెండు వేరువేరు జాతుల మధ్య పోరాటం.

ఇక్కడ ఒకే రక్త సంబంధ జాతిలో ఆర్థిక సాంఘిక విశిష్టతకోసం అంతర్ఘర్షణ. మీ పోరాటంలో ఈ సత్యాన్ని గుర్తుంచుకోవడం అవసరం. ఎందుకంటే– ఇక్కడ అగ్రకుల యువకులలో చాలామంది ఈ సత్యాన్ని గుర్తించినవాళ్ళే. వాళ్ళంతా మీ కుల నిర్మూలనోద్యమంలో మీతో కలిసేవాళ్లే!

100

సిగ్గుపడి కాని, మొగమాటపడికాని, భయపడికాని, అవసరార్థం కాని, మాలమాదిగ లెవరూ తమ కులాన్ని దాచుకోరాదు. అలా దాచుకోవడం ఉభయ భ్రష్టత్వం.

ధైర్యాన్ని కూడగట్టుకోండి! అవమానాలకు, ప్రాణ త్యాగాలకు కూడ సిద్ధం కండి! అప్పుడే మీరు మానవులుగా బ్రతుకగలుగుతారు.

101

అస్పృశ్యత యొక్క అసలు స్వరూపం ఏమిటి?

ఏ సమస్యకైనా రెండు స్వరూపాలు ఉంటై. ఒకటి బాహ్య స్వరూపం. ఒకటి అంతస్స్వరూపం. ఈ రెండు స్వరూపాలను, స్వభావాలను మనం నిశితంగా పరిశీలించి, స్పష్టంగా అర్థం చేసుకోవాలి.

పరిష్కారానికి ఏ సమస్య అయినా లొంగడం లేదంటే – అదొక గోముఖ వ్యాఘ్రంగా ఉన్నదన్నమాట. దాన్ని పరిష్కరించాలంటే దాని అసలు స్వరూపాన్ని పట్టుకోవాలి.

102

అస్పృశ్యతకు కారణం ఏమిటి?

(1) వాళ్ళు మురికిగా ఉంటారు అని.

(2) మురికి వృత్తులు చేస్తారు కనుక దూరంగా ఉంచబడ్డారని

(3) ఏదో తప్పు పనికి వాళ్ళ పూర్వీకులు జాతి భ్రష్టులు కావించబడి, వెలివేయబడ్డారని.

(4) పాపం చేసిన వాళ్లు శిక్ష అనుభవించడానికి ఈ కులాలలో పుడతారని

ఎవరికి తోచిన జవాబులు వారు చెప్పి, ఆయా కారణాలను నిర్మూలించు కుంటే అంటరాని తనం తొలగిపోతుందని పరిష్కారం సూచించారు – చాలమంది సంస్కర్తలు.

(1) ఆవు, గేదె, పంది, కుక్క వంటి వన్నీ మురికిగా లేవా?

(2) పందులు వగైరాలను పెంచేవాళ్ళు, తోళ్ల వర్తకులు, మాంస విక్రేతలు, చేపల అంగడిదార్లు – ఈ అందరూ మురికి వృత్తులు చేసేవారే కదా? వాళ్లెవరికీ అంటరాని తనం లేదుకదా?

(3) "చండాలస్తు జనితో బ్రాహ్మణ్యాం వృషలేన య" అనేది ఏ నాటిది? కృతయుగం నాటి వెలి ఇంకా కొనసాగుతూనే ఉన్నదా?

(4) పాపం చేసిన వాళ్లు ఉత్తమమైన మానవ జన్మకు ఎందుకు వస్తారు? కుక్క, పంది వంటి నీచ జన్మలకు పోతారు. అవన్నీ మళ్లీ స్పృశ్య జంతువులే కదా?

ఆయా కారణాలకు జవాబులుగా, ఇలాంటి హేతువాద ప్రశ్నలతో సాయుధులై – ఎంతోమంది ప్రవక్తలు, యోగులు, సంస్కర్తలు, మహాత్ములు, ఎంతో కృషి చేసినప్పటికీ అస్పృశ్యత తొలగి పోలేదు. ఎందుచేత?

అశుభ్రత, వృత్తి హేయత, జాతి బహిష్కారం, పూర్వజన్మ దుష్కర్మవంటి వన్నీ కేవలం పైకి చెప్పుతున్న కారణాలు. అవి అసలు కారణాలు కానే కావు. ఈ అశుభ్రత వంటివన్నీ అగ్రకులాలలో కూడా ఎక్కువగా ఉన్నట్టివే.

103

అస్పృశ్యతకు అసలు కారణం ఆర్థిక దుస్థితి. మతం పేరుతో హిందూ సమాజం ఒక వర్గంగా తయారై, అనేక దుష్ట శాసనాల ద్వారా శూద్రుల్ని బానిసలుగా చేసుకొన దలచింది. శూద్రులు తిరగబడగా వారిని తనలో లీనం చేసుకొని, ఆ తర్వాత హరిజనులపై పడింది. ఇప్పుడు హరిజనులు కూడ తిరగబడితే తప్ప – ఈ సమస్య పరిష్కారం కాదు.

తన కింద శాశ్వతంగా ఒక బానిస వర్గాన్ని సృష్టించి అణచి ఉంచుకోవడానికి హైందవ సమాజం పన్నిన పన్నాగమే అంటరాని తనం. ఇది సాంఘిక సమస్య కాదు. కేవలం ఆర్థిక సమస్య. అందుకు అనుగుణమైన విధంగానే దాన్ని పరిష్కరించ వలసి ఉంది.

104

మాల మాదిగ యువకులు ముందుగా సంఘటితం కావాలి. తర్వాత తదితర పీడిత కులాల యువకుల్నీ, ఆ తర్వాత అభ్యుదయ కాములైన అగ్రకులాల యువకుల్నీ కూడగట్టుకోవాలి.

అగ్రకులాల వారి సహకారం ఇందుకు లభిస్తుందా అని అనుమానించకండి! అస్పృశ్యతా నివారణకోసం శతాబ్దాలుగా కృషి చేస్తున్నవారు, ఈ శతాబ్దంలో అందుకు ఉద్యమాలనే లేవదీసిన గాంధీజీ, వీరేశలింగం పంతులు, వెంకట రత్నం నాయుడు. పొట్టి శ్రీరాములు, మంగిపూడి వెంకటశర్మ వంటి వారు అంతా అగ్రకులాలవారే అన్న సత్యాన్ని విస్మరించకండి!

105

ప్రతివ్యక్తి ఏదో ఒక కులంలో పుడతాడు కదా? ఆ కులం యొక్క తత్వం, ప్రభావం ఆ వ్యక్తిపై తప్పకుండా ఉంటుంది. అలా ఉండడం ఆ వ్యక్తి దోషంకాదు.

ఆయా వ్యక్తుల్ని ఆయా కుల మతాల ప్రభావం నుంచి తప్పించి, వాస్తవ పరిస్థితుల్ని వారు అవగాహన చేసుకొనేటట్టు మనం చెయ్యాలి. అదంత సులభమైన పనికాదు. అందుకు ఎంతో ఓర్పు, తెలివితేటలు, చాక చక్యం, వాస్తవిక, దృష్టి, గ్రంధ పరిచయం, సంప్రదాయజ్ఞత, వాద పటిమ, పట్టుదల, ఒప్పించేశక్తి, నిరంతర కృషి, వేచిఉండే ఓర్పు ఉండాలి.

భ్రమలు, మూఢాచారాలు అంధ విశ్వాసాలు, ఆనుపంశిక స్వప్రయోజనాలు చాలా బలంకలవి. వాటి నుంచి విముక్తే నిజమైన విముక్తి. ఎంతటి త్యాగాలకైనా సిద్ధపడి, అట్టి విముక్తిని సాధించాలి. అగ్రవర్ణాల యువకుల్ని ఉద్యమంలోకి తీసుకురావాలి.

106

స్వేచ్ఛ, స్వాతంత్ర్యం ఒకళ్ళిచ్చేవి కావు. ఆత్మబలంతో, ఐక్య ప్రతిఘటన ద్వారా సాధించుకోవలసినట్టివవి.

స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు లేని వ్యక్తిగాని, జాతిగాని, దేశంగాని కేవలం జీవచ్ఛవం.

వేద ఋషులంతా హరిజనులకు, గిరిజనులకు, బహుజనులకు చెందినవారే. వైదిక సంస్కృతి, ఆర్ష సంప్రదాయం, భారతీయ వేదాంతం అంతా మనదే. సనాతనమైన ఈ మన ఆస్తిని కాపాడుకోడానికి - మాల మాదిగ యువకుల్లారా, ఏకం కండి!

107

ఈనాడు దేశంలో కాపిటలిజం, సోషలిజం, కమ్యూనిజం, మార్క్సిజం అంటూ - రకరకాల పార్టీలమధ్య రాజకీయ పోరాటాలు జరుగుతున్నై. ఏ ఇజానికీ, ఏ లక్ష్యానికీ కట్టుపడని పార్టీలు కూడా చాలా ఉన్నై. నాయకత్వం, పదవి- ఈ రెంటికోసమూ తాపత్రయం తప్ప మరో పరమార్థం ఉన్న పార్టీ ఒక్కటీ లేదు.

భారత దేశం బడుగు దేశం కావడానికి కారణమేమిటో, ఆ కారణాన్ని నిర్మూలించడం ఎలాగో తెలిసిన నాయకులు కాని, పార్టీలు కాని ఈనాడు మృగ్యం. లేని ప్రయోజనాలను సంసాదించుకోడానికి ఒక వర్గం ఉన్నవాటిని రక్షించుకోడానికి ఒక వర్గం పోటీలు పడుతూ, పోరాడుకొంటూ ఉన్నై. అంతే.

ప్రజల సాముదాయక శ్రేయస్సును కాంక్షించే వారెవరూ రాజకీయ రంగంలో లేరు.

ఈ రకమైన రాజకీయాల జోలి మీకు వద్దు. మీ కార్యక్రమం ప్రజల మధ్య ప్రారంభం కావాలి. అస్పృశ్యతా నిర్మూలనతో ప్రారంభం కావాలి.

108

పాత కాపు పండితులు, స్వాములు, వాళ్ళకు పాద పూజలు చేసే నాయకులు, పెత్తందార్లు, కులాన్ని స్వార్థాని కుపయోగించుకునే కులపెద్దలు, భగవంతుడికి కూడా లంచం ఎరచూపే దోపిడీ దొరలు, శక్తి సామర్థ్యాలను అసహ్యించుకునే దుర్బలులు, అధికార దాహం తీర్చుకోడం కోసం దేశమాతను కూడ తాకట్టు పెట్టడానికి వెనుకాడని కుత్సితులు- ఇలా ఎన్నోరకాల స్వ ప్రయోజకులు తరతరాలుగా జాతి ప్రయోజనాన్ని

అడ్డుతున్నారు. దేశ పురో గతికి గుదిబండలుగా ఉన్నారు. వీరందర్నీ ఓడించుకొంటూ మీరు ముందుకుపోవలసి ఉంది.

109

"కృణ్వంతో విశ్వమార్యం" అనే నినాదంతో క్షైతయాత్రకు శంఖం పూరించిన వేదజాతి- నేడింతగా చిక్కి, శల్యావశిష్టమై, చిన్నాభిన్నమై మరణశయ్య మీద ఉండడానికి కారణం- దాసీ దేశమై మూలుగుతుండడానికి కారణం- మత మౌఢ్యానికి అట్టిపెట్టుకు బ్రతుకుతున్న ఈ స్వాములే! ప్రతిభను పట్టి పాతేస్తూ, తాము మాత్రమే బ్రతకాలనుకునే అసమర్థ కుక్షింభరులే!

దోమల బ్రతుకుతెరువు కోసం మురికిగుంటల్ని పెంచుకుంటామా? భారత జాతి పునరుజ్జీవం కోసం మూఢ మతవాదుల్నీ, స్వార్థపరుల్నీ, కులతత్వ స్వాముల్నీ ప్రతిఘటించండి!

110

"తల్లి ఊర్వశి లంజ, తన తలు మాదిగ,
తాను బ్రాహ్మడయ్యె తగ వశిష్ఠ
డిలను గుణమె కాని, కులమేమి ముఖ్యము?
విశ్వదాభిరామ వినురవేమ!"

అన్నాడు వేమన్న. జన్మ చేత అందరూ శూద్రులే. కర్మ చేతనే వర్ణాలు ఏర్పడుతున్నై. బ్రహ్మజ్ఞానం అనేది వైదిక మతంలో మకుటాయ మానమైన పరమజ్ఞానం. అట్టి బ్రహ్మజ్ఞానాన్ని ఆర్జించినవాడే బ్రాహ్మణుడు.

జన్మనా జాయతే శూద్ర:
కర్మణా జాయతే ద్విజ:
వేద పాఠంతు విప్రాణాం
బ్రహ్మజ్ఞానేన బ్రాహ్మణ:

జన్మ చేత అందరూ శూద్రులే. కర్మ చేత కొందరు ద్విజులై నారు. కర్మ అంటే పడుగు చేసుకొని, జందెం వేసుకొనడమేనా?

వేదాల ముఖమే చూడని నేటి ఈ గుమస్తా బ్రాహ్మలంతా విప్రులేనా?

బ్రహ్మజ్ఞానం, యోగసిద్ధి కలవాళ్ళు ఈనాడు బ్రాహ్మణుల మని చెప్పుకొనేవారిలోనే కంటె – తదితర కులాలలోనే – ముఖ్యంగా హరిజనులలోనే – ఎక్కువగా కలరన్న సత్యాన్ని గుర్తించండి.

అందువల్ల – గుణాన్ని బట్టి వృత్తీ, వృత్తిని బట్టి కులమూ ఏర్పడతాయే కాని, కులం పుట్టుకతో రాదు. బ్రాహ్మణత్వం అనేది ఒక డిగ్రీ. అది ఎవరికి వారే సాధించుకోవలసినట్టిది. గ్రాడ్యుయేటు కొడుకు పుట్టుకతోనే గ్రాడ్యుయేటు ఎలా కాడో, అలానే బ్రాహ్మణుడి కొడుకు పుట్టుకతోనే బ్రాహ్మణుడు కాడు.

వేద కాలంలో పుట్టుకకు ప్రాధాన్యం లేదు. గొప్ప గొప్ప ఋషుల, రాజుల పుట్టుకలను పరిశీలించి చూడండి. అందులో సహజంగా వివాహిత దంపతులకు పుట్టిన వాళ్లెంత మంది?

గ్రాడ్యుయేటు కొడుకు పుట్టుక తోనే గ్రాడ్యుయేటు కాడు. కూలి వాడి కొడుకు పుట్టుకతోనే కూలివాడు కాడు. అతడు చదువుకొని గ్రాడ్యుయేటు కావచ్చు. మిలిటరీలో చేరి సేనాధిపతి కావచ్చు. బట్టలకొట్టు పెట్టుకొని వర్తకుడు కావచ్చు. వ్యవసాయ దారూ కావచ్చు. పుట్టుకతో మాత్రం ఎవరూ ఏమీ కాదు.

అందుకే – పుట్టుకతోనే కులాలను నిర్ణయిస్తున్న నేటి కుల వ్యవస్థ అశాస్త్రీయమైనట్టిది. అసహజ మైనట్టిది. అన్యాయమై నట్టిది. అందుకే– దీన్ని రద్దు చేస్తేనే కాని మానవ పురోగతి సాధ్యం కాదని గుర్తించండి.

111

వేద వ్యాసుడు మున్నగు పరమర్షులు చెప్పిన త్వమేవాహం, తత్త్వమసి. అహం బ్రహ్మాస్మి, కృణ్వంతో విశ్వమార్యం వంటి ఆధ్యాత్మిక వైదిక సూత్రాలన్నీ సోషలిస్టు సూత్రాలే.

ఆర్య జీవన విధానం సోషలిజమే. మానవుడిలోని బాల్య యౌవన కౌమార వృద్ధాప్యాలు నాలుగూ, ధర్మ అర్థ కామ మోక్షాలు నాలుగూ, పురుషార్థాలను సాధించే

దశలు. శూద్ర, వైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ అనే నాలుగు వర్ణాలకు (అంటే గుణాలకు) ప్రతీకలు అవి.

ఒకే పురుషుడు బాల్యంలో ధర్మ ప్రధాని అయిన శూద్రుడు, యౌవనంలో అర్థ ప్రధాని అయిన వైశ్యుడు, కౌమారంలో కామ ప్రధాని అయిన క్షత్రియుడు, వృద్ధాప్యంలో మోక్ష ప్రధాని అయిన బ్రాహ్మణుడు అవుతాడు. వర్ణం అంటేకాదు. ఈనాటి కులాల వంటివి దానికి లేవు. ఉంటే ఆనాటి ఋషులంతా మాలమాదిగలో, వెనకబడ్డ కులాలవారో అయి తీరవలసిందే.

ప్రపంచమంతా ఆర్యం చెయ్యమంటే ఏమిటి? ఆర్యజీవన విధానాన్ని. పురుషార్థ ప్రణాళికను ప్రపంచ ప్రజలలో ప్రచారం చెయ్యమనే కదా? ప్రపంచ ప్రజలందర్నీ ఆర్యులుగా మార్చమనే కదా? గుణం ఆర్యమతం గుణ ప్రధానమైన జీవనవిధానం, నిజానికి అదొక మతం.

112

నేటి కమ్యూనిస్టు నినాదం లాంటి నినాదాన్ని అంతకంటే గొప్పదైన సర్వమానవ సమతా ధర్మ నినాదాన్ని ఆనాడే ఋగ్వేదం ఇచ్చింది. ఆ నినాదం ఎందుకు కార్యరూపం ధరించలేదో, ఏ అభివృద్ధి నిరోధక శక్తులు దాన్ని నిరోధించాయో తెలియదు. అప్పటినుంచే ఆర్థిక రాజకీయ స్వార్థశక్తులు విజృంభించి ఉంటాయి. వర్ణం అంటే కులం అనే అర్థం కల్పింపబడి ఉంటుంది. "జన్మనా జాయతే శూద్ర", అనే సిద్ధాంతాన్ని అణిచివేసి, కులం పుట్టుకతోనే వస్తుందన్న కృత్రిమ శాసనాన్ని చేసి ఉంటారు. అట్టి కృత్రిమ శాసనాల ఫలితంగానే - శాసన ధిక్కారాలు, శిక్షలు, వెలి, అంటరాని తనం, అష్టాదశ కులాలు వగైరా అన్నీ ఏర్పడి ఉంటాయి. అసలు ఆర్యధర్మం మంట గలసి ఉంటుంది. స్మృతులు రాబందుల్లా రెక్కలాడిస్తూ ఆ మంటల్ని మరింత రగుల్కొల్పి ఉంటాయి.

లేకపోతే -

మానవ జీవితం యొక్క సమస్త రంగాలలోను సర్వతోముఖాభివృద్ధిని సాధించి, ఆ నాటి సమస్త లోకాలకూ ఆదర్శ ప్రాయమై, గురు స్థానాన్ని ఆక్రమించి ఉన్న

భారతజాతి ఈ నాడు ఇంతగా పతనమై, కూటికీ, గుడ్డకూ కూడ ప్రపంచ వీధుల్లో భిక్షమెత్తుకోవడానికి ఏమిటి హేతువు?

అంతటి ఉదారమైన ఉన్నతమైన జాతి ఇంతటి సంకుచిత నీచదృక్కు ఎందుకయింది?

గతంలో ఏం జరిగిందో ఇప్పుడు మన కక్కరలేదు. ఆర్య వైదిక సోషలిజాన్ని ఏ సైంధవుడు నిరోధించాడో తెలియదు. అస్పృశ్యతను, కుల వ్యవస్థను నిర్మూలించడం ద్వారా మళ్ళీ మన జాతికి ప్రగతి కల్పించడమే ఇప్పుడు మన ముందున్న కర్తవ్యం.

113

పాత కాలానికి చెందిన కుల వ్యవస్థను నిర్మూలించి, దాని స్థానంలో కుల రహితమైన కొత్త వ్యవస్థను నెలకొల్పడమే మన లక్ష్యం.

అయితే – ఎంతో కాలంగా పాతుకుపోయిన పాత వ్యవస్థను నిర్మూలించడం సులభం కాదు. అందుకు తీవ్రమైన పోరాటం జరగడం తప్పకపోవచ్చు.

లక్ష్యశుద్ధి, చిత్తశుద్ధి, కార్యసాధన శక్తి, ప్రాణాలను లెక్కచెయ్యని సాహసం, సూక్ష్మదృష్టి కల మిలిటెంటు కార్యక్రమం, నిస్వార్థ మనస్తత్వం కలవాళ్ళే భారత దేశంలో కుల రహిత ప్రజాస్వామిక సోషలిజాన్ని స్థాపించగలరు.

కడుపు నిండిన కామేశ్వరుల కది సాధ్యం కాదు. ఒక్క మాలమాదిగ యువకులు మాత్రమే అందుకు సమర్థులు.

114

ఈ నాడు దేశంలో ఒకే సిద్ధాంతం క్రింద లక్ష పార్టీలు, ముఠాలు, గ్రూపులు ఉంటున్నై, ఎందుకని? నాయకత్వాల కోసం, పదవుల కోసం, గౌరవం కోసం, ధనం కోసం మాత్రమే! ప్రజలను ఉద్ధరించడానికి మాత్రం కాదు!

పేదలకు భూములు పంచుతామన్న పార్టీలను, భూముల్ని జాతీయం చేస్తామన్న పార్టీలను పరిశీలించి చూడండి? ఆ పార్టీ పెద్దల భూములను, ఆస్తులను అంచనాలు కట్టండి! ఒక్కడైనా, ఒక్క సెంటు నేలనైనా వదులుకున్నాడా?

నేటి రాజకీయ పార్టీలన్నీ కుక్షింభరుల డిన్నరు పార్టీలు. వాటి జోలి మనకు వద్దు.

ప్రజల అవసరాలను తీర్చేది విశ్వజనీనమైన ఆర్థిక కార్యక్రమం. రాజకీయ పార్టీ కాదు.

115

విద్యావంతులు కండి!

మన ప్రవక్త అయిన అంబేడ్కరు మానవ విజ్ఞాన రంగాలన్నిటిలోనూ మహా విద్వాంసుడన్న సత్యాన్ని ఎప్పుడూ మనసులో ఉంచుకోండి.

కవనం, గానం, నర్తనం, చిత్రలేఖనం వంటి కళల్ని– సామూ, కుస్తీ వంటి విద్యల్ని అభ్యసించండి. వివిధ దేశాల చరిత్రలు, కావ్యాలు, పురాణాలు, వేదాలు, ఉపనిషత్తులు పరిశీలించండి. ప్రతిభను, ప్రజ్ఞానాన్ని పెంచుకోండి.

విద్య శక్తి స్వరూపం. ఏదో ఒక విద్య అయినా స్వాధీనంలో లేనివాడు నిజమైన మానవుడుగా బ్రతకలేడు.

116

ధనం ఒక శక్తే. పుష్కలంగా ధనం సంపాదించండి. భూములు, గృహాలు, సమస్త సంపదలూ గడించండి. ఎవరికీ ఎందులోనూ వెనక పడకండి.

సమాజంలో గౌరవ మర్యాదలకు ధనమే ప్రధాన కారణంగా ఉన్నంతకాలం, వ్యక్తి గత ధనం సమాజపరం చెయ్యబడనంత కాలం– అందరితోపాటు మనం కూడ ధనం సంపాదించడంలో ముందడుగు వెయ్యవలసిందే.

అయితే– ఈనాడు ధనం పిచ్చివాడి చేతి రాయిగాను, గ్రుడ్డివాడి చేతి దివిటీగాను ఉన్నది. ధనం కల ప్రతివాడూ మతినీ, మానవతనూ పోగొట్టు కొంటున్నాడు. ఆ మందలో మాత్రం మీరు చేరకండి.

ఒక చేతితో సంపాదిస్తూ, రెండో చేతితో విద్యల కోసం ఖర్చు పెట్టేవాడే నిజమైన ధన వంతుడు.

117

షెడ్యూల్డు కులాల వారిని తక్కిన అగ్రకులాల వారి స్థాయికి అభివృద్ధి పరచడం కోసం ఎన్నో రాజ్యాంగ నిబంధనలున్నై. ప్రభుత్వ శాసనాలున్నై. జీఓలున్నై. ఉత్తర్వులున్నై. నిజమే.

అయితే - అవి అమలు జరుగుతున్నాయా? అమలు జరగక పోవడానికి, జరిగినా సఫలం కాకపోవడానికి ఏమిటి కారణం?

మాలమాదిగలు చైతన్య వంతులు కాకపోవడమే అందుకు కారణం.

ఎవళ్ళ కోసం భోజనం వడ్డించ బడిందో, వాళ్ళకు తినడానికి నోళ్ళు లేనప్పుడు ఎవరేం చెయ్యగలరు?

హక్కులూ, శాసనాలూ కాదు ముఖ్యం. మనిషి సుఖ స్వాతంత్ర్యాలకు కావలసింది ఆత్మబలమూ, అనుభవించే శక్తీ.

118

ప్రగతి పథంలో అభ్యుదయం సుఖ ప్రసవం కాదు. ఎన్నో నొప్పులకు, బాధలకు, రక్తస్రావాలకు, అస్త్రశస్త్రాలకు, ప్రాణత్యాగాలకు కూడా సిద్ధపడవలసి ఉంటుంది. ధైర్యంతో, చొరవతో, ఓర్పుతో, నేర్పుతో వాస్తవ పరిస్థితుల్ని ఎదుర్కోవలసి ఉంటుంది.

పురోగామి శక్తులకు ప్రతిఘాత శక్తులు అడుగడుగునా అడ్డు తగులుతూ ఉంటై. వాటిని ఢీకొని, అధిగమించి ముందుకు పోవడమే చైతన్య లక్షణం.

మాల మాదిగలు చైతన్య వంతులు కాకుండా, తమ భవిష్యత్తును తామే దిద్దుకోడానికి సిద్ధం కాకుండా, వారికి ఏ అభ్యుదయమూ లభించలేదు.

119

మాల మాదిగల అభ్యుదయం వడ్డించిన విస్తరి కాదు.

కాశీ విస్తరాకుల దగ్గరనుంచీ - పాత్ర సామగ్రి, కాయకూరలు, కట్టెలు, వంటపొయ్యి వరకు కూడ-తామే కష్టపడి సంపాదించుకొని, వండుకొని,

వడ్డించుకోవలసిన శ్రమ జీవులు మాలమాదిగలు. అప్పుడైనా అది వాళ్ళకు దక్కుతుందనే నమ్మకం లేదు. ఈ మధ్యలో ఏ పిల్లో ఏ కుక్కో తినేసి పోవచ్చు. పేదవాడి బ్రతుకు లోకాని కొక చితుకు.

120

కులతత్వ వాదులు అస్పృశ్యతను సమర్థిస్తారు. కర్మవాదాన్ని ప్రతిపాదిస్తారు. అందుకు ఉపబలకంగా శాస్త్రాలను ఉదాహరిస్తారు. కూపస్థ మండూకాలుగా ఉండే స్థానిక ప్రజలు అదంతా నిజమని నమ్ముతారు.

అస్పృశ్యతను, కుల వ్యవస్థను, వర్గ పక్షపాతాన్ని సమర్థించే వాదాలన్నీ పచ్చి అబద్ధాలే. వాటి వెనుక ఉన్న సత్యం ఒక్కటే. అది ఆర్థిక స్వప్రయోజనం.

అమాయకులు, సాధువులు, దైవభీతి కలవారు అయిన ఒక వర్గపు ప్రజల్ని శాశ్వతంగా ఆర్థిక రాజకీయ దాస్య పంకంలో ఊరడ్రొక్కి ఉంచడం కోసమే అస్పృశ్యత, కర్మ సిద్ధాంతం, శుష్క నీతులు సృష్టించబడ్డె.

121

జన్మ లన్నిటిలో మానవ జన్మ ఉత్తమమైంది.

మానవులందరిలో తన తిండిని తాను స్వయంగా కష్టపడి సంపాదించుకునే వాడే ఉత్తమ మానవుడు.

ఇతర మానవుల్ని అన్యాయం చేసి, మోసం చేసి, మై మరిపించి, దొంగ లాభాలు సంపాదించి, జూదమాడి, లంచాలు పట్టి, పిత్రార్జితాన్ని పోగులు పోసుకొని బ్రతికేవాడు ఖచ్చితంగా అధముడు.

మానవులలో పెచ్చుతగ్గులుంటే ఈ విధమైన గుణకర్మ విభాగంపై ఆధారపడి ఉండాలి. పుట్టుకతో అందరూ సమానులే. దైవానికి పక్షపాతం లేదు.

మానవులు కల్పించిన అక్రమాలకు, అక్రమ వ్యవస్థలకు, అక్రమ సిద్ధాంతాలకు మనం తల ఒగ్గ కూడదు. అవన్నీ స్వార్థపరుల అక్రమ కల్పనలు.

122

ఎవరూ మనకు శత్రువులు కారు.

కులతత్వ వాదులు సైతం పెడదారులు పట్టించబడిన వారే. తగిన ఉపపత్తులు చూపి, నచ్చచెప్ప గలిగితే - ఎంతటి మూర్ఖ కులతత్వ వాదులైనా సరే- సత్యాన్ని గుర్తించ గలుగుతారు.

వివిధ దేశాలలోని ఆధునిక సమాజాలను, అక్కడి ఆచార వ్యవహారాలను, వాటిలోని వైరుద్ధ్యాలను, సమన్వయ ధోరణులను వివరించి చెప్పడం ద్వారా - హేతువాదం ద్వారా - సద సద్విమర్శ ద్వారా- ఎంతటి మూఢ పట్టుదలలు కలవారి నైనా సరే- చైతన్యవంతుల్ని చేయవచ్చు.

వెలుగు చూపితే ఆనందించని వాళ్ళెవ రుంటారు- కర్మ జబ్బుల వాళ్ళూ, గుడ్డి వాళ్ళు తప్ప?

123

వైరుధ్యమూ, ఘర్షణా- ఈ రెండే సృష్టికీ, సృష్టి వికాసానికీ మూల శక్తులు.

చీకటి, వెలుగు- అతివృష్టి, ఉగ్రాతపం- స్త్రీ, పురుషుడు- చావు, పుట్టుక- బాధ, సంతోషం- ఇలా, సృష్టి సమస్తమూ వైరుద్ధ్యాల జంటలతో కూడుకొన్నట్టిదే. ఆ జంటల మధ్య నిత్యమూ జరుగుతుండే సంకుల సంఘర్షణే సృష్టి వికాసానికి దోహదకారి అవుతున్నది.

సృష్టిలో మానవ సమాజం ఒక భాగం. సమాజంలోని వైరుద్ధ్యాలను చూచి నిరాశ పడగూడదు. ఘర్షణకు భయపడి పారిపోకూడదు.

124

ఋగ్వేద కాలంలో కష్టపడితేనే తిండి లభించేది. అందుకే అది పనికి ప్రాధాన్యం ఇచ్చింది. అధర్వ వేద కాలంలో తిండి పుష్కలంగా దొరికేది. అందుకే అప్పుడు కళలు, సైన్స్ అభివృద్ధి పొందాయి.

తిండి ఉంటే తీరిక ఉంటుంది. తీరిక ఉంటే కళా విజ్ఞానాలు అభివృద్ధి పొందుతై. కళ విజ్ఞానాల అభివృద్ధే జాతి అభివృద్ధి.

అయితే– ఈనాడు తిండీ, తీరికా ఉన్న అగ్రవర్ణాల యువకులలో కళా విజ్ఞానాలకు బదులు జూదం, తాగుడు వృద్ధి పొందుతున్నై. ఎందువల్ల? జాతి పతనోన్ముఖమై ఉన్నందువల్ల. వేద కాలం తర్వాత జాతిని సంస్కరించి, సన్మార్గంలో నడిపించగల ఋషులు పుట్టనందువల్ల.

ప్రతి మనిషీ పని చెయ్యాలి. ప్రతి పని లక్ష్యమూ సర్వజన శ్రేయమై ఉండాలి.

మనిషి లక్ష్యం తన స్వార్థమే అయితే, ఆ జాతి త్వరలో నశించి పోక తప్పదు.

125

వేద కాలమే ఋషుల కాలం. ఆ తర్వాత ఋషులు పుట్టలేదు. స్మృతి కర్తలు పుట్టి ఆర్ష సమాజాన్ని నానా విధాలుగా పాడుపెట్టారు.

అంత వరకు ఋషుల నిత్య తపో వ్యవసాయంతో కలకల్లాడుతున్న వైదిక క్షేత్రం, ఆ తర్వాత సంస్కారం లేక బీడుపడిపోయింది. ముళ్ళ పొదలు, అడవి మొక్కలు దాని నిండా పెరిగాయి. అస్పృశ్యత, కులవ్యవస్థ వంటి విష వృక్షాలను కూడా స్మృతికర్తలు నాటారు. దానితో అదొక మానవ వాసయోగ్యం కాని విషమ గహనంగా తయారై, నేటి హిందూ మతంగా రూపుదాల్చింది.

126

హైందవ సమాజంలో ఇన్ని వైరుధ్యాలు పుట్టుకు రావడానికి, హిందూ మతం హిందువులకే దుస్సహం కావడానికి, అనేక మంది పరమతాల లోకి పారిపోవడానికి, పర దేశ పర మతస్థులకు హైందవ సమాజం పాదాక్రాంతమై ఎంతో కాలం పడి ఉండడానికి ఏమిటి కారణం!

ఋషులు పుట్టడం ఆగిపోయిన తర్వాత, వైదిక సమాజం అచేతనమై పోవడమే. బీడు పెట్టబడడమే. సంస్కారమూ, సంస్కరణా లేని ముళ్ళడొంకల నిండా పాములూ, తేళ్లూ, తోడేళ్లూ, పెద్దపులులూ చేరడమే!

127

సామాజిక వ్యవస్థ వ్యవసాయ క్షేత్రం వంటిది. దాని శాసనాలను, విధి నిషేధాలను, తక్షణ కర్తవ్యాలను ఎప్పటికప్పుడు విమర్శించుకొంటూ, అవాంఛితాలను నిర్మూలించుకొంటూ, కలుపు తీసుకొంటూ, బూజు దులుపుకుంటూ, చెత్త ఊడ్చుకొంటూ, దేశ కాల పరిస్థితుల కనుగుణంగా సంస్కరించుకొంటూ ఉండాలి. హిందూ సమాజం విషయంలో అలా జరగలేదు. అది ఉపేక్షించబడి, అడవిలా పెరిగిపోయింది. ఉపనిష ద్విజ్ఞాన కాంతి మరుగు పడిపోయి, పౌరాణిక పాండితీ స్వార్థాంధకారం అంతటా ఆవరించింది!

ఇప్పుడు దీన్ని పరిశీలించి, విమర్శించి, ఆధునికం చెయ్యాలంటే కత్తి, గునపం, గొడ్డలి, నాగలి, ములుకోల, కొరడా వంటివన్నీ చేతబట్టక తప్పదు. పిడివాదాల, మూఢ సిద్ధాంతాల, అంధ విశ్వాసాల తుప్పల్నీ, రుప్పల్నీ, డొంకల్నీ నరికి పారేసి – ప్రజల ఆలోచనా పద్ధతి లోనే మార్పు తీసుకురాక తప్పదు.

వైదిక వేదాంత సూత్రాలకూ, హైందవ సామాజిక పద్ధతులకూ మధ్య – దున్నని చేలో ముళ్ళ మొక్కలలా – ఎన్నో వైరుధ్యాలు పుట్టుకొచ్చినై. ఘర్షణ ద్వారా వాటిని నిర్మూలించక తప్పదు.

వివేకవంతులూ, విజ్ఞానవంతులూ, తత్వవేత్తలూ, మానవతావాదులూ అయిన యువకులంతా ఈ ఘర్షణలో, ఈ ధర్మ పోరాటంలో మన పక్షం వహిస్తారు, ఉద్యమాన్ని ముందుకు నడిపిస్తారు.

128

వైరుధ్యాలు రకరకాలుగా ఉంటై.

సిద్ధాంతాలుగా పైకి కనిపించే వాటి వెనుక స్వార్థ ప్రయోజనాలుంటై.

వ్యక్తిగత ఆస్తి, స్వలాభాపేక్ష, అధికార దాహం – ఇవే హిందూ సంఘంలోని అస్పృశ్యతకూ, కుల వ్యవస్థకూ ప్రధాన హేతువులు.

ప్రపంచంలో వివిధ జాతులకూ, దేశాలకూ మధ్య యుద్ధాలకు దారితీస్తున్న కారణాలు కూడా ఇవే.

ఇవి పోతేనే కాని మానవులలో భయాందోళనలు తొలగవు. శాంతి సౌఖ్యాలు వెలగవు.

129

దేశ కాల పాత్రలతో సంబంధం లేకుండా – ఎప్పుడైనా సరే, ఎక్కడైనా సరే – మానవులకు కావలసింది శాంతి. హిందువులకు కావలసింది కూడా శాంతే.

"ఓం శాంతి: శాంతి:" అంటూ శాంతి మంత్రం పఠిస్తూనే, కొన్ని కోట్లమంది మాలమాదిగలను అశాంతిలో ముంచి ఉంచడంలో హిందువుల ఉద్దేశ్యం ఏమిటి?

శాంతి అంటే తమకు మాత్రమే శాంతి, తక్కిన అందరికీ అశాంతి అని అర్థమా?

"లోకా స్సమస్తా స్సుఖినోభవంతు" అంటూ హిందువులు చెపుతున్న దాంట్లో నిజాయితీ ఉన్నదా?

తమ ప్రక్క ప్రక్కనే బ్రతుకుతున్న ఇన్ని కోట్లమంది మాలమాదిగల్ని అశాంతిలో ముంచి, తాము మాత్రం శాంతిని అనుభవించడం ఎలా సాధ్యం? అందుకు సర్వ సముడైన భగవంతుడెలా అంగీకరిస్తాడు?

130

వేదాలు, ఆరణ్యకాలు, ఉపనిషత్తులు వెలిసిన ఆనాటి ఆర్షమతం వేరు కులాలు, కుత్సితాలు, కుట్రలు కుళ్ళి కంపుకొడుతున్న ఈనాటి హిందూ మతం వేరు.

సంస్కరించడం సాధ్యం కాకపోతే శస్త్రం చేసైనా, సమాజం నుంచి కుల వ్యవస్థను తొలగించి, వ్యాసప్రోక్తమైన ఆర్ష సోషలిజాన్ని నెలకొల్పడానికి – మాల మాదిగ యువకుల్లారా, ఏకంకండి!

131

శాంతి కోసం యుద్ధం చెయ్యి వలసిన దుస్థితి మానవుడిది.

ఒక్క మానవుడిదే కాదు – సృష్టిలోని అన్ని జీవరాశులదీ ఇదే స్థితి అనవచ్చు.

ప్రకృతి లోని ప్రతి జీవరాశినీ పరిశీలించండి. కనీసం పొలం లోని పశువుల మందను పరిశీలించి చూడండి. అందులోని ప్రతి పెయ్యా, ప్రతి గిత్తా ఎప్పుడో ఒకప్పుడు కోట్లాటలలో పాల్గొని, బలాబలాలు తేల్చుకొని, సమాధానపడి, సాధువులుగా బ్రతుకుతున్నట్టివే.

ధర్మక్షేత్రే కురుక్షేత్రే అనడంలో భగవద్గీత ఉద్దేశం ఏమిటి? శాంతి కోసం యుద్ధం తప్పదు. యుద్ధానికి భయపడే వాళ్ళకు శాంతి ఉండదు.

132

మనకు న్యాయం జరగాలంటే – ఇతరుల న్యాయబుద్ధి మీద కాక, మన స్వశక్తి మీదనే మనం ఆధారపడాలి.

త్యాగ శక్తి, ఆత్మ రక్షణ శక్తి, పరాక్రమ శక్తి – ఈ మూడు శక్తులూ కలిసిందే స్వశక్తి.

133

తాను తన ఒక్కడి కోసమూ బ్రతికే కంటే, పదిమంది కోసం చావడం ఉత్తమం. పదిమంది కోసం బ్రతికే కంటే మొత్తం జాతి కోసం చావడం ఉత్తమోత్తమం.

జాతీయత లేకుండా అంతర్జాతీయత లేదు. మీ జాతి రక్షణే మీ ఆత్మరక్షణ.

134

ఒక్కొక్క కులం ఒక్కొక్క ప్రత్యేక జాతి వలె పరస్పర వైర భావంతో ఘర్షణ పడుతున్న హిందూ సమాజం నేడు ఒక పగిలి బీటలు దీసిన గోడలా ఉంది. బీటల్ని పూడ్చడం కంటె పూర్తిగా పడగొట్టి మళ్ళీ కట్టడం క్షేమం కాదా? అప్పుడు భారతజాతి ఏకజాతిగా, జగజ్జేయమానంగా వికసించదా?

135

అంటరానితనం నిర్మూలించబడి, అగ్ర కులాలతో సమాన ప్రతిపత్తిగల కులంగా హరిజన కులం గుర్తించబడి, గ్రామాల మధ్య వాసయోగ్యమైన గృహాలలో గౌరవంగా హరిజనులు స్థిరపడే వరకు నా ప్రబోధం మాలమాదిగ యువకులకు.

బ్రహ్మ, క్షత్రియ, వైశ్య, శూద్ర, హరిజన వర్ణాలు అయిదూ సమాన ప్రతిపత్తి కలిగి మెలగడం ప్రారంభమైన తర్వాత - వర్ణాంతర భోజనాల ద్వారా, వర్ణాంతర వివాహాల ద్వారా హైందవ సమాజం నుంచి కుల వ్యవస్థ నిర్మూలించబడేదాక నా ప్రబోధం హిందూ యువకులకు. హిందూ సమాజం నుంచి కుల వ్యవస్థ నిర్మూలించబడిన తర్వాత - మత, భాష, ప్రాంతీయ విభేధాలు తొలగిపోయి, ఏక భారతజాతి రూపొందే పర్యంతరం నా ప్రబోధం మొత్తం భారతీయ యువకులకు.

136

మన విద్యావిధానం పూర్తిగా మారాలి. తల్లిదండ్రుల ఆర్థిక సాంఘిక పరిస్థితులకు అతీతంగా బిడ్డలు పెంచబడాలి. విద్య గరపబడాలి.

దొంగ కొడుకు దొంగ, బ్రాహ్మణుడి కొడుకు బ్రాహ్మణుడు, అంటరానివాడి కొడుకు అంటరానివాడు, ధనికుడి కొడుకు ధనికుడు, కూలివాడి కొడుకు కూలివాడు - అన్న ధోరణిలో పెరుగుతున్నారు నేటి బిడ్డలు. సంఘంచే అలా చూడబడుతున్నారు. ఇది వట్టి అవాస్తవిక మూర్ఖ ధోరణి. మానవ జాతిని పట్టి పీడిస్తున్న అన్ని వ్యాధులకు మూలం ఇదే.

కుల మత వంశానుగతమైన కృత్రిమ వారసత్వం పోవాలి. ప్రతి వ్యక్తిలోను సహజ ప్రతిభ స్వేచ్ఛగా వికసించాలి. అందుకు వారి కుటుంబ వాతావరణం నుంచి బాలల్ని ఉద్ధరించి, వారిని అసూయాద్వేషాలకు అతీతంగా పెంచాలి. తల్లిదండ్రుల ఆచారాల దృష్ట్యా కాక, బిడ్డల అభిరుచుల దృష్ట్యా అక్షరాభ్యాసం మొదలు అణువిజ్ఞానం వరకు ఉచితంగా విద్య గరపబడాలి.

ఈ విధంగా విద్యావిధానం మారకుండా, వ్యవసాయమూ, పరిశ్రమలూ జాతీయం కాకుండా భగవంతుడు లక్షల అవతారాలెత్తినా, లక్షమంది మహా ప్రవక్తలు తన్నుకు చచ్చినా కూడ సమాజానికి ప్రగతి లేదు.

137

కూడు, గుడ్డ, కొంప – ఈ మూడిటినీ కలిగి ఉండడం ప్రతి వ్యక్తికీ జన్మ హక్కు.

ఒకడు తీరికగా కూర్చుని మూడు పూటలూ విందులు గుడుస్తుంటే మరొకడు రెక్కలు ముక్కలు కొట్టుకున్నా గంజినీళ్ళు దొరకని పరిస్థితి – ఒకడికి వెయ్యి ఎకరాల భూమి ఉంటే, మరొకడికి ఇళ్ళ స్థలం కూడా లేని పరిస్థితి ఎందుకు వచ్చింది? ఒకడికి బేంకులో లక్ష రూపాయలు ఉంటే, మరొకడికి చేతిలో పదిపైసలు కూడ లేవెందుకు? ఒక్క క్షణం ఆగి ఆలోచించి చూడండి.

138

లక్షాధికారి కోటిశ్వరు డెలా అవుతున్నాడు? డబ్బు పిల్లల్ని పెడుతుందా?

ఒక్క ప్రక్క మెజారిటీని మోసం చేసి మైనారిటీ ఆస్తులు ప్రోగు చేసుకొంటూ – మరో ప్రక్క మెజారిటీకి శుష్కనీతులు చెపుతున్నంతకాలం మానవుడికి అభ్యుదయం లేదు. కనుక – ఓ మెజారిటీ ప్రజలారా ! కళ్లు తెరవండి ! మీ జన్మ హక్కులను సాధించుకోవడం ద్వారా మొత్తం మానవ సమాజాన్నే ఒక మజిలీ ముందుకు నడిపించండి !

139

నమ్మేదానికీ, చెప్పే దానికీ, చేసే దానికీ సమన్వయం ఉండాలి.

మన ఉపనిష ద్వేదాంతం ఆత్మవత్ సర్వభూతాని అంటూ సర్వజన సమత్వాన్ని భోదిస్తున్నది. ఆ తర్వాత వచ్చిన కర్మకాండ ఉపనిషన్మతాన్ని నాశనం చేసి, నేటి కులతత్వాన్ని తెచ్చి పెట్టింది. ఆనాటి వైదిక సమాజానికీ, ఈనాటి హిందూ కులతత్వ సంఘానికీ ఏమీ సంబంధం లేదు. కులతత్వంతోను, హిందూ మతం వేదమతం కాదు కనుక – కులవ్యవస్థను తొలగించి, ఉపనిషత్సామ్య వాదాన్ని నెలకొల్పడానికి సిద్ధం కండి!

140

కర్మ అనేది ఏదైనా ఉంటే అది ఈ జన్మకు సంబంధించినదే !

మానసిక శక్తి, శరీర బలం, ప్రతిభ, సామర్థ్యం వంటి వాటిలోని తేడాలు ప్రకృతి స్వభావం తోడివి. స్వభావం, అవసరం, పరిస్థితి – ఈ మూడిటి మీదా ఆధారపడి, వ్యక్తుల మధ్య తరతమ భేదాలు ఉత్పన్నమవుతై.

ప్రకృతి సిద్ధమైన ఒక లక్షణాన్ని తెలివైన వాళ్ళు ఉపయోగించుకొని, తెలివితక్కువ వాళ్ళను దోచుకోడానికి కర్మవాదాన్ని కల్పించారు.

కర్మవాదాన్ని, జన్మవాదాన్ని ఖండించి, మీ దాస్య శృంఖలాలను త్రెంచుకోవడానికి విజ్ఞానాభిముఖులు కండి !

141

వాస్తవంగా కులం, మతం అనేవేవీ ఈనాడు లేవు. వాటికి చెప్ప బడ్డ విధి నిషేధాలు మొదలే లేవు.

కుల పెద్దలు, మత పెద్దలు తమ తమ ఆర్థిక రాజకీయ స్వప్రయోజనాల కోసం అమాయక ప్రజల్ని దోచుకోవడానికి కులం పేరును మతం పేరును ఉపయోగించు కొంటున్నారు.

తస్మాత్, జాగ్రత ! జాగ్రత !

142

ఈనాడు ప్రపంచంలోని మనుషులు రెండే రెండు వర్గాలు.

1. పనిచేసికొని బ్రతికేవాళ్ళు – శ్రమ జీవులు.

2. పని చెయ్యకుండా బ్రతికేవాళ్ళు – జడ జీవులు.

తాము పని చెయ్యకుండా తప్పించుకోడానికి, ఇతరుల చేత తమ పనులు చేయించుకోడానికి జడజీవులు ఎన్నో నీతులు చెపుతారు, భక్తి సూత్రాలు బోధిస్తారు, శాసనాలు నిర్మిస్తారు. శ్రమజీవులారా ! మోసపోకండి.

సుఖ దుఃఖాలు, లాభ నష్టాలు ప్రకృతి సహజ మైనట్టివి. శక్తి సామర్థ్యాలలోని తేడాలు పరిసరాలకు, తిండికి, పెంపకానికి సంబంధించినట్టివి. సర్వసముడైన భగవంతుడి దృష్టిలో మనిషికీ, మనిషికీ మధ్య తేడా ఉండదని గుర్తించండి!

143

దైవ శక్తిని ఆవాహన చేసి, ఆత్మశక్తిని పెంచుకొని, జీవిత విజయాన్ని కోరేది వేదమతం. అదే ఆర్యమతం.

భక్తిని ఆశ్రయించి, దైవం దగ్గర దాస్యం కోసం, జీవితం నుంచి పారిపోయేది పౌరాణిక మతం. అదే నేటి హిందూమతం.

ఈనాటి కులతత్వ దుష్టమైన మూఢ మతమే అసలు భారతీయ సంప్రదాయమని భ్రమ పడకండి.

ఏ మతం తోనూ మనకు ప్రమేయం లేదు. మత మూఢులైన వారి భ్రమలకు సమాధానం కోసం మాత్రమే ఈ సత్యాలు వెల్లడిస్తున్నాను.

కులమత భేదం లేకుండా మొత్తం భారతీయులందరి కోసమూ ఈ ఉద్బోధ చేస్తున్నాను.

144

ఈనాడు దేశంలోని పెద్దలకు ఆలోచన లేదు. ఆలోచించే చిన్నలకు పెద్దరికం లేదు.

విద్య, రాజకీయం, మతం, సాహిత్యం – అన్ని రంగాలలోను ఇదే పరిస్థితి.

తిండి, డబ్బు – ఈ రెండూ తప్ప, మరో పరమార్థం లేదీనాడు.

ఈ దుస్థితి నుంచి దేశాన్ని, ఓ మాలమాదిగ యువకుల్లారా, మీరే ఉద్ధరించగలరు ! స్వార్థ త్యాగులై, సర్వ మానవ సమతాధర్మం కోసం లేచి నిలబడండి!

145

దేశానికి పునాదులు మాలమాదిగ పేటలు. జాతికి పునాదులు మాలమాదిగ ప్రజలు.

పునాదుల్ని అలక్ష్యం చేసి, మహా సౌధాలు నిర్మించడానికి పూనుకోవడం వల్లనే ఎందరో మహానాయకులు అపజయం పొందారు. ఎన్నో మహాద్యమాలు విఫల మైనాయి. ఎన్నో ప్రణాళికలు బూడిద పాలైనాయి.

నాయకులు, విద్యాధికులు, అధికారులు - ఎవరూ కూడ ఆలోచించడం లేదు. దేశం ఇంతగా రోగిష్టి దెందుకై పోయిందో పరీక్షించడం కూడ లేదు.

అందుకని - పునాదులకే నేనీ హెచ్చరిక చేస్తున్నాను.

ఓ పునాదులారా! మీ వంక ఇతరులు చూడకపోతే, మీ వంక మీరైనా చూచుకోండి! మిమ్మల్ని ఇతరులెవరూ బలపరచకపోతే, మిమ్మల్ని మీరే బలపరచుకొని, భారత సౌభాగ్య సౌధానికి స్థిరత్వం కల్పించండి !

146

అస్పృశ్యత, కులతత్వం, మతోన్మాదం, భాషాహంకారం, ప్రాంతీయ సంకుచితత్వం, అధికార దర్పం, లంచగొండితనం, బంధు పక్షపాతం, పదవీ దాహం, చీకటి వ్యాపారం - ఇన్ని దుష్ట వ్యాధులతో మంచం పట్టి ఉన్న రోగిష్టి జాతి, వట్టి పటాటోపమే ప్రధాన లక్ష్యమైన నాటు డాక్టర్ల చేతుల్లో పడడం నిజంగా దురదృష్టమే.

రోగి శరీరంలోని సహజ రక్తాన్ని పీల్చి వేస్తూ, విదేశీ ఎర్రనీళ్ళతో రక్తనాళాలను నింపుతూ, శుష్కోపన్యాసాల నోటి తుపర్ల గ్లూకోజును ఇంజక్షను చేస్తూ - ఈ డాక్టర్లు ఎంతకాలం రోగిని బ్రతికించి ఉంచగలరు.?

వ్యాధుల్ని నిర్మూలించి, జాతిని కాపాడడం కోసం - వివేకం కల యువకులారా, ముందుకు రండి ! వ్యాధి హేతువుల్ని తెలుసుకోండి. మందులు పని చెయ్యకపోతే, శస్త్రం చెయ్యడానికి సిద్ధం కండి:

147

ప్రజలకు ఆత్మ విమర్శ నేర్పండి !

పొరపాట్లను, పొర పొచ్చాలను, అపోహలను, అసూయలను ఎప్పటి కప్పుడు నిర్మూలించి వెయ్యండి!

సమస్యలను చెత్తలా పెరగ నివ్వకండి.

మనం ఉంటున్న గదిని ఒక్కరోజు ఊడ్చకపోతేనే అంత చెత్త పెరుగుతుంది కదా? ఒక్క రోజు స్నానం చెయ్యక పోతేనే శరీరంపై అంత మురికి పేరుకొంటుంది కదా? ఒక్క రోజు విరేచనం కాకపోతేనే కడుపులో అంత తీట బైలుదేరుతుంది కదా?

మానవుని బాహ్య పరిసరాలకే, భౌతిక శరీరానికే ఎప్పటి కప్పుడు అంతటి ప్రక్షాళనం అవసరమవుతున్నప్పుడు - మానవ జీవితాన్నే నిత్య నవోన్మేషశీలంగా ఉంచవలసిన మెదడుకు, ఆలోచనకు, సాంఘిక నీతికి ఎంతటి నిశిత నవీకరణ అవసరమో యోచించండి !

రోజు కొకసారి కాదు, ఏడాది కొకసారి కాదు, శతాబ్దాని కొకసారైనా మన ఆలోచనలను, జీవిత పద్ధతులను, సాంఘిక నీతులను, విధి నిషేధ శాసనాలను పున: పరిశీలన చేసుకోవడం లేదుకదా! ఇక ఈ సమాజం నిండా, ఈ మతం నిండా, ఈ బ్రతుకుల నిండా చెత్తాచెదారం చేరకుండా ఎలా ఉంటుంది?

మనిషి ఎక్కడ ఉంటే అక్కడ చెత్త, మురికి, దురలవాట్లు, మూఢాచారాలు స్వార్థపరత, పరపీడన వంటి అవాంఛితాలన్నీ పెరుగుతై. వాటిని ఎప్పటికప్పుడు తొలగిస్తూ, శుభ్రం చేస్తూ ఉండాలి. అలా చెయ్యకపోవడం వల్లనే హైందవ సమాజం నిండా కుళ్లు పేరుకొని, శిథిలావస్థ ఏర్పడింది!

148

భీమ సేనను ముందుగా మాలమాదిగ యువకులతో, మాల మాదిగ పేటలలో ఆర్గనైజు చెయ్యండి. ఈ నాడు ఆరోగ్యకరమైన విప్లవ చైతన్యం కలవాళ్లు ఒక్క మాలమాదిగలే.

ఆ తర్వాత - సాంఘిక హైన్య దైన్యాలకు గురిచేయబడి ఉన్న తదితర కులాల వారినీ, మతాల వారినీ భీమ సేనలో చేర్చుకోండి. సేన లక్ష్యాలతో పూర్తి ఏకీభావంకల ఎవరైనా సరే సేనలో చేరవచ్చు. మాలమాదిగ పేటలను ప్రధాన గ్రామాలతో కలిపి వెయ్యడం ప్రాతిపదికగా కార్యక్రమం ప్రారంభం కావాలి. ఇది సేన కార్య ప్రణాళికలో అతి ప్రధానమైన భాగం.

149

సేనలో స్త్రీలకు, విద్యార్థులకు ప్రత్యేక విభాగాలుండాలి. విద్యార్థులకు సృజనాత్మకమూ, నిర్మాణాత్మకమూ, ఉత్తేజకరమూ అయిన కార్యక్రమాన్ని నిర్దేశించాలి.

ఈ నాడు విద్యార్థులలో క్రమశిక్షణ లోపించడానికి కారణం వారి శక్తికి, ఉత్సాహానికి, భావోద్వేగానికి తగిన జాతీయ కార్యక్రమం లేకపోవడమేనని గుర్తించండి.

ఇంటివద్ద తల్లిదండ్రులు కాని, బడిలో ఉపాధ్యాయులు కాని విద్యార్థులకు ఉత్తేజం కలిగించలేక పోతున్నారు. చాలీ చాలని రాబడితో, తెలిసీ తెలియని ప్రణాళికతో సతమతమై పోతున్న వాళ్లు కుర్ర వాళ్ళలో ఉత్తేజాన్ని ఎలా కలిగించ గలరు? అందుకే విద్యార్థులు తమ యౌవన భావోద్వేగాల్ని కార్య రూపంలో పెట్టడానికి వీధిని పడుతున్నారు. ఏం చేస్తారు మరి? ఉరకలు వేసే యౌవన శక్తుల్ని నిర్మాణాత్మకంగా ఉపయోగించుకో గల్గిన ప్రణాళిక దేశంలో ఎక్కడుంది? ఎవరికుంది? విద్యారంగం ఈ నాడున్నంత నిస్సారంగా, నిస్తేజంగా, అయోమయంగా, అంధకార బంధురంగా మరెప్పుడుంది?

అందుకే- విద్యార్థులకు తగిన నిర్మాణాత్మక జాతీయ కార్యక్రమం చూప మంటున్నాను.

150

చిన్నప్పుడే స్త్రీ సాంగత్యం మొదలు పెట్టిన వాడు యౌవనంలోనే నిర్వీర్యుడై ఎలా నశించి పోతాడో, అలానే విద్యార్థి దశలోనే రాజకీయాలు మొదలు పెట్టిన జాతి ప్రౌఢ ప్రపంచపు పోటీకి తట్టుకోలేక నశించి పోతుంది.

సమస్త విద్యలలోను ఆరితేరిన తర్వాతనే జీవిత రంగంలో ప్రవేశించాలి. జీవిత రంగంలో రాజకీయ రంగం ఒక తరంగం మాత్రం.

అధికారంలో ఆనందం లేదు. రాజకీయ జీవితం కృతకమై నట్టిది. అది ప్రౌఢులకే కాని, యువకులకు పనికిరాదు. విద్యార్థులకు అసలే పనికిరాదు.

రాజకీయ నాయకులు, పార్టీలు ఈ నాడు తమ తమ స్వప్రయోజనాల కోసం విద్యార్థుల్ని వాడుకొంటున్నారు. అంతకంటే నైతిక దారిద్ర్యం మరొకటి ఉండదని గుర్తించండి. పిందెల్ని కోసి మార్కెట్లో పారబోయడాన్ని సహించకండి.

151

విద్యార్థులను చదువులలో పలెనే - యువకులను జాతి నిర్మాణ కార్యక్రమాలలో నిమగ్నులను చేసి ఉంచాలి.

మానసికమైన అపరిపక్వత, దైహికమైన నిర్వ్యాపారత- ఈ రెండూ నిస్పృహకూ, తిరుగుబాటుకూ మూల బీజాలు.

జాతి జీవన ప్రగతికి దోహదం చేసే వ్యావసాయక, పారిశ్రామిక, సాంస్కృతిక రంగాల వివిధ శాఖలలో ప్రభుత్వమే విప్లవాలను నడిపిస్తూ ఉండడం ద్వారా యువకులకు చేతినిండా పని కల్పిస్తూ ఉండాలి.

రాజకీయ రంగం నుంచి వృద్ధులు వైదొలగి, సలహాదార్లుగా మారుతూ - యువకులు కార్యరంగం లోకి ప్రవేశిస్తూ ఉండాలి.

ప్రకృతి - మానవ ప్రకృతి- నిత్య ప్రగతిశీలం. దాని గమనానికి అనుగుణంగా విప్లవం ముందుకు సాగాలి. అది ఎక్కడైనా ఆగిపోతే- రెట్టింపు వేగంతో అది ముందుకు దూకుతుంది.

యుద్ధాలకు, తిరుగుబాట్లకు, కల్లోలాలకు కారణం విప్లవ నిరోధమే.

ఇండియాలో, ముఖ్యంగా హైందవ సమాజంలో విప్లవం ఆగిపోయి ఎన్ని యుగాలైందో గుర్తించారా? కుల కక్షలకు, మత కలహాలకు, అన్నిటికీ మూల కారణం ఏమిటో గుర్తెరిగారా?

మానవత్వం చచ్చిన శవాలపై పదవీ వ్యామోహ పిశాచాలు విందులు గుడుస్తున్నై. చూస్తూ ఇంకా ఎంతకాలం సహిస్తారు?

152

కాయ కష్టంలో, త్యాగంలో, ఓర్పులో, బాధలను సహించడంలో, భవిష్యత్తుపై ఆశతో బ్రతకడంలో మాలమాదిగ స్త్రీలు తమకు తామే సాటి. సాంఘిక దురాచారాలను తుడిచి పారవెయ్యడంలో వారికి ప్రాధాన్యం ఇవ్వండి!

స్త్రీలు చైతన్య వంతులై, విప్లవ కార్యక్రమాలలో ప్రముఖ పాత్ర వహించకుండా ఏ జాతి అభ్యుదయాన్ని సాధించ జాలదని గుర్తించండి.

స్త్రీకి వివాహం ఒక్కటే పరమార్థమనే మూఢ విశ్వాసాన్ని వదిలి పెట్టండి. పురుషుడితో సమానంగా పోరాడే శక్తిని కలిగించండి.

ధనిక వర్గాలలోని ఎండ కన్నెరుగని సుకుమారులైన స్త్రీలే ఈనాడు ఉద్యోగాలలో, రాజకీయాలలో, సాంఘిక సేవలో, నాటకాలలో, నాట్యాలలో సంగీత సాహిత్యాది కళలలో ఎంతో ముందడుగు వేస్తుంటే– పురుషులతో సమానంగా కష్టపడే మీ స్త్రీలంతా ఎక్కడున్నారు?

ఇరవై సంవత్సరాలుగా ప్రభుత్వ సహాయంతో చదువుకొంటున్న మీ వేలకొలది అమ్మాయిల నుంచి చెప్పుకోదగ్గ ఒక్క గొప్ప మహిళ కూడ తయారు కాలేదు, ఎందువల్ల?

153

విప్లవ చైతన్యం అంటే ఏమిటి? అది ఎవరి కుంది?

మంచి యౌవనంలో ఉండడం, బలంగా ఉండడం, గొంతెత్తి అరవడం, ఉపన్యాసాలు దంచడం, కొరవతో ఎదుటి వాడి మీదకు దూకడం, నినాదాలివ్వడం ఈ లక్షణా లుంటే అది విప్లవ చైతన్యం అవుతుందా? అది ఈనాడు వామ పక్షాలుగా పిలుప బడుతున్న వారిలో అయినా ఉన్నదా?

ఈ దేశంలో ఈనాడు విప్లవ చైతన్యం అనేది ఒక్క మాల మాదిగలలోనే ఉన్నదని గుర్తించండి! కులానికీ, వర్గానికీ తేడా తెలియని వామ పక్షాలకు విప్లవ ధోరణే లేదని తెలియండి!

154

భీమ సేన ఒక సర్వ తంత్ర స్వతంత్రమైన జాతీయ సంస్థ. దీని లక్ష్యం హైందవ సమాజం నుంచి అస్పృశ్యతను, కుల వ్యవస్థను నిర్మూలించడం. నిమ్నులమూ, నిర్వర్గమూ అయిన భారతీయ ప్రజాస్వామిక సోషలిస్టు సమాజాన్ని దేశంలో నెలకొల్పడం. విశ్వమానవ సమావిర్భూతికి ప్రభాత భేరి మ్రోగించడం!

కుల వ్యవస్థను కూకటి వ్రేళ్ళతో సహా పెరికి పారవెయ్య కుండా ఈ దేశంలో సోషలిజాన్ని స్థాపించడం అసాధ్యం.

ఈ దేశంలో సోషలిజాన్ని, అంటే శ్రేయోజన సమ సమాజాన్ని స్థాపించాలని మనస్ఫూర్తిగా విశ్వసించే ఏ పార్టీ అయినా సరే- ముందుగా అస్పృశ్యతను, కుల వ్యవస్థను నిర్మూలించక తప్పదు.

అందుకు భీమసేన ఒక్కటే సర్వ సమర్థవంత మైనట్టిది.

155

దేశంలోని నేటి ఏ రాజకీయ పార్టీకీ లక్ష్యశుద్ధి లేదు. చిత్తశుద్ధి లేదు. సార్వజనిక దృష్టి లేదు. ప్రజా హృదయావగాహన లేదు. విశ్వాభ్యుదయ కార్యక్రమం లేదు.

తమ వాళ్ళకు ఉద్యోగాలు, లైసెన్సులు, పర్మిట్లు, కాంట్రాక్టులు, ట్రాన్సుఫరులు, ప్రమోషనులు, తమ ఊరికి రోడ్లు, తమ పొలాలకు కాలువలు, తమ ఫ్యాక్టరీకి విద్యుచ్ఛక్తి - ఇలాంటి వేవో సంపాదించు కోడానికి తాపత్రయ పడడం, అందుకు ముఠాలు కట్టడం, పదవుల కోసం కుట్రలు పన్నడం- ఇంతే తప్ప. ఏ పార్టీ నాయకులకూ మరో ఆదర్శం కనబడదు. సాముదాయక శ్రేయస్సు గాని, జాతి సర్వతోముఖాభివృద్ధి గాని ఎవరి మనస్సుకూ పట్టినట్టు లేదు.

అందుకే- దేశంలో సమస్యలు రోజు రోజుకూ పెరిగిపోతున్నై. వాటిని పరిష్కరించే విజ్ఞత తరిగి పోతున్నది. పార్టీలు పడిపోతున్నై. నాయకులు నామరూపాలు లేకుండా పోతున్నారు.

స్వార్థం ప్రవేశించగానే సరస్వతి నిష్క్రమిస్తుంది. సరస్వతి లేని దేశం - ఇప్పుడు మన దేశం వలెనే- అయోమయమై పోతుంది.

నినాదాలు విప్లవాన్ని తేలేవు. మంత్రాలకు చింతకాయలు రాలవు.

ఇచ్ఛాశక్తి లేనిదే జ్ఞానశక్తి లేదు. జ్ఞానశక్తి లేనిదే క్రియాశక్తి లేదు. ఈ మూడూ సక్రమమైన మార్గంలో సర్వజనాభ్యుదయం కోసం పురోగమించినప్పుడే వాటికి దైవశక్తి తోడ్పడి, విజయం లభిస్తుంది.

ఇందులో- ఈ అన్నిటికీ ఆధారభూతమైన ఇచ్ఛాశక్తి మాలమాదిగలలో ఉన్నంతగా మరే కులంలోనూ లేదని గుర్తించండి! ప్రస్తుతం అది నివురు గప్పిన నిప్పులా, మర్రి విత్తులోని మహావృక్షంలా, భూగర్భం లోని అగ్ని పర్వతంలా ఉంది. అది ఎప్పుడో ఒకప్పుడు, ఏదో ఒక రూపంలో క్రియాశక్తిగా మారక తప్పదు. దానికి దైవశక్తి తోడ్పడడం కోసం జ్ఞాన శక్తిని ఆశ్రయించండి!

స్వార్థ రహితమైన సర్వజనాభ్యుదయ కృషే జ్ఞానశక్తిగా గుర్తించండి ! అదే నిజమైన సరస్వతి.

156

పనిచేస్తూ ఉంటే అనుభవం కలుగుతూ ఉంటుంది. అనుభవాన్ని మళ్ళీ ఆచరణలో పెడితే, పని మరింత చక్కగా సాగుతుంది. అప్పుడు అనుభవానికి మరింత పదునూ, కాంతీ లభిస్తుంది. వాస్తవ జ్ఞాన సముపార్జన పద్ధతి ఇది.

వాస్తవ జ్ఞానమే సరియైన జ్ఞానం.

మత, రాజకీయ, సాంఘిక, విద్యా, కళా, సాంస్కృతిక ఆది రంగాలలో ఏ ఆచారమైనా, ఏ సిద్ధాంతమైనా, ఏ కార్య పద్ధతి అయినా మానవుని వాస్తవ జ్ఞానం మీద ఆధార పడినట్టిదే. వాస్తవ జ్ఞానం ఎడతెగని పని ద్వారా, పరిశీలన ద్వారా లభించినట్టిదే.

వాస్తవ జ్ఞానం దేశ కాల పాత్రానుగుణమై ఉంటుంది. దేశ కాల పాత్రాను గు ంగా మారుతుంది.

స్వయం వరాలు, కన్యా దానాలు, కన్యా విక్రయాలు, వర విక్రయాలు, ప్రేమ వివాహాలు, నిధవా వివాహాలు, ఏకపత్నీత్వాలు, బహు భార్యాత్వాలు, బహు భర్తృత్వాలు, ఈ అన్నిటి మీదా విధి నిషేధాలు, తిరుగుబాట్లు, సర్దుబాట్లు, రాజరికాలు, రిపబ్లిక్కులు, పిలకలు, క్రాపులు, తలపాగాలు, టోపీలు– ఈ విధంగా ఏ చిన్న విషయాన్ని తీసికొని మనం పరిశీలించినా, ఈ సత్యం కనిపిస్తుంది. మంచి చెడ్డలు, ఆచార వ్యవహారాలు, నీత్యవినీతులు, విధి నిషేధాలు అన్నీ దేశకాల పాత్రాను గుణంగా ఎలా మారిపోతున్నాయో స్పష్టమవుతుంది.

ఏ ఆచారమూ, ఏ సిద్ధాంతమూ, ఏ కార్యపద్ధతీ, ఆకాశం నుంచి ఊడి పడలేదు. మార్పుకు అతీత మయిందేదీ లోకంలో లేదు.

157

మేధావు లైనవాళ్లు, వివిధ రంగాలలో విప్లవాలను సాధించిన వాళ్ళు విజయాలకు ప్రజలను నడిపించిన వాళ్ళు అందరూ కూడ మొదట్లో మీ వంటి వాళ్ళే పని ద్వారా, త్యాగం ద్వారా, అనుభవాన్ని ఆచరణలో పెట్టడం ద్వారా గొప్ప వాళ్లైన వాళ్లే.

ఆచరించే వాడికి అసాధ్య మయిందేదీ లేదు. కనుక–న్యాయం అనుకొన్న పనికి వెంటనే పూనుకోండి.

"అనగ ననగ రాగ మతిశయిల్లును నుండు, తినగ తినగ వేము తియ్యనుండు, సాధనమున పనులు సమకూరు ధరలోన" అన్న వేమన యోగి మాట యదార్థమని గుర్తించండి.

158

సృష్టిలో వర్గ వైరుధ్యాలు సహజ సిద్ధ మైనట్టివి. వాటి వల్ల ఘర్షణ ఏర్పడుతుంది. దానివల్ల అభ్యుదయం కలుగుతుంది. ఆ అభ్యుదయంలో మళ్ళీ వైరుధ్యాలు మొలకెత్తుతై. ఇది పురోగమన క్రమం. దీనికి అంతం లేదు.

అంతం లేని ఈ క్రమం దేని చుట్టూ పరిభ్రమిస్తున్నదో దాన్ని తెలుసుకొని, స్వాధీనం చేసుకోవడమే భారతీయ తత్వ దర్శనం. దానిని చేరే అనంతకోటి దృక్పథాలలో గతి తార్కిక భౌతిక వాదం ఒకటి.

మార్క్సిజంలో ఉండే లోపాలను సవరించి - ఆర్ష వేదాంతం ప్రతి పాదించిన, బుద్ధ భగవానుడు ప్రయోగించి చూపిన, అంబేడ్కరు ఉద్దేశించిన సర్వమానవ సమతా సమాజాన్ని నెలకొల్పవలసి ఉంది. అట్టి పనిని హరిజన బహుజన యువకుల నాయకత్వం క్రింద భీమసేన ఒక్కటే నిర్వహించ గలదని నా విశ్వాసం.

159

ఒక్క సత్యాన్ని మనం అసందిగ్ధంగా గుర్తించవలసి ఉంది. కులం అంటే పట్టింపు కలవాళ్ళూ, కులం పేరుతో కొట్లాటలకు దిగేవాళ్ళూ ఆయా కులాలలోని కొద్దిమంది రౌడీలు మాత్రమే. ఈ రోజులలో జనసామాన్యానికి కులంతో నిమిత్తం లేదు.

కొద్ది మంది రౌడీల నుంచీ, పదవీ వ్యామోహపరుల నుంచీ, కులం పేరుమీద బ్రతికే బిచ్చగాళ్ళ నుంచీ జనసామాన్యాన్ని కాపాడ గలిగితే చాలు, అన్ని కులాల ప్రజలూ మన ఉద్యమాన్ని బలపరచ గలరు.

160

ఎక్కడ చైతన్యం లేదో అక్కడ కాంక్ష లేదు. ఎక్కడ కాంక్ష లేదో అక్కడ ఘర్షణ లేదు. ఎక్కడ ఘర్షణ లేదో అక్కడ అభ్యుదయం లేదు.

మాల మాదిగలు తరతరాలుగా దాస్యంలో మునిగి ఉండడానికి హేతువు వారిలో వర్గ చైతన్యం లేక పోవడమే.

161

భారత దేశంలో వర్గం అంటే కులం. ఈ సత్యం తెలియ నందువల్లనే, ఈ దేశంలో కమ్యూనిస్టు ఉద్యమం సైతం విఫలమయింది.

ఈ దేశంలో కులాన్ని నిర్మూలించకుండా, ప్రగతి పథంలో ఒక్క అడుగైనా ముందుకు సాగడం సాధ్యం కాదు.

162

అగ్రశ్రేణి నాయకులలో, విద్యావంతులలో, పట్టణ వీధులలో, హోటళ్లలో, సినిమా హాళ్ళలో, క్లాసు రూములలో, సభలలో– అస్పృశ్యత చాలా వరకు పోయిన మాట నిజమే. అంత మాత్రం చేత లాభమేమీ లేదు.

ఎవళ్ళపట్ల అంటరానితనం పాటించబడడం లేదో, వాళ్ళు సమాజంలో బహుకొద్ది మంది. పైగా వాళ్ళకూ, గ్రామాలలోని మాలమాదిగ పేటలకూ ఈ నాడు ప్రత్యక్ష సంబంధం ఏమీ లేదు.

అస్పృశ్యత ఎక్కడ పోతే అది నిజంగా పోయినట్టో, అక్కడ అది అసలు పోనే లేదు.

పట్టణాల లోను, గ్రామాల లోను మాలమాదిగ పేటలు ఎక్కడి వక్కడే పడి ఉన్నై. వెలివేయబడే ఉన్నై. అంధ యుగాలనాటి అనాగరికతకూ, దారిద్ర్యానికీ, దిక్కులేని తనానికీ చిహ్నాలుగానే ఉన్నై.

163

పట్టణాలలో కాని, గ్రామాలలో కాని ఈనాడు అంటరానితనాన్ని అగ్రకులాల వారి కంటె కూడ, వెనుకబడ్డ కులాల వారే ఎక్కువగా పాటిస్తున్నా రనేది అందరికీ తెలిసిందే. ఇది ఒక విచిత్రమైన విపరీత పరిస్థితి. ఈ పరిస్థితిని చాలా నేర్పుతో ఎదుర్కోవలసి ఉంది.

మాల మాదిగ పేరు చెపితే పట్టణాలలో ఇల్లు అద్దెకు ఇవ్వరు. మ్యునిసిపల్ పంపు దగ్గర నీళ్ళు పట్టుకోనివ్వరు. హరిజనోద్యోగుల ఇళ్ళలో పనులు చెయ్యరు. అంతవరకు ఆనందంగా పనిచేస్తున్న వాళ్ళు కూడా కులం పేరు తెలియగానే చట్టుక్కున మానివేస్తారు. ఇలా చేసే వాళ్ళంతా ఎక్కువగా వెనుకబడ్డ కులాలకు చెందినవారే. ఎందుకు వారలా చేస్తున్నారు? ఈ సమస్యలో ఉన్న కిటుకు ఏమిటి?

164

దేశంలో కులతత్వం ఈ నాడున్నంత తీవ్రంగా పూర్వ మేనాడూ లేదు. అందుకు కారణం రాజకీయాలు కావచ్చు. అయితే అస్పృశ్యత మాత్రం పై కులాలలో లేనంత తీవ్రంగా క్రింది కులాలలో ఉంటున్నది. ఎందుచేత?

హైందవ సమాజంలో, స్మృతుల ప్రకారం, బానిసలుగా చూడబడ్డ వాళ్లు శూద్రులు. అట్టి శూద్రుల చేత కూడ హీనంగా చూడబడ్డ వాళ్ళు వెనుకబడ్డ కులాలవారు. అట్టి వెనుకబడ్డ కులాల వారే మాల మాదిగల పట్ల ఎవరికీ లేనంత అంటరాని తనాన్ని పాటిస్తున్నారంటే ఏమనుకోవాలి? దీన్ని వెనుక ఆర్థిక కారణ మేదైనా ఉన్నదా? వట్టి మూర్ఖత్వమేనా?

165

భగవద్భక్తి మొదలు బందిపోటు వరకు మానవ ప్రవర్తన ప్రతి దానికి కూడ వెనుక ఏదో ఒక ఆర్థిక కారణం ఉంటుంది. రాజకీయా ధిపత్యానికి కూడ మూల ప్రేరకం ఆర్థిక ప్రయోజనమే కదా?

కారణం సమసిపోయిన తర్వాత సైతం ఆ ప్రవర్తన మార్పు లేకుండా కొనసాగితే– అప్పుడది మూఢాచార మవుతుంది.

మాలమాదిగలతో చేతులు కలిపితే గ్రామంలోని అగ్రకుల పెద్దలకు కోపం వస్తుందనీ, అందువల్ల తమ వృత్తికి భంగం కలగవచ్చుననీ, అంటరానితనం పోతే ఆయావృత్తులలో హరిజనులే తమకు పోటీ రావచ్చుననీ వెనుకబడ్డ కులాలవారు భయపడుతూ ఉండవచ్చు. ఈ రోజులలో అట్టి భయం అక్కరలేదని వారికి మనం నచ్చ చెప్పవలసి ఉంది. వెనుకబడ్డ కులాలవారిలో అంటరానితనం పోతే తక్కిన వారిలో అది క్షణాల మీద పోతుంది.

అందుకే – మాలమాదిగ పేటల తర్వాత, వెనుకబడ్డ కులాలవారి పేటల్లో భీమసేన పని చెయ్యాలి.

166

ఎక్కడ ఎక్కువ విజ్ఞానం ఉంటుందో అక్కడ ఎక్కువ చైతన్యం ఉంటుంది. ఎక్కడ ఎక్కువ చైతన్యం ఉంటుందో అక్కడ ఎక్కువ పురోగమనం ఉంటుంది. ప్రతి

అభ్యుదయోద్యమం లోను, సంస్కరణోద్యమం లోను బ్రాహ్మలే ముందడుగు వెయ్యడానికి కారణం అదే.

ఈనాటి వాస్తవ పరిస్థితి గుర్తించి, వెనుకబడ్డ కులాలతో పాటు తాము కూడా కలిసి రావడానికి బ్రాహ్మణ ప్రజలు అంగీకరిస్తే వారిని కూడా కలుపుకోడానికి వెనుదియ్యకండి! ఈనాడు బ్రాహ్మలు కూడా ఎన్నో విధాల వెనకబడి ఉన్నవారే.

167

వేద, పురాణ, ఇతిహాస యుగాలను గమనించినా – బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులకు, ఇంద్రాది దేవతలకు, అప్సరసలకు, మునులకు, మహారాజులకు, రాణులకు కూడ కిరీటాలు, కుండలాలు, హారాలు, పంచెలు, చీరెలు, గదలు, ఆయుధాలు, పావుకోళ్ళు, చెప్పులు, కమండలాలు, పాత్రలు, రథాలు వగైరా వగైరా లన్నింటినీ తయారు చేసి ఇచ్చే చేతిపనుల నిపుణులు – వారి ఆరోగ్యానికి, శుచి శుభ్రతలకు, అందచందాలకు, విందు వినోదాలకు అవసరమయ్యే వర్గాలవారు – ఈనాడు దిక్కులేని దీనజాతు లెందుకయారో ఆలోచించండి!

శ్రీ మహావిష్ణువు పవిత్రుడూ, ఆయనకు పాదరక్షలు సమకూర్చిన మాదిగ అపవిత్రుడూనా?

చీకటిని తొలగించే సూర్యుడు పవిత్రుడూ, మురికిని తొలగించే పాకీవాడు అపవిత్రుడూనా?

ఆనాడు దేవ, దానవ, మానవ గుణ భేదాలే తప్ప – నేటి కుల భేదాలు లేవనే సత్యాన్ని గుర్తించండి! నేటి కులవ్యవస్థను నిర్మూలించకుండా భారత జాతికి మోక్షం లేదని గమనించండి!

168

మనకు కులతత్వం లేదు. అన్ని కులాలూ మనకు సమానమే.

అన్ని కులాల లోనూ మనకు మిత్రులూ, సానుభూతి పరులూ, సహాయకులూ ఉన్నారు. అన్ని కులాల లోనూ మన ఉద్యమాన్ని బలపరిచే యువకులున్నారు. ఉద్యమంలో పనిచేసే భీమ సైనికు లున్నారు.

నేను ప్రత్యేకంగా హరిజనులకే ఈ ఉద్బోధ చెయ్యడానికి కారణం వాళ్లు

అంటరానితనానికి గురి చెయ్యబడి ఉండడమే. కులవ్యవస్థ విషపు కోరలలో చిక్కుకొని ఉండడమే.

గిరిజనులు అస్పృశ్యులు కారు. వారి సమస్యల స్వరూపం వేరు. అయినా – వెనుకబడ్డ కులాలతో పాటు గిరిజనులు కూడ భీమసేన కార్య పరిధిలో వారే?

బాధితులే బాధా విముక్తి కోసం పోరాడవలసి ఉంది.

మన పోరాటం అస్పృశ్యత, కులతత్వం వంటి సమస్యల మీద. మనుష్యుల మీద కాదు.

169

ఏ ఉద్యమ మైనా జయప్రదం కావాలంటే డబ్బు అవసరమన్న మాట నిజమే. డబ్బు లేకుండా ఏ పనీ జరగని రోజులివి. అయితే అన్ని విషయాలలో వలెనే డబ్బు విషయంలోకూడ స్వయంశక్తి మీదనే ఆధారపడాలి. మాలమాదిగలు తమలో తామే చందాలు వేసుకొని ఉద్యమాన్ని నడిపించాలి. తర్వాత ఉద్యమంలో విశ్వాసం గల ఇతర కులాల వారి సహాయాన్ని పొందవచ్చు.

170

అస్పృశ్యత పోయి, మాలమాదిగ పేటలు ప్రధాన గ్రామంలో లీనమైపోయే వరకు – అంటే ఉద్యమం లోని తొలిదశ ముగిసే వరకూ ఉద్యమ బాధ్యత యావత్తూ హరిజనుల మీదనే ఉండవచ్చు. బహుజనులు కూడ చేరవచ్చు. ఏది ఏమైనా, ప్రధాన భారాన్ని మోయడానికి హరిజనులు సిద్ధంగా ఉండవలసి ఉంది.

హరిజనోద్యోగులు, హరిజన నాయకులు – ఒకరి నొకరు విమర్శించుకోవడం తోనే బాధ్యత తీరిందనుకోక ఈ పవిత్రోద్యమానికి ధారాళంగా తోడ్పడవలసి ఉంది.

కుల తత్వాన్ని కులతత్వం తోవే ఓడించక తప్పని క్లిష్ట స్థితి ఈనాడు ఏర్పడి ఉంది. నాగాస్త్రాన్ని గరుడాస్త్రంతో ఎదుర్కొనక తప్పదు.

మనది కులతత్వం కాదు. ఇతరులలోని కులతత్వాన్ని ఎదుర్కొనడానికి బాధితకులాలు సంఘటితం కావడం దోషం కాదు.

ముల్లును ముల్లుతో తీసి పారవేసిన తర్వాత, ఆ ముల్లును కూడ పారవేస్తాం.

171

భీమసేన ఒక పవిత్ర జాతీయ సంస్థ.

ఏక నాయకత్వ ప్రాతిపదికపై ఇది పనిచెయ్యాలని నా కాంక్ష.

రాష్ట్ర సేనకు రాష్ట్ర నాయకు డొక్కడే సర్వాధికారిగా ఉంటాడు. అతని క్రింద జిల్లా నాయకులు పనిచేస్తారు. జిల్లా నాయకుడి క్రింద తాలుకా నాయకులు, పట్టణ నాయకులు పని చేస్తారు. తాలుకా నాయకుడి క్రింద గ్రామ నాయకులు పని చేస్తారు. గ్రామ నాయకుని క్రింద ఆ గ్రామ జనాభానుబట్టి ఎన్నో యూనిట్లు అయినా పని చేయవచ్చు. ఒక్కొక్క యూనిట్టులో ఎంత మంది సభ్యులుండాలనే విషయం ఆయా స్థానిక నాయకులే నిర్ణయించుకుంటారు.

భీమసేనలో చేరిన సభ్యులందరూ భీమ సైనికులే.

అంటరానితనాన్నీ, కుల వ్యవస్థనూ నిర్మూలించడానికి తమ సర్వశక్తులూ ధారపోస్తామని ప్రతి భీమ సైనికుడూ ప్రతిజ్ఞచేస్తాడు.

ప్రతి నాయకుడుకీ ఒకో సలహా సంఘం ఉంటుంది. కార్య ప్రణాళిక ఉంటుంది. ఎన్నికల తంతు ఏమీ ఉండదు. ఏ విషయంలోనైనా సరే నాయకుడి ఆదేశానికి తిరుగుండదు. క్రింది నాయకుడి కార్యక్రమాన్ని పై నాయకుడు నిత్యమూ పరిశీలిస్తూ ఉంటాడు.

172

ప్రతి భీమ సైనికుడూ హృదయ వైశాల్యం, త్రికరణ శుద్ధి, స్నేహ పరాయణత కలిగి ఉండాలి.

ఎవరికి అన్యాయం జరిగినా, ఆపద కలిగినా సహించకూడదు. కష్టాలలో ఉన్న ఎవరికైనా సరే తోడ్పడడం భీమ సైనికుడి ప్రథమ కర్తవ్యం. ఈ విషయంలో అతడు బాలభటుడే. బాలభటుడు పొందే శిక్షణను ప్రధాన అర్హతగా భీమ సైనికుడు పొందాలి. ఈత, సాము, ప్రథమ చికిత్సా విధానాలు అన్నీ అభ్యసించాలి.

173

క్రమ శిక్షణ, నిగ్రహం, దూరదృష్టి, సూక్ష్మ గ్రహణ శక్తి, త్యాగనిరతి, స్నేహశీలత, పట్టుదల, ఆత్మ విశ్వాసం ప్రతి భీమ సైనికుడికి అవసరం.

సమస్యలను క్షుణ్ణంగా అర్థం చేసుకోవాలి. సరియైన కార్యక్రమాలను రూపొందించాలి. స్పష్టమైన ఆదేశాలను ఇవ్వాలి. ఎందులోనూ అస్పష్టత పనికిరాదు. చెప్పే మాట సూటిగా చెప్పాలి. ఊగిసలాట పనికిరాదు.

174

లోకంలో ప్రతి విషయమూ తప్పొప్పులతోనూ, మంచి చెడ్డలతోనూ కూడుకొని ఉంటుంది. తప్పొప్పులు, మంచిచెడ్డలు మహా పర్వతాలేం కావు. వ్యక్తిని బట్టి, పరిస్థితిని బట్టి, కాలాన్ని బట్టి మారుతూ ఉంటాయవి. ఈ సత్యాన్ని గుర్తించి ప్రతి సమస్యనూ దేశ కాల పాత్రోచితంగా మాత్రమే పరిశీలించాలి.

తండ్రి కమ్యూనిస్టు అయితే కొడుకు కూడా కమ్యూనిస్టే అనుకోరాదు. పండితుడి కొడుకు పండితుడే అనుకోరాదు. పరిసరాల ప్రభావం ఉంటుంది. కాని – పెంపకాన్ని, పరిసరాలను కూడ అధిగమించగల శక్తి ప్రతిభావంతుడైన వ్యక్తికి ఉంటుందని గుర్తించండి.

మూఢాచార పరుడైన తండ్రికి ప్రగతి గామి అయిన విప్లవకారుడు పుట్టవచ్చు. హిరణ్యకశిపుడికి ప్రహ్లాదుడు పుట్టాడు.

ప్రతి వ్యక్తికి ఒక ప్రత్యేక స్వభావ ముంటుంది. అలానే, ప్రతి సమస్యకూ ఒక ప్రత్యేక స్వరూప ముంటుంది. ఒకే సమస్య రెండు ప్రాంతాల్లో రెండు విధాలుగా ఉండవచ్చు. రెండు కాలాలలో రెండు రూపాలుగా ఉండవచ్చు. ఈ సత్యాన్ని గుర్తించి పరిష్కారానికి పూనుకోండి.

175

ప్రజల సమస్యను మీ సొంత అభిప్రాయాలతో కాక – వాస్తవ పరిస్థితుల దృష్టితో పరిశీలించాలి.

మీ సొంత అభిప్రాయాలను, సొంత అభిరుచులను, సొంత అలవాట్లను మీ సొంతానికే ఉంచేసుకోండి. అవి ప్రజా సమస్యల పరిష్కారానికి అడ్డం రాకుండా జాగ్రత్త తీసుకోండి.

ప్రతి సమస్యనూ నిర్మలమైన మనస్సుతో, నిష్పక్షపాత దృష్టితో పరిశీలించండి. సమస్య ఎంత పాతదైనా – అది సమస్యగా ఉన్నంత కాలం అది కొత్తదే.

176

హృదయ పరివర్తనం, దైవ భీతి, పుణ్యం, పాపం అనే మాటలు అర్థం లేనివి. స్వార్థపరుల మీద అవి పనిచెయ్యవు. లంచగొండి అయినవాడు స్నేహితుడి సిఫారసును ఖాతరు చెయ్యడు.

ఇతరు లెవరికో హృదయ పరివర్తన కలిగి, మీకేదో భిక్ష పెడతారని ఆశించవద్దు. మీకు న్యాయంగా రావలసిందుంటే దానిని మీరు మీ స్వశక్తి ద్వారా సాధించుకో వలసిందే. శక్తి లేనివాడికి సామ్రాజ్యం ఇచ్చి మాత్రం ఏం లాభం?

రాజ్యం వీరభోజ్యం. ఎవరో ఇచ్చేదీ కాదు. ఎవరో పుచ్చుకునేదీ కాదు. హక్కు కూడా అంతే. బలం ఉంటే హక్కు ఉంటుంది. బలం లేని వాళ్ళకు ఏ హక్కులూ ఉండవు.

మాలమాదిగ తరతరాల దైన్యానికి కారణం హక్కులు లేకపోవడం కాదు. బలం లేకపోవడం.

177

ప్రభుత్వ శాసనాలు, రాజ్యాంగ రక్షణలు, పోలీసులు, కోర్టులు – ఇవన్నీ బలహీనుల కోసమే నని గుర్తుంచుకోండి.

బలవంతుడి కెప్పుడూ అన్యాయం జరగదు. బలవంతుడి హక్కుల కెప్పుడూ భంగం కలగదు. బలవంతు డెప్పుడూ, ఎందుకూ పోరాడవలసి ఉండదు. న్యాయం కోసమో, ధర్మం కోసమో సమానత్వం కోసమో పోరాటం జరిపే వాళ్ళంతా బలహీనులే.

బలహీనులు పోరాటం ద్వారా బలవంతు లవుతారు. మీకు కావలసింది లభించే వరకు లక్ష్యం సిద్ధించే వరకు పోరాడండి! బలవంతులు కండి!

178

అంతా తనకే తెలుసు ననుకోవడం, ఇతర్లు చెప్పేది వినక పోవడం, సమస్యను సమగ్రంగా పరిశీలించక పోవడం, ఇష్టం వచ్చినట్లు వాగడం, పేరుకోసం ప్రాకులాడడం, ప్రతిభ కల వాళ్ళను ద్వేషించడం, పని చేసే వాళ్ళను వెక్కిరించడం, ఊహాపోహలకు తావివ్వడం, అహంభావం, మూర్ఖపట్టు, దురుసుతనం వంటివేవీ భీమ సైనికులకు పనికిరావు.

ఈ దుర్గుణాలన్నీ నేటి రాజకీయ వాతావరణంలో, విషపు గాలికి గొంగళి పురుగుల్లా పుచ్చి ఉన్నై. అవి మీకు అంటుకోకుండా జాగ్రత్తపడండి.

179

చిత్తశుద్ధి లేకుండా దేన్నీ సాధించలేం.

డబ్బు, పదవి, కీర్తి, అధికారుల దయ, నాయకుల అభిమానం– వీటి కోసం ప్రాకులాడే వాళ్ళను దూరంగా ఉంచండి. పేద గుండెలకూ, పిరికి పందలకూ భీమసేనలో స్థానం ఇవ్వకండి. అవకాశవాది హరిజనుడైనా మన కక్కరలేదు. అలాంటివాడు మీర్ఖాఫరో, క్విస్లింగో అయి, జాతి అభ్యుదయాన్ని బీరుకో, నారికో అమ్మి పారవేస్తాడు.

ఆదర్శమూర్తి అగ్రవర్గం వాడైనా మనవాడే. కాశీనాధుని నాగేశ్వరరావు, రఘుపతి వెంకటరత్నం నాయుడు, పిఠాపురం మహారాజా, కందుకూరి వీరేశలింగం పంతులు, వేమూరి రాంజీరావు, మాగంటి బాపినీడు, పొట్టి శ్రీరాములు మొదలైన వారంతా మాలమాదిగల అభ్యున్నతికి పాటుపడ్డ వారే నన్న సత్యాన్ని విస్మరించకండి.

180

భీమ సేనను నడిపించే కార్యకర్తల బుద్ధి గురి తప్పని బాణంలా మెరకాలి. మాట ఉగాది పచ్చడిలా ఉండాలి. ప్రవర్తన అంతరాత్మ ఆసిడు టెస్టుకు ఆగాలి. మనస్సు అంబేడ్కరు మూర్తిపై వెలగాలి. దృష్టి జాతి శ్రేయో లక్ష్యం మీద నిలవాలి.

ఆ ప్రాంతంలో ఒక్క భీమ సైనికుడున్నా ఆ ప్రాంత మంతా భద్రంగా ఉన్నట్టే ఆ ప్రాంతపు ప్రజలంతా భావించాలి. భీమసేన శక్తి సామర్థ్యాలపై, భీమ సైనికుల కార్య శూరతపై, దుష్ట శిక్షణ శిష్ట రక్షణ శక్తిపై, ధర్మ నిరతిపై, న్యాయ పాలనపై అంతటి గాఢ విశ్వాసాన్ని ప్రజలకు కలిగించాలి.

అంతటి ఆత్మబలం కలవాళ్లే భీమ సేనలో చేరాలి.

181

భీమ సేన ప్రగతి సేనగా ముందుకు ఉరకవచ్చు. సేవా సంస్థగా పనిచేయవచ్చు. రాజకీయ పార్టీగా రూపం దిద్దుకోవచ్చు. రేపటి పరిస్థితి ఎలా ఉంటుందో చెప్పలేం. పరిస్థితికి అనుగుణంగా కార్య ప్రణాళిక మారుతూ ఉండక తప్పదు.

ఏది ఏమైనా భీమ సేన ఎప్పుడు, ఎక్కడ, ఏ ప్రణాళికను అమలు జరుపుతున్నా, అది అన్ని విధాలా అగ్రస్థానంలో ఉండాలి. ఆదర్శ ప్రాయంగా ఉండాలి. ఆబాల గోపాలానికీ ఆశాజ్యోతిగా ఉండాలి. దాన్ని అలా నిర్వహిస్తామని ప్రతి భీమ సైనికుడూ ప్రతిజ్ఞ గైకొనాలి. ప్రాణం పోయినా, ప్రతిజ్ఞా భంగం జరగరాదు.

ధీరోదాత్తులు, స్థిత ప్రజ్ఞులు, సేవా నిరతులు, సద్గుణ శీలురు, సాహసోపేతులు,. కార్యచతురులు అయిన అలాంటి మెరకల్లాంటి కుర్రవాళ్లు జిల్లాకు పదిమంది ఉన్నా చాలు. భీమసేన తన లక్ష్యాన్ని సాధించ గలదు.

అలాంటి కుర్రవాళ్ళు జిల్లాకు పదిమందీ ఉండరా? మనం తర్ఫీదు ఇస్తే- ప్రతి హరిజన యువకుడూ, ప్రతి భారతీయ యువకుడూ అలాంటి వాడే కాగలడని నా విశ్వాసం. ఇందులో అత్యాశ ఏమీలేదు.

182

భీమ సైనికులు కార్యశూరులు. కార్యచతురులు, కార్య సాధకులు కండి. ఎక్కుడి కక్కడ ఆర్గనైజు కండి. మాలమాదిగల్ని ఏకం చేసే కార్యక్రమంతో పని ప్రారంభించండి. ప్రారంభించిన పనిని చచ్చినా సరే ఆపబోకండి.

మీరు పదిమంది ఒక చోట చేరినప్పుడు, ముందుగా మీలో ఉన్న గుణ దోషాలను దాచుకోవద్దు.

భీమ సేనను ఆర్గనైజు చేసే ప్రథమ దశలో వ్యక్తిగత గుణదోషాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వవద్దు. లక్ష్యం పట్ల విశ్వాసం, కార్యసాధన దీక్ష ఉంటే చాలు. అలాంటి ఒక నలుగురు కుర్రవాళ్ళు - ఉభయ వర్గాలకు చెందిన మాలమాదిగ కుర్రవాళ్ళు కలుసుకొని తలుచుకొంటే చాలు. ఆ నలుగురే ఆ రెండు పేటలకు కలిసి భీమసేన యూనిట్టు కావచ్చు. పేట కొకటి, రెండు యూనిట్లు కూడ ఏర్పడవచ్చు.

183

క్రమశిక్షణ, నాయకుడి పట్ల విధేయత - ఈ రెండూ చాలా ముఖ్యం. ఈ రెంటినీ ప్రతిజ్ఞ చేసి పాటించాలి.

త్రాగుడు, జూదం, వ్యభిచారం - వీటిని పరమ శత్రువులుగా చూడాలి.

దుబారా ఖర్చుకు, సుఖ భోగాలకు అలవాటు పడకూడదు. బుద్ధిని కరగ నివ్వకూడదు. బొజ్జను పెరగ నివ్వకూడదు.

సోమరితనాన్ని చేరనివ్వకండి. తీరిక లేని పనే ఆరోగ్యానికీ, ఆయుస్సుకూ, విజయానికీ, విశ్వ శ్రేయస్సుకూ అమృతప్రాయమని నమ్మండి. పనే భగవంతుడని గుర్తించండి.

184

సహచరులు, ప్రోత్సాహకులు, సుముఖులు, తటస్థులు, విముఖులు, వ్యతిరేకులు, విరోధులు – ఇలా అనేక రకాలుగా ఉంటారు ప్రజలు – ఏ ఉద్యమం విషయంలో అయినా సరే.

సాధారణంగా నూటికి తొంభైమంది తటస్థులుగా ఉంటారు. వాళ్ళే జన సామాన్యం.

మన కళ్ళ ఎదుట జరిగిన భారత స్వాతంత్రోద్యమంలో వాస్తవంగా పాల్గొన్న వారెంతమంది? ఈనాడు స్వాతంత్ర్య ఫలాన్ని రెండు చేతులతోను జుర్రు కొంటున్న వాళ్ళలో ఎక్కువమంది ఆనాటి జాతీయోద్యమాన్ని వ్యతిరేకించిన వాళ్ళే నన్న సత్యాన్ని విస్మరించకండి.

ఉద్యమం కొనసాగుతున్నప్పుడు, దానికి విముఖులుగాను, విరోధులు గాను ఉన్నవాళ్ళే – అది జయప్రద మైనప్పుడు దాని ఫలితాన్ని అనుభవించడానికి ముందుకు తోసుకు వస్తారు. వాళ్ళు ఎంత దూకుడుగా వస్తారంటే – ఆ తాకిడికి అసలు ఉద్యమ కార్యకర్తలే వెనక్కి నెట్టి వేయబడతారు.

కార్యకర్తలు తాము ఉద్యమాన్ని ఎంత తీవ్రంగా నడిపిస్తారో అంత తీవ్రం గాను తద్వ్యతిరేకమైన అవకాశవాదులను అడ్డుకొనకపోతే– అసలు ఉద్యమ ఉద్దేశమే విఫలం కాగలదు. ఈ విషయంలో జాగ్రత్త తీసుకోండి !

185

మాలమాదిగల అభ్యుదయం కోసం పోరాటంలో దిగుతున్న మిమ్ము మాలమాదిగలే విమర్శించవచ్చు. వెక్కిరించవచ్చు. ఎదిరించవచ్చు. హాని చేయవచ్చు. ఆశ్చర్య పడకండి.

మాలమాదిగలు స్థానికులైన అగ్రకుల పెద్దల చేతులలో ఉంటారన్న సత్యాన్ని విస్మరించకండి. తరతరాలుగా ఆర్థిక దాస్యంలో ఉంటూ – పాలేరుతనం చేసుకొంటున్న వాడికి – చదువుకొన్న తమ్ముడి కంటె డబ్బున్న తన కామందే గొప్పవాడుగా కనిపించవచ్చు. లెక్క చెయ్యకండి. ఓర్పుతో అట్టి వారి దృక్పథంలో మార్పు తీసుకు రావడానికి ఎడతెగకుండా కృషి చేయండి.

186

గిరిజనులకు చెందిన కొన్ని తెగల ప్రజల్ని చూడండి. నవనాగరిక సమాజం మధ్య బ్రతుకుతున్నా – తమ పాత పౌరాణిక వేషాలను, పద్ధతులను, విశ్వాసాలను వారు వదులుకోవడం లేదు.

మోచేతుల దాకా ప్లాస్టిక్కు గాజులు, మోకాళ్ల దాకా అందెలు, మెడ నిండా పూసలపేర్లు, జాకెట్ల నిండా తళుకులు, చెవుల నిండా, ముక్కు నిండా రింగులు ధరించి – అన్ని బరువుల తోనూ మట్టి తట్టలు మోసే గిరిజన కార్మిక స్త్రీని చూస్తే – ఒక్క టెర్లిను చీర తప్ప మరే అలంకారమూ లేని కాలేజీ అమ్మాయికి ఏమనిపిస్తుంది?

నాగరికత, ప్రకృతి విజ్ఞానం బ్రహ్మాండంగా వికసించిన ఈ రోజులలో – రకరకాల విద్యుద్దీపాలతో రాత్రి కూడ పగలుగా భాసిస్తున్న ఈ రోజులలో – దేవుడికి అంధ యుగాల నాటి ఆ ప్రమిద దీపాలనే ఎందుకు పెడుతున్నారు?

వెలుగెక్కడ లేదో అక్కడ చీకటి ఉంటుంది. గుండె వర్తమానం లోను, మెదడు గతంలోను బ్రతుకుతున్న వాళ్ళే సమాజంలో ఎక్కువ. మూఢత్వాలు ముక్కోటి రీతులు. వాటి మధ్య ఎడతెగని ఘర్షణలు.

అటువంటి మూఢాచార పరులు, తాతల నాటి పిలకలే నేటి క్రాపులకంటె గొప్పవని వాదించే చాదస్తులు, మాలమాదిగలలో కూడ ఉన్నారు అటువంటి వాళ్ళని మార్చడం కష్టమైతే – ఉపేక్షించి ముందుకు సాగిపోండి.

187

ఏ గొప్ప పనీ, ఏ సంస్కరణా, ఏ మార్పూ ప్రతిఘటన లేకుండా ముందుకు సాగదు. ఇది ప్రకృతి రహస్యం.

మీ పురోగమనంలో కులతత్వ వాదుల, మూఢాచార పరుల, స్వప్రయోజకుల ప్రతిఘటనలకు, ఒత్తిడులకు మీరు గురికావచ్చు. వెనకడుగు వెయ్యకండి.

అవినీతిని బహిరంగంగా విమర్శించే మహా నాయకులలో ఎక్కువమంది నీతిని చీకటి బజారులో అమ్మి సొమ్ము చేసుకొనే ఘనులే అయి ఉండవచ్చు. బాహ్యాటోపాలకు భ్రమసి పోకండి.

డబ్బు ఎక్కువగా ఉండే వాళ్ళలో మెదడు తక్కువగా ఉంటుంది. మెదడు తక్కువగా ఉండే వాళ్ళలో అహంకారం ఎక్కువగా ఉంటుంది. అహంకారం ఎక్కువగా ఉండే వాళ్ళలో వివేకం తక్కువగా ఉంటుంది. అట్టివాళ్లు మీ విప్లవ కార్యక్రమాన్ని ఎదిరించగలరు. భయపడకండి.

ఏ సమస్య నుంచీ, ఏ బాధ్యత నుంచీ తప్పించుకు పారిపోకండి.

శత్రు పటాటోపమూ, మంది మార్బలమూ నిశ్చల బలోన్నతుడైన వీరుణ్ని ఏమీ చెయ్యజాలవు. ఉత్తర గోగ్రహణం నాటి అర్జునుణ్ణి తలచుకోండి. అర్జునుడు మాలమాదిగ వంశీయుడేననీ, వ్యాస భగవానుడి మనుమడనీ మరచిపోకండి.

అస్పృశ్యత, కులతత్వం హైందవ సమాజం నుంచి రూపు మాసి పోయేదాకా నిద్రపోం అని శపథం తీసుకొని పురోగమించండి.

188

ప్రజల సమస్యలను, ఉద్దేశాలను గ్రహించి, సేకరించి, తమ యూనిట్టు నాయకుడి దృష్టికి తీసుకు రావడం ప్రతి భీమ సైనికుడి ప్రధాన కర్తవ్యం.

ఆ తర్వాత ఆ సమస్యలు చర్చించబడి, పరిష్కార మార్గాలు యోచించ బడాలి. ఈ విషయంలో నాయకుడికి అతడి సలహా సంఘమే కాక, అందుకు సంబంధించిన స్థానిక పెద్దలు కూడ తోడ్పడవచ్చు. అట్టి సమస్యలను వీలైనంత వరకు అక్కడి కక్కడే స్థానికంగా పరిష్కరించి వెయ్యడానికి పూనుకోవాలి. అలా సాధ్యం కాని వాటిని పై నాయకుని దృష్టికో, ప్రభుత్వం దృష్టికో తీసుకుపోవాలి.

ఎక్కడ ఏ సమస్య ఉత్పన్న మయినా, భీమ సైనికులు కనీసం ఒకరిద్దరైనా అక్కడికి పోయి వివరాలు కనుక్కోవాలి. భీమసైనికు డెక్కడుంటే అక్కడ న్యాయం ఉంటుందన్న విశ్వాసం ప్రజలలో ఉంటుంది కనుక, అతణ్ని చూడగానే బాధితులకు

ధైర్యం కలుగుతుంది. బాధకులు వెనక్కి తగ్గుతారు. సమస్యా పరిష్కారం సులభమవుతుంది.

189

నాయకుల కుండే అహంభావంతో కాక, సేవకుల కుండవలసిన వినయ విధేయతలతో మనం ప్రజలలో పని చేయవలసి ఉంది.

ఏ విధమైన ఎక్కువ తక్కువలు లేకుండా మనం ప్రజలలో కలిసిపోయి పని చేసినప్పుడే వారి కష్ట సుఖాలు, బాధలు, సమస్యలు మన కర్థమవుతై. ఆయా సమస్యలపై వారి అభిప్రాయాలు మనకు తెలుస్తై. అప్పుడు వాటికి మనం స్పష్టమైన రూపం కల్పించవచ్చు. పరిష్కరించవచ్చు.

ప్రజలు తమ సమస్యల్ని తామే పరిష్కరించు కోలేక పోతున్నారంటే - ఆ సమస్య యొక్క స్వభావం వారికి స్పష్టంగా అవగాహన కాలేదన్న మాట. అట్టి సమస్యను పరిశీలించి, అర్థం చేసుకొని, దాని నిజ స్వరూపాన్ని ప్రజల ముందు పెడితే చాలు మనం. తక్షణం ప్రజలే దాన్ని పరిష్కరించి పారేస్తారు.

అంటరానితనం, కులవ్యవస్థ - వీటి నిజ స్వరూపాన్ని స్పష్టంగా ప్రజల ముందు ఉంచండి. ఏం జరుగుతుందో చూడండి.

190

వర్ణాశ్రమ ధర్మాలు గొప్పవంటూ చిలుక పలుకులు పలుకుతారు కొందరు. ఎన్నెన్నో విదేశీ దండయాత్రలకు తట్టుకొని హిందూమతం ఇంకా బ్రతికి ఉండడానికి కారణం మన వర్ణ వ్యవస్థ అంటూ బట్టతలను సవరించుకొంటారు కొందరు. అదంతా ఆత్మవంచనో, పరవంచనో తప్ప మరేమీ కాదు.

ఆశ్రమ ధర్మాలను అనుసరించిన వారు ఏనాడూ లేరు. శ్రీరాముడు వంటి రాజులు కాని, వశిష్ఠుడు లాంటి పురోహితులు కాని, విదురుడు వంటి గృహస్థులు కాని ఎవరూ వానప్రస్థులూ కాలేదు. సన్యాసులూ కాలేదు.

191

కొంత కాలం శూద్రుల్ని వెలివేసి ఉంచడానికీ, ఇప్పుడు హరిజనుల్ని వెలివేసి ఉంచడానికీ తప్ప - ఎప్పుడూ ఇతరులెవరి పట్లా వర్ణ ధర్మాలు అమలు

జరుగలేదు. ఈనాడు వర్ణ ధర్మాలను పాటించి వాటి ప్రకారం మనుషుల్ని విడదీయ దలిస్తే – ఉపాధ్యాయులుగా ఉన్న వారందర్ని బ్రాహ్మలుగాను – మిలిటరీ, పోలీసూ, ఎక్సైజూ, రెవెన్యూ శాఖలలో ఉన్న వారందర్ని క్షత్రియులుగాను – వ్యవసాయదారు లందర్ని వైశ్యులుగాను – నౌకర్లు, ప్యూనులు, కూలీలు వంటి వారందర్ని శూద్రులుగాను – వైద్యం, సంగీతం, నృత్యం, నాటకం వంటి కళలతో సంబంధమున్న వాళ్ళందర్ని అంటరాని వాళ్ళుగాను పరిగణించ వలసి ఉంటుంది. ఇది సాధ్యమేనా?

వర్ణాశ్రమ ధర్మాలనేది కేవలం మిథ్యావాదం. అదెప్పుడూ అమలులో లేదు. ఈనాడింకా దాని పేరెత్తడం మూఢ ప్రజల్ని మోసం చేయడానికే. ఇంకా ఇంకా మన వాళ్లని పర మతాలలోకి తరిమి వెయ్యడానికే.

హిందూ మతం ఇంకా కొన ఊపిరితో అయినా బ్రతికున్నదంటే అందుకు కారణం దాని ఆధ్యాత్మిక వేదాంత సూత్ర శక్తే. ఆ శక్తి ఋషుల వల్ల వచ్చింది. ఈ ఋషులందరూ ఏ వర్ణానికీ చెందినవారు కాదని గుర్తించండి. వ్యాస వాల్మీకాదులు మాలమాదిగలు. అగస్త్య వసిష్ఠాదులు వర్ణసంకరులు. నారద కాళిదాసాదులు వెనకబడ్డ కులాలవారు. జాతి మనుగడకు ప్రధానమైన సంగీత సాహిత్య సాంస్కృతిక తాత్త్విక రంగాలలో మూల ఋషులంతా మొత్తం మీద మనవాళ్ళే అన్న సత్యాన్ని మరచిపోకండి.

కాగా – వర్ణాశ్రమా లనేవి ఎప్పుడూ లేవు. ఈనాడూ లేవు. లేని దాన్ని లేనట్టు అంగీకరించడానికి తటపటాయించడం ఎందుకు?

ఈనాడు నిజంగా వర్ణ వ్యవస్థ ఉన్నదా? గుండెల మీద చేయి వేసుకొని చెప్పండి. లేదు కదా? స్మృతులలో చెప్పబడ్డ వర్ణ వ్యవస్థే లేనప్పుడు మరి ఈ కులవ్యవస్థ ఎక్కడ నుంచి వచ్చింది?

సృష్టి ధర్మానికి వ్యతిరేకమైన ఈ వ్యవస్థను జాతిశ్రేయస్సు కోసం నిర్మూలించి పారవేయడానికి అభ్యంతరం ఎందుకు?

192

మాలమాదిగ పేటలలోను, తదితర వర్గాల వారిలోను పని చేసే భీమ సైనికులు ముందుగా ఆ ప్రజల కష్ట సుఖాలలో పాల్గొనాలి.

మీరు ఆయా పేటలకు చెందిన యువకులే కావచ్చు. మరొక ప్రాంతం

నుంచి పంప బడ్డవారు కావచ్చు. ఎవరైనప్పటికీ, ప్రజలతో కలిసిపోకుండా మనం ప్రజల్ని ఉత్తేజ పరచలేం.

ఇంతకూ మనమంటే ఎవరు? మనమూ ప్రజలమే. ఎవరి పని వారు చేసుకుంటూ, ఎవరి బ్రతకు వారు బ్రతికే వాళ్ళను ప్రజలంటున్నాం. మొత్తం మీద ప్రజల కష్ట సుఖాలను గురించీ, సుఖ దుఃఖాలను గురించీ ఆలోచిస్తూ, జాతి యావత్తునూ ఏక అభ్యుదయ మార్గంలో నడిపిండానికి పూనుకొన్న వాళ్ళం. మనం ముందు నడుస్తున్నాం. అలా నడవక తప్పదు. అలా నడిచేటప్పుడు ప్రజల్ని అనుకునే నడవాలనేది నా విజ్ఞప్తి.

193

ప్రజలలో పని చెయ్యడం అంటే – ప్రజల నిత్య కృత్యాలను గురించి, కష్ట సుఖాలను గురించి ఎల్లప్పుడూ తెలుసుకుంటూ ఉండడం, పేటలోని ప్రతీ గృహం గురించి అవగాహన కలిగి ఉండడం.

బియ్యం సులభంగా దొరుకుతున్నాయా? బ్లేకులోకి ఏ వస్తువు పోయింది? ఎవరికి ఉద్యోగం లేదు? ఏ ఇంట్లో రాత్రి పస్తు పడుకున్నారు? ఎందువల్ల? ఎవడు సోమరిపోతుగా తయారవుతున్నాడు? ఎవడు రౌడీగా తిరుగుతున్నాడు? వారిని మార్చడం ఎలా? వెంకయ్య జ్వరం తగ్గిందా? పుల్లయ్య కొడుకు ఏమైనా పంపుతున్నాడా, లేదా? వీరన్న చదువెందుకు మానేశాడు? వెర్రయ్యను కామందు ఎందుకు కొట్టాడు?

ఈ విధమైన పరామర్శలతో నిత్యమూ ప్రజల యోగ క్షేమాలను కనుక్కొంటూ ఉండాలి. తోడ్పడుతూ ఉండాలి. మంచిని పెంచుతూ, చెడును ఎప్పటికప్పుడు తొలగిస్తూ ఉండాలి.

చెడు అనేది ప్రత్యేకంగా ఏదీ లేదు. పరిస్థితిని బట్టి, వ్యక్తిని బట్టి ఉంటుందది. సృజనాత్మకమైన కళలలో మునిగి తేలుతుండే వారు కొన్ని కొన్ని అలవాట్లకు లోనవుతారు. మెదడు పని ఎక్కువగా ఉండేవారికి కొన్ని ప్రత్యేక సౌకర్యాలు అవసరమవుతాయి. కుస్తీ వంటి వ్యాయామ విద్యలలో పాల్గొనేవారికి బలమైన తిండి కావలసి ఉంటుంది. అలానే ఒకో విద్యకు ఒకో వ్యాసం ?ఒకో ప్రత్యేక ఏర్పాటు అవసరమవుతుంది. అది వ్యక్తి స్వభావం మీదా, ఒకో వేళా విశేషం మీదా కూడా ఆధారపడి ఉంటుంది.

ఎప్పటి కప్పుడు కొత్త పొంగులతో ముందుకు ప్రవహించే చైతన్య స్రవంతి ఎప్పుడెట్టి మలుపు తీసుకోగలదో స్పష్టంగా చెప్పలేం. మానవ ప్రవర్తన విషయంలో కూడా అంతే. నేటి చెడ్డవాడు రేపు మంచివాడు కావచ్చు. నేడు చెడ్డగా భావించ బడినట్టిది రేపు మహా గొప్పగా కీర్తించ బడవచ్చు. కనుక దేనికైనా విలువలు కట్టవలసి వచ్చినప్పుడు, మంచి చెడ్డల నిర్ణయం చెయ్యవలసి వచ్చినప్పుడు బహు జాగ్రత్తతో, విజ్ఞతతో, ముందు చూపుతో మెలగవలసి ఉంది. దేన్నీ తృణీకరించరాదు. ఎవరి శక్తినీ తక్కువ అంచనా వేయరాదు.

194

మన ఉద్యమానికి ప్రత్యర్థులూ, విరోధులూ అయిన వాళ్ళను ఏవగించు కోకండి. కించ పరచకండి. ఉపేక్షించకండి. గౌరవంతో, శ్రద్ధగా వాళ్ళు చెప్పేది వినండి. ఓర్పుతో నిదానంగా వాళ్ళకు నచ్చచెప్పండి. వాళ్ళు మారినా, మారకపోయినా – వాళ్ళ వాదం వినడం వల్ల మీ అనుభవం బలపడనుంది. మీ కార్యసాధక శక్తి పెరుగుతుంది.

సీతను ఎత్తుకు పోయిన రావణుడి వైపు కూడా కొంత అనుకూల వాదం ఉంటుందని మరచిపోకండి. అదేదో తెలుసుకోకుండా దాన్ని మనం ఎలా ఖండించగలం?

దొంగ, దొంగ వర్తకుడు, నరహంతకుడు కూడ తమ తమ ప్రవర్తనలకు, పనులకు కారణాలను చెపుతారు. వాళ్ళ దృష్టిలో అవి సహేతుకమైనవే, న్యాయమైనవే కావచ్చు. అందుకే వినదగు నెవ్వరు చెప్పిన. అది మన ఉద్యమానికీ చాల అవసరం. వినడం, చూడడం, పరిశీలించడం, తెలుసుకోవడం, కర్తవ్య నిర్ణయం చెయ్యడం, నిర్ణయాన్ని అమలు పరచడం – ఇదే పురోగమన క్రమం.

195

ప్రతి పేటకూ ఒకటి రెండు వయోజన విద్యా కేంద్రాలను నెలకొల్పాలి. ప్రభుత్వ సహాయం లేకపోయినా, స్వయం సహాయంతో నిర్వహించాలి. ఆ పేటలోని ఉపాధ్యాయుల సహాయాన్ని తీసుకోవాలి. పెద్ద క్లాసులు చదివే విద్యార్థులుంటే వారు కూడా తగు పాత్ర తీసుకోవాలి.

పేటలో బడికి పోని బాలబాలిక లెవరూ ఉండకూడదు.

దేశీయ, అంతర్జాతీయ, రాజకీయ విశేషాలను, కథలను ప్రజలకు చెపుతూ ఉండాలి. వివిధ జాతుల చరిత్రలను, వాళ్ళు సాధించిన విజయాలను గురించి తెలియజేస్తూ ఉండాలి. ప్రకృతి విజ్ఞానాన్ని, కలలను బోధిస్తూ ఉండాలి.

పేటకు కనీసం ఒక నాటక సమాజం ఉండాలి. ఆయా ప్రాంతాలలో ఉండే ప్రత్యేక ఆధునిక పద్ధతులపై పునరుద్ధరించాలి. డప్పు, రుంజి, చిందు, మోళి, దొమ్మరగడ, మాస్టిడీ, సాము, భజన కోలాటం, గరగ, గారడీ మొదలైన గ్రామీణ విద్యలను నవీకరించి ప్రోత్సహించాలి.

సంగీతం, సాహిత్యం, చిత్రలేఖనం, నృత్యం వంటి కళలు వ్యక్తులలో కనిపించినప్పుడు వాటిని అభివృద్ధి చెయ్యడానికి పూనుకోవాలి. రచనను బాగా ప్రోత్సహించాలి. ఏ రంగంలో నైనా సరే శక్తి సామర్థ్యాలు కనిపిస్తే, వెంటనే వాటి వికాసానికి శ్రద్ధ తీసుకోవాలి. ప్రత్యేక శిక్షణ ఇప్పించాలి. ఆర్థిక సహాయం చెయ్యాలి.

ఈ అన్నిటికి ప్రభుత్వం ప్రత్యేకంగా ధన సహాయం చెయ్యగలదు. అందుకు ప్రయత్నించాలి.

ప్రతి పేటకూ ఒక సంఘ నిధిని ఏర్పాటు చెయ్యాలి. దాని నుంచి కూడా పై కార్యక్రమాల ఖర్చులను భరించవచ్చు. కళలకు బహుమతు లివ్వవచ్చు.

మాలమాదిగ పేటలు గ్రామాలలో లీనమై పోయే వరకూ ఈ ప్రత్యేక కార్యక్రమాలు, ప్రత్యేక ప్రోత్సాహాలు తప్పవు. పనిలేని వాళ్ళు, చదువు రానివాళ్ళు, త్రాగుబోతులు, సోమరులు, జూదగాళ్ళు మాలమాదిగ పేటలలో లేకుండా చర్య తీసుకోవాలి.

196

హరిజనులకు, గిరిజనులకు, బహుజనులకు రాజ్యాంగం కల్పించిన ప్రత్యేక హక్కులేమిటో, రక్షణ లేమిటో ప్రజలకు స్పష్టంగా తెలియ జెయ్యాలి.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ కులాల అభివృద్ధి కోసం ఎన్నో శాసనాలు చేస్తున్నై. ఎన్నో కార్యక్రమాలను నిర్వహిస్తున్నై. అవేమీ ఎక్కువ ఫలప్రదం కావడం

లేదు. అందువల్ల – వాటిని గురించి కరపత్రాల ద్వారా ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేస్తూ ఉండాలి. వాటి నిర్వహణను పర్యవేక్షిస్తూ ఉండాలి.

ప్రభుత్వ ప్రణాళికలు మన కనుకూలంగా ఉండేటట్టు ముందే శ్రద్ధ వహిస్తూ ఉండాలి.

ఏ పేట హరిజనుల కైనా ప్రభుత్వ ఇళ్ళ స్థలాలు మంజూరు చేసినప్పుడు – అట్టి స్థలాలు ఊరికి దూరంగా ఉండకుండా జాగ్రత్త తీసుకోవాలి. ఊరి మధ్యలోనో, ఊరికి ఆనుకొనో ఉండేటట్లు చూసుకోవాలి. ఈ పని ప్రభుత్వమే చెయ్యదా అంటే, చెయ్యవచ్చు. చెయ్యకపోవచ్చు. ప్రభుత్వ ఉద్యోగి ఎంత గొప్పవాడైనా, అతని దృష్టి ఎక్కువగా జీతం మీదనే ఉంటుందని మరచిపోకండి. మన సమస్యల పట్ల మనమే శ్రద్ధ వహించడం అన్ని విధాలా క్షేమం.

ప్రభుత్వం కాని, ఇతర సంస్థలు కాని ఈ కులాల అభివృద్ధికి చేస్తున్న పనులను గురించి, పెడుతున్న ఖర్చులను గురించి ఎప్పటికప్పుడు లెక్కలతో సహా ప్రజలకు చెప్పుతూ ఉండాలి. జనరలు కార్యక్రమాలతో పోల్చి చూపుతూ ఉండాలి. ప్రజలు చైతన్యవంతులు కావటానికి ఇది చాలా ముఖ్యం.

197

భారత దేశం నుంచి అంటరానితనాన్ని, కులవ్యవస్థను తొలగించి వెయ్యడానికి ప్రభుత్వం చెయ్యగలిగిన పనులు కొన్ని ఉన్నై. వాటిని తక్షణమే ప్రారంభించవచ్చును కూడ.

1. హరిజనులకు ఇళ్ళ స్థలాలను మంజూరు చేసేటప్పుడు వాటిని ప్రధాన గ్రామం మధ్యనే ఉండేటట్టు చూడాలి. అప్పుడు మాలమాదిగ పేటలనేవి ప్రత్యేకంగా లేకుండా పోతై.

2. అగ్రకులాలకూ, హరిజనులకూ మధ్య వర్ణాంతర వివాహాలు జరుగుతున్నై. అవి ఎంత ఎక్కువగా జరిగితే అంత తొందరగా కులవ్యవస్థ పోతుంది. అందువల్ల – వర్ణాంతర వివాహాలను చేసుకొన్న యువతీ యువకులకు ప్రభుత్వం ధన సహాయం చెయ్యాలి. ఉద్యోగ నియామకాలలో ప్రిఫరెన్సు ఇవ్వాలి.

3. కులం పుట్టుకతో వచ్చిందన్నప్పటికీ, వివాహం ద్వారా కులాల్ని మార్చుకోవచ్చునని ప్రకటించాలి. అందుకు ఒక శాసనం చెయ్యాలి. హరిజన యువతిని కాని, యువకుడ్ని కాని వివాహం చేసుకొన్న వ్యక్తికి హరిజనుల కుండే ప్రత్యేక హక్కులన్నీ చట్టరీత్యా లభింపచేయాలి.

4. ఈ కులాల వారిలో కళా సంస్కృతులను పునరుద్ధ రించడానికి ఆ పేటలలోనే ప్రత్యేకంగా పని చెయ్యడానికి జిల్లా కొకరు చొప్పున కల్చరల్ డెవలప్‌మెంట్ అధికారులను నియమించాలి.

5. ప్రత్యేకంగా మాలమాదిగ పేటలను గ్రామాలలో లీనం చెయ్యడానికి ఉద్దేశించే గృహ నిర్మాణ పథకాల కోసం జిల్లా కొక కోటి రూపాయల నిధితో ఫైనాన్సింగు కార్పొరేషన్లను ఏర్పాటు చేయాలి.

6. శక్తి, సామర్థ్యం, ప్రతిభ, పాండిత్యం వంటి సహజ గుణ సంపదను ఏ ఒక్క జాతీ, ఏ ఒక్క కులమూ గుత్తకు తీసుకోలేదు. దేశాన్ని ఆయా కాలాలలో ఆయా విదేశీయులకు ధారాదత్తం చేసిన అసమర్థులు హరిజనులు కారనేది చారిత్రక సత్యం.

ఈనాడు మన దేశంలో శక్తి సామర్థ్యాలు, నీతి నిజాయితీలు, సృజనాత్మక శక్తి మిగిలి ఉంటే – అవి ఒక్క హరిజనులలోను, వెనుకబడ్డ కులాలలోను మాత్రమే ఉన్నాయనేది కూడ నిరూపిత సత్యం.

అందువల్ల ఏ సంకోచమూ లేకుండా, అన్ని రకాల అధికార పదవులకూ జనాభా ప్రతిపదిక పైన హరిజనులను నియమించాలి.

ఈ విధమైన చర్యల ద్వారా కులవ్యవస్థ దానంతట అదే సడలిపోయి మాసిపోతుంది. ఆ తర్వాత సోషలిజం ఏర్పడడానికి ఎంతో ప్రయత్నం అక్కరలేదు. భూమిని జాతీయం చేస్తే చాలు.

198

ప్రస్తుతం మనకు తగిన నాయకత్వం లేదు. ఉన్న నాయకులకు నిర్దిష్ట కార్య ప్రణాళిక లేదు. చిన్న చిన్న ఉద్యోగాల కోసం రికమెండు చెయ్యడం, ఉద్యోగుల

బదిలీలను ఆపించడం, ప్రభుత్వంపై ఏవేవో విమర్శలు విసరడం వంటి పనులు తప్ప – జాతి సాముదాయక అభివృద్ధి కోసం ఒక కార్యక్రమ మంటూ ఏదీ లేదు. వ్యక్తులకే కాదు, రాజకీయ పార్టీలలో దేనికీ కూడా అట్టి సామాజిక కార్యక్రమం లేదు. వ్యక్తుల దృష్టీ పార్టీల దృష్టీ అంతా ధనరాసుల్నీ, అధికార పదవుల్నీ ప్రోగు చేసుకోవడంపై నిమగ్నమై ఉంది ఈ పరిస్థితిని తొలగించి, నిజమైన ప్రజాస్వామిక సోషలిజాన్ని దేశంలో నెలకొల్పడానికి భీమసేన నడుం కట్టాలి.

అధిక సంఖ్యాకులైన ప్రజలు అజ్ఞానంలోను, దాస్యంలోను మునిగి ఉన్న ఏ దేశంలోనూ ప్రజాస్వామ్యం జయప్రదం కాదని గుర్తించండి. ప్రజాస్వామికం జయప్రదం కావాలంటే, శాంతియుత పద్ధతుల ద్వారా సోషలిజం నెలకొనాలంటే, భారతదేశం శాంతి సౌభాగ్యాలతో తులతూగుతూ లోకంలోని అగ్రరాజ్యాలకే నాయక మణిగా విరాజిల్లాలంటే – అస్పృశ్యత తొలగాలి. కులవ్యవస్థ నశించాలి. అందుకు భీమసేన కృత నిశ్చయంతో ముందడుగు వెయ్యాలి.

199

ఒక సమస్యను పరిష్కరించడం కోసం, ఒక లక్ష్యాన్ని సాధించడం కోసం ఎన్ని కష్ట నష్టాలనైనా భరించడానికి సిద్ధ పడడమే నిజమైన మానవత్వం. నిజమైన మానవత్వం మృత్యువుకు భయపడదు. ఎలాంటి ఆటంకాలకూ వెనకడుగు వెయ్యదు. ఎంతటి నిరంకుశత్వానికీ తలవంచదు.

మీరు నిజమైన మానవత్వాన్ని అలవరచు కొనండి. నిజమైన మానవులు కండి. మీజాతిని నిజమైన మానవులుగా తయారు చెయ్యండి!

200

దురాగ్రహంపై సన్మార్గాన్ని, దుర్మార్గంపై సన్మార్గాన్ని, దౌర్జన్యంపై సౌజన్యాన్ని మోహరించడానికి ఎంతో ఆత్మబలం కావాలి.

ఒక మానవ సమస్య కోసం, మానవ బాధా నివారణ కోసం, అన్యాయ నిర్మూలన కోసం పోరాడడానికి నడుం గట్టి నిలబడినప్పుడే ఆత్మబలం జ్వలిస్తుంది. జ్వలించిన ఆత్మబలమే దైవబలం.

మీ కార్యక్రమం మంచిది. మీ మార్గం పవిత్రమైంది. మీ లక్ష్యం భగవంతుడికి హితమైంది.

మీ శరీరాలు చిన్నవైనా, మీ ఆత్మలు మేరు గిరి శిఖరాలు. మీ హృదయాలు పాల సముద్రాలు. మీ మనస్సులు తుఫాను గాలి మంటలు. మీ లక్ష్యం మానవ మహోదయం.

మిత్రులారా! పురోగమించండి! దైవబలం మీకుంది.

అవినీతిని, అన్యాయాన్ని, అసమానతను తుడిచిపెట్టి, మానవ లోకాన్ని మాధవ లోకంగా మార్చడానికి – భారత యువకుల్లారా ! నడుం బిగించి, ముందుకు దూకండి!

201

డాక్టరు భీమారావు అంబేడ్కరు ఇప్పుడు ఒక వ్యక్తి కాదు. ఉద్యమం. ఆయన ఏ ఒక్క కులానికో, ఏ ఒక్క కాలానికో, ఏ ఒక్క దేశానికో చెందిన వాడు కాదు. ఆయన పుట్టుక, పెంపకం, విద్య, ఆదర్శం, చేసిన పనులు, సాధించిన విజయాలు, ప్రజల కిచ్చిన సందేశం పరిశీలించి చూడండి. సర్వ దేశాలకూ, సర్వ కులాలకూ, సర్వ ప్రజలకూ చెందిన మానవుడాయన. ఆయన పేరు మీద నెలకొల్పబడ్డ భీమసేన – విశ్వసేన, విశ్వమానవ కళ్యాణ సేన, విశ్వైక మానవతా నిర్మాణ సేన కావాలని నా ఆకాంక్ష. అందుకే, కార్యక్రమాన్ని హరిజన పేటల నుంచి ప్రారంభిస్తున్నాం.

నేను పేర్కొన్న లక్ష్యంతో, ఇచ్చిన కార్యక్రమంతో, చిత్త శుద్ధితో భీమసేన పురోగమిస్తే – కులరహిత, వర్గరహిత, సర్వమానవ సమాజం అచిర కాలంలోనే ఏర్పడి తీరుతుంది. ఇది తథ్యం.

202

భారత దేశంలో కులరహిత సమాజమే ప్రపంచంలో వర్గ సమాజం. అసలు ఆర్థిక వర్గాలే ఇక్కడ కుల్లి కులాలైనై. బలం గల వాళ్ళదే రాజ్యం. ఈ సత్యాన్ని మరిచిపోకండి.

మన ఈ కుల మత వర్గ రహిత మానవ సమతా సమాజ నిర్మాణ ప్రణాళికను ఒక్క మన దేశం లోనే కాక ప్రపంచం అన్ని దేశాల లోను అమలు పరచడానికి పునాదులు వెయ్యండి. వివిధ దేశాలలోను అంబేడ్కర్ సేవా దళాలను, భీమసేన శాఖలను నెలకొల్పండి. అదే సర్వజన శ్రేయోమార్గం. అంబేడ్కర్‌జీ ప్రబుద్ధ ధర్మం. కృణ్వంతో విశ్వమార్యం నినాద సాఫల్యం.

203

బూర్జువా నియంతృత్వం, కార్మిక నియంతృత్వం వ్యక్తి నియంతృత్వం వంటి ఏ రకం నియంతృత్వ పరిపాలన అయినా సరే సూచన సర్వతోముఖాభివృద్ధికి వ్యతిరేకమైనట్టిదే.

రాజరికాలు పోయినై. నియంతృత్వాలు కూడ పోక తప్పదు.

మానవ శక్తుల బహుముఖ వికాసానికి ప్రజాస్వామిక పద్ధతి సోషలిస్టు ప్రభుత్వం ఒక్కటే దోహదం చెయ్యగలదు.

అట్టి ప్రజాస్వామిక సోషలిజాన్ని నెలకొల్పడానికి - హరిజన, గిరిజన, బహుజన, ప్రగతిగామి భారత యువజనులారా - సమైక్యం కండి, ముందుకు దూకండి!

204

జాతీయ సమైక్యం, భావ సమైక్యం, సాంస్కృతిక సమైక్యం- ఇలా ఎన్నో రకాల సమైక్యం గురించి ఉపన్యాసాలు దంచుతూ ఉంటారు పెద్దలు. తాము మాత్రం తమ స్వప్రయోజనాల కోసం కృషి చేసుకోవడం తప్ప, తదితరుల మంచి చెడ్డల్ని గుర్తించరు.

సమైక్యం అంటే ఏమిటి? ప్రజలంతా తమ స్వభాషలను వదిలేసి ఒకే భాష మాట్లాడడమా? ఒకే ఆలోచన చెయ్యడమా? ఒకే మతాన్ని అనుసరించడమా? ఒకే పదార్థాన్ని తినడమా? ఒకే రకం పంటను పండించడమా? ఒకే రకం బట్టను కట్టడమా? ఏమిటి? ఎందులో సమైక్యం?

సమైక్యం అంటే ఇదేదీ కాదని గుర్తించండి. ఎవరి భాష వారిది, ఎవరి విశ్వాసం వారిది, ఎవరి అభిరుచి వారిది, ఎవరి ఆనందం వారిదిగా ఉంటూ అందరూ పరస్పర గౌరవ మర్యాదలతో కలిసి బ్రతకడమే సమైక్యం.

మనిషికీ మనిషికీ మధ్య వైవిధ్యం ఎంత ఎక్కువగా ఉంటే, మానవ మనీష అంత బహుముఖంగా వికసిస్తుంది. తోటలో ఎన్నోరకాల పువ్వులు, ఫలాలు లభిస్తాయి. ఎన్ని ఎక్కువ రకాల వాద్యాలుంటే, అంత ఎక్కువ పుష్టిని సంగీతం సంతరించు కొంటుంది. కావలసినన్ని వాద్యాలూ ఏకవాద్యమే ఉండడం కాదు.

నీ పొరుగువాడు ఏ మతం వాడైనా సరే, ఏ దేశం వాడైనా సరే, ఏ వర్ణం వాడైనా సరే, ఏ భాష మాట్లాడే వాడైనా సరే – అతని కష్ట సుఖాలలో నీవు భాగం పంచుకోవడమే సమైక్యం.

అతణ్ని నీ మార్గానికి మార్చడమో, నీవు అతడి మార్గానికి మారడమో సమైక్యం కాదు. అట్టి మార్పు మానవ ప్రతిభను అరికడుతుంది. మానవతా వికాసాన్ని కుంటు పరుస్తుంది.

205

మానవుడు ఆశాజీవి అనే సత్యాన్ని మరవకండి. తోడి మానవుల కంటె తాను అధికుడుగా వికసించాలని ప్రతి మానవుడూ ప్రయత్నిస్తాడు. చెట్టు కొమ్మలలో తానే బాగా ఎదగాలని ప్రతి కొమ్మా ప్రయత్నిస్తుంది. అయితే, ఒకదాని కొకటి అడ్డం రావు. ఒక దాని చావుకు మరొకటి కారణం కావు.

తన పొరుగువాడు సుఖంగా బ్రతకడానికి కావలసిన కనీసపు అవసరాలకు అడ్డం రాకుండా, స్వయం వికాసానికి నిరంతరం కృషి చెయ్యడమే మానవుడు అనుసరించ వలసిన మార్గం. అదే మానవ ధర్మం. అట్టి ధర్మం కోసమే మన పోరాటం.

ఆశను, పేరాసను మన్నించవచ్చు. అవి లేనిదే పురోగమనం లేదు. దురాశను మాత్రం సహించకండి. మరొక మానవుడికి అన్యాయం చేసి తాను బాగుపడా లనుకొనేదే దురాశ. అది ఎక్కడ కనిపించినా, వెంటనే రూపుమాపండి.

206

వజ్రాన్ని సానపట్టాలి. బంగారాన్ని చింత బొగ్గుల వేడిలో కరిగించాలి. భూమిని దున్నాలి. బాలకుణ్ణి శిక్షించాలి. దండనం దశగుణం భవేత్.

త్యాగం చెయ్యకుండా, ఆత్మ శిక్షణ లేకుండా ఏ మంచి పనీ జరగదు.

బుద్ధుడు, క్రైస్తు, వివేకానందుడు, గాంధీ, అంబేద్కరు వంటి మహా పురుషుల జీవితాలను పరిశీలించి చూడండి!

ప్రాపంచక వ్యామోహాలను నిరసించి - సుఖ భోగాలను పరిత్యజించి - మాలమాదిగల ఉద్ధరణ కోసం, దళిత జాతుల అభ్యుదయం కోసం, దేశ సౌభాగ్యం కోసం, ప్రపంచ ప్రజా సమైక్యం కోసం, తమ జీవితాలను సమర్పించడానికి ఎవరైనా సిద్ధంగా ఉన్నారా?

ఉంటే-

ఆంజనేయుడు, భీష్ముడు, వివేకానందుడు వంటి మహామహుల వలె నిత్య బ్రహ్మచారిగా, నిరంతర ప్రజా సేవకునిగా, ప్రాణాలను తృణప్రాయంగా పరిగణించి, విశ్వ జనోద్ధరణ మహాయజ్ఞంలో పాల్గొనగలిగే తాహతు ఉన్నదా?

ఉంటే-

అలాంటి వారు ముందుకు రండి. అలాంటి వ్యక్తి, జిల్లా కొక యువకుడు, ముందుకు వచ్చినా - మరొక పది సంవత్సరాలలో భారత మాతను ప్రపంచ మాతనే చెయ్యగలం! కుల మత వర్గ రహిత మహా మానవ సమాజాన్ని రక్తపాతం లేకుండా, శాంతి యుతంగా నిర్మించగలం.

ఆర్య సనాతన మత స్థాపకులై, దేహబలాన్నీ, బుద్ధి బలాన్నీ, నీతి బలాన్నీ కూడ మించిన యుక్తి బలానికి ఓడిపోయి, అంత్యజులుగా శిక్షించబడి, అన్యాయం చేయబడ్డ - ఓ మాలమాదిగ, వెనుకబడ్డ ప్రజలారా! చచ్చారా? బ్రతికి ఉన్నారా?

బ్రతికి ఉంటే - ముందుకు రండి! మానవాభ్యుదయానికి నాయకత్వం వహించండి !

207

అన్ని మతాలు ఒకే దైవ ధర్మాన్నీ, ఒకే మనుజ ధర్మాన్నీ ప్రతిపాదిస్తున్నప్పుడు – ఏ మతమైతేనేం? అందువల్ల – మతం విషయమే మనకు వద్దు.

మానవుడి కంటికి చీమలు ఎలా కనిపిస్తాయో, భగవంతుడి కంటికి మానవులు అలా కనిపించవచ్చు. ఎర్ర చీమలు, తెల్ల చీమలు, నల్ల చీమలు, చలి చీమలు, కండ చీమలు ఈ మానవ జాతులు. వీటిని భగవంతుడు అసలు గుర్తించి ఉంటాడని నేన నుకోను. ఈ మహా విశ్వంలో మన మానవ లోకం ఒక చీమల పుట్ట కంటె చిన్నదనే సత్యాన్ని గుర్తించండి.

అందువల్ల ఏ అతీత శక్తుల మీదా, ఏ బాహ్య సహాయం మీదా మనం ఆధారపడకూడదు. మనం మానవులుగా బ్రతకాలంటే పౌరుషంతో బ్రతకాలి. విద్య, విజ్ఞానం, కళ – ఈ త్రిమూర్తి రూప సరస్వతిని ఆరాధిస్తూ, ఆనందంతో బ్రతకాలి.

అసమర్థులకు ఆనందం లేదని తెలుసుకోండి. నిరానందంగా బ్రతికేవాడు మానవుడే కాదని గుర్తించండి. నిజమైన జీవితం ఒక నిరంతర పోరాటమన్న సత్యాన్ని అవగాహన చేసుకోండి.

208

సోషలిజం, ప్రజా సోషలిజం, సంయుక్త సోషలిజం, విప్లవాత్మక సోషలిజం, ప్రజాస్వామిక సోషలిజం, కమ్యూనిస్టు సోషలిజం, జాతీయ సోషలిజం – ఇలా ఎన్నో పేర్లతో పార్టీలు ఏర్పడడం ఎందుకు? ప్రజాభ్యుదయం కోసమా?

ఒకే లక్ష్య సాధనకు ఇన్ని పార్టీలు అవసరమా? కానే కాదని గుర్తించండి. ఈ పార్టీలన్నీ కొందరు వ్యక్తుల న్యాయకత్వాల కోసమూ, అధికారాల కోసమూ మాత్రమే. కులం వర్గం నిర్మూలించబడి, మత ప్రమేయం విస్మరించబడి, వస్తు ద్రవ్య ఉత్పత్తి అంతా జాతి పరం చెయ్యబడి, నిరుద్యోగ వృద్ధాప్య భత్యాలు ఏర్పాటు చెయ్యబడి, ఉచిత విద్యా వైద్య సౌకర్యాలు కల్పించబడి – సమస్య జీవిత రంగాల లోను మానవుడు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను, సమాన గౌరవ మర్యాదలను అనుభవిస్తూ

- అభిరుచిని బట్టి అభ్యుదయం పొందడానికి వీలుండే సామాజిక వ్యవస్థే సోషలిస్టు వ్యవస్థ.

ఈ దేశంలో ఇట్టి వ్యవస్థను మీరు తప్ప మరెవరూ నిర్మించజాలరు.

ఆలస్యం జరిగినా, అవస్థలు చుట్టు ముట్టినా అధైర్య పడకండి. ఎంతటి కారు చీకటి అయినా భయపడకండి. ముందుకు దూసుకుపోండి. సౌఖ్య సూర్యోదయం ఎంతో దూరంలో లేదు.

నిజమైన జీవితం ఒక నిరంతర పోరాటం. ధర్మం ఒక జీవన స్రవంతి. ధర్మం కోసం పోరాటమే మానవ ప్రగతి.

రాజకీయవీరుడు

డాక్టరుఖాను

రచన :

బోయి భీమన్న

ప్రచురణ :

సుఖేలా నికేతన్

తొలి ముద్రణ
జనవరి, 1968

నాట్యకళ ప్రెస్
హైదరాబాద్

హక్కులు : రచయితవి

వెల : రూ. 3/-

ప్రతులకు :

సుఖేలా నికేతన్

ఐ.సి. 85, ఇర్రమంజిల్ కాలనీ,
హైదరాబాదు - 34.

రాజకీయవీరుడు డాక్టరు ఖాను

పరిచయము

బహు గ్రంథ కర్తలు, కవులు, వినూతన సిద్ధాంత ప్రతిపాదకులు నయిన శ్రీ బోయి భీమన్నగారు తెలుగు సారస్వత లోకానికి సుపరిచితులు. వివిధ సాహిత్య వీధులలో వారు కావించిన కృషి సుప్రసిద్ధమైనది. ఈ గ్రంథ రచనతో భీమన్నగారు మరొక క్రొత్త సాహిత్య ప్రక్రియకు పూనుకొనినారు.

ఈ గ్రంథము డాక్టర్ ఖాన్ జీవిత చరిత్ర. డాక్టర్ ఖాన్ గొప్ప అధికార పదవుల నలంకరించిన పొరులు కాదు. అందుచేత ఆయన జీవిత వివరాలు చాల మందికి పరిచితమైనవి కావు. సుప్రసిద్ధుడు కాని వ్యక్తిని యీ గ్రంథ రూపమున పరిచయము కావించు ప్రయత్న ములో యేదో యొక ముఖ్యమైన అభిప్రాయము గర్భితమై యుండక తప్పదు. నిజానికి యే దేశ చరిత్ర యైనను తెలుసుకొన వలెనన్నచో దేశ నాయకుల జీవితములను తెలుసుకొని నంత మాత్రమున సరిపోదు. ఎందుకనగా అసాధారణ వ్యక్తుల జీవితాలు దేశమునకు ఆదర్శపాత్రములే కాని, సమకాలిక దేశ పరిస్థితులను సంపూర్ణముగా తెలియజేయజాలవు. అందుచేతనే కాబోలు ఒక సాధారణ పొరుని జీవిత చరిత్రను తీసుకొని, వివిధ రాజకీయ సామాజిక పరిస్థితులలో సాధారణ పొరుడు జాతీయ సమైక్యతకు అనుగుణముగా తన బాధ్యతలను యెట్లు నిర్వహించినాడో భీమన్నగారు యీ గ్రంథమున చక్కగా చిత్రించినారు.

ఇందులోని కథా నాయకులు డాక్టర్ ఖాన్ జన్మచేత ఇస్లామ్ మత నాయకులు. కాని – కర్మచేత ఇస్లాం, హిందూ, క్రైస్తవ మత ధర్మాలలోని ఉదాత్తతను తన వ్యక్తిత్వములో మేళవించుకొనిన సంస్కృతీపరులు. కావుననే ఆయన మన భారత జాతీయతకు ప్రతిబింబ మని చెప్పవచ్చును.

గడచిన ముప్పది సంవత్సరాలలో మన దేశములో చరిత్రాత్మకమైన సంఘటనలు జరిగినవి. అనేక క్లిష్ట పరిస్థితులు ఉత్పన్నమైనవి. ఈ పరిస్థితులలో మన డాక్టర్ ఖాన్ భారత పౌర ధర్మమును ప్రశంసనీయముగా నెరవేర్చి దేశ నాయకుల మన్ననలను పొందినారు.

డాక్టర్ ఖాన్ దృష్టిలో అన్ని మతాలు, అన్ని కులాలు, అన్ని వర్గాలు ఒక్కటే. తనలో అందరిని, అందరిలో తనను చూసుకొనిన అద్వైతి ఆయన. తెలుగులో అక్షరాభ్యాసము చేసిన అచ్చ తెనుగు వాడు ఆయన. ఉరుదూతో పాటు తెలుగును ప్రేమించిన రసికుడు ఆయన. భారత జాతీయోద్యమములో, విశాలాంధ్ర ఉద్యమములో పాల్గనిన రాజకీయ వీరుడు ఆయన. ఆయన యింటిలో అన్ని భాషలకు, అన్ని మతాలకు సుస్వాగతము. ఆయన గృహము ఆంధ్రప్రదేశ్‌లోని మూడు ప్రాంతాలను ముడివేసుకొన్నది. ఇటువంటి ఉదాత్త సంస్కృతీపరుని జీవిత వివరాలను యీ గ్రంథములో పేర్కొని శ్రీ బోయి భీమన్నగారు ప్రశంసనీయమైన పని చేసినారు.

భారతీయ పౌర ధర్మానికి, జాతీయ జీవనానికి ఆదర్శ ప్రాయమైనది డాక్టర్ ఖాన్ జీవితము. ఆయన వంటి పౌరుల సంఖ్య మన దేశములో అభివృద్ధి చెందినచో మన జాతీయ సమస్యలు సులభముగ పరిష్కారమయి, దేశము అభ్యుదయ మార్గమున పురోగమించ గలదు. డాక్టర్ ఖాన్‌కు నా శుభాకాంక్షలు. శ్రీ భీమన్నగారికి నా అభినందనలు.

హైదరాబాదు
ప్లవంగ సంక్రాంతి
14-1-1968

దేవులపల్లి రామానుజ రావు
ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ కార్యదర్శి

కొత్త ప్రయోగం

డాక్టరు ఖాను చరిత్ర ఇంతే కాదు. ఇంకా చాలా ఉంది.

జీవిత చరిత్రను ఒక మహా సౌధంతో పోలిస్తే – ఈ గ్రంథం ఒక తాత్కాలిక కట్టడం మాత్రం.

ఇందులో స్పృశించబడ్డ అంశాలను సూక్ష్మంగా పరిశీలించి, పరిశోధించి, సమగ్రంగా వ్రాయడానికి భవిష్యత్తులో ఎవరైనా పూనుకొంటే – అట్టివారికి ఇది ప్రాతిపదిక గ్రంథం అనవచ్చు. అట్టి కృషి ద్వారా ఇంకా ఎన్నో గొప్ప గొప్ప క్రొత్త విషయాలు వెలుగులోకి రావచ్చు కూడ.

రాజుల ప్రతాపాలు, మంత్రుల చాణక్యాలు, అంతఃపుర కుట్రలు, తాంత్రిక యుద్ధాలు, విజయోన్మాదాలు, పటాటోపాలు – ఇవే చరిత్ర అనుకొన్న రోజులు పోయినై. ప్రవక్తల, నియంతల, నాయకుల మహాకార్య నిర్వహణోదంతాల వివరణ పట్టికలే చరిత్ర అనుకొంటున్న రోజులు కూడ పోతున్నై. సామాన్య మానవుడి దైనందిన జీవిత చరిత్రే నిజమైన, సరియైన దేశ చరిత్ర అని గుర్తించవలసిన రోజులు వస్తున్నై. వచ్చేసినై.

సామాన్య మానవులలో డాక్టరు ఖాను ఎంతటి ఆదర్శ పురుషుడో, రచయితలలో శ్రీ బోయి భీమన్న అంతటి ఆదర్శ పురుషుడు.

ఇతర దేశాలలో వలె ఈ భారతదేశంలో కూడ మత విషయకమైన కలహాలు,

కొట్లాటలు, రక్తపాతాలు లేకుండా ఉండాలంటే – ఇతర మతాల వారి వలెనే ఇస్లాం మతస్థులు కూడ ఈ దేశపు వేష భాషల్ని అనుసరించక తప్పదు.

తెలుగుదేశంలోని హిందువుడు ఎంతటి తెలుగువాడో, క్రైస్తవుడు కూడ అంతటి తెలుగువాడే. ముస్లిం కూడ అంతటి తెలుగు వాడే కావలసి ఉంది. ఎవరు ఏ ప్రాంతం వాడో నిర్ణయించేవి వేష భాషలు. తెలుగు వేషం, తెలుగు భాష – ఈ రెండింటిని అనుసరించ కుండా, ఎవడూ కూడ – చివరకు దేవుడైనా సరే – తెలుగువాడు కాలేడు.

అలానే ఏ భాషా ప్రాంతం విషయంలోనైనా కూడ.

ఈ విషయంలో భారతీయ ముస్లింలకు డాక్టరు ఖాను ఆదర్శ పురుషుడు.

తాను ముస్లిం. ఇస్లాం మతస్థుడు. మతం వ్యక్తిగతం. తాను తెలుగు వాడు. అన్ని విధాలా తెలుగు సంప్రదాయాన్ని అనుసరించిన వాడు. అందువల్ల ఆదర్శ పురుషుడు.

మనం ఏ నేలలో పుట్టామో, ఆ నేలకు విధేయులమై, విశ్వాస పాత్రులమై ఉండాలి. అదే దేశభక్తి. దేశభక్తి జీవిత రక్తికి, భుక్తికి, ముక్తికి కూడ అవసరమైన ప్రధాన విషయం. జాతీయత లేకుండా అంతర్జాతీయత లేదు.

భారతదేశంలో వివిధ భాషా ప్రాంతాలలో నివసించే ముస్లింలు ఎలా ప్రవర్తిస్తే వారు సరియైన భారత పౌరులు కాగలరో – తాను స్వయంగా ఆచరించి చూపుతున్న వాడు డాక్టరు ఖాను. ఈ ఒక్క ఆదర్శమూ చాలు, ఆయనను ఒక మహావ్యక్తిని చెయ్యడానికి.

అలాంటి ఒక ఆదర్శమూర్తి జీవిత చరిత్రను వ్రాయగల్గిన శ్రీ భీమన్నగారు – శ్రీ దేవులపల్లి రామానుజరావుగా రన్నట్లు – చరిత్ర రచనలో ఒక నూత్న యుగాన్నే సృష్టించిన వారైనారు. ప్రజాస్వామిక సోషలిజం లక్ష్యపథంలో ఒక విప్లవాన్నే సాధించిన వారైనారు.

ఈ దేశంలోని ముస్లింలలో అత్యధిక సంఖ్యాకులు సున్నీలు. ప్రవక్త

బోధనలు విని ముస్లిం లైనవారు. అంటే – మతాంతరులైన దేశీయులే. కనుక దేశీయమైన వేషభాషల్ని అవలంబించటానికి సంకోచపడవలసిందేమీ లేదు. డాక్టరు ఖాను నడుస్తున్న మార్గంలో నడిస్తే చాలు.

ఆదర్శ పురుషులైన ఇలాంటి వారి జీవిత చరిత్రలను ఇతోధికంగా వ్రాసి, దేశ నాయకుల లక్ష్యశుద్ధికి, సమాజ నేతల చిత్తశుద్ధికి ఒరవడి పెట్టవలసిందిగా శ్రీ భీమన్నగారిని కోరుతున్నాం. డాక్టరు ఖానుగారి ఆయురారోగ్యైశ్వర్యాల ఇతోధికాభివృద్ధి కోసం ప్రార్థిస్తున్నాం.

ఏవో నాలుగు మాటలు అభిప్రాయం వ్రాసిపెట్ట వలసిందిగా కోరిన వెంటనే, ఏ మాత్రం ఆలస్యం చేయకుండా, చక్కని అభిప్రాయ సుధా కలశాన్ని అందించ గల్గిన ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీ కార్యదర్శులు శ్రీ దేవులపల్లి రామానుజ రావు గారికి ఎంతో కృతజ్ఞులం.

నిమిషాల మీద – అక్కడక్కడ అచ్చుతప్పులు దొర్లితే దొర్లాయి గాక – గ్రాంథాన్ని ముద్రించి ఇవ్వ గల్గిన నాట్యకళా ప్రెస్ వారికి, ముఖ్యంగా శ్రీ గిడుగు రామమూర్తి గారికి మా నమస్కారాలు. ఈ గ్రంథం అచ్చుకు వ్రాతప్రతిని తయారు చెయ్యటం వంటి కార్యక్రమాలలో మాకు ఎంతగానో తోడ్పడ్డ నటశేఖర శ్రీ వైద్యుల శ్రీనివాస రావు గారికి వందనాలు.

హైదరాబాదు,
జనవరి, 1968

సుఖేలా నికేతన్



డాక్టర్ ఎమ్.ఎ. ఖాను

రాజకీయవీరుడు డాక్టరు ఖాను

బిస్మిల్లా హిర్రహ్మాని ర్రహీమ్

(వరప్రదాయకుడు, కరుణామయుడు అగు అల్లా నామస్మరణతో ప్రారంభిస్తున్నాను.)
– ఖురాన్

ఎవ్వనిచే జనించు జగ
మెవ్వని లోపల నుండు లీనమై,
ఎవ్వని యందు డిందు పర
మేశ్వరు డెవ్వడు, మూల కారణం
బెవ్వ, డనాది మధ్యలయు
డెవ్వడు, సర్వము దానయైన వా
డెవ్వడు, వాని, నాత్మభవు,
నీశ్వరు, నే శరణంబు వేడెదన్.

పౌరాణిక రాగ ధోరణిలో వినిపిస్తున్నదీ భాగవత పద్యం లోపల నుంచి – నేను డాక్టరు ఖానుగారి సూర్యభవనం ప్రాంగణంలోకి అడుగు పెట్టేటప్పటికి.

"రండి, రండి !" అంటూ లోపల నుంచి బయట మెట్ల దాకా వచ్చి నా చెయ్యి పట్టుకొని, హాలులోకి తీసుకుపోయాడు డాక్టరు ఖాను – మందహాసంతో.

"మేఘరంజనీ ! రెండు కప్పులు టీ తీసుకురా !" అంటూ లోనికి చెప్పి, నన్ను కూర్చోమని, లోపలికి వెళ్ళా డాయన.

ఒక ముస్లిం డాక్టరు భాగవతంలోని పద్యాన్ని అంత చక్కగా చదువుతున్నందుకే ఆశ్చర్యపోతున్న నేను, మేఘరంజని అనే పేరు విని మరీ విభ్రాంతుణ్ణయాను.

నేను ఎక్కడున్నాను ? ఒకచోటి కనుకొని మరొక చోటికి రాలేదు కదా !

"ఇంకా నిలబడే ఉన్నారా ?" అంటూ ప్రవేశించా డాయన – రెండు ప్లేట్ల బిస్కెట్లతో.

"అది కమలా నెహ్రూగారి ఫోటో. మా వెల్‌ఫేర్ సెంటర్ కోసం ఎన్‌లార్జ్ చేయించాను" అన్నాడు చేతిలోని ప్లేట్లను మేజా మీద పెడుతూ, నా చూపుల చివరకు తన చూపుల్ని కూడా పోనిచ్చి.

అప్పటి వరకూ నాకు కమలానెహ్రూగారి చిత్రం వంక చూస్తున్నాననే ధ్యాసే లేదు. మనస్సు మేఘరంజనితో గజేంద్రమోక్షం గానం చేస్తున్నది ! హృదయం డాక్టరు ఖానుగారి భారతీయ సంప్రదాయ పరమజ్ఞతా శుభ్రజ్యోత్స్నలో పొంగులు వారుతున్నది !

హాలు మొత్తం దేశనాయకుల పాతకాలం ఫోటోలతో నిండి ఉంది. గాంధీ, నెహ్రూ, పటేల్, మౌలానా ఆజాద్, ఆంధ్రకేసరి, నేతాజీ, శాస్త్రి, పొట్టి శ్రీరాములు, రాజేంద్రప్రసాద్, సరోజినీ దేవి, రాధాకృష్ణన్, జాకిర్ హుసేన్ వంటి నాయకుల ఫోటోలు ముఖ్యస్థానాల్లో అమర్చబడి ఉన్నాయి. కాంగ్రెసు వాదుల ఇండ్లలో సాధారణంగా ఈ ఫోటోలు అన్నీ ఉండేవే. ఇక్కడ కమలానెహ్రూ ఫోటో కూడా ఉండడం ఎంతో ముచ్చటగా ఉంది.

మేం బిస్కెట్లు తింటున్నాం. అంతలో అక్కడ ప్రత్యక్షమైంది – మెరుపులాంటి ఒక ఆరేండ్ల అమ్మాయి.

"మా పెద్దబ్బాయి కమల్ కూతురు, మేఘరంజనీ బేగం" అంటూ ఆ అమ్మాయిని పరిచయం చేశా డాయన నాకు. నేను చెయ్యి చాపాను. నా ఒళ్ళోకి వచ్చేసిందామె.

"సూర్యభవనం, మేఘరంజని - చాల అందమైన పేర్లు పెడతారు మీరు" అన్నాను నేను అభినందన పూర్వకంగా... "సంస్కృతభాష లోనే వుంది ఆ అందం" అన్నా డాయన.

డాక్టరు ఖానుతో పరిచయం నాకు కొత్త దేమీ కాదు. ఆయన నాకు చిరకాలంగా తెలిసినవాడే. జాతీయోద్యమంలో, సాంస్కృతిక కార్యక్రమాలలో మే మిద్దరం కలిసి పనిచేసిన సందర్భాలు ఉన్నాయి. అయితే, మొన్న మొన్నటివరకు కూడా పరిచయం స్నేహంగా మారలేదు. మేము స్నేహితులమూ, సన్నిహితులమూ అయిన తర్వాత నేను వారింటికి రావడం ఇదే మొదటి సారి.

ఆయన స్వచ్ఛమైన దేశభక్తుడు, గాంధీజీ అనుచరుడు, నిర్మాణ కార్యకర్త, సత్యసంధుడు, స్నేహశీలి, భావుకుడు, గ్రంథకర్త, త్యాగి, మానవసేవా పరాయణుడు, సహృదయుడు. ఇదంతా నాకు చిరకాలంగా తెలిసిందే. అయితే, మత, సాంఘిక, సాంసారిక విషయాల్లో కూడా ఇంత కార్యవాది అనీ, విప్లవకారు డనీ నాకు అంతకు ముందు తెలియదు. ఇది నాకు ఒక అపూర్వమైన సత్యావిష్కారం !

ఎంతోమంది సంస్కర్తల్నీ, ప్రగతికాముల్నీ, విప్లవకారుల్నీ ఎరుగుదును నేను. అందులో - ఏ విధమైన స్వప్రయోజనాన్ని ఆశించని, ఎంతటి ప్రతిఘటనకైనా సరే వెనకడుగు వెయ్యని నిర్భయుల్నీ, నిజాయితీపరుల్ని కూడా చూశాను నేను.

కానీ -

ఇస్లాం మతానికి చెందిన ఒక వ్యక్తి, ఆ మతం పట్ల గాఢవిశ్వాసం గల ఒక ముస్లిం గృహస్థు, అంతవరకూ ఉన్న సంప్రదాయానికీ, ఆచారానికీ విరుద్ధంగా తన గృహానికీ, కుటుంబ సభ్యులకూ హైందవ సంప్రదాయం లోని పేర్లను పెట్టడం మాత్రం చాలా అపూర్వం !

'స్వప్నంలో ఆంధ్రరాష్ట్రం' అనే గ్రంథంలో డాక్టరు ఖాను యీ సూచన చేసి ఉన్నాడు. ఆ విషయం నేను మరచేపోయాను. అయితే, అది ఆయన స్వప్నానికి సంబంధించిన విషయం. ఆయన కల నిజమై ఆంధ్రరాష్ట్రం సమగ్ర సుందరంగా ఏర్పడ్డ మాట వాస్తవమే. కాని, తన మనుమరాలికి మేఘరంజని అని పేరు పెట్టడం

కూడ నిజమైందంటే - ఆయన ఎంత కార్యవాదో, ఎంతటి సాహసోపేతుడో మనం ఊహించ వచ్చు.

"అనుకొన్న పని అనుకొన్నట్టు నెరవేర్చటంలో మీకు మీరే సాటి" అన్నాను నేను... మేఘరంజని తెచ్చిన తేనీటిని చాతకంలా చప్పరిస్తూ.

"మేఘరంజని అని పేరు పెట్టడం ముస్లిం సంప్రదాయానికి విరుద్ధమనీ, ఇస్లాం మతాచారాలను డాక్టరు ఖాను మంటగలుపు తున్నాడనీ, 1949లో నేను నా గ్రంథాన్ని ప్రకటించి నప్పుడే ముస్లింలీగు కార్యకర్తలు పెద్ద ఆందోళన లేవదీశారు - నాకు వ్యతిరేకంగా. అది ఒక పెద్ద ఉద్యమంగా కూడ పరిణమించింది. చివరకు కాంగ్రెసు నాయకుడు కాకాని వెంకటరత్నం గారు కలుగజేసుకుంటేనే కాని అది చల్లారలేదు" అన్నా డాయన.

"ఇంతకూ మేఘరంజని అనేది హిందూ పేరు కాదు కదా ! అది సంస్కృత పదం. సంగీతం లోని ఒక రాగం. సంస్కృతం ఒక భాష. ఒక భాష గానీ, ఒక కళ గానీ, యే ఒక్క మతానికీ చెంది వుండవు. చూడండీ ! ఆచారాలూ, సంప్రదా యాలూ ఎలా అపార్థాలకు లోనై, అనర్థాలకు హేతు వవుతున్నాయో ! మతాలు కాలక్రమేణా మానవుణ్ణి మరీ అంధుణ్ని చేస్తున్నాయి" అన్నాడు - నా ముఖం లోకి చూస్తూ.

డాక్టరు ఖాను ఎంత సంస్కారవంతుడో అప్పుడు తెలిసింది నాకు. నిజమే. భాష, భావం, కళ, సాహిత్యం, విజ్ఞానం, సౌందర్యం వంటి వన్నీ - గాలి, నేల, నీరు, నిప్పు వంటి వాటిలాగే - సర్వమానవకోటికీ చెందినట్టివి. మతాలూ, ఆచారాలూ, దేశ సరిహద్దులూ, ఆహారవిహారాలూ వంటి వ్యక్తిగత విషయాలకు అవి ఎన్నటికీ పరిమితం కావు.

ఆధునిక భాషల్లో ఇంగ్లీషులాగే, ప్రాచీన భాషల్లో సంస్కృతం విశ్వజనీన భాష. దేశకాల పాత్రావధులు లేవు దానికి. ముస్లింలు చేసే సమాజు సంస్కృత నమస్సే కదా ! భారతదేశం లోని యే మతం వాళ్ళు అయినా సరే, యే ప్రయోజనం కోసమైనా సరే, సంస్కృత పదజాలాన్ని స్వేచ్ఛగా వాడుకోవచ్చు. అలా వాడుకోవడమే నిజమైన జాతీయత అవుతుంది కూడ.

గాంధీజీ సిద్ధాంతాలను అక్షరాలా అమలు జరిపే నైష్ఠికుడు, సత్యాగ్రహి, సౌమ్యుడు అయిన డాక్టరు ఖానులో ఇంతటి విప్లవాత్మక శక్తి ఉండటం ఎంతో మహిమాన్వితం అనిపించింది నాకు. అందుకే అలాంటి మనస్తత్వమే కల నేను, ఆయనకి మరీ సన్నిహితుణ్ని కాగలిగాను.

★★★

2. ముస్లింలీగుతో తెగత్రెంపులు

అది 1945, జూలై 31వ తేది.

ఉషఃకిరణాలు బాణాల్లా దూసుకు వస్తున్నై తూర్పు నుంచి, చీకట్లు తిరిగి తిరిగి చూస్తూ పారిపోతున్నై పడమటి ముఖంగా. బ్రిటిషు సామ్రాజ్యంలో రవి అస్తమించ బోతూ, భారతదేశంలో ఉదయించబోతూ ఉన్న సంధ్యాసమయం అంది.

ఎవరో ఎత్తి కుదేసినంత ఊపుతో నిద్రలేచింది బెజవాడ పట్టణం ఆ ఉదయం. ఇంకా తిన్నగా తెల్లవారలేదు. పారిపోతున్న చీకట్లు వదిలి వేసిన మందుగుండు సామగ్రిలా పట్టణ నడివీధుల్లో గుండెలదర గొడుతున్నాయి పందులు. బెజవాడ ప్లాట్‌ఫారం మీద నుంచి కలకత్తా మెయిలు ఇంకా కదలనే లేదు. అది తెచ్చిన మద్రాసు పత్రికలు అప్పుడే కాఫీ హోటళ్ళలో ఇడ్లీలకు ఆర్డర్లు ఇస్తున్నాయి. రాజకీయ పార్టీల కార్యాలయాలలో వేడివేడి చర్చలు ప్రారంభమైనాయి. కాంగ్రెసు కార్యకర్తల ముఖాలలో సూర్యోదయ కాంతులు కట్టలు త్రెంచుకొంటూ ఉంటే, ముస్లిం లీగర్ల ముఖాల్లో క్రోధం అకాండతాండవం చెయ్యసాగింది. మొత్తం పట్టణం త్రుళ్ళిపడి, కళ్ళు నులుపుకొని, లేచి చూచేసరికి వాతావరణం శాంతభయానక రసాల కోలాహలంతో నిండిపోయి ఉంది.

ఈ పత్రిక లేమిటి ? ఈ ఉద్రేకా లేమిటి ? ఇంత పట్టణమూ ఇలా అట్టుడికి నట్టు ఉడికిపోతుండడానికి ఏమిటి కారణం ?

ఏం జరిగిందా ఉదయం ?

ఆ ఉదయం వచ్చిన పత్రికలలో డాక్టరు ఎం.ఏ. ఖాను చేసిన ప్రకటన

వుంది. కృష్ణా జిల్లా ముస్లింలీగు ఉపాధ్యక్ష పదవికీ, లీగు సభ్యత్వానికీ రాజీనామా చేస్తూ ఆయన చేసిన ప్రకటన అది.

"ముస్లింలీగు మహమ్మదీయుల హక్కులను కాపాడ గలదని నేను దానిలో చేరాను. కృష్ణాజిల్లా ముస్లింలీగుకు 1944లో జాయింట్ సెక్రటరీగానూ, 1945లో ఉపాధ్యక్షుడుగానూ ఉన్నాను. ఇండియాకు స్వాతంత్ర్యం ద్వారా మహమ్మదీయులు స్వతంత్రులు కావాలని నా కోరిక. వైస్రాయి కార్యవర్గంలో, హిందువులతో సమానంగా మహమ్మదీయులకు సభ్యత్వం ఇస్తానని వేవెల్ ప్రభువు చెప్పినప్పటికీ, జిన్నా సాహేబ్ ఒప్పుకోలేదు. చాలా మూర్ఖించి కూర్చున్నాడు. ఆ విధంగా సిమ్లా సభ భగ్నమై పోయింది. ఆ విధంగా మహమ్మదీయుల స్వాతంత్ర్య ప్రాప్తికి జిన్నా సాహేబ్ ప్రతిబంధక మైనాడు. బెంగాలులో కూడు గుడ్డ లేక వేల మంది ముసల్మానులు చచ్చిపోయారు. ప్రజాప్రభుత్వాలు యేర్పడి దొంగ వ్యాపారస్తుల్ని శిక్షించి, ఆకటిచావుల నుండి ప్రజల్ని రక్షించడానికి వీలు లేకుండా జిన్నా సాహేబ్ చేశాడు. కనుక జిన్నా సాహేబ్ దేశభక్తుడు కాడు. ఆయన మహమ్మదీయుల క్షేమం కోరేవాడు కాడు. మహమ్మదీయుల ప్రతినిధి కాడు. కాంగ్రెసు ప్రెసిడెంటు అయిన ఆజాద్ గారే జిన్నాగారి కంటే ఎక్కువ ప్రశంసాపాత్రంగా వ్యవహరించారు. మహమ్మదీయుల హక్కులను కూడా కాపాడగలిగి నట్టిది కాంగ్రెసు సంస్థే అని చూపించారు. సిమ్లా సమావేశం అయిన తర్వాత కాంగ్రెసు పట్ల మహమ్మదీయులకు గల అనుమానాలన్నీ తీరిపోయాయి. అందువల్ల ముస్లింలీగులో నా సభ్యత్వానికి రాజీనామా ఇస్తున్నాను. ఆంధ్ర దేశంలోని నా సోదర మహమ్మదీయులు కూడా ముస్లింలీగును విసర్జించి, కాంగ్రెసులో చేరి, మహమ్మదీయుల క్షేమాభివృద్ధికై కృషి చెయ్యవలసిందిగా కోరుతున్నాను".

1945 ప్రాంతంలో, దేశంలో రాజకీయ వాతావరణం ఎంత ఉద్రేక పూరితంగా ఉండినదో తెలిసిన వారికీ, ఆ వాతావరణంలో ఆనాడు పడి కొట్టు కొంటున్న వారికీ, డాక్టరు ఖాను చేసిన ఈ ప్రకటన ఎలాంటి ఉద్రేకాలను రెచ్చగొట్ట గలదో, హిందూ ముస్లిం జన సమ్మిశ్రితాలై ఉన్న బెజవాడ వంటి పట్టణాల్లో ఎలాంటి తుఫానుల్ని సృష్టించ గలదో వేరే చెప్పనక్కర లేదు. ఖానుగారి ఈ ప్రకటన వరుసగా

దేశంలోని తెలుగు, ఇంగ్లీషు పత్రిక లన్నిటిలోనూ రావడంతో, ఆలిండియా రేడియో ఢిల్లీ కేంద్రం నుంచి కూడా ప్రసారం కావడంతో ఒక ఆంధ్రదేశం లోనే గాక, మొత్తం భారతదేశంలోనే రగులుతున్న అగ్నిలో ఆజ్యం పోసినట్లయింది.

విమర్శలూ, వ్యాఖ్యానాలూ, చర్చలూ, సమావేశాలూ తీవ్రంగా కొనసాగినాయి. ఆవేశకావేషాలు మిన్ను ముట్టినై. ఒక ప్రక్క మహమ్మదీయుల్లో ఉద్రేకాలు రెచ్చ గొట్టడానికి ముస్లింలీగు కార్యకర్తలు తంటాలు పడుతూ ఉండగా, మరోప్రక్క కమ్యూనిస్టు పార్టీ వారు ఖానుగారిని విపరీతంగా విమర్శించడం మొదలు పెట్టారు. డాక్టరు ఖాను ముస్లింలకు ద్రోహం చేశాడనీ, జనాబ్ జిన్నాగారి వద్ద ఆంధ్ర ముస్లింలకు తలవంపులు తెచ్చాడనీ తిట్టిపోశారు. దేశంలో ముస్లింల పరిస్థితి ఏమిటో, ముస్లింల హక్కులు ఏమిటో, సాధారణ ముస్లిం జనం పల్లెలలో, పట్టణాలలో ఎలా బ్రతుకుతున్నారో, వారికి కావలసిం దేమిటో తెలియని మతోన్మాదులు దానితో పెట్రేగి, డాక్టరు ఖానును ఎన్నో బాధలు పెట్టారా రోజుల్లో.

అందులో ఒక రోజు –

★★★

3. మతమౌఢ్య పరాకాష్ఠ

"ఉద్రేక పూరితులైన కొందరు రౌడీలు 'జిన్నా జిందాబాద్, ఖాన్ మురదాబాద్' అంటూ వచ్చేస్తున్నారు. కర్రలు, బరిసెలు పుచ్చుకొని ఆవేశంతో ఊగిపోతూ దండెత్తు కొస్తున్నారు. ఇక్కడ ఉండడం అపాయకరం. వెంటనే మీరు ఇక్కడ నుంచి తప్పించుకోండి. అదిగో ! అప్పుడే ఓవర్ బ్రిడ్జి దాటారు. ఆలస్యం చేయవద్దు. తొందరగా వచ్చెయ్యండి" అంటూ తొందరచేశాడు ఒక మిత్రుడు గాంధీనగరంలో వున్న నా ఆస్పత్రికి వచ్చి. చాలా కంగారుగా ఉన్నాడు అతడు. అప్పటికే ఆ రౌడీ మూకల దౌర్జన్య నినాదాలు సమీపంలోకి వచ్చేసినాయి.

"సరే, వారిని రానియ్యండి, నా పాలసీ వివరిస్తాను. వారికి నేను నచ్చ చెప్పగల ననుకుంటాను" – అన్నాను నేను. ఆస్పత్రి వరండాలోకి వచ్చి, దూరంలో ఆ గుంపును చూస్తూ.

ఆశ్చర్యంతో కళ్లు ఎర్రచేశాడా మిత్రుడు.

"వాళ్ళు మీ పాలసీలూ, గీలసీలూ వినే రకం కారు. వాళ్ళు విద్యా సంస్కారం కలవాళ్ళు కారు. మూఢ మతావేశం అనే పిశాచం ఆవేశించిన వాళ్ళు. కర్రలు, బరిసెలు తప్ప - మాటలూ, వాక్యాలూ అర్థం కావు వాళ్ళకి. మీరు మాట్లాడక ముందే దౌర్జన్యానికి దిగుతారు. వెంటనే ఆస్పత్రికి తాళం పెట్టి బయలుదేరండి" - అన్నాడా మిత్రుడు భయంతో వణికిపోతూ. అంటూనే నా సమాధానానికైనా ఎదురు చూడకుండా, కాంపౌండరును పిలిచి, తాళం వేయించి, నన్ను తనతో లాక్కు పోయాడు.

నేను తిన్నగా ఇంటిముఖం పట్టాను.

"ఇంటికి కాదు. మీ ఇల్లు వాళ్ళకు తెలుసు" - అంటూనే ఆ మిత్రుడు రిక్షా పిలిపించి, నన్ను ఎక్కించి, తిన్నగా అయ్యదేవర కాళేశ్వర రావుగారి ఇంటికి తీసుకువెళ్ళాడు.

క్విట్ ఇండియా మహావిప్లవంలోకి దూకి, విదేశీ ప్రభుత్వ క్రూర నిర్బంధంలో ఎంతో కాలం మ్రగ్గి, జైలు నుంచి విడుదలై వచ్చి, తీవ్రమైన కమ్యూనిస్టు వ్యతిరేకతను ఎదుర్కొంటున్న ఆంధ్ర అగ్రనాయకుడు కాళేశ్వరరావుగారు. బ్రిటిష్ పాలకుల యుద్ధవిధానాన్ని ఎదిరించి, సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని కోరి కాంగ్రెసు నాయకులంతా జైళ్ళల్లో ఉండగా - కమ్యూనిస్టు పార్టీ మాత్రం బ్రిటిషు వారికి అండగా వుండడానికి నిర్ణయించుకొని, జాతీయ వ్యతిరేక వైఖరిని అవలంబించి, జిన్నాగారి పాకిస్తాన్ నినాదాన్ని బలపరుస్తూ తిరుగుతున్న రోజు లవి. రామకుమారవర్మ, మైనేని రామకోటయ్య, భూపతి కోటేశ్వరరావు, ఎన్.వి.యస్. ప్రసాద్, తుమ్మలపల్లి సత్యనారాయణ మూర్తి, అన్నే శ్రీరాజ్యం వంటి యువతరం వారు కమ్యూనిస్టుల జాతీయ వ్యతిరేక ధోరణిని నిరోధిస్తూ, కాళేశ్వరరావు గారికి బాగా తోడ్పడ్డ కాలమది. పాకిస్తాన్ ఉద్యమానికి, జిన్నాగారి నాయకత్వానికి, కమ్యూనిస్టులు తోడ్పడకపోతే, మతోన్మాదాన్ని రెచ్చకొట్టకపోతే ముస్లింలీగు వర్కర్లు అంతగా రెచ్చిపోయి ఉండేవారు కారు. "ఏది యేమయినా ఆ రోజు కాళేశ్వరరావుగారి ఇల్లు చేరివుండక పోతే ఆనాటి కల్లోలంలో నేను ఏమై పోయి ఉండేవాడినో" అన్నాడు డాక్టరు భాను - ఆ రోజు సంఘటనలను గుర్తుకు తెచ్చుకొంటూ.

మూడు రోజుల పాటు కాళేశ్వరరావుగారి ఇంట్లోనే ఉన్నాడు డాక్టరు ఖాను. అలా ఉండక తప్పలేదు ఆయన. ఆ మూడు రోజులూ ఆయన పడిన మనోవేదన ఇంతా అంతా అనడానికి వీలు లేదు.

"ఆస్పత్రి మూసి వుండటం చూచి రెచ్చిపోయిన రౌడీ మూకలు, నాకు వ్యతిరేక నినాదాలు చేసుకొంటూ, ఉచ్చరించరాని దుర్భాషలతో అచట నుంచి కదిలి, అరండేల్ పేటలో వున్న మా ఇంటిని చుట్టుముట్టి, ముస్లిం లీగ్ - జిందాబాద్, డాక్టర్ ఖాన్ - మురదాబాద్ అంటూ కొంతసేపు అరచి, అక్కడ నుంచి కదలి వెళ్ళారట. ఆ తర్వాత జిన్నా లైబ్రరీ వద్ద మీటింగ్ పెట్టి, ఆ సభలో అనేక విధాల నన్ను దూషించారట. ఈ విషయాలు ఎప్పటి కప్పుడు నాకు తెలుస్తూనే ఉన్నాయి. నా కుటుంబ రక్షణ గురించి నేను ఎప్పుడూ ఆందోళన పడలేదు. ఆ భారాన్ని కాళేశ్వర రావుగారు తదితర కాంగ్రెసు యువ కార్యకర్తలూ స్వీకరించారు. ముస్లింలీగు వర్గర్ల దౌర్జన్యానికి కూడా నేను భయపడలేదు. లీగ్ నుంచి నా రాజీనామా, జిన్నాగారిపై నేను చేసిన ఆరోపణలూ లీగర్లకు కోపం తెప్పించటం సహజమే. మతపిచ్చి కలవాళ్ళు సత్యాన్నీ, హేతువునూ దర్శించలేరు. అటువంటి మూఢోన్మాదులు ప్రతి మతంలోనూ వుంటారు. అందుకు నే నేమీ చింతపడలేదు, భయపడలేదు. కాని, నా మీద వ్యతిరేక ప్రదర్శనలు చేసిన మూకలో ఎంతోమంది హిందూ యువకులు కూడా ఉండటం నన్ను చాలా ఆందోళన పరిచింది. విచారంలో ముంచింది. విదేశీ పరిపాలకుల సామ్రాజ్యవాద యుద్ధం ప్రజాయుద్ధ మంటూ ప్రచారం చేస్తున్న కమ్యూనిస్టులు భారతీయ యువకుల్ని ఎలా పెడదారులు పట్టిస్తున్నారో చూచి, చాలా భయపడ్డాను, బాధపడ్డాను. నేను బయటకు పోయి, నా దృక్పథాన్ని, నా చర్యలో వున్న సహేతుకతను ప్రజలకు వివరించి చెప్పాలని యెన్నోసార్లు ప్రయత్నించాను. అందుకు కాళేశ్వర రావుగారు, మరుపిళ్ళ చిట్టిగారు వంటి మిత్రులు అంగీకరించ లేదు" అన్నా డాయన - అప్పటి తన మనస్థితిని గురించి వివరిస్తూ.

ఆ తర్వాత కాళేశ్వర రావుగారే ఒక కారును యేర్పాటు చేసి - ఆయననూ, ఆయన కుటుంబాన్ని నిడదవోలు పంపించివేశారు. నిడదవోలు డాక్టరు ఖాను అత్తవారి ఊరు.

★★★

4. ప్రహ్లాద చరిత్ర

"డాక్టరు ఖాను ఈ మెయిల్లో ప్రయాణం చేస్తున్నాడు" అనే టెలిగ్రాములు వందలూ వేలూ యివ్వబడేవి ఆ రోజుల్లో.

రైలు మార్గానికి సమీపంలో వుండే ప్రతి పట్టణానికీ అందేవి ఈ టెలిగ్రాములు. ఆయనను అల్లరి పెట్టడం కోసం ముస్లీం లీగర్లకు, ఆయనకు రక్షణ కల్పించడం కోసం కాంగ్రెసు వర్కర్లకు కూడా అందేవి అవి. ఏ స్టేషన్ ప్లాట్‌ఫారం మీదనైనా ఆయన ప్రయాణం చేస్తున్న మెయిలు ఆగగానే, వ్యతిరేక నినాదాలతో లీగర్లు ప్రదర్శనాలు జరిపేవారు. ఎలాంటి ఆత్యయిక పరిస్థితి ఏర్పడినా ఎదుర్కోడానికి కాంగ్రెసు వాలంటీర్లు కూడా హాజరుగానే వుండేవారు. ఆనాటి రాజకీయ వాతావరణం అలాంటిది. ఉద్రేకాలు అట్టివి.

నిడదవోలులో అత్తవారి ఇంట ఒక వారం రోజులు వుండి, తరువాత కార్యక్రమానికి ఒక పథకం వేసుకొని, బెజవాడ వెళ్ళి కాళేశ్వరరావుగారి ఆమోదం పొంది, ఆంధ్ర జిల్లాలలో పర్యటించడం ప్రారంభించా డాయన. అట్టి పర్యటనల సందర్భాలలో ఆయన ఎదుర్కొన వలసిన పరిస్థితి ఎంతో విషమం.

ఆ రోజుల్లో ఆయన ప్రయాణాలూ, రైల్వే ప్లాటుఫారాల మీద ప్రదర్శనాలూ, మహాసభల్లో ప్రతిఘటనలూ, జాతీయ భావావేశంలో ఆయన పడ్డ బాధలూ వింటూ వుంటే నాకు ప్రహ్లాద చరిత్ర జ్ఞాపకానికి వచ్చింది.

సత్యాన్నీ, శ్రేయాన్నీ గుర్తించలేని హిరణ్యకశిపుని రాక్షస మూకల మధ్య, ఆనాడు ప్రహ్లాదుడు పడ్డ బాధలు కూడా ఇటువంటివే కదా అనిపించి – దృఢ నిశ్చయంతో, సత్యం కోసం పోరాడే ప్రతి జీవితం లోనూ కూడా చరిత్ర పునరావృత్తం అవుతుంది కదా అని ఆశ్చర్యపడ్డాను నేను.

చరిత్ర పెద్ద కొండ వంటిదే కావచ్చు. అది ఎంత చిన్న అద్దంలో అయినా ప్రతిబింబించక తప్పదు. వ్యక్తి పెద్దవాడైతే, అగ్రస్థానం లోని వాడైతే, అతని కాలిచెప్పు తెగినా అది చారిత్రక విషయమే అవుతుంది. దానికి పత్రికల వంటి ప్రచార సాధనాలు

పెద్ద శీర్షిక పెడతాయి. వ్యక్తి సామాన్య ప్రజలలో ఒకడైనప్పుడు, అతడు దేశసేవలో తన సర్వస్వాన్ని, తుదకు ప్రాణాన్ని కూడా కోల్పోయినా, అది చరిత్రకు కాదు కదా, స్థానిక పత్రికలకు కూడా ఎక్కదు. మానవుడు కల్పించుకొన్న ఈ పెచ్చు తగ్గులు, ఇక్కడ సాంఘిక ప్రయోజనాలకు ఉపయోగపడవచ్చు, సృష్టి ప్రణాళికలో మాత్రం మనిషికీ – మనిషికీ మధ్య తేడా ఉండదు.

అధికార బధిరాంధక దౌర్జన్యాన్ని ధైర్యంతో ఎదిరించి నిల్చే ప్రతి యువకుడూ ప్రహ్లాదుడే నా దృష్టిలో, అతడు రాజపుత్రుడే కాని, కార్మిక బాలుడే కాని, అమీర్ గాని, గరీబ్ కానీ.

ఆంధ్రదేశం మొత్తం మీద ప్రతి ముఖ్యప్రాంతం లోనూ పర్యటించి ముస్లిం లీగుకు వ్యతిరేకంగా, కాంగ్రెసును బలపరుస్తూ, డాక్టరు ఖాను చేసిన అసంఖ్యాకమైన ప్రసంగాల ధోరణి ఎలా ఉండేది ?

"మౌలానా ఆజాద్‌గారి అధ్యక్షతను అఖిల భారత కాంగ్రెసు 1942వ సంవత్సరం ఆగస్టు మొదటి వారంలో సమావేశమై, సంపూర్ణ స్వాతంత్ర్యం క్విట్ ఇండియా తీర్మానములు చేసింది. బ్రిటిష్ సామ్రాజ్య వాదులు ఈ తీర్మానాలకు ఆగ్రహావేశ పూరితులై దేశనాయకుల నందరినీ నిర్బంధించారు. అగ్రనాయకులే గాక రాష్ట్ర, జిల్లా, తాలూకా, గ్రామస్థాయి నాయకుల్ని కూడా, ప్రజావిశ్వాసాన్ని చూరగొన్న ప్రతి కాంగ్రెసువాదినీ కూడా జైళ్ళలో పెట్టారు. ఒక ప్రక్క గాంధీజీ నాయకత్వము క్రింద, జాతీయ కాంగ్రెసు నాయకు లందరూ సత్యాగ్రహోద్యమానికి గురై దేశ స్వాతంత్ర్యం కోసం పోరాటం సలుపుతూ కారాగారాల్లో ప్రగ్గుతూ ఉండగా, మరో ప్రక్క సుభాస్ చంద్రబోసు వంటి తీవ్రవాదులు సైనిక చర్యల ద్వారా విదేశీయ ప్రభుత్వాన్ని దేశం లోంచి వెడలగొట్టి, సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని సాధించటానికి కంకణం కట్టుకొని అజాద్ హింద్ ఫౌజ్‌ని నిర్మించి "ఢిల్లీ ఛలో" అంటూ జైత్రయాత్ర సాగుతున్న సమయంలో, జాతీయ వ్యతిరేక చర్యలకు కమ్యునిస్టు పార్టీ పూనుకొంది. నేతాజీ వంటి జాతీయ మహావీరుణ్ణి దేశద్రోహి అంటూ నినాదాలు ఇవ్వసాగింది.

"ఈ విధంగా దేశం అల్లకల్లోలంలో మునిగి ఉండగా, ముస్లిం లందరకు తానే నాయకుడ నంటూ జిన్నా సాహెబ్‌గారు బయలుదేరారు. దేశానికి, భారతజాతికి,

జాతీయోద్యమానికి వ్యతిరేకంగా ముస్లింలలో మతదురభిమానాన్ని రెచ్చగొట్టారు. "ఇస్లాం ఇన్ డేంజర్" అనే నినాదాన్ని లేవనెత్తారు. అమాయకులైన ముస్లింలను మత పిచ్చి ద్వారా లోబరచుకొని, పాకిస్తాన్‌కు అనుకూలంగా చిలుక పలుకులు పలికిస్తున్నారు. విడదీసి పాలించడమే రాజనీతిగా గల బ్రిటిష్ పాలకులు జిన్నాగారి నాయకత్వానికి పక్క తాళం వేస్తున్నారు. ఈ పరిస్థితిని, ఈ కల్లోలాన్ని, అవ్యవస్థని తమ పార్టీ పలుకుబడిని పెంచుకోవడం కోసం కమ్యునిస్టులు అటు బ్రిటిష్ వారికి ఇటు జిన్నాగారి ముస్లింలీగుకు వంతపాట ప్రారంభించారు. పాకిస్తాన్‌ను సమర్థిస్తూ, జిన్నా నాయకత్వాన్ని బలపరుస్తూ కమ్యూనిస్టులు చేస్తున్న ప్రచారం, కమ్యూనిస్టు పార్టీ మూలసూత్రాలకే ఎంత విరుద్ధమైందో, మతోద్రేకాన్ని రెచ్చగొట్టడం ఎంత సిద్ధాంత ద్రోహకరమైన విధానమో అందరికీ తెలిసిందే. పాకిస్తాన్ ఉద్యమం బలపడటానికి జిన్నాగారి వాద బలంకన్న, కమ్యునిస్టుల ప్రచారబలమే ఎక్కువగా తోడ్పడిందంటే అది అతిశయోక్తి మాత్రం కాదు.

"ఇంతకూ, పాకిస్తాన్ అంటే ఏమిటి ? మొన్న సిమ్లా సమావేశం వరకు దాని నిజస్వరూపం ఎవరికీ ఎరుక పడలేదు. పాకిస్తాన్ అంటే ముసల్మానుల హక్కులు గుర్తించడం, వారి మతస్వేచ్ఛను రక్షించడం, వారిని సాంఘికంగా అభివృద్ధి పరచడం అని కమ్యునిస్టులు ప్రచారం చేశారు. దానికి ముస్లిం నాయకు లంతా తలలాడించేశారు. జిన్నాగారు కూడా పాకిస్తాన్ అంటే మొన్నటి వరకూ స్పష్టం చేయలేదు. పాకిస్థాన్ అంటే ముస్లింల అభివృద్ధికి కృషి చేయడం అనే చాలా మంది ముస్లిం ప్రజలు భావించారు. నేను కూడా అలానే అనుకొన్నాను. అందుకే, జాతీయవాదినైన నేను ముస్లిం లీగులో చేరి ప్రధానమైన బాధ్యతలు నిర్వహించాను. పాకిస్తాన్ అంటే దేశాన్ని రెండు ముక్కలు చెయ్యడం అని జిన్నాగారు స్పష్టపరిచేదాకా నేనూ, నాలాంటి అనేక మంది జాతీయ భావాలు గల దేశభక్తులైన ముస్లిం సోదరులూ అదే భ్రాంతిలో ఉన్నాం.

"ఫైట్ ఫర్ పాకిస్తాన్ ఈజ్ ఫైట్‌ఫర్ ఇండియాస్ ఇండిపెండెన్స్" (పాకిస్తాన్ కోసం పోరాడటమే భారత స్వాతంత్ర్యం కోసం పోరాడటం) అనే మొన్నటి వరకూ లియాఖత్ అలీఖాన్‌గారు కూడ చెపుతూ వచ్చారు. మా అందరి భ్రాంతి మొన్నటితో

(1945 జులై సిమ్లా కాన్ఫరెన్సుతో) విడిపోయింది. పాకిస్తాన్ అంటే దేశవిభజన అని స్పష్టపడి పోయింది. దేశాన్ని రెండు ముక్కలు చేయడం మొత్తం భారత జాతికే గాక, ముస్లింలకు కూడా తీరని అపకారం చెయ్యడమే. శాశ్వతమైన కీడును కలిగించడమే. ఏదో కొద్దిమంది జనాబ్‌ల ప్రాభవాడంబరాల కోసం, కోట్ల కొలది పేద ముస్లింలకు ఘోరమైన అన్యాయం చెయ్యడమే. ఈ విషయంలో నా కే మాత్రం సందేహం లేదు. అందుకే, పాకిస్తాన్ డిమాండ్ లోని నిజస్వరూపం నాకు గోచరించిన తక్షణమే నేను ముస్లింలీగు సభ్యత్వానికి రాజీనామా చేశాను. ముస్లిం ప్రజానీకానికి పాకిస్తాన్ వాదం తీరని అపకారం కలిగిస్తుంది. ముస్లింల భవిష్యత్తును నాశనం చేస్తుంది. ఏదో, ఎక్కడో కొద్దిపాటి భూభాగం ముస్లింల వాటాకు వస్తే రావచ్చు. ఎక్కడో, ఏదో కొద్దిమంది ముస్లిం నాయకుల అహంకారానికి మేత దొరికితే దొరక వచ్చు. కాని, జనాబ్ జిన్నాగారి కోరిక ఫలించి, దేశం ముక్కలై పాకిస్తానే ఏర్పడితే – అసంఖ్యాకులైన ముస్లిం ప్రజలు, సుప్రసిద్ధమైన, సువిశాలమైన భారత ఉపఖండాన్ని శాశ్వతంగా పోగొట్టుకున్న వారవుతారు. అటువంటి దుష్టచర్యతో నేను సంబంధం పెట్టుకో దలుచుకోలేదు. అందుకే ముస్లిం లీగు నుంచి బయటకు వచ్చేశాను.

"హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు, బౌద్ధులు, జైనులు, సిక్కులు, బ్రహ్మ సామాజికులు, ఆర్యసామాజికులు – ఈ విధంగా అనేక వర్గాల వారు చిరకాలంగా భారతదేశంలో ఇరుగు పొరుగున అన్నదమ్ముల వలె కలిసి మెలసి నివసిస్తున్నారు. అలాగే ఎల్లప్పుడూ కలసి ఉండాలనే నా కోరిక. తత్కాలికమైన కష్టాలు, నష్టాలు, కలహాలు, కావేషాలు ఒక పురాతన జాతిని శాశ్వతంగా విడదీయకూడదు. అలాంటి కలహ కావేషాలు మతాల మధ్యే కాదు... కులాల మధ్య, కుటుంబాల మధ్య, స్వంత అన్నదమ్ముల మధ్య కూడా ఏర్పడుతూనే ఉంటాయి. అంతమాత్రం చేత దేశాన్ని ముక్కలు చేస్తాం అనడం అన్యాయం. క్రైస్తవులు, హిందువులు కలిసి బ్రతకడం లేదా ? శతాబ్దాల పాటు హిందువులు ముస్లింలు కలిసి బ్రతక లేదా ? దేశాన్ని విభజింప వలసిన అవసరం ఇప్పుడేం వచ్చింది ?

"అందువల్ల జనాబ్ జిన్నాగారి వాదంతో నేను కాదు మతి ఉన్న ఏ ముస్లిం సోదరుడు కూడా అంగీకరించడు. అంగీకరించలేడు. దేశభక్తుడైన ఏ భారతీయుడూ

అట్టి దుశ్చర్యను సహించలేడు. మనమంతా కలిసి బ్రతుకుదాం. దేశాభ్యుదయం కోసం కలిసి కృషి చేద్దాం. అందుకు ముందుగా కాంగ్రెసువారి క్విట్ ఇండియా తీర్మానం అమలు జరుగవలసి ఉంది. దేశం నుంచి విదేశీ పాలకులు వైదొలగ వలసి ఉంది. అందు నిమిత్తం మనమంతా ఏకైక జాతీయ సంస్థ అయిన కాంగ్రెసును బలపరచవలసి ఉంది".

ఈ ధోరణిలో సాగింది ఆ కాలంలో డాక్టరు ఖాను రాజకీయ ప్రచారం.

★★★

5. ముస్లింలకు తెలుగే మాతృభాష

కేవలం తెలుగు రాని ముస్లింలతో మాట్లాడవలసి వచ్చినపుడు మాత్రమే డాక్టరు ఖాను ఉరుదూ భాషను ఉపయోగించేవాడు. తక్కిన సమయాలలో ఆయన స్వచ్ఛమైన తెలుగునే మాట్లాడేవాడు. ఆయన ఉపన్యాసాలన్నీ తెలుగులోనే సాగాయి.

నిజానికి తెలుగు దేశంలో ఉన్న ముస్లిం లందరికీ తెలుగే మాతృ భాష. అలానే ఏ రాష్ట్రంలో ఉన్న ముస్లింలకు... ఒక్క ముస్లింలకే కాదు, ఏ మతం వారికైనా సరే... ఆ రాష్ట్ర భాషే మాతృభాష.

ఉరుదు దేశ భాష కాదు. ఏ రాష్ట్ర ప్రజలకూ అది మాతృభాష కాదు.

పూర్వం మధ్య ప్రాంతం నుంచి పారసీకులు, తురుష్కులు, అరబ్బులు వంటి పరభాషీయులు భారత దేశంపై దండెత్తి వచ్చి, ఇక్కడ రాజ్యాలు నెలకొల్పుకొన్న ఆ రోజుల్లో... దైనందిన ప్రజావ్యవహారాల నిర్వహణ కోసం, స్వదేశీ, విదేశీ పదాల సమ్మిశ్రణంతో ఒక కొత్త భాష ఏర్పడ్డది. అది అటు విదేశీ భాషా కాదు, ఇటు స్వదేశీ భాషా కాదు. భారతదేశానికి వచ్చి భారతీయులుగా నిలచిపోయిన మధ్య ప్రాచ్యుల రాజరికాలకు పరిపాలనా భాషగా ఆ మిశ్రభాష అభివృద్ధి పొందింది.

ఆ మిశ్ర భాష నుంచే విధేశీ లిపితో, విదేశీ పదజాల ప్రాబల్యంతో హిందుస్తానీ ఏర్పడింది. నిజానికి ఈ రెండు భాషల స్వరూపం మొత్తం మీద ఒకటే. ఈ రెండూ కూడా సిసలైన దేశభాషలు కావు. ఢిల్లీ చుట్టు ప్రక్కల పరిపాలనా సంబంధంగా ప్రచారంలో ఉన్న ఈ భాషలు, రాజ్యోద్యోగులతో పాటు దేశం

నలుమూలలకూ విస్తరించిన మాట నిజమే. అంత మాత్రం చేత అవి ఎవరికీ మాతృభాషలు కాలేవు.

ఈనాడు ఇంగ్లీషు భాష భారతదేశం లోని ఏ రాష్ట్ర ప్రజలకూ మాతృభాష కానట్టే, ఉరుదు కూడ కాదు. అందువల్లనే... ఈ వైజ్ఞానిక కాలంలో కూడా ఇంకా మతాచార మూఢులుగా ఉన్నవారిని అలా ఉంచేస్తే – ఏ రాష్ట్రంలో ఉన్న ముస్లింలకు ఆ రాష్ట్రభాషే మాతృభాష. ఈ సత్యం ద్రావిడ భాషా కుటుంబానికి చెందిన దక్షిణాది రాష్ట్రాలలో ఇంకా స్పష్టంగా కనిపిస్తున్నది.

తెలుగు దేశంలో నివసిస్తున్న మహమ్మదీయు లంతా తెలుగు ప్రజలే. వారికి తెలుగు భాష క్షుణ్ణంగా రావాలి. తక్కిన దక్షిణాది రాష్ట్రాల లోని ముస్లింలకు ఆ రాష్ట్ర భాషలు తప్ప ఉరుదు భాష రానే రాదు.

మతం వేరు. భాష వేరు. వ్యక్తి ఏ మత విశ్వాసాలు కలిగి ఉన్నా, ఏ సంప్రదా యాలను అనుసరించినా, భగవంతుణ్ని ఏ రూపంలో ధ్యానించినా, తాను ఏ నేలలో పుట్టాడో ఆ నేలకు స్వభావ సిద్ధమైన భాషలో అట్టి అనుష్ఠానాన్ని జరిపినప్పుడే, దానికి ఆత్మీయత సిద్ధించి పరమాత్మీయత లభిస్తుంది. భాషకు ప్రాధాన్యం ఇచ్చేవారికి మతం అప్రధానం. మతానికి ప్రాధాన్యం ఇచ్చేవారికి భగవంతుడు అప్రధానం. భగవంతుడికే ప్రాధాన్యం ఇచ్చేవాడికి కులం, మతం, భాష, దేశం వంటి వన్నీ అప్రధానాలే.

తన మాతృభాష అయిన తెలుగులో మంచి ప్రవేశాన్ని సంపాదించిన డాక్టరు ఖాను అచిరకాలం లోనే తెలుగు ప్రజల, నాయకుల అభిమానాన్ని చూరగొన గలిగాడు.

"ఆంధ్రదేశంలో తెలుగులో నావలె మాట్లాడగల వాడివి నీవొక్కడవే !" అంటూ వేదిక మీదనే కొగిలించు కొన్నాడు, ఆయనను మహాకవి ఉమర్ ఆలీషా... ఒకసారి బాపట్లలో ఒక సభలో. ఉమర్ ఆలీషా మహాకవి, మహావక్త. ఆ రోజులలో ఉపన్యాస ధోరణిలో ఆయనను మించినవారు నిజంగానే లేరు.

సంకుచిత మత రాజకీయాల నుంచి వైదొలగి, స్వచ్ఛమైన ఇస్లాం సిద్ధాంతాలను అనుసరిస్తూ, జాతీయోద్యమంలోకి ఉరికాడు కనుక... అకలంక దేశభక్తుడుగా, దేశదాస్య విమోచనా రణయోధుడుగా ప్రఖ్యాతి గడించాడు కనుక...

అప్పటి రాష్ట్ర కాంగ్రెసు అగ్రనాయకులైన అయ్యదేవర కాళేశ్వరరావు, భోగరాజు పట్టాభి సీతారామయ్య, ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం, వి.వి.గిరి, కళావెంకట్రావు, ఆచార్య రంగా, తెన్నేటి విశ్వనాధం, పళ్లంరాజు, కడప కోటిరెడ్డి, గొట్టిపాటి బ్రహ్మయ్య, మాగంటి బాపినీడు, వేముల కూర్మయ్య, బి.యన్.మూర్తి, అల్లూరి సత్యనారాయణ రాజు వంటి వారి ప్రశంసలకు పాత్రమైనాడు డాక్టరు ఖాన్.

★★★

6. పార్టీల పతనాలూ, హేతువులూ

కాంగ్రెసు నాయకులూ, కార్యకర్తలూ అంతా జైళ్ళ నుంచి విడుదలై వచ్చి, తిరిగి జాతీయోద్యమం ఉవ్వెత్తున విజృంభిస్తున్న తరుణంలో 1947లో సార్వత్రిక ఎన్నికలు తలపెట్టబడినాయి.

రెండవ ప్రపంచ యుద్ధంలో మిత్ర మండలి గెలిచింది. అయినా బ్రిటన్‌కు విజయోత్సవం లేకుండా పోయింది. ఆయుధాలతో సాయుధులైన శత్రులోకాన్ని నిర్జించగలిగిన బ్రిటన్ భారతదేశంలో నిరాయుధమైన స్వాతంత్ర్యోద్యమాన్ని ఏమీ చెయ్యలేక పోయింది.

కాంగ్రెసు వారి క్విట్‌ఇండియా తీర్మానానికి బ్రిటన్ ఇక తల ఒగ్గక తప్పదేమో అన్న పరిస్థితి అది.

ఒక ప్రక్క నేతాజీ ఆజాద్ హింద్ ఫౌజ్, మరొక ప్రక్క ఐ.యన్.యస్. తిరుగుబాటు, ఇంకొక ప్రక్క షానవాజ్, ధిల్లాన్ ప్రభృతుల విచారణ. అదే సందర్భంలో జవహర్‌లాల్ నెహ్రూ, భులాభాయిదేశాయి వంటి మేధావులు నాదబలం. దేశం నిండా స్వాతంత్ర్యోద్యమం, ప్రజావాహిని పొంగు... ఈ పరిస్థితులలో జరిగినాయి ఆ ఎన్నికలు.

ఆ ఎన్నికల సందర్భంలో కాళేశ్వరరావుగారు డాక్టరు ఖానుకు కబురు చేసి, కృష్ణాజిల్లా ముస్లిం నియోజకవర్గం నుంచి కాంగ్రెసు తరపున శాసన సభకు నిలబడ వలసిందిగా కోరారు.

అందుకు ఖాను ఒప్పుకోలేదు.

తనకు పదవీ వ్యామోహం లేదనీ, అయినప్పటికీ ముస్లిం నియోజక వర్గం నుంచి కాంగ్రెసు గెలవడం సాధ్యం కాదనీ కాళేశ్వరరావుగారికి ఆయన చెప్పాడు.

అప్పటికి ముస్లింలకు ప్రత్యేక నియోజకవర్గపు పద్ధతి ఉంది. ముస్లిం నియోజక వర్గం నుంచి నిలబడే అభ్యర్థిని ముస్లిం ఓటర్లు మాత్రమే ఎన్నుకోవలసి ఉంది. హరిజనులకు కూడ ప్రత్యేక నియోజకవర్గ పద్ధతి ఉంది. అది పాక్షిక మైనట్టిది.

పాక్షికపు పద్ధతిలో జాతీయవాది అయిన హరిజన అభ్యర్థి కాంగ్రెసు తరపున ఎన్నిక కావడానికి వీలుంది. ముస్లింల విషయంలో అట్టి వీలు లేదు.

నూటికి తొంభై మంది ముస్లింలు ముస్లిం లీగు యొక్క దుష్ప్రచారత వ్యామోహంలో ఉన్నవాళ్ళే. అందువల్ల అక్కడ కాంగ్రెసు అభ్యర్థి గెలిచే అవకాశం లేదు. ఓడిపోవటం తప్పదని తెలిసి కూడా రంగంలో దిగడం అవివేకం. ఈ విషయా లన్నీ కాళేశ్వరరావుగారికి డాక్టరు ఖాను వివరించి చెప్పాడు.

డాక్టరు ఖాను అంచనా నిజమే. దానిని కాళేశ్వరరావుగారు ఆమోదించడమూ విజ్ఞతే.

అయితే నిజమైన అంచనాలను, సక్రమమైన నిర్ణయాలను అమలు జరుగ నివ్వరు అనుచరులు. తమ తమ స్వార్థాలతో నాయకుల నిర్ణయాలను కలుషితం చేసి, నిజాయితీ పరులను త్రోసిరాజని, తాము ముందుకు వస్తూ ఉంటారు చాలా మంది.

ఎంత బలమైన పార్టీలైనా విచ్ఛిన్నమై పోవడానికి, ఎంత ప్రజ్ఞావంతుడైన నాయకుడైనా పతనమై పోవడానికి అనుచరుల స్వప్రయోజన కాంక్షా ప్రాబల్యమే ప్రధాన హేతువు.

అలానే జరిగింది అప్పుడు కూడా – డాక్టరు ఖానును, కాళేశ్వర రావుగారిని కూడా గాదని – ముస్లిం సీటుకు కాంగ్రెసు అభ్యర్థి నిర్ణయించబడటం, అపజయం పొందటం కూడా జరిగిపోయిం దప్పుడు.

ఆ ఎన్నికలలో కాంగ్రెసు తరఫున చాలా తీవ్రమైన ప్రచారం చేశాడు డాక్టరు ఖాను. ముఖ్యంగా ఆ ప్రచారంలో చాలా భాగం ముస్లిం ప్రజలలో జరిగింది.

ముస్లిం ప్రజలలో జాతీయ భావాన్ని రేకెత్తించడానికి, జిన్నాగారు పన్నిన మతోద్రేక వాగురుల నుంచి ముస్లిం ప్రజానీకాన్ని విముక్తుల్ని చేయడానికి తగినంత మంది ముస్లిం కార్యకర్తలు, ప్రత్యేక ప్రచారకులు ఆనాడు కాంగ్రెసుకు లేరు. నిజానికి నేటికీ లేరు.

అసహాయ వీరుడుగా డాక్టరు ఖాను చేసిన త్యాగం, ముస్లింల పట్ల కాంగ్రెసు వారికి కల అభిమానాన్ని పెంచగలిగిందే కాని, కాంగ్రెసు వారికి మాత్రం ముస్లిం ఓట్లను ఎక్కువగా తేలేకపోయింది.

ఆ రోజుల్లో హరిజన ప్రజల పరిస్థితి కూడా ఒక విధంగా అలాంటిదే.

రాష్ట్ర కాంగ్రెసు ఆర్గనైజరుగా ఉన్నాను నే నప్పుడు. హరిజన ప్రజల్లో కాంగ్రెసు లక్ష్యాలను ప్రచారం చేసి, అసంఖ్యాకంగా వారిని కాంగ్రెసు సంస్థలో చేర్చడం అప్పటి నా లక్ష్యం. హరిజనులకు ప్రత్యేక కాలనీల పద్ధతి కావాలన్న డాక్టర్ అంబేద్కర్ గారి విధానం ఫలకారి కాదని జాతీయ సమైక్యం కోసం పోరాడిన కొద్దిమంది ఆంధ్ర జాతీయ వాదుల్లో నే నొకణ్ని.

వేముల కూర్మయ్య, బి.యస్. మూర్తిగార్ల అగ్రనాయకత్వం క్రింద, హరిజన ప్రజాబాహుళ్యంలో కాంగ్రెసు ప్రచారం బాగానే జరిగింది. కాని, సామాన్య హరిజన ప్రజలలో మాత్రం కాంగ్రెసు పట్ల సంపూర్ణ విశ్వాసం ఏర్పడి ఉండలేదు. అందుకు కారణం స్థానిక కాంగ్రెసు నాయకుల వైఖరి.

ప్రతి గ్రామంలోను హరిజను లున్నారు. కులాల వారిగా చూస్తే, మొత్తం గ్రామంలో ఉండే అన్ని కులాల్లోను హరిజనులే మెజారిటీ కులం. అయినా - అంటరానితనానికీ, కులతత్వ దౌర్జన్యానికీ, నిర్బంధ దాస్యానికీ, నిరంతర దారిద్ర్యానికీ ఇతర కులాల చేత వాళ్ళు గురిచేయ బడుతూనే ఉన్నారు. దైనందిన జీవితంలో ప్రతి క్షణమూ ప్రత్యక్షంగా ఇంతగా పీడిస్తున్న స్థానిక నాయకులు కాంగ్రెసు తరఫున నాయకులుగా తయారైనపుడు, గాంధీజీ సిద్ధాంతాలను ఒక అక్షరమైనా అమలు

పరచడానికి విముఖులుగా ఉంటున్నప్పుడు, చూస్తూ చూస్తూ ఆ పీడిత ప్రజలు కాంగ్రెసును ఎలా బల పరచగలరు ?

★★★

7. జిన్నా - అంబేద్కరు

ఆ ఎన్నికలలో ముస్లిం వోటర్ల వైఖరీ, హరిజన వోటర్ల వైఖరీ ఒకే విధంగా ఉన్నట్లు కనిపించినా రెండు వైఖర్లూ రెండు విరుద్ధ మార్గాలలో ప్రవహించి, ఒకటి దేశ విభజనకు, మరొకటి జాతి సమైక్యతకూ హేతు భూతమైనవి.

మత మూర్ఖత గల ప్రజల బలంతో, అంతకు మించి బ్రిటీష్‌వారి అండ దండలతో జిన్నాగారు తమ పట్టుదల వదలక, దేశాన్ని ముక్కలు చేసి ముస్లిం ప్రజలకు శాశ్వతమైన భయాన్ని, ఆస్థిరత్వాన్ని తెచ్చిపెట్టాడు, ఆ విధంగా ఆ నాయకత్వం ముస్లింలకు పరాజయ కారణమే అయింది.

సర్వమత సర్వజన సమతా దృష్టి కల ప్రజల బలంతో గాంధీజీ సహకారంతో డాక్టర్ అంబేద్కర్ గారు తమ పట్టును సడలించుకొని, తదితర నాయకులతో సమాధాన పడి, హరిజనులకు ప్రత్యేక సదుపాయాలను సాధించడం ద్వారా, ఒక్క హరిజనుల సత్వరాభివృద్ధికే గాక, మొత్తం జాతి బహు ముఖాభివృద్ధికే ఎంతగానో దోహద కారులయ్యారు.

ఈ పరిస్థితిని, "దేశం మనదే" అన్న భావాన్ని, జనసంఖ్యలో ఇతర కులాల కంటే హరిజనులదే మెజారిటీ కులమన్న సత్యాన్ని, హరిజనుల అభివృద్ధి కోసం గాంధీజీ చేసిన త్యాగాన్ని, తదితర కులాల అగ్రనాయకులు చేస్తున్న నిస్వార్థ సేవని, ప్రత్యక్షంగా వివరించి నిరూపించడం ద్వారా - హరిజన వోటర్ల సహకారాన్ని ఇతోధికంగా మేము కాంగ్రెసుకు సంపాదించి పెట్టగలిగాం.

హిందూ సమాజంలో అనంతంగా ఉన్న క్లిష్ట సమస్యల్లో హరిజన సమస్య ఒకటి. అంటరానితనం పోతే హరిజన సమస్య పోతుంది. అంటరానితనాన్ని తొలగించటానికి దేశం యావత్తూ కంకణం కట్టుకొంది. మహమ్మదీయుల సమస్య అలాంటిది కాదు.

అందువల్లనే పాకిస్తాన్ ఏర్పడి, జిన్నాగారి నాయకత్వం లోని బండారం బయటపడి, భారత ఉపఖండంలో మిగిలిపోయిన కోట్ల కొలది ముస్లింలకు దైన్యం తప్ప మరేదీ లభించకుండా పోయినప్పుడు గాని మహమ్మదీయులలో అధిక సంఖ్యాకులు కళ్ళు తెరువలేకపోయారు.

అందువల్లనే - అ ఎన్నికల సంరంభంలో జిల్లా లన్నిటి లోనూ పర్యటిస్తున్న డాక్టరు ఖానును పిలిపించి, ఎన్నికల పరిస్థితులను గురించి, ముస్లిం వోటర్ల వైఖరిని గురించి ప్రకాశం పంతులుగారు ప్రశ్నించినప్పుడు కూడా మహమ్మదీయుల వోట్లు కాంగ్రెసుకు రావు అని ఆయన చెప్ప గలిగాడు.

"నీవు ధైర్యంగా సత్యం చెప్పినందుకు సంతోషిస్తున్నాను. ముస్లిం వోట్లు మనకు బాగానే వస్తాయని మన కార్యకర్తలు ఎంతో మంది చెపుతున్నప్పటికీ నేను నమ్మలేదు. కాంగ్రెసు దృక్పథాన్ని, జాతీయ నిర్మాణ కార్యక్రమాన్ని గురించి ముస్లింలలో ఎక్కువగా ప్రచారం జరుగలేదు. జిన్నాగారి మాయలో పడటంలో వాళ్ళ తప్పేమీ లేదు. ఆ మాయ నుంచి వాళ్ళను కాపాడే నిమిత్తం వాళ్లకు దేశకాల పరిస్థితుల్ని, కాంగ్రెసు సిద్ధాంతాల్ని, అది చేయబోయే అభివృద్ధి కార్యక్రమాలను గురించి వివరించే ప్రయత్నం ఇంతవరకూ మనం ఏం చేశాం ?" అన్నారు ప్రకాశం పంతులుగారు ఆయనతో అప్పుడు.

ప్రకాశంగారి వద్ద డాక్టరు ఖాను మూడు రోజుల పాటు ఉన్నాడు. అది తన జీవితంలో మరపురాని ఘట్టమని ఇప్పటికీ అంటూ ఉంటా డాయన... తళ తళమనే కళ్లని జేబురుమాలుతో ఒత్తు కొంటూ.

"ఓరే ! చొక్కాలు లేవు. రేపు నేను ఢిల్లీ వెళ్ళాలి. రెండు చొక్కాలు కుట్టించు" అని అప్పుడే అక్కడకు వచ్చిన ఒక యువ కాంగ్రెసువాదితో అన్నారు పంతులు గారు. వెంటనే ఆ కాంగ్రెస్ మిత్రుడు సాయంత్రానికే తెస్తానంటూ వెళ్ళిపోయాడు. అక్కడే ఉన్న నన్ను చూచి ఒక కాగితాన్ని అందిస్తూ... "ఓరే ! ఈ టెలిగ్రాం గాంధీజీ గారికి ఇచ్చిరా..." అన్నా రాయన. నేను వెంటనే దాన్ని అందుకొని, కళ్ల కద్దుకొని పోస్టాఫీసుకు పరుగెత్తాను.

"హై కోర్టు న్యాయవాదుల్లో అంతవాడు లేడనిపించుకొని, లక్షలార్జించి

తమ సమస్తాన్ని దేశమాత పాద పద్మాలకు సమర్పించి, శిబి, దధీచుల వంటి మహాత్ములను మించిన త్యాగాలు చేసి, దేశదాస్య విమోచన సమరమధ్యంలో సతమతమై పోతున్న ఈ మహానాయకుడికి, ఈ మాత్రం సేవైనా చేసే భాగ్యం నాకు లభించింది కదా అని, ఆ రోజున ఎంత ఆనందంతో నేను తలమున్నలైపోయానో ఈ నాటికీ జ్ఞాపకం ఉంది" అంటాడు డాక్టరు ఖాను ఆ ప్రస్తావన వచ్చినప్పుడల్లా.

ఆనాటి నుంచీ చివరి వరకు కూడా, పంతులుగారు డాక్టరు ఖాను పట్ల వాత్సల్య పరినిష్ములుగానే ఉన్నారు.

ఆ ఎన్నికల సందర్భంలోనే ఒక మూడు రోజుల పాటు డాక్టరు ఖానుతో ఉండి, ఆయన ఏర్పాటు చేసిన ముస్లిం సభలలో పాల్గొని, ఆంధ్ర కేసరి తమ అగ్ర నాయకత్వాన్ని బహుముఖం చేసుకొన్నారు.

★★★

8. ముస్లింలు - వక్ఫ్ సంస్థలు

ఎన్నికలలో కాంగ్రెసు గెలిచింది.

ప్రకాశం పంతులుగారి నాయకత్వం క్రింద మద్రాసులో కాంగ్రెసు మంత్రి వర్గం ఏర్పడింది. అవన్నీ చరిత్ర ప్రసిద్ధమైన విషయాలే. అందరికీ తెలిసిన విషయాలే.

1947 ఆగష్టు 15తో దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం లభించింది. అంత త్వరగా స్వాతంత్ర్యం వస్తుందని ఎవరూ ఊహించక పోవడం వల్ల, చివరకు కాంగ్రెసు నాయకులు కూడా అనుకోకపోవడం వల్ల, దాని వల్ల ఏర్పడే కష్టసుఖాలను ఎదుర్కొనడానికి దేశం సర్వసన్నద్ధంగా ఉండలేదు. స్వాతంత్ర్య సంతోషంతో పాటు దేశవిభజన దుఃఖం ప్రజల్ని అల్లకల్లోల పరిచింది.

పాకిస్తాన్ వల్ల భారతీయ ముస్లింలకు లాభం కలుగకపోగా అది ఎంతో నస్టాన్ని తెచ్చిపెట్టింది. అందువల్ల బెజవాడలో ఉన్న ముస్లింలీగర్లు ఆనాడు డాక్టరు ఖాను పట్ల ప్రదర్శించిన దౌర్జన్య వైఖరికి పశ్చాత్తాప పడసాగారు. వారికి ఆయన

పట్ల స్నేహసంబంధాలు అంతగా తిరిగి ఏర్పడక పోయినా, విరోధభావం మాత్రం చాలా వరకు తొలగిపోయింది. అంతటితో ఆయన బెజవాడలో ఉన్న తన ఆస్పత్రిని మళ్ళీ తెరవసాగాడు.

అభ్యుదయ భావాలు కల ముస్లిం యువకులలో ఎప్పుడైతే జిన్నా వ్యామోహం, కమ్యూనిస్టుల గారడీ ప్రభావం తొలగిపోవటం ప్రారంభమైందో డాక్టరు ఖాను జాతీయ నాయకత్వంపైని వారికి విశ్వాసం కుదరసాగింది. అప్పుడే ఆయన దేశంలోని జాతీయ ముస్లిం శక్తులను సమీకరించి, ఒక జాతీయ ముస్లిం రాజకీయ సంస్థను ఏర్పాటు చేయ గలిగాడు. జాతీయ ముస్లిం నాయకుడుగా సుస్థిరకీర్తిని పొందగలిగాడు. ఆయన నాయకత్వం క్రింద జాతీయ ముస్లిం మహాసభ ఆ తర్వాత సాధించిన విజయాలు అద్వితీయ మైనట్టివి.

హిందూ ముస్లిం సమైక్యతకు, హరిజనోద్ధరణకు, కార్మికాభ్యుదయానికి, సహకారోద్యమ వికాసానికి, గాంధీజీ నిర్మాణ కార్యక్రమం లోని వివిధ ప్రణాళికల నిర్వహణకు, వక్ఫ్‌సంస్థ పునరుజ్జీవనానికి డాక్టరు ఖాను ఎంతో కృషి చేశాడు.

హిందూ ధర్మాదాయ దేవాదాయ సంస్థ వంటిదే, ముస్లిం ధర్మాదాయ దేవా దాయాలకు చెందిన వక్ఫ్‌సంస్థ. ముస్లిం ప్రజల సాంఘిక, మత, వైజ్ఞానిక పురోభి వృద్ధికి వినియోగించడం కోసం ఏర్పాటైన నిధులే ముస్లిం దేవాదాయ ధర్మాదాయ నిధులు. ఉదారులైన ముస్లిం ధనవంతులు బహూకరించిన ఆస్తులతోనూ, కేటాయిం చిన ధనంతోనూ ఈ నిధులు ఏర్పడ్డాయి.

ఈ నిధులన్నీ సక్రమంగా ఉపయోగించడం కోసం నియమింపబడ్డ ధర్మకర్తలు వాటిని తరచు దుర్వినియోగం చేస్తూ ఉండడం వల్ల వాటిపై ప్రభుత్వం వారి అజమాయిషీ అవసరమైంది. అట్టి అజమాయిషీ కోసం ఉద్దేశించబడినట్టిదే వక్ఫ్‌బోర్డు.

"ముస్లిం ప్రజల సర్వతోముఖాభివృద్ధి కోసం ఆయా దాతలు చేసిన దాన ధర్మాలివి. ఏ మహదాశయంతో ఈ ధర్మనిధులు సమకూర్చబడ్డాయో అట్టి మహదాశయాన్ని అర్థం చేసుకోలేని స్వార్థపరులు ఆ నిధులకు ధర్మకర్తలై, ఆశయాలను

మంట కలిపి, ఆత్మ ప్రాగ్రల్భ్యానికి వాటిని వాడుకో సాగారు. పేద ముస్లింల ఆలనా పాలనా కూడా జరగలేదు. ఆ అన్యాయాన్ని, అధర్మాన్ని, అదైవిక విధానాన్ని భరించ లేని ముస్లిం ప్రజలు ఆందోళన జరిపి, ప్రభుత్వ దృష్టిని ఇటు మళ్ళించగలిగారు. తత్ ఫలితంగానే అప్పటికి తొలిసారిగా అధికారంలోకి వచ్చి ఉన్న కాంగ్రెసు ప్రభుత్వం 1938 వక్ఫ్ బిల్లును ప్రతిపాదించింది. ఆ తర్వాత 1954లో పార్లమెంటుచే ఆమోదించబడి యావత్ భారతానికి అది చట్టమైంది" అన్నాడు డాక్టరు ఖాను ఈ విషయంలో మాటాడుతూ.

1938లో ముస్లిం దేవాదాయ ధర్మాదాయ ఆస్తులను, అనగా ముస్లిం వక్ఫ్‌లను తన అజమాయిషీ కిందకు తెచ్చుకోవడానికి మద్రాసు ప్రభుత్వం ఒక బిల్లును రూపొందించడం దగ్గర నుంచీ - 1954లో కేంద్ర ప్రభుత్వం యావత్ దేశానికి వర్తించే చట్టాన్ని నిర్మించడం వరకు - జరిగిన నిరంతర కృషిలో డాక్టరు ఖాను నిర్వహించిన పాత్ర అతిప్రధాన మైనట్టిది. ఆంధ్ర కాంగ్రెసు సభ్యుడుగా ఉంటూ, జాతీయ ముస్లిం నాయకుడుగా ఉంటూ, ఇటు ప్రభుత్వంలోనూ, అటు ముస్లిం లోను కూడా అత్యధికమైన పలుకుబడి కలిగి ఉన్నందు వల్ల, తోటి ప్రధాన నాయకుల సహకారంతో ముస్లిం వక్ఫ్‌లకు సుస్థిరమైన ఒక వ్యవస్థను సాధించి పెట్టగలిగాడు ఆయన.

ఈ విషయంలో డాక్టరు ఖాను చేసిన కృషి ఎంతో నిర్మాణాత్మకమైనట్టిది. దేశం యావత్తూ తిరిగి, ముఖ్యంగా ఆంధ్రదేశం నలుమూలలా పర్యటించి వక్ఫ్ ఆస్తులకు సంబంధించిన వివరా లన్నిటినీ సేకరించా డాయన. ఆయన సేకరించిన వివరాలతో ఒక నివేదికను తయారుచేసి ప్రభుత్వానికి సమర్పించాడు.

ఆయన సేకరించిన వివరాలను బట్టి ఆంధ్ర ప్రాంతంలో 3,483 ముస్లిం వక్ఫ్ సంస్థలు ఉన్నాయి. అందులో 1,350 మసీదులు, 1,535 పీర్ల పంజాలు, 330 దర్గాలు, 142 ఈద్‌గాలు, 43 ధర్మశాలలు, 12 పవిత్ర స్థలాలు, 69 మర్హూతులు, ఘుద్మతులు. వీటికి 66,200 ఎకరాల సేద్యయోగ్యమైన భూములు ఉన్నాయి. సుమారు నాల్గువేల బిల్డింగులు ఉన్నాయి. ఈ ఆస్తుల విలువ మొత్తం మీద నాలుగున్నర కోట్ల రూపాయలు. ఈ ఆస్తులపై సాలీనా వచ్చే నికరాదాయం పది లక్షల రూపాయలు అప్పటిలో.

ఇంత ఆస్తీ, ఇంత ఆదాయం ఉన్న ముస్లిం వక్ఫ్‌లు, అప్పటికి ఎంత అస్తవ్యస్తంగా, అక్రమంగా, అదుపూ ఆజ్ఞా లేకుండా నిర్వహించ బడుతున్నాయో డాక్టరు ఖాను ప్రభుత్వానికి వివరించి చెప్పాడు. 1954 చట్టం క్రింద తెలంగాణాలో ఏర్పడిన వక్ఫ్‌బోర్డు కూడా, ప్రజలతో సంబంధం లేని పెద్దల చేతుల్లో పడి, ఎలా నిరర్థకమై పోయిందో వివరించి.. తెలంగాణా వక్ఫ్‌బోర్డును రద్దు చెయ్యాలనీ, మొత్తం ఆంధ్ర ప్రదేశ్ అంతకూ ఒకే ఒక బోర్డును ప్రజాసేవా పరాయణులైన జాతీయ ముస్లిం పెద్దలతో పునర్నిర్మించాలనీ ఆయన ప్రభుత్వాన్ని కోరాడు.

అప్పటికి ముఖ్యమంత్రిగా ఉన్న దామోదరం సంజీవయ్యగారు, దేవాదాయ మంత్రిగా ఉన్న అనగాని భగవంతరావుగారు, డాక్టరు ఖానుగారి కృషిని, పట్టుదలను ఎంతగానో ప్రశంసించారు. ఆనాటి పత్రికలు, ప్రజలు, డాక్టరు ఖానుగారి ప్రజాసేవా దీక్షా పరాయణతను బహు విధాల కీర్తించినాయి.

"తెలంగాణలోని ముస్లిం దేవాదాయ ధర్మాదాయాలకు ఒక బోర్డు పనిచేసిన మాట నిజమే. కాని ఈ బోర్డులో జాగీర్దారులను, నవాబులను సభ్యులుగా నియమించడం వల్ల సామాన్య ప్రజానీకానికి ఎట్టి మేలూ జరగ లేదు. ఆ బోర్డు సభ్యులకు దేశాభిమానం గానీ, సాంఘిక సేవా భావం కానీ లేనందువల్ల అవి సక్రమంగా పనిచెయ్యలేదనీ, తోటి ముస్లింలకు వాటి వల్ల ఎట్టి ప్రయోజనమూ సిద్ధించలేదనీ," ఆ బోర్డు కార్యకలాపాలపై విచారణ జరిపిన ఒక అధికారి పేర్కొన్నారు...

వక్ఫ్‌బోర్డులు, ముస్లిం దేవాదాయ సంస్థలను సుసంఘటితం చేయడమే కాకుండా, వాటి ఆదాయంతో ముస్లిం ప్రజలకు ఎంతైనా ఉపకారం చెయ్యవచ్చు...

నిరుద్యోగులైన ముస్లిం సోదరులను ఆదుకోవచ్చు. చిన్న చిన్న పరిశ్రమలను స్థాపించడం, వితంతువులకు సహాయపడటం, విద్యార్థులకు ఉపకార వేతనాలు ఇవ్వడం ముస్లిం చర్యల ద్వారా పేద ముస్లింల సముద్ధరణకు ఈ మతాదాయ సంస్థల ఆదాయాన్ని వినియోగించటం ధర్మం. అయితే ఈ వక్ఫ్‌బోర్డు సభ్యులుగా ప్రజాబాహుళ్యంతో సంబంధం లేని నవాబులనూ, జాగీర్దారులనూ, బ్రిటిష్ వారికి తొత్తులుగా పనిచేసిన వారినీ నియమిస్తే దానివల్ల ఏమీ ప్రయోజనం ఉండదు. జాతీయోద్యమంలో ప్రముఖపాత్ర వహించిన సాంఘికసేవా పరాయణులనూ,

ప్రజానీకంలో పలుకుబడి కలవారినీ, ఈ వక్ఫ్ సంస్థల వ్యవహారాలలో ఆది నుంచి శ్రద్ధ వహించి పనిచేసిన వారినీ సభ్యులుగా నియమిస్తేనే ఈ బోర్డు తన ఉనికిని సార్థకపరుచుకో కలదు" అంటూ తెలుగు దిన పత్రిక ఆంధ్ర జనత తమ సంపాదకీయంలో ఉద్ఘాటించింది.

డాక్టరు ఖాను కృషి ఫలించి, మొత్తం ఆంధ్రప్రదేశ్ అంతకూ ఒకే ఒక వక్ఫ్ బోర్డును ఏర్పాటు చెయ్యడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది 1961లో.

ఆ తర్వాత కొద్ది నెలలకే ఆంధ్రప్రదేశ్ వక్ఫ్ బోర్డు నిర్మాణం జరిగింది. జిల్లా వక్ఫ్ కమిటీల నియామకం కూడా జరిగింది. అందులో ఎక్కడా డాక్టరు ఖాను పేరు లేదు. సరికదా, ఆయన ప్రస్తావన కూడా లేదు !

ఈ వైపరీత్యానికి ఎంతో మంది ప్రజలు ముక్కుపై వేలు వేసుకున్నా - సంపూర్ణ స్వాతంత్ర్య మహోద్యమం నుంచి మంత్రి పదవుల స్వీకరణ వరకూ దేశకాల రాజకీయ పరిణామ పరిస్థితిని అవలోకిస్తున్న వారికి మాత్రం అందులో వింతేమీ కనిపించలేదు.

రాష్ట్ర బోర్డుకే అధ్యక్షుడు అవుతా డనుకొంటున్న డాక్టరు ఖాను సభ్యుడు కూడా కాకపోవటంతో, ఆశావాదులైన ఎంతో మంది మిత్రులు నిరాశావాదులై పోయారు. డాక్టరు ఖాను మాత్రం తన కృషి ఫలించినందుకు ఎంతో సంబరపడ్డాడు. ఆనాడు మిత్రు లందరికీ విందు కూడ చేశాడు. ఈ వక్ఫ్‌బోర్డు నిర్మాణ వార్తను, జిల్లా కమిటీల సభ్యుల పేర్లతో సహా, తన 'ఆజాద్' పత్రికలో ప్రముఖంగా ప్రకటించాడు.

★★★

9. బొండాడలంక వ్యవహారం

ఒక ప్రక్క మత విషయంలో ముస్లిం ధర్మాదాయ సంస్థల పునర్నిర్మాణానికి కృషి చేస్తూనే, మరో ప్రక్క గాంధీజీ ఇచ్చిన నిర్మాణ కార్యక్రమ ప్రణాళికలతో సతమత మవుతూనే, సహకార విధానం ద్వారా వ్యవసాయ కూలీలను సంఘటితపరచి, వారిలో ఆత్మ విశ్వాసాన్ని, స్వయం సేవా పరాయణత్వాన్ని, సంఘబల ప్రాధాన్యాన్నీ

ఉద్బోధించాలనీ, కార్యరూపంలో ఆచరించి చూపాలనీ ఒక నిర్ణయానికి వచ్చి – బొండాడ లంకలో 1946లోనే ఒక ఫీల్డ్ లేబర్ కోఆపరేటివ్ సొసైటీని స్థాపించాడు డాక్టరు ఖాను.

ప్రభుత్వ బంజరు భూముల్ని వ్యవసాయ కూలీలకూ, పేద రైతులకూ ఇప్పించడం, సాముదాయక వ్యవసాయ పద్ధతి ద్వారా ఆ భూముల్ని పండించడం, ఫలితాన్ని అందరూ సమానంగా అనుభవించడం, వ్యవసాయానికి కావలసిన పెట్టుబడి, పరికరాలు మొదలైన వన్నిటినీ సహకార పద్ధతిలో సేకరించడం... ఇవి ఈ సొసైటీ స్థాపనలో గల ముఖ్య లక్ష్యాలు.

తాను స్వయంగా ఈ సొసైటీని నడిపి, వ్యవసాయ కూలీలలోనూ పేద రైతులలోనూ సాముదాయక సహకార వ్యవసాయోద్యమాన్ని ఆదర్శప్రాయంగా అమలు జరిపి చూపించాలనే డాక్టరు ఖాను ఉద్దేశం. అందుకే ఆ సొసైటీకి తానే అధ్యక్షుడైనాడు.

తన లక్ష్యానికి అనుగుణంగా బైలాస్ వగైరాలు రూపొందించి, ఆ సొసైటీ సెక్రటరీతో కలిసి మద్రాసు వెళ్ళి రిజిష్టరు కూడా చేయించుకొచ్చా డాయన. ఎంతో మంది వ్యవసాయ కూలీలను, రైతులను సభ్యులుగా చేర్చాడు. అలా నాలుగు వందల మంది సభ్యులు చేరా రందులో.

అధికాహారోత్పత్తికి ప్రభుత్వం ఎంతో సహాయం చేస్తున్న రోజులవి. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం తాలూకాలో, బొండాడ లంకలో 1,945 ఎకరాల ఏకఖండిక భూమిని ఆ సొసైటీకి సంపాదించాడు. సంఘ సభ్యుల నుంచి సుమారు ఇరవై ఐదువేల రూపాయలు వసూలు చేసి, ఆ మొత్తాన్ని కృష్ణా కోఆపరేటివ్ బ్యాంకులో డిపాజిట్ చేయించాడు.

భూమి యొక్క కొలతలు, మేపులు అన్నీ తయారైనాయి. జిల్లా కలెక్టరును, సహకార సంఘాల రిజిస్ట్రారును కలుసుకోవడం, సలహాలు పొందడం వంటి వన్నీ చురుకుగా సాగదొడగినాయి. సొసైటీ యొక్క వర్కింగ్ కమిటీ, జనరల్ బాడీ సమావేశాలలో నిర్మాణాత్మకమైన, ఉత్తేజ కరమైన ఎన్నో చర్చలు సాగేవి. భవిష్యత్ కార్యక్రమాలు, వాటివల్ల కలిగే సంపద్వైభవాలు గురించి ఖాను వర్ణిస్తూ ఉంటే సభ్యులెంతో ఉత్సాహ భరితు లయ్యేవారు.

అట్టి పరిస్థితిలో, కొందరిలో అసూయా పిశాచం తలెత్తింది. వ్యతిరేక ప్రచారాలు ప్రారంభమైనాయి. ఖానుకు మతిపోయిందని, ఈ పనంతా సాగేదేనా అని, ప్రజల డబ్బు తినెయ్యడానికే ఈ ఎత్తు ఎత్తాడని – సభ్యులలో రహస్య ప్రచారం కొనసాగింది.

సహకార వ్యవసాయోద్యమం ద్వారా కూలీలూ, పేదరైతులూ బాగుపడితే, స్వతంత్రులైతే, తమ కాళ్ళపై తాము నిలబడగల స్థితి ఏర్పడితే – ఇక తమ ఆటలు సాగ వనుకొన్న భూస్వాములు – కూలీలలోనూ, రైతులలోనూ డాక్టరు ఖానువంటి కాంగ్రెసువాదులు పలుకుబడి సంపాదించుకుంటే తమ పార్టీ ప్రాబల్యానికి అధికారం పోతుందనుకొన్న కమ్యునిస్టులు కూడా – సొసైటి సభ్యులలో ఖాను పట్ల వ్యతిరేక భావాన్ని రెచ్చగొట్టారు.

"గాంధీజీకి నిజమైన అనుచరుడవు నీ వొక్కడవేనయ్యా –" అని ఎదర మెచ్చుకొనేవాళ్ళు సైతం వెనుక గోతులు తవ్వేవారే అయినారు.

ఈ పరిస్థితికి ఖాను చాలా బాధపడ్డాడు. రెండు చేతులా ఆర్జించుకునే వైద్య వృత్తి ఉన్నవాడు. మొదటి నుంచీ ఇతరులకు ఇంత పెట్టడమే గాని, ఇతరులది రవ్వంతైనా తినడం చేతకానివాడు. ఇచ్చే కుటుంబం నుంచి వచ్చినవాడు. పుచ్చు కోవడం ఎరగనివాడు. అటువంటి వాడు ఎటువంటి దుష్ప్రచారాన్నయినా ఎలా సహించగలడు ?

గొర్రె గొర్రెల వాడిని నమ్మదన్నట్లు – ప్రజాభ్యుదయాన్ని కోరే నిజమైన నాయకుణ్ని ప్రజలు నమ్మరు.

అందుకే డాక్టరు ఖాను ఆ సొసైటీ అధ్యక్ష పదవికి రాజీనామా పెట్టాడు.

సభ్యుల నుంచి వసూలైన డబ్బు పైసలతో సహా బ్యాంకులో ఉంది. చట్టరీత్యా సొసైటీకి చేయవలసిన ఖర్చులు కూడా తన స్వంత డబ్బు నుంచే పెట్టాడు. సొసైటీ డబ్బును వాడనే లేదు. సొసైటీ రిజిస్ట్రేషన్ కోసం వెళ్ళినప్పుడు కూడా తన ఖర్చంతా తానే పెట్టుకొన్నాడు. స్టేషనరీ కూడా తన డబ్బుతోనే కొన్నాడు. ఎందుకూ, ఎప్పుడూ సొసైటీ డబ్బును ఒక్క పైసా కూడా వాడలేదు. ఈ విషయాలన్నీ సభ్యులకు చెప్పి, తన వద్ద కల రికార్డులను, బ్యాంకు పుస్తకాల్ని అప్పగించేసి చేతులు కడుక్కొన్నాడు.

బ్యాంకులో 25 వేల రూపాయలు, చేతిలో 1,945 ఎకరాల లంక భూమి. ఎవరు వదలుకొంటారు – నిస్వార్థసేవా పరతంత్రుడైన డాక్టరు ఖాను వంటివారు తప్ప ?

డాక్టరు ఖాను రాజీనామాను ప్రేరేపించిన మరొక సంఘటన ప్రకాశం పంతులుగారు ముఖ్యమంత్రి పదవి నుండి దింపివేయబడడం.

అప్పటి మద్రాసు ప్రభుత్వంలో వేముల కూర్మయ్యగారు హరిజన సంక్షేమ మంత్రిగా ఉండి – అనేకమైన చట్టాలూ, శాసనాలు చేస్తూ, అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తూ, హరిజనాభివృద్ధికీ, వెనుకబడిన తరగతుల అభ్యుదయానికీ ఎంతో కృషి చేస్తున్న రోజులవి. బొండాడ లంక సొసైటీలో ఎక్కువమంది సభ్యులు హరిజనులే. తాను సొసైటీ అధ్యక్ష పదవికి రాజీనామా ఇచ్చినప్పటికీ, సొసైటీ అభివృద్ధే తన ధ్యేయం కనుక – మద్రాసు వెళ్ళి మంత్రి కూర్మయ్యగారిని కలుసుకొంటే సొసైటీకి ఎంతో ఉపకారం జరుగుతుందని ఆయన తన తర్వాత వచ్చిన కార్యకర్తలకు సలహా ఇచ్చాడు. అయితే, ఆయన సలహా దుర్వినియోగమే అయింది.

అంత నిస్వార్థంగా, కేవలం ప్రజాసేవా భావంతో సొంత వృత్తిని కూడ అలక్ష్యం చేసి, సొంత డబ్బును సొసైటీ కోసం ఖర్చుపెడితే – అందుకు ఫలితంగా డాక్టరు ఖానుకు లభించిం దేమిటి ? దుర్వినియోగపు కేసు !

బొండాడ లంక సొసైటీ డబ్బును డాక్టరు ఖాను తినేశాడంటూ ఆయనపై ఒక కేసు పెట్టబడింది. ఆయనపై దుష్ప్రచారం చేసినవారే, ఆ తర్వాత సొసైటీని తమ చేతుల్లోనికి తీసుకొని, దుర్వినియోగం చేసో, చేయదలచో – ఆ నేరాన్ని డాక్టరు ఖాను పైకి త్రోసివెయ్యడానికి ప్రయత్నించారు. మంచికి పోతే చెడ్డ ఎదురు వచ్చింది.

ప్రజలకు సంబంధించిన ప్రతి పనీ అంతే. రాజకీయాలు, సాంఘిక సేవ వంటి ప్రజా సంబంధ కార్యరంగాలలో అంతవరకూ దైవంగా ఉన్న నాయకుడే, అంతలో దెయ్యంగా మారిపోతూ ఉంటాడు ప్రజల దృష్టిలో. అందుకు స్పష్టమైన కారణాలు ఉండవు. ఎవడో ఒక అసూయాపరుడైన వ్యక్తి ప్రజలను నడిపిస్తూ ఉంటాడు వెనుక ఉండి. ప్రజలు మాత్రం ఏం చెయ్యగలరు ? అదిగో పులి అంటే ఇదిగో తోక. అంతే మానవ స్వభావం !

ఆ కేసు డాక్టరు ఖానును బాగా కృంగ దీసింది. ఎంత అన్యాయం ? భగవంతుడనే వాడు లేడా ? పుణ్యానికి పోతే పాపం ఎదురైందే ! గాఢమైన మనోవ్యథతో బాధపడ్డా డాయన. వృత్తిని ఇంకా అలక్ష్యం చేశాడు. చేతిలో ఉన్న డబ్బు కాస్తా అయిపోయింది. తన కేసుకు ప్లీడరును కూడా పెట్టుకోలేదు. ఆయన లేకుండానే కేసు విచారణ జరిగింది. న్యాయం కలిగించమని భగవంతుడ్ని ప్రార్థించటం తప్ప మరేమీ చేయలే దా యన. సాక్షులను కూడా పెట్టుకోలేదు.

1949లో కే సు విచారణ ముగిసింది. తీర్పు చెప్పబడింది. న్యాయం గెలిచింది. ఆయనపై చేయబడ్డ ఆరోపణ లన్నీ నిరాధారాలని కొట్టివేయబడ్డాయి. ఆయన తన సొంత డబ్బుతో సొసైటీకి చేసిన సేవను న్యాయస్థానం గుర్తించి కీర్తించింది. దైవం ఉన్నా డనుకొన్నా డాయన.

ఈ బొండాడలంక ఉదంతం మానవ నైజం లోని రెండు సత్యాలను కన్నులకు కట్టిస్తుంది.

కాంగ్రెసు లక్ష్యమైన సోషలిస్టు సమాజ నిర్మాణం, ఫీల్డు లేబరు కోఆపరేటివ్ సొసైటీల పద్ధతిలో, బీజప్రాయంగా ఉంది. అయితే, దాన్ని అమలు పరచడానికి ఎవరూ పూనుకోరు. పూనుకొనే నిజాయితీ పరుల్ని నిరుత్సాహ పరుస్తారు.

రెండో దేమిటంటే – రాజకీయ పార్టీలు సామాన్య ప్రజలను ఉద్ధరించవు.

ఏ రాజకీయ పార్టీ లక్ష్యమైనా ఒక్కటే – అధికారంలోకి రావడం. అధికారం లోకి వచ్చేవరకు ప్రజల్ని ఉపయోగించుకొని, ఆ తర్వాత ఎక్కడి ప్రజల్ని అక్కడే అణచి ఉంచటానికి అన్ని విధాల ప్రయత్నిస్తుంది అది.

★★★

10. ఇదా స్వరాజ్యం ?

ఆ విధంగా రకరకాల సమస్యలతో సతమతమౌతూనే, ఆంధ్రరాష్ట్ర నిర్మాణం గురించి కూడా ఆలోచించడం సాగించాడు డాక్టరు ఖాను.

బ్రిటిష్ సామ్రాజ్య వాదులతో ఎంతో కాలం పోరాడి, ఎన్నో త్యాగాలు చేసిన మీదట స్వరాజ్యం వచ్చింది మనకు. అయితే, స్వరాజ్యంతో పాటు మనకు

వస్తుందను కొన్న రామరాజ్యం రాలేదు. పైగా స్వరాజ్యం లభించిన తర్వాత దేశంలో స్వార్థ పరత్వం, లంచగొండితనం, అధికార వ్యామోహం, పదవీ గర్వం వగైరా శ్రుతిమించి పెరిగి పోతున్నట్టుగా కనిపించ సాగినాయి.

త్యాగాలు చేసిన వాళ్ళకు, జాతీయ పోరాటంలో సమస్తమూ పోగొట్టుకొన్న వాళ్ళకు, ఏ పదవులను ఆశించక ప్రజలలోనే సేవ చేస్తూ ఉండిపోయిన ఉత్తమ దేశభక్తులకు రాజకీయ రంగంలో స్థానం లేకుండా పోయింది. డబ్బున్న వాళ్ళు, నోరున్న వాళ్ళు, అగ్రశేణుల్లోకి చేరుకొని, అధికార పదవుల్ని అందినంత వరకూ ఆక్రమించుకో సాగారు. గాంధీజీ చెప్పిన మంచితనానికి, నిస్వార్థసేవకు, శక్తి సామర్థ్యాలకు, దేశభక్తికి పరిగణ లేకుండా పోయింది.

స్వరాజ్యం వచ్చిన ఇంత అచిర కాలం లోనే దాన్ని తమ చేతుల్లోకి తీసుకొన్న నాయకుల దృక్పథం, మనస్తత్వం ఇంతగా మారిపోతే ఇక భవిష్యత్తు ఎలా ఉంటుందో అని ఆందోళన పడసాగింది దేశం.

డాక్టరు భానును మరీ కల్లోల పరచినట్టిది ప్రత్యేక రాష్ట్ర సమస్య. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం ఆంధ్ర నాయకులంతా ఒక త్రాటిపై నిలిచి, చిరకాలం నుంచీ పోరాడుతూ ఉన్నారు. 1912 నుంచి కూడా ఈ పోరాటం సాగుతూనే ఉంది. దేశంలో భాషా ప్రయుక్త రాష్ట్రాలను ఏర్పాటు చెయ్యాలన్న విధానాన్ని జాతీయ కాంగ్రెసు మహాసంస్థ ఆమోదించి ఉంది. 1947 ఆగష్టులో దేశ పరిపాలనాధికారం కాంగ్రెసు చేతుల్లోకి వచ్చిన తర్వాత కూడా రాష్ట్ర వ్యవస్థను భాషా ప్రయుక్తంగా పునర్ని నిర్మాణం చెయ్యాలన్న ఆలోచన ప్రభుత్వానికి రాకపోవడం అందరినీ ఆశ్చర్య చకితుల్ని చేసింది.

అందులోనూ, మద్రాసు రాష్ట్రంతో ఉమ్మడి కాపురం చెయ్యడం ఆంధ్రులకు మరీ బాధగా ఉంది. ఉమ్మడి భాషా రాష్ట్రాలలో తెలుగు భాషకు, తెలుగు నేలకు జరిగినంత అన్యాయం దేశంలో మరెవ్వరికీ జరగలేదు.

దేశంలోని తదితర ఏ భాషల వారికీ లేనన్ని బాధలు తెలుగు వారు అనుభవిస్తున్నా, తెలుగు నేలకు మాత్రం ప్రత్యేక రాష్ట్ర మహద్భాగ్యం లభించలేదు.

అట్టిది లభించే సూచన కూడా అప్పటికి కన్పించలేదు. ఈ విషయమై మనస్సును పాడుచేసుకొంటున్న భాషా రాష్ట్ర వాదుల్లో డాక్టరు ఖాను ఒకడు.

అది అలా వుండగా, ఆ వచ్చిన స్వరాజ్యమైనా సుఖప్రదంగా రాలేదు.

బ్రిటిష్ పాలకులు పోతూ పోతూ దేశాన్ని రెండు ముక్కలు చేసి ఒకటి హిందువులకు, ఒకటి ముస్లింలకు ఇచ్చి పోయారు. దానితో నౌకాళీ దురాంతాల వంటి మతోన్మాద జాతీయ వ్యతిరేక శక్తులు గొలుసులు త్రెంచుకొని దేశం మీదకు దూకినవి. హిందూ ముస్లిం అమాయక ప్రజల రక్తంతో భారతభూమి కురుక్షేత్రమే అయింది. అంతవరకూ అన్నదమ్ములై ఇరుగు పొరుగున బ్రతుకుతున్న హిందువులూ, ముస్లింలూ అంతటితో ఒకరి కొకరు విదేశీయులై, ప్రాణశత్రువులై ఒకరి పీకలు ఒకరు నరుక్కో సాగారు.

అప్పటి స్థితి పాకిస్తాన్‌లోని హిందువులకు సద్యఃప్రాణాంతకం కాగా, భారత దేశంలోని ముస్లింలకు దినదిన గండంగా పరిణమించింది. భారతమాత రెండు భుజాలపై రెండు కుంపట్లులా పాకిస్తాన్ రెండు భాగాలు రగలడం మొదలు పెట్టినవి.

స్వరాజ్య ప్రదాత, జాతిపిత, యుగపురుషుడు, హరిజనోద్ధారకుడు అయిన గాంధీజీ ఘోరంగా హత్య చేయ బడటంతో దేశంలో పాశవిక శక్తుల విలయతాండవం పరాకాష్టకు చేరుకొంది.

"ఏమిటి భగవాన్ ! స్వరాజ్యం వచ్చిన తర్వాత దేశం ఇలా తయారైంది ? చేసిన పోరాటం, అహింసతో కూడుకొన్నట్టిదైనా, చివరకు ఏ యుద్ధంలోనూ చావ నంత మంది హిందూ ముస్లిం ప్రజలు చావటం తప్పలేదు. రక్తం కాలువలుగా ప్రవహించింది. లక్షల మంది నిలువ నీడ లేని పక్షులయ్యారు. ఆకలి బాధ హెచ్చింది. ఆహార ధరలు ఆకాశానికి పెరిగినవి. పేదలు మరీ పేద లవుతున్నారు. ఎక్కడా శాంతిలేదు. ధనికులు మరీ ధనికులవుతున్నారు. రైతుల్లో, కూలీలలో, ఉద్యోగులలో విద్యార్థులలో ఎక్కడ చూచినా ఆకలి, అసంతృప్తి, అశాంతి, నిరుద్యోగం, సమ్మెలు ! ఏమిటిదంతా ?" అంటూ వాపోయాడు డాక్టరు ఖాను. మనస్సు మరీ అల్లకల్లోలమై మతి పోగొట్టుకున్నా డాయన.

అలాంటి పరిస్థితిలో ఆయన ఇల్లు విడిచి, అడవి దారులు పట్టాడు. జాతీయ అంతర్జాతీయ సమస్యలతో ఆయన మస్తిష్కం ఒక తేనె పట్టులా తయారైంది.

ప్రపంచ మంతా భగవంతుని సృష్టే కదా? మానవు లంతా ఆయన సంతానమే కదా ? ఏ మతం బోధించినా మానవ సౌభాతృత్వాన్నే కదా ? మరి... ఈ మత కలహాలూ, జాతి ద్వేషాలూ, దేశ వైరాలూ, అసూయలూ, ఈర్ష్యలూ, ఉద్రేకాలూ, పోరాటాలూ, హత్యలూ, రక్తపాతాలూ ఇవన్నీ ఏమిటి ? ఎందుకు ?

రోజుకు మూడు పూటలా తిండి కోసమేనా... మానవుడు ఇంత ఘోరానికి పాలుపడుతున్నది ?

కొత్తగా ఆటంబాంబులు వచ్చాయి. విజ్ఞాన శాస్త్రం పెరిగే కొలది మారణా యుధాల హత్యాశక్తి విపరీతంగా పెరిగి పోతున్నది. మూడవ ప్రపంచ యుద్ధమే వస్తే అది ఆటంబాంబులతోనే ప్రారంభం అవుతుంది. రెండు మూడు రోజుల్లోనే మొత్తం మానవజాతే తుడిచిపెట్టుకు పోగలదు అప్పు డింకేం మిగులుతుంది ? అంతా బూడిద !

కులం, మతం, జాతి, స్వార్థాలు, అధికారాలు, అహంకారాలు సమస్తమూ వట్టి బూడిద.

ఎవళ్లూ ఆలోచించటం లేదు. ఎవరి మట్టుకు వారు తమ స్వార్థాల చుట్టూ పేక మేడలు నిర్మించుకొంటూ బయటి ప్రపంచాన్ని చూడలేక పోతున్నారు. ఒకడు విపరీతంగా ధనవంతుడై భోగభాగ్యాలు అనుభవిస్తూ ఉంటే, ఆ ప్రక్కనే మరొకడు తిండికి, గుడ్డకు మాడి చస్తున్నాడు. అలా ఎందుకు జరగాలి ? అందరూ భగవంతుని సంతానమే కదా ? అలాంటి అసమత్వాలు, అన్యాయాలు ఇచ్చే ఫలితాలు చివరకు ఎంత ఘోరంగా ఉంటాయో ! ఎవళ్ళూ ఆలోచించటం లేదు.

వాస్తవాలు పోరుగుర్రాల్లా దౌడు తీస్తూ ఉంటే, నాయకులు కళ్ళు మూసుకొని నిద్రపోతున్నారు. ప్రజలు దిక్కుతోచక కాళ్ళు త్రొక్కుకొంటున్నారు. ఎప్పుడు కలుగుతుందో లోకానికి వివేకం ? ఎలా కలుగుతుందో మనస్సుకు శాంతి ?

★★★

11. కోయప్రజల ఆదర్శం

ఈ విధమైన ఆలోచనలతో డాక్టరు ఖాను ఎటు, ఎక్కడికి అనే విచక్షణ లేకుండా, నడచి పోసాగాడు. గోదావరి అడ్డం వస్తే దాటాడు. లాంచి కనిపిస్తే ఎక్కాడు, అది ఆగిపోతే దిగి పోయాడు, బాగా రాత్రి పడ్డ తర్వాత గాని అదొక కీకారణ్యమన్న సంగతి ఆయనకు గుర్తే రాలేదు.

అది భద్రాచలం ప్రాంతం లోని ఒక దట్టమైన అరణ్యం !

చీకట్లో భయంకరమైన ప్రకృతి తనను చుట్టుముట్టేదాకా ఆయన మనస్సుకు మెలకువ రాలేదు !

మానవ స్వభావమే అంత. అంతరంగికమైన ఆలోచనల, బాధల, బాధ్యతల, ఊపపోహల మధనంతో వ్యాకులపడుతున్న వాడికి హఠాత్తుగా బాహ్యావిపత్తు ఏదో తారసపడితే – అంతరంగిక మనస్తాపాలన్నీ ఒక్క సారిగా ఎరిగిపోతాయి. బాహ్య విపత్తులను ప్రతిఘటించడానికే అతనిలోని సర్వశక్తులూ ఏకముఖంగా సమాయత్త మౌతాయి. అది ప్రకృతి స్వభావం. డాక్టరు ఖాను విషయంలో కూడా అలానే జరిగింది. ఏకాకిగా చీకటిరాత్రి కీకారణ్యంలో ఉన్నట్టు తాను తెలుసుకోగానే అంతవరకు అన్యాయత్తమైన ఆయన మనస్సు ఒక్కసారిగా జాగృతమై కింకర్తవ్యతా భావాభి ముఖమైంది.

మనశ్శాంతి కోసం చాలా కాలం ఆయన ఆ అడవుల్లోనే గడిపాడు. అప్పటి తన అనుభవాలను "స్వప్నంలో ఆంధ్రరాష్ట్రం" అనే గ్రంథంలో ఆయన ఎంతో హృద్యంగా వర్ణించి ఉన్నాడు. ఆ వర్ణన చదువుతూ ఉంటే మనం కూడా అలాంటి అపూర్వానుభూతిని జీవితంలో ఒక్కసారైనా పొందా లనిపిస్తుంది.

కీకారణ్యాలు, క్రూర మృగాలు, వింత రొదలు, గర్జనలు, పక్షుల కోలాహలం, గాలిచేసే రాగధ్వనులు, కార్చిచ్చులు, కారుమేఘాలు, కొండలు, కొండవాగులు,

నీటిపట్లు, నెమళ్ళు, ఎగులుబంట్లు, కొండచిలువలు, పులులు, పునుగు పిల్లలు, ఉడుతలు, ఉగ్రలోయలు - ఓహో ! ఉద్వేగ ప్రకృతి ! దాని ఒడిలో ఒక మానవుడు ! ఎంతటి మహానుభూతి !

ఆ అరణ్య మధ్యంలో ఉన్న ఒక కోయ గూడెంలో గడిపాడు చాలా కాలం ఆయన. అక్కడి ఆ గిరిజనుల విధానాలను గురించి ఆయన చేసిన వర్ణనలను చదువుతూ ఉంటే, అవన్నీ మనం కళ్ళార చూడా లనిపిస్తుంది.

ఎత్తైన మంచెల మీద వేసిన గుడిసెలు. ప్రతి గుడిసె ముందూ పెద్ద పెద్ద నెగడులు, గూడెం చుట్టూ వంతులవారీ పహారాలు, గెడచువ్వల మెట్లు, గుడిసెల లోపల పాలకర్ర దివ్వెలు, క్రొవ్వు కాగడాలు, ఊచబియ్యం, తేనె, వెలగపళ్ళు, విప్పపువ్వు, అడవి సారా ఎంతటి ఆహ్లాదకరాలో... వాళ్ళ ఆచారవ్యవహారాలూ, నీతినియమాలూ అంతటి ఉత్తేజకరాలు ! నాగరికుల మనుకొంటున్న మనం ఈ ఆదిమవాసుల నుండి నేర్చుకోవలసింది ఎంతో ఉన్నదంటాడు ఆయన.

అక్కడ తాను గడిపిన రోజుల్లో తాను చూచిన వింతలను, జరిగిన సంఘటన లను, కోయ ప్రజల ప్రేమ వాత్సల్యాలను, వాళ్ళు వేటాడే పద్ధతులను, ఒక వీరజాతిగా వాళ్ళు చూపుతున్న ధైర్యసాహసాలను గురించిన ఎన్నో విషయాలను ఎంతో మనోహరంగా వివరించా డాయన తన గ్రంథంలో.

తాను వైద్యుడు కావడం వల్ల, సర్వమానవ సౌభ్రాతృత్వాన్ని పుట్టుక నుంచే జీర్ణించుకొన్నవాడు కావడం వల్ల, ఆ ప్రజల ప్రేమాభిమానాలకు పాత్రుడై తాను పోగొట్టుకున్న శాంతిని తిరిగి పొందగలిగాడు. అప్పుడే ఆంధ్ర రాష్ట్రాన్ని, అది సాధించగల ప్రగతినీ గురించి కలలు కన్నాడు. ఆ కలలనన్నీ తాను ఇంటికి తిరిగి వచ్చిన తర్వాత గ్రంథస్థం చేసి ప్రకటించాడు.

★★★

12. అనుభవజ్ఞుడే ఋషి - మహాకవి

'స్వప్నంలో ఆంధ్ర రాష్ట్రం' అన్న గ్రంథంలో ఒక మహాకవిగా కనిపిస్తాడు డాక్టరు ఖాను.

అత డెంత కార్యవాదో అంత భావుకుడు. మహాకవులు కాతగిన ఋషులంతా కార్యవాదులే అన్నది చరిత్ర సత్యం. కార్యవాది కానివాడు, స్వయంగా సాహస కార్యాలు చేయలేనివాడు, ప్రజల్ని ఎరగనివాడు, పరుల కోసం బాధలు పడనివాడు మహాకవి ఎన్నటికీ కాలేడు.

రమణీయార్థ ప్రతిపాదక మైనట్టిదే కావ్యం అనుకొంటే - డాక్టరు ఖాను ఊహించిన ఆంధ్రరాష్ట్ర స్వరూపం, దాన్ని ఆయన చిత్రించిన విధానం పరమ రమణీయం కనుక, ఆయన ఒక మహాకవే అంటున్నాను. ఆయన నాకు మిత్రుడు కనుక అంటున్న మాట కాదిది. ఒక మహాకవిగా ఆయనను లోకం గుర్తిస్తుందనీ కాదు. అలా ఎన్నటికీ జరగదని నాకు తెలుసు.

అయినా -

రాగం ఎంత చిన్నదైనా అది సంగీతమే. నాదం ఎంత అనామకమైనా అది పరబ్రహ్మమే.

"ఆంధ్ర రాష్ట్రాన్ని మనం సాధించి తీరాలి. అందుకోసం ఎంత త్యాగాన్నయినా చెయ్యటానికి వెనుదీయకూడదు. ఆ వచ్చిన రాష్ట్రాన్ని మనం ఫలానా విధంగా అభివృద్ధి చేసుకోవాలి" అంటూ ఉపన్యాసం చెప్పలేదు ఆయన. రాష్ట్రం వచ్చిన 20 సంవత్సరాల తర్వాత అది ఎలా ఉంటుందో తన భావనలో తాను చూచి మనకు చూపించాడు స్పష్టంగా. మనస్సుకు హత్తుకునేటట్టు లక్ష్యాన్ని నిరూపించి చెప్పటానికి ఇది ఒక చమత్కారమైన పద్ధతి. ఒక అప్రతిహతమైన శాసన విధానం. కార్యరంగంలో, భావనా రంగంలోను కూడా సిద్ధహస్తులైన అనుభవజ్ఞులకే రచనా విధానంలో ఇట్టి ప్రక్రియ సాధ్యం.

1949లో ప్రచురింపబడ్డ ఈ గ్రంథం చిన్నదే కావచ్చు. సాహితీ వేత్తల దృష్టిని కాని, రాజకీయ నాయకుల దృష్టిని కాని ఆకర్షించేటంత పెద్దది కాకపోవచ్చు. రచనా ప్రణాళికలో సమగ్రత లేకపోవచ్చు. రచయితగా ఆయన ప్రసిద్ధుడు కాకపోవచ్చు. నిజమైన ఏ వ్యక్తీ బాహ్య ప్రపంచాన్ని లక్ష్యం చెయ్యడు. సూక్ష్మంగా పరిశీలిస్తే, ఒక మహా కావ్యానికి ఉండవలసిన బీజబలం ఈ గ్రంథానికి ఉంది. ఒక్క ఆంధ్ర రాష్ట్ర నిర్మాణానికే కాక, ఏ రాష్ట్ర నిర్మాణానికైనా సరే, ఇది లక్ష్య నిర్వచన గ్రంథమే కాగలదు.

"మానవునికి కావలసిం దేమిటి ? అశాంతి, అసత్యం, అత్యాశ, అత్యాచారం లేని కోయగూడెం లోని ప్రజల కంటే నాగరిక ప్రజలు ఎక్కువ సుఖపడు తున్నారా ? మనిషికి కావలసింది సుఖ శాంతులే అయితే, ఈ కోయగూడెం వాతావరణాన్నే ప్రపంచమంతా ఎందుకు నెల కొల్పుకొనకూడదు ?" అన్న ఊహతో ప్రారంభించి – ప్రపంచం ఇక వెనక్కు నడవదు గనుక, దిన దిన ప్రవర్ధమాన మవుతున్న ప్రకృతి విజ్ఞానం ద్వారా, ముఖ్యంగా అణుశక్తి ద్వారా, ఒక మహోన్నత స్థాయిలో మానవుడికి సుఖ శాంతుల్ని సాధించి పెట్టగల ఒక ఉజ్జ్వల ప్రణాళికను ఊహించాడు డాక్టరు ఖాను. ఆ ప్రణాళికను ఒక ఆంధ్ర రాష్ట్రంలోనే ఆయన తన భావనలో అమలు పరచి చూపినా, అది విశ్వజనీన ప్రణాళికే. అదే దాని గొప్ప తనం.

కేవలం పది జిల్లాలతో కూడిన ఆంధ్ర రాష్ట్రమైనా ఏర్పడుతుందో లేదో తెలియని 1949 లోనే, నేటి 20 జిల్లాలతో కూడిన సమగ్ర ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాన్ని ఊహించ గలిగా డాయన.

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన 20 సంవత్సరాల అనంతరం రాష్ట్ర ప్రభుత్వమూ, ప్రజలూ ఎంత గొప్ప అభివృద్ధిని సాధించ వచ్చునో ఊహించా డాయన. ఆ ఊహా చిత్రం మొత్తం మీద ఇలా ఉంది.

విజయవాడతో గుంటూరు కలిపి ఒక మహానగరంగా నిర్మించాడు. ఇది వరకు ఉన్న పాత ఇళ్ళూ, కట్టడాలూ, అన్నీ పడగొట్టి, నగర ప్రణాళిక క్రింద పునఃనిర్మాణం

నిర్మించాడు. భూగర్భ రైల్వేలు, ఫ్యాక్టరీలు, ఆఫీసులు, కాలేజీలు, యూనివర్సిటీలు, విమానాశ్రయాలు వగైరాలతో ప్రపంచంలోని మహా నగరాలలో ఇదొకటైంది.

రామపాద సాగర్, నాగార్జున సాగర్, తుంగభద్రా సాగర్ మొదలైన ప్రాజెక్టుల వల్ల దేశం స్వయం సమృద్ధమైంది. మన పంటలు, సరుకులు, కళలు, కవితలు, విదేశాలకు ఎగుమతి అవుతున్నాయి. చౌకగా లభిస్తున్న విద్యుచ్ఛక్తితో ప్రతి గ్రామమూ మనోమోహనంగా ఉంది.

రాయలసీమ రత్నాల గనులతోను, సానపెట్టే కర్మాగారాలతోను కలకల లాడుతోంది. పూర్వం తెలుగు నేలలో దొరికిన కోహినూర్, రిజంట్ వజ్రాల వంటి అనేక రకాల గొప్ప గొప్ప వజ్రాలు దేశ దేశాలకు ఎగుమతి అవుతున్నాయి.

కోస్తా పొడుగునా ఓడ రేవులు - నౌకా నిర్మాణ పరిశ్రమలతో, విదేశ వ్యాపార రద్దీతో విరామం లేకుండా పనిచేస్తున్నాయి. ప్రతి రేవుకూ రైల్వేలు, పడవ కాలువలు. ప్రతి నది మీద ఎన్నో ప్రాజెక్టులు. నదులన్నీ కాలువలు ద్వారా కలుపబడినాయి. బస్సులు, కార్లు, స్టీమర్లు, రైళ్ళు, విమానాలు - వేటిమీదనైనా సరే రాష్ట్రంలోని ప్రతి ముఖ్యపట్నానికీ, రేవుకూ, క్షేత్రానికీ నిమిషాల మీద పోవచ్చు.

రకరకాల లోహాల, ఖనిజాల గనులు పాతాళలోకాలను జయిస్తుంటే - వివిధ ఫలాల, పుష్పాల, ధాన్యాల రాశులు నియల్లోకాలతో వియ్యమందుతున్నాయి. రాష్ట్రం మొత్తం ఒక వైకుంఠం, ప్రతి గృహమూ ఒక లక్ష్మీనివాసం.

పరిపాలనా వ్యవస్థ వికేంద్రీకరించబడి, స్థానికమైన అన్ని వ్యవహారాలు గ్రామ పంచాయతీలే నిర్వహిస్తున్నాయి. గ్రామపంచాయతీలన్నీ తాలూకా పంచాయితీకీ, తాలూకా పంచాయితీలన్నీ జిల్లా పంచాయితీలకీ అనుబంధించబడినాయి. పరిపాలనా కేంద్రం గ్రామమే. గ్రామస్థులంతా పంచాయితీ సభ్యులే.

కులతత్వం పూర్తిగా నిర్మూలించబడింది. చదువురాని వాళ్ళు ఒకరూ లేరు. అంటు వ్యాధులన్నీ అరికట్టబడినాయి. అకాల మరణాలు, బాలారిష్టాలు మచ్చుకైనా లేవు. నిరుద్యోగం లేదు. బిచ్చగాళ్ళు లేరు.

అణుశక్తి కేంద్రాలు రాష్ట్రంలోని ఐదారు ఉన్నాయి. ఒకో కేంద్రం ఒకొక్క రంగంలో పనిచేస్తున్నది.

రోదసీ నౌకలు గ్రహాంతర ప్రయాణాలు చేసి వస్తున్నాయి.

రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధిని సాధించి స్వర్గంలా ఉంది, ప్రజలు దేవతల్లా జీవిస్తున్నారు. అణుశక్తి సులభసాధ్యం కావటంతో అన్నిటికీ అదే ఉపయోగపడుతున్నది. అందరికీ అన్ని సౌఖ్యాలు అనాయాసంగా లభిస్తున్నాయి.

ఏ రాష్ట్రమైనా, ఏ దేశమైనా ఒక ఇరవై సంవత్సరాల లోనే కాదు, ఇరవై ఐదువేల సంవత్సరాల లోనైనా ఈ విధంగా తయారు కాగలదా?

మానవుడిలో నేటి కామ క్రోధ మద మాత్సర్యాది దుష్టగుణాలు ఇలానే ఉన్నంతకాలం స్వార్థమూ, దారిద్ర్యమూ, హింసా, దీనత్వమూ పోతాయనుకోలేం. అయినా ప్రతి మానవుడూ తోటి మానవుడి సంక్షేమానికి అవకాశం కలిగిస్తూ ప్రవర్తించడం నేర్చుకొన్ననాడు, మానవ సమాజం ఎంతో దివ్యంగా భాసించడానికి అభ్యంతరం ఉండదనే అనుకొంటాను.

ఉచిత విద్య, ఉచిత వైద్యం, శిశు సంరక్షణ, ఉద్యోగం, వృద్ధాప్యపుభత్యం, ఉచిత గృహవసతి, ఉచిత వినోద విజ్ఞాన విహార సౌకర్యాలు – మొత్తం మీద మనిషి పుట్టిన మరుక్షణం నుంచీ చచ్చిన మరుక్షణం దాకా, మన ప్రతిభా ప్రాభవాలను క్షణక్షణం వికసింప చేసుకొంటూ జీవించడానికి కావలసిన సమస్త సౌకర్యాలు... తప్పకుండా వాటంతటవే లభించేటట్టు ప్రభుత్వం చూడగలిగితే సర్వజన సమ సమాజం ఏర్పడి తీరుతుంది, "దీపసభ" మొదలైన కావ్యాలలో నేను ఇదే చెప్పి ఉన్నాను.

ప్రజలూ, ప్రజా ప్రతినిధులూ, స్వార్థరహితంగా, త్యాగబుద్ధితో కృషి చేస్తే, అట్టిది అసాధ్యమేమీ కాదు. అవసరానికి వైద్యసహాయం, చదువుకు ధనసహాయం, మంచి జీతం గల ఉద్యోగం, మార్కెట్టు నిండా కావలసిన సరుకులు, ముసలితనంలో తిండి బట్టలకు గ్యారంటీ, ఉండటానికి ఒక సొంత ఇల్లు ఇవన్నీ వుంటే ఎవడు మాత్రం రేపటి కోసం బెంగపెట్టుకొంటాడు ? ఎందుకు డబ్బు నిలవ చేస్తాడు ?

డబ్బు నిల్వ చేయడం, ఆస్తులు సంపాదించడం, అందుకోసం ఎలాంటి హింసలు, దోపిడిలు, పాపాలు చెయ్యడానికైనా సరే సిద్ధపడడం ఎందుకు ? రేపటి పరిస్థితి ఏమిటో, ఎలా ఉంటుందో తెలియక పోవడం వల్లనే కదా ? ప్రతి మనిషికి రేపటి పరిస్థితిని సుస్థిరం చెయ్యడం (కనీసం కూడు గుడ్డల వరకైనా) ప్రభుత్వానికి అంత కష్ట సాధ్యమా ?

అందుకే ఆంధ్రరాష్ట్ర సర్వతోముఖాభివృద్ధిని గురించి డాక్టరు ఖాను చేసిన ఊహ నన్నింతం గా ఆకర్షించింది. దానిని నేను ఇంతగా విపులీకరించడం జరిగింది.

★★★

13. సమకాలిక సమీక్షలు

"చిత్రించితివి కలన్ చిత్రవిస్ఫూర్తితో
రాజ్యాంగ తంత్ర విరాజితముగ,
మేల్కొల్పితిని సాటి మేధా నిధుల నెల్ల
నవనవోన్మేషమౌ నాదగతితో,
కల్పించితివి గాధ కమనీయమౌ శ్రుతిన్
'స్వప్నాంధ్రరాష్ట్రంపు' సౌమ్యతీవి,
కూర్చినాడవు జాతి గువలయానందమౌ
భావికాలపు దివ్యపాటవంబు,
కలయు గాదది సోదరా! ఖానా ! నీకు
గలుగబోయెడి నవ్యాంధ్ర కాంత ప్రతిభ
గాంచినాడవు తొలిరేఖ కనులలోన
దాగియున్నట్టి ఆంధ్రుల ధైర్య పటిమ !
ప్రజలలో గల కోర్కెలు ప్రగతి గాంచి
కూర్చినాడవు నీలోని కోర్కె నిట్లు
ఇంతియేగాని 'కల' కాదిదెల్ల మనకు

జరుగ బోయెడు నవ్యాంధ్ర జాడ గాదె ?
కోటి తెలగాణవారల కోర్కెలెల్ల
రూపుగావించి నాడవు రూఢిగతిని,
కాలగతిలోన నీ మార్పు కలుగునయ్య !
ఆంధ్రరాజ్యంపు తొలిబిడ్డ వగుదువోయి !'

అంటూ ప్రశంసించాడు శ్రీ తిరుక్కోవళ్ళూర్ అనే కవి, డాక్టరు ఖాను "స్వప్నంలో ఆంధ్రరాష్ట్రం' గ్రంథం తొలిసారి ప్రకటించబడినప్పుడు.

"ప్రపంచ యుద్ధం మమ్ముఱంగా ఉన్న రోజుల్లో విజయవాడలో డాక్టరు ఖానుగారిని చూశాను. ఇంగ్లీషువాణ్ణి భుజాల మీద నుంచి దింపు కోవడానికి భారతం పోరాడుతున్న రోజులవి. ఇంగ్లీషు వాడితో పాటు దేశ ప్రజల్ని పీడించుకొని తింటున్న దారిద్ర్యం, అనారోగ్యం వంటి ఇతర పీడలతో కూడా పోరాటం జరిపిన దేశభక్తుల్లో డాక్టరు ఖానుగారు ఒకరు. అసలు ఆంధ్రరాష్ట్రం ఏర్పడుతుందా లేదా అన్నంత ప్రతికూల వాతావరణం ఉన్నరోజుల్లో అనేకులకు డాక్టరు ఖానుగారికి వలెనే ఊహలు పొడమినవి. అయితే, ఆయన వాటికి చక్కని అక్షరరూపము ఇచ్చినాడు. పరిణత మనస్కుడైన దేశభక్తుడు. ఊహాశాలియొక్క ఆలోచనరీతి ఈ గ్రంథంలో చక్కగా సాక్షాత్కారిస్తున్నది" అన్నారు తెలంగాణా రచయితల సంఘ ఉపాధ్యక్షుడైన మహాకవి దాశరథి ఈ గ్రంథం రెండవ ముద్రణ పరిచయంలో.

"ఆంధ్ర సంస్కృతిని అన్నివిధాల అపురూపంగా తీర్చిదిద్దిన గోదావరీమతల్లి పర్యంకం మీద చల్లగాలి తెమ్మెరలలో పడుకొని, ఆంధ్రరాష్ట్రపు భవిష్యత్తును ఆలోచించు కొంటూ ఒక ఆంధ్ర యువకుడు నిద్రిస్తాడు. వైజ్ఞానికంగా, సాంఘికంగా, రాజకీయంగా, నిర్మాణాత్మకమైన స్వీయరాష్ట్రాన్ని మహోన్నత దివ్యస్వర్గంగా దర్శించు కొంటాడు. స్వరాష్ట్రంలో ఆంధ్రుడి బ్రతు కొక రంగు రంగుల బంగారపు భరిణ అనుకొంటాడు. తాను చూచి పొంగిపోయిన సుస్వప్నానికి అక్షరరూపమే ఈ పుస్తకం. నిజానికి ఇది చక్కని అనుభూతిని ఇచ్చే మధురమైన కల అని ఒప్పుకోవాలి. ఈ తియ్యని అనుభూతిని మన అందరికీ పంచి ఇచ్చిన డాక్టర్ ఖాన్‌గారిని అభినందిస్తున్నాను. కలలు నిజమౌతాయంటారు పెద్దలు ! నేను కలగన్న రాష్ట్రం

రాకుండా పోతుందా ? ఇష్ట వాంఛాఫల సిద్ధిరస్తు, అభీప్సిత సిద్ధిరస్తు. ఇది అదృశ్యవాణి ఆశీర్వాదంగా అనిపిస్తున్నది – " అన్నది అనందవాణి.

"ఇదిగో అదిగో అంటూ అవతరింపనున్న ఆంధ్ర రాష్ట్రము మన ప్రజా ప్రభుత్వము ఏ విధముగా, ఎటువంటి లక్ష్యములతో నడుపవలెనో సూచించు ఒక ఊహా చిత్రణ ఇది" అంది భారతి.

"ఆంధ్రరాష్ట్రం వేరుపడితే బానిసలకు స్వరాజ్యం వచ్చినంత సంబరపడేవారు అనేకు లున్నారు. స్వరాష్ట్రంలో ఎంతో సుఖం మరెన్నో సదుపాయాలూ, ఇంకెంతో విజ్ఞానం లభిస్తాయనే ఆశలు చాలా మందికి ఉన్నాయి. ప్రతి వ్యక్తి అదేదో స్వర్గంలా అవతరిస్తుందని కలలు కనేవారే కాని ఫలానా కారణాల వల్ల. ఫలానా పరివర్తనలు జరిగి, ఫలానా విధమైన స్వర్గం ఆంధ్రరాష్ట్రంలో వెలుస్తుందని చెప్పేవాళ్ళు లెక్కకు కనుపించడం లేదు. డాక్టరు ఖానుగారు తానూహిస్తున్న భవిష్యదాంధ్రరాష్ట్రం ఇలా ఉంటుందీ అని నిర్దిష్టంగా చెప్పాలనే ఉద్దేశ్యంతో ఈ పుస్తకాన్ని రచించడం మెచ్చుకోదగ్గ సంగతి. చదివితే అంతా విచక్షణాయుతంగా, కార్యకారణ ఫలిత సామ్య దృక్పథంతో వివరంగా కనిపిస్తున్నది. అందుగ్గాను మనం చేయవలసిన కృషినీ, మార్చుకోవలసిన పద్ధతులనూ సూచించారు" అన్నది జ్యోతి.

"రచయితగా డాక్టర్ ఖాన్ తాను కలగన్న విశాలాంధ్రోన్నత్య స్వరూపాన్ని తేట తెలుగు నుడికారంతో చిత్రించాడు. రానున్న 'ఆంధ్రరాష్ట్రం' ఆ పిదప అది 'విశాలాంధ్ర'గా రూపొంది సర్వాలంకార శోభితంగా మారిన ఇరువది సంవత్సరాల మేరకు ఊహించాడు. సర్వమానవ సౌభ్రాతృత్వంతో విశాలాంధ్ర విలసిల్లాలనే విశాల భావంతో విహరించి చిత్రించిన స్వప్న దృశ్యం చదువుటకు చక్కగా ఉంది" అన్నది జాగృతి.

ఇంకా ములుకోల, వినోదిని, గ్రామోద్ధరణ, శారద, వెండి తెర వంటి ఆనాటి పత్రికలు, అనుమోలు దుర్గా మల్లికార్జున శర్మ, గోపరాజు వెంకటానందం, మహాకవి జాషువ, గిడుతూరి సూర్యం వంటి ప్రముఖులు డాక్టరు ఖానుగారి కల నిజం కావాలని ఆశీర్వదించారు.

★★★

14. లాటీకి నమస్కారం

నమస్కారానికి లాటీ

ఆంధ్ర రాష్ట్ర నిర్మాణానికి నాయకుల ప్రజల ఆందోళన ఎంతగా తోడ్పడిందో, ఆ ఆందోళనను ప్రవేగీకరించడానికి డాక్టరు ఖానుగారి రచన అంతగానూ తోడ్పడింది. వేల కొలది ప్రతులను ముద్రించి ఆయన ఉచితంగా పంచిపెట్టడం వల్ల, తానే స్వయంగా వాటిని వివిధ నాయకులకు, ముఖ్యంగా ఢిల్లీలో ఉన్న ఆంధ్ర నాయకులకు, తదితర పెద్దలకు అందివ్వడం వల్ల, ఏమైనా సరే రాష్ట్రాన్ని సాధించాలనే పట్టుదల ప్రజల్లోనూ నాయకులలోనూ కలిగింది. ఆందోళన తీవ్రతరమైంది. దాని ఫలితమే పొట్టి శ్రీరాములుగారి నిరశన దీక్ష.

1951-52 ప్రాంతంలో భారత ప్రధాని నెహ్రూగారు విజయవాడ వచ్చినప్పుడు ప్రత్యేక రాష్ట్ర వాంఛను నిర్దిష్టంగా ఆయన ముందు ఉంచిన వారిలో డాక్టరు ఖాను ఒకడు. ఆంధ్ర ముస్లింల తరఫున కూడ ఒక విజ్ఞాపన పత్రాన్ని ఆయన సమర్పించాడు.

తక్షణం ఆంధ్ర రాష్ట్రం ప్రత్యేకించబడాలని, దానికి చెన్న పట్టణమే రాజధానిగా ఉండాలని ఆంధ్రులంతా ఏక కంఠంతో ఎలుగెత్తి చాటారు. ఆంధ్రుల ఈ చిరకాల వాంఛ ఈడేరే వరకు తాను మంచి నీళ్ళుకూడా ముట్టనని పొట్టి శ్రీరాములు గారు శపథం చేసి దీక్షలో కూర్చున్నారు. మద్రాసు నగరంలో మైలాపూరులోని మహర్షి బులుసు సాంబమూర్తిగారి గృహంలో ఆ దీక్ష సాగింది. దేశం ఉద్రిక్తమైంది.

చచ్చినా మద్రాసు విడిచిపెట్ట మంటూ తమిళ నాయకులు ఉద్ఘాటనలు చెయ్య సాగారు. న్యాయం జరగాలంటూ ఆంధ్ర నాయకులు ఉద్ఘోషించసాగారు. ఉమ్మడి మద్రాసు రాష్ట్ర ప్రభుత్వం రాజగోపాలాచారిగారి చేతుల్లో ఉంది. ప్రత్యేకాంధ్ర రాష్ట్ర నిర్మాణానికి ఆయన ప్రబల విరోధి. విజయమో వీరమరణమో అన్న పరిస్థితులలో దీక్షాబద్ధులైనారు పొట్టి శ్రీరాములు గారు. శ్రీరాములు గారు దీక్ష సాగించిన ఆ 58 రోజులూ మద్రాసులో ఏ నిమిషంలో ఏం జరుగుతుందో తెలియని

ఉద్రిక్త స్థితి ఏర్పడింది. ఆయన దీక్షను అపార్థం చేసుకొన్నవారు, అవహేళన చేసినవారు ఒక్క సారిగా నిశ్చేష్టులైపోయారు - డిసెంబరు 15వ తేదీన, ఆయన పూర్ణాహుతి అయిపోయినప్పుడు.

శ్రీరాములుగారి పూర్ణాహుతికి దేశం యావత్తూ కన్నీరు కార్చింది. అందులో డాక్టరు ఖాను ఒక్కరని వేరే చెప్పనక్కర లేదు.

ఆంధ్రప్రజలు ఉద్రిక్తులైనారు. ఆ తర్వాత ఆంధ్ర ప్రాంతంలో చెలరేగిన విప్లవం పట్టపగ్గాలు లేనట్టిది. దానిని తట్టుకోవడం కోసం ప్రత్యేకాంధ్ర రాష్ట్రాన్ని ఏర్పరుస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రకటన చెయ్యక తప్పలేదు.

ఆందోళనలూ, నవ్మెలూ, దౌర్జన్యాలూ, ఆత్మాహుతులూ వంటి హింసాకాండ జరిగితేనే తప్ప, అహింసా సిద్ధాంతంపై ఏర్పడ్డ ప్రభుత్వాలు సైతం న్యాయాన్ని గుర్తించక పోవడంలోని దేవరహస్యం ఏమిటో ?

చెన్నపట్టణం లేకుండానే ఆంధ్ర రాష్ట్రం ఏర్పడాలన్నది ప్రభుత్వ నిర్ణయం. అయితే, ఆంధ్ర రాష్ట్రానికి రాజధాని ఏదీ ?

రాజధానిగా ఉండటానికి అర్హత గల ఒక పట్టణాన్ని నిర్ణయించటం కోసం వాంఛూ ఆంధ్రప్రాంత పర్యటనకు పంపబడ్డారు. ఆ సందర్భంలో ఆయనకు మంచి సూచనలు చేసిన వారిలో డాక్టరు ఖాను ఒకడు.

జాతీయ ముస్లిం మహాసభ అధ్యక్షుడుగా ఆయన వాంఛూను కలుసుకొన్నాడు. బెజవాడ పట్టణం ఒక్కటే ఆంధ్ర రాష్ట్రానికి రాజధాని కాదగిన అర్హత కలిగి ఉన్నదని ఆయన నిరూపించాడు. గుంటూరు, బెజవాడ, తెనాలి ఈ మూడు పట్టణాలూ కలిసి పోగలవని, తత్ఫలితంగా ఒక మహానగరం ఉద్భవించగలదని ఆయన వాదన. ఆయన కన్న కల కూడా అదే. చిత్రమేమంటే - ఆంధ్రలోని అన్ని జిల్లాల ముఖ్య పట్టణాలనూ, ప్రధాన ప్రాంతాలనూ దర్శించి, ఎంతో మంది ప్రజల, నాయకుల సలహాలను సేకరించి, పరిస్థితిని కరతలామలకం గావించుకొన్న వాంఛూ తన నివేదికలో డాక్టరు ఖాను చేసిన సూచన వంటి సూచనలే చెయ్యటం !

బెజవాడ, గుంటూరు, తెనాలి. ఈ మధ్య ప్రాంతం రాజధాని నగర నిర్మాణానికి తగి ఉంటుందని శ్రీ వాంఛూ సూచించారట.

1953, అక్టోబరులో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు ఎంతో ప్రత్యేక మైనట్టిది. దానిని సాధించటానికి ఆంధ్రులు చేసిన త్యాగం, జరిపిన పోరాటం, పడ్డ బాధ వర్ణనాతీతం.

దీన్ని సాధించిన శక్తుల్ని మూడు భాగాలుగా పేర్కొంటే – అందులో అతి ముఖ్యమైన శక్తి అమరజీవి పొట్టి శ్రీరాములుగారు. రెండవ శక్తి అయ్యదేవర కాళేశ్వరరావుగారి వంటి అగ్రనాయకులు. మూడవ శక్తి డాక్టరు ఖాను వంటి భావుకులూ, కార్యకర్తలూ.

ఆంధ్రరాష్ట్ర అవతరణ సందర్భం లోనే ఆంధ్రుల స్వర్ణయుగం అన్న పేరుతో ఆంధ్రజాతి చరిత్రనూ, రాష్ట్రోద్యమ చరిత్రనూ ముఖ్యమైన వివరాలతో ఒక చిన్న గ్రంధంగా వ్రాసి, ఆంధ్ర సరస్వతికి ఒక ఆభరణంగా అర్పించాడు డాక్టరు ఖాను. ఆ గ్రంధం చూడటానికి చిన్నదే అయినా, అందులోని వివరాలు చరిత్రకు ఆణిముత్యాలు.

★★★

15. రసలింగం

బెజవాడ పట్టణంలో, గాంధీ నగరంలోని తాలూకా ఆఫీసు ఎదురుగా ఉన్న మేడ మీద 'రే అండ్ కో' అనే బోర్డును చూడని వారెవ్వరూ ఉండరు.

ముస్లింలీగు నుంచి రాజీనామా చేసి, జిన్నాను ఎదిరించి, డాక్టరు ఖాను జాతీయోద్యమంలో చేరిన మరునాడు ముస్లిం లీగర్లు, కమ్యునిస్టు వర్కర్ల ముట్టడికి లోనైంది ఆ మేడే. స్వప్నంలో ఆంధ్రరాష్ట్రం ప్రకటించబడ్డ తర్వాత, అందులో ఖానుగారి మనుమరాలికి మేఘరంజని అన్న పేరు పెట్టబడి ఉండడం చూచి, ముస్లింలలోని పామరజనం కొందరు మళ్ళీ మరొకసారి ముట్టడి జరిపిన మేడ కూడా అదే.

అటువంటి చరిత్ర కలది ఆ మేడ. అందుకే "రే అండ్ కో" అన్న బోర్డు అంత ప్రసిద్ధిని పొందింది. అది డాక్టరు ఖానుగారి వైద్యశాల.

వైద్యవృత్తి డాక్టరు ఖానుగారి కుటుంబంలో వంశానుగతంగా వస్తున్నట్టిది. డాక్టరు ఖాను తండ్రిగారు డాక్టరు నవాబ్ హుస్సేన్ ఆలీఖాన్. డాక్టరు ఆలీఖాన్‌గారు ఆలోపతి (ఇంగ్లీష్) వైద్యంలో మంచి పేరున్న వాడు. తూర్పు గోదావరి జిల్లా, పెద్దాపురంలో గవర్నమెంటు హాస్పటలులో ఆనరరీ సర్జనుగా ఉండేవాడు. సర్జరీ కేసులలో సిద్ధహస్తుడు. రెండు చేతులా సంపాదించేవాడు. ఒక పెద్దాపురంలోనే కాదు ఆ చుట్టుపట్ల కూడా ఆయనకు మంచిపేరు ఉండేది.

1916లో పెద్దాపురంలోనే, డాక్టరు ఆలీఖాన్ మోహతాబీ బేగం దంపతులకు ఒక కుమారుడు జన్మించాడు. ఆయన పేరు సర్కార్ మహబూబ్ ఆలీఖాన్. ఆయనే మన డాక్టరు ఎం.ఎ. ఖాను.

డాక్టరు ఖాను మూడేండ్ల పసిపాపగా ఉన్నప్పుడే తల్లిని కోల్పోయాడు. ఆ తర్వాత ఆయన పడ్డ అవస్థలు అన్నీ ఇన్నీ కావు.

1934లో ఏలూరులో చదువుకొంటున్న రోజుల్లో డాక్టరు ఖాను దృష్టి వైద్యం మీదికి మళ్ళింది. డాక్టరుగారి కొడుకు కావడం వల్ల ఆయన పుట్టుకతోనే డాక్టరు అయినాడు. రోగ నిదానం దానంతట అదే అలవడింది. చికిత్సకు మందులు అందుబాటులోనే ఉన్నాయి. హరిజనవాడల్లోనూ తదితర పేద ప్రజల్లోను, బజారుల్లోని కూలీలలోను, హోటళ్ళలోని సర్వర్లలోనూ, ఆయన వైద్యం పాదరసంలా ప్రవహించ సాగింది. చిన్నచిన్న రోగాలకు పెద్ద పెద్ద మందులిచ్చి ఆయన రోజుకు నాలుగైదు రూపాయల వరకు సంపాదించ గలిగేవాడట. అప్పటి కాయన వయస్సు 18 సంవత్సరాలు మాత్రం. ఈ రోజుల్లో నలభై యాభై రూపాయలన్న మాట. సామాన్య జనం ఒక కుర్రవాడికి ఆ మాత్రం డబ్బు మెచ్చి ఇచ్చే వారంటే అప్పటికే ఆయన వైద్యం ఎంత పటిష్ఠంగా ఉండేదో మనం ఊహించుకోవచ్చు.

ఆ తర్వాత కుటుంబంలో ప్రారంభమైన గాలిదెబ్బలకు గురై, అనాతవరంలో తన తండ్రివైపు బంధువైన షేక్ పెదమౌలా సాహెబ్ గారి వద్ద కొంత కాలం గడప

వలసి వచ్చింది. షేక్ పెదమౌలాసాహేబ్ మంచి స్థితిపరుడు. సహృదయుడు, దేశ భక్తుడు.

గోదావరి శాఖలైన గౌతమీ వైనతేయ నదుల మధ్య గల అమలాపురం – ప్రకృతి సౌందర్యంలో పరాకాష్ఠ నందుకొన్న కోనసీమలోని ఒక భాగం. బహుశా, అక్కడ గడపిన ఆ రోజులే ఆయనలోని జాతీయతను, దేశభక్తిని, సౌందర్యారాధనను, కవితాభావుకతను, స్వతంత్రజీవిత కాంక్షను వికసింపజేసి ఉండవచ్చు. ఆయన అక్కడ ఉన్నప్పుడే పాదరసపు గుళికలు, అమృతాంజనాన్ని పోలిన తైలాలు స్వయంగా చేసి అమలాపురంలోనూ, ఆ చుట్టుప్రక్కలను వైద్యం చేయటం సాగించాడు.

స్వయంగా మందులు తయారు చేయడం అప్పుడే అబ్బిం దాయనకు. ఆయన చేసే వైద్యంలో ప్రధానమైన ఔషధం పాదరసపు గుళిక. ఇది సర్వరోగ నివారిణి. రసాన్ని శుద్ధిచేసి కట్టిన ఈ గుళికలు సరైన అనుపానాలతోను, పథ్యంతోను వాడితే ఏ వ్యాధినైనా సరే నివారించగలవట !

ఇది తరతరాల నుంచీ వస్తున్న గృహయోగం కనుక, డాక్టరు ఖాను చిన్న నాటి నుంచే ఇందులో సిద్ధహస్తు డైనాడు.

ఆయన వద్దనున్న మరొక అపూర్వ యోగం రసలింగం. "రసము కట్టెనేని రాజ్యంబు కట్టును" అని వేమనయోగి చెప్పాడని, అట్టి రసయోగం కోసం తన తాతగారు, తండ్రిగారు కూడ ఎన్నో పరిశోధనలు జరుపుతూ వచ్చారని డాక్టరు ఖాను అంటాడు.

రసలింగం అంటే పాదరసాన్ని లింగాకారంలో గడ్డకట్టించడం. ఆ లింగాన్ని మెడలో ధరిస్తే ఎన్నోరకాల వ్యాధులు నయమౌతాయట !

ఈ రసలింగానికి ఆ రోజుల్లో పండితులలోను, పామరులలోను కూడ చెప్పలేనంత గిరాకీ ఉండేది. ఆనాడు అమలాపురంలోని ఒక ప్రముఖ మెడికల్ స్టోర్స్ వారు ఈ గుళికలకు, రసలింగాలకు డాక్టరు ఖానుగారి ప్రత్యేక ఏజెంట్లుగా ఉండి, వివిధ ప్రాంతాలకు వాటిని సరఫరా చేసేవారు.

అలా వచ్చిన డబ్బుతో స్వేచ్ఛగా, హుందాగా కాలం గడుపుతూ ఉండేవాడా యన. అయితే, అక్కడ షేక్ పెదమౌలా సాహెబ్‌గారి వృత్తి ప్రధానంగా వ్యవసాయం

కావడం వల్ల, డాక్టరు ఖానును ఒక వ్యవసాయకుడిగా తీర్చిదిద్దడానికి ఆయన ప్రయత్నం చేయడం వల్ల అక్కడి జీవితం డాక్టరు ఖానుకు తృప్తిని ఇవ్వలేక పోయింది. ఆ తర్వాత కొద్దికాలానికే తన పెదతండ్రిగారి సలహాపై, కోనసీమ సౌందర్యానికి ఒక నమస్కారం చేసి, డాక్టరు ఖాను విజయనగరం వెళ్ళిపోయాడు.

★★★

16. రే అండ్ కో

డాక్టరు ఖాను జీవితంలో ఇదొక ప్రధాన ఘట్టం. ఒక ముఖ్యమైన మలుపు. ఈనాడు సర్కార్ మహబూబ్ ఆలీఖాన్ అనే కుర్రవాడు సుప్రసిద్ధుడైన ఒక డాక్టరు కాగలిగాడంటే, దేశంలో ఆసాధ్య మనుకునే ఒక ప్రత్యేక శారీరక బాధతో కుమిలి పోయే దురదృష్టవంతులైన అనేక మంది పురుషులకు దేవుడిచ్చిన ఒకవరంగా భాసిస్తున్నాడంటే అందుకు పునాది వేసింది ఆనాటి ఆయన విజయనగరం యాత్రే.

విజయనగరంలో ఆయన ప్రత్యేక వైద్యం ప్రారంభించిన కొద్ది కాలానికే తన ప్రఖ్యాతి ఆ చుట్టు ప్రక్కల అంతటా వ్యాపించింది.

తమ జీవితం ఇక వ్యర్థం అనుకొంటున్న ఎంతో మంది పురుషులు ఎంతో సులభంగా ఆయన దగ్గర రోగనివారణను పొంది, సంతానవంతులై ఆనందించ సాగారు. దానితో ఆయనకు డబ్బు బాగా వచ్చేది. అందులో కొంత భాగాన్ని ప్రతి నెలా తన తండ్రికి కూడా పంపుతూ తాను ఒక జమీందారులా ఉన్నతస్థాయిలో డబ్బును ఖర్చుపెడుతూ, ఇతరులకు సహాయం చేస్తూ ఎంతో వైభవంగా జీవితాన్ని అనుభవింప సాగాడాయన.

ఒక కాంపౌండరు, ఒక వంటవాడు, ఒక నౌకరు – ఇలా ప్రారంభమైన ఆయన ప్రత్యేక వైద్యవృత్తి దినదిన ప్రవర్ధమానమౌతూ విజయనగరం నుంచి అనకాపల్లికి, అనకాపల్లి నుంచి నిడదవోలుకు – అలా మజిలీలు చేసుకొంటూ, చివరకు బెజవాడలో "రే అండ్ కో" అనే పేరుతో ఒక పెద్ద ఆస్పత్రిగా వికసించింది.

రే అనే ఆంగ్ల పదానికి కిరణం అని అర్థం.

"సమస్త వ్యాధుల్నీ సూర్యకిరణాలు బాగుచేస్తాయి. అలాంటి వ్యాధుల్లో ఒక అసాధ్య వ్యాధిని ఎట్టి శస్త్ర చికిత్సా లేకుండా అనాయాసంగా బాగుచేసే వైద్య కేంద్రం ఇది. అందుకే నా ఆస్పత్రికి రే అండ్ కో అని పేరు పెట్టాను. దీనికి నా పేరో, నా తండ్రిగారి పేరో, మా అబ్బాయి పేరో పెట్ట గలను. అనాదిగా మా ఇంట వర్ధిల్లుతూ వస్తున్న వైద్య దేవత ఇది. మా వంశమూల పురుషుడి పేరు కూడా పెట్టవచ్చు దీనికి. కాని, నా దృష్టిలో వ్యక్తులు ప్రధానం కాదు. మా కుటుంబం లోని ఎందరో వ్యక్తులు ఈ వైద్యం చేశారు. ముందు ముందు ఇంకా ఎందరో వ్యక్తులు చేయబోతారు. అందుకే వైద్యానికి మాత్రమే నేను ప్రాధాన్యం ఇస్తాను. అందుకే ఆరోగ్య దైవతం అయిన సూర్య భగవానుడి అమృతహస్తం పేరు మీద ఈ వైద్య సంస్థను నెలకొల్పాను" అంటారు డాక్టరు ఖాను.

ఆ పేరు పెట్టడంలో ఆయన ఉద్దేశం ఏదైనప్పటికీ, బృహద్రోగ పీడితులై దిక్కు తోచక దుఃఖించే అనేక మంది పురుషులకు ఈ సంస్థ ఒక ఆశాకిరణంగా భాసిస్తున్న దనడానికి సందేహం ఏమీ లేదు. ఆయన వైద్య కేంద్రానికి ప్రతిదినం చికిత్స కోసం వచ్చిపోయే వేలాది పురుషులే అందుకు ప్రత్యక్ష నిదర్శనం.

"ఈ సంస్థను ఇంకా అభివృద్ధి చెయ్యాలని ఉంది నాకు. ఆధునికమైన ఆపరేషనులు తప్ప మరో గత్యంతరం లేని ఈ వ్యాధికి, ఇంద్రజాలం లాంటి ఈ చికిత్స ఎంతో అద్భుతంలా పనిచేస్తుంది. ఆపరేషన్‌లను రూఢిగా నమ్మలేం. ఈ చికిత్సలో అట్టి ప్రమాదం ఏదీ లేదు. రోగ నివారణ జరిగి తీరవలసిందే. ఇది అనాది సిద్ధమైన మూలికా యోగం. ఇది పూర్వం మా కుటుంబ పరిధిలోని వారికే ఉపయోగ పడేది. నేను ఒక మన రాష్ట్రంలోనే కాక మన చుట్టుప్రక్కల రాష్ట్రాలలోని ప్రజలకు కూడా దీని సేవను అందచేస్తున్నాను. ప్రపంచమంతటా ఈ ఔషధాన్ని, చికిత్స విధానాన్ని వ్యాపింపజేయాలని నా ఆకాంక్ష. తైల రూపంలో, బిళ్ళల రూపంలో, ఇంజక్షన్ల రూపంలో దీన్ని విదేశాలకు ఎగుమతి చెయ్యవచ్చు. విదేశాల నుంచి కొత్త కొత్త ఔషధాలు, పేటెంటు మందులు అనేక రూపాలలో వేన వేలుగా మన దేశానికి దిగుమతి ఔతున్నాయి. ఈనాటికీ అప్రతిహతంగా, అప్రతిమానంగా, అసాధ్య

దీర్ఘరోగాలను సైతం నివారణ చేస్తున్న ఆయుర్వేదం, సిద్ధ, యునానీ ఔషధాలు మనకు ఉన్నాయి. గోసాయి చిట్కాలు, మూలికా యోగాలు వందలూ, వేలూ ఉన్నాయి. శుద్ధమైన ఒక సిద్ధ ఔషధాన్ని కూడా మనం విదేశాలకు ఎగుమతి చెయ్యలేక పోతున్నామూ అంటే ఏమను కోవాలి ? పరిశోధన, క్రియాశక్తి మనలో ఇంతగా ఎందుకు క్షీణించి పోయాయో ?" అంటాడు డాక్టరు ఖాను ఎంతో ఆవేశంతో.

రే అండ్ కో సంస్థను ప్రపంచ వ్యాప్తం చెయ్యాలని, తమ ఔషధాలను లోకం అన్ని మూలలకు అందుబాటులో ఉంచాలని ఆయన చిరకాల వాంఛ. ఆయన ఈ వాంఛే కాక – ఇటువంటి మహా వ్యక్తుల విశ్వజనీన సమ్యగభిలాషలన్నీ నెరవేరాలనేదే మనందరి కోరిక కూడ.

మానవ సేవే మాధవ సేవ అన్న గాంధీజీ తత్వబోధే పునాదిగా నడుస్తున్నది డాక్టరు ఖాను వైద్యసేవ – నిత్య నవనవోన్మేషంగా.

సూర్య కిరణం శక్తిదాయకం, చంద్రకిరణం ఓషధీ పోషకం. ప్రాణానికి ఆధారం చంద్ర సూర్యులే. బహుశా ఈ దృష్టితోనే కావచ్చు – ఆయన తన గృహాలలో ఒక దానికి సూర్య భవనం అని, మరొక దానికి చంద్ర భవనం అని నామకరణం చేశాడు.

★★★

17. తల్లిలేని బిడ్డ

తల్లిగారి మరణంతో, తండ్రిగారు మనఃక్లేశానికి గురై వైద్య వృత్తిని నిర్లక్ష్యం చెయ్యటంతో, డాక్టరు ఖాను కుటుంబాన్ని విషాద మేఘాలు క్రమ్ముకొన్న రోజులవి. ఆయన కప్పుడు మూడేండ్లు మాత్రమే. ఆయన జీవితంలో నిత్యం వెన్నంటి వస్తున్న తుఫాను గాలులు బహుశా అప్పుడే ప్రారంభించా యనుకోవచ్చు.

అప్పటికి పెద్దాపురంలో ఆయన కుటుంబం మంచి పలుకుబడిలోనే ఉంది. ఆయన తాతగారు షంషర్‌ల్లీ ఖాన్ మంచి ఆయుర్వేద వైద్యుడు. పెద్ద తండ్రి అబ్దుల్

అజీజ్‌ఖాన్ వెటరినరీ సర్జెను. మేనమామ ఇస్‌మేల్ ఖాన్ సివిల్ సర్జను. ఆయన పెద్దాపురం మునిపిపల్ చైర్‌మన్‌గా కూడా ఉండేవారు.

ఇంతటి ఉత్తేజకరమైన వాతావరణంలో, ఉత్తమ సంస్కారంలో, డాక్టర్ల వంశంలో పుట్టి కూడా చిన్నప్పుడే ఆయన తల్లిలేని బిడ్డ అయినాడంటే - మానవుని అసహాయత మరొకసారి రుజువు కావడమే.

ఆ తర్వాత తన నాయనమ్మ చేతుల్లో పెరిగాడు డాక్టరు ఖాను.

జనాబ్ హుసేన్ ఆలీఖాన్ భార్య మరణంతో పిచ్చివాడై - వృత్తిని, సంసారాన్ని కూడా నిర్లక్ష్యం చేసి - తిరుగుతున్నప్పుడు ఎంతో మంది ఆయన్ని ఓదార్చటానికి ప్రయత్నించారు. తనువులు శాశ్వతం కాదనీ, పుట్టిన వాళ్ళు గిట్టక తప్పదనీ - అలా ఎన్నో సత్యాలను బోధించారు. మానవ ధర్మాన్ని ఉపేక్షించ కూడదన్నారు. వైద్యవృత్తిని మానవద్దన్నారు. ఒకసారి మనస్సు పాడుచేసుకొంటే అది మళ్ళీ బాగుపడటం కష్టం అన్నారు.

ఏదీ కూడా డాక్టర్ ఆలీఖాన్ మనస్సుకు ఎక్కలేదు. అవన్నీ ఎవరికి తెలియవు గనుక. కష్టం కలిగినప్పుడు దుఃఖించడం, దుఃఖపడుతున్న వాళ్ళని ఓదార్చటం - ఇవన్నీ ఎప్పుడూ ఉంటూ ఉండేవే.

కాని -

తన నమస్తాన్నీ అర్పించి, తన కష్ట సుఖాలు అన్నిటిలోనూ భాగస్వామిని అయి, తన ప్రాణంలో ప్రాణంగా కలసిపోయిన సహ ధర్మచారిణిని కోల్పోయిన ఒక సహృదయుణ్ణి ఎంతమంది ఓదార్చ గలరు ? ఎన్ని సత్యాలు సేదదీర్చ గలవు ?

అయినా - ఏలాంటి వారికైనా, ఎంతటి విలువైన వస్తువును పోగొట్టుకున్న వానికైనా, ఓదార్పు పొందటమూ తప్పదు, సేద దేరడమూ తప్పదు. భార్యా వియోగంతో మానసికమైన దౌర్భల్యం ఏర్పడి. విరక్తి కలిగి కూర్చున్న డాక్టర్ హుసేన్ అలీ ఖానును చిట్ట చివరకు కర్తవ్యాభిముఖుణ్ణి చెయ్యగలిగిన గౌరవం లంకా సుబ్బారావు గారికి దక్కింది.

సుబ్బారావుగారు కాకినాడ వాస్తవ్యులు. జమీందారులు. ఆయన చేసిన కర్తవ్యోపదేశం డాక్టర్ హుసేన్ అలీఖాన్‌ను తిరిగి మేల్కొలిపింది. మనస్సు దిటవు చేసుకొని, తిరిగి వైద్య వృత్తిని అవలంబించటానికి ఆయన ఉత్సాహం కనబరచారు. అయితే – ఆమె లేని ఇంట్లో తానుండలేనని ఆయన చెప్పడం వల్ల, సుబ్బారావుగారు ఒక పరిచయ లేఖతో ఆయనను పంగెడిగూడెం పంపించారు. దానితో డాక్టరు ఖానుగారి కుటుంబం తూర్పు గోదావరి నుంచి పశ్చిమ గోదావరికి మారింది.

పంగెడిగూడెం పశ్చిమ గోదావరి జిల్లాలో ఏలూరు దగ్గర ఒక గ్రామం. నార్త్‌ఫ్ట్ వల్లూరు ఎస్టేట్ రాజాగారైన శ్రీ రాజా బొమ్మదేవర వెంకటరాయలు నాయుడు బహదూర్ వారి నివాసం అది. శ్రీ రాజావారు లంకా సుబ్బారావుగారికి బావగారు. రాజా వారికి మంచి అనుభవజ్ఞుడైన ఒక ఫేమిలీ డాక్టర్ అవసరమని ఎరిగి ఉన్న సుబ్బారావుగారు ఆ స్థానానికి డాక్టర్ హుస్సేన్ ఆలీఖాన్ గారిని రికమండ్ చేశారు. ఆ విధంగా డాక్టర్ హుస్సేన్ ఆలీఖాన్ గారు పంగెడిగూడెం రాజా వారికి ఆస్థాన వైద్యులైనారు.

కోటలోనే డాక్టరు గారికి వసతి ఏర్పాటు చేయబడింది. రాజా వారి బంగళాకు అటూ ఇటూ రెండు భవనాలు ఉండేవి. అందులో ఒకటి డాక్టరు గారికి, ఒకటి ఎస్టేట్ దివాను గారికి కేటాయించబడినాయి. అప్పటికి మన ఖానుకు నాలుగేండ్లు.

డాక్టరు ఖాను విద్యాభ్యాసం కోటలోనే ఓనమాలతో ప్రారంభమైంది.

ఒక ముస్లింబాలుని విద్యాభ్యాసం తెలుగు సంప్రదాయంలో ఓనమాలతోనూ, పెద్దబాలశిక్షతోనూ ప్రారంభమైనదంటే భాషకు మతానికి తేడా తెలియని కేవల ప్రాకృతులకు వింతగానే కనిపించవచ్చు. కానీ, సర్వజ్ఞుడు, సమదర్శనుడు అయిన పండితుడికి అదే ఉత్తమ సంస్కార మార్గం.

తెలుగు నేలలో పుట్టినవాడు తెలుగు చదవడం కనీస ధర్మం. తెలుగు చదవ దలచినవాడు తెలుగు సంప్రదాయ ప్రకారం అక్షరాభ్యాసం చెయ్యక తప్పదు. ఇది భాషా విషయం. మతంతో సంబంధం లేదు. ఇట్టి ఉత్తమ సంప్రదాయాన్ని

ఎరిగినవారు కనుకనే డాక్టరు ఖాను కుటుంబంవారు అట్టి పద్ధతిని అవలంబించ గలిగారు.

అంది పుచ్చుకున్నట్టుగా వచ్చింది చదువు డాక్టరు ఖానుకు. అచిర కాలంలోనే పెద్దబాలశిక్ష పూర్తి చేసి, గజేంద్రమోక్షం తీసుకున్నా డాయన ఆ తర్వాత రుక్మిణీ కల్యాణం. ఆయన గురువు కనకయ్య పంతులుగారు.

★★★

18. కనకయ్య పంతులుగారు

"గురువంటే కనకయ్య పంతులుగారే గురు వనిపిస్తుంది నాకు. ధనరూపంలో గాని, వస్తు రూపంలో గాని ఎన్నడూ ఏమీ తీసుకోలే దాయన మా దగ్గర. కేవలం చదువు కోసమే చదువు చెప్పేవా రాయన. భారత భాగవతాలను టీకా తాత్పర్యాలతో సహా ఆనాడు ఆయన నాకు అంతగా నూరిపొయ్యడం వల్లనే ఈనాడు నాకు ఈ మాత్రపు అక్షర జ్ఞానమైనా కలిగింది. గురువులోని ఆత్మీయతే శిష్యుణ్ని ఆత్మజ్ఞానిగా చేస్తుంది. గురుఃబ్రహ్మ, గురుఃవిష్ణు, గురుదేవో మహేశ్వరః – అనుకున్నప్పుడెల్లా నాకు నేటికీ ఆనాటి కనకయ్య పంతులుగారే కళ్ళముందు సాక్షాత్కరిస్తారు" అంటాడు డాక్టరు ఖాను, తన బాల్యాన్ని గుర్తుకు తెచ్చుకుంటూ. ఆయన జీవితంలో అదొక స్వర్ణయుగం.

డాక్టరు హుసేన్ ఆలీఖాన్ ఆస్థాన వైద్యుడైనట్లే, పంగెడిగూడెం సంస్థానంలో కనకయ్య పంతులుగారు ఆస్థానోపాధ్యాయుడు. కోటలోని రాజావారి పిల్లలకు, దివానుగారి, డాక్టరుగారి, సెక్రటరీగారి పిల్లలకు మాత్రమే చదువు చెప్పేవాడాయన. బాగా చదువు కొన్నవాడు. గొప్ప విద్వాంసుడు. అన్నిటినీ మించి సహృదయుడు. శ్రేయోభిలాషి. ఒక్క చదువుకు సంబంధించినంతవరకు మాత్రమే కాక బాలక్రియా రంగంలోని అనేక తదితర విషయాలకు సంబంధించి కూడా కనకయ్య పంతులుగారు డాక్టరు ఖానుకు గురువు.

బొబ్బిలి యుద్ధం నాటకంలో ఆయన రంగారాయుడుగా నిలిస్తే డాక్టరు

ఖాను చిన రంగారావు పాత్రను ధరించేవాడు. అంటే కనకయ్య పంతులుగారు డాక్టరు ఖానుకు నాటకాల గురువు కూడా అన్నమాట.

పంగెడిగూడానికి ద్వారకా తిరుమల (చిన్న తిరుపతి) చాలా దగ్గర. ఆరుమైళ్ళు మాత్రమే. అక్కడికి వెళ్ళేయాత్రికులు చాల వరకు పంగెడిగూడెం మీదుగానే వెళ్ళాలి. అందులో, పండితులైనవారు శ్రీరాజావారిని దర్శించి, ఎన్నో విధాల కీర్తించి, వారి వద్ద నుంచి ఎన్నో బహుమానాలను తీసుకొని పోతూ ఉండేవారు.

ఆ రోజుల్లో అది ఒక చిన్న కృష్ణదేవరాయల ఆస్థానంలా ఉండేది. దసరా ఉత్సవాలను చూడాలంటే మైసూరు తర్వాత పంగెడి గూడెమే అని ప్రజలు చెప్పుకొనే వారు. ఇక కనకయ్య పంతులుగారి ఆధ్వర్యంలో నాటకాలకు, వినోదప్రహసనాలకు లోపం ఉండేది కాదు.

డాక్టరు ఖాను శ్రావ్యంగా పాడేవాడు కూడ. రాజావారు, రాణివారు, వారి కుటుంబ సభ్యులు చాల సరసులు, సహృదయులు. తోచినప్పుడెల్లా వారు ఆయనకు కబురు చేసి, ఆయనచేత రుక్మిణీ కళ్యాణంలోని పద్యాలు పాడించుకొంటూ, ఎన్నో బహుమతులు ఇస్తూ ఉండేవారు. అందు బంగినపల్లి మామిడిపళ్లూ, బత్తాయి నారింజపండ్లూ వంటి ఆయాకాలోపలబ్ధాలైన ఫలాలే ఎక్కువగా ఉంటూ ఉండేవి.

తనకు సంగీతం, సాహిత్యం, నాట్యం, శిల్పం, ఆశుకవిత, తెలుగు ఇంగ్లీషు భాషల్లో ప్రవేశం – మానవ జీవితం ఉత్తేజకరంగా సాగడానికి అవసరమైన అన్ని విద్యలూ, తనలో బీజప్రాయంగానైనా అవాపితాలై ఉన్నాయంటే, అందుకు కారణం కనకయ్య పంతులుగారి శుశ్రూషా, అక్కడ అమృత వాతావరణమూ – అంటాడు డాక్టరు ఖాను.

కనకయ్య పంతులుగారు విద్వత్తులోనూ, విద్యాబోధనలోనూ ఎంత గట్టివాడో, అంత స్వాతంత్ర్య ప్రవృత్తీ, ఆత్మాభిమానమూ కలవాడు.

ఒకసారి ఆయన పాఠం చెపుతూ, రాజావారికి సంబంధించిన ఒక పిల్లవాణ్ణి బెత్తంతో కొట్టాడు. ఆ విషయం రాజావారికి తెలిసింది. రాజావారు ఆయన్ని పిలిపించారు. ఆ పిల్లవాడు పాఠాలు చదవటం లేదనీ, మందలించక తప్పలేదనీ పంతులుగారు అన్నారు. అయినా సరే పిల్లల్ని కొట్టకూడదన్నారు రాజావారు.

"అయ్యా ! విద్య చెప్పేటప్పుడు నా పద్ధతి నేను అనుసరిస్తాను. తెలివి తేటలు రకరకాలుగా ఉంటాయి. ఒకొక్క విద్యార్థి పట్ల ఒకొక్క విధానాన్ని ఉపాధ్యాయుడు అనుసరించ వలసి ఉంటుంది. వాత్సల్యం హృదయంలో ఉండవలసినట్టిది. విద్యను బోధించే వేళ కొంత కాఠిన్యం ప్రదర్శింపక తప్పదని నా ఉద్దేశం. లేకపోతే, సరైన శిక్షణ లేక పిల్లలు చెడిపోతారు. పిల్లల పట్ల విద్యకు సంబంధించినంత వరకు గారాబం పనికిరాదు. మీరు ఇలా కలుగ చేసుకుంటే, గురువుగా నా కర్తవ్యాన్ని నిర్వహించలేను" అంటూ పంతులుగారు ఆ బెత్తాన్ని రాజావారి ఎదుట ఉంచేసి, నమస్కారం చేసి, వెళ్ళిపోయారు, మళ్ళీ కనిపించలేదు. ఆయన కోసం రాజావారు ఎంత వెదికించినా, ఫలితం లేకపోయింది.

అది ఆనాటి ఉపాధ్యాయుల ఆత్మ గౌరవస్థాయి. జీతం కోసం, జీవితంకోసం తాపత్రయ పడటమే ఎరుగరు వారు. తమలో ఉన్న విద్యను ఎదుట వారిలో ప్రవేశపెట్టడం ఒక్కటే వారి లక్ష్యం. తమ శిష్యులు తమంత వారు కావాలన్నది ఒక్కటే వారి ధ్యేయం.

అందుకే ఆ రోజుల్లో సమాజంలో ప్రధమస్థానం ఉపాధ్యాయుడికే ఉండేది. విద్యార్థులలో అప్రతిమానమైన క్రమశిక్షణ ఉండేది. పాఠశాలల్లో సరస్వతి తాండవించేది. ఆనాటి ఉన్నతశ్రేణి శిక్షణ విధానం దిగజారి పోవడం వల్లనే ఈనాడు ఉపాధ్యాయుల గౌరవం, విద్యార్థుల తెలివితేటలు. క్రమశిక్షణ స్థాయి కూడ దిగజారి పోయింది.

భయభక్తులు లేని చోట విద్య అబ్బదు. విద్య అబ్బని చోట క్రమశిక్షణ ఉండదు. క్రమశిక్షణ లేని జాతి వట్టి జీవచ్ఛవం మాత్రమే.

ఈనాటి విద్యావిధానాన్ని పరిశీలించి చూస్తే - మిషనరీ స్కూళ్లలో ఉన్నంత ఉన్నతస్థాయిలో విద్య గవర్నమెంటు స్కూళ్ళలో ఉండటం లేదు. కారణం ఏమిటి ?

6-12 సంవత్సరాల మధ్య కుర్రవాళ్ళను విద్యకు అభిముఖులను చెయ్యడం కోసం ఉపాధ్యాయులు తమ శక్తిసామర్థ్యాలతో పాటు బెత్తాన్ని కూడ ఉపయోగించే వారు పూర్వం. ఆ వయస్సులోని కుర్రవాళ్ళకు భయమూ, భక్తీ రెండూ అవసరమే. ఇంటివద్ద తల్లిదండ్రులు, స్కూళ్ళలో గురువులు వాటిని ఉపయోగించి, బాలకుల్ని క్రమశిక్షణ కల నియమబద్ధులైన యువకులుగా తయారు చేసేవారు.

ఈనాడు వాటి స్థానంలో కఠినమైన నియమ నిబంధనలను అమలు పరచటం ద్వారాను, అట్టి ప్రతిభ కల ఉపాధ్యాయులను ఎంచుకోవడం ద్వారాను ఉన్నతశ్రేణి విద్యా ప్రబోధాన్ని మిషనరీ స్కూళ్ళు సాధించగలుగుతున్నాయి.

అట్టిది లేని మామూలు పాఠశాలల్లో కనీసం బెత్తాన్ని అయినా తిరిగి ప్రవేశపెట్టకపోతే, ఏం మిగిలేటట్టు ? పన్నెండు సంవత్సరాల లోపు పిల్లలకు బెత్తమే సరస్వతీ స్వరూపం కాదా ?

ఆరు-పన్నెండు సంవత్సరాల మధ్య కుర్రవాళ్ళని కేవలం సేవకులుగా చూడమని మన ధర్మ శాస్త్రాలు చెపుతున్నాయి. ఈ నాటి విద్యార్థి లోకంలో అవిద్య, అవిధేయత, అశిక్షణ ఇంత ఘోరంగా అలుముకొని ఉండడానికి హేతువు బహుశా ఈ ప్రాథమిక సత్యాన్ని గుర్తించక పోవడమే నేమో ! పవిత్ర విద్యా పీఠాలను ఆక్రమించుకొని కూర్చున్న పెద్దలు రాజకీయ స్వార్థాలకు, పదవీ వ్యామోహాలకు బానిసలుగా తయారై పోవడమే నేమో !

★★★

19. ఒక్క నెలలో రెండు క్లాసులు !

కనకయ్య పంతులుగారు వెళ్ళి పోవటంతో కోటలో విద్య కుంటుపడి - చదువు కోసం ఏలూరు పోవలసి వచ్చింది డాక్టరు ఖాను. అక్కడ 1932-33 సంవత్సరంలో, మునిసిపల్ హైస్కూలులో ఫస్ట్ ఫారంలో చేరాడాయన.

అక్షరాభ్యాసం తెలుగులో జరగడం వల్ల, తెలుగు భాషలో నిష్ణాతుడైన వ్యక్తి ఉపాధ్యాయుడుగా ఉండడం వల్ల తెలుగు భాష బాగానే వచ్చింది డాక్టరు ఖానుకు. కోటలోని లైబ్రరీలో లభించే భారత రామాయణ భాగవతాది గ్రంథాలు తరచు చదువుతూ దాన్ని మరింత అభివృద్ధి చేసుకొన్నా డాయన. తెలుగుతోపాటు కనకయ్య పంతులుగారే ఇంగ్లీషు కూడా చెప్పేవారు. అందుకే డాక్టరు ఖానుకు తెలుగు, ఇంగ్లీషు వచ్చినంతగా ఉరుదు భాష రాదు.

పన్నెండు సంవత్సరాల వయస్సు వచ్చేంత వరకూ కోటలోనే ఉండడం వల్ల, బయట ప్రపంచం గురించే తెలియదు ఖానుకు. అన్ని సౌకర్యాలూ, వినోదాలూ, ఆటపాటలూ – అన్నీ కోట గోడల మధ్యే జరిగిపోయేవి. కోట గుమ్మం వద్ద విచ్చు కత్తుల పహరా ఉండేది. కోట దాటి బయటకు వచ్చే అవకాశమే లేదు. అవసరమూ లేదు. తాను చదువు కోసం ఏలూరు బయలుదేరే వరకూ, తన ఆ పన్నెండేండ్ల బాల జీవితం ఒక "ఎ" క్లాస్ ఖైదీలా గడిచిందంటా డాయన.

కోట దాటి బయట ప్రపంచంలో అడుగు పెట్టగానే, ఒక నూతన ప్రపంచంలో అడుగుపెట్టి నట్టనిపించిం దాయన కాక్షణం. రోడ్లు, బళ్ళు, ఎంతో మంది మనుష్యులు, విశాలమైన పొలాలు, పెద్ద పెద్ద స్కూళ్ళు, అంగళ్ళు, హోటళ్ళు – అపూర్వమైన ఒక వింత అనుభూతిని, హాయిని కలిగించినై ఆయనకు. ఆయన ఫస్ట్ ఫారం చదువు నల్లేరు మీద బండిలా నడవసాగింది.

స్కూల్లో చేరిన ఒక మాసం రోజుల్లోనే అక్కడ జరిగిన ఒక విశేషాన్ని గురించి ఎంతో సంతోషంతో చెపుతూ ఉంటాడు డాక్టరు ఖాను.

ఒక రోజున హఠాత్తుగా హెడ్ మాష్టరుగారు వాళ్ళ క్లాసు లోకి వచ్చి ప్రశ్నలు వేశారట ! ఇంగ్లీషులోనూ, తెలుగులోనూ కూడ డాక్టరు ఖాను మంచి ఘటికుడుగానే కనిపించాడు ఆయనకు. హెడ్ మాష్టారు ఇంగ్లీషులో కొన్ని ప్రశ్నలు అడిగిన మీదట, చాలా మెచ్చుకొని "ఇంగ్లీషులో దిట్టంగానే ఉన్నాడు. తెలుగులో ఎలా ఉన్నాడో చూడండి" అంటూ తెలుగు మాష్టారు కేసి చూశాడు. తెలుగు మాష్టారికి ఈ కుర్ర వాని సంగతి అంతకుముందే తెలుసు గనుక, ఒక పద్యం చదివి, దాన్ని వివరించ మన్నాడు.

ఇలలో ఇద్దరు రాజులు
మలయుచు చదరంగ మాడి, మాపటి వేళన్
బలమెత్త మరచి పోయిన,
ఎలుకలు తమ కలుగులోని కేనుగ నీడ్చెన్.

ఈ పద్యాన్ని విని, దానికి అర్థం చెప్పమన్నట్టు చూశాడు క్లాసు పిల్లలందరి

వైపు హెడ్మాష్టారు. ఎవరూ సరైన సమాధానం చెప్పలేదు.

అసలే అది ఫస్ట్ ఫారం క్లాసు. చదరంగం ఆటను చూచిన వాళ్ళు గానీ, కనీసం వినిన వాళ్ళు గానీ ఆ క్లాసులో ఉండి ఉండరు. ఉన్నా, పద్యం అర్థమై ఉండదు. కోటలో నిత్యమూ చదరంగం ఆటను చూస్తూ ఉండేవాడు కనుకనూ – పద్యాలనూ, సమస్యలనూ ఎరిగి ఉన్న వాడు గనుకనూ – డాక్టరు ఖాను తనకున్న పాండిత్యాన్ని ప్రదర్శిస్తూ పద్యాన్ని మంచి నీళ్ళ ప్రాయంగా వివరించాడు.

హెడ్ మాష్టారు ఎంతో సంతోషించారు. ఆ వెంటనే ఆయన్ను ఫస్ట్‌ఫారం నుండి సెకండు ఫారంకు ప్రమోట్ చేశారు.

ఒక నెలలోనే రెండు క్లాసులు !

శ్రేణికి మించిన తెలివితేటలు కనబరచే పిల్లలకు డబుల్ ప్రమోషన్లూ, ట్రిబుల్ ప్రమోషన్లూ కూడా ఉండేవి ఆ రోజుల్లో.

విద్యకూ, విద్యార్థులకు మంచి రోజులవి. మెరిట్‌ను గుర్తించి గౌరవించే వారు గనుకనే ఆనాడంత ఉన్నత స్థాయిలో ఉండేది విద్య. విద్యను బట్టి వృత్తి నైపుణ్యం, వృత్తి నైపుణ్యాన్ని బట్టి విశ్వప్రశస్తి !

ఏలూరులో ఆయన చదువంతా ఇలాంటి ఎన్నో చమత్కారాలతోనే నిండి ఉండేది. పిట్టకొంచం కూత ఘనం అన్న సామెతను అడుగడుగునా రుజువు పరుస్తూ ఉండేవాడు ఆయన.

ఒక రోజు తండ్రి గారితో ఒక సభకు వెళ్ళాడాయన. ఏలూరు మునిసిపాల్టీకి చైర్‌మెన్‌గా ఉన్న మోతే నరసింహారావు గారికి రావు బహదూర్ బిరుదు ఇచ్చింది ప్రభుత్వం. ఆ సందర్భంలో పట్టణంలో ఉన్న పెద్దలంతా ఆయనకు సన్మానసభ ఏర్పాటు చేశారు. అదీ ఆ సభ.

పెద్దలంతా ఉపన్యాసాలు ఇచ్చారు. కవులు పద్యాలు చదివారు. అదంతా చూస్తూ ఉన్న డాక్టరు ఖాను ఒక చిన్న కాగితం మీద తాను కూడా రెండు పద్యాలు వ్రాసి, ఎవరి అనుమతీ పుచ్చుకోకుండానే వేదిక ఎక్కి, నరసింహారావుగారి ప్రక్కన నిలబడి, గబగబా చదివేశాడు.

అంత చిన్నవాడు, ముస్లిం కుర్రవాడు, తెలుగు పద్యాలు వ్రాయడమే కాక, ధైర్యంగా వేదిక ఎక్కి, అంత శ్రావ్యంగా చదవడం !

సభంతా విస్తుపోయింది.

అప్పటికి పంగెడిగూడెం నుంచి వచ్చేసి, భీమడోలు స్కూలులో ఉపాధ్యాయుడుగా ఉంటున్న కనకయ్య పంతులు గారు, తన శిష్యుని ప్రతిభా వికాసాన్ని చూచి ఎంతో మురిసిపోయారు.

ఆ రోజుల్లోనే డాక్టరు ఖాను ప్రదర్శించిన ప్రతిభా విశేషాలలో ముఖ్యమైన మరొకటి – బియ్యపు గింజ మీద అక్షరాలు వ్రాయడం. అత్యద్భుతమైన ప్రక్రియ ఇది. ఎంతో నైపుణ్యం, హస్త సౌకుమార్యం, లాఘవం, దీక్ష, సహనం అవసరమైన విద్య ఇది. ఈ పనితనం ద్వారా ఉపాధ్యాయు లందరికీ అభిమాన పాత్రుడయ్యాడాయన.

చక్కని బియ్యపు గింజల మీద ఆనాటి జమీందార్ల పేర్లు, వదాన్యులైన పెద్దల పేర్లు వ్రాసి, వారికి వాటిని బహూకరిస్తూ ఉండేవాడు. అందుకు ప్రతిఫలంగా వారు ఆయనకు సన్మానాలు చేస్తూ ఉండేవారు. ధనరూపం గానూ, వస్తు రూపం గానూ ఎన్నో బహుమతులు ఇస్తూ ఉండేవారు. అర్థ నూట పదహార్లను కూడ ఇచ్చేవారు. ఆ కాలంలో అర్థ నూట పదహార్లు అంటే ఈ కాలంలో వెయ్యి న్నూట పదహార్లే.

★★★

20. గాంధీజీ - జాతీయతా బీజం

ఏలూరులో డాక్టరు ఖాను మూడవ ఫారం చదువుతున్న సమయంలోనే గాంధీజీని చూచే అదృష్టం ఆయనకు పట్టింది.

1934లో గాంధీజీ ఆంధ్రదేశంలో పర్యటిస్తూ ఏలూరు వచ్చారు. ఆయన రావడానికి కొద్ది రోజులు ముందు నుంచే, ఆయనకు స్వాగతం చెప్పే నిమిత్తం ఏలూరు పట్టణం అంతా సమాయత్తం కాసాగింది. హైస్కూలు లోని విద్యార్థులలో

ఉత్సాహం పరవళ్ళు త్రొక్కసాగింది. స్కౌట్ మాష్టారు జోశ్యుల వెంకటరావుగారు స్కౌట్లను తయారు చేస్తున్నారు. స్కౌట్లలో చాలా ఉత్సాహవంతులైన కుర్రవాళ్ళలో డాక్టరు ఖాను ప్రథముడైనాడు.

గాంధీజీ వచ్చినప్పుడు, జనం తోసుకు వచ్చి ఆయన మీద పడకుండా ఎలా అరికట్టాలో, ఆయన చుట్టూ ఎలా రక్షణ కలిపించాలో ఆయన కారు వెంట ఎలా ఉండాలో, కారు దిగినప్పుడు, ఎక్కినప్పుడు, ప్రయాణం చేస్తున్నప్పుడు, సభల్లో ఉపన్యాసాలు ఇస్తున్నప్పుడు ఏ ఏ స్థానాల్లో ఉండి ఏయే విధంగా ప్రవర్తించ వలసి ఉంటుందో – ఆ పద్ధతు లన్నిటిలోనూ క్షుణ్ణంగా బాల భటు లందరికీ తరిఫీదు ఇచ్చారు వెంకటరావు గారు.

గాంధీజీ ఏలూరులో ఉన్నంతసేపూ ఆయన్ని అంటి ఉండవలసిన బాలభట దళానికి డాక్టరు ఖాను నాయకు డైనాడు.

దేశమంతా అరాధించే గాంధీమహాత్ముణ్ణి అంత సన్నిహితంగా చూచే భాగ్యం తనకు లభించినందుకు ఎంతో ఉప్పొంగిపోయాడు ఆయన. ఆయన బాల హృదయం ఎగిరి గంతులు వేసింది.

పట్టణమంతా అలంకరించబడింది. కాంగ్రెసు సంస్థవారు పెద్ద ఎత్తున స్వాగత సన్నాహాలు చేస్తున్నారు. దూరగ్రామాల నుంచి వచ్చే అశేష ప్రజానీకానికి జాతిపితను దర్శించుకునే మహాభాగ్యం సులభ సాధ్యం అయ్యేలా సకల సౌకర్యాలు ఏర్పాటు చేయబడినై.

గాంధీజీ అనుకొన్న రోజున అనుకొన్న వేళకే ఏలూరు స్టేషన్ దిగారు కాని, వారి రక్షణ కోసం స్కౌట్ మాష్టారు చెయ్యాలనుకుందల్లా వ్యర్థమే అయింది.

రక్షణ ఏర్పాటులన్నీ పోలీసువారే చేశారు. కాంగ్రెసు వాలంటరీలు ఉండనే ఉన్నారు. అందువల్ల హైస్కూళ్ళ బాలభటుల అవసరం లేకుండానే పోయింది.

అయితే... గాంధీజీ ఊరేగింపులో, రోడ్డు పొడుగునా ఇసక వేస్తే రాలనట్టున్న జనం, తోసుకొచ్చి కారు మీద పడకుండా ఆయన కారు మడ్‌గార్డు మీద ఇటొక బాల భటుణ్ణి, అటొక బాల భటుణ్ణి పెట్టారు. అందులో డాక్టరు ఖాను ఒకడైనాడు.

జీవితంలో తనకు పట్టిన గొప్ప అదృష్టాలలో ఆనాడు తనకు లభించిన ఆ అవకాశం ఎంతో ప్రధానమైన దంటాడు ఆయన.

"ఆ వేళ సాయంత్రం, గాంధీజీ ఊరేగింపు ఆయన కోసం ఏర్పాటు చేసిన బంగాళాకు చేరేసరికి చీకటి పడింది. వెంటనే ఆయన ప్రార్థనలో కూర్చున్నాడు. "ఈశ్వర్ అల్లా తేరేనాం. సబ్‌కో సన్మతిదే భగవాన్" అంటూ. అక్కడ సమావేశమైన జన సమూహమే కాక, దశ దిశలు కూడా ఆయనతో కలసి గొంతెత్తి పాడినై. ఆ వాతావరణం ఎంతో దివ్యంగా, ఆనందకరంగా ఉంది. ప్రార్థన అయేసరికి రాత్రి ఎనిమిది గంటలైంది. మమ్మల్ని అందర్నీ ఇళ్ళకు పొమ్మన్నారు.

"ఇంటికి వెళ్ళానన్న మాటే గాని, మనస్సంతా గాంధీజీ పైనే ఉండిపోయింది. ఆ ముఖం, ఆ చిరునవ్వు, ఆ చూపులు, ఆ తేజస్సు, ఆ మాటలు, ఆ ప్రసంగంలో ఉండే తీవ్రత, ఆ ఊరేగింపు, ఆ జనం... వీటితోనే నిండి ఉంది నా మనస్సు. రాత్రంతా ఆవే స్వప్నాలు. ఎప్పుడు తెల్లవారుతుందా, ఎప్పుడు మళ్ళీ ఆ మహాత్ముని సాన్నిధ్యం లభిస్తుందా అన్న ఉద్రేకభావం తోనే గడచిపోయిందా రాత్రి.

"ఇంకా తెల్లవారకుండానే లేచి, కాలకృత్యాలు ముగించి, యూనీఫారం ధరించి, హోటల్‌లో టిఫిన్ తిని, గాంధీజీ మకాం చేరుకొన్నాను. స్కౌటును గనుక, గాంధీజీ సన్నిధిలో ఉండటానికి నాకు ఎలాంటి అభ్యంతరం ఏర్పడలేదు.

"నేను ఆయన దగ్గరకు వెళ్ళేటప్పటికి ఆయన ఒళ్ళు పట్టించుకొంటున్నారు. ఎవరో ఇద్దరు వ్యక్తులు ఆ ఉదయం వచ్చిన పత్రికలను ముందువేసుకొని, ఒక్కొక్కటే తీసి వార్తలు చదివి వినిపిస్తున్నారు. పట్టణంలో ఉన్న పెద్దలు, ఆ ప్రాంతాల నాయకులు ఒక్కొక్కరే వచ్చి మాట్లాడి వెళుతున్నారు. ఈ పనులన్నీ ఏక కాలంలోనే జరిగిపోతున్నాయి. ఒకేసారి ఇన్ని పనులు చేస్తూ కూడా, గాంధీజీ ఒళ్ళు పట్టించు కొంటునే ఉన్నారు. రాట్నం వడుకుతూనే ఉన్నారు. ఒక ప్రక్కన పెద్దలతో మాట్లాడు తూనే ఉన్నారు. మరోప్రక్క వార్తలు వింటూ ఉన్నారు. నిజంగా ఆయన మూర్తీ భవించిన సమగ్రకృషి! దేశ మాతకు విదేశీ దాస్యం నుంచి విముక్తి కలిగించడానికి అవతరించిన భగవంతుడు అంటాడు డాక్టరు ఖాను – ఆనాటి సంఘటనను జ్ఞప్తికి తెచ్చుకొంటూ!

గాంధీజీ మీద అపరిమితమైన భక్తి గౌరవాలు ఏర్పడటానికి, బ్రిటిష్

పాలకుల మీద ద్వేషభావం కలగడానికి, దేశదాస్య విమోచన పోరాటంలో తాను ప్రవేశించటానికి అప్పటి సన్నివేశం తనకెంతో తోడ్పడిందంటాడాయన.

ఆనాటి నుంచి దృఢమైన జాతీయవాదిగా మారిపోయాడు డాక్టరు ఖాను.

అంతకు ముందు నుంచే ఈ జాతీయతా బీజం ఆయనలో ఉంది. 1923 ప్రాంతంలో కాకినాడలో జరిగిన ఖిలాఫత్ మీటింగులకు ఆయన తండ్రిగారు హాజరైనారట. షౌకతాలీ, మహమ్మదాలీ మొదలైన నాయకుల ఉపన్యాసాలన్నీ అవగాహన చేసుకున్నారట. ఆ విషయాలన్నీ తండ్రిగారి దగ్గర నుంచి డాక్టరు ఖాను వింటూ ఉండేవాడట. తనలో భక్తిబీజం బాగా నాటుకోవడానికి అవన్నీ తోడ్పడ్డాయి అంటాడు ఆయన.

ఆ తర్వాత జరిగిన జాతీయ యువకవీరుల పోరాట గాథలు – ముఖ్యంగా అల్లూరి సీతారామరాజు తిరుగుబాటు ఉదంతం, కాకినాడ బాంబు కేసు, భగత్ సింగ్ ప్రభృతుల చరిత్ర ... ఇవన్నీ తన నెత్తురు వీరోచితం చేశాయంటాడాయన.

★★★

21. కళా వెంకటరావు కాంగ్రెసుతో తొలి పరిచయం

1937లో తాను అనాతవరం (అమలాపురం)లో ఉంటున్నప్పుడు తొలిసారిగా కాంగ్రెసు రాజకీయ రంగంలో ప్రవేశించాడు డాక్టరు ఖాను.

ఆ సంవత్సరం లోనే బ్రిటిష్‌వారి క్రొత్త రాజ్యాంగం క్రింద తొలిసారిగా ఎన్నికలు జరిగినై.

అప్పటికి రాష్ట్రంలో జస్టిస్ పార్టీ అధికారంలో ఉంది. భారతీయ కాంగ్రెసు సంస్థ ఒక రాజకీయ పార్టీగా ఎన్నికలలో పోటీ చెయ్యడానికి అదే ప్రారంభం.

పిఠాపురం రాజావారి నాయకత్వంతో అప్పుడే పుట్టిన పీపుల్సు పార్టీ కూడా ఎన్నికలలో పోటీ చెయ్యడానికి పూనుకొంది. ఆ ఎన్నికలలో ప్రజల దృష్టిని ఆకర్షించిన ప్రధాన నియోజక వర్గాలలో అమలాపురం ఒకటి. అక్కడ కాంగ్రెసు తరఫున కళా

వెంకటరావుగారు, పీపుల్సు పార్టీ తరపున పిఠాపురం యువరాజావారు పోటీ చేశారు. పీపుల్సు పార్టీ డబ్బును మంచినీళ్ళ ప్రాయంగా ఖర్చు పెట్టింది. లక్షలు తగలేసింది. ఆ డబ్బంతా మధ్యవర్తుల జేబులలోకి పోయింది. ప్రజల దాకా రాలేదు. అది వేరే కథ. ప్రజలు మాత్రం దేశభక్తి పూరితులై, తుఫానులోని మహా సముద్రంలా ఉద్రిక్తులై ఊగిపోయారు.

ఒక ప్రక్క తన సమస్తాన్నీ హరిజనోద్ధరణ కోసం, హరిజన బాల బాలికల విద్యాభివృద్ధి కోసం, అనదల కోసం, అబలల కోసం త్యాగం చేసిన పిఠాపురం మహారాజా !

మరో ప్రక్క దేశ దాస్య విముక్తి కోసం, హరిజనాభ్యుదయం కోసం తమ సమస్తాన్నీ త్యాగం చేసి పోరాడుతున్న కాంగ్రెసు నేత గాంధీజీ !

ఒక ప్రక్క స్థానికమైన వ్యక్తిగత భక్తి.

మరొక ప్రక్క సార్వజనికమైన దేశభక్తి.

అమలాపురం నియోజక వర్గం జయాపజయాల మధ్య అల్లల్లాడి పోయిన సమయ మది.

అలాంటి కల్లోల పరిస్థితిలో, తన మనస్సు నిండా గాంధీజీ దివ్య మూర్తిని నింపుకొని ఉన్న డాక్టర్ ఖాను – అప్పటికి 20 ఏండ్ల కుర్రవాడు – కళ్ళు మూసుకొని ఎన్నికల యజ్ఞంలోకి దూకాడు. కాంగ్రెసు జండా పట్టుకొని, కళా వెంకటరావుగారి ప్రక్కన నిలబడ్డాడు.

వెంకటరావుగారి బావమరది బాబయ్యగారి ఆధ్వర్యంలో ఎన్నికల నిర్వహణ కోసం వాలంటరీ దళాలు నిర్మించబడ్డాయి. అందులో చాలా చురుకు గానూ, ప్రముఖం గానూ పనిచేసిన యువకుల్లో డాక్టరు ఖాను ఒకడు. ఆయనకు అప్పటికే సర్వరోగ నివారణ డాక్టరుగా ముస్లింల లోనూ, సాధారణ ప్రజల లోనూ పేరు ప్రఖ్యాతు లున్నాయి. ఆ పలుకుబడి ఈ ఎన్నికలలో కాంగ్రెసుకు బాగా ఉపయోగపడింది.

ఆంధ్ర కాంగ్రెసుకు అఖిల భారత నాయకత్వం సాధించటమే కాక, బ్రిటిష్

పార్లమెంటుకు కూడా గుండె తల్లడం గావించిన ఒక మహా విప్లవకారుడు కళా వెంకటరావు అంటే !

ఆగష్టు విప్లవ సమయంలో ఆంధ్ర సర్కులర్‌కు జనకుడై అఖిల భారత విప్లవాన్ని రెచ్చగొట్టిన వాడాయన. విప్లవశక్తి ఆయనకు పుట్టుకతోనే వచ్చింది. అత్యంత క్లిష్ట సమయంలో జెండా పట్టుకొని ఆయన ప్రక్కన నిలబడి, ఆయన ఆశీర్వాదం పొందగలిగాడు డాక్టరు ఖాను. గొప్ప మెజార్టీతో కాంగ్రెసు గెలిచిం దక్కడ.

ఈ ఎన్నికలలో - రాష్ట్రం మొత్తం మీద ప్రకటించబడిన తొలి ఫలితం, పోటీ లేకుండా తూర్పు గోదావరి నుంచి వచ్చిందే. అది కాంగ్రెసుకే లభించింది. అలా గెలిచిన వాడు బి.యస్. మూర్తి. హరిజన అగ్రనాయకులలో ఒకడాయన. ఆయన వెన్ను చలవగా, తదుపరి వచ్చి ఫలితాలన్నీ మొత్తం మీద కాంగ్రెసుకే లభించాయి. హోరా హోరి పోరాటంలో అఖండ విజయాన్ని సాధించినవాడు కళా వెంకటరావు.

డాక్టరు ఖానులో జాతీయ భావం, కాంగ్రెసు పట్ల విశ్వాసం పెరిగి పెద్దదిగా వికసించటానికి ఈ ఎన్నికలు చాలా వరకు తోడ్పడ్డాయి.

కళా వెంకటరావు గారికి ప్రచారం చెయ్యడం కోసం అమలాపురం వచ్చిన జాతీయ నాయకులలో శ్రీమతి సరోజనీనాయుడు ఒకరు. అక్కడ ఆమె ఉపన్యాసం తనను ఎంత ఉత్తేజ పరచిందో డాక్టరు ఖాను చెపుతుంటేనే వినాలి.

"కాంగ్రెసు దేశానికి జీవగర్ర. కాంగ్రెసు ద్వారానే దేశానికి ముక్తి. ప్రతి వ్యక్తీ తన జీవితాన్ని కాంగ్రెసుకు ముడి పెట్టుకొన్న నాడే దేశానికి అభ్యుదయం" అంటూ ఆవిడ చేసిన ఉద్ఘాటన ఈ నాటికీ తన హృదయంలో ఖంగు మంటూనే ఉంటుం దంటా డాయన.

ఆ తర్వాత కొద్ది రోజులకే అనాతవరం విడిచిపెట్టి, విజయనగరం వెళ్ళి పోయాడు డాక్టరు ఖాను.

★★★

22. తల్లులు - సవతి తల్లులు

ఎంతో ఉజ్జ్వలంగా, ఎంతో ఉన్నత స్థితికి పోవలసినంత శక్తివంతంగా ప్రారంభమైన ఆయన విద్యార్థి జీవితం ఛిన్నా భిన్నమై, ఆయనను ఏలూరు నుంచి అనాత వరానికి విసిరేసిన పరిస్థితి చాలా దయనీయ మైనట్టిది. అది ఆయన కుటుంబంలో ఏర్పడ్డ ఒక కల్లోల పరంపర.

పంగెడిగూడెం రాజావారి కోటలో ఉన్నంతకాలం బయట ప్రపంచం ఎలా ఉంటుందో, కష్టాలంటే ఏమిటో ఎరగడు. పెద్దాపురంలో భోగిగా పుట్టాడు. సిరిసంపదల మధ్య శైశవాన్ని గడిపాడు. మాతృ మరణానంతరం పంగెడిగూడెంలో రాజావారి కోటలో రాజాలా పెరిగాడు. పన్నెండేండ్ల వయస్సు వచ్చేవరకు బాల్యం యావత్తూ 'సర్కార్' అనే తన పేరును సార్థకం చేసుకొంటూ ఒక రాజకుమారుడులా సర్వ సుఖాలూ అనుభవించాడు.

లోకాన్ని ఆయన చూచింది ఏలూరు వచ్చిన తర్వాతనే. లోకంలో ఉండే కామ క్రోధాదుల్ని, బాధను, దుఃఖాన్ని రుచి చూచింది మాత్రం ఆయనకు రెండవ సవతి తల్లి వచ్చిన తర్వాత, ముఖ్యంగా ఆవిడకు బిడ్డలు కలిగిన తర్వాత.

డాక్టరు ఖాను తండ్రి గారి రెండవ భార్య చాల గర్విష్ఠి. సవతి కొడుకైన ఖానునే కాదు, భర్తను కూడా లక్ష్యం చేసేది కాదు ఆమె. ఆ తర్వాత ఆ భర్త సుఖాన్నీ, శాంతినీ అన్వేషిస్తూ దఫదఫాలుగా భార్య మీద భార్యగా ముగ్గురు భార్యల వరకూ చేసుకోవలసి వచ్చింది. అయినా ఆయన కోరిన సుఖ శాంతులు లభించలేదు. అవి తొలిభార్య తోనే పోయినై. డాక్టరు ఖాను ఎక్కువగా బాధపడత రెండవ సవతి తల్లి చేతిలో.

అంతవరకూ తనకు ఏం కావాలో, ఏం అక్కర లేదో తెలియని దర్జాలో బ్రతి కాడు డాక్టరు ఖాను. అన్ని సౌకర్యాలు తన అభిరుచి తగ్గట్టు ఎప్పటి కప్పుడు ఎక్కడివి అక్కడ అమర్చి పెట్టబడి ఉండేవి. ఆ సవతి తల్లి వచ్చిన తర్వాత అవన్నీ అదృశ్యమై పోయాయి. ఇంట్లో పెత్తనమంతా ఆమెదే. ఇంట్లో పనిచేసే నౌకర్లు, చాకర్లు కూడా ఆమె మాటకు బద్ధులు. తన మాట వినే వాళ్ళు ఒకరూ లేరు.

తనకేది కావలసి వచ్చినా తండ్రిగారిని అడిగే అలవాటు లేదు. తండ్రి ఎదుట నిలబడి మాట్లాడటానికే భయం. ప్రతిదానికీ, స్కూలు జీతంతో సహా మారు తల్లినే అడగాలి. ఆమె ఆయన్ను గడ్డిపరక కంటే హీనంగా చూచేది. తిండి పెట్టేది కాదు. బట్టలు కుట్టించేది కాదు. స్కూలుకు జీతం కూడా కట్టేది కాదు. అందువల్ల ప్రతినెలా జీతం జరిమానాలతో కట్టవలసి వచ్చేది. చాలా సార్లు ఆయన పేరు హాజరు పట్టిలో కొట్టివేయబడి ఉండేది. జరిమానాతో జీతంకట్టి పేరు మళ్ళీ వ్రాయించు కోవలసి వచ్చేది.

ఏలూరులో డాక్టరు ఖాను చదివే హైస్కూలు ఇంటికి మూడు మైళ్ళ దూరంలో ఉండేది. ఇల్లు పెంషను లైనులో ఉండేది. మారుతల్లి బిడ్డలు చదువుతున్న చిన్న స్కూలు ఇంటికి సమీపంలోనే ఉంది. అయినా, ఇంట్లో ఉన్న నౌకర్లు అందరూ ఆవిడ బిడ్డల సేవలోనే మునిగి ఉండేవారు. ఆయనకు భోజనం కూడా తీసుకొని వెళ్ళేవారు కాదు.

పరిస్థితి ఎంత వరకు దిగజారిందంటే, ఇంటి నౌకర్లు తన మాట వినకపోగా, వాళ్ళకు పురమాయించబడ్డ పనుల్ని కూడ ఆయనకు చెప్పి ఆయన చేత చేయించుకునే వాళ్ళు. తన నౌకర్లకే తాను నౌకరు కావలసిన దుస్థితి ఏర్పడ్డ దాయనకు ఆ ఇంట్లో.

ఈ కష్టాలు కొద్ది కొద్దిగా పంగెడిగూడెం లోనే ప్రారంభమైనా, ఏలూరు వచ్చిన తర్వాత రాక్షస స్వరూపం దాల్చి జీవితాన్ని దుర్భరం చేసివేసినై.

తల్లిదండ్రుల ప్రేమ కరువై పోగా, చిన్ననాటి గారాబం క్షీణించి పోగా, తిండికి కూడా నౌకర్ల మీద, వంట వాళ్ళ మీద ఆధారపడవలసి వచ్చింది. రెండవ సవతి తల్లే కాక, ఆమెతో కలసి మూడవ సవతి తల్లి కూడా బాధనే కలిగించింది.

అయితే, ఇంట్లో ఎంత దైన్యాన్ని అనుభవిస్తున్నాడో అంత దైన్యాన్ని బయట కూడా అనుభవిస్తున్నాడని కాదు.

ఇంట్లో దైన్యం సహజమైంది కాదు. అది దారిద్ర్యం వల్ల వచ్చింది కాదు. సవతి తల్లులలోని కారుణ్య దారిద్ర్యం వల్ల, మానవత్వ దారిద్ర్యం వల్ల ఏర్పడినట్టిది. ఆయన తండ్రి భార్యా దాసుడు కావటం వల్ల ఏర్పడినట్టిది.

నిజానికి పిల్లల్ని కన్నంత మాత్రం చేత ఏ తల్లీ తల్లి కాబోదు. తన పిల్లల వలెనే ఇతర స్త్రీల పిల్లలను కూడా చూడగలిగిన స్త్రీయే నిజమైన తల్లి. తన పిల్లలకు మాత్రమే పెట్టుకొంటూ, ఎదుటి పిల్లల కడుపు మాడ్చే తల్లి గొడ్రాలి కంటే హీనురాలు.

పురుషుడి విషయంలో కూడా అంతే. మొదటి భార్య మీద ప్రేమకు, ఆమె సంతానం మీద వాత్సల్యానికి ఏ మాత్రమూ లోపం కలుగకుండా జాగ్రత్త పడగలిగిన మగవాడే మరొక పెళ్ళి చేసుకోవడానికి అర్హుడు.

అనర్హులైన వాళ్లు, అసమర్థులైన వాళ్ళు శక్తికి మించిన పనులకు, ఆశలకు పోవడమే మానవలోకం లోని దుఃఖాని కంతకూ మూలకారణం.

బయట మాత్రం ఖాను దర్జా ఎప్పటిలాగే ఉంది. అందుకు కారణం ఆయన చేతిలో ఉన్న వైద్య విద్య. దాన్ని రకరకాలుగా ప్రజల మీద ప్రయోగించి, వారి మన్నలను పొంది, సన్మానాలను చేయించుకొంటూ, డబ్బు గడించే వాడాయన. దానితో బట్టలు, టిఫిను, సాదర ఖర్చులు అన్నీ గడిచి పోయేవి. తాను తినేవాడు. తోడి వారలకు తిని పించేవాడు. ఆ రోజుల్లో తన వైద్య విద్యే తనకు తల్లీ, తండ్రీ, చుట్టం, స్నేహం.

"నా సొంత సంపాదనలో నుంచి నా సవతి చెల్లెండ్రకు ఏవేవో వస్తువులు కొని ఇచ్చే వాణ్ని. వాటిని ఎంతో ఆప్యాయంగా తీసుకొనే వాళ్ళు. 'అన్నయ్యా' అని నోరార పిలిచే వాళ్ళు. ఎంతో స్నేహంగా ఉండే వాళ్లు. నాకు పరమానందంగా ఉండేది. నా సవతి తల్లులు నాపై రేపిన ఎన్నో గాలి దుమారాలు ఆ నా చెల్లెండ్రు నా పక్షం వహించటంతో చల్లారి పోయినై. సోదరి ప్రేమ నేను అప్పుడే రుచి చూచాను" అంటాడు డాక్టరు ఖాను కన్నులు తుడుచుకుంటూ.

ఏలూరుకు సంబంధించిందే మరో చిన్న విషయం ఇక్కడ చెప్పటం బాగుంటుం దనుకొంటాను.

గాంధీజీ ఏలూరు వచ్చినప్పుడు ఆయనకు ఒక పర్సు ఇవ్వడానికి వాళ్ళ స్కౌటు మాష్టారు ఉద్దేశించారు. హైస్కూలులోని విద్యార్థులంతా అందుకు ఉత్సాహం కనబరిచారు. అందుకు గాను బాలభటులైన వారినంతా తోచిన చేతి వస్తువులు

తయారు చేయమని స్కౌటు మాష్టారు చెప్పారు. డాక్టరు ఖానుకు బియ్యపు గింజపై పేర్లు వ్రాయటం అప్పటికే బాగా వచ్చు. ఆయన తాబేలు ఆకారంలో ఒక బ్లాటింగ్ పాడ్, ఒక చక్కని ఈతాకుల చాప, దూదితో చేసిన ఒక కొంగ, ఒక సీసా హేరాయిల్ ఇవి నాలుగూ తయారుచేసి మాష్టారికి ఇచ్చాడు. వాటిని ఎగ్జిబిషన్‌లో పెట్టి వేలం వేయగా నూట యాభై రూపాయలు వచ్చాయట ! అలా వచ్చిన డబ్బంతా కలిపి, గాంధీజీకి విద్యార్థుల తరఫున ఒక పర్సును సమర్పించు కొన్నారట.

★★★

23. అంటరాని వాడు వెలివేయ బడ్డవాడు

అంత ఉజ్జ్వలంగా సాగుతున్న విద్యార్థి జీవితానికి సవతి తల్లుల అమానుష ప్రవర్తనల కారణంగా స్వస్తి చెప్పవలసి వచ్చింది ఆయన.

ఏలూరు నుంచి అనాతవరం వెళ్ళి, అక్కడా, అమలాపురంలోనూ బాల వైద్యుడుగా రాణిస్తున్న సమయంలోనే – కళా వెంకటరావు గారి పరిచయంతో పాటు ఆయనకు కలిగిన మరొక చక్కని పరిచయం నంబూరి శ్రీనివాసరావు గారితో.

నంబూరి శ్రీనివాసరావుగారు కాంగ్రెసులో అతివాది. శ్రీయుతులు అల్లూరి సత్యనారాయణరాజు, మహీధర రామమోహనరావు, జగన్మోహన రావు, అల్లూరి సోమరాజు, మండెల విశ్వనాధం, కాసిన శంకరయ్య, కొరపాటి పట్టాభి రామయ్య, సి.వి.కె. రావు వగైరా యువకులంతా ఆనాడు కాంగ్రెసులో తీవ్రవాదులే. వారంతా రష్యాలోని బోల్షివిక విప్లవంతో ఉత్తేజితులైన వారు.

ఆనాడు ఉన్నది ఒకే ఒక కాంగ్రెసు సంస్థ. ఈనాడు కమ్యూనిస్టులుగా, సోషలిస్టులుగా, ప్రజా పార్టీగా, ప్రజా సోషలిస్టులుగా, ఫార్వర్డు బ్లాక్‌గా, స్వతంత్ర పార్టీగా, సర్వోదయ వాదులుగా, ఇంకా రకరకాలుగా కనిపిస్తున్న ప్రముఖ నాయకులంతా ఆనాడు కాంగ్రెసు సంస్థలోనే ఉండేవారు. యువకులైనవారు, సోషలిస్టు సమాజ స్థాపనమే ఆదర్శంగా కలవారు, అతివాదులుగా ఉండేవారు. అందులో నంబూరి ఒకడు.

నంబూరితో పరిచయం నాకు కూడా ఆ రోజుల్లోనే అయింది. బి.యస్.మూర్తి, వేముల కూర్మయ్య, కుసుమ ధర్మన్న, గొల్ల చంద్రయ్య, గొట్టుముక్కల వెంకన్న, రాయుడు గంగయ్య, కమతం షణ్ముఖం, చెన్నా ధర్మారావు, ఐలపాక శ్రీరాములు, సాకేటి గురువులు, పోలుకొండ భద్రయ్య, దిడ్ల పుల్లయ్య, ఉంద్రు సుబ్బారావు, ఈలి వాడపల్లి, పాము రామమూర్తి, మోకా మీరయ్య, రెడ్డి కామయ్య, గెద్దాడ బ్రహ్మయ్య, పచ్చిపాల రామస్వామి, నేరేడుమల్లి జగన్నాధం, గంటి కామయ్య, నక్కా చిన వెంకయ్య, తాళ్ళూరి జియ్యరుదాసు, మంగళగిరి వరవస్తుదాసు, నందనారు హరిశ్చంద్రుడు మొదలైన హరిజన నాయకులతో అప్పుడప్పుడు కలసి తిరుగుతూ ఉండేవాణ్ణి నేను. కాంగ్రెసు వాణ్ణి కావడం వల్ల కళా వెంకటరావు గారికి, పళ్ళంరాజు గారికి ఎక్కువ సన్నిహితుణ్ణిగా ఉండేవాణ్ణి.

అందులో అటు పూర్వ తరం నాయకులకు, ఇటు యువతరం కార్యకర్తలకు మధ్య ఒక సేతువులా ఉండి – ఒక తరం ప్రజా జీవితాన్ని తన ఉపన్యాసాలతో, పాటలతో, పద్యాలతో, నాట్యాలతో, నాటకాలతో, సిరి కథలతో, బహిరంగంగాను, అండర్ గ్రౌండులో ఉంటూనూ, ఉత్తేజ పరచిన వాడు నంబూరి శ్రీనివాసరావు. తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణ జిల్లాలను ప్రధాన కార్యక్షేత్రంగా చేసుకొని – పేద వర్గాలలో, ముఖ్యంగా హరిజనులలో ఆయన చేసిన సేవ చరిత్రాత్మకమైనట్టిది. ఆనాడు డాక్టరు ఖానుకు పరిచయమైన నంబూరి అంతటి వ్యక్తి.

నంబూరితో పరిచయ మయ్యేదాకా హరిజనుల మీదకు దృష్టి మరలలేదు డాక్టరు ఖానుకు. అపలు అంటరాని తనం అనే దాన్నే ఎరగడాయన.

భారతజాతి ప్రజలలో ఎన్ని తర తమ భేదాలు ఉన్నాయో, ఎన్ని కులమత వర్గాలు ఉన్నాయో, పరస్పర ద్వేషం, హింస, దోపిడి, పీడన, అస్పృశ్యత, అసహనం, కుళ్ళు ఎంత విపరీతంగా పెరిగిపోయి ఉందో అప్పటి వరకు డాక్టరు ఖానుకు తెలియదు.

"నంబూరి సమాజంలో అంటరాని వాడు. నేను కుటుంబంలో వెలివేయబడ్డ వాణ్ణి. మేమిద్దరమూ హరిజనులమే, మా ఇద్దరికీ హరి, అంటే భగవంతుడు, తప్ప మరొక దిక్కు లేదు. అలా అనిపించింది అప్పుడు నాకు. సబ్‌కో సన్మతి దే

భగవాన్ అంటూ మహాత్ముడు చేసిన ప్రార్థనలో ఎంత హృదయ పరితాపం ఉన్నదో అప్పుడుగాని నాకు అర్థం కాలేదు" అంటాడు డాక్టరు ఖాను.

"అందరం భగవంతుని బిడ్డలమే. అందరం హరిజనులమే. కృత్రిమ విభేదాలను కల్పించి, మానవుడు తన చుట్టూ ఎందుకు ఇలా నరకాన్ని సృష్టించు కొంటాడో?" అంటూ వాపోతా డాయన.

నంబూరితో ఆ రోజుల్లో ఆయనకు కలిగిన పరిచయం స్నేహంగా పరిణ మించి, ఒక విడరాని అనుబంధాన్ని సమకూర్చిం దాయనకు.

★★★

24. ఆదర్శ దాంపత్యం

విజయనగరంలో స్వతంత్రంగా ఆస్పత్రిని నెలకొల్పుకొని, సమర్థుడైన వైద్యుడుగా అనతికాలంలోనే ఖ్యాతిని గడించుకొని, సమాజంలో ఒక గౌరవస్థానాన్ని సంపాదించుకొంటూ ఉన్న ఖానుపై ఆయన సవతి తల్లుల దృష్టి పడింది మరొకసారి.

ఇప్పటి వారి దృష్టి అప్పటి దృష్టి కంటే భిన్నమైనట్టిది. ఆనాడు అతడు ఎందుకూ పనికిరానివాడు. ఈనాడు ఉపయోగించుకొంటే బాగా పనికివస్తాడు. ఒక చిన్న పన్నాగంతో ఆయనపై వాత్సల్యాన్ని కుమ్మరిస్తూ, వాళ్ళు పెళ్ళి మాటలు తలపెట్టారు. తమ బంధుకోటిలో ఒక సంబంధాన్ని చూచి, ఆయనకు ముడిపెట్టడానికి పూనుకొన్నారు.

అయితే, డాక్టరు ఖాను అందుకు ఒప్పుకో లేదు. పిల్లను తాను చూడాలనీ, తనకు నచ్చిన పిల్లనే పెండ్లాడతాననీ, అదెంత పేద కుటుంబమైనా తనకు అభ్యంతరం లేదనీ ఆయన ధైర్యంగా చెప్పేశాడు తండ్రి గారితో. తండ్రి అందుకు అంగీకరించక తప్పలేదు. సవతి తల్లుల పన్నాగం పారలేదు.

తన ఇష్టానుసారమే పెళ్ళి చేసుకొన్నాడు డాక్టరు ఖాను, 1939లో నిడదవో లులో, ఒక పేద ఇంటిపిల్లను. అవిడ పేరు రహమతున్నీసా బేగం.

ఆయన పెళ్ళి కూడా ఒక విప్లవాత్మకమైనట్టిదే. పెండ్లికి ముందు వరుడు

వధువును చూచుకునే సంప్రదాయం ముస్లింలలో లేదు. తల్లిదండ్రులు నిర్ణయించిన పిల్లను పిల్లవాడు చేసుకొని తీరవలసిందే. ఈ సంప్రదాయానికి భిన్నంగా తనకు నచ్చిన అమ్మాయినే చూచి చేసుకోవడంలో ముస్లిం సామాజిక సంప్రదాయంలో ఒక విప్లవాన్ని ఆయన సాధించా డనవచ్చు.

కట్నాలను కానుకలను అన్నిటినీ నిషేధించా డాయన. మామగారి నుంచి కేవలం ఖద్దరు బట్టలను మాత్రమే స్వీకరించాడు. బావ మరదుల పోరు పడలేక ఒక్క సిల్కు సూటును తీసుకొన్నాడు. అది కూడా ఖద్దరుదే.

జాతీయ వాదంలో అంత నైష్టికు డాయన. నేటికీ ఖద్దరు తప్ప కట్టడు. స్వదేశీ వస్తువులు తప్ప వాడడు. సంస్కరణను, స్నేహాన్ని గురించి తప్ప మాట్లాడడు. అంతటి సంస్కారం ఆధునికుల్లో చాలా అరుదు.

వివాహం కాగానే అనకాపల్లిలో ఆస్పత్రి తెరచి, క్రొత్తగా కాపురం పెట్టాడాయన.

భార్య చిన్న వయస్సుది. తానూ చిన్నవాడే. ఒక్కరికీ సంసారానుభవం లేదు. ప్రతి పనీ క్రొత్తే. ఊరు కూడ క్రొత్త. అయినప్పటికి అక్కడ ఉన్న కొద్దిమంది స్నేహితుల ఆసరాతో, తన పాండిత్య బలంతో, వైద్య సామర్థ్యంతో, హస్తవాసితో అన్నిటిని మించిన అమృత హృదయంతో అచిరకాలంలోనే నలుగురికి నోట్లో నాలుక కాగలిగాడు.

చిరకాలం నుంచీ వస్తున్న పరదా పద్ధతికి స్వస్తి చెప్పా డాయన. ఇరుగు పొరుగు హిందూ స్త్రీల వలెనే కలిసి మెలిసి తిరగడం నేర్పాడు భార్యకు. ఫోషా లేదు. కళ్ళ నిండా కాటుక, చేతుల నిండా గాజులు, జరీ చీర, నగలు, అచ్చంగా హిందూ స్త్రీలా తయారు చేశాడామెను. స్వచ్ఛమైన తెలుగులో మాట్లాడేవారు దంపతులిద్దరూ. ఎక్కడ ఏ పండగ జరిగినా, ఏ పుణ్యం జరిగినా ఇద్దరూ కలిసే వెళ్ళేవారు. ఇరుగు పొరుగుల కష్టసుఖాలను పంచుకొనేవారు. ముస్లిం కుటుంబాలలో ఎలా ఉన్నా, హిందూ కుటుంబాలలో రహమతున్నీసా బేగం రామతులశమ్మగా మారి పోయింది.

అన్ని రంగాలలో వలెనే, దాంపత్యరంగంలో కూడా డాక్టరు ఖాను ఒక విజయాన్ని సాధించాడు.

మొదటి నుంచీ తాను అభ్యసించింది తెలుగు భాష. నేర్చింది భారతీయ సాహిత్యం. పరిశీలించింది ఆర్షసారస్వతం. కనుక, ఆయనకు అనేక సనాతన శాస్త్రాలతో పరిచయం ఏర్పడి ఉంది. వాత్స్యాయన కామసూత్రాలను, తత్ సంబంధమైన అనేక ధర్మ సిద్ధాంతాలను, చరక సుశ్రుతాలను, ఆరోగ్య నిబంధనలను, సత్‌సంతాన ప్రక్రియలను బాగా చదివి జీర్ణించుకొన్న వాడవడం చేత, ఆయా ఋషులు చెప్పిన పద్ధతులనూ, నియమాలనూ, తిధివార నక్షత్రాది విధి నిషేధాలను, నిగ్రహాన్ని అమలు పరిచా డాయన. అందుకే తనకు సంతానం కలుగబోతున్న రోజులలో, చాలా ముందుగానే, తనకు మగసంతానం కలుగబోతున్నదని రూఢిగా చెప్పగలిగాడు.

ఆయన అలా చెప్పినప్పుడు ఎంతోమంది ఆశ్చర్యపడ్డారు. కొందరు అవహేళన చేశారు. ఎలా చెప్పగలవని మిత్రులు ప్రశ్నించారు. ధృతరాష్ట్రుడు పుట్టంధు డవుతాడని ముందుగానే వ్యాస మహాఋషి ఎలా చెప్ప గలిగాడో అలానే నాకు మగపిల్లవాడు పుట్టగలడని ముందుగానే నేను చెప్పగలనని జవాబిచ్చా డాయన.

రామాయణ భాగవత భారతాదుల మీద, ఆధ్యాత్మిక విషయాల మీద చర్చలు ప్రారంభమయ్యేవి. డాక్టరు ఎ. రామమూర్తి, కె. కామేశ్వర రావు మొదలైన వారు ఆయన కెంతో ఆప్తులు. వారితో మాట్లాడుతూ, చర్చలు జరుపుతూ, ఎంతో ఉత్తేజాన్ని పొందుతూ ఉండే వాడాయన

భార్య పురిటికై పుట్టింటికి పోగా, అనకాపల్లిలోని ఆస్పత్రిని ఎత్తేసుకొని, పుత్రోదయం కోసం ఎదురు చూస్తూ అత్తవారింట కూర్చున్న డాక్టరు భానుకు ఈ రకమైన ఆధ్యాత్మిక సాహిత్య వైజ్ఞానిక వ్యాసంగం ఎంతగానో కాలక్షేపం అయ్యేది. శాంతినీ ఇచ్చేది. ఇంతలో 1941 జులై నాల్గవ తేదీ రాత్రి భార్యకు పురుడు వచ్చింది. ఆయన చెప్పినట్టే మగపిల్లవాడు పుట్టాడు.

ఆ తర్వాత ఆయన మకాం బెజవాడకు మారింది. డాక్టరు రామమూర్తి, కామేశ్వరరావు గార్లు ఆధ్యాత్మికంగానే కాక, వ్యవహారంగంలో కూడా ఆయన కెంతో తోడ్పడ్డారు. ఆ ఇద్దరూ మానవతా వాదులనీ, నిష్కపటులనీ, ప్రేమహృదయులనీ,

బహుగ్రంథ పారీణులనీ, తన కత్యంతాప్తులనీ, వారి స్నేహం తనకు అమృత ప్రాయమూ, ప్రాణప్రదమూ అయిందనీ వారిని వేనోళ్ళ పొగుడుతూ ఉంటాడు డాక్టరు ఖాను ఈ నాటికీ.

★★★

25. అర్ధాంగి - ఆర్ష సంప్రదాయం

డాక్టరు ఖాను జీవితాన్ని మూడు అధ్యాయాలుగా విడదీస్తే, ఆయన బెజవాడ కాపురంతో రెండవ అధ్యాయం ప్రారంభమైన దనవచ్చు.

అది చాలా ముఖ్యమైన అధ్యాయం.

కృష్ణాజిల్లా ముస్లిం లీగుకు నాయకత్వం వహించడం, దాని విధానం నచ్చక వైదొలగటం, కాంగ్రెసు ఉద్యమాన్ని తీసుకొని రాష్ట్రమంతా ప్రచారం చెయ్యటం, వక్ఫ్‌సంస్థల పునర్నిర్మాణాన్ని సాధించటం, ఫీల్డ్‌లేబర్ సహకార సంఘాన్ని స్థాపించటం, ప్రత్యేకాంధ్రరాష్ట్రం కోసం కలలు కనటం, రే అండ్ కో ద్వారా వైద్యసేవను విస్తరింప జెయ్యటం వంటి వన్నీ ఆ అధ్యాయంలోని ప్రకరణాలు.

అందులో మరొక ప్రధానమైన ప్రకరణం ఆయన సతీమణి శ్రీమతి రహమతున్నీసా బేగంకు సంబంధించి నట్టిది.

ఆమె హిందూ స్త్రీ వలె, ఘోషా లేకుండా బహిరంగంగా భర్తతో కూడా తిరగడమే ఒక రకమైన విప్లవకరమైన చర్య. తమ ఇరుగు పొరుగు ముస్లిం స్త్రీలంతా ఆమెను ఎంతో వింతగా చూచేవారు. గుసగుసలాడే వారు. ముస్లిం సంప్రదాయాన్ని మంట కలుపుతున్నదని బహుశా తిట్టుకునేవారేమో కూడ !

మతాంధులైన మానవులకు మూఢాచారాలు చాలా ముచ్చటగా ఉంటాయి. అనారోగ్యవంతులకు అపథ్యమే బహు ఇష్టం. మంచిని చూచి నేర్చుకోదు లోకం.

ఎవరే మనుకొన్నా లెక్క చెయ్యకుండా శ్రీమతి రహమతున్నీసా బేగం బెజవాడలోని మహిళా జనోద్యమంలో చేరి పనిచేసింది. మహిళా సంఘ కార్య

క్రమాలలో ఎక్కువగా పాల్గొనేది. అక్కడ నేర్పే ప్రత్యేక వృత్తి విద్యలను కూడా అభ్యసించింది. ఒకటి రెండు విద్యలలో ట్రైనింగ్ కూడా పొందింది. ఆ తర్వాత హైద్రాబాదులో కమలానెహ్రూ మెమోరియల్ వెల్‌ఫేర్ సెంటర్ అనే పేరుతో స్త్రీల కోసం ప్రత్యేకంగా ఒక చేతి పనుల కేంద్రాన్ని ఆమె స్థాపించ గలిగిందంటే అందుకు పునాది బెజవాడలో ఆనాడు ఆమె గడించిన అనుభవమే.

ఒక ప్రక్క బెంగాలు కరువు – మరొక ప్రక్క రాయలసీమ కరువు – దేశాన్ని కొట్టి కాకులకూ, గ్రద్దలకూ ఎగరనేసిన రోజులు చరిత్రలో మహా భయంకర మైనట్టివి.

ఆ రోజుల్లో కరువులో చిక్కుకొని పేనుగు పెంటలుగా మారిపోతున్న ఆ ప్రాంతపు ప్రజానీకానికి తోడ్పడే కృషిలో తమకున్న సమస్తాన్నీ ధారపోసిన ప్రజా సంస్థల్లో బెజవాడ మహిళా మండలి ఒకటి. డాక్టరు కొమర్రాజు అచ్చమాంబ, శ్రీమతి కంభంపాటి మాణిక్యాంబ, శ్రీమతి జోస్యభట్ల సుబ్బమ్మ మొదలైన మహిళా మణులతో కలసి శ్రీమతి రహమతున్నీసాబేగం బెజవాడ పట్టణంలో ఇంటింటికీ తిరిగి బట్టలు, బియ్యం వగైరా ప్రోగు చేసి, కరువు నివారణ కార్యక్రమాలకు ఎంతగానో తోడ్పడింది. తన ఒంటిమీద ఉన్న నగలన్నిటినీ ఒలిచి విరాళంగా ఇచ్చేసింది.

తన భార్యను కూడా తనలాగే తయారు చేసుకోవడంలో డాక్టరు ఖాను సఫలీకృతుడయ్యాడు. తన ఆశయాలకు అనరిగుణంగా ఆమెను తీర్చిదిద్దుకోగలిగాడు. సర్వజన సమతా దృష్టి, పేదల పట్ల దయాదాక్షిణ్యాలు, దీనులపై కరుణా కటాక్షాలు, హృదయ వైశాల్యం, ఔదార్యం, వదాన్యత, ధాతృత్వం వంటి ఉత్తమ సంప్రదాయ గుణాలతో పాటు – తనకు గల విచక్షణా జ్ఞానం, పట్టుదల, ధర్మ కోసం పోరాడటం, తను మంచిదని నమ్మిన పని నుంచి వెనుకంజ వెయ్యక పోవడం వంటి రాజస గుణాలలో కూడా ఆమెను తనంతటి దానిగా తర్ఫీదు చేశాడు. అనేక రంగాలలో, అనేక సందర్భాలలో, ధర్మం కోసం పోరాడవలసి వచ్చినప్పుడు ఈ గుణశక్తులే ఆమెకు ఎన్నో విజయాలను సాధించిపెట్టినాయి. ఈ శక్తులనే తిరగబడి తన భర్త

మీద కూడా ప్రయోగించి, ఆయనను కొన్ని పొరపాట్ల నుండి మళ్ళించుకొన్న సందర్భాలను కూడా నే నెరుగుదును.

ఒక సారి డాక్టరు అచ్చమాంబగారు ఒక మహిళా సభలో ఉపన్యసిస్తూ, స్త్రీలకు భర్త పట్ల ప్రేమ ముఖ్యం కాని మంగళ సూత్రాలు కాదనీ, తక్కిన నగలతో పాటు వాటిని కూడా విరాళంగా ఇచ్చివేయ వచ్చుననీ ఉద్బోధించిందట.

ఒక ప్రక్క కమ్యునిస్టులూ, మరొక ప్రక్క గోరాగారి నాస్తిక వాదులూ మంగళ సూత్రాలను త్రెంచి పారవేసుకొంటున్న రోజులవి. ఈ మాంగల్య చిహ్న వ్యతిరేకోద్యమానికి బెజవాడే ప్రధాన కేంద్రం. అట్టి బెజవాడలో కమ్యునిస్టు, నాస్తిక మత ప్రాబల్యం కల మహిళా సభలో, డాక్టరు అచ్చమాంబ వంటి నాయకురాలు మంగళ సూత్రాలను త్రెంచి ఇచ్చివేయమంటే, కాదనే వారెవరు ? కాదనగల వారెవరు ?

అయితే...

ఆ సభలో కాదనగలిగిన, కాదన్న ఒక మహిళ ఉండనే ఉంది. ఆమే రహమతున్నీసాబేగం. ప్రేమ కంటే మంగళ సూత్రమే ప్రధాన మంది ఆమె.

ప్రేమ ఉండవచ్చు, లేకపోవచ్చు. అది హృదయానికి సంబంధించిన విషయం. పైకి కనిపించేది కాదు. దాంపత్య జీవితానికి ప్రధానమైంది ధర్మం. ధర్మానికి చిహ్నమే మంగళసూత్రం. అది పుణ్యస్త్రీకి అత్యంత ముఖ్యమైనట్టిది. పవిత్రమైనట్టిది. దానిని తీసివేయ మనడం ఉచితం కాదు. మెడలో మంగళసూత్రం ఉన్న స్త్రీనే లోకం గౌరవిస్తుంది. అది లేని స్త్రీని వితంతువును వలె అపవిత్రంగా చూస్తుంది. భారత సమాజంలో మంగళసూత్రం లేని స్త్రీకి గౌరవమూ లేదు, ప్రతిష్టా లేదు, పవిత్రతా లేదు.

శ్రీమతి బేగం చేసిన ఈ ధర్మవాదం - అధికార పక్షం బాగా మెజారిటీలో ఉన్న అసెంబ్లీలో ప్రతిపక్షవాదం వలె - అప్పటికి నిరర్థకమే అయినా, ఆ తర్వాత దానికి బాగా బలం చేకూరింది. మంగళ సూత్రాలను విరాళంగా ఇవ్వడానికి చాలా మంది స్త్రీలు నిరాకరించారు.

ఆ తర్వాత కమ్యూనిస్టులు కూడా తమ స్త్రీలు మంగళ సూత్రాలను ధరించ కూడదన్న సూత్రాన్ని మార్చుకొన్నారు.

"కార్యేషు దాసీ, కరణేషు మంత్రి" అన్న ఋషి నిర్వచనానికి అనురూపమైన భార్య తనకు లభించినందుకు డాక్టరు ఖాను ఎంతో మురిసిపోతాడు. బాహ్య ప్రపంచంలో తాను జగుప వలసి వచ్చిన ఎన్నో పోరాటాలలో తాను దృఢంగా నిలబడటానికి కారణం... ఇంట తన ఇల్లాలు తనకు ఇచ్చిన ఆత్మశక్తే అంటాడు ఆయన.

★★★

26. పార్లమెంటులో ఉండవలసినవాడు

ఆయన కల ఫలించి, పొట్టి శ్రీరాములుగారి ప్రాణాన్ని బలి తీసుకొని, 1953లో ఆంధ్రరాష్ట్రం అవతరించింది.

ఆ తర్వాత ఆయన దృష్టి రాష్ట్ర ప్రజాభ్యుదయం మీదికి మళ్ళింది.

ఒక పద్ధతిలో, ఒక ప్రణాళిక క్రింద, రాష్ట్రంలో సర్వతోముఖాభివృద్ధిని సాధించడానికి... నైజాములోని ఆంధ్రజిల్లాలను కలుపుకొనడం ద్వారా సమగ్ర ఆంధ్రను నిర్మించడానికి ఆయన కృషిని ప్రారంభించాడు. ఆ కృషి లోని ఒక భాగమే "అజాద్" పత్రికా స్థాపన.

1955లో ఆయన సంపాదకత్వం క్రింద ఆజాద్ వారపత్రిక వెలువడింది. ఆయన ఊహలు, ఉద్దేశాలు, నిర్మాణ కార్యక్రమ నిర్వహణ పద్ధతులు, వివిధ సమస్యల పరిష్కార మార్గాలు - ఎన్నో విషయాలను ఆ పత్రిక చర్చిస్తూ ఉండేది.

అప్పటికి కాంగ్రెసు కార్యదర్శిగా ఉంటున్న కాసు బ్రహ్మానంద రెడ్డిగారి ప్రతిపాదనతో డాక్టరు ఖాను పి.సి.సి. మెంబరు అయ్యాడు.

కర్నూలు రాజధానిగా, ప్రకాశం పంతులుగారు ముఖ్యమంత్రిగా, బెజవాడ గోపాలరెడ్డిగారు పి.సి.సి. అధ్యక్షులుగా బ్రహ్మాండంగా ప్రారంభమైన ఆంధ్ర రాష్ట్ర

ప్రభుత్వం ఒక్కవోటు దెబ్బతో కూలిపోగా – అప్పుడు జరిగిన మధ్యంతర ఎన్నికలలో, కాంగ్రెసు విజయం కోసం డాక్టరు ఖాను చేసిన కృషి నిజంగా అప్రతిమానం.

ఆయన కృషిని బెజవాడ గోపాలరెడ్డిగారే కాక, ఎన్నికల పర్యవేక్షణ కోసం ఆంధ్రలో మకాం పెట్టిన ఎస్.కె. పాటిల్‌గారు కూడా ఎంతగానో కొనియాడారంటే – అది ఎంత గొప్పదో వేరే చెప్పనక్కర లేదు.

ఆ ఎన్నికల సందర్భంలో నూజివీడులో ఎం.ఆర్.అప్పారావు గారి విజయం కొరకు జరిగిన ఒక 50 వేల మంది మహాసభలో డాక్టరు ఖాను చేసిన మహోపన్యాసాన్ని విని, తన్మయుడైన బారిష్టరు అక్బరు ఆలీఖాన్, వేదిక మీదనే కౌగలించుకొని "నీవు మహాశక్తివంతుడవు, పార్లమెంటులో ఉండవలసినవాడవు" అంటూ ఆయనను ఎంతో ప్రశంసించాడంటే అది ఎంతటి చారిత్రాత్మక సంఘటనో ఊహించుకోవచ్చు.

ఇలాంటి సంఘటనలు ఆనాడు ఎన్నో జరిగినై డాక్టరు ఖాను జీవితంలో.

ఆ ఎన్నికలలో కాంగ్రెసు పూర్తి విజయాన్ని సాధించింది. కమ్యునిస్టులు చిత్తుగా ఓడిపోయారు. బెజవాడ గోపాలరెడ్డిగారి నాయకత్వం క్రింద కాంగ్రెసు ప్రభుత్వం ఏర్పడింది.

ఆ ఎన్నికలలో మైనారిటీ వర్గాలను, ముఖ్యంగా ముస్లింలను, కూడగట్టి వారి వోట్లన్నిటినీ కాంగ్రెసుకు సంపాదించిన ఖ్యాతి డాక్టరు ఖానుకు దక్కింది.

ఆయన చేసిన సేవను గుర్తించి, 1955 మార్చి 23వ తేదీన, ఆంధ్ర రాష్ట్ర యువజన కాంగ్రెసువారు ఆయన్ని ఘనంగా సన్మానించారు.

బెజవాడలో ఆంధ్రరత్న భవనంలో తుమ్మలపల్లి సత్యనారాయణ మూర్తిగారి అధ్యక్షతను జరిగిన ఈ సన్మాన సభలో, డాక్టరు ఖాను గుణగణాలను గురించి పలువురు ప్రముఖులు వేనోళ్ళ కొనియాడారు.

ఆ ఎన్నికలలో ఆయన ఎన్ని సభలు చేశాడో, ఎన్ని సమావేశాలకు అధ్యక్షత వహించాడో, ఎన్ని పట్టణాలలో, పల్లెలలో ఎన్ని వేల మందికి తన సమైక్యతా సందేశాన్ని వినిపించాడో, ఆనాటి పత్రికల్ని చూస్తే తెలుస్తుంది.

రాష్ట్రం ఈ దరి నుంచి ఆ దరికి తుఫానులా తిరిగా డాయన. ప్రతి మసీదులోను సభ చేశాడు. ప్రతి ముస్లిం యువకుడికి కాంగ్రెసు సిద్ధాంతాలను బోధపరిచాడు. నిద్రాహారాలు మానివేశాడు. నిర్విరామంగా శ్రమించాడు. తాను నమ్మిన పార్టీని గెలిపించాడు. తాను గెల్చాడు.

ఆంధ్రదేశంలో ఉన్న ముస్లింలు ఆంధ్రులే. క్రైస్తవుల కంటే, హిందువుల కంటే వారే విధంగాను భిన్నులు కారు" అంటూ ఆయన చేసిన సర్వాంధ్ర సమైక్యతా నినాదం దేశం మూల మూలలా వినిపిస్తుందీ నాటికీ - చెవులుండి వినగలిగిన వాళ్ళకు !

★★★

27. రాజకీయ వీరుడు

"అడిగో ! రాజకీయ వీరుడు వస్తున్నాడు ! రావయ్యా, ఖాన్ ! రా ! కూర్చో !" అన్నారు అయ్యదేవర కాళేశ్వరరావుగారు, ఒక సాయంకాలం, బషీర్‌బాగ్‌లోని ఆయన బంగళాలో మేమంతా కూర్చొని ఉండగా - అప్పుడే లోనికి అడుగు పెట్టిన డాక్టరు ఖానును చూచి.

"ఖాన్ సాహెబ్ తెలుసా నీకు ? రాజకీయ వీరుడు !" అన్నా రాయన నా కేసి చూసి.

అది 1959 నవంబరు ప్రాంతం.

అసెంబ్లీ స్పీకరు హోదాలో కాళేశ్వరరావుగారు ఒక గ్లాసరీ కమిటీని వేసి, దానికి ఆయనే అధ్యక్షుడుగా ఉండి, పారిభాషిక పదకోశాన్ని రూపొందిస్తున్న కాలమది.

ప్రాథమిక కృషి అంతా జరిగిపోయింది. దాన్ని పరిష్కరించి, ఒక పద్ధతిలోకి తెచ్చి, ముద్రణకు ఇవ్వవలసిన చివరి ఘట్టం మిగిలింది. ఆ ఘట్టం కార్యక్రమాన్ని నిర్వహించడం కోసం నా అధ్యక్షత క్రింద ఒక ఉపసంఘాన్ని నియమించా రాయన.

శ్రీ కాళోజి నారాయణరావు, ఖండవల్లి లక్ష్మీరంజనం, డి.వి.శివరావు, దేవుల పల్లి రామానుజరావు, కప్పగంతుల లక్ష్మణశాస్త్రి, పి.వి. నరసింహారావుగార్లు

ఆ ఉపసంఘంలో సభ్యులు. ఆ పదకోశానికి సంబంధించిన విషయాలను కాళేశ్వర రావుగారితో చర్చిస్తూ కూర్చున్నాను నేను, డాక్టరు ఖాను వచ్చిన సమయానికి.

అప్పటికే నాకు డాక్టరు ఖాను బాగా తెలుసు. కాని, కాళేశ్వరరావు గారు ఆయనను రాజకీయ వీరుడని సంబోధించడంలో అర్థమేమిటో తెలియదు.

"జాతీయోద్యమంలో పాల్గొని, దేశం నుంచి విదేశీ ప్రభుత్వాన్ని వైదొలగించిన మనమంతా రాజకీయ వీరులమే కదా ?" అన్నాను నేను వారితో.

"ఖాన్ ప్రత్యేకత వేరులే" అన్నా రాయన.

"జాతీయోద్యమ పోరాటంలో పాల్గొన్న ఇద్దరు డాక్టరు ఖాన్ సాహెబ్‌లలోనూ, ఈయన దక్షిణ నాయకుడు" అన్నాను నేను.

"అదీ కాదు" అన్నారాయన నవ్వుతూ.

జాతీయోద్యమంలో పాల్గొని దానికి సంబంధించిన వివిధ రంగాలలో కృషి చేసి, ఎన్నో విధాలైన త్యాగాలను చేసి, చదువును, ఆస్తులను, ఉద్యోగాలను, ఆయుస్సును కూడా పోగొట్టుకొని, పోరాటం జరిపి – విజయానంతరం క్షతగాత్రులుగా మిగిలిన సైనికుల్లా బాధపడుతున్న ఉద్యమ కార్యకర్తలకు సహాయం చెయ్యడం ధర్మం అన్న ఉద్దేశం ఒకనాడు కళా వెంకట్రావుగారికి కలిగింది. మద్రాసు ప్రభుత్వంలో అప్పటికాయన మంత్రి. ఉద్దేశం కలగటమే తడవుగా దానిని కార్యరూపంలో పెట్టాడాయన.

రాజకీయ పోరాటంలో త్యాగాలు చేసి, నిరాధారులై ఉన్న వారికి రాజకీయ బాధితులు అన్న పేరు పెట్టారు. అట్టి రాజకీయ బాధితులకు భూవసతి కల్పిస్తామన్నారు. సేద్యానికి వీలైన, ఇతరుల ఆక్రమణలో లేని భూములను అట్టివారికి ఉచితంగా ఇవ్వడానికి ప్రభుత్వంచే నిర్ణయింపజేశారు. నీటి వసతి కల పల్లపు భూమి అయితే ఐదెకరాలు, మెట్టభూమి అయితే పదెకరాలు ఒకొక్క వ్యక్తికి ఇవ్వబడతాయి.

ఈ ప్రణాళిక క్రింద ఎంతో మంది పేదలైన రాజకీయ బాధితులకు సహాయం లభించింది.

సమస్తమూ దేశమాత పాదాల వద్ద సమర్పించుకొని బికారులై పోయినవారే కాక - ఏమీ పోగొట్టుకొనని రాజకీయ సమయజ్ఞులు కూడ ఈ ప్రణాళిక క్రింద బాగా లాభపడటం జరిగితే జరిగి ఉండవచ్చు. అది వేరే విషయం. అది వెంకటరావు గారి ప్రణాళికలోని లోపం కాదు. ఎంత మంచి ప్రణాళికలైనా - బలమైన స్వార్థపరులు తమకు అనుకూలంగా మార్చుకోవడం జరుగుతూనే ఉంటుంది కదా ?

అది 1948-49 ప్రాంతం.

"నీవు కూడా రాజకీయ బాధితుడవే కదా ? ధరఖాస్తు పెట్టు. నేను సిఫార్సు చేస్తాను. ఐదెకరాల పొలం వస్తుంది" అన్నారట కాళేశ్వరరావుగారు డాక్టరు ఖానుతో ఒకనాడు.

"ప్రతిఫలాపేక్షతో మనం పోరాటం జరుపలేదు. దేశ విముక్తి కోసం పోరాడాం. రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యంతో పోరాడుతున్నపుడు, బ్రతికి బయట పడతామన్న ఆశ కూడా ఆనాడు మనకు లేదు. దేశాన్ని దాస్య విముక్తం చేయడం మన ధర్మం. ధర్మం కోసం పోరాడాం. భవిష్యత్తులో ఏదోలాభం కలుగుతుందన్న దృష్టే అప్పుడు మనకు లేదు. రాజకీయాల వల్ల మనం బాధపడలేదు. మనం వీరులం. బాధితుల మనిపించు కోవడం ఒక ఐదెకరాల కోసమే కదా ? నాకు ఐదెకరాలు అక్కరలేదు. నేను రాజకీయ బాధితుణ్ణి కాదు. రాజకీయ వీరుణ్ణి" అన్నాడట డాక్టరు ఖాను.

కాళేశ్వరరావుగారు ఖాను సమాధానానికి విస్తుపోయారు, ఆనందించారు, అభినందించారు.

రాజకీయ బాధితులు కాని వారు కూడ ఐదెకరాల కోసం అప్లయి చేసు కొంటున్న రోజుల్లో - బాగా ధనవంతులైన రాజకీయ నాయకులు కూడ పదెకరాల కోసం ప్రయత్నిస్తున్న రోజుల్లో - వ్యవసాయ భూముల కోసం పట్టణాలలో బాగా ధర పలికే మార్కెట్టు స్థలాల కోసం పోటీలు పడుతున్న రోజుల్లో - నిరుపేదల అక్రమణలలో నుంచి మంచి భూముల్ని బలాత్కారంగా లాగుకోవడానికి కూడ పాలు పడుతున్న రోజులలో - ఎక్కడా ఏ ఆస్థి లేని డాక్టరు ఖాను ఊరికనే చేతికందుతున్న ఆస్తిని అక్కరలేదనడం ఎంత అపూర్వం !

అప్పటినుంచీ డాక్టరు ఖాను కనిపించినప్పుడెల్లా, ఆయనను 'రాజకీయ వీరుడు' అనే పిలిచేవారట కాళేశ్వరరావుగారు. ఈ ఉదంతాన్ని విన్న తర్వాత నాకు డాక్టరు ఖాను పట్ల అశేషమైన గౌరవం ఏర్పడింది.

"మేఘురంజని" పేరు కంటే, "రాజకీయ వీరుడు" బిరుదే నన్ను ఎక్కువగా ఆకర్షించి, నా హృదయాన్ని ద్రవీభూతం చేసి, ఆయనతో ఇతోధికమైన ఆత్మీయతకు దోహదం చేసింది.

తాను చేసిన త్యాగాలకు ఎట్టి ప్రతిఫలాన్ని కోరని ఉదాత్తచిత్తుడు డాక్టరు ఖాను. ఆయన ఒక రాజకీయ వీరుడే కాదు, జీవితం ప్రతి రంగంలోను ఆయన ధర్మ వీరుడే !

★★★

28. ఎవరు ఉత్తమ నాయకులు ?

1956, నవంబరులో ఆంధ్రప్రదేశ్ ఏర్పడింది.

ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డానికి చాలా ముందుగానే - ఆంధ్రరాష్ట్రంలో నైజాం రాజ్యంలోని తెలంగాణా జిల్లాలను చేర్చి, ఆంధ్ర తెలంగాణా సమష్టి సమగ్ర రాష్ట్రాన్ని ఏర్పరచాలన్న నిర్ణయం గైకొన బడింది.

అప్పటి ఆంధ్రరాష్ట్రానికి బెజవాడ గోపాలరెడ్డిగారు, నైజాం రాజ్యానికి బూర్గుల రామకృష్ణారావుగారు ముఖ్యమంత్రులుగా ఉన్నారు. నైజాం రాజ్యాన్ని మూడు భాగాలుగా విడగొట్టి ఒకదానిని మైసూరుకు, ఒకదానిని మహారాష్ట్రకు, ఒకదానిని ఆంధ్రకు కలిపివేయడానికి కూడ తీర్మానించబడింది. ఆంధ్రకు వచ్చిన భాగంలో హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాలతో పాటు తొమ్మిది జిల్లాలు ఉన్నాయి. అదే తెలంగాణ.

నిజాం రాజ్యం మూడు భాగాలై ప్రక్క రాష్ట్రాలలో కలిసి పోవడంతో, రామకృష్ణారావు గారి ముఖ్యమంత్రి పదవి పోక తప్పదు. ఆంధ్ర రాష్ట్రం తెలంగాణాను కలుపుకొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా అవతరించడంతో, ఆంధ్రరాష్ట్ర మంత్రి వర్గంలో మార్పులు జరగడం కూడ తప్పదు.

తెలంగాణా శాసన సభ్యులు మొత్తం మీద గోపాలరెడ్డిగారి నాయకత్వాన్ని బలపరుస్తూ ప్రకటన చేసి ఉంటే, ఆయనే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా కొనసాగగల అవకాశం ఉంది. అయితే రాజకీయాలను నమ్మడానికి వీలు లేదు. ఏ క్షణంలో ఏ గాలి ఎటు వీస్తుంది చెప్పలేం. ఎవరు మిత్రులో, ఎవరు శత్రువులో తేల్చుకోలేం. ఏది ఏమైనా, ఆంధ్రప్రదేశ్ అనేది ఒక కొత్త రాష్ట్రం కాబట్టి, నాయకత్వానికి క్రొత్తగా ఎన్నిక జరగాలని నిర్ణయం గైకొనబడింది.

ఆ ఎన్నిక ఇటు ఆంధ్రరాష్ట్రంలోని శాసన సభ్యులూ, అటు తెలంగాణా జిల్లాలకు చెందిన శాసన సభ్యులూ కలసి జరుపవలసి ఉంది. ఇక్కడ గోపాలరెడ్డిగారు గాని, అక్కడ రామకృష్ణారావుగారు గాని ముఖ్యమంత్రి పదవికి పోటీ చెయ్యవచ్చు. తెలంగాణా శాసన సభ్యుల కంటే ఆంధ్రశాసన సభ్యుల సంఖ్య ఎక్కువ కనుక, ఆంధ్ర నుంచి పోటీ చేసే అభ్యర్థికే విజయం కలిగే అవకాశం ఉంది. బహుశా, అందుకేనేమో, రామకృష్ణారావుగారు పోటీ చెయ్య దలచలేదు.

ఇక మిగిలింది గోపాలరెడ్డిగారు. ఆయనతో పోటీ చెయ్యడానికి సంజీవరెడ్డి గారు నిర్ణయించుకొన్నారు.

ఆ విధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి పదవికి ఏకగ్రీవ ఎన్నిక అసాధ్యమైంది. పోటీకి ఆంధ్ర కాంగ్రెసులో ఉన్నత శ్రేణికి చెందిన నాయకులిద్దరూ తలపడ్డారు. ఈ పోటీ సందర్భంలో డాక్టరు ఖాను నిర్వహించిన పాత్ర నిజంగా చాల గొప్పది. సంజీవరెడ్డి గారిని బలపరచి, ఆయన విజయం కోసం అహర్నిశలూ శ్రమపడి కృషి చేశాడు డాక్టరు ఖాను.

ఒక్క కాంగ్రెసు వాదిగానే కాక జాతీయ ముస్లిం నాయకుడుగా కూడ డాక్టరు ఖానుకు హైదరాబాదుతో సన్నిహిత సంబంధం ఉంది. అందు వల్ల ఆయన హైదరాబాదు వెళ్ళి మైసూర్ కేఫ్‌లో మకాం పెట్టి, తమ కార్యక్రమాన్ని ప్రారంభించాడు.

అల్లూరి సత్యనారాయణరాజు, మంతెన వెంకటరాజు, వేముల కేశవరావు (కూర్మయ్యగారి తమ్ముడు), నంబూరి శ్రీనివాసరావుగార్లతో కలసి ఒక నిర్ణీత పద్ధతిలో ఆయన పని చేశాడు. తెలంగాణలోని నాయకులను శాసన సభ్యులను ఖుద్దున

కలుసుకొని, చర్చలు జరిపి, సంజీవరెడ్డి గారి అభ్యర్థిత్వానికి పూర్తి బలం సంపాదించాడు.

ఈ నాయకత్వపు పోటీలో సంజీవరెడ్డిగారు అఖండ విజయం పొందుతారని మొట్టమొదటగా పత్రికా ప్రకటన చేసింది డాక్టరు ఖానే.

ఆంధ్ర తెలంగాణా రాజకీయాలను క్షుణ్ణంగా అవగాహన చేసుకొని, మొత్తం శాసన సభ్యుల మనస్తత్వాన్ని గ్రహించి చెప్పిన జోస్యం కనుక, అది ఫలించింది. పోటీలో సంజీవరెడ్డిగారు గెలిచారు. ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రి అయ్యారు. అగ్రశ్రేణిలోని నాయకులు అధికారాలను స్వీకరించారు. యుద్ధంలో గెలవడానికి ప్రధాన కారణమైన యోధులు గెలుపు తర్వాత వలె, డాక్టరు ఖాను వంటి కార్యకర్తలు ఇళ్ళకు మళ్ళారు.

నాయకత్వపు పోటీలో అంత కృషి చేసి, తాను బలపరచిన నాయకుడు అత్యధిక మెజారిటీతో గెలుపొందినా కూడ, డాక్టరు ఖానుకు ఏ పదవీ లభించలేదు. అందుకు ఆయన ప్రయత్నించనూ లేదు. అదే ఆయనలోని ప్రత్యేకత !

అయితే –

పోరాటంలో పాల్గొని, నిద్రాహారాలు లేకుండా కష్టించి, త్యాగాలు చేసి, తనకు అభిమాన పాత్రుడైన నాయకుణ్ణి గెలిపించుకొన్న కార్యకర్తలు అందరూ ఒకేలా ఉండరు. కొందరు తమ కష్టానికి ఫలితాన్ని ఆశిస్తారు. తమ త్యాగాలకు ప్రతిఫలం కోరతారు. కొందరు పనిచేసినంత తీవ్రంగానే ప్రతిఫలాన్ని రాబట్టుకోవడానికి కూడా పోరాడుతారు.

కొందరు ఉదాసీనంగా ఉంటారు. ప్రతిఫలం లభిస్తే వద్దనరు. కాని, తమంతట తాముగా చేయి చాచి అడగరు.

మరి కొందరు ఏదైనా ఇస్తామన్నా పుచ్చుకోరు. చిరునవ్వుతో నిరాకరిస్తారు.

అసలు ఏ పనీ చెయ్యకుండానే అంతా తమకే కావాలనే వారు కూడ ఉంటారు. రాజకీయాలలోనే కాదు, ఏ రంగంలో అయినా సరే, అధికార పదవుల కోసం తాపత్రయ పడే వారంతా మొత్తం మీద ఈ బాపతే.

ఇన్ని రకాల ప్రజల్లో ఎవరు ఎటువంటి వారో గుర్తించి, వారి వారి అవసరాలను గమనించి, అందరినీ తృప్తి పరచవలసిన బాధ్యత నాయకత్వానికి ఉండవలసి ఉంది. డాక్టరు ఖాను విషయంలో మాత్రం అటువంటి దేదీ జరిగినట్టు లేదు.

నిజమైన కార్యకర్తల చేత, ప్రతిభా పాండిత్యాలు గల ప్రజ్ఞావంతుల చేత - జాతి పునర్నిర్మాణ ప్రణాళికలను అమలు జరిపించుకోవడం నాయకుల విధి. గాంధీజీ నాయకత్వం క్రింద తరిఫీదు పొందిన దేశంలో తరచు అట్టి విద్యుక్త ధర్మం విస్మరింపబడుతూ ఉండటం నిజంగా జాతి దురదృష్టం.

అందుకే -

ప్రతిభావంతులు, శక్తివంతులు, శీలవంతులు, స్వార్థరహితులు, సర్వజన సమతావాదులు, త్యాగనిరతులు వెనుకబడి పోవడం - స్వార్థపరులూ, అసమర్థులూ, దుశ్శీలురూ, ధనదాహపరులూ, అగ్రశేణుల లోకి తోసుకురావడం జరుగుతున్నది ! జాతి జీవితం ప్రగతికి కాక - అధోగతికీ, అయోమయస్థితికీ, అంధకారానికీ దిగజారి పోతున్నది !

★★★

29. సూర్యభవనం - చంద్ర భవనం

ఆంధ్రప్రదేశ్ ఏర్పడి, దానికి హైదరాబాదు నగరం రాజధాని కావడంతో, డాక్టరు ఖాను తన ఆస్పత్రినీ, కార్య రంగాన్నీ హైదరాబాదుకు మార్చాడు.

ఆంధ్రులకు ఒక సమగ్ర రాష్ట్రం ఏర్పడింది. ఒక మహా నగరం లభించింది. ఒక అర్ధ శతాబ్దిగా సాగిన ఆంధ్రోద్యమం ఈ విధంగా సమగ్ర సత్ఫలితం ఇచ్చి, సమాప్తమైంది.

అయితే - అంతటితో సరా ?

ఆంధ్రోద్యమం నిజంగా సమాప్తమైందా ?

సమగ్ర సమ్యగ్రాష్ట్రాన్ని మనం ఎందుకు కోరాం ?

ఉద్యమం సమాప్తం కాలేదు. ఇప్పుడే ప్రారంభమైంది !

ఆంధ్రం - ఆబాల గోపాలం అందరకూ ఆనందకరం, ఐశ్వర్యవంతం, అమృతప్రాయం కావాలి. అందుకు నిజమైన కృషి ఇప్పుడు ప్రారంభం కావాలి.

ఇల్లు అలుకగానే పండగ కాదు. ఇంతవరకూ మనం చేసిన పని ఇల్లు అలకటం వరకే. ఇంట్లో ఏమీ లేంది పండగ ఎలా అవుతుంది ?

రాష్ట్రం ఏర్పడింది.

కాని, రాష్ట్ర ప్రజలు మాత్రం బ్రిటిష్ ప్రభుత్వ కాలంలో ఎలా ఉన్నారో అలానే ఉన్నారు ఇప్పటికీ !

హిందూ ముస్లిం సమైక్యత, అస్పృశ్యతా నివారణ, హరిజనోద్ధరణ, విద్యా వ్యాప్తి, దారిద్ర్య నిర్మూలన, గృహ నిర్మాణం, గ్రామ పునర్నిర్మాణం, రహదారుల ఏర్పాటు, పరిశ్రమల స్థాపన, సాముదాయక వ్యవసాయం, అధికాహారోత్పత్తి, ప్రాజెక్టుల నిర్మాణం, సంగీత సాహిత్య నృత్యాది కళల పునరుజ్జీవనం, సాంస్కృతిక సముద్ధరణ, సోషలిస్టు సమాజ స్థాపన వంటి కార్యక్రమాల నిర్వహణకు శ్రీకారం కూడ చుట్టబడలేదింత వరకు !

ఏం చెయ్యా లిప్పుడు ?

అందుకని -

నిర్మాణ కార్యరంగంలో ఇతోధికంగా కృషి చెయ్యడానికి పూనుకున్నాడు డాక్టరు ఖాను. అందుకే తన ఆజాద్ పత్రికను హైదరాబాదుకు తరలించాడు. భార్యచే ఒక చేతిపనుల కేంద్రాన్ని నెలకొల్పించాడు. ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తేవడానికి ఎన్నో రాయబారాలు నడిపాడు, అడుగడుగునా అవరోధాలను ఎదుర్కొంటూ కూడా ఇప్పటికీ ప్రతి కార్య రంగంతోనూ సంబంధం పెట్టుకొని, సాధ్యమైనంత కృషి చేస్తూనే ఉన్నాడు.

అయితే -

ఒక్కడూ ఏం చేస్తాడు ?

ఇది ప్రజా ప్రభుత్వం. ప్రభుత్వ ధనంతో ప్రజా సేవ చేస్తున్న నాయకోప

నాయకుల సంఖ్య లెక్కకు మిక్కిలిగా పెరిగిపోతూ ఉంది. ఒక డాక్టరు ఖాను వంటి వారికి అడుగు ముందుకు ఎలా పడుతుంది ?

అయితే - ఆయన జీవిత రంగంలో, వైద్య రంగంలో, సాంస్కృతిక రంగంలో, స్నేహ రంగంలో సుప్రసిద్ధుడు, సుస్థిరుడు, సుప్రతుడు, సహృదయుడు.

పెద్ద భార్య శ్రీమతి రహమతున్నీసా బేగం, చిన్న భార్య శ్రీమతి సలామా బేగం సూర్య - చంద్ర భవనాలలో ఆ ఇద్దరు భార్యలు అహర్నిశలూ సేవ చేస్తూ ఉంటే - ఆనందం మూర్తీభవించినట్టుంటా డాయన ఎల్లప్పుడూ.

ఇద్దరు భార్యలకూ - కొడుకులు, కూతుళ్ళు చాలామందే ఉన్నారు. అందరూ రత్న మాణిక్యాల లాంటి వాళ్ళు. కొందరికి పెళ్ళిళ్ళు చేశాడు. పెద్ద కొడుకులు చేతికి అంది వచ్చి. సంపాదన పరులైనారు. మనుమల్ని కూడా కనిపెడుతున్నారు. ఆయన రెండు సంసారాలూ మూడు పువ్వులూ ఆరు కాయలుగా, నిత్య కళ్యాణం పచ్చ తోరణంగా ప్రవర్ధమానమవుతూ ఉన్నాయి.

బంధువులతో, స్నేహితులతో, అతిథి అభ్యాగతులతో కళ కళలాడుతూ ఉంటై అవి ఎప్పుడు చూచినా. ఇటు విజయనగరం కాలనీ గాని, అటు అంబరుపేటకు గాని ఎప్పుడు ఎటు వెళ్ళినా - ఏ సమయంలో నైనా సరే - పంచ భక్ష్య పరమాన్నాలు లభిస్తాయి వారి గృహాలలో.

ఆ ఇద్దరు సతీమణులూ అక్కడ చెల్లెండ్ర కంటే ఎక్కువ అన్యోన్యంగా ఉండడం కూడ ఆయన చేసుకొన్న మరొక సుకృతం !

వండ నలయదు వేవురు వచ్చిరేని
అన్నపూర్ణకు ఉద్దియౌ అతని గృహిణి !
అతిథులేతేర నడిరేయి యైన పెట్టు
వలయు భోజ్యంబు లింట నవ్వారి గాగ !

అనే భారత గృహిణీ ధర్మం ఆ ఇద్దరిలోనూ పోటీ పడుతూ వర్ధిల్లుతూ ఉంది నిత్య నూతనంగా !

★★★

30. వైవిధ్యంలో ఏకత్వం

అనేక వైవిధ్యాలకు, వైరుద్ధ్యాలకు సమన్వయ కేంద్రం డాక్టరు ఖాను జీవితం.

ఆయన ఒక మహా నాయకుడు కాదు. కోటీశ్వరుడు కాదు. పరిపాలకుడు కాదు. ప్రవక్త కాదు. ఏదో ఒక రంగంలో పైకి వచ్చిన ఎవడైనా, తక్కిన రంగాలన్నిటి లోనూ అడుగున ఉంటాడు. అలాంటివాడు ఏక దృక్కు. ఏ దృక్కుక అయిన వాడు పూర్ణ పురుషుడు కాలేడు.

డాక్టరు ఖాను సామాన్యుడు. ధనదాహం, అధికార దాహం, కీర్తి దాహం - ఈ దాహత్రయం కోసం తాపత్రయం లేదాయనకు. మానవుడి జీవితం ఎలా ఉండాలని భగవంతుడి ఉద్దేశమో, అలా - ఆత్మవత్సర్వ భూతానిగా - జీవించే వాడే నిజమైన మానవుడు. అలాంటివాడు ఒక్క సామాన్య మానవుడే. డాక్టరు ఖాను సామాన్య మానవుడు కనకనే, మానవత్వం సర్వతో ముఖంగా వికసించిన సర్వజనీన సమ్యక్ దృక్కు అయినాడు, పూర్ణ పురుషుడైనాడు.

"ప్రతి సామాన్యుడూ పూర్ణ పురుషుడే నా ?"

"అవును"

"ప్రతి సామాన్యుడికీ ఇంతటి జీవిత చరిత్ర ఉంటుందా ?"

"ఉంటుంది."

"మరి, ఎవరూ వ్రాయరేం ?"

"వ్రాసే వాళ్ళు లేక."

ఎక్కడో బొగ్గు, ఎక్కడో ఇనుం, ఎక్కడో బంగారం, ఎక్కడో పెట్రోలు - అంతేనా భూగర్భ సంపద ? తవ్వేవాళ్లుంటే - ఎక్కడ తవ్వినా అమూల్యమైన ఖనిజాలు లభిస్తాయి. పండించే వాళ్లుంటే - ఎక్కడ దున్నినా అపారంగా పంటలు పండుతాయి.

మహా పర్వతాలు, అరణ్యాలు, వాగులు, జీవనదులు, విహంగాలు వేణు

రవాలు, పంట పొలాలు, మేఘాలు, వెన్నెలు, సముద్రాలు, రకరకాల ప్రజలు, రంగు రంగుల బ్రతుకులు – ఇలాంటి సహజ సంపదలు లేకనేనా, మనం ప్రతి దానికీ విదేశాలలో బిచ్చమెత్తుకొంటున్నాం ?

అన్నీ ఉన్నాయి, అల్లుడి నోట్లో శని ఉంది.

మన పొలాలను బీడు పెడతాం. విదేశాల నుంచి నూకలు కొంటాం.

మన పొరుగువాడి ప్రతిభను అణిచివేస్తాం. విదేశీ పుస్తకాల్ని అనువదించు కొంటాం.

మన ముడి ఖనిజం ఎగుమతి చేస్తాం. విదేశాల పిన్నుల్ని, పేకముక్కల్ని దిగుమతి చేసుకుంటాం.

ఇలా ఎన్నో, ఎందుకు చేస్తాం ?

అదే – శని !

సామాన్య మానవుడు కనిపించడం లేదు – నేడు దేశంలో పైకి వచ్చిన ఏ వ్యక్తి కంటికీ ! సామాన్యుణ్ణి దోచుకోవడం, ప్రజాభివృద్ధి పద్దు క్రింద ఖర్చు వ్రాయడం, బ్యాంకు బేలన్సు పెంచుకోవడం ! దేశానికి స్వరాజ్యం వచ్చిన ఇరవై ఏండ్ల తర్వాత, ఈనాడు దేశంలో కనిపిస్తున్న దేమిటి ? కరువు ! దరిద్రం ! ఆకలి ! అలజడి ! విలయ తాండవం చేస్తున్న శని !

బ్రిటిషు ప్రభుత్వం మనల్ని ఎక్కడ విడిచి వెళ్ళిందో అక్కడికి – ఇరవై ఏండ్ల వెనక్కి – మనం వెళ్ళాలి. ఆనాటి స్థాయికి ధరల్ని దించాలి. పన్నుల్ని రద్దుచెయ్యాలి. జీతాలు తగ్గించాలి. పెరిగిన ఆస్తులను, బేంకు నిల్వలను స్వాధీనం చేసుకోవాలి. స్థిర నిర్ణయంతో, స్థిత ప్రతిజ్ఞతతో, ధైర్యంతో, ధర్మబుద్ధితో ఈ పనుల్ని నిర్వహించాలి. స్వప్రయోజన దృష్టిని తుడిచి వేసుకొని, భగవంతుని ముఖం చూచి, సామాన్య మానవుడి అభివృద్ధినే లక్ష్యంగా స్వీకరించి, సోషలిస్టు సమాజ నిర్మాణం కోసం ప్రణాళిక వేసుకొని, మనం గట్టిగా పురోగమించ గలిగినప్పుడు గాని ఈ

శని తొలిగి పోదు. సామాన్యుణ్ని మనం ఎంత కాలం ఉపేక్షిస్తామో, అంత కాలం మన గతి అడుక్కు తినడమే !

సరే – ఆ విషయం అలా ఉంచుదాం.

మన ఆంధ్రరాష్ట్రంలో జనం నాలుగు కోట్ల మంది వరకూ ఉన్నారు కదా ? అందులో ఏ కొద్ది వేల మందో తప్ప, అందరూ సామాన్యులే కదా ? ప్రతి వ్యక్తికీ ఏదో ఒక రకమైన జీవితం ఉంది కదా ? ఎవరైనా పరిశీలిస్తున్నారా ? పట్టించు కొంటున్నారా ?

ప్రతి సామాన్యుడి జీవితమూ ఒక ప్రత్యేక మార్గం కలదే. అపూర్వ సౌందర్యాలను పండించేదే, ఆనందార్ణవ తరంగాల పరిష్వంగాల కోసం హస్తాలు చాచేదే – దాన్ని అనుసరించి చూడ గల్గితే.

డాక్టరు ఖాను సామాన్యుడు. అందరికీ తెలిసిన వాడు కాడు. పైగా, ఒక మైనారిటీ వర్గానికి చెందినవాడు. అయినా – ఆయన జీవితంలో ఇంత చరిత్ర ఉంది !

అయితే –

ప్రతి సామాన్యుడి జీవితం లోనూ ఇంతటి గొప్పతనం ఉంటుందని కాదు. ప్రతి ప్రవాహమూ, గంగో గోదావరో కాదు. ఝరులు, స్రవంతులు, సెలయేళ్ళు, వాగులు, వాహినులు, ధారలు – చిన్నా పెద్దా ఎన్నో రకాలుగా ఉండవచ్చు. కొన్ని వట్టి చినుకులు గానే ఆరిపోవచ్చు. అయినా – ప్రతి దాని రూపమూ రమ్యమే. ప్రతి రమ్య రూపమూ పరాశక్తే. ప్రతి శక్తిలవమూ పరమ శివాత్మకమే.

డాక్టరు ఖాను జీవితం ఇంత ఉత్తేజకమూ, ఉన్నతమూ కావడానికి, సాధారణ దృష్టితో పరిశీలించి చూస్తే, రెండు ప్రధాన కారణాలు కనిపిస్తాయి. అందులో ఒకటి – ప్రాపంచిక జీవిత రంగంలో, సాంఘిక సాంస్కృతిక సమన్వయ కృషిలో ఆయన సాధించిన విజయం.

తెలుగులో అక్షరాభాస్యం చేసిన అచ్చ తెలుగు వాడాయన.

ఒక మనుమరాలి పేరు మేఘరంజనీ బేగం, మరొక మనురాలి పేరు మయూరీ బేగం. చక్కని సంస్కృత పదాలను ఇస్లాం సంప్రదాయానికి మలచిన పరమ భారతీయు డాయన. సూర్యభవనం, చంద్రభవనం – ఎంత అందమైన, అర్థవంతమైన పేర్లు ! హిందువులుగా పుట్టిన వారిలో సైతం – ఆధునికులలో ఎంత మంది కుంది ఈ ఆర్ష సంస్కారం ?

తాము పుట్టిన నేల భాషే తమ మాతృభాష అన్న సత్యాన్ని గుర్తించిన ముస్లింలు దేశంలో ఎంత మంది ?

ఇప్పుడిప్పుడు తెలుగులో రచనలు చేస్తున్న కవులు, కథకులు, పండితులు, భాషా కోవిదులు, గాయకులు, నటులు ముస్లింలలో చాలా మందే ఉన్నారు. వారిలో కూడ – గృహాలకూ, బిడ్డలకూ తెలుగు పేర్లు పెట్టుకొన్న వారెంత మంది ?

తెలుగు హిందువులు మస్తాన్‌రావు వంటి పేర్లు పెట్టుకోవడం ఉంది. తెలుగు క్రైస్తవులు జాన్ రత్నం, డేవిడ్ రాజు, మేరీ దయావతి వంటి పేర్లు ఎక్కువగా పెట్టు కొంటారు. వేష భాషల్లో తేడా లేదు. ఆపాటి సంస్కరణ ముస్లింలలో వచ్చిన వాడు దేశంలో మత సమస్యే ఉండదు కదా ? ఈ సంస్కరణకు డాక్టరు ఖాను గురుస్థానీ యుడే కదా ?

మరో విశేషం –

ఆయన పెద్ద భార్యది పశ్చిమ గోదావరి. చిన్న భార్యది నిజామాబాదు. ఆంధ్ర తెలంగాణా సమైక్యం సాధించా డాయన ఆ విధంగా. పెద్ద కోడలు గుల్బర్గాకు, రెండవ కోడలు బీదరుకు చెందిన వారు. కర్ణాటక మహారాష్ట్రాలను కూడ ఆంధ్ర గృహానికి తెచ్చుకొన్నా డాయన.

పఠాన్ అంటే జయించుకొని వచ్చిన వాడని అర్థం. ఖాన్ అనేది అట్టి విజేతలకు బిరుదు నామం. జాతి, మత, భాషా సంప్రదాయాల సరిహద్దుల్ని జయించి, విశ్వకుటుంబ పరిమాణానికి పెరిగిన డాక్టరు ఖాను అన్వర్థ నామధేయుడే కదా !

ఆయన ఇంకా చిన్న వాడుగా ఉన్నప్పుడు - ఏలూరు, బెజవాడ మొదలైన చోట్ల కలరా, మసూచి వంటి వ్యాధులు వ్యాపించి, వేల కొలది జనాన్ని బలిగొని పోతున్న సమయాలలో - ఆ మహోగ్నిలో దూకి, ఆయన ప్రజలకు చేసిన సేవ ఎంతో సాహసోపేత మైనట్టిది. మహా భయంకరమైనట్టిది. అంతా భగవదిచ్ఛ అనుకొంటూనే - ప్రజాసేవే పరమేశ్వర సేవ అని కూడా విశ్వసించిన మహా భక్తుడు తప్ప అట్టి ప్రమాదకర వాతావరణంలోకి సామాన్యుడు నిశ్చంతగా దూకలేడు.

వరికుప్పలు అంటుకుంటే పేలాల కోసం ఎగబడే దుష్ట స్వార్థం ఉంటుంది లోకంలో ఎందరికో. అలాంటి వాళ్ళలో ఒకడు - వే అండ్ కో బోర్డు కట్టి రే అండ్ కో అదే అన్న భ్రాంతిని కలిగించి, ప్రజల్ని మోసగించాలని చూశాడు - డాక్టరు ఖాను రాజకీయాలలో నిమగ్నుడై తిరుగుతున్న రోజులలో. ఆ కేసు కూడా కోర్టు వరకూ వెళ్ళింది. ఏది సిసలో, ఏది నకలో కోర్టే నిర్ణయించ వలసి వచ్చింది. డాక్టరు ఖాను గెలిచాడు. వంచకుడు శిక్షపడ్డాడు. ఆ సందర్భంలో పచ్చిపులుసు సుబ్బారావు వంటి మిత్రులు తనకు చేసిన సహాయానికి ఆయన నేటికీ అంజలి ఘటిస్తూ ఉంటాడు.

అయితే - ఆ కేసు రే అండ్ కోకు మంచి ప్రచారం చేసి పెట్టింది. ప్రైవేటుగా చిరునవ్వులు కురిపించే మిత్రుడి కంటే, పది మందిలోనూ నోరు పారవేసుకొనే శత్రువే పురోగామికి ఎక్కువ ఉపకారి. కాంట్రవర్సీయే ఖ్యాతికి దారి.

ఆయన జీవితంలో జానపద గాథలా నడచిన ఒక ఉదంతం స్వర్ణ యోగం.

రకరకాల రసాయనిక సమ్మిశ్రణల ద్వారా రాగి, పాదరసం వంటి వాటిని బంగారంగా మార్చే ప్రయత్నాలు చాలా పురాతన మైనట్టివే. చాలా మంది యోగులు స్వర్ణ యోగాన్ని సాధించారని వింటాం కూడ. వేమన యోగి సైతం ఈ విషయంలో చెప్పింది చాలానే ఉంది.

డాక్టరు ఖాను తండ్రి తాతల నుంచీ ఈ యోగాన్ని సాధించాలనే ప్రయత్నం ఉంది. అది పంగిడిగూడెంలో పరాకాష్ఠనందు కొంది.

"కరి మ్రింగిన వెలగ పండును" సంపాదించి, దానిని పాదరసంతో నింపి పుటం పెడితే - బంగారం అవుతుందట !

పంగిడిగూడెం రాజావారి కోటలో ఏనుగులకేం తక్కువ ? అయితే... ఎన్ని ఏనుగులకు ఎన్ని వెలగపండ్లు అందించినా... పటపట నమిలి మ్రింగటమే తప్ప, పండుపను పండు వళంగా మ్రింగే ఏనుగే కనుపించలేదట ! పట్టి గొంతులో త్రోసినా, మర్నాడు లద్దెలో ఏమీ కనిపించేది కాదట ! పాపం, ఏం చేస్తాడు ?

పంది పాలు తీసి, కరిగిన రాగిపై చురకా యిస్తే, అది బంగారం అవుతుందట ! అయితే... పంది పాలు ఎలా వస్తాయి ? చచ్చినా సరే పంది తన పిల్లలకు తప్ప మరొకళ్ళకు పాలివ్వదే !

సదాపాకు చెట్లలో ఒకానొక సమయంలో పుట్టే ఎర్రటి పురుగుతో మరొక యోగం.

ఈ విషయంలో డాక్టరు ఖాను తండ్రిగారికీ, ఢిల్లీలోని ప్రసిద్ధ యునానీ హకీం అజ్మల్‌ఖాన్‌గారికీ మధ్య ఎన్నో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగాయట. హకీం అజ్మల్‌ఖాను గొప్ప వైద్యుడు, జాతీయవాది, కోటీశ్వరుడు, కాంగ్రెసు అధ్యక్షుడు కూడ అయిన ప్రముఖుడు. హందర్డ్ దవాఖానా వ్యవస్థాపకుడు. తన సమస్తాన్ని యునానీ వైద్య వికాసం కోసం దానమిచ్చిన వదాన్యుడు. ఆయనతో స్వర్ణయోగం సంప్రదింపులు !

నానా అవస్థలు పడి సదా పురుగును పట్టుకొన్నారట. దానిని భద్రంగా ఢిల్లీ పంపించారట, అంతటితో ఆ యోగం ముగిసింది.

ఇలాంటి చమత్కారాలు కూడ వందలు, వేలు ఉన్నాయి డాక్టరు ఖాను జీవితంలో.

గాంధీజీ ఆవు పాలను విసర్జించి, మేక పాలు త్రాగడం ఎందుకు జరిగిందో... ఆ ఉదంతం వినడమే సాధ్యం కాదు. ఇక్కడ వ్రాయడం ఎలా సాధ్యం ?

బహు భార్యాత్వ నిషేధం, గోవధ నిషేధం మొదలైనవి ఈనాడు పాక్షిక రాజకీయ నినాదాలైనాయి. సనాతన ధర్మ దృష్టితో ఏ సమస్యా పరిశీలించ బడటం లేదు నేడు. బహు భార్యాత్యం ముస్లింలకు ఎంతటి సంప్రదాయమో, హిందువులకూ అంతటి సంప్రదాయమే. రాముడు ఏక పత్నీ వ్రతుడని బల్లలు గుద్దేవారు రామ లక్ష్మణులు సవతి తల్లుల బిడ్డలనే సత్యం మరచిపోతూ ఉంటారు.

గోవధ కూడ అలాంటిదే. ఆర్ష ధర్మ సమ్మత మైనట్టిదే. బహు భార్యాత్వాన్ని నిషేధించడంలో స్త్రీకి ఎంతటి అన్యాయం జరిగిందో, గోవధను నిషేధించాలన్న నినాదం హిందూ ముస్లిం సమైక్యాని కంతటి గొడ్డలి పెట్టు అయింది. ఇంతకూ... ముస్లింలంతా గో మాంసం తింటారని కాదు. అలాంటి వాళ్ళు సకృత్తుగా ఉంటారు. అభిరుచి, ఆహారం, ప్రేమ, వివాహం వంటివి వ్యక్తిగత విషయాలు. పిడుగుకి, బియ్యానికి ఒకటే మంత్రం వేసే విధానం పనికిరాదు.

నిజానికి.... ఈనాడు మన తెలుగు కవి సమ్మేళనలలో ఎక్కువగా పాల్గొంటున్న ముస్లిం మిత్రుడు శ్రీ జైనూలాబ్దీన్ (భయ్యా) ఏక పత్నీవ్రతుడు, సంపూర్ణ శాకాహారీ కాదా ?

★★★

31. ఇస్లాం - వీర శైవం

లా వొక్కింతయు లేదు, ధైర్యము విలో
లంబయ్యె, ప్రాణంబులన్
రావుల్ తప్పెను, మూర్ఛ వచ్చె, తనువున్
దస్సెన్, శ్రమంబయ్యెడిన్,
నీవే తప్ప ఇతఃపరంబెరుగ, మ
న్నింపన్ దగున్ దీననన్ ;
రావే ఈశ్వర ! కావవే వరద ! సం
రక్షింపు భద్రాత్మకా !

ఒక సాహితీ సమ్మేళనలో ఈ పద్యం చదివి.... ఇస్లాం మత సారమే ఈ పద్యం అనీ, బహుశా లోకంలో తొలి ముస్లిం గజేంద్రుడే కావచ్చుననీ అన్నాడు శ్రీ భయ్యా... ఆ మధ్య ఎప్పుడో.

"క్రైస్తవం విశిష్టాద్వైతం, ఇస్లాం వీరశైవం" అన్నాడు మిత్రుడు డాక్టర్ అరిపిరాల విశ్వం - మొన్న మాటల సందర్భంలో.

నిజానికి ఏ మత లక్ష్యమైనా ఒక్కటే - భగవంతుణ్ణి పొందడం. అందుకు ఏ మతం చూపే మార్గమైనా ఒక్కటే - భక్తి మార్గం.

"నీవే తప్ప ఇతఃపరంబెరుగ, మన్నింపన్ దగున్ దీననన్ !" అంటూ చేతులు మోడ్చి నమస్కరించడం, నిండు మనస్సుతో భగవంతుడికి తనను తాను పూర్ణార్పణ గావించుకొనడం - అంతే ఏ మతం బోధించినా ! చివరకు - భగవంతుడి పేరైనా ఎత్తని బౌద్ధం కూడ బోధించింది శరణాగతినే !

అయితే -

జ్ఞానులు, తత్త్వవేత్తలు, వేదాంతులు, భాగవతులు, యోగులు ప్రతి మతంలోనూ పుడుతూ ఉంటారు. వాళ్ళు అప్పటికి తమ చుట్టూ ఉన్న మత సిద్ధాంతాలను గ్రుడ్డిగా అనుసరించడానికి నిరాకరించి, భగవంతుడి కోసం స్వతంత్రాన్వేషణ సాగిస్తారు. అలాంటి సాధకులలో ఒకొక్క అదృష్ట వంతుడు ఒకొక్క సత్యాన్ని ఆవిష్కరించడం కద్దు. అలాంటి సత్యాలే - హిందూ మత పరిధిలోని ద్వైత, అద్వైత, విశిష్టాద్వైత తత్త్వాలూ, ఇస్లాం మత పరిధిలోని సూఫీ తత్త్వమూ.

సూఫీ తత్త్వంలో కూడ ద్వైతాద్వైత భావ భేదాలెన్నో ఉన్నై. అందులో "అహం బ్రహ్మాస్మి" అనే అద్వైత తత్త్వానికి చెందిన వాడు డాక్టరు ఖాను. అందుకే ఆయనలో మతాచార పట్టుదలలు లేవు.

ఈ మధ్య సాహిత్య అకాడమీ వారు ప్రకటించిన రెండు మంచి గ్రంథాలను ూశాను నేను. ఒకటి – శ్రీ సదాశివగారు అనువదించిన మౌలానా రూమీమన్నవీ. రెండు – గుంటూరు శేషేంద్రశర్మగారి షోడశి.

మన్నవీ సూఫీ తత్త్వ బోధకం, షోడశి యోగ విద్యా విస్ఫారకం.

సూఫీ తత్త్వం లోని వేణువే యోగ విద్యలోని కుండలిని. (పృష్ఠవంశనాద బ్రాహ్మి !) వెదురు పొదే సహస్రారంలోని పరమాత్మ వియోగ వ్యధ, పునస్సమాగ మోన్మనస్కత ఉభయత్రా సమానమే. ఎంత దివ్యమైన ఏక భావనత !

ఏడు ఆకాశాల కవతల ఈశ్వర స్థానమని, మహమ్మదు ప్రవక్తను ఈశ్వరుడు అక్కడికి రప్పించుకున్నాడనీ ఖురాను చెపుతున్నది. క్రైస్తును కూడా ఆలానే రప్పించు కున్నాడట.

మన యోగ విద్యలోని షట్కమలాలకు ప్రతి పత్కళా కమలాన్ని కూడ చేర్చి, ఆ ఏడు ఆవరణలు ఏమి ఆకాశాలు అనుకుంటే – ఖురాను సూచించిన ఈశ్వర స్థానం ఏదో, మహమ్మదు ప్రవక్త పొందిన అపవర్గం ఎంతటి పరమైశ్వర్య పారమ్యమో ఊహించగలం కదా?

అది ద్వైతం కానీ, అద్వైతం కానీ, వైష్ణవాద్వైతం కానీ, శైవా ద్వైతంకానీ – ప్రపంచంలోని ఏ మతానికైనా, ఏ తత్త్వానికైనా పునాది ఒక్కటే. అది జీవుని వేదన. అదే సమస్త మతాలకూ, భావాలకూ, తత్త్వాలకూ, ఉపాసనలకూ, విమోచన మార్గాలకూ మూల వేదం. దిగ్దిగంతాలకు వ్యాపించిన మహా శాఖి. అందులోని లలిత లలితాలైన లవలీ గుచ్ఛాలే, మధుర ఫలాలే ఈశ్వర ప్రణయమూ, మధుర భక్తీ, ఆత్మార్పణా, ఆనంత సంలీనతా.

ఆయా కాలలాలో, ఆయా భాషలలో మోజస్, మూసా, మహేశా అని పిలువబడ్డ ప్రవక్తలు ముగ్గురూ ఒకే మూల వ్యక్తిగా మనం గుర్తించ వచ్చు. క్రైస్తవుల మోజస్సే ముస్లింల మూసా, హిందువుల మహేశా. ఈ మూడు మతాలకూ మూల వేదం ఒకటే అనడానికి ఇదొక ప్రబల నిదర్శనం.

ఈ సత్యాన్ని మక్కాలోని "కాబా" [illegible] మరింత రుజువు చేస్తుంది.

మక్కాను దర్శించే పవిత్ర యాత్రికులంతా, ప్రవక్త సమాధిని దర్శించుకునే ముందు, కాబా లింగానికి నుదురు ఆనించి మ్రొక్కుతారు... (మన శ్రీశైలంలో వలె)! ప్రదక్షిణ చేస్తారు.

మొదట్లో అది తెల్లని స్ఫటిక లింగమట. శతాబ్దాలుగా, శత సహస్రాల భక్తుల పాపాలను స్వీకరించడం వల్ల అది నల్లబడి పోయిందట. ఇప్పుడది నల్లగా ఉంటుంది. ముస్లింలు హిందూ పద్ధతిలో లింగార్చన చేసేది ఆ ఒక్క చోటనే. కాబాకు మ్రొక్కి, పాప విముక్తులైన తర్వాతనే ప్రవక్త పవిత్ర సమాధి దర్శన యోగ్యత.

కాబా అంటే కవి. అంటే శుక్రుడు. శుక్రుడు భృగు వంశం వాడు. అంటే యూదులుగా నేడు పేర్కొన బడుతున్న వారి పూర్వీకుడన్న మాట. గురువు, శుక్రుడు, ప్రాచీన వైదిక ఋషులు. సురలు, అసురులు అంతా సిరియా, అసీరియా ప్రాంతం వాళ్ళే. ఆర్ష జాతికి అగ్ని స్థానమైన స్వాదిష్ఠాన మది. ఆధార భూమి. అక్కడి నుంచే శాఖోప శాఖలుగా ప్రపంచ మంతా వ్యాపించిందది.

ధర్మరాజు అశ్వమేధం చేసిన తావు ఈజిప్టు అనే వాదం ఉంది. యూదులు, పూర్వక్రైస్తవులు జంజాలు ధరించే వారట కూడ. ఆర్యుల జన్మ స్థానం మధ్య ప్రాచ్య మనడానికి, అన్ని మతాలకూ మూల తత్వం ఆర్ష వైదికమే అనడానికీ ఇవన్నీ ఉపబలకాలు.

కవి అంటే వైదిక భాషలో పరమేశ్వరుడు, మహేశ్వరుడు. పాప విమోచనకు అతడు ప్రసాదించినట్టిదే కాబా లింగం.

ఆచార్య చతురసేన శాస్త్రి వ్రాసిన "వయం రక్షామ" అన్న గ్రంథం అనుబంధంలో ఈ విషయాలన్నీ చారిత్రక సాక్ష్యాలతో పాటు వివరించబడి ఉన్నాయట. జిజ్ఞాసువులు పరిశీలించ వచ్చు.

పార్వతీ పతి తెలుపు.

ముస్లింల చంద్రోపాసన, శ్వేతవర్ణ సమాభిముఖ్యం వంటివన్నీ కూడ ఇస్లాం వీరశైవానికి దగ్గర అన్న వాదాన్ని బలపరచేవే.

ఈ సత్యాలన్నిటి దృష్ట్యా, భారతీయ తత్త్వ శాస్త్రాన్ని కూలం కషంగా అర్థం చేసుకొన్న వాడు కనుకనే, సర్వతత్త్వ శిరోభూషణమైన అద్వైతాన్ని ఆశ్రయించాడు డాక్టరు ఖాను.

అన్ని మతాలు, అన్ని వర్ణాలు, అన్ని కులాలు, అందరు మానవులూ ఒకటే ఆయనకు. తనలో అందర్నీ, అందరిలో తననూ చూచుకునే అద్వైతి ఆయన.

ఏకం సత్, విప్రా బహుధా వదంతి.

★★★

COMPLETE WORKS OF BOYI BHIMANNA VOL - 4 : VACHANA GRANDHALU PART - I

డా॥ బోయి భీమన్న సమగ్ర సాహిత్య సంపుటాలు

1. సంపుటి - 1 - భీమన్న గేయ కావ్యాలు : భాగం 1 & 2
2. సంపుటి - 2 - భీమన్న పద్య కావ్యాలు : భాగం 1 & 2
3. సంపుటి - 3 - భీమన్న వచన కవితా సంపుటాలు : భాగం 1 & 2
4. సంపుటి - 4 - భీమన్న వచన గ్రంథాలు : భాగం 1 & 2
5. సంపుటి - 5 - భీమన్న నాటకాలు : భాగం 1 & 2
6. సంపుటి - 6 - Works of Boyi Bhimanna
7. సంపుటి - 7 - భీమన్న అముద్రిత రచనలు
8. సంపుటి - 8 - భీమన్న పీఠికలు : భాగం 1 & 2

1. పాలేరు నుంచి పద్మశ్రీ వరకు బోయి భీమన్న - శ్రీమతి హైమవతీ భీమన్న
2. భీమన్న సాహితీ షష్టి పూర్తి సంచిక - సంపాదకుడు : శ్రీ గనుమల జ్ఞానేశ్వర్
3. బోయి భీమన్న రచనలు - దళిత దృక్పథం - (సదస్సు పత్రాలు)
4. బోయి భీమన్న నాటకాలు - సార్వజనీనత - (సదస్సు పత్రాలు)
5. బోయి భీమన్న సాహిత్యం - వర్తమాన సమాజానికి సందేశం (సదస్సు పత్రాలు)
6. బోయి భీమన్న రచనలు - కావ్యతత్వ వివేచన (సదస్సు పత్రాలు)